Govt. College Autonomous, Rajahmundry

ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తి

రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 19 - Issue. 10 - Spl. Edition - October 2022 - ISSN No. : 2456-4702

రెండు రోజుల జాతీయ సదస్సు

21 - 22 అక్టోబర్ 2022








దళిత సాహిత్యం - తాత్త్విక దృక్పథం

Dalit Literature - Philosophical Perspective







నిర్వహణ:

తెలుగు మరియు తత్వశాస్త్ర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో

ప్రభుత్వ కళాశాల స్వయంప్రతిపత్తి

రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

Website : www.gcrjy.ac.in

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Spl Issue 10 - October 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu &
Chairman, BOS Philothrophy& Religion Studies,
Andhra University, Visakhapatnam.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.
7. **Prof. T. Ramaprasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
Principal,
St Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

రెండు రోజుల జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

దళిత సాహిత్యం – తాత్త్విక దృక్పథం

21 & 22 అక్టోబర్ 2022

నిర్వహణ

తెలుగు మరియు తత్త్వశాస్త్ర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి),

రాజమహేంద్రవరం.

దళిత సాహిత్యం – తాత్త్విక దృక్పథం

జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities

ప్రథమ ముద్రణ	:	**అక్టోబర్ 2022**
ప్రతులు	:	**500**
వెల	:	**రూ. 500/-**
కాపీలకు	:	**ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), రాజమహేంద్రవరం.**
గమనిక	:	**ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**
ఎడిటోరియల్ చిరునామా	:	**హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను,** **గుంటూరు – 522 002.**
డి.టి.పి & ప్రింటింగ్	:	**తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్,** **గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509.

దళిత సాహిత్యం – తాత్త్విక దృక్పథం

జాతీయ సదస్సు

ప్రధాన సంపాదకులు :

డా॥. రాపాక డేవిడ్ కుమార్

శ్రీ కందుల ఆంజనేయులు

సంపాదకులు :

డా॥. కాకాని సుధాకర్

డా॥. మోగంటి సుధామయి

సలహా మండలి :

డా॥. కె. పుష్పమ్మ

డా॥. సిహెచ్. నాగరాజేశ్వరి

శ్రీమతి షేక్ జరీనా బేగం

డా॥. యస్. ప్రిస్కిల్లా

డా॥. డి. సుజాత

డా॥. పి.ఎ. సత్యనారాయణ



ప్రధాన పోషకులు :

డా॥. పోలా భాస్కర్



డా॥. రాపాక డేవిడ్ కుమార్



శ్రీ కందుల ఆజంనేయులు

Government College Autonomous, Rajahmundry
ప్రభుత్వ కళాశాల, స్వయం ప్రతిపత్తి
రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్.
తెలుగు శాఖ స్వర్ణ మహోత్సవాలు
రెండు రోజుల జాతీయ సదస్సు
21 - 22 అక్టోబర్, 2022
అంశం :
దళిత సాహిత్యం - తాత్విక దృక్పథం
TITLE :
DALIT LITERATURE - PHILOSOPHICAL PERSPECTIVE
ప్రభుత్వ కళాశాల, స్వయం ప్రతిపత్తి
రాజమహేంద్రవరం, తూ.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్.
Website : www.gcrjy.ac.in
ప్రధాన పోషకులు :
డా. వేదుల భాస్కర్ I.A.S.
కమిషనర్ కళాశాల విద్య, ఆంధ్రప్రదేశ్
అధ్యక్షులు :
డా. రాజోల్ దేవదత్ సుమనాథ్
జాయింట్ డైరెక్టర్, కళాశాల విద్య, ఆంధ్రప్రదేశ్
ప్రిన్సిపాల్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం
సహన్యాసకులు :
శ్రీ కందుల ఆదిశేషయ్య - ప్రిన్సిపాల్ ఇన్‌చార్జ్
తత్వశాస్త్ర శాఖాధ్యక్షులు
డా. మొగంటి సుధాకరం - తెలుగు శాఖాధ్యక్షులు
సహన్యాసకులు :
డా. కొమరవోలు గణపతి - తెలుగుశాఖాచార్యులు
పత్ర పరిశీలనా కమిటీ :
డా. చాగంటి నాగ మల్లేశ్వరి - తెలుగు సహాచార్యులు
శ్రీమతి పేరి బదిరమ్మ బేగం - తెలుగు సహాచార్యులు
డా. సమ్మెట ఉమాదేవి - తెలుగు సహాచార్యులు
సమన్వయ కర్తలు :
డా. ఎం.ఎ. సత్యనారాయణ - తెలుగు సహాచార్యులు
డా. వి. సుజాత - తెలుగు సహాచార్యులు
శ్రీమతి కె.ఎస్. సౌందర్యవల్లి - తెలుగు సహాచార్యులు
శ్రీ ఎ. సత్య శేష కుమార్ - తెలుగు సహాచార్యులు
కుమారి టి. రేవతి - తెలుగు సహాచార్యులు
శ్రీ ఎ. శ్రీకాంత్ - తెలుగు సహాచార్యులు
కుమారి పి. చుంచు - తెలుగు సహాచార్యులు
శ్రీమతి వి.ఎ. సుకన్య - తత్వ శాస్త్ర సహాచార్యులు
శ్రీ జి.రాజేష్ - ఫైనాన్స్ సహాచార్యులు
సభ్యులు :
పి. శ్రీకాంత్ - అర్థ శాఖాధ్యక్షులు
పి. శ్రీకృష్ణ - సంస్కృత శాఖాధ్యక్షులు
డా. జి. గిరిజ దేవి - హిందీ శాఖాధ్యక్షులు
డా. వి. వి. నాగేశ్వరరావు - ఉర్దూ శాఖాధ్యక్షులు
శ్రీ వి. బాబ్జీ - రాజకీయ శాస్త్ర శాఖాధ్యక్షులు
శ్రీమతి ఎం. పుష్పావతి - చరిత్ర శాఖాధ్యక్షులు
డా. వి.వి.ఎస్.సత్యనారాయణ - వాణిజ్య శాస్త్ర శాఖాధ్యక్షులు
డా. సనీల్. వి. శ్రీనివాసులు - గణిత శాస్త్ర శాఖాధ్యక్షులు
డా. వి. కె.వి.వి.ప్రసాద్ రాజు - భౌతిక శాస్త్ర శాఖాధ్యక్షులు
డా. వి.సుధాకర్ - రసాయన శాస్త్ర శాఖాధ్యక్షులు
డా. ఎం.ఆర్. గోపాకు - ప్రాణి శాస్త్ర శాఖాధ్యక్షులు, అడమిన్ కో-ఆర్డినేటర్
శ్రీ ఏ. సురేష్ కుమార్ - కంప్యూటర్ సైన్స్ శాఖాధ్యక్షులు
శ్రీ కె. నాగేంద్ర ప్రసాద్ - భూగోళ శాస్త్ర శాఖాధ్యక్షులు
డా. ఎస్. మాధవి - గణాంక శాస్త్ర శాఖాధ్యక్షులు
శ్రీ కె. దుర్గారావు - జంతు శాస్త్ర శాఖాధ్యక్షులు
డా. జి. నాగేశ్వర - బయో టెక్నాలజీ శాఖాధ్యక్షులు
డా. టి. సరిత - మాస్ మీడియా శాఖాధ్యక్షులు
శ్రీ పి. బాలయ్య - భూగోళ శాస్త్ర శాఖాధ్యక్షులు
శ్రీ టి. రవీష్ కుమార్ - క్రైస్ట్ సైన్స్ శాఖాధ్యక్షులు
శ్రీ సి.హెచ్. అమలేశ్వర్ - అప్లయిడ్ ఫిజిక్స్ ఫ్యాకల్టీ
డా. ఎ.ఎ. అప్పలస్వామి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ - IQAC కో-ఆర్డినేటర్
విశిష్ట అతిథులు :
పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, మూర్తి దేవి అవార్డు గ్రహీత,
లిటరై సైన్ ఛాన్సలర్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
గౌరవ అతిథులు :
శ్రీ గుంటూరు లక్ష్మీనరసయ్య, ప్రముఖ కవి, సాహితీ ముద్దుబిడ్డ, నిజామాబాద్
కళారత్న ఆచార్య కె. శేషగిరి, ప్రముఖ కవి, కవయిత్రి, ప్రముఖ సాహితీ వేత్త
సంపాదకులు వేద సాహిత్య ఆడియో గ్రంథాలు, హైదరాబాద్
ఆచార్య కె. వేంకటకుమార్, తత్వ శాస్త్ర శాఖాధిపతి, పీఠీ విశ్వవిద్యాలయం, పీఠీ
ముఖ్య అతిథులు :
ఆచార్య జ్ఞాన అస్పూనాథ్, తెలుగు శాఖాధిపతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం
ఆచార్య వసిలి శంకరరావు, తెలుగు శాఖాధిపతి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, తెలుగు శాఖాధిపతి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి, బుద్ధిస్ట్ స్టడీస్ విభాగాధిపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు
ఆచార్య కోయి కోటేశ్వరరావు, తెలుగుశాఖాధిపతి, సరోజినీ నాయుడు, హైదరాబాద్
ఆచార్య కె.ఎం.వి.వి. వర ప్రసాద్, తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర కళా సమితి విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం
సాంకేతిక సహకారం :
శ్రీ వి. సురేష్ కుమార్ - కంప్యూటర్ సైన్స్ శాఖాధ్యక్షులు
డా. వి. సంజీవ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్
శ్రీ వి. ప్రవీణ్, కంప్యూటర్ ఆపరేటర్
కె. రవీష్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్
రుసుము వివరాలు :
రిజిస్ట్రేషన్ : రూ.200/- (తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవలసిన)
స్కాన్ ప్రదర్శన కొరకు : రూ.500/-
https://tinyurl.com/DalitheSaahityam2022Reg మీరు రూ.700 ను
200+500=700 పెట్టిందండి (లేదా)
డా. యం. సుధాకుమారి, యూనియన్ బ్యాంక్ ఎకౌంట్ నెం.
062610100133022, IFSC Code : UBIN0806269
చెల్లింపు చేసిన తరువాత రిజిస్ట్రేషన్ చేయించుకోవలసిన తేదీ : 14-10-2022
వ్యాసాలు పంపవలసిన చిరునామా :
అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తమ వ్యాసాలు పీడీఎఫ్ (తెలుగు) లిపి - 7, ప్రియదాస్, ఫాంట్ సైజు 18, అర్థ వ్యాసాలు పంపరాదు (మరియు/13 సైజులో టైప్ చేసి పీడీఎఫ్ ఫైల్ చేసి పీడీఎఫ్ ఫైల్‌లో ఈ క్రింది ఇ-మెయిల్ పంపగలరు.
ఇ - మెయిల్ : telugudepartment@gcrjy.ac.in
ఎంపిక చేయబడిన వ్యాసాలు యుజిసి కేర్ జర్నల్‌లలో ప్రచురిస్తాము.
సమాచారం పంపవలసిన చిరునామాలు
డా. మొగంటి సుధాకరం - 9492149532
డా. కమల సుధాకర్ - 9440184788
డా. సమ్మెట. నాగలక్ష్మి - 9440385649
శ్రీమతి పేరి బదిరమ్మ బేగం - 7386426385
డా. ఎస్.ప్రసన్నశ్రీ - 7075091195

Contents (విషయ సూచిక)

1.	దళిత సాహిత్యం - కథానిక - తత్త్వపరిశీలన	- ఆచార్య ఎం. రామనాథం నాయుడు	14
2.	మల్లిపురం జగదీశ్ "దుర్ల" (కవితాసంపుట) - విశ్లేషణ	- ఆచార్య జర్రా అప్పారావు	19
3.	దళిత ఉద్యమాలలో స్త్రీలు	- డా॥. కె. ప్రేమకుమారి	24
4.	గోరటి వెంకన్న సాహిత్యం - దళితోద్యమ ప్రభావం	- బానోత్ వెంకటేశ్వర్లు	28
5.	జాషువా గబ్బిలం - దళిత వాదం	- నోసిన వెంకటేశ్వర్లు	32
6.	దళిత సాహిత్యం - వివిధ ప్రక్రియలు	- కాళేశ్వరం కృష్ణమూర్తి	35
7.	దళిత సాహిత్యారంభం - సమాలోచన	- డా॥. ఎన్. నిశ్చల	41
8.	దళిత సాహిత్యం - నేపధ్యం	- డా॥. పి. నీరజ	44
9.	ఇనాక్ కట్టడి కథల్లో - దళిత జీవన విధానం పై అంబేద్కర్ ప్రభావం	- ఆది ఆంధ్ర రామాంజనేయులు	47
10.	జాషువా "గబ్బిలం" - దళితవాదం	- డా॥. కె. చెన్నకేశవరెడ్డి	51
11.	జక్కులు నవల - సహజ ప్రేమస్పద పాత్రలు	- సూరేపల్లి పద్మావతి	54
12.	విశ్వ మానవతా వాది - జాషువా	- డా॥. ఆంజనేయుడు	58
13.	జాషువ - విప్లవ భావాలు	- డా॥. వి. కృష్ణవేణి	61
14.	దళితవాద సాహిత్యం - తత్త్వ పరిశీలన	- డా॥. బి. చక్రవర్తి	65
15.	పల్లిపట్టు నాగరాజు కవిత్వం - దళిత సాహిత్య తత్త్వం	- డా॥. యం. ఆదిశేషయ్య	72
16.	చిన్ననవుతున్న పాట దళిత కవిత్వం - చారిత్రకత	- డా॥. మోగునూరు వెంకటరమణ	76
17.	తెలుగు సాహిత్యంలో దళితవాదం - చారిత్రక నేపథ్యం	- డా॥. యస్.సి. సంజీవ రెడ్డి	79
18.	దళిత కవిత్వంలో - ఆణిముత్యం గుర్రం జాషువా	- డా॥. యం. వెంకటలక్ష్మమ్మ	82
19.	ప్రబంధ - దళిత కావ్య నాయకుల సామ్యత-ఒక పరిశీలన	- వి. నరేష్ (నంది)	86
20.	జాషువా శ్మశానవాటి - తత్త్వ విశ్లేషణ	- డా॥. చాగంటి నాగరాజేశ్వరి	89
21.	"దళిత సాహిత్యం - చారిత్రక నేపథ్యం"	- జె. సత్యనారాయణ	94
22.	"అభాగ్యుని జీవన వేదనను దేవునికి సమర్పించిన కావ్యం-గబ్బిలం"	- నెల్లి సంతోష్‌కుమార్	97
23.	"జాషువా గబ్బిలంలో దళిత తత్త్వం"	- పొట్టంగి సత్యనారాయణ	100
24.	దళిత సాహిత్యానికి దిక్సూచి - గుర్రం జాషువా	- మొండి స్వామి	103
25.	ఇనాక్ కవిత్వం - నిరసన, ప్రతిఘటన, చైతన్య తత్త్వము	- డా॥. సి. శివన్న	107
26.	జాషువా నా కథ - బాల్య చిత్రణ	- డా॥. మంథని శంకరయ్య	109
27.	దళిత సాహిత్యానికి చైతన్యమే అజెండా	- డా॥. ర్యాలి శ్రీనివాసు	113
28.	ముద్ర నవలలోని దళిత స్త్రీ వెతల చిత్రణ	- తలారి నాదమని	117

29. ఆచార్య కొలకలూరి ఇనాక్ కథలు - దళిత తాత్వికత	- కందుల ఆంజనేయులు	120
30. జాషువా కవిత్వం - స్త్రీ వాద దృక్పథం	- డా॥. కాకాని సుధాకర్	127
31. పాలేరు నాటకం - దళిత చైతన్యం	- కె. వి. పద్మావతి	130
32. గుళ్ళం జాషువా గబ్బిలం - దళిత తాత్విక ధృక్పథం	- పిల్లి ఉషారాణి	134
33. "పిడికెడు ఆత్మగౌరవం కోసం - కవితా పరామర్శ"	- భాగం సైదారావు	138
34. "తెలుగులో దళిత సాహిత్యం - సంఘటనాత్మక కవిత్వం"	- పంపోతు నాగేశ్వరరావు	142
35. కట్టెలమోపు కవితా సంకలనం - దళిత జీవనం	- డా॥. డి. సుజాత	146
36. దళిత సాహిత్యం - తాత్విక పునాది	- డా॥. నేతల లలిత	149
37. డా॥ బోయి భీమన్న "పాలేరు" నాటకం - సుందరం పాత్ర చిత్రణ	- సాలి రాజా	153
38. "దళితులు అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తులు తత్వం"	- గెడ్డాపు జానకిరామ్	156
40. చండాల చాటింపు కవిత సంకలనంలోని దళిత వాదం	- జి. రమేష్ బాబు	159
41. దళిత సాహిత్యం - డాక్టర్ అంబేద్కర్ ప్రభావం	- వెంకటలక్ష్మి చెరుకూరి	162
42. బహుజన సాహిత్య వేగుచుక్క - కలేకూరి	- భమిడిపాటి గౌరీ శంకర్	167
43. సంగవిజయం - దళిత జీవన సమీక్ష	- తాడి రేవతి	170
44. మొగిలి - సమానత్వాన్ని కాంక్షించే మనుషుల లోగిలి	- వేము రాములు	173
45. "దళిత సాహిత్యం - చారిత్రక నేపథ్యం"	- జె. సత్యనారాయణ	176
46. పై మెట్టు నవలలో - దళిత జీవన చరిత్ర	- డా॥. కె. పుష్పమ్మ	179
47. దళిత సాహిత్యం - తాత్విక నేపథ్యం	- డా॥. యన్.హెచ్.పి. కిరణ్ కుమార్	181
48. "బొట్టు భోజనాలు కథలో దళిత స్త్రీ మానసిక స్థితి"	- డా॥. పసుపులేటి నాగమల్లిక	184
49. సంఘ సంస్కరణ నేపథ్యంలో - దళితాభ్యుదయ గీతాల ప్రభావం	- డా॥. ఎం. పద్మగౌరి	187
50. హరిజన శతకం - కుసుమ లోచనం	- పెదముత్తి ఝాన్సీ	190
51. బోయి భీమన్న కవిత్వం-దళిత తాత్విక దృక్పథం	- డా॥. కోలా శేఖర్	194
52. శిఖామణి కవిత్వం-దళిత చైతన్యం	- తంత్రవహి శ్రీరామమూర్తి	199
53. మాదిగ విజయం నవల-దళితుల జీవిత చిత్రణ	- గడ్డం లింగరాజు	204
54. సునీల్‌కుమార్ కథల్లో దళిత స్పృహ	- డకర వెంకట రమణ	210
55. దళిత కథ - వస్తువైవిధ్యం	- సేపేని రామస్వామి	214
56. సినీ, వాస్తవాధారిత - దళిత సమస్యల చిత్రణ	- అరిగెల శ్రీకాంత్	217
57. కా.రా.కథలు- దళితచైతన్యం	- డా॥. కె.వి.శాంతకుమారి	218
58. సంస్కరణ కథలోని కొలకలూరి ఇనాక్ దళిత భావ చైతన్యం	- బాణావతు సత్యనారాయణ	222
59. దళిత సాహిత్యం - విలువల పునర్మూల్యాంకనం	- బాదరాల అంజనీ కుమారి & - దాసరి భవాని శంకర్ రెడ్డి	224

60. ఆధునిక పద్య కవిత్వం - దళిత స్పృహ	- డా॥. ఎన్. భీమన్న	227
61. బోయ జంగయ్య కథలలో దళిత దృక్పథం జీవిత వాస్తవిక చిత్రణ	- పొన్నకంటి స్వప్న	229
62. మనువాదంపై లెల్లాయి పాటతో లొల్లి పుట్టించిన మాదిగబిడ్డ ఎర్ర ఉపాళి	- పోతురాజు శ్రీనివాసు	234
63. బోయి భీమన్న వచన కవిత్వం దళిత దృక్పథం	- డా॥. బి. తేజోవాణి	236
64. గబ్బిలం కావ్యంలో - దళిత స్పృహ	- దత్తి రామారావు	239
65. పంచముల నాదం - పంచమ వేదం	- ఎం. ప్రదీప్	242
66. దళిత కవిత్వంలో మానవతావాదం	- డా॥. గుండిమెడ శ్రీనివాసరావు	246
67. మద్దూరి నగేష్‌బాబు కవిత్వం-దళిత స్త్రీ జీవిత చిత్రణ	- డా॥. మల్లెపోగు మాదన్న	254
68. రాయక్క మాన్యమ్ - దళిత జీవిత దృక్పథం	- చిలుక శ్రీలత	257
69. గబ్బిలానికి విన్నవించుకొన్న అరుంధతీ సుతుని ఆర్త సందేశం	- మాల్యాద్రి మార్తాటి & - మోగంటి సుధామయిగారు	260
70. రిజర్వేషన్ బోగి - దళిత స్పృహ	- డా॥. వి. వింధ్యవాసినీదేవి	264
71. దళిత సాహిత్యం - చారిత్రక పరిశీలన	- ఎం. రమాగీతా దేవి	268
72. దళిత సాహిత్యం-సామాజిక చైతన్యం	- డాక్టర్. టి. పార్థసారథి	271
73. దళిత సాహిత్యం - శ్మశాన వాటి తాత్వికత	- వద్ది వెంకటరమణమ్మ & - డా॥. మోగంటి సుధామయి	275
74. వర్ణవ్యవస్థను నిరసించిన 'దళిత సాహిత్యం'	- డా॥. దార్లపూడి శివరామకృష్ణ	279
75. 'అగ్నికవి' మోదకూరి జాన్సన్ 'నిచ్చెనమెట్లపై' నిరసన	- గజ్జెల ప్రమీల	282
76. సినీ గేయ సాహిత్యంలో దళిత తత్వం	- డా॥. ఉడాలి విష్ణుప్రియ	286
77. "తుమ్మల రామకృష్ణ 'రాలినచింత' కథ దళిత సామాజిక స్పృహ"	- రాళ్ళపాటి లోకనాథం	290
78. ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి కథాసాహిత్యంలో - దళిత స్త్రీ చైతన్యం	- డా॥. మల్లెపాగు నాగమ్మ	292
79. చాతుర్వర్ణ వ్యవస్థను కూలదోయమనే "నిచ్చెనమెట్లు"	- డా॥. చదలవాడ విజయ్ కుమార్	295
80. "దండోరా ఉద్యమం - గుండెడప్ప కనకయ్య తీర్పు"	- కోష్ట గోవిందరావు	297
81. దళిత కవిత్వం - చారిత్రక నేపధ్యం	- గెడ్డ కళ్యాణి & - డా॥. మోగంటి సుధామయి	301
82. సామాజిక చైతన్యం - చిలుక భాస్కర్ సాహిత్యం	- అరూరి రాజు	304
83. జాషువా 'ముసాఫరులు' - అధ్యాత్మిక తాత్విక దృక్పథాల పరిచయం	- డా॥. రత్నశేఖర్ కట్టెపోగు	308
84. కొలకలూరి ఇనాక్ రచనలు - సామాజిక దృక్పథం	- శశికళ బలరామ మహంతి & - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి	312

85. జక్కులు నవల-1940లలో మాదిగల జీవితం	- ఈ. యాకయ్య	320
86. దళిత సాహిత్యం - వస్తు వైవిధ్యం	- డా॥. పసగడుపుల శివాజీ	324
87. రాయలసీమ కథల్లో దళిత జీవనం	- డా॥. సంగుల సునీల్ కుమార్	328
88. దళిత సాహిత్యంలో ముస్లీం సాహిత్యం	- షేక్ జరీన బేగం	333
89. పిల్లంగోవి పాటల్లో తొణకిన తాత్త్విక స్వరాలు	-డా॥ మోగంటి సుధామయి	336
90. దళిత సారస్వతంలో మాదిగ సాహిత్యం ఒక చారిత్రక తప్పిదం?	- డా॥ పి.ఎ. సత్యనారాయణ	339
91. బోయి భీమన్న నాటకాలు - దళిత అభ్యున్నతి	- డా॥ టి. ఆశీర్వాదం	342
92. సామాజిక దృక్పథం - జాషువా దళిత సాహిత్యం	- కె.ఎం. సౌందర్యవతి	345
93. భూమి భాష - నది ఘోష	- డా॥. సముద్రాల ప్రిస్కిల్ల	347
94. తొలితరం దళితకథలు - సామాజిక విశ్లేషణ	- చిలుకమఱ్ఱి శారద	349
95. దళిత గతి పై - కలము గళ పౌరుషం	- డా॥. ఎక్కిరాల వెంకటనర్సయ్య	355
96. బోయి భీమన్న గారి పాలేరు నాటకం - సామాజిక చిత్రణ	- డా॥. ఝాన్సీ పావని మేరుగు	358
97. దళిత సాహిత్యం - ఆర్థిక చైతన్యం	- డా॥. ఎన్. సుజాత	361
98. నల్ల రక్త కణాలు - దళిత ప్రేమ తత్వం	- పగిడిపల్లి వెంకటేశ్వర్లు	363
99. మనందరం ఒక్కటే	- కళాగౌతమి బులుసు వి.యస్. మూర్తి	367
100. దళిత సాధికారత - వర్గీకరణ ఉద్యమం	- తెన్నేటి మోజేష్ ప్రసాద్	370
101. మాతంగి దురాచారం - దళిత స్త్రీ జీవితం	- డా॥. డి. వి. నాగేశ్వర రావు	373
102. దళిత సాహిత్యము - కవిత్వ చైతన్యము	- చామర్తి సాయికృష్ణ	376
103. దళిత కవిత్వం తాత్విక నేపథ్యం	- డా॥. పెండ్యాల లావణ్య	379
104. దళిత కళా సాహిత్యం - సమకాలీన జీవనచిత్రణ	- డా॥. బూసి వెంకటస్వామి	383
105. మహాకవి జాషువా కవిత్వంలో విస్తరించిన 'ఆకాశంలో సగం'	- డా॥. కోయి కోటేశ్వరరావు	387
106. దళిత ఆళ్వార్ - తిరుప్పాణాళ్వార్	- డా॥. యస్. దివిజాదేవి	391
107. సూరజ్ పాల్ చౌహాన్ - సమకాలీన దళిత రచయిత	- డా॥. బి. గీతా దేవి	395
108. నాగప్ప గారి సుందర్రాజు - "నడిమింటి బోడెక్కబసివిరాలయ్యేద" కథ విశ్లేషణ	- డా॥. కట్టెపోగు సురేష్ కుమార్	397
109. బోయి భీమన్న 'పాలేరు' నాటకం - చదువు విలువ	- రాచప్రోలు రమేష్ కుమార్	402
110. పాలేరు నాటకం - దళిత కోణం	- డా॥. సిహెచ్. నాగరాజేశ్వరి & - రాజుబాబు బెందుకుర్తి	406
111. విశ్వనరుని హృదయ వేదనకు ప్రతీక - 'గబ్బిలం'	- డా॥. డి. ధాత్రికుమారి	409
112. తెలుగు కవిత్వంలో దళిత తాత్వికత	- విజయ్ కుమార్ బండారు	413

113.	సర్కారు గడ్డి నవల - దళిత చైతన్యం	- దాసరి కృపారావు	422
114.	"సారాజ్ఞెం" నవల - రాజ్యాంగ నైతికత, ఆర్థిక అసమానత	- బోరుగడ్డ సుబ్బయ్య & - విప్పర్తి రమేష్ కృష్ణ	425
115.	సంఘ సంస్కరణ దిశగా దళితోద్యమం పాట	- డా॥. సి.హెచ్. శ్యామలకుమార్	431
116.	మానవత పై మరకలు తుడిచిన - మహనీయ మాటలే సాహిత్యం	- డా॥. తేళ్లూరి వేంకటేశ్వర రావు	434
117.	ప్రశ్నించే తాత్వికుడు - జాషువ	- పరుచూరి విజయలక్ష్మి	438
118.	భీమన్న తాత్విక చింతన 'అసూయ'	- యద్దనపూడి దీప్తి & - డా॥. యం. సుధామయి	441
119.	Devadasi System – an Overview	- M. Pushpanjali & - Dr. K. Venkateswara Prasad	444
120.	History of Dalit Movement – A Few Pioneers	- P. S. Sastry & - A. Rajeswari	446
121.	Dalit Literature in the Works of Mulkraj Anand	- K.Chandrasekhar	450
122.	PaperforPresentationatNationalConferenceon DalitLiterature-Perspective21-10-2022& 22-10-2022. Philosophical Egalitarian Reforms of SrimadRamanujacharyaand Literary Vision	- Alikani Satya Siva Kumar & - Dr. M. Chandraiah	455
123.	Pariyar - The Rationalist	- Prof VanapalliVenkataRao & - Sri KandulaAnginayulu	459
124.	Untouchbility in India dealing with the novel Untouchble - MulkRaj Anand	- Dr. B. Bhavani	462
125.	Dalit Movement : A Social Change	- B. Neethu Prathyusha	466
126.	The life of Dalit women in kolakaluri Enoch select short stories : In the perspective of Indian writing in English	- Maram subbaraju	471
127.	Symbolism and Subaltern Identity in Yendluri Sudhakar's 'Kotta Gabbilam'	- Dr. Govindaiah Godavarthi	476
128.	Resistance of Women in the Short Stories of Dalit Feminists and Main Streem Feminists	- Ch. Vennela	480
129.	Evaluation of Dalit Literature - A Study	- Dr. U. Ramesh Babu & - Dr. K. Lakshmi Sudheshna	484

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం - కథానిక - తత్త్వపరిశీలన

- ఆచార్య ఎం. రామనాథం నాయుడు, తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో అడుగుపెట్టిన ఆధునిక సాహిత్య ప్రక్రియ కథానిక. ప్రాచీన కాలం నుంచి జానపద కథల రూపంలో తెలుగు కథ వ్యాప్తిలో ఉన్నా ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వెలువడిన కథానికలో ఆధునిక కాలానికి అనుగుణమైన కొత్తలక్షణాలు కన్పిస్తాయి.

ఆధునిక కథానిక ప్రక్రియకు వందేండ్ల పైగా చరిత్ర ఉంది. అయినా అంటరాని వాళ్లుగా పరిగణించబడుతున్న దళిత జీవితం మాత్రం చాలా ఆలస్యంగా కథానికలో ప్రవేశించింది. 1925 నుంచి కథా సాహిత్యంలో దళిత చిత్రణ కన్పిస్తుంది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాతే దళిత చరిత్ర, సంస్కృతి సాహిత్యంలో ప్రవేశించింది. స్వాతంత్ర్యోద్యమంలో పాలు పంచుకున్న సంఘసంస్కర్తలే అస్పృశ్యతా నిర్మూలన గురించి పోరాటం సాగిస్తూ దళితులను చైతన్యం చేయడానికి ప్రయత్నించి వాళ్లు పోగొట్టుకున్న హక్కుల్ని వాళ్లే సముపార్జించుకొనే దశకు తీసుకురావడానికి రచనలు చేశారు. 1960 ప్రాంతంలో కాశ్మీర్‌లో ఆవిర్భవించిన 'పాంథర్స్' సాహిత్య సంస్థ దళిత అస్తిత్వ పోరాటాలకు ఊపిరిపోసింది. దాని ఫలితంగా 1984 అంబేద్కర్ భావజాలం నేపథ్యంగా దళిత కథలు వెలువడినాయి.

జ్యోతిబాపూలే సామాజిక పోరాటాల వల్ల దళిత సాహిత్యోద్యమం బాగా ఊపందుకొంది. కవిత్వంలో లాగే కథానికలోను దళిత జీవితం చోటు చేసుకుంది.

1925లో జూన్ నెల 'ప్రబుద్ధాంధ్ర' పత్రికలో శ్రీపాద సుబ్రహ్మణ్యం శాస్త్రి రాసిన 'పుల్లంరాజు-2' అనే కథ దళిత ఇతివృత్తంతో వచ్చిన మొదటి కథ. అస్పృశ్యుల్లోనే రెండు కులాల మధ్యవున్న అంతరాల్ని పోగొట్టుకొని ఐక్యంగా అంటరానితనాన్ని ఎదుర్కోమని సలహా ఇవ్వడం ఆ కథలో కన్పిస్తుంది.

దళిత సమస్యలను చిత్రిస్తూ కథలు రాసిన వాళ్లను రెండు వర్గాలుగా విభజించవచ్చు. ఒకటి దళితేతర రచయితలు రెండు దళిత రచయితలు. అయితే దళితులు రాసిన కథల్లో దళితేతరులు రాసిన కథల్లో కంటే వాస్తవికత. చైతన్యం ఆలోచనాత్మకంగా ఉండడాన్ని గమనించవచ్చు. దళితులు స్వీయ అనుభవాల్ని నిష్కర్షగా ప్రకటించడంతో వాళ్ల ఆవేదనను అర్థం చేసుకోవడానికి చక్కని అవకాశం ఏర్పడింది.

రెండవ వర్గం వాళ్లు రాసిన కథల్లో సాంఘికంగా ఆర్థికంగా, రాజకీయంగా ఊరికి దూరంగా ఉన్న హరిజనులెదుర్కొంటున్న సమస్యల చిత్రణ కన్పిస్తుంది. వాటికి పరిష్కారాలు కన్పిస్తాయి. సమాజాన్ని సంస్కరించాలనే దృష్టి కన్పిస్తుంది. జాలి, దయతో పాటు అవసరమైతే పోరాటం కూడా చేయాలన్న ఉద్దేశం కన్పిస్తుంది. ఈ కథలు సవర్ణులు హరిజనులను సంప్రదాయాలు, ఆచారాల పేరుతో తమలో కలుపుకోకుండా ఊరికి దూరంగా పెట్టడం, బానిసల్లాగా వాడుకోవడం అన్యాయమని చెప్తాయి. అలాంటి వాళ్లకు చేయూతనిచ్చి సమాజంలో పేరుకు పోయిన ఈ దుర్లక్షణాలను రూపుమాపడానికి ప్రయత్నించాలని సూచిస్తాయి. తొలి తరంలో వెలుగు చూసిన దళిత కథా సాహిత్య సృష్టికర్తలందరూ చాలావరకు దళితేతరులవడం గమనించదగ్గ విషయం. ఈ రెండు రకాల కథల్ని పరిశీలిద్దాం.

దళితుల పట్ల సానుభూతి ప్రధానంగా వెలువడిన కథలు :

దళిత కథలు రాసిన వాళ్లలో వీళ్లను తొలి తరం

కథకులుగా పేర్కొనవచ్చు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, బందా కనకలింగేశ్వరరావు, వేలూరి శివరామశాస్త్రి, చలం, మాగోఖలే, అడవి బాపిరాజు, గోపీచంద్, కేతు విశ్వనాథ రెడ్డి, మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి మొదలైన వాళ్లు దళిత జీవితాన్ని తమ కథల్లో సృష్టించారు.

శ్రీపాద వారి 'ఇలాంటి తవ్వాయి వస్తే' అనే కథలో జాతీయోద్యమ కాలంనాటి మతం మార్పిడి అంశం ప్రధానంగా కన్పిస్తుంది. అగ్రహారంలో ఒక చెరువుంటుంది. అందులో మూడువంతులు వూర్లో వాళ్లకైతే ఒక వంతు దళితులకు. దళితులకు చెందిన చెరువులో ఒక కుష్ఠురోగి చనిపోతాడు. అందువల్ల ఆ నీటిని ఎవ్వరూ తాగరు. అది ఒక సమస్యగా తయారవుతుంది. హరిజనులు నీటి కోసం క్రైస్తవ ఫాదర్ను అడుగగా వాళ్లను మత ప్రచారం కోసం వాడుకుంటాడు. వూర్లో వుండే ముస్లింలు కాంగ్రెస్ వాళ్ల నడుగగా వాళ్లు ముస్లింలను పార్టీ ప్రచారం కోసం వాడుకుంటారు. ఇది గమనించి ముస్లింలే క్రైస్తవ మతాన్ని స్వీకరించి నీళ్లను వాడుకుంటారు. స్వార్థ పూరితమైన రాజకీయం ఎలా ఉంటుందో, అవకాశవాదులు దాన్ని ఎలా వాడుకుంటారో ఈ కథ ప్రధానంగా చెప్పినా దళితుల్ని ఊర్లోవాళ్లు వేరుగా చూడ్డాన్ని కళ్ళకు కట్టిస్తుంది.

బందా కనకలింగేశ్వరరావు రచించిన 'గుక్కెడు నీళ్ళు' కథలో హరిజనోద్ధరణ ప్రధానంగా కన్పిస్తుంది. వెంకటప్ప అనునతను హరిజన తలారి. ఆ ఊరి కరణం బ్రహ్మయ్య. అతని భార్య మహాలక్ష్మి. ఆ రోజుల్లో గాంధీజీ ప్రబోధంతో మాలమాదిగల్ని హరిజనులని పిలిచేవారు. హరిజనులకు దేవాలయ ప్రవేశం కలిగించాలని, వాళ్ళు కూడా సమాజంలో మనుషులే కాబట్టి వాళ్లను అగ్ర వర్ణాలతో సమానంగా చూడాలని గాంధీ హరిజన పత్రికలో రాశాడు. ఒక రోజు కరణం భార్య మహాలక్ష్మి నీళ్లు తీసుకొని రాగా వెంకటప్ప పక్కకు దూరంగా తొలగి పోలేదని ఆమె కోపంతో 'మాయ స్వరాజ్యంవచ్చింది. అందరినీ చెడ గొడుతూ వుంది' అని గట్టిగా అంటూ జరిగిన విషయాన్ని భర్తకు చెప్తుంది. పైగా వెంకటప్పను పిలిపించి కొట్టిస్తుంది. 1932లో కలరాసోకి బ్రహ్మయ్య మరణిస్తాడు. బంధువులెవ్వరూ శవాన్ని మోయడానికి రారు. ఎవర్ని పిలిచినా రాకపోగా తిట్టడం మొదలు పెడతారు. దిక్కు తోచని స్థితిలో మహాలక్ష్మి వెంకటప్పను పిలిపిస్తుంది. 'నీవే నా కొడుకువి' అని ప్రాధేయపడగా వెంకటప్ప కరణం శవాన్ని దహనం చేస్తాడు. తర్వాత వెంకటప్పకు కలరా సోకుతుంది. అప్పుడు మహాలక్ష్మి అతనికి బాగు చేయిస్తుంది. ఆ స్థితిలో బంధువులామెను కులం నుంచి వెలివేస్తారు. అయినా ఆమె వెంకటప్పను రక్షిస్తుంది. 'నీవు నా కడుపున పుట్టకపోయినా నీవేరా నా కొడుకువి. ఆస్తంతా నీపేరు మీద రిజిష్టరు చేయించాను. దానిలో సగమాస్తి స్కూలు, ఆస్పత్రి కట్టడానికి వినియోగించు. అంటరాని వాళ్లు కూడా చదువుకోవాలి' అని పలుకుతూ 'దాహం' అంటుంది. వెంకటప్ప నీళ్లు పోస్తే అవి సేవిస్తూ ఆమె మరణిస్తుంది.

సంఘ సంస్కరణాభిలాషలు కాంక్షించిన కుల, మత సమానత్వానికి ఈ కథ ప్రతీక. సమాజంలో మార్పు రావాలని అంటరాని వాళ్లనే నెపంతో వాళ్లను అవమానించడం తగదని ఈ కథ అందించే సందేశం.

ఇలా దళిత పీడిత వర్గాల అభ్యున్నతి కోసం కొంతమంది కథలు రాశారు. సమాజంలో దళితు లెదుర్కొంటున్న సమస్యలకు చక్కని పరిష్కార మార్గాల్ని కూడా సూచించారు.

దళితుల వాస్తవిక జీవితాలను చిత్రించే కథలు :

అంబేద్కర్ భావజాలం నేపథ్యంగా, అస్పృశ్యతా నివారణోద్యమం స్ఫూర్తిలో దళిత జీవితాలు సాహిత్యంలో ప్రతిబింబించడం మొదలు పెట్టాయి. జ్యోతిబాపూలే నిర్వహించిన సామాజిక పోరాటాలవల్ల దళిత సాహిత్య ఉద్యమం అనుకోనంతగా ఊపందుకుంది. అయన 'మాలవాసి' సిద్ధాంత దళిత సంస్కృతిని, చరిత్రను సుసంపన్నం చేయడానికి దోహద పడింది. తొలి దశలో దళితులు తమ ఉనికిని చాటుకోవడానికి చేసిన పోరాటం చాలా తక్కువగా కన్పిస్తుంది. రాజకీయ రంగ ప్రవేశం

చేసేదాకా గాంధీ కూడా దళితుల గురించి పట్టించు కున్నట్లు కన్పించదు. అంబేద్కర్ పోరాటం మొదలు పెట్టిన తర్వాతే దళితులు వాళ్లలోకి వాళ్లు తొంగి చూసు కోవడం మొదలు పెట్టారు. బ్రిటిషు ప్రభుత్వంలోని విద్యావకాశాలు, ప్రభుత్వ చట్టాలు దళితుల మనస్సులో మార్పుతో పాటు ధైర్యాన్ని కూడా నింపాయి. కాని రాజకీయ, సాంఘిక రంగాల పట్ల దృష్టి సారించినంతగా ప్రభుత్వ చట్టాలు దళితుల్ని పట్టించుకోలేదు. అందువల్ల అగ్రకులాల స్వార్థానికి దళితులు బలికాక తప్పలేదు. ఆ ఆవేదనలను, ఆక్రోశాలను ఆవిష్కరిస్తూ, స్వీయ అనుభవంతో గొట్టుముక్కల మంగాయమ్మ రాసిన తొలి దళిత కథ 'అయ్యో పాపం'.

ఆ కథ అంటరాని వాళ్లుగా పుట్టడం పూర్వ జన్మ కర్మ ఫలితమనే కుట్రపూరితమైన అభిప్రాయాన్ని బయట పెట్టి వర్ణాశ్రమ ధర్మాల్లో ఉన్న స్వార్థాన్ని చీల్చి చెండాడే ప్రయత్నం చేసింది. అవిద్యావంతులైన దళితుల్లో ఉన్న వేదనను స్వయంగా అనుభవించింది కావడం వల్ల ఈ కథలో జీవిత సత్యాలు బహిర్గతమయ్యాయి. అగ్ర వర్ణాలవాళ్లు దళితదంపతుల దాహం తీర్చకపోగా మాల ముండలకి నీరివ్వరంటూ అవమానించడాన్ని ఈ కథలో చిత్రించింది రచయిత్రి. నీళ్లివ్వకపోగా వాళ్లపైకి కుక్కలను ఉసిగొల్పుతారు. ఆస్థితిలో ఒక సాయిబు వాళ్లకు నీళ్ళిచ్చి వాళ్ల ప్రాణాలను కాపాడతాడు.

1922లో గాంధీజీ అస్పృశ్యతా నివారణం కోసం దేశమంతా తిరుగుతూ ఆంధ్రదేశం వచ్చాడు. ఒక మంచి నీళ్ల బావి దగ్గరకు వెళ్లి 'దాహానికి నీళ్లిస్తారా?' అని అడిగాడు. అక్కడున్న ఉన్నతకులస్థుడు 'మీదే కుల'మని అడిగాడు. అప్పుడు గాంధీజీ 'దాహానికీ కులానికీ సంబంధమేమిట'ని అడిగాడు. కులం చెప్పకపోతే మంచి నీళ్లిచ్చేది లేదని ఖరాఖండిగ చెప్పాడతను. ఈ సంఘటనను అప్పటి ప్రముఖ పత్రికలు పతాక శీర్షికలో ప్రచురించాయి. ఈ సంఘటన తర్వాత గాంధీజీ పల్లెల్లోకి వెళ్లి సనాతనవాదులతో మంచినీళ్లు పోయించడం చేశాడు. అదే సమయంలో అంబేద్కర్ హిందూ సమాజంలోని వర్ణవ్యవస్థలోపాల్ని ఎత్తిచూపాడు. కథా రచయిత్రికి స్ఫూర్తి నిచ్చినవి ఇవే కావచ్చు అంటాడు ఆచార్య ననుమాస స్వామి.

కేవలం దాహం తీర్చకపోవడమే కాదు. దళితులను ఏదో సాకుతో చంపడంలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. నీరుకొండ, పదిరి కుప్పం, చుండూరు, వేంపెంటల్లో దళితుల్ని ఊచకోత కోశారు. అడపాదడపా అంటరానితనాన్ని అలుసుగా తీసుకొని హత్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఆచార్య కొలకలూరి ఇనాక్ కథల్లో ప్రతిబింబిస్తాయి. 1965లో కంచిక చెర్ల కోటేశు హత్యా సంఘటనను వస్తువుగా తీసుకొని ఈయన 'దిక్కులేనోడు' కథ రాశాడు. 'సూర్యుడు తలెత్తాడు'లో అత్యాచారాలకు, హత్యలకు దోపిడీ దౌర్జన్యాలకు దళితులు బలవుతున్న వైనాన్ని హృదయవిదారకంగా చిత్రిస్తూ సంఘటాన్ని ఒంటరిగా ఎదుర్కోలేని ఓ దళితుడు తనకు ఊరివాళ్లు చేసిన అన్యాయానికి ప్రతీకారంగా ఊరును తగులబెట్టినట్లు చూపిస్తాడు. ఊరును తగులబెట్టడమంటే అగ్రవర్ణాల దురహంకారాన్ని రూపు మాపడమే. 'గొడ్డుదొంగ' కథలో దళితుడు మరో అడుగు ముందుకేస్తాడు. గొడ్డుదొంగగా ముద్రపడిన మాదిగ నాగడు అసలు దొంగ అయిన కామందును చంపి అతని ఆచూకీ తెలియకుండా చేస్తాడు. 'తలలేనోడు'లో మరో దొరపై ప్రతీకారం తీర్చుకోవడం కన్పిస్తుంది. 'ఊరబావి' కథ దళిత వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఇందులో అగ్రవర్ణాల ఆగడాలను ఒక స్త్రీ ఎంతో తెగింపుతో అడ్డుకుంటుంది. రైల్వేస్టేషన్లో తమను చూసి లేవలేదని ఆమె భర్త అయిన చిదంబరాన్ని కొట్టబోతే ఆమె 'ఉండవయ్యా పెద్దమనిషీ ఏంది చెయ్యెత్తా ఆ' అంటూ అదిలిస్తుంది. అగ్రకులాలవాళ్లు చిదంబరాన్ని కొట్టి చావడిలో కట్టిపడేస్తే అర్ధరాత్రిపూట పెత్తందార్ల మీద దాడిచేసి భర్తని విడిపించుకుంది. గడ్డివాములు తగల

బెట్టింది. ఎద్దు దట్టాన్ని బావిలో పడవేసి పగతీర్చుకుంది. కులం పేరులో నిప్పుకు నీళ్లకు దూరం చేసిన అగ్రవర్ణాలను ఎదుర్కోవడానికి, మానవత్వాన్ని మరిచి పోయి వాళ్లు చేసే దుర్మార్గాలపై ప్రతీకారాన్ని తీర్చుకోవడం ద్వారా వర్ణవ్యవస్థ నిర్మూలించడానికి చేసే ప్రయత్నం ఇనాక్ కథల్లో కన్పిస్తుంది.

బోయ జంగయ్య దళితుల పోరాటాల్ని వివిధ కోణాల్లో పరిశీలించి కథలు రాశాడు. తెలంగాణాలోని దళితులు ఎదుర్కొనే కష్టాల్ని అత్యంత సహజంగా చిత్రించాడు. నిజాం దొరల పెంపకం వల్ల బలపడ్డ దొరలు, పటేలు, స్వాతంత్ర్యం తర్వాత శాసన సభ్యులయ్యారు. భూస్వామ్య, పెత్తందార్ల వ్యవస్థలు తెలంగాణాలో కన్పించినంతగా మిలిగిన ప్రాంతాల్లో కన్పించదు. దళితుల అక్షరాస్యత వల్ల వాళ్లలో చైతన్యం కొరవడింది. వాళ్ల అస్తిత్వం ప్రశ్నార్థకమైంది. దళితుల నుంచి ఎదిగి వచ్చిన నాయకులు తమ సమస్యలపై పోరాటాలు సాగించారు. ఇవన్నీ బోయ జంగయ్య కథల్లో స్పష్టంగా కన్పిస్తాయి. 'పనిష్‌మెంట్' కథలో బోయ జంగయ్య ప్రజా ప్రతినిధుల దుర్మార్గాల్ని తెలిపాడు. నేరంచేయకున్నా దళిత స్త్రీ శీలాన్ని హరించడం ఆమె భర్తను తప్పుడు కేసులో ఇరికించి జైలుపాలు చేయడం అతన్ని ఇడిపించ డానికంటూ నగలను, నగదును దోచుకోవడం ఈ కథలో కనిపిస్తుంది. 'పంచరాయి' కథలో దళితులకు ప్రభుత్వం పంచిన భూమిని వాళ్లకు దక్కకుండా చేయడానికి పెత్తందార్లు పన్నిన కుట్ర వ్యక్తమవుతుంది.

తెలంగాణా దళితుల జీవితాలను చిత్రించిన మరో కవి కాలువ మల్లయ్య. కులవృత్తిని నమ్ముకొని తమ జీవితాలను 'అడవికాచిన వెన్నెల' చేసుకున్న వారి గురించి ఈయన కథలో చిత్రించాడు. దళిత ఉపాధ్యాయులు ఎదుర్కొనే అవమాన కరమైన, దయనీయమైన స్థితిని గుండెడపు కనకయ్య చిత్రించాడు. దళిత కార్మికుల కష్టాలను బి.యస్.రాములు స్పష్టం చేశాడు. జాజులగౌరి రాసిన 'మన్నుబువ్వ' కథ దళితులు కూటికోసం పడే పాట్లను వివరించింది. గద్దల భాను 'పాపానికి జీతం' కథల్లో మాదిగ ఇల్లాళ్ల శీలాన్ని యజమానులు దోచు కోవడం కన్పిస్తుంది.

నాగప్పగారి సుందర్‌రాజు రాసిన 'మాదిగోడు' కథలు అట్టడుగున సమాధి అయిపోయిన మానవీయవిలువల్ని దానివల్ల దళితుల జీవితాల్లో చోటుచేసుకున్న దయనీయ స్థితిని విపులంగా చర్చించాయి. అత్యాచారానికి గురై దారుణంగా హత్య చేయబడిన యువతి కథ 'మద్దికేరి మార్తమ్మ'. దళితుల చరిత్ర, సంస్కృతి నేపథ్యంలో రాసిన కథలు ఎండ్లూరి సుధాకర్ 'అంటరానోళ్లు'.

మొత్తం మీద దళిత కథల్లో ప్రధానంగా రెండురకాల కథలు దర్శనమిస్తాయి. మొదటి రకం కథల్లో దళితుల పట్లసానుభూతిలో వాళ్ల స్థితిగతుల్ని వివరిన్తూ సాంఘికంగా, మతపరంగా వాళ్లపట్ల వివక్ష చూపే అంశాలను సంస్కరించే ప్రయత్నంలో వచ్చిన కథలు.

రెండవ రకం కథలు దళితుల అభ్యుదయానికి అడ్డుతగిలే నమ్మకాలను, వ్యక్తులను, వ్యవస్థను ప్రతిఘటించాలని, అవసరమైతే హింసామార్గాన్ని అనుస రించినా తప్పులేదని చెప్తాయి.

ఆధార గ్రంథాలు :

1. డాక్టర్ సి.మృణాళిని, స్త్రీవాద నవలలు - కథలు : అస్తిత్వ పోరాటం వివేచన, పరిశోధన పత్రిక, జాతీయ సాహితీ సదస్సు ప్రత్యేక సంచిక, సంచిక 27, సెప్టెంబర్ 2006 (తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు-7

2. రాజేశ్వరి స్త్రీవాద దృక్పథం వ్యాసావళి, 2003.
3. ఆధునికాంధ్ర సాహిత్య వికాసం, దూరవిద్యాకేంద్రం ప్రచురణ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.
4. డాక్టర్ ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాద్, ద్వితీయ ముద్రణ 2004.
5. పూర్ణి, సత్యవతి, స్త్రీవాద కవిత్వం - వస్తువైవిధ్యం, ఎం.ఫిల్., లఘు సిద్ధాంత వ్యాసం, శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, జూన్, 2005.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మల్లిపురం జగదీశ్ "దుర్ల" (కవితాసంపుట) - విశ్లేషణ

- ఆచార్య జబ్బి అప్పారావు, శాఖాధిపతి, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

మల్లిపురం జగదీశ్ ఈ పేరు ఉత్తరాంధ్ర ఆదివాసీ సాహిత్యంలో ఒక చెరగని ముద్ర ఇతని కథల్లో అపు రూమైన వ్యక్తులున్నారు. ఆలోచింపజేసే సంఘటన లున్నాయి. నవ్వులున్నాయి నిట్టూర్పులున్నాయి. అమాయక ఆదివాసీలు ఉన్నారు గడసరలూ ఉన్నారు. వెన్నెలా ఉంది, చీకటి ఉంది. బుడ్డీ దీపాల వెలుగులు ఉన్నాయి ఉత్తరాంధ్ర ఆదివాసీ సాహిత్య సంతకం మల్లిపురం జగదీశ్ ఆదివాసీ సాహిత్యంలో చేయి తిరిగిన రచయిత. ఆశువుగా కవిత్వం, అలవోకగా కథలు అల్లే సాహితీ నేతగాడు, సాహిత్య సేద్యం చేస్తూ కథలను, కవితలను పండించే సేద్యగాడు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక వైవిధ్యమైన బాట వేసుకుని తన కంటూ ఒక విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకున్న రచయిత మల్లిపురం జగదీశ్.

మానవుడు సంఘజీవి. సంఘంలో కలిసి మెలిసి జీవించే మానవుడు సమాజాన్ని విడిచి ఏనాడు ఉండ లేడు. సమాజమే అతనికి అన్ని విధాలా జీవన విధానాన్ని నేర్పుతుంది. అటువంటి సమాజంలో ఎన్నో సంఘ టనలు, సంఘర్షణలు, సన్నివేశాలు నిత్యం కనిపిస్తూనే ఉంటాయి. అంటువంటి సందర్భాల్లో ఆయా విషయా లకు స్పందించి తన ఆలోచనతో రచనలు చేసి సమా జాన్ని జాగృతం చేసేవాడే రచయిత. సమాజంలో కన్పించే న్యాయాన్యాయాలు మంచి చెడులు అన్నింటిని నిశితంగా పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ తగిన సమాయంలో తన దైన శైలిలో కళాత్మకంగా లేక కవితాత్మకంగా వివరించే ప్రయత్నం చేసేవాడే నిజమైన రచయిత అటువంటి రచయిత రచనలును సమాజం ఆదరిస్తుంది.

సమాజం సాహిత్యానికి దేనినైతే ముడి వస్తువుగా ఇస్తుందో దాన్నే మరలా సాహిత్యం తిరిగి కొంత కళాత్మకతను, సౌందర్యాన్ని జోడించి సమాజానికి అందిస్తుంది. అందుకే సమాజనికి, సాహిత్యానికి మధ్య అవినావభావ సంబంధం ఉంది. సమాజంపట్ల బాధ్యతతో కూడిన కథలను రచించిన కథకునిగా తనదైన ఒక ప్రత్యేక ముద్ర సంపాదించుకున్న రచయిత శ్రీ మల్లిపురం జగదీశ్ గారనే విషయం స్పష్టమౌతుంది. అటువంటి రచయిత రచనలు సమాజానికి అద్దం పట్టేవిగా కనిపిస్తాయి. ఆదివాసీ సామాజికత చిత్రణ, సాంఘిక నేపధ్యం, మానవీయ విలువలు, సంఘ సంస్కరణ దృక్పధం, స్నేహసామరస్యం సంఘీ భావన విధానం వీరి రచనల్లో ప్రాధాన్యతను సంపాదించుకున్నాయి.

తెలుగు సాహిత్యంలో ఎన్నో రకాల ప్రక్రియలు ఉద్భవించాయి. ఒక్కో సాహిత్య ప్రక్రియది ఒక్కో ప్రత్యేకత. అటువంటి వాటిలో విశిష్టమైనది. నిత్య నూతనమైనది కవిత్వం. కవిత్వం పాఠకుల మనసును ఆకట్టుకుంటుంది. కవిత్వం కవి యొక్క రచనా నైపుణ్యాన్ని, వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. తెలుగు సాహిత్యంలో కవితా ప్రక్రియను చేపట్టి పేరొందిన కవుల ఎందరో ఉన్నారు. ఆ కొవలో మల్లిపురం జగదీశ్ కూడా చేరతారు. మల్లిపురం జగదీశ్ బహుముఖ ప్రజ్ఞా శీలిగా కన్పిస్తారు. కథలు, కవిత్వం ఏది రాసినా అందులో ఒక ప్రత్యేకతను, వైవిధ్యాన్ని చూపిస్తారు. చెప్పే విధానంలో తనదైన ముద్రను, నూతన విధానాన్ని అనుసరిస్తారు. జగదీశ్ రాసిన ప్రతి రచనా సామాజిక చైతన్యాన్ని దోహదపడేదే. సాంఘిక రుగ్మతలను తీసుకుని వాటి నిర్మూలనకు తన రచన ద్వారా కృషి చేస్తారు జగదీశ్. సమాజంలో మార్పును కాంక్షిస్తారు. ఎక్కువ శాతం ఆదివాసుల సమస్యలనే కవితా వస్తువుగా తీసుకున్నారు. జగదీశ్ కవిత్వం ప్రముఖుల మన్ననలు పొంది, పాఠకుల హృదయాలలో కలకాలం నిలిచే విధంగా ఉన్నాయి.

పోరాట కవితలు :

వర్గ రహిత సమ సమాజ నిర్మాణమే ధేయంగా, తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలబడి వారికి జరుగుచున్న అన్యాయాలను, అక్రమాలను, బాహ్య ప్రపంచానికి తమ కవితల ద్వారా తెలియజేశారు కొందరు కవులు. వారి అనుభవంలో ఎదురైన సంఘటనలు,తారసపడ్డ ఘట్టాలు కవితా వస్తువులైనాయి. అమాయకలైన జనం పక్షాన నిలబడి వారిలో పోరాట పంధాను నేర్పించె ఈ కవిత్వం. సామాన్యుల హక్కుల సాధన కోసం పోరాడక తప్పదని తెలియజేసింది. వర్గరహిత సమాజ నిర్మాణానికి పోరాటమే ఊపిరిగా సాగాలని ఎందరో కవుల తమ కవిత్వం ద్వారా తెలియజేశారు. "పోరాడితే పోయేదేమిలేదు, బానిస సంకెళ్ళా తప్ప" అన్న నెపోలియన్ మాటలను వీరు బలంగా నమ్ముతారు. కావున తమ కవితల్లో, ధనస్వామ్య ప్రభుత్వంపై సామాన్యుడు ఏ విధంగా పోరాటం చేయ్యాలో కవి నేర్పారు. పీడితులు, తాడితులు తమకు జరుగుతున్న అన్యాయాల్ని ఎదిరించి పోరాడక తప్పదని తన కవితల్లో ఉద్భోవించారు జగదీశ్. అటువంటి కొన్ని కవితల్ని పరిశీలిస్తే రచయిత దృక్పధం అవగత మవుతుంది.

జాగో ఆదివాసీ జాగో !!: జాగో .... ఆదివాసీ! జాగో !!
పీక తెగిపడుతున్నా
కొండలు తరగనేకు
జాగో ..... ఆదివాసీ ! జాగో !! ఆదివాసీ ప్రాంతాల లోని విలువైన బాక్సైట్ ఖనిజాన్ని మైదాన ప్రాంత పారిశ్రామిక వేత్తలు తరలిస్తూపోతుంటే బాక్సైట్ ఉద్యమం ఉవ్వెత్తున్న లేచింది. ఆ ఉద్యమానికి మద్దతుగా రచయిత ఈ కవితను రాశారు. ఈ కవిత ద్వారా ఆది వాసులలో పోరాట పంథాను నేర్పారు. జాగో ఆదివాసీ ! అంటూ ఆదివాసులను మేలుకొలిపారు.

పుంటుమాట :

ఎవుల గెలిస్తే మాత్రము కొండకి రావాల?
మాల్లా ఓట్లను కోని ఐదేళ్ళ దాక ఎవడ్రాడుగదా !!
ఐతొక్కమాటా .....
మేము కొండోల్ల మనుకొని ఓట్లడిగి
ఇన్నాల్లూ రాజ్యమేలిన రాజులు
నేల కొరిగినారు

గిరిజనుల మని చెప్పి నకిలీ ధృవపత్రాలతో గిరిజన ప్రాంతాలను పాలించే రాజకీయ నాయకులను హెచ్చ రిస్తూ పై కవిత సాగింది. కొండోల్లమని చెప్పి రాజ్యమేలిన రాజులు నేలకొరిగినా కొత్త కొండోల్లు తెర మీదకి వచ్చారని అంటాడు. వారిని తరిమి తరిమి కొట్టే దాకా పోరా డాల్సిందేనంటాడు. ఆదివాసులు ఐక్యమై ఒకే త్రాటిపై నిలిచినప్పడు, కలసికట్టుగా అందరిది ఒక మాట అయినప్పుడు ఇటువంటి నాయకులను తరిమికొట్టడం సాధ్యపడుతుందని భావిస్తాడు కవి. ఆదివాసుల మని చెప్పి ఆదివాసుల ఓట్లతో రాజ్యమేలిన రాజులు ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఎక్కువగా కన్పిస్తారు. ఎన్నికలలో ఆదివాసులకు కేటాయించిన సీట్లలో తరతరాలుగా అక్కడి జమీందారులే పోటి చేసి పాలిస్తున్నారు. నిజమైన ఆదివాసీ ఎన్నికలలో ఏనాడు పోటి చేయలేదు. పోటీ చేసినా గెలవలేడు. ఇది గమనించిన కవి తన ఆత్మ వేదనను పై కవిత ద్వారా వెల్లడించాడు.

దోపిడి కవితలు :

నానాటికి అంతరించిపోతున్న మానవీయ విలువలు, మనవునిలో నశించిపోతున్న మానవత్తం చూసి చలించిన కొందరు రచయితలు తమ ఆత్మ వ్యధను కవితలుగా మార్చారు. సమాజంలో ఎక్కడ చూసినా అన్యాయాలు, అరాచాకాలు రాజ్యమేలుతున్నాయి. అమాయక ప్రజలు అత్యాచారాలకు, హత్యాచారాలకు గురౌతున్నారు. మనిషి తన నైతికతను కోల్పోయి రాక్షసునిలా ప్రవర్తిస్తున్నాడు. ఈతనిలోనె మానవీయ గుణాలు కనుమరుగువు తున్నాయి. శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో దేశం అభివృద్ధి పధంలో దూసుకుపోతున్నా, అవినీతి, బంధు ప్రీతితో కొందరు మోసగాళ్ళు అమాయకాలను దోపిడికి గుచేసున్నారు. సమాజంలో అ సాంఘిక స్థితి నెలకొని

ఉంది. ప్రజల్లో నీతి, న్యాయం, ధర్మం, శాంతి, సహకారం వంటివి కనబడటం లేదు.

అమాయకులైన నిమ్న వర్గాలను, ఉన్నత వర్గాలు దోపిడికి గురిచేస్తున్నాయి. సామాన్య ప్రజల ధన, మన, ప్రాణాలు, దనిక వర్గం దోచుకునే తీరు కొందరు కవులు తమ రచనల ద్వారా అక్షరీ కరించారు. బూర్జువా, భూస్వామ్య వర్గాల పక్షలకు అండగా ప్రభత్వం ఉంటూ ఈ దోపిడిని ప్రోత్సహించటం కొందరి మేధావులకు ఆగ్రహం కలిగించింది. మేధావులందరు కలసి సామాజికంగా, శరీరకంగా, ఆర్థికంగా దోపిడికి గురౌతున్న కక్షాన నిలబడి పోరాడం చేశారు. అమాయక ప్రజానీకం ఏ విధంగా దోపిడికి గురౌతున్నారో తమ రచనల ద్వారా సమాజానికి తెలియజేసే ప్రయత్న చేశారు. ప్రస్తు మన రచయిత మల్లిపురం జగదీశ్ కూడా అమాయక ఆదివాసుల పక్షాన నిలబడి, వారు ఏవిధంగా దోపిడికి గురౌతున్నారో తన కవితల ద్వారా తెలియజేశారు.

శవశాపం :

ఒక శవాన్ని మాట్లాడతున్నా
లెక్కపెట్టండి వంశవాల్ని ఎప్పటిలాగే ....!
లెక్కదారి కాక హాయిగా నిదుపొండి .. !
ఏ శవం ఎంత బరువుందో.....!!
దీని రుర్వాసన ఘాటెంతో .... !
సరిగ్గా లెక్క కట్టండి

గోదావారి నది పరివాహక ప్రాంతంలో అనేక ఆదివాసీ గ్రామాలు ఉన్నాయి. వారు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయడానికి, మైదాన ప్రాంతాలకు రాకపోకలు చేయడానికి గోదావారి నదిలో తిరిగే లాంచీలపైనే ఆధార పడకతప్పదు. ఒక్కొక్కసారి వాతావరణం అనుకూలించిక పడవ ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతుంటారు. గోదావరి పడవ మునకలో ప్రాణాలు కోల్పోయిన గిరిజనులను తలచుకుంటూ రాసిన కవిత ఇది. అమాయక ఆదివాసుల చావుకి కారణం అధికారుల నిర్లక్ష్యమే అంటాడు కవి. కట్టలు తెంచుకున్న ఆవేశంతో శాపనార్తాలు పెడతాడు. పవాలు తినే రాబందులతో అధికారులను పోల్చుతాడు. గిరిజనుల ఓట్లు మాత్రమే కావాలి కాని వారి అభివృద్ధి పలకులకు అక్కర్లేదంటాడు. గిరిజనుల సంపదను దోచుకుని, పోలవరం ప్రాజెక్ట్ నెపంతో వారిని నిర్వాసితులుగా మార్చిననాడే వారి మునక ప్రారంభమయ్యిందని బాధపడతాడు.

చైతన్య కవితలు :

పేదల పక్షాన నిలబడి బుర్జువా, భూస్వామ్య వర్గాలను నిలదీస్తూ కొందరు కవులు తమ కలాన్ని ఘాలిపించారు. శ్రామిక వర్గానికి, దళితులకు జరిగే అన్యాయాన్ని తమ కవితల ద్వారా సమాజానికి తెలియజేసే ప్రయత్న చేశారు. వాళ్ళకు జరిగే అన్యాయం వాళ్ళకు తెలిసేటట్లు సామాన్యులను తమ కవితల ద్వారా చైతన్య పరిచారు. రచయిత యొక్క ముఖ్యోద్ధేశ్యం సామాజిక చైతన్యమే. సమాజంలోని వ్యక్తులను చైతన్య పరిచే ప్రతి కవితా సమాజానికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుంది.

ఆదివాసీ కష్టపడి చెమటోడ్చి అటవీ ఉత్పత్తులను సేకరిస్తాడు. కాని వాటికి తగిన గిట్టుబాటు ధర ఇవ్వ కుండా మైదాన ప్రాంత వర్తకుల మోసాలు చేస్తుంటారు. ఆదివాసీలు పండించే ఫలసాయాన్ని కొనుగోలు చేయాటానికి ఏర్పడిన సంస్థలలో పనిచేసే అధికారులు కూడా చేతి వాటం చూపిస్తూ ఆదివాసులను అన్యాయం చేస్తున్నారు. కష్టపడేవాడు ఆదివాసీ, ఫలాన్ని అనుభవించే వారు మైదాన ప్రాంత వ్యక్తులు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కాని కొండ మీద నుండి దించిన సరుకును ఏదో వంకలు చెబుతూ ధర తగ్గించి దోపిడి చేస్తుంటారు.

శ్రమ ఎవడిదో ఫలితం కూడా వాడే అనుభవించాలన్న చైతన్యాన్ని వారిలో కల్పించే ప్రయత్నం చేసాడు జగదీశ్. ఉత్పత్తి చేసేవాడు గుడిసెల్లో ఉంటే దొరలు మాత్రం మిద్దెల్లో ఉంటున్నారు. ఈ వ్యత్యాసంతగ్గాలంటే అమాయక ఆదివాసుల్లో తప్పక చైతన్యం రావాలి. ఆదివాసులకి సరైన న్యాయం జదగాలంటే వారిలో

చైతన్యం తప్పని సరి అనేక విభాజించారు. కావున వారిని చైతన్య పరిచే అనేక కవితలను రచించారు. ఒక పెద్ద కథగాని, నవలగాని చేయలేనివని ఒక చిన్న కవిత చేస్తుంది. కవిత సూటిగా గుండెలను తాకుతుంది. కావున తన కవితల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచ దలిచాడు కవి. ఆదివానులందరిని ఐక్యపరిచి సంఘటితంగా తమకు జరిగే అన్యాయాలను ఎదుర్కొవ డానికి వారిలో చైతన్యం తప్పనిసరి కావున తన కవితల ద్వారా ఆదివాసీ సమాజాన్ని ఉద్ధరించే ప్రయత్న చేసారు

రా అంబేద్కర్! రా....!
ఒక్కసారి కనపడు
ఈ రోజు
నీ బొటన వేలునూ నరికేస్తున్నారు
రాలిన రక్తపు బొట్లు కనిపించకుండా
కొత్త రంగుల్ని పూసేస్తున్నారు
రాక్షసులని పేరు మాకు పెట్టి
రాక్షసత్వాన్ని కరణచేస్తున్నారు
అడవిలో మా ముక్కు చెవులను కోసి
మైదానంలోంచి శాంతి వచనాలు పలుకుతున్నారు.
రా అంబేద్కర్! రా....!
ఒక్కసారి కనపడు

దళితుల రక్షణగా నిలిచే కొన్ని రాజ్యాంగ హక్కులను రద్దు చేసే దిశగా నడుస్తున్న కుట్రలను నిరసిస్తూ ఈ కవిత ద్వారా ఆదివాసులను చైతన్య పరిచే ప్రయత్నం చేశారు. ఇతిహాసాలలోని ఘట్టాలను ఉటుకిస్తూ కవిత సాగిన తీరు సహృదయ పాఠకునికి ఆలోచింప జేసేలా ఉంది. భారతంలో ద్రోణుడు ఏకలవ్యుని గురుదక్షిణగా బొటనవేలు అడిగి మోసం చేస్తాడు. రామాయణంలో రాముడు వారిని చెట్టు బాటున నిలబడి చంపుతాడు. ఆదివాసులను ఆటవెకులనే ముద్ర వేసి నాగరికత పేరుతో మోసం చేసేవారు ఎక్కవయ్యారు. ఆదివాసుల హక్కుల కోసం పోరాటం చేస్తుంఏ ఆ హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రపంచ ఆదివాసులారా! రండి కలిసినడుద్దాం
రేపటి వెలుతురుకై ముందడుగేద్దాం!
వాగ్గానమెద్దాం రేపటి తరాలకు
మన సంస్కృతికీ, సంప్రదాయాలనే అందిస్తామని
నినదిద్దాం
మన హక్కులకై ..... నలుదిక్కులకై!
చదువుకుందాం
రేపటి మన వెలుగులకై.

ఈ కవిత ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదివాసులను చైతన్య పరుస్తున్నారు కవి. రేపటి తరాల వెలుతురు కోసం అందరూ కలసికట్టుగా పోరాడాలని అంటాడు. తమదైన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందిస్తమని వాగ్గానం చేయమాంటాడు. ఆది వాసుల భాషను మరిచిపోయే ఆదివాసులను హెచ్చ రిస్తాడు. తమ భాషను భవిష్యత్ తరాలకు అందివ్వాలంటే తమ భాషను తాము మరిచిపోకూడదు. ఆధునిక పోకడల మోజులో పడ్డ ఆదివాసీ యువతీ యువకులు ఆదివాసీ భాషలో మాట్లాడటానికి సిగ్గుపడుతున్నారు. ఆదివాసీ భాషలో మాట్లాడితే సమాజం చులకనగా చూస్తుందేమో నన్న సందేహంతో పూర్తిగా ఆ భాషను విడిచిపెట్టేస్తున్నారు. బాషను మరిచిపోతే సంస్కృతికూరాక సుమారు గురి వుతుంది. ఆదివాసుల నివాసం ఉండే ప్రాంతాలు పచ్చ ప్రకృతిలో అహ్లదకరంగా ఉంటుంది. అటువంటి పర్యావరణాన్ని కాపాడడానికి పోరాటనికైనా సిద్ధపడా లంటాడు కవి.

అరుకిప్పుడు
చెరచబడ్డనాతో బుట్టువు
టూరిజమ విడిచిన స్థలనబిందువు [1]

ఉత్తరాంధ్రలోనే అత్యంత రమణీయమైన ఆదివాసీ ప్రాంతం అరకు. పచ్చని ప్రకృతితో, ఎత్తైన కొండలు, లోతైన లోయలు, చక్కటి జలపాతాలతో, భూతల

స్వర్గంలా అన్పిస్తుంది. పర్యాటక ప్రదేశం పేరుతో మైదాన ప్రాంత వ్యక్తులు తరచుగా వెళ్ళడం వలన కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయి సహజ సౌందర్యాన్ని కోల్పోతుంది. మైదాన ప్రాంత వ్యక్తుల విలాసాలకు, విహారాలకు అడ్డాగా మారిన అరకు నేడు చరచబడ్డ ఆదివాసీ స్త్రీ మూర్తిలా కన్పిస్తుంది. ఆదిగమనించిన కవి తన వేదనను ఈ కవితా రూపాన్ని కల్పించాడు.అరకు బాహ్యరూపం అందంగా కన్పిస్తున్న, అక్కడ నివసించే ఆదివాసులు ఎన్నోవెతలు పడుతున్నారని అంటాడు కవి. తన జాతి చిరునామాను వెతుకుంటూ వెళ్ళిన కవికి చేదుజ్ఞాపకాలే మిగులుతాయి.

ముగింపు :

ఈ విధంగా మల్లిపురం జగదీశ్ రుర్ల కవితాసంపుటిలో ఒక ఆదివాసీగా, కవిగా తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. ఇందులో ప్రతి కవితా సమాజానికి చైతన్య పరిచేదే. ఈ కవితా సంపుటి ద్వారా కిటవి ఆదివాసీల ఐక్యతను కాంక్షిస్తాడు. ఆదివాసీల ఉజ్వల భవిష్యత్ కోసం కలలు కంటాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత ఉద్యమాలలో స్త్రీలు

– డా॥ కె. ప్రేమకుమారి, ఉపన్యాసకురాలు, పి. ఆర్. ప్రభుత్వ కళాశాల (అ), కాకినాడ.

నా దేశములో
నాప్రజలు ఎంతకాలం
మనుష్యులుగా గుర్తింపబడరో
అంతకాలం
ఈ తిరుగుబాటు గీతం
పాడుతూనే ఉంటాను
నా జాతి
నా వారసత్వాన్ని కొనసాగిస్తుంది.

అని చెప్పిన నవ వైతాళికుల స్ఫూర్తితో ఎన్నోదళిత స్త్రీ ఉద్యమాలు వికసిస్తున్నాయి

నీళ్ళు మమ్మల్ని చూసినప్పుడల్లా
కన్నీరు పెట్టుకునేవి
మేము తమని
తాకడం లేదని
దిగులు పడేవి
తనివితీరా తాగడంలేదని
దిక్కులు చూసేవి
నీటికి మతమున్న దేశంలో
మేము పుట్టడం నేటికీ గొప్పవిషాదం.

అని గొంతెత్తి నవ ప్రంచానికి చాటాలని ఎందరో దళిత స్త్రీలు ధైర్యముచేసి ప్రతిభందకాలను ఎదిరించి సాగించిన ఉద్యమ, సాహిత్యకారులు ఎందరో వారిలో ప్రథమరాలు సామాజిక ఉద్యమరాలు జాలా మంగమ్మ (1909-1974): తన భర్త జాలా రంగస్వామితో కలిసి దళితుల పిల్లల కోసం ఆంధ్రాలో అనేక పాఠశాలలను నెలకొల్పారు. 1928 సం.లో దళిత బాల, బాలికలకు విడివిడిగా వసతి గృహాలు నిర్మించారు. లక్ష్మి పారిశ్రామిక శిక్షణా పాఠ శాలను రామచంద్రాపురంలో స్థాపించారు. ఈమె మొదటి దళిత సంపాదకురాలు, చేతిరాతతో 'వీరభారతి' అనే పత్రికను నడిపించింది. 'రైతు పిల్ల' అనే తొలి తెలుగా దళిత నవలకు సంపాదకత్వం వహించి ప్రచురించింది. 'రాష్ట్ర హరిజన నాయకులు' అనే గ్రంధం రాసింది. హరిజన మహిళా సంఘం'

స్థాపించింది. జాతీయోద్యమంలో పెద్ద ఎత్తున పోరాడి దళితోద్ధరణ కోసం స్వాతంత్ర్యం కోసం పోరాడి అనేక సాహిత్యాల్ని రచించిన జాలామంగమ్మ స్వాతంత్రోద్యమ చరిత్ర పుస్తకాల్లో కానరాకపోవడం బాధాకరము. కొమ్ము దమయంతి, భూషి అన్నపూర్ణమ్మ, చిపంతగడ శేషమ్మ రచనలు గృహలక్ష్మి, ధర్మజ్యోతి, ధర్మసాధన వంటి పత్రికల్లో విస్తృతంగా వచ్చాయి. పంతగడ శేషమ్మ గీతాంజలి, ప్రేమాంజలి అనువాదం చేశారు. మనదేవు డెక్కడ, విరజాలము అనే ఖండకావ్యములు రాసింది. కుమార స్వామి అనే నాటకాన్ని రాసి ప్రదర్శించింది.

అలా ఎందరో స్ఫూర్తితో ఎన్నో దళిత స్త్రీ ఉద్యమాలు జరిగాయి వాటిలో కొన్ని.

కారంచేడు ఉద్యమం: ఆధిపత్య కులాల కనుసన్నల, నియంత్రణలోనే జాతీయోద్యమాలు జరిగాయి. దానికి కారణం పితృస్వామ్య పరిదిలోనే చరిత్రలు రాసుకున్నారు కాబట్టే. ఇదే అణచివేత కారంచేడు, చుండూరు ఉద్య మాల్లో కూడా చూడొచ్చు. కారంచేడు ఉద్యమం ఆధిపత్య కులాలకు వ్యతిరేకంగా పోరాడి దేశంలోనే కారంచేడు-దళిత ఉద్యమం ఒక వెలుగుగా దారి చూపింది. ఆ ఉద్యమం కుల ప్రధాన వైరుధ్యాన్ని ఎత్తి చూపుతూ అంబేధ్కరిజం రాజ్యాంగం బద్ధ పరిష్కారం వంటి అంశాలు సమాజంలో చర్చకు వచ్చి, దళితులలో అస్తిత్వం, అత్మగౌరవం, సంఘటితం, ఏకీకరణ చైతన్యం పెరిగాయి. ఆ చైతన్యాలు రాజకీయ, విప్లవ పార్టీలలో కొనసాగుతున్న కుల వివక్షతల్ని ప్రశ్నించింది. ఆ పోరాట ఫలితమే ఎస్.సి మరియు ఎస్.టి. అత్యాచారా నిరోధక చట్టం 1989.

రక్తమైన చిందిస్తాం ప్రాణమైన అర్పిస్తాం
ఆత్మగౌరవాన్ని మేము హక్కుగానే సాధిస్తాం

అనూహ్య చైతన్యంతో నీఅహంభావాన్ని అంత మొందించే అంకుశంగా మారుతుంది అని.

ఇంతటి మహాఉద్యమంలో ప్రధాన భూమిక మహిళలు పోషించారు. మంచినీళ్ల కోసం జరిగిన సంఘర్షణతో ఆ ఉద్యమం మొదలైంది. ఆ సంఘర్షణలో మున్నంగి సువార్తమ్మ అనే దళిత మహిళ ఆధిపత్యకుల అహంకారాన్ని దిక్కరించింది.దళితుల మంచినీళ్ల చెరువులోకి పశువులను తోలిన ఆధిపత్య కుల అహం కారాన్ని ఎదిరించి, ప్రశ్నించింది. అది సహించలేని ఆధిపత్య కుల దురహంకారం ఆరుగురు దళితులను హత్య చేసింది. ఆ హత్యాకాండకు ప్రధాన సాక్షి దుడ్డు అలీసమ్మ, ఆమెనూ ఆధిపత్య దురహంకారం అంతం చేసింది.

కారంచేడు ఉద్యమానికి అయువుగా పనిచేసింది మహిళలే. పోలీసుల్నించి ఆధిపత్య కులదురహంకారుల దాడుల్నించి ఉద్యమాన్ని ఉద్యమ నాయకత్వాన్ని కాపాడింది మహిళలె. తమ ప్రాణాల్ని పణంగా పెట్టి కార్యకార్తలను, నాయకులను ఊరుదాటించడం, ఊరికి కాపలా కాయడం, క్యాంపులో వేల మందికి భోజనాలు వండివార్చింది, ఉద్యమాన్ని బతికించింది, ధర్నాలు, రాస్తారోకోలు, లాఠీ దెబ్బలు తిన్నది దళిత ఉద్యమ మహిళలే. దళిత మహాసభ నాయకులు కత్తి పద్మారావు అరెస్టయితే మహిళలంతా ఏకమై రాజకీయ నాయకు లను నిలదీసే వారి వాహనాలకు అడ్డంబడి, పోలీసు లాఠీదెబ్బలు తిని నాయకులను విడిపించేదాకా ఈ దళిత స్త్రీలు కారంచేడు ఉద్యమాన్ని కొనసాగించారు.

చుండూరు ఉద్యమం :

రానున్న రాజ్యము నీదోయి దళిత
కానున్న రాజువు - నీవోయి జ్వలిత
నీరాజ్యము నీది - మేలు కానవోయి
నీరాజ్యము నీవు - నేలు కొనవోయి

అనే రచనలును చదివి నిజమైన రాజ్యము కొరకు దళిత స్త్రీలు ఎదురుచూస్తున్న సమయములో అగ్రవర్ణాల అమ్మాయిలను దళిత మగపిల్లలు అల్లరి పెట్టారనే సాకుతో ఆరుగురు దళితులను అగ్రవర్ణాల వాళ్ళు వూచకోతకోసి మారణహోమం సృష్టించారు. చుండూరు ఉద్యమంలో మహిళలు చుండూరు నుండి ఢిల్లి వరకు దళిత మార్చ్ జరిగింది ఈ మార్చ్‌లో దళిత మహిళలు పాల్గొనిఉద్యమాన్ని చైతన్యపరచిందేకాక ప్రాణ త్యాగం చేసింది గూడూరి లేయమ్మ. ఢిల్లీ వీధుల్లో వంటలు చేసి మార్చ్ కార్యకర్తలను, నాయకత్వాన్ని బతికించారు దళిత మహిళలు. ప్రభుత్వాలు కదిలేదాక ఢిల్లీ నుంచి కదిలేది లేదని నినదించారు. దళిత ఉద్యమకారిణి బి.ఎమ్. లీలా కుమారి చుండూరు ఉద్యమంలో చూసిన పోరాటాలు త్యాగాలు చరిత్రలో మరువలేనివి. మారణహోమం జరిగినచోటే విచారణ కోసం స్పెషల్ కోర్టు భాదితుల మధ్యకు రావడం నిందుతులకు, ఆ కోర్టు శిక్షను ఖరారుచేయడం అ పోరాట విజయమే.

లక్ష్మింపేట ఉద్యమాలు :

నేను అస్పృశ్యుణ్ణి నా ఒళ్ళంతా మట్టివాసన
నా బ్రతుకు నిండా వెట్టివేదన
నన్ను ఊరికి దూరంగా వుంచారు
మట్టి పిసికి ఇటుకలు చేసి
ఇళ్ళు కట్టి ఇవ్వమన్నారు
ఇంట్లోకి రావద్దన్నారు
భూమి దున్ని గింజలు పండించి
రాసి ఏర్చి కూర్చమన్నారు
మీరు విసిరేసిన గింజలు
ఏరుకు తినమన్నారు
మీ పాడికి కాపలా ఉంచుకున్నారు
ఒక్క పాలచుక్కయినా తాగవద్దన్నారు
నా నీడ మీకు తగలకూడదన్నారు
నేను చేసేపని మలినపని అని నాకు మాలిన్యం అంటగట్టారు

నేనెప్పుడో చేసిన పాపంకొద్దీ
నాకా బతుకొచ్చిందని
మీకు ఊడిగం చేయడమే దేవునికి యిష్టమని
అలా నానొసట వ్రాశాడని మీరు నాకాశిక్ష వేశారు
కూలి పెంచండని బతిమాలితే
కర్రలతో చావబాదారు
నరరక్తం రుచిమరిగిన పెద్దపులుల్లా
తరతరాలనుంచి మా రక్తాన్ని జుర్రుకు తాగుతూనే
ఉన్నారు

అని దళితులు గ్రహించే స్థితిలో తరతరాలుగా భూమికి దూరం చేయబడ్డ దళితులందరూ ఒక్కొక్క కుటుంబం ఎకరా చొప్పున పదేళ్ళ నుండి సాగు చేసుకుంటున్నారు. వెలివాడల్లో వుండాల్సిన దళితులు కాపుల ప్రక్కన జీవించడమే గాక కాపులతో సమానంగా రైతులుగా బతుకుతూ, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో మనిషిగా బతకాలనే చిన్న ఆశతో ఆత్మగౌరవాన్ని ప్రకటించుకున్నందుకు, అగ్రకుల మను రాజ్యాన్ని సవాల్ చేసినందుకు దళితులు ఐదుగురు నేలరాలారు. ఈ మృతుల రక్తం నుండి పుట్టిన దళిత ఉద్యమానికి ప్రతిఘటనా శక్తి స్వయం సిద్ధమైంది. ఇంచుమించు అన్ని గ్రామాలలో నెలకొని ఉన్న పరిస్థితుల్ని అవగాహన చేసుకొని గ్రామం పునాదిగా ఉద్యమాన్ని నడిపింది. మాతృసామ్యవ్యవస్థ అంత:శక్తి అయిన దళిత ఉద్యమం స్త్రీలను కదిలించింది. కులాధిపత్యంలో అణచివేయబడుతున్న యువతరాన్ని సమీకరించింది. బానిస సంకెళ్ళలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని మేల్కోల్పింది. నినాదాన్ని నేర్పింది. పతాక నెగురవేసింది. నిర్మించటం, ప్రవహించటం, ప్రజ్వలించటం ఉద్యమ ధర్మంగా సాగాయి. మరియు మారణహోమం జరిగినచోటే విచారణ కోసం స్పెషల్ కోర్టు భాదితుల మధ్యకు రావడం దళిత స్త్రీ ఉద్యమ విజయము అని దళితులు గ్రహించే స్థితిలో తరతరాలుగా భూమికి దూరం చేయబడ్డ దళితులందరూ ఒక్కొక్క కుటుంబం ఎకరా చొప్పున పదేళ్ళ నుండి సాగుచేసుకుంటున్నారు. వెలివాడల్లో వుండాల్సిన దళితులు కాపుల ప్రక్కన జీవించడమే గాక కాపులతో సమానంగా రైతులుగా బతుకుతూ, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో మనిషిగా బతకాలనే చిన్న ఆశతో ఆత్మగౌరవాన్ని ప్రకటించుకున్నందుకు, అగ్రకుల మను రాజ్యాన్ని సవాల్ చేసినందుకు దళితులు ఐదుగురు నేలరాలారు. ఈమృతుల రక్తం నుండి పుట్టిన దళిత ఉద్యమానికి ప్రతిఘటనా శక్తి స్వయం సిద్ధమైంది. ఇంచుమించు అన్ని గ్రామాలలో నెలకొని ఉన్న పరిస్థితుల్ని అవగాహన చేసుకొని గ్రామం పునాదిగా ఉద్యమాన్ని నడిపింది. మాతృసామ్యవ్యవస్థ అంత:శక్తి అయిన దళిత ఉద్యమం స్త్రీలను కదిలించింది. కులాధిపత్యంలో అణచివేయబడుతున్న యువతరాన్ని సమీకరించింది. బానిస సంకెళ్ళలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని మేల్కోల్పింది. నినాదాన్ని నేర్పింది. పతాక నెగురవేసింది. నిర్మించటం, ప్రవహించటం, ప్రజ్వలించటం ఉద్యమ ధర్మంగా సాగాయి. మరియు మారణహోమం జరిగినచోటే విచారణ కోసం స్పెషల్ కోర్టు భాదితుల మధ్యకు రావడం దళిత స్త్రీ ఉద్యమ విజయము.

కోటిరేవుపల్లి మనెమ్మ, సుబ్బమ్మ, మంగమ్మ, రమణమ్మ, పద్మమ్మ, రత్నమ్మ తమ తాగుబోతు మొగుల్ల మీద పాటలు కట్టి సారా ఉద్యమం నడిపించారు. యింకా మాతమ్మ దురాచారాల మీద చేసిన పోరాటాల్ని చేస్తుంది. దళిత స్త్రీలు అన్యామాని ఎదిరించడమే ఒక గొప్ప, ఉద్యమాలు జరిపి విజయం సాధించడం అనేది యీ కుల సమాజంలో మామూలు విషయం కాదు.

ఉపయుక్త గ్రంధసూచిక :

1. దళిత సాహిత్యంలో వాదా ప్రతివాద విమర్శ - గుర్రం మాదవరావు
2. ఆధునిక సాహిత్యం: దళిత స్పృహ - యువ భారతి, సాహితి సాంస్కృతిక సంస్థ
3. చుండూరు నెత్తుటి చరిత్ర - కుల నిర్మూలనా ప్రచురణలు
4. అందుకో దండాలు - మాష్టార్జీ
5. అంబేడ్కర్ అనంతర దళిత ఉద్యమాలు, సాహిత్యం: సవాళ్ళు
6. దళిత ఉద్యమాలు-సాహిత్యం, దళిత స్త్రీల పాత్ర- జూపాక సుభద్ర

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గోరటి వెంకన్న సాహిత్యం – దళితోద్యమ ప్రభావం

– బానోత్ వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

తెలుగునాట దళితఉద్యమం. 80వ దశకంలో ముందుకు వచ్చింది. సమాజంలో సాహిత్యంలో సంచలనం తెచ్చింది. మహారాష్ట్రలో వచ్చిన "దళిత్‌పాంథర్స్" ఉద్యమ ప్రభావంతో ఇక్కడ దళితఉద్యమం జీవం పోసుకున్నది. కారంచెడు ఘటనతో ఊపందుకున్నది. చరిత్రలో వచ్చిన ఈ ఉద్యమం వ్యక్తులమీద, శక్తులమీద అద్భుత ప్రభావం వేసింది. ఇట్లాంటి సందర్భంలో పాటకు దగ్గరైన గోరటివెంకన్న దళితఉద్యమ ప్రభావానికి గురయ్యాడు. దళిత ఉద్యమం పుట్టుక, నేపథ్యం చర్చించుకుంటే వెంకన్న పాటపై ఈ ఉద్యమ ప్రభావం ఎలా ఉందో అర్థమవుతుంది.

'దళిత' అనే పదానికి "చీల్చబడిన, ఖండించబడిన, ఛేదింపబడిన, పోగొట్టబడిన, సగంగా చేయబడిన" అనే అర్థాలున్నాయి. సమాజంలో మనిషి మనుగడకు కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డనోచుకొని అభాగ్యులు. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయపరంగా అణగతొక్కబడినవారు. ఊరికి దూరంగా ఉండి తమ ఉనికినే పోగొట్టుకున్నవారు, సభ్యసమాజంలో సరైన సబంధ బాంధవ్యాలు లేనివారు, నిత్యపీడితులు, తాడితులు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నా వారందరూ దళితులు.

దళిత అన్నపదం బలహీనతలను, అసహాయతను వైఫల్యాన్ని సూచించదు. అది ఒక సంఘటిత శక్తికి ప్రతీక. ఆత్మవిశ్వానికి, ధైర్యానికి ఆలంబనం. తరతరాలుగా అస్పృశ్యతకు గురై మతంపేరిట సాంస్కృతికంగా హీనంగా చూడబడి, విద్యా సౌకర్యాల కరువైనసమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై, ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడీకి గురి అయినవాళ్ళు, అనే అర్థంలో దళితపదాన్ని ప్రస్తుతం ఉపయోగించవచ్చు. 'దళితుల సంవేదనలను, ఆర్తిని, ఆవేశాన్ని, నిరాశనూ, నిట్టూర్పులనూ, ఆగ్రహాన్ని, యదార్థజీవిత వ్యధార్థ దృశ్యాలనూ ప్రతిబింబించేది దళిత సాహిత్యం."

1970వ దశకం నుండి గద్దరు, వంగపండు, గూడ అంజయ్య, మాస్టార్జీ, ఉప్పలపాటి సాంబశివరావు, కత్తి పద్మారావు మొదలైన వారు దళితపాటలు రాసిన విప్లవ కవులు. వీరందరిలో గ్రామజీవితాన్ని, విప్లవ చైతన్యాన్ని గొప్పగా జోడించిన కవి గూడ అంజయ్య. ఈయన రాసిన "ఊరుమనదిరా" అనే పాట పాటల సాహిత్యానికి మచ్చుతునకని చెప్పవచ్చు. ఆ తర్వాత గ్రామీణసంస్కృతిని ఒంట బట్టించుకున్న కవి గోరటి వెంకన్న. ఈ క్రమంలో వచ్చిన వివిధ రకాల వర్గపోరాటలు, దళితఉద్యమాలు వెంకన్నను పాటరాయడానికి మేలుకొల్పాయి. వెంకన్నకు మట్టి పరిమళాలు తెలుసు. మట్టిలో పుట్టి, మట్టిలోపెరిగిన వ్యక్తి కాబట్టి తనపాటల్లో కష్టనష్టాల్లో బాధలు సుఖ దు:ఖాలు కనిపిస్తాయి. రెడ్డి భూస్వాముల, వెలమదొరల, పెత్తందార్ల, హిందూమత నిరంకుశత్వంతో అణచివేతలు, ఆకలిచావులు భరించలేక పల్లెనుండి పట్నం బాట పట్టారు. ఏ గల్లిలో చూసిన పాలమూరు లేబర్ జనం కనబడతారు. అందుకే గోరటి వెంకన్న కోపం, కసిని తన పాటల్లో స్పష్టంగా వ్యక్తపరుస్తాడు. అందుకే వెంకన్న సాహిత్యంపై దళితసాహిత్యం ఉద్యమ ప్రభావాలు ఉన్నాయని చెప్పవచ్చు.

భారతదేశం వర్గసమాజం, అట్లే కులసమాజం ఈ దేశంలో మెజార్టీ దోపిడిశక్తులు అగ్రకులాలే దళితులను వారి శ్రమను చరిత్రనిండా దోపిడి చేశారు. ఈ దోపిడి పీడనలను ఎదురిస్తూ తెలుగుసాహిత్యం ప్రతిస్పందించింది. ఈ చైతన్యంలో భాగంగానే గోరటి వెంకన్న అగ్రకులాల దోపిడిని, తన పాట ద్వారా ఎండగట్టాడు.

"ఎంతకు తెగించితివేరా ఓ మతోన్మాది
ఈ దేశమున ఎన్నడారని చిచ్చుపెడ్తివిరో!
రామజన్మభూమిపేర - రంకు బొంకు కథలనల్లి
. . . . . .
. . . . . .
అగ్రకుల మనువు ధర్మమును అంతం చేయు దళితులు లేచిరి
భూమిలేని పేదలంత భూమికోసం దండుకట్టరి
భూమి పోరుచూసి జడసి రామజన్మ భూమిని తెస్తిరి
భూస్వాముల కావలి కుక్కవురో ఓ మతోన్మాది
నీకు పోగాలము దాపురించినదిరో ఓ మతోన్మాది
మతం ఒక మత్తు మానవత్వానికి పెడ్తుంది చిచ్చు
అని చెప్పినట్లుగా రేపటికల్లా మాపటికల్లా" అని

హిందువులు అల్లాని తలుస్తారు. 'ఓదేవ్ ఏదేవ్" అంటూ ముస్లీంలు మన దేవుళ్ళను తలుస్తారు. ఇది భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భరతభూమి. అటువంటి పవిత్రమైన ఈ గడ్డ మీద వివిధమతాలు, కులాలు, వర్గాలు, ప్రాంతాల వారు నివసిస్తున్నారు. అటువంటి ఈ సువర్ణ భూమిలో కొంతమంది స్వార్థపరులు తమ ఉనికిని చాటుకోవటానికి సార్ధరాజకీయ నాయకులు అమాయకులైన అన్యం పుణ్యం ఎరుగని ప్రజల్ని మతం, కులం ప్రాంతాల పేర్లతో చిచ్చుపెట్టి చిన్నాభిన్నం చేస్తారని కవి గోరటి వెంకన్న మతోన్మాదుల గురించి చక్కగా పాటను రాశారు.

"ఎవ్వని ధర్మమే మాయన్నో దళితన్నా
ఇది ఏమి న్యాయమే మాయన్నో దళితన్నా
తడిబట్టలతో గోంతుకోసే-మడిధర్మం మనదికాదు
మనువు ధర్మమే మాయన్న దళితన్నా
మాయ వాదమో మాయన్న దళితన్నా. . . .
. . . . . .
సమత ధర్మం మనది, సత్యమార్గం మనది
సకల పీడితుల వేదన తలగిపోయే ధర్మముకై
మార్క్స్ మావో, అంబేడ్కర్ బోధనలతో కదిలిసాగి
మనువుగాని, కుటిలనీతి - మంట్లకలుపకదిలి రండీ!"

అగ్రకులస్తులైన బ్రాహ్మణులు ఈ దేశంలో మనుషులను చుతర్విధ వర్ణాలతో పాటు, పంచమ కులం అంటూ వర్గీకరించి మనిషిని మనిషి హీనంగా చూసే తారతమ్య భేదాలను సృష్టించారు. ఆ పంచముల చేత అన్ని పనులు చేయించుకున్న ఈ బ్రాహ్మణులు చివరికి వారిని అంటరానివారుగా ముద్రవేసి లోకం దృష్టిలో చండాలులుగా ఊరికి దూరంగా విసిరేసినారు. అందుకే గోరటి వెంకన్న తడిబట్టలతో గొంతుకోసే మడిధర్మ ఆచారాన్ని నిరసిస్తూ ఖండిస్తూ దళితుల్ని చైతన్యం చేసే సందర్భంపై పాటలో కనబడుతుంది. అగ్రకులస్తుల అహంకారాన్ని నిరసిస్తూ, వారి కపట బుద్ధిని వెలికితీస్తూ కవి గోరటి వెంకన్న పాటరూపంలో తన బాధను వ్యక్తపరుస్తున్నాడు. అన్నా ఓ దళితన్నా ఎవరు సృష్టించారు ఈ మాయ ధర్మాన్ని, తడిబట్టలతో గోంతుకోసే మడిధర్మం మనది కాదు. మనుధర్మం ఒక మాయజూదం లాంటిదంటాడు. గుడికట్టాలన్న, ఇల్లుకట్టాలన్న, వ్యవసాయం చేసి పండించేటపుడు మన రక్తం ధారపోయాలి. కాని గుడికి బడికి దూరంగా ఉండాలని శాసిస్తారు. ఈ అగ్రకులస్థులు అందుకే కవి రక్తమంత ఇంకిపోగ రాళ్ళుగోడలు గట్టి దేహమంతా అలసిపోంగలేవ గోపురాలు కట్టి రాతిగిర్రలు ఇనుము రథాలన్ని లాగుతాము. రథంపై కూర్చోని బాపనోడు పెత్తనం చేస్తాడు. పేగు తేగేదాక గుంజిసస్తే స్వర్గమొస్తదని మాయమాటలు చెప్పుతున్నాడు. ఆ స్వర్గమేదో వారికే దక్కని సచ్చేదాకా ఆ రథాన్ని వారినే లాగమని చెప్పండి. తాళ్ళుపేనీ మామిడాకులు తెచ్చి తోరణాలు కట్టి, మర్రిఆకులు తెచ్చి దేవుడికి పందిరేసి, గుడినంతా శుభ్రం చేస్తాము. కాని పూజ సందర్భంలో గుళ్ళో ప్రవేశించేటప్పుడు మైల పడుతుందని ఈ కపట బ్రాహ్మణులు మనల్ని నీచంగా చూస్తారు. అందుకే దళితుల్ని పనులని ఆపేయండని పిలుపు నిస్తున్నాడు. రాములోడి గుడిసుట్టు తిరిగే బండికి రంగులేసి, పిల్లలంతా

ఎగిరి ఎక్కికూసుంటే అయ్యాబండెక్కుతానని అడిగిన పాపానికి ఛీ ఛీ అంటూ చీత్కరించే బ్రాహ్మణుల నైజాన్ని కవి చక్కగా వివరించాడు.

"దూల దూల కాశ్మిమ్ము-దుమ్ములేపర దుర్గన్న
దుమ్ము లేపర దుర్గన్న-కొమ్మూది రావే దుర్గన్న
కడుపుసల్ల కదలకుండ-సుక్కసెమట రాల్చకుండ
పరులశ్రమను దోసిబలిసి - భగమునులించె దొరల
దోపిడింక సయిపనుని - ఆకలి పేగులేకంకాగా"

మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, సమాజాన్ని చిన్నాభిన్నం చేసే అగ్రకులస్తుల నైజాన్ని వెలికితీసి చెప్పే సందర్భంలో కవి గోరటి వెంకన్నపై పాటలో చక్కని విశ్లేషణ చేశాడు. తిని ఊరకే కుర్చోని పనిపాట లేకుండా అనాలోచితంగా ఆలోచించే అగ్రకులస్తుల అహంకారాన్ని కవి నిర సిస్తున్నాడు. కడుపులచల్ల కదలకుండా మాయమాటలు చెప్పి అమాయకుల్ని బలిపశువుల్ని చేసే వారి గురించి కవి నిరిస్తున్నాడు. శ్రమఒకరిది, సోకు ఇంకొక్కరిదన్నట్లుగా పరులశ్రమను దోచుకునే భోగభాగ్యాలు అనుభవించే దొరల దోపిడిని కవి ఖండిస్తున్నాడు. "మాపవనం, మామిడొనం పూతపట్టి పిండేలేస్తే చిగురుటాకుతల్లి మద్య వదిగి పాడె కోయిలమ్మదే మతం, సల్లగాలి పిల్లవాము తగిలి ఒళ్ళు పులకరిస్తే పురివిప్పి నాట్యమాడే నెమలిదే మతం, ఉరుము ఉరిమి వానవస్తే ఏరుకు ఎదురీదే చేపపిల్లదేమతం" అని గోరటి వెంకన్న సమాజాన్ని ప్రశ్నిస్తున్నాడు. ప్రకృతితో లేని ఈ మతపిచ్చి మానవుల్లో ఎలా వచ్చిందని ఆశ్చర్యపడుతున్నాడు.

"వహ్యారే మా దొర వడుపు నేర్చుకున్నాడు
వహ్యారే మాదొర వరుస మార్చుకుంటుండు
వేషాన్ని మార్చుకుండు రోషాన్ని అణుచుకుండు
మిషాన్ని దించుకుండు కోపాన్ని మింగుతుండు
మోసం మాతుం దొరా ఈసమెత్తు వదలకుండు
పల్లె పల్లె తెలివొచ్చి ప్రశ్నల కొడవళైతే" ॥వయ్యారే॥

అంటూ గోరటి వెంకన్న తెలంగాణాలో ఒకప్పుడున్న దొరల దోపిడీలను, ఇప్పుడున్న మాయమంత్రాలతో అందర్ని మోసం చేసే దొంగబాబుల పరిస్థితిని ఆకళింపు చేసుకుని పాట కట్టుకున్నాడు. తెలంగాణా అంటే దోర తనం, వెట్టిచాకిరీ తప్ప మరేమీలేని మధ్యయుగాల మహాంధకారమని కవి భావన. దోరోడు వదిలి వెళ్ళిన పల్లె విముక్తి గ్రామమైందని కవి భావన. ఇది తెలంగాణ తరతరాలుగా దోపిడికి ఎలా గురైంది అనే విషమున్న పాట. అగ్రకులస్థులు అణగారిన కులాల వారిని ఏ విధంగా దోపిడీ చేస్తారో చక్కగా వర్ణింపబడింది.

భారతదేశం కులాల సమాజం. దీనికి మూలం మను ధర్మం, చాతుర్వర్ణ వ్యవస్థ విరాట్ రూపమే అంటరాని తనం బ్రాహ్మకు పుట్టినది నలుగురే అన్నారు. కాని పంచమ వర్ణం ఎట్లూ వస్తుందని గుర్రంజాషువా లాంటి కవులు ప్రశ్నించారు. ఆ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న గోరటి వెంకన్న అంటరానితనంపై తన పాటను ఎక్కుపెట్టాడు.

"ఏమున్నదే నా బాతకేమున్నది
ఊరు మారిందంటూ తీరు మారిందంటూ
ఊరికి రోడ్డంటా- రోడ్డెంటా బస్సంటా
బడిపిల్లలు చదివే పక్క బంగులలంట
ఇన్ని మారినా నా బతుకెందుకిట్లుందో . . .॥ఏమున్నదే॥

ఇది గ్రామాల్లో ఉండే దొరల, పెత్తందార్లు భూ స్వాముల దళితుల శ్రమను ఏవిధంగా దోచుకుని వారిని జీవితాంతం వెట్టిపనుల్లో ఉంచుతారో తెలియచేసే పాట, ఈ పాటను చదవితే తెలంగాణో ఉన్న దళితుల జీవితం కండ్లముందు కదులాడుతుంది. ఇది ఒక పేద దళిత స్త్రీ పాట. చిన్నప్పుడు అంటే ముక్కు పచ్చలారని ఆరేండ్లకే దొరల దగ్గర వెట్టి పనుల్లో కుదిరిన ఒక అమ్మాయి జీవితం. ఈ వెట్టి తరతరాలుగా వస్తున్న వైనాన్ని ఆ స్త్రీ ఆవేదన ఈ పాటలో స్పష్టంగా కనబడుతుంది.

దళితులు ఆకలైనా భరిస్తారు కానీ, అవమానాన్ని భరించలేరు. అగ్రకులాల దోపిడిని, అణచివేతను భరించలేని దళితులు ఎదురుతిరిగే స్వభావాన్ని మొదటగా కమ్యూనిస్ట్‌పార్టీతో, తర్వాత వచ్చిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంత వ్యాప్తితో చైతన్యం అయి ప్రశ్నించటం నేర్చు

కున్నారు. దళితుల అణచివేతను కళ్ళతో చూసిన గోరటి వెంకన్న తన కవిత్వంలో ప్రశ్నించే తత్వాన్ని నేర్పుతాడు. దళితుల సమస్యలకు పరిష్కారం పోరాటం అని చూపిస్తాడు.

"ఏమిమారే ఏమిమారే రా
ఈ పేదల బతుకులు ఎందుకింత హీనంగున్నవిరా
ఇంటిముందు కొట్టములా మేకపిల్లల రోచ్చు వున్నది
ఇంటిలోన గంపక్రింద కోడిపెట్టల రెట్టా వున్నది. . . .

ఇది దళితులైన పేదవారి బతుకు చిత్రాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించే పాట. కవి గోరటి వెంకన్న వాస్తవంగా దళితుడు కాబట్టి వారి జీవితాన్ని ఉన్నదానిని పాట రూపంలో వ్యక్తపరిచాడు. దళిత బహుజన ప్రతిభను ఆకాశానికెత్తిన పాట ఇది. ఈ పాటలో దళితుల జీవన విధానం, వారి బతుకుచిత్రం కండ్లకు కట్టినట్లున్నది. గ్లోబలైజేషన్ మాయలో వచ్చి కూలిజనానికి ఉపాధి లేకుండా పోయింది. పేదలబతుకు మీద బండరాయి పడిందని కవి దళితులైన పేదల కష్టాలకు కన్నీటికి తన పాటలో స్థానం కల్పించాడు.

"ఏందిరో మనోడిట్ల ఎందుకిట్ల మారెరో
మనోడే మన బిడ్డడే మన దళిత ఆఫీసరే
మనోళ్ళ సూసి వీడు మనుసు విసుక్కుంట డేంది
మన మాలమాదిగోల్ల గేర్ల మంట్ల ఆది పెరిగినోడే

అంటూ దళిత ఆఫీసర్ గురించి, అతని నైజం గురించి అద్భుతంగా రాశాడు. ఇది దళితకోణం నుండి రాసిన పాట. ఇందులో వెంకన్న దళిత కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని ఉన్నత ప్రభుత్వ ఉద్యోగిఅయి ఆఫీసర్‌గా ఉండేవారి స్థితిని తెలియపరుస్తున్నాడు.

ఎన్నిసార్లు ఈ ఘోరాలు ఎంత మందిమి వోరుగుదాం

"దళితన్న దండు కట్టకుంటె బ్రతుకలేము
దళితన్న భరిసెలెత్తకుంటె నిలువ లేము
కట్టబట్ట తెల్లగుంటె - వానికండ్లు మండిపాయె
కళ్ళజోడు మొరుపులుంటే -వాని కడుపు మంటబుట్టె
వాళ్ళ కాళ్ళ కాడ అణగమని -హద్దులెన్నో గీసినాడు
దళితన్న వాళ్ళబ్బా సొమ్ము తింటున్నామా
దళితన్న మరి అదిరి బెదిరి బ్రతుకుండెది"

॥ఎన్నిసార్లు॥

ఇది గోరటి వెంకన్న రాసిన మొదటి దళిత ఉద్యమ పాట అనాదిగా దళితుల మీద సాగుతున్న దౌర్జన్యాన్ని అన్యాయాన్ని ఆరాచకాల్ని ఎదుర్కొనాలని దళితుల్ని చైతన్యం చేసే సంధర్భంలో పై పాటను వెంకన్న రచించాడు. అతను కూడా ఒక దళితుడే. మాల కులంలో పుట్టి రకరకాల అవమానాలను ప్రత్యక్షంగా పరోక్షంగా అనుభవించి చూశాడు. కాబట్టి వారి బతుకు చిత్రాన్ని చక్కగా పాటరూపంలో వివరించాడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. గోరటి వెంకన్న, ఏకునాదం మోత
2. గోరటి వెంకన్న, రేలపూతలు
3 కె. శివారెడ్డి, అలసెంద్రవంక, ముందుమాట
4. పాలపిట్ట మాసపత్రిక, 2010 ఏప్రిల్
5 గోరటి వెంకన్న సాహిత్యం-పరీశీలన-చారకొండ వెంకటయ్య

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా గబ్బిలం – దళిత వాదం

– నోసిన వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము, గుంటూరు.

మనుషులు రెండు రకాలుగా జన్మిస్తారు. ఒక రకం వారు 'కారణ జన్ములైతే' రెండవ రకం వారు 'జన్మ కారణులు'. ఈ భూమి మీద కేవలం ఆ ఒక్క పనిని పూర్తి చేసి తిరిగి వెళ్లిపోయినవారు కారణజన్ములు. కానీ తాము జన్మించిన తరువాత తమ జీవనమార్గంలో తన జన్మ కారణాన్ని వెతుక్కుని కార్యసాధన చేసేవారు జన్మకారణులు.

ఈ రెండవ కోవకు చెందిన వారే గుర్రం జాషువా గారు. దళితుల ఆకాంక్షలను వ్యక్తీకరించడానికి దళితుల పక్షాన నిలబడి వారికి తన గొంతుకనిచ్చి దళితుల ఆవేదనను, ఆక్రందనలను అవమానాలను తన కవిత్వములో వ్యక్తపరచినవారు జాషువా గారు. దళితుల తలరాతలను తన రచనల ద్వారా మార్చడానికి 1895లో జన్మించిన "దళిత బ్రహ్మ" గుర్రం జాషువా గారు.

జాషువా తండ్రి గొల్ల కులానికి చెందినవాడు. తల్లి మాదిగ కులానికి చెందిన స్త్రీ. అయితే జాషువా గారు చివరి వరకు మాదిగ కులానికి చెందినవాడిగానే ఈ సమాజంలో గుర్తింపు పొందాడు. చిన్న వయసులోనే కులం, మతం పరంగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాడు. చదువు మనకు సమాజంలో గౌరవాన్ని కలిగిస్తుంది. తలెత్తుకొనేలా చేస్తుంది. చదువే ఈ కుల, మతాలు విసిరే శరాలను తుత్తునియలు చేసే వజ్రాయుధం అని తండ్రి చెప్పిన మాటలను ఎల్లప్పుడూ తన మస్తిష్కంలో నెమరు వేసుకుంటూ బాగా చదువుకొని చిన్న వయసు నుండే మంచి రాతగాడిలాగా, పాటగాడిలాగా ఎదిగాడు.

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఒక నూతన ఒరవడిని సృష్టించి, తనకంటూ చిరిగిపోని తన పేజీలను తానే లిఖించుకున్న దళిత అక్షరబ్రహ్మ జాషువా గారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా దళిత సాహిత్యంలో ఒక యుగపురుషుడుగా జాషువా గారిని చెప్పవచ్చు. మహాకవి జాషువా గారు ఎన్నో కావ్యాలు రాశారు. జాషువా గారు రాసిన కావ్యాలన్నీ ఒక ఎత్తు, గబ్బిలం కావ్యమొక్కటే ఒక ఎత్తు. అయన దళిత సమస్యపై రాసిన గబ్బిలం కావ్యం దళితులలో కుల నిర్మూలనా ధృక్పథాన్ని పెంపొందించింది. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఏ కవి రాసిన పద్యాలు సాధించ లేని ప్రజాకర్షణను జాషువా పద్యాలు సాధించాయి. జాషువా సమాజంలోని అసమానతలను, దురాచారాలను విమర్శించారు. జాషువా రచనలలో గబ్బిలం చాలా ప్రసిద్ధి చెందింది. 'గబ్బిలం' ఈ పేరే అనేకమైన అగ్రవర్ణ రచయితలకు వెన్నులో వణుకు పుట్టేలా చేసిన రచన. 'గబ్బిలం' కావ్యం యొక్క శీర్షికను ఎన్నుకోవడంలోనే ఒక ధిక్కారం కనిపిస్తుంది. అనేక మంది భావకవులు తన సందేశాలను హంసలద్వారా పంపితే జాషువా మాత్రం ఈ కావ్యంలో ఒక దళితుడి కన్నీటి సందేశాన్ని పక్షులలో అట్టడుగు పక్షి అయిన గబ్బిలం ద్వారా పంపడంలో జాషువా ఈ సమాజంపై తన నిరసనను తెలియజేశాడు.

గబ్బిలంలో ఒక దళితుడు తన పరిస్థితులను గురించి శివునికి చెప్పాలనుకుంటాడు. కానీ దళితులకు దేవాలయ ప్రవేశం లేదు కనుకనే తనకు దూతగా గబ్బిలమును జాషువా గారు ఎన్నుకున్నారు. ఆ గబ్బిలానికి తన బాధ లన్నీ తెలిపి, శివుడి దగ్గరకు వెళ్ళే మార్గాన్ని గురించి వర్ణించుటయే ఈ కావ్యంలోని ఇతివృత్తం. దళితుని సందేశమంతా సామాజిక పరిస్థితులతో నిండి ఉంటుంది.

శ్రమ దోపిడీ :

గబ్బిలం కావ్యంలో తొలి పద్యంలోనే జాషువా కథా నాయకుడిని ఒక పంచముడిగా పరిచయం చేశాడు. ఈ

పంచముడికి, అతని సేవలకు మనదేశం అప్పు పడిందని ప్రకటించాడు.

"ముప్పు ఘటించి వీనికులమున్ గలిమిన్ గబళించి దేహమున్
బిప్పి యెనర్చు నీ భరతవీరుని పాదము కంద కుండగా
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే
దెప్పుడు నప్పువడ్డది సుమీ భరతావని వీని సేవకున్"

కష్టపడి పనిచేసేది పంచముడు, కానీ సుఖాలు అనుభవించేది భూస్వామి అని చెబుతూ

" నేను చిందులాడి నేను డప్పులు గొట్టి
యలసి సొలసి సత్తి కొలుపు గొలువ
ఫలితమెల్ల నొరులు భాగించుకొనిపోవు
నీచమైన భూమి జూచినావె "

అంటరాని తనాన్ని నిరసించుట :

వర్ణవ్యవస్థను జాషువా " గబ్బిలం " ఖండకావ్యంలో తీవ్రంగా నిరసించాడు. వర్ణవ్యవస్థను నాల్గు పడగల హైందవ నాగరాజుగా వర్ణించాడు.

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

తన సమస్యలు భగవంతునికి చెప్పుకోవడానికి వెళితే దళితులకు దేవాలయ ప్రవేశం నిషిద్ధం. అందుకే తన గుడిసెలోనికి వచ్చిన గబ్బిలానికి తన బాధలను చెప్పుకొని నీవు దేవునికి తన బాధలను చెప్పమంటాడు.అదీ పూజారి లేని సమయంలో మాత్రమే చెప్పమంటాడు.

"ఆలయంబున నీవు వ్రేలాడు వేళ
శివుని చెవి నీకు గొంత చేరువుగా నుండు
మౌని ఖగరాజ్ఞి, పూజారి లేని వేళ
విన్నవింపుము నాదు జీవితచరిత్ర"

ఆర్థిక వ్యవస్థకు కారణం :

మన దేశంలో నిర్జీవమైన, ప్రాణం లేని దేవుళ్ళ ప్రతిమలకు రోజూ పెళ్ళిళ్ళు, నైవేద్యాలు, ఉత్సవాలు, తిరునాళ్ళు మొదలైనవి జరుపుతూ ఎంతో సంపదను వృధా చేస్తున్నారే, కానీ పేదవాడికి కడుపు నిండా తిండి పెట్టలేకపోతున్నారు అని నిరసిస్తూ ....

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు
వ్యయించుగాని దు:
ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని ముప్పదిమూడు
కోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులాఱునే"

స్వాతంత్ర్య కాంక్ష :

ఈ కావ్యం 1941లో వ్రాయబడింది. జాషువా స్వాతంత్రం రాకముందే దళితులకు, అణగారిన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం లభించినట్లు అని భావించాడు.

"ఏ జాతి కెంతవచ్చునొ
రాజత్వంబు నాకు రావచ్చు గదా
నా జాతి యెత్తు కేతన
రాజంబున నీదుమూర్తి వ్రాయింతు జెలీ"

గబ్బిలానికి ఉన్న స్వేచ్ఛ తనకు లేదని, నాలాగా నీవు బానినవు కాదని గబ్బిలము లాగా తనకు కూడా స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కావాలని భావిస్తాడు.

"పక్షి సుందరి నీ చిన్న కుక్షి నిండ
నిన్ని నీరంబు బలహారమున్న జాలు
నెన్ని దేశాలు తిరిగిననేమి నీకు
నీవు నావలె బుట్టు బానిసవు కావు"

జాషువా ఆత్మీయ సోదరుడు -అంబేద్కర్ :

"కలడంబేద్కరు నా సహోదరుడు మాకై యష్ట కష్టాలకుం
బలియై సీమకువోయి క్రమ్మరిన విద్వాంసుండు వైస్రాయి మే
ల్కొలువందంగల దొడ్డవాడతడు నీకున్ స్వాగతం బిచ్చి పూ
వుల పూజల్ వొనరించెనే యతనిమెప్పుల్ నీజయారంభముల్"

ఉన్నత కులాల వాళ్ళు స్వాతంత్ర్య పోరాటం అనే పేరుతో దళితులను ఎలా మోసం చేశారో అంబేద్కర్

పసిగట్టారు. అందుకే అంబేద్కర్ దళితులకు అన్నిటికంటే ముందుగా సామాజిక పరమైన సమానత్వం కావాలని పోరాడాడు. అందుకే జాషువా అంబేద్కర్‌ను తన సోదరునిగా చెప్పుకోగలిగాడు. దళితులకు దారిచూపే ఒక టార్చ్‌బేరర్‌గా జాషువా అంబేద్కర్‌గా చూపాడు.

పీడితుల పక్షపాతి జాషువా :

ఎక్కడ దళిత ప్రస్తావన వచ్చినా, అన్యాయంగా దళితుని శ్రమదోపిడీ జరిగినా జాషువా దానిని తన కవిత్వంలో చెప్పడం జరుగుతుంది.

"వాని రెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తిలేదు"

అని చెప్పడంలో జాషువా పీడితుల పక్షాన నిలిచే గొంతుకగా చెప్పవచ్చు.

ముగింపు :

భవిష్యత్తులో దళిత సాహిత్యం వస్తుందని దానికి తనను నాయకుడిని చేస్తారని తన "గబ్బిలం" వారికి దారి చూపే దీపం కాగలదు అని జాషువా అనుకొని ఉండడు.

ఈ కావ్యంలో కవి దగాపడిన దళితుల జీవితాన్నే తన రచనకు వస్తువుగా ఎన్నుకున్నాడు.

'విశ్వనరుని'గా తనను తాను ప్రకటించుకొని జాషువా తెలుగు సాహిత్య చరిత్రలో ముఖ్యంగా దళిత సాహిత్య చరిత్రలో " విషయ సూచిక"గా చెప్పదగిన వ్యక్తిగా జాషువాను మనం చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. గుర్రం జాషువా - గబ్బిలం
2. జాషువా ఆత్మకథ - నా కథ
3. డా॥ కోయి కోటేశ్వరరావు -విశ్వనరుడు జాషువా (జీవితం - సాహిత్యం)
4. డా॥ ద్వా.నా. శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – వివిధ ప్రక్రియలు

– కాళేశ్వరం కృష్ణమూర్తి, ఇ.నెం. 35-6-395, వివేక్‌నగర్‌కాలని, తులసిబార్ ప్రక్కన, కెయు 100 ఫీట్ రోడ్, గోపాలపూర్, హన్మకొండ జిల్లా.

శతాబ్దాల తరబడి జరిగిన పోరాటంలో వ్యక్తమైన ఆత్మ గౌరవ నినాదం "దళిత". మతాన్ని ఆధారం చేసుకొని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో జరిగే వివక్షను ప్రశ్నించే శబ్దం "దళిత". సమాజంలో నిమ్నస్థాయిలో బతుకీడుస్తూ, ఆ కష్టాల నుండి బయటపడటానికి శాస్త్ర విజ్ఞానాన్ని విశ్వసిస్తూ, హేతువాద భావనా బలంతో పోరాడుతూ, అస్తిత్వం కోసం నిత్యం ప్రయత్నించే వారికి ప్రాతినిధ్యం వహించే శబ్దం "దళిత'.

అస్పృశ్యులు, అంటరానివాళ్ళు, పంచములు, హరిజనులు వంటి వివిధ పేర్లతో పిలిచారు. అయితే పంచములు, హరిజనులు శబ్దాలతో కొన్ని వందల సంవత్సరాలుగా వీరిని పిలిచేవారు. భారత స్వాతంత్రోద్యమ కాలంలో నర్సీమెహతా అనే ఓ రచయిత పెట్టిన "హరిజన" శబ్దాన్ని మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ విస్తృతంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. మతపరంగా దేవుని బిడ్డలనే అర్థంలో ఆ శబ్దాన్ని ప్రచారం చేశారనీ, అది తమ ఆత్మగౌరవ భంగకరమని దళితులు నిరసించారు. అప్పటినుండే "దళిత" శబ్దం ఆత్మ గౌరవానికి సమైక్య శక్తికీ ప్రతీకగా ప్రయోగంలో ఉంది. ఆ శబ్దంతో పిలిపించుకోవడానికి ఇష్టపడుతూ, ఆ పేరుతోనే తమ భావాలను వివిధ సాహిత్య ప్రక్రియలుగా అందిస్తున్నారు.

దళిత సాహిత్యం మరాఠీ భాషలో ముందుగా స్థిరపడి, తరువాత భారతీయ భాషలన్నింటిలోనూ విస్తరించింది. ప్రాచీన, సాంప్రదాయిక స్వభావం కలిగిన సామాజిక నిర్మాణాన్ని (కులవ్యవస్థని) తిరస్కరించటం.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ఆశించే మానవతా దృక్పథాన్ని ఆశించటం. అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, సామాజిక, ఆర్థిక న్యాయం కోసం పోరాడటం.దళితుల భాషను, ఆచార వ్యవహారాలను గౌరవించి, ఆత్మ గౌరవాన్ని పెంపొందించటం.హిందూ లేదా మూఢత్వాన్ని ప్రబోధించే మత భావనలను తిరస్కరించి, ప్రత్యామ్నాయ సంస్కృతిని రూపొందించటం. అస్పృశ్యత కారణంగా దూరంగా విసిరేయబడిన వారిని ప్రధాన జీవన స్రవంతిలో కలపటం, కులాన్ని నిర్మూలించటం ప్రధాన లక్ష్యాలుగా గ్రహించటం.దళిత సాహిత్యాన్ని రాయటం వినోదం కోసం కాదనీ, సామాజిక చైతన్యం, సామాజిక పరివర్తనకు బాధ్యతాయుతమైనపనిగా గుర్తించటం దళితులు రాజ్యాధికారాన్ని చేపట్టే దిశగా సాహిత్యం ప్రేరణ నివ్వటం.అభ్యుదయ, విప్లవ సాహిత్యం అవి వర్ణానికిచ్చిన ప్రాధాన్యం, కులానికివ్వలేదు. కనుక, కులనిర్మూలన ప్రధాన లక్ష్యంగా దళిత సాహిత్యం కొనసాగుతుంది. దళిత సాహిత్యం ఆవిర్భవించటానికి శతాబ్దాల సామాజిక పీడనను ఎదుర్కొన్న చారిత్రక నేపథ్యం ఉంది. ఆ నేపథ్యం నుండే "దళిత సాహిత్యం' స్పష్టమైన అంబేడ్కర్ తాత్విక భావజాల భూమికతో ఆవిర్భవించింది.

చారిత్రక నేపథ్యం :

వేదాల్లో (ఋగ్వేదం-10వ మండలం పురుష సూక్తం) చాతుర్వర్ణ వ్యవస్థ గురించి ప్రస్తావన కనిపిస్తుంది. దాని ప్రకారం భారతదేశంలో కుల వ్యవస్థ సాంఘిక అసమానతలకు కారణమయ్యింది. కులం వల్ల కలిగిన అసమానతలపై బౌద్ధం, జైనం, చార్వాకం మొదలైనవి నిరసనను తెలిపాయి. అవి కుల నిర్మూలనకంటే అహింస, జ్ఞానబోధ, బౌద్ధిక దృక్పథాలపై ప్రధాన దృష్టిని కేంద్రీకరించాయి. నాటి 'జాతీయోద్యమ సాహిత్యం' లో భాగంగా కుల నిర్మూలన కూడా ఒక అంశమయ్యింది. జ్యోతిబా

పూలే, నారాయణగురు, సాహు మహారాజ్, పెరియార్ ఇ.వి. రామస్వామి నాయర్, డా.బి.ఆర్. అంబేడ్కర్ మొదలైన వారి ఆలోచనలు దళిత సాహిత్యానికి చారిత్రక, తాత్విక భూమికను ఏర్పరిచాయి. జ్యోతి బాపూలే నిమ్నజాతుల ఉద్ధరణ కోసం "సత్య శోధక సమాజం" (1873) స్థాపించారు. పూలే హిందూమతంలోని లోపాలను వివరిస్తూ అనేక పుస్తకాలను రాశారు. 1910లో కలకత్తా కాంగ్రెస్ సమావేశం అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది. 1918లో అఖిలభారత దళితజాతుల సమావేశాలు బొంబాయిలో జరిగాయి. 1924లో డా.బి.ఆర్. అంబేడ్కర్ అస్పృశ్యత నివారణోద్యమాన్ని ప్రారంభించారు.

1968లో కంచకచర్లలో కోటేశుని సజీవ దహనం చేయడం, 1985 జూలై 17న కారంచేడు ప్రాంతంలో దళితులపై మారణకాండ సాగించడం వంటి సంఘటనలు జరిగాయి. 1990 ఆగస్టు 6న చుండూరులో దళితులను ఊచకోత కోశారు. దీనితో అంతవరకు సంస్కరణోద్యమ, అభ్యుదయ, విప్లవ సాహిత్యం రాస్తున్న తెలుగు రచయితలు, కవులు దళిత సాహిత్యం పై దృష్టిని కేంద్రీకరించారు.భారతదేశ వ్యాప్తంగా జరిగిన పాలన, ఆర్థిక పర అంశాల కారణంగా వచ్చిన సామాజిక ఉద్యమాలు వచ్చాయి. దాని ప్రభావంతో వెలువడుతున్న సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక ప్రత్యేక విభాగమయ్యింది. 1960 నుండి దళిత సాహిత్యం ప్రాచుర్యాన్ని పొందింది.1909లో ఒక అజ్ఞాత కవి రాసిన "మాల వాండ్రు" పాటను తొలి దళిత గేయంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఇది ఆంధ్రభారతి (బాధ్రపద) మాసపత్రికలో అచ్చయ్యింది. ఆ తరువాత గురజాడ అప్పారావు 1911లో కుల సమస్యను స్పృశిస్తూ ముత్యాల సరాల్లో రాశారు. 1915లో మంగిపూడి వేంకటశర్మ "నిరుద్ధ భారతం అనే పద్య కావ్యాన్ని రాశారు. అస్పృశ్యతను నిరసిస్తూ దళితేతరులు రాసిన తొలి పద్యకావ్యంగా దీన్ని విమర్శకులు భావిస్తున్నారు. కొండపల్లి జగన్నాథరావు 1921లో రాసిన "మేలుకొలుపు" గీతం పురాణాల్లో దళితుల గొప్పతనాన్ని కీర్తించే విధంగా ఉంది. 1930లో జాలా రంగస్వామి రాసిన అంటరానివాడెవ్వడు పాట, 1933లో కుసుమ ధర్మన్న రాసిన హరిజన శతకం దళితుల మనోభావాలను బాగా పట్టుకోగలిగాయి. 1933లోనే కుసుమ ధర్మన్న రాసిన "మాకొద్దీ నల్ల దొరతనము" గేయం ఒక ఊపు ఊపింది.

గుర్రం జాషువా రాసిన గబ్బిలం(1941) కావ్యంలో దళితుల వేదనా భరిత జీవితాలను, అప్పుడే మొలకలెత్తుతున్న తిరుగుబాటు స్వభావాన్ని శక్తివంతంగా అభివ్యక్తీకరించారు. ఈయనే రాసిన నా కథ దళిత ఆత్మ కథకు ప్రేరణనిచ్చే రచన. బోయి భీమన్న పురాణేతిహాసాల సమగ్ర అవగాహనతో గాంధీ, అంబేడ్కర్ తాత్విక భావాల సమ్మేళనంతో గొప్ప రచనలు చేశారు. గుడిసెలు కాలి పోతున్నై, రాగవాశిష్టం పాలేరు వంటివి బోయి భీమన్న రచనలలో ప్రముఖమైనవి. ఈ రచనలు దళితులకు గొప్ప ప్రేరణనిచ్చాయి. ఇలా అస్పృశ్యతను నిరసిస్తూ దళిత, దళితేతరులు అనేక రచనలు చేశారు.1985 తరువాత వచ్చిన రచనల్లో జీవితానుభవాలతో కూడిన దళిత చైతన్యం ప్రతిఫలిస్తుంది. వివిధ పుస్తకాలకు రాసిన ముందుమాటలు, పత్రికా వ్యాసాలు, పుస్తకాల రూపంలో దళిత సాహిత్య విమర్శ వచ్చింది. విశ్వవిద్యాలయాల్లో దళిత సాహిత్యంపై పరిశోధనలు జరుగుతున్నాయి. అలా దళిత సాహిత్యం ప్రక్రియా వైవిధ్యాన్ని సాధించింది.

దళిత గేయ సాహిత్యం :

అస్పృశ్యతను నిరసిస్తూ 1909లో అజ్ఞాత కవి "మాలవాండ్రు పాట' లో "అందారు పుట్టిరీ హిందమ్మ తల్లికి - ఎట్టాగు ఎక్కువ బ్యాపన్లు మాకంటె అని నిల దీశారు.. మంచియన్నది మాలయైతే మాలనే అగుదున్ అని గురజాడ అన్నారు. జయధీర్ తిరుమలరావు ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన దళిత గీతాలు (1993)లో చాలా వరకు అస్పృశ్యత నివారణకు ప్రయత్నించిన గేయాలున్నాయి. జాలా రంగస్వామి (1930) రాసిన

అంటరానివారెవరు? గేయం బొబ్బిలి యుద్ధం బుర్రకథ వరుసలో వీర రసాత్మకంగా సాగింది. నక్కా చిన వెంకయ్య "హరిజన కీర్తనలు" బాగా ప్రసిద్ధి పొందాయి. అస్పృశ్యతా నివారణకై శక్తివంతమైన పాటలు రాసిన వారిలో కుసుమ ధర్మన్న ప్రతిభావంతుడైన కవి. బోయి భీమన్న డా.బి.ఆర్. అంబేడ్కర్‌పై రాసిన "జయ జయ అంబేడ్కర" (1992), మాష్టార్జీ "అందుకో దండాలు బాబా అంబేడ్కరా' గేయాలు ప్రార్థనా గీతాలయ్యాయి. శివసాగర్, వంగపండు ప్రసాదరావు, ఉ. సాంబశివరావు, ఇంకా అనేక మంది రాసిన గేయాలలో చాలా వరకు సంస్కరణ, మార్క్సిస్టు భావాలు అధికంగా ఉన్నా దళిత జీవితమే స్పష్టమవుతుంది.

దళిత పద్య కవిత్వం :

కుసుమ ధర్మన్న (హరిజన శతకం - 1933)
కర్ణ వీర నాగేశ్వరరావు (అస్పృశ్యుల విజ్ఞప్తి -1936)
బిర్రీడి మోషే (హరిజనాభ్యుదయం, పృథ్వీ భాగవతం - 1966)
జోసెఫ్ కవి (కన్నీటి కబురు)
గుర్రం జాషువా (గబ్బిలం - 1941)
కె.సి. జాన్ (బహిష్కారం -1948, ధర్మచక్రం)
ఎడ్లపల్లి సామ్యూల్ (చిక్కుడు -1963)
మల్లవరపు జాన్ (విశ్వ ప్రకాశం - 1974, అతుకుల బ్రతుకులు)
సవ్వప్పగారి ఈరన్న (కడలి కెరటం - 1987)
నంబూరు దూర్వాస మహర్షి (లోకాలోకనం - 1971)
నూతక్కి అబ్రహాం (మత్కణం)
రావూరి ఏకాంబరం (అంబేడ్కరో సమరసింహ -1994)
కొలకలూరి స్వరూపరాణి (ప్రబోధము)
ఎన్. టి. జ్ఞానానంద కవి (పాంచజన్యం, ధర్మాగ్రహం)
ఆశావాది ప్రకాశరావు (అంతరంగ తరంగాలు-1990)

తదితరులు ఎంతో మంది కవులు కుల నిర్మూలనను ఆకాంక్షిస్తూ తమదైన దృక్పథంతో పద్య కవిత్వాన్ని రాశారు. ఛందోబద్ధ పద్య కవిత్వం దళితుల దగ్గరకు చేరే సాహిత్య రూపం కాదని ఎనభయ్యో దశకం వచ్చే నాటికి చాలా మంది వాదించినా కావ్యాలు వెలువడుతూనే ఉన్నాయి. గుర్రం జాషువా పద్యాలు నేటికీ దళితులకు ప్రేరణ నిస్తూనే ఉన్నాయి.

దళిత సాహిత్యంతో పరిచయం ఉన్న ప్రతీ వారికి గుర్రం జాషువా రాసిన ఒక పద్యం అయినా నోటికి రాకుండా ఉండదు. ఆ పద్యాల్లో ఉండే వస్తువు, లాలిత్యం, మాధుర్యంతో రసభరితంగా ఉండటమే దానికి ప్రధాన కారణం. గబ్బిలం కావ్యంలో పరమేశ్వరునికి సందేశం పంపిస్తూ దళితుని గురించి

ముప్పు ఘటించి వీని కులమున్, గలిమిన్ గబలించి దేహమున్
బిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదముకందకుండగా
జెప్పులు కుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే
దెప్పుడు నప్పువడ్డది సుమీ భారతావని వీని సేవకున్

- అని వర్ణించారు జాషువా.

దళిత వచన కవిత్వం :

కులం వల్ల కలుగుతున్న సమస్యలను వర్ణిస్తూ వచన కవిత్వం అధిక స్థాయిలోనే వచ్చింది. నేటికీ పత్రికల్లో, పుస్తకాలలో ప్రచురితమవుతూనే ఉంది. గేయం కుల సమస్యను ఆధారం చేసుకొన్నాఆర్థికాంశాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినట్టుగా కనిపిస్తుంది. గేయాలు పాడిన/రాసిన వారే వచన కవిత్వాన్ని కూడా రాశారు. కానీ, వారి వచన కవిత్వం ప్రధానంగా కుల సమస్యపైనే దృష్టిని కేంద్రీకరించబడింది. మూలవాసీ సిద్ధాంతాన్ని మాష్టార్జీ ప్రతిపాదించారు చిక్కనవుతున్న పాట (1995) తెలుగు సాహిత్యంలో ఒక కదలికను తెచ్చింది. ఆ తరువాత, దళిత కవిత్వం పూలే, అంబేడ్కర్ తాత్విక భావజాలంతో, చైతన్యవంతంగా అనేక కవితా సంకలనాలు, సంపుటాల రూపంలో వెలువడింది. 1995లోనే ఈ కవితా సంకలనాలు ఎక్కువగా రావడం దళిత కవిత్వంలో ఒక

చారిత్రక పరిణామం. ఈ సంవత్సరంలోనే కేశవ కుమార్, కె. సత్యనారాయణల సంపాదకత్వంలో ''దళిత మేనిఫెస్టో'', పట్టేటి రాజశేఖర్, నాగప్ప గారి సుందర్రాజు సంపాదకత్వంలో ''గుండె డప్పు'', సుంకిరెడ్డి నారాయణ రెడ్డి సంపాదకత్వంలో 'బహుమవచనం' కవితా సంకలనాలు వచ్చాయి. ఇదే సంవత్సరంలో వచ్చిన మద్దూరి నగేష్ బాబు 'వెలివాడ', కత్తి పద్మారావు 'జైలుగంటలు', జూలూరి గౌరీశంకర్ ''పొలికట్టె'', సుంకర రమేష్ బాబు తల్లి కోడి హెచ్చరిక' సతీష్ చందర్ 'పంచమ వేదం'వంటివి పేర్కొన దగినవి. వీటితో పాటూ కత్తి పద్మారావు ''నల్లకలువ'' (1996) ''భూమి భాష'', ''కట్టెల మోపు'', ఎండ్లూరి సుధాకర్ ''వర్తమానం'', ''కొత్త గబ్బిలం'', ''నల్ల ద్రాక్ష పందిరి'', ''వర్గీకరణీయం'', ''అటాజనికాంచె'' (2005), పైడి తెరేష్ బాబు ''''అల్ప పీడనం'''' (1996), చిన్ని ''ఒళ్ళు కడుక్కుందాం రండి'' జి.వి. రత్నాకర్ ''మట్టి పలక'', ''అట్లేటి అల'', గ్యార యాదయ్య ''ఎక్కోషి'', దార్ల వెంకటేశ్వరరావు ''దళిత తాత్వికుడు'' (2004), ప్రసాద్ మూర్తి ''కలనేత'', ''మాట్లాడుకోవాలి'', చల్లపల్లి స్వరూపరాణి ''మంకెన పూవు'', ''నాగప్పగారి సుందర్రాజు ''చండాల చాటింపు'', బన్న ఐలయ్య ''నిప్పు కణిక'' మొదలైనవి దళిత వచన కవిత్వంలో వస్తు, శిల్పాలలో వైవిధ్యాన్ని ప్రదర్శించాయి. వి. సిమ్మన్న, కొండపల్లి సుదర్శనరాజు వెలువరించిన ''దళిత కవిత'' (1991)ను అనేకదళిత కవితలను ఒక చోటకు చేర్చిన మొదటి కవితా సంకలనంగా కొందరు పేర్కొంటున్నారు.

దళిత నవలా సాహిత్యం :

అస్పృశ్యతను వివిధ కోణాల్లో చిత్రిస్తూ నవలలు రాసిన వాళ్ళున్నారు. ''హేలావతి'' (1913)

వెంకటపార్వతీశ్వరకవులు మాతృమందిరం (1919)

ఉన్నవ లక్ష్మీనారాయణ గారి ''మాలపలి'' (1922)

వట్టికోట ఆళ్వారుస్వామిగారి ''ప్రజల మనిషి'' (1955)

ముప్పాళ్ళ రంగనాయకమ్మ గారి ''బలిపీఠం'' (1962)

డా. కేశవరెడ్డి రాసిన ''బానిసలు'' (2971), 'శ్మశానం దున్నేరు' (1979),'' ''ఇన్‌క్రెడిబుల గాడెస్'' (1979), ''అతడు అడవిని జయించాడు'' పేర్కొనదగినవి. ''మాల పల్లి'' నవల మార్క్సిస్టు భావజాలంతో జాతీయోద్యమ ప్రభావంతో వచ్చినా, దళితుల జీవితాన్ని స్పర్శించిన నవలగా ప్రసిద్ధి పొందింది. దళితులలోని దాసరుల కుటుంబం చుట్టూనే ''మాలపల్లి'' నవలలోని సంఘటన లన్నీ చిత్రితమయ్యాయి. తక్కెళ్ళ జగ్గడు ఉరఫ్ వెంకటదాసు కులం వల్ల వివక్షకు గురవుతుటాడు. అయినా, ఆర్థిక స్థితిగతులలో మార్పుల రాకపోతే దళితుల అస్తవ్యస్తమవుతుందనేటట్లు పాత్రను తీర్చిదిద్దారు రచయిత. 1980 తర్వాత దళిత సాహిత్యంలో నవలా ప్రక్రియ వేగవంతంగానే వచ్చింది. అక్కినేని కుటుంబరావు ''''సొరాజ్జెం'''' (1981) స్వాతంత్ర్యానంతర గ్రామీణ దళితుల జీవితాలను నవలలో చిత్రించారు. ''ఖాకీ బతుకులు'''' (1980-82) నవలలో పోలీసుశాఖలో దళితుల ఆత్మగౌరవ పోరాటాన్ని స్పార్టకస్ (జి. మోహన రావు) వివరించారు. చిలుకూరి దేవపుత్ర రాసిన ''అద్దంలో చందమామ' ''(1988), ''పంచమం'' (1998) నవలలో సుమారు 1975 నుండి 99 వరకు రాష్ట్రంలో జరిగిన దళిత ఉద్యమాల చారిత్రక నేపథ్యాన్ని చిత్రించే ప్రయత్నం చేశారు. ''అకాశంలో సగం'' (1990) నవలలో ఓల్గా అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థ కింద నలిగిపోతున్న దళితుల జీవితాలను, ముఖ్యంగా స్త్రీ దృక్పథాన్ని వర్ణించారు. సదానంద శారద 1992లో రాసిన ''మంచినీళ్ళ బావి'' తెలంగాణ ప్రాంతం దళిత జీవితాలను వర్ణించింది. 1996లో బండి నారాయణస్వామి ''గద్దలాడ తాండాయి'' నవలలో రాయలసీమ దళితుల జీవితాన్ని చిత్రించారు. ''నీ బాంచెన్ కాల్మొక్త'' (1997) నవలలో కాలువ మల్లయ్యగారు సుమారు యాభై ఏళ్ళలో తెలంగాణలో వచ్చిన సామాజిక పరిణామాలను ప్రాంతీయ మాండలికంలో వివరించే ప్రయత్నం చేశారని విమర్శకులు వ్యాఖ్యానించారు. నన్నపురెడ్డి

వెంకటరామిరెడ్డి "కాడి" (1998నవలలో మాల, మాదిగల మధ్య కలిగే అంతరాలను ఆసరా చేసుకొని అగ్రవర్ణాల వారు దళితులపై చేసే పెత్తనాన్ని వర్ణించారు. ఇంచు మించు ఇదే ఇతివృత్తంతో పి.నాసరయ్య "మాదిగపల్లె" (1998) నవల రాశారు. జి.కళ్యాణరావు గారు "అంటరాని వసంతం" (2000)లో సుమారు వంద సంవత్సరాల దళితుల పోరాటాల పరిణామాలను ఆకర్షణీయమైన శైలిలో రాశారు. వేములఎల్లయ్య "కక్క" (2000) "సిద్ధి" (2006) నవలలో తెలంగాణ ప్రాంత దళితుల సాంస్కృతిక జీవనాన్ని ప్రాంతీయ మాండలికంలో రాశారు. బోయ జంగయ్య జాతర (1997) కూడా తెలంగాణ దళితుల జీవితాన్ని వర్ణించిందే. భూతం ముత్యాలు "నూర" పురుడు, ఇగురం వంటి నవలల్లో దళితుల ఆత్మ గౌరవం, చదువు యొక్క ప్రాధాన్యతను తెలిపారు.

దళిత కథాసాహిత్యం :

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 1925లో రాసిన "పుల్లం రాజు కథ"లో తొలిసారిగా దళితుల ప్రస్తావన కని పిస్తుంది. దళిత జీవితాన్ని, సంవేదనలను, పోరాట చైతన్యాన్ని వర్ణించిన తొలి దళిత కథగా కొలకలూరి ఇనాక్ రాసిన' "ఊరబావి" (1968-69) కథను పరిశోధకులు గుర్తిస్తున్నారు. ఈ కథలో వ్యవస్థ కోసం వ్యక్తి చేసిన త్యాగం, దళితుల్లోని వివిధ తరాల్లో వచ్చిన చైతన్యాన్ని వర్ణించారు. ఈ కథలో మాల మాదిగలందరికీ నీటి సమస్యను తీర్చడానికి ఒక దళిత స్త్రీ చూపిన సాహసంలో ధైర్యం ఉంది. అగ్రవర్ణ కుట్రను ఎదుర్కొనే ఆలోచన ఉంది. డా.భార్గవి రావు సంకలనం చేసిన "ఇంకానా ఇకపై సాగవు", కె.లక్ష్మీనారాయణ, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి సంపాదకత్వం, సంకలనంలో వచ్చిన "దళిత కథలు", గోగు శ్యామల, జూపాక సుభద్ర సంపాదకత్వంలో వచ్చిన "రేగడి సాల్లు" (2006), రచయితలే విడివిడిగా ప్రచురించుకున్న కథా సంపుటాలలో సుమారు వెయ్యికి పైగా దళిత కథలు కనిపిస్తున్నాయి. కొలకలూరి ఇనాక్, బోయ జంగయ్య, కాలువ మల్లయ్య, శాంతి నారాయణ, ఎండ్లూరి సుధాకర్, నాగప్పగారి సుందర్రాజు, గోగు శ్యామల, జూపాక సుభద్ర, చల్లపల్లి స్వరూపరాణి, జాజుల గౌరి మొదలైన వాళ్ళు రాసిన దళిత కథల్లో నిజమైన దళిత జీవితం కనిపిస్తుంది. దళితేతరులు రాసిన కథల్లో కరుణకుమార, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గోపీచంద్ వంటి వారు కూడా దళిత జీవితాల్లోని అనేక కోణాలను చిత్రించ గలిగారు.దళితుల్లోని అంత:సంఘర్షణను, ముఖ్యంగా మాల మాదిగల మధ్య సాంస్కృతిక, ఆర్థిక సామాజిక వ్యత్యాసాలను స్వామి, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు, ఎండ్లూరి సుధాకర్, ఒమ్మి రమేష్ బాబు, గోగు శ్యామల, జూపాక సుభద్ర మొదలైన వాళ్ళు వర్ణిస్తూ కథలు రాశారు. ననుమాస్వామి, బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య, కాసుల ప్రతాపరెడ్డి మొదలైన వారు కథల్లో మార్క్సిస్టు, తెలంగాణ సమస్యలను దళిత జీవిత కోణాల నుండి వర్ణించారు. ఇక ఆధునికంగా దళితకథను బలంగా చిత్రిస్తున్నవాళ్లలో డా.ఎం.ఎం.వినోదిని, డా.పసు నూరి రవీందర్ ఉన్నారు.

దళిత నాటక సాహిత్యం :

పందొమ్మిది వందల ముప్పై ప్రాంతం నుండి దళితులను ప్రస్తావిస్తూ కొన్ని నాటికలు, నాటకాలు వచ్చాయి. వాటిని దళితులపై సానుభూతిని చూపుతూ వచ్చిన నాటకాలుగానే చెప్పుకోవచ్చు. ధర్మవరం గోపాలా చార్యుల "అస్పృశ్యవిజయం"లో అస్పృశ్యత మహా పాపమని వివరించే నాటకం. మునిమాణిక్యం నరసింహా రావు తిరుగుబాటు (1938), దర్భ భాస్కరమ్మ "దేవాలయ ప్రవేశం" ఓరుగంటి కృష్ణ కౌండిన్య "కృష్ణ చరితం" (1933), బండారు మృత్యుంజయ "సమాజం మారాలి", ఆచార్య ఎన్.జి.రంగా "హరిజననాయకుడు" (1933), ఉన్నవ లక్ష్మీనారాయణ "హరిజన నాటకం" (1933) వంటి నాటకాలలో ఆయా రచయితలకు దళితుల పట్ల ఉన్న సానుభూతి కనిపిస్తుంది. దళిత జీవితాన్ని పౌరాణిక, చారిత్రక, సాంఘిక ఇతివృత్తాలతో రాసిన నాటకాలు కూడా కొన్ని కనిపిస్తున్నాయి. దళితులపై సానుభూతి చూపం

డంటూనే వారి ప్రతిభను వివరించే ప్రయత్నం చేసిన నాటకాలున్నాయి. పుట్టుక, ''కలిసిమెలిసి తిరగటం'', ''ప్రేమ వివాహాలు'', ''దేవాలయ ప్రవేశం'', తిరుగుబాటు భావాలతో కొన్ని నాటకాలు వచ్చాయి.1959లో బోయి భీమన్న రాసిన ''రాగవాశిష్టం'' నాటకాన్ని తొలి దళిత నాటకంగా భావించే అవకాశం ఉంది. దళితుల పుట్టుక కూడా ఉన్నతమైనదేనని, దళితులు హిందువులలో భాగమని వాదించే నాటకం ''రాగవాశిష్టం''. ఈ రచయితే రాసిన ''ఆదికవి వాల్మీకి'' (1970), ''పాలేరు'' నాటకం దళితులను ఆలోచింపజేసినవి. కొలకలూరి ఇనాక్ రాసిన ''మునివాహనుడు'' నాటకం దళితులు దేవాలయ ప్రవేశాన్ని, వారి భక్తిని శక్తివంతంగా వర్ణించింది. ఇంకా సాంఘిక నాటకాలు కూడా చాలా వచ్చాయి.

1980లోకి వచ్చేటప్పటికి, నిర్దిష్టమ్మెన సిద్ధాంతాల్ని ఏర్పరచుకోవడం, డా. బి.ఆర్. అంబేద్కర్‌ని స్ఫూర్తిదాతగా తీసుకోవడం, సమష్టి ఉద్యమాల కోసం పురోగమించడం మొదలయింది. మేకల్నే బలిస్తారు గాని సింహాల్ని కాదనే అంబేద్కర్ మాటలు దళితుల్ని పోరాటం వ్కెపు మరల్చడం ప్రారంభమ్కెంది.ఐనా కులవ్యవస్థను నిర్మూలన గావించాలంటే ఇంకా పరిశోధన, సాహిత్యం విస్తృతంగా రావాల్సిన అవసరం ఉంది.

ఆధార గ్రంథాలు :

1. దళిత కవిత్వం - డా.శిఖామణి
2. భావజాల యుద్ధం - బి.ఎస్.రాములు.
3.దళిత సాహిత్యం మాదిగ దృక్పథం - దార్ల వెంకటేశ్వరరావు
4. తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యారంభం - సమాలోచన

- డా॥. ఎన్. నిశ్చల, తెలుగు సహాయ ఆచార్యులు, ఎన్.టి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్.

దళిత :

'దళిత' అనే పదానికి మొదట్లో 'ఖండించబడిన', 'ఛేదించబడిన', 'చీల్చబడిన' అని అర్థాలుండేవి. తర్వాత 'హరిజన' అనే పదం స్థానంలో ఈ 'దళిత' అనే పదం చేరింది. ప్రస్తుతం అది కొన్ని కులాలను సూచించే పదంగా వాడుకలో ఉంది. ఇంకా ఆ కులాల సాముహిక చైతన్యంగా, ఒక సంఘటిత శక్తికి ప్రతీకగా నిలుస్తుంది. ఆత్మాభిమానానికి, ఆత్మగౌరవానికి, ఆత్మస్థైర్యానికి ఆలంబనం.

దళితులు :

తరతరాలుగా అస్పృశ్యతకు గురై, సాంఘిక, ఆర్థిక, మత, సాంస్కృతిక, రాజకీయంగా అణిచివేయబడి, విద్యావికాసాలకు దూరం చేయబడి సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై, శ్రమ దోపిడీకి ఆహుతైనవారు.

దళితవాదం :

దళితుల ఆలోచనల్లో సమాజాన్ని, నడుస్తున్న చరిత్ర పరిణామాలను అధ్యయనం చేసే వాదం దళితవాదం. దీనికి ఆధారం దళితుల నిత్యయథార్థ వ్యథాభరిత జీవితమే. జీవితంలో అన్ని రంగాలతో బాటు సాహిత్య రంగంలోనూ దళితులు నిరాదరణకు గురయ్యారు. సాహిత్యంలో దళితులను మనుషులుగా పరిగణించక, వ్యక్తిత్వం లేనివారిగా చిత్రించారు. నేడు దళితులు తమ సమస్యలకు ప్రతిస్పందించి తామే వ్రాయడం ఆత్మగౌరవ వాదంగా చెప్పుకోవచ్చు.

దళిత సాహిత్యం :

తరతరాలుగా అనేక అవమానాలకు, సాంఘిక అసమానతలకు, వివక్షలకు గురైన దళితుల వేదనలను, సంవేదనలను, జీవితానుభవాలనూ తామే చిత్రించేది దళిత సాహిత్యం. తమ గురించి తామే నేడు ఎంతో ప్రతిభావంతంగా దళిత సాహిత్యం ప్రకటించు కుంటున్నారు.

నేపథ్యం :

జ్యోతిబాపూలే (1827-1890) సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు మహారాష్ట్రలో మొదటి సారిగా నిమ్నవర్గాల ఉద్ధరణకు తిరుగుబాటుకి పిలుపు నిచ్చాడు. 'సత్యశోధక్ సమాజ్' అనే సంస్థను 1874లో స్థాపించి దాని ద్వారా దళితులను చైతన్యపరచడానికి విశేషమైన కృషి చేసాడు. దళిత సమస్య

1910 నాటికి ఒక 'ఆందోళనరూపం' దాల్చింది. 'నిమ్నజాతులవారి మహసభ' ను శివరామ్ కాంబ్లే ఏర్పాటు చేసాడు. అదే కాలంలో కర్మవీర్ షిండే దేశం నలు మూలలా పర్యటించి, నారాయణ్ చందావర్కర్ సహ కారంతో 'దళిత జాతు సేవా సంఘం' స్థాపించాడు. 1917లో కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో దళితుల అభివృద్ధిని కోరుతూ, అస్పృశ్యతను నిరసిస్తూ తీర్మానాలు చేసింది. ఈ సంవత్సరంలోనే దళిత పాంథర్స్ ప్రతినిధులు మొదటిసారిగా దేశరాజకీయ రంగంలోకి రాగలిగారు, బొంబాయిలో మొదటిసారిగా 1918 మార్చి 23, 24, తేదీల్లో 'అఖిల భారత దళిత జాతుల సమావేశాలు' జరిగాయి. 1919 నాటి బ్రటిష్ చట్టం ద్వారా పరిపాలనా వ్యవస్థలో మొట్టమొదటిసారిగా దళితుల ఉనికి కన్పిస్తుంది. దళితులపట్ల, సవర్ణహిందువులు తమవైఖరిని మార్చుకోవాలనీ, స్వపరిపాలన సిద్ధించడానికి ముందు సాంఘిక సమానత్వం సమకూరాలనీ డా॥ బి.ఆర్. అంబేద్కర్ వాదించారు. తమ అభిప్రాయాలను అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు తెలియజేయడానికి 'మూక్ నాయక్' పత్రికను ప్రారంభించాడు. డా॥ బి.ఆర్.

అంబేద్కర్ 1924 మార్చిలో అస్పృశ్యతా నివారణోద్యమాన్ని మొదలుపెట్టారు. జాతీయోద్యమంతో పాటు వచ్చిన ఈ ఉద్యమంలో భాగంగా గాంధీజీతో అస్పృశ్యులకు హరిజనులనే పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. మార్చి 9, 1927లో బొంబాయిలోని దామోదర్ హాలులో 'దళిత సమావేశం' జరిగింది. అక్కడ 'బహిష్కృత హితకారిణీ సభ' రూపొందింది. అదే ఏటా అంబేద్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్షపత్రికను ప్రారంభించాడు. తర్వాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ దేశ స్వాంతంత్ర్యం, పత్రికల ప్రచురణ, దళితుల సామాజిక రాజకీయ హక్కులు, భారతదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం నిర్విరామ కృషి చేసారు.

భారతీయ సాహిత్యాలలో 1960ల నుండి దళిత చైతన్యం, దళిత సాహిత్యం అన్న పదబంధాలు ప్రముఖంగా వినిపించాయి. 1970లలో మరాఠి, కన్నడ భాషలలో నిర్దిష్టలక్ష్యాలతో, ప్రత్యేకమైన అభివ్యక్తులతో దళిత సాహిత్యం పురోగమించింది. 1980ల ఉత్తరార్ధంలో తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం నిర్దిష్టరూపాన్ని పొంది 1980లు మొదలయ్యేనాటికి దళిత సాహిత్యం, సాహిత్యంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తూ ఉంది. దళిత సాహిత్యానికి మరాఠీలో జ్యోతిబాపూలే, డా॥బి.ఆర్. అంబేద్కర్ ప్రేరణనిచ్చారు. 1950లలో మొదలై 'మహారాష్ట్ర బుద్ధ సాహిత్య పరిషత్' దోహదంతో విస్తరించిన దళిత సాహిత్యం 1970లలో స్థిరమైన ఉద్యమ రూపాన్ని పొంది, 1980ల నాటికి మరాఠి సాహిత్య స్రవంతిలో భాగమై, గుర్తింపుపొంది పాఠ్య గ్రంథాలలోకి కూడా ప్రవేశించింది. బాబురావు బగుల్, నారాయణ్ సుర్వే, అర్జున్ కాంబ్లే, దయాపవార్, వామన్ నింబాల్కర్, నామ్‌దేవ్ దాశాల్ మొదలైన రచయితలు మరాఠీ దళిత సాహిత్యాన్ని పరిపుష్టం చేసారు. దాదాపుగా అన్ని సాహిత్య ప్రక్రియలలోను దళిత సాహిత్యం వచ్చింది. యూరోప్, ఆఫ్రికా, అమెరికాలలో బ్లాక్ లిటరేచర్‌తో పోలుస్తూ ఉంటారు. దళిత సాహిత్యం కన్నడంలో కూడా బలమైన ఉద్యమంగా కన్పిస్తుంది. ఏ భాషలోనైనా దళిత సాహిత్యంపైనా అంబేద్కర్ ప్రభావం ప్రత్యక్షంగా కన్పిస్తుంది.

సమాజంలో వివక్షను ప్రతిఘటిస్తూ దళితుల సంవేదనలను, బాధలను, అనుభవాలను, అనుభూతులను, చిత్రించడంతో పాటు దళితులపై జరుగుతున్న అత్యాచారాలను శక్తివంతంగా అభివ్యక్తం చేయడానికి 'దళిత సాహిత్యం' మొదలయ్యింది. 1967లో ఔరంగాబాద్‌లో 'మిళింద సాహిత్య పరిషత్' ఏర్పడింది. 1969 నుండి

'దళిత సాహిత్యం' అనే పదం విస్తృతవ్యవహారంలోకి వచ్చింది. ఎంతో ముందుగానే జ్యోతిబాపూలే రచనలు చేసారు. గులాంగిరి, పూణే సత్యశోధక సమాజ నివేదిక, తృతీయరత్న, ఛత్రపతి శివాజీ, రాజ్ భోంస్లే యాంఛ, విద్యాకాథాతిల్, బ్రహ్మణ్ పంతోజి, సార్వజనిక్ ధర్మపుస్తక్, పౌరోహిత్యం యొక్క బండారం, సేద్యగాడి చెర్నకోల, సత్య సారాంశం, హెచ్చరిక మొదలైనవి. అలాగే డా॥బి.ఆర్. అంబేద్కర్ రచనలను మహారాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అంబేద్కర్ రచనలను, ఉపన్యాసాలను వివిధ సంపుటాలలో ప్రచురించింది. 1994లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సంపుటాలను తెలుగులోకి అనువదించి ప్రచురించింది. అందులో మచ్చుకు కొన్ని భారతదేశంలో కులాలు; వాటి విధానాలు, పుట్టుక, అభివృద్ధి, హిందూ మతం తాత్వికత, హిందూతత్వంలో చిక్కు ప్రశ్నలు, అంటరానివారు, అంటరానితనంపై వ్యాసాలు, శూద్రులంటే ఎవరు? అంటరానివారు, భారత రాజ్యాంగానికి ప్రధానరూపకర్తగా డా॥ బి.ఆర్. అంబేద్కర్, బుద్ధుడు, అతని ధర్మం, భారతదేశపు మొదటి స్వతంత్ర న్యాయ శాఖా మంత్రి డా॥బి.ఆర్. అంబేద్కర్ (1947-1956) మొదలైనవి.

దళిత సాహిత్యవ్యాప్తికి పత్రికలు కూడా తమవంతు పాత్రపోషించాయి. 1920లోనే బెంగాలీభాషలో దళిత పత్రిక వెలువడింది. ఆ తరువాత వివిధ భాషల్లో దళిత

పత్రిక, ప్రభుద్ధ భారత్, అస్మితాదర్శ, మూక్‌నాయక్, సోమవంశీయమిత్ర, భీం పత్రిక, దర్పణం, జనతా, ప్రమేయ నికాయ, జాయజా, సింహగర్జన, శ్రామిక్ విచార్ మొదలైన పత్రికలు దోహదం చేసాయి.

జ్యోతి బా ఫూలే, సాహో మహరాజ్, పెరియార్ రామస్వామి నాయకర్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ మొదలైన వారి భావజాల ప్రభావంతో, వారు తెచ్చిన చైతన్యంతో తెలుగులో కూడా దళిత పత్రికలు ప్రారంభమయ్యాయి. 1917లోనే 'దీన బంధు' పత్రిక వేమూరి రాంజీరావు పంతులు నిర్వహించారు. ఆ తర్వాత వరుసగా పంచమం, నవజీవన, వ్యవసాయకూలీ, వీరభారతి, జీవన జ్యోతి, ఆది ఆంధ్ర, ఆదిమాంధ్ర, ఆది హిందూ, జయభేరి, జ్యోతి, మూక్ నాయక్, ఆంధ్ర రిపబ్లికన్, సమతావాణి, ఎదురీత మొదలైన వాటిల్లో దళితుల వార్తలు కూడా ప్రచురించడం మామూలైంది/జరిగింది.

తెలుగు సాహిత్యంలో సంస్కరణోద్యమానికి ముందే అస్పృశ్యతా నిరసన కవిత్వం వచ్చింది. 1909లో అజ్ఞాత కర్తృత్వంగా 'ఆంధ్ర భారతి' పత్రికలో 'మాలవాండ్రపాట' అన్న గేయంలో అంటరానితనం వద్దంటూ గళం విప్పారు. 'అందారు పుట్టిరీ హిందమ్మతల్లికి' అది మొదలు దళితులు నేటికి తమ హక్కుల కోసం ఆత్మగౌరవ పోరాటం చేస్తూనే ఉన్నారు. 1930లో దళిత స్పృహ మొదలై దళిత చైతన్యంగా, దళిత సాహిత్యంగా, దళిత వాదంగా అభివృద్ధిచెంది 1970-80లలో విప్లవ సాహిత్యం, దళిత సాహిత్యంలో కలిసిపోయింది. దళిత కవిత్వానికి స్వయం ప్రతిపత్తి ఏర్పడుతూ వచ్చి, ఎంతో మంది దళిత కవులు, కలంపట్టారు, గొంతు విప్పారు.

తెలుగు సాహిత్యంలో ఏ ఉద్యమానికైనా, ఏ వాదానికైనా ముందు కవిత్వం, పాట పుట్టాయి. ఆ తర్వాతనే మిగిలిన ప్రక్రియలు కథ, నవల, విమర్శ మొదలైనవి పుట్టుకొచ్చాయి. ఒక విధంగా తెలుగు సాహిత్యానికి, అత్యాధునిక దృక్పథాన్ని కలిగించి, ఇతర భాషా సాహిత్య స్థాయికి చేర్చింది కూడా దళితవాదమే. 1987 నుండి 2004 దాకా అంటే రెండు దశాబ్దాల కాలం తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లోకి వేళ్ళూనుకుని శక్తివంతంగా ముద్రవేసిన వాదం దళితవాదం. దళితవాదం అన్ని రంగాలను ప్రభావితం చేయడమే కాదు, సాహిత్య ప్రక్రియలన్నింటిని సుసంపన్నం చేసింది. నూతన తాత్విక దృక్పథం, వాస్తవికత, మానవతావాద సూత్రాల పరిమళాలను విస్తరింపజేసింది. అంతే కాదు దళితవాదం సామాజిక, తాత్విక, సాహిత్యరంగాల్లో కొత్త ప్రశ్నలను లేవనెత్తింది. కవిత్వం, కథ, నవల, విమర్శ దీనికేమి మినహాయింపు కాదు. ఇది ప్రతిఘటనాపూర్వకంగా సాగిన చైతన్య సాహితీ పంథా. ఆ పంథా జ్యోతి బా ఫూలే సిద్ధాంతాలను పునాదిగా చేసుకొని, అంబేద్కర్ భావ ధారను ఆధారంగా చేసుకొని వచ్చిన సాహిత్యోద్యమం/ సాహిత్యసృజన.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – నేపథ్యం

– డా॥. పి. నీరజ, పి. బి. సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, విజయవాడ.

1980 దశకం తరువాత వచ్చిన సాహిత్యోద్యమాలలో దళిత సాహిత్యం ప్రముఖమైనది.అంబేద్కర్ బోధనల నుంచి, బ్లాక్ పాంథర్స్ ఉద్యమం. నుంచి ప్రేరణ పొందిన దళిత పాంథర్స్ సాహిత్యోద్యమం మరాటీ సాహిత్యాన్ని పెనుమార్పులక గురిచేసింది. కులంతాలూకు అన్ని ప్రత్యేకతల్ని చర్చించి కుల నిర్మూలనా ధ్యేయం

దేశవ్యాప్తంగా అల్లుకుపోతున్న దళిత ఉద్యమాలలో భాగంగా తెలుగు రాష్ట్రంలో కూడ దళిత ఉద్యమాలు, ప్రవేశించాయని అర్థం చేసుకోవచ్చు.ఈ రాష్ట్రంలో ముందునుంచే అనేక విప్లవోద్యమాల చరిత్ర వుంది.

తరతరాలుగా భారతదేశంలో యెడతెగని అన మానత్వానికి భౌతిక మానసికహింసకి హక్కులకి, హక్కుల రాహిత్యానికి, దళితులు గురౌతున్న వాస్తవాన్నిస్పర్తించి దళితసాహిత్యం ఉద్భవించింది. పురుషాధిక్య సమాజం స్త్రీని బానిసనుచేసినట్లే అగ్రకుల ఆధిపత్య వ్యవస్థ దళితులను సేవకులుగా పీడితులుగా మార్చింది. అధిక సంఖ్యాకులైన ప్రజలు అణగారిన కులాల్లో పుట్టిన కారణంగా ఆకలి, అవిద్య, అపరిశభ్రత, అనారోగ్యం, సాంస్కృతిక వెనుకుబాటుతనం, మొదలైనవాటికి గురికావల్సి రావడం సహజంగా జరిగిన విషయంకాదు. దీనిని అల్పసంఖ్యాకులైన దీపిడీ వర్గాలు,అశేష జనాన్ని దోచుకోవడానికి పన్నిన పన్నాగంలో భాగంగా భావిస్తారు.

దళిత సాహిత్యోద్యమ కవులు, డాక్టరు అంబేద్కర్ ఈ దేశంలోని కులవ్యవస్థమీద లోతైన పరిశోధన జరిపి దాని పుట్టుకను,చలనాన్ని, అభివృద్ధిని, విశేషించి వివరించంటంతో పాటుగా కులనిర్మూలనాసిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

భారతీయ సామాజిక వాస్తవికతని గుర్తించడంతో మన మార్క్సిస్టులు విఫలమైకులవ్యవస్థతో తలపడలేక పోయారు. కులమేదైనా, పేదలంతా, ఒక్కటే అనే అవగాహనా లోపం వల్ల జరిగిందా, ఈ దేశంలో మార్క్సిజం కూడా అగ్రకులస్థుల ద్వారా ప్రవేశించటం వల్లా జరిగిందా అనేది చర్చినియాంశమే . కారణం ఏదైనా మార్క్సిష్టులు చెపుతున్న కేవల ఆర్థిక వాద, వర్గ వాద తెరల్ని ఛేదిస్తూ దేశ అభివృద్ధి దళితుల అభివృద్ధి లేకుండా జరగడం అసాధ్యం అని అధిక సంఖ్యాకులై కూడ అధికంగా అన్ని రకాల దోపిడీలకు గురౌతున్న దళితుల విముకే,దేశ పీడితుల విముక్తి అనే అవగాహనతో కలం పట్టారు కొంతమేది కవులు. వారిలో ప్రసిద్ధులు శివసాగర్, గద్దర్, చరబండరాజు, వంగపండు ప్రసాదరావు, బి.యస్.రాములు, అప్పర్, సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్, కత్తి పద్మారావు మొదలైన వారు ప్రముఖులుగా కనిపిస్తారు.

తెలుగు దళిత సాహిత్యంలో దళితుల సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ తగిన భావావేశంతో దళితులే రాసిన సాహిత్యం దళిత సాహిత్యం. తెలుగు దళిత సాహిత్యంలో వచనకవిత్వం,పాట మాత్రమే యిప్పటి వరకు విస్తృత స్థాయిలోవచ్చాయి. 1980 తరువాత వచ్చిన దళిత చైతన్యం వెలుగులో వచ్చిన సామిత్యం చాలా స్వల్పం.

తెలుగుదేశంలో కొత్త సాహిత్యోద్యమాలు ముందుకు వచ్చినప్రతిసారిముందుగావచ్చినకవిత్వం,పాట మాత్రవే. ఉద్యమాలను పట్టుకుంటూ వస్తూన్న చరిత్ర వుంది. అలాగే ఈనాడు వస్తున్న దళిత ఉద్యమాలను బలంగా వ్యక్తీకరిస్తున్నదీ దళిత కవిత్వ,పాట మాత్రమే అని అవగత మౌతుంది.

దళిత వచన కవితలోగాని, పాటలో గాని ప్రధానంగా అయిదు అంశాలు కనబడతాయి. 1. తరతరాల నుండి దళితులు అవమానాన్నికి గురైన క్రమం 2. దళితుడు

తన స్వీయత్వాన్ని వెదుక్కుంటున్న వైనం 3. ఆత్మ గౌరవంతో అగ్రకులాల పెత్తనాన్ని దిక్కరిస్తూ, ప్రతిఘటనాలు, ఉద్యమాలు నడుపుతున్న వాస్తవం సామాజిక విముక్తి ఉద్యమాలలో నాయకత్వానికి, 4. భారత చరిత్ర గమనాన్ని నిర్దేశించడానికి సంబంధించి తమ వాటాని దళితులు డిమాండు చేస్తున్న వర్తమాన వాతావరణం. 5. భారతమార్క్సిస్టులపట్ల విమర్శనాత్మక వైఖరిని నేటి దళిత సాహిత్యంలో గమనించవచ్చు.

దళితులు సర్వహక్కులు కోల్పోయి సర్వమర్యాదలకు, గుర్తింపుకూ, దూరంగా బతుకుతూ, అంటరానితనంతో, వుడికి పోయిన వాస్తవం ఈదేశ చరిత్రకు సంబంధించిన అమానవీకరణకు పెద్ద గుర్తని తళితుల అభిప్రాయం. దీనిని తొలిసారిగా, వ్యక్తీకరించే ప్రయత్నం జాషువా కవిత్వంలో కనబడుతుంది. ఆ తరువాత జాలారంగ కవి, కుసుమ ధర్మన్న, నక్కచిన వెంకయ్య, బోయి భీమన్న, జ్ఞానానంద కవి, సి.వి. తదితరులు ఈ పని చేశారు.

కేవలం పాటలతో ప్రజల్లోకి విప్లవ భావాలను ప్రచారంచేసి వారిని ఉత్తేజితుల్ని చేయటయే గాక స్వయంగా కలం పట్టి కవితలెన్నో రాసిన కవిగాయకుడు గద్దర్‌తమ సమస్యలకు పరిష్కారం, తమకు రాజ్యాధికారం లభించినప్పుడేనన్న నిర్ణయానికి దళితులు రావడం ఆక్రమంలో రాజయాచరణం ముందుకు పోతుండటం గమనించవచ్చు. తాము ఇనాళ్ళు ఏమిపోగొట్టుకున్నారో రాన్ని తిరిగి పొందటమంటే అధికారాన్ని కైవనం చేసుకోవడమే అని రాజ్యాధికారానికి మాలన్న గేయంలో అంటాడు గద్దర్.

ప్రతిభా విషయంలో, అధిక్యతా విషయంలోనూ అగ్రకులస్థుల వాదనని తన కవితలలో తిప్పికొట్టినవాడు ఎండ్లూరి సుధాకర్. భారత గత చరిత్రను తవ్వి తీసి అమానవీకరణ పేర్లనూ,మూలాన్ని పట్టుకునే ప్రయత్నం కూడా చేసినవాడు ఎండ్లూరి. దళితుడు కనీప వాక్కులు ఏ విధంగా కోల్పోయాడో నెత్తుటి ప్రశ్న ఖండికలో.

దళిత పాటకు గద్దర్, చెరబండ రాజులతో కలసి శ్రీకారం చుట్టినవాడు వంగపండు, గద్దర్ తెలంగాణా మాండలికంలో పాటలు పాడుతుంటే, వంగపండు కళింగాంధ్ర మాండలికంలో పాటలు రాసిపాడుతూ ప్రచారం చేసాడు. ఆస్తిలో హక్కేకాదు, అధికారమే మనకు కావాలి. అయితే అధికారం కావాలంటే దళితులందరు ఏకమై పోరాడితే అధికారం దాసోహం అవ్వక తప్పదు అంటాడు.

భారత చరిత్ర గురించి పునర్చనాలు వేసే ప్రయద్నం దళిత ఉద్యమాలలో భాగంగా ముందుకు వస్తున్న వాస్తవాన్ని ఊరవతలి దు:ఖం కవితా ఖండికలో వేద శ్లోకాల మధ్మ అణచి పెట్టిన శోకమే నాకు కావాలి అంటాడు అఫ్సర్.

పూలే భారత చరిత్రమీద వ్యక్తంచేసిన అభిప్రాయాన్ని దళితులు అంగీకరించటం జరిగింది. ఇప్పుడు ఏవర్ణ యితే దళితులు అంటున్నారో వాళ్ళే ఈ దేశంలో మొదటి నుంచి వున్న వాళ్ళనీ, వీళ్లని ఆర్యులు జయించి బానిసల్ని కావించారనీ, గెలిచిన ఆర్యులు ఉన్నత కులాలుగా చెప్పుకుంటూ స్వదేశీయుల్ని శూద్రులుగా చేసి అధికారాన్ని కైవసం చేసుకుకొన్నారని పూలే చెప్పిన విషయాల అవగాహనని ధ్వనిస్తూ మాస్టార్జీ మాదిగోన్ని - మాలోన్ని అన్న కవితా ఖండిక రాసారు.

అంతే కాకుండ అధికారం ఇచ్చేశక్తి ఓటుకుంది కాబట్టి 85% ఉన్న దళితులంతా తమ ఓటును సక్రమంగా వినియోగించు కోవటం ద్వారా అధికారం పొందవొచ్చుం టాడు మన మేనబై యైదు శాతం అన్న కవితా ఖండికలో.

భారతీయ మార్క్సిస్టుల్ని వివరిస్తూ, విముక్తి పేరుతో, నవసమాజం పేరుతో అరుశతాబ్దల పైగా తమచేత ఎర్రజెండాలు మోయిప్తూ, తమ పెత్తనాన్ని పరీక్షించు కుంటూ కాలం గడిపిన వారు మార్క్సిస్టు లంటాడు శంముక దళితుల ఆత్మగౌవ సమన్యని ఖాతరు

చెయ్యలేదంటాడు తన పోయేదేమీ లేనివాళ్ళం అన్న కవిత ఖండికలో. దళిత గర్జన అనే మరో ఖండికలో దలితుల్ని ప్రతిభ లేనివారిగా ముద్రవేసి పార్టీ క్రమశిక్షణా బంధంలో మూగసేవకులుగా మార్చి విముక్తి ఉద్యమాలలో తమకు నాయకత్వం లేకుండా చేశారు.

అమానవీకరణ ఆధునిక రూపాన్ని శక్తివంతమైన కవిత్వంలో చెప్పినవాడు సతీశ్ చందర్. ఒక జననం వాయిదా ఖండికలో అంటరినితనంతో బాధపడ్డ పూర్వీకుల గురించి, చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూ బతుకుతున్న యువకుల అవమానానికీ, ఏహ్యభావానికీ గురువుతున్నారని వ్యక్యం చేశాడు.

ఇంకా అనేకమంది యువకవులు ప్రత్యేకించి ఇక్బాల్ చంద్ రాములు, కల్లూరి ఆనందరావు, వరదయ్య ఇత్యాదులు అనేక మంది దళితసాహిత్యాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తూన్నారు. సాహిత్య రచనవి కులం ప్రాతిపదికా కాదా అనేది సాహిత్యాన్ని సృష్టిస్తున్న సమాజంలో కుల సమస్య ఉందా లేదా అనే విషయం మీద ఆధారపడి ఉంటుంది. తెలుగులో ఈనాడు స్త్రీ వాద ప్రధాన శక్తిగా ఉండి, దళిత సాహిత్యం రెండో శక్తిగా ఉందనేది విమర్శకు భావన.

స్వేచ్ఛగా ఎంత ఎత్తుకైనా ఎగిరిన వ్యక్తికి భూమి మీదతాకే పురుగు కనిపించగానే ఆహారంకోసం ఎరగావున్న పురుగును భక్షించేందుకు భూమి మీదకు దిగుతూ పక్షి తన స్వేచ్ఛను కోల్పోతుంది. స్వయం ప్రకాశంగా వెలుగొందె సూర్యుడు సైతం మానవ మేధస్సుతో చేసిన గడియారపు ముళ్ళలో బంధించబడుతున్నాడు. ఆలోచిస్తే సూర్యుడి స్వేచ్ఛ మానవుడే హరించి రోజులూ, నెలలూ నిర్దేశిస్తున్నాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఇనాక్ కట్టడి కథల్లో - దళిత జీవన విధానం పై అంబేద్కర్ ప్రభావం

- ఆది ఆంధ్రు రోమాంజనేయులు, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

దళితుడు అంటె వెనుకబడినవాడని, అంటరాని వాడని, సామాన్యజన వ్యవహారంలో వుంది. కాని దళిత అంటే ఖండించబడినది, బేధించబడినది, వికసించినది. అని ఒక అర్థం వుంది. మనిషి వృత్తిని బట్టి మనుస్మృతి అనాటి సమాజం దళిత జాతికి సాంఘికంగా, సాంస్కృతి కంగా నిషేదించింది. అనాటి నిషేద సంస్కృతిని, ఈనాటికి భారతదేశం అంతటా వ్యాపించి కొనసాగుతువుంది. ఈ కుసంస్కృతి మనషుల నరనరాల్లో ఇంకి పోయింది. అందువల్లనే దళితులపై వివక్షత భిన్న రూపాల్లో వ్యక్తమవుతుంది. ఈ వివక్షత పోవాలంటే భారత రాజ్యంగం మనకు ఇచ్చిన హక్కులను సక్రమంగా నిర్వర్తిస్తే రూపుమాపవచ్చును. లేదా కులాంతర వివాహాలను చేసుకుంటే రూపుమాపవచ్చు. అందుకే డా॥బి.ఆర్.అంబేద్కర్ మన దేశానికి దిశ నిర్దేశం చేస్తూ భారత రాజ్యాంగాని రాశారు. అందులో బాగంగానే ఇనాక్ గారు ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత పదవులను అలంకరించి దళితుల జీవన విదానాన్ని గమనించి తాను అనుభవించిన, తన జీవిత అనుభవాలలో నుంచి కథా వస్తువులను తీసుకోని ఆ జీవిత లోతుపాతులను విశ్లేషించి అనేక కథలు రాశారు.

తెలుగు కథా సాహిత్యం ప్రక్రియల్లో కథలు రాసిన కథకులలో ఇనాక్ గారు ముందు వరుసలో వుంటాడు. వీరి కథలలో దళితులు, దళిత స్త్రీలు, బాల కార్మీకులు, ఉద్యోగస్తులు, ప్రేమికులు, మొదలైన వారందరూ వీరి కథలలో పాత్రలుగా కనిపిస్తారు. ఇనాక్ గారు పాత్ర చిత్రణ చేయడంలో గోప్ప మేధావి కట్టడి కథల సంకలనం ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలను గురించి రాశారు.

దళితులు జీవన విధానంలో ఎన్నో సమస్యలు వున్నాయి. అస్పృశ్యత, స్త్రీల అణచివేత, అవినీతి, అధికారం, లంచగొండితనం మొదలైన సమస్యలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. అందువలన దీనికి పరిష్కార మార్గం. భారత రాజ్యాంగంలోని పొందపరచిన పౌరుల ప్రాథమిక హక్కులను, ప్రాథమిక విధులు, అదేశిక సూత్రాలు మొదలైన వాటిని ప్రజలకు రక్షణగా వున్నాయి. కావున వీటి ఈ నాటి సామాన్య జనులకు ఏలా అవగాహన కలిగించాలి అనదే ప్రశ్న? అందుకు సమాధానంగా ఇనాక్ గారు రాసిన కట్టడి, ముట్టడి కథలల్లో దళితుల జీవన విధానాన్ని కళాత్మకంగా తన కథలలో వివరించారు.

కట్టడి కథలో వున్న కథా వస్తువు చాలా వైవిద్యమైనది. ఇందులో 19 కథలున్నాయి. కట్టడి, ముట్టడి ఈ రెండు కథలలో దళితుల జీవితాన్నికి ప్రతిబింబాలుగా కని పిస్తాయి. నేను ఈ వ్యాసానికి ఈ రెండు కథలను తీసుకున్నాను.

అంబేద్కర్ రాసిన భారత రాజ్యంగంలో బడుగు బలహీన వర్గాలవారికి రాజ్యాంగ పరమైన అవకాశాలు కల్పించిన కూడా వారికి రిజర్వేషన్లులను వినియోగించిన కూడా చాలామంది దళితులు ఆర్థికంగాను, సామాజికం గాను, జీవన పరిస్థితులలో ఏలాంటి మార్పు చెందలేదు. దళితులు తరతరాలుగా వెనుకబడి జీవితాన్ని గడుపు తున్నారు. అదే విధంగా సాంఘిక సమానత్వం, ఆర్థిక సమానత, సంస్కృతి పరిపూర్ణత సాదించలేదు.వర్ణ దురహంకారం కొనసాగుతూనే ఉంది. ఈ లాంటి పరిస్థితుల్లో దళితులు జీవితం అవమానాలకు, అవహేళనలకు, పీడనకు, దోపిడికి గురికావడం వంటి

సంస్కృతిక అంశాలు ఇనాక్ కథలలో స్పష్టంగా కనిపిస్తాయి. కట్టడి ముట్టడి కథలలో దళితుల జీవన విదానాన్ని కళ్ళక కట్టినట్లుగా ఇనాక్ గారు కథన నైపుణ్యంలో రాసిన కథలు దళితులు అంటే అగ్రవర్ణాల అధిపత్యానికి గురవుతున్న వెనకబడిన కులాలు మాల, మాదిగలని చెప్తారు. ఈ రెండు కులాలలోను మరింతగా వెనుకబడిన కులం మాదిగలు. మాదిగ కులంలో పది ఉపజాతులు వున్నాయి. ఈ జాతిలో వ్యత్యాసాలు ఉన్నాయి. ఈ ఉపకులంలో చివరి వర్గానికి చెందిన "మొండోడు" అనే ఉపకులం వున్నదని రచయిత మన ముందు వుంచారు. మొండోడు కథ మాదిగ కులంను ఆశ్రయించి జీవనం సాగించేవారు మొండోళ్ళు ఇందులో రచయిత మెండోడు అనే ఉపకులం జీవన విధానాన్ని ఈ కథ ద్వారా పూర్తిగా వివరించాడు.

కట్టడి కథలో మాదిగలను ఏ విదంగా కట్టడి చేసినవాడు మొండోడు. చేసింది మాదిగల తాగునీటి బావికి, వాడికి తినడానికి అన్నం లేక పోతే కాదు మాదిగలు పెట్టకపోతే కొన్ని వెంట్రుకలు బావి గిలకకు కట్టి ఎవరూ నీళ్ళు తోడరాదని కట్టడి చేస్తాడు, ఈ ఆచారాన్ని మాదిగలు అదికమించరాదు. ఇలా కట్టడి చేసే అధికారం వానికి ఎవరు ఇచ్చారు. చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం కదా! అంటె ఈ సంస్కృతి డా॥బి.ఆర్.అంబెద్కర్ రాసిన భారత రాజ్యంగం పౌరులకు కల్పించిన హక్కులలో లేదు. అమెరికా వంటి దేశాలలో చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం వుంది. కాని మన భారతదేశంలోకాని, మన ఆంధ్ర రాష్ట్రంలో కాని ఈ పద్ధతికి వ్యతిరేకం.

మాదిగ కులంను ఆశ్రయించిన మొండోళ్ళను పోషించాలన్న భావాలు నమ్మకాలు ఎన్నెన్నో వున్నాయి. ఈ నాటికి ఉన్నత కులాలను ఆశ్రయించి కొన్ని కులాలు మనుస్మృతి కాలం నుండి సంప్రదాయబదంగా రావడం వాస్తవమే గాని మాదిగలను ఆశ్రయించి జీవనం సాగిస్తున్నారని మనకు అర్థమైంది. డబ్బు లేకుండా పేదవారిగా ఉండవచ్చు కాని, గుణానికి, కులానికి తమను ఆశ్రయిస్తారని చెప్పవచ్చు. ఈ భావన ప్రతి నిమ్న కులంలో ఉందనే సత్య భావం కనబడుతుంది.

ప్రాచీన కాలంలో రాజులు, జమిందారులు రాజ్యంలో ఉండే పేదప్రజలకు భూమి ధానం చేయడం. అన్న దానాలు చేయడం గొప్ప పని కాకపోవచ్చు. కాని కనీసం తనకు పూటకు ఇంత అన్నందొరికినదాన్ని తనను నమ్మిన వానికి, తమ జాతిపై ఆదారపడిన వారికి దానం చేసి ఆకలి బాధను తీర్చడం గొప్ప అన్న విషయాన్ని మనం గ్రహించవచ్చు.

మొండోడు ఈ కథలో మాదిగలకు తన ముఖం కూడా చూపకుండా ఏది పెట్టిన అది తినిపోవడం, అపరిశు భ్రంగా ఉండడం మనం చూడవచ్చు. మాదిగ ఉపకులం వాడే అయిన వీడు చీకట్లో ఇంటిదగ్గరకి వచ్చి "మొండోణ్ణి బువ్వ బెట్టు తల్లి" అని మూడు సార్లే అడుగుతాడు చీకట్లోనే పెట్టండి తిని పోతాడు. వాడికి అన్నం పెట్టకపోతే వానికే కడుపుమంట గదా! అందుకే నీళ్ళు తోడుకోకుండా కట్టడి చేస్తాడు.

ఈ కథలో మాదిగలు మొండోడికి ఏందుకు భయంతో వాడికి అన్నం పెట్టడమేమిటి? అడుక్కువడం కొందరికి రాజ్యంగం కల్పించినట్లుగా మనువు ఈ మొండోడికి ఇచ్చినట్లు ఉంది. ఈ సంప్రదాయం మాదిగ జాతిలో చాలా విచిత్రంగానే వుంది. మొండి వాళ్ళు బిచ్చం అడగడం ప్రజలను తిట్టడం, కొట్టడం కుక్కల్ని ఉసి గొల్పడం, ఇంటిలో దొంగతనం చేయడం వాటిని రచయిత వ్యతిరేకించాడు. మాదిగలు వారి పిల్లలు, మునలి వాళ్ళు నోటిని కట్టి దర్పంగా అడుక్కునే మొండోడికి మాదిగలు వినయ విధేయలతో అన్నం పెట్టాలని నిర్దేశించడం అంతా హింస అని రచయిత వాపోయాడు.

సమాజం చాలా అభివృద్ధి చెందిన మనువు రాసిన మనుస్మృతి కారణంగా ధనవంతులను పై ఆధారపడి జీవించే కులాలు, ఉపకులాలు మన దేశాబివృద్ధిని ఇంకా వెనకబడుతుందని పెద్దోడి పాత్రద్వారా మనకు

తెలుస్తుంది. ఎవరికోపుట్టి, ఎక్కడోపుట్టి, ఎవరి మీదో ఆధారపడి జీవించే హీనస్థితి నుండి బయటపడాలి. ఈ భూమి మీద వున్న జంతువులు తనకు తానుగా ఆహారం సంపాదించుకొని తింటాయి. మొండోణి మాత్రం సమాజం వాటి కంటె హీనంగా, నీచాతినీచంగా, అసహ్యంగా, అనాగరికంగా అభాగ్యులుగా ఆకలితో వున్న వాడిగా తయారుచేసింది. డా॥ బి.ఆర్.అంబేద్కర్ దళితుల కోసం ఇలాంటి సంస్కృతి పోవాలని అస్పృశ్యత నివారణ చట్టంలో పొందుపరచాడు. మనిషై పుట్టినవాడు మనిషిలాగానే బ్రతకాలని నేటి సమాజంలో ఇంకా ఎన్నో మార్పులు రావలని రచయిత ఆశపడ్డాడు.

కట్టడి కథలో మాదిగల జాతిలో వుండే సంస్కృతిని వున్నది వున్నట్లు ఇనాక్ గారు కథన శిల్ప నైపుణ్యంతో మొండోడిని జీవన విదానం ఇలానే వుండాలని చెప్పడం లేదు. కాని మనుదర్మవ్యవస్థను పరోక్షంగా వ్యతిరేకించాడు. మొండోడి కథలో తమ జాతి ఈ సమాజంలో అభివృద్ధి చెందాలని రచయిత అశించాడు.

ముట్టడి కథలో పెద్ద రైతులు ఇంట్లో మాదిగలు పశువులను మోపడంలో తమ కుటుంబ సభ్యులుగా వాటిని పెంచడం ఆదరించడం ముద్దు పెట్టడం మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి. అయితే వారు ఎద్దులను తమ డబ్బుకోసం దర్పాలకోసం పెంచుతారు. భూస్వాములు వ్యవసాయ పనులకోసం కాకుండా ఎద్దులను పందేలలో గేలవడం కోసం పెంచుతారు. ఇందులోను అంబేద్కర్ ప్రభావం కనిపిస్తుంది. ఎందు కంటే భారత రాజ్యంగంలో బడుగు బలహీన వర్గాలకోసం, దళితులను అగ్రవర్ణాలవారు తమకు బానిసలుగా చేసుకొని, వెట్టి చాకిరి చేయించుకొంటారు. వీటిని అంబెద్కర్ ఆ నాటికీ వ్యతిరేకించారు. అయిన కూడా ఈ నాటికి మాదిగలు రైతుల ఇంట్లో జీతాలు వున్నట్లు మనం గమనించవచ్చు. ఈ వ్యవస్థలోని బానిసత్వం పోవాలని రచయిత ముట్టడి కథలోని వెంకయ్య తన మనవడిలాగా చూసిన కుర్రదూడనే వ్యవసాయానికి ఉపయోగించగా ఆ కష్టాన్ని భరించలేక, తిండి తిప్పలు మాని ప్రాణాలను కోల్పోతుంది. మాదిగలు పశువులతో వారికి వున్న అభినాభావసంభందాన్ని, అనుబంధానికి, ఆత్మీయతకు, ఈ కథ అద్దం పడుతుంది. కుర్రదూడ యజమానికి తని ఆత్మీయ స్పర్శ వెంకన్న మనస్సును మాత్రం వికలతం చేసింది. ఇంట్లో సొంత మనిషి చనిపోతే ఏ విధంగా ఆచారాలు చేస్తామో అలాగే పసుపు, కుంకుమలు, కొత్త బట్టలతో చనిపోయిన ఆ కుర్ర దూడను సాగనంపడం సహృదయులైన పాఠకుల మనస్సు చితిమెన్తుంది. సహజంగా మాదిగలు చనిపోయిన జంతువుల్ని పంచుకు తినే సంస్కృతిని, జీవన విదానాన్ని చిత్రించిన కథలు వచ్చాయి. అయితే ఇందులో అదే కుర్రదూడ చనిపోతే ప్రాణాల్ని కోల్పోయిన వెంకనను చూపించిన విదానంలో ఇనాక్ గారి వస్తు వైవిద్యం కనిపిస్తుంది.

కట్టడి, ముట్టడి కథలలో రచయిత దళితుల జీవన విదానాన్ని యథాతథంగా రూపొందించాడు. కాని వారిలో జీవితంలో అభివృద్ధిని పోరాట పటిమను, వారిలో చైతన్యం రచయిత ఎక్కడ చూపలేదు.

మాదిగ జాతిలో పది ఉపకులలో చివరి వర్గానికి చెందిన మొండోడి కథలో వాని ముఖం కూడా చూడడా నికి ఇష్టపడని ఈర్ష, అసహ్యం మాదిగ కులాల్లో వుండే ఆచారాలను ఏవిధంగా వుందో ఇనాక్ గారు పాఠకులకు ప్రశ్నల వర్షం కురిపించాడు. ఈ రెండు కథా కథనంలో దళిత జీవన సౌందర్యం శిల్పం అద్భుతంగా అవిష్కరించ బడింది.

ఈ విధంగా ఇనాక్ గారు సామాజిక కట్టుబాట్లు మీద, సంప్రదాయాల మీద నీతి, నియమాల మీద మంచి అవగాహన వుంది. మాదిగలు అడుక్కుతినే అలవాటు పోవాలని నేటి ఆధునిక సమాజంలో అందరు సమానంగా ఉండాలని, ఇంకా దళితులను ఆలయ ప్రవేశ నిషేదం రూపుమాపలని, బహుజనులకు రాజకీయపరమైన

హక్కులను కల్పించాలని డా॥బి.ఆర్ అంబెద్కర్ అనాడు పున ఒడంబడికను వ్యతిరేకించాడు. దళితులకు ప్రత్యేకమైన నియోజక వర్గాలను రాజ్యాధికారం ఇవ్వాలని అకాంక్షించాడు. తద్వారా దళితులలో సాంఘికంగా, ఆర్థికంగా, సంస్కృతి పరంగా అభివృద్ధి సాదిస్తారు అని చెప్పారు.

ఆధార గ్రంథాలు :

1. కొలకలూరి ఇనాక్ - కట్టడి కథల సంపుటి
2. డా॥బి.ఆర్.అంబేద్కర్ - కుల నిర్మూలన
3. కవితోద్యమాలు - తెలుగు అకాడమి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా "గబ్బిలం" – దళితవాదం

– డా॥. కె. చెన్నకేశవరెడ్డి, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి), కడప.

తెలుగు సాహిత్యంలో దళిత వేదనకు, ప్రతిఘటన చైతన్యానికి, ధిక్కార స్వరానికి తొలి ప్రతినిధి గుర్రం జాషువా. అంటరానితనమనే మదగజాన్ని అంతం చేయడానికి కంకణం కట్టుకున్న కవిసింహం జాషువా. కులమతాల వైషమ్యాలతో కునారిల్లుతున్న సమాజాన్ని తనకలంతో బలంగా ఎదుర్కొన్న ధీరకవి. దళిత కులంలో పుట్టి ఏన్నో అవమానాలు పొందిన జాషువా బాల్యంలో అనుభవించిన పేదరికం, కులమత భేదాలు, అవమానాల్లోంచి జాషువా కవిగా రూపాంతరం చెందాడు.కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని మూఢాచారాలపై తిరగబడ్డాడు. అందుకనే ఆయనే స్వయంగా

కులమతాలు గీచుకొన్న గీతలచొచ్చి
పంజరాన కట్టువడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు
తిరుగు లేదు, విశ్వనరుడనేను.

అని చెప్పుకొన్న ధీరోదాత్తుడు జాషువా. తన వ్యక్తిత్వం లోనూ, కవిత్వంలోనూ వచ్చిన పరిణామానికి ఈ పద్యం తార్కాణం.

జాషువా రచించిన గబ్బిలం ఒక అసాధారణ రచన. వర్తమాన సమాజపు సాంఘీక అసమానతలపై, అనాచారాలపై జాషువా ఎక్కుపెట్టిన బాణం గబ్బిలం. సామాజిక దురన్యాయానికి బలై, అగ్రవర్ణాలచేత వెలివేయ బడ్డ పంచముని ఆక్రందన గబ్బిలం కావ్యానికి ఆయువు పట్టు. జాషువా స్వానుభవంనుండి పుట్టినకావ్యం గబ్బిలం. అంటరానితనాన్ని ఘోరమైన దురాచారంగా చాటిచెప్పిన కావ్యాల్లో గబ్బిలం ప్రముఖమైనది. ఒక దళితుని సజీవ వేదనకు ప్రత్యక్ష సాక్ష్యం గబ్బిలం. ఒక అంటరానితనానికి చెందినవ్యక్తిని కథానాయకుడుగా చేసుకొని ఈ కావ్యం రాసి సంచలనం సృష్టించాడు జాషువా. ఈదేశంలో గుడిలోకి దళితుడి ప్రవేశంలేదు గానీ, గబ్బిలానికి ఉందటూ దళితుల దయనీయ పరిస్థితులను హృదయ విదారకంగా వర్ణించాడు జాషువా. ఈ కావ్యంలో తన అనుభవపూర్వకమైన దళిత జీవణ చిత్రణ అద్భుతంగా వర్ణించిన తీరుకు నిదర్శనము ఈ పద్యం.

చిక్కిన కాసుచే దనివి చెందు నమాయకు డెల్ల కష్టముల్
బొక్కిడుబువ్యతో మరచిపోవు క్షుధానల దగ్ధమూర్తి న
ల్దిక్కులు గల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీసుతుం
డొక్కడు జన్మమెత్తె భరతోర్వకుం గడగొట్టు బిడ్డడై.

కవి కథానాయకున్ని పరిచయంచేస్తూ నాటి సమాజంలో పాతుకుపోయిన అంటరానితనాన్ని, తద్వారా అరుంధతీ సంతానమైన దళితజాతి దీనగాధను తేటతెల్లం చేశాడు. జాషువారచించిన రచనలన్నీ ఒక ఎత్తు. గబ్బిలం ఒక్కటే ఒకఎత్తు. ఇది దళిత వేదనకు ప్రతీక. ఆయన రచనలలో సర్వోత్తమమైనది గబ్బిలం కావ్యం.ఇందులో దళితకథానాయకుడి వేదనను వర్ణించిన తీరు హృదయాలను కలిచివేస్తుంది.జాషువా తన మనో భావాలను -

వానినుద్ధరించు భగవంతుడే లేడు
మనుజుడెట్లు వాని గనికరించు
వాడుజేసుకొన్న పాపకారణమేమొ
యింతవఱకు వాని కెఱుకలేదు.

దలితుడిని ఉద్ధరించే భగవంతుడే లేకుంటే ఇక మనిషి సంగతి వేరేచెప్పనక్కరలేదు.తనిట్లా కావడానికి ఏపాపంచేశాడో అతనికి ఇంతవరకు తెలియదు. దళితుడిపట్ల సమాజంలో చిన్నచూపు ఎందుకు? తాను చేసిన పాపమేమిటి? అని ప్రతి దళితుడి ఆవేదనను వ్యక్తం చేశాడు కవి.

గబ్బిలం కావ్యం ప్రతీక కవిత. జాషువగారి అంతరంగం లోని ఆవేదన అనంతంగా వారి కవితలో ప్రతిబింబిస్తుంది. వారి ఆవేదనకు అక్షరరూపమే గబ్బిలం. ఇందులోని కథానాయకుడు అంటరానివాడు. ఈ నాయకుడు భరత మాత కడగొట్టుబిడ్డడు. అరుంధతీసుతుడు, గర్భదరిద్రుడు కాని నీతివంతుడు దానికి నిదర్శనమే ఈ పద్యం

ముప్పు ఘటించి వీని గలిమిన్ గబలించి దేహమున్
బిప్పియొనర్చు నీ భరత వీరుని పాదము కందుకుండగా
జెప్పలు గుట్టి జీవనముసేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పువడ్డది సుమీ భరతావని వీని సేవకున్.

వర్ణవ్యవస్థపై కవి నిరసన వ్యక్తంచేస్తూ 'చెప్పులుకుట్టి జీవనం సాగించే దళితుడికి భరతావని అప్పపడ్డది' అని వర్ణించాడంటే అనాటి సమాజంలో దళితుల పరిస్థితిని, తీవ్రతను గమనించవచ్చు. జాషువా కులం కారణంగా ఎదుర్కొన్న అవమానాలు ఎక్కువ. కాబట్టి కులతత్వాన్ని 'గబ్బిలం కావ్యంలో తూర్పారబట్టాడు. జాషువాజీవితంలో అంటరానితనం అతన్ని అణువణువునా వెంటాడింది. ఆ వ్యధ ఆయన రచనల్లో హృద్యంగా కనిపిస్తుంది. అందుకే సమసమాజంలో దళితుల పట్ల సమాజానికిగల చిన్న చూపును -

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

హిందూమతంలోని నాలుగు వర్ణాలు నాల్గుపడగలకు ప్రతీకగా జాషువా చెబుతూ, అణుగారిన కులాల గాలి సోకినంతనే ఆకారణంగా నాలుగు వర్ణాలవారు అతడిని కనరుకొంటున్నారని కవి ఆవేదనవ్యక్త చేశాడు. వర్ణాశ్రమధర్మాల హైందవ కులవ్యవస్థ నీడలో దళితుడి దయనీయమైన పరిస్థితిని చక్కగా వివరించాడు.

ఈదేశంలో దళితులు ఎదుర్కొంటున్న బాధలు, వారి ఆర్థిక స్థితుగతులు ఎంతదయనీయంగా ఉన్నాయో పరిష్కారం లేని సమస్యను కూడా జాషువా కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ-

"వానిఱెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తిలేదు."

దళితుల రెక్కల కష్టం లేకపోతే సస్యశ్యామలమైన భారతావనిలో పంటలు పండవు. చెమటోడ్చి తమ కష్టంతో ప్రపంచానికి భోజనంపెట్టే పేదలకు తిండి లేదన్న వాస్తవాన్ని ఆవిష్కరించిన జాషువా పేదవాడిని దోపిడి చేస్తున్న వ్యవస్థను ఇదేమి న్యాయమని ప్రశ్నిస్తాడు. ఈ తీరు మారాలని ఆశిస్తాడు.అటువంటి శ్రమజీవికి పట్టెడన్నం దొరుకుట దుర్లభమని దళితుల బాధలను వ్యక్తం చేశాడు.

మతం మానవత్వాన్ని నేర్పాలి కానీ విషాన్ని నూరి పోయరాదని హితబోధ చేశాడు జాషువా. ఎక్కువ తక్కువ అనేభావంతో కొందరిని అంటరానివారుగా సమాజంలో చూస్తున్నారు. వారితో శ్రమ చేయించుకొని వారినే హీనంగా చూసే అమానవీయ సమాజంలో అగ్రవర్ణాల కుట్రలను బహిర్గతం చేస్తూ-

ఆలయంబున నీవు వ్రేలాడు వేళ
శివుని చెవి నీకు గొంత చేరువగ నుండు
మౌని ఖగరాజ్ఞి, పూజారి లేనివేళ
విన్న వింపుము నాదు జీవిత చరిత్ర

దేవుడికీ సామాన్యుడికీ మధ్య పూజారి అడ్డుగా నిల్చున్నాడని, అందుకే శివుని నివాసమైన కైలాసానికి గబ్బిలాన్ని పంపి నిర్భాగ్యుడి కష్టాన్ని విన్నవించమని వేడుకున్నాడు. సందేశాన్ని పంపించాడానికి గబ్బిలాన్ని ఎన్నుకోవడానికి గల కారణాన్ని వివరిస్తూ, పంచముడి బాధలను చెప్పుకోవడానికి "ఈ మదోన్మత్త ప్రపంచంలో పులు గుంపుట్రలు గాక పేదలకు ఆప్తుల్, చుట్టపక్కంబుల్ (పక్షి)కలరే "అంటూ సమర్థించాడు కవి.

జాషువా సాంఘీక విప్లవాన్ని కోరి నంస్కరణ దృక్పథంతో గబ్బిలం కావ్యాన్ని రచించారు. గాంధేయ వాదిగా, ఆ హింసా సిద్ధాంత ప్రియుడుగా గాంధీజీ బోధించిన ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని ఆయన విశ్వ సించాడు. సంఘంలోని ధనికులు, అధికులైన వారిలో హృదయ పరివర్తన కలిగి, పేదలు, బలహీనులు, అభాగ్యులపట్ల జాలినిచూపితే సమాజం బాగుపడు తుందని జాషువా నమ్మకం. అందుకే గబ్బిలం కావ్యంలో దళితుడి దుస్థితిని హృదయవిదారకంగా వర్ణించినా అతడిని తిరుగుబాటుకు ప్రోత్సహించలేదు. అందుకే ఆయన రచనలలో గబ్బిలం శిరశ్శేఖరకృతి. అంతేకాదు జాషువా జీవిత ప్రస్థానానికి, సామాజిక దర్శనానికి నిదర్శనంగా కూడా నిలిచింది ఈ కావ్యం.

జాషువా తన రచనలను సామాజిక ప్రయోజనానికి సాధనంగా మలచుకున్నాడు. కాబట్టి అంటరానివారి గాలికూడా సోకనీయనిజాతి ఆయన ప్రతిభకు, కాలికి గండపెండేరం తొడిగింది. దళితకులంలో పుట్టి కవిత్వం రాస్తున్నాడన్న కోపంతో నరికినా పాపంలేదన్నవారు చివరకు సరస్వతీ పుత్రుడన్నారు. జాషువా మాటలతో కాకుండా తన రచనా పాటవంతో సమాజాన్ని జయిం చాడు. జాషువా ఒక్క దళిత సమస్య దగ్గరే ఆగిపోకుండా సామాజిక ప్రగతికి విఘాతం కల్గించే అనేక రకాల సమస్య లపై కూడా దృష్టిసారించి తన కవిత్వం ద్వారా నిర్మాణాత్మక పరిష్కార మార్గాలను సూచించాడు. ఒక్క విత్తనం ఒక మహావృక్షంగా ఎదిగిన విధానాన్ని మనం జాషువాలో చూడవచ్చు.''కవిని గన్నతల్లి గర్భంబు ధన్యంబు'' అన్న జాషువా మాటలు అందరి విషయంలో నిజమైనా కాకున్నా జాషువా విషయంలో నిజమైంది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జక్కులు నవల – సహజ ప్రేమస్పద పాత్రలు

– సూరేపల్లి పద్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

జక్కులు నవల ఉత్తరతెలంగాణ దళిత నవల. ఈ నవలలలో గోదావరి పరివాహక ప్రాంతంలోని మంథని దగ్గర వున్న ఒక గ్రామం మాదిగ గూడెంలోని ప్రజల జీవన విధానానికి అద్దం పడుతుంది. ఈ నవలలో అగ్రవర్ణ కుల అధికార అహంకారం, అన్యాయాలు అడుగడుగునా తారసపడుతాయి. మాదిగలను అమాయ కులుగా చేసి రాజ్యమేలుతున్న దొరల రాక్షసత్వానికి నిదర్శనంగా జక్కులు నవలను చెప్పవచ్చు. జక్కులునవల రచయత డా॥మంథని శంకర్. ఇతను మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో గట్టమ్మ వెంకటరాజం దంపతుల అయిదవ కుమారుడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగువిభాగంలో అధ్యాపకులుగా పని చేస్తున్నారు. స్వాతంత్ర్యానికి ముందు మంథని చుట్టుపక్కల గ్రామాల దళితుల పరిస్థితులను తెలిపే నవల.

గ్రామాలలో దొరలే రాజులుగా చలామణి అవుతూ తమ అధికార బలంతో గ్రామాలలోని ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసేవారు. అన్నికులాల వారు గ్రామాలలో నివసిస్తున్న రెడ్డి బ్రాహ్మణ వారికి తప్పా ఎవ్వరికి ప్రాధన్యత ఉండేది కాదు. మరి దళితులను అత్యంత నీచంగా చూసిన సంఘటనలు మనకు సమాజంలో అనేకం కన్పిస్తాయి. అలాంటి పరిస్థితులున్న సమాజంలో దళితులను అస్పృశ్యత అంటరానితనం పేరుతో ఊరికి దూరంగా వెలివేసేవారు. మాదిగలు ఉన్నత కులం వారికి ఎదురు మాట్లడొద్దు, వారిని ముట్టు కోవద్దు, వారితో మాట్లాడొద్దు. ఇలాంటి ఆంక్షాల మధ్యన వారి జీవితాలు వుండేవి. పొరపాటున మాట్లాడినా, ముట్టుకున్న అక్కడిక్కడే చంపివేసిన సందర్భాలు, ఆవమానించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇన్ని అడ్డుగోడల మధ్య కులాంతర ప్రేమను ఈ అగ్రవర్ణ సమాజం ఎలా ఒప్పుకుంటుంది. ప్రేమ రెండు మనుషు లను ఏకం చేసే మానసిక స్థితి. ఎవ్వరిలో ఎప్పుడు ఎలాగైనా పుట్టవచ్చు. ప్రేమకు కులాలు, మతాలు, ప్రాంతాలతో సంబంధం లేదు. అలాంటి నిజమైన ప్రేమ తత్వాన్ని జక్కులు నవలలో మనం చూడవచ్చు.

ఎంకక్క-హుస్సేన్ :

ఎంకక్క, మారన్న అక్క వీళ్ల తండ్రి జక్కులు. పెద్ద జక్కులుకు ఇద్దరు భార్యలు, మొదటి భార్య చిన్నెల్లి, రెండవ భార్య మైసీ. ఎంకక్క మొదటి భార్యకు పుట్టింది. మాదిగ కులంలో పుట్టిన చాలా అందంగా ఉండేది.

''ఆ ఎత్తు సిత్తు బలమైన పిక్కలు మోకాళ్ళపైకి కాసెపోసిన సీర.భూలచ్చిమి కాడి పెద్ద పోసమ్మ చెక్క బొమ్మలెక్కనే ఉన్నది''. ఎంతో మంది తన అందానికి చూసి ఎక్కువ కులపోళ్లు ఆగం జేత్తరని ఎటు పంపలేదు పెద్ద జక్కులు. మిక్కిలి పేదరికం కావడం వల్ల కుటుంబంలో ఇబ్బందులువచ్చేవి. మైసుకు కాలుకు కొయ్యకాలు కుచ్చడంతో ఎంకక్క కూడా పనిలో భాగంగా కట్టెలు అమ్మడానికి మంథని పోయ్యేది. అక్కడే ఆమెకు హుస్సేన్‌ఖాన్ పరిచయం అవుతాడు. ముందుగా హుస్సేన్ ఖాన్ తనను ఇష్టపడుతాడు. ''ఇదేంది నేను పావులంటే నువ్వు రూపాయిమ్మినవ్ చిల్లరకేడికి వోవాలె'' అంటుంది ఎంకక్క. నయి నయి జాందేవ్ చిల్లర ఏమద్దు. ఏవూరు నీది.అని ఊరుపేరడుగుతాడు హుస్సేన్. ''మది పల్లె ''అంటుంది ఎంకక్క.ఇలా ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారుతుంది.ప్రేమను తెలపడం కోసం రోజు కట్టెలు కొంటూనే వుంటాడు హుస్సేన్. ఒక రోజు అనుకోకుండ ఇద్దరు ఒకటవడం. రెండు రోజులకు ఒక సారి కలుసు కవడం. పెద్దల అనుమతికి విరుద్ధంగా హైదరాబాద్ వెళ్ళిపోతారు. హుస్సేన్‌ఖాన్ ముస్లిం, ఎంకక్క మాదిగ

కులం అయిన ప్రేమకు కులంతో సంబంధం వుండదనే విషయాన్ని నిరూపించే ప్రయత్నం చేశాడు రచయిత. ఈ ప్రేమ సఫలీకృతం అయింది. పెద్దలను ఎదిరించిన పరిస్థితి మనకు కన్పిస్తుంది.

ఎర్రపోసు-జక్కులు :

జక్కులుకు తెలిసీ తెలియని వయసులోనే ఎర్రపోసు ఆకర్షణలో పడుతాడు. పిల్లలు ఆడుకునే వయసులోనే పాత కొట్టంలో దాక్కునే ఆట ఆడుతూ చీకటి ఎర్రపోసు ను పట్టుకోవడం. అలా మొదలైన అనుభూతి. ఎర్రపోసు బట్టలు పట్టుకొని వాగుకు పోయినదని తెలువగానే జక్కులు వాగుకు వెళ్ళుతాడు. వాగులో కొట్టుకుపోతున్న ఎర్రపోసును జక్కులు రక్షిస్తాడు. చిన్న పిల్లలు ఆడుకునే ప్రాయంలోనే వాగుతో కొట్టుకు పోతున్న ఎర్రపోసును కాపాడడం. జక్కులు ధైర్య సాహసాలను చిన్నతనము నుండే చిత్రించాడు రచయిత. ఇలా జక్కులు ఎర్రపోసుల కలయిక జరుగుతుంది. అయితే అప్పుడు జక్కులు అల్లరి పిల్లవానిగా కనబడుతాడు.అలా అల్లరిగా కనబడే జక్కులు తర్వాత చాలా ఓర్పుగా దేనికి భయపడకుండా ఏ బల హీనతలకు లోనుకాకుండ ఎదగడం ఈ నవలలో చూస్తాం.

నర్సు-జక్కులు :

కొన్ని సందర్భాలలో ఎంతో ఇష్టపడ్డప్పటికి కులం అనే అడ్డుగోడల మధ్య ఆ ప్రేమ విఫలం అవుతుంది. ఇద్దరు ఎంతో ఔదార్యంతో ఉంటారు. తమ పరిస్థితిని, తమ ప్రేమ వల్ల వచ్చే అనర్థాలు తెలుసుకోగలుగుతారు. సమాజంలో జరుగుతున్న వాస్తవిక పరిస్థితులు అర్థం చేసుకొని వారి ప్రేమను వారిలోనే భద్రపరుచుకుని జీవితకాలం ఒకరికి ఒకరు మేలు చేస్తూనే ఉంటారు. వారిపై ఉన్న ప్రేమను ఆ బాధను మనుసులో వుంచుకుని ఎంతో వేధనను అనుభవిస్తారు. ఈ సంఘటనకు ఉదా హరణగా మనం జక్కులు, నర్సూ ప్రేమను చూడవచ్చు.

జక్కులు మాదిగ కులంలో పుడతాడు. తండ్రి మారన్న తల్లికి కొండక్క వీరి కుటుంబంలో ఉన్న పేదరికంతో ఏదో ఒక పని చేయాల్సివచ్చేది. అప్పుడు (సోమయ్యదొర) దొర జొన్న సేనులో పిట్టకావలికి కుదురుతాడు. జక్కులు అక్కడి నాలువ నారన్నబిడ్డ నర్సుతో పరిచయం ఏర్పడు తుంది. అది ఒక విచిత్రమైన పరిచయం.

"ఎవ్వలు దొరకనట్టు మాదిగోళ్ళను కావలి పంపు తండ్రు పాడుగాను" అనుకుంట చేనులో మంచె ఎక్క బోయి మెట్టు జారి జక్కులు పైన పడిన నర్సు మానసిక పరిస్థితిలో మార్పు వస్తుంది. నర్సుకు జక్కులు పైన ప్రేమ ఏర్పడుతుంది. నర్సు ఎంతో ఓర్పు, సహనం, గల తెలివైన అమ్మాయి. జక్కులు, మాదిగ కులం అని తెల్సినా తనపై ఇష్టాన్ని పెంచుకుంటుంది. కులం పట్టింపు ఉన్నట్టు కల్పించిన జక్కులు విషయంలో అమే ఆలాంటివి ప్రదర్శించలేదు. జక్కులుకు ఏదన్న ప్రమాదం ఎదురైతే తానే ఆదుకునేది.

చేనుకాడ అటుకులు కాపుకుని బుక్కి మిగిలినవి ముల్లెకట్టుకొని వస్తుంటే మసుక చీకటిఅవుతుంది.రాతిరి ఆగులకు దిగి ఇసుకలో ఇద్దరే కొంత కాలక్షేపం జేసి చెట్టపట్టాలేసుకొని తుమ్మల్లకచ్చి తుమ్మలనీడలో కూర్చుండి సన్నగ కూని రాగం తీస్తూ పాటలు పాడు కుంటూ వస్తారు.

"లవంక మడుగుల జెల్లపిల్లా..ఓజెల్లాపిల్లా..
నాచేయ్యి జారిపోతావానే జెల్లపిల్లా..ఓజెల్లాపిల్లా..
ఏనంగ పోతారా కొర్రమట్టా..ఓకొర్రమట్టా
పుసికి పొయ్యె పిడికితారా కొర్రమట్టా..ఓకొర్రమట్టా"

తొవ్వలో పాడుకుంటూ వెళ్లడం స్వచ్ఛమైన ప్రణయా నికి ప్రతీకగా కనబడుతుంది. జొన్న చేన్ల కుండల నీళ్ళు తాగితే బుచ్చి రామన్న దొరకు చెప్పుతాడేమో అనుకుని జక్కులు భయపడతుంటే నర్సు బుచ్చిరామన్నను బ్రతిమి లాడి ఎవరికి చెప్పుకుంటా ఒప్పిస్తుంది. జక్కులుకు నర్సు పెండ్లి అని తెలువగానే ఎట్లైనా ఈ పెండ్లికి పోవాలని నిర్ణయించుకుంటాడు. ప్రేమించిన అమ్మాయికి వివాహం జరుగుతే బాధగా ఉంటుంది ఎంతో వేధన అనుభ విస్తాడు జక్కులు. తన బాధను దప్పు దరుకు జోడి చేసి

దప్పనాట్యం చేస్తాడు.నర్సు పెండ్లికి ఆదిరెడ్డి దొర బిడ్డ భారతి ఆచ్చిన కాళ్లగజ్జెలు కట్టుకొని ఎగురుతాడు. నర్సుమీది ప్రేమ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు చేసుకోలేదు. అటు నర్సుగాని ఇటు జక్కులు గాని ప్రేమను మనసునకే పరిమితం జేసుకున్నారే తప్పా ఎక్కడ భయటపడలేదు. అలాగే దొడ్డి చెరువు మైసమ్మ దగ్గరి చెరువు తెగి వాగులో కొట్టుకొచ్చిన జక్కన్ని ఆ ఊరి వాళ్ళు బండ్లె ఏసుకత్తె చూసి గుర్తు పట్టి కాపాడుతుంది. నర్సుకు వేరే అతనితో పెళ్ళి అయినప్పటికి తన ఇంటిలో వుంచుకొని సేవలు చేసి భారతితో జక్కులును కలిసి తనకు మేలు చేసిన ఉత్తమమైన ప్రేమికురాలిగా నర్సు మనకు నవలలో దర్శనమిస్తుంది.

భారతి-జక్కులు :

ఉన్నత కుల స్త్రీలు దళితులను ఇష్టపడితే వారు ప్రేమించిన వ్యక్తి కోసం తల్లిదండ్రులను విడిచిపెట్టిన ప్రేమను సొంతం చేసుకుంటారు. ఆప్రేమ కోసం, ప్రేమించిన వ్యక్తి కోసం తల్లిదండులను దిక్కరిస్తారు అని తెలిపే పాత్ర మన భారతి. ఆమె చాలా అందమైన అమ్మాయి, తెలివైనది. జక్కులు డప్పుకొట్టడం, దరువు తగ్గట్టు అడుగులేసుడు, ఆయన ధైర్యం చూసి భారతి ప్రేమిస్తుంది. జక్కులు, భారతి ప్రేమలో సహజంగా కనబడుతుంది. భారతి మాటల్లో, చేతల్లో జక్కులుతో నడుచుకునే తీరులో చాలా జక్కులు తనకే స్వంతం అనే భావన కనబడుతుంది. జక్కులుకు భారతిపై లోపల ఇష్టం ఉన్న ఆమె ఆదిరెడ్డి కూతురు కనక కొంచెం వెనక ముందు చూస్తే జాగ్రత్త మసలుకుంటాడు. జక్కులు రాముల వారి తల్వాలకు దప్పుకొట్టడానికి వచ్చినప్పుడు దప్పుకొట్టి దడి పక్కకు కూసున్నప్పుడు భారతి పోవుకుంట "జక్కులు మస్తెగిరినవు" అని మెచ్చుకొగానే మళ్లీ దప్పుకొట్టుకుంట ఎగురుతాడు.ఇక ఏలుపుకాడికి పోయినప్పుడు జక్కులు లంజమడుగు గోదావరి లోయను దాటినప్పుడు ఒకవైపు భయపడుతూనే ఒకవైపు జక్కులు ధైర్యానికి ముగ్ధురాలవుతుంది. "ఏంద్రా జక్కా ..! గట్లవోయినవు. మొసల్లు అత్తన్నయిగదరా ఏమన్నయితే ఎట్లరా "అని ఊరోళ్లంటే భారతి మనసులో "అబ్బ ఏం మొగోనివిరా...!నువ్వు" అని అనుకుంటుంది.ఏలుపుకాడ అందరికూరలుబువ్వలు అయిన తర్వాత "అరే జక్కా..!లంజమడుగు దాటినవు నువ్వు తురుంఖాన్‌రా.."అని మెచ్చుకుంటుంది.ఒకరికి తెలియకుండానే ఒకరు ఇష్టాన్ని పెంచుకుంటూనే ఉంటారు.ఆదిరెడ్డికి తెలిస్తే ఏమైనా చేస్తడు అనే అనుమానం మనసులో ఉండేది. సరియైన సమయం కొరకు ఎదిరిచూస్తూ ఒకరినొకరు కలుసుకునేవారు. చిందోళ్ళు కథ చెబుతుంటే "అల్లిరాణిగా తనను అర్జునునిగా జక్కులును తలుచుకొని కథ చూస్తుంది భారతి." అంటే భారతి జక్కులు కంటే ముందే మానసికంగా బలమైన నిర్ణయం తీసుకున్న మనకు ఎక్కడ తొందర పడినట్లు భారతి కనబడదు.

పద్మ-అష్టల్ :

నిమ్న వర్గ ప్రజలు, ఉన్నత వర్గాలలోని పిల్లలను ప్రేమించిన వారితో సన్నిహితంగా మెలిగిన, వారితో మాట్లాడిన తక్కువ జాతివారిపై దాడులు చేయడం సమాజంలో మనం చూస్తూనే ఉంటాం. కొన్ని సందర్భాలలో చూసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఉన్నత కులం వారిని ప్రేమించి ఇబ్బందులు ఎదుర్కొన్న వారిగా అష్టల్, పద్మల ప్రేమను ఈ నవలలో చూడవచ్చు. అష్టల్ ముస్లీం వాడు. పద్మ సాలె అమ్మాయి.అష్టల్ మాదిగ ఎంకక్క, హుస్సేన్‌ఖాన్‌కు జన్మించాడు. శాలరామయ్య బిడ్డ పద్మ. వీరిద్దరి ప్రేమ కథ కూడ ఈనవలలో ప్రాధాన్యత సంతరించుకుంది.అష్టల్ తాశీల్ ఆఫీస్‌లో పని చేస్తాడు. పద్మ పొలం పనులకు పోయే పిల్ల.

పద్మ అష్టల్‌ను చూసి ఇష్టపడుతుంది.ఆవిషయం పక్క పిల్లలు గమనించి చెప్పే వరకు అష్టల్‌కు తెలియదు. పద్మ అష్టల్‌కు బంగారు ఉంగరం ఇస్తునప్పుడు. పద్మ పక్కపిల్ల చూడడంతో సమస్య మొదలవుతుంది. పక్కన ఉన్న అమ్మాయి పద్మ తండ్రి శాల రామయ్యతో

చెప్పతుంది ఆ లొల్లి గ్రామాన్ని రెండు భాగాలుగా విడిపోయేదాకా వస్తుంది.ఊరంత ఒక్కవైపు మాదిగ మన్నెపోళ్లు ఒక్కవైపు అవుతారు. ఇది పెద్దగొడవకు దారితీస్తుంది.ఈ విషయం తెలుసుకున్న గ్రామంలో దొరలు అయిన ఆదిరెడ్డి, సోమయ్యలు ఇదే అదునుగా కులం పేరుతో నానా రభస చేస్తారు. ఏరాలో చాలామందికి గాయాలవుతాయి. అందులో రంగిని అత్యాచారం చేసిన రమేశ్ రెడ్డి దొరను రంగి విపరీతంగా కొడుతుంది.ఇలా ఇరువర్గాల వారికి దెబ్బలు తగలడంతో ఆదిరెడ్డిదొర అష్టల్‌పై రహస్యంగా దాడి చేయించి చంపాలని చూస్తాం.దొర మనుషులు మంథనికి వెళ్ళిన అష్టల్‌ను రాయితో కొట్టి హతమార్చాలని చూస్తారు. ఆ సమయంలో గాయపడిన అష్టల్‌ను జక్కులు వచ్చి రక్షిస్తాడు. చివరికి మైసమ్మ కొలుపు తర్వాత చెరువు తెగిపోవడం తో పద్మ వచ్చి అష్టల్ ఇంటిలోనే ఉంటుంది.ఈ విధంగా గ్రామాలలో కులాంతర, మతాంతర ప్రేమలు యువతి యువకులలో కలగడం దాని ద్వారా వారు అనేక సమస్యలు ఎదుర్కోవడం జక్కులు నవలలో చూడవచ్చు.

ఎన్ని ఇబ్బందులు, గొడవలు జరిగిన అష్టల్, పద్మలు ఒకరిపై ఒకరు ఇష్టాన్ని పెంచుకున్నారు తప్పా వారు వారిలో ద్వేషంకు స్థానం ఇవ్వలేదు. మనుషులను కులాలు, మతాలకు, వర్గాలకు అతీతంగా ఒక్కటి చేసేది ప్రేమ. ప్రేమ ఎవ్వరినైన ఒకటిచేయగల శక్తి ఉన్నట్లుగా జక్కులు నవలలో రచయిత మనకు తెలియజేస్తారు. రచయిత ఎనభైఏండ్ల కాలమును కథలో తీసుకుని అనాటి గ్రామ సమాజాన్ని ఆగ్రామంలో మమేకమై జీవిస్తున్న దళిత జీవితాలను మానవీయ సంబంధాలను సహజంగా చిత్రించాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విశ్వ మానవతా వాది - జాషువా

- డా॥. ఆంజనేయుడు, తెలుగుశాఖ, రాయలసీమ విశ్వ విద్యాలయం, కర్నూలు.

జలముల్ వాయువు నగ్నియున్ బరమ రాజన్యుండు భోలోక వా
సులకుం బంచియె సంగిపోయిన స్థిరాస్తులే స్పృశ్యతా స్పృశ్యతన్
కులగోత్రాల ప్రపంచ సభ్యకు సిగ్గుంజేటు జుమ్మిమ్మహా
కలుషంబెల్ల మహాపదార్థములకున్ గల్పింతు రల్పాశయుల్ ॥ క్రీస్తు చరిత్ర ॥

20వ శతాబ్దం భారతదేశ చరిత్రలో మైలురాయి వంటిది దేశం పారతంత్ర్యం నుండి విముక్తిని కోరుతూ అతివాద, మితవాద, గాందేయవాదులు చేస్తున్న ఉద్యమాలు ఒకవైపైతే, సంఘం సంస్కరింపబడాలని, అట్టడుగు వర్గాల జీవితాలలో వెలుగులు నింపాలనే అంబేద్కర్ ఆశయం మరోవైపు, గాంధీ ఆశయాలను అంబేద్కర్ ఆలోచనా విధానానికి ప్రభావితులైన రాజకీయవాదులు, కవులు, కళాకారులు అయా ప్రాంతాలలో అయా రంగాలలో ప్రగతిని సాధిస్తూ ముందుకు అడుగేసారు. అలాగే ఆధునిక తెలుగు సాహిత్యంలో ఇటువంటి మార్పును గమనిస్తూ సంఘ సంస్కరణ ధోరణితో కందుకూరి స్త్రీ జనోద్ధరణ మూఢవిశ్వాసాలపై ధ్వజమెత్తితే, గురజాడ రచనల్లో వీటితో పాటు హరిజనుల ప్రగతికి సంబంధించిన అంశాలను కూడా కనిపిస్తాయి. గురజాడ కన్న ముందుగా 1909 సంవత్సరంలో ఆంధ్ర భారతి పత్రికలో వచ్చిన మాలవాండ్రపాటను పరిశీలిస్తే ఎట్టాగు మెక్కువ యేరైన మాకంటే అని ప్రశ్నిస్తూ 'తమ్ములమని మమ్మూలజూడండి. అమ్మోరు దీవించి అయిశ్వర్యమిచ్చును. అంటూ సాగిన పాటలో ఒకవైపు సవర్ణులు తమకన్నా ఉన్నతులు కాదంటూనే తమని తమ సోదరులుగా భావించాలనే బోధన కూడా కనిపిస్తుంది. తర్వాత వచ్చిన రచనల్లో దళితులపై సానుభూతితోనో, ఉద్ధరణతోనో వచ్చిన రచనలు కనిపిస్తాయి.

గాంధీ ఆదర్శాలను, అంబేద్కర్ భావజాలాన్ని పుణికి తెచ్చుకున్న గుర్రం జాషువా దళితుల వ్యక్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని మొదటిసారిగా తెలుగు సాహిత్యంలో బలంగా కనిపించాడు. ఒక దళితునిగా సంఘంలో ఉన్నటువంటి సాంఘిక దురాచారాల్ని అనుభవిస్తూ దుర్భర జీవితాన్ని గడిపిన జాషువా పేదరికం, కులమత భేదం తన గురువు లన్నాడు. ఒకటి సహనాన్ని మరొకటి తనలో ఎదురించే స్వభావాన్ని నేర్పాయన్నాడు. భారతీయ వ్యవస్థ నిచ్చెన మెట్ల వ్యవస్థ. ఆధిపత్యం కోసం తమని ఉన్నతులుగా నిర్మించుకోవడం కోసం బ్రాహ్మణ వర్గం నిర్మించిన కుల వ్యవస్థను కూకటివేళ్లతో, పెకిళించి తన కవితా ఖడ్గంచే ఖండించి హరిజనుల ఉద్ధరణ కోసం కైలాసగిరునికి సందేశం పంపాడు.

నా కత్తి కవిత
నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు
దాని విధానంపై ద్వేషం (నా కథ) అని అనగలిగాడు.

ఈ దేశంలో దళితులు ఎదుర్కొంటున్న బాధలు, వాళ్ల ఆర్థిక స్థితిగతులు ఎంత రయనీయంగా ఉన్నాయో గబ్బిలం కావ్యంలో తెలియజేశాడు జాషువా. ఆ స్పృశ్యులుగా చూడబడే పంచమజాతి సందేశాన్ని అటుపక్షి ఇటు జంతువు కనటువంటి గబ్బిలం ద్వారా పరమ శివునికి సందేశం పంపడం తెలుగు సాహిత్యంలోనే విన్నూత్న ప్రయోగం. ఎందుకనగా పక్షులన్నింటిలోకి హీనమైనదిగా పరిగణింపబడే గబ్బిలాన్ని రాయబారానికి ఎన్ను కోవటంలోనే కవి హృదయం అర్థమవుతుంది. అలాగే అంటరానితనం వల్ల అన్ని జాతులకన్న ఎంత హీనమైన దళితులు ఎంచబడతారో మనకు కళ్లకు కట్టినట్లు తన రచనల్లో చూపించారు. అందుకే కవిత్వం హృదయ గతమైనదన్నారు. జాషువా గొప్ప భావకుడు అలాగే దర్శనికుడు. కనుకనే ఆనాటి సమాజంలో ఉన్నటువంటి సాంఘిక అసమానతలపై ధ్వజమెత్తినాడు.

ఆది న్నాలుగు జాతులు
ప్రాదుర్భావంబునందె భారతమున నే
దేదేవుని దయవలెనో
పొదుకొనియె వేనవేలు వర్ణాంతరముల్ (ఖండకావ్యం)

భారతీయ సమాజం కుల సమాజం. తరతరాలుగా ఈ దేశాన్ని కులమే పరిపాలిస్తుందనటంలో సందేహం లేదు. ఋగ్వేదంలో నాలుగు కులాల ప్రస్తావన ఉంది. బ్రహ్మదేవుని ముఖం నుండి బ్రాహ్మణులు, భుజముల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారని చెప్పబడింది. పంచములుగా ఎంచబడే వారి ప్రస్తావన కనిపించదు. స్వార్థపరులైన కొందరు వర్ణాధిపత్యంకోసం, తమ ఆదిపత్యం కోసం మనుషులను కులాలుగా విడగొట్టి వారికి కొన్ని పనులను అప్పగించారు. ఒక సాంఘిక కట్టుబాటు ద్వారా వారిని కలవనీయకుండా కులం అన్ని రంగు పులిమి బానిసలుగాను, వెట్టివాళ్లు గాను నిర్ణయించారు. ఈ కడజాతి వాళ్లకు విద్యను, శుచి శుభ్రతను, ఆస్తి ఐశ్వర్యాలను అనుభవించనీయకుండా పై వర్ణాల వారి సామాజిక అవసరాలను తీర్చే పనిముట్లుగా ముద్రించారు. దానికి వారిపై కర్మ సిద్ధాంతాన్ని రుద్ది యుగయుగాలుగా మనుషులను నిర్వీర్యం చేస్తూ వచ్చారు. మనుధర్మశాస్త్రం కూడా వర్ణాధిపత్యాన్ని సమర్థించింది. ఎదురించిన వారిని కఠినంగా శిక్షించటమే కాకుండా వారిని ఊరి నుండి దూరంగా తరిమివేశారు. అయితే హైందవ సమాజంలోని ఈ దుర్మార్గాన్ని బుద్ధుడు జైనం, చార్వాకం వ్యతిరేకించాయి సమానతరాన్ని చాటాయి. ఐనా కులాధిక్యత రాజ్యమేలసాగింది. కర్మ సిద్ధాంతం ఈ సంఘంలో ఎంత బలమైనదో దానికి పరిష్కారమార్గమేమిటో ఈశ్వరున్నే అడగమని తన సందేశ కావ్యంలో చెబుతాడు.

కర్మ సిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థ లోలురు నా భుక్తి ననుభవింతు
కర్మమననేమో దానికీ కక్షమేయె
యీశ్వరునిచేత రుజువు చేయించవమ్మా. (గబ్బిలం)

ఈ దేశంలో దళితులు రాత్రింబవళ్లు కుటుంబంలోని వాళ్లంత కష్టపడి పనిచేసిన కడుపు నిండని స్థితి. చెప్పులు కుట్టే వారి కళ్లకు చెప్పులు లేకపోవడం, బట్టనేసే వారి శరీరాలపై గుడ్డలు లేకపోవడం, పంటలు పండించే వారికి ధాన్యం లేకపోవడం అందమైన గృహాలు నిర్మించేవారికి తలదాచుకొనే చోటు లేకపోవడం నిత్యం చూస్తున్నవే. కానీ ఏ పనీ చేయని సుఖాన్ని అనుభవించే కొన్ని ఉన్నత కులాల చేతుల్లో ఆస్తులు, ఐశ్వర్యాలు, అధికారాలు ఉండటం శోచనీయం. పని ఒకరిది. ఫలితం మరొకరిది. ఈ విధానాన్ని జాషువా క్రింది పద్యంలో తెలియజేశాడు.

నేను చిందులాడి నేను డప్పుగొట్టి
యలసి సొలసి సత్తి కొలుపు గొలువ
ఫలితమెల్ల నొరులు భాగించుకొని పోవు
నీచమైన భూమి జూచినావే - అని (గబ్బిలం) ఎంతో బాధతో అంటాడు.

దళితుని యొక్క శ్రమ ఎంత విలువైనదో అతడెంత కష్టజీవో గబ్బిలం కావ్యంలో స్పష్టం చేశాడు. భారతీయుని పాదాలు కందకుండా వాటికి రక్షణగా చెప్పులు కుట్టి జీవితం గడుపుతున్న పంచముడు తన పనిని ఎన్నడూ నిరాకరించలేదంటాడు. తన ధర్మాన్ని నెరవేరుస్తున్నా డంటాడు. అతని రెక్కల కష్టం లేకుంటే భూమి పంటనివ్వడానికి సందేహపడుతుంది. అతడు చెమటోర్చి ప్రపంచానికి అన్నం పెడుతున్నా అతనికి మాత్రం తిండి లేదు. ఆ దీనుని తలమీద పడ్డ బురదను కడగడానికి ఆకాశ గంగ కూడా కరుణించలేదు. వాని నైవేద్యం లేనిరోజు మూడు మూర్తులకు కూడా నైవేద్యం కూడా లేదు. అతడు చేసుకున్న పాపమేమిటో కాని అతన్ని ఉద్ధరించే భగవంతుడే లేదంటాడు. అయినా నిరుత్సాహ పడలేదు. ఈ దేశాన్ని నిందించలేదు. తన మాతృదేశాన్ని పొగడుతూనే ఉన్నాడు. ప్రేమిస్తూనే ఉన్నాడు. అలాంటి దళితుడు ఈ దేశానికి వెన్నెముక వంటివాడు. అలాంటి వంశంలోనుంచే వచ్చాడు జాషువా, బాల్యం నుంచే ఏ కుల భేదం వలన తన ఆత్మాభిమానం దెబ్బతిన్నదో, ఏ

కులభేదం తనలోని కవితా ఝరికి బండరాళ్లు అడ్డుపెడుతూ వచ్చిందో, ఏ కుల భేదం తన వ్యక్తిత్వాన్ని బాకున క్రుమ్మినదో ఆ కులభేదాన్ని నరసించాడు. ఎదురించాడు. తనని అంటరానివాడని ఆటలోనికి రానివ్వని ఒక కుర్రవాడి చెంపమీద కొట్టి "సోదరా ఈ దెబ్బనీకు కాదు. నీ లోని కుల భేదానికి లే" - అన్న ఆయన మాటలు తన హృదయ వేదనను తెలియ జేస్తాయి.

జాషువా విశ్వమానవతావాది. అతనికి అహింస అంటే ప్రాణం. అందుకే కుల రహిత వర్గరహిత సమాజాన్ని కాక హింసలేని సమాజాన్ని కోరుకున్నాడు.

తెలుగుజాతియన్నా భారతదేశమన్ను దేశంలోని వివిధ ప్రదేశాలన్నా జాషువాకు ఎంతో ఇష్టం. జాషువా దేశభక్తి, దేశప్రేమ నిష్కల్మషమైనది. దళితుల్ని ప్రతిభ లేనివారని నిందించడం రిజర్వేషన్ గాళ్లని ఎద్దేవా చేయడం లాంటి దుర్మార్గాలెన్నో జాషువా అనుభవించాడు.

ఒకడు ప్రోత్సహింప నొక్కడు నిరసింప
నొకడు చేర బిలువ నొకడు తరుమ
మిట్టపల్లములను మెట్టుచు నెట్టులో
పలుకులమ్మసేవ సలిసినాడ

(ఖండకవ్యం, నా కథ -2)

ఈ మాటలు జాషువా హృదయ వేదనలో నుండి వచ్చిన వాక్యాలవి. దళితుల్ని కర్మపేరు చెప్పి, కులం పేరు చెప్పి ఈసడించుకొనే వారిని సహించి ఓర్చుకొని కవితారచన సాగించాడు. మాదిగ మాల కులాల వారెంత ప్రతిభావంతులైనా వారికి గుర్తింపు లేకపోవడాన్ని నిరసించాడు. అందుకే ఈ దేశంలోని, దళితుల స్థితి గతులు, అసమానతలు సంస్కరణలతోనే తొలగిపోతాయని సమసమాజ స్థాపన కావాలని కోరుకుంటాడు.

ఏ జాతికెంత వచ్చునో
రాజత్వంబు నాకు రావచ్చు గదా (గబ్బిలం)
నాజాతి యెత్తు కేతన
రాజంబున నీదుమూర్తి వ్రాయింతు చెలీ

అని దళిత రాజ్యాధికార భావాన్ని వ్యక్తం చేశాడు. దళిత రాజ్యం రావలసిన అవసరమేంటో భారతదేశంలో దళితుల పాత్ర ఏమిటో, అతడెంత కష్టజీవో తన రచనల్లో తెలియజేశాడు జాషువా. ఈ అసమానతలు పోయి అందరూ సమానస్థాయికి ఎదగాలని ఆశించాడు. అంబేద్కర్ దళిత రాజ్యాధికారమే దళిత సమస్యకు సరైన పరిష్కా మార్గమన్నాడు.

జాషువా తనను తాను ఆవిష్కరించుకున్న పద్యాన్ని పరిశీలిస్తే కులమతాలకు అతీతంగా విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని నిర్మిస్తూ పలికిన మాటలుగా అగుపిస్తాయి.

కులమతాలు గీసుకున్న గీతల జొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖాల లోక మెట్లు నిర్ణయించిన నాకు,
తరుగు లేదు విశ్వనరుడనేను !

- (ఖండకావ్యం నే-5 పుట ।)

జాషువా వ్యక్తిత్వంలోనూ, కవిత్వంలోనూ వచ్చిన పరిణామానికి ఈ పద్యం తార్కాణం, జాషువా సహజంగా విశ్వమానవాతావాది. అతనికి అహింస అంటే ప్రాణం, అందుకే కుల రహిత, వర్గ రహిత సమాజాన్ని కాక హింస లేని సమాజాన్ని కోరుకున్నాడు.

విశ్వమందు గల్గు ప్రేమ సర్వస్వంబు
ముద్దజేసి హృదయములను మలచి
మెరయు సత్యమెల్ల గరగి రేకులు గొట్టి
(ఖండకవ్యం) సృష్టి చేయమయ్య జిహ్మకలను

విశ్వంలో ఉన్న ప్రేమనంతా ముద్దజేసి హృదయాన్ని చేయాలంటాడు. ఇక్కడ కనిపించే ప్రేమ కులమతాలకు అతీతమై హృదయ మాలిన్యాలను కడగి ప్రేమ తత్వాన్ని మానవ హృదయాల్లో జనింపజేయాలంటాడు. అనగా కళలు సాహిత్యం బాగా వర్ధిల్లే చోటును కోరుకుంటున్నాడు. ఇంతకంటే మంచి హృదయ మేముందీ చాతుర్వర్ణ వ్యవస్థతో బాధపడినా ఈ సమాజంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేయలేదు. సంస్కరణలను కోరుకుంటున్నాడు. ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువ – విప్లవ భావాలు

– డా॥ వి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల, తిరుపతి.

గుర్రం జాషువ తెలుగు సాహితీ ప్రస్థానంలో ఓ వజ్రం. మట్టిలోని మాణిక్యం. తన జాతిని ఉద్ధరించడానికి విరిసిన పంకజం. అయితే జాషువా పరిపూర్ణ శిల్పంగా రూపు దిద్దడానికి అనుభవించిన ఉలి దెబ్బలెన్నో? ఈసడింపులు మరెన్నో? ఛీత్కారాలు ఏవేవో? తెలుసుకుంటే 'భళా మహాకవి!' అని అనకమానరు.

చలువరాతి గదుల్లో కూర్చొని వ్రాసిన కవిత్వం కాదు వీరిది. గబ్బిలాల గూడులో గుభాళించిన కవిత. ప్రకృతి అందాలతో పరవసించే తోటలో పుట్టలేదు ఈ ఖండ కావ్యాలు. స్మశానవైరాగ్యాల కడుపుకోతలివి. 'ఊరు పొమ్మనె, కాడి రమ్మనె' సామెతలోని తాత్త్వికాలివి. వలపు సోయగాల మన్మథ బాణాలు కావివి. ఆకలికేకల వెలివేతల బ్రతుకులివి.

అందుకే జాషువా జీవన విధానంలో, రచనా వైవిధ్యంలో ఓ విప్లవ శంఖారావం వినపడుతుంది. అందరూ నడిచిన దారిలో కాక తానొక భిన్నమైన మార్గానికి నాంది పలికారు. దళిత సాహిత్య ప్రక్రియ బలపడేలా విస్తృత లఘు, ఖండకావ్యాలను రచించారు. అందుకే, తననొక విశ్వగోత్రేయ మానవునిగా అభివర్ణించారు. సమాజానికి చేటుచేసే అంధ విశ్వాసాలను, అంటరాని తనాన్ని తూర్పారబట్టారు. కావున జాషువలోని విప్లవ భావాలను పరిశీలించడం అవశ్యం. మొదట అందుకు దారితీసిన పరిస్థితుల ఆధారంగా వారి జీవనశైలిని పేర్కొనవచ్చు.

జీవనశైలి :

జాషువ జీవన గమనం ఓ ముళ్ళదారి. అందులోని కంటకాలను ఏరి పారవేయడంలో వీరి కాళ్ళు కాయలు కాశాయి. 'క్రిస్టియన్' పాఠశాలలో చదువుకుని, చర్చికి వెళ్ళి, బైబిల్ చదువుకొని, తిరిగి క్రిస్టియన్ పాఠశాలలోనే ఉపాధ్యయ వృత్తిని చేపట్టారు. అయితే వెల్లువలా వచ్చే కవిత్వ ధారకు ఓ అర్థం చేకూర్చాలని భావించారు. ఇతిహాసాలు, పురాణాలు, ప్రబంధాలను అధ్యయనం చేయటం ప్రారంభించారు.

'భారత కావ్యకర్తల స్వభావములన్ కవితా స్వభావముల్
తీరికగా బఠించి గురితించుచు తిక్కన కల్పనాచమ
త్కారములన్ తెలుంగు నుడికారములుం గమనించి మెచ్చుచున్
బూరితి జేసితిన్ జెరకు ముక్కలవంటి దశాష్ట పర్వముల్' (నాకథ)

మహాభారతంలోని కవితా స్వభావాలను, తిక్కన కల్పనా చమత్కృతులను, తెలుగు నుడికారాలను గుర్తించి, మెచ్చుకుంటూ, చెరుకు ముక్కల వంటి పద్దెనిమిది పర్వాలను పఠించినానని 'నాకథ' అనే తన స్వీయ చరిత్రలో వివరించారు.

అందుకు ఫలితం అనుభవించవలసి వచ్చింది. క్రైస్తవులు వీరిని తమవాడు కాదన్నారు. హిందువులు అంటరానివాడన్నారు. చివరికి తండ్రి సయితం తన ఫాదరీ ఉద్యోగానికి ముప్పు వాటిల్లుతుందని ఇంటి నుండి వెళ్ళిపొమ్మన్నాడు. ఊరు, ఇల్లు వెలివేయగా మసీదులో జాషువ తలదాచుకోవలసివచ్చింది.

అక్కడే ఉర్దూ భాష నేర్చుకొనుటకు అవకాశం అందిపుచ్చుకున్నారు. ముస్లిమ్ స్నేహితుని ద్వారా ఆ భాషా సౌందర్యంను ఒంటబట్టించుకున్నారు. ఫలితంగా 'ఫిరదౌసి', 'ముంతాజ్ మహల్' వంటి రచనలను భవిష్యత్తులో రంచించారు.

మరో విషయం ఇక్కడ అర్థమవుతుంది. మూడు ముఖ్య మతాలయిన హిందూ, క్రైస్తవ, ముస్లిమ్ మత

గ్రంథాల అధ్యయనం, ఆ మతస్థులతో సన్నిహితంగా జీవనం సాగించడం వంటి అంశాల వలన విశ్వ మానవుడిగా తన భావాలను తీర్చిదిద్దుకున్నారు జాషువ.

జాషువ కుమార్తె హేమలతా లవణంగారు 'మా నాన్నగారు' గ్రంథమయిన జాషువ జీవిత చరిత్రలో జాషువ వ్యక్తిత్వాన్ని వివరిస్తూ 'నిమ్న కులంలో పుట్టి ఇంతటి ఖ్యాతి గడించిన జాషువ అని ఎవరయినా మాట్లాడితే, ఆ మాటలు జాషువాకు అసహనం కలిగించే'వని వివరించారు.

అయితే మతానికి సంబంధించిన ఖండకావ్యాలయిన 'రుక్మిణీ కళ్యాణం', 'ధ్రువ విజయం', 'దావీదు చరిత్ర', 'చిదానంద ప్రభాతము', 'ముంతాజ్ మహల్' వంటి వాటిలో కంటే 'గబ్బిలము'. 'ముసాఫరులు' వంటి కావ్యాలలోని భావాలు అత్యున్నతములు.

కవితా వస్తు విప్లవం :

జాషువలోని విప్లవ భావాలను నిరూపించే ముఖ్యమైన అంశం వస్తువు ఎంపిక. జాషువ కవితలల్లిన కాలం భావకవుల యుగం. 'ఊర్వశి' ఊహల్లో తేలియాడే కృష్ణశాస్త్రి, కిన్నెరసానికి నడకలు నేర్పే విశ్వనాథ సత్య నారాయణ, పుష్పాల కన్నీరుకు తపించే కరుణశ్రీ వంటి మహనీయుల కవితలు యువతను పరవశంలో ముంచేసేకాలమది.

కానీ జాషువా కవితా ఖండికల్లో కరుకుదనం కనిపించేది. ఆ భావనను జీర్ణించుకొనడానికి సాహిత్యాభి మానులకు కొద్దిగా కాలం దొర్లవలసి వచ్చింది. కవి నమయాలను నేలమట్టం చేసి కవితా వస్తువును ఎన్నుకోవడంలో జాషువా చూపిన ధీరత్వం తెలుగు వాఙ్మయంలో ఓ విప్లవగళం.

అందుకు తార్కాణం 'గబ్బిలం' ఖండకావ్యం. ఇందులో శివుడి వద్దకు రాయబారం పంపుటకు గబ్బిలాన్ని స్వీకరించాడు కవి. పచ్చటి రెక్కలు, ఎర్రటి ముక్కుగల రామచిలుకలను కాదనుకున్నాడు. పాలరంగు పావురాలను త్యజించాడు. హొయల నడకలు నడిచే హంసలను త్రోసిపుచ్చాడు.

చీకటి ప్రదేశాల్లో, తలక్రిందులుగా వ్రేలాడే నిశాచరి అయిన 'గబ్బిలం'ను శీర్షికగా స్వీకరించారు. గబ్బిలం ఇంటిలోకి వస్తే ఆ ఇంటిని నెల లోపల వదిలేయ మంటారు. లేదా శుద్ధి పరచమంటారు. సరిగ్గా ఇటువంటి బ్రతుకులే అంటరాని వారి వెతలు. అందుకే భగ వంతుడికి గబ్బిలంను శివుడికి రాయబారిగా కవి స్వీకరించారు.

పంచముడి గాలిసోకడం ఎంతపాపమని హిందువులు భావిస్తున్నారో తెలిపి, లోకాన్ని మేలుకొలపటం కవి ఉద్ధేశ్యం.

"వానిఱెక్కల కష్టంబు లేనినాడు
సస్యరము పండి పులకింప సంశయించు
వాడు చెమ్మట లోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తిలేదు.
ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెలతల్లి జీవనముసేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు" (గబ్బిలము)

కవుల జీవితాల తీరు తెన్నులు, బాధలు, వేదనలను వివరించే మరో లఘుకావ్యం 'పిరదౌసి'. ఒక పారశీక కవి వీరుని జీవితాన్ని ఆధారంగా చేసుకుని రచింపబడిన కావ్యమిది.

ప్రకృతిలో పరవశించే కవి హృదయాన్ని వర్ణిస్తూ..

"హాయిగా బవ్వళించి బ్రహ్మానందములను
బల్కరించుచు నన్ను దివ్యస్వరూప
హృదయమును జీల్చి పూజలర్చించు కొందు
వందుకొని పొమ్ము, వ్యవధి లేదనక రమ్ము".

అంటాడు కవి చంద్రునతో కానీ ఆ కవి హృదయాన్ని, జీవితాన్ని ఓ రాజు అహంకారంతో కూలత్రోసిన విధానం హృదయాన్ని కదిలిస్తుంది.

'కాందిశీకుడు' ఖండకావ్య వస్తువును కూడా భిన్న కథా వస్తువు క్రింద పేర్కొనవచ్చు, పరాయిదేశంలో స్థిరపడి, యుద్ధాల వంటి విపత్కర పరిస్థితులలో స్వదేశానికి తిరిగివచ్చే కాందిశీకుల కడగండ్లను ఈ కావ్యంలో చిత్రించారు.

యుద్ధ పరిస్థితులపై దానిని ఎదుర్కొనవలెననే మనోస్థైర్యాన్ని వివరించే వాక్యాలివి.

"గీతాకృష్ణుడు గావలె, నీ తరుణమునందు గాంధీ
యేమిటికి? మహా
గౌతమ బుద్ధుడుండేటికి? మా తనువల్లికలు
పిరికిమందల జవికెన్" (కాందిశీకుడు)

భావ విప్లవం :

సమాజంలోని కట్టుబాట్లకు కొట్టుకొని పోకుండా, నిర్భయంగా తనలోని భావాలను వ్యక్త పరచడంలో గెలుపు సాధించారు జాషువ. భావస్వాతంత్రాన్ని కవిత్వంలో జొప్పించి, ఎందరినో తన దారిలో నడవటానికి చేయూత నిచ్చారు. ఈ భావ విప్లవ గీతికలతో గొంతు కలపడానికి, మరెందరో సిద్ధపడటానికి స్వరాలను సమకూర్చారు జాషువ.

హేతువాద భావాలతో మనుధర్మశాస్త్రాన్ని ప్రశ్నిస్తుందీ పద్యం.

"ముసలివాడైనా బ్రహ్మకు బుట్టినారు
సలుగురు కుమారులనుట విన్నాముగాని
పసరముకన్న హీనుడభాగ్యుడైన
యైదవ కులస్థు డెవరమ్మా! సవిత్రి"

పంచముడి కులమేది? అంటూ భరతమాతకు వేసిన ప్రశ్నలతో లోకం నెవ్వరపోయింది.

"కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి
పంజరాన గట్టుపడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు, విశ్వనరుడ నేను"

జాషువా 'విశ్వనరుడను' అంటూ ఎలుగెత్తిచాటం ఎందరికో ఆదర్శం అయింది.

"ఒకడు ప్రోత్సహింప, నొక్కడు నిరసింప
నొకడు చేరబిలువ నొకడు తరుమ
మిట్టపల్లములను మెట్టుచు నెట్టులో
పలుకులమ్మ సేవ సలిపినాడ" (నా కథ)

అంటూ తన జీవితంలోని ఒడిదుడుకులను పొందికైన పదాలతో పద్యాలతో 'నా కథ' స్వీయ చరిత్రను వెలువరించడం లోకానికి ఓ స్ఫూర్తి.

సంఘంలో తన మనసును చిన్నబుచ్చిన సంఘటన లను మాలగా కూర్చి, తన కవితలకు విలువనివ్వండి, కులానికి కాదంటూ ఎలుగెత్తి చాటిన గొప్ప కవి జాషువా.

'నా కవితావధూటి వదనంబు నెగాదిక జూచి, రూపురే
ఖా కమనీయ వైఖరులుగాంచి "భళీ! భళీ"
యున్నవాడె. "మీ
దేకుల" మన్న ప్రశ్న వెలయించి చివాలున లెచిన పోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర! వచింప
సిగ్గగున్' (నా కథ)

జాతీయతా విప్లవం :

కులమతాల కురుక్షేత్రంలో కూరుకుపోని జాతీయకవి, విశ్వమానవునిగా నిలపమని వేడుకోవడంలోని అంతర్యం అతనిలోని దేశభక్తి.

నేతాజి, బాబూజీలు మరణించినపుడు వారి సేవలను కొనియాడతూ వ్రాసిన స్మృతి వాక్యాలు ఇందుకు నిదర్శ నాలు.

సత్యాహింసలు రెండే
ముత్యాలసరాలు సకల పుణ్యంబులకున్
గత్యంతరములు ప్రేమ
వ్యత్యస్తములేని మోక్షపతి నేత్రంబుల్. (బాపూజీ)

సత్య, ఆహింసలు రెండు బాపూజీ నేత్రాలని పేర్కొనడంలో కవి సత్యదర్శనం నిరూపితమయింది.

'మనము బానినలము మనకును బానినల్, శాశ్వతముగ నిమ్నజాతి వారు
బానినీండ్ర క్రింద బానినలున్నచో, బలము ముమ్మరించు పాలకులకు' - బాపూజీ

దీన జనోద్ధరనకు గాంధీజీ అందించిన సందేశాన్ని భావగర్భిత వాక్యాలతో తెలియ చేశారు జాషువ.

గాంధీజీ విగ్రహములేని ఊరు, గ్రామం లేదనటం నిజం. దానితో సంతృప్తిపడకండి. అంటూ గాంధీ ఆశయాలను నెరవేర్చాలన్నాడు కవి.

'ప్రతిమల్ నెక్కి శిలాసహస్రముల నారాధించినన్ గాదు భా
రతదేశాన ననైక మత్యములు నీర్ష్యాద్వేషముల్ స్వార్థమున్
గతమై దోషపుజాఱలేని యొక సాక్షాత్ స్వర్గ మింపారినన్
బ్రతుకుంగ్రమ్మర శ్రీ సబర్మతి ముని బ్రహ్మంబు ముమ్మాటికిన్' (బాపూజి)

నేతాజీ మరణం నేటికీ వివాదస్పదమే. ధీరత్వం, పోరాట పటిమను చాటే నేతాజీ రక్తపుమరకల జీవితాన్ని ఆవిష్కరిస్తూ జాషువ వ్రాసిన ఖండకావ్యం జాతీయోద్యమానికి మలుపు.

తల్లిదండ్రుల, కవుల బాధ్యతలను గుర్తుచేసేదీ పద్యం.

'తలిదండ్రులెపుడు బిడ్డలకు నేర్పగరాదు కులగోత్రముల వారి గొప్పదనము
చదివింపగారాదు చదువులయ్యలు పాఠ శాలలలోన వర్ణాలగొడవ
రచియింపగారాదు రచయితల్ శాశ్వత దాస్యంబు నిలుపు కథానకములు
సలుపరాదెట్టి ప్రచారంబులీ దినం బమలు నందున్న కృత్రిమపు సంస్థ
లన్నదమ్ముల తనమున కడ్డువచ్చు
శబ్దజాండంబు సర్వంబు చావవలయు
స్వర్గ మఱచేతి యందూడి పడగవలయు
మోక్షరాజ్యంబు బొందితో పొందవలయు.

రాష్ట్రపూజ, నాగార్జునసాగర్, కొత్తలోకం వంటి ఖండ కావ్యాలలోని భావాలు కూడా జాతీయవిప్లవ గీతికలు.

'నవయుగకవి చక్రవర్తి'గా కీర్తిగడించిన జాషువ ఆలోచన సరళి, వెలయించిన కవితా ఖండికలు పఠితులలో ధైర్యాన్ని పోరాటతత్వాన్ని నింపుతాయి. ఆ భావాలున్నవి విప్లవ వాక్యాలలో. విప్లవమంటే అణచివేతను ఎదిరించటం. వెలివేతను ధిక్కరించటం. మనుషులుగా మసలే హక్కు, న్యాయంగా వారికి చెందవలసిన భాగం అందటం, దౌర్జన్యాలపై పోరాడటం... మొదలయిన అంశాలు.

ఈ అంశాలన్నీ పుష్కలంగా తన ఖండకావ్యాలలో అక్షర నిక్షిప్తం చేశారు జాషువ. అందుకే జాషువ ఓ విప్లవకవి.

ఆధార గ్రంథాలు :

1. కథానాయకుడు జాషువా - తెలుగు అకాడమి - హైదరాబాదు.
2. గాంధీ దర్శనము - ఉప్పలూరి వెంకట సుబ్బారావు - ఆదర్శ గ్రంథమండలి.
3. జాషువా కవిత్వము - అభ్యుదయ వేదిక - విజయవాడ.
4. జాషువా కృతుల సమాలోచన - డా॥ బి. భాస్కర చౌదరి.
5. జాషువా రచనలు - రెండవసంపుటం - శ్రీమతి హేమలతాలవణం.
6. మా నాన్నగారు - శ్రీమతి హేమలతాలవణం.

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళితవాద సాహిత్యం – తత్త్వ పరిశీలన

– డా॥. ఖి. చక్రవర్తి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

భారతీయ సమాజంలో బహుభాషా వ్యవహర్తలున్నట్లు గానే సమాజంలో కూడా ఎన్నో వైరుధ్యాలున్నాయి. మిగతా సమాజాల్లోలేని వర్ణం, కులం వాటి మధ్యవిభేదాలు భారతీయ సమాజానికున్న ప్రత్యేకత దీనివల్ల సమాజంలో సమానత్వం లేదు. కులాల మధ్య కాకుండా ఒక్కో కులం నుంచి పుట్టుకొచ్చిన శాఖోపశాఖల మధ్య కూడా ఎన్నో అంతరాలు.

రుగ్వేదం పదవమండలంలోని పురుషసూక్తంలో కుల విభజనకు సంబంధించిన శ్లోకం ఉంది. రామాయణంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే చాతుర్వర్ణ వ్యవస్థ గురించి ప్రస్తావన ఉంది. భారతంలో అవే అయిదు కులాలయ్యాయి. అంటే 'పంచములు' పేరులో మరో కులం తోడయింది. తర్వాత ఈ కులాలనుంచి ఎన్నో ఉపకులాలు విస్తరించాయి.

ఈ కులాలలో కనీస మానవులుగా గుర్తింపబడిన వాళ్లే పంచములు. వీళ్లు ఊరికి దూరంగా ఉంటూ అగ్రకులాల వాళ్ల అడుగులకు మడుగులొత్తుతూ వాళ్ల అవసరాలను తీరుస్తుంటారు. వాళ్ల చేత అస్పృశ్యులుగా భావించ బడుతుంటారు. నీచమైన వృత్తులన్నీ వీళ్లకు అంటగట్టింది సమాజం. ఈ స్థితికి పూర్వజన్మలో చవికున్న పాపమే కారణమని అభూత కల్పనలతో కూడిన కర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది. దీనివల్ల ఎన్నో తరాలుగా పంచములు ఊరికి దూరంగా ఉంటూ కాయకష్టంతో జీవిస్తూ, అవమానాల్ని భరిస్తూ బతుకులు వెళ్లదీస్తూ వచ్చారు.

సాంఘిక దోపిడీకి, అణచివేతకూ గురవుతూ, అస్పృశ్యులుగా పరిగణించబడుతూ అనాది నుంచి అవమానాల పాలవుతున్నవారు దళితులు. దళితుల జీవితం ఎప్పట్నుంచి ఉందో దళిత సాహిత్యం కూడా అప్పట్నుంచి ఉంది. ఎందుకంటే - ప్రపంచంలో ఏ సాహిత్యమైన ఆయా కాలాల్లోని పరిస్థితుల్ని బట్టి వెలువడుతుంది. అంటే ఆకాలం నాటి ప్రభావాలకు సాహిత్యంలోను కావాల్సిందే. అందుకే ఆయా కాలాల్లో వచ్చిన సాంఘిక సిద్ధాంతాలు, దృక్పథాలు, ఉద్యమాలు సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. భారత దేశంలో ఆధునిక దళిత ఉద్యమాలకు శ్రీకారం చుట్టినవాడు అంబేద్కర్. ఆయన ప్రభావంతో చాలామంది సాహితీ సృష్టి చేశారు. పత్రికల ద్వారా దళిత చైతన్యాన్ని ప్రజలకందించారు. అంటరాని తనాని నిరసిస్తూ సాహిత్య సృష్టి చేయడం చాలాకాలం ముందు మొదలైంది. కానీ ఉద్యమకారులైన వ్యక్తుల ప్రభావంతో దళితచైతన్యమే ప్రధానాశయంగా వెలువడిన సాహిత్యం దళిత సాహిత్యంగా గుర్తించబడింది. దళిత జీవిత వాస్తవికత నుండి దళిత వాదం పుడితే దళిత వాదం నుండి దళిత సాహిత్యం పుట్టింది అంటారు. ఆచార్య యస్.వి.సత్యనారాయణ. అంటరానితనం, సాంఘిక అణచివేత ఆర్థిక పీడన ఇవన్నీ దళిత వాస్తవికత.

దళితవాద ఉద్యమం గురించి తెలుసుకొనే ముందు దళితులెవరో తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందికదా! దళితులెవరు? అనే విషయంలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

1. అస్పృశ్యకులాలు మాత్రమే దళితులు
2. హరిజనులతోపాటు గిరిజనులూ దళితులే.
3. హరిజనులు, గిరిజనులతోపాటు వెనుకబడిన తరగతుల వాళ్లూ దళితులే.
4. హరిజనులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులతో పాటు మైనార్టీ వర్గం వాళ్లూ దళితులే.
5. పై నాలుగు రకాల వాళ్లతోపాటు స్త్రీలు కూడా దళితులే.

హరిజనులతోపాటు గిరిజనులూ దళితులే అన్నది కొందరి అభిప్రాయం కదా! గిరిజనులకు అస్పృశ్యతా జాఢ్యం అంటుకోలేదు. కానీ సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లోనూ అస్పృశ్యల కన్నా వెనకబడి ఉన్నారు. కాబట్టి దళిత పద పరిధిలో గిరిజనులను కూడా చేర్చడం సముచితమని వాళ్ల భావన. అలాగే తరతరాలుగా కులవృత్తులకు పరిమితమై దుర్భర జీవితాల్ని గడుపుతూ ఆర్థికంగా వెనుకబడి ఉండడమే కాకుండా సాంఘిక గౌరవాన్ని కూడా పొందలేక పోతున్నారు కాబట్టి వెనుక బడిన తరగతులు వాళ్లూ దళితులే అని మరి కొందరి అభిప్రాయం.

భారతదేశంలో ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు, మొదలైన మైనారిటీ వర్గంవాళ్లు హిందూమత ఆధిపత్యం క్రింద భయం నీడలో బతుకు వెళ్లదీస్తున్నారు. ఆత్మగౌరవం కోసం అట్టడుగు వర్గాల వాళ్లు క్రైస్తవంలాంటి మతాల్లోకి వలస వెళ్లారు. ఆ విధంగా మైనార్టీలోని ఎక్కువమంది క్రింది వర్గాల వాళ్లే కాబట్టి దళితులనడం సహేతకుమని కొందరి భావన. సమాజంలో వివక్షకు గురి అవుతున్న వాళ్లు ఎక్కువగా స్త్రీలే. అగ్రవర్ణాల స్త్రీలతో సహా స్త్రీలందరూ దళిత పరిధిలోకి చేరతారని కొందరి అభి ప్రాయం. కానీ ఈ వాదనకు అంతబలం లేదు. శాస్త్రవేత్తలు, పండితులు, విమర్శకులు, ఉద్యమకారులు దృష్టిలో దళితులంటే హరిజనులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారు, మైనారిటీ వర్గం వాళ్లు. సమాజంలో సాంఘికంగా, ఆర్థికంగా అణగదొక్కబడిన వాళ్లు వీరు. వీరే దళితులన్న విషయం అందరూ ఆమోదించినది.

దళితవాదం దళితులు పుట్టినప్పటి నుండి ఉంది అని అయితే నివురు గప్పిన నిప్పులాగా ఉండిపోయిందని దానికి కారణం అగ్రవర్ణాల వాళ్ల దౌర్జన్యమనీ వాళ్లు బలవంతంగా, అమానుషంగా దళితుల్ని అణగదొక్కుతూ వచ్చారని కొంతమంది అభిప్రాయం. ప్రాంతాలు, మతాలు, కులాలు, తెగలు వేరైనా దళితులు ఎదుర్కొం టున్న సమస్యలు ఒక్కటే. దళితవాదం ఉన్నపళంగా ఆకాశం నుంచి ఊడిపడలేదు. దీని పుట్టుకను వివరిస్తూ ఎండ్లూరి సుధాకర్ చెప్పిన మాటలు చూద్దాం "ఈ పుట్టుక వెనుక వేల సంవత్సరాల అణచివేతలు ఊకుమ్మడి ఊచకోతలు, మానసిక, శారీరక, సామాజిక పరమైన తొక్కివేతలూ చరిత్రలో సాక్ష్యాలుగా నిలుస్తాయి. తర తరాల భారతదేశ సామాజిక జాఢ్యాలనుంచి, అణచివేతల నుంచి, అణచుకున్న ఆవేదనల నుంచి ఆవేశాలనుంచి తమ హక్కుల్ని తమ స్థానాల్ని ఎలుగెత్తి ప్రశ్నిస్తూ ఎదురు తిరిగిన నూతన చైతన్యమే ఇప్పటి దళిత వాదానికి లేదా దళితోద్యమాలకి చారిత్రక భూమికగా నిర్ధారించవచ్చు.

ఎంతో కాలంగా గుండెలోతుల్లో అణగిమణి ఉన్న దళితుల బాధల బంధాలను కట్లు విప్పి పైకి లాగి సమాజం కళ్లముందుంచి ఇది మానవత్వమా? అని బలమైన గొంతుతో ప్రశ్నించిన అంబేద్కర్ తిరుగులేని పోరాటాన్ని ప్రకటించాడు. అదే దళితులు ఒకటి కావడానికి దారితీసింది. జాతీయోద్యమ స్ఫూర్తితో గాంధీ చేపట్టిన నిర్మాణాత్మక కార్యక్రమాల్లో అస్పృశ్యతా నిర్మూలన ప్రధానమైంది. ఇవి రెండూ దళితుల్ని ఉద్యమ రూపంలో ముందుకు నడిపించింది. అటువంటి సందర్భంలో దళిత సాహిత్య రూపంలోకొందరు ఉద్యమానికి ఊపిరి ఊదారు.

భారతదేశంలో దళిత ఉద్యమం అత్యంత ప్రాచీన మైనది. సుదీర్ఘమైన చరిత్ర కలిగినది. హిందూమతవాద తత్వం మీద, దాని అనుసరించి వచ్చిన సాంఘిక అసమానతల మీద దాడి చేయడం క్రీస్తు పూర్వమే మొదలయింది. ఆ తరహాలో దాడి చేసిన ప్రధాన ఉద్యమాలు దళిత ఉద్యమానికి గట్టిపునాదులు వేశాయి అవి.

బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం లాంటి మతాల తత్వాన్ని జ్యోతిబాపూలే, కబీరుల వంటి వ్యక్తుల భావాల్ని సంపూర్ణంగా అర్థంచేసుకొని ఆ దారిలో నడిచిన వ్యక్తి అంబేద్కర్. ఆయన ఆలోచనలు దళితవాదానికి జీవం.

ఆయన సామాజికంగా దళితులు ఎదగడానికి, సాంఘిక గౌరవాన్ని పొందడానికి, ఆర్థిక పురోగతిని సాధించడానికి, ఆత్మ గౌరవాన్ని పెంపొందించుకోవడానికి సంపూర్ణ విద్యను అందుపుచ్చుకోవడానికి, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో రాణించడానికి ఇంకా దళితులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యల నుంచి బయట పడడానికి కావలసిన ప్రణాళికల్ని రూపొందించాడు.

అంబేద్కర్ దళితులు ఏ ఉద్యమాన్ని ఎలా నడపాలో చెప్పాడు. వాటిలోని లోటుపాట్లను పరిశీలించాడు. ఆయన సిద్ధాంతాలే దళిత సాహిత్య సిద్ధాంతాలుగా పేరుపొందాయి. 'విద్యావంతుల్ని చేయండి, సంఘటిత పర్చండి, ఆందోళన జరపండి' అన్నది అంబేద్కర్ త్రిసూత్ర పథకం. దళిత సమస్యల్ని అధికమించడానికి ఉపకరించే సూత్రాలివి. దళిత ఉద్యమానికి అసలైన పునాది వేసిన మహనీయుడు అంబేద్కర్.

ప్రాచీన కాలం నుంచి భారతీయ సాహిత్యంలో ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో వర్ణవ్యవస్థను నిరసించిన కవులు లేకపోలేదు. అయితే అది భక్తిమార్గం లోను, తాత్విక దృక్పథంలోనూ జరిగింది. 16 శతాబ్దంలోనే శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద' కావ్యంలోని మాలదాసరి కథ మనందరికీ తెలిసిందే. తెలుగులో వేమన, బ్రహ్మంగారు, అన్నమయ్య అంటరానితనాన్ని నిరసించారు.

"మాల మాలగాడు మహిమీద నే ప్రొద్దు
మాట తిరుగువాడు మాలగాక
వాని మాలయన్న వాడెపొ పెనుమాల
విశ్వదాభిరామ వినురవేమ" అన్నాడు వేమన.

కులం కంటె గుణం మిన్న అని, మాట తప్పినవాడు మా అని వేమన అభిప్రాయం.

"పంచముడని నిను కించపరచిరని బాధపడకురా కక్కా

పంచ భూతాలకు లేని అంటు ఈ మనుషలకేలర కక్కా' అని ప్రశ్నిస్తాడు వీరబ్రహ్మం.

ఆధునిక యుగంలో సంఘసంస్కరణోద్యమం మొదలు కాకముందే తెలుగులో అంటరానితనాన్ని, నిరసిస్తూ రాసిన కవిత్వం కన్పిస్తుంది. అది 1909లో భాద్రపదమాసం ఆంధ్రపత్రికలో 'మాలవాండ్రపాట' అనే పేరుతో అచ్చయింది. అయితే దానికర్త ఎవరో తెలియదు. ఆ పాట చూడండి.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి
అందారు ఒక్కటై ఉందారి సక్కంగ
అమ్మోరు దీవించి అయిశర్యమిచ్చాను'

కులనిర్మూలన గురించి ఈ పాటలో గొప్పగా చెప్పడింది.

1910లో 'లవణరాజు కల' అనే గేయాన్ని గురజాడ రాశాడు. అందులో

"మలిన దేహుల మాలలనుచు
మలిన చిత్తుల కధిక కులముల
వెల వొసంగిన వర్ణధర్మ
మధర్మ ధర్మంబె' అని అస్పృశ్యతను నిరసించాడు.

"మంచి యన్నది మనుజులందున
యెంచి చూడగ రెండు కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనేనగుదున్" అంటాడాయన. ఆ తర్వాత ఎందరో కవులు ఆ మార్గాన్ని అనుసరించారు. 1915లో మంగిపూడి వెంకటశర్మ అస్పృశ్యతను నిరసిస్తూ 'నిరుద్ధ భారతం' అనే పద్యకావ్యాన్ని రాశాడు.

"జాతి వెన్నెముక యనందగు నంత్య జాతులను
సంఘమునకు దూరము చేసి
మనకు కాని వారిగ జేసి కొనుట కన్న
యాత్మ హత్య వేరొండు లేదు" అంటే తోటి మానవులను సమాజానికి దూరంగా తరిమివేయడం సాంఘిక ధర్మమవుతుందా? అని ప్రశ్నిస్తాడు.

బసవరాజు అప్పారావు 'మాల మాదిగల మొఱ' అనే గేయంలో హరిజనుల హృదయ విదవారకమైన బాధను

చిత్రించాడు. గాంధీ మహాత్ముని రక్షించమని మొరపెట్టుకోవడం ఈ గేయంలో కనిపిస్తుంది.

"సరకారు వోరు - కరుకైన వారు
ఉప్పేరితేను - తప్పేసి నోరు
డబ్బుగలోరు - దరికిరానీరు
ఈ గోరమేమి - మానేరమేమి
మాల మాదిగలం - మనుషులంగామా
కుక్కలకన్నా - తక్కువయ్యామా"

ప్రారంభంలో వెలువడిన దళిత కవిత్వాన్ని ఎక్కువగా దళితేతరులు, సంఘసంస్కర్తలు దళితులు అనుభవిస్తున్న బాధలను చూసి, భరిస్తున్న అవమానాలను చూసి సానుభూతితో సృష్టించారని చెప్పవచ్చు.

ఆధునిక దళిత కవిత్వం :

ఆధునిక సాహిత్య రంగంలో ప్రాచీన సాహిత్యం కంటే భిన్నమైన మార్పులు చోటు చేసుకున్న విషయం అందరికీ స్పష్టంగా తెలిసిన విషయమే. కవిత్వంలో ఎన్నో ధోరణులు చోటు చేసుకున్న విషయం కూడా తెలిసిందే. ఎన్నో ఏండ్లుగా రకరకాలుగా దోపిడీకి గురవుతూ వచ్చిన దళితుల గుండెల్లో అణగారిన భావాలు ఉప్పెనలాగా దళిత కవితా రూపంలో పెల్లుబికి వచ్చింది. అంటరాని తనం అక్షరాలు నేర్చుకున్న నేపథ్యంలో వాళ్ల ఆర్తినీ, ఆవేదననీ, ఆక్రోశాన్ని కవితా రూపంలో వ్యక్తం చేసింది.

గాంధీ రంగప్రవేశంలో జాతీయోద్యమం వేడెక్కింది. దాంతోపాటు అస్పృశ్యతా నిరననను గాంధీ ఒక ఉద్యమం లాగా ప్రచారం చేశాడు. పంచములకు 'హరిజనులు' అని పేరు పెట్టాడు. ఆ సమయంలో అస్పృశ్యతను నిరసిస్తూ ఎంతో మంది కావ్యాలు రాశారు.

జాతీయ కవిగా ప్రసిద్ధిచెందిన గరిమెళ్ళ నత్య నారాయణ 'మా కొద్దీ తెల్ల దొరతనం' గేయంలో

"అంటూ దోషము మాకులేదండీ
పాపమంటూ చాటుదాము రండి" అంటూ రాసిన గేయం చాలా ప్రసిద్ధి పొందింది. 1926లో అయన రాసిన ఖండకావ్యంలో అస్పృశ్యత పేరుతో పంచములను హింసించడం, దూరం పెట్టడం పట్ల ఆవేదన వ్యక్తమవుతుంది. ఇంతవరకూ దళితులు హరిజనుల పక్షాన రాస్తే తర్వాత దళితులు రంగ ప్రవేశం చేసి తమ సమస్యలను కవిత్వంలో వ్యక్తం చేయడం మొదలుపెట్టారు.

గుర్రం జాషువా, కుసుమ ధర్మకవి, జాలా రంగసామి, నక్కా చినవెంకయ్య, బోయి భీమన్న, కొలకలూరి ఇనాక్ వంటి వారు తమ పదునైన పదజాలంతో అస్పృశ్యతా సమస్యను ఎండగట్టారు.

గుర్రం జాషువా :

జాషువా గబ్బిలం అనాధ, స్మశానవాటి వంటి ఖండకావ్యాల్లో అస్పృశ్యత భావాన్ని దాని సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కరించడాఉ. ఒక రైలు ప్రయాణంలో కులపరంగా తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఎంతో ఆవేదనతో వ్యక్తం చేశాడు. తన కవిత్వాన్ని 'భళి భళి' అని మెచ్చుకున్నవాడే 'నీదేకులమని' ప్రశ్న వేసి చెప్పగానే చివుక్కున లేచిపోవడాన్ని చాచి బాకుతో గుచ్చినట్ల యిందని బాధపడతాడు. అలాంటి దళితున్ని చూసి 'కసరి బుసకొట్టు నాల్గు పడగల హైందవ నాగరాజు అని వర్ణ వ్యవస్థ క్రూరత్వాన్ని వెల్లడిస్తాడు.

'ముసలి వాడైన బ్రహ్మకు బుట్టినారు
నల్వురు కుమారులను మాట విన్నముగాని
పసరముకన్న హీనుడభాగ్యుడైన
ఐదవ కులస్తుడెవరమ్మ సవిత్రి' అని పంచమ వర్గం పుట్టుక గురించి ప్రశ్నిస్తాడు జాషువా.

కుసుమ ధర్మన్న :

'మా కొద్దీ నల్లదొరతనం' అనే గేయంలోనూ, హరిజన శతకంలోనూ దయనీయమైన హరిజనుల కడగండ్లను, ఆవిష్కరించాడు. అంబేద్కర్ భావజాలంతో కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల్ని బ్రాహ్మణ వాదంలోని కుట్రని నిశితంగా విమర్శించాడు.

"శాస్త్రాలు వేదాలు చదివినట్టి

గొప్ప శాస్త్రాలమని చెపుతారు

మమ్ము మాల మాలను మాట
మామూలు దప్పార
మా కొద్దీ నల్ల దొరతనం
మాకు పది మందితోపాటు

పరువు గలగకయున్న''అంటూ విద్యావంతులుగా, జ్ఞానవంతులుగా చెలామణి అవుతూ పక్షపాత దృష్టితో మానవత్వాన్ని మరిచి ప్రవర్తించే వారిపై కవితా కొరడాలు ఝళిపించాడు.

''స్వతంత్ర పాలన జేసెద మంటారా
చెంతాకు మమ్ము చేరనీరు
శర్మగారిని శరణన్న లేదు
గుప్త గారిని గురవన్నలేదు
కాపుకరణాలకు కరుణలేదు దేవ
వర్మాలకు మేము దుర్మార్గులమంట'' అంటూ మిగిలిన వర్గాల వాళ్లు పంచముల పట్ల నిర్దయంగా వ్యవహరించడం అన్యాయమంటాడు. దళితవాదాన్ని ప్రచారం చేయడానికి ఈయన 'జయభేరి' పత్రికను స్థాపించాడు.

బోయి భీమన్న :

పద్మశ్రీ బోయి భీమన్న కుల వ్యవస్థను, దానికి కారణ భూతమైన పురాణాల్ని, దేవుడి పేరుతో జరిగే దోపిడీని, బ్రాహ్మణ వ్యవస్థను తీవ్రంగా ఖండించాడు. 'గుడిసెలు కాలిపోతునై, కవితా సంపుటి అంబేద్కర్ ఆశయాలకు అద్దం పట్టేదే.

''ఎంత కాలం గొర్రెగా వుంటావె జనతా
సింహమై తిరగబడి రాక్షస వధ చెయ్యి
నతులతో నినాదాలతో ఊరుగుతున్న
ఈ వేషగాళ్ళు వట్టి మహిషాసురులే కాదు
మేకతోలు కప్పుకున్న వాతావులు కూడా'' అంటూ సింహాలై తిరగబడండని తిరుగుబాటకు పురికొల్పుతాడు.

'కూలగొట్టుడు కులమత కుటిలతలను' అని ప్రేరేపిస్తాడు. సాంఘిక సమానత్వాన్ని కాంక్షిస్తూ 'చదువులేని వాడు సంస్కార హీనుడు' అంటూ దళితుడు వివేక వంతుడై తన తెలివిని ప్రదర్శిస్తే ఎవరికీ తీసిపోడని హెచ్చరిస్తాడు. వీళ్లందరూ వర్ణపోరాట కవులైతే కొంతమంది వర్గపోరాటానికి పూనుకున్నారు. వాళ్లు.....

సుబ్బారావు పాణిగ్రాహి :

వర్ణ పోరాటాన్ని వర్గ పోరాటంలో భాగంగా ప్రబోధిస్తున్న దళిత కవుల్లో సుబ్బారావు పాణిగ్రాహి ఒకడు. ఇతడు విప్లవ పోరాటకవి. కార్మికులు, కర్షకులు, గిరిజనులు, హరిజనులు, పీడితులు, తాడితులు ఇతని కవిత్వంలో కనిపిస్తారు.

''కొండల పక్కన బండలు కొట్టే
గిరిజనుడా ఇటు రావయ్యా
----------'' అని పిలిచి ఎర్రజెండా, జనత మేలుకొన్నది, మేలుకో, తూర్పు జెండా మొదలైన గేయాల ద్వారా ఆదివాసి ప్రజలను మేల్కొలిపే ప్రయత్నం చేశాడు.

శివసాగర్ :

వర్ణపోరాటాన్ని వేడెక్కించిన కవి శివసాగార్. 'ఓ విలుకాడా' గేయాన్ని గిరిజనులను సంఘిటత పరిచి పాటలల్లాడు.

''తోటరాముని తొడకు కాటా తగిలిందని
చిలుక చీటీ చెప్పెరా! ఓ విలుకాడా
వైనా మతలబు చేసెరా!'' అని గిరిజనుల వాతావరణాన్ని గ్రహించి రచన చేస్తాడు. నరుడో భాస్కరుడా, నా చెల్లీ చెంద్రమ్మా, నేల తల్లి చెరను విడిపింపగ మొదలైన శివసాగర్ గీతాలు దళిత ఉద్యమ గీతాలకు దిక్సూచులయ్యాయి. అంటాడు ఎస్వీ సత్య నారాయణ.

దళిత కవిత్వం పురాణ పాత్రల్ని తిరస్కరిస్తుంది. తన జాతికి ద్రోహం చేసిన శక్తులమీద ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తుంది. ఇందుకు చక్కని ఉదాహరణ శివసాగర్

రచించిన 'నడుస్తున్న చరిత్ర' అనే కవిత. అందులో ప్రతీకారం ప్రతిధ్వనిస్తుంది.

"శంభూకుడు పెదాల మీద చిరునవ్వుతో - రామున్ని వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలును - గొడ్డలితో నరుకుతున్నాడు
బలి తన చిరు పాదాలలో వామనున్ని - పాతాళానికి తొక్కేస్తున్నాడు
మనువు కళ్ళలో సూదులు గుచ్చుకొని - నాలిక తెగ్గోసుకొని
చెవిలో సీసం పోసుకొని - స్మశానంలో దొర్లాడుతున్నాడు
కాలం కసాయి కత్తిమీద నిలబడి గర్జిస్తున్న చండాలుడు
శంకరునిపై నాలుగు వేటకుక్కల్ని ఉసిగొల్పుతున్నాడు
ఇప్పుడు నడుస్తున్న చరిత్ర పరమ చండాల చరిత్ర".

గద్దర్ :

స్థిర చిత్తంలో, బలమైన గొంతుతో దళితులున్న పక్షాన నిలబడి సమాజాన్ని ఎదిరించిన కవి గద్దర్.

"బంగారు పంటలిచ్చె - భారత గడ్డమనది
గంగమ్మ ప్రవహించే - పుణ్యభూమిరా మనది

మాల మాదిగన్నలకే మంచి నీళ్లు కరవాయె
యాలరో ఈ మాదిగ బతుకు' అనే గేయంలో శ్రమ జీవులైన దళితులకు ఆ సంపదలపై ఎలాంటి అధికారం లేకపోవడాన్ని నిరసిస్తాడు.

దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తూ అభ్యుదయ రచయితలు రాసిన గీతాలు 'ఉప్పెన' అనే గ్రంథంలో సంకలనం చేయబడ్డాయి. అంబేద్కర్ సిద్ధాంతాలను, మార్క్స్ సిద్ధాంతాల్ని మిళితం చేసి సామాజికార్థిక పోరాటం వల్ల దళితులకు న్యాయం జరుగుతుందని కత్తి పద్మారావు, మాస్టార్జీ కవితలు రాశారు. కత్తిపద్మారావు రాసిన జనగీతం, దేశం డైరీ వంటి కవితా సంపుటాలు దళిత చైతన్యాన్ని మేల్కొలిపేవిగా ఉన్నాయి. దళితగీతాల రచనలో ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్న యువ రచయిత మాస్టార్జీ రాసిన గీతాలు 'దళిత గీతాలు' పేరుతో ప్రచురితమైనాయి.

"కుల హీనుడవని నిన్ను - వెలివేసిన వాళ్ళనూ
తమ ఊర్పుకు మన దళితుల - బలిజేసిన వాళ్ళనూ
కండ కండ కాల్చేసి - గుండెలల్ల తూట దించ
రండిరో దళితన్నా - రైఫిల్ బట్టండి
ఉగ్రరూప మెత్తండి' - అంటూ పోరాటానికి పిలుపు నిస్తాడయన.

దళిత కవిత ఒక జాతివేదన. తరతరాల బాధల్లోంచి, వేదనల్లోంచిపుట్టింది. తిరుగుబాటు తత్వాన్ని బోధించింది. అన్యాయాలను అగ్రహంతో ఎదుర్కొనే ప్రయత్నం చేసింది. అనుభవం నుంచి పుట్టింది కావడంవల్ల వాస్తవిక విలువను సంతరించుకుంది. వర్ణవ్యవస్థలో పతనమై పోయిన సమాజాన్ని నిటారుగా నిలబెట్టే ప్రయత్నం చేసింది.

దళితులు రాసిన కవిత్వమే దళిత కవిత్వమని చాలా మంది భావన. 1981లో ఢిల్లీలో జరిగిన భారతీయ దళిత సమాచార పత్రిక సంపాదకుల సమ్మేళనంలో దళిత పత్రికలలోని ప్రతిపేజీ దళితుల రచనలకే కేటాయించాలని తీసుకున్న నిర్ణయం దీనికి బలం చేకూర్చింది.

దళిత కవిత్వంలో ఊహలుండవు. వృథా అనుభూతులుండవు. దళిత కవిత వాస్తవికతతో జీవిస్తుంది. తన పేదరికాన్ని, తన అస్తిత్వాన్ని, తన అవమానాల్ని, నిస్సహాయతల్ని నిర్భయంగా చెబుతుందన్నది వాళ్ల వాదన. అందులో నిజం లేకపోలేదు. దళితులు మాత్రమే దళిత జీవితం గురించి, వారి సమస్యల గురించి మంచి దళిత కవిత్వం రాయగలరు అనడంలో సందేహం లేదు. ఎవరి కోసమైతే పోరాడుతున్నామో వాళ్లే చైతన్యవంతులై తమ సమస్యల్ని తామే పరిష్కరించుకొనే దిశగా కవిత్వం సృష్టిస్తే అదే దళిత కవిత్వంకాదు. వాళ్ల అనుభవాన్ని, అనుభూతిని రంగరించి రాసిందే దళిత కవిత్వం. అయితే ఇక్కడ

గమనించాల్సిన అంశం ఒకటుంది. జాషువా, బోయిభీమన్న తమది దళిత సాహిత్యమని చెప్పుకోలేదు. ప్రధాన కవితా ప్రవాహంలో భాగంగానే అది చోటు చేసుకుంది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య, జి., నవ్య పరిశోధక ప్రచురణ, తిరుపతి.
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1998 శాస్త్రి, ద్వానా, ప్రతిభా పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021, సిమ్మన్న, వెలమల, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, విజయవాడ.
4. తెలుగు సాహిత్య చరిత్ర, 1996, శ్రీరామమూర్తి, కొర్లపాటి, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
5. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగాలు, 2015, నారాయణ రెడ్డి, సి., విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
6. సమగ్రాంధ్ర సాహిత్యం, 2013, ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పల్లిపట్టు నాగరాజు కవిత్వం – దళిత సాహిత్య తత్త్వం

– డా॥. యం. ఆదిశేషయ్య, గెస్ట్ ఫ్యాకల్టీ, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

కష్టాలే తెలిసినవాడు
తరాలుగా కార్చుతున్న కన్నీళ్ళకు
సరికొత్త భాషను నేర్పుతున్నవాడు
అక్షరాల మీద అంబారీ ఎక్కి
వాడవాడలో చూపుడు వేలై చేరుతున్నవాడు
సమయం లేదు, ఇకనైనా కదలండని
మేల్కొలుపు కవిత్వమై నడుస్తున్నవాడు
అతడే
ఈ మట్టి సంతకం పల్లిపట్టు!

- కవి యాకూబ్

దళిత జీవిత నేపథ్యం నుంచీ ఎదిగి వచ్చిన పల్లిపట్టు నాగరాజు అనివార్యంగా దళిత జీవిత తాత్త్వికతను కవిత్వంగా మలిచాడు. ఉన్నత విద్యావంతుడు అయినా, ఉన్నత విద్యావంతులకు మాత్రమే అర్థమయ్యే కవిత్వం రాయలేదు. దళితుల గురించి పల్లిపట్టు నాగరాజు రాసిన కవిత్వం, మారుమూల దళితవాడకు వెళ్ళి చదవి వినిపిస్తే చక్కగా అర్థం చేసుకోగలుగుతారు. ఇది అనేక మంది తెలుగు, దళిత కవుల్లో పల్లిపట్టు నాగరాజు ప్రత్యేకత.

తెలుగులో దళిత కవిత్వం రాసిన జాషువా, శివసాగర్, ఎండ్లూరి సుధాకర్, కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్‌బాబు, నూకతోటి రవికుమార్, నాగప్పగారి సుందర్రాజు, తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ వంటి వారు ఏర్పరిచిన తాత్త్విక భావనను పల్లిపట్టు నాగరాజు తన కవిత్వం ద్వారా విస్తృతం చేశారు. దళిత జీవితంలో కనిపించే వివక్ష మూలాలను పట్టుకున్నాడు. అందుకే, దళిత సమూహానికి వ్యతిరేకంగా ఉండే శక్తుల పట్ల గురిపెట్టి కవిత్వాన్ని ఎక్కుపెట్టారు. 2020 లో వెలువడిన 'యాలై పూడ్సింది' కవితా సంపుటి నిండా ఈ బాధలూ, ఈ భావనలే కనిపిస్తాయి.

చిత్తూరు జిల్లా సత్యవేడు మండలం మిట్టిండ్లు వీరి స్వగ్రామం. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో 'తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ కవిత్వం' పై పీహెచ్.డీ చేస్తూ ఉన్నారు. కుప్పం సమీపంలో గల శాంతిపురం మండలం 64-పెద్దూరు హైస్కూల్‌లో తెలుగు పంతులుగానూ ఉన్నారు. 2020 లో పల్లెపట్టు నాగరాజు రాసిన 'యాలై పూడ్సింది' కవితా సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డుతో పాటు గతంలో ఉమ్మడిశెట్టి కవితా పురస్కారం వంటి అనేక పురస్కారాలను కూడా పల్లిపట్టు స్వీకరించి ఉన్నారు. కవిత్వ రంగంలో ఇంకా ఎంతో ఉన్నత భవిష్యత్తు గల పల్లిపటునాగరాజు కవిత్వంలోని 'దళిత తాత్త్వికత' ను పరిశీలిద్దాం.

'మా ఇళ్ళు అద్దాల మేడలు కాకపోవచ్చు
మా ఇళ్ళు బలిసిన బల్బులై వెలగకపోవచ్చు
మా మూలుగులున్నాయి
మా ఆకటి నిప్పులున్నాయ్
మా ఏడ్పులున్నాయ్
మా వేదనలున్నాయ్
ఏవో అమానవీయ గాలులు వీస్తున్నప్పుడల్లా
రగలిపోతున్న ఆత్మాభిమాన పొయ్యిలున్నాయ్'

దళిత వాడల్లో అద్దాల మేడలు, పెద్ద పెద్ద బల్బులు ఉండచ్చు. ఉండకపోవచ్చు. ఇళ్ళు అనేది మనిషి నివాస అవసరం. ఇది తప్పనిసరిగా అవసరం కూడా. అయితే, చిన్నదో, పెద్దదో ఏదో ఒకటి తప్పనిసరిగా ఉండాల్సిందే. దళితులకు ఇళ్ళూ, భూములు వంటి ఆసరా లేని తనాన్ని ఇక్కడ ప్రస్తావించారు. అంటే, ఇంకా ఇవన్నీ దళితులకు దక్కని పరిస్థితిని కవిత్వం చేశారు. ఆకలి గురించి తెలిసిన వాడే, తన లాంటి ఆకలి జీవులను గుర్తిస్తాడనేది చారిత్రక

సత్యం. అందుకే ఆకటి నిప్పులు, ఏడ్పులు, వేదనలను గుర్తించి అక్షర బద్ధం చేశారు. దళిత ఉద్యమం 'ఆత్మ గౌరవం' అనే అంశం పునాదిగా ఏర్పడింది. మాకూ మానం ఉంది అని గుర్తించినవాడే దళిత ఉద్యమ అవసరాన్ని గుర్తిస్తాడు. ఉద్యమాన్ని నిర్మిస్తాడు. ఇలా పల్లిపట్టు నాగరాజు కవిత్వం కూడా ఆత్మభిమానంతో రగిలి పోతూ ఉంది.

'కల్లో కూడా
మమ్మల్ని అవులే తరుముతుండాయి
మమ్మల్ని అవులే కుమ్ముతున్నాయి
అవు కొమ్మలకు వేలాడుతున్న
పీనుగులా వుండాది నా వాడతల్లి'

ఆవు ఒక జీవి. అది జీవుల్లోకి అత్యంత పవిత్రమైనది. దీనిని ఎవ్వరూ కాదనరు. కానీ, మనుషుల చుట్టూ కాకుండా, ఆవు చుట్టూ వివాదం రేగడం పట్ల కవిగా పల్లిపట్టు నాగరాజు స్పందించారు. ఆవును కొట్టారనో, చంపారనో, ఆవు మాంసం తిన్నారనే నెపంతో దళితుల పైన, దళిత కుటుంబాలపైన దాడులు చేయడం, చంపడం దాకా వివాదం నడిచింది. ఇలాంటి పరిస్థితులను తన కవిత్వం ద్వారా పల్లిపట్టు నాగరాజు కవిగా నిరసించాడు. ఇది అన్యాయమని స్పష్టం చేశాడు. ఆవు అని వినబడితే భయపడే పరిస్థితులు ఏర్పడిన వైనాన్ని కవిత్వంలోకి తీసుకొచ్చారు. నిజ జీవితంలోనే కాదు, కలలో కూడా తమను అంటే దళితులను ఆవులు తరుముతున్నట్టూ, కుమ్ముతున్నట్టూ ఉందని వాపోయాడు. దీనిని బట్టి ఆవు పేరుతో సాగుతున్న దాడులను అక్షరీకరించారు. ఆవులు కాదు, ఆవు పేరుతో మనుషులపై మనుషులు చేస్తున్న అమానవీయ దాడులను కవిత్వంతో కవి పల్లిపట్టు నాగరాజు ఖండించారు. 'ఆవు కొమ్మలకు వేలాడుతున్న పీనుగులా ఉంది, నా వాడతల్లి' అనడం ద్వారా ఆవు పేరుతో జరుగుతున్న తంతులో దళితుల జీవితం ఎంత అభద్రతలోకి వెళ్ళిందో ఈ కవితల ద్వారా వివరించే ప్రయత్నం చేశారు.

గ్రామీణ జీవితంలో కుల, మత ప్రభావాలు ఉండవని కాదు. కానీ, అంతకంటే ఉన్నతంగా మనుషుల మధ్య సున్నిత, మానవీయ సంబంధాలు కనిపిస్తాయి. కవి పల్లిపట్టు స్వీయ జీవితంలోని అనుభవాన్నీ, జ్ఞాపకాలనూ కవిత్వంలోకి ప్రవేశ పెట్టారు.

'మొన్నా మధ్య
చేపల పాపత్త అగుపించింది
దూదిచెట్టులా నెరిసిపోయిన జుట్టు
పిసంగి పైరులా గాలికి వంగిపోయి నడుస్తూ
కలబెడితే సట్లో నెంటకాయలు కుసాకుసా కదిల్నట్టు
కన్నీళ్ళతో కందిపోయే చేపల పాపత్తతో
మొన్న ఇంటికెళ్ళినప్పుడు మాట్లాడాను'

ఈ కవితా పాదాలను బట్టి ఒక విషయాన్ని మనం గుర్తించవలసి ఉంటుంది. దళితులంటే ఆవును చంపడం, తినడం అన్నట్టు భావించే స్థితి నుంచీ మనుషుల పట్ల ఎంతటి ప్రేమానురాగాలను కనభరుస్తారనేది ఈ కవిత ద్వారా అర్థమవుతూ ఉంది. మనుషుల మధ్య మలినం లేని మానవీయ పరిమళాన్ని వెదజల్లారు.

'రుక్కత్త గురించి చెబటమంటే
మురికిలేని మనసు గురించి చెబటమే
రుక్కత్త గురించి రాయటమంటే
ఇంటిని బుజాలపై మోసీ మోసీ
ఒంటరిగా మిగిలిపోయిన దు:ఖ కావ్యాన్ని సదవటమే'
'నేను నలుపు తోలోడ్నో
నలిగిన గుడ్డలోడ్నే
నా ఇంటి ముందర వీరబాగోతమేందబ్బా
నేను నంజరే తింటానో
గెంజి నీళ్లే తాగతానో
నా కూటికుండ కాడ నోటి కవణం కాడ
ఎవడి కలుకుతనమో ఏందయ్యా
నన్ను వారగొట్టినోల్లెవరూ

మా వాకిట్లోకి రావొద్దు మా కొట్టంలోకి దూరొద్దు
మా గొడ్ల పెంట తీసే
పొరక్కట్టకి అంటురోగం అంటుకుంటాదేమో'

దళితుల తిండి, తీర్థంపైన పరిశీలనలు, అంక్షలు, అణిచివేత నుంచీ హత్యల వరకూ వ్యవహారం నడుస్తూ ఉంది. దళితుల జీవితం 75 ఏళ్ళ స్వాతంత్ర్య దేశంలో ఇప్పటికీ మార్పు చెందలేదు. వారకి కనీసం తిండి, గుడ్డ, నివాసం, జీవనోపాధి, భూమి, విద్య, ఆరోగ్యం వంటి సమస్యలను ఏ మాత్రం తీర్చలేదు. సరికదా, దళితులు వారింట్లో, వారి పాత్రల్లో ఏం వండుకోవాలో, ఏం తినాలో నిర్ణయించే భావజాలాన్ని కవిగా పల్లిపట్టు నాగరాజు తిరస్కరించాడు. నేనేం ఏం తింటానో, ఏం తాగుతానో, మా దగ్గర మీ ఆధిపత్యం ఏమిటని ప్రశిస్తున్నాడు. ఇన్నాళ్ళూ కులం పేరుతో మమ్మల్ని మనుషులకూ, ఊరికీ, అవకాశాలకూ, అధికారానికీ దూరం పెట్టిన మీరు మా దగ్గరికి రాకండి అంటూ ఆజ్ఞాపించాడు. ఇన్నాళ్ళు మలిన దేహులు అంటూ తమను అంటని వారు, ఏ పేరుతోనూ తమ వద్దకు వస్తే తమ గొడ్ల పెంట పరకకు కూడా అంటురోగం వస్తుందని చెప్పడం ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేయడమే కాదు, దళిత ఆత్మ గౌరవాన్ని పెంపొందించడం కూడా అనిపిస్తుంది. అలాగే,

'వధను గురించి మాట్లాడే ముందు
వ్యధను గురించి మాట్లాడాలి
వధ వంకన మృగాలు చేస్తున్న వేల వేల వధల గురించి
మైకులు విరవకుండా మాట్లాడాలి
జంతువు గురించి మాట్లాడే ముందు
మనిషిని గురించి మాట్లాడాలి'

పశువుల గురించి మాట్లాడే ముందు మనుషుల గురించి మాట్లాడమని ఈ కవితలో నిలదీశాడు. కవిగానే కాదు, మనిషిగా తనలోని మానవత్వాన్ని కవి పల్లిపట్టు నాగరాజు ఈ కవితలో ప్రదర్శించాడు.

దేశంలో దళిత ఉద్యమం అనేక ఎత్తు పల్లాలను చూసింది. రాజ్యాధికారం అనే బరువైన మాటను పక్కన పెడితే, కనీసం దళిత ఉద్యమం రాజ్యాధికారాన్ని సాధించే మార్గంలో ఏ మాత్రమూ ముందుకు నడవని స్థితిని కవిగా నాగరాజు పసిగట్టాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నుంచీ కాన్షీరాం, మాయావతి, కెజి సత్యమూర్తి, గద్దర్, బొజ్జా తారకం, కత్తి పద్మారావు, మందకృష్ణ మాదిగ వంటి ఎందరో మహనీయులు దళిత ఉద్యమాన్ని నిర్మించారు. అయితే, రాజ్యాధికారం కోసం ఇంకా ఎడతెగని ప్రయాణం సాగుతున్న పరిస్థితిని ఒక్కటే కాదు, వర్తమానంలో దళిత సమూహాన్ని ముందుకు నడిపే నాయకత్వ లోపాన్ని కూడా కవిగా పల్లిపట్టు నాగరాజు గుర్తించారు. ప్రస్తుతం దళిత జీవితంలో మరింత సంక్లిష్టత ఏర్పడిన పరిస్థితుల్లో దళిత ఉద్యమానికి అంకితమై, నీలి జెండాలా రెపరెపలాడే చైతన్య జ్వాల గల నాయకుడు అత్యవసరం అని పల్లిపట్టు నాగరాజు కవిత్వం ధ్వనింప చేస్తూ ఉంది.

'ఎవరైనా ఈ దారెమ్మటి నడిచొస్తే బాగుండు
దారిని కలగనేవాళ్ళు
దారిని నమ్ముకున్నవాళ్ళు
దారి ఆశయానికి ఆయువు పోసేటోళ్ళు
దారిని దారిద్ర్యం నుంచి రక్షించుకునేందుకు
ఎవరైనా ఎవరైనా
భీమ్ రాగంలో పూలే పాట పాడుకుంటూ
దారిని నీలి జెండా చేసి ఆకాశం నిండా ఎగరేస్తూ'

తానూ, తన కుటుంబమూ, తన ఊరు, తాను పని చేస్తున్న పాఠశాల, తనను ప్రభావితం చేసిన సాహిత్య ప్రపంచమూ వీటి మధ్యే కవిగా పల్లిపట్టు నాగరాజు కవిత్వ సృజన జరిగి ఉండాలి. దీనికి భిన్నంగా స్పష్టమైన దళిత సాహిత్య తాత్విక పునాదిగా అద్వితీయ కవితా నిర్మాణం చేశారు. దళిత జీవితంలోని అనేక పార్శ్వాలను తడమటం ద్వారా తెలుగులో దళిత కవితా రంగానికి తాత్విక భూమికను ఏర్పరిచే ప్రయత్నం చేశారు. తాను పుట్టిన ఊరిలో చేపలమ్మే 'రుక్కత్త' నుంచీ ఇటీవల ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వరకూ దీనంతటినీ కవిత్వంలోకి తీసుకొచ్చి తన కవితా పరిధిని

విస్తరించు కున్నాడు. గతంలో వెలువడిన దళిత కవిత్వానికి కొన సాగింపుగా గొప్ప దళిత తాత్త్విక భూమికను కవిగా నాగరాజు ఏర్పరుచుకున్నారు. దీని ద్వారా కవిగా పల్లిపట్టు నాగరాజు భావజాలం ఏమిటో, కవిత్వం ద్వారా ఏం చెప్పదలుచుకున్నాడో, ఈ కవిత్వం రాయడం ద్వారా ఎలాంటి సమాజాన్ని స్వప్నిస్తున్నాడో, అందుకోసం ఇంకా జరగాల్సిన కృషి ఏమిటనే స్పష్టత కవిగా పల్లిపట్టు నాగరాజుకు ఉందని అనిపిస్తుంది. ఈ మార్గంలో మరింత ప్రతిభనూ, పరిణతినీ, గుర్తింపునూ, తాను పొందడమే కాక దళిత జీవితాలకు కూడా ఆ పరిమళం పూసేలా చూడాలని తన కవిత్వ పాఠకుడిగా పల్లిపట్టుకు నా విజ్ఞప్తి.

ఆధార గ్రంథాలు :

1. యాలై పూడ్సింది - పల్లిపట్టు నాగరాజు
2. దళిత - డాక్టర్ కె. బాలగోపాల్
3. దళిత కవిత్వం - వస్తు, శిల్ప సమాలోచన - డాక్టర్ బిరుసు సురేష్‌బాబు
4. దళితవాద వివాదాలు - డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ
5. దళిత సమస్య పరిష్కారానికి బుద్ధుడు చాలడు, అంబేడ్కరూ చాలడు, మార్క్స్ కావాలి - రంగనాయకమ్మ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిన్ననవుతున్న పాట దళిత కవిత్వం – చారిత్రకత

– డా॥. మోగునూరు వెంకటరమణ, తెలుగు అధ్యాపకులు, యస్.ఆర్.& బి.జి.యన్.ఆర్.
ప్రభుత్వ ఆర్ట్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), ఖమ్మం, తెలంగాణ

ఆధునిక తెలుగు కవిత్వంలో 1985 తరువాత ఒక మార్పు స్పష్టంగా కనిపించటం మొదలైంది. ఈ మార్పులో కవిత్వానికి సంబంధించిన ఒక ఉద్వేగం కూడ ప్రస్ఫుటంగా కనిపించింది. 1985 తరువాత తెలుగు కవిత్వంలో ఒక పాయ తన మాతృభాషను వెతుక్కుంటే, మరొక్కటి సామాజిక మూలాల్లోకి వెళ్ళి అప్పటిదాక విస్మరణకు గురైన అంశాలను వేదిక మీదకు తెచ్చింది. ఈ రెండు పాయలు 90ల ప్రారంభం కల్లా స్త్రీవాద, దళిత వాదాలుగా కవిత్వంలో స్థిరపడ్డాయి.

అంతవరకు పత్రికల్లోను వివిధ సంకలనాలల్లోను చెదురు మొదురుగా ఉన్న కవితల్లి ఒకటిగా చేర్చి "చిక్కనవుతున్న పాట " గా వెలువరించారు సంపాదకులు. తెలుగు కవిత్వానికి, సమాజానికి సంబంధించినంత వరకు కొన్ని మౌళిక ప్రశ్నలకు ఈ సంకలన కవిత్వం లేవనెత్తింది. అవి పూర్వ కవిత్వాలైన అభ్యుదయ, విప్లవ కవిత్వాలల్లో లుప్తమైన ముఖ్య సామాజిక వాస్తవాన్ని గురించి ఆసక్తిని కల్గించాయి. అవే మౌళిక ప్రశ్నలు తెలుగు కవిత్వం అంతటిని దళిత దృక్పథంతో పునర్విచేచనకు గురి చేసేందుకు పురికొల్పాయి.

సంకలనంగా 'చిక్కనవుతున్న పాట' జనవరి, 1995 వెలువడింది. ఒక దశాబ్ధికాలంలో వచ్చిన కవిత్వాన్ని త్రిపురనేని శ్రీనివాస, జి. లక్ష్మీనర్సయ్యలు సంపాదకులుగా వ్యవహరించి సంకలితం చేశారు.ఈ సంకలనంలో మొత్తం 47 మంది కవుల 104 కవితలు ఉన్నాయి. సంకలనం లోని కవులందరి సాంఘిక స్థాయి, నేపథ్యం ఇంచు మించుగా ఒక్కటే. వీరందిలోనూ కనించే సామాన్యాంశము సమాజానంలోని కింది కులాల వారు కావటం విద్య, ఆర్థిక స్థాయి, కుటుంబ పరిస్థితులు వ్యక్తులుగా సమాజంలో ఎదుర్కొనే అనుభవాలు అందరికీ సమానం గానే ఉన్నట్లు ఈ సంకలం ద్వారా అవగతం అవుతుంది. ఈ కవుల సామాజిక అనుభవంలో సామాన్యాంశాలే కన్పిస్తాయి. సంకలనంలోని కవులందరిని కలవరపరచిన సామాజిక వాస్తవం 'కుల సమస్య' అందుకే కవులందరి అనుభవ వ్యక్తికరణలో సామాన్యతా, సాదృశ్యము కన్పిస్తుంది.

ఈ సంకలనంలోని కవులు మూడు రకాల సామాజిక శ్రేణుల నుంచి వచ్చారు. 1. య.సి., 2. బి.సి. 3. మైనారిటీ కవులు. దీనిలో మైనారిటీ కవులుచ, మైనారిటీ స్పృహతో తమ ఆస్తిత్వానికి కల్గిన ముప్పును గూర్చి భీతిల్లిన కవులు. 1992, డిసెంబర్ 06 పరిణామాల తరువాత భారతీయ సమాజంలో మైనారిటీ ఆస్తిత్వ వేదనను తెలియజెప్పే కవిత్వం వీరిది. వీరిలో మైనారిటీ చైతన్యం అధికంగా కనిపిస్తుంది. మైనారిటీ - మేజరిటీ అన్న భావన మీద నిరసన ఈ కవిత్వం ద్వారా వ్యక్తపరిచారు.తమని కేవలం ముస్తింలుగా చూడవద్దనే చెప్పుతూనే తామేలా చూడ బడుతున్నారో తెలియజెప్పారు. 'చిక్కనవుతున్న పాట' కవులల్లో రెండవ శ్రేణి బి.సి.కవులది. వీరు సాంఘికంగా వెనుకబాటుతన్నాని, అసమానతను గురించి వ్రాసిన కవిత్వంలో క్రింది కులాల వారమన్నా చైతన్యం బలంగా వ్యక్తమయ్యింది అయితే వీరు దళిత కులాలకు చెందిన వారు కాదు. అయిన తమవి భావాలను ప్రకటించారు. అయితే సామాజిక సంఘటనలపై ముఖ్యంగా దళితులపై జరిగిన దాడులను వస్తువుగా స్వీకరించి తీవ్ర స్థాయిలో, అంతే తీవ్ర స్వరంతో స్పందించారు. దళిత అవమానా లను తమ అనుభవాలుగానే భావించి భావ ప్రకటనకు పూనుకున్నారు. ఇక యస్.సి., కవులు - దళిత

జీవితానుభవ దృష్టికోణం నుంచి కవిత్వం వ్రాసారు. వీరు వ్రాసిన కవిత్వంలో ఆత్మాభిమానం, ఆగ్రహం, ఆత్మగౌరవం ప్రతిఫుటన కులనిరసన, వ్యవస్థతతో తలపడే తత్వం, ఆక్షేపణ, విస్తృత దళిత జీవన వాస్తవికానుభవం వల్ల కలిగిన వ్యధను ప్రకటించటం కనిపిస్తుంది.

ఈ సంకలంలోని కవులందరినీ కాలదృష్టితో చూస్తే మరొకవిధంగా ఉంటుంది. 1980ల ప్రారంభం నుంచి కవిత్వం రంగంలోకి వచ్చి 1985 నాటికి స్థిరపడిన కవులు, 1985-1990ల మధ్యకాలంలో కవిత రంగంపైకి వచ్చిన కవులు, 1990-1995 మధ్య వచ్చిన కవులు అంటూ 3 విధాలుగా గుర్తించవచ్చు.1980 ప్రారంభం నాటికే కవిత్వం రంగంలోకి ప్రవేశించిన కవులు వ్రాసిన కవిత్వంలో వస్తు-రూపాల సమన్వయంతోపాటుగా రూపదృష్టి, ప్రయోగదృష్టి ప్రధానంగా కనిపిస్తాయి. శికామణి, అఫ్సర్, సతీష్‌చందర్,యండ్లూరి సుధాకర్,ప్రసేన్,యాకూబ్‌లను పేర్కొనవచ్చు. ఈ విధమైన ధోరణి కన్పించటానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది ఈ కవులు కవిత్వ రంగం మీదకు వచ్చేనాటికి విప్లవ కవిత్వ ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. సామాజిక ఉద్యమాలు లేవు. ఈ దశలో పూర్వ కవిత్వం కంటే భిన్నమైన కవిత్వాన్ని ఈ కవులు 1980-1985 మధ్యకాలంలో వ్రాసారు. కవిత్వం లోకి 'అస్పష్టత' లక్షణం వచ్చింది. ఈ కవులతోనేని ఒక విమర్శ కూడా తెలుగు కవిత్వంలో ఉన్నది. ఇక 1985-1990 మధ్య కాలంతో ప్రవేశించిన కవులు సామాజిక సంఘటలను వస్తువుగా స్వీకరించి వ్రాయటం జరిగింది. 1985-1990 మధ్య కాలంలో వచ్చిన కవులు వ్రాసిన కవిత్వంలో సరళత, స్పష్టలతో పాటుగా కసి, ఉక్రోషం, తీవ్ర ఆవేధన మొదలైనవి కన్పిస్తాయి. ఈ సంకలనం మొత్తం మీద కవులలో అతి ప్రధానమైన తేడా చెప్పవలసి వస్తే దాదాపుగా సగం మంది గత దశాబ్దిన్నర కాలంగా ఆంధ్రదేశంలో వచ్చిన వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమాలతో ప్రత్యేక్ష, పరోక్ష సంబంధాన్ని కలిగిఉన్న కవులు. స్థూల దృష్టితో చూస్తే ఈ కవులందరిదీ ఒకే ఆకాంక్ష అది కుల నిర్మూలన దిశగా సమాజం సాగాలన్నది లక్ష్యంగా ఉన్నది.

'చిక్కనవుతున్న పాట' రెండు రకాల ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చింది. ఈ సంకలనం వెలువడే దాక దళితులు ఏది దళిత కవిత్వం ? అనే ప్రశ్నలపైనే చర్చ జరిగింది. సంపాదకుల ముందుమాటలను బట్టి చూస్తే మైనారిటీలతో కలుపుకొని క్రింది వర్గాలను చెందిన వారంతా దళిత కవులని భావించాలి."ఈ సంకలనం లోని యస్.సి.,యస్.టి,బి.సి. కులాలకు సంబంధించిన కవులు, ముస్లిం కవులు మాత్రమే చోటుచేసుకున్నారు' 1 అంటే ఈ వర్గాల వారు మాత్రమే దళితులు అనుకోవాలి. తక్కిన వారు దళితేతరులు ఇప్పటివరకు వివిధ కులాకు సాంఘికంగా ఉన్న గుర్తింపును బట్టి వీరినే దళితులుగా సంపాదకులు వ్యవహించారని చెప్పవచ్చును. ఒక ఏదీ దళిత కవిత్వం అవుతుంది అన్న ప్రశ్నకు "కుల వ్యవస్థ దానికి ఆలంబన అయిన హిందుయిజం వీటి వల్ల రోజువారి జీవితంలోని పీడనని అనిశ్చితత్వాన్ని అభ్రతతను, అవమానాన్ని ఎదుర్కొంటున్న పీడిత కులస్తుల నుంచి మైనారిటీల నుంచి వచ్చిన కవులు వ్రాసిన కవిత్వమే దళిత కవిత్వం"2 అని "కేవలం ఆర్థిక వాద సంకెళ్ళను చీల్చుకుంటూ దళితుల స్వంత నెత్తురుగుండా ఒలుకుతున్న పలుకుల సముదాయమే దళిత కవిత్వం"3 నిర్వచించబడింది. ఈ రెండు నిర్వచనాలు ఒకే విషయాన్ని చెపుతున్నాయి. దళితుల స్వీయానుభవ ప్రకటన, దళిత స్వీయాత్మ ఆవిష్కరణ ఆ అనుభవం తమది రెండవ నిర్వచనంలో ఒక అంశంగా ఇది ప్రకటితమైంది.

'దళిత అనే పదానికి విశాలమైన ప్రాతిపదికను 'చిక్కనవుతున్న పాట' సమకూర్చింది. ఇది క్రింది కులాల నుంచి మైనారిటీల వరకు తనలో కలకలుపుతున్న విశాల వేధిక బహుజన ప్రాతిపదిక. ఒక విశిష్ట సంకలనంగా 'చిక్కనవుతున్నపాట' దళిత కవిత్వంలోని వైవిధాన్ని, విస్తృతిని తెలియజెప్పింది. ఇందులో మార్క్సిజం,

అంబేద్కరిజంలకు సంబందించిన ఒక సాధారణ తాత్విక భూమిక కనబడుతుంది. తెలుగు కవిత్వంలో అప్పటిదాక వచ్చిన వివిధ కవిత విప్లవాల ప్రభావం కనిపిస్తుంది. మహారాష్ట్రలో ప్రభవించిన దళిత పాంథర్స్ సాహిత్యోద్యమం, అమెరికన్ బ్లాక్ పొయెట్రీ, దక్షిణాఫ్రిక సాహిత్య ప్రభావం'చిక్కనవుతున్న పాట' లో కనిపిస్తుంది. విముక్తి, అణిచివేత, ఆధిపత్య నిర్మూలన మొదలైన వాటి కోసం పోరాటాల ప్రభావమే ఈ కవిత్వ ప్రత్యేకతని చెప్పవచ్చు.

'చిక్కనవుతున్న పాట' మొత్తం లోను తరతరాలుగా వస్తున్న కుల పరమైన వీడన వ్యక్తమయ్యింది. అణిచివేతను ప్రతిఘటించే కవిత్వం కనిపిస్తుంది. కులం తక్కువన్న ఆత్మన్యూనత భావంలోకి నెట్టివేసిన సామాజిక దౌష్ట్యం మీద ఏవగింపు ఉంది. దానిలోనుంచి జనించే వేధన సంఘర్షణలు బహిర్గతమయ్యాయి.ఆత్మగౌరవం కోసం జరిపే పోరాటం ఎట్లాఉంటుందో తెలిపింది. గతాన్ని ఒక సూచికగా తీసుకొని, వర్తమానానుభవాన్ని జోడించి, భవిష్యత్తుమీద ఆశావహమైన చూపు ప్రకటితమైనది. మైనారిటీ సమస్యలు, మత చాందసం, ఉనికికి ముప్పు మొదలైన అంశాలను, దళిత మైనారిటీ కవులు కవితాత్మకంగా ఈ సంకలనంలో వ్యక్తికరించారు.

దళిత చైతన్యంలో బాగంగా తమ ప్రత్యేకమైన సంస్కృతి పట్ల అనురక్తి, భాష, సంప్రదాయం, చరిత్రలపై కొత్త దృష్టి ఏర్పడింది. రాజ్యం దళితులపై సాగించే హింస పట్ల నిరసన వ్యక్తం అయ్యింది. కులానికి మతం ఆలంబనగా, మతం కులానికి సైదోడుగా దళిత మైనారిటీలను ఎట్లా సాంఘీక సమానతకు దూరం చేశాయో వివరించింది ఈ సంకలనం. సామాజిక సంవేదలను తదితర అంశాలను 'చిక్కనవుతున్న పాట' స్పష్టంగా వినిపించింది. ఒక్కమాటలో చెపితే ' ఈ వ్యవస్థ శవ పేటికను మోసుకుపోవాలి' అంటూ దళిత కవుల ఆకాంక్షకు 'చిక్కనవుతున్న పాట' దర్పటం పట్టిందని చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1,2,3. లక్ష్మీనర్సయ్య. జి, దేశీయ మార్క్సిజమే దళిత కవిత్వం ఎజండా, చిక్కనవుతున్నపాట ముందుమాట - పుట 3

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సాహిత్యంలో దళితవాదం - చారిత్రక నేపథ్యం

- డా॥. యస్.సి. సంజీవ రెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల - జమ్మలమడుగు, కడప జిల్లా,

సారాంశము :

భారతీయ సమాజంలో వేల సంవత్సరాలుగా వర్ణవ్యవస్థ అమలులో ఉంది. కాలక్రమములో వర్ణవ్యవస్థ కుల వ్యవస్థగా పరిణామం చెందింది. ఈ వ్యవస్థ శ్రమ విభజన కోసం పుట్టిందని, మానవ స్వభావాన్ని అనుసరించి పుట్టిందని అనేక వాదాలున్నాయి. ''చాతుర్వర్ణ్యం మయాసృష్టం - గుణ ఖర్మ విభాగశహః'' అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. అంటే ఒక వ్యక్తి చేసే పనిని బట్టి లేదా అతని స్వభావాన్ని బట్టి నాలుగు వర్ణాలవ్యవస్థ నా చేత సృష్టింపబడింది అని అర్థం. ఈ నాలుగు వర్ణాలలో దళితులు లేరు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు నాలుగు వర్ణాలవాళ్లు, మనుస్మృతి బ్రహ్మదేవుని శిరస్సులో నుండి బ్రాహ్మణులు, చేతుల్లో నుండి క్షత్రీయులు, తొడల్లో నుండి వైశ్యులు, పాదాలలో నుండి శూద్రులు పుట్టారని చెబుతూ ఈ నాలుగు వర్ణాల వారికి ధర్మాలను కూడా నిర్ణయించినారు. ఈ ధర్మాలలో సమానత్వం లేదు. ఒకే నేరానికి వర్ణాన్ని బట్టి శిక్షను నిర్ణయించింది మనుస్మృతి. ఈ వాళ మనం దళితులు అంటున్న వాళ్లు వెనుకటి రోజులలో పంచములు అని పిలువబడేవారు. అంటే అయిదవ వర్ణం వారు అని అర్థం. మనస్మృతి చండాలురు అనే ఒక శాఖను గుర్తించి, అందులో బ్రాహ్మణ స్త్రీకి శూద్ర పురుషునకు వర్ణ సాంకర్యం ద్వారా కల్గిన సంతానమే చండాలురు అని చెప్పబడింది. ఈ చండాలురు వర్ణధర్మాలను అతిక్రమించి పుట్టినవారు కనుక శిక్షను అనుభవించాలి. గ్రామానికి దూరంగా నివశించడం, మొలకు పరక, నోటికి ముంత కట్టుకొని తలకు ఎర్రని రుమాలు చుట్టుకొని గంట గణ గణ వాయిస్తూ గ్రామంలో నడచి పోవాలి. అగ్రవర్ణాల వారు దయతలచి పెట్టిన ఆహారాన్ని, చచ్చిపోయిన పశువుల్నివారు తినాలి. ఈ చండాలురే కాలక్రమంలో పంచములుగా, అస్పృశ్యులుగా, మాల, మాదిగలుగా పిలువబడుతూ, మహాత్మా పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి వారి చేత దళితులని మహాత్మాగాంధీ చేత హరిజనులని పిలువబడినవారు.

శ్రమ విభజన - కుల విభజన :

కుల వ్యవస్థ పైకి చూడటానికి శ్రమ విభజనగా కనబడినా డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారు అన్నట్లు అదిశ్రమ విభజన కాదు. శ్రామిక విభజన కూడా ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని ఈ విభజన భారతదేశ ప్రజలను విభజించి, వాళ్ల మధ్య ఆర్థిక, సాంఘీక, అసమానతలను సృష్టించింది. అంతేకాక ఆర్థిక, సాంఘీక, అణచివేతకు దోపిడీకి కూడా కారణం అయింది.

దళిత సమస్యను సంస్కరించడానికి లేదా నిర్మూలించడానికి చరిత్రలో అనేక ప్రయత్నాలు జరిగినాయి. వీరశైవ మతం శివునికి భక్తులు కావడానికి కులం అడ్డుకాదు అని చెప్పింది. బౌద్ధం వర్ణ వ్యవస్థను నిరాకరించింది. బ్రహ్మనాయుడు చాప కూడు ఏర్పాటు చేసి కుల నిర్మూలకు దోహదం చేశాడు. తాళ్ళపాక అన్నమయ్య అంటరాని తనాన్ని వ్యతిరేకించినారు. శ్రీకృష్ణ దేవరాయలు ''అముక్త మాల్యద''లో మాల దానరిని గొప్ప వైష్ణవ భక్తునిగా చిత్రీకరించినారు. 17వ శతాబ్దంలో వేమన అస్పృశ్యతను చాలా తీవ్రంగా వ్యతరేకించినాడు. ''మాల వానినేల మరి మరీ - నిందింప ..... మాలను మాలయను వాడే పెనుమాల'' అని అన్నాడు. పోతులూరి వీరబ్రహ్మం, యాగంటి లక్ష్మయ్య లాంటి తాత్విక కవులు కుల తత్వాన్ని, కుల వ్యవస్థను తీవ్రంగా ప్రతిఘటించారు. సంఘ సంస్కరణోద్యమంలోనూ, జాతీయోద్యమంలోనూ అస్పృశ్యతా నిర్మూలన ఒక ప్రధానమైన అంశం అయింది. గురజాడ అప్పారావు 1910వ సంవత్సరంలో,

"మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మాల అయితే
మాలనే యగుదున్" అని అస్పృశ్యతను వ్యతిరేకించి నాడు. అంతకు ముందే రచయిత పేరు తెలియని మాల వాండ్రు పాట ఒకటి కనిపిస్తూ వుంది. 1911 ప్రాంతంలో వేంకట పార్వతీశ్వర కవులు మాతృ మందిరము అనే నవలలో దళితుల సమస్యలు చిత్రించారు. వేలూరి శివరామ శాస్త్రి "ఓబయ్య" నవలలో ఓబయ్య దళితుడు జాతీయోద్యమంలో పాల్గొంటాడు. 1922లో ఉన్నవ లక్ష్మీ నారాయణ "మాలపల్లి" నవలను వ్రాశాడు. దళిత కుటుంబం ప్రధాన వస్తువుగా చేసి ఒక నవల వ్రాయడం భారతీయ సాహిత్యంలోనే అప్పటికి అరుదు. దళితులలో వున్న ఆధ్యాత్మిక చింతనకు, మానవీయతకు, సహనానికి "రామదాసు" ఆయన కొడుకు ప్రతినిధులైతే, ఆ దళితులలో వున్న తిరుగుబాటు తనానికి వెంకటదాసు ప్రతినిధి. "మాలపల్లి" నవలలో దళితులు వెనుకబాటు తనానికి వాళ్లు నిరంతరం అవమానాలు ఎదుర్కొంటూ వుండడానికి కారణాలు - పరిష్కారాలు చర్చింపబడ్డాయి. 1925 ప్రాంతంలో శ్రీ పాద సుబ్రమణ్యం శాస్త్రి, పుల్లమురాజు "సాగర సంగం" వంటి కథల్లో దళితులలో వున్న అంతర్గత వైరుధ్యాలను ఎత్తిచూపారు. ఆ ప్రాంతంలోనే గరిమెళ్ళ సత్యనారాయణ- అనేక 'దళిత గీతాలు' రచించాడు. కుసుమ ధర్మన్న "మాకొద్దీ-నల్లదొర తనము" అనే పాటను, హరిజన శతకాన్ని రచించాడు. మంగిపూడి వెంకటశర్మ అనే కవి 1913 ప్రాంతంలోనే "నిరుద్ధ-భారతము" అనే కావ్యంలో భారతీయ సమాజ చరిత్ర నిర్మాణంలో దళితులు నిర్వహించిన మహోన్నత పాత్రను కీర్తించారు. పౌరానిక వాగ్మయంలో దళితుల స్థానాన్ని ఎత్తి చూపారు.

ఈ నేపద్యంలో 1936లో డా. బి.ఆర్. అంబేద్కర్ కుల-నిర్మూలన అనే గొప్ప పరిశోధనాత్మక వ్యాసాన్ని ప్రచురించారు ఆ వ్యాసం సంప్రదాయ వాదుల్లో కలవరం లేపింది. భారత జాతీయోద్యమం క్విట్ ఇండియా పిలుపుని ఇవ్వబోతుండగా, రెండవ ప్రపంచ యుద్ధం భయంకరంగా సాగుతున్న కాలంలో మహాకవి గుఱ్ఱం జాషువా గబ్బిలం కావ్యాన్ని వ్రాశాడు.

జాషువా సాంఘీకంగా దళితుడు, చిన్నప్పటి నుండి సమాజంలో అవమానాలను అనుభవించాడు. అడు గడుగునా సాంఘిక వివక్ష అతని పసి హృదయాన్ని గాయపరిచింది. "నాకు ఇద్దరు గురువులు ఒకటి పేదరికం, ఇంకొకటి కులమత విభేదం" ఈ రెండూ నాకు సహనాన్ని నేర్పాయే తప్పా ఉద్రేకాన్ని కల్గించలేదు. నా కోపం సంఘం మీద కాదు, సంఘ విధానం మీద మాత్రమే అని చెప్పుకున్నాడు. కుల మతాల కుమ్ము లాటను గమనించి హిందూ, క్రైస్తవ మతాలు తనను బహిష్కరించడం, ఈ రెండింటినీ తాను బహిష్కరించడం పర్యవసానంగా.

"కుల మతాలు గీచుకున్న గీతలు జొచ్చి
పంజరాన కట్టు వడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వనరుడను నేను" అని చాటు కున్నాడు. కుల వ్యవస్థ ఉత్పత్తి రంగంలో పాల్గొని, మానవ జీవితం సుఖంగా సౌఖ్యంగా కలవడానికి కావలసిన వస్తువుల్ని తయారు చేసే వర్గాన్ని సమాజం నీచంగా, హీనంగా చూడడం మీద జాషువా ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆఖరికి తోచిన భావాలను రాయటం మీద కూడా కులరాక్షసి తన ఉక్కు పాదాన్ని మోపడం జాషువాకు తీవ్రమైన ఆవేదన కల్గించింది. అగ్రవర్ణ కవులు ఆయనను సభలలో, సదస్సులలో అవమానిస్తూ, నర్మగర్భంగా జాషువా పంచమ స్వరం వినిపిస్తాడని అనడం, ఆయనకు దక్కే గౌరవాలను గురించి ఎగతాళిగా మాట్లాడడం ఆయన హృదయాన్ని గాయ పరిచాయి. ఒక సారి జాషువా రైలెక్కి వెంకటగికి వస్తూ, రైలులో ఒక అగ్రవర్ణ వ్యక్తి తనపట్ల ప్రవర్తించిన తీరును వెంకటగిరి రాజుతో జాషువా ఇలా విన్నవించుకున్నాడు.

"నా కవితా వధూటి వధనము నెగాదిగ చూసి రూపురే
ఖాక మనీయ వైఖరుల గాంచి భళీ భళీ యన్న వాడే నీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున క్రుమ్మినట్లగున్ పార్థివ చంద్రా, వచింప
సిగ్గయడిన్"

ఇదే జాషువా దళిత వేదన, ఈ వేదనను జాషువా తన కావ్యాలన్నింటిలోనూ సమయం దొరికినప్పుడల్లా వ్యక్తం చేస్తూ వచ్చారు. ఈ విధంగా తెలుగు సాహిత్యంలోకి దళిత వాదం, దళితవాద సాహిత్యం ప్రవేశించినదని చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. భగవద్గీత - నాల్గవ అధ్యాయం - 13 శ్లోకం
2. మనుస్మృతి - మనువు
3. ముత్యాలసరాలు - గురజాడ
4. గబ్బిలం - గుర్రం జాషువ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత కవిత్వంలో - ఆణిముత్యం గుర్రం జాషువా

- డా॥. యం. వెంకటలక్ష్మమ్మ, తెలుగు అధ్యయన శాఖ, సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూలు.

ఏ కవి అయిన ఏ రచయిత అయిన తన జీవిత అనుభావాల్లోంచి, తను చూసిన సంఘటనల గూర్చి, ఒక్కొక్క విషయాన్ని తీసుకొని దానికి కొంత కల్పనలు జోడించి దాన్ని కవిత్వంగా , లేక ఒక సాహిత్యంగా మన ముందు పెడతారు. కాకపోతే అనుభవించి, పలవరించి నప్పుడు, ఉన్న కవిత్వానికి, కేవలం ఊహాత్మకంగా ఉ న్న సాహిత్యానికి, కవిత్వానికి కొంతో గొప్పా తేడా వుంటుంది. అలా తెలుగులో ఒక కవి దళిత కులంలో పుట్టి, దళిత వేదనని అనుభవించి, సామాజికంగా వేదనకు, వివక్షతకు గురై అందులోంచి తన జీవితాన్ని తన కవిత్వాన్ని, శాశ్వత సత్యాలను చెప్పే దిశగా, మానవతాన్ని చెప్పేదశగా నడిపించిన సాహిత్యపు విలువలతో కూడిన గొప్ప రచనలు చేయడం జరిగింది. ఆయన రచించిన కావ్యాలేమిటో ఈ రోజు మనం తెలుసుకోవాలి.

తెలుగుసాహిత్యంలో దళిత కవిత్వం, సాహిత్యం అంటేముందు చెప్పుకోదగిన కవి తొలి తెలుగు దళిత కవిగా తను రచించినది 'గబ్బిలం' ఈ కావ్యం తొలి దళిత కావ్యంగా 1940లో కాళిదాసు రచించిన 'మేఘసందేశం' అనే కావ్యాన్ని దృష్టి పెట్టుకొని ఈ గబ్బిలం రచిస్తున్నానని, కాళిదాసు రచించిన 'మేఘసందేశం'లో ఉన్న నాయకుడు మన్మదాగ్ని పీడితుడు, విరహాన్ని పీడుతుడు. కాని ఇందులో ఉన్న ఈ దళిత కథా నాయకుడు మాత్రం అగ్నిపీడుతుడు అతడికి శిక్ష కేవలం ఒక ఏడాదే, కాని ఇతనికి శిక్ష జన్మజన్మాంతరం అని చెప్పు, ఒక దళితుని యొక్క జీవితాన్ని గూర్చి చెప్తే అది గబ్బిలం కావ్యం అయింది. తంజావూరు అది తమిళ నాడులో వుంది. అక్కడొక ఒక దళిత కథానాయకుడు పేదవాడు వుంటాడు. అతడు ఒక చిక్కిచిల్వమైన పోతున్న ఒక గుడిసెలోకి వుంటాడు అక్కడికి ఒక గబ్బిలం వస్తుంది. ఆ గబ్బిలంతో ఇతడు మాట్లాడడం మొదలు పెడతాడు. గబ్బిలమా! నీవు ఎలాగు మా యింటికి వచ్చావు కదా! ఇక్కడ ఎలాగు నీకు ఆనందం సుఖం దొరకదు. పేదవాన్ని నేను, కైలాసంలో శివుడు వుంటాడు. ఆ ఈశ్వరుడికి కాస్త విన్నపం చేసుకో. ఈ దళిత సందేశాన్ని తీసుకెళ్ళు అంటాడు. ఈ దేశంలో ఉన్న దళితులకు మతపిచ్చిగాని, వర్ణోన్నతగానీ, స్వార్థచింతనముగానీ ఉండదు అంటూ తన కవిత్వంలో ఏమేమి ఉండవో చెప్పాడు.

గౌరవం కులానికా? కలానికా?

కవిత్వంలో కూడా కులభేదాలా? అని ఆశ్చర్యపోయే రోజుల్లో గుర్రం జాషువా పుట్టారు. ఆయన పద్యాలు చదివి 'భళీ భళీ' అని మెచ్చుకొన్న వారే కులం తెలిశాక నొచ్చుకొన్నారు అని ఒక పద్యంలో ఈ విధంగా చెప్పారు.

'నాకవితా వధూటి వదనంబున్ ఎగాదిగ చూచి రూపురే
ఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళీయన్న వారేమీ
దె కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచి పోవుచో
బాకున్ గ్రుమ్మినట్లగును ప్రార్థివచంద్ర! వచింపసిగ్గుగన్'

ఆధునికాంధ్ర సాహిత్యంలో తొలితరం కవుల్లో అన్ని విధాలా లక్షణాలు ప్రసన్నమయ్యే మహానీయమూర్తి జాషువా. వారిది రాపిడిపడ్డ జీవితం. రాపిడిలో రాణించిన ప్రతిభ వారిది. అటువంటి జాషువాగారు 1985 సెప్టెంబరు 28న వినుకొండలో గుర్రంవీరయ్య, లింగమాంబ లకు జన్మించారు. కవి కావటానికి అనుకూల పరిస్థితులు లేని వ్యవస్థను ఎదుర్కొని నిలిచారు. మహాకవిగా పేరొందారు. కులం రిత్యా నాటకం చూడడానికి

వీలులేదు. కులం వల్ల స్కూలులో వేదిక ఎక్కి పద్యాలు చదివే అవకాశం లేదు. అయినా అన్ని గాలివానలకి సహించి వటవృక్షంలా నిలబడగలిగారు. చివరికి తనకులం వారి చేత కూడ మాటలు పడ్డారు. మాల మాదిగల పట్ల భేదాన్ని సహించలేక పోయారు. తన కులంలో గల శాఖాభేదాల్ని, అంటరాని తనాన్ని కూడ నీలదీశాడు.

'దేవుడొకడు మాకు దేవళంబులు రెండు
దేశమొకటి, మాకు తెగలు రెండు
మాట వరుస కొక్క మతమందుమేకాని
కుల సమస్య వద్ద కుమ్ము దుమ్ము'

అంటారు. అంతటితో ఆగక తను ఏ కులానికో, ఏ మతానికో ప్రాధాన్యము ఇవ్వనని విశ్వనరుడను అంటారు. అందుకే జాషువా గారు

'కులమతాలు గీచుకొన్న గీతలు చొచ్చి
పంజరాన కట్టుపడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన, నాకు
తిరుగులేదు, విశ్వనరుడనేను' అంటారు.

గబ్బిలం అనే ఒక మహోన్నతమైన ఖండ కావ్యాన్ని రచించి, అందులో గబ్బిలంలో, కవి గబ్బిలంచేత తన మనోగతాన్ని చెప్పిస్తాడు. జాషువా ఎంత నిశ్చయం, ధృడనిశ్చయం గలవారో ఈ పద్యం తెలుపుతుంది.

ధర్మమునకు పిఱికి తన మెన్నడును లేదు సత్య వాక్యమునకు చావులేదు అంటూ జాషువా కరుణరసంలో నుంచి వీరరసాన్ని పొంగించిన కవి వారు చిందించిన కన్నీళ్ళు అగ్ని గోళాలు. అందుకే

'పామునకు పాలు చీమకు పంచదార
మేలుకొనుచున్న కర్మభూమింజనించు
ప్రాక్తనంబైన ధర్మదేవతకు కూడ
ఉలికిపడుజబ్బుగలడు వీడున్నచోట' అంటూ సమాజంలో పంచముల దీనస్థితి, అంటరానితనాన్ని ప్రధానంగా చూపిస్తూ

'ఆ యభాగ్యుని రక్తంబునాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
కసరి బుసగొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు' అని పంచముల దీనస్థితిని వర్ణించారు జాషువా. ఈ విధమైన ఆక్రందనలకు జాషువా గారి 'గబ్బిలమున అక్షర రూపము సిద్ధించినది. 'భరతోర్వకుంగడ గొట్టుబిడ్డ'డైన అరుంధతీ సుతుడు తన దుస్థితిని కైలాసపతికి విన్నవించవలసినదని గబ్బిలముతో తెలిపిన సందేశమిది. ఇందులో ఆనాడు వర్ణవ్యవస్థనలోని కుళ్ళును వెలచిమ్మటకు ప్రయత్నించినాడు.

సనాతనధర్మ ధేనువుల్ పిదికినపాలు :

పేదకు లభింపవని అతని గాలిసోకగా' నాల్గుపడగల హైందవ నాగరాజు, కసిరి బుసగొట్టునని,

'ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుగాని
దు:ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతకు విదల్పరీ భరతమేదిని, ముపుది మూడు కోట్లదే,
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీని లక్షుత్తులాఱునే?

ఏ విషయం మీద వర్ణించినా జాషువా దృష్టి అమానుషాల మీద, అసమ సమాజం మీదే వుంటుంది. ఎవరూ చూడని చీకటి కోణాల్ని చూడగల క్రాంతదర్శి జాషువా. అందుకే

'నిమ్నజాతుల కన్నీటి వీరదములు
పిడుగులై దేశమును కాల్చివేయునని' హెచ్చరించాడు. గర్జించాడు. అసలు ఈ చాతుర్వర్ణవ్యవస్థనునే నిలదీస్తూ జాషువా విష్ణుమూర్తిగా సాక్షాత్కరిస్తాడు. పంచమకులం ఎక్కడుందని హుంకరిస్తున్నాడు. ఎలా అంటే

ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలువురు కుమారులనుట విన్నాముగాని
పసరము కన్నహీనుడ భాగ్యుడైన
యెదవ కలస్థుడెవరమ్మా,సవిత్రి' అంటారు. కులం

వల్ల కలిగిన అవమానం, దారిద్ర్యం వల్ల కలిగిన ధైన్యం రెండూ జాషువాను కలిచి వేశాయి. పచ్చి నిజమైన సంఘటనను చిన్నానాడే జాషువా ఎదుర్కొన్నాడు. లేత మనసులో పడిన ఆముద్ర చెరిగిపొతుందా? 'నాకథలో' మనందరికి వీడియో చూపిన్నారు.

'విను మొకనాడు నేను పూరవీధిని పోవుచుండ వైశ్యనం
దనులో, ధరామరాత్మజులొనన్గని ముట్టకల మంచు వెనకన్
జనిరపుడేను కోపమును వల్వారి ముగ్గురి గొట్టిపేరెయె
త్తిన ఘటనంబు నేడుదు మదిం చెడబాయదు దొడ్డగాయమై'

ఇటువంటి ధారుణ అన్యాయాన్ని ఎదుర్కొన్నారు. అందుకే వీరు తన కలం ద్వారా విశ్వం అంతా ఒక్కటే కావాలని, వుండాలని ఆశించారు. అందుకోసం అంతా ఒక్కటే భావన వుండాలని ఆశించారు. అందుకోసం పద్యాకావ్యాలు, కావ్య ఖండికలు అత్యధికంగా అనాధ, స్వప్నకథ, గబ్బిలం, కాందిశీకుడు, నేతాజీ, బాపుజీ, స్వయంవరం, రాష్ట్రపూజ, కొత్తలోకం, ముసాఫరులు లాంటి అనేక ఖండకావ్యాలు రాశారు. అంతటితో ఆగక ఫిరదౌసి, ముంతాజ్‌మహల్, క్రీస్తుచరిత్ర లాంటి లఘు కావ్యాలు, కుశలవోపాఖ్యానం, చిన్ననాయకుడు అనే గద్య కృతులు, దావీదుచరిత్ర, రుక్మిణీ కల్యాణం, చిదానంద ప్రభాతం ధ్రువవిజయం, వీరబాబు లాంటి దృశ్య కావ్యాలు 'నాకథ' అనే స్వీయచరిత్ర లాంటి అనేక రచనలు చేసి, 'క్రీస్తుచరిత్ర' లాంటి కావ్యానికి కేంద్రసాహిత్య అవార్డుపొందారు. ఇంతగొప్ప రచనలు చేసిన కవి సమసమాజం కోసం అనేక సవాళ్ళుతో కూడిన పద్య రచనలు చేశారు అందులో

ఏనాడు మాకావ్యా సృష్టికర్తల జిహ్వా
విశ్వ సత్తము నాసింపగలదా
ఏనాడు మాజాతి దృష్టిమాంద్యమువాసి
చుట్టు పక్కలచేరి చూడగలదా
ఏనాడు మా బుఱ్ఱలో జట్టు తలలేని
పుక్కిటి కథలలో బక్కువడవా
ఏనాడు మా విద్యలినుప సంఘమునందు చిలము పట్టక ప్రకాశింపగలదా
అలాంటి రోజులు కావారిని ఆశిస్తూనే
'తనువు దాచక సోమరితనముమాని
యెన్నడే మరంబు బిచ్చమెత్తకొనవో
అట్టి శుభవేళ కొంగుబట్టి నిలిచ
నలిగి పోవుచున్నది నామనస్సు' అంటారు.

ఇంతగొప్పకవి 'కవికోకిల', కవితావిశారద, మధుర శ్రీనాధ, నవయుగ కవిచక్రవర్తి అని బిరుదులు పొంది కళాప్రపూర్ణ, పద్మభూషణ్ మొదలైన వాటిచే సత్కరించబడ్డ విశ్వనరుడు అయిన జాషువ గారి గూర్చిరావడం భగ వంతుడు నాకు యిచ్చిన, నాకు నచ్చిన గొప్ప అవకాశంగా భావిస్తూ వారి అడుగు జాడల్లో నడుచుటకు వారి స్ఫూర్తి, ఆశీస్సులు కవాలని ఆకాంక్షిస్తూ, అంతగొప్ప మహానీయుని స్మరించే అవకాశం కల్గడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎందుకంటే గుర్రం జాషువా గారు కలం అందరి నోళ్ళలో నానుతుంది దానికి సాక్ష్యం వారు.

'రాజు మరణించె నొకతార రాలిపాయె
కవియు మరణించె నొకతార గగన మెక్కి
రాజు జీవించే రాతి విగ్రహములందు
సుకవి జీవించే ప్రజల నాలుకల యందు' అన్న పద్యం ఎంత వాస్తమో మనకు అర్థమవుతుంది. దళితులకు సంబంధించిన వేదనను చెప్పి, కాస్త సమసమాజ స్థాపనల తీసుకరామ్మ అని చెప్తున్న ఒక కావ్యం గబ్బిలం. ఇందులో దళిత కథానాయకుడు సందేశకర్తగా కనిపిస్తే, సందేశ స్వీకర్త ఈశ్వరుడు కనిపిస్తే, సందేశాన్ని తీసుకెళ్ళిన దూతగా గబ్బిలం కన్పిస్తుంది.

993-లో విక్రమదేవవర్మ గారిచే జాషువాగారిచే' కవితా విశారద' బిరుదు

1936- చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిచే గండపెండేరం

సత్కారంలోపాటు కవి దిగ్గజ నవయుగకవిచక్రవర్తి అన్న బిరుదులు

1952- లో తిరుపతి కవితా సమితిచే 'మధురశ్రీనాథ' బిరుదుపొందారు.

1964 ఏలూరు తెలుగు దర్బార్ స్మశానంలో 'విశ్వకవిసామ్రాట్' బిరుదు

1964 ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా నియమితులయ్యారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం' కళాప్రపూర్ణ'బిరుదుతో సత్కరించింది.

భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది.

'గవ్వకు సాటిరాని పలుకాకుల మూకల సూయచేతన

న్నేవిధి దూరినన్ ననుు వరించిన శారద లేచిపోవునే' అనే పద్యంలో ప్రతిభను కులమతాల తక్కెడలో తూచరాదన్నాడు. అందుకే ఎక్కడ చిత్కారాలు ఎదు రయ్యయో అక్కడే సత్కారాలు పొందిన కవి.

ఆధార గ్రంధాలు :

1. గబ్బిలం- గుర్రంజాషువా
2. ఫిరదౌసి - గుర్రంజాషువా
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానాశాస్త్రి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రబంధ – దళిత కావ్య నాయకుల సామ్యత – ఒక పరిశీలన

– ఐ. నరేష్ (నంది), తెలుగు సాహిత్య విద్యార్థి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు సాహిత్యంలో ఆదికవి నన్నయ నుండి ఆధునిక యుగం వరకు, పెద్దన నుండి చిన్నయ వరకు, కందుకూరి నుండి యండమూరి వరకు వచ్చిన సాహిత్యం అంతా దాదాపుగా వైధిక సాహిత్యం అని, బ్రాహ్మణీయ సాహిత్యం అని చెప్పవచ్చు. ప్రాచీన సాహిత్యం నకు స్వర్ణయుగంగా చెప్పబడే ప్రబంధయుగంలో సాహితీమ తల్లికి వివిధ రకాల కవులు తమతమ ఘంటాలతో సహస్రాధిక పద్యార్చన చేశారు అనటంలో అతిశయోక్తి లేదు

తెలుగు వాఙ్మయాన్ని బ్రాహ్మణీయ, అబ్రాహ్మణీయ సాహిత్యంగా విభజించి సాహిత్య విమర్శకులు ఒక త్రాసులో తూచినట్లయితే అధిక శాతం బ్రాహ్మణీయ సాహిత్యం వైపే త్రాసు తూగుతుంది. పుంఖాను పుంఖాలుగా వచ్చిన ప్రబంధాలలో కావ్యనాయకులు ఏ సామాజిక వర్గానికి చెందిన వారని పరిశీలించినట్లయితే అందులోని కావ్యనాయకులు దాదాపుగా శర్మలు, శాస్త్రులే.

ఉదా : - నిగమ శర్మ, గోవిందమంచన శర్మ, నిరంకుశుడు, కళానిధి, గుణనిధి, ప్రవరుడు మొ॥

ఆంధ్ర సాహిత్యంలో ఆదికవి, ఆంధ్రకవితా పితామహ, ఆంధ్ర కవిసార్వభౌమ అనే బిరుదాంకితులు దాదాపుగా జుట్టు, జంధ్యము, ధరించినవారే.

సామ్యత :

సార్వోచిష మనునంభవం అని పిలవబడే మను చరిత్రను వ్రాసిన పెద్దనామాత్య, శృంగారనైషధము వ్రాసిన శ్రీనాథ మహాకవి మొ॥ వారందరూ ప్రభుభక్తి కలవారే కానీ ప్రజలభక్తి కలవారేమీ కాదు అనటంలో ఆశ్చర్యము లేదు. ప్రాచీన వాఙ్మయమంతా ప్రభువుల ఆస్థానంలో బ్రాహ్మణ కవివర్యులు ప్రభువుల మీద భజనలు చేసినవారే, ఆ రాజ సార్వభౌములు కూడా బ్రాహ్మణ మతాభిమానులే కావటం వల్ల అనేక అగ్రహారాలను దేవ బ్రాహ్మణులకు దానం చేశారు. దళిత వాద కవులు, రచయితలు బ్రాహ్మణ కవుల లాగా అగ్రహారాలను పొందలేదు, రాజ భోగాలను అనుభవించ లేదు. 11వ శతాబ్ధం నుండి నిన్న మొన్నటి వరకూ రాజభోగం పొందిన మాల, మాదిగల జాతికి చెందిన కవిని భూతద్దం పెట్టి వెతికినా దొరకడు.

అల్లసాని పెద్దన లాంటి కవికి కవిత్వం వ్రాయలంటే నిరుపమహతీ స్థలంలో అడపా తడపా వయసులో వున్న ప్రియురాలి దగ్గరి నుంచి కర్పూరం తో కూడిన తాంబూలం తెంచే దూతిక తన ప్రక్కలో ఉండాలన్నాడు, ఆత్మకి ఇంపైన భోజనం కోరాడు, ఉయ్యాల మంచం కావాలన్నాడు.

కానీ దళిత కవులకు వీటన్నింటితో అసలు పరి చయాలే ఉండవు. రాజాస్థాన పండితులు ఇంపైన భోజనం తింటే అణగారిన జాతికి చెందిన కవులు కేవలం గంజి బువ్వతో నరిపెట్టుకున్నారు. ప్రబంధకవులు హంసతూలికా తల్పం(పట్టు పరుపులు) మీద శయనిస్తే రాజాస్థాన కవులు తమ పాదరక్షలు వదిలిన చోట దళిత కవులు జీవించిన చరిత్రలు ఉన్నాయి.

ప్రబంధకవులు అష్ట ఐశ్వర్యాలతో తులతూగుతుంటే దళిత కవులు అస్పృశ్యత, అంటరానితనంతో చింతిస్తూ ఉన్నారు, ప్రబంధకవులు స్త్రీ శరీర అంగాలమీద, చెట్లమీద, పుట్లమీద, గుట్లమీద వర్ణిస్తుంటే దళిత కవులు నిమ్నవర్గాల జీవనం పై వర్ణిస్తూ ఉన్నారు.

మనుచరిత్రలోని కావ్యనాయకుడు ప్రవరుడు వేద భూమిలో జన్మించాడు, గబ్బిలం కావ్యంలోని అరుంధతీ సుతుడు కర్మభూమిలో జన్మించాడు. పెద్దన ప్రవరుడిని

మానవోత్తముడిగా పాత్రీకరించాడు, జాషువా గారు దళితుడైన అరుంధతీ కుమారుడిని స్వభావ సిద్ధంగా చండాల జాతిగా కవిత్వీకరించాడు.

ప్రబంధాలలో ఉన్న నాయకులు వీరశృంగార రసి భరితులై ఉన్నారు, దళితకావ్యనాయకులు శోకరసాన్ని అనుభవిస్తూ ఉన్నారు. ప్రబంధాలలో రాయభారాలు ప్రేయసీ, ప్రియుడికి మధ్య జరుగుతూ ఉంటాయి, గబ్బిలం కావ్యంలో అంటరానివాడైన అరుంధతీ సుతుడికి, ఆదిశంకరుడికి మధ్య రాయభారం జరిగింది. ప్రబంధ వాఙ్ఞయంలో వలె పూర్వ కావ్యాలలో కవులు హంసలు, చిలుకలు, కోయిలలు వంటి కూత నేర్చిన పక్షులకు స్థానం కల్పించారు. ఆకలేసి అరిచే కాకులు, గబ్బిలాలు వంటి పక్షులను ఎవరూ స్మృశించలేదు.

పూర్వప్రబంధాల నాయకులైన నిగమశర్మ, ప్రవరుడు మొ॥ వారు అగ్రహారాల నివాసితులు కానీ గబ్బిల కావ్య అరుంధతీ సుతుడు వెలివాడలోని ఒక పూరిగుడిసెలో నివాసమున్నవాడు.

ప్రాచీన కావ్యనాయకులు పంచభక్ష పరమాన్నాలు తినేవారు. క్రీడాభిరామంలోని గోవింద మంచనశర్మ ఏకశిలా నగరంలోని లక్ష్మణవర్ఝుల వారింట మృష్టాన్న భోజనం చేసేవాడు కానీ అరుంధతేయుడు నిరంతర కష్టజీవి, గొడ్డులా చాకిరీ చేసి ఈ ప్రపంచానికి భోజనం పెడుతున్నాడు అయినా తనకు బొక్కెడు బువ్వకూడా లేక గొడ్డులాగే పస్తులు పడుకుంటున్నాడు. కానీ అతను పశువు కాదు. ఈ ఖర్మ భూమిలో చాలా పశువులు, జంతువులు పూజించబడుచున్నాయి.

గోవిందమంచనశర్మ లాంటి వారు స్వర్ణజరీ అంచు పంచెలు, ఉత్తరీయములు ధరిస్తే దళిత కావ్య నాయకులు మట్టివాసనతో నిండిన, ఘర్మజలాలతో నిండిన బట్టలను ధరించి ఉంటారు.

నిరంకుశోపాఖ్యానం వంటి కావ్యాలలో నిరంకుశుడి లాంటి నాయకుడు పావిత్ర స్థలంగా చెప్పబడే శివాలయంలో శివుడిచేత జూదం ఆడించి జూదంలో గెలిచి రంభతో కామవాంఛ తీర్చుకున్నాడు. పౌష్టికాహార మేలేని దళిత కావ్యనాయకులకు ఏ శారీరక వాంఛలూ రావు.


వాని చక్కదనము వైరాగ్యమున జేసి
కాంక్షసేయు జార కామినులకు
భోగబాహ్యమయ్యె బూచిన సంపెంగ
పొలుపు మధుకరాంగనలకు బోలె.

పుంసా మోహనరూపుడైన ప్రవరాఖ్యుడి చక్కదనానికి పెట్టిన నలుగు. అతని యవ్వన అందం వేశ్యలకు సైతం వలపు రేపేదట. ఆ వార స్త్రీలకు సాధారణంగా సొమ్ము మీదే కానీ, సోకుమీద కాంక్ష ఉండదు. కానీ వారిని సైతం ఆకర్షించగలిగిన అందగాడు ఈ ప్రవరాఖ్యుడు. కానీ నిమ్నవర్గాల కావ్యనాయకులు ఏ అందచందాలను ధరించినవారు కారు. ఏ వార స్త్రీలు, ఏ కాంతామణులు, కామినులు, ఈ అరుంధతీ సుతుడ్ని కామించలేదు.

ఆముక్తమాల్యదలోని షష్ఠమా శ్వాసంలో నాయకుడైన మాలదాసరి ప్రతినత్యము బ్రాహ్మీ ముహూర్తంలో మంగళకైశికీ గానంతో నానావిధ వైష్ణవ గీతాలు పాడుతూ వుండేవాడు, అతను జాతిచేత చండాలుడైననూ ఉత్తమోత్తమ గుణాలచేత ఎండనూ, గాలినీ తలంపక మధ్యాహ్నం వరకూ రాళ్ళను సైతం కరిగించేవిధంగా తన చండాల వీణను వాయిస్తూ ఆనందబాష్పాలతో తన్మయత్వం చెందేవాడు. అలా అతను ఒకరోజు కురుంగుడినంబి

దేవాలయానికి వెళ్ళే మార్గంలో ఒక బ్రహ్మరాక్షసుడు ఇతనిని భక్షించటానికి ప్రయత్నించగా అప్పుడు ఆ మాల

దాసరి నావ్రతము ముగించుకుని తిరిగి నీ వద్దకే వచ్చెదను అని పలికెను. అప్పుడు అతను తిరిగి రాక్షసుడి దగ్గరికి వచ్చినపుడు మాలదాసరిలో మాటమీద నిక్కచ్చి తనం, అసత్యము ఆడకపోవటం మొ॥ సద్గుణాలను గమనించవచ్చు.



అనాదిగా సాగుతున్న ఈ నిచ్చెన మెట్ల సమాజంలో దళితులు పై నాలుగు వర్ణాల వారి దోపిడికి గురి అవుతూనే ఉన్నారు. ఆదికాలం నుంచి ఈ నాటి కాలంవరకూ సామాజిక దోపిడీకి, సాంఘిక అణచివేతకు గురవుతున్నవారు దళిత వర్గీయులు. ఈ దోపిడీ అణచివేతలో ఏమైనా మార్పు కలిగిందా అని చూస్తే మార్పు అయితే కలిగింది కానీ ఆశించిన స్థాయిలో కలుగులేదు. శారీరక కాయా కష్టం పై ఆధారపడి బ్రతుకులు గడుపుతూ సమాజ సంపదను పెంచుతున్న వారు దళితులు. దళితుల జీవిత వాస్తవికత ఎప్పటి నుంచి ఉందో దళితుల భావప్రకటన కూడా అప్పటినుంటి ఉంది. కానీ ఆ భావాలను, బాధలను అగ్రవర్ణాల వారు పంజా ఎత్తిన సింహంలా అణచివేశారు.

ఏ వర్గం వారైతే అణచివేయుటకు కారణభూతులయ్యారో ఆ వర్గంలోని కొందరు సహృదయులే బ్రాహ్మలలో కూడా కొందరు మంచి బ్రాహ్మణులు కలరోయ్ అని గురజాడ అన్నట్టుగా

బ్రాహ్మణజాతిలో కూడా దళితులను గుండెలకు హత్తుకున్న దళితుల బాధలను విన్న దళిత జాతి ఉన్నతికి పాటు పడిన బ్రాహ్మణులు కూడా ఉన్నారు. వారు మంగిపూడి వెంకటశర్మ - నిరుద్ధభారతం, కందుకూరి, గురజాడ, ఉన్నవ లక్ష్మీనారాయణ మొ॥వారు దళితుల ఔన్నత్యానికి అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేశారు.

మతములన్నియూ మాసిపోవును అని గురజాడగారు అన్నట్టుగా బ్రాహ్మణ, అబ్రాహ్మణ, అస్పృశ్యులు, స్పృశ్యులు, నాయీ, నయా బేధాలను వదిలి ఉర్వి వారందరికీ ఒక్క కంచమున పెట్టి ఒక్క కంచములో తిని సమస్త జనులు అన్న తమ్ముల వలె భరతభూమి సుతులవలె ఉండవలెనని ఈ వ్యాస సందేశము.

ఆధార గ్రంధాలు :

1. మను చరిత్ర - అల్లసాని పెద్దనామాత్య
2. ఆముక్తమూల్యద - శ్రీ కృష్ణదేవరాయ సార్వభౌమ
3. క్రీడాభిరామం - శ్రీనాథుడు, వినుకొండ వల్లభామాత్యుడు
4. పాండురంగ మహత్యం - నిగమశర్మ
5. గబ్బిలం - గుఱ్ఱం జాషువా

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా శ్మశానవాటి – తత్త్వ విశ్లేషణ

– డా॥. చొగంటి నాగరాజేశ్వరి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (ఆటానమస్), రాజమహేంద్రవరం.

ఆధునిక తెలుగు సాహిత్య వనంలో చందన వృక్షం. సాహితీ సరస్వతి మెడలో కంఠాభరణం. ఎంతో సాహిత్య సృజన చేసి ఆధునిక సాహిత్య చరిత్రను సుసంపన్నం చేసిన కవి జాషువా. సాహితీ ప్రియుల గుండెలలో తన రచనలతో చెరగని ముద్ర వేసి మధుర శ్రీనాథ,నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల అంటూ అభిమానంగా పిలుచుకునే కవి జాషువా. నేడు జాషువా రచనల్లోని ఏదో ఒక వాక్యం ఉదహరించని సాహిత్య వేదిక లేదంటే అతిశయోక్తి కాదు. గుంటూరు జిల్లా వినుకొండ గ్రామంలో లింగమాంబ వీరయ్య దంపతులకు 1895 సెప్టెంబర్ 28 జన్మించిన జాషువా చిన్నతనం నుండి అంటరాని వానిగా అస్పృశ్యత జాడ్యానికి బలై ఎన్నో అవమానాలు కష్టాలు కడగండ్లను చవి చూశాడు.పీడిత కులాల నుంచి చదువుకొని విద్యావంతులు కావడం కవులుగా, రచయితలుగా, తత్వవేత్తలుగా ఎదగడం నిలదొక్కుకోవడం అత్యంత కష్టసాధ్యమైన పని. అలాంటి కష్టాలను ఎన్నింటినో ఎదుర్కొని సంప్రదాయవాదులతో అష్ట కష్టాలు పడి కవిగా నిలదొక్కుకొని జీవితాన్ని గెలుచుకున్న దళిత శూద్ర తాత్వికుడు గుర్రం జాషువా. కష్టాలను కన్నీళ్లను సిరాగా మార్చుకుని కలాన్ని ఆయుధంగా చేసుకుని తన ధర్మాగ్రహాన్ని కవిత్వంగా వ్యక్తీకరిస్తూ అసమానతలను ఎండగట్టాడు. తన భావవ్యక్తీకరణకు తిరుగులేదని నిరూపించుకుంటూ అవమానాలను సన్మానాలుగా పొందగలిగే స్థాయికి చేరుకున్నాడు.ఎన్నో అద్భుతమైన రచనలు చేశాడు. సంప్రదాయ ఛందస్సులలో ఆధునిక భావాలను అందంగా అభివ్యక్తీకరించాడు.

రాజు జీవించె రాతి శిల్పములయందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు

అని జాషువా అన్నట్టుగా ఎంతమంది కవులు ఉన్నా వారి రచనలు ప్రజల నాలుకలపై నిరంతరం పలుకుతూ ఉండాలి. అతడే సుకవి. వేమన పద్యాలంత సులభంగా సాహిత్యంతో పరిచయం ఉన్నవారు ఎవరికైనా జాషువా పద్యాలు అలవోకగా నోట్లో పలుకుతాయి. జాషువా రచనలు ఒక్కొక్కటి ఓ అణిముత్యం. ఖండకావ్య రచనలలో సిద్ధహస్తుడు. జాషువా తత్వం పరిశీలించినట్లయితే తనకు సమాజంలో అవమానాలకు కారణమైన కుల వివక్ష అసమానతలపై పదునైన తనకలాన్ని ఝళిపించాడు. జాషువా రచనలలో వస్తువుకు ఒక ప్రత్యేకత కనబడుతుంది. సామాన్య వస్తువులను కవిత్వీకరించడం సాలీడు గిజిగాడు తుమ్మెద వంటి అల్ప జీవులకు కవితా పట్టం కట్టాడు అందరూ పనికిరానివిగా చూసే వస్తువుకు తన కవితా పటిమతో జవజీవాలు కలిగించినవ్యక్తి అలాంటి వాటిలోశ్మశాన వాటి ఖండకావ్యం ఒకటి. శ్మశాన వాటి ఖండకావ్యంలో తత్వాన్ని విశ్లేషించడమే.

ఈ వ్యాస ఉద్దేశ్యం :

తత్ = అది. త్వం = నీవు. తత్త్వం= అది నీవు అని అర్థం.అంటే దానికి నీకు ఉండే సంబంధాన్ని తెలియజేసేది అని అర్థం. ప్రకృతిలోనూ, సమాజంలోనూ ఎన్నో అంశాలు ఉన్నాయి. జీవుల పుట్టుక, కులం, మతం, హింస మొ॥ అనేకం ఉన్నాయి. ఒక అంశం పట్ల వ్యక్తికీ ఉండే అభిప్రాయమే ఆ వ్యక్తి తత్త్వం. తత్త్వమంటే అభిప్రాయం అని కూడా చెప్పవచ్చు. మన సమాజంలో చావు పుట్టుక, దైవం వంటి విషయాలను గూర్చి మాట్లాడితే తత్త్వవేత్తగా పరిగణిస్తారు. వేదాంతం చెబుతున్నాడంటారు. అట్టి తత్వాన్ని ఈ కావ్యంలో జాషువా చెప్పిన విధం పరిశీలిద్దాం.

శ్మశాన వాటి ఖడకావ్యం 1933లో రచించాడు. శ్మశాన వాటి అనే మాట వింటేనే మనుషులకు భయం. కలలో కూడా ఆ మాట పలకడానికి ఇష్టపడరు అటువైపు వెళ్ళా

లన్నా దాన్ని చూడాలన్న వణుకుపుడుతుంది. అందరికీ తెలుసు, పుట్టిన ప్రతి జీవి మరణించక తప్పదని, ఆ భూమి కి చేరక తప్పదని. అయినా దాన్ని ఇష్టపడరు. అలాంటి ఎవరూ ఊహించడానికి కూడా ఇష్టపడని శ్మశానాన్ని కవితా వస్తువుగా స్వీకరించాడు దీనిలో 8 పద్యాలు ఉన్నాయి.

మొదటి పద్యంలో శ్మశాన వాటి తత్వాన్ని చెప్పాడు మనిషి ఎప్పుడు పుట్టాడో అప్పుడే మరణం కూడా నిర్ణయింపబడుతుంది కాబట్టి సృష్టి జరిగినప్పటి నుంచే మరణం కోసం శ్మశాన వాటి కూడా సిద్ధమైంది మానవ చరిత్ర అంత ప్రాచీనమైంది శ్మశానం. అందుకే ఈ క్రింది పద్యంలో

ఎన్నోయేండ్లు గతించిపోయినవి గానీ యీశ్మశాన స్థలిన్
గన్నులుమోడ్చినమందభాగ్యుడొకడైనన్లేచిరాడక్కటా
యెన్నాళ్ళీ చలనంబు లేని శయనం? బేతల్లులల్లాడిరో!
కన్నీటంబడిక్రాగిపోయినవి నిక్కంబిందు పాషాణముల్.

ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి.ఎంతోమందిని చనిపోయిన తర్వాత ఇక్కడికి తీసుకువచ్చిఅంత్యక్రియలు చేస్తారు. అక్కడికి రావడమేగాని తిరిగివెళ్ళడం జరగదు. అందుకే ఒక్క మందభాగ్యుడైనలేచిరాడు. ఇలా చలనం లేకుండా పడి ఉండడం ఎంత కాలం అని ప్రశ్నించాడు. బిడ్డల కోసం వారి తల్లులు ఏడ్చిఏడ్చి కార్చిన కన్నీళ్ళతో అక్కడి రాళ్ళు కాగిపోయాయట.కన్నీరు వెచ్చగా ఉంటుంది మరి. ఎంత ఏడ్చినా అక్కడి బండరాళ్ళు ఉలకవు, పలకవు. అ తల్లులలను ఒదార్చేవారులేరు.

శ్మశానంలో వాతావరణం ఎలా ఉంటుందో ఎవరూ ఎప్పుడూ పరిశీలించరు.అన్త్య క్రియల కోసం వచ్చిన వారుకుడా పని ముగించుకుని వెళ్ళిపోవాలని. భీతిల్లుతూ ఉంటారు. పరిసరాలను పరిశీలించే యోచన ఉండదు. అది ఆస్వాదించే చోటుకాదు. అక్కడ విషాదం, నిశ్శబ్దం, ఆవేదన తప్ప ఏమీ ఉండవు. దాని పరిసరాలను ఈ క్రింది పద్యంలో...

ఆకాశంబున కారుమబ్బుగము లాహారించె, దయ్యాలతో
ఘూకంబుల్ చెరలాడసాగినవి, వ్యాఘోషించె నల్దిక్కులన్
గాకోలంబులు,గుండెరుఘుల్లు మనుచున్నంగాని యిక్కాటియం
దాకల్లాడిన జాడలే, దిచ్చట సౌఖ్యం బెంత క్రీడించునో

ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకొని కటిక చీకటి చిక్కగా అల్లుకున్న వేళ, దయ్యాలు,గుడ్లగూబలు చెరలాడుతున్నాయి. కాకులు మూకుమ్మడిగా పెద్ద పెట్టున అరుస్తూ, గోల చేస్తుంటే ఆశబ్దాలకు జనులు భీతిల్లుతున్నారు. కానీ శ్మశానంలో ఆకు కుడా కదలడం లేదు. శ్మశానంలో మనుషులు ఉండరు. ఇంకా ఎవరు భయపడేది? అంతా నిశ్శబ్దమే. ఇక్కడ ఎంత సౌఖ్యమో అంటాడు జాషువా.

పుట్టినప్పుడు మనిషి ఏమి తీసుకురాడు. పోయేటప్పుడు ఏమి తీసుకుపోడు. మధ్యలోనే ఆడంబరాలు, అంతరాలు అన్నీ. ఎంత గొప్పవాడైనా కటిక పేద అయినా శ్మశానంలో ఒకటే. రాజు పేద తేడాలేని సమానత్వ భూమి. కుల నిరసనగళంతో ఈ ఖండ కావ్యాన్ని రచించాడని చెప్పవచ్చు

ఇచ్చోటనే సత్యవీంద్రుని కమ్మని కలము
నిప్పులలోన (కరగి (పోయె!
యిచ్చోటనే భూములేలు రాజన్యుని
యధికార ముద్రిక లంతరించె!
యిచ్చోటనే లే(త యిల్లాలి నల్లపూ
సల సొరుగంగలో గలిసిపోయె!
యిచ్చోట నెట్టి పెరెన్నికం గను గొన్న
చిత్ర లేఖకుని కుంచియనశించె!

ఇక్కడే గొప్ప కవి కలం నిప్పులో కరిగిపోయింది

.విశాల సామ్రాజ్యాలను ఏలిన రాజు అధికారం అంతరించిపోయింది. కొత్తగా పెళ్లయిన అమ్మాయి మాంగల్యం గంగలో కలిసిపోయింది .ప్రసిద్ధ చిత్రకారుని కుంచె ఇక్కడే నశించిపోయింది. అంటే కవి రాజు, చిత్రకారుడు, ఇల్లాలి భర్త అందరూ మరణించిన తర్వాత ఇక్కడికి రావాల్సిందే. అందరూ ఇక్కడ సమానమే పరమేశ్వరుడు లయకారుడు. అతని నివాసం శ్మశానం. ఇది పరమేశ్వరుని రంగస్థలం. ఇష్టమైనది తాండవ నృత్యం. తన పిశాచ గణాలతో ఇక్కడ నాట్యం చేస్తాడు. ఇది మరణ దూత తీక్షణమైన చూపులతో చూస్తూ భూమిని పాలించే భస్మ సింహాసనం అని జాషువా శ్మశానాన్ని అభివర్ణించాడు. భస్మ సింహాసనంఅనే పదప్రయోగం జాషువా తాత్వికతకు నిదర్శనం .అంతా బూడిద మయమే. మరణించిన తరువాత బూడిద తప్ప ఏమి మిగలదనే జీవిత సత్యాన్ని పదునైన మాటలతో వ్యక్తీకరించాడు .

తమవారు మరణిస్తే కుటుంబ నభ్యులు సమాధులవద్ద దీపాలు ఉంచి నివాళులు అర్పిస్తారు . అలా ఒక కొత్త సమాధివద్ద దీపం వెలుగుతుంటే దాన్ని తనదైన తాత్వికతతో ఈ క్రిందివిధంగా పేర్కొంటున్నాడు.

ముదురు తమస్సులో మునిగిపోయిన క్రొత్త సమాధి మీద(బై
బొదలు మిణుంగురు బురువు పోలిక వెల్గుచున్న దివ్వె, ఆ
ముద ముడివోయినన్సమసిపోవుట లేదది దీప
హృదయము సుమ్మి, నిల్పి చనియె న్గతపుత్రిక యే యభాగ్యయో

ఆ రాత్రి చిక్కనిచీకటి సమయంలో కొత్త సమాధి అంటే ఆరోజే మరణించిన ఒక స్త్రీ సమాధివద్ద ఇంకా దీపం వెలుగుతూ ఉంది అరే! మినుగురుపురుగులా రెపరెపలాడుతూ వెలుగుతున్న ఆ దీపంలో చమురు కూడాలేదు అయినా వెలుగుతుంది అంటే అది బహుశా సమాదిలోపల స్త్రీ హృదయమేమో ఏ తల్లో ఆ దీపాన్ని వెలిగించి వెళ్ళింది. తల్లి వెలిగించినది మామూలు దీపం ఐతే కూతురి హృదయం దీపంలా వెలుగుతుందని చెప్పడం కొత్త తాత్విక భావన. చేయితిరిగిన కవి మాత్రమే ఇలాంటి భావన చేయగలడు.

మరణం శరీరానికే గాని హృదయానికి లేదని సూచించాడు. మన శరీరం పంచభూతాత్మకమైనది.నీరు నిప్పు గాలి మట్టి శూన్యంతో నిండి ఉంది. మరణానంతరం నీరు నీటిలో నిప్పు నిప్పులో, గాలి గాలిలో, మట్టి మట్టిలో కలిసిపోతాయని చెబుతారు. పుట్టుక తల్లి గర్భం నుండైనా ఆ తల్లి కూడా ప్రకృతి జీవితమే.మన శరీరం మరణానంతరం మట్టిలో కలిసిపోతుంది.దహనమైనా, ఖననమైనా మట్టిలో కృంగి కృషించి రేణులలో కలిసిపోతుంది. ఇదే భావాన్ని ఒక పద్యంలో చెప్పాడు.

కవుల కలాలు గాయకుల కమ్మని కంటము లీ సశ్మశానపుం
గవనుల ఁద్రొక్కి చూచెడి నొకానొక నాఁ డల కాళిదాస భా
రవుల శరీరముల ప్రకృతిరంగమునం దిపు డెంతలేసి రే
ణువు లయి మృత్తికం కలిసెనో కద! కుమ్మరివాని సారె పై

గొప్ప కవి కలం, గాయకుడి గళం ఇక్కడే మట్టిలో మట్టిగా రేణువులుగా కలిసిపోయాయి. ఆ మట్టిని కుమ్మర్లు కుండల తయారీలో ఉపయోగిస్తే సారెపై మట్టి రూపంలో తిరుగుతున్నాయేమో అని ఊహించాడు. సృష్టికర్త బ్రహ్మ అని, కాలం చక్రమని పెద్దలు చెబుతారు. బ్రహ్మ కుమ్మరి వాని వలె కాలచక్రంపై కుండల మాదిరి మనుషులను సృష్టిస్తున్నాడని తాత్విక భావనను ఇక్కడ జాషువా ఊహించాడని చెప్పవచ్చు.

శ్మశానం వద్ద నిలబడి ఆ సమాధులను చూస్తే గుండె తరుక్కుపోతుంది. చిన్నపిల్లల సమాధులను గూర్చి జాషువా ఆవేదన తెలుపుతూ ఇలా చెప్తున్నాడు.

ఆలోకించిన గుండిల్గరగు, నాయా పిల్ల గోరీలలో
నే లేబుగ్గల సారు రూపరియెనో! యే ముద్దు నిద్రించెనో!

యే లీలావతి గర్భగోళమున వహ్నిజ్వాల జీవించునో?
యీ లోకంబున వృద్ధి గాదగిన యేయే విద్య లల్లాడునో?

ఆ పిల్ల గోరీలలో ఎంత చిన్న పిల్లల మృతదేహాలు ఉన్నాయో కదా! బిడ్డలను పోగొట్టుకున్న తల్లుల కడుపు తీపి నిద్రిస్తుందో?ముద్దులు మూటగట్టే ఏ చిన్నారి రూపం దాగుందో?తలుచుకుంటే గుండె తరుక్కుపోతుందని మరణానికి వయస్సుతో పనిలేదని సూచించాడు.

ఈ క్రింది పద్యంలో జాషువా తనదైన కలాన్ని కత్తిలా ఝళిపించాడు. సభ్య సమాజంలో ఉండే అంతరాలు శ్మశానంలో సమసి పోతాయని పేర్కొంటూ..

ఇట నస్పృశ్యత నంచరించుటకు దావేలేదు, విశ్వంభరా
నటనంబున్ గబలించి గర్భమున విన్యస్తంబు గావించి, య
త్కటపు బెబ్బులితోడ మేక నొక్క పక్క జేర్చి జోకొట్టి యూ
ఱట గల్పించు నభేదభావమును, ధర్మం బిందు గారాడెడిన్

శ్మశానంలో అస్పృశ్యతకు చోటు లేదు.కులం మతం వర్గం జాతి భేదాలు ఇక్కడ లేవు.అంతా ఒకటే. ఎవరినైనా ఒకేలా స్వీకరిస్తుంది. పులిని మేకను ఒకేచోట ఉంచగలదు. అభేద భావం చూపగల చోటు శ్మశానం అందుచేతనే కుల భేదాలపై గళమెత్తిన జాషువా శ్మశానాన్ని కవితావస్తువుగా స్వీకరించి ఉండవచ్చు. ఈనాటి సమాజంలో మనిషికి స్వార్థం పెరిగి ధనార్జన ధ్యేయంగా విలువలకు తిలోదకాలు ఇచ్చి బంధాలను కూడా మర్చిపోతున్నాడు. మరణించిన తర్వాత అంతరాలు ఉండకపోవచ్చు.అందరూ అక్కడే అంతమవ్వవచ్చు. కానీ మరణించిన వారి బంధువులకు ఇంకా అంతరాలు, భేదాలు అనుసరణీయాలే ,అందుకే అంత్యక్రియల్లోనూ ఖర్మకాండల్లోనూ ధనిక పేద వ్యత్యాసం మనం చూస్తూనే ఉన్నాం. చనిపోయింది ధనికుడైతే సమాధి నిర్మాణం దగ్గర నుండి కర్మకాండల వరకు ఆడంబరాలే. అదే పేదవాడైతే మరో తీరు. ఇదే విషయాన్ని ఈ క్రింది పద్యంలో జాషువా పేర్కొన్నాడు.

వాకొ నరాని గొప్ప ధనవంతుని నిద్దపుఁ బాలరాతిగో
రీకడఁ బారవేయబడి ప్రేలికలం బొరలాడు ప్రేతమే
యాకటి చిచ్చునన్ గుమిలి, యార్చి, గతించిన పేదవాని దొ
నో కద! వానికై వగవ డొక్కడు దాఁచదు కాటి నేలయున్

గొప్ప ధనవంతుని పాలరాతి సమాధి వద్ద ఒక పేదవాని శవం పడి ఉంది. దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అది బహుశా ఏ అనాధ శవమో? జంతువులు పీకి వేయగా పేగులు వేలాడుతూ పడి ఉంది. ఆకలితో కృంగి కృశించి నశించిపోయిన పేదవానిదే అయి ఉంటుంది. దానికోసం ఎవరూ ఏడవరు. కాటినేల కూడా దాన్ని తనలో దాచుకోలేదు. ఎందుకంటే ఎవరో ఒకరు పూనుకుంటే తప్ప మట్టిలో కలవదు. తల్లిదండ్రులను బరువుగా భావించి బ్రతికుండగానే శ్మశానంలో వదిలి వెళుతున్న బిడ్డలు గల సమాజం మనది. అలాంటిది అనాధ శవాన్ని పట్టించుకునే నాధుడేడి? ఇది ఎంత హృదయ విదారకమైన దృశ్యం. అయితే ఇటీవల కాలంలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఏర్పడి అనాధ శవదహన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుంది.ఇది చాలా గొప్ప సామాజిక సేవ.

ముగింపు :

ఈ విధంగా జాషువా శ్మశాన వాటిక ఖండకావ్యంలో తాత్వికతను ప్రతిపద్యంలోనూ ఎంతో హృద్యంగా పొందు పరిచాడు. శ్మశాన వాటికను ఇంతగా తాత్విక చింతనలతో దర్శించిన జాషువా 1971 జూలై 24న ఈ లోకాన్ని విడిచి శాశ్వత నిద్రలోకి చేరుకున్నాడు. వినుకొండలోని శ్మశాన వాటికలో సమాధి నిద్రలో బహుశా కవితా సౌఖ్యాన్ని అనుభవిస్తున్నాడని భావిద్దాం.

ఉపయుక్త గ్రంధాలు :

1. జాషువా ఖండకావ్యం సంపుటి
2. జాతీయకవి జాషువా - డా॥ కాలువ మల్లయ్య
3. గుఱ్ఱం జాషువా - బి. భాస్కర చౌదరి
4. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు
5. అంతర్జాల సమాచారం

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"దళిత సాహిత్యం – చారిత్రక నేపథ్యం"

– జె. సత్యనారాయణ, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

దళిత సాహిత్యం - చారిత్రక నేపథ్యం :

అపౌరుషేయాలని భావించే వేదాల్లో (ఋగ్వేదం-10వ మండలం - పురుష సూక్తం) చాతుర్వర్ణ వ్యవస్థ గురించి ప్రస్తావన కనిపిస్తుంది. దాని ప్రకారం భారతదేశంలో కులవ్యవస్థ సాంఘిక అసమానతలపై బౌద్ధం, జైనం, చార్వాకం మొదలైనవి నిరసనను తెలిపాయి. అహింస, జ్ఞానబోధ, బౌద్ధిక దృక్పథాలపై ప్రధాన దృష్టిని కేంద్రీకరించాయి. కొన్ని వందల యేండ్లుగా బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల వారు తమ అధికారాన్ని చెలాయిస్తూ సంస్కృతి సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కాలంలోనే ముస్లిములు భారతదేశంపై దండయాత్రలు చేసి, చాలా చోట్ల అధికారం హస్తగతం చేసుకున్నారు. ఆ తరువాత కాలంలో పరోక్ష పద్ధతులలో హిందూ సామాజిక వ్యవస్థలో కనిపించే అణచివేత స్వభావాన్నే ముస్లిం పాలకులు కూడా అనుసరించారు. ముస్లిం పాలనలో తమకు అనుకూలమైన వాటిని స్వీకరించి, మిగిలిన వాటిని అణచివేశారు. ఆ తరువాత భక్తి సాహిత్యం ప్రారంభమయింది. ఈ సాహిత్యంలో హిందూ మతంలోని మౌళిక లక్షణాలను విస్మరించకుండా, కొన్నింటిని సంస్కరించే ప్రయత్నం మాత్రం జరిగింది. హిందూ ముస్లిం పాలకుల సంఘర్షణలో బ్రిటీష్ వాళ్ళు భారతదేశాన్ని ఆక్రమించుకున్నారు. కొన్ని వందల యేండ్ల బ్రిటీష్ వారి భౌతిక దృష్టిని కలిగించింది. కొన్ని వందల యేండ్ల బ్రిటీష్ వారి పాలనను వ్యతిరేకిస్తూ జాతీయోద్యమం ఊపందుకుంది. ఈ పరిస్థితుల్లో "జాతీయోద్యమ సాహిత్యం"లో భాగంగా కుల నిర్మూలన కూడా ఒక అంశమయ్యింది. డా॥ బి.ఆర్. అంబేద్కర్, ఇ.వి. రామస్వామి నాయర్, జ్యోతిబాపులే, నారాయణగురు, పెరియర్, సాహూమహారాజ్ మొదలైన వారి ఆలోచనలు దళిత సాహిత్యానికి చారిత్రక, తాత్విక భూమికను ఏర్పరిచాయి.

జ్యోతిబాపులే నిమ్నజాతుల ఉద్ధరణ కోసం "సత్య శోధక సమాజం" (1873) స్థాపించారు. 1910లో కలకత్తా కాంగ్రెస్ సమావేశం అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మాణం చేసింది. 1918లో అఖిల భారత దళిత జాతుల సమావేశాలు బొంబాయిలో జరిగాయి. 1924లో డా॥ బి.ఆర్. అంబేద్కర్ అస్పృశ్యత నివారణోద్యమాన్ని ప్రారంభించారు.

1967 నాటికి జ్యోతిబాపూలే, సాహూ మహారాజ్, కారల్‌మార్క్స్ సిద్ధాంతాలు నీగ్రో సాహిత్యంలోని తిరుగుబాటు కలగలిసి అంబేద్కర్ భావజాలాన్ని ప్రధానంగా చేసుకొని "దళిత సాహిత్యం" ఆవిర్భవించింది. భారత దేశంలో ప్రధానంగా తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్ రాష్ట్రాల్లో బలంగా కనిపించి, దళిత ఉద్యమాలు ఊపందుకున్నాయి. 1981లో భారతీయ దళిత సమాచార పత్రికా సంపాదకుల సదస్సు జరిగింది. 1984లో భారతీయ దళిత సాహిత్య అకాడమీని స్థాపించారు. దీనితో రాజకీయంగా కూడా దళితులలో చైతన్యం వెల్లువెత్తింది. ఈ ప్రభావం కూడా తెలుగు సాహిత్యంపై కనిపించింది.

దళిత గేయం :

అస్పృశ్యతను నిరసిస్తూ 1909లో అజ్ఞాత కవి "మాలవాండ్ర పాట"లో అందారు పుట్టిరీ హిందమ్మ తల్లికి - ఎట్టాగు ఎక్కువ బ్యాపన్లు మాకంటె" అని నిలదీశారు. "మంచియన్నది మాలయైతే మాలనే అగుదన్" అని గురజాడ గారు అన్నారు. జయధీర్ తిరుమలరావు ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన "దళిత గీతాలు" (1993)లో చాలా వరకు అస్పృశ్యత నివారణకు ప్రయత్నించిన గేయాలున్నాయి. 1930లో రాసిన "అంటరానివారెవరు" గేయం, బొబ్బిలి యుద్ధం. బుర్రకథ వరుసలో వీర

రసాత్మకంగా సాగింది. నక్కా చిన వెంకయ్య "హరిజన కీర్తనలు" బాగా ప్రసిద్ధి పొందాయి. బోయి భీమన్న, డా॥ బి.ఆర్. అంబేడ్కర్‌పై రాసిన "జయ జయ అంబేడ్కర" 1992 మాష్టార్టీ "అందుకో దండాలు బాబా అంబేడ్కరా" గేయాలు ప్రార్థనా గీతాలయ్యాయి. గద్దర్ పొట్ట కూటి కోసం "పోలీసోడు" "దళిత పులులమ్మా", గేయాలు, యువక "కర్మభూమిలో పూసిన ఓ పువ్వా", గూడ అంజయ్య రాసిన "ఊరు మనదిరా ఈ వాడ మనదిరా" గేయాలు దళితులను నేటికీ ఉర్రూతలూగిస్తున్నాయి. వంగపండు ప్రసాదరావు, శివసాగర్, ఉ.సాంబశివరావు ఇంకా అనేకమంది రాసిన గేయాలలో చాలా వరకు సంస్కరణ, మార్క్సిస్టు భావాలు అధికంగా ఉన్నా దళిత జీవితమే స్పష్టమవుతుంది.

1990లో చుండూరులో దళితులను ఊచకోత కోశారు. దీనితో అంతవరకు అభ్యుదయ, సంస్కరణోద్యమ విప్లవ సాహిత్యం రాస్తున్న తెలుగు రచయితలు, కవులు దళిత సాహిత్యంపై దృష్టిని కేంద్రీకరించారు. తెలుగు సాహిత్య చరిత్రలో 12వ శతాబ్దంలో శివకవులు నిమ్న జాతీయులని పిలవబడుతున్న దళితులను శైవమతం వైపు ఆకర్షించేటట్లు చేసిన రచనలు కొన్ని కనిపిస్తున్నాయి. 13వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు భక్తి ఉద్యమం పేరుతో హిందూ మతంలో సంస్కరణ దిశగా రచనలు వచ్చాయి. 16వ శతాబ్దానికి చెంది శ్రీ కృష్ణదేవరాయలు "ఆముక్తమాల్యద"లో మాలదాసరి కథ రాయడంలోనూ కుల ప్రభావాన్ని గుర్తించారు.

17వ శతాబ్దంలో పోతులూరి వీరబ్రహ్మం, వేమన వంటి కవులు కులం వల్ల కలిగే సాంగిక నిమ్నోన్నతాలను నిరసిస్తూ రచనలు చేశారు. 18,19 శతాబ్దాలలో జమీందారీల పెత్తనం, వారి అధికారం క్షీణించటంతో పాశ్చాత్య పాలనకు, పాశ్చాత్య విద్యకు ద్వారాలు తెరిచాయి.

దళిత పద్య కవిత్వం :

అస్పృశ్యతా నివారణను ప్రతిఫలించే గేయాలు మాత్రం ఛందస్సులో పద్యాలలో దళిత, దళితేతరులు రాసినా, 1915లో మంగిపూడి వెంకటశర్మగారి "నిరుద్ధ భారతం" ఛందోబద్ధ దళిత పద్యకావ్యాల్లో మొదటి రచన. ఆ సాహిత్యాన్ని ప్రశ్నిస్తూ తనదైన అస్తిత్వంతో ముందు కొచ్చింది. వేమన, తత్వ కవులు మానవతా దృక్పథంతోనూ, జాతీయోద్యమం అస్పృశ్యతా సమస్యను ప్రధానంగా గుర్తించి, మతస్పృహలో దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేసింది.

అభ్యుదయ సాహిత్యం పీడిత శ్రామిక వర్గ సమస్యలలో భాగంగానే దళిత సమస్యలకు పరిష్కారాన్ని సూచించింది. విప్లవ సాహిత్యం గిరిజన సమస్యలతో పాటు దళిత సమస్యలను వర్గ దృష్టితో ప్రత్యేక ప్రాధాన్యాన్ని చ్చింది. ఆర్థిక కోణానికి అధిక ప్రాధాన్యాన్నిచ్చే విప్లవ స్పృహతో సమాంతరంగా సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడా దళిత చైతన్యం విస్తరించింది. వర్గం కంటే దళిత సమస్య "కులం"తోనే ముడిపడి ఉందని గుర్తించి, ఆ అంశాలను ప్రధానంగా తీసుకొచ్చింది.

1990లో ఒక అజ్ఞాత కవి రాసిన "మాలవాండ్ర పాట"ను తొలి దళిత గేయంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఇది ఆంధ్ర భారతి మాసపత్రికలో అచ్చయ్యింది. 1915లో మంగిపూడి వెంకటశర్మ "నిరుద్ధ భారతం" అనే పద్య కావ్యాన్ని రాశారు.

1921లో రాసిన "మేలుకొలుపు" గీతం పురాణాల్లో దళితుల గొప్పతనం కీర్తించే విధంగా ఉంది. 1930లో జాలా రంగస్వామి రాసిన "అంటరాని వాడవ్వడు" పాట. 1933లోనే కుసుమ ధర్మన్న రాసిన "హరిజన శతకం" దళితుల మనోభావాలను బాగా పట్టుకోగలిగాయి. 1933లోనే కుసుమ ధర్మన్న రాసన "మాకొద్దీ నల్లదొరతనము" గేయం ఒక ఊపు ఊపింది. 1941 గుర్రం జాషువా రాసిన "గబ్బిలం" కావ్యంలో దళితుల వేదనా భరిత జీవితాలను,

"జెప్పుల కుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే దెప్పుడు
నప్పు వడ్డది సుమీ భారతావని వీని సేవకున్" -

అని జాషువా వర్ణించాడు.

దళితుల శ్రమను విలువ కట్టడం సాధ్యం కాదంటున్నారు కవి.

గాంధీ ప్రభావంతో దళితేతరుడైన తుమ్మల సీతా రామమూర్తి అస్పృశ్యతా నివారణను కోరుతూ....

"హరిజనుల యందు నేను నొక్కరుండననుచు
నెపుడు ప్రతి హైందవుడు నిర్ణయించుకొనునూ
యపుడె యస్పృశ్యతా భూతమాపరిల్లు
నపుడె శుచితామయ సమాజయవతరించు"ను. అనే భావాలతో పద్యాలను రాశారు. ఇలా అనేక మంది పద్య కవిత్వం ద్వారా కూడా దళిత సమస్యను వర్ణించే ప్రయత్నం చేశారు. కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్నలను దళిత పద్య కవిత్వం అభి వర్ణించవచ్చు.

దళితుల గురించి తొలిసారిగా "విరుద్ధ భారతం" కావ్యాన్ని రాసిన మంగిపూడి వేంకటశర్మ అస్పృశ్యతను నిరసిస్తూ....

"మాలలని, పంచములటంచు, మాదిగలని
శ్వపచులని, చెప్పగారాని వారటంచు
మరియు చండాలురని తోడి మానవులను
దురలి వేయుట సాంఘిక ధర్మమగునె"

అని సంఘాన్ని ప్రశ్నించారు. మొత్తం మీద దళిత పద్య కవిత్వంలో మూడు ప్రధాన ధోరణులు కనిపిస్తు న్నాయి. అవి 1. గాంధీ ప్రభావం 2. గాంధీ - అంబేడ్కర్ ప్రభావం 3. హేతువాద భావాలు గల పురాణ విమర్శతో కూడిన మానవతావాద ధోరణులుగా చెప్పుకోవచ్చు.

దళిత సాహిత్యం - ఆరంభ వికాసాలు :

భారతదేశ వ్యాప్తంగా జరిగిన పాలన, ఆర్థికపర అంశాల కారణంగా వచ్చిన సామాజిక ఉద్యమాలు వచ్చాయి. దాని ప్రభావంతో వెలువడుతున్న సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక ప్రత్యేక విభాగమయ్యింది. 1960 నుండి దళిత సాహిత్యం ప్రాచుర్యాన్ని పొందింది. విమర్శకులు ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు క్రింది విధంగా విశ్లేషించారు.

1970లలో మరాఠీ, కన్నడ భాషలలో నిర్ధిష్ట లక్ష్యాలతో, ప్రత్యేకమైన అభివ్యక్తులతో దళిత సాహిత్యం పురోగమించింది. 1980లో తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం నిర్ధిష్ట రూపాన్ని పొందింది.

దళిత సాహిత్య - ప్రక్రియలు :

తెలుగులో దళిత సాహిత్యం ప్రధానంగా "దళిత కవిత్వమే" అన్నంతగా కవిత్వం వెలువడింది. అదే స్థాయిలో కాకపోయిన కథలు కూడా ఎక్కువగానే వచ్చాయి. నవలలు, నాటకాలు కూడా వచ్చిన సంఖ్యా పరంగా చెప్పుకోదగినన్ని రాలేదు. ఆత్మకథ అనువాదాలు కూడా కొన్ని వచ్చాయి. 1985 తరువాత వచ్చిన రచనల్లో జీవితానుభవాలతో కూడాన దళిత చైతన్యం ప్రతిఫలిం చింది. వివిధ పుస్తకాలకు రాసిన ముందు మాటలు, పత్రికా వ్యాసాలు, పుస్తకాల రూపంలో దళిత సాహిత్యం విమర్శ వచ్చింది. విశ్వవిద్యాలయాల్లో దళిత సాహిత్యంపై పరిశోధనలు జరుగుతున్నాయి. అలా దళిత సాహిత్యం ప్రక్రియా వైవిధ్యాన్ని సాధించింది. ఆ తరువాత పేర్కొన దగిన పద్యాలు, కావ్యాలు, శతకాలు చాలా వరకు వచ్చాయి. అయితే అవి జాతీయోధ్య సాహిత్యంలో భాగంగా గాంధీ ప్రభావంతో వెలువడినవి.

కుసుమ ధర్మన్న (హరిజన శతకం - 1933), కర్ణ వీర నాగేశ్వరరావు (అస్పృశ్యుల విజ్ఞప్తి - 1936), బిర్రీడి మోషే (హరిజనాభ్యుదయం, (జోసెఫ్ కన్నీటి కబురు) (జాన్ - బహిష్కారం - 1963), సవ్వప్పగారి ఈరన్న (కడలి కెరటం - 1987), ఎన్.టి. జ్ఞానానంద కవి - పాంచజన్యం, ధర్మాగ్రహం, ఇలా ఎంతో మంది కవులు దళిత సాహిత్యం కోసం ఎన్నో సాహిత్య ప్రక్రియను పేర్కొనడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు కవితోద్యమాలు
2) తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న
3) గుర్రం జాషువా - గబ్బిలం
4) నిరుద్ధ భారతం - మంగిపూడి వెంకటశర్మ

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"అభాగ్యుని జీవన వేదనను దేవునికి సమర్పించిన కావ్యం - గబ్బిలం"

- నెల్లి సంతోషకుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

భారతీయ సమాజం మిగతా సమాజాల కంటే నిర్మాణంలో ఎన్నో వైరుధ్యాలను సంక్లిష్టతలను కలిగి ఉన్న సమాజం. మిగతా సమాజంలో లేని కులం వర్ణం భారతీయ సమాజంలో ప్రత్యేకత. ఆ కులం కూడా వేలాది శాఖోపశాఖలుగా విస్తరించి దీనవలన భారతీయ సమాజంలో అనేక అంతరవులు అసమాన వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఋగ్వేదం పదవ మండలం పురుషసూక్తంలో కుల విభజనకు సంబంధించి శ్లోకం ఉంది. రామాయణంలో నాలుగు కులాల ప్రస్తావన కలదు. భారతం కాలం నాటికి నాలుగుగా ఉన్న కులాలు ఆ తరువాత అయిదుగా తదనాంతరం కాలంలో అనేక ఉపకులాలుగా విస్తరించాయి.

పంచమ కులస్తులుగా ముద్ర వేసి ఊరికి దూరంగా వెలివేయబడ్డాయి. నీచమైన వృత్తులు అంటగట్టి వీరిపట్ల అస్పృశ్యత పాటిస్తూ వీరిని కనీనం మానవులుగా గుర్తించలేదు.

భారతీయ సమాజం దీనికి పూర్వ జన్మలో చేసుకున్న కర్మలే కారణమని ఒక అభూత కల్పనతో కూడిన కర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది. దీని కారణంగా ఎన్నో ఏళ్ళుగా ఎన్నో తరాలుగా పంచములు ఊరికి దూరంగా, జీవన స్రవంతికి దూరంగా బ్రతుకులు వెళ్ళదీస్తూ వచ్చారు.

అటువంటి సమాజంలో ఉన్న అస్పృశ్యత అంటరాని తనం వలన జాషువా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. జాషువ కవిత్వానికి ఒక ప్రత్యేక ఉంది. ఆయన జీవితమే కవిత్వం. దళిత కుటుంబంలో పుట్టి ఎన్నో బాధలు అనుభవించి ఆ అనుభవంలో నుండి వచ్చిన కవిత్వం కాబట్టి ప్రతి పదం వెనుక భయం బాధ ఆర్ధత ఆత్మాభిమానం కళ్ళకు కట్టినట్లుగా ఉంటుంది. జాషువా చిన్నప్పుడు స్కూల్‌లో దూరంగా కూర్చుని పెట్టేవారు.

"కులమతాలు గీచుకొన్న గీతలు చొచ్చి
పంజరానా కట్టువడను నేను
నిఖిల లోకమెట్ల నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వనరుడ నేను"

అని తన ఆశయాన్ని ప్రకటించిన మానవతవాది గుర్రం జాషువా. ఈయన 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా వినుకొండ గ్రామంలో లింగమాంబ వీరయ్య దంపతులకు జన్మించాడు. ఈయన సమాజంలో సంకుచిత దృష్టిని స్వార్ధపరతత్వాన్ని తన రచనలు ద్వారా ఎండగట్టారు. మత పిచ్చిగాని, స్వార్ధ చింతన గాని తన కవిత్వంలో ఉండదని ఆధునికాంధ్ర సాహిత్యంలో తనదైన ప్రతిభను ప్రదర్శించి విశిష్ట కవిగా ఖ్యాతికెక్కాడు. అయన రాసిన ప్రతి పద్యం వెనుక సంస్కరణ భావం ప్రబోధ దీప్తి ఉన్నాయనటం సముచితం.

"గవ్వకు సాటి రాని పలుకాకులు మూకల సూయాచేతన
న్నే విది దురినన్ ననువరించిన శారదా లేచిపోయినే"

అని ప్రతిభను కులమతాలు తక్కెడలో తూచరాదు అన్నారు.

వడగాల్పులు నా జీవితం అయితే వెన్నెల నా కవిత్వం, అనేక విపత్కర పరిస్థితులను ఎదుర్కొని వెన్నెల వంటి చల్లని కవిత్వాన్ని అందించాడు. అటువంటి వాటిలో స్వప్నకార, కాందీశీకుడు, స్వయంవరం, నాగార్జునసాగర్, ముసాపరులు, స్మశానవాటిక, వాటిలో మణితునక వంటిది గబ్బిలం కావ్యం.

ఈ కావ్యంలో ఆబాగ్యుడు అయినటువంటి కథా నాయకుడు చెప్పులు కుట్టి బతుకుబండిని లాగే అరుంధతి సుతుడు. ఈ లోకంలో అస్పృశ్యత పరిస్థితుల్ని పేదల బాధల్ని శివునికి పూజారి లేని సమయంలో విన్నవించవలసిందిగా గబ్బిలానికి కథానాయకుడు విన్నవించుకుంటాడు.

గబ్బిలం కావ్యంలో కథ దక్షిణ భారతదేశంలో నుంచి సాగిన ఈ కథ కైలాసం వరకూ వెళుతుంది. ఇందులో దేశారాధనం ఉంది. గబ్బిలం కావ్యన్ని ప్రారంభిస్తూ కార్యనాయకుడై అరుంధతి సుతిని పరిచయం చేస్తూ...

"చిక్కిన కాసుచేతనివిఁ జెందు నమాయకుడెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మరచి పోవు క్షుదానల దగ్ధమూర్తి, న
ల్దిక్కులు గల్గు లోకమున దిక్కరి యున్న యరుందతీ సుతం
డొక్కడు జన్మమెత్తె భరతోర్వరకుంగడగొట్టు బిడ్డడై"

అరుంధతీ సుతిని గూర్చి ఈ పద్యంలో జాషువా ప్రయోగించిన ప్రతి పదమూ విలువైనదే "చిక్కినకాసుచే" అని మొదలు పెట్టాడు. అరుంధతి సుతునికి చిక్కనకాసు అంటే అతడు కాయకష్టం చెయ్యగా దానికి ప్రతిఫలంగా వచ్చిన కాసు అని అర్థం. తనకు దొరికిన కాసుతోనే తృప్తి పడుతున్నాడు అని చెప్పటం వలన లోకంలో ఎంతో మంది తరతరాలు తిన్న తరగని సంపదలున్నా తృప్తి పడటం లేదనే భావాన్ని వ్యంగ్యంగా జాషువా ప్రకటిస్తున్నట్లుగా గుర్తించాలి. తృప్తి మనిషికి అవసరం అనే ప్రబోధాన్ని జాషువా పరోక్షంగా ప్రబోధించారు.

"ముప్పుఘటించి వీనికులమున్ గలిమిన్ గబాళించి, దేహమున్
బిప్పియొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగాఁ
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని విని సేవకున్"

భారతదేశం అరుంధతీ సుతిని ఎలా దోచుకున్నదో, అణగదొక్కిందో చూపటానికి జాషువా ఈ పద్యాన్ని "ముప్పు ఘటించి" అని మొదలుపెట్టాడు. భారతదేశంలో జన్మించిన నాలుగు వర్ణాల వారు అరుంధతీ సుతునికి ఆపదలు కలిగించిన వారే, అతని కులాన్ని సంపదను హరించి, శరీరాన్ని పిప్పి చేసినా అతడు మాత్రం భారతీయుల పాదాలు కందకుండగా, అంటే ఎర్రబడ కుండగా, బాధపడకుండగా చెప్పులు కుట్టి జీవనం సాగిస్తున్నాడు. దయనీయమైన జీవితాన్ని గడుపుతున్న అరుంధతీ సుతిని ఉద్ధరించే భగవంతుడే కనిపించడం లేదు, ముక్కోటి దేవతలుఉన్న ఈ భారతదేశంలో ఏ భగవంతుడూ అతన్ని పట్టించుకోవడం లేదని, అతని పట్ల దయ చూపడం లేదని, అట్టాంటిది మానవుడు ఎట్లా అతణ్ణి కరుణిస్తాడు. వాడు చేసుకొన్న పాపం ఏమిటో ఇంతవరకు ఎవరికి తెలియదు.

"ఆ యాభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరి బుసకొట్టు నాతని గారిసోఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

హైందవ సమాజంలో ఒక వైపు పేదరికం మరోవైపు అంటరానితనం ఆ అరుంధతీ సుతిని పట్టిపీడుస్తున్నాయి. అభాగ్యుడు అంటే సంపద లేనివాడు, దరిద్రుడు, పేదవాడు. అతని రక్తాన్ని హరించి ఇనుపగజ్జెల తల్లి జీవనం చేస్తుందని చెప్పారు.

పగలంత కష్టపడి వచ్చిన అరుంధతీ సుతునికి నిద్రకు సిద్ధమవుతుండగా ఒక గబ్బిలం అతని ఇంటిలోకి ప్రవేశించడం అతని ఇంటిలో ఉన్న ఆముదపు దీపం ఆరిపోయింది. గబ్బిలాన్ని చూసి అరుంధతి సుతుడు కొత్త కొత్త ఆలోచనలు వచ్చాయి. దానికి తనకథను వివరించడం జరుగుతుంది.

ఈ లోకానికి హృదయం లేదని అరుంధతీ సుతుడు పలికాడు. జాలి హృదయం, దయగల హృదయం లేదు కాబట్టి తన ఇష్టం వచ్చినట్లుగా సమాజం ప్రవర్తిస్తుందని చెప్పాడు. బ్రహ్మాది దేవతలు కూడా ధనవంతుడు ఆజ్ఞాపిస్తే కనీసం నోరు తెరచి మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. ధనవంతులు అధికారం నిర్వహిస్తూ ప్రపంచాన్ని

శాసిస్తున్నారని గబ్బిలముతో తన వేదనను చెప్పుకున్నాడు. అరుంధతి సుతుడు మాటలు ద్వారా లోకంలో దేవత విగ్రహాలు కళ్యాణానికి వందలు వేలు ఖర్చు పెడతారు. కానీ దేవాలయము ముందు కూర్చొన్న పేద బైరాగుల పాత్రలలో ఒక్క మెతుకు కూడా విదల్చరు అని అరుంధతీ సుతుడు వాపోయాడు. అరుంధతి సుతుడు గబ్బిలంతో మాట్లాడతూ... ఈ రాత్రి సమస్త లోకాన్ని నిద్రపుచ్చింది కానీ ఔషదం లేని అస్పృశ్యతా జాత్యుడైన తనను మర్చిపోయిందని తనకు నిద్రపట్టకుండా చేసిందని తన బాధను గబ్బిలంతో తెలియజేసాడు.

కర్మసిద్ధాంతంలో తన నోరును కట్టివేసి, స్వార్థపరులు తన భుక్తిని కూడా అనుభవిస్తున్నారని కర్మమంటే ఏమిటో దానికి తన మీద ఎందుకో అంత కక్ష ఉందో ఈశ్వరుని చేత రుజువు చేయించడానికి గబ్బిలానికి జాగ్రత్త చెబుతూ ఇలా పలికాడు. మృగ పక్షి లక్షణాలతో ఉన్న విచిత్ర ప్రాణి గబ్బిలము తన సందేశాన్ని శివునికి అందించమని అభాగ్యుడు అరుంధతీ సుతుడు అర్థిస్తూ తన బాధలను గబ్బిలంతో చెప్పుకున్నాడు.

గబ్బిలం కావ్యంలో ఆనాటి సమాజంలో ఉన్న వర్ణవివక్ష, అంటరానితనాన్ని సూచికగా గబ్బిలాన్ని, పాడుబడ్డ గుడిని పేర్కొని కైలాసంలో ఉన్న శివునికి తన వృత్తాంతాన్ని తెలియజేయడం గబ్బిలం కావ్యం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

గబ్బిలం కావ్యం ద్వారా ఆనాటి సమాజంలో ఉన్న వర్ణ కుల మతం అస్పృశ్యత వంటి సామాజిక రుగ్మతలను గబ్బిలం కావ్యం ద్వారా శారద వరించిన కవిగా జాషువా ప్రసిద్ధుడు జాషువా రచించిన ప్రతీ కావ్యం వెనుక ఏదో ఒక ప్రేరణతో ఒక దృడమైన కారణం లేదా సంఘ సంస్కరణ భావాలు ఉంటాయి. జాషువా తనను తాను విశ్వనరుడుగా, విలక్షణ చక్రవర్తిగా, గబ్బిలం కావ్యం ద్వారా నిరూపించుకున్న విశిష్ట ప్రతిభాసముద్రుడు జాషువా.

పాదసూచికలు :

1) తెలుగులో కవితోద్యమాలు - తెలుగు అకాడమీ
2) గుర్రం జాషువా పద్య చంద్రిక - డా॥ గుమ్మా సాంబశివరావు
3) ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - తెలుగు అకాడమీ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"జాషువా గబ్బిలంలో దళిత తత్వం"

– పొట్నంగి సత్యనారాయణ, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

భారతీయ సమాజం మిగతా సమాజాల కంటే నిర్మాణంలో ఎన్నో వైరుధ్యాలను, సంక్లిష్టతలను కలిగి ఉన్న సమాజం. మిగతా సమాజాలలో లేని వర్ణం, కులం భారతీయ సమాజం ప్రత్యేకత. ఆ కులం కూడా వేలాదిగా శాఖోపశాఖలుగా విస్తరించింది. దీని వల్ల భారతీయ సమాజంలో అనేక అంతరువులు, అసమవ్యవస్థ ఏర్పడ్డాయి. రుగ్వేదం పదవ మండలంలోని పురుష సూక్తంలో కుల విభజనకు సంబంధించిన శ్లోకం ఉంది. రామాయణంలో నాలుగు కులాల ప్రస్తావన ఉంది. భారతం కాలం నాటికి నాలుగుగా ఉన్న కులాలు ఆ తరువాత అయిదుగా తదనంతర కాలంలో అనేక ఉప కులాలుగా విస్తరించాయి. పంచమ కులస్థులుగా ముద్ర వేసి, ఊరికి దూరంగా నెట్టబడి, నీచమైన వృత్తులు అంటగట్టి, వారి పట్ల అస్పృశ్యతను పాటిస్తూ వారిని కనీసం మానవులుగా గుర్తించలేదు భారతీయ సమాజం. 1980వ దశకం నుంచి చెదురుముదురుగా వస్తున్న దళిత కవిత్వం 1990 నాటికి ఒక నిర్దిష్ట రూపాన్ని తీసుకుంది. తొలిరోజుల్లో ఆవేశ ప్రధానంగా సాగిన కవితోద్యమం ఆ తరువాత ఆలోచనాత్మకంగా సాగింది. తెలుగులో వచ్చిన కవితోద్యమాలలో దళిత సాహిత్యం అంత వివాదాస్పద సాహిత్యం మరొకటి లేదు.

జడజగత్తును రసమయం చేసి చైతన్య భిక్ష పెట్టేది కవిత్వం. ఆధునికాంధ్ర సాహిత్య జగత్తులో సంప్రదాయ చ్ఛందాన్ని స్వీకరించి సామాజికాభ్యుదయం కోసమే సాహితీ వ్రతాన్ని సాగించిన ప్రజాకవి గుఱ్ఱం జాషువా. శారదా వరించిన కవిగా ప్రసిద్ధుడు గుఱ్ఱం జషువా. ఇతను రచించిన ప్రతీ కావ్యం భావం, ప్రభోద దీప్తి ఉన్నా యనటం సముచితం. పద్యం ద్వారా అభ్యుదయాన్ని ఆశించిన కవిగా జాషువా ప్రసిద్ధుడు. విశ్వనరునిగా తననుతాను ప్రకటించుకున్న విలక్షణ చక్రవర్తి గుర్రం జాషువా. ఖండకావ్య రచనలో, లఘుకావ్య నిర్మాణంలో తనకుతానే సాటి అని నిరూపించుకున్న విశిష్ఠ ప్రతిభా సముద్రుడు. జాషువాను తొలి దళిత కవిగా పేర్కొం టారు. జాషువా ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా వినుకొండ గ్రామంలో 1895 సెప్టెంబర్ 28న జన్మిం చారు. జాషువా తల్లిదండ్రులు లింగమాంబ, వీరయ్య దంపతులు. జాషువ తండ్రి వీరయ్య యాదవ కులానికి, తల్లి లింగమాంబ, మాదిగ కులానికి చెందినవారు. పేదరికం మరియు అతని తల్లిదండ్రుల కులాంతర వివాహం కారణంగా, కొన్ని కులాలు "అంటరానివి"గా పరిగణించబడే సమాజంలో అతని బాల్యం కష్టంగా ఉంది. జాషువా మరియు అతని సోదరుడు అతని తల్లిదండ్రులు క్రైస్తవులుగా పెరిగారు. ఉన్నత విద్య అవసరాలను తీర్చడానికి జాషువా ఎంతగానో కృషి చేశారు. "అంటరానితనం" దళిత హక్కులు మరియు విభజనకు వ్యతిరేఖంగా నిరసనలు జాషువా యొక్క అన్ని రచనలలో సాధారణ ఇతివృత్తాలు. ఆంధ్రప్రదేశ్‌లోని దళిత సంఘాలు జాషువాను మొదటి ఆధునిక తెలుగు దళిత కవిగా పరిగణిస్తాయి.

జాషువా రైలుబండిలో ప్రయాణం చేస్తుండగా అతని కవిత్వాన్ని పొగిడిన వారు, కులం గురించి అడిగి తెలుసుకొని జాషువాను అంటరానివాడిగా చూసే సందర్భంలో ఈ క్రింది పద్యం చెబుతారు.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపురే
ఖా కమనీయ వైఖరులు గాంచి భళీ భళీ యన్నవాడె మీ
దేకుల? మన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచే
బాకున క్రమ్మినట్లుగును పార్థివ చంద్ర! వచింప సిగ్గునన్"

పుట్టుకతో దళితుడైన జాషువా కవి శేఖరుడిగా, నవయుగ చక్రవర్తి, తన కవితా ప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి, విశ్వమానవుడు శ్రీ గుర్రం జాషువాగారు. ఆధునిక తెలుగు దళిత కవుల్లో ప్రముఖులు గుర్రం జాషువా. "నాకు గురువులు ఇద్దరు - పేదరికం, కులమత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదురించే శక్తిని పెంచింది" అని జాషువా చెప్పారు.

జాషువా రచనల్లో గబ్బిలము అద్భుతమైనది. ఇది రెండు భాగాలుగా వెలువడింది. మొదటి భాగాన్ని 1941లో రచించాడు. దీన్ని కల్లూరి చంద్రమౌళి చౌదరి గారికి అంకితమిచ్చాడు. చెప్పులు కుట్టి బతుకు బండిని లాగే అరుంధతీ సుతుడు కావ్య నాయకుడు. లోకంలోని అస్థవ్యస్థ పరిస్థితుల్ని, పేదల భాదల్ని శివునికి పూజారి లేని సమయంలో విన్నవించవలసిందిగా గబ్బిలానికి కథానాయకుడు విన్నవించుకొంటాడు. దక్షిణ భారతదేశం నుంచి సాగి ఈ కథ కైలాసం వరకు వెళుతుంది. ఇందులో దేశారాధనం ఉంది.

అరుంధతీ సుతునికి చిక్కిన కాసు అంటే అతను కష్టం చెయ్యగా దానికి ప్రతిఫలంగా వచ్చిన కాసు అని అర్థం చేసుకోవాలి. తనకు దొరికిన కాసుతోనే తృప్తి పడుతున్నాడని చెప్పటం వల్ల లోకంలో ఎంతోమంది తరతరాలుగా తిన్నా తరగిపోని సంపదలున్నా తృప్తిపడటం లేదనే భావాన్ని వ్యంగ్యంగా జాషువా ప్రకటిస్తున్నట్లు గుర్తించాలి. తృప్తి మనిషికి అవసరం అనే ప్రభోదాన్ని జాషువా పరోక్షంగా ప్రభోదిస్తున్నాడు. అరుంధతీసుతుడు అమాయకుడు. అంటే మోసం చెయ్యటం తెలియనివాడు. నిష్కల్మషుడు తన కష్టాలన్నిటినీ బొక్కెడు బువ్వతో మరచిపోయే ఆకలి అనే అగ్నికి దగ్ధమవుతున్న ప్రాణి అతడు. బొక్కెడు బువ్వ అంటే పుక్కిలిలో పట్టినంత బువ్వ తింటే చాలు సంతోషపడతాడు. లోకంలో నాలుగు దిక్కులున్నాయి. కానీ అరుంధతీ సుతునికి ఏ దిక్కూలేదు. అందుకే జాషువ "దిక్కరియున్న" అని చెప్పాడు. అంటే అరుంధతీ సుతునికీ సంబంధించిన వారెవరు లేరని అర్థం. అరుంధతీ సుతుని గురించి జాషువా ఈ పద్యంలో ప్రయోగించిన ప్రతీపదం విలువైనదిగా భావించాలి.

"చిక్కిన కాసుచే తనివి జెందు నమాయకుడెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మరచిపోవు.....
..... భరతోర్వరకుంకడగొట్టు బిడ్డడై"

జాషువా అరుంధతీ సుతుని యొక్క మనస్తత్వాన్ని చిత్రించిన తీరు అమోఘమైనది. దళితులు నేడు ఎదుర్కొంటున్న అంటరానితనాన్ని ఈ పద్యంలో వ్యతిరేఖించడం జరిగింది. జాషువా దళితుల కీర్తిని కాంక్షిస్తూ గబ్బిలం వ్రాశారు. హైందవ సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ గురించి జాషువా క్రింది పద్యంలో వర్ణించారు.

"ఆయభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరిబుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

ఒకవైపు పేదరికం, మరోవైపు అంటరానితనం ఆ అరుంధతీ సుతునికి పీడిస్తున్నాయని చెప్పాడు. అభాగ్యుడు అంటే సంపదలు లేనివాడు, దరిద్రుడు, పేదవాడు. అతని రక్తాన్ని హరించి ఇనుప గజ్జెల తల్లి జీవనం చేస్తున్నదని చెప్పాడు. దరిద్ర దేవత అని చెప్పటానికి జాషువా ప్రయోగించే పదబంధం "ఇనుప గజ్జెల తల్లి" ఇనుపగజ్జెల తల్లి అతని రక్తాన్ని హరించి అతనితో జీవనం సాగిస్తున్నదని చెప్పటం ద్వారా జాషువా అరుంధతీ సుతుని పేదరికాన్ని స్ఫురింపజేశాడు. అతని గాలి సోకితేనే నాలుగు వర్ణాల వ్యవస్థతో కూడిన హైందవ నాగరాజు బుసలు కొడుతున్నాడని జాషువా ప్రకటించాడు. "నాగరాజు" పదబంధాన్ని జాషువా సమర్థంగా ప్రయోగించాడు. "నాగ" శబ్దానికి పలు తలలు గల పాము అని అర్థం. అనేక వర్ణాలు గల వ్యవస్థ కాబట్టి హైందవ సమాజానికి "నాగ" శబ్దం సముచితంగా కుదిరింది.

శివాలయాల్లో గబ్బిలాలు వేలాడుతూ ఉండటం సహజం. అవి తల్లకిందులుగా వేలాడతాయి. కాబట్టి వాటి నోటికి శివుని చెవి కొంచెం దగ్గరగా ఉంటుంది. అందుకే గబ్బిలంతో అరుంధతీసుతుడు శివుని చెవి నీకు సమీపంగా ఉంటుందని చెప్పి, పూజారి లేని సమయంలో తన భాదాతప్త చరిత్రను వివరించమని అరుంధతీ సుతుడు వేడుకొన్నాడు. పూజారి ఉంటే గబ్బిలాన్ని మాట్లాడనివ్వడని, తనగోడు శివునికి తెలియదని అరుంధతీ సుతుని ఆవేదన. తెల్లవారబోతున్నదని గబ్బిలం తన రెక్కల్ని విసిరి అరుంధతీ సుతుని శ్రమను పోగొట్టిందని, దానికి ప్రత్యుపకారంగా తానేమి ఇవ్వలేక ఋణగ్రస్థుడును అయ్యానని తన బాధను చెప్పాడు.

అంబేద్కర్ ఘనతను గూర్చి అరుంధతీసుతుడు గబ్బిలాన్ని అడిగిన తీరును జాషువా చెప్పాడు. అంట రానివారి అభివృద్ధి కోసం తన జీవితాన్ని వెచ్చించిన మహానుభావుడు అంబేద్కర్. ఆనాటి అగ్రవర్ణాల వారిని ఎన్నో పోరాటాలు సాగించిన మానవతామూర్తి అంబేద్కర్. అందుకే జాషువా అరుంధతీ సుతునితో అంబేద్కరు "నా సహోదరుడు" అనిపించాడు. తన వాక్పటిమతో, మేధతో అందరి మెప్పుల్ని అందుకోగలిగాడు. అలాంటి మహాను భావుడు గబ్బిలానికి స్వాగతాన్ని పలికి పువ్వులతో పూజించాడా అని అరుందతీసుతుడు అడిగాడు. అట్టడుగు వర్గాల వారి ఔన్నత్యానికి, వారి జీవితాలు బాగుపడటానికి అంబేద్కర్ కేవలం మన దేశంలో పోరాటాలు సాగించడమే కాకుండా బ్రిటన్‌లో కూడా పోరాడారు.

భారతీయ సమాజంలో ఉన్న కులవ్యవస్థను నిరసించే భావంతో సాగిన జాషువా ఆవేదనకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్నదని చెప్పటం సముచితం. సమాజం వ్యక్తిగత ప్రతిభకు విలువనివ్వకుండా కులానికి మాత్రమే గుర్తింపునిస్తున్నదనే బాధతో జాషువా గబ్బిలంలో చెప్పాడు. ఇతిహాసంలో జరిగిన గబ్బిలంలో చెబుతూ మహాభారతంలో కుంతీదేవి సూర్యభగవానుని దయతో సద్యోగర్భంలో కర్ణుని కని, సమాజం తన గురించి ఏమనుకుంటుందోనని భయపడి పుట్టిన బిడ్డని గంగా నదికి అర్పించింది. ఆ బిడ్డను సూతుడు పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పించాడు. కౌరవులు, పాండవులు విద్యాకౌశలాన్ని ప్రదర్శిస్తున్న సమయంలో కర్ణుడు అక్కడకు వెళ్ళి తన విద్యా ప్రదర్శణకు అనుమతి ఇవ్వమని కోరగా అతడు క్షత్రియుడు కాని కారణంగా అతనికి అవకాశం లభించలేదు. దుర్యోధనుని సహాయంతో రాజ్యాన్ని పొంది విద్యా ప్రదర్శణ చేస్తాడు. మహాభారతంలో ఏకలవ్యుడిని దళితునిగా భావించి గురువు విద్య అందించడానికి నిరాకరిస్తాడు అని గబ్బిలం కావ్యంలో నివేదిస్తారు.

దళితులను అంటరానివారిగా భావించి ఆలయా లలోని ప్రవేశించడానికి నిరాకరించేవారు అందుకే గబ్బిలాన్ని చీకటికి, దళితునికి ప్రతిరూపంగా తీసుకొని వర్ణించడం జరిగింది. గబ్బిలం పూజారి లేని సమయంలో తన ఆవేదనను శివునికి విన్నవిస్తుంది. అంటరానితనాన్ని పాటించి భారతదేశం ప్రపంచ దేశాల్లో తన గౌరవాన్ని కోల్పోయిందని గబ్బిలం ద్వారా జాషువా విన్నవించు కున్నారు. దళితులు యొక్క శారీరక శ్రమను దోపిడీ చేసేవారని, దళితులు చదువుకుంటే అభివృద్ధి చెంది తమ అస్థిత్వాన్ని తెలియజేస్తారు అని గబ్బిలం కావ్యం తెలియజేసింది.

సంస్కృత సాహిత్యంలో మేఘసందేశం ఎంతటి ప్రాముఖ్యత పొందిందో అదే విధంగా తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా గారి గబ్బిలం ప్రాముఖ్యత పొందిన కావ్యంగా జి.వి. సుబ్రహ్మణ్యం గారు అభి వర్ణించారు.

పాదసూచికలు :

1) తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ
2) గుర్రం జాషువ పద్య చంద్రిక - డా॥ గుమ్మా సాంబశివరావు

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యానికి దిక్సూచి – గుర్రం జాషువా

– **మొండి స్వాతి,** పరిశోధక విద్యార్థి (జె.ఆర్.ఎఫ్.), తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

రాతియుగం నుండి రాకెట్ యుగం వరకు గడియ గడియకూ శాస్త్రసాంకేతికత దినదినాభివృద్ధి జరుగుతున్న ప్పటికీ మన హైందవ దేశంలో ఇంకా కుల వ్యవస్థ కోరలు చాస్తూనే ఉంది. ముఖ్యంగా పూర్వకాలంలోని ప్రజల్ని విభజించిన వర్ణవ్యవస్థ వెర్రితలలు వేసి కులవ్యవస్థగా రూపాంతరం చెంది, ప్రజల మధ్య కులం అడ్డుగోడలు సృష్టించి మనిషిని మనిషిగా చూడలేని మానవత మాసి పోయిన ఈ భారతదేశంలో కులం పేరుతో అణగారిన వర్గాల వారి మీద జరుగుతున్న రాజ్యహింస, వివక్ష, దాడులు, అన్యాయాలు, అక్రమాలు చెప్పనలవికాదు. ముఖ్యంగా మనుధర్మ శాస్త్రం, ఉపనిషత్తులు, పురుష సూక్తులు పేరుతో ప్రజల్ని రెండు శతాబ్దాలు వెనక్కి నెట్టి, శారీరకంగా, మానసికంగా దుర్భలుల్ని చేసి, ఆచార సాంప్రదాయాలు పేరుతో, అంటరానితనం, అస్పృశ్యతను కల్పించి దళితుల్ని, పంచముల్ని ఊరికి నాలుగు ఆమడు దూరం తరిమి, ఆస్థిపాస్తులను దోచుకుని, శ్రమను దోచుకుని, బానిసలమనే మానసిక స్థితికి దిగజార్చిన అగ్రవర్ణ ఆధిపత్య ధోరణికి వ్యతిరేఖంగా ఈ కర్మ భూమిలో దళిత చైతన్యానికి నడుం కట్టిన మహామనిషి మహాత్మ జ్యోతిరావుపూలే. ఈయన మహారాష్ట్రలో దళిత చైతన్యానికి, సమాజంలోని అసమానతలు, కుల వివక్షలకు వ్యతిరేఖంగా ఎంతో పోరాటం జరిపిన యోధుడు. అయితే మన తెలుగు నాట ఈ దళిత స్పృహ 1909 నుండి గమనించవచ్చు. తెలుగులో మొట్టమొదటి సారి దళిత సాహిత్య స్పృహతో కవిత్వం రాసిన వారు మంగిపూడి వెంకటశర్మగారు, ఆ తరువాత ఎంతో మంది రచయితలు దళిత సాహిత్య స్పృహతో రాసిన వారిలో ప్రముఖంగా చెప్పకదగినవారు గుర్రం జాషువా.

ఒక దళితునిగా తన యొక్క అనుభవాలు, స్థితిగతులను తెలుపుతూ దళితుల యొక్క జీవన వేదనలను తెలుపుతూ దళిత కవిత్వం అనే నూతన ఒరవడిని సృష్టించిన కవి గుర్రం జాషువా. సమకాలీన కవిత్వ ఒరవడియైన భావ కవిత్వ రీతి నుంచి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని, సమాజంలోని మూఢాచారాలపై, కులవ్యవస్థపై, అంటరానితనంపై, వర్ణవ్యవస్థ పేరుతో జరుగుతున్న దమనకాండను నిరసించాడు.

సాధారణ దళిత కుటుంబంలో గుంటూరు జిల్లా వినుకొండలో గుర్రం వీరయ్య, లింగమ్మలకు 1895 సెప్టెంబర్ 28న తల్లిదండ్రులు వేరు వేరు కలములకు చెందినవారు. తండ్రి యాదవులు, తల్లి మాదిగ, ఈ ఒక్క విషయం చాలు, మూఢాచారాలలో నిండిన ఈ హైందవ సమాజంలో అవమానాలు, చీత్కారాలు ఎదుర్కోవడానికి, బాల్యం వినుకొండ గ్రామంలో పచ్చని పొలాల మధ్య సాఫీగానే సాగిది, చదువుకోవడానికి బడిలో చేరిన తరువాత జాషువాకు కష్టాలు ఎదురయ్యాయి. ఉపా ధ్యాయులు, తోటి విద్యార్థుల నుండి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. ఎన్నో అవమానాలును ఓర్చుకుని చదువును పూర్తి చేసి, మిషనరీ పాఠశాలలో ఉద్యోగంలో చేరాడు. తరువాత 1915-16లో రాజమండ్రి వెళ్ళి సినిమా వాచకుడుగా పని చేశారు. ఆ తరువాత గుంటూరు లూథరిన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణా లయంలో ఉపాధ్యాయుడుగా 10 సంవత్సరాల పాటు పని చేశారు. తరువాత తెలుగు పండితునిగా, రక్తగానం అనే గీతాల పేరుతో యుద్ధ ప్రచారకుడుగా మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పని చేశాడు. చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బొమ్మలు గీయడం, పాటలు పాడటం చేసేవారు. తరువాతి కాలంలో ఎన్నో గ్రంథాలు ఖండకావ్యలను

ఆవిష్కరించారు. ముఖ్యంగా సమాజంలోని మూఢా చారాలు, కులవ్యవస్థ, వర్ణవ్యవస్థ, అసమానతలు మొదలైన వాటి గురించి లోతైన పరిశీలన చేసి, రచించిన జాషువా రచనలు దళిత చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచి భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళిక వేశాయని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా ఈయన రచనల్లో ఆయన అనుభవాలే ఎక్కువగా అనిపిస్తాయి. "1940 దశకంలో విశాఖలో ఓ సాహితీ సంస్థ - కవి జాషువాను ఆహ్వానించి, షోకాల్డ్ పండితులందరికీ శాస్త్రోక్తంగా షామియానాలో భోజనాలు ఏర్పాటు చేసి, జాషువా ఒక్కరికే ఆంధ్రాయునివర్సిటీ బోటనీ లాల్ వరండాలో వేరుగా భోజనం పెట్టి, తిరిగి వేదికపై "కవిత విశారధ" అని బిరుదునిచ్చి సత్క రించింది.! అటువంటి అభ్యుదయ సాహితీ పీఠాలు మనవి" అంటూ దళితవాద వివాదాల్లో సి. జాన్‌సన్ ఆవేదన వ్యక్తం చేశారు. జాషువా ఇలాంటి అవమానాలు, వివక్షతలను ఎన్నో ఎదుర్కొన్నారు. అవమానాలు, చీత్కారాలు, వివక్షతల సంవేదనమే గుర్రం జాషువా కవిత్వం.

జాషువా తన కవిత్వంలో వర్ణవ్యవస్థను తీవ్రంగా నిరసించాడు. ఎందుకంటే పుట్టుకతో అంతా సమానమైన మనుషుల్లో మధ్యలో వర్ణం చేరువై మనుషుల మధ్య అంతరాలు పెంచిందని తెలుపుతూ.

"ముసలివాడైన బ్రహ్మకు బుట్టినారు
నలుగురు కుమారులనుట విన్నాను గానీ
పసరము కన్న హీనడభాగ్యుడైన
ఐదవ కులస్తుడెవ్వరమ్మ! సవిత్రి"

మనుధర్మం పేరుతో అగ్రవర్ణాలు వారు కూడ సృష్టి చేసిన అక్రమ వర్ణవ్యవస్థ యొక్క లోపాల్ని, కోరలు చాచి హైందవ భూమిని ఆక్రమించి వర్ణవ్యవస్థ యొక్క విరాట్ రూపాన్ని జాషువా చిన్న పద్యంలో అర్ధవంతంగా తెలియ జేసారు. ముఖ్యంగా అగ్రవర్ణాల వారి మోసపూరిత నిర్మితమైన ఈ బ్రహ్మ శరీర ఆవిర్భావ చాతుర్వార్ణాలను పేర్కొంటూనే మెజారిటీ ప్రజల్ని కులహీనులుగా, అవర్ణులుగా, పంచములుగా, శ్వపతులుగా చేసి అంట రానితనాన్ని మోపి, వివక్ష చూపించి, ఆర్థిక, సాంఘిక, రాజకీయ, శ్రమదోపిడీకి పాల్గొంటూ, మానసిక, శారీరక దుర్భలుల్ని చేసి ఊరికి దూరంగా, నాగరికతలు దూరంగా బతుకులు దుర్భరం చేసిన పంచములు ఎలా వచ్చారనే హైందవ పురాణాలను, పురుషసూక్తులను నిలదీస్తున్నాడు జాషువా. మనుధర్మం, పురుష సుఖాలు ప్రకారం బ్రహ్మ శిరస్సు నుంచి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు ఉద్భవించినప్పుడు ఈ పంచమ వర్ణం ఎలా వచ్చింది? ఎక్కడ నుండి ఉద్భవించింది, అసలు దేవుని సృష్టిలో లేని ఐదవ వర్ణాన్ని ఎవరు సృష్టించారు. ఆర్థిక, సాంఘిక దోపిడీకి గురై, పశువు కన్నా హీనంగా ఈ ధర్మభూమిలో బతుకు దుర్భరమైన, ఐదవ కులం వారు ఎవరంటూ జాషువా ప్రశ్నించడం గమనించవచ్చు. చాతుర్వర్ణాలే అక్రమమైనప్పుడు ఈ కర్మభూమిలో పంచముల కష్టాలను తెలుపుతూ...

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుస కొట్టు నాతని గాలి సోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

శతాబ్దాలుగా బానిసత్వానికి గురిచేసి పంచముడి రక్తమాంసాలతో తన జీవనం సాగిస్తున్న ఈ భరతమాత, తిరిగి అదే పంచమున్ని అంటరానివానిగా, అస్పృశ్యునిగా ముద్ర వేసి, తరాల బానిసత్వంలో వెట్టిచాకిరీ చేయించు కుని ఆర్థిక, సాంఘిక, రాజకీయ, విద్యా ఉద్యోగ రంగాలలో దోచుకుని, సర్వస్వాన్ని స్వాహా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు. ఈ నిచ్చెన మెట్ల వర్ణవ్యవస్థలో తన రక్తపు బిందువులే చెమట చుక్కలుగా నాలుగు వర్ణాల వారిని తన భుజస్కందాలపై మోస్తూ, వారి ఆలనా పాలనా చూస్తున్న దళితుల్ని, పంచమున్ని కనీసం తన గాలిని కూడా తాకకుండా అంటరానితనం అనే జాఢ్యంలో ఈ కర్మభూమి దళితుల్ని ఊరికి దూరంగా ఉంచుతూ,

అనాగరికులుగా ముద్రవేసి, నీచమైన వృత్తులను అంటగట్టిందని తెలియజేస్తూ ఈ చాతుర్వర్ణ హైందవ సమాజాన్ని విషనాగుతో పోల్చడం జరిగింది. స్వార్థ పరత్వంతో కూడిన చాతుర్వర్ణాల వారు పంచములిల్ని బానిసలుగా చిత్రీకరించి, వారిని నాగరికతకు సమాజానికి దూరంగా బహిష్కరించారని తెలుపుతూ ఈ భరతమాత దళితునికి అప్పు పడ్డదని ఖరాఖండిగా తేల్చి చెప్పారు.

ఈ భారతీయ సమాజంలో వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ ఎంతగానో ప్రభావితం చూపుతున్నాయి. ఇక్కడ గుణం కంటే కులానికే ప్రాధాన్యత ఉంది. ఈ కులం మొత్తం ఈ భారతీయ సమాజాన్నే చీలికలు చీలికలు చేస్తుందని చెప్పవచ్చు. కులం పేరుతో, వర్ణం పేరుతో మనిషితో మనిషికీ మధ్య అడ్డుగోడలు సృష్టించి, అరాచకాన్ని ప్రబలింపజేస్తుంది. ఈ కులం ప్రభావం నుండి ఎలాంటి వారైన తప్పించుకోలేరనే తెలియజేస్తూ, జాషువా తన అనుభవాన్ని అక్షరీకరించారు.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగా జూచి, రూపురే
ఖా కమనీయ వైఖరులు గాంచి భళిభళి యన్న వాడె, నీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచి పోవచో
బాకున గ్రువ్వనట్లగును పార్థివ చంద్ర వచిం పని సిగ్గుగన్"

అంటే ఒక మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత అభివృద్ధి చెందిన, కులమతాలు విష నాగులా వెంటాడుతున్నాయనీ, అవి మనిషి యొక్క అంతరంగంలో చిరస్థాయిగా నిలిచిపోతున్నాయని, ఆ కులమూలాలను చెరిపి వేయాలని జాషువా ఆకాంక్షించాడు. ఇప్పటికీ పల్లెల్లో, పట్టణాల్లో కొత్త వ్యక్తులకు ఎదురయ్యే ప్రశ్న మీరు ఏమిట్లు? అని ఈ ప్రశ్న ఈ భారతావనిలో శతాబ్దాల తరబడి పాతుకుపోయిన సామాజిక జాఢ్యాన్ని తెలియజేస్తుంది. ఈ కులం ఎంతటి విజ్ఞాని, గొప్పవారినైనా విడిచి పెట్టదు అనడానికి ప్రబల నిదర్శనం పై పద్యం. పై పద్యంలో జాషువాగారు తన ఆవేదనను తెలియజేసారు. అందులో ఆయనకు జరిగిన అవమానాన్ని గమనించవచ్చు. ఈ పద్యంలో అంటరానితనం ఎంతటి ప్రభావం చూపుతుందో, అది సమాజానికి, మనిషిలోని మానవత్వానికి ఎంతటి ప్రమాదకరమో తెలియజేస్తుంది. పిపీలికాది బ్రహ్మ పర్యంతం అంతటా పరబ్రహ్మ స్వరూపాన్ని దర్శించగల బ్రహ్మజ్ఞానులు సైతం ఈ కులం ఉచ్చు నుండి తప్పించుకోలేరు. ఆ మొహంలోనే బతుకుతున్నారు. అని మనకు ఈ పద్యం ద్వారా తెలుస్తుంది.

జాషువా గారు ఒక వైపు పూర్తిగా ఈ అంటరానితనం మీద దళితుల అణచివేతల మీద, వారి మీద జరుగుతున్న దమనకాండల మీద తీవ్రంగా స్పందించి తన కవిత్వం ద్వారా సమాజంలోని జాఢ్యాలను తెలియజేసారు. అయితే ఒకవైపు ఈ దళిత సమస్య మీద పోరాటం చేస్తూనే దళితులైన అనైఖ్యతను కూడా బహిర్గతం చేసి, ఆధిపత్య ధోరణిలో మాలమాదిగల మధ్యగల అంతర్గత ఆధిపత్య తీరును, వారిలోని వైరుధ్యాలను తెలుపుతూ

"కలదమ్మా! ప్రణమంటరానితన మాకర్ణింపు మీ
యిండియా
పొలమందుంగల మాలమాదిగల కున్ భూతేశుడే
కాదు, కృ
ష్ణులు, కృష్ణున్ని రసించు దైవములు క్రీస్తుల్ మస్తుగా
పుట్టినన్
కలపన్నేరరు రెండు జాతులను వక్కాణింప
సిగ్గయ్యెడిన్..."

అంటూ వాపోయాడు మహాకవి జాషువా. అగ్ర కులాలకు అదృష్టంగాను, అలంకరణను, నిమ్న కులాలకు నీచంగాను నికృష్టంగాను, పవిత్ర హైందవానికి ఆయువు పట్టుగా ఉంటూ, మూడొందల ముప్పయి కులాలు, ఆరొందల అరవై వర్ణాలుగా వర్ధిల్లుతూ కులమనే కుష్ట వ్యవస్థ విస్తరించిన ఈ బురద గుంటలో బతుకుతూ నిత్యం దోపిడీకీ, దౌర్జన్యాలకు, మారణకాండలకు బలైపోతున్న మాలమాదిగల మధ్యగల అంతర్గత కుమ్ములాటలను నిశితంగా పరిశీలించి, వాటిని ఏ దేవుడు వచ్చినా ఆపలేడనే వాస్తవాన్ని తెలియజేసారు.

మరీ ముఖ్యంగా సోదర కులాల మధ్య కులం చిచ్చు పెరిగి అంటరానితనం ఆవహించి, అస్పృశ్యత కరాళ నృత్యం చేస్తున్న తరుణంలో మాలలు మాదిగలపై వివక్ష చూపటం, అంటరానితనం పేరుతో దూరంగా ఉంచడం, అర్థిక సాంఘికరంగాల్లో, విద్యా ఉద్యోగాల్లోని అవకాశాలను ఉపయోగించుకోవడం వంటి కారణాలు రెండు కులాల మధ్య ఆజ్యం పోస్తున్నాయనే తెలుపుతూ దళిత కవిత్వమే లేని తొలినాళ్ళలో వర్గీకరణ ఆవశ్యకతను, సామాజిక న్యాయం యొక్క అవసరాన్ని తెలియజేసారు జాషువా.

కళాప్రపూర్ణ జాషువా దళిత కవిత్వంలో దళితుల చైతన్యాన్ని ఆకాంక్షించారు. సమాజంలోని జాడ్యాలను, లోపాలను, మూఢాచారాలను ఖండించారే తప్ప ఏ వ్యవస్థని, ఏ వ్యక్తిని ఆయన వ్యక్తిగతంగా విమర్శించలేదు. జాషువా గారు ఈ భారతదేశంలో పునాదిరాళ్ళుగా పేరుకుపోయిన వర్ణవ్యవస్థ యొక్క స్వరూప స్వభావాన్ని, కులవ్యవస్థ యొక్క వికృతీ రూపాన్ని, కులం పేరుతో సమాజంలో జరుగుతున్న దోపిడీని ఖండించారు. జాషువా కవిత్వం ద్వారా ఈ ఆంధ్ర దేశంలో మొదటి సారిగా దళితుల చైతన్యాన్ని కాంక్షించి, దళిత స్పృహతో రాసిన మొదటి కవి. ఈయన కవిత్వం తరువాత కవులకు మార్గదర్శకమై, దళిత కవిత్వపు రీతిని, నడతను నిర్దేశించి, దళత సమస్యలను నిర్ధారించి వాటి మీద పోరుకు సిద్ధపడడానికి ఈ జాషువా కవిత్వం ఎంతగానో ఉపయోగ పడింది. అందు మన గుర్రం జాషువా దళిత సాహిత్య చరిత్రకు పునాదిగా చెప్పవచ్చు. 1980 నాటికి దళిత సాహిత్యం రూపుదిద్దుకోవడానికి జాషువాకు మధ్య ఎంతో మంది దళిత స్పృహతో కవిత్వం రాసిన ఎవరూ ఆ స్థాయికి వెళ్ళలేకపోయారనేది జగమెరిగిన సత్యం. అందువల్ల దళిత సాహిత్యాన్ని ప్రభావితం చేసి దిశానిర్దేశం చేసిన మహాకవి విశ్వనరుడు గుర్రం జాషువా.

జీవిత వాస్తవిక దృక్పథాన్ని తన కవిత్వంలో, సాహిత్యంలో ముద్రించిన దళిత భావ విప్లవ భాస్కరుడు జాషువా.

ఆధారగ్రంథాలు :

1) గుర్రం జాషువా 4వ సంపుటి
2) తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య,
3) గుర్రం జాషువా - పద్యచంద్రిక - డా॥ గుమ్మ సాంబశివరావు
4) దండోరా దరువు - డా॥ గుండెడప్ప కనకయ్య

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఇనాక్ కవిత్వం – నిరసన, ప్రతిఘటన, చైతన్య తత్త్వము

– డా॥. సి. శివన్న, తెలుగు పండిట్, జి.ప.ఉ. పాఠశాల, గౌడన హళ్ళి, అనంతపురం (జిల్లా).

ఇనాక్‌గారి జీవితం పైకి, సామాన్యంగా కనిపించినా అది పోరాట ఖిల్లా. బాహ్యాంతర సంఘర్షణల నడుమ నిరంతరం ప్రతిఘటనలతో సాగినది. అణగారిన జీవితం లోని అనుభూతులను పలకడమే కాకుండా ఆ స్పృహతో, ఆ చైతన్యంతో అలాంటి జీవితానికి కారణమైన సామాజిక విలువలను ధిక్కరించారు ఇనాక్‌గారు. ఆయన జీవితం ఆయన సాహిత్యం సృజనకు ఎరుపు. ఇనాక్‌గారు తన నుంచి సమాజాన్ని ఎల్లప్పుడూ విడదీసి చూసుకోలేదు. కుల వివక్షతో తన కవిత్వాన్ని ఈ సమాజం విడదీసినా తను మాత్రం సమాజాన్ని వదలి పోలేదు. ఈ లక్షణమే ఇనాక్‌గారిని సామాజిక చైతన్యం కలిగిన కవిగా చేసింది.

ఆయనలోని నిరసనలు, ప్రతిఘటనలు కవిత్వ రూపంలో ఒక నదీ ప్రవాహ ఝరిలా ఉప్పొంగింది. అందుకే ఇనాక్‌గారి కవిత్వంలో సామాజిక అసమానతల పట్ల క్రోదం, తీవ్ర నిరసన, పతాక స్థాయిలో కనిపిస్తాయి. కవిత్వం కోసమే కవిత్వం రాయలేదు ఇనాక్ గారు. తను అనుభవించిన సంఘటనలను తను చవి చూసిన అసమానతలను, తను గురియైన వివక్షతలను, తన గుండెను చీల్చినపుడు ఆక్రోశించాడు. కులమత వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించాలని, తన కలాన్ని గునపంగా ప్రయోగించాడు. ఆకలిని, శోకాన్ని నిర్మూలన చేసే వ్యవస్థను స్థాపించాలనుకొన్నాడు. సంఘమే రణరంగంగా, సంస్కరణయే అంతిమ లక్ష్యంగా పరిశ్రమించాడు. ఈ సంఘ సంస్కరణాభిలాషిగా ఇతని కవిత్వంలో త్రిముఖంగా సాగింది. అవి 1. అస్పృశ్యతా నిరసన 2. దారిద్ర్య నిరసన 3. కులవైషమ్యాల నిరసన.

ఇనాక్‌గారి నిరసనకు ఒక స్పష్టమైన ఆకృతి ఉంది. కవిత్వం సామాజికం కావాలని చీకటి శక్తులకు వ్యతి రేకంగా పోరాడాలనే బలమైన అవగాహన దృఢంగా విశ్వసించాడు.

"ఈ దళితుడు అగ్నిపర్వతం. పేలితే ఏముంది బూడిద. ఊళ్ళు వల్ల కాడు." అంటాడు. అమృత సర్వస్వం అనే కవితలో అణగారిన జీవితం నుండి అంకురం మొదలైతే కులపర్వతాలు కూడా భూమి పేలుడు దాటికి నిలబడవు అంటాడు. "గుండె మండితే మనిషి ఆరిపోతే నిర్జీవి". అందుకే సమసమాజ నిర్మాణం కోసం "కొండలు మండిస్తాడు. బండరాళ్ళు కరిగిస్తాడు. అయిన వాడు పేలడు. గుండెల్లో అగ్నిపర్వతం నిత్యం మండుతున్న వాడు పేలడు. వాని ఆశ, సహనం, శాంతి, ప్రేమ, దయ కలిగి ఉండాలనేది ఇనాక్ గారినావేదన. మీరిచ్చే మణులు మాణిక్యాలు అవసరం లేదు. వాణ్ణి ప్రేమించడం" అనే ఒక అమృతమైన సందేశాన్నిచ్చాడు.

ఇనాక్‌గారి కవితల్లో విప్లవ బావాలు విస్తారంగా కనిపిస్తాయి. నూతన వ్యవస్థ కోసం, సమ సమాజ నిర్మాణం కోసం ఒక బలమైన వాంఛ కనిపిస్తుంది. ఇనాక్‌గారి కవిత్వంలోని వస్తువులన్ని కులవృత్తులకు సంబంధించినవే. ఈ సమాజం సుభిక్షంగా సాగాలంటే కులవృత్తులు వాటంతట అవి సహజంగా ఏ ఆటంకాలు లేకుండా ఏ దౌర్జన్యానికి బలి కాకుండా బ్రతకాలంటాడు ఇనాక్‌గారు. ఎవరికి ఎవరు దాసోహం కాదు. వాటంతట అవి స్వతంత్రులై అంటాడు. తన మదిలో కలిగిన సమసమాజ స్థాపన వాంఛ కోసం పరిష్కారాల పద్ధతులను కనుగొన్నాడు. సాంఘిక చైతన్యాల కోసం, సామాజిక అభ్యున్నతి కోసం ఆయన కవిత్వంలో గొప్ప తపన, ఆర్ధత కనిపిస్తాయి. ఒక "కవి" సాంఘీక వాతావరణము, సమాజ ప్రతిస్పందనా అతని చైతన్య స్థాయిని నిర్ణయిస్తాయి. ఇనాక్‌లో కనిపించే నిరసన, ప్రతిఘటనలు ఆయనను ఒక పదునైన కవిగా తయారు చేశాయి. ఇనాక్ గారికి ఎదురైన సంఘటనలు మరియెవరికైనా ఎదురై ఉంటే వారు సమాజంపై 'కసి'ని పెంచుకొనేవారు. కాని సమాజాన్ని వదలి ఇనాక్ గారు పోలేదు. సమాజంలోని మనుషులను ఒకటిగా చేయడానికి "విద్య మూలమని" విద్యకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రశ్నించడం నేర్పారు.

ప్రతిఘటించడం, సంఘటితకు ప్రాధాన్యం కల్పించాడు.

ఇనాక్‌గారు నన్ను నన్నుగా చూడండని నన్ను వేరుగా చూడవద్దంటాడు. నా కవితలోని వస్తువులు నావె. అవి అన్ని నా కన్నీళ్ళె అంటాడు. అందుకె "చెప్పులకు" అనే కవితలో సమసమాజ నిర్మాణం కోసం శ్రమించే దళిత సామర్థ్యాన్ని మాలమాదిగల శ్రమైక శక్తిని చూపించాడు. మనిషి శ్రమజీవి. శ్రమకు సహాయకారిగా జంతువులను కూడా వాడుకొంటాడు. అవి ఆరుగాలం శ్రమించి చనిపోతే వాటి చర్మంతో చెప్పులు కుట్టి మానవుల పాదాలు కందకుండా చేస్తాయి. అలాంటి దళితుడు. జీవితాంతము శ్రమించి, శ్రమించి కృషించి చనిపోతాడే కాని ఏ రోజు ఎవరి దగ్గరకు పోడు. ఇక్కడ చెప్పులు అంటే దళితడు, మాదిగోడు, మాలవాడు. అందుకే ఇనాక్‌గారు అంటారు. "నా చెప్పులకు నమస్కారం అంటాడు. దళిత కుటుంబం నుండి వచ్చినారు కనుకనే వారి కష్టాలు తెలుసుకొన్నాడు. అందుకే కవితారూపంలో చెప్పాడు.

నా జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా జీవితం లోని పేదరికం, సహనాన్ని నేర్పితే, కులమతభేదం ఎదురించే శక్తిని పెంచింది. కాని బానిసగా బ్రతకమని చెప్పలేదు. దారిద్ర్యాన్ని కులబేధాలను కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి కవితా కథ. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానం పై ద్వేషం అంటారు ఇనాక్‌గారు.

ఇలా చెప్పుకోవడంలో ఇనాక్‌గారి నిరసన ఎంత క్రియాత్మకమో తెలుపుతుంది. ఇనాక్ గారి నిరసనలు సంఘ విధానంపై. ఆయన ప్రతిఘటనలు, సంఘంలో దుష్ట శక్తులపైన. పెత్తందారి వ్యవస్థపైన. అందరూ సమానంగా పంచుకుని తినాల్సిన ప్రకృతి సంపదను కొందరికి మాత్రమే పరిమితం చేసే విధానానికి ఇనాక్ గారు నిరసన చేశారు.

అంధకార నదీజలంలో వెలుగు పడవల సరుగు ఎవరీ సూర్యుడు? దరిద్రుల నుదుటి రాతమీద ఉద యించడానికి అసహాయుల బానిస సంకెళ్ళు తెంచడానికి, హింసను తలదాల్చిన హిందూమతానికి, అహింసను నేర్పిన అపర బుద్ధుడు, పిరికితనం, సోమరితనం కాల్చిన విద్యా రహస్య తత్త్వవేత్త. దళితుల విముక్తి సూత్రం, ధర్మ చక్రతాదాత్మ్యం ఎవరీ సూర్యుడు? అంటూ సమాజంపై ఘీంకరించాడు. ప్రశ్నించడం నేర్పాడు. ఇనాక్‌గారు. " నా చెప్పులు కలల కార్ఖానా. షరా మామూలే. వంటి కవితా సంకలనాలు సమాజంపై తిరుగుబాటు ప్రతీకలుగా చెప్పవచ్చు. నా చెప్పులు అనే కవితలో అణిగి మణిగి వుంటె వుండవచ్చు. కాని ఆత్మాభిమానంపై దెబ్బ కొడితే కోపం వచ్చి, అవే ఆయుధాలై సమాజంపై తిరుగబడతాయి. అనే సంకేతాన్ని ఘాడంగా పంపించారు ఇనాక్‌గారు.

ఇనాక్‌గారు సమాజంలోని ఆర్థిక పీడనాన్నే కాదు ఎదుర్కొన్నది. సాంస్కృతిక, సామాజిక పీడనను కూడా. అందుకే కుల భేదాల పట్ల, ఆర్థిక అసమానతల పట్ల తీవ్ర నిరసను తెలియజేసాడు. ఆర్థిక అసమానతలు రూపుమాపాలంటే విద్య ప్రాముఖ్యత అవసరమంటాడు. ఈ సమాజ మార్పుకోసం పునాదినే కదిలించాలనే విధానం కాదు. అనునిత్యం ఆయన ఎదుర్కొన్న కులభేదాలను వ్యతిరేకించాడు. నేటికి సామాజిక శాస్త్రీయ దృక్పథంతో చూసినట్లైతే ఆయనది కులధర్మాలను ప్రధానంగా వ్యతిరేకించే చైతన్యస్థాయిగా విశ్లేషించుకోవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. చెప్పులు - ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు
2. సాహిత్య దర్శిని వ్యాస సంపుటం - ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు
3. కలల కార్ఖానా - ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు
4. దళిత కథలు - వర్ణ వివక్ష కథలు - ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు - డా॥ కె. లక్ష్మీ నారాయణగారు
5. సాహిత్య దర్శనం - ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా నా కథ – బాల్య చిత్రణ

– డా॥. మంథని శంకరయ్య, అధ్యాపకుడు, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

జాషువా తన జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నాడు. జాషువా తండ్రి యాదవ సామాజిక వర్గానికి చెందినవాడు. తల్లి మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళ. వీరి కులాంతర వివాహం ఆ కాలంలో గొప్ప విప్లవమే. అయితే జాషువా జీవితమంతా దళిత జీవితాన్నే అనుభవించవలసి వచ్చింది. అందుచేత జాషువా అస్పృశ్యతను ఎదుర్కొనవలసి వచ్చింది. జాషువా తన జీవిత చరిత్రను 'నా కథ'గా మూడు భాగాలుగా రాసాడు. ఆయన జీవితంలో చాలా భాగం బాధలతోనే గడిచాయి. ఈ సుఖదు:ఖములు కలిగిన జీవితంలోని తీపి చేదులను పాఠకలోకానికి అందిచాడు.జాషువా కవిత్వంలో పల్లె వాతావరణం ప్రతిఫలించినట్లే తన జీవితచరిత్ర 'నాకథ'లో కూడా గ్రామీన జీవితాన్ని చిత్రించాడు. చిన్ననాడు చిలుకలను గోరువంకలను పిల్లలు పట్టి పంజరంలో వేసి బంధించి ఆనందపడుచుండెడు వారు. చెట్లెక్కి ఎగురుతూ ఉడుతలకు ఉచ్చులుపెట్టి పట్టుకొని ప్రేమతో వాటికి పేర్లు పెట్టి పసితనమున ఆనందించేవారు. ఏది ఎరుగని వానివలె దొంగ ఏడ్పుఏడ్చేవాడు. ఇలా అల్లరి పిల్లవాడు కనిపిస్తాడు జాషువా.

జాషువాకు పశుపక్షాదులపై, జంతువులపై ఎనలేని మమకారము. బాల్యదశనుండే అలవడినది. అవి కనిపించినప్పుడల్లా వాటి దగ్గర నిలిచి పరిశీలించి కుక్క కూనలతో కొంత కాల క్షేపం జేసి ఆటలాడి ముద్దు మురుపెం తీర్చుకుని విడిచిపెట్టేవాడు. మొహరం దసర పండేగలకు పులివేషములు కాబూలీవానిగా, పిట్టల దొరగా వేషమువేసి తన ఇంటినే నాటకశాలగా మార్చి తోలు బొమ్మలాటలు, కుస్తీలు పట్టుట లాంటి ఆటలు ఆడి మానసిక ఆనందం పొందేవాడు. బాల్యదశలో ఆడిన ఆటలు నడిచిన నడతలు కొన్ని తన జీవితంలో కూడా జీవనోపాధికి అవనరమగునని ఆ దశలో తను గుర్తించలేదు.కాని అది జరిగినది తను వేసిన వేషములు తన కావ్యంలో వివరించాడు.

పులి వేషంబులు వీధిభాగవతముల్ పోట్లాటలుం బొమ్మలా
టలు కుస్తీల్ బలువేటలున్ మనను నాటన్ మిత్రులంగూడి నా
యిల్లు రంగస్థలిగా నటించితిని నాయీ పాత్రలన్ దాల్చి,బె
బ్బులిగా రాజుగా కిరాతకునిగా బుంగాసల్మానుగా
(నాకథ)

ఈ విధంగా జాషువా తన యింటినే రంగస్థలంగా తయారు చేసుకొని తోలు బొమ్మలాట ఆడించిన తాను నవయుగ కవి చక్రవర్తిగా, విశ్వనరునిగా, పద్మ భూషణునిగా, రాష్ట్రపతి అవార్డు గ్రహితగా ఎదిగి అనేకమైన బిరుదులు, సన్మానములు పొందుతాడని ఎరుగలేకపోయాడు. "జాషువా తల్లిదండ్రుల అంతర్వర్ణ వివాహం మొదలుకొని క్రైస్తవ మిషనరీల ప్రభావం బాల్యంలో తాను విని నేర్చుకున్న 'గొల్లసుద్దులు'లోని సెక్యులర్ దృక్పథం," (ప్రజాసాహితి, సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక 1995, జాషువా సాహిత్యం - సాంఘిక నేపథ్యం పేజీ 13)

తన గ్రామంలో గేదెలు కాయుబోయే పిల్లలతో కలిసి ఆడుకొనులకు ఏదో విధంగా కుంటిసాకులు తన తల్లికి చెప్పి మెల్లగా వాళ్ళతో వెళ్ళేవాడు.జాషువా తండ్రి గుళ్ళం వీరయ్య ఫాదర్‌గా పని చేస్తున్న కాలం.తన గేదెల కాసే పిల్లలతో ఆటలాడు సమయం ఎవరైనా చూసి తన తండ్రి చెప్పుతారనే భయంలో మెల్లగా తల్లి చెంతకు వచ్చి రకరకాలైన మాటలలో తన తండ్రికి తెలియకుండా మసలుకొనేవాడు.

గేదేల్ గాయబోవు బాలకులతో క్రీడింపగా నెంచి మ
ర్యాదా భంగభయంబునన్ జననికాదంచు న్ని
వారించినన్
ఎదోరీతి ననుజ్ఞనందుకొని నీశృంగారపుందోటలో
గేదేలు కాచితి కొన్నినాళ్ళులనురక్తిన్ కొంటె కోణంగినై
(నాకథ)

జమీందారులు వారి కుటుంబములతో సరదాగా విహరించుటకు రకరకాలైన పూలచెట్లు,పూలమొక్కలు నాటించి ఒక నందన వనంగా తయారుచేసేవారు.ఆ చెట్లవాసనకు రకరకాలైన సీతకొక చిలుకలు మనసుకు ఆనందం కలిగించుతూ విహరించుచుండేవి.అది శృంగార పు వనంగా పేరుగాంచింది. వారు అంతరించిన తర్వాత చెత్తకుప్పలతో కొంత కాలం ఉన్న తరువాత ఇండ్లు లేని పేదలకు జీవనోపాధి కొరకు వినుకొండకు వచ్చిన వలసదారులు ఆక్రమించి చిన్న చిన్న పాకలు గుడిసెలు వేసుకొని జీవిస్తుండేవారు.

బాటల్‌తోటలు నీటి పట్టులు సమీప గ్రామముల్
క్షేత్రముల్
జోటాచిత్రములై సమీపమున చక్షు:పర్వముల్‌సేయనే
టేటన్నీ గిరులెక్కి చూచితిమి మున్నే కాసికేకాసికా
గాటంబైన ముదంబు జిక్కునె హిమగ్రావా
గ్రమున్‌మెట్టిగన్
(నాకథ)

ఒక గ్రామం నుండి చూస్తే ఇంకో గ్రామం కనబడు తుంది. గ్రామాల్లో ఉన్న వారికి ప్రక్కలల్లోకి వెళ్లడం. పరిశీలించడం చూస్తాం. అయితే జాషువా తన గ్రామం లోని కొండపైకి ఎక్కి ఆ ప్రక్కనున్న గ్రామాన్ని చూసి స్నేహితులతో ఆనందం పొందేవారు.ఆప్రక్క గ్రామంను కాశిగా భావించేవాడు. ఆ రోజులలో గ్రామాలలో నలుపు తెలుపు భేదములు చచ్చి పోకుండుట జాషువా ఈ పద్యం ద్వారా తెలుస్తుంది. జాషువా చిన్న తనం నుండి అటు వ్యక్తిగా ఇటు కళావేత్తగా కుల వివక్షతకు నలిగిపోయాడు. 'నాకథ'లోని వ్యథాఘట్టములు ఆ గుండె కోతకు ఆవేదనకు అక్షర రూపాలు''(ప్రజాసాహితి,సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక 1995,గబ్బిలం జాషువా ఆత్మధాత్మక కావ్యం, పేజీ 28).

ఏడిచి చెప్పితిన్‌విషయమెల్లను నా జనయిత్రి గ్రుచ్చి
ము
ద్దాడుచు నాయనా!యిది భయంకర దేశము
వర్ణభేదముల్
గూడులు గట్టుకొన్న వనగూడదు,పంచమ
జాతివారికిన్
కూడుహుళక్కి మానవతగూడ హుళక్కిహుళక్కి
జన్మమునన్ (నాకథ)

దళిత కులంలోజన్మించిన పిల్లలపై ఎంత వివక్ష ఈ సమాజంలో ఉంటుందో తెలుస్తుంది. వర్ణముల పేరుతో కుల మత వివక్షతో దళితులు బాల్యం నుండే ఎంతో బాధను అనుభవిస్తారు. ఆ బాధను అక్షరాల అనుభవించి చెప్పుతున్నాడు జాషువా. ''నాయన అంటరాని వారికి అనగా పంచమ జాతి వారికి (మాదిగలకు) ఇచ్చట నిలువ తావులేదు. ఇది భయంకర దేశము అస్పృశ్యతా రాజ్యము ఇచ్చట వీరంగమై ఏరులై పారుచున్నది.'' (జాషువా సాహితీ తపస్సు,అమృతపూడి రాజారావు.పేజీ 53).

నలుపుం దెల్పను ఇంగు భేదవు ఘురానా
చచ్చియున్‌జాక పే
దల గోరీలను వెక్కిరించు గతి పాంతన్ బొల్చు ఆనాటి జా
తుల వార్తెల్ల దొరల్ శయించిన నమాధుల్
పాలగాగచ్చు ని
గ్గులతో నేటికి నిల్చియున్నయవె నీకుం
గంఠహారంబులై (నాకథ)

ఊరిలో ఉన్న స్మశానంలో ఉన్న పేదవారి గోరీలు నలుపు గోరీలు గను, తెల్ల దొరల గోరీలు తెల్ల గచ్చుతో నిర్మించడం వల్ల అవి తెల్ల గోరీలు గాను కనిపిస్తాయి. గ్రామంలోని జాతుల రీతిగనే స్మశానంలోని గోరీలను కూడా విభజించి మాట్లాడడం వలన జాషువా గారి

'నాకథ' సహజమైన ధోరణిలో వ్యక్తికరించాడు. ఆ గోరీలు చెక్కుచెదరక ఆఊరుకు అవే కంఠహారాలుగా మిగులు తాయని అవి చాలా కాలం వరకు చెదిరి పోనివని భావించాలి. జాషువా కవిత్వంలో 'పిరదౌసి' కావ్యం చాలా ప్రసిద్ధమైనది. అయితే జాషువా గారి 'నాకథ'లో తన ఊరికి తూర్పుదిక్కున ఒక మసీదు ఉన్నదని దీనిలో చిన్ననాట ఆటలు ఆడుకున్నారని, ఆ మసీదుని శివాలయంగా చెప్పుకునేవారని తెలపడం ద్వారా ఆ ఊరి పరిసరాలలో ఉన్న పాత మసీదు ప్రభావం చిన్ననాటి నుండి జాషువా మనసులో ఒక ముద్ర వేసినందునే 'పిరదౌసి'లో పాడుబడ్డ మసీదు వల్లనే రాసి యుండవచ్చుననే భావన కలుగు తుంది.

ఊరికి దూర్పుగా నిలిచియున్న మసీదొకనాడు నిత్యదే
శీరతులైన బాలుర కళీకకళా కితవ ప్రజాళికిన్
జారుల కాశ్రయంబయి ప్రశస్తికి నెక్కినదమ్మ!దాని ప్రా
కారవుఱాల్ మసీదనినకాదని చూవు శివా
లయాంకముల్ (నాకథ)

గ్రామశివారులో ఉన్న మసీదును గురించి చెప్పి యున్నాడు. జాషువా గ్రామప్రాంతంలోని పచ్చదనము లను పంటపొలాలను జొన్నచేన్లను చూసిన అనుభవం ఉన్నందున ఆయన 'పలుజీరంగుల పచ్చపట్టు'అని పలికినాడు. మక్కకంకులను బంగారు రంగులకంకులని అభివర్ణించాడు.వాటిని మూట కట్టుకొని ఆహారంగా తీసుకుపోయేవారు. పెసరి కాయలు లీడర్‌గా కొంత మందిని కూడగట్టుకొని ప్రక్క వారి పెరటిలో పెసరి కాయలు దొంగలించడం వారితో తిట్లుతినడం లాంటి చేష్టలు జాషువాలో కనబడుతాయి.

పలు జీరంగుల పచ్చపట్టు టెఱకల్ బంగారు రంగారు కం
కులు దూగొడెడు జొన్న కఱ్ఱలకు నిగ్గుల్ గూర్చు ఆకొన్న పే
దల కాహారము మూటగట్టుకొని ప్రత్యక్షించు దాతల్ బలెన్
పొలముల్‌పండిరహించునే సరనిష్ణన్ బ్రౌక్షణీయం
బులై (నాకథ)

ఏటిలో పైనుండి పల్టీలు గొట్టి పీకితుమ్మలల్లో పక్షుల జంటల మధుర స్వరాల వినుచు చెట్ల కొమ్మల చాటున దాగి చెవులు పెట్టి వినుచూ చెవులు గింగురులు పోయేటట్టుగా యీలలుకొట్టి గోలలుచేసి పొలము గట్టులలో తిరుగుతూ కాపుకాసేవారి విసరేటి వడిసెలలన్ చూసుచూ ఎంతో ఆనందపడన సందర్భాన్ని గుర్తు చేసుకున్నాడు జాషువా.

ఏట్రింత పిట్టపై కెగసి, పల్టిగొట్టి
యెయ్యారముగ నేలకు కూఱుకుచుండ
పీకే తుమ్మలనుండి బెళగువ జంటలు
సన సన్న గుడగుడ ధ్వనులు సేయ
చెట్లకొమ్మలు దాగి చెవులు గింగురులు వోవ
యీల పుర్వుల పిండుగోరవెట్ట
పొలము గట్టుల కాపు పొలచుక్కల్ పొలికేక
బెట్టుచు విడిసెలల్ విసరుచుండ
అతి నీరాడంబ రానంద మాటలాడ
పండిన పోలాలతో నేత్రపర్వ మగుచు
ప్రబలునే నీదు పరిసల ప్రాంత లక్ష్మి
పెద్ద నగరాల పెను హడావిడులు లేక

పెద్ద నగరాలలోని ధ్వని కాలుష్యం, హడావిడులు లేనటువంటి ఒక చక్కని పల్లెప్రాంతం వినుగొండ. పసిడి పంటల బంగారులక్ష్మీ జాషువాగారు పుట్టి పెరిగినా ఊరు. అందుచేత తన జీవిత చరిత్ర అయినా 'నా కథ' కావ్యం మొదటి భాగంలో ఎక్కువగా గ్రామీణ వాతావరణ కన బడుతుంది. బాల్యం నవయవ్వనమంత ఈ గ్రామంలోనే ఉన్నట్లుగా సృష్టమౌతుంది. ఈ విధంగా తాను అనుభ వించిన జీవితంలో గ్రామం ఒకభాగమే కనక మనకు ఈ కావ్యంలో ఒక చక్కని గ్రామీణ వాతావరణం కనబడు తుంది. తీగబావి, నిమ్మలబావి, పోలాల చేన్లు కొండ కోనలు స్మశానం గోరీలు, తిరగడం గ్రామీణ పండుగలు జరుపుకోవడం ద్వారా పల్లె సౌందర్య సంస్కృతి 'నా కథ'లో ప్రతిఫలించినది.

చెలి కారడ్రతో నుండ విలుబట్టి విహరించి
పొన్నంగి పిట్టల పొడవడంచి
చిలుక గోర్వంకల కూనల బట్టి
పంజరంబుల నుంచి బందిజేసి
చెట్టుచెట్టున కెక్కి శృంగార మొలకించు
యుడుతల కంఠాల కుచ్చు లొడ్డి
కంటికింపై ముద్దుగా బొద్దుగా నున్న
కూనకుక్కలను మక్కువను తెనిచి
కూర్మి కొండతోడ కుస్తీలు బట్టుచు
కొట్టుకొనుచు నలిగి తిట్టు కొనుచు
చీకుచింతలేని చిన్నారి స్వర్గంబు
ననుభవించినాడ చినతనమున (నా కథ)

"జాషువా కవి స్వీయ చరిత్ర 'నాకథ'3భాగాలుగా వెలువడింది. మొదటిది 1950లోను రెండవది 1962లోను మూడవది 1966లో వచ్చాయి. జాషువా బాల్యం నుండి అస్పృశ్యుడిగా అనుభవించి అవ మాయాలు, ఉద్యోగ విషయాలు కళా పోసకులు, వాత్సల్యం, అభిమానుల, కష్టసుఖాలు మేళవించిన రచన నాకథ." (దళిత సాహిత్య చరిత్ర, డాక్టర్. పిల్లి శాంసన్. పేజీ 82) ఇలా జాషువా జీవితంలో సుఖసంతోషాలను అంటే బాధలను మరియు మనం మొదట చెప్పినట్టు చెట్లు ఎక్కడం చిలుకలను గోరువంకలకు పంజరంలో బందించిన చిన్నతనము చెటికాండ్రు చిలిపిపనులు మొదలగు గుర్తులు. ఆ గ్రామంలో పశువులు పాడిపంటల పచ్చదనం, గ్రామీణ వ్యవస్థ గ్రామ స్వరూపానికి సంబం ధించిన అంశాలు మున్నగు మనకు జాషువా బాల్య జీవితాన్ని అంటిపెట్టుకొని వున్న మణులు ముత్యాలుగా చెప్పవచ్చు.

ఉపకరించిన గ్రంథాలు :

1. దళిత సాహిత్యచరిత్ర-డా॥పిల్లి శాంసన్
2. జాషువా సాహితీ తపస్సు-అమృతపూడి రాజారావు
3. ప్రజాసాహితి,సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక అక్టోబర్ 1995,

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యానికి చైతన్యమే అజెండా

– డా॥. ర్యాలి శ్రీనివాసు, తెలుగు శాఖాధ్యక్షులు, వియస్ఎం అటానమస్ కళాశాల, రామచంద్రపురం,
డా.బి.ఆర్.అంబేదర్కర్ కోనసీమ జిల్లా, ఆం.ప్ర

ప్రజల ఆలోచనల, అభిప్రాయాల ప్రతిబింబమే సాహిత్యం. అదికేవలం అంతర్మథనం స్ఫురింపజేయడం మాత్రమే కాదు ఉద్యమ బాటకూ దారులను చూపిస్తుంది. త్రోవలను ఏర్పాటు చేస్తుంది. నినాదాలు చేయించి నూతన జీవన నిర్మాణానికి మార్గం సుగమం చేస్తుంది. ఇదంతా తాము సామాజికంగా సమానంగా చూడబడటానికి చేసే ప్రయత్నం. భూమిమీద ఏ ప్రాణి అయినా తమ ఉనికిని కాపాడుకోవడం కోసం ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడం ప్రకృతి సిద్ధమైనదే కదా! అటువంటప్పుడు మనిషిగా పుట్టిన ప్రాణి తన అస్తిత్వం కాపాడుకోవడం కోసం ఉద్యమించక తప్పదు. తప్పలేదు!

సమాజంలో నెలకొన్న విభిన్నమైన విషయాల్ని సంఘటనల్ని సాహిత్యం బహిర్గతం చేస్తుంది. తెలుగు సాహిత్యంలో దళిత కవిత్వం దాదాపు ఒక శతాబ్ధ కాలం పూర్తిచేసుకున్నా... చైతన్య ప్రతీకత్వం కోసం ఇంకా ప్రాకులాడవలసిన స్థితి ఉంది. కునుమ దర్మన్న "ఆలకింపుమయ్య హరిజనుండ" నినాదం చాలావరకు దళిత భావజాలానికి స్ఫూర్తి నింపింది. జాతీయోద్యమ కాలంలో హరిజనాభ్యుదయ కవిత్వంగా వెలువడిన దశ తొలిదశ కాగా, వామపక్ష ఉద్యమాల తీవ్రత పీడిత వర్గ కవిత్వంగా వికసించడం రెండవ దశ. నేడు దళిత ఉద్యమాల స్ఫూర్తితో ఒక ప్రధానమైన సాహితీ స్రవంతిగా దళితకవిత్వం దూసుకురావడం వర్తమానంలో కని పిస్తోంది! అందుకే సమాజం సాహిత్యం అవిభాజ్యమైనవి అన్నది అక్షర సత్యం!

సాంఘికపరమైన చర్యలు మనిషిని చాలావరకు ఆలోచింపజేస్తాయి. ఆచరణలోకి త్రోవలు చేస్తాయి. చేసే వృత్తి, శ్రమ వంటివి తమస్థాయిని నిలబెట్టడంతో వచ్చే సమస్యలు ఇందుకు కారణాలు. అయితే అస్పృశ్యత నిరక్షరాస్యతకు తోడవ్వడంతో వివక్ష కాలానుగుణంగా పెరిగింది. ఇప్పటికీ గ్రామాల్లోని ఆలయాలకు దళితులు రాకపోవడం మనం చూస్తూనే ఉన్నాం!. నిజానికి శ్రమ చేసి దేశ సంపదను పెంచేది వీరే! కానీ సాంఘిక దోపిడికీ అణచివేతకూ గురవుతున్నవారు, అస్పృశ్యులుగా పరి గణింపబడుతున్నవారు, నీచ వృత్తులుగా భావింప బడుతున్న వృత్తులు చేస్తున్నవారు, శారీరక శ్రమపై ఆధారపడి బతుకులు గడుపుతూ సమాజ సంపదను పెంచుతున్నవారు వీరే. దళితుల సంవేదనలను, ఆర్తినీ, ఆవేశాన్ని, నిరాశనూ, నిట్టూర్పులనూ, ఆగ్రహాన్నీ, యదార్థ జీవిత వ్యధార్త దృశ్యాలనూ ప్రతిబింబించేది దళిత సాహిత్యం.

మనిషి ఉంటేనే భావ ప్రకటన ఉంటుంది. అది ఆనందం కావచ్చు బాధ కావచ్చు. ఆవేదన, ఆలోచన, అభిప్రాయాలే కదా సాహిత్యానికి మాతృకలు. దళితుల జీవిత వాస్తవికత ఎప్పట్నించి ఉందో, దళితుల భావ ప్రకటన కూడా అతి సహజంగానే, అప్పట్నించీ ఉంటుంది. అంటే దళిత సాహిత్యం దళితుల జీవిత మంత పాతది.

ఈ యుగ సాహిత్యంలో అత్యంత ప్రముఖమైన, చర్చించాల్సిన విషయంగా దళిత సాహిత్యం ముందుకు వచ్చింది. సామాజిక మార్పుని కోరుకునే సాహిత్యమే దళిత సాహిత్యం. ఇది దళిత, పీడిత, దోపిడీకి గురైన, హక్కుల నిరాకరణకు గురైన వర్గాల అభివృద్ధి గురించి గొంతెత్తి నినదిస్తుంది. సామాజిక అసమానతలు మతపరమైన దురాచారాలని దళిత సాహిత్యం నిరాకరిస్తుంది. భారత దేశ చరిత్రలో అన్నింటికి మించిన కళంకం ఏదైనా

ఉందీ అంటే... అది కులమే. అనేక సమస్యలకి మూలం అదే. కుల కాలుష్యాన్ని తొలగిచేందుకు, తలపై పులిమిన పాప పంకిలాన్ని కడిగి కరుణించేందుకు ఎందరో మహాత్ములు వచ్చారు, కాలం తీరిపోయారు. కాని కులం మాత్రం అలాగే ఉంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ దళిత సమాజంలో కొత్త చైతన్యాన్ని కొత్త చూపుని ప్రసాదించాడు. ఒక చోట గాంధీకి జవాబుగా 'మీరు భారత్‌ను నా మాతృభూమిగా చెబుతున్నారు. ఏ దేశంలో కుక్కలు, పిల్లులు జంతువుల కంటే హీనంగా చూడ బడుతున్నామో ఆ దేశం మాదెట్లా అవుతుంది' అంటాడు.

కుల నిర్మూలనకు ప్రయత్నించిన మహానుభావులలో బుద్ధుడు, కబీర్, ఫూలే, అంబేడ్కర్, కుసుమ ధర్మన్న, జాషువా లాంటి వారెందరో ఉన్నారు. మంత్రతంత్రాలతో, రాజ్య సహకారంతో కుట్రలతో బ్రాహ్మణవాద సమాజ మాయోపాయానికి గురైన బహుజన సమాజం నేటికీ తమ పోరాట పంథాలో పయనిస్తూ అక్షరాల్నే ఆయుధాలుగా ప్రయోగిస్తున్నది. అదే స్థాయిలో కవి పద్మారావు అనేక దళిత ప్రతీకలతో, బింబాలతో, శైలితో నిరంతర కవిత్వ సాధనలో ఉన్నారు.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో చార్వాకులు, లోకాయతులు, శంబూకుడు, త్రిశంకుడు లాంటి పాత్రల్లో అన్యాయాలకు, అక్రమాలకు, హత్యలకు గురైన అంటరాని మనుషులు అనేకం కనిపిస్తారు. మానవ సమాజ క్షేమం కోరి ప్రజ్ఞ, సమత, కరుణ అనే త్రిశరణాలను బోధించిన బుద్ధుడు నడయాడిన నేల ఇది. భక్తి కాలంలో వచ్చిన సంత్ సాహిత్యంలో నిర్గుణధారకు చెందిన జ్ఞానాశ్రయ శాఖలో సంత్ కబీర్, సంత్ రవిదాస్, గురునానక్ విప్లవాత్మకమైన సాహిత్యాన్ని సృష్టించారు.

సంత్ కబీర్‌దాస్ ఒకచోట 'జాతి నాపూఛో సాధూకీ పూచ్ లీజియేజ్ఞాన్/మోల్ కరో తల్‌వార్ కీ, పడే రహనే దో మ్యాన్' అనగా సాధువు యొక్క కులాన్ని అడగవద్దు, అతనిని జ్ఞానం గురించి అడిగి తెలుసుకోండి. ఖడ్గం పదును చూడండి. దానిని ఉంచే ఒర ఎలా ఉంటే మనకేంటి అంటాడు. కబీర్ స్ఫూర్తితో అసలైన విప్లవ కారునిగా తెలుగు దళిత కవిత్వంలో కత్తి పద్మారావు దళిత కవిత్వాన్ని సృష్టించారు.

మానవ ధర్మ ప్రవక్త సంత్ రవిదాస్ ఇలా అంటాడు-

'జాకే కుటుంబ్ కే డౌర్ డోవంత్ ఫీరల్/
అజుప్ బనారస్ కే ఆస్ ఆసా పాసా/
ఆచార్ సహిత్ విప్రకర్‌హి దండవత్/
విన్ వనయ్ రవిదాస్ దాసానుదాసా''

నా కులానికి చెందిన ప్రజలు కాశీ దగ్గర చనిపోయిన పశువుల్ని మోస్తున్నారు. బ్రాహ్మణులు గౌరవ ప్రదమైన రీతిలో దాసానుదాసుడైన నా ముందు మోకరిల్లుతున్నారు. దళితులు తొలుత తమని తాము గౌరవించుకోవడం చేయాలి. హీనత్వం అనేదానికి తావివ్వకూడదు. అందుకే చదువు చాలా అవసరం. జ్ఞాన సముపార్జన ద్వారా అది సాధించగలగాలి. లేదంటే ప్రజలు ఎందుకు తనను గౌరవిస్తున్నారని ప్రశ్నించాడు. విషయావగాహన, ఆలోచన, మార్పు అనేవి కేవలం తెలుసుకోవాలనే జిజ్ఞాసతో ముడిపడిఉన్నాయి. అప్పుడే మనిషిని గౌరవిస్తారు అంటారు.

బాబాసాహెబ్ అంబేడ్కర్ '' కులం ప్రాతిపదికన బానిసత్వ సంకెళ్ళు దళితులుగా చిత్రించిన వైనాన్ని తూర్పారబట్టాడు. ఇదంతా కులం కట్టిన కోట. ఇది దుర్మార్గం అని ఆయన ఉద్యమ స్ఫూర్తికి తావిచ్చాడు. హాత్మా అని కీర్తించే గాంధీ కూడా వర్ణ వ్యవస్థను స్వీకరిస్తూనే కుల వ్యవస్థ పోవాలి అంటూ సంస్కరణ వాదపు గొంతుతో హరిజనోద్ధరణ ఉద్యమంతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపారు. కులం పేరుతో నీచమైన వాడిగా చూసిన దశను గుర్తుంచుకుంటూ జ్ఞానమే గొప్పతనానికి మూలమన్న రవిదాస్ మార్గంలో తన జాతి గొప్పదనాన్ని కీర్తిస్తూ మహోన్నతమైన స్థానాన్ని గుర్తిస్తూ కవి కత్తి పద్మారావు తన గొంతును వినిపించాడు.

'నా పాదాల్లో
అరుణ కిరణాలున్నాయని

నేడు నమస్కరిస్తున్న
చేతులు నేను చిన్నప్పుడు
మంచి నీళ్ళడిగితే
అస్పృశ్యమన్నాయి
నేను నడిస్తే
నా వెనుక పరిగెడుతున్నప్పుడు కాని
నా నడకను/వాళ్ళ పరుగు
అందుకోలేదని

వారికి తెలియదు' అంటాడు. కత్తి పద్మారావు కవిత్వం వక్తృత్వ ధోరణితో పాఠకుల్ని నిలేసి ప్రశ్నిస్తుంది. పల్లెల ఉగ్గుపాలు తాగిన పద్మారావు దళిత భాషను దళిత నంన్కృతిని తన శైలిలో ఆవిష్కరించాడు. పండుకారప్పచ్చడి, గోంగూర పచ్చడి, బెల్లం కుడుములు, పిల్లి పెసర్లు, బొబ్బర్లు, బెల్లబ్బువ్వ, అలసందులు ఆయన కవిత్వం నిండా పరుచుకుంటాయి. అలాగే ఎండ్లూరి సుధాకర్ వర్తమానం, కొత్త గబ్బిలం, నల్ల ద్రాక్షపందిరి, జివి రత్నాకర్ మట్టిపలక, ప్రసాదమూర్తి కలనేత వంటి రచనల్లో దళిత వస్తు, శిల్ప వైవిధ్యాలు మనకు కనబడ తాయి. కాలేకూరి ప్రసాదు పిడికెడు ఆత్మ గౌరవం కోసం చెప్పిన కవిత భూస్వామ్య వ్యవస్థలోని క్రౌర్యాన్ని వ్యక్తంచేసింది. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోను నేడు మనకు దళితవాద కవిత్వమూ వెలువడుతుంది.

1919లో మాంటేగూ సంస్కరణల తరువాత వచ్చిన ప్రజాస్వామిక మార్పుల వల్ల రాజకీయాల్లో దళితుల సంఖ్యకి గుర్తింపు వచ్చింది. వివిధ రాజకీయ పార్టీలు బలహీన వర్గాలని తమవైపు తిప్పుకోవడంలో సఫలమయ్యాయి. కానీ అన్ని పార్టీల్లో నాయకత్వం అగ్ర వర్ణాలకే స్వంతమై, దళిత మేధావివర్గం పక్కవాద్యాలకే సరిపోయింది. దళిత వర్గాల్లో కాస్తో కూస్తో కనిపించే ఆర్థిక, సామాజిక ప్రగతి పట్టణాలకే పరిమితమయింది. గ్రామాల్లో వ్యవసాయం, సాంప్రదాయక వృత్తులపై ఆధారపడిన వారి జీవన విధానంలో హెూదాలో మార్పు శూన్యమే. విద్య, ఉద్యోగం, సంపాదన, సమాన హెూదా విద్యావంతులని పట్టణాలలో కట్టేస్తాయి. ఆస్తిపాస్తులున్న అగ్రవర్ణాల వారు కొంత వరకూ గ్రామాలతో సంబంధాలు నిలుపుకున్నా, ఏ ఆస్తులూ లేని దళిత మేధావి వర్గం గ్రామాలకి మరింత దూరమైంది. ఈనాటికీ పట్టణాలకీ, గ్రామాలకీ మధ్య జీవనసరళిలో వ్యత్యాసం బలహీన వర్గాల్లో మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నది నిజం.

ఏమిటి కర్తవ్యం?

ఆర్యుల దండయాత్రలకంటే పూర్వం నుండి వైదిక సాహిత్య ఆవిర్భావానికి ముందునుండీ ఈ గడ్డ మీద పుట్టి పెరిగిన ఇక్కడి భూమి పుత్రుల, ఆది భారతీయుల సాహిత్య మూలాలను వెదికి, వెలుగులోకి తేవాల్సిన బాధ్యత దళిత రచయితల, చరిత్రకారుల, సామాజిక శాస్త్రవేత్తలపై ఉంది. మౌఖిక సాహిత్య సంప్రదాయం లోనూ, శ్రామిక సాహిత్య రూపాలలోనూ దాగి ఉన్న దళిత వాస్తవికతను దళితుల దృష్టి కోణం నుండి అన్వేషించి, ఆవిష్కరించాల్సిన అవసరం ఉంది. ఆధునికాంధ్ర కవిత్వంలో దళిత కవిత్వం దాదాపు ఒక శతాబ్ధ కాలంకు పైగా వెలువడుతున్నది. జాతీయోద్యమ కాలంలో హరిజనాభ్యుదయ కవిత్వంగా వెలువడినదశ తొలిదశ కాగా, వామపక్ష ఉద్యమాలలో పీడిత వర్గ కవిత్వంగా వికసించడం రెండవ దశ, నేడు దళిత ఉ ద్యమాల స్ఫూర్తితో ఒక ప్రధానమైన సాహితీ ప్రవంతిగా దూసుకురావడం వర్తమాన దశ. ఇందుకోసం కొన్ని నియమాలు ఖచ్చితంగా మనం పాటించాలి. రచనల్లో వాస్తవికత, ప్రయత్నంలో జాగురూకత పెంపొందించే విధంగా రచనలూ రావాలి.

1. పార్టీ నాయకత్వంలో అగ్రవర్ణాలతో బాటు సమాన మైన స్థానం కల్పించాలి.
2. దళితుల్లో అగ్రభాగాన ఉన్నవారు మిగిలిన వారి శ్రేయస్సుకు తగిన కృషి చేయాలి.
3. ఇంకా తాము వెనుకబడి ఉన్నామనే నైరాశ్యం విడనాడే నినాదాన్వేష రచనలు రావాలి.

4. ఆర్థిక, సామాజిక సామరస్యం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఇవి ఎక్కువగా కథల రూపంలో వస్తున్నాయి.
5. దళితుల్లో సాంప్రదాయక వృత్తుల్లో ఉన్న వారి ప్రగతి, హెూదాలో మార్పులు ఆశించే సాహిత్యం ఇంకా రావాలి.
6. కళాత్మక నిర్మాణం కోసం దళితులు, దళితేతర కళాకారులు, ఇందుకు సంబంధించి రచనలు ఇంకా రావాలి.
7. పట్టణ ప్రాంతాల్లోని దళితుల ప్రగతి, గ్రామస్థాయి లోనూ పెంపొందించే విధంగా కృషి సాగాలి.
8. విద్య, ఉద్యోగం పట్టణ ప్రాంతాలకే పరిమితమైన పరిస్థితినుండి గ్రామాలకు చైతన్య స్ఫూర్తి చేరువయ్యేలా చూడాలి.
9. చైతన్యం కొరవడిన మనసుల్లోకి స్ఫూర్తికి రచయితలూ కృషి సాగించాలి.
10. దళిత కవిత్వం కొంత ప్రయత్నమైతే దళితవాద కవిత్వం సంపూర్ణమనే భావానికి కవులు చేరాలి.

ఆధార గ్రంథాలు :

1. దళిత సాహిత్య నేపథ్యం -ఎస్వీ సత్యనారాయణ
2. హరిజన శతకం - కుసుమ ధర్మన్న
3. బోయి భీమన్న రచనలు - పాలేరు, రాగవాసిష్టం గుడిసెలు కాలిపోతున్నై

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ముద్ర నవలలోని దళిత స్త్రీ వెతల చిత్రణ

– తలారి నారదముని, ఎం.ఎ.తెలుగు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

ఆయనొక నడిచే పల్లెటూరు, మానవత్వపు పరిమళాలను మది నిండా నింపుకున్నా మానవతమూర్తి. నిలువెత్తు వరికంకుల సంగీతం, కొండ్రు దున్నే రైతు, కాడి మోపిన కర్షకుడు, సాలు మధ్యన నడిచే మడకెద్దుల ఊపిరి, తపస్సు మాను ఎక్కిన అర్జునుడు, ఆ అర్జునునికి బతుకాట చూపించిన శ్రీకృష్ణుడు. వలస జీవుల కన్నిటినీ దోసిట పట్టి వారి చెమటను సిరాగా మార్చుకున్న కవి. ఎంత ఎదిగినా అమ్మనాన్నల అరచేతి బొబ్బలను గుండెల్లో పదిలంగా దాచుకున్నవాడు. ఎందరో విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దిన గురబ్రహ్మ నటుడు, నాటకకర్త, రచయిత, కవిగా సాహితీలోకానికి పరిచయం అయిన డాక్టర్ వి.ఆర్.రాసాని పూర్తి పేరు రాసాని వెంకట్రామయ్య చిత్తూరు జిల్లాలో ఒక కుగ్రామం అయిన కురవపల్లెలో 1957 సంవత్సరం ఏప్రిల్ 19న జన్మించారు. వీరిది పశు పోషణతో కూడిన వ్యవసాయ ధారిత కుటుంబం. రాసాని శిద్దయ్య, ఎల్లమ్మలు తల్లిదండ్రులు. కమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యా, ఎస్వీ ఆర్ట్ కళాశాలలో బి.ఏ., శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేశారు. ఆచార్య జి.నాగయ్యగారి పర్యవేక్షణలో "రాయల సీమ వేడుక పాటలు - ఒక పరిశీలన" అనే అంశంపై పి హెచ్.డి. చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా ఉద్యోగం చేసి 2017లో పదవి విరమణ చేశాడు.

రాసాని బాల్యం నుంచే కవిత్వం పట్ల, రచనా వ్యాసంగం పట్ల మక్కువను కలిగి ఉండేవాడు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసేటప్పుడు మొదటి సారిగా ఆయన రామునిపై కంద పద్యం రాశారు. యతిరాజు గారి ప్రోత్సహంతో ఆయనలోని రచయిత బయటకీ వచ్చాడు. డాక్టర్ వి.ఆర్.రాసాని కలం పేరుతో ఆయన మొదటగా రాసిన నవల 'చీకటి రాజ్యం'. ఇంకా మట్టి బ్రతుకులు, చీకటి ముడులు, బతుకాట, వలస, పరస, ఏడోగ్రహం నవలలు రాశారు. ప్రస్తుతం నవల ముద్ర ఇది 2006లో చతురలో వచ్చింది. తెలుగుతోపాటుగా హిందీ, కన్నడం, తమిళభాషలలోకి కూడ అనువాదం అయ్యి ఈ ముద్ర నవల పాఠకుల హృదయంలో చెరగనీ ఒక ముద్రను వేసింది.

పుస్తకాలను చదివి పుస్తకాలు రాసే ఈ రోజులలో జీవితాలను చదివి, ప్రత్యక్షంగా చూసి అధ్యయనం చేసి రచనలు చేసే రాసాని లాంటి రచయితలు చాలా అరుదుగా ఉంటారు". రాయలసీమ ప్రాంతంలోని అన్ని సాంఘిక దురాచారం అయిన బసివినీ వ్యవస్థ గురించి, అదియే విధంగా దళిత స్త్రీ బ్రతుకులను బలితీసుకుంటుంది. అగ్రవర్ణాలకు చెందిన భూస్వాములు తమ లైంగిక వాంచలు తీర్చుకోవడానికి మతం ముసుగులో అమాయికులు అయిన అమ్మాయిలను బసివినీలుగా మార్చి వాళ్ళ వికృతమైన కామ దాహంను కన్నెరికం పేరుతో తీర్చుకునే వాళ్ళు బ్రతుకులను కుక్కలు చింపిన విస్తరిలా ఎలా నాశనం చేస్తున్నారో మన కన్నులకు కట్టినట్లుగా రాయలసీమ ప్రాంతంలోని భాష, యాస, పలుకుబళ్ళు ఉపయోగించి కరుణారసత్మంకగా గొప్ప శిల్ప నైపుణ్యంతో నవల నిర్మాణం చేశారు. ఈ విషసంస్కృతి నశించాలే అనే బలమైన తన ఆ కాంక్షను వ్యక్తం చేశారు రచయిత. బాల్యంలో రచయిత కన్నుల ముందు జరిగిన కొన్ని సంఘటనలు ఈ నవల రచనకు ప్రేరకలు. రచయిత బాల్యంలో వాళ్ళ పొలంలో పనికీ వచ్చే ఒక దళిత బాలికను మాతమ్మగా మార్చబడితే ఆ అమ్మాయి అవమాన భారంతో ఆత్మహత్య చేసుకుంది. మరో అమ్మాయికి శాస్త్రోకంగా బసివిని ముద్ర వేసి వదిలేస్తే ఆమె దేశమంతా తిరిగి అనాథలా స్వంత ఊరికే వచ్చి

మరణించే వరకు భిక్ష మెత్తుకొని జీవించి మరణించంది. ఈ సంఘటనలు ఈ నవల రచనకు మూల కేంద్రాలు.

రాయలసీమ ప్రాంతంలో నేటికీ సజీవంగా కనిపించే సాంఘిక దురాచారమే బసివినీ వ్యవస్థ వెర్రి తలలు వేసి మనుధర్మ శాస్త్రం నుండి పుట్టుకొచ్చిన దురాచారాలలో దేవదాసీ వ్యవస్థ ఒకటి. దానీ నుండి గణాచారీ వ్యవస్థ మాతమ్మ వ్యవస్థ, తెలంగాణ ప్రాంతంలో జోగినీ వ్యవస్థ, కరీంనగర్ ప్రాంతంలో శివనత్తులు, రాయలసీమ ప్రాంతంలో బసివినీ వ్యవస్థలు పుట్టుకు వచ్చాయి. స్త్రీలను లైంగికంగా మతాల పేరుతో దోచుకోవడం ఇందులో మనకు ప్రధానంగా కనబడతాయి. దక్షిణ భారతదేశంలో ఒక్క కేరళలో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలో ఈ దురాచారం వుంది. నరబలికి బదులుగా దేవాలయాలకు అమ్మాయిలను సమర్పించే దురాచారమే ఈ బసివినీ వ్యవస్థకు పునాది కాళిదాసు మేఘదూతంలో ఉజ్జయిని మహాకాళికీ కొన్ని వందల మంది పిల్లలను సేవకులుగా సమర్పించే వారు అని రాశారు. దేవాలయంలో దేవదాసీలుగా పిలువబడే వీళ్ళు గ్రామంలో బసివినిలుగా పిలువబడుతున్నారు. గ్రామాలలో అన్ని అరిష్టాలకు, అనర్థాలకు మూలం గ్రామదేవతకు ఆగ్రహం కలగడమే అని భావించే గ్రామీణులు ఆమెను శాంతింపజేయటానికి ఊరి పెద్దలు పెళ్ళికానీ దళిత స్త్రీలను వీపు పైన ముద్ర వేసి బసివినిలుగా మార్చి వదిలి వేస్తారు. వారినీ ఊరు ఉమ్మడి సొత్తుగా చేసుకునీ అనుభవిస్తారు. ఆమెతో మొదటి రాత్రి ఆ ఊరి పెద్ద కన్నెరికం చేస్తాడు. తరువాత ఆమెను అందరూ అనుభవిస్తారు. ఆమె జీవితంలో ఎవరినీ పెళ్ళి చేసుకోరాదు అనే నియమం పెడతారు. ఇటువంటి సాంఘిక దురాచారంకు బలి అయిన కోటమ్మ అనే దళిత స్త్రీ తన కూతురు ఈ విష ఆచారంలో విషసంస్కృతిలో చిక్కుకుపోరాదనీ మృగాళ్ళ చేతిలో ఆమె బ్రతుకు నాశనం కారాదనీ చేసిన పోరాట మీ ఈ ముద్ర నవల. కథలోనికి ప్రవేశిస్తే.

రాయలసీమలోని ఒకదళిత వాడలో ఊరి చివర వృద్ధ యాచకురాలు ఓబులవ్వ నివాసం అటూ వైపు ఎవ్వరూ పోరు ఎందరో అమాయికపు అమ్మాయిల బ్రతుకులు బసివినీలుగా మారీ బలి అయిన ప్రదేశం ఆ ముసలామె గుడిసె వద్ద గల ప్రాంతమే ఓ అర్ధరాత్రి మంచి చలి కాలంలో ఆ అవ్వ గుడిసె తలుపు తట్టి లోపలికీ హసనా అనే స్త్రీ ప్రవేశిస్తుంది. తనకు ఈ ఊర్లో పనివుందని 4 రోజులు పాటు నీ వద్ద వుంటాను. అందుకు ప్రతిఫలంగా 100 రూపాయల నోటు ఇస్తుంది. అంతడబ్బు ఆ అవ్వ ఆమె జీవితంలో ఎప్పుడు చూసి ఉండదు. సంతోషంగా అంగీకరిస్తుంది. ఓబులవ్వ హాసీనా ఎవరు అనేది నవల చివర వరకు సస్పెన్స్‌గా వుంచుతాడు రచయిత.

కొన్ని సంవత్సరాల క్రితం అదే గ్రామంలో కోటమ్మ అనే స్త్రీ ఉండేది. ఆమె తనకు లొంగలేదని కోపంతో ఆ ఊరు సర్పంచి ముసలయ్య ఆమెను ఆ గ్రామంకు చెందిన శాస్త్రి సహకారంతో బసివినీగా మార్చి లైంగికంగా వాడుకుంటాడు. అంతటితో ఊరుకోక తన అవసరాల కోసం అధికారులకు తార్చబోతాడు. కోటమ్మ అందుకు ఒప్పుకోదు. సర్పంచిమూలన ఆమె ఒక బిడ్డకు తల్లి కూడ అవుతుంది. అధికారుల పక్కలో పడుకోలేదు. అనే కోపంతో ఆమెను చంపటానికి చూస్తే ఆమె తన బిడ్డను తల్లిదండ్రుల వద్ద విడిచి పెట్టి ఊరు వదిలి పారి పోతుంది. ఆమె కన్నమ్మగా పేరు మార్చుకుని పాలం పనులు చేసుకుంటుంది. అక్కడ తమిళ కూలీ మణితో పరిచయం అవుతుంది. అతనితో కలిసి రైలెక్కుతుంది. ఆయనకు ముందే పెళ్ళి అవుతుంది. అతని భార్య నుండి తీవ్రమైన వివక్షతను కన్నమ్మ ఎదుర్కొంటుంది. అక్కడి నుండి వెళ్ళిపోతుంది. ఆ తర్వాత ఆమెకు ఐస్ ఫ్రూట్స్ అమ్ముకునే సలీంతో పరిచయం ఏర్పడుతుంది. వాడు ఉర్దూ నేర్పించి హసీనా పేరు పెడతాడు. కువైట్ తీసుకువెళ్తానంటు ఆమెను బొంబాయిలో వ్యభిచార గృహంకు అమ్మెస్తాడు. ఆమె ఆ గృహంలో వ్యభిచార వృత్తి చేయలేక షేర్‌ఖాన్ అనే రౌడీ సహాయంతో

తప్పించుకునీ తన సొంత గ్రామం వస్తుంది. తనగాథ అంతా ఓబులవ్వకు వినిపిస్తుంది. ఆ హసీనా యే ఈ కోటమ్మ, తన కూతురు క్షేమంగా వుందా ఎలా వుంది అని సమాచారం అడిగితే ఆమె కూతుర్ని ఊరి బాగు పేరిట బసివినిగా మార్చాలని కొందరు సిద్ధమవుతున్నారు అని చెబుతుంది. దీనితో ఆమె ఆడవాళ్ళలో నిశ్శబ్ద విప్లవాన్ని తెచ్చి చైతన్య పరచి ఈ దూరచారంను అడ్డుకుని తన కూతురు కోరుకున్న అబ్బాయితో ఆమె పెళ్ళినీ జరిపిస్తుంది. తాను ఎవరో కూడా తన కూతురికీ చెప్పకుండా రాత్రికీ రాత్రే ఊరు వదిలి వెళ్ళిపోతుంది. హసీనాగా వచ్చి కోటమ్మగా ఇచ్చిన వందనోటు మరణించిన ఓబులవ్వ చేతిలో రెపరెపలాడుతుంటుంది. తన కూతురు ఆమె ప్రసాదించిన స్వేచ్ఛ పతాకంలా స్వాతంత్ర్య భారతదేశంలో ఇటువంటి సాంఘిక దురాచారాలు నశించి పోవాలి అనీ యుగయుగాలు, తర తరాలుగా దళిత స్త్రీలపై మతం పేరుతో జరిపే ఈ లైంగిక దోపిడి అంతరించి పోవాలనీ రచయిత ఈ నవల ద్వారా ఆకాంక్షించారు. 1974 వ సంవత్సరంలో సంస్కార్ అనే సంస్థ ద్వారా హేమలత లవణం దేవదాసీ, బసివినీ హక్కుల కోసం పోరాటం చేసి వాళ్ళ సంక్షేమం కోసం ఎంతో సేవ చేశారు. 1988లో ఈమె కృషి ఫలితంగా జోగినీ వ్యవస్థకు రద్దు చేస్తు చట్టం కూడ వచ్చింది. ఈ నవల అశేష పాఠకుల ఆదరాభిమానాలు పొందటమే గాక మేధావుల్లో, అధికారుల్లో స్పందన కూడ తెచ్చింది. వాళ్ళ సంక్షేమం కోసం తిరుపతిలో మాతమ్మ కాలనీ కూడా నిర్మించారు. రచయితగా రాసాని సాధించిన గొప్ప విజయంగా మనం దీనిని చెప్పుకోవచ్చు. తెలుగు సాహిత్యంలో ఈ నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రాకపోవడం కేంద్ర సాహిత్య అకాడమికే ఒక పెద్ద లోపం అని ప్రముఖ కథకులు బండినారాయణ స్వామి పేర్కొన్నారు. తెలుగు సాహిత్యం వున్నంత కాలం ఈ నవల వుంటుంది.

ఆధార గ్రంథాలు :

1. వి.ఆర్.రాసాని సాహిత్య సమాలోచన - సంపాదకులు ఆచార్య నాగోలు కృష్ణారెడ్డి, డాక్టర్ పి.సి.వెంకటేశ్వర్లు - 2017.
2. మెహర్ - ముద్ర ఉర్దూ అనువాదం - డాక్టర్ విస్.హసీనా బేగం.
3. జోగతి - ముద్ర - కన్నడ అనువాదం - 5వ ముద్రణ - డాక్టర్ టి.డి.రాజన్న తగ్గి.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య కొలకలూరి ఇనాక్ కథలు – దళిత తాత్వికత

– కందుల ఆంజనేయులు, తత్వశాస్త్ర శాఖాధిపతి, ప్రభుత్వ కళాశాల, స్వయంప్రత్తి, రాజమహేంద్రవరం.

ఇనాక్ కథలు ప్రధానంగా దళిత జీవితంలోని ఆత్మగౌరవ ధిక్కార స్వభావానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. అంటరానితనాన్ని నిషేధించిన భారత రాజ్యాంగం (17 వ అధికరణం) అమలులోకి వచ్చిన నాలుగేళ్లకు కథారచన ప్రారంభించిన ఇనాక్ ఆ మరుసటి సంవత్సరమే అంటే 1955 లో అంటరానితనం నేరం అని చట్టం వచ్చినా దళితులను ఆ పేరు మీద న్యూన పరచటం, అవమానించటం, హింసించటం, చంపటం ఏ మాత్రం ఆగని సమకాలీన సమాజాన్ని చూస్తూనే ఉన్నారు. కంచికచెర్లలో కోటేశును ఇత్తడి చెంబు దొంగతనం చేసాడని ఆరోపించి చెట్టుకు కట్టి కిరసనాయిలు పోసి సజీవ దహనం చేసిన (1969) ఘటన నాటి నుండి ఆయన దళితులపై అణచివేతను, హింసను గమనిస్తూనే ఉన్నారు. ఆలోచిస్తూ న్పందిన్నున్నారనటానికి అంటరానితనం, విద్య, ఉద్యోగాలు, పదవులు, రాజకీయాలు, స్నేహాలు, ప్రేమలు, సంస్కృతి విలువలు, మతం, ధిక్కారం, తిరుగుబాటు మొదలైన దళిత జీవిత పార్శ్వాలను వస్తువుగా చేసిన్రాసిన అనేక కథలు నిదర్శనం. ఆ వరుసలో ముందు చెప్పుకోవలసినది 'ఊరబావి'(1969).

'ఊరబావి' కథ నీటి సమస్యతో మొదలవుతుంది. దళితుల నీటిసమస్య కానీ, ఆ సమస్య పై కథలు కానీ కొత్తకాదు. ఊరి నుండి మాల మాదిగ పల్లెలను వేరుచేసిన సవర్ణ దురహంకారం ప్రజా వినియోగ వ్యవస్థలను ముఖ్యంగా బావి, బడి, గుడి - ఈ మూడింటినీ దళితులకు నిషేధించింది. దీనిని సవాల్ చేస్తూ వాటిని దళితుల అనుభవానికి తీసుకురావటానికి 1927లో మహద్ చెరువులో దళితుల ప్రవేశానికి అంబేద్కర్ ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించి దారి చూపాడు. అలాగే ఇనాక్ కంటే ముందుగానే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి ఊరి చెరువు నీళ్లలో వాటాకోసం బతిమిలాడి భంగపడిన దళితులు ముస్లిం మతంలోకి మారి చెరువులోదిగే అర్హతను సంపాదించిన వైనాన్ని 'అలాంటి తవ్వాయి వస్తే' అనే కథగా వ్రాసాడు. ఆ వరుసలో దాదాపు పాతికేళ్ల తరువాత స్వతంత్ర భారతదేశంలో కొత్త చైతన్యంతో, యుద్ధవ్యూహాలతో ఆ సమస్యను పరిష్కరించుకొనటం వస్తువుగా వచ్చిన కథ ఊరబావి. ఎండాకాలం వంద గడప ఉన్న పల్లె బావి ఎండిపోయి ఊరబావి మీద ఆధార పడవలసిన స్థితిలో నాటకీయ పరిణామాలతో వాస్తవ భూమిక మీద విస్తరించిన కథ ఇది.

ఊరబావిలోకి దించబడిన చర్మం వలిచిన ఎద్దు కళేబరం చూడటానికి ఊరంతా వస్తున్న ఒకానొక ఉదయం పూట ప్రారంభమైన కథలో అందుకు కారకుడుగా చిదంబరం అనుమానించబడంతో కదలిక మొదలవుతుంది. చిదంబరం ఎందుకు అనుమానించ బడ్డాడు? అది అతని తండ్రి రామయ్య క్రితం రోజు రైతు నాంచారయ్య దగ్గరనుండి తన వంతుగా తెచ్చుకొన్న చచ్చిన ఎద్దు కళేబరం కనుక. ఎద్దు దట్టేం పడిన బావి నీళ్లు ఊరివాళ్ళు ముట్టరు కనుక పల్లెవారి నీటి సమస్య పరిష్కారానికి చిదంబరం ఆ పని చేసి ఉంటాడనుకొనటం వల్ల. అతనిలో ఆ తిరుగుబాటు లక్షణం అందరికీ తెలిసిందే కనుక. ఏమిటి అతను చేసిన తిరుగుబాట్లు? ఒకటి తాను కోరుకొన్న పిల్లతో పెళ్ళయితే గుళ్లో పాతిక కొబ్బరికాయలు కొడతానని మొక్కుకొని పెళ్లయ్యాక ఆ మొక్కు తీర్చుకొనటానికి ధర్మకర్తల నుండి, పెత్తందార్ల నుండి వచ్చిన అవరోధాలను చట్టం సహాయంతో, పోలీసు అండతో తీర్చుకొనటం. రెండవది. రైల్వే స్టేషన్లో భార్యతో పాటు సిమెంటు బెంచీ మీద కూర్చుని పెద్దలు వచ్చినా లేవక అందరితో పాటు ఖాళీగా ఉన్న బెంచీ మీద తనకూ కూర్చునే హక్కు ఉందని స్టేషన్ మాష్టారు ముఖతః చెప్పించటం. ఈ రెండు పబ్లిక్ ప్రదేశాలలో సమాన

హక్కుల కోసమైన దళిత యువత ఆరాటం కనిపిస్తుంది. వీటిని బట్టి ఇది చిదంబరం పనే అయివుంటుందని మునసబు తీర్మానానికి వచ్చాడు.

పేరు లేని చిదంబరం భార్య ఆత్మగౌరవ చైతన్యపు ఉనికి మాత్రం కథ అంతా పరుచుకొని ఉంటుంది. రైల్వేస్టేషన్ లో చిదంబరం పై ఎత్తిన ఆసామి చెయ్యిని పట్టి ఆపటంలో అదే కనబడుతుంది. చిదంబరం ఆత్మాభిమాన ప్రకటనకు ప్రేరణ ఆమె పక్కన ఉండటమే అని రచయిత చెప్పాడు కూడా. ఊరబావి దగ్గర నీళ్ల కోసం పడిగాపులు పడి నీళ్లు తోడిపోసిన యువకుడు కడవ నెత్తికెత్తుతానని మీద చెయ్యేసిన తీరును అక్కడే అతనిని ఒక చెంపదెబ్బ కొట్టటంతో నిరసించి ఇంటికొచ్చి అందరికీ చెప్పుకొనటం లోనూ అన్యాయాన్ని సహించని వ్యక్తిత్వమే కనబడుతుంది. ఊరి మీదికి పోయి ఇదేమిటని నిలదీయాలి అని ఉద్రేక పడుతున్న తోటివాళ్లను మామ రామయ్య తొందర మంచిది కాదు, కోరి గొడవలు తెచ్చుకోవద్దు అని ఆపేసాడు. కొడుక్కి కూడా శాంతమే నూరిపోశాడు. ఊరబావికి నీళ్లకు పోవటం వల్ల కదా సమస్య అని తానే ఇంటికి అవసరమైన నీళ్లు మోశాడు భర్త చిదంబరం. ఈ రెండూ ఆమెకు సంతృప్తి నిచ్చిన చర్యలు కావు అని రచయిత ఎక్కడా చెప్పలేదు. కానీ ఊరబావి దగ్గర వ్యక్తిగా తనకు జరిగిన అవమానానికి అందుకు మూల కారణంగా తనను అక్కడికి వెళ్లి నీళ్లకోసం సవర్ణులను దేబరించవలసిన అనివార్యతను కల్పించిన పల్లె అందరికీ సంబంధించిన నీటి సమస్యకు ఎక్కడో సంబంధం ఉన్నదన్న గ్రహింపు ఆమెకున్నట్లు పాఠకులు అర్థంచేసుకొనటానికి వీలుగా కథను నడిపించడంలో ఉంది రచయిత చాతుర్యమంతా. వ్యక్తిగతమూ అదే సమయంలో సామాజికమూ అయిన సమస్యకు పరిష్కారంగా మామ చర్మం వలచి వదిలిన ఎద్దుకు మోకులు కట్టి బావిలోకి దించే పని ఆమే చేసి ఉంటుందని ఎక్కడా వాచ్యం కాలేదు. బావిని పల్లెకు వదిలేసినట్లు నిర్ధారణ అయ్యాక అందులోని ఎద్దు కళేబరాన్ని బయటకు తియ్యటం లో ఆమె చూపిన ఆవేశం, చొరవ, మెలకువ చూస్తే అది ఆమె పని అయి వుంటుందని అనిపించక మానదు. చైతన్యవంత మవుతున్న మాలమాదిగ పల్లెల మానవ ముఖచిత్రంగా ఈ కథ కనిపిస్తుంది.

'అస్పృశ్య గంగ' కథ ఊరబావి కథకు మరొకరకమైన కొనసాగింపు. 1999 లో అస్పృశ్య గంగ కథల సంపుటి ప్రచురిస్తూ ఇనాక్ అవలోకనం అనే పేరుతో వ్రాసిన చిన్న ముందుమాటను బట్టి అందులోని కథలు 1996 -1999 మధ్యకాలపువి. ఊరబావి కథకు పాతిక సంవత్సరాల తరువాతది. చిదంబరం తరువాతి తరం. చదువుకొని ఉద్యోగాలకు వచ్చిన తరం మునసబుల పెత్తనాల నుండి బయటపడవచ్చుగానీ అస్పృశ్యత నీడలా వెంట వస్తూ బహురూపాలలో అనుభవానికి వస్తుంటే లోలోపల ఘర్షణ పడుతూ, ఎదుర్కొనటానికి అవసరమైన వ్యూహాలను, తర్కాన్ని, తాత్వికతను కూడా అభివృద్ధి చేసుకొనే దిశగా చేయవలసిన ప్రయాణం ఈ అస్పృశ్య గంగ కథకు వస్తువు.

1996- 1999 మధ్యకాలపు కథ ఇది. అంటే అప్పటికి తెలుగునాట దళిత ఉద్యమ చరిత్ర రెండవ దశకంలోకి ప్రవేశించింది. కారంచేడు నుండి చుండూరు మీదుగా దళితులపై జరుగుతున్న అగ్రకుల దురహంకార దాడులకు, హత్యాకాండకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ ధిక్కార పోరాటంగా ప్రవహిస్తున్న చరిత్ర ఇందులో ప్రత్యక్ష వస్తువు కాదు కానీ ఆ ఒరిపిడిలో దళితులు ఎలా, ఎంతంగా సహన శక్తులను కూడ దీసుకొంటున్నారో, సమత్వ విలువలను అభివృద్ధి చేసుకొంటున్నారో ఈ కథ చూపిస్తుంది. కాలేజీ అధ్యాపకుడైన వినాయక్ బడి పంతులు అయిన భాగీరథి దంపతులు నూటముప్ఫయ్ ఇళ్ల కాలనీలో ఒక ఇంటి స్వంతదారులు. సవర్ణుల మధ్య దళితులు స్థలం కొనుక్కోరాదని, ఇల్లు కట్టుకోరాదని ఏ నిషేధాలూ ఉండవు. కానీ వాళ్ళ మధ్య జీవించటంలో అప్రకటిత అస్పృశ్యత అనుభవానికి రావటమే అసలు విషాదం. అది ఆడుకొనే పిల్లలను ఇంట్లోకి రానియ్య

కుండా ఆపుతుంది. పిల్ల తాగిన నీళ్ల గ్లాసు తాము అంటుకోకుండా పనిమనిషిచేత కడిగించటంగా ఉంటుంది. తమ ఇంటి బావుల నుండి నీళ్లు తోడుకోనియ్యక పోవటంగా ఉంటుంది. మొరటుగా, వాచ్యంగా కాక వాళ్లే గ్రహించి ముడుచుకుపోయెట్లు చేయటంగా ఉంటుంది. ఈ పరిస్థితులలో ఇంటి అవసరాల కోసం మొదలుపెట్టిన బావి తవ్వకం పని చుట్టూ ఈ కథ నడుస్తుంది.

బావి తవ్వకపు పనిక్రమంలోని అందం, గోవిందు, అతని భార్య ల శ్రమైక జీవన సౌందర్యం ఒకవైపు గొప్ప భావోద్వేగాన్ని కలిగిస్తున్నా, తమకోసం నాలుగుబిందెల నీళ్ళు తెచ్చిపెట్టె వాళ్ళ మంచితనం అర్థం అవుతున్నా వాళ్ళు తమకు నీళ్లు ఇస్తున్నారు కానీ తమ ఇంటినీళ్లు, తమ చేతి నీళ్లు వాళ్ళు తాగటం లేదని తెలుస్తూ మనసుకు నొప్పిని కలిగించటం వినాయక్ గుర్తించకపోలేదు. ఆర్థికంగా చాలా తక్కువస్థాయిలో ఉన్నవాళ్లు కూడా కులం వల్ల కొందరికంటే ఎక్కువవాళ్ళు కావటం పట్ల పదునెక్కుతున్న సమకాలపు అవగాహన ఈ కథలో ఇలా ప్రతిఫలించింది. అలాగే కులం వల్ల కలిగిన ఆధిక్యత కారణంగా దళితుల ఇంట పనిమానుకొనేట్లు పని మనుషులపై ఒత్తిడి తెచ్చే వర్ణసమాజపు దుష్ట సంస్కృతిని కూడా ఇనాక్ ఈ కథలో ప్రస్తావనకు తెచ్చారు. అదే వస్తువుగా తరువాతి కాలంలో 'కూటికి పేదనైనా' (జూపాక సుభద్ర) వంటి కథలు రావటం గమనించవచ్చు.

బావి తవ్వించే క్రమంలో బండపడటం, నీళ్లు పడతాయో పడవో అన్న ఆందోళన, నీటిలేమి గురించిన చిరకాల అనుభవాల చింత- వీటిమధ్య బావి నీరు ఎవరి సొంతమూ కాదు అన్న తాత్విక స్థాయికి చేరతాడు వినాయక్. భూమిస్తన్యం. ఏ బిడ్డ అయినా తాగవచ్చు. దానికి ఏ వంకమూ అంటదు. నీటికి స్పృశ్య అస్పృశ్యములు అనే తేడాలు లేని ప్రకృతి వనరుగా నీటిని భావించగలిగిన దశకు చేరాడు. కనుకనే బావిలో బండను బద్దలు కొట్టటానికి సిద్ధం చేసిన డైనమేట్ పేలి గోవిందు గాయపడితే అతని కోసం తహతహ లాడాడు. మొహం కడిగాడు. బావి లో నీరుపడ్డందుకు ఆనందపడుతూ నీరు రుచి చూడమని గోవిందు అన్నప్పుడు అంతకు ముందు గోవిందు తాగిన కడవలో మిగిలిన నీరు ఏ సంకోచం లేకుండా తాగగలిగాడు. అవి తన ఎంగిలి నీళ్ళని గోవిందు అభ్యంతర పెడుతుంటే 'నీటికి ఎంగిలి లేదు. నీ ఎంగిలి అని నేను మానదలిస్తే బావినే వాడుకోరాదు' అని చెప్పగలిగాడు. చెమటతో, నెత్తురుతో నీటి నుండి సమస్త సంపదలను భూమినుండి బయటకు తీసే శ్రామికుల గురించి ఆలోచించగల ఒక ఉదాత్త మానవుడి అవతరణ దళితుల నుండే సాధ్యం అని అనన్యంగా నిరూపించిన కథ ఇది. కుల వివక్ష దగ్గర ప్రారంభించి శ్రమ విలువను గుర్తించి గౌరవించగలిగిన సంస్కారంతో దానికి కుదిర్చిన లంకె వల్ల ఈ కథ మంచి కథ అయింది.

దళితులు అవమానానికి ప్రతీకారాన్ని ఎంత తీవ్రంగా కోరుకొంటున్నారో అది ఆత్మగౌరవ చైతన్య ప్రకాశమే కానీ అదే అదనుగా తమ ఆధిక్యతను స్థాపించుకొనే విధానం కాదు. కుల ఆధిక్యతతో అమానవీయమై పోతున్న అగ్రవర్ణుల చిత్తసంస్కారాలలో మార్పు వాళ్ళ ఆగ్రహానికి ఆశయం అని సూచిస్తుంది పరిష్కారం (1996- 99) కథ. బ్రాహ్మణుల ఆధిక్య ఆస్తితకు భౌతిక సంకేతం అయిన జంధ్యం కేంద్రంగా వ్రాసిన తాకట్టు(1996- 99) కథ కూడా ఇలాంటిదే. తనకు చిన్ననాటి నుండి స్నేహితుడు, ఒకే కాలేజీలో అధ్యాపకుడుగా తనతో కలిసి పనిచేస్తున్నవాడు, తన ఇంటికి పిలిచి అన్నం పెట్టేవాడు, తాను పిలిస్తే వచ్చి తన ఇంట తినేవాడు అయిన శాస్త్రి పదివేలు అప్పు కావాలని అడిగినప్పుడు ఓబులేసు జంధ్యం తాకట్టు పెట్టమని కోరటం ఇందులో విషయం. వట్టి దారపు పోగుగా దానికి విలువలేకపోవచ్చు కానీ దానికి ఆపాదించబడిన పవిత్రత మిత్రుడిని అనుక్షణం బ్రాహ్మడుగా గుర్తుచేస్తూ తననుండి భిన్నంగా నిలుపు తున్నది కనుక సమత్వ, సహోదరత్వ భావాలకు అవరోధంగా ఉంది కనుక అతను అలా కోరాడు. ఆర్థికంగా

కానీ, జీవిత విలువలరీత్యా గానీ దిగువస్థాయిలో ఉన్నవాడికి కులం వల్ల లభిస్తున్న ఆధిక్యతలోని అన్యాయాన్ని ప్రశ్నించటానికి ఓబులేశు ఎంచుకొన్న ఒక పద్ధతి ఇది. అప్పు తీర్చేవరకు తిరిగి ధరించక పోవటం షరతుగా జంధ్యం తాకట్టు పెట్టించటం అనే సన్నివేశ కల్పన ద్వారా జంధ్యం వల్ల తరతరాలుగా లభిస్తున్న ఆధిక్యతా భావం నుండి అగ్రవర్ణులు సాధించవలసిన స్వీయ విముక్తిని కూడా సూచించే అదనపు ప్రయోజనాన్ని సాధించింది ఈ కథ. జబ్బు కథ అంటరాని తనాన్ని పాటించటమే ఒక జబ్బు అని తేల్చి చెప్పింది. బంధువులు ఏమైనా అనుకుంటారు అని ఆప్తమిత్రుడు దళితుడు కనుక అతని ఇంట తినటానికి నిరాకరించిన సత్యం కాలక్రమంలో స్నేహాన్ని కులానికి లోకువ చేసిన మాయ జబ్బు నుండి విముక్తుడు కావటం ఇందులోని వస్తువు. కుల ఆధిక్య భావన నుండి అగ్రవర్ణులు, కుల న్యూనతా భావం నుండి దళితులు విముక్తమయ్యే క్రమంలోనే విలువలు గల మనుషులుగా ఎదుగుతారని ఇనాక్ భావిస్తారు.

బొట్టు హిందూత్వ ప్రతీకగా సామాజిక జీవితంలో హిందువులకు దళిత క్రైస్తవులకు మధ్య సంఘర్షణ కారణం కావటం దళిత చింతన లో భాగంగా ఇటీవల కాలంలో తరచు చర్చకు వస్తున్న అంశం. మాదాసు వినోదిని , ఎండ్లూరి మానస ఆ వరుసలో కథలు కూడా వ్రాసారు. దానిని ఇనాక్ ఇద్దరు స్నేహితులు వారు వీరయ్యే క్రమంలో పరిష్కరించుకోగల అంశంగా చూస్తారు. బొట్టును హిందూత్వ చిహ్నంగా కాక ఒక అందం గా చూడగలిగిన దళిత క్రిస్టియన్ స్నేహితురాలి బొట్టు తాను పెట్టుకొనాలని ఉబలాట పడుతుంది. బొట్టు హిందూత్వ చిహ్నం అనుకోలేదు కనుకనే స్నేహితురాలి బొట్టులేని ముఖ నైర్మల్యానికి ముగ్ధురాలై ఒక హిందూ యువతి బొట్టు లేకుండా తిరగాలని ఉబలాట పడుతుంది. వ్యక్తులు సంస్కారవంతులవుతూ సమస్యలను పరిష్కరించుకొనే దిశగా కథ నడపటం ఇనాక్ కు ఇష్టం. బొట్టు కథ ఆ రకంగా వచ్చిందే. పరిష్కారం కథ కూడా అంతే. సవర్ణులు, దళితులు అన్నలతమ్ములవలె కలిసి మెలిసి ఉండవలసిన వాళ్ళని ఇనాక్ నమ్మకం. తొలి నుండి దళిత కవులందరిదీ అదే మాట. సవర్ణులు తమ్ములను అంటరానివాళ్ళని తరిమికొట్టటం తగదని భారతమాతకది దుఃఖ హేతువని చెప్పారు. అయినా పెడచెవిన పెట్టినప్పుడు తిరుగుబాటు అనివార్యం అవుతుంది. దాని అంతిమలక్ష్యం సవర్ణులలో మానసిక పరివర్తన. ఆ కోణం నుండి చూడవలసిన కథ పరిష్కారం.

చదువు ఆత్మభిమానాన్ని ప్రోదిచేస్తుంటే మాల మాదిగ పిల్లలలో బలపడుతున్న ధిక్కార స్వరాన్ని వినిపించే కథలు పంతం (1996-99), గెలుపు. కులం, సంపద, అధికారం అన్నీ తమవైన గ్రామీణ పెత్తందారీ వ్యవస్థ చదువులను పొందే ప్రతిభ కూడా తమదేనని విర్రవీగుతూ తమను మించి మరెవరూ ఎక్కువ చదువులు చదవకుండా జాగ్రత్త పడుతుంటుంది. పంతం కథలో వీరనారాయణ ఆ వర్గానికి ప్రతినిధి. తను గానీ, తన కొడుకుగానీ దాటలేని హైస్కూల్ గడప తన యింటి మాల జీతగాడి కొడుకు దాటెట్లు పసిగట్టి వాడి చదువు ఆపించే ప్రయత్నాలు చేసాడు. అది సాధ్యం కాకపోయేసరికి వాడు పాస్ కాడని నమ్మకం పెంచుకున్నాడు. ఒకవేళ పాసైతే తన ఆధిక్యతకు, గుర్తుగా ఉన్న మీసాలు తీయించుకొంటానని పందెం కాసాడు. అతని నమ్మకం వమ్మయింది. ఎస్సెల్సీ పాసయిన చంద్రి పందెం ప్రకారం వీరనారాయణ మీసం తడిపి గొరిగించుకొనటానికి తన మూత్రం తో కూడిన మల్ల కొత్త చాటలో పెట్టి తీసుకురావటం దగ్గరే అసలు కథ ప్రారంభం అవుతుంది. పసుపురాసి బొట్లు పెట్టిన చాటలో బియ్యం పోసి, దానిపైన యజమానుల కోసం కుట్టిన చెప్పులు పెట్టి తీసుకువెళ్లే సంప్రదాయం తండ్రి ఇన్నాళ్లూ ఆచరించాడు. అదే చాటలో అదేరకంగా భంగపడిన వీరనారాయణకు మీసాలు తీసెయ్యటానికి కావలసిన పరికరాలు తీసుకువెళ్లిన చంద్రి చివరలో కాలితో తన్ని ఎగరగొట్టిన ఆ చాట దళిత ధిక్కార పతాక అయింది.

గెలుపు కథలో సన్నోబులు కూడా బడికిపోయే పిల్లవాడే. కథలో ప్రస్తుతాంశం ఎన్నికలలో గెలిచిన జడ్పీటీసీ ఊరేగింపు ముందు తప్పెట దరువు విద్యను ప్రదర్శించటం అయితే ఊరేగింపు పాడవునా బడిలో అస్పృశ్యత ప్రస్తావనగా వస్తుంటుంది. తప్పెట దరువు వేసినందుకు ప్రతిఫలం ఇచ్చేవేళ అది ఎంత అవమాన కరంగా అమలవుతుంటుందో చూపటం అసలు కథ. యజమానుల నుండి ప్రతిఫలం పుచ్చుకొనేవేళ అస్పృశ్యత వల్ల కలిగిన అవమానానికి నిరసన గా నేలన పడిన వందనోటు వంగి అందుకోకుండా తిరస్కరించి ఆత్మాభి మానాన్ని ప్రదర్శించి వంటి మీది గోచీగుడ్డను నిరసన జండాగా ఎగరేసి జీవితంలో నిజమైన గెలుపుకు తొలి అడుగులు వేసినవాడు సన్నోబులు.

చంద్రి, సన్నోబులు వంటి పిల్లలు పెరిగి, పెద్ద చదువులు చదివి ఉన్నతోద్యోగాలలోకి వెళితే అడుగడునా ఆత్మగౌరవ చేతనతో తమపరిసరాలను ఎంత సంస్కార వంతంగా మార్చుకొనే పనిలో ఉంటారో చెప్పే కథ కులవృత్తి. మనుషులలో ఎక్కువ తక్కువలు అన్నది అసమసమాజ లక్షణం. ఒకమనిషిని న్యూన పరచటం ఆ మనిషి చేసే పనిని కూడా హీనం చేసి చూడటంగా ఉంటుంది. ఆ క్రమం లోనే కులం రీత్యా సమాజానికి బహిష్కృతులు అయిన దళితుల జీవన వృత్తులు కూడా హీనం చేసి చెప్పబడుతున్న సాంస్కృతిక సందర్భాలలో వాళ్ళు మృత పశువుల చర్మం ఒలవటం అయినా, చెప్పులు కుట్టటమైనా హేయమైన పనులే అవుతాయి. చెప్పులు ఇంటిలోపలికి, గుడిలోపలికి వేసుకువెళ్ల వీలులేని అపవిత్రతను పొందుతాయి. దీనిని తిరస్కరించే తర్కంతో కూడిన చర్చ ఈ కథకు ఇతివృత్తం. వృత్తి గౌరవ సూచికలుగా చెప్పులను ఉన్నతీకరించిన దళిత సంస్కృతి వేసే ప్రశ్న బూటు కాళ్లతో దేవాలయంలోకి ఎందుకు వెళ్లకూడదని. ఆ ప్రశ్నకు జవాబియ్యలేని, ఆ తర్కానికి తట్టుకోలేని పురోహిత వర్గ నిస్సహాయత ఈ కథలో కన బడుతుంది. ఆరకంగా దళిత నైతికత గమనం విజయం దిశగా ఉండటాన్ని సూచించారు ఈ కథలో ఇనాక్.

అయితే ఇనాక్ కథలు ఈ విధమైన సున్నిత మానవీయ సంఘర్షణలను, సంస్కరణలను చిత్రిం చటంతో పాటు అదే సమయంలో బాధిత దళిత కసిని వ్యక్తీకరించటం గమనించవచ్చు. నల్లులు, పొట్టపేగు లిబ్బందిగాడు, గొడ్డుదొంగ, కొలుపులు కథలు ఈ కోవలోవి. నల్లులు కథలో సుబ్బడు దళితుడు కాదుగానీ దళితవాడలో ఆశ్రయం పొందిన అనాథ. మరీ దిక్కులేని జీవితం. పాడుబడ్డ పాకలో నివాసం. ఎవరన్నా పెట్టింది తినటం. వూళ్ళో ఏవో దొంగతనాలు జరగటం, అతనే దొంగ అని పోలీసులకు పట్టియ్యటం ఒకటి రెండు నెలలు జైలులో ఉండి రావటం ఇదీ వాడి బ్రతుకు. దొంగతనం చెయ్యని తాను దొంగ అనిపించుకొనటం అతని అభిమానాన్ని గాయపరిచినా ఏమీ చెయ్యలేని నిస్సహాయుడు. రాత్రంతా నిద్రబోనియ్యని నులక మంచంలో నల్లులను వదల్చటం కోసం సుబ్బడు మంచాన్ని ఎత్తి కుదెయ్యటం, ఎండలో పడెయ్యటం, నేలరాలిన నల్లులను కాలితో నలిపి చంపటం, కూసాలలో నీళ్లు నలసల కాచి పొయ్యటం, నల్లులను పూర్తిగా వదలగొట్టిన మంచంలో నిశ్చింతగా నిద్రబోవటం అనే అప్రస్తుతాంశాన్ని కథనం చేస్తూ తనను హత్యానేరం లో ఇరికించటానికి ప్రణాళిక వేసిన మునసబు ఇంటికి నిప్పుపెట్టటం అనే ప్రస్తుతాంశాన్ని సూచించటం నల్లులు కథా శిల్పం. అలిగరీ కథనపద్ధతి ఇది. ఇందులో మనుషుల రక్తం పీల్చే నల్లులు సుబ్బడి వంటి అనహాయులను, అనాథలను స్వప్రయోజనాలకు పావులుగా చేసి బలుస్తున్న పెత్తందారీ వ్యవస్థకు ప్రతీకలు. నల్లులు చస్తేనే మనిషికి ప్రశాంత నిద్ర. మునసబులు చస్తేనే సుబ్బడి లాంటివాళ్లకు విముక్తి.

గొడ్ల దొంగతనం నేరం మొయ్యాల్సివచ్చిన నాగడు అసలు దొంగ అయిన ఊరి పెత్తందారు మీద తీర్చు కొన్నది అలాంటి ప్రతీకారమే. తాత ముత్తాతల నుండి దున్నుకొంటున్న పొలాన్నిఎవరికో రాసిచ్చిన కరణం పైన పొట్టపేగులిబ్బందిగాడు తీర్చుకొన్నదీ అదే రకం ప్రతీకారం.

ఈ రెండు కథలలో బాధితులు మాదిగలు. చచ్చిన పశువును చర్మం వలచి బాగుచేసి, మాంసం బాగుంటే తీసుకొనేవాడు నాగడు. తెల్ల వాళ్ళను వెళ్ళగొట్టాలని తెనాలి రైల్వేస్టేషన్ను తగలబెట్టినప్పుడు కిరసనాయిలు డబ్బా మోసిన చరిత్ర ఉంది. అందువల్లేనేమో తనపెరట్లో దూడ దొంగతనానికి వచ్చి దొరికిపోయిన దొర కులంపేరుతో తిడితే సహించలేకపోయాడు. పొట్ట పేగులిబ్బంది గాడు చేసుకొనే పాలం పోయి పశువును కోసి కుప్పలేసి అమ్ముకొంటున్నవాడు. పశువు కడుపు చీల్చిపేగులు తీసి బాగుచేసే అతనిలాంటివాళ్లే పీడకుల పట్ల పేగులుతీసి న్యాయం చెయ్యగల నరసింహావతారాలు కాగలరని సూచిస్తుంది ఈకథ.

కొలుపులు కథ వీటి కంటే కాస్తభిన్నమైనది. మాదిగ స్త్రీలపై పెత్తందార్ల లైంగిక ఆధిపత్యం పై తిరుగుబాటు ఈకథ. పూజారి లింగడు చచ్చిపోతే అతని భార్యమీద కన్నువేసిన మోతుబరి రైతు నాంచారయ్య తన కోరికను నిరాకరించిందని ఆమెపై పగబట్టి పాతబాకీ తీర్చాలని ఒత్తిడి చేసి, నట్టనడిబజారులో, పోతరాజు విగ్రహం ముందర అవమానించాలని పన్నిన పన్నాగం భగ్నమై అతనే పోతరాజుకు బలిపశువు కావటం ఇందులో విషయం. మాదిగల సాంస్కృతిక ఉత్సవాలను ఆత్మగౌరవ పోరాట వేదికలుగా మలచటం ఇనాక్ కథలలో, నవలలో తరచు కనిపిస్తుంది. అటువంటి కథలలో ఎన్నదగినది పొలి. కారంచేడు దుర్ఘటనను పునఃసృష్టించిన కథ ఇది. మెయిన్ రోడ్డు మీదుగా ప్రభుత్వం ప్రయాణం చేస్తుంటే రోడ్డుకు ఒక వైపు ఊరు, మరొకవైపు పల్లె ఆ రెంటి మధ్యా ఉన్న దాటరాని అంటరానితనం, ఇంకానా ఇకపై సాగదు అంటూ దళిత యువత తాగిన టీ గ్లాసులు కడుక్కోనాలన్న పాత అలవాటుకు స్వస్తిచెప్పటం, ఊరి యువతతో మీకన్నా మేమేమి తక్కువ అని స్వాభిమానం ప్రకటించటం అది ఘర్షణల కు దారితీసి చివరికి ఊరు పల్లె పై దాడిచేసి ఊచకోత కోయటం, పల్లె చెల్లాచెదరు కావటం అంతా కారంచేడు చేదు చరిత్రే.

దీనిని మాదిగల పూజారి పోతురాజు కోణం నుండి నడపటం ప్రత్యేకత. పల్లె హితవరిగా తన సోదరులను ప్రారంభం నుండి హెచ్చరిస్తూనే ఉన్నాడు. టీగ్లాసులు కడగటం దగ్గర పంతాలకు పోవద్దురా అని. చదువుకోండి, పెద్ద ఉద్యోగాలు చెయ్యండి, మన్నన వద్దన్నా వస్తుందని చెవినిల్లు కట్టుకొని చెప్పాడు. కానీ జరగవలసిన నష్టం జరగనే జరిగింది. తన తరువాత పూజారి కావలసిన వాడితో సహా పల్లె ఊరి మారణహోమానికి బలి అయింది. ఆ దుఃఖంలో, ఆవేశంలో, ఆక్రోశంలో దేవర ఉత్సవాలలో పోతురాజుకు, పోలేరమ్మకు జంతుబలి ఇయ్యటానికి వాడే కొంగ కాలు కత్తి అటక మీది నుండి దించి భుజంపై వేసుకొని బయలుదేరిన సందర్భంలో మొదలైన కథలో ఈ చరిత్ర అంతా పోతరాజు కేంద్రంగా శకలాలు శకలాలుగా కళ్ళముందు ఆవిష్కృతమవుతుంది. బలి ఇయ్యటానికి కత్తి దించాడంటే అది తన వారిని చంపిన ఊరివాళ్లపై వేటు కోనమే కావాలి. కానీ ఆ పని చేయలేకపోయాడు పోతురాజు. రక్తం అంటకుండా దించిన కత్తిని అటక ఎక్కించరాదు అన్న నియమాన్ని నాటకీయంగా పూర్తి చేసింది ఊరి ఆంబోతు. దాని కాలి రక్తంతో తడిసిన పోతరాజు విగ్రహం దగ్గరి ఎప్పటివో బియ్యపు గింజలను పోగు చేసి చచ్చిన తనవాళ్ల రక్తంతో కలిపి మెయిన్ రోడ్డును నిలువుగా చీలుస్తూ పోలి పోస్తూ 'కోబలి' అని అరవటంతో కథ ముగుస్తుంది. అది ఊరివైపు నుండి పల్లెలోకి వచ్చి దుర్మార్గం చేసే వాళ్లకు హెచ్చరిక. అహంకారం, అధికారం హద్దులు మీరితే సహనం అసహనంగా మారటం అనివార్యం అని చెప్పినకథ ఇది.

ఇనాక్ కథలలో మాదిగ జీవితచిత్రణతో పాటు మాదిగ ఉపకులాల కథలు కూడా కొన్ని ఉన్నాయి. మాదిగలను ఆశ్రయించి వాళ్లకు ఏదో ఒక రకమైన సేవలు అందిస్తూ హక్కుగా వాళ్ళ దగ్గర యాచించి జీవించటం వృత్తిగా కలవాళ్లు ఆశ్రిత కులాలు. ఏమి ఉన్నది అన్నదానితో నిమిత్తం లేకుండా ఆశ్రితకులాల వారిని పోషించటం మాదిగల బాధ్యత. ఈ సంప్ర

దాయంలో బండోళ్ళు అనే ఆశ్రితకులం కేంద్రంగా కాకి అనేకథ, మొండోళ్ళు అనే ఆశ్రిత కులం కేంద్రంగా 'కట్టడి' కథ, మాదిగదాసు అనే కులం కేంద్రంగా 'బుభుక్షితః కిం న కరోతి పుణ్యం'కథ వ్రాసారు ఇనాక్. ఇద్దరూ రాత్రిపూటే ఏఒక ఇంటి దగ్గరో ఆగి బువ్వపెట్టమని అడుగుతారు. మరో ఇంటికి వెళ్లరు. ఆ ఇంటివాళ్ళు వినకపోయినా, లేక పెట్టలేకపోయినా ఇంటిమీదికి కాకుల దాడి చేయించటం మొదటికథకు, బావి కట్టడిచేయటం రెండవ కథలో విషయాలు. బండోళ్ళవి అయినా మొండోళ్ళవి అయినా దిమ్మరి బతుకులు. ఏకాకి బతుకులు. వాళ్ళవి ఆకలిసమస్యలు. ఆకలితీరని ఆక్రోశం వాళ్ళను ఆయాపనులకు పురికొల్పుతుంది. కాకి దాడి ఫలితం అంతా ఒక ఇంటికి సంబంధించిన సమస్య అయితే బావికట్టడి మాదిగ పల్లెకంతా సంబంధించిన సమస్య. వాళ్ళ ఆకలి సమస్య ఎంత తీవ్రమో. ఆ ఆకలి తీర్చటానికి వీళ్ళు పడవలసిన యాతనకూడా అంత తీవ్రమే. ఇరుపక్షాలను బాధితులుగా చేసే ఆకలి కర్కశత్వాన్ని చిత్రిస్తాయి ఈ కథలు. ఇనాక్ వ్రాయకపోతే మానవ సమాజంలో మిగిలి ఉన్న ఈ నికృష్ట పార్శ్వాలు మనకు తెలిసేవి కావు.

మాదిగల వంశవృక్షాన్ని వివరించే మాదిగదాసులకు పిల్లల కడుపాకలి వాయిదా వేసి ఉప్పుతో ముప్పయి మూడు ఇరుగిళ్ల నుండి అడిగి తెచ్చి అయినా సమకూర్చవలసిన బాధ్యత మాదిగకుటుంబాలు ఎలా నిర్వహిస్తాయో బుభుక్షితః కిం న కరోతి పుణ్యం కథలో చూపించారు ఇనాక్. అయితే ఈ కథ ప్రయోజనం ఆ సంస్కృతిని చెప్పటం మాత్రమే కాదు, మాదిగ దాసుకు ఆహారం సమకూర్చవలసి రావటం వల్ల ఏ ఇంట పిల్లవాడు ఆ పూట ఆకలితో ఉండాల్సి వచ్చిందో, ఆ పిల్లవాడు సాయంత్రం తండ్రి కూలి తెస్తే తల్లి వండి పెట్టేవరకూ ఆకలిని భరించటం, పుస్తకం తీసుకొని చదువుకొంటూ కూర్చోటం ద్వారా ఆకలిని మర్చిపోయే ప్రయత్నం చేయటం అసలు కథ. ఆకలిగొన్న దళితులు చేయ వలసిన పని చదువుకొనటం. చదువే ఆకలి తీర్చే మార్గం అన్న చైతన్యం వ్యాపింప చేయటం ఈ కథ అసలు ప్రయోజనం.

దళిత వర్గీకరణ సమస్య కీడు, లాకీ వంటి కథలకు వస్తువు అయింది. దళిత వర్గీకరణ లేకపోతే మాదిగలు పెద్ద చదువులకు దూరమయ్యే అవకాశం ఉందన్న సూచనతో అది వాళ్ళజీవితం మీద వేసే విపరీత ప్రభావాల చిత్రణతో వ్రాసిన కథ కీడు. కాగా లాకీ దళిత వర్గీకరణ ఉద్యమాన్ని మాలల కోణం నుండి ఆవిష్కరించింది. దళిత సమైక్యతను దెబ్బతీస్తుందని వాళ్ళ అభ్యంతరం. దానిని సున్నితంగా చర్చకు పెట్టిన కథ లాకీ. సవర్ణులతో హక్కులు పొందటానికి దళిత ఉద్యమం ఎంత న్యాయమో, మాలలతో సమాన హక్కులు, అవకాశాలు పొందటానికి దండోరా ఉద్యమం కోరుతున్న వర్గీకరణ లో అంత న్యాయం ఉందని ఈ కథ సూచిస్తుంది. మాల మాదిగలు విడిపోతే సమైక్యత దెబ్బతింటుందనటం తప్పు.... ఎందుకంటే అసమానుల మధ్య సమైక్యత ఎప్పటికీ సాధ్యంకాదు కాబట్టి. వర్గీకరణ ద్వారా మాదిగలను మాలలతో సమానంగా అభివృద్ధి చెందటానికి అవకాశాలు కల్పిస్తే సహజంగా సమానులైన వాళ్లు సమైక్యం కావటానికి కావలసిన చైతన్యం అదే అభివృద్ధి చెందుతుందని సూచిస్తుంది ఈ కథ. దళిత సమైక్యత పట్టుకు వేళ్లాడవలసిన అంశమే కాదన్న ప్రజాస్వామిక చేతన మాలలలో కలగాలన్న రచయిత ఆకాంక్ష ఇందులో వ్యక్తమైంది.

దళిత జీవిత చిత్రణ ప్రధానం అయిన ఇనాక్ కథలు దళితుల వృత్తి జీవితాన్ని పశువులను చంపి, చర్మాలు వలిచి, రక్తం, మాంసం, ఎముకలు వేటికవి వేరుచేసి పెట్టటం, ఎవరికేవి అవసరమో వాటిని పంపటం వంటి వివరాలతో ఉంటాయి. అదేసమయంలో ఆయన ఇతర వృత్తిపర వర్గాల వారి జీవితాన్ని అనేక వివరాలతో చిత్రించటం విశేషం. ఇతరేతర సామాజిక సమస్యలు చిత్రిస్తూ వ్రాసిన కథలు కూడా ఉన్నాయి. ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా కవిత్వం – స్త్రీ వాద దృక్పథం

– డా॥. కొక్కాని సుధాకర్, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల స్వయంప్రతిపత్తి, రాజమండ్రి.

'యత్రనార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్రదేవతాః' అన్న ఒక కవి విశ్వాసంతో మహాకవి గుర్రం జాషువా తన రచనల్లో భారతీయ మహిళలకు నీరాజనం పట్టినారు. భారతీయ మహిళాభ్యుదయానికి అవరోధాలుగా ఉన్నటు వంటి పనికిరాని కట్టుబాట్లను, ద్వంద్వ ప్రమాణాలను తీవ్రంగా నిరసించారు.

బాల్యంలో తల్లి ఒడిలో తను పొందిన ప్రేమాను రాగాలు, దాంపత్య జీవితంలో చవి చూపిన ఇల్లాలి నిస్వార్థ సేవ, స్త్రీల పట్ల జాషువకు ఒక పూజ్యనీయ భావం పెంపొందించ డానికి దోహదం చేస్తే, భారత స్త్రీ సమాజంలో ఎదుర్కొంటున్న అన్ని రకాల వివక్షతలను గమనించడం ద్వారా వారు జాగృతం చెందవలసిన అవసరం ఎంతైనా ఉందన్న ఆలోచనా దృక్పథం ఆయనలో ప్రోది చేసుకొంది. ముందుగా తల్లిని, భార్యను, కూతురిని జాషువ గౌరవించిన తీరును పరిశీలిద్దాం.

'పుణ్యములు తల్లి! నీ పాలు పుష్టికతన
కవన బాలిక నా జిహ్వానవతరించే" నన్నారు. తన తల్లి పాలపుష్టి చేతనే తనకింతటి కవితా వైభవమిచ్చిందని జాషువ భావన.

నలభై ఏండ్లు దాటినా తనను ముద్దు చేసిన తల్లిని గూర్చి పద్యం రాసిన జాషువ, అరవై ఏండ్లు దాటినా "తల్లికంటికి తాను చిరుత"నేనని, "నీ ఋణము దీరదు రక్తము ధారవోసి నన్" అన్నారు. అంతేకాదు, కొందరు తల్లులు ఉత్తమ భావి భారత పౌరులుగా ఎదగాల్సిన పిల్లలకు మూఢ విశ్వాసాలను, పిరికి మందును ఉగ్గు పాలతో నూరి పోయడాన్ని విమర్శించారు. "ఇట్టి పైశాచిక వత్సలత్వములు జాతికి తీరని వజ్రఘాతముల్" అన్న హెచ్చరిక మహిళా లోకానికి చేసిన హితబోధ.

"నా కవితకు నా ప్రతిభా
శ్రీకిం గారణము నాడు ప్రేయసి' మహిళా
లోక శిరోమణి' మీరీ
చాకిరి నన్నింత వాని సలిపెందలపన్"

భార్య మరణానంతరం తల్లి తండ్రి తానై కూతురు హేమలతకు వివాహం చేసి దీవించిన తీరులో జాషువా హృదయం, తనపై గల వాత్సల్యం స్పష్టమవుతుంది.

"కులమున గన్న కూతులకు, గౌరవలీల వివాహ కార్యముల్
సలిపితి, డ్బునం గనిన నా తనుజన్మకు నీకు,నేడు పెం
డిలి మొనరించుచుంటి ధరణీ సుర బాలునకిచ్చి, వార్ధిలో
గల లవణంబుతో యుసిరికాయకు పొత్తు ప్రసిద్ధమే కదా!"

ఇక - 'వంచిత' ఖండికలో జాషువ స్త్రీకి జరిగిన అన్యాయాన్ని వివరించాడు. స్త్రీని వంటఇంటి పని ముట్టుగా పరిగణించడం, భారతనారిని నేనని స్త్రీ భావదాస్యంలో పడి వుండటం, కలుపుల రాణిగా, చిలుక పుల్కుల చక్కెర పిండి బొమ్మగా, అలికుల వేణిగా స్త్రీని పొగిడి, ఆకాశంలో ఊయల గట్టి ఊగిస్తున్నాడీ పురుషుడు ఎన్నో యుగాల నుండి అని జాషువ తెలిపాడు.

స్త్రీపట్ల సమాజము, మన సంస్కృతి, మనధర్మాలు, కర్మ సిద్ధాంతాలు, అంతకంటే పురుషులు చూపిన వివక్షతను జాషువా కవి స్పష్టాతి స్పష్టం చేసాడు.

పురుషుని మోసప్రయుక్తులకు స్త్రీ ఎలా లోబడి మంచి బట్టలు, నగలు, షోకులతో సంతృప్తి చెంది అనాది నుంచి ఎలా నడుచుకొంటూ ఉందో వివరించి, కళాత్మకమైన ఈ ప్రపంచాన్ని పరిశీలించమని మహిళా లోకానికి ప్రబోధాన్నందించారు.

స్త్రీ కంటే పురుషుడధికుడని తాటాకుల్లో రాసి, కంఠమెత్తి ప్రచారంచేసారని, స్త్రీ జాతికే ఇది తీరనిఅన్యాయమని, స్త్రీకి పురుషునితో సమానగౌరవం ప్రసాదించమని పరమేశ్వరుని జాషువా ప్రార్థించారు.

"అబలయన్న బిరుద మంటించి కాంతల
స్వీయ శక్తులదిమి చిదిమినారు
సబలయన్న బిరుదు సాధించి హక్కులు
గడన చేసి కొమ్ము కష్ట చరిత"

అంటూ తమ హక్కుల సాధన దిశగా మహిళా లోకాన్ని జాగృతం చేసే కవిత్వం జాషువా సృజించారు.

అనాది నుంచి వస్తున్న తమ దుస్థితిని నవ నాగరిక మహిళా లోకం గుర్తించిందనీ, "మగవాళ్ళ మటుమాయల
నుంచి తప్పించుకుని'నేటి నెలత"ను
గ్రహించినది నేటి కామినీ తిలకంబు
బురఖాలకెరయైన బుద్ధి బలము
తెలిసికొన్నది నేటి కలికి ముద్దుల గుమ్మ
ఉబ్బించు గాధలందున్న కిటుకు" అంటూ ప్రశంసించారు.

1. యుద్ధంలో మరణించిన పురుషుడు రంభను కూడి సుఖిస్తాడని అంటారు. మరి యుద్ధంలో మరణించిన వీరకాంతులకు ఆ సుఖం ఎట్లా అమరుతుందని జాషువా ఆనాడే ప్రశ్నించారు.
2. ఘోషాలోబడి క్రుళ్ళిపోయినది దిక్కున్ మ్రొక్కు లేకుండనీ యోషా మండలి
   ఉత్తుత్త ధర్మాలకున్ భోషాంబయి - బూజు పట్టినది హిందూజాతి చిత్తంబునం
   దీషత్ప్రేమ వహించి స్వేచ్ఛయిడవోయీ! అక్క చెల్లెండ్రకున్" అని సహపురుష ప్రపంచానికి పిలుపునిచ్చాడు.
3. నగలు, చుప్పనాతి తనము, మూఢాచారాలు, ఒళ్ళు బరువు తనము

"ప్రబలియున్న దెల్ల భామినీ లోకాన
ఎట్లు శిక్ష సలిపి యేమి కఱపి
యుద్ధియలను తీర్చిదిద్ది దీవింతువో
భారమెల్ల నీది పాఠశాల " అంటూ స్త్రీల అజ్ఞానాన్ని ఆవిష్కరించి విజ్ఞాన కాంతులు ప్రసరింప చేసే మహిళాభ్యుదయకరమైన సాహిత్యాన్ని రచించాడు జాషువా.

4. ప్రధిత సంస్కార మార్గాన్నే భారత మహిళా లోకం అనుసరిస్తున్నారని అనుసరించాలన్న జాషువా కవి, ముసలి వాడిని వివాహం చేసికుని సామాజిక కట్టుబాట్ల మధ్య ఇమడ లేక, వాటిని బహిరంగంగా ఎదుర్కోలేక, వేరేదారులు ఎదుర్కొనే స్త్రీల మనసు లోని సంఘర్షణను తెలిపారు. వితంతువైన యువతి తన వయసు చేసే గారడీ, నరాల తీపు గురించి ఘర్షణ పడటాన్ని చిత్రించాడు.

1. వీర చానమ్మ - ముగ్గురాడ వాళ్ళమయ్యాలినటం, పసుపు రాసుకుని స్నానం (2) చుప్పనాతి మొదలైన పదప్రయోగాలు.
2. స్త్రీల బాధలు అర్థం చేసుకొలేని వారిని స్త్రీలుగా జన్మింపచేసి శిక్షించాలనటం వంటివి మినహాయిస్తే
   1. ఆడది లేకుండిన నీ
      రేడు జగంబులను శోభయే లేదు
   2. సతుల నైసర్గిక జ్ఞాన సస్యరమను
      చిత్ర చిత్రంబుగా హత్య చేసినారు.
   3. పతిభక్తురాలన్న పద గౌరవము దక్క
      సౌఖ్యం బెరుంగని జాన తనము
   4. అన్నదమ్ముల వోలి నాస్తి పాస్తుల మీద
      హక్కులించుక లేనియాడు తనము.
   5. స్త్రీ విద్యా విభూషితయై ప్రకాశించాలి.

మహిళాభ్యుదయాన్ని జాషువా ఎంతగా కోరారో తెలుసుకోవడానికి వారి వాక్యాలు, ఖండికలలోని అనేకమైన ఉదాహరణల నుంచి కొన్ని మాత్రమే ఇవి.

"కొంత మగవారితో చేయి గలపకున్న
తలపనేల యనర్ధంబు తప్పదనుచు
భారతక్షోణి చిత్తంబు కోరిగింప
కలము బట్టిన దీనాటి వెలది మిన్న"

1. పి.హెచ్.డి. 2. యం.ఫిల్, చేయదగినంత మహిళాభ్యుదయకరమైన సాహిత్యం జాషువా సాహిత్యంలో ఉన్నది. అన్నది నా దృష్టిలోకి వచ్చిందని ఈ సదస్సుకు విన్నవించుకుంటున్నాను.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పాలేరు నాటకం – దళిత చైతన్యం

– కె. ఐ. లక్ష్మావతి, తెలుగుశాఖాధ్యక్షులు, జి.డి.సి. కంభం, ప్రకాశం జిల్లా

దళిత నేపథ్యం :

అనాదిగా భారతావనిలో సామాజికంగా, సాంఘికంగా, ఆర్థికంగా అణచివేతకు గురైనవారంతా దళితులే. వీరిని అణచివేస్తున్న అగ్రవర్ణాలకు ఒక తాత్విక పునాది ఉంది. అదే హిందూ మతవాద తాత్విక పునాది.ఈ అగ్రవర్ణాలకు ఒక సాంఘిక దృక్పథం ఉంది. అది కుల అసమసమాజ నిర్మాణం. ఈ కులం హిందూ సాంప్రదాయం వల్ల అభివృద్ధి చెందింది. హిందూ ధర్మశాస్త్రాలు, సాహిత్యం, కళలు ఈ కులాన్ని భారతీయుల మెదళ్ళలో అంటు వ్యాధిలా వ్యాపింపచేశాయి. దీని వల్ల అంటరాని కులం ఏర్పడి తరతరాలుగా చీకట్లో మగ్గిపోయింది, పోతుంది దళిత మేధావులందరు కులవివక్ష గురైనారు. అలాంటి వాళ్ళు జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ రామస్వామి తదితరులు. శతాబ్దాలుగా సామాజికంగా, సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా బహిష్కరించబడ్డ జనంగా, హీనంగా, దీనంగా బతుకు తున్న దళితుల జీవితాల్లో ఉద్యమాల ద్వారా వెలుగు నింపిన దార్శనికులు వీళ్ళు. వ్యక్తి స్వాతంత్ర్యం, రాజకీయ స్వాతంత్ర్యం కొరకు పోరాడుతూనే దళిత చైతన్యానికి ఇనుప గోడల్లాగా ఉన్న మనుస్మృతిని, వర్ణవ్యవస్థను కూలదోయడాని కి అక్షరాలను ఆయుధంగా మలచు కున్నారు. మరికొందరు స్వరూపాన్ని బట్టి నక్సలిజాన్నే మార్గంగా ఎంచుకున్నారు. అది ముగింపు లేని ప్రస్థానంగా సాగుతుంది. అందుకు ఆత్మగౌరవ పోరాటాన్ని ఎంచు కున్నారు.

వందల వేల సంవత్సరాల నుండి సమాజంలో ఒక వర్గం పనిచేయకుండా దోపిడీ ద్వారానే జీవిస్తుంది. ఆ వర్గం భూమిని, పెత్తందారీతనాన్ని తమ సొంత ఆస్తులుగా కలిగి ఉంది. మొదట వాటికి బలైనది దళితులు. ఉత్పత్తిలో ప్రధాన భాగస్వామ్యాన్ని పోషిస్తున్నా, వారికి మిగులుతుంది కటిక దారిద్ర్యమే. కానీ ఆ దారిద్ర్యాన్ని తలచుకొని ఎప్పుడూ బాధపడలేదు. ఒకడు తింటూ మరొకడు పస్తులుండడం ధర్మం కాదంటాడు. అందరికీ కూడు, గూడు, గుడ్డ సమానంగా ఉండాలని సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ఆశించాడు. ఆ విధంగా ఆలోచించటానికి కూడా వీలులేకుండా చేసిందీ సమాజం. అందుకు ప్రధాన కారణం కులం. ఈ కులాన్ని పోగొట్టాలంటే ఉద్యమాలే సరైన మార్గంగా ఎంచుకొని దళితులను చైతన్యవంతులను చేశారు కొందరు దళిత తత్త్వవేత్తలు. ప్రారంభంలో ఈ రకమైన చైతన్యం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలలో ఆరంభమై ఆంధ్ర ప్రదేశ్‌కు కూడా వ్యాపించింది.

దళితులపై అగ్రవర్ణాల పెత్తనానికి నిరసనగా సాంఘీక సమానత్వం కావాలంటూ 1917 నవంబర్ 4, 6 తేదీలలో భాగ్యరెడ్డి సారధ్యంలో ''ఆది ఆంధ్ర మహాసభ''ను విజయవాడలో నిర్వహించారు. ఈ సభ దళితులలో ఆత్మస్థైర్యాన్ని, చైతన్యాన్ని నింపింది. ఇదే స్ఫూర్తితో 1917 మొదలు 1938 దాకా భాగ్యరెడ్డి వర్మతో సుందు వెంకయ్య, కుసుమ ధర్మన్న, వేముల కూర్మయ్యలు ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు విరివిగా నిర్వహించడం, కులాల మధ్య అంతరాలు నశించేదాకా పోరాటాలు ఆపకూడదని తీర్మానించుకున్నారు.

ఈ కాలంలోనే సంప్రదాయ మేధావులు కొందరు మూఢ విశ్వాసాలతో, ఆచారాలతో నిండిన సమాజాన్ని ఖండించే ప్రయత్నం చేశారు. అందుకు వేదాంత ధోరణిని మార్గంగా ఎంచుకున్నారు. వేమన, పోతులూరి వీరబ్రహ్మంలను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. వేమన దేశమంతా సంచారం చేస్తూ సంఘంలోని దురాచారాలను ఆసు పద్ధతిలో దుయ్యబట్టారు. మనుష్యుల స్థాయిని హీనపరిచేది జన్మ కాదు - గుణ హీనత అని ప్రభోధించారు.

వందల వేల సంవత్సరాల నుండి సమాజంలో ఒక వర్గం పనిచేయకుండా దోపిడీ ద్వారానే జీవిస్తుంది. ఆ వర్గం భూమిని, పెత్తందారీతనాన్ని తమ సొంత ఆస్తులుగా కలిగి ఉంది. మొదట వాటికి బలైనది దళితులు. ఉత్పత్తిలో ప్రధాన భాగస్వామ్యాన్ని పోషిస్తున్నా, వారికి మిగులుతుంది కటిక దారిద్ర్యమే. కానీ ఆ దారిద్ర్యాన్ని తలచుకొని ఎప్పుడూ బాధపడలేదు. ఒకడు తింటూ మరొకడు పస్తులుండడం ధర్మం కాదంటాడు. అందరికీ కూడు, గూడు, గుడ్డ సమానంగా ఉండాలని సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ఆశించాడు. ఆ విధంగా ఆలోచించటానికి కూడా వీలులేకుండా చేసిందీ సమాజం. అందుకు ప్రధాన కారణం కులం. ఈ కులాన్ని పోగొట్టాలంటే ఉద్యమాలే సరైన మార్గంగా ఎంచుకొని దళితులను చైతన్యవంతులను చేశారు కొందరు దళిత తత్వవేత్తలు. ప్రారంభంలో ఈ రకమైన చైతన్యం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలలో ఆరంభమై ఆంధ్ర ప్రదేశ్‌కు కూడా వ్యాపించింది.

దళితులపై అగ్రవర్ణాల పెత్తనానికి నిరసనగా సాంఘిక సమానత్వం కావాలంటూ 1917 నవంబర్ 4, 6 తేదీలలో భాగ్యరెడ్డి సారధ్యంలో ''ఆది ఆంధ్ర మహాసభ''ను విజయవాడలో నిర్వహించారు. ఈ సభ దళితులలో ఆత్మస్థైర్యాన్ని, చైతన్యాన్ని నింపింది. ఇదే స్ఫూర్తితో 1917 మొదలు 1938 దాకా భాగ్యరెడ్డి వర్మతో సుందు వెంకయ్య, కుసుమ ధర్మన్న, వేముల కూర్మయ్యలు ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు విరివిగా నిర్వహించడం, కులాల మధ్య అంతరాలు నశించేదాకా పోరాటాలు ఆపకూడదని తీర్మానించుకున్నారు.

ఈ కాలంలోనే సంప్రదాయ మేధావులు కొందరు మూఢ విశ్వాసాలతో, ఆచారాలతో నిండిన సమాజాన్ని ఖండించే ప్రయత్నం చేశారు. అందుకు వేదాంత ధోరణిని మార్గంగా ఎంచుకున్నారు. వేమన, పోతులూరి వీర బ్రహ్మంలను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. వేమన దేశమంతా సంచారం చేస్తూ సంఘంలోని దురాచారాలను ఆసు పద్ధతిలో దుయ్యబట్టారు. మనుష్యుల స్థాయిని హీనపరిచేది జన్మ కాదు - గుణ హీనత అని ప్రభోధించారు. వీరబ్రహ్మం కూడా ఇదే ధోరణితోనే కులవ్యవస్థను ఖండిస్తూ అస్పృశ్యతను, 'మైల' అనే పదాలను తీవ్రంగా గర్హించాడు.

సాహిత్యంలో ప్రవేశం :

1969 నుండి దళిత సమస్య సాహిత్యంలోకి ప్రవేశించింది. కథ, నవల, నాటకం ద్వారా దళితులను చైతన్యపరచగలిగారు కొంతమంది రచయితలు. ఈ నేపథ్యంగా పరిశీలిస్తే దళిత సమస్యను చిత్రించిన తొలి భారతీయ నవల ముల్కరాజ్ ఆనంద్ రచించిన 'అంటచబుల్'. తెలుగులో దళితుల సమస్యలను వేర్వేరు కోణాలతో చిత్రించిన నవలలు - వెంకట పార్వతీశకవులు రచించిన 'మాతృమందిరం', ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన 'మాలపల్లి', వట్టికోట ఆళ్వారు స్వామి రాసిన 'ప్రజల మనిషి', దాశరథి రంగాచార్యులు రచించిన 'చిల్లర దేవుళ్ళు' మొదలగు నవలలను ప్రత్యేకంగా చెప్పుకొవచ్చు. అయితే ఈ నవలలు సమస్య మూలాన్ని ఆశించిన స్థాయిలో పరిష్కరించ లేకపోయాయి. అందుకు ప్రధాన కారణం కందుకూరి వీరేశలింగం పేర్కొన్నట్లు... ''మన కులవ్యవస్థ కొన్ని కులాలకు విద్యను నిషేధించింది. ఆ కులాల జ్ఞానమూ, నైపుణ్యమూ, అభివృద్ధి చెందడానికి ఎంతగానో అడ్డుపడింది. మానవ కార్యకలాపాలకు చెందిన సమస్త శాఖలతో పురోగమిస్తున్న ప్రపంచంలో మనం అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో సమంగా ముందుకు పోవాలి. విద్య లేకుండా ఇది సాధ్యం కాదు. విద్యరాని చేతి పనివానికి తన వృత్తిలో ఉపయో గించబడే వేలైన నైపుణ్యాలు, సంవిధానాలు తెలియవు''... ఫలితంగా అతని పెరుగుదల శాశ్వతంగా కుంటు పడుతుంది. కులవ్యవస్థ పరస్పర అవిశ్వాసాన్ని సృష్టించి అనైక్యత, శత్రుభావం ఏర్పడడానికి కారణం అవుతుందని భావించాడు.

విప్లవ ధోరణి :

ఈ శత్రుభావం అగ్రవర్ణాల మధ్య అణగారుతున్న వర్గాల మధ్య ఆరని కుంపటి లాగే ఉంది. ఆ కుంపటిలో నుండి అనేక ఆలోచనలు ఎగిసిపడుతున్నాయి. ఒడలు మరిచి నిద్రపోయే మోతుబరుల జీవితాల్లో వెలుగులు విరజిమ్మడానికి సిద్ధంగా లేమని ఒకరి దయాధర్మాల మీద బతకడానికి సిద్ధంగా లేమని, సామాజిక సమానత్వం కావాలని కోరుకుంటున్నారు. అందుకు ఎలాంటి ప్రతి బంధకాలు అడ్డొచ్చినా ప్రతిఘటించటానికి సిద్ధమే అంటు న్నారు. ఇలాంటి ఆలోచనలు వారిలో ఒక్కరోజులో వచ్చినవి కావు, వందల సంవత్సరాలుగా సాంఘీక జీవన చట్రంలో నలుగుతూ, ఆకలి కేకల్లో నుండి ఉప్పెనలా వచ్చిన ఆలోచనా తరంగాలు. ఈ ఆలోచనలు సమాజం లోని వ్యవస్థ లకు - వ్యక్తులకు మధ్య అగాధంలో నుండి పుట్టుకొచ్చినవి. అలాంటి ఆలోచనలకు దర్పణమే కళాప్రపూర్ణ బోయి భీమన్న రచించిన 'పాలేరు' నాటకం. ఇది ఆనాటి సమాజానికి ప్రతిబింబం. వ్యాపార ధోరణికి అతీతమైంది. రచయిత అనుభవాల సమాహారం. అహింస ద్వారా దళితులలో కొంత వరకైనా చైతన్యాన్ని తెచ్చి ఉన్నత నిలపాలని కోరుకున్న ఆశావాది. వెరసి ఈ నాటకం ఆంధ్రదేశమంతటా వందలాది ప్రదర్శనలకు వేదికైంది.

పాలేరు నాటకం - వస్తువు :

నాటకంలో ప్రధాన వస్తువు వంశానుగతంగా వస్తున్న జమిందారీతనం - కామందు - పాలేరు మధ్య జరుగు తున్న మౌనపోరాటం. నాటకంలో కామందు అభివృద్ధి నిరోధక తత్వం కలిగిన కుబేర్రావు. ఈ నాటకంలో నాయకుడు వెంకన్న. వెంకన్న పాలేరుగా ఉన్నా భావదాస్యం పోయి సర్వ మానవ సమానత్వం కావాలని, అప్పుడే భారతదేశానికి భాగ్యోదయం అని అంటాడు. ప్రపంచ దేశాలు చైతన్యమవుతున్న తరుణంలో దాస్య జీవితం ఎంతకాలమని ప్రభువు సేవకుడు సంఘాన్ని నిర్మించి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకునే అభ్యుదయవాది. అందుకు పూర్తిగా విరుద్ధమైన వాడు కుబేర్రావు.

పాలేరు తను చేస్తున్న పనిలో అలసట మరవడానికి పాటలు పాడుకున్నా అందుకు తన అనుమతి కావా లంటాడు. సమాధానం చెబితే "మాటలు నేర్చిన కుక్క ఉస్కో అంటే డిస్కో అందిట... మొద్దు పీనుగ" అంటూ తన నైజాన్ని ప్రదర్శిస్తాడు. పాలేరు ప్రశ్నించడానికి ప్రధాన కారణం - 'చదువు' అని, దాన్ని నేర్పుతున్న పంతులును శిక్షిస్తే పాలేరులో ప్రశ్నలుండవని గ్రహించాడు కుబేర్రవు. కాని పాలేరు వెంకన్న కుబేర్రావు కాటేస్తాడని తెలిసినా అతని పట్ల విశ్వాసం నడలదు. గ్రామాలే దేశానికి వెన్నెముక, పరిశ్రమించే బహుజనులంద రినీ అధికారపు బహుభారపు లోహపు పాదాల కింద క్రిమికీటకాల మాదిరి నలిగిపోకుండా కాపాడమని లోకానికి చాటుతాడు.

కుబేర్రావు పాలేరుకు మాట్లాడే హక్కులేదని, తన కనుసన్నల్లో మెలగాలే తప్పా స్వేచ్ఛగా ఉండకూడదని శాసిస్తాడు. సందర్భం ఉన్నా లేకపోయినా వెంకన్నను మానసికంగా కృంగదీస్తాడు. వనబాల సాహచర్యం వల్ల, ప్రేమ వల్ల, వనబాల అన్న సుందరం తోడ్పాటు వల్ల, ఉపకారి మాష్టారు ప్రోద్బలం వల్ల చదువుపై ప్రేమను పెంచుకుంటాడు. వెంకన్న చదువుకోవటాన్ని గ్రహించిన కుబేర్రావు చదువుకోవద్దని చావు దెబ్బలు కొడతాడు. తండ్రి వెంకబేష్ కూడా అదే తీరులో శిక్షిస్తాడు. వెంకన్న చేసేది లేక నిరాశతో చావడానికి సిద్ధపడతాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వనబాల వెంకన్నకు తోడుగా ఉంటుంది. బ్రతికి చదువుకోవాలనే నీ ఆశయాన్ని నెరవేర్చాలేగానీ, చావడం వల్ల ప్రయోజనం లేదని అతనిలో ఆశయసిద్ధిని కలిగిస్తుంది.

పాలేరులో వచ్చిన చైతన్యం :

వెంకన్నలో చదువుకోవాలనే పట్టుదలను గ్రహించిన ఉపకారి పంతులు వనబాల అన్న సుందరం సహాయంతో కాకినాడలోని అనాథ శరణాలయంలో చేర్పించి చదువుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాడు. అక్కడ రామం అనే స్నేహితుడి పరిచయంతో తన ఆశయాలను నెరవేర్చుకునే క్రమంలో పట్టుదలతో బి.ఎ. పరీక్ష పాసై

డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికవుతాడు. ఉద్యోగ బాధ్యతలో భాగంగా ఏ గ్రామమైతై తనను బాధలకు, హేళనకు, ఈసడింపులకు గురిచేసిందో ఆ గ్రామానికే - రైతువాడకు డిప్యూటీ కలెక్టర్ హోదాతో వెళతాడు.

ఒకప్పుడు తనను పశువు కంటే హీనంగా చూసి తన ప్రగతికి అడ్డుగోడగా ఉన్న కుబేర్రావుతోనే నమస్కారం పెట్టించుకునే ఉన్నత స్థితికి చేరుకుంటాడు. అందువల్ల మనిషిని కులం బట్టికాక, గుణం, ప్రతిభను బట్టి చూడాలి గాని ఏ కులాన్నీ తక్కువ అంచనా వేయకూడదు. సమాజంలో అంటరానితనం, అవిద్య, పేదరికం, బానిసత్వం, కులం, ధనిక, పేదల మధ్య అంతరం మొదలైన వాటిని అధికమించాలంటే ప్రతి మనిషి చేతిలో ఒక ఆయుధం ఉండాలి. ఆ ఆయుధమే 'విద్య' - ఇదే విషయాన్ని నాటకంలో బోయి భీమన్న "కర్ర చేతిలో లేకుంటే గొర్రె కూడా కరచెనోయ్" అంటాడు. అటువంటి విద్య వల్లే వెంకన్న వెంకటేశంగా మారి అందరికీ ఆదర్శంగా నిలబడతాడు. అదే ఆదర్శంతో విశ్వాసంతో తన ఎదుగుదలకు కారణమైన వనబాలను ఆదర్శ వివాహం చేసుకుంటాడు.

ముగింపు :

ఆనాడు ఈ నాటకం గ్రామాల్లోని దళిత పల్లెల్లో ప్రదర్శించటం వల్ల ఎంతోమంది దళితులు చైతన్యంతో చదువుకోవటానికి ముందుకు వచ్చారు. అలాంటి వారిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి కాకి మాధవరావు గారు ఒకరు. ఒక సందర్భంలో ఆయన "పాలేరు నాటకానికి ప్రభావితుడనై కలెక్టర్ నయ్యానని, ఈ నాటకం రాకపోతే నేను పాలేరుగా, అనామకుడిగా మిగిలి ఉండేవాడి"నని అన్నారు. పాలేరు నాటకం ద్వారా సమాజంలో వచ్చిన మార్పు కేవలం ప్రారంభమేనని, చక్కని ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి దళితులందరూ విద్యావంతులై ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఈ నాటకం దళితులందరిలో ఒక చైతన్యాన్ని తీసుకువస్తుంది. గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయులంతా నాటకంలోని ఉపకారి మాష్టారిలా గ్రామాల్లో అందరూ చదువుకోవడానికి వీలైన పరిస్థితులను కల్పించాలి. ముఖ్యంగా కూలీల బిడ్డల విద్యాభివృద్ధికి కూడా కృషి చేయాలని సందేశమిస్తుంది. సంపన్న, ఉన్నత కులాల్లో పుట్టిన వనబాల వంటి యువతులు వర్ణాంతర వివాహాలకు ముందుకు రావాలని ఈ నాటకం సందేశమిస్తుంది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గుఱ్ఱం జాషువా గబ్బిలం – దళిత తాత్త్విక ధృక్పథం

– పిల్లి ఉషారాణి, యస్.వి.డి. జి.డి.సి. (మ), నిడదవోలు, తూర్పు గోదావరి జిల్లా.

పిరదౌసి, గబ్బిలం, కాందిశీకుడు, ముంతాజ్‌మహల్, నేతాజీ, ముసాఫరులు మొదలైన ఖండకావ్యరచనలతో పాఠకలోక ప్రాచుర్యాన్ని చూడగొన్నకవి జాషువా. వీటిలో గబ్బిలం రెండు భాగాలున్న ఖండకావ్యం. మొదటిభాగం (1941)లో సుమారు 117 పద్యాలు రెండవ భాగంలో (1946)లో 142పద్యాలు, మొత్తం 259 పద్యాలున్న గబ్బిలాన్ని లఘుప్రబంధం అనవచ్చు. జాషువా మిగిలిన రచనలన్నీ ఒక ఎత్తు. గబ్బిలం ఒక్కటీ ఒక ఎత్తు. ఆయన రచనల్లోని ఇది శిరశ్శేకర కృతి. జాషువా జీవత ప్రస్థానానికి, సామాజిక దర్శనానికి నిదర్శనంగా నిలిచేది ఈ గబ్బిలం కావ్యం.. కాళిదాసు మేఘ సందేశం తరహాలో సాగుతుంది. ఇందులో సందేశాన్ని పంపేది యక్షుడు కాదు. సమాజంలో పాతుకుపోయిన అంటరానితనాన్ని, వర్ణ వ్యవస్థలోని కౄరత్వాన్ని అరుంధతి సుతుడు తన సందేశంగా శివునికి గబ్బిలం ద్వారా విన్నవించుకోవడం ఈ కావ్యేతివృత్తం.

జాషువా కవిత్వానికి మౌలికాంశాలు బాల్యంలో తాననుభవించిన సాంఘిక వివక్ష, ఆర్థిక అసమానత్వ మన్నది సుస్పష్టం. అందుకే తన కవిత్వంలో అడు గడుగునా అట్టడుగు వర్గాల ఆవేదన ఆక్రోషాన్ని అక్షీకరించాడు. ''Best Poetry is always auto-biographical'' (ఉత్తమ కవిత ఎప్పుడూ స్వీయచరిత్ర నివేదనాత్మకమే) అని అంటాడొక ఆంగ్ల విమర్శకుడు. దానికి అక్షరసాక్ష్యం గబ్బిలం.

గబ్బిలంలో జాషువా ప్రధానంగా చిత్రించింది దళిత సమస్యనే. తిరుగుబాటు దోరణిలేని దారిద్ర్యంతో, అవమానంతో కుమిలిపోతూ బుక్కెడుబువ్వతో తృప్తిపడే క్షుధానల దగ్ధమూర్తి ఒక అరుంధతి సుతుడే కావ్యానికి నాయకుడు.

జాషువా తన కావ్యానికి గబ్బిలం అని పేరు పెట్టడం లోనే దళితవేదన స్ఫురిస్తుంది. గబ్బిలం అస్పృశ్యుడు లేదా దళితుడికి ప్రతీక. గబ్బిలం లాగా దళితుడు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాడు. గబ్బిలంలాగా దళితుడు కూడా ఊరికి చివరగా అగ్రవర్ణాలకు దూరంగా నివసించడం చూస్తూనే ఉన్నాం. గబ్బిలం తలక్రిందులుగా వేలాడు తుంది. ఈ సమాజంలో దళితుని జీవితం కూడా తలక్రిందుల జీవితం. అంటే అస్తవ్యస్తమైన జీవితం. గబ్బిలం లాగా దళితుని జీవితం కూడా అంధకార బంధురమే. గబ్బిలం రెక్కలమీద ఆధారపడుతుంది. దళితుడు కూడా రెక్కల కష్టం మీదే జీవిస్తాడు. ఈ విధంగా జాషువా కావ్య శీర్షికలోనే దళితవేదనను ధ్వనింప జేశాడు. ఈ సమాజంలో కులాధిపత్యానికి, పీడనకు వర్ణవ్యవస్థే కారణం. వర్ణవ్యవస్థకు మూలకారణం హిందూమతం. భగవద్గీతలో నాలుగు వర్ణాలే పేర్కొనబడిన, పంచమ వర్ణాన్ని సృష్టించి దళితుల్ని కుల పీడనకు గురిచేశారు. అందుకే

''ఆ యాభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరి బుసకొట్టు నాతని గాలిసీఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు'' అని నిలదీస్తాడు.

తాను అనుభవించిన వేదనల్ని గుర్తుకు తెచ్చుకొని కొంటూ కొంచెం తీవ్రంగా ధర్మదేవతకు కూడా అంటరాని తనమని చెప్పవద్దని అంటాడు.

''పామునకు బాలు, చీమకు బంచదార
మేపుకొనుచున్న కర్మభూమి జనించు
ప్రాక్తనం బైన ధర్మదేవతకు గూడ
నులికుపడు జబ్బు గలదు వీడున్న చోట''

వర్ణవ్యవస్థ వల్ల కుల పీడన ఎంతగా ఉన్నదో జాషువా

చమత్కారంగా, ఎంతో దిగులుతో చెప్పిన పంక్తులివి. పాముకు పాలు, చీమకు పంచదార వేసే ఈ కర్మ భూమిలో ధర్మదేవత కూడా ఇతనున్న చోట ఉలిక్కిపడు తుందంటాడు కవి. చివరకి ఈ అరుంధతీయుడు తీసుకున్న నిర్ణయం ఏమిటంటే

"కులములేని నేను కొడుకులం బుట్టించి
యీ యఖాతమందె త్రోయవలెనె
భార్యయేలం బుట్టబానిసకని వాడు
జరుపసాగె బ్రహ్మచర్య దీక్ష"

కులం లేని తనకు కొడుకులు కలిగితే వాళ్ళు కూడ తనలాగా కులహీనులుగా పిలువబడుతూ దుఃఖోన్మత్తులు అవుతారని ఇటువంటి కఠిన నిర్ణయం తీసుకుంటాడు. ఇది ఏ జాతికైనా తీరని కళంకం. తన కులం తాను పొందుతున్న పీడనకు, తిరస్కారానికి ఈ పరిష్కారాన్ని వెతకాల్సివచ్చిన తన పరిస్థితి దయనీయమైనది.

దళితవాద లక్ష్యాలలో మొదటిది ఆత్మగౌరవ పోరాటం. కులం పేరు చెబితే నిరాదరణ మాత్రమేకాదు అవమాన భారం కూడా తప్పదు. ఆత్మగౌరవం లేక పోవడం వల్ల పుట్టు బానిసగా బతకాల్సి వచ్చింది. అంబేద్కర్ కూడా ఆత్మగౌరవ పోరాటానికి ప్రాధాన్యం ఇచ్చాడు.

"ముప్పు ఘటించి వీని గలిమిన్ గబళించి దేహమున్
బిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదము కందుకుండగాఉ
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరంప లే
దెప్పుడు నప్పు వడ్డది నుమీ భరతావని వీని సేవకున్"

ఈ పద్యంలో దళితుని దుస్థితిని వివరిస్తూ అతని వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైనదో చెబుతున్నాడు. ఈ సమాజంలో సాటి భారతీయుడే దళితుడికి ఆపదలు కలిగిస్తాడు. అతని శ్రమని దోచుకుని శరీరాన్ని పీల్చి పిప్పిచేస్తాడు. ఇంత ద్రోహం చేస్తున్నా గాని అతనెప్పుడూ నిరసన తెల్పలేదు. ప్రశ్నించలేదు. ఎంతగా కుమిలిపోతున్నా తనను పీడించేవారి కోసం చెప్పులు కుట్టి వారికి సమర్పించుకుంటాడు. అంటే అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చేసే వ్యక్తిత్వం దళితునిది.

దళితులు తరతరాలుగా వెట్టిచాకిరికి గురయ్యారు. ప్రపంచానికి భోజనం పెట్టే ఈ కష్టజీవికి ఎల్లప్పుడూ ఆకలి మంటలే. ''వాడు చెమటలోడ్చి ప్రపంచమునకు భోజనము బెట్టు వానికి భుక్తిలేదు''. ఇది దళితుని పరిస్థితి. వారు పండించే ధాన్యాన్ని ఆలయాలలో దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. కానీ ఆ ధాన్యం పండించే వారికి మాత్రం సరైన తిండిలేదు అన్న కవి వాక్కులు నేటికి మార్పులేదు సరికదా సరికొత్తగా బహుళజాతి కంపెనీల దాడి ప్రారంభమయ్యింది. దోపిడి మరింత పెరిగింది. దళితుడికి ఆలయ ప్రవేశం లేదు. స్వేచ్ఛలేదు. మానవతా విలువలను నాశనం చేసే మనిషికి మనిషికి మధ్య అగాధాన్ని సృష్టిస్తున్న వర్ణవ్యవస్థ మీద ధ్వజమెత్తాడు.

దళితోద్యమంలో బ్రాహ్మణవాదాన్ని లేదా మనువాదాన్ని బద్దలు కొట్టడం ముఖ్యాంశం. మనుస్మృతిలో శూద్రులపై అంక్షలు, నిషేధాలు ప్రకటించబడ్డాయి. ఈ గ్రంథం వర్ణవ్యవస్థను పూర్తిగా సమర్థస్తుంది. కొన్ని కులాలు కులాధిపత్యాన్ని ప్రదర్శించి తాను శ్రమపడ కుండా ఇతరుల శ్రమపై సుఖిస్తూ ఉంటారు. దీనినే బ్రాహ్మణవాదమంటారు. అందుకే మొదటి పద్యంలోనే 'కడగొట్టు బిడ్డడు' అనడం గమనార్హం.

పూజారి లేని వేళ "విన్నవింపము నాదు జీవిత చరిత్ర" అనడంలో బ్రాహ్మణవాదం స్ఫురిస్తుంది. పూజారి వ్యవస్థ వర్ణవ్యవస్థను పోషిస్తూ రక్షిస్తుంది. దళితుడికి దేవాలయ ప్రవేశం లేకుండా చేస్తుంది. ఇదే భావనను జాషువా ''పిడుగుల్ వడ్డ బ్రవేశయోగ్యతలు పాపన్నాకు లేవచ్చటన్'' అంటాడు. భగవంతుడు అందరివాడు అయినప్పుడు సాక్షాత్తు భగవంతుడే అందరినీ సృష్టిస్తున్నాడని భావిస్తున్నప్పుడు దళితుడు మాత్రం భగవద్దర్శనానికి అనర్హుడని అనడంలోని అసంబద్ధతని తెలుపుతున్నాడు.

ఒక పక్షి అయిన గబ్బిలానికున్న దేవాలయ ప్రవేశం, యోగ్యత మనిషైన అతనికి లేకపోవడం అన్న భేదాన్ని అతడు సుతిమెత్తగా ఎత్తిచూపుతాడు. ''ప్రేమికుల దేవతావాసము చేయుచు మమ్మువంటి మానవులకు లేని గౌరవమునందుల దూగెడు గబ్బిలాల రాణివి'' అని అనడంలో తన వర్గానికి ఎంతటి అన్యాయం జరుగుతున్నదో తెల్పుతున్నాడు.

''వాని నుద్ధరించు భగవంతుడే లేడు
మనుజు డెట్లు వాని గనికరించు
వాడు జేసికొన్న పాపకారణమేమొ
యింతవఱకు వాని కెఱుకలేదు''

అనడంలో భగవంతుడకు కూడా అతన్ని కనికరించనపుడు మానవుడెట్లు కనికరిస్తాడని ఆవేదన చెందుతాడు. నేరస్థుడికి వాడి నేరాన్ని తెలిపి శిక్ష వేస్తారు కాని నేరారోపణ లేదు. నేర నిరూపణ లేదు. కానీ శిక్ష మాత్రం ఉంది. అది కూడా సామాన్యమైన శిక్ష కాదు. మానసికంగానూ, భౌతికంగానూ అతన్ని హింసిస్తున్నారు.

''వాని నైవేద్యమున అంటువడిననాడు
మూడు మూర్తులకు కూడా కూడులేదు'' అంటూ జాషువా అస్పృశ్యతలోని అమానుషతని నిలదీశాడు. సాధారణంగా శరీరానికి అంటరానితనం ఆపాదిస్తారు. కానీ ఇక్కడ దళితుని చూపు కూడా అంటరానిదనడం మానవత్వానికే మాయనిమచ్చ. దేవుడికి నైవేద్యం పెట్టే ముందర అది దళితుని కంటపడిందంటే ఆ పూటకు ఇంక నైవేద్యం పెట్టరు.

''ఇది అంటరానివాడున్న నిషిద్ధగేహము, నీవు సమస్త దేవతా సన్నిధి నారగింతువు ప్రసాదములంతటి పుణ్యరాలివై యన్నము లేని పేదలగృహంబు సుచ్చితివేల'' అని తామిద్దరి భేదం తెల్పుతూ కవి తాను అస్పృశ్యత చేత పీడింపబడుతున్నాడని తనకన్నా ఆ గబ్బిలమే మేలని ఒక పక్షికున్నపాటి గౌరవం ఒక నిండుమనిషికి ఈ సమాజం ఇవ్వడం లేదంటాడు. దానికున్నపాటి స్వేచ్ఛ తనకు లేదని గబ్బిలం ఎక్కడికంటే అక్కడికి స్వేచ్ఛగా వెళ్ళగలదని ''ఎన్ని దేశాలు తిరిగిననేమి నీకు నీవు నావలె బుట్టు బానిసవు'' కావంటాడు. పాశ్చాత్య వ్యవస్థలలో లాగా మన దేశంలో కుల వ్యవస్థలో కులాచారం కులధర్మం పేరుతో ఏ కులంలో పుట్టినవాణ్ని ఆ కులానికి సంబంధించిన పనికి పరిమితం చేశారు. ఇదేమని ప్రశ్నించే వీలు లేకుండా కర్మ సిద్ధాంతం పేరుతో ఎవరికి వారు లోబడి ఉండేలా చేశారు. దీనినే జాషువా

''కర్మసిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నాభుక్తి ననుభవింత్రు
కరమమననేమొ దాని కీ కక్ష యేమొ
యీశ్వరునిచేత బుజువు చేయింపవమ్మ'' ఇప్పటికీ బాకీలు తీర్చలేక కొడుకునో కూతురునో పనిలో పెట్టడం జరుగుతోంది. ఏళ్ళకేళ్ళు పనిచేసినా వడ్డీ తీరని సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి సందర్భాల్లో జీవితాంతం బానిసగా పనివుండటం తప్ప వాని జీవితాలకు వెలుగు లేదు. ఎక్కడో అక్కడ ఒక్కటీ అరా వార్తాపత్రికల ద్వారా తప్ప ప్రజల్లో వీటి గురించి పెద్దగా పట్టింపు లేకుండా ఉంది.

''ఈ ప్రశాంతారాత్రి ఎల్లరందరును
బుజ్జగించి నిద్ర బుచ్చుకొనియె
నౌషధంబులేని యస్పృశ్యతాజాడ్య
మందభాగ్యు నన్ను మఱచిపోయె'' అనడంలో అతని దీనస్థితి వెల్లడవుతుంది. నిజానికి రాత్రి ఎవరినీ నిద్ర పుచ్చదు. అయితే అంటరానివానికి ఆకలి మంటల చేత, అవమానాల పరంపరచేత కునుకు ఉండదు. ఆకలి మంటలతో అలమటించే అభాగ్యులెందరో మన కళ్ళ ముందు కన్పిస్తుంటారు. అన్నం కోసం మనం నిత్యం పరితపిస్తుంటారు. ప్రొద్దస్తమానం చెమటోడ్చినా వారికి పట్టెడన్నం దొరకదు.

''ముక్కు మొగమున్న చీకటి ముద్దవోలె
విహరణము సేయసాగె గబ్బిల మొకండు
దాని పక్షానిలంబున వాని చిన్న
యాముదపు దీప మల్లన నాఱిపోయె''

గబ్బిలం ఎంత? దాని రెక్క ఎంత? ఆ రెక్క గాలికి ఆముదపు దీపం ఆరిపోయిందంటే ఆ దీపం ఎంత కొడిగట్టే స్థితిలో ఉందో ఆ దళితుని దీనస్థితిని మనం ఊహించవచ్చును. జాషువా సునిశిత దృష్టికి ఇదే చక్కని తార్కాణం.

"ఆ యాభాగ్యుని రక్తంబు నాహరించి యినుపగజ్జెల తల్లి జీవనము సేయు, ద్వారములు లేని నాదు కుటీర లక్ష్మి, ఉదయమాది రక్త మోడ్చికష్టముజేసి యినుని సాగనంపి యిల్లుసేరి యున్న గంజింద్రావి యొక్కనా డా పేద ప్రక్కమీఉద మేను వాల్చియుండె" అన్న మాటల ద్వారా అతనెంత అంతులేని కటిక దరిద్రాన్ని అనుభ విస్తున్నాడో తెలుస్తుంది.

ఈ విధంగా కావ్యంలో అన్పశ్యత, దళితుల దారిద్ర్యం, వారి శ్రమైక జీవనం, వారి సాత్వికతా ప్రవృత్తి, వారికి దేవాలయ ప్రవేశం లేకపోవడం చిత్రించబడ్డాయి.

గబ్బిలం ద్వారా ఈ సందేశాన్ని శివునికి పంపు తున్నప్పటికీ ఈ సందేశం నిజానికి తన చుట్టూతా వున్న ప్రజలకే! "నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును కాల్చివేయునని" హెచ్చరించాడు.

దీనుల పట్ల, సంఘం అణచివేసినవారి పట్ల, అపార మైన సానుభూతితీ కలం కదిలించిన కవి జాషువా. సంఘ సంస్కరణ ఆయన కావ్య లక్ష్యం. ఆకలిని శోకాన్ని నిర్మూలించాలన్నదే ఆయన ధ్యేయం. సంకుచిత తత్వాలను ఖండిస్తూ "నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తిరుగులేదు విశ్వనరుడ నేను" అని తన విశ్వజనీనమైన దృక్పథాన్ని చాటాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"పిడికెడు ఆత్మగౌరవం కోసం - కవితా పరామర్శ"

- భాగం సైదిరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

దళిత సాహితీ చరిత్రలో ఉవ్వెత్తున ఎగసి, అంతలోనే అమరుడైన దళిత విప్లవ యువ కెరటం శ్రీ కలేకూరి ప్రసాద్‌గారు. దళిత సాహిత్యంలో తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకుని హరిజనుల, పంచముల అస్థిత్వ పోరాటంలో తనూ ఒక కవిత ఆయుధమై దళిత సోదరుల చైతన్యానికి రెండు జాతులతో ఎర్రజెండా, ఎత్తి అణగారిన వర్ణాల ఆత్మగౌరవానికై అహర్నిశలు ఆలోచన చేసిన మహామనిషి కలేకూరి ప్రసాద్. ఈ భూమిపై నాగరికత అభివృద్ధి చెందుతున్నప్పటి నుంచి ఎన్నో ఉద్యమాలు, విప్లవాలు, ప్రజా పోరాటాలు వచ్చాయి. అయితే అటువంటివన్నీ కూడా కేవలం అణగారిన వర్గాల పీడనను నినదించి, పాలకుల ఆధిపత్యాన్ని తెగ నరికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం జరిగినవే. అటువంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఈ భరత భూమిలోని ఒక వర్గం కన్నెత్తి కూడా చవిచూసి ఎరుగదు. అటువంటి దళితులు నిత్యం వెతలకు గురవుతూ, అగ్రవర్ణాల ఆధిపత్యంతో అణువణువునా బలైపోతూ ఆర్థిక, సాంఘిక రంగాల్లో వెనుకబాటుకు గురై బానిసకొక బానిసగా బ్రతుకు వెల్లదీస్తున్న వైనాన్ని తెలుపుతూ తెలుగునాట వచ్చిన దళితోద్యమం దిశగా దళితులు, పంచముల యొక్క ఆత్మ గౌరవ, అస్థిత్వ ప్రకటనా దిశ సాగి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆకాంక్షించింది. అటువంటి దళితోద్యమంలో తాను ఒక పూచిక పుల్లలా మారి దళితుల ఆత్మగౌరవ ప్రకటనే ధ్యేయంగా కలేకూరి ప్రసాద్‌గారు రాసిన ఈ పిడికెడు ఆత్మగౌరవం కోసం అనే కవిత నేటి దళితుల మాన్యువల్‌గా చెప్పవచ్చు.

కలేకూరి ప్రసాద్ గారు 1962 అక్టోబర్ 25వ తేదీన కృష్ణాజిల్లా కంచికచెర్లలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లలితా సరోజిని, శ్రీనివాసరావులు ఇద్దరూ ఉపాధ్యాయులే. ప్రసాద్‌గారు కవిగా, సినీ గీత రచయితగా, సాహితీ విమర్శకుడుగా, మార్క్సిస్టు విశ్లేషకుడుగా, దళిత ఉద్యమకారునిగా, జననాట్య మండలి, విప్లవ రచయితగా పేరుగాంచారు. ఈయన తన స్వగ్రామమైన కంచికచెర్లలో కోటేసు అనే యువకున్ని పెత్తందార్లు సజీవ దహనం చేయడంతో చలించిపోయి పీపుల్స్‌వార్‌లో చేరాడు. పార్టీ రాజకీయ పాఠశాలల్లో భోదకుడుగా పని చేశాడు. కారంచేడులో దళితుల మారణకాండతో దళిత ఉద్యమంలోకి అడుగిడుతూ పీపుల్స్ వార్ నుండి బయటకు వచ్చి శివసాగర్ వంటి నాయకులతో కలసి పలు ప్రజా, దళిత ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. డర్బన్‌లో జాతి వివక్షపై జరిగిన చారిత్రక అంతర్జాతీయ సదస్సులో కలేకూరి పాల్గొన్నాడు. ఈయన "యువక" అనే కులం పేరుతో కవితలు రాస్తూ "మండుతున్న చుండూరు", దళిత కవిత్వం లాంటి కవితా సంకలనాల్లో కవితలు రాసారు. ఈయన రాసిన పలు పాటలు చలనచిత్రాల్లో బహుప్రాచుర్యం పొందాయి. శ్రీరాములయ్య సినిమాలో రాసిన "భూమికి పచ్చని రంగేసినట్లూ అమ్మలారా" పాట కారంచేడును ఉద్దేశించి రాసినది. ఈయన దళిత సాహిత్యం, దళిత కిరణాలు, దళిత ఉద్యమం - దళిత సాహిత్యోద్యమం, ఆంధ్రప్రదేశ్ దళితులు, పిడికెడు ఆత్మగౌరవం కోసం, అంటరాని ప్రేమ వంటి స్వీయ రచనలు వెలువరించారు. అదే విధంగా ఎన్నో కవిత సంకలనాల్లో ఈయన కవితలు చోటుచేసుకున్నాయి. అందువలన వ్యాస పరిధిని దృష్టిలో ఉంచుకుని కేవలం "పిడికెడు ఆత్మ గౌరవం" కోసం అనే కవితను మాత్రమే తీసుకుని వివరించగలనని మనవి చేయగలను.

కలేకూరి ప్రసాద్ గారు తాను స్వయంగా చూసిన సంఘటనల ఫలితమే పిడికెడు ఆత్మగౌరవం అనే కవిత. ఇందులో కంచికచెర్ల, చుండూరు, కారంచేడు వంటి

దళిత మారణకాండాల్ని పేర్కొంటూ ఈ కర్మభూమిలో మానవత్వం మాసిపోయిందని తెలుపుతూ తరాలుగా అగ్రవర్ణాల ఆధిపత్య ధోరణితో బానిస బ్రతుకులు బ్రతుకుతున్న దళితుల దీనావస్థలను గురించి తెలుపుతూ

"నేను ఎప్పుడు పుట్టానో తెలియదు గానీ
వేల ఏళ్ళ క్రితం ఈ గడ్డ మీదనే చంపబడ్డాను
పునరపి మరణం పునరపి జననం
నాకు కర్మ సిద్ధాంతం తెలియదు కానీ
మళ్ళీ మళ్ళీ మరణించిన చోటనే పుడుతున్నాను"

హిందూ వ్యవస్థ కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం పేరుతో దళితుల్ని దగా చేసి దోచుకుతింటున్న అగ్రవర్ణాల ఆచారాలు, వారి కట్టుబాట్ల పేరుతో దళితులపై జరుపు తున్న అమానుష దాడుల్ని ఖండించారు కలేకూరి ప్రసాద్ గారు. శతాబ్దాలు గడుస్తున్న దళితుడు ఇంకా అవే వేదకాలం నాటి పరిస్థితులను, ఎదుర్కొంటున్నాడని, వారికి ఏవిధమైన మార్పు రాలేదనీ, సమాజంలో వారిపై జరిగే దాడులు, దమనకాండలు అలానే కొనసాగు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. మళ్ళీమళ్ళీ మరణించిన చోటనే పుడుతున్నాను అంటూ ఈ కర్మబంధాల నుండి ఈ హిందూ వ్యవస్థ దళితులకు ముక్తిని, స్వేచ్ఛను ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించాడు. అయితే ఈ వాక్యలు గమనించినట్లయితే భోయి భీమన్న గారు గుడిసెలు కాలిపోతున్నాయ్ కవితలోని "కాలి పోయిన స్థానంలో ఈ గుడిసెలు మళ్ళీ మళ్ళీ పుడుతూనే ఉంటాయి" అన్న వాక్యలను అనుసరించి ఇద్దరు కవులూ తెలిపింది ఏమిటంటే, కాలాలు మారినా సమాజంలో మార్పు రావట్లేదని, దళితుల పరిస్థితులు అదే రీతిలో ఉంటూ నిత్యం వెతలకు గురవుతూనే ఉన్నారని తెలియజేయడం గమనించవచ్చు. అదే విధంగా

"నా కనుగుడ్లు కన్నీరై ద్రవిస్తే
ఈ దేశంలో జీవనదులు ప్రవహించాయి
నా సిరల నుండి జీవధాతువులు స్రవిస్తే
ఈ దేశం సస్యశ్యామలమై సిరులు కురిసింది"

ఈ భరతభూమి అభివృద్ధికి పంచములే పునాదులై అహర్నిశలూ శ్రమించి, రక్తం దారపోసి తన భుజ స్కందాలపై నిలిపి పోషిస్తున్నారనే, వారి శ్రమ ఫలితమే ఈ భరతభూమి నేటి అభివృద్ధికి కారణమని తెలియ జేస్తున్నారు. దళితులు బానిసత్వంలో వెట్టిచాకిరీలో నిలువెల్లా నీరై కరిగిపోతున్నారనే, అయినప్పటికీ వారికి తినడానికి, తాగడానికి కూడా గతిలేక నిర్భాగ్య జీవితాలు అనుభవిస్తున్నారనీ వాపోతూ

"త్రేతాయుగంలో నేను శంభూకుణ్ణి
ఇరవై రెండేళ్ళ క్రితం నా పేరు కంచికచర్ల కోటేశు
నా జన్మస్థలం కీలవేణ్ముణి కారంచేడు, నీరుకొండ
ఇప్పుడు కరుడు గట్టిన భూస్వామ్య క్రౌర్యం
నా గుండెల మీద నాగేటి కర్రులతో పచ్చ బొడిసిన
పేరు చుండూరు
ఇక చుండూరు నామవాచకం కాదు సర్వనామం"

ఈ పుణ్యభూమిలో దళితుల రక్తం చిందని ప్రదేశం అణుమాత్రమైనా లేదని, గడియకో హత్య, లిప్తిలో అవమానంలో ఈ హైందవ భూమిని అగ్రవర్ణాల వారు పునీతం చేస్తున్నారనీ ప్రతీకగా చెపుతూ, ఆంధ్రదేశంలో దళితుల పరిస్థితి మరింత దిగజారి పోతుందనే అగ్రవర్ణాల వారి జాత్యాహంకార ఆధిపత్య ధోరణి దళితుల్ని సమూలంగా నాశనం చేసేంత వరకు నిద్రపోదని తెలిపుతూ, తనని తాను శంభూకునితో పిల్చుకుంటూ వేదకాలం నుండి దళితులకు రక్షణ కరువైందనే చేదు నిజాన్ని తన కవిత్వం ద్వారా తెలియజేశాడు. దళిత వాడలపై అగ్రవర్ణాల వారి క్రౌర్యం రక్తపుటేరులు ప్రవహింపజేస్తుంది. కంచికచర్లలో కోటేను సజీవ దహనం చేయడం, 1980లో కారంచేడులో దళితవాడపై అగ్రవర్ణాల వారు చేసిన దాడిలో సుమారు 30 మందిని వెంటాడి, వేటాడి చంపిన సంఘటన, అదే విధంగా చుండూరులో 1991లో సుమారు 8 మందిని నరికి, ముక్కలు చేసి తుంగభద్రలో వేసిన ఘటన మానవత్వాన్ని హత్య చేసిన దినంగా వర్ణించవచ్చు. అలాంటి మాన

వత్వానికి మాయనిమచ్చలా పరిణమించిదని ఈ సంఘటనలపై శ్రీ కలేకూరి ప్రసాద్ గారు ఎంతో ఆర్తితో కవిత్వం రాస్తూ ఇక చుండూరు సర్వనామమని, సమస్త దళితుల యొక్క నామవాచకమని తెలిపారు. ముఖ్యంగా కరుడు కట్టిన కులవాదం, అంతకుమించి భూస్వాముల యొక్క ధనాధికారంతో చుండూరులో రక్తపుటేరులు పారించిన వైనాన్ని రచయిత ఆవేదనగా వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో దళితుల యొక్క అభ్యున్నతి, వారిపై గల ద్వేషం, పగ, ప్రతీకారాలే అగ్రవర్ణాల వారిని ఈ మారణ కాండకు ఉసిగొలిపాయని చెప్పవచ్చు. అదే విధంగా తరతరాలుగా ఈ దేశ మూలవాసులైన దళితులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేక, విద్యకు దూరంగా ఉంచబడి, సంపదకు దూరం చేసి, వెట్టిచాకిరీ చేయించుకుని బతుకు దుర్భరం చేసి నిత్యం అవమానాలకు, అత్యాచారాలకు, మానభంగాలకు, చిత్రహింసలకు గురి చేస్తున్న ఈ అగ్రవర్ణాల వారిపై ఆత్మ గౌరవ పోరాటం తీసుకురావాలని, అప్పుడే దళిత చైతన్యం అవతరిస్తుందని తెలుపుతూ

"నేను బాధితున్ని కాదు అమరుణ్ణి
ఎగిరే ధిక్కార పతాకాన్ని
నా కోసం కన్నీరు కార్చకండి
మీకు చేతనైతే
నన్ను నగరం నడిబొడ్డున ఖననం చేయండి"

అంటూ తన ధిక్కార స్వభావాన్ని దిగంతాలకు వ్యాపించేలా సవాలు విసురుతున్నాడు. నిజమే ఇప్పుడు దళితులకు కావల్సింది దయ, జాలి చూపడమో, కన్నీరు కార్చడమో, ఊరడింపు మాటలు చెప్పడమో కాదు. సామాజిక న్యాయం కావాలి. సంఘంలో సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలి. కలేకూరి చెప్పినట్లు దళితులు బాధితులు కాదు అమరులు. ఎందుకంటే ఈ అసమసమాజ కులనిర్మూలనా పోరాటంలో కుహన వాదుల కుతంత్రాల వ్యూహంలో అశువులు బాసి, తనువులు చాలించిన అమరులని కలేకూరి దళితుల ఆత్మ గౌరవాన్ని ఇనుమడింపజేసారు. తాను ఎగిరే ధిక్కార పతాకం అని చెపుతూ తన కోసం కన్నీరు కార్చవద్దని చెపుతూనే, నగరం నడిబొడ్డులో దహనం చెయ్యమని సవాలు విసురుతున్నాడు. ఎందుకంటే దళితులు ఏనాడు సగర్వంగా తల ఎత్తుకుని తిరగలేదు, కాళ్ళకు పాదరక్షలు, వంటి నిండా వస్త్రం ఉన్నా చూసి సహించలేని జాత్యాహంకారులున్న ఈ దేశంలో దళితునికి స్వేచ్ఛ అనే పదానికి అర్థం కూడా తెలియదని, వారికి పల్లె వీధుల్లో నడిచే స్వేచ్ఛ లేనప్పుడు నగరం ప్రవేశం కూడా దుర్లభమని తెలుపుతూ, మనిషికే ప్రవేశం లేని నగరంలోకి శవాన్ని తీసుకెళ్లి దహనం చేయండంటూ సవాలు విసురుతున్నాడు. ఎందుకంటే తాటాకు చప్పుళ్ళు వంటి మాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం మానుకుని చేతల్లో దళిత జనోద్ధరణ జరగాలని ఆవేశంలో రాసిన వాక్యలివి.

రచయిత కలేకూరి ప్రసాద్ కవిత్వాన్ని పరిశీలించినట్లయితే అందులోని లోటుపాటులు గమనించినట్లయితే ఇంతవరకు జరిగిన అనేక సంఘటనలను ఉదాహరణలు తీసుకుని తన కవిత్వంలో పొందు పరిచారు. ముఖ్యంగా దళిత నరమేధ సంఘటనలు అయిన కారంచేడు, చుండూరు, నీరుకొండ, కంచిక చర్లను ఈ కవితలో చిత్రిస్తూ, అగ్రవర్ణాలవారి జాత్యాహంకార ధోరణితో పాటు, సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నా కూడా మానసిక బలహీనులైన దళితుల నిర్భలత్వాన్ని తెలియజేసారు. అంటరానితనం, అస్పృశ్యత వంటి సామాజిక వైకల్యాలు దళితుల పాలిట మరణ మృదంగమైనప్పుడు యముని మహిషగింటికలు ఆయా గ్రామాల్లో వినిపించిన దళితులు చావుకేకల యొక్క మానసిక వేదన ఆధారంగా కలేకూరి ప్రసాద్ ఈ దళిత మరణ మృదంగ మయమైన అక్షరాలతో తన ఆవేశాన్ని ప్రకటించారు రచయిత.

"ఒక పెనుమంటల పెనుగులాటనై
మళ్ళీమళ్ళీ ఈ దేశంలోనే ప్రభవిస్తాను".

ఆధార గ్రంథాలు :

1) పిడికెడు ఆత్మగౌరవం కోసం - కలేకూరి ప్రసాద్
2) చిక్కనవుతున్నపాట - జి.లక్ష్మీ నరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్
3) తెలుగు కవితోద్యమాలు - తెలుగు అకాడమీ
4) తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న
5) అంతర్జాల సమాచారం
6) యూట్యూబ్ వీక్షణలు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"తెలుగులో దళిత సాహిత్యం – సంఘటనాత్మక కవిత్వం"

– పంతోతు నాగేశ్వరరావు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

దళిత సాహిత్యమంటే ఏదో ఒక వర్గం ఒక బడుగు బలహీన వర్గాలపై చేయు అజమాయిషీ కాదు. ఒక జాతి తన అస్థిత్వ నిరూపన వేదనాభరితమైన జ్వలన రూపం దళిత కవిత్వం. అసలు ఉద్యమాలు రావడానికి కారణం వ్యక్తి లేదా ఒక జాతి అస్థిత్వాన్ని అణచివెయ్యడం ద్వారానే. తద్వారా దేశంలోని విభిన్న ప్రాంతాల్లో వేర్వేరు రకాలుగా ఉద్యమాలు వచ్చాయి. శ్రీకాకుళంలో భూస్వామ్యానికి వ్యతిరేకంగా కర్షకుల విప్లవ శంఖం పూరిస్తే, తెలంగాణా ప్రాంతంలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం, గుంటూరు పెదనందిపాడు పన్నుల ఉద్యమం, నెల్లూరు ప్రాంత పుల్లరి ఉద్యమాలు అనేవి ఒక విధంగా వాస్తవ సంఘటనను ప్రజలు గుర్తెరిగా ప్రబలిన ఉద్యమాలు. అదే విధంగా జాతుల మధ్య వివక్షతను అధిక వర్గాల దుర్నీతిని, ఎండగడుతూ, సమాజంలో అన్ని వర్గాలు మాదిరిగా మేం కూడా సమానమేనని తన రచనలు ద్వారా తేటతెల్లం చేశారు.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో నిమ్నకులాలకు ప్రాధాన్యమిచ్చినది శివకవియుగం. అన్ని మతాల వారికి సర్వసంపన్నమైన ప్రాధాన్యమిచ్చిన తొలి సాంఘిక విప్లవకారుడు బసవేశ్వరుడు. అతను నిర్మించిన అనుభవ మంటపం నాలుగు వర్ణాల సమైక్యతతో నిర్మించిన ఐకమత్య భవనం లాంటిది. దరిమిలా తన రచనల్లో బడుగు వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చిన సమకాలీన శైవ ప్రతినిధి పాల్కురికి సోమనాధుడు. బసవపురాణం, పండితారాధ్య చరిత్ర అను రచనల్లో నిమ్నకులాలకు పట్టం కట్టిన చతురాననుడు. తర్వాత అన్నమాచార్య సంకీర్తనల్లోనూ, ప్రబంధ యుగం అనే వృక్షాన్ని పెంచి పోషించిన ప్రబంధ ఉద్యానవన యజమాని అయిన శ్రీకృష్ణదేవరాయలు విరచితమైన ఆముక్తమాల్యద ఫ్రౌడ ప్రబంధంలో మాలదాసరి పాత్రచే చెప్పించిన ధర్మాలను బట్టి రాజు రాజ్యంలోని జనులను వర్ణ బేధాలను చూడకుండా అందరిని సమైక్యంగా చూడాలనే భావాలకు నిలువుటద్దాలుగా భావించవచ్చును. ఇంకా చాలామంది ప్రాచీన కావ్యంలో తమ తమ గ్రంథాల్లో అక్కడక్కడ వీరి ఛాయలు మనకు గోచరిస్తాయి. ఈ వ్యాసంలో స్త్రీవాద కవిత్వోద్యమం వెన్నంటి వచ్చిన ఉద్యమంగా పేర్గాంచిన దళిత కవిత్వ ఉద్యమం గూర్చి, ఆ ఉద్యమంలో భాగంగా వచ్చిన సమస్యాధారిత సంఘటనాత్మక కవిత్వ పరిణామమును విరివిగా ప్రస్తావించుకుందాం. ఈ వ్యాసంలో సంఘటనాత్మక కవిత్వాన్ని అందించిన కొంతమందిని గూర్చి సూచనాప్రాయంగా తెలుసు కుందాం.

సంఘటన అంటే ఒక వాస్తవ విషయాన్ని రికార్డు చేయ్యడం. అది నిజజీవితానికి చాలా సన్నిహితంగా ఉంటుంది. దానిని అనుభవంలోకి తీసుకుని రచనలు చేసే వ్యక్తి యొక్క గాఢత, తీవ్రత పాఠకుల హృదయాల్లో చెరగని ముద్ర వేస్తాయి. ఆ విధంగా సంఘటనాత్మక కవిత్వం రాసిన ప్రముఖుల్లో ఒకరు కలేకూరి ప్రసాద్‌గారు. ''పిడికెడు ఆత్మగౌరవం కోసం'' అనలు సినలైన సంఘటనాత్మక కవిత్వమునకు మేలుబంతి రచన. ఇందులో కంచికచర్ల, కారంచేడు, చుండూరు, నీరుకొండ, కీలవేణ్మణి, మొ॥ సంఘటనల్ని వాస్తవ దృక్పథంతో కవిత్వీకరించారు.

"రగిలే గుండె కొలిమిలో నినాదాలు కురిపిస్తున్న వాణ్ణి
నాకు జాలి జాలి మాటలొద్దు కన్నీటి మాటలొద్దు
నేను భాధితుణ్ణి కాదు అమరుణ్ణి
ఎగిరే ధిక్కార పతాకాన్ని
నా కోసం కన్నీరు కార్చకండి
మీకు చేతనైతే

నన్ను నగరం నడిబొడ్డున ఖననం చెయ్యండి
జీవన రవళిని వినిపించే వెదురువనాన్నయి
వికసిస్తాను'' [1]

అని ధిక్కారమైన గొంతుకను అందించిన కార్య సాధకుడు కలేకూరి ప్రసాద్. జరుగుతున్న అన్యాయాలపై నత్తనడకన నడిచే ప్రభుత్వ విధానాలను, అగ్ర కులాలు అజమాయిషితో ఉండే పోలీస్‌వ్యవస్థ పట్ల తీవ్రమైన భావజాలాన్ని ప్రదర్శించారు. వారు మృతదేహాల దగ్గరకు వచ్చే సానుభూతి మొసలికన్నీరు వద్దని, సాంఘిక పరివర్తనే ముఖ్యమనే లొతైన సందేశాన్ని అందించారు. చుండూరు సంఘటనలో మృతి చెందిన మృతదేహాలను నగరం నడిబొడ్డున ఖననం చెయ్యాలని, ఆ అగ్నిజ్వాలలే చైతన్యానికి ప్రతీక అనే సత్యాన్ని అందించారు.

అగ్రకులజులు పీడిత వర్గాలు ఎప్పుడూ కూడా నిమ్న స్థాయిలోనే ఉండాలనే ఆచారం పూర్వకాలం నుండి ఈనాటి వరకు కూడా ఏదో ఒక ప్రాంతంలో దర్శనమిస్తాయి. ఇటువంటి సంఘటన ఒకటి 1998లో ఒక గ్రామంలో ఒక దళిత వ్యక్తి పంచె కట్టుకున్నాడని పనిలోనికి రానివ్వలేదు. దీనిని ఆంధ్రజ్యోతి వార్తాపత్రికలో వచ్చిన కథనాన్ని చదివి స్పందించినవారు ఉన్నారు. వారిలో ఒకరు యస్.ఆర్. భల్లం. ''పంచకడితే...'' అనే కవితలో

''పిడికెడు ఆత్మగౌరవం కోసం
మమ్మల్ని మేమే వొల్చుకొని నిరాకారంగా నిలబడ్డ
మా శవాలు చెప్పే పాఠం వింటానికి
మీ గుండెకి చెవులున్నాయా
ప్రకృతిలో మనిషికంటే
గొప్ప వారసత్వపు విత్తనం మరొకటి లేదుగా'' [2]

అని యస్.భల్లంగారు తాము తమ స్వాభిమానం కోసం బతుకుతున్నామని, ఇంతకుముందు జరిగిన దమనకాండల్లో మృతి చెందిన అన్నార్తులకు జరిగిన అన్యాయాలను అనుభవంలోకి తీసుకుని ప్రతీకార సూర్యుడిగా ముందుకు సాగుతున్నామని, దానిని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

సాధారణంగా సంపన్నుల యొక్క భూకమతాలలో సేద్యం చేసుకుని జీవనం సాగించేవారు క్రింది తరగతులవారు. వారి జీవితం వ్యధభరితం. ఏ పంటను పండించిన ఆ కాలంలో ఉన్న పరిస్థితులను ఎదుర్కొని సేద్యం చేస్తారు. పంటకాలం పూర్తి అయి చేతికొచ్చాక సరైన ధర ఉండదు. ఇటువంటి సమస్యలను పరిశీలించి మారయ్య ''కాంటా'' అను కవితలో

''వెళ్ళి అరిగిపోయిన నాగలికేం చెప్పను
జవను కోల్పోయిన మడికేం చెప్పను
దెబ్బలు తిని అర్రు ఆసి నీరు గార్చే ఎడ్ల కళ్ళకేం చెప్పను
నాయినా ఏం దెచ్చినవని చెయ్‌సంచి తడిమోరలకేం చెప్పను
నాకు దక్కని ఈ చేలెందుకు, చెలకలెందుకు?
ఈ పంట బూడిదైపోవాలని సాపిస్తున్నా
ఈ భూమి బుగ్గై పోవాలని సాపిస్తున్నా'' [3]

అంటూ రైతుల యొక్క కష్టమును అక్షరీకరించాడు. ఎన్ని ఒడిదుడుకులు ఎదరైనా సరే రైతులు పంటలు పండించి ఫలాలను ప్రజలకు అందించే సేద్యశీలురు వీరు. ఒక ప్రక్క సరైన గిట్టుబాటు ధర, పండిన ఫలాలను తక్కువ ధరలకు మింగేసే వ్యాపారుల ఆకలిలో రైతుల యొక్క జీవితం ఎడారిలో పడ్డ నీటి బిందువువలె ఆవిరౌతుంది. ఇంకా పండిన పంటలో సగభాగం తీసుకునే భూస్వాముల ఆకలితో అలమటించే రైతుల యొక్క కుటుంబాలు, వారికి వ్యవసాయంలో చేయి అందించిన నాగలి, మడి, కాడెడ్లు, పంటకాలువలకు అభివృద్ధి ఏది అంటే ఏమని బదులివ్వాలో ఆర్తన చేసే సేద్యకారుని గూర్చి పైకవితలో కవి తెలిపారు.

చదువు అనేది సంస్కారమును ప్రోది చెయ్యాలి. కాని కొంతమంది చదువుకున్న మూర్ఖులు ఉపాధ్యాయులుగా చెలామణి అయ్యి బడులల్లో కూడా వివక్షతను చూపిన వైనాలు తారసపడడం జరుగుతుంది. అలాంటిది మద్రాస్‌లోని మెట్టూరు సమీపంలోని కట్టనాయకన్‌పట్టి

అనే గ్రామంలో ధనం అనే దళిత బాలిక పాఠశాలలోని కుండలోని నీరు తాగిందని టీచర్ కొట్టడం వల్ల కన్ను పోగొట్టుకున్న విధానాన్ని జూలూరు గౌరీ శంకర్ 'అబద్ధపు పాఠం' అనే కవితలో

"భగీరథుడు తపస్సు చేసి
గంగను భూమి పైకి తెచ్చెను
ఆపండ్రా-ఆపండి - అబద్దాల్ని ఆపండి
ఎవరి గంగరా అది...?
నిజాల్ని నమలకండి
అబద్దాలు పాఠాలు చేయకండి
నేనంటునని, నాదాపులకు రాని
ఆ నీళ్ళు, ఆ గంగ ఎవరిదిరా...?
మా కళ్ళను ముంజకాయల్లా చితిపితే
కారిన నీళ్లు కదా మాగంగ" [4]

అని తీవ్రమైన కంఠంతో గళమును వినిపించాడు. సృష్టిలో లభించే నీటిని తాగడంలో కూడా అస్పృశ్యత అంటించే ఈ నీచ సంస్కృతిని, దప్పిక తీర్చుకునే స్వేచ్ఛ దళితులకు లేదని ఆవేదన చెందిన విధం కన్పిస్తుంది. గంగతల్లిని దూరం చేసిన వారిని మమ్ములను ఏ విధంగా చూస్తున్నారో అదే విధంగా వారిని సామూహికంగా బహిష్కరించాలని భావించారు.

భారతీయ విద్యావిధానం చాలా ప్రముఖమైనది. అందు గురుకుల వ్యవస్థలో కూడా ఆనాడు రెండు వర్గముల వారికీ విద్యనభ్యసించెడి అవకాశం ఉండేది. దానిని నిరసించిన మొట్టమొదటి సాంఘిక విప్లవ చంద్రుడు బుద్ధుడు. విద్యను చాతుర్వార్ణాల వారికి తన విద్యా కులంలో సమానంగా అందించిన మొదటివారు. కాబట్టే డా॥ బి.ఆర్. అంబేద్కర్ బుద్ధుడును తన మొదటి గురువుగా స్వీకరించడం, బౌద్ధిజాన్ని ఆచరించడం వెనుకున్న ఆంతర్యం. అయితే ఆధునిక కాలంలో విద్యలో కూడా దళితులను వెనుకబాటుకు గురిచేస్తున్న సర్కారు తీరును. నిరసిస్తూ కె. రాంలక్ష్మణ్ "రాజకీయ నాటకం" అనే కవితలో

"సర్కారు నౌకర్ల పిల్లలందరు కూడ
సర్కారు బళ్ళోనె సదువుకోవాలంటు
శాసనం చెయ్యాలని సమరం సాగించి
తప్పు చేసేటోళ్ళ నందర్ని సరిచేసి
ఈ లాంటి మోసాలు ఇక ముందుగాకుండ
చూస్తూ ఊరుకోక ముందుకెళ్ళాలని" [5]

అంటూ సమాజంలో ఉన్న వివక్షతను ప్రభుత్వ బడుల్లోనూ జరుగుతుందని, సామాజిక ప్రగతిశిల మాటలు చేతలు కాక వాడుకలో అమలు చెయ్యాలని, సమానత్వ సాధన దిశగా ప్రభుత్వ ఉద్యోగ పిల్లలను కూడా సర్కారు బడుల్లో చదివించి సమన్యాయం చెయ్యాలని హితవు పలికారు.

ఇంకా చాలామంది సంఘటనలకు ప్రేరణ పొంది కవిత్వం రాసినవాళ్ళు కోకొల్లలుగా ఉన్నారు. వారందరిని ఏకచ్ఛత్రంగా ఈ వ్యాసంలో పేర్కొనలేము. పై కవితల్లో తెల్పినట్లు జరుగుతున్న అన్యాయాలు ప్రస్తుత కాలంలో జరిగిన ఒక సంఘటనాత్మక విషయాన్ని చెప్పి ఈ వ్యాసమును పూర్తి చేస్తాను.

2022 ఆగష్టు నెలలో రాజస్థాన్ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదేళ్ల దళిత విద్యార్థి ఇంద్రకుమార్ మేఘావల్ కుండలో నీళ్లు తాగినందుకు బాలుడిని టీచర్ కొట్టినందుకు 23 రోజులు ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడి మరణించడం అనేది ఆధునిక భారతదేశ అభివృద్ధి మరికొన్ని వందల సంవత్సరాలు వెనుకంజలో ఉందనడానికి తార్కాణం.

పాదసూచికలు :

1) చిక్కనవుతున్న పాట (సంకలనం) - కలేకూరి - పుట 111
2) దళిత కవిత్వం - 2 (సంకలనం) - యస్.ఆర్. భల్లం - పుట 147
3) బహువచనం (సంకలనం) - మారయ్య - పుట 71
4) పదునెక్కిన పాట (సంకలనం) - జూలూరి గౌరీశంకర్ - పుట 43
5) దళిత కవిత్వం - 1 (సంకలనం) - కె.రాంలక్ష్మణ్ - పుట 99

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కట్టెలమోపు కవితా సంకలనం – దళిత జీవనం

– డా॥. డి. సుజాత, సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల(గౌ) , రాజమండ్రి.

"హితేన సహితం సాహిత్యం" సాహిత్యం హితవును బోధిస్తుంది. మేలైన మార్గంలో మానవుడు నడవటానికి తోడ్పడుతుంది. అటువంటి సాహిత్యం మొదట కొన్ని నియమ నిబంధనలకు లోనై ఉండేది. (ఛందోబద్ధంగా) దేవుళ్ళు, రాజులే ప్రధాన కథా వస్తువుగా ఉండేవారు. కాలక్రమంలో ఆ తీరు మారింది. సామాన్య మానవుడు కథావస్తువయ్యాడు. స్త్రీవాద, మైనారిటీ, దళితవాద ప్రక్రియలు సాహిత్యంలోకి అడుగిడినవి. తెలుగు సాహిత్యం వికాసం చెందింది.

ఆర్థికంగా, కుల పరంగా అణచబడిన వారు దళితులు. వారి ఆక్రందనను సమాజానికి తెలపాలను కున్నారు. సొంత గొంతును వినిపించడానికి ముందు కొచ్చారు. తమ ఆవేదన ఎవరో చెప్పడం కాదు. స్వయంగా చెప్పాలనుకున్నారు. వారే దళితులు. వారు చెప్పేదే దళిత సాహిత్యం.

కత్తి పద్మారావు గారు దళిత వాది. వారి రచనలన్ని ఎక్కువగా దళిత ఆవేదనను, ఆవేశాన్ని తెలిపేవిగా ఉంటాయి. ఆ కోవకు చెందిందే "కట్టెల మోపు" కట్టెల మోపు అంటే "కవితల కూర్పు" అని అర్థం. ఇది 83 కవితల సమ్మేళనం.

ఈ పుస్తకంలో ప్రతి కవితలోను దళితుల ఆక్రందనలు వినిపిస్తాయి. వారు సమాజంలో అట్టడుగు పొరలకు నెట్టివేయబడుతున్న విధానం కనిపిస్తుంది.

కవిపరిచయం :

కత్తి పద్మారావుగారు గుంటూరు జిల్లాలోని ఈతేరు గ్రామంలో జులై 1953న జన్మించారు. వీరి తండ్రి కత్తి సుబ్బారావుగారు, తల్లి జానకమ్మ గారు.

విద్యాభ్యాసం :

1958 - 1960లో మున్సిపల్ ప్రాథమిక స్కూలు చీరాలలోను, ఈతేరు ప్రాథమిక స్కూలులోని ప్రాథమిక విద్య నభ్యశించారు. పొన్నూరు, జిల్లెళ్ళమూడి, చినగొండ్ర కొలనులో సంస్కృత విద్య నేర్చుకున్నారు.

ఉద్యోగం :

1975 జూలైలో పొన్నూరు పి.బి.యన్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఆ తరువాత శ్రీ భావనారాయణ సంస్కృత కళాశాలలో (పొన్నూరు) తెలుగు అధ్యాపకునిగా పని చేశారు.

వివాహం :

పద్మారావుగారు హేతువాది. అదే భావాలు కలిగిన స్వర్ణకుమారి గారిని కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. ఒక అమ్మాయి. ఇద్దరు అబ్బాయిలు. ముగ్గురికీ కులాంతర వివాహాలే చేశారు. పొన్నూరు అంబేద్కర్ కాలనీలోని "లుంబినీ వనంలో" వారు నివసిస్తున్నారు.

కట్టెలమోపు - దళిత జీవనం : పద్మారావుగారు కట్టెలమోపు రచనలో బడుగు జీవుల జీవన విధానాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

దళితులు అంటే వెనుకబడినవారు. కుల, మత, వర్ణ, జాతి, ఆర్థిక స్థితిగతులలో వెనుకబడినవారు దళితులు. వీరి జీవన విధానం నేటికీ దుర్భరంగానే ఉంది. శ్రమించే వాడు శ్రామికుడు. శ్రమకు తగిన ఫలితం రాక, కాయకష్టం చేసి కనీన అవసరాలు తీరనివాడు దళితుడు. వారి ఆవేదన కట్టెల మోపులో కనిపిస్తుంది.

బెస్తవారు సముద్రంలో చేపల వేటకు పోతారు. ప్రాణానికి త్యజించి కొన్ని రాత్రుళ్ళు సముద్రంలో ఉంటారు. ఎందుకు ? ప్రాణం నిలుపుకోడానికి. కానీ చివరికి వారికి మిగిలేది కంటతడే. ఈ విషయాన్ని "మీరు వాటినీ తగుల బెట్టారు" అనే కవితలో

"రెండు తాటి బోదెలతో
ఒక్క వెదురు బొంగుతో
నేను ఇంత యుద్ధం చేశాను
మీరు వాటినీ తగులబెట్టారు
మీరు పూడ్చి పెట్టినప్పుడల్లా
నేను లేస్తూనే ఉన్నాను"

అని వారి జీవన పోరాటాన్ని వివరించారు. (కట్టెలమోపు - పుట - 32)

శ్రమ జీవి శ్రమించడానికే పుట్టాడు. జీవించడానికి కాదు బ్రతుకు భారంగా లాగుతాడు. తను శ్రమ పడుతుంది తన కోసం కాదు ఎదిగే వారి కోసం

"బీళ్ళు బీళ్ళుగా ఈ నేల గిడసబారినపుడు
చాళ్ళు చాళ్ళుగా నేను మునివేళ్ళతో దున్ని
మండుటెండకు నెర్రలిచ్చి
పగ్రలాపగిలిన నాపాదాలు
వీరి జీవన స్రవంతికి
రుధిర బిందువులు నీరాజనాలు ఇచ్చినప్పుడైనా
మీరు నా వంక ఆర్ద్రంగా చూశారా!"

అని శ్రమ జీవి ఆవేదనను నేను "శకుంతులని కాను" అనే కవితలో తెలిపారు.

శ్రమ దోచుకున్న వాడు అంత:పురంలో నివాసం. శ్రామికునికి నిలవ నీడలేదు.

"వీడు బడుగుల భుజాల మీద ఎక్కినోడు
అవును వీళ్ళు అడవులను తగులబెడుతూ
అంత:పురాలు పంచుకొంటున్నారు"
అని శ్రమజీవి వేదనను తెలిపారు.

దగా పడిన ప్రతివాడూ మౌనంగా ఉండడు. ఎప్పుడో ఒకప్పుడు తిరగబడతాడు. అగ్నిగుండమౌతాడు.

"చివరకు ముంజకాయలో నీళ్ళు కూడా
నా బిడ్డకు మిగల్చడం లేదు
సరే కానివ్వండి
మీరు తడినంతా గుంజుకెళ్ళాక
ఇక నేను అగ్నిగుండంగా కాక ఏమి కాను"

అని "అగ్నిగుండం" అనే కవితలో దగాపడ్డవాడే అగ్నిగుండంగా మారి విప్లవకారుడౌతాడని హెచ్చరించాడు. శ్రమలోనే సంతోషం ఉంది. శ్రమతోనే ఆత్మవిశ్వాసం పెరగుతుంది. నిరంతర శ్రామికుడే "శ్రమణుడు" శ్రమ రమ. అని "కార్యశీలురే బోధిసత్వులు" అనే కవితలో

"కాలం ఎక్కడో లేదు
కాలం శ్రమలోనే ఉంది
నిరంతర శ్రమజీవే నిజమైన శ్రమనుడు
శ్రమ రమ మెదడును అనంత
భ్రమల నుండి విముక్తుణ్ణి చేస్తుంది"

ఎవరో వచ్చి ఏదో చేస్తారనే భ్రమ వద్దు. మన శ్రమ మనల్ని ఎప్పటికైనా ఆనందింపచేస్తుంది. అని శ్రమజీవిని ధైర్యపరచాడు.

శ్రామికునికి మరణం లేదు. రాజులు, రాజ్యాలు కూలినా శ్రామికుడు నిరంతరం జీవిస్తాడు.

"బోధిసత్వులు ఎవరో కాదు
కార్యశీలురే
వారికి మరణం లేదు"

అని శ్రమజీవి ఒక స్రవంతి. ఆ శ్రమరమ కావ్యానికి హేతువౌతుంది. కవిత్వమే శ్రమగా రూపుదాలుస్తుంది. ఆ కవిత్వం తరతరాలుగా శాశ్వతంగా ఉంటుంది అని "కట్టెల మోపు" అనే కవితలో

"ఆకట్టెల మోపు వెనకున్న శ్రమ
ఆ కాళ్ళమట్టెల మోతలో వున్న ధ్వని
ఆ చెమట బిందువుల్లో ఉన్న రమ
ఆమెను కవయిత్రిని చేశాయి
అందుకే ఆమె కవిత్వం వసివాడదు."

పేదరికం ఒక పిశాచి. అది పట్టిందంటే అణచి వేస్తుంది. అని "ముసలమ్మ నవ్వింది" అనే కవితలో

"రాత్రి ఒక ముచ్చట పందిరి
వోణీ చిరిగిన చోటల్లా అది మాసికలు వేస్తుంది"

అని కనీసం బట్టలు లేని బీద యువతి దుర్భర జీవనం తెలిపారు.

"మట్టి పెళ్ళల్లో పొర్లాడే మేము
మళ్ళీ మట్టిలో కలిసేదాక
గుండె దిటవుతోనే వుంటున్నాం
ఎందరు మా శ్రమను కొల్లగొడుతున్నారో

అని బడుగు బలహీనుల ఆక్రందన ఆవేదన గుండె చప్పుళ్ళు అసమానతల సమాజానికి తెలిపారు.

ముగింపు :

ఈ విధంగా కత్తివారు తమ రచనల ద్వారానే కాక, దళితుల బాధలలో కూడా పాలు పంచుకుంటున్న మహామహులు.

ఆధారగ్రంథాలు :

1. కట్టెలమోపు - కత్తి పద్మారావు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – తాత్విక పునాది

– డా॥. నేతల లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్ (ఎ), కాకినాడ.

దళిత వాదం నేపథ్యం :

ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ ఈ దేశంలోనే నెలకొంది. దీనివల్ల సంక్రమించిన అస్పృశ్యతా జాడ్యం వేల సంవత్సరాలుగా సమాజాన్ని తునాతునకం చేసింది. క్రీ॥పూ॥ 5వ శతాబ్దం నుండి అంటే బౌద్ధ, జైనులు కుల వ్యవస్థను, అంటరానితనాన్ని నిరసించాయి. దళిత సమస్యలే దళితవాద సిద్ధాంతాలుగా, లక్షణాలుగా దర్శన మిస్తాయి. అందుకే దళిత, సాంఘిక, సాహిత్య ఉద్యమా లకు తాత్విక భూమిక పురాతనమైంది. ఇది సుదీర్ఘమైన చరిత్ర కలిగి పుష్టికరంగానే వ్యాపించింది. ఇది ప్రధానంగా హిందూ మతవాదతత్వం మీద, దాన్ని అనుసరించి వచ్చిన సాంఘిక అసమానతల మీద విమర్శించడం ప్రారంభ మైంది. ఇలా విమర్శ చేసిన ఉద్యమాల్లో బౌద్ధం, జైనం, చార్వాకం లాంటివి క్రీస్తు పూర్వానికి సంబంధించినవి కాగా వీరశైవం, భక్తి ఉద్యమం, పోతులూరి వీర బ్రహ్మ తత్వాలు ప్రాచీనమైనవి.

తాత్విక నేపథ్యం :

గౌతమ బుద్ధుడి కాలం నాటికి వర్ణవ్యవస్థ సమాజంలో పాతుకుపోయింది. ఈ సాంఘిక అసమానతల్ని ఆకలింపు చేసుకొన్న బుద్ధుడు వర్ణవ్యవస్థను ఘాటుగా ఖండించాడు. బ్రాహ్మణ వ్యవస్థను, వైదిక కర్మకాండను, యజ్ఞయాగా దుల్ని బౌద్ధం వ్యతిరేకించింది. అలాగే విద్యకు, ధనానికి, గౌరవానికి కొన్ని వర్గాలే అర్హులనే దుష్టనీతిని ఖండించింది. పండిత పామర, రాజు, పేద భేదం లేకుండా ప్రజలందరికీ ఒకే ధర్మమని చెప్పింది. హింసాపూరితమైన అశ్వమేధం, రాజసూయం, నరమేధం లాంటి యాగాల పేర్లతో మనుషుల్ని మేకల్ని గుర్రాల్ని వధించడం, బలగాలను వృధా చేయడం లాంటి అంశాల్ని వ్యతిరేకిం చింది. ప్రధానంగా అస్పృశ్య కులతత్వంపై పోరాడిన బౌద్ధం దళిత సాహిత్యానికి తాత్విక పునాది అయ్యింది. దళితులు, స్త్రీలు బౌద్ధ సన్యాసులుగా వెలుగొందారు. అందుకే అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడంలోని ఆంతర్యం.

జైనం కూడా కులతత్వాన్ని నిర్ద్వంద్వంగా ఖండిం చింది. కులవ్యవస్థకు కారణమైన హైందవమతాన్ని మత నమ్మకాల్ని వ్యతిరేకించింది. పుజారి వ్యవస్థ భగవంతుడికి అంటగడుతున్న ఆధిపత్యాన్ని ఇది అంగీకరించలేదు. ఇది కూడా వైదిక కర్మకాండను, యజ్ఞయాగాదుల్ని, విగ్రహా రాధనల్ని తీవ్రంగా నిరసించింది. జైనంలో దళితులు, స్త్రీలు సన్యాసులుగా వేల సంఖ్యలో వున్నారు. కులరహిత సమాజాన్ని కాంక్షించిన జైనం కూడా దళిత సాహిత్యానికి తాత్విక భూమికగా భాసిల్లింది.

ఆది భౌతిక వాదంగా పేర్కొనే చార్వాకం కర్మల్ని, పునర్జన్మల్ని, వర్ణాశ్రమ ధర్మాల్ని యజ్ఞయాగాదుల్ని నిశితంగా విమర్శించింది. ఈ జన్మలో చేసుకున్న పాపపుణ్యాల ఫలితంగా, మరో జన్మలో హీనవర్గంలోనో, వింత వర్గంలోనో జన్మిస్తామనే మోసపూరిత వాదనల్ని చార్వాకం ఖండించింది. యజ్ఞాల్లో బలిచ్చే పశువులు నేరుగా స్వర్గానికి వెళ్తాయని నమ్ముతారు కదా దానికి బదులు మీ తల్లిదండ్రులను బలిస్తే వారు స్వర్గం చేరుకుంటారు కదా? అని ప్రశ్నించారు. దేవుడు సర్వాంతర్యామి, సర్వశక్తివంతుడూ, దయామయుడు, నీతిపరుడు, ఈ సృష్టికి మూలం అంటున్నారు కదా! అలాంటప్పుడు ఈ లోకంలో దు:ఖాలు, రోగాలు, ఆకలి, అవినీతి ఎందుకున్నాయి. వీటిని సృష్టించినవాడు కూడా ఆ భగవంతుడే కావాలి కదా అని ప్రశ్నించారు. వర్ణ వ్యవస్థను, అస్పృశ్యతను తీవ్రంగా వ్యతిరేకించిన చార్వాకం కూడా దళిత సాహిత్యానికి తాత్విక భూమికగా దర్శన మిస్తుంది.

శివుడి పట్ల భావం కలిగి, సంఘసంస్కరణాభిలాష మెండుగా ఉన్నవారు వీరశైవులు. వారి విధానాలూ, భావాలూ సామాన్యులకు కూడా అందుబాటులో ఉండటానికి జైన, బౌద్ధాలలాగ ప్రజల భాషను వాడారు. కవిత్వంలో బ్రాహ్మణ, క్షత్రియులే నాయకులుగా ఉండాలనే సంప్రదాయానికి విరుద్ధంగా వీరు సాహిత్య సృష్టి చేశారు. బ్రాహ్మణులతో పాటు చాకలి, మంగలి, మాల, మాదిగ లాంటి అన్ని కులాల సత్రభోజనాలు, వస్త్రదానాలూ ఏర్పాటు చేసింది వీరశైవం. తెలుగులో సాహిత్య ఉద్యమాన్ని ఉదృతంగా చేపట్టి బాగా ప్రసారం చేసిన బసవడు 12వ శతాబ్ధంలో ప్రభగా వెలుగొందాడు. నన్నెచోడుడు, పాల్కురికి సోమనాధుడు, శ్రీపతి పండితుడు లాంటివారు ఈ సాహిత్య ఉద్యమాన్ని కొనసాగించారు. బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకించి శూద్రులకు, చండాలురకు సముచిత స్థానం ఇవ్వడం కారణంగా వీరశైవం దళిత సాహిత్య ఉద్యమానికి తాత్విక భూమికగా నిలిచింది.

14వ శతాబ్దం వాడైన రామానందుడు అట్టడుగు వర్గాల్లో భక్తి ఉద్యమాన్ని బాగా వ్యాప్తి చేసారు. అతని శిష్యుల్లో శాలి, మంగలి చర్మకారులు, ముస్లింలు అనేక మంది వున్నారు. అలాగే స్త్రీ పురుష సమానత్వాన్ని బోధించారు. భక్త మీరాబాయి, భక్త కబీరు, భక్త తుకారం వీరి శిష్యులే. సిక్కుమత గురువైన గురునానక్ ఈ ఉద్యమానికి చెందినవాడే బౌద్ధం తరువాత భారతదేశ మంతటా వ్యాపించిన మత ఉద్యమం వేరొకటి లేదు. బ్రాహ్మణ వాదానికి భిన్నంగా అనాడు దళితులకు ఆదరణ ఇచ్చిన ఈ ఉద్యమం నేడు దళిత ఉద్యమానికి తాత్విక నేపథ్యంగా భాసిల్లుతుంది.

చారిత్రక నేపథ్యం :

కుల వివక్షతల్ని, మత మౌడ్యాల్ని నిశితంగా విమర్శించి జాతిని జాగృతం చేయడానికి పూనుకున్న సంఘ సంస్కరణాభిలాషి, పోతులూరి వీరబ్రహ్మం. 17వ శతాబ్ధానికి చెందిన ఈయన వైదిక భావజాలానికి వ్యతిరేకంగా మానవుల్ని స్వతంత్ర్యంగా ఆలోచింపజేసే సాహిత్యాన్ని సృష్టించారు. వీరు రాసిన తత్వాల్లో స్వచ్ఛత, సజీవత, సరళత కన్పిస్తుంది. విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన వీరికి ముస్లింలలో వెనుకబడిన వర్గానికి చెందిన సిద్దప్ప, పంచమ వర్గానికి చెందిన మాదిగ కక్కయ్యలు శిష్యులుగా ప్రసిద్ధి చెందారు. కులమనేది భూటకమని, మానవులంతా ఒకటేననే విషయాన్ని ఎంతో తర్కంతో నిరూపించారు. వీరి సంఘసంస్కరణోద్యమ ప్రభావం అనంతర కవులపై, సంఘ సంస్కర్తలపై పడడమే కాకుండా క్రింది కులాల్లో ప్రశ్నించే సామర్ధ్యం పెరిగింది. ఇప్పుడు దళిత సాహిత్య ఉద్యమానికి పునాది అయ్యింది.

హిందూ మతంలోని గుడ్డి నమ్మకాల్ని ఖండిస్తూ అస్పృశ్యుల అభ్యున్నతికి జీవితాంతం శ్రమించిన నిజమైన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే. పరోక్షంగా హిందూమత సమోద్ధరణకు ఏర్పడిన బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం దివ్య జ్ఞాన సమాజం, ప్రార్థనా సమాజంలు చేస్తున్న సంస్కరణ భావాలకు భిన్నంగా సత్య శోధక సమాజం అనే సంఘాన్ని 1873 సం॥లో స్థాపించి నిమ్న జాతుల ఉద్ధరణి కోసం ఉద్యమించారు. వీరు కుల వ్యవస్థకు సంబంధించిన చారిత్రక, భౌతికవాద సిద్ధాంతాల్ని రూపొందించారు. దళితుల పెళ్ళిళ్ళకు బ్రాహ్మణ పౌరోహిత్యం అవసరం లేదని స్వకుల పౌరోహిత్యాన్ని ప్రతిపాదించారు. దీనికి బ్రాహ్మణ పురోహిత వ్యవస్థ నుండి ఎదురైన ప్రతిఘటనకు రాజీ లేని నిరంతర చట్టబద్ధమైన పోరాటాన్ని కొనసాగించారు. వీరు అస్పృశ్యులు కాక పోయినా అస్పృశ్య బాలల కోసం ప్రత్యేకంగా పాఠశాలల్ని ఈ దేశంలో ఏర్పాటుచేసిన ఘనత వీరిదే. 'బానిసత్వం, పూజతత్వం బయటపడింది'. అనే పుస్తకాలు రాసి కుల వ్యవస్థకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడారు. అందుకే అంబేద్కర్ ముగ్గురు గురువుల్లో వీరిని ఒకరిగా పేర్కొన్నారు. వీరి ఆలోచన్లు దళిత సాహిత్య ఉద్యమానికి పునాదులయ్యాయి.

బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం, భక్తి ఉద్యమం లాంటి వాదాల్ని కబీరు, జ్యోతీరావుపూలేల భావాల్ని పూర్తిగా అవగాహన చేసుకున్న డా॥అంబేద్కర్ ఆలోచనలు దళిత వాదానికి మానిఫెస్టో. దళితుల సాంఘిక గౌరవం, ఆర్థిక పురోగతి, దళితుల స్వయంకృషి, ఆత్మ గౌరవం సంపూర్ణ విద్య, ప్రత్యామ్నాయ సంస్కృతి, రాజ్యాధికారం మొ॥న అనేక సమస్యల్ని పరిష్కరించడానికి ప్రణాళిక రూపొందించారు. దళితుల ఏ ఉద్యమాన్ని ఎలా నడపాలో, దళితులకు, దళితోద్యమాలకు ఇంటా బయటా శత్రువులు ఎలా పుట్టుకొస్తారో కూడా డా॥అంబేద్కర్ చెప్పారు. ఈనాడు దళిత ఉద్యమంలో నైనా, దళిత సాహిత్య ఉద్యమాల్లోనైనా చోటు చేసుకున్న అంశాలన్నీ అంబేద్కరిజంలోనివే. విద్యావంతుల్ని చేయండి,సంఘటిత పరచండి. పోరాటం చేయండి అనే అంబేద్కర్ త్రిసూత్ర పథకం ఎంతో భావగర్వితమైంది. అన్ని సమస్యల్ని అధిగమించటానికి ఉపకరించే అంబేద్కర్ తాత్వికత దళిత ఉద్యమాలకు మూలపునాది.

జ్యోతీరావు పూలే సత్య శోధక ఉద్యమాన్ని ఆయన అనుచరుడైన ఎన్.ఎమ్.లో ఖండే బ్రాహ్మణేతర కార్మికోద్యమాన్ని నడిపారు. అనంతరం సత్య శోధక్ బహుజన రైతు ఉద్యమం ఆవిర్భవించింది. 1910 నాటికి దళిత సమస్యలు ఒక పోరాటాన్ని సంతరించుకున్నాయి. దళిత ఉద్యమాల ప్రభావంతో 1917 కలకత్తాలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశంలో అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ అన్ని రంగాల్లో దళితుల అభ్యున్నతిని కాంక్షిస్తూ కొన్ని తీర్మానాలు చేసింది.

1918 మార్చి 23,24 తేదీల్లో బొంబాయిలో ప్రప్రథమంగా అఖిల భారత దళిత జాతుల సమావేశాలు జరిగాయి. 1920 సం॥లో డా॥బి.ఆర్. అంబేద్కర్ అస్పృశ్యతా నివారణోద్యమాన్ని ప్రారంభించారు. 1927, డిసెంబర్ 25వ తేదీన దుష్ట భావాలతో కూడిన మనుధర్మ శాస్త్రాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేసి మరీ తగలబెట్టారు. 1956 అక్టోబర్ 14వ తేదీన నాగపూర్‌లో కుటుంబ సమేతంగా ఆరు లక్షల మందితో బౌద్ధాన్ని స్వీకరించారు. అలాగే 1956 నవంబర్ 16న మధ్యప్రదేశ్ లో చాంచా అనే గ్రామం వద్ద అనేక వేల మందితో బౌద్ధాన్ని స్వీకరించారు.

1981 సం॥ ఢిల్లీలో భారతీయ దళిత సమాచారం పత్రికా సంపాదకుల సదస్సు జరిగింది. దాదాపు దేశ నలుమూలల నుండి 100 పత్రికల ప్రతినిధులు పాల్గొన్నారు. 1984లో అంబేద్కర్ ప్రభోదించిన రాజ్యాధికార స్ఫూర్తితో కాన్షీరామ్ బహుజన సమాజ పార్టీని స్థాపించారు. 1985 జూలై 17న ప్రకాశం జిల్లా కారంచేడులో దళితులపై అగ్రవర్ణాలు దాడి చేసి ఎనిమిది మంది దళితుల్ని దారుణంగా చంపిన సంఘటన జరిగింది.

1991 ఆగస్టు 6న గుంటూరు జిల్లా చుండూరులో అగ్రవర్ణాలు దళితులపై దాడి చేసి ఎనిమిది మందిని అతిక్రూరంగా నరికారు. ఇది రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా పెనుసంచలనం రేకెత్తించింది. అన్ని పార్టీల్లో వున్న దళిత 107 గురు పార్లమెంటు సభ్యులు రాష్ట్రపతికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్ళగా రాష్ట్రపతి అందరూ వద్దు ప్రతినిధులు మాత్రమే రండి అంటారు. దాంతో వి.పి. సింగ్ ఈ దేశానికి దళితులు రాష్ట్రపతి కావాలని ప్రకటిస్తారు. దాని అనంతరం కె.ఆర్. నారాయణ ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా సేవలందించారు. 1991 లో డా॥అంబేద్కర్ శతజయంతి సంధర్భంగా ఆయనకు భారతరత్నను ప్రకటించడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంవత్సరం పాటు అంబేద్కర్ శతజయంతి వేడుకలు గణంగా నిర్వహించారు.

వృత్తుల కారణంగా కులాలేర్పడ్డాయని చెబుతారు. కానీ నేటి సమాజంలో కులాలు నానాటికీ బలీయంగా మారడం అహేతుకం. కులవ్యవస్థ వల్ల అనేక అవమానాలు ఎదుర్కొనే తమకు నేడు వృత్తులన్నీ కార్పోరేట్ చేతుల్లోకెళ్ళి బ్రతుకు భారమైందని 'కరిమింగిన వెలగ పండు' అనే కవితలో కో.ప్ర కుమ్మరి వృత్తిని గూర్చి -

"నా కులం ఇప్పుడు కరిమింగిన వెలగపండు
నా వీపున రాచపుండు
బాధ్యతలు తప్ప
హక్కులు లేని జీవితం
గాడిదకన్నా హీనం కదా
వృత్తికోసమే కులమని
నన్నిన్నాళ్ళూ వంచించిన అగ్రకులమా
నా కులవృత్తి విచ్ఛిన్నమైన నాడే
నా కులం విచ్ఛిన్నం కాకపోవడం ఎవడి కుట్ర" అని దళితుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసి అనుభవించే హక్కు లేకుండా, సమాజానికుపకరించే బరువు బాధ్యతల్ని కేటాయించడాన్ని తప్పుబట్టారు. ఈ విధంగా తాత్విక ఉద్యమాలు, చారిత్రక సంఘటనలు దళిత సాహిత్యం ఉద్యమంగా ఉధృతంగా రావడానికి మిక్కిలి ఉపకరించాయి.

ఆధార గ్రంథాలు :

1. మహాతి (నవలావిభాగం) డా॥అక్కిరాజు రమాపతిరావు
2. తెలుగులో కవితోద్యమాలు - సి.మృణాళిని
3. దళిత వాద వివాదాలు - జి. లక్ష్మీనరసయ్య
4. తెలుగు సాహిత్యంలో ఉద్యమాలు వాదాలు - ధోరణులు - డా॥ద్వానాశాస్త్రి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

డా॥ బోయి భీమన్న "పాలేరు" నాటకం – సుందరం పాత్ర చిత్రణ

– **సాలి రాజు,** యుజిసి జెఆర్ఎఫ్ పరిశోధక విద్యార్థి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

ప్రవేశిక :

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో నాటకం విశిష్టమైనది. ఇతర సాహిత్య ప్రక్రియలకన్నా నాటకం అధిక ప్రాధాన్యత కలిగినదిగా భావించవచ్చు. నాటకం దృశ్య కావ్యం కాబట్టి ప్రేక్షకుల యొక్క హృదయాలను రంజింపచేస్తుంది అందుకే నాటకం సమాహారకళ అయ్యింది. బోయి భీమన్న రాసిన నాటకాలలో పాలేరు నాటకం చెప్పుకోదగిన సాంఘిక నాటకం. బోయి భీమన్న పాలేరు నాటకాన్ని ఆధునిక దృక్పథంతో నాటక లక్షణాలలోని అన్ని అంశాలను సృశిస్తూ నాటి తరానికే కాక నేటి ఆధునిక తరాల వారిలో కూడా మార్పు తీసుకురావాలనే ప్రయత్నం హర్షించదగినది. అటువంటి దృక్పథంతో రాసిన నాటకంగా "పాలేరు" నాటకం చెప్పుకోవచ్చు. పాలేరు నుండి పద్మశ్రీ వరకు ఎదిగిన బోయి భీమన్న పాలేరు నాటకం ఒక విశిష్ట రూపకం, ఆకాలంలో వర్ణ వివక్ష అనేది అధికంగా ఉండేదని చెప్పవచ్చు. ఇప్పటికి ఈ ఆధునిక సమాజంలో ఉన్నప్పటికీ అనేక మంది కవులు తమ నాటకాల ద్వారా వివిధ రచనల ద్వారా అంటరానితనాన్ని నిరసిస్తున్నప్పటికీ దీనిని పూర్తిగా రూపుమాపలేకపోతున్నారు. నేటి సమాజంలో కులాంతర వివాహాలు చేసుకుంటున్న వారి సంఖ్య తక్కువగానే ఉందని చెప్పవచ్చు. నిమ్న కులాల వారు అగ్రకులాలవారిని వివాహం చేసుకున్నప్పటికి అగ్రకుల అహంకార జ్వాలలకు ఆహుతి అయినవారు కూడా ఉన్నారు. అటువంటి సమాజంలో జీవిస్తున్న మనకు పాలేరు నాటకంలోని సుందరం యొక్క పాత్ర ఈనాటి అగ్రకుల వర్గాల వారికి ఒక కనువిప్పుకావాలనే ఆశతో ఈ రచనను బోయి భీమన్న చేసారనేది స్పష్టమౌతున్నది. అటువంటి నాటకాలు నాటక సాహిత్య చరిత్రలో చాలా తక్కువగానే వచ్చాయి. సంఘ సంస్కరణ దృష్టితో ఎన్నో రచనలు వచ్చినా అనాటి వ్యవస్థలో కుల వ్యవస్థ ఊడలు పాతుకుపోయినట్టు అర్థమౌతున్నది. సమానత్వానికి బదులు అసమానత్వం, అగ్రవర్ణ ఆధిపత్యంలో స్థైర విహారం చేసింది. అందుకనే బోయి భీమన్న రాసిన పాలేరు నాటకం అప్పటి నుండి ఇప్పటివరకు అభ్యుదయ భావాలకు, ఆదర్శ భావాలకు అసలైన రూపకంగా నిలిచింది.

ఉద్దేశ్యం :

బోయి భీమన్న రాసిన పాలేరు నాటకం ద్వారా ఆధునిక సమాజానికి ఉత్తమమైన సందేశాన్ని ఇవ్వడం జరిగింది. ఈనాటకంలో కులనిర్మూలన ప్రధాన అంశంగా భావించి నిమ్నవర్గంవాడైన వెంకన్నకు అగ్రవర్ణం వాడైన సుందరం తన చెల్లిని ఇచ్చి వివాహం జరిపిస్తాడు. ఈ వ్యాసం యొక్క ముఖ్యఉద్దేశం సుందరం యొక్క సంస్కరణ దృక్పథం, ఆదర్శభావాలు, మానవీయ విలువలను గురించి ప్రధానంగా చెప్పవచ్చు.

సారాంశం :

బోయి భీమన్న రాసిన పాలేరు నాటకంలో 23 రంగాలు ఉన్నాయి. ఇందులోని స్త్రీల పాత్రలుగా అభ్యుదయ భావాలు కలిగిన వనబాల, ఆత్మాభిమానం కలిగిన నిమ్న వర్గానికి చెందిన సీత పాత్ర వివరించడమైనది. వీరితో పాటుగా పురుషపాత్రలైన కుబేరయ్య అనే కామాంధు పాలేరు అనె పుల్లయ్య మరొక పాలేరు వీరేశు పుల్లయ్య కొడుకు నాటకంలో కథానాయుడు అయిన వెంకన్న మరియు అభ్యుదయ దృక్పథాలు నిమ్న జాతుల పట్ల దయార్ధహృదయం కలిగిన ఉపకారి మరియు సుందరం పాత్రలు ఉన్నాయి. ప్రధానంగా ఈ పాలేరు నాటకంలో పాలేరుగా ఉన్న వెంకన్నను ఆదరించి డిప్యూటి కలక్టరుగా ఎదిగేందుకు ఎంతగానో కృషిచేసిన సుందరం పాత్ర అతిప్రధానమైన పాత్రగా చెప్పవచ్చు.

సుందరం పాత్ర - అభ్యుదయ భావాల చిత్రణ :

పాలేరు నాటకంలో డాక్టర్ బోయి భీమన్న అద్భుతంగా చిత్రించిన చక్కని పాత్ర సుందరం. ఈయన సంఘ సంస్కార ప్రియత్వాన్ని కోరుకున్నవ్యక్తి. సుందరం రైతువాడ గ్రామంలో ఒక సంపన్న కుటుంబానికి చెందిన కుమారుడు పెల్లెలకు పోదామని, పల్లెటూళ్ళే భారత భాగ్యమని నమ్మిన వ్యక్తి.

అతడు పాడిన పాటలలో అతని అభ్యుదయ భావాలను తెలుసుకోవచ్చు

పదరా పదరా, పల్లెలకు
పల్లెటూరేరా భారత బాగ్యము!
అజ్ఞానముతో, అధికారపు బహు
భారపు లోహపు పదముల కింద
క్రిమి కీటకముల మాదిరి నలిగే
కృషికుల, శ్రమికుల కాపాడుమురా!
పదరా, పదరా, పల్లెలకు
పల్లెటూరేరా భారత భాగ్యము
చీకటి కడుపున దాగిపోయి, ఈ
సృష్టి నిద్రపోయెడు నపుడైనా
విరతి యెరుంగనిగతి పర్విడు రవి
విధమున కార్యా సక్తుడవై ॥పద॥

సుందరం మంచి పాటగాడు మరియు గొప్ప సంఘ సంస్కార భావాలు గల యువకుడు. కుబేరురావు ఇంటి పక్కవాడైనా, ఒకే కులం వాడైనా అతడి నీచ భావాలను సుందరం ఎప్పుడూ మెచ్చుకోలేదు. ఆదర్శ ఉపాధ్యాయుడైన ఉపకారి మాష్టారు విద్యాప్రబోధాన్ని ఆయన నిరంతర కృషిని సుందరం ఎల్లప్పుడూ మెచ్చుకునే వాడు. పల్లెల్లో విద్య, వైద్య, నివాస సౌకర్యాలు కల్పించినపుడు మాత్రమే ప్రజలు పల్లెలకు పరుగులు తీస్తారని సుందరం గట్టినమ్మకం.

తన చెల్లి వనబాల అంటరానివాడితో అంటకాగుతున్నా సహించగల పరపక్వతకలిగిన అసాధారణ వ్యక్తి సుందరం. వెంకన్న బాగా పాడుతాడని చెల్లి చెప్పగా వెంకన్నను అడిగి మరి పాడించుకుని ఉప్పొంగిపోయాడు. వెంకన్న చదువు కోసం కాకినాడ అనాధశరణాలయానికి వెళ్ళడానికి సహాయం చేయమని వనబాల తన అన్న సుందరాన్ని కోరినప్పుడు, సుందరం దగ్గరుండి వెతికి మరి వెంకన్నను అనాధ శరణాలయంలో చేర్పించాడు. శరణాలయం మేనేజరు రామంతో ప్రత్యేకంగా మాట్లాడి ప్రైవేటుగా వెంకన్నచే మెట్రిక్ కట్టించాడు. తరువాత గ్రాడ్యుయేట్ అయ్యి డిప్యూటి కలెక్టర్ కావడంలో సుందరం కృషి చెప్పలేనిది. క్రమంగా సుందరానికి వనబాల ప్రేమ విషయం తెలుస్తుంది. సంఘసంస్కార భావాలుగల ఆదర్శవంతుడైన సుందరం అస్పృశ్యుడైన వెంకన్నకు తన ముద్దుల చెల్లెలను ఇచ్చి కులాంతర వివాహం జరిపించిన ఘనుడు. అలాంటి సుందరం లాంటి యువకులు నేటి సమాజానికి ఎంత అవసరమో పాలేరు నాటకంలో చాలా ఆధునిక దృక్పథం, అభ్యుదయ భావాలు మేళవింపుతో బోయి భామన్న గారు చిత్రీకరించారు.

పాలేరు నాటకం నాటికి కులాంతార వివాహాలు జరిగేవి కావు. ఏ కులం వారు ఆ కులంలోనే వివాహం చేసుకోవాలి. అలా కాకుండా ఇతర కులాల వారిని వివాహం చేసుకుంటే వివాహం చేసుకున్న వారిని ఆ ఊరి నుండి వెలివేసేవారు. అంటరానితనం అనేది ఆనాడు మల్లెతీగలాగా సమాజానికి అల్లుకొనిఉండేది. ఉన్నత కులాలవారు దళిత స్త్రీల మానాలను దోచుకునే వారు. అనేక చిత్రహింసలకు గురిచేసేవారు. అంతేగాని వారిని పెండ్లిమాత్రం చేసుకునేవారు కాదు. పశువులకంటే హీనంగా చూసేవారు. దళితులు ఉన్నత కులాలవారిని కన్నెత్తికూడా చూడడానికి వీలులేదు, అలా చూసినట్లైతే వారిని నికృష్టంగా హింసించేవారు. ప్రాణాలు తీసి పాతిపాతరవేసే వారు. నేటికి కొన్ని ప్రాంతాలలో ఇలాంటి దౌర్భాగ్య సంస్కృతి ఉంది.

పాలేరు నాటకంలో ఉన్నత కులానికి చెందిన వనబాల పంచమ కులానికి చెందిన వెంకన్నను ఇష్టపడు

తుంది. వీరిద్దరు పరస్పరం ఒకరినొకరు ప్రేమించు కుంటారు. వీరిద్దరి వివాహానికి అనేక అవాంతరాలు, ఒడిదుడుకులు ఎదురౌతాయి. వనబాలకు సుందరం మిత్రుడైన రామంతో పెండ్లి నిశ్చయమౌతుంది. సుందరం వనబాల వెంకన్నల మధ్య ప్రేమ విషయం తెలుసుకుని వనబాల వెంకన్నలకు పెండ్లి చేసి తనలోని అభ్యుదయ భావాలను నిమ్నజాతులపట్ల అగ్రకులాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే ప్రయత్నంచేస్తాడు.

ముగింపు :

పాలేరు నాటకం ద్వారా ఆధునిక సమాజంలో మార్పు కోరుతూ కులం అడ్డుగోడలు అనే అవాంతరాలను కూలగొడుతూ సమసమాజ నిర్మాణాన్ని నిర్మించాలనే ఉన్నత భావాలతో బోయి భీమన్న తన రచనల ద్వారా ఈ సమాజానికి గొప్ప సందేశాన్నిచ్చి సంస్కరణవాదిగా నిలిచాడు.

ఆధార గ్రంథాలు :

1) పాలేరు నాటకం - డా॥ బోయి భీమన్న
2) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"దళితులు అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తులు తత్త్వం"

– గెడ్డాల జనకిరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

భారతదేశం విభిన్న భౌగోళిక స్థితులు కలిగిన దేశం. అదే విధంగా విభిన్న మతాలకు నిలయం గల దేశం. అవి : హిందు, క్రైస్తవ, సిక్కు, ముస్లిం, బౌద్ధ, జైన మొదలైన మతములు కలవు.

ప్రాచీన భారతదేశంలో క్షత్రియులు, బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు అనే తెగలుగా వుండేవి. శూద్రులలో ఒక తెగ నేడు దళితులు అనే భావంతో వాడటం జరుగుతుంది.

వాల్మీకి రామాయణంలో శంభూకున్ని శూద్రుకుడు అనే నెపంతో వదించడం జరిగింది. అంటే ప్రాచీన కాలంలోనే శూద్రుకులు పైన చిన్నచూపు వున్నది అని మనకు అర్థం అవుతుంది. వీరు యుగయుగాలుగా, తరతరాలుగా నేటికి కూడా కొంతమంది దళితులు కూటికి, గుడ్డకి, గూడికి నోచుకోక ఎన్నో స్థితిగతి బాధలు అనుభవిస్తు జీవిస్తున్నారు. అనటంలో అతిశయోక్తి లేదు. వీరు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా, భౌతికంగా హీనాతిహీనంగా జీవిస్తున్నారు.

రాజులు కాలంలో వీరు భాదలు వర్ణణాతీతంగా వుండేది. బ్రిటీష్ పరిపాలన కాలంలో కూడా ఎన్నో స్థితిగతి బాధలు అనుభవించేవారు. నేడు ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య పరిపాలన వచ్చినప్పుడు నుండి ఆధునిక ప్రభుత్వంలో వెనుకబడిన వారి కోసం కొన్ని ప్రత్యేక సౌకర్యములు కల్పించడం జరిగింది. అందులో ఏమనగా పనికి ఆహార పధకం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నిరుపేదలకు ఇల్లు కూడా ప్రభుత్వం కట్టి ఇవ్వడం జరుగుతుంది. ఇలా ప్రభుత్వాలు ఆదుకోబట్టి సమసమాజ స్థాపించక పోయినప్పటికి రోజు వారి జీవనంగా వీరు బతుకు సాగుతూ వుంది.

ప్రాచీన కాలంలో వీరిని దేవాలయంలోకి అడుగు పెట్టనిచ్చేవారు కాదు. కానీ అటువంటి సందర్భంలో కూడా తెలుగు సాహిత్యంలో పాల్కురికి సోమనాధుడు. పండితారాధ్య చరిత్ర, బసవ పురాణం ద్వారా అట్టడుగు వర్గాలు వారిని కూడా తన సాహితీ ప్రస్థానంలో వీరికి ప్రముఖ స్థానం ఇవ్వడం జరిగింది.

16వ శతాబ్ధికి చెందిన శ్రీ కృష్ణదేవరాయలుచే రచించ బడిన "అముక్తమాల్యద" కావ్యంలో "మాలదాసరికి" ప్రముఖ స్థానం కల్పించబడింది.

అన్నమయ్య తన కీర్తనలోని "నిండైన రాజు నిద్రించే నిద్ర ఒకటే, బంటు నిద్ర కూడా ఒకటే" అని సమ సమానత్వం గూర్చి తెల్పుతుంది.

వేమన శతకంలోని కులమతాలు గురించి కూడా దూషించాడు. ఆచారము పేరిట దళితులను అంటరాని వారిగా చూసి వేమన

"మాలవాని నేల మరిమరి నిందింప, ఒడలు నున్న మాంస మొక్కటి గాదె, వానిలోన వెలుగు వాని కులంచే" అని మానవతావాదం చూపించును.

"మాలమాలగాడు మహీమదనే ప్రొద్దు, మాట తిరుగువాడు మాలగాక వాని మాలయన్నవాడె పొస్తెను మాల" అని కులవ్యవస్థను ఖండించాడు.

పోతులూరి వీరబ్రహేంద్రస్వామి కూడా "అన్న మయమ్ములైన వన్ని జీవమ్ములు కూడు లేక జీవ కోటి లేదు కూడు తిను కాడ కుల బేదంబు లెందుకో" అని కులమతాలను నిందించి అందరూ తినేది అన్నము ఒక్కటే కథ అని వెలుగెత్తి చెప్పెను.

గురజాడ అప్పారావు గారు "లవణరాజు కల"లో వర్ణధర్మమూ అధర్మ అని చాటుచు...

"మంచి చెడ్డ మనుజులందున యెంచి చూడరెండె కులములు. మంచియన్నది మాలయైతే, మాలనే అగు

దునే" అని గురజాడ భూమ్మీద మంచివారు, చెడ్డవారు తప్ప ఇన్ని కులాలు లేవు అని పేర్కొనటం జరిగింది.

"మనిషి చేసిన రాయీరప్పకు మహిమ కలదని సాగి మ్రొక్కుచు, మనుషులను రాయిరప్పలకంటే హీనముగా చూచెడి వారిని ఖండించెను".

తెలుగులో మొట్టమొదటి దళిత కవిగా గుర్రం జాషువను చెప్పుకోవచ్చు. ఈయన గబ్బిలం కావ్యంలో ఒక పూరి గుడిసెలో దీపపు బుడ్డీ వెలుగులో వున్న ఒక దళితున్ని కథానాయకుడుగా స్వీకరించును.

ఈ కావ్యంలో భారతదేశంలోని ప్రసిద్ధమైన ప్రదేశములు చక్కగా వర్ణించడం జరిగింది.

తెలుగులో అంతవరకు కూడా కథానాయకున్ని అగ్రవర్ణాలకు చెందిన వారుగా వుండేవారు కాని జాషువా ఒక దళితున్ని కథానాయకుడుగా ఎన్నుకోవడం జరిగింది.

మంగిపూడి వెంకట శర్మగారు "నిరుద్ధ భారతం"లో అస్పృశ్యతా నిర్మూలనాన్ని కాంక్షించి వాల్మీకి, వ్యాసుడు, పరాశరుడు, అరుంధతి మొదలైన వారంతా నిమ్నజాతులు వారేనని సోపయుక్తంగా విపులీకరించెను.

ఏకలవ్యుడు వంటి పాత్రలు దళిత కవులకు ఆదర్శ పాత్రమయ్యాయి. దళితోద్యమంలో కలం పట్టిన ప్రతి కవి పురాణాలను పునర్ వ్యాఖ్యానించడానికి, వాటిని తిరిగి వ్రాయడానికి ప్రయత్నించారు. నేర్వని విద్యకు గురువు బొటన వేలును ఏకలవ్యుడు సమర్పించుకుంటే ఆధునిక కాలంలోనూ ఇలాంటి ఏకలవ్యుల ఘటనలు జరుగుతున్నాయని సతీష్ చందర్ "పంచమ వేదం" కవిత నిరూపిస్తుంది.

"నేనెన్నిసార్లు లెక్క పెట్టుకున్న
నా చేతికి నాలుగు వేళ్ళే ఉండేవి
నాన్నకు ఐదో వేలు లేకనే
మీరు గుండు సున్నాలు చుట్టిన ప్రొగ్రెస్ కార్డు మీద
ఎప్పుడు వేలి ముద్రలు వేయలేదు..."

పంచముడు అంటే ఐదవ వ్రేలు లేనివాడు అని అర్థం అయింది అంటూ సతీష్ చందర్ ప్రశ్నించాడు. ఆధునిక కాలంలో కూడా విద్యావ్యవస్థలో దళితులు ఎదుర్కొంటున్న వివక్షతను ఈ కవిత ద్వారా అద్దం పడుతుంది.

ఆకలి, దారిద్ర్యం, కులవివక్ష ఎదుర్కొంటున్న దళిత స్త్రీలు పనిమనుషులుగా మిగిలిపోతున్న విషాదాన్ని జి.విజయలక్ష్మి "పనిపిల్ల" కవితలో ఈ విధంగా వ్యక్తం చేసెను.

"కళ్లు తెరిచినప్పటి నుండీ
కన్నీళ్ళే కళ్ళల్లో నింపుకున్నదాన్ని
అమ్మా అమ్మకి బదులు
దొరాదొరసానీ అని ఏడ్చిందాన్ని
కడుపునిండా తిన్నది కలలోనే
కులమే నా రంగు
కటిక దరిద్రమే నాకొంగు
కింది మెట్టే నాబతుకు"

ఈ విధంగా దలితులు వంశపర్యవసానంగా దొరసాని ఇంట్లో పని మనిషిగా జీవనం గడుపుతూ అమ్మకి బదులు దొరసాని దొరసాని అనే విధంగా వీరు బ్రతుకు సాగుతుంది.

బోయి భీమన్న దళితులు ఉద్ధరణ కోసం ఎన్నో రచనలు చేసెను. అందులో ముఖ్యమైనవి. "గుడిసెలు కాలిపోతున్నాయి" కావ్యం, "పాలేరు" నాటకం. ఆ రోజుల్లో ఎంతమంది దళితులు పూట కూడు కోసం పాలేరుతనంగా వుండేవారు. ఈ నాటకం చూసాకా ఎంతో మంది యువకులు పాలేరుతనం మాని చదువుకొని క్రొత్త జీవితం ప్రారంభించారు. అంటే అతిశయోక్తి లేదు.

కుసుమ ధర్మన్న "హరిజన శతకం"లో హరిజనులు యొక్క సాధక భాదలు వర్ణించడం జరిగింది.

కారంచెడు, చుండూరు, లక్ష్మీపురం సంఘటనలు ఎంతోమంది హృదయాలను కదిలించాయి. ఈ సంఘటనలను ఎంతోమంది కవులు, కవితలు, బుర్ర కథలు రూపంలో కూడా పేర్కొనడం జరిగింది.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో కొలకలూరి ఇనాక్, కత్తి పద్మారావు, కొండపల్లి సుదర్శనరాజు, ఎండ్లూరి సుధాకర్ మొదలైన వారు ఎన్నో రచనలు చేసి తమ గళం, కళం విప్పి దళితులను చైతన్యపరిచెను.

భారతదేశంలో ఆధునిక కాలంలో మొట్టమొదటి సారిగా జ్యోతిబాపూలే దళితవాదాన్ని, దళిత సాహిత్య వాదాన్ని, దళిత తత్త్వ శాస్త్రాన్ని రూపొందించెను. 1873-74 సం॥లో "సత్యశోధక సమాజం"ను స్థాపించెను. గులాంగిరి, పూజారితత్వం బయటపడింది. మొదలైన రచనలు చేసి దళితులు పెళ్ళిళ్ళకు దళితులే పురోహితులుగా వుండాలని గట్టిగా వాదించి నమ్మిన వ్యక్తి పూలే.

అయితే పూలే సిద్ధాంతాన్ని డా॥ బి.ఆర్. అంబేద్కర్ బాగా అవగాహన చేసుకున్నారు. ఫలితంగా దళితులకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతంగా సమసమాజ నిర్మాలన కావాలి అని ఎంతో తాపత్రయ పడిన వ్యక్తి అంబేద్కర్.

1924లో అస్పృశ్యత నివారణోద్యమం మొదలుపెట్టిన అంబేద్కర్ జాతీయ స్వాతంత్ర్యం కన్నా అస్పృశ్యుల విముక్తికి ఎక్కువుగా పాటు పడెను.

దళితులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్ళాలంటే చదువు ముఖ్యమని చదువుతో అన్ని పనులు చేసుకోవచ్చు. దళితులు బాగుపడాలన్నా, తమకు జరిగిన అన్యాయాల్ని ఎదుర్కోవాలన్నా విద్య అవసరం. ఎప్పుడు చదువు వస్తుందో అప్పుడే పోరాడే శక్తి కలుగుతుంది. అప్పుడు అందరూ ఏకమై తమ హక్కుల సాధన కోసం, న్యాయం కోసం పోరాడవచ్చు.

భారతదేశంలో కులవ్యవస్థ పోవాలంటే వర్ణాంతర వివాహాల్ని ప్రోత్సహించాలి. మనదేశంలో తప్ప ప్రపంచంలో ఎక్కడా కులవ్యవస్థ లేదు.

ఈ విధంగా అంబేద్కర్ తెచ్చిన రాజ్యాంగం నేటికి అమలు అవుతుంది. అంటే ఆయన కృషి అనితర సాధ్యం అని మనకు తేటతెల్లంగా కన్పిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1) తెలుగులో సాహిత్య సమీక్ష - జి. నాగయ్య
2) తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న
3) తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చండాల చాటింపు కవిత సంకలనంలోని దళిత వాదం

– జి. రమేష్ బాబు, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

నాగప్పగారి సుంద్రరాజు దళిత కవి, రచయిత, కథకుడు, దళిత సాహితీ వినీలాకాశంను నీలి మెరుపులు మెరిపించి, కొత్త గొంతుక వినిపించి, దళిత సాహిత్యానికీ కొత్త ఊపిరీ ఊదినాడు. తరతరాలుగా అణచివేతను, అవమానలను ఎదుర్కొనే మాదిగ ప్రజలు ఎలా దుర్భర జీవితాన్ని గడుపుతున్నారో తన కలం ద్వారా అక్షరీకరించాడు. దానికీ వ్యతిరేకంగా అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని పోరాటం చేశాడు. మాదిగల భాష, యాస, సంస్కృతి ఆయన కవిత్వంలో మనకు సజీవంగా కనిపిస్తాయి. తెలుగు దళిత కథకు పితామహుడు అయిన కొలకలూరి ఇనాక్ బడినుంచి కవిత్వం నేర్చుకున్నాను అని సగర్వంగా చెప్పుకునే వారు సుంద్రరాజు. సుంద్రరాజు 1968 మే 30 కర్నూలు జిల్లా ఆలూరు తాలుకా మొలగ నెల్లి కొట్టాంలో పెద్ద నర్సమ్మ, రంగన్నలకు జన్మించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిలో పులికంటి కృష్ణా రెడ్డి దళిత కథలపై ఎం.ఫిల్., పిహెచ్.డి. పరిశోధనాలు చేసి అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సహాయాచార్యునిగా పని చేశారు. ప్రస్తుత కవిత సంకలనం చండాల చాటింపు 1996లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా వున్నప్పుడు రాశాడు. నిజాల నిప్పుల తప్పెటను వాయిస్తు చాటింపు వేశాడు.

మాదిగ దండోరా ఉద్యమ ప్రభావంతో స్ఫూర్తితో దీనిని రాశాడు. కులం లేని వాళ్ళ కూతే చండాల చాటింపు అన్నాడు సుంద్రరాజు. సువార్త అనే కలం పేరుతో దీనిని రాశాడు. ఒక చైతన్యవంతమైన భావస్ఫూర్తి దీనిలో అడుగడుగునా కనిపిస్తుంది. దళిత గొంతుక ధ్వనిస్తుంది.

"ఊరవతల ఉండమంటే
ఊరు ఎవరిదీ అని ప్రశ్నిస్తాను
చెప్పులు చేతికి తీసుకోమంటే"
బూట్లు తోడుక్కునీ మరీ ఎందుకనీ ప్రశ్నిస్తాను"

అని కుల అహంకారులపైన తన కలంతో తిరుగు బాటు చేశాడు. ఆవుల్ని దేవతలుగా పూజించే హిందూ సంస్కృతిలో మాదిగలకు ఆ పశువులకు ఇచ్చిన విలువ కూడ ఇవ్వకపోవడం ఎంత దారుణామో అని దానిని కూడా వ్యతిరేకించాడు.

"దారిద్ర్యం తీరాలంటే
ఆవు కడుపు కోయాల్సిందే
నోరు ఎరుపెక్కేడానికి
మనం వేట మొదలెట్టాలి
ఆవు కడుపు కోయ్యాలి
గోరోజనం పట్టాలి".

అని కవిత్వీకరించి మానవజాతికీ అన్ని స్వేచ్ఛలలో కెల్లా ఆహార స్వేచ్ఛ ముఖ్యమైనది. కొన్ని కాషాయ శక్తులు గోవధ నిషేదం పేరుతో దళితుల పైన జరిపేదాడులను సుంద్రరాజు ఖండించాడు. వెజిటేరియన్ టెర్రరిజమ్ పైన విరుచుకుపడ్డాడు. దేశానికీ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నెళ్ళైన మారుమూల పల్లెల్లో దళితులపై కులం పేరుతో చూపిస్తున్న వివక్షతను తన కవిత్వం ద్వారా ఖండించాడు.

"కుళ్ళి కంపు కొడుతున్న కులాన్ని చూసి
ముక్కుమూసుకునే మునీశ్వరునీకాదు
చెప్పులు కుట్టిన చేత్తో చరిత్రను రాస్తా
అవమానింపబడ్డ అరికాళ్ళకు అధికార మిస్తా".

అంటూ అంటరాని బ్రతుకులు అక్షరంను అందు కున్నప్పుడే వారికీ రాజ్యాధికారం వస్తుంది. వాళ్ళ బ్రతుకులు బాగుపడతాయి అని రాజ్యంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ యొక్క దళితుల రాజ్యాధికార కల నెరవేరుతుందని ఆకాంక్షించాడు. ఈ వివక్షత అగ్ర

వర్ణలలోనే కాదు దళితులలో కూడ సాటి దళితుల మీద, దళిత ఉపకులాల మీద వివక్షత చూపుతున్నారో వివరించాడు.

"మాలోళ్ళు కూడా మాకంటే పెద్దోళ్ళనంటా
మాదిగ్గేర్లోకి ఎవరూ రా రంట".

మాలవాళ్ళు మాదిగలపైన చూపించే వివక్షతను ఖండించి అన్నదమ్ములు లాగా ఐకమత్యంగా జీవించాలి అన్నారు. దళితుల జీవుల బ్రతుకు మూలాల్లోకి వెళ్ళి అందులో వున్న లోతులను చూసి ప్రపంచం గుర్తించ కుండా మరుగునపడిన వాళ్ళ జీవితాలను సమాజానికి పరిచయం చేశాడు. మాదిగ జాతిని ఈ సమాజం అంటరాని జాతిగా చేసి అవమానిస్తున్న తీరును తన కవిత్వంతో వెలికి తీసి బాహ్యప్రపంచానికి చూపించాడు.

"పెద్దింటి దానా! నిన్నెవడు చేసుకుంటాడే అని
బ్యాగారోడు అన్నప్పుడే
బతకరాదు అనుకున్నాను
అప్పటికి కాని నాకు అర్థం కాలేదు
ఈ దేశంలో నేను మనిషినికానని
అంటరానితనంకు ఆఖరి రూపం నేనే"

ఒక దళిత స్త్రీ ఆవేదనకు, ఆర్తనాదంకు అక్షర రూపంను ఇచ్చి ఈ దేశం ఇకనేనా వాళ్ళను మనుషులుగా చూడాలి అని ఆకాంక్షించాడు. ఈ కవిత్వం ద్వారా అతనిలో వున్న ప్రజాస్వామికత, చైతన్యపూరితమైన అతనిలోని భావజాలం మనకు తెలుస్తుంది.

"నా పాట నేనే పాడుకుంటూ
మాదిగ పాటను ఇంకా మధురంగా పాడుకుంటా"

అని ఒంటరిగానైనా తన పోరాటం తాను చేస్తానని తనని ఈ సమాజం తక్కువ. చేసినందుకు ఈసడించి కున్నందుకు బాధపడుతూ కూర్చోనని చైతన్య జ్వాలలు రగిలించి తన జాతినీ ప్రగతి పథంలో పయనింప చేస్తాననీ చీకటిలో మగ్గిపోతున్న తన జాతి చరిత్రకు వెలుగు దారులు చూపిస్తానని పేర్కొన్నాడు.

"భరతమాతకు ముద్దుబిడ్డను
కానీ భారతీయులకు అస్పృశ్యుడను"

భారతదేశం తనను తన కుమారునిగా స్వీకరిస్తుంది. కానీ భారతీయులు తనను సహోదరునిగా గుర్తించడం లేదని అంటరానివాడిగా చూస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశాడు.

"నా జాతిని అనాదిగా అవమానిస్తున్న
ఆర్య సంస్కృతి అంతరించనిదే
అందరూ ఒక్కరున్నది ఒట్టిమాట
పేదల బాధలన్నీ ఒకటికాదు
కులం నీలా నిలువెత్తు ప్రశ్న"

కులం మానవులలో అసమానతలకు, అనైక్యతలకు ప్రథమ కారణం సమాజంలో ఎన్నో వందల సంవత్స రాలుగా వేళ్ళులుకున్నా ఈ కుల వ్యవస్థను అంతం చేయటానికి, బౌద్ధ, జైన, శైవమతాలు లాంటి ఎన్నో మతాలు ఇంకెన్నో సామాజిక ఉద్యమాలు ఎందరో వ్యక్తులు పోరాటాలు చేశారు. కానీ అది అంతంకాలేదు. రోజు రోజుకీ కుల వ్యవస్థ పెరుగుతూనే ఉంది. ఈ కులవ్యవస్థకు మూల పునాదులు మనుధర్మం, ఆర్య సంస్కృతి అని వాటిని అందరూ వ్యతిరేకించాలని కోరుకున్నాడు.

"ఆర్యులు అణచివేసిన
సజీవ సమాధులం దళితులం"

అని ఆయన ఆర్య సంస్కృతిపై ధ్వజమెత్తినాడు. విద్యార్థులకు విద్యను అందించే విశ్వవిద్యాలయాలలో కూడ కులవ్యవస్థ నశించాలని కోరుకున్నాడు. నేటి నుంచి కవిత్వం ఇక మాదిగవాడల నుండి ప్రవహిస్తుందని మాదిగ భాషే మాట్లాడుతుంది. ఇదే చండాల చాటింపు అని ఆనాడు సుందర్రాజు ఇచ్చిన ఈ సందేశం భావి తరాల కవులకు స్ఫూర్తిని ఇచ్చింది - ఆంధ్రదేశం నలుదిక్కులా దళిత జాతిలో చైతన్యాన్ని రగిల్చింది. ప్రగతి పథంలోకి నడిపింది.

నిండు నూరేళ్ళు జీవించవలసిన సుందర్రాజు అర్థాంతరంగా మరణించడం చాలా విచారకరం. ఈయన 2000 జూలై 17 కారంచేడులో దళితుల ఊచకోత కోసిన రోజునే ఆయన కూడ ఆత్మహత్య చేసుకుని మరణిం చాడు. డప్పుకొట్టి మరీ మాట్లాడిన మాదిగ తత్వం మూగబోయింది. ఆయన ఆత్మహత్య చేసుకోవడం ఏమిటనీ సాహితీవేత్తలు అందరూ దిగ్భ్రాంతీ చెందినారు. ప్రొఫెసర్ దార్ల వేంకటేశ్వరరావు సుందర్రాజుపైన ఒక మంచి పుస్తకాన్ని తీసుకొచ్చారు. దాని పేరు ''ఒక మాదిగ స్మృతి'' పుస్తకం రాశారు. సుందర్రాజు జీవితాన్ని తెలుసు కోవటానికి ఇదే ఆధారం. ఆయన మరణించి ఆయన కవిత్వం ఎప్పటికీ బ్రతికే వుంటుంది.

ఆధార గ్రంథాలు :

1. ఒక మాదిగ స్మృతి - ప్రొఫెసర్ దార్ల వేంకటేశ్వరరావు
2. చండాల చాటింపు - నాగప్పగారి సుందర్రాజు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – డాక్టర్ అంబేద్కర్ ప్రభావం

– వెంకటలక్ష్మి చెరుకూరి, ఎస్.ఏ తెలుగు, జడ్.పి.హెచ్.ఎస్, గౌరీపట్నం.

హరిజన, గిరిజన, వెనుకబడిన మైనార్టీ వర్గాలకు సంబంధించిన జీవిత విధానానికి సంబంధించిన సాహిత్యం దళిత సాహిత్యం అవుతుంది. దళితవర్గాల అభ్యున్నతి కోసం అగ్రవర్ణాల వారు సృష్టించిన సాహిత్యం కూడా దళిత సాహిత్యమే అవుతుంది. అయితే దళితేతరులు సృష్టించిన సాహిత్యం కన్నా, దళితులు సృష్టించిన సాహిత్యం వాస్తవ రూపానికి అద్దం పడుతుంది అని చెప్పవచ్చు. ఆయా సమస్యల్ని అనుభవిస్తున్న దళితుడి అభివ్యక్తిలోనూ, ఆత్మాశయ రీతిలోనూ ఘూడత చోటు చేసుకుంటుంది. అందుకే దళిత సాహిత్యాన్ని దళితులే సృష్టించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాల్సి ఉంది. అంతమాత్రాన దళితేతరులు దళిత స్పృహతో సృష్టించిన సాహిత్యం దళిత సాహిత్యం కాకుండా పోదు. క్రీస్తుపూర్వం నుంచే సాంఘిక అసమానతలపై బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం, భక్తి ఉద్యమం పోతులూరి వీరబ్రహ్మం, సిద్ధప్పల తత్వాలు ఎదురు తిరుగుతూనే ఉన్నాయి. ఆధునిక కాలంలో జ్యోతిబాపూలే, నారాయణ గురు, సాహుమహరాజ్, పెరియార్, ఇ.పి.రామస్వామి నాయకర్ మొదలైన వారు చేసిన పోరాటాలు దళిత ఉద్యమాలకు తాత్విక పునాదిగా నిలిచాయి. తర్వాత డాక్టర్ అంబేద్కర్ క్రీస్తు పూర్వం నుండి తన వరకు బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్ని ఆకళింపు చేసుకున్నారు. అంతేకాకుండా ప్రపంచంలోనే ఆయా జాతుల చరిత్రలని, పరిణామాల్ని లోతుగా పరించారు. అందువల్లనే ఆయన దళిత ఉద్యమాలకు తాత్విక పునాదిగానేకాకుండా, సహేతుకమైన ఉద్యమ వ్యూహరచనకు శ్రీకారం చుట్టగలిగారు.

డాక్టర్ అంబేద్కర్ దేశవ్యాప్తంగా దళితుల సమస్యల కోసం పోరాడుతూ హిందూమత నమ్మకానికి, సాంఘిక వ్యవస్థ విచ్ఛిన్నానికి కారణం మనుధర్మశాస్త్రము అని ధ్వజమెత్తాడు. అంతేకాకుండా పత్రికాముఖంగా ప్రకటన చేసి దాన్ని సమర్థించే వారిని ఛాలెంజ్ చేసి 1927 డిసెంబర్ 25వ తేదీన నడివీధుల్లో పెద్ద జన సమూహం సమక్షంలో తగలబెట్టారు. దీంతో దేశంలోని మేధావుల్లో ఒక కదలిక వచ్చింది. ఈ సంఘటన మత భావనలను, ఆచారాల్ని, నమ్మకాల్ని సహేతుకంగా అంచనా వేయడానికి శాస్త్రీయ దృక్కోణంలో ఆలోచించడానికి అనేక మందికి మార్గదర్శకమైంది. డాక్టర్ అంబేద్కర్ మొదటి, రెండవ రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరై దేశ స్వాతంత్ర్యం కంటే నాకు దళితుల శ్రేయస్సే ముఖ్యం అని నిమ్నజాతుల పక్షాన రక్షణదుర్గమై నిలిచాడు. దాంతో అంబేద్కర్‌ను దళితులకు తిరుగులేని నాయకుడు గానే కాకుండా ఒక గొప్ప మేధావిగా ప్రపంచం గుర్తించింది.

ఇండియా కార్మికమంత్రి పదవిని అలంకరించడం, భారతరాజ్యాంగ నిర్మాణాన్ని చేపట్టి విజయవంతంగా పూర్తి చేయడం, తొలి న్యాయశాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించడంలో అంబేద్కర్ ప్రతిభ దేదీప్యమానంగా వెలిగింది. ఆ వెలుగు అన్ని రాష్ట్రాల్లోనికి, గ్రామాలకు సహితం వ్యాపించి దళిత ఉద్యమానికి దారులు చూపింది. అంబేద్కర్ ఆలోచనలే దళిత సాహిత్య సిద్ధాంతాలుగా పేర్కొనవచ్చు. దళిత ఉద్యమంలోనైనా, దళిత సాహిత్య ఉద్యమంలోనైనా చోటుచేసుకునే అంశాలన్ని అంబేద్కరిజం లోనివే. విద్యావంతులను చేయండి, సంఘటితపరచండి, అందోళన జరపండి అన్న అంబేద్కర్ త్రిసూత్ర పథకం ఎంతో విప్లవ గర్భితమైంది. అన్ని సమస్యల్ని అధిగమించడానికి ఉపకరించేవి. ఏ సాహిత్యమైనా ఆయా పరిస్థితులను బట్టి అనేక ప్రభావాలకు లోను కావాల్సిందే. వివిధ కాలాల్లో వచ్చిన ప్రముఖ సాంఘిక దృక్పథాలు సిద్ధాంతాలు, ఉద్యమాలు సాహిత్యంలో చేర్చుకోవడం సర్వసాధారణం. అదే విధంగా

ఉద్యమకారులైన వ్యక్తుల ప్రభావం కూడా సాహిత్యం పై అమితంగా ఉంటుందనేది అక్షర సత్యం. ఆధునిక సమాజంలో దళితుల సాంఘిక, సంస్కృతిక, సాహిత్య ఉద్యమాలు అన్నీ డాక్టర్ అంబేద్కర్ సిద్ధాంతాల ఆలంబనగానే వచ్చాయని చెప్పవచ్చు. డాక్టర్ అంబేద్కర్ పై వచ్చిన రచనలు విశ్లేషిస్తే దాదాపు అన్ని ప్రక్రియల్లోనూ ఆయన జీవితం, ఆయన సిద్ధాంతాలు ఆవిష్కరించ బడ్డాయి అనేది తేట తెల్లమవుతుంది.

కావ్యాలు, ఖండకావ్యాలు, ఖండికలు, శతకాలు, కవితలు, గీతాలు, పాటలు, బుర్రకథలు, హరికథలు, రూపకాలు, జీవిత చరిత్రలు, సిద్ధాంతగ్రంథాలు మొదలైన సాహితీ రూపాల్లో అంబేద్కరిజం రూపుకట్టి దళిత చైతన్యానికి దారుల వేసింది. డాక్టర్ అంబేద్కర్ ఉద్యమ జీవితానికి ప్రభావితులై, ఆయన చరిత్రను ఇతివృత్తంగా తీసుకుని అనేక మంది కావ్యసృష్టి చేసారు అనడంలో సందేహం లేదు. మొదటి తరంలో అంబేద్కర్ ప్రభావంతో రచనలు చేసిన ప్రముఖులలో కుసుమ ధర్మన్న, పద్మశ్రీ బోయి భీమన్న, రావూరి ఏకాంబరం, కత్తి పద్మారావు పేర్కొనదగిన వారు.

కుసుమ ధర్మన్న అంబేద్కరిజమ్‌ని వ్యాప్తి చేయడానికి జయభేరీ పత్రికను స్థాపించారు. వీరు రాసిన "మాకొద్దీ నల్లదొరతనము" అనే గీతంలో కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల్ని బ్రాహ్మణవాదంలోని కుట్రని నిశితంగా విమర్శించడం అంబేద్కర్ ప్రభావంతోనే.

శాస్త్రాలు వేదాలు చదివినట్టి గొప్ప శాస్త్రులమని చెబుతారు
విద్యావంతులమని పలుకుతారు గొప్ప కవులమని చెబుతారు
శాస్త్ర ధర్మాలు ఎన్నో చాటేరు నర్వజనులన్న దమ్ములంటారు
మమ్ము మాల మాలను మాట మామూలు దప్పారు
మాకొద్దీ నల్ల దొరతనం మాకు పదిమందితోపాటు పరువు గలగకయున్న

అంటూ జ్ఞానవంతులుగా చలామణి అవుతూ, అజ్ఞానంగా ప్రవర్తించే వారిపై కవితా కొరడాలు ఝుళి పించారు. 1933లో హరిజన శతకమును ఆ తర్వాత నల్లదొరతనము రాశారు. ఇది గరిమెళ్ల సత్యనారాయణ గారి మాకొద్దీ తెల్ల దొరతనమునకు వ్యతిరేకంగా రాసినది. స్వాతంత్ర్యం వచ్చాక మా కొద్దీ తెల్ల దొరతనము పాట ప్రయోజనం పూర్తయింది. కానీ ధర్మన్న నా కొద్దీ నల్ల దొరకతనము అనే ఉద్యమం నేటికీ అవసరమే. దళితుల జీవనస్థితి నుంచి కొలుకునే వరకు వీరి భావజాలం దళితులకు శిరోధార్యం. ఈ పాట వీరికి నల్ల దొరకవిగా ప్రాచుర్యం తీసుకువచ్చింది. వీరు జయభేరి అనే వార పత్రికను స్థాపించి దళితుల స్థితిగతుల్ని, దళితుల కోర్కెల్ని దాని ద్వారా తెలియజేశారు. దళితుల్లో సాంఘిక చైతన్యాన్ని, రాజకీయ అవగాహనను తీసుకురావడానికి ఈ పత్రిక ఎంతగానో ఉపయోగపడింది. నల్ల దొర తనము పాటను అచ్చుకు తీసుకువచ్చేటప్పుడు ధర్మన్న గారు

బ్రాహ్మణ: క్షత్రియో వైశ్య స్త్రయోవర్ణా ద్విజాతయ:
చతుర్ధ ఏక జాతిస్తు శుద్రోనాస్తితు పంచమ:

అనే శ్లోకాన్ని ఇచ్చారు. అలాగే "వినదగునెవ్వరు చెప్పిన" అనే సుమతి శతక పద్యాన్ని కూడా ముందు మాటగా చెప్పి తన వాదాన్ని దళితుల వేదనలని విపులంగా ఈ పాటలో వివరించారు.

మా కొద్దీ తెల్ల దొరతనము దేవా మా కొద్దీ నల్ల దొరతనము
మాకు పదిమందితో పాటు పరువు గలగకయున్న
మాకొద్దీ నల్ల దొరతనము - దేవా మా కొద్దీ నల్ల దొరతనము
స్వతంత్ర పాలన చేసేదమంటారా -చెంతాకుమము చేరనీరు
శర్మగారిని శరణన్న లేదు - గుప్త గారిని గురువన్న లేదు
కాపు కరణాలకు కరుణలేదు దేవ - వర్మాలకు మేము దుర్మార్గుల మంట

అంటూ చాతుర్వర్ణ వ్యవస్థలలో పై మూడు వర్గాల వారు మిక్కిలి నిర్దయగా దళితుల పట్ల వ్యవహరించడం అన్యాయమని చెప్పారు.

భారత రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చే సందర్భంలో జరిగిన సమావేశంలో డాక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఈ దేశానికి వేదం కావాల్సి వచ్చినప్పుడు మావాడు అయిన వ్యాసుడు కావలసి వచ్చాడు. ఈ దేశానికి పురాణం కావాల్సి వచ్చినప్పుడు మా వాడు అయిన వాల్మీకి కావలసి వచ్చాడు. ఈ దేశానికి రాజ్యాంగం కావలసి వచ్చినప్పుడు నేను దొరికాను అని అంటారు. ఇదే భావాన్ని

మా వంశంబునబట్టే
మహిమ గాంచినయట్టి మానవులను గానరేల
వేద వ్యాసుడు మావాడు గాడా!
వాల్మీకి గోత్రము మాదిగాదా?
మా కులము తక్కువైతే గుణము లేదంటారా!

అంటూ హిందూ మతం వల్లే సాంఘిక వ్యవస్థ సర్వనాశమైందని మేధావులు, పండితులమని చెప్పుకునే వారికి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా ఎందుకు పోయిందని బాధపడతారు ధర్మన్న.

పద్మశ్రీ బోయి భీమన్న :

కులవ్యవస్థకి దానికి కారణభూతమైన పురాణాలని, పురాణ పురుషులని దేవుడి పేరున జరిగే దోపిడీని దానికి కారణమైన బ్రాహ్మణ వ్యవస్థను దుమ్మెత్తి పోసారు. వీరు పాలేరు,కూలిరాజు, పడిపోతున్న అడ్డుగోడలు, ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు, రాగవాసిష్టం మొదలైన నాటకాలు, గుడిసెలు కాలిపోతున్నాయి కవితా సంపుటి పూర్తిగా అంబేద్కరిజానికి అద్దంపట్టేవే. వీరు అంబేద్కరిజం, అంబేద్కర సుప్రభాతం అనే రచనలు కూడా చేశారు.

ఎంతకాలం గొర్రెగా ఉంటావే జనతా
సింహమై తిరగబడి రాక్షసవధ చెయ్యి
నీతులతో నిననాదాలతో ఊరేగుతున్న
ఈ వేషగాళ్ళు వట్టి మహిషాసురులే కాదు
మేకతోలు కప్పుకున్న వాతాపులు కూడా

అంటూ నీతులు చెబుతూ, వట్టి నినాదాలతో కాలం గడుపుకునే వాళ్ళు వేషాదారులే తప్ప దమ్ము, దర్పం ఉన్నవారు కాదని గొర్రెల్లాగా బ్రతకకుండా, సింహమై తిరగబడాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని ఇస్తున్నారు.

ఈ అస్తవ్యస్త సమాజాన్ని చూసినపుడు ఈ సమాజం లోని అన్ని రుగ్మతలు మతం, దేవుళ్ళు ఆలంబనగా జరిగాయి కాబట్టి ఈ అంశాలపై వీరు మిక్కిలి ఘాటుగా ఉన్న దాఖలాలు అనేకం ఉన్నాయి.

ఈ గుడిలన్నీ మట్టివి
ఈ దేవుళ్ళంతా మిణుగురులు
ఈ మతాలన్నీ దొంగల గుహలు
ఈ మనుషులు బుర్రలేని బొమ్మలు

అని విమర్శించారు. మానవుడు బాగుపడడం గురించి భీమన్న దృక్కోణాల నుంచి ఆలోచిస్తూ

మతం నుంచి బయట పడ్డప్పుడు
తాను కల్పించుకున్న దైవభ్రాంతి నుంచి
తప్పించుకుని నిలబడినప్పుడు
కర్మ సద్ధాంతాన్ని కాలరాసేసినప్పుడు

తనకు తాను తెలుసుకొని తన్మయాత్ముడయినప్పుడు మానవుడు బాగుపడతాడని కచ్చితంగా నిర్మొహమాటంగా చెప్పగలిగాడు.

భీమన్న భారతంలో అవినీతిని, లంచగొండితనాన్ని గూర్చి ప్రపంచ పోటీలు అనే కవితో

లంచగొండితనం
మన జాతీయ క్రీడ కదా!
దానికి నోబెల్ ప్రైజ్ ఇస్తే
ప్రతి ఏడాది అది మనకే రాదా?

రావూరి ఏకాంబరం :

1942 సంవత్సరంలో డాక్టర్ అంబేద్కర్ ఆంధ్ర రాష్ట్ర పర్యటన సదర్భంగా గుడివాడలో డాక్టర్ అంబేద్కర్ ఆంగ్ల

ఉపన్యాసాన్ని తెలుగులో అనువదించారు. అస్పృశ్యునిగా అంటరానివానిగా పుట్టి సాంఘిక అసమానత జాడ్యానికి లోనైనా ఈయన సమసమాజ స్థాపనకు, సాంఘిక విప్లవం కావాలంటాడు.

వందచెప్పుగాక హిందూకులోన్మాది
తలవంచనులేడు దళితముందు
కుక్కబుద్ధిపోదు ఎక్కడికేగిన
పీడిత జననేత! భీమరాయ!!

సవర్ణ హిందువులు కొంగున ముడి కట్టుకున్న వర్ణం అంటరానితనం. దాన్ని ఆయుధంగా చేసుకుని ఒక వర్గాన్ని పనికి తప్ప, పాలుకు దూరం చేస్తూ సంపదలు మూట కట్టుకోగలిగారు. ధర్మ శాస్త్రాలను ఆధారం చేసుకుని దళితులకు విద్యాసంపదలని, ప్రజ్ఞా పాటవాలని అంటు కోకుండా చేశారు. వీరిని విమర్శిస్తూ

దెబ్బ తిననివాడు దొబ్బుకుతినువాడు
అగ్రకులజుడు తప్పనొరుడు గాడు...

అని రావూరి ఏకాంబరం నిర్ధారిస్తారు.

వ్యాసాల్మీకులు దుష్టద్వయమ్ముగా
భారతజాతిని కొరత వేసే దుష్ట మేధావులై

దుర్వ్యవస్థను రుద్దిన వారని, ప్రగతి విద్రోహులని, మానసిక బానిసలుగా బ్రాహ్మణేతర కులాలను చేసిన వారని, పిరికిమందు పోసిన వారని, మేతువాద దృష్టి లేని వారని నిందిస్తాడు ప్రజాకవి రావూరి ఏకాంబరం.

స్పర్శ నిషేధించి యస్పృశ్యులను జేసె
ధర్మశాస్త్రములు దళిత ప్రజల
విద్య నిషేధించి వింత పశువుల జేసే
ధర్మశాస్త్రముల దళిత ప్రజల
ఆస్తి నిషేధించి యరిపేదలం జేసి
ధర్మశాస్త్రములు దళిత ప్రజల
ప్రజ్ఞ నిషేధించి బానిసలను జేసె

ధర్మశాస్త్రములు దళిత ప్రజల...అంటూ దళితులను ఏ విధంగా దగా చేశారో తెలిపాడు.

భగవద్గీతను గూర్చి దాని తత్వాన్ని గూర్చి ఘాటుగా విమర్శించారు.

గీత ప్రబోధము గోతులు త్రవ్వును
మహిమలు చిట్కాలు మారు మ్రోగు
గీతా ప్రబోధము కేరింతలాడును
మనిషి బోల్తాగొట్టు మాయజేసి
గీతా ప్రబోధము రోత పుట్టించును
సాత్కర్ష మొత్తము సోదిగోల.... అన్నారు.

దళితులు తమకర్తవ్యాన్ని విస్మరించరాదని, తమ సమస్యకు పరిష్కారాలు ఎంచుకునే విషయాలలో వాళ్ళు ప్రముఖ పాత్ర వహించాలని ఉద్బోధించారు. దళిత మేధావులు అనే ఖండికలో

దళిత మేధావులు కులమెత్తి గళమెత్తి
ధ్వజమెత్త వలె జాతి ప్రగతి కొరకు
దళిత మేధావులు దాసోహములు మాని
దళిత గాథలు తవ్వవలెను
దళిత మేధావులు దండకంబులు మాని
దళిత మేధావులు దాస్య హాస్యాలు మాని
సూటిగా సత్యములే చాటవలెను.....అని ప్రభోదించారు.

కత్తి పద్మారావు :

దళిత అభ్యుదయం కోసం అహర్నిసలు కృషి చేస్తున్న వారు కత్తి పద్మారావుగారు. ఒక మాటలో చెప్పాలంటే ఉద్యమభరితం కత్తివారి జీవితం. అందుకే కత్తి పద్మారావుగారి పేరే వినగానే దళిత ఉద్యమం గుర్తుకు వస్తుంది.

దళితుల విముక్తి పోరాటంలో
అంతిమ విజయం దాకా
ఈ మహాప్రస్థానం సాగుతూనే ఉంటుంది
గండె కదలిన వారంతా సాగి
ఉద్యమంలో నడవండి
విప్లవ విజయంకోసం
అణువణువును అర్పిద్దాం....

అంటూ మానవతావాదులు, సామ్యవాదులు, సానుభూతిపరులు యావన్మంది దళిత జనోద్ధరణకోసం ఉద్యమించి పోరాడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

కారంచేడు మృతవీరుల - రక్త స్రవంతుల నుండి
పుట్టిందీ దళితుల - సామాజిక ఉద్యమం
ఆరోజున మరువలేను చరిత్ర గర్భంనుండి
రక్తం, లావాల ప్రవహించిన రోజుది
కారంచేడు కులకావరం - గొడ్డలై, బరిసెలై

దళితుల గుండెల్ని చెండాడిన రోజుది.... అంటూ కారంచేడు కన్నీటి కథను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

చాతుర్వర్ణాలు పంచములను ఊరికి దూరంగా ఉంచడాన్ని, వారి దుర్భర జీవన స్థితిగతుల్ని

అర్ధరేతిరి కాడ - వల్లకాడులోనా
అరగాలిన పీనుగుల - పడదోసి కాలుతుండు
వోడురా ....వాడు?భారతమ్మోరి కడగొట్టు కొడుకా
పెద్దోళ్ళు నలుగురు - వెలిబెట్టివాణ్ణి
కూడు లేకుండా - గుడ్డ లేకుండా
అంటకూడదని
వల్లకాడుదాకా - తరిమి తరిమి కొడుతుంటే
భారతమ్మోరు సోద్దెంగ నవ్వుతుందేందిరా
బిడ్డల్ని గందా! గడ్డల్ని గందా! అంటూ వాపోతారు.

డాక్టర్ అంబేద్కర్ ప్రభావానికి అస్పృశ్యులు, అగ్రవర్ణాలవారు కూడా లోనయి సాహితీ సృష్టి చేశారు.

వారిలో బొడ్డు ప్రకాశం, చౌడగిరి చంద్రరావు, గోవ తోట లాజరస్, ఎం.వి.రమణ, కేసి జాన్, నూతక్కి అబ్రహం, జాకబ్, శివసాగర్, బొజ్జా తారకం, బోయ జంగయ్య, సతీష్ చంద్ర, ఎండ్లూరి సుధాకర్, సవేరా, మాస్టర్జీ, బి.ఎన్.రాములు, సాంబశివరావు, జి.లక్ష్మీ నరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్ మొదలైనవారు అనేకమంది అంబేద్కర్ ప్రభావానికి లోనైనవారే. వీరందరూ దళితుల సాంఘిక సామాజిక ఉద్యమం కోసం ఎంతో కృషి చేశారు. వారి రచనల ద్వారా దళితోద్యమానికి ఎంతో ప్రేరణను కల్పించారు. నాటికి నేటికి దళితుల జీవనం చాలా మార్పులకు లోనైంది. వారిని చైతన్య పరచడానికి మరింత మెరుగైన దళితసాహిత్యం రావలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. దళిత సాహిత్య చరిత్ర - డాక్టర్ పిల్లి శాంసన్.
2. దళిత సాహిత్య తత్వం - జి.లక్ష్మీనరసయ్య.
3. దళిత సాహిత్యం - కొండపల్లి సుదర్శనరాజు, డాక్టర్ గజ్జా యోహాన్ బాబు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బహుజన సాహిత్య వేగుచుక్క - కలేకూరి

- భమిడిపాటి గౌరీ శంకర్, తెలుగు విభాగాధిపతి, గాయత్రి కాలేజి ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్, మునసబుపేట, శ్రీకాకుళం జిల్లా.

సంఘ సంస్కరణ.... మానవ పరిణామ క్రమంలో కులాల విభజన నాటి నుంచి ఏదో రూపంలో వినిపిస్తున్న మాట... ఏదో విధంగా 'చుండూరుల'ను ప్రదర్శింపజేస్తున్న మాట... ప్రతీ చోట 'కంచికర్ల కోటేశులు' త్యాగాలును ప్రశ్నిస్తున్న ప్రశ్న... స్వర్ణోత్సవ వేదికపైన ఆడంబరంగా ప్రదర్శిస్తున్న 'అదృశ్యరూప దృశ్యం'. రాజా వారి వస్త్రాలు వంటి మాట... అయినా నేటికి నజీవంగా కవులు నిలదీస్తున్నారు. 'కవులను' ప్రశ్నించారని జైలులో పెడు తున్నారు. ఇది కూడా సంస్కరణల్లో భాగమంటున్నారు. జాతీయోద్యమ సమయంలో కవితా రచన చేసిన ప్రతిభావంతుల్లో మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి ఒకరు. ఆయన రాసిన కవితల్లో 'అంటరాని వారెవరంటే మా వెంట రాని వారే' అన్నది ప్రసిద్ధి పొందింది. నిజమే... వారి వెంట వెళ్ళే వారి కన్నా... వారినే లేకుండా చేసిన వారే ఎక్కువగా ఉన్నారు. ఇది కూడా ఒక సంస్కరణే. 'ధిక్కారాన్ని' (ప్రశ్నించడాన్ని) సంహించలేని రాజ్యం నా దృష్టిలో జీవం లేనిది. మనుగడ సాగించలేనిద'ంటారు మార్క్స్. వర్తమానంలో పరిస్థితి ఇందుకు సోదాహరణ చిత్రం....!?

కవులను సమాజం ప్రేరిపేస్తుంది. పరిస్థితులు 'వాడి' అయిన కవిత్వానికి ప్రేరణగా నిలుస్తాయి. ప్రజాపక్షం వహించిన కవి 'తన కులం' చట్రం నుండి విశాల మానవ హితాన్ని ఆశ్రయిస్తాడు. తన వారి కోసం పరితపిస్తాడు. కవిత్వగుణం, లక్షణం 'సంఘం' అనుకొనేవారు 'మనుషుల' స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆకాంక్షిస్తారు, ప్రశ్నిస్తారు... కవిత్వం రూపంలో ప్రశ్నల శరపరంపరను సంధిస్తారు. తమ ధిక్కారస్వరాన్ని వినిపిస్తూనే 'రాజ్య హింస'లో వర్గపోరును సమాజానికి ఎఱుక చేస్తారు. అటు వంటి ఓ ధిక్కారస్వరం... కలేకూరి ప్రసాద్ కవిత్వం. 1984 నుండి 2012 మధ్యకాలంలో ఆయన 'కవిత్వం'ను వెలువరించారు. నూకతోటి బాబూరావు, డప్పు ప్రకాష్, చందుశ్రీలు ఆయన గేయాలకు తమ గొంతులను వేదికలుగా చేసి 'వేనోళ్ళ'కు చేరవేసారు. కుల నిర్మూలన కోసం గొంతెత్తిన కవి కలేకూరి. స్వతంత్ర రచనలకెంత ప్రాధాన్యమిచ్చారో అనుసృజననునహితం అంతగా అక్కున చేర్చుకున్న కవి. బెంగాళీ, రష్యన్, మరాఠీ దళిత కవితను తెలుగు పాఠకుల మెదళ్ళలో చొప్పించారు. ఆలోచించమని అగ్నిని రగిలించారు. ఆయన కవిత్వంను గురించి గద్దర్ ఒక మనిషిగా గుర్తించబడని మనిషి గురించి రాసిన కవిత్వాన్ని దళిత కవిత్వమని ఎట్లా అంటారు మీరు? అది మహోన్నత కవిత్వమవుతుంది. కవెకూరి దళిత కవి కాదు. మహాకవి" అంటారు. ఇది అక్షర లక్షల విలువ చేసే ఓ అక్షర చిత్రం. కలేకూరి సహితం 'దళిత సాహిత్యోద్యమంలో ఒకడిగా చేరే అవకాశం తనకు కలిగిందని' వినయంగా చెప్పుకొన్నారు. ఆయన రచనల్లో సమసమాజం పట్ల అచంచల స్వప్నం, కుల నిర్మూలన పోరాటం కనిపిస్తుంది. బలంగా వినిపిస్తుంది.

తని వెనుక మూడు దశాబ్దాల ఉదాత్తమైన కవితా వ్యాసంగం ఉంది. తన కవితలు గురంఇచి కలేకూరి 'కాలానికి నిలబడగలిగే శక్తి ఉంటే ఉంటాయి. లేకపోతే లేదు' అంటారు. కాని... కాలక్రమ ప్రవాహంలో స్థిరంగా నిలిచిన కవిత్వాన్నే ఆయన సృజియించారు. సాహిత్యేతర ప్రయోజనాల కోసం సాహితీసృజన చేసిన కవి కలేకూరి ప్రసాద్ కాదు, రోహిత్ వేముల నుండి ప్రణయ్ పెరుమాళ్ల వరకు బలితీసుకున్న ఈ దేశపు వ్యవస్థానిర్మితా అస్తవ్యస్థల విలువలకు ఆ రచనలు ఓ కత్తి గాటువంటివి. 'దురా'గతమే' పునరావృతమవుతున్న వర్తమానంలో ఈ కవిత్వం ప్రాసంగితను గురించి ప్రత్యేకంగా చర్చించు

కోనక్కరలేదని' ప్రసాద్ కవిత్వానికి పుస్తక రూపమిచ్చిన 'నామిడి శ్రీధర్' అంటారు.

సమాజం ఓ పద్మవ్యూహమయే వర్తమానంలో కలేకూరిని నిరంతరం జ్ఞప్తికి తెచ్చుకోవలసి అవసరం ఉంది. కులం, మతం, వర్గం, జాతి ఇలా విభజన కార్యక్రమం ముమ్మరంగా చాప కింద నీరులా నిర్వహిస్తన్న వేళ 'హింస' ఓ అంతర్లీన సూత్రంగా జరిగిపోతున్న సందర్భంలో కలేకూరి ప్రసాద్ ఓ కవితలో మానవీయ నమాజం/కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, వ్యక్తులుగా/ ఒంటరులుగా నిర్వీర్యమవుతొంటే... అది హింస/ ఏ బలిపీఠమైనా గొర్రె పిల్లల కోసమే తయారవుతుంది/ఏ బలిపీఠం పైన ఏ గొర్రె పిల్ల బలైనా/అది 'ఐచ్ఛికా'ర్పణే!' అంటారు. ప్రతీ చోటా అణగారిన వర్గీయులు బలైనా (ఇది ఏ రూపమైనా) అది ఓ 'త్యాగంగా' 'ఓ ఐచ్ఛికాంశంగా' అందరూ (మిగిలిన వారు) అనుకుంటారు. ఇలా జరుగుతున్న 'హత్యలకు' కాలం ఓ మౌన సాక్షిగా నిలవటం అనేకానేక శేష ప్రశ్నలను చరిత్రలో వదిలేస్తున్నది. 'ఈశ్వరి' స్మృతిలో రాసిన కవితలో 'నా తల్లీ! / హింసోన్మత్త నిన్ను జీవితం కొనదాకా / తరిమితరిమి హత్య చేసింది / కాలం సాక్షిగా మిగిలిపోయింది! ఇలా నినదిస్తూనే తన అక్షరాల్లో 'ఆమె'ను ఎత్తుకుంటానంటారు. 'కళ్ళలో మెరిసే ఎర్రని జీరల్లో నిన్ను నిలుపుకుంటాం' ఇది కలేకూరి వారి కవితల్లో కనిపించే త్రీవ్రమైన హెచ్చరిక... ప్రపంచం ఓ భ్రమలవ(వి)లయం. ఇక్కడ 'ప్రతిభ' సహితం 'వర్గీరణ'ల మధ్య 'వర్ణణాత్మకంగా' మిగిలిపోతున్నదంటారు కవి. 'పీఠాధిపతుల ప్రవచనాల ప్రభంజనాలు/లోకాన్ని ముంచెత్తుతున్నట్లు గుండెలు జలదరిస్తున్నవి' ప్రతిభకున్న వివిధ' వేషాల చిత్రాలను దృశ్య రూపం' చేసిన ధీశాలి... కలేకూరి 'ఇప్పుడు ప్రతిభంటే/రెక్కలు చాస్తోన్న మూర్తిభవించిన రాజ్యహింస' అని ఆవేదనగా 'గర్జన' చేస్తారు. కుర్చీల కోసం మారణహోమం సృష్టి 'రాజ్యానికి' ఓ క్రీడ. ఇందుకు ఎన్నో మార్గాలున్నాయి. చిన్న, పెద్ద, కుల, వర్గ, మత, వృద్ధ, స్త్రీ అనే తారతమ్యం లేదు. కావలసినదల్లా 'కుర్చీ'... పదవి. కలేకూరి సహితం ఇది చూసి సహించలేక 'ఒక కుర్చీని మార్చడం కోసం / వేలాది పసి ప్రాణాలను కాలరాచే / చాకచక్యం తెలియదు నాకు' అంటారు... నిజమే కదా అనిపిస్తుంది. అక్షరాలను ఆయుధాలుగా మలచి - ప్రయోగించిన కలం 'కలేకూరి' స్వంతం.

స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచాయని సంబరాలు జరుపుకుంటున్న వేళ... వెనుకకు 'తోసేస్తున్న వర్గీయులను 'ముందుకు' తీసుకురావటానికి 'పథకాలున్నాయి' కాని... నిజమైన అర్హులు వాటిని అందుకుంటున్నారా అని ప్రశ్నించుకుంటే... లేదనే సమాధానం వస్తుంది. చాల దగ్గర రాజ్యంగనేతలు తమ 'వ్యక్తిత్వాన్ని' పరిచేస్తున్న 'అంశాన్ని' కూడా ప్రసాద్ గారు వ్యంగ్యంగానే అయినా '18 డిసెంబర్ 1996' నాటి సంఘటనకు జత చేసిన విధం ఆయనలోని సత్యసంధత చదువరి హృదయంలో 'కలవరం' 'కలకలం' కలిగిస్తుంది. కవిత్వ ప్రయోజనమేమిటి అని ప్రశ్నించే వారికి కలేకూరి కవిత్వం 'నగ్నంగా సత్యాలను' చూపిస్తుంది. తట్టుకొనే ధైర్యం, నిజాయితీ చదువరికి అవసరం. సాధించిన 'స్వాతంత్ర్యం' తమ వారిని ఇంకా 'సమాజానికి' దూరంగా 'ఆధునికతను జత చేసి వేరుగా 'జీవింపజేయటం' కూడా అవమానమంటారు. 'నా సొరాజ్జమా! / నీకు యాభై ఏళ్ళు నిండిన తర్వాత / ఇప్పుడు నువ్వంటే / అమితమైన ప్రేమ పుట్టుకొస్తున్నది / ఒక్కసారి రావే... / మామాల మాదిగ గూడెల దాకా' అనే అక్షరక్రమం గుండెలను మండిస్తాయి (1996లో రాసిన కవిత). ప్రశ్నిస్తాయి.

జీవితానుభవాలు కళ్ళకు కట్టిన దృశ్యాలు, సామాజిక అసమానతల కొలిమిలో అవమానతల మంటల వేడిమిని భరించలేని వ్యక్తి సమాజంను ప్రశ్నించే తత్వం కవిత్వంలో ప్రతిఫమిస్తే అది కలేకూరి ప్రసాద్ అగ్నిధారల కుంభవృష్టి అవుతుంది. కదిలిస్తుంది. కన్నీరును తెప్పిస్తుంది. కళ్ళంట మంటలను కురపిస్తుంది. కవి, అనువాదకుడు, పాత్రికేయుడు, సామాజిక, రాజకీయ కార్యకర్తగా కవేకూరి

బహుముఖీయ ప్రజ్ఞ వెనుక చిన్నతనంలో స్వగ్రామలో జరిగిన కంచికర్ల కోటేశ అనే బాలుడి సజీవదహన దృశ్యం అదృశ్యశక్తిగా ఉందనేది విస్మరించరానిది. ఆ సంఘటన ప్రేరణ నుండి అతనొక 'మహా శక్తిగా' ఎదిగిన క్రమం గొప్పది. అతని కవిత్వం గాఢత్వంతో నిండి ఉంటుంది. ఆర్ధత, అంతర్ముఖత, స్పష్టత, కోపోద్రిక్తత, అధిక్షేపం, అంబేద్కర్ భావాజాలాల సమ్మేళన సమ్మోహన రూపం కలేకూరి కవిత్వం'. 2013 మే 17 కలేకూరి కానరాని లోకాలకు తన కలంతో తన వారి కతలను, వ్యధలపై ప్రశించడానికి పయనం సాగించాడు...

'నాదు కన్నీటి కథా సమన్వయముసేయు
నార్ధ హృదయంబుగూడ కొంతవసరంబు...'

అనే జాషువా వాఖ్యానం ఈ సందర్భంలో గుర్తుకు రాకమానదు...

ఆధార గ్రంధాలు :

1. కలేకూరి కవిత్వం - కలేకూరి ప్రసాద్, సాహితీ మిత్రులు ప్రచురణ - 2002
2. దళిత సాహిత్య - కలేకూరి ప్రసాద్, తంగిరాల మేరి ప్రచురణలు - 20-22

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంగవిజయం – దళిత జీవన సమీక్ష

– **తొడి రేవతి,** తెలుగు అధ్యపకురాలు, ప్రభుత్వ కళాశాల (అ), రాజమండ్రి.

"సాహితస్య భావం సాహిత్యం"

"హితేన సహితం సాహిత్యం" అంటే సాహిత్యం హితవును భోదిస్తుంది అని అర్థం. అలాగే మానవుడు మేలైన మార్గములో నడవడానికి సాహిత్యం ఉప యోగపడుతుంది. సాహిత్యం మొట్టమొదట దేవుళ్ళు, రాజులనే కథావస్తువుగా స్వీకరించి పురాణాలు, ఇతిహాసాలు తెలుగు సాహిత్యంలో వెలువడ్డాయి. సాహిత్యం నేల విడిచి సాము చేసినట్లు కాలక్రమంలో కొంత మార్పుచెంది, సామాన్య మానవున్ని కూడా కథా వస్తువుగా చేసి వ్యవహారిక భాషలోకి మలిచి రాయబడిన క్రమంలో తెలుగు సాహిత్యం అనేక శాఖోపశాఖలుగా విస్తారించింది. ప్రస్తుత సమాజంలో మానవ జీవన విధానాన్ని వివరించే క్రమంలో అనేక మంది కవులు వారి కావ్యాలు ద్వారా సరళ భాషలో సమాజ శ్రేయస్సుకొరకు రచనలు తెలుగు సాహిత్యంలో చేశారు. ఆ క్రమంలో సాహిత్యం సమాజ శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకొని ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యం, మైనార్టివాద సాహిత్యం, దిగంబర సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యం, దళిత సాహిత్యం వెలువడ్డాయి.

దళిత జీవన విధానం అనాది కాలం నుండి భారత దేశంలో ఏ విధంగా కొనసాగుతూ వచ్చిందో, వివక్ష, అనుభవించిన, అనుభవిస్తున్న వారి పరిస్థితులకు అనుగుణంగా అనేక మంది కవులు వారి కలం ద్వారా వారి మనస్సులోని ఆవేదనను సమాజానికి తెలియజేసి, దళితుల ఔనత్యానికి పాటు పడిన మహనీయులు ఎందరో ఉన్నారు. వారిలో ఒకరు మాలపల్లి నవల రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ గారు. ఈ మాలపల్లి నవలకే సంగ విజయం అనే నామాంతరం కలదు.

సాహిత్యం ద్వారా హరిజన ఉద్ధరణకు కృషి చేసిన స్వాతంత్ర్య ఉద్యమవీరుడు ఉన్నవ లక్ష్మీనారాయణ. ఈయన న్యాయవాది. 1877 డిశంబరు 4న గుంటూరు జిల్లా వేములూరుపాడు గ్రామంలో జన్మించారు. శ్రీరాములు, శేషమ్మ గార్లు వీరి తల్లిదండ్రులు. ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. 1897 సం॥లో గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివారు. 1906 లో సం॥లో రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో శిక్షణ పొందారు. 1892 సం॥లో లక్ష్మీబాయమ్మతో వివాహం జరిగింది.

ఉపాధ్యాయుడిగా, హైకోర్టు న్యాయవాదిగా, ఆంధ్ర రాష్ట్ర కమిటి కార్యదర్శిగా పని చేసారు. 1942 సం॥లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభ వించారు. రాయవేలూరు జైలులో ఉన్నప్పుడు ఈయన మాలపల్లి నవల రాసారు.

ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవలలో దళితుల జీవన విధానంలో మార్పు రావాలని, వారు ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నతులు కావాలని ఆరాటపడినట్లు తెలుస్తుంది. ఈ నవలలో వ్యవసాయ కూలీలు ఉద్యమం కనిపిస్తుంది. వారు పడుతున్న సమస్యలన్ని మాలపల్లి నవలలో చిత్రించారు. సామాన్య మానవులంటే అనాడు దేశంలో అధిక భాగంలో ఉన్న కూలీలే. ఉన్నవ లక్ష్మీనారాయణ వ్యవసాయ కూలీల జీవితాన్ని ఒక ప్రధాన వస్తువుగా స్వీకరించి నవలను రచించారు. వ్యవసాయ కూలీలు దుర్భర పరిస్థితులు అనుభవించడానికి కారణం నాటి పల్లెలలో పరిపాలన విధానం, భూమి అక్రమాలు, న్యాయస్థానాలు ధనవంతులపై చూపించే పక్షపాతం అని ఉన్నవ వారి ఉద్దేశ్యం.

మాలపల్లి నవలలో రామదాసు భూస్వాముల వద్ద వెట్టి చాకిరి చేసినప్పటికి ఆధ్యాత్మిక జీవనం గడుపుతూ

ఉంటాడు. కాని అతని కుమారుడు ఆధ్యాత్మిక జీవనం గడుపుతూ దళితుల ఆవేదనను తెలుసుకొని భూస్వామ్య వ్యవస్థపై తిరుగబడి సమాజంలో గొప్ప మార్పు తీసుకువస్తాడు. సంగదాసు మంగళపురంలో ధనికుడు, మోతుబరి అయిన చౌదరయ్య దగ్గర గుమస్తాగా పని, చేస్తూ పంచములు అనుభవిస్తున్న దారిద్ర్యన్ని, వారు మోసగింపబడుతున్న విధానాన్ని గమనిస్తూ వారి ఉద్ధరణకై రాత్రింబవళ్ళు మార్గము వెతుకుతాడు. చౌదరయ్య దగ్గర పని చేస్తూనే వ్యవసాయంలోని కష్ట నష్టాలను, కూలీల శ్రమను, భూస్వాములు పొందుతున్న రెట్టింపు లాభాన్ని గమనించి సంఘ చైతన్యం కోసం ఆవేదన చేందుతాడు.

అగ్రవర్ణాల వారి దౌర్జన్యాలకు గురి అవుతున్న కారణంగానే దళితులు విద్యాభివృద్ధికి నోచుకోలేక పోతున్నారు. శుచి, శుభ్రత లేని మురికి వాడలలో బ్రతుకు బండిని లాగుతున్నారు. అలాంటి వారి జీవితాలు మెరుగు పరచడానికి ఆరాట పడతాడు. ఒక రోజు కేవలం తన చేను గట్టుపై నడుస్తుంది అనే నెపంతో ఒక ఆసామి రామదాసు చెల్లెలు సుబ్బలక్ష్మిపై దౌర్జన్యానికి పాల్పడ తాడు. ఆమె తెచ్చుకుంటున్న గడ్డి మోపు లాక్కుంటాడు. ఇటువంటి దౌర్జన్యలు గమనించిన నంగదాను చౌదరయ్య మనస్తత్వం ఎరిగినవాడై తన ప్రజలలోనే కాదు ధనికులలో కూడా మార్పు తేవాలని ప్రయత్నిస్తాడు అందుకే అతని కొడుకు రామానాయుడితో స్నేహం ఏర్పరుచుకొంటాడు.

సుఖంగా పెరుగుతున్న రామానాయుడు నంగ దాసునితో స్నేహం చేస్తూ కూలీలతో కలిసి ఉంటాడు. తన తల్లిదండ్రులు వారిస్తున్నపటికి పని చేస్తూ, దళితుల కష్ట జీవితాన్ని ఆకలి మంటలను గమనించి దళిత ఉద్ధరణకు తన తండ్రిని కూడా ఎదిరిస్తాడు. సమాజంలో కూలీలు పడుతున్న ఆకలి మంటలకు, ఆర్త నాదాలను రామానాయుడు విని అగ్రవర్ణాల ఆలోచనలో మార్పుకి ప్రయత్నిస్తాడు. తన తండ్రి కొంత మంది భూస్వాములలో కలిసి అప్పటికే చాలిచాలని కూలీలతో శ్రమ జీవులు కుక్కి మంచాలలో మడతలు పడిన దేహంతో డొక్కలో కాళ్ళు పెట్టుకొని జీవచ్ఛావాలుగా బ్రతుకుతుంటే వారికి ఇచ్చే కూలీ ఇంకా తగ్గించాలని తన తండ్రి చేసే పనికిమాలిన పనిని రామనాయుడు ఎదురిస్తాడు. తన తండ్రి హృదయకాఠిణ్యానికి బాధపడతాడు. రామానాయుడి వేధింపులకు ఒక ముసలిది ఆకలి బాధతో పడిపోతే అది కూటి కోసం వేషాలు వేస్తుందని తన తండ్రి దుర్భాష లాడిన కాఠిణ్య స్థితిని, ధనశ, దుర్చర్యలు, పరోక్షంగా రామానాయుడు దళితుల సమస్యలు వైపు దృష్టి పెట్టడానికి ప్రభావం చూపాయి. భూస్వాముల అహం భావం, పీడితుల ఆకలి కేకలు రామానాయుడి హృదయాన్ని కదిలించి వేసాయి. పంచమ, కార్మికుల అభివృద్ధికి దివారాత్రులు తపన పడుతున్న సంగదాసు మరణంతో అట్టడుగు ప్రజల భాద్యతను రామదాసుకు బదులు రామానాయుడు స్వీకరించి సమాజ మార్పుకు కృషి చేస్తాడు.

ఈ నవలలో సంగదాసు మొదటి భాగంలోనే చని పోయినప్పటికి సంగదాసు తరువాత రామానాయుడు అనేకమంది దళితులలో చైతన్యం పురుగొల్పి, అప్పదాసు లాంటి కూలీలు కూడా చైతన్యవంతులు అయ్యేటట్టు చేస్తాడు. ఈ నేపద్యంలో రామానాయుడు కుటుంబంలో తన భార్య వేరోకరితో లేచి పోయినప్పటికి, తన కుమారుడు మరణించినప్పటికి దళిత చైతన్యం కోసం నిరంతరం కృషి చేసిన రామానాయుడు కుల, మత, బేదం లేకుండా సంగదాసు ఆశయాలను నెరవేర్చాడు. బడుగుల జీవన విదానానికి కృషి చేసాడు.

ముగింపు :

ఈ నవలలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు తన తండ్రి ఆశయాసాధనను రామానాయుడు పాత్ర ద్వారా తెలియజేసారు. లక్ష్మీనారాయణ గారి తండ్రికి కుల, మత, ధనిక, బేద వర్గాల తారతమ్యలు ఏ మాత్రం నచ్చదు.

సమాజ అభివృద్ధి ఆయన ఆశయం. ఆబాటలోనే ఉన్నవ వారు కూడా నడిచి అనేక సంఘ సంస్కరణ ఉద్యమాలలో పాల్గొనటయే కాక దేశంలో, మన మధ్యలో పీడించబడుతున్న జనుల సమాజ ఉద్ధరణ ముఖ్యంగా భావించారు. 400 సం॥రాలు బానిస బ్రతుకు నుండి బ్రిటిష్ దాస్యశుంఖం నుండి భారత దేశంలోని ప్రజలు బయటకు రావాలంటే, మన ప్రజల ఆలోచన దృక్పదంలో మార్పు రావాలి. అందర్ని గౌరవిద్దాం, అందరితో కలిసి మెలిసి ఉందాం. అన్నదమ్ముల వలే జీవితం, హెచ్చు తగ్గులు లేని భారత దేశ అభివృద్ధికి పాటు పడదాం అనే గొప్ప సందేశాన్ని ఉన్నవ వారు ఈ నవల ద్వారా తెలియ జేసారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య
2. మాలపల్లి - ఉన్నవ లక్ష్మీనారాయణ
3. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ప్రొఫెసర్ వెలమలసిమ్మన్న
4. తెలుగు కవితోద్యమాలు - తెలుగు అకాడమీ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మొగిలి – సమానత్వాన్ని కాంక్షించే మనుషుల లోగిలి

– వేము రాములు, తెలుగు భాషోపాధ్యాయులు, మధిర, మధిర మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ.

ఆధునిక సాహిత్యంలో అనేక ధోరణులు బయలు దేరాయి. అందులో దళిత సాహిత్యం ఒకటి. దీని ప్రధాన లక్ష్యం దళిత అభ్యుదయం, దళిత చైతన్యం లక్ష్యంగా సాగుతున్నది. ఈ ఆంధ్రదేశంలో దళిత సాహిత్యానికి ప్రేరణ మహారాష్ట్ర కేంద్రంగా 1972-1977 సంవత్సరాల మధ్య జరిగిన 'దళిత పాంథర్స్' ఉద్యమం. ఇది జె.వి.పవార్, దయా పవార్, అర్జున్ డాంగ్లీ, నామ్‌దేవ్ దసాల్, ప్రహ్లాద్ చరత్వాంకర్ మొదలైన వారి సారధ్యంలో జరిగింది. ఈ 'దళిత పాంథర్స్' ఉద్యమం దేశంలో దళితులలో, దళిత సాహిత్యంలో విశేషమైన ప్రభావాన్ని చూపింది. ఈ ప్రభావం గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు లలో ఎక్కువగా కనిపించింది. తద్వారా దళిత ఉద్ధరణ కొరకు ఉద్యమాలు, దళిత సాహిత్యం మొదలైనాయి. అందునా ఆంధ్రదేశంలో చుండూరు, కారంచేడు ఘటనలతో దళిత ఉద్యమాలు, సాహిత్యం ప్రారంభమైనది. అలాగే తెలంగాణలో కూడా దళిత సాహిత్యం ప్రారంభమైనది. తెలంగాణ దళిత సాహిత్యానికి నల్గొండ కేంద్రబిందువని చెప్పవచ్చు. నిజానికి తెలంగాణలో దళిత నవలా రచనకు పునాదులు వేసింది నల్గొండని చెప్పవచ్చు. అట్లా పునాదులేసిన వారిలో 'జాతర, జగడం, ఆలోచించండి' నవలలు బోయ జంగయ్య తీసుకొచ్చి తెలంగాణ దళిత నవలా సౌధానికి ముగ్గు పోసిండు. అలాగే 'ఎదురు పాదలు నినదించాయి', 'బలిపశువు' నవలలు జాతశ్రీ. 'కక్క', 'సిద్ధి' నవలలు వేముల ఎల్లయ్య, ఇంకా కదిరె కృష్ణ, గుండెపంగు వరకుమార్ మొదలగువారు నవలలు రాశారు. అటువంటి నల్గొండ జిల్లా నుండే ఎక్కువగా దళిత సాహిత్యాన్ని తీసుకొచ్చినవారిలో భూతం ముత్యాలు ఒకరు. వీరు రాశిలోనూ, వాసిలోను మేలైన, మెండైన దళిత సాహిత్యాన్ని తెస్తున్నారు, తెచ్చారు. ఆయన రచనలు నాలుగు కథా సంపుటాలు, ఐదు నవలలు, ఒక స్వీయచరిత్ర, ఒక నిఘంటువు, కవిత్వం, నాటకం ఇలా అనేక ప్రక్రియలలో రచనలు చేశారు.

భూతం ముత్యాలు రచించిన ఐదు నవలలు 'సూర, మొగిలి, ఇగురం, పురుడు, మాలచ్చువమ్మ'. ఇందులో 'మొగిలి' దళిత నవల గురించి తెలుసుకుందాం. ఇది 2016లో రాసిన దళిత నవల. భారతీయ సమాజంలో కులవ్యవస్థ కొన్ని వేల ఏండ్లుగా వేళ్ళూనికొని నేటికి తన ఉనికిని చాటుతూనే ఉంది. భారతదేశం అంటేనే మనువు సృష్టించిన కులాల సమూహం అని చెప్పవచ్చు. దీనికి ఒక కొలమానం గానీ, హేతుబద్ధత గానీ లేదని నా అభిప్రాయం. ఈ నేలపై పుట్టిన ఆదివాసులు, ఈ దేశ మూలవాసులు నేడు అంటరాని జాతులుగా పిలువ బడుతున్నారు. ప్రపంచ చరిత్రలో ఎప్పుడైనా, ఎక్కడైనా గెలిచినవారే తమ చరిత్రలను గొప్పగా రాసుకున్నారు. ఓడినవారిని బానిసలుగా, అంటరానివారిగా గెలిచిన వారిచే ముద్రించబడి నాగరిక సమాజం నుండి వెలివేయ బడినారు. పరాజితులైన ఆదివాసులు, ఈ దేశ మూల వాసులకు తమదైన చరిత్ర, సంస్కృతి ఉంది. అది నేటికీ సజీవమై ఈ సమాజంలో జీవనదియై అంతర్వాహినిలా ప్రవహిస్తూనే ఉంది. అంటరాని జాతులలో ఒక కులమైన 'మాల' వారి ఉనికిని, వారి మూలాల్లోకి వెళ్ళి సోధిస్తే గానీ, క్రీ.పూ. నుండి మాలల ప్రస్తావన, వారి ధైర్య సాహసాలు, వారి శౌర్యం, వారి తెగువ, పరాక్రమాలు, రాజులకు మించిన వీరత్వం. బయల్పడిన విధం అబ్బురపరుస్తుంది. లక్ష శ్లోకాలు గల 'గుణాడ్యుని' ''బృహత్కథ''లో ప్రవేసేనజిత్తుని కుమార్తెను 'మాల కుమారుడు వివాహమాడాడు. ఇది నిజం, చరిత్ర. అలాంటి మరొక మాల కుమారుని కథే 'మొగిలి' నవల.

మొగిలి అతని తల్లిదండ్రులు ఎల్లమ్మ, మనెయ్య, తాత వెంకట నర్సయ్య ఒక కుటుంబం అయితే, వీరడు అతని తల్లి బార్తమ్మ భార్య కల్లెమ్మ రెండో కుటుంబం. వీటికి భిన్నంగా రచయిత జీవన్, అలాగే జమీందారి కూతురు జయంతిదేవి నాయకి. ఈమె, మొగిలి ప్రేయసిల చుట్టూ అల్లుకున్న ప్రణయ కథ. పల్లెలో దళితవాడలో మొదలైన కూలి నాలి కష్టజీవనం పాలేరు తనం గ్రామీణ వాతావరణం, పల్లె సౌందర్యం, పిల్లల ఆటపాటలు, ఆడపడుచుల కలుపు పాటలు, వివిధ సందర్భాలలో దళిత ఆచార వ్యవహారాలు, పల్లెటూరి ప్రజల స్వచ్ఛమైన మనసులు, మోసమెరుగని అమాయ కత్వం. ఆ వాడ పల్లెలో జరిగే జాతరలో కొండపైన ప్రతియేడు జరిగే సంబురం ఆ జాతరలో మొగిలి జయంతి ప్రేమకు బీజం పడడం, జమీందారి ధిక్కారం, వీరని మరణం, కలెమ్మ తెగింపు. సమయస్ఫూర్తితో ముందు చూపు కలిగి అందరూ సమానము, కులాలు లేని సమసమాజాన్ని కలలు గనే రచయిత, అతనికిమల్లె సమసమాజ వికాసానికి బాటలు పరిచిన మొగిలి, జయంతిదేవీల ప్రేమ పరాకాష్టకు కులాంతర వివాహం దారితీస్తుంది. ఈ క్రమంలో ఎదురయ్యే సమస్యలు చిలికి చిలికి గాలివానై వీరడు మరణించడం, ఆ కసితో కల్లెమ్మ జమీందారుపై పగతీర్చుకోవడం. చీకట్లు అలుముకొని మూగబోయిన పల్లెలో కొండపై గుడిలో దీపం వెలగడంతో పేదల బతుకులలో చీకట్లు తొలగి రాబోయే రేపటి పొద్దుకు సంకేతంగా ఆ దీపం కనిపించడం, కలెమ్మ కొడుకు బడిబాట పట్టడంతో ఈ నవల ముగుస్తుంది.

మొగిలి ఈరడుల మిత్రుడు జీవనం. ఇతడు ఎప్పుడూ ఆలోచనలో ఉండేవాడు. మనుషులంతా ఒకేలా ఉన్న ఎక్కువ, తక్కువలు ఎలా వచ్చాయని, ఎప్పుడూ ఈ సమాజం గురించి ఆలోచించేవాడు. ఈ కులమతాలు, ఎక్వ, తక్వలు ఎన్నడు పోతాయోనని నిరంతరం ఆలోచించేవాడు. సమసమాజం అతని స్వప్నం. అందులో భాగంగా మొగిలికి, ఈరడికి తన ఆలోచనలు, తన భావాలను వారికి వివరించి చెప్పేవాడు జీవన్. అటువంటి రచనలు చేసేవాడు, అతని రచనలన్నీ పూలే, అంబేద్కర్‌లు చెప్పిన (విషయాలను) బోధలకు అనుగుణంగా ఉండేవి. మొగిలి, ఈరడు జీవన్ రచనలు, అతని లక్ష్యాన్ని తెలుసుకొని విశాల భావాలు కలిగి ఉన్నారు. ఈ నిచ్చెనమెట్ల సమాజంలో కులమతాలు, ఎక్వ, తక్వలు మంచిది కాదని, అవి అనాగరికమని, అవి అభివృద్ధి నిరోధకాలని, సమసమాజ స్థాపనకు అవి ఆటంకాలనీ చెపుతూ, సమసమాజ స్థాపన ఎప్పుడు జరుగుతుంది. ఈ దళితుల బతుకులు ఎప్పుడు మార తాయని, మారాలని, పూలే, అంబేద్కర్ ఆశయాలు, వారి ఆకాంక్షలు ఈ దళితుల బతుకున ఎప్పుడు ప్రతి ఫలించునో ఎదురు చూస్తున్నాడు. అట్టి ఆశావాదముతో జీవిస్తూ, నేనేమి చేయలేకపోతున్నానని బాధపడుతూ తనకు చేతనైనంత వరకు తన రచనల ద్వారా, తన బోధనలతో మొగిలిని, ఈరడిని చైతన్యపరిచినాడు. ఆవిధంగా జీవన్ రచనల నుండి మొగిలి, ఈరడులు స్ఫూర్తిని పొందినారు. సమసమాజాన్ని ఆకాంక్షించినారు.

కళెమ్మ పాత్ర ద్వారా రచయిత పల్లెటూరి వారి స్వచ్ఛమైన మనస్సును, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం కనబడుతుంది. కళెమ్మ ఈరడికి మనసిచ్చింది. పెళ్ళికాకున్నా, సమాజం ఏమనుకున్నా తను ప్రేమించిన ఈరడు కష్టాల్లో ఉంటే సేవలు చేసింది. ఆడది మనసిచ్చిందంటే ఎంతటి కష్టమైన, నష్టమైన తమ ప్రేమను నెగ్గించుకొనుటకు ఎన్ని ఆటంకాలైనా, అడ్డంకులైనా, ఓర్పుతో ఎదుర్కొంటుందని, నిష్కల్మషమైన ప్రేమకు కళెమ్మ పాత్ర రచయిత తీర్చిదిద్దాడు. అంతేగాక ఈ సమాజం ఏమనుకున్నా పర్వాలేదని మనసిచ్చి వాన్ని మనసులో నిలుపుకొని, జీవితాంతం వానితో ఉండాలని, జీవితాన్ని వానితో పంచుకోవాలని, కష్టమైన, బాధైనా, దుఃఖమైన, చివరికి మరణం దరిచేరినా వానితోనే ఉండాలని, స్వచ్ఛమైన ప్రేమకు నిర్వచనంగా కళెమ్మ పాత్రని ఉదాత్తంగా తీర్చిదిద్దారు రచయిత. నేటి మాయ

ప్రేమను ఒలకబోసే మరియు అవసరం ఉన్నంతవరకు ప్రేమను చూపే వారికి కనువిప్పుగా, నిస్వార్థ ప్రేమకు సాక్ష్యంగా కళెమ్మ, ఈరడిల ప్రేమ కనిపిస్తుంది. అంతేగాక పేదవాళ్ళకు ఓర్పు ఒకస్థాయి వరకు ఉంటుందని, ఆ స్థాయిని మించితే అది అవతల ఎంత బలవంతుడైన, శక్తివంతుడైన పేదల ఆగ్రహానికి గురై అంతము కావాల్సిందేనని మరియు కళెమ్మ బూర్జువాల్లారా, భూస్వాములారా ఖబడ్దార్ మా జోలికి రావద్దు అంటూ తిరుగుబాటు చేసిన వీరవనితగా తీర్చిదిద్దాడు.

జయంతిదేవి పాత్ర ద్వారా వయస్సులో ఉన్నప్పుడు అందరూ తోడు కోరుకున్నట్లే జయంతిదేవి కూడా తోడును చూసుకుంది. అంతేగాక జయంతిదేవిలా ప్రతి స్త్రీ తనకు కాబోయే భర్తకు కొన్ని ప్రత్యేక లక్షనాలు ఉండాలని కోరుకుంటారు. జయంతిదేవి అలాగే తాను తనకు కాబోయే భర్తకు ఏయే గుణాలు ఉండాలో ఆ గుణాలన్ని మొగిలిలో ఉన్నాయి. అందుకే మొగిలి కులాన్ని, సామాజిక స్థితిని ఆలోచించలేదు. అతనితో జీవితాంతం జీవించాలని, ఎప్పుడూ గడిలోనే బందీ జీవితంతో విరక్తి చెందిన జయంతి పల్లెటూరి, స్వచ్ఛమైన జీవితాన్ని ఆస్వాదించాలనుకున్నది. అలాగే కులమతాల పట్టింపులు లేక, సమసమాజము పట్ల సానుకూల వైఖరి ఉన్నది. అందుకే మొగిలి మాలవాడైనా అతనితో కలసి జీవించాలనుకుంది.

మొగిలి ఎల్లమ్మ, మనెయ్యల కుమారుడు. ఇతను చదువుతోపాటు చురుకుదనం కలవాడు. జీవన్ మాటలు, అతని పుస్తకాలు ఇతడిని ప్రభావితం చేసాయి. అందుకే కులమతాలు పోవాలని, సమసమాజ స్థాపన జరగాలని, కోరుకునేవాడు. అబ్దుల్ కలాంగారి సూక్తిలా "కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి" అన్న సూక్తి ప్రకారం మొగిలి తన భవిష్యత్తు జీవితాన్ని కలలుగన్నాడు. అవి ఎప్పుడు నెరవేరుతాయా అని నిరీక్షించాడు. ఆ నిరీక్షణలో అతని కల జయంతిదేవి రూపములో తన కల నెరవేరింది. మొగిలి విశాలమైన భావాలు, స్వచ్ఛమైన మనస్సు గలవాడు. స్వార్థం, మోసం, వంచన వంటి చెడ్డలక్షణాలు లేనివాడు. ఎప్పుడూ సమసమాజాన్ని ఆకాంక్షించేవాడు. అందుకే మొగిలి జమీందారి కూతురుని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ బంధాన్ని నిలుపు కోవడానికి ఎంత కష్టమైన భరించాడు.

ఈ నవలలో ఇంకా పల్లెటూరి జీవనం, వారి స్వచ్ఛమైన మనస్సులు, స్నేహానికి వారిచ్చే ప్రాముఖ్యత తెలుస్తుంది. వీరు మోసం, కుట్ర, మాయ, మర్మం ఎరుగనివారు. అవసరమైనతే తాము బాధపడతారు కాని, మోసానికి గురవుతారు కాని మోసం చేయరు. ఇంకా సమాజాలలో భూస్వాములు, ధనవంతులు, పేదలకున్న పొలాలను వివిధ కారణాలచేత వారినుండి తీసుకొని వారిని తనకు బానిసలుగా, సంపద పెంచే వస్తువులుగా మార్చుకొని వాడుకొనే విధానం రచయిత చూపించారు. ఈ నవల అంతా మాలల అస్థిత్వాన్ని, పరిస్థితిని తెలుసుకొని, మూలాలు తెలుసుకొని అంబేద్కర్ ఆశయ సాధనలో, సమసమాజ స్థాపనలో ఈ కులమతాల అంతరాలు పోయి, సమసమాజ స్థాపన జరగాలని అందరూ వసుదైక కుటుంబంలా ఉండాలని రచయిత ఆశ, ఆకాంక్ష.

ఆధార గ్రంథాలు :

1. దళిత పాంథర్స్
2. గుణాడ్యుని బృహత్కథ
3. మొగిలి నవల
4. భూతం ముత్యాలు సాహిత్యం

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"దళిత సాహిత్యం - చారిత్రక నేపథ్యం"

- జె. సత్యనారాయణ, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

దళిత సాహిత్యం - చారిత్రక నేపథ్యం :

అపౌరుషేయాలని భావించే వేదాల్లో (ఋగ్వేదం-10వ మండలం - పురుష సూక్తం) చాతుర్వర్ణ వ్యవస్థ గురించి ప్రస్తావన కనిపిస్తుంది. దాని ప్రకారం భారతదేశంలో కులవ్యవస్థ సాంఘిక అసమానతలపై బౌద్ధం, జైనం, చార్వాకం మొదలైనవి నిరసనను తెలిపాయి. అహింస, జ్ఞానబోధ, బౌద్ధిక దృక్పథాలపై ప్రధాన దృష్టిని కేంద్రీకరించాయి. కొన్ని వందల యేండ్లుగా బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల వారు తమ అధికారాన్ని చెలాయిస్తూ సంస్కృతి సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కాలంలోనే ముస్లిములు భారతదేశంపై దండయాత్రలు చేసి, చాలా చోట్ల అధికారం హస్తగతం చేసుకున్నారు. ఆ తరువాత కాలంలో పరోక్ష పద్ధతులలో హిందూ సామాజిక వ్యవస్థలో కనిపించే అణచివేత స్వభావాన్నే ముస్లిం పాలకులు కూడా అనునరించారు. ముస్లిం పాలనలో తమకు అనుకూలమైన వాటిని స్వీకరించి, మిగిలిన వాటిని అణచివేశారు. ఆ తరువాత భక్తి సాహిత్యం ప్రారంభమయింది. ఈ సాహిత్యంలో హిందూ మతంలోని మౌళిక లక్షణాలను విస్మరించకుండా, కొన్నింటిని సంస్కరించే ప్రయత్నం మాత్రం జరిగింది. హిందూ ముస్లిం పాలకుల సంఘర్షణలో బ్రిటీష్ వాళ్ళు భారతదేశాన్ని ఆక్రమించుకున్నారు. కొన్ని వందల యేండ్ల బ్రిటీష్ వారి భౌతిక దృష్టిని కలిగించింది. కొన్ని వందల యేండ్ల బ్రిటీష్ వారి పాలనను వ్యతిరేకిస్తూ జాతీయోద్యమం ఊపందుకుంది. ఈ పరిస్థితుల్లో "జాతీయోద్యమ సాహిత్యం"లో భాగంగా కుల నిర్మూలన కూడా ఒక అంశమయ్యింది. డా॥ బి.ఆర్. అంబేద్కర్, ఇ.వి. రామస్వామి నాయర్, జ్యోతిబావులే, నారాయణగురు, పెరియర్, సాహూమహారాజ్ మొదలైన వారి ఆలోచనలు దళిత సాహిత్యానికి చారిత్రక, తాత్త్విక భూమికను ఏర్పరిచాయి.

జ్యోతిబాపులే నిమ్నజాతుల ఉద్ధరణ కోసం "సత్య శోధక సమాజం" (1873) స్థాపించారు. 1910లో కలకత్తా కాంగ్రెస్ సమావేశం అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మాణం చేసింది. 1918లో అఖిల భారత దళిత జాతుల సమావేశాలు బొంబాయిలో జరిగాయి. 1924లో డా॥ బి.ఆర్. అంబేడ్కర్ అస్పృశ్యత నివారణోద్యమాన్ని ప్రారంభించారు.

1967 నాటికి జ్యోతిబాపూలే, సాహూ మహారాజ్, కారల్ మార్క్స్ సిద్ధాంతాలు నీగ్రో సాహిత్యంలోని తిరుగుబాటు కలగలిసి అంబేడ్కర్ భావజాలాన్ని ప్రధానంగా చేసుకొని "దళిత సాహిత్యం" ఆవిర్భవించింది. భారతదేశంలో ప్రధానంగా తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో బలంగా కనిపించి, దళిత ఉద్యమాలు ఊపందుకున్నాయి. 1981లో భారతీయ దళిత సమాచార పత్రికా సంపాదకుల సదస్సు జరిగింది. 1984లో భారతీయ దళిత సాహిత్య అకాడమీని స్థాపించారు. దీనితో రాజకీయంగా కూడా దళితులలో చైతన్యం వెల్లువెత్తింది. ఈ ప్రభావం కూడా తెలుగు సాహిత్యంపై కనిపించింది.

దళిత గేయం :

అస్పృశ్యతను నిరసిస్తూ 1909లో అజ్ఞాత కవి "మాలవాండ్ర పాట"లో అందారు పుట్టిరీ హిందమ్మ తల్లికి - ఎట్టాగు ఎక్కువ బ్యాపన్లు మాకంటె" అని నిలదీశారు. "మంచియన్నది మాలయైతే మాలనే అగుదన్" అని గురజాడ గారు అన్నారు. జయధీర్ తిరుమలరావు ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన "దళిత గీతాలు" (1993)లో చాలా వరకు అస్పృశ్యత నివారణకు ప్రయత్నించిన గేయాలున్నాయి. 1930లో రాసిన "అంటరానివారెవరు" గేయం, బొబ్బిలి యుద్ధం బుర్రకథ వరుసలో వీర రసాత్మకంగా సాగింది. నక్కా చిన వెంకయ్య "హరిజన కీర్తనలు"

బాగా ప్రసిద్ధి పొందాయి. బోయి భీమన్న, డా॥ బి.ఆర్. అంబేడ్కర్‌పై రాసిన ''జయ జయ అంబేడ్కర'' 1992 మాష్టార్టీ ''అందుకో దండాలు బాబా అంబేడ్కరా'' గేయాలు ప్రార్థనా గీతాలయ్యాయి. గద్దర్ పొట్ట కూటి కోసం ''పోలీసోడు'' ''దళిత పులులమ్మా'', గేయాలు, యువక ''కర్మభూమిలో పూసిన ఓ పువ్వా'', గూడ అంజయ్య రాసిన ''ఊరు మనదిరా ఈ వాడ మనదిరా'' గేయాలు దళితులను నేటికీ ఉర్రూతలూగిస్తున్నాయి. వంగపండు ప్రసాదరావు, శివసాగర్, ఉ.సాంబశివరావు ఇంకా అనేకమంది రాసిన గేయాలలో చాలా వరకు సంస్కరణ, మార్క్సిస్టు భావాలు అధికంగా ఉన్నా దళిత జీవితమే స్పష్టమవుతుంది.

1990లో చుండూరులో దళితులను ఊచకోతకోశారు. దీనితో అంతవరకు అభ్యుదయ, సంస్కరణోద్యమ విప్లవ సాహిత్యం రాస్తున్న తెలుగు రచయితలు, కవులు దళిత సాహిత్యంపై దృష్టిని కేంద్రీకరించారు. తెలుగు సాహిత్య చరిత్రలో 12వ శతాబ్దంలో శివకవులు నిమ్న జాతీయులని పిలవబడుతున్న దళితులను శైవమతం వైపు ఆకర్షించే టట్లు చేసిన రచనలు కొన్ని కనిపిస్తున్నాయి. 13వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు భక్తి ఉద్యమం పేరుతో హిందూ మతంలో సంస్కరణ దిశగా రచనలు వచ్చాయి. 16వ శతాబ్దానికి చెంది శ్రీ కృష్ణదేవరాయలు ''ఆముక్త మాల్యద''లో మాలదాసరి కథ రాయడంలోనూ కుల ప్రభావాన్ని గుర్తించారు.

17వ శతాబ్దంలో పోతులూరి వీరబ్రహ్మం, వేమన వంటి కవులు కులం వల్ల కలిగే సాంగిక నిమ్నోన్నతాలను నిరసిన్తూ రచనలు చేశారు. 18,19 శతాబ్దాలలో జమీందారీల పెత్తనం, వారి అధికారం క్షీణించటంతో పాశ్చాత్య పాలనకు, పాశ్చాత్య విద్యకు ద్వారాలు తెరిచాయి.

దళిత పద్య కవిత్వం :

అస్పృశ్యతా నివారణను ప్రతిఫలించే గేయాలు మాత్రం ఛందస్సులో పద్యాలలో దళిత, దళితేతరులు రాసినా, 1915లో మంగిపూడి వెంకటశర్మగారి ''నిరుద్ధ భారతం'' ఛందోబద్ధ దళిత పద్యకావ్యాల్లో మొదటి రచన. ఆ సాహిత్యాన్ని ప్రశ్నిస్తూ తనదైన అస్తిత్వంతో ముందు కొచ్చింది. వేమన, తత్వ కవులు మానవతా దృక్పథంతోనూ, జాతీయోద్యమం అస్పృశ్యతా సమస్యను ప్రధానంగా గుర్తించి, మతస్పృహలో దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేసింది.

అభ్యుదయ సాహిత్యం పీడిత శ్రామిక వర్గ సమస్య లలో భాగంగానే దళిత సమస్యలకు పరిష్కారాన్ని సూచిం చింది. విప్లవ సాహిత్యం గిరిజన సమస్యలతో పాటు దళిత సమస్యలను వర్గ దృష్టితో ప్రత్యేక ప్రాధాన్యాన్ని చ్చింది. ఆర్థిక కోణానికి అధిక ప్రాధాన్యాన్నిచ్చే విప్లవ స్పృహతో సమాంతరంగా సామాజిక, సాంస్కృతిక రంగా లలో కూడా దళిత చైతన్యం విస్తరించింది. వర్గం కంటే దళిత సమస్య ''కులం''తోనే ముడిపడి ఉందని గుర్తించి, ఆ అంశాలను ప్రధానంగా తీసుకొచ్చింది.

1909 లో ఒక అజ్ఞాత కవి రాసిన ''మాలవాండ్ర పాట''ను తొలి దళిత గేయంగా పరిశోధకులు సి.నారా యణరెడ్డి గారు ''ఆధునికాంధ్ర - సంప్రదాయల ప్రయోగాలు'' చెప్పడం జరిగింది. ఇది ఆంధ్ర భారతి మాసపత్రికలో అచ్చయ్యింది. 1915లో మంగిపూడి వెంకటశర్మ ''నిరుద్ధ భారతం'' అనే పద్య కావ్యాన్ని రాశారు.

1921లో రాసిన ''మేలుకొలుపు'' గీతం పురాణాల్లో దళితుల గొప్పతనం కీర్తించే విధంగా ఉంది. 1930లో జాలా రంగస్వామి రాసిన ''అంటరాని వారెవ్వరు'' పాట. 1933లోనే కుసుమ ధర్మన్న రాసిన ''హరిజన శతకం'' దళితుల మనోభావాలను బాగా పట్టుకోగలిగాయి. 1941 గుర్రం జాషువా రాసిన ''గబ్బిలం'' కావ్యంలో దళితుల వేదనా భరిత జీవితాలను,

''జెప్పుల కుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే దెప్పుడు
నప్ప వడ్డది సుమీ భారతావని వీని సేవకున్'' -

అని జాషువా వర్ణించాడు.

దళితుల శ్రమను విలువ కట్టడం సాధ్యం కాదం టున్నారు కవి.

గాంధీ ప్రభావంతో దళితేతరుడైన తుమ్మల సీతా రామమూర్తి అస్పృశ్యతా నివారణను కోరుతూ....

"హరిజనుల యందు నేను నొక్కరుండననుచు
నెపుడు ప్రతి హైందవుడు నిర్ణయించుకొనునూ
యపుడె యస్పృశ్యతా భూతమాపరిల్లు
నపుడె శుచితామయ సమాజయవతరించు"ను. అనే భావాలతో పద్యాలను రాశారు. ఇలా అనేక మంది పద్య కవిత్వం ద్వారా కూడా దళిత సమస్యను వర్ణించే ప్రయత్నం చేశారు. కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్నల మొ॥ కవులు తమ దళిత సాహిత్యాన్ని పద్య కవిత్వంతో తమ గళాన్ని అందించారు.

దళితుల గురించి తొలిసారిగా "నిరుద్ధ భారతం" కావ్యాన్ని రాసిన మంగిపూడి వేంకటశర్మ అస్పృశ్యతను నిరసిస్తూ....

"మాలలని, పంచములటంచు, మాదిగలని
శ్వపచులని, చెప్పగారాని వారటంచు
మరియు చండాలురని తోడి మానవులను
దురలి వేయుట సాంఘిక ధర్మమగునె"

అని సంఘాన్ని ప్రశ్నించారు. మొత్తం మీద దళిత పద్య కవిత్వంలో మూడు ప్రధాన ధోరణులు కనిపిస్తు న్నాయి. అవి 1. గాంధీ ప్రభావం 2. గాంధీ - అంబేడ్కర్ ప్రభావం 3. హేతువాద భావాలు గల పురాణ విమర్శతో కూడిన మానవతావాద ధోరణులుగా చెప్పుకోవచ్చు.

దళిత సాహిత్యం - ఆరంభ వికాసాలు :

భారతదేశ వ్యాప్తంగా జరిగిన పాలన, ఆర్థికపర అంశాల కారణంగా వచ్చిన సామాజిక ఉద్యమాలు వచ్చాయి. దాని ప్రభావంతో వెలువడుతున్న సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక ప్రత్యేక విభాగమయ్యింది.

1970లలో మరాఠీ, కన్నడ భాషలలో నిర్దిష్ట లక్ష్యాలతో, ప్రత్యేకమైన అభివ్యక్తులతో దళిత సాహిత్యం పురోగమించింది. 1980లో తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం నిర్దిష్ట రూపాన్ని పొందింది.

దళిత సాహిత్య - ప్రక్రియలు :

తెలుగులో దళిత సాహిత్యం ప్రధానంగా "దళిత కవిత్వమే" అన్నంతగా కవిత్వం వెలువడింది. అదే స్థాయిలో కాకపోయిన కథలు కూడా ఎక్కువగానే వచ్చాయి. నవలలు, నాటకాలు కూడా వచ్చిన సంఖ్యా పరంగా చెప్పుకోదగినన్ని రాలేదు. ఆత్మకథ అనువాదాలు కూడా కొన్ని వచ్చాయి. 1985 తరువాత వచ్చిన రచనల్లో జీవితానుభవాలతో కూడా దళిత చైతన్యం ప్రతిఫలిం చింది. వివిధ పుస్తకాలకు రాసిన ముందు మాటలు, పత్రికా వ్యాసాలు, పుస్తకాల రూపంలో దళిత సాహిత్యం విమర్శ వచ్చింది. విశ్వవిద్యాలయాల్లో దళిత సాహిత్యంపై పరిశోధనలు జరుగుతున్నాయి. అలా దళిత సాహిత్యం ప్రక్రియా వైవిధ్యాన్ని సాధించింది. ఆ తరువాత పేర్కొనదగిన పద్యాలు, కావ్యాలు, శతకాలు చాలా వరకు వచ్చాయి. అయితే అవి జాతీయోధ్య సాహిత్యంలో భాగంగా గాంధీ ప్రభావంతో వెలువడినవి.

కుసుమ ధర్మన్న (హరిజన శతకం - 1933), కర్ణ వీర నాగేశ్వరరావు (అస్పృశ్యుల విజ్ఞప్తి - 1936), బిర్రీడి మోషే (హరిజనాభ్యుదయం, (జోసెఫ్ కన్నీటి కబురు) (జాన్ - బహిష్కారం - 1963), సవ్వప్పగారి ఈరన్న (కడలి కెరటం - 1987), ఎన్.టి. జ్ఞానానంద కవి - పాంచజన్యం, ధర్మాగ్రహం, ఇలా ఎంతో మంది కవులు దళిత సాహిత్యం కోసం ఎన్నో సాహిత్య ప్రక్రియను పేర్కొనడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు కవితోద్యమాలు
2) తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న
3) గుర్రం జాషువా - గబ్బిలం
4) నిరుద్ధ భారతం - మంగిపూడి వెంకటశర్మ

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పై మెట్టు నవలలో – దళిత జీవన చరిత్ర

– డా॥. కె. పుష్పమ్మ, లెక్చరర్ ఇన్ తెలుగు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ (అ), రాజమండ్రి.

పై మెట్టు నవలా రచయిత ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు ఎనిమిది పదులు దాటిన ప్రాయంలో తన గత జ్ఞాపకాలను, బాల్యంలో తన స్వగ్రామం అయిన వేజండ్ల మాదిగ పల్లెలో, ఇళ్ళలో తాను చూసిన అనుభవించిన అనుభూతులను రంగరించి ఈ పై మెట్టు నవలను వ్రాశారు. కొలకలూరి ఇనాక్ గారు తెలుగు రచయిత, కవి, విమర్శకుడు, నాటకకర్త, తెలుగు సాహిత్యంలో ఆయన షోడశ కళా ప్రపూర్ణ వేయ్యేళ్ళ తెలుగు సాహిత్యాన్ని ఆయన మట్టి చేతులతో శాసించాడు. తాను కార్చిన ప్రతీ కన్నీటి చుక్కను కవిత్వీకరించాడు తెలుగు పదాలకు వెలుగులు దిద్దినాడు. ఆధునిక సాహిత్యంలో అన్ని ప్రక్రియల లోను రచనలు చేశారు. వేల మందికి విద్యదానం చేసిన ఉత్తమ ఆచార్యునిగా, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంను ప్రగతిపథంలో నడపిప ఉపకులపతిగా ఆయన విశేషమైన సేవలు అందించారు.

ఆయన సాహితీ కృషికి తగ్గ ఫలితంగా 2014వ సంవత్సరంలో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 1939 జూలై-1వ తేదీ గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి అతి సాధారణ కుటుంబం అసాధారణమైన స్థాయికి ఆయన ఎదిగిన తీరు ఎందరికో ఆదర్శనీయం. బాల్యంలో గుర్రం జాషువా ప్రభావం ఆయన పైన ఎక్కువగా వుండేది అందుకే జాషువాలాగా ఆయన కూడ కవి అయ్యాడు. తెలుగునవలా రంగంలో ఇనాక్ గారిది ఒక సుస్థిరమైన స్థానం ఆయన వ్రాసిన మొదట నవల సమత తరువాత, సౌభాగ్యవతి సౌందర్యవతి, ఎక్కడుంది ప్రశాంతి, రెండు కళ్ళు మూడు కాళ్ళు సర్కారుగడ్డి, అనంతజీవనం, రంధి, పైమెట్టు, వలస, కన్నతల్లి మొదలైన నవలలు వ్రాశారు. 2015వ సంవత్సరంలో ఇనాక్ గారి అనంతజీవనం నవలకు జ్ఞానపీఠ్ సంస్థ వారి మూర్తి దేవి పురస్కారం వచ్చింది.

పైమెట్టు నవలలో గుంటూరు వద్దగల వేజెండ్ల గ్రామంలోని మాదిగ పల్లెలోని జీవన విధానంను మన కన్నులకు కట్టినట్టుగా రచయిత నవలలో చూపించారు. నవల ప్రారంభమే పెళ్ళి పందిట్లో పెళ్ళి జరగడంతో ప్రారంభిస్తారు. రచయిత పెళ్ళి పందిట్లో పెళ్ళి ఆగి పోతుంది. ఈ పెళ్ళి జరుగుతుందని కొందరు జరగదని ఇంకొందరు చర్చించుకుంటూ వుంటారు. మాదిగల ఇళ్ళలో ఏ శుభకార్యం జరిగినా పౌరోహిత్యం వహించే మాదిగదాసు కాలుకాలిన పిల్లిలా అటు ఇటు తిరుగుతూ వుంటాడు. పెళ్ళి పందిట్లో, కథలోనికి ప్రవేశిస్తే మాదిగ పల్లెలో బుజ్జులు అనే ఒక మాదిగ వ్యక్తి వుంటాడు. అతని భార్య పేరు మల్లీ వాళ్ళకు ఒక్కగానొక్క కొడుకు దొర బాబు బుజ్జి తన చెల్లి నల్లమ్మ పెళ్ళి చేసి నారాకోడూరు అత్తారింటికి కాపురానికి పంపించేటప్పుడు నాకు కొడుకు పుడితే నీకు పుట్టే కూతురితో పెళ్ళి జరిపిస్తాను అని మాటిచ్చాడు. దానికి నల్లమ్మ సంతోషపడుతుంది. బుజ్జులు భార్య మల్లికి ఒక తమ్ముడు వున్నాడు అతని పేరు చిట్టోడు వాడికి వాళ్ళ అక్క అంటే వల్లమాలిన ప్రేమాభిమానాలు, అక్కకొడుకు దొరబాబును పుట్టినప్పటి నుండి నేలపైదించకుండా అల్లారుముద్దుగా పెంచు కుంటాడు. దొరబాబుకు తనకు పెళ్ళి అయిన తరువాత పుట్టే పిల్లను ఇచ్చి పెళ్ళి చేయాలి అనుకుంటాడు. వీడే నా అల్లుడు అని మురిసిపోతాడు. తన అక్క మల్లిదగ్గర మాటకూడ తీసుకుంటాడు. నాకు కూతురు పుడితే దొరబాబుకు ఇచ్చి వివాహం జరిపించాలి అని ఆమె మాట ఇస్తుంది. తమ్ముడికి అయితే చిట్టోడికి పెళ్ళి జరుగుతుంది. కాని వాడి భార్యకు అబ్బాయి పుడతాడు. ఎలా అయినా దొరబాబూని అల్లుడుగా చేసుకోవాలి అనే

బలమైన కోరికతో వేజెండ్లకు ఉత్తరంగా వుండే మాదిగలకు ఉపకులం అయిన చిందుభోగం స్త్రీ అయిన రవ్వతో కన్నెరికం కుదుర్చుకుంటాడు. ఈ కన్నెరికం అనేది ఆనాటి పెద్దలు సృష్టించిన దురాచారం. చిందుకులం వాళ్ళతో మాదిగ కులంలోని మగవాళ్ళు కన్నెరికం చేస్తారు. అయితే ఇది పెళ్ళిలాంటిది మాత్రం కాదు. కన్నెరికంలో వుండే ఆమె మిగతా మగవారితో పొందు కుదుర్చుకోరాదు. ఇది లైంగిక దోపిడిలాంటిది. కన్నెరికం వల్ల పుట్టన పిల్లలకు మాదిగల ఇంటిపేరు గానీ, ఆస్తిపాస్తుల్లో చిల్లిగవ్వ కూడా వాటా ఉండదు. కన్నెరికం పెట్టుకునే మగాడు సోమరి అయితే ఆ చిందుభోగం స్త్రీనే అతనిని పోషించాలి.

చిట్టోడు, రవ్వతో కన్నెరికం పెట్టుకునేటప్పుడు మాదిగ పెద్దల సమక్షంలో రవ్వ చిట్టోడినీ నీ ఆస్తి, అంతస్తులు, ఏమి నాకు వద్దు. నీ ఇంటి పేరు మనకు పుట్టబోయే బిడ్డకు ఇవ్వమని అడుగుతుంది. దానికి పెద్ద మనసు చేసుకుని మాదిగ పెద్దలు అందరూ అంగీకరిస్తారు. క్రింద మెట్టులో వున్న రవ్వ తనకు జన్మించబోయే బిడ్డ కోసం చైతన్య స్ఫూర్తితో ఒక అడుగు పైకి వేసి పై మెట్టు ఎక్కింది. నిజంగానే చిట్టోడి కోరిక తీరింది. అతనికి ఒక అందమైన అమ్మాయి జన్మించింది. ఆమె పేరు మువ్వ. దొరబాబుతో పాటుగా చదువుకునేది. దొరబాబు నీకు బావ అవుతాడు. అతడే నీ మొగుడు అని చెప్పి పెంచసాగినాడు చిట్టోడు. కాలం గడిచింది. దొరబాబు యుక్త వయస్సుకు వచ్చాడు వాడికి పెళ్ళి చెయ్యాలి అనుకుంటాడు బుజ్జి ఈ విషయం తెలిసి అతని చెల్లెలు నల్లమ్మ ఆఫు మేఘాలు మీద వేటపాలెం నుండి వచ్చి అన్న తనకు ఇచ్చిన మాటను గుర్తుచేస్తుంది. ఆమె కూతురు కే తన బిడ్డను ఇచ్చి పెళ్ళి చేస్తాను అని చెప్పి ఆమెను సంతోషపరుస్తాడు. ఈ విషయం తెలిసి చిట్టోడు, రవ్వ తన అక్క వద్దకు వచ్చి నా కూతురు మువ్వతోనే పెళ్ళి జరిపించాలి అని పట్టుబడతాడు. ఎవరితో పెళ్ళి జరిపించాలో తెలియక బుజ్జి, మల్లి తలలు బాధుకుంటారు. దైవం పైన భారం వేసి అనుకున్న ముహూర్తంకు నల్లమ్మ కూతురుతో పెళ్ళి అని ఏర్పాట్లు చేసుకుంటాడు. వేజెండ్ల మాదిగ పల్లెలో పెద్ద సందడి మొదలైంది. మాదిగదాను మంత్రాలు చదవడం ప్రారంభించాడు. కొద్ది నమిషాలలో తాళికట్టేతతంగం ప్రారంభం అవుతుంది అనగా అక్కడ ఒక ఆశ్చర్య సంఘటన జరుగుతుంది. చిట్టోడి కూతురు మువ్వ పెళ్ళి బట్టలు ధరించి ఒడిపాలు కట్టుకుని పెళ్ళి పందిట్లోకి వచ్చి నాకు కూడా బావతో పెళ్ళి జరిపించండి లేకుంటే ఇక్కడే చస్తాను అని అంది. అందరు ఆశ్చర్యపోయారు. మాదిగ పెద్దలకు ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. నా కూతురుకు న్యాయం చెయ్యమని అడిగింది రవ్వ. ఇంతలో ఒకడు నల్లమ్మ కూతురుతో మనువు, నీ కూతురుతో కన్నెరికం అంటాడు. ఆ మాట వినగానే అపరకాళిలా వాడిమీద విరుచుకుపడుతుంది. ఆమె భోగంది కాదు మాదిగ మగాడికీ పుట్టిన మాదిగస్త్రీ నా కూతరు మువ్వ అది కాపురమే చేస్తుంది. కన్నెరికం కాదు అని చెబుతుంది. మాదిగ పెద్దలు అందరూ దానికీ అంగీకరిస్తారు. నిజమే అంటారు. చివరకు అందరూ కలిసి దొరబాబుకు ఇద్దరు అమ్మాయిలతో వివాహం జరిపిస్తారు. వాళ్ళు చాలా అన్యోన్యంగా కాపురం జరుపుకుంటారు. కన్నెరికం అనే ఒక సాంఘిక దురాచారంపై రచయిత తిరుగుబాటు చేశాడు. కుల, వర్ణ వ్యవస్థలు నశించి, సమ సమాజం ఏర్పడాలి అంటే కులాంతర వివాహాలు జరగాలి అన్న అంబేడ్కర వాదంను ఇక్కడ రచయిత ప్రస్ఫుటంగా మనకు చూపిస్తాడు. పిల్లల ఇష్టాలకు విరుద్ధంగ పెద్దలు మాటలను ఇచ్చిపుచ్చుకుని వాళ్ళ బ్రతుకు నాశనం చేయరాదని దీని ద్వారా సందేశం ఇచ్చాడు.

ఆధార గ్రంథాలు :

1) పై మెట్టు నవల - కొలకలూరి ఇనాక్
2) మాల, మాదిగల చరిత్ర - బొనిగల రామారావు
3) మాదిగ వారి చరిత్ర - తాళ్ళూరి లాబన్‌బాబు
4) మాదిగ తత్వం - కంచె ఐలయ్య

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – తాత్విక నేపథ్యం

– డా॥. యన్.కొచ్.పి. కిరణ్ కుమార్, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాయుడుపేట - నెల్లూరు జిల్లా.

ఈ దేశంలో దళితులు ఎప్పుడు పుట్టారో దళిత సాహిత్యం కూడా అప్పుడే పుట్టింది. అయితే అది నివురు కప్పిన నిప్పులా దాగి ఉంది. దాగి ఉంది అనడం కంటే దౌర్జన్యంగా బలవంతంగా, అమానుషంగా దాచివేయ బడింది అనడం సమంజసం. దళితవాదం, దళిత సాహిత్యం - భాషలు వేరు కావచ్చు, ప్రాంతాలు వేరుకావచ్చు, మనుషులు వేరు కావచ్చు కాని భాధ మాత్రం ఒక్కటే. దళిత వాదం ఈ రోజు ఉన్నపళంగా పుట్టుకొచ్చింది కాదు. ఈ పుట్టుక వెనుక వేల సంవత్సరాల అణచివేతలు, మూకుమ్మడి ఊచకోతలు, మానసిక, శారీరక, సామాజిక పరమైన తొక్కివేతలు చరిత్రలో సాక్ష్యాలుగా ఉన్నాయి.

దళితులు' అంటే ఎవరు ?

మనిషి మనుగడకు కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడు నోచుకోని నిర్భాగ్యులు. ఊరిక దూరంగా ఉండి ఉనికిని కోల్పోయిన వారు. దళితుల పుట్టు పూర్వోత్తరా లను నిర్దేశించుట కష్టము. ఆర్య ద్రావిడ సంఘర్షణలో ఆర్యులకు లొంగినవారు శూద్రులని లొంగని వారిని వెలివేయబడిన వారు అనగా అంటరాని వారుగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నాడు.

దళితోద్యమానికి దోహదం చేసిన అంశాలు :

చారిత్రక నేపథ్యమేకాక, అనేక ఇతర అంశాలు కూడా దళితోద్యమానికి దోహదం చేశాయి. ఏమనగా :- 1) ఆంగ్ల విద్యా విధాన ప్రభావం వలన జనించిన నూతన భావోద్యమాలు (హేతువాదం, మానవతావాదం) 2) కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావము, 3) పేదరికం, 4) గ్రామీణ ప్రాంతాల్లో సాగే వివక్ష, దౌర్జన్యాలు 5) సాహిత్య రచనలు, 6) దళిత (పూలే, అంబేద్కర్ మొ॥) దళితేతర (గాంధీ వంటి నాయకులు) నాయకుల ఉద్యమాలు మొ॥నవి.

దళిత సాహిత్యానికి సైద్ధాంతిక, తాత్విక భూమికలు ఏమిటి ? అనే ప్రస్న ఇవాళ తెలగు సాహిత్యంలో ప్రధానంగా వినబడుతుంది. అలాగే రాజకీయ భావజాలం విషయంలో కూడా విభిన్న ప్రతిస్పందనలు వినబడు తున్నాయి.

"హిందూ ఫాసిస్టు వ్యతిరేక, బ్రాహ్మణీయ అగ్రవర్ణ వ్యతిరే, భూస్వామ్య పెట్టుబడిదారీ వ్యతిరేక వర్గ కుల, మత 'సామాజిక విప్లవ అవగాహన' ఈ ఉద్యమాలకి దేశీయ సైద్ధాంతిక భూమికగా ముందుకొచ్చింది. ఇండియాలో మార్క్సిజాన్ని ఆవరించిన బ్రాహ్మణిజాన్ని, మార్క్సిజానంపై దాని ఆధిపత్యాన్ని కూలద్రోసి అందుకు కరదీపికను అందించిన అంబేద్కర్ సామాజిక విప్లవ అవగాహనతో మార్క్సిజం నెయ్యం చేయడానికి పూనుకొంటుంది. దళిత విప్లవకారుల చేతుల్లో అది ఈ దేశ నిర్దిష్ట వర్గ కుల సమాజానికి అన్వయించే శాస్త్రంగా రూపొందుతుంది. మరోవైపు అంబేద్కర్ దృక్పథం మార్క్సిస్టు దృక్పథం రెంటినీ సమన్వయం చేయాలా? రెంటిలో ఏదో ఒకటే స్వీకరించాలా ? లేక రెంటినీ నిరాకరించి సరికొత్త సిద్ధాంతాన్ని అన్వేషించాలా అనే సిద్ధాంత చర్చ సాగుతోంది. అంబేద్కర్ సామాజిక విప్లవ వర్గకుల దృక్పథాన్ని పునాది చేసుకొనే ఈ చర్చంతా సాగుతోంది. దళిత సాహిత్యోద్యమానికి ప్రధానంగా అంబేద్కర్ సామాజిక విప్ల దృక్పథం సైద్ధాంతిక పునాదిగా ఉంది.

ఈ నేపథ్యంలో మరికొందరు మార్క్సిజాన్ని, దళిత వాదాన్ని కలిపి చూడడానికి గానీ కలిపి రాయడానికి గానీ ఇష్టపడడం లేదు. శుద్ధ అంబేద్కర్ వాదమే దళిత సాహిత్యానికి తాత్విక భూమికగా కొందరు రచనలు చేస్తున్నారు. అయితే దళితులు ఆత్మగౌరవం కోసం,

సామాజిక ఆర్థిక సాంస్కృతిక విముక్కి కోసం పోరాడే శాస్త్రీయమైన దళిత చైతన్యాన్ని రగిల్చి దళిత సాహిత్యానికి ఒక వెలుగు భూమికను సమకూర్చి సమగ్రమైన తాత్విక దృక్పథాన్ని ఇచ్చినవాడు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ అనేది ఒక చారిత్రక సత్యం.

ఆధునిక సాహిత్యానికి ఇరవయ్యో శతాబ్ధాన్ని ప్రారంభ దశగా గుర్తించాలి. దళిత సాహిత్యం ప్రారంభ దశలో దళితేతరులు రాసిందే. కందుకూరి వీరేశ లింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం పంతులు మొదలైన వారు కులవ్యవస్థను, వర్ణ భేదాలను నిరసించి మానవతను ప్రబోధించారు. ఆనాటి బ్రహ్మసమాజం ఆంధ్ర దేశంలోని మేధావులను బాగా ప్రభావితం చేసింది. మనవతావాదం, సంఘ సంస్కరణ ప్రధాన లక్షణాలుగా కొనసాగింది.

"మంచియన్నది మాలయైతే
మాలనేనవుదున్" అని గురజాడ ఉదారంగా ప్రకటించడంలో కూడా సానుభూతితో కూడుకున్న సంసణ్ణ దృష్టే కనబడుతుంది. సరిగ్గా ఈ దృష్టితోనే దళితుల మీద సానుభూతితో ఎన్నో గేయాలు, పద్య కావ్యాలు వెలిశాయి. దళితులను నవలల్లో పాత్రలుగా చిత్రించడం మొదలు పెట్టారు. 1913లో వెలువడిన తల్లాప్రగడ సూర్య నారాయణ "హేలావతి" నవల, 1922 ప్రాంతంలో వచ్చిన ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' నవల మొదలైన వాటిని ఉదారవాదంలో నుంచి పుట్టిన సానుభూతితో కూడిన రచనలుగానే భావించాలి. అలాగే 1915లో వెలువడిన మంగిపూడి వేంకటశర్మ 'నిరుద్ధ భారతం" కావ్యంలో నిమ్నజాతుల నికృష్ట జీవితాలను ఎంతో హృదయ విదారకంగా చిత్రించారు. అయితే వీరి రచనల్లో సానుభూతి చోటు చేసుకున్నా దళితాత్మ మాత్రం కనిపించదు. మళ్ళీ జాషువా 'గబ్బిలం' (1942) ప్రవేశంతోనే నిజమైన దళిత సాహిత్యానికి జవజీవాలు ఏర్పడ్డాయి. జాషువా మీద అంబేద్కర్ ప్రభావం కంటే గాంధీ ప్రభావమే అధికంగా కనబడుతుంది.

'దిగంబర కవులు' తమ మూడో కవితా సంకలనాన్ని అగ్రవర్ణస్థుల చేతిలో నజీవదహనానికి గురయిన 'కంచికచర్ల కోటేశు' కు అంకితం ఇచ్చి దళిత స్పృహను బలంగా గుర్తించడం వల్ల ఈ సంఘటన సాహిత్య చరిత్రలోను, సామాటక చరిత్రలోను ఒక కొత్త మలుపు తీసుకుంది. 1985లో జరిగిన కారంచేడులోని దళితుల హత్య మొత్తం దేశాన్ని కుదిపేసింది. సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకుంది. దళితులు ఏరకంగా ఎదిగినా, నాగరకంగా మారినా సమాన స్థాయిలో కనబడినా సవర్ణులకు దుర్భరంగా ఉంటుంది. అణిగి మణిగి ఉండవలసిన వాళ్ళు ఆత్మ గౌరవంతో తలెత్తుకొని నడవడం, తమతోపాటు స్వేచ్ఛను, సమానత్వాన్ని అనుభవించడం అగ్రవర్ణస్థులకు నచ్చదు. ఈ కారణాల వల్లనే కారంచేడు, నీరుకొండ, పదిరికుప్పం, చుండూరు మాత్రమే కాదు, వార్తలకెక్కిన ఇలాంటి ఎన్నో సంఘటనలు దళితులను జాగృతం చేసి దళితవాదానికి పోరాట స్ఫూర్తిని కలిగించాయి. ఒకవైపు దళిత సాహిత్యాన్ని సృష్టిస్తూనే మరోవైపు దళిత ఉద్యమాలకు బలమైన నాయకత్వాన్ని వహిస్తున్న కత్తి పద్మారావు, శివసాగర్, బొజ్జాతారకం, బి.యం.లీలాకుమారి మొదలైన వారి పాత్ర పరోక్షంగ దళిత సాహిత్య వికాసానికి దోహద పడింది.

అలాగే దళిత వాదానికి సైద్ధాంతిక, తాత్విక భూమికను ఏర్పరచడంలో తత్వవేత్త బి.యస్. రాములు, కంచ ఐలయ్య, జి. లక్ష్మీ నరసయ్య మొదలైన మేధావుల నూతన ఆలోచనలు, విమర్శలు, విశ్లేషణలు, దళితవాదాన్ని దళిత వహిత్యాన్ని ముందుకు తీసుకొని పోతూ శక్తివంతం చేస్తున్నాయి. ఉ. సాంబశివరావు, మాష్టార్జీల పాటలు దళిత సాహిత్య భావజాలాన్ని సామాన్య ప్రజల్లోకి పరివ్యాప్తం చేయడంలో విజయ వంతమవుతున్నాయి.

ఇవాళ తెలుగు కవిత్వంలోనే కాదు, కథ, నవల, నాటిక, జానపద రూపకాల్లోనూ దళిత సాహిత్యం

శాఖలుగా విస్తరిస్తోంది. కొత్త రూపాయలు చేరడంతో నిండుదనం వచ్చింది. కొత్త ప్రశ్నలు తలెత్తడంతో పాత విలువలు తమ ఉనికిని కోల్పోవలసి వచ్చింది. ఎనభయ్యో దశకం తెలుగు కవిత్వం రూపవాదుల చేతుల్లో పడి కొంతకాలం సంక్లిష్టతకు, అస్పష్టతకు దారి తీసింది. దళిత, స్త్రీవాదుల ప్రవేశంతో ఆ పెడధోరణులు వెనకడుగు వేయక తప్పలేదు. దళిత సాహిత్యం రాకతో తెలుగు సాహిత్యంలోకి సరికొత్త వస్తు రూపాలు ప్రవేశించాయి. ప్రక్రియాపరంగా చూస్తే కథ, నవల కంటే కూడా పాట, కవిత్వం విభిన్న వైవిధ్యాలతో పాటు విస్తృత ప్రచారాన్ని పొందాయి.

దళిత సాహిత్యం వస్తురూపాల్లో ప్రారంభదశల్లోని విమర్శలను దాటి, ఒక రకంగా ఎదుర్కొంటూ రూపవాదులకు, రసవాదులకు, సువర్ణ వాదులకు దీటుగా తమ సొంత ఉనికిని ఏర్పరచుకొంది. దళిత సాహిత్యం వస్తుపరంగా విభిన్న కోణాల నుంచి దళిత సంస్కృతిని, దళిత జీవితాన్ని శక్తిమంతంగా ఆవిష్కరిస్తోంది. ఇప్పుడు దళిత సాహిత్యం ఆర్తిలోంచి, ఆవేదన నుంచి బయట పడుతూ ఆగ్రహించే స్థాయికి చేరుకుంది. ఒక ప్రత్యామ్నాయ వాతావరణాన్ని సృష్టించుకుంది. పూర్తిగా ధ్వంసమైపోయిన శిథిలాల్లోంచి మళ్ళీ ఒక ఉద్యానవనం వికసించినట్లు వర్ణ వ్యవస్థతో పతమనమైపోయిన ఈ సమాజం మళ్ళీ దళితుల చిరునవ్వుతో ఉదయిస్తుంది. మళ్ళీ సాహిత్య చరిత్రలో ఒక స్వర్ణయుగమంటూ వస్తే ఒక్క దళిత సాహిత్యం వల్లనే వస్తుందని వర్తమాన దళిత సాహిత్యం కొత్త వాగ్ధానం చేస్తోంది.

ఆధారాలు :

1. ఇవాల్యుఏషన్ ఆఫ్ తెలుగు దళిత లిటరేచర్ - కె. పురుషోత్తం
2. హిస్టరీ ఆఫ్ తెలుగు దళిత లిటరేచర్ - తుమ్మపూడి భారతి
3. ప్రాస్‌పెక్టివ్ తెలుగు దళిత లిటరేచర్ - కేశవ కుమార్

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"బొట్టు భోజనాలు కథలో దళిత స్త్రీ మానసిక స్థితి"

– డా॥. పసుపులేటి నాగమల్లిక, తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

మన దేశంలో ఆనాదిగా బొట్టు అనేది సంస్కృతి సంప్రదాయలకు మతానికి సంకేతంగా నిలుస్తుంది. నిలువు బొట్టు, అడ్డ బొట్టులు హిందూ మతంలో రెండు పార్శ్వాలైతే, సింధూరం, విభూతి, కుంకుమలు రంగుల మూలంగా వేరు వేరు రకాల దేవుళ్ళకు ప్రతీకులుగా నిలుస్తున్నాయి. ఆడైనా, మగైనా, పిల్లలైనా, పెద్దలైనా హిందువులైతే మాత్రం ఏదో ఒక సందర్భం మరిచి పోతారేమో కానీ బొట్టు లేకుండా బయట తిరగరు. ఆ బొట్టును బట్టి వాళ్ళు ఏ మతం వారో ఇట్టే తెలిసి పోతుంది. బొట్టును అన్ని కులాల వాళ్ళు పెట్టుకున్నా, హిందూ మతం దళితుల్ని దూరంగా పెట్టడం, ఆ కాలనుక్రమంలో ఆంగ్లేయులు ఇండియా వచ్చినపుడు దళితుల్ని చేరదీయడం, చదువు సంధ్యలు చెప్పించడం, దళితుల్ని మనుషులుగా అక్కున చేర్చుకోవడం వల్ల వారు ఆంగ్లేయుల క్రైస్తవ మతం పట్ల ఆకర్షితులై ఆ మతాచారం ప్రకారం బొట్టు లేకుండా ఖాళీ నుదురుతో ఉండడం అలవాటు చేసుకోవడం జరిగింది.

సాధారణంగా దళితులు పేదవారు కాబట్టి చెవులకు గానీ ముక్కులకు గానీ ఆభరణాలు లేక బోసిగా ఉండడంతో బొట్టు లేకుండా ఖాళీ నుదురుతో ఎవరైనా స్త్రీలు కనిపిస్తే వారు దళితులే మోననే అనుమానంతో ప్రతక్షంగానో, పరోక్షంగానో వివక్షకు గురి అవుతున్నారు. దీనిని ఎదుర్కొనే వారికి మాత్రమే తప్ప వివక్ష చూపే వారికి, ఎరగని వారికి ఆ బాధ, ఆ ఆవేదన, ఎన్నటికీ అర్థం కాదు. బొట్టులేని మొహాలతో దళిత క్రైస్తవులు పడే అవమానాలను, పోగొట్టుకునే అవకాశాలను అక్షరబద్ధం చేసారు ప్రముఖ వర్ధమాన రచయిత్రి మానస ఎండ్లూరి.

ఈమె ప్రసిద్ధ కవి, రచయిత, ఆచార్య ఎండ్లూరి సుధాకర్, పుట్ల హేమలత దంపతులకు జన్మించారు. మానస నిబద్ధత కలిగిన రచయిత్రి. కథలు తక్కువే అయినా విషయంలో మంచి సామాజిక స్పృహ ఉంది. నేటి డిజిటల్ ఆధునిక యుగంలో 22 కథలని రాసిన మేటి కథా రచయిత్రి. అవి వివిధ పత్రికల్లో ప్రచురించబడి "మిళింద" అనే కథా సంపుటంగా 2018 ఏప్రిల్ పాఠక సమాజానికి అందించారు. వాటిలో బొట్టు ప్రాధాన్యత గల బొట్టు, దొంగబొట్టు, బొట్టు గుర్తు, బొట్టు కుక్క మొదలగు బొట్టు కథల్లో బొట్టు భోజనాలు కథలో దళిత స్త్రీ పడిన మానసిక సంఘర్షణని మానస గారు కళ్లకు కట్టినట్లు చూపించారు.

ఈ కథలో కథకురాలు విద్యావంతురాలైన, స్థితిమంతురాలైనా, కలుపుకోలు, మనిషైనా దళితురాలు గానే పరిగణిస్తారు. ఈమె ఓ కళాశాలలో లెక్చరర్. వాళ్ళ డిపార్టుమెంట్లో స్టాఫ్ కలివిడిగానే మాట్లాడుకుంటారు. కానీ వాళ్ళంతా హిందువులు. కథకురాలు వచ్చాక వారు కొంత కలవరపాటుకు గురౌతారు. కథకురాలు క్రైస్తవ కుటుంబం నుండి రావడంతో బొట్టు పెట్టుకోకపోతే ఓ టీచర్ అడుగుతుంది. మీరు క్రైస్తవులు కదా అంటే ఏం ముస్లింలు అవ్వచ్చు కదా అని తిరిగి ప్రశ్నిస్తుంది కథకురాలు. దానికి ఆ టీచర్ ఆ మాత్రం తెలియదా అని అనడంతో కథకురాలు మనస్సు చివుక్కుమంటుంది. స్టాఫ్ వాళ్ళందరి ఇళ్ళలోని తినుబండారాలు గానీ, కూరలు గానీ, ప్రసాదాలు గానీ అందరూ పంచుకుని తింటారు. కథకురాలికి తాను దళితురాలిననే భావన ఎప్పుడు కలుగుతుందంటే కథకురాల్ని పిలవకుండా మిగతా స్టాఫ్ వాళ్ళంతా కార్తీకమాస వన భోజనాలకు వెళ్తారు.

ఆ విషయం తెలియక కథకురాలు ఒక్కతే కళాశాలకు వచ్చి స్టాఫ్‌లో ఏ ఒక్కరూ కనిపించక, ఎప్పుడూ కనిపించని ఆయా కనబడడంతో వెళ్ళి విషయం కనుక్కుంటుంది.

అందుకు ఆమె ఇలా అంటుంది మిమ్మల్ని ఎలా పిలుస్తారమ్మా వాళ్ళంతా అగ్రవర్ణాలు, మీరు మాదిగ కదా అందుకే పిలవరని అనడంతో కథకురాలు మనసులో వేదన చెందుతుంటుంది.

ఆ వన భోజనాలు నుంచి ఆయా మార్తమ్మ మాటలు మరలాలని తన మానభిమానాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఇలా అంటుంది. వన భోజనం అంటుంటే చిన్నపుడు దానవాయిపేట అన్నపూర్ణ మెన్ 'బుట్ట భోజనం' దొరికేది అది గుర్తొస్తుంది మార్తమ్మా అని భోజనాలమ్మా" అని కథకురాలు అంటే మార్తమ్మ ఇలా చమత్కరిస్తుంది "అయ్యి బుట్ట భోజనాలైతే ఇయ్యి బొట్టు భోజనాలమ్మా.." అని తన అసహాయతను, చేతకాని తనాన్ని అదొక రకమైన నవ్వుతో అంటుంది. కథకురాలు బయటపడలేక మనస్సులో ఆ విషయం పట్ల బాధపడుతూ నేను దళిత స్త్రీగా జన్మించడం వల్ల సాటి స్త్రీల చేత ఇలా అవమానం భరించలేకపోతుంది. మరుసటి రోజు స్టాఫ్ వారందరూ యధాలాపంగా నవ్వుతూనే కనిపిస్తారు కానీ ఎక్కడా తోటి సహోపాధ్యాయిని పిలవలేదనే బాధగానీ, భావంగానీ కనిపించదు. వాళ్ళ కళ్ళల్లో కానీ వివక్ష గాయం తగిలిన కథకురాలు మాత్రం మౌనంగా ఉంటూ తన స్థానాన్ని గుర్తు చేసినందుకు మనస్సులో బాధను అనుభవిస్తూ ఉంటుంది.

కాలం గాయాన్ని మనుషుల మధ్య దూరాన్ని మాన్పుతుంది. ఈలోగా క్రిస్మస్ పండుగ నెల ప్రారంభం కావడంతో కథకురాలు ఇంట్లో ఆ పండగ వాతావరణంలో నిండిపోతుంది. దాంతో ఇంట్లో చేసిన తినుబండారాల్ని తన స్టాఫ్ వాళ్ళందరికీ తీసుకెళ్ళి సంతోషంతో ఇవ్వబోయే సరికి 'కార్తీకమానం ఉపవాన' మని సున్నితంగా తిరస్కరిస్తారు. కానీ కార్తీక మాసం ఎప్పుడో ముగిసిపోయిందని కేవలం తాను దళితురాలైనందునే తాను తెచ్చిన పదార్థాలను తీసుకోవడం లేదన్న సంగతి గ్రహించి కుమిలిపోతుంది.

క్రిస్మస్ పండుగ రోజు మాత్రం స్టాఫ్ వారందరూ క్రిస్మసు శుభాకాంక్షలు చెప్పారు. విషెష్ చెప్పిన స్టాఫ్ వాళ్ళందర్ని ఆ రాత్రి పండుగ విందుకు ఆహ్వానిస్తుంది. వాళ్ళు వస్తామంటారు. దాంతో తన స్టాఫ్ వాళ్ళంతా వస్తారనే ఆనందంతో చికెన్, మటన్ బిర్యానీ, గోంగూరా మాంసం, గాయిత్రి వేడం బ్రహ్మణురాలైనందున ఆమెకు ప్రత్యేకంగా కందాబచ్చల్ని, పనసపొట్టుకూర వంటి వంటకాలన్ని తయారు చేయించి డైనింగ్ టేబుల్ మీద పెట్టి స్టాఫ్ కోసం వేచిచూస్తూ ఫోన్లు చేస్తూ వుంటుంది. కానీ ఏ ఒక్కరూ రాత్రి పది అవుతున్నా రాకపోయే సరికి ఓ నిశ్చయానికి వచ్చేస్తుంది ఆ కథకురాలు. వారి దృష్టిలో తను ఎప్పటికీ దళితురాలినే అని తన మనసుకి చెప్పుకుంటుంది. సహ ఉపాధ్యాయులని అరులుచాచక, తన అవసరం ఎవరికుందో వాళ్ళే నావారని దృఢ నిశ్చయానికి వచ్చేసి తను తయారు చేయించిన వంటలన్నీ మూడు బుట్టల్లో సర్ధించి ఆయా మార్తమ్మ ఇంటికి ప్రయాణం అవుతుంది.

మార్తమ్మ ఇల్లు వెదుకుతూ వెళ్ళి చూసే సరికి మార్తమ్మకి తింటానికి తిండిలేక ఖాళీ కడుపుతో నేలమీద పడుకోవడం గమనించి, లేపి తను పట్టుకెళ్ళిన మూడు బుట్టల్లో ఒక బుట్టను అందిస్తుంది కథకురాలు. దానికి మార్తమ్మ మహాదానంద పడిపోతూ ఇలా అంటుంది. "పొద్దుట్నుంచీ ఏమీ తినలేదమ్మా! చర్చిలో రెండు కేకు ముక్కలు, ఒక చాక్లెట్టు, అరటిపండు ఇచ్చారు. అయ్యి కూడా చర్చి బయట అడుక్కునే వాళ్ళకి ఇచ్చేశాను. నీరసంగా ఉండి పడుకునేసరికి నిద్రపట్టేసింది. నా మొర ఆలకించి ఆ ప్రభువే మిమ్మల్ని పంపారమ్మా..!!" అనడం బట్టి కలిగి వున్నవారు రాలేదనే బాధ కన్నా పేద వారికి అందులోనూ ఆకలితో ఉన్న వారికి పెట్టి వాళ్ళ ఆనందంలో మన ఆనందాన్ని వెదుక్కోవాలన్న రచయిత్రి అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ కథలో విద్యావంతురాలైన దళిత స్త్రీ తోటి వారితోనే వివక్షను ఎదుర్కొంటే ఒక సాధారణ దళిత స్త్రీ ఈ సమాజంలో ఇంకేంత వివక్షను ఎదుర్కొంటూ మానసిక వేదన అనుభవిస్తున్నదో మనమే ఆలోచించాలి.

దళితులంటే విలువ లేకుండా చూసే ఈ భారత దేశంలో బొట్టు పెట్టుకోకపోతే మేమే దళితులమని స్పష్టంగా తెలుస్తుంది. బొట్టు ఒక సింబల్లా మారి పోయినందు వల్ల ఈ కథలోని పాత్రలు సందర్భాను సారంగా వెల్లడి చేయడం జరిగింది. బొట్టు భౌతిక పరమైందని, మనసు అంతరంగికమైనది. బొట్టు కంటే మనస్సే ప్రధానమని, కులం కంటే గుణమే చూడదగ్గదని, దళిత స్త్రీ పడే మానసిక స్థితిని, కడుపు నిండిన వాడికి పెట్టేకన్న ఆకలితో ఉండే వాని ఆకలి తీర్చాలని వంటి సామాజికపరమైన అంశాలు తెలియజేస్తూ సామాజిక స్పృహ కలిగించే విధంగా కథని మానస ఎండ్లూరి రాశారని చెప్పవచ్చు. మానవత్వపు విలువలతో పాటి మనిషికి గౌరవ మర్యాదలు ఇవ్వాలని విభేదాల్ని మరిచి మనుగడ సాగించాలని కోరుకుందాము..

ఆధార గ్రంథాలు :

1. మిళింద కథల సంపుటి - మానస ఎండ్లూరి
2. దళితుల సామాజిక సాంస్కృతిక చరిత్ర - డా॥ కత్తి పద్మారావు
3. జాషువా అనర్ఘరత్నాలు - తాళ్ళూరి లాబాబ్బాయి
4. కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంఘ సంస్కరణ నేపథ్యంలో – దళితాభ్యుదయ గీతాల ప్రభావం

– డా॥. ఎం. పద్మగౌరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమండ్రి.

భారతదేశంలో జాతీయోద్యమకాలంలో ప్రజలను ఉత్తేజ పరిచి వారిలో చైతన్యం కల్గించడానికి, అందరికి అర్థమయ్యే రీతిలో గీతాలను ఆలపించడం ప్రారంభించారు. ఈ క్రమంలో అన్ని వర్గాల వారిని జాతీయభావంతో ఒకేతాటిపై నడిపించాల్సిన అవసరం ఏర్పడింది. అరకంగా సంఘ సంస్కరణ నేపథ్యంలో భాగంగా గాంధీజీ హరిజనోద్ధరణ కార్యక్రమం, అంబేడ్కర్ సాంఘిక పోరాటం, కారల్‌మార్క్స్ వర్గ దృష్టి నేపథ్యంగా దళితాభ్యుదయం కోసం సాహిత్యసృష్టి జరిగింది. ఈ నేపథ్యంలో గేయాలను రచించటం ప్రారంభించారు.

డా॥ అంబేడ్కర్ ఆలోచనా సిద్ధాంతం, కుల నిర్మూలన, సంఘ సంస్కరణ నేపథ్యంలో దళిత సాహిత్యం ఆవిర్భవించింది. దీనిని రచించిన వారు దళిత కవులేకాదు దళితేతర కవులు. కవులపట్ల సానుభూతితో అభ్యుదయ భావాలతో సృష్టించిన సాహిత్య రూపమే దళిత సాహిత్యంగా పేర్కొనవచ్చు

ఆధునిక కాలంలో దళిత సంబంధమైన ఇతివృత్తంతో వచ్చిన సాహిత్యంలో ప్రథమంగా చెప్పాల్సినది "మాల వాండ్రపాట" ఇది 1910 వ సం॥లో ఆంధ్రభారతి మాసపత్రికలో వెలువడింది. ఈపాట ఆధునికాంధ్ర సాహిత్యంలో దళితుల పట్ల మొదటిసారి దృష్టిసారించి రచించినదని చెప్పవచ్చు. ఈ పాట అజ్ఞానకర్తృత్వంగానే ఘనత చెందినది. కాని ఇటీవల కాలంలో ఈ పాటను రచించింది "మంగిపూడి వేంకటశర్మ" అని నిర్ధారణ చేస్తూ డా॥ రంకిరెడ్డి రామమోహనరావు గారు, డా॥ సింగుపురం నారాయణరావు గారు తెలియజేసారు.

దళిత సాహిత్యంలో తొలి కావ్యంగా చెప్పబడుతున్న "నిరుద్ధభారతాన్ని" శర్మ గారు 1915లో ప్రచురించారు. అంతకు మందే అస్పృశ్యతా నివారణోద్దేశ్యంతో ఒకపాటను రాసి 1910 సెప్టెంబర్‌లో ఆంధ్రభారతిలో ప్రచురించారు. దీని శీర్షిక "మాలవాండ్ర పాట" అని పెట్టారు. ఇది మాల వాండ్రు తమను గురించి తాము రాసుకున్నట్లుగా రాయబడినది. శర్మ గారు పరకాయ ప్రవేశం చేసి రాసిన పాట ఇది ఆనాటి సాంఘిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని శర్మ గారు తమ పేరు లేకుండా రాసి ఉంటారని చెప్పడానికి గల కారణాలను వివరించారు.

20వ శతాబ్దం ఆరంభ దశలో ఈ విషయమై ఎక్కువగా తెలుగు ప్రాంతంలో ఆలోచించి తదను గుణమైన రచనలు చేసింది మంగిపూడి వారే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. నిరుద్ధ భారత సందేశ సారాంశాన్ని పాటగా మలిచి ప్రచురించి ఉండవచ్చని చెప్పారు. కారణం నిరుద్ధ భారతాన్ని 1915లో ప్రచురించినా, ఈ కావ్యరచన 1907న సం॥ నాటికే సిద్ధమైంది. ప్రచురణకు వారి దగ్గర సరియైన ధనం లేక ఆలస్యం అయ్యింది. ఈ నిరుద్ధ భారత సందేశ సారాంశాన్ని పాటగా మలిచి ఆనాటి సామాజిక స్పందన ఏవిధంగా ఉంటుందనే ఆలోచనతో మంగిపూడి వారు భావించవచ్చు. సమాజంలో నాటి స్థితిగతుల్ని పాటలోను, కావ్యంలోను, సమానంగా చెప్పారు. ఈ మాలవాండ్ర పాటలో

"అందారు పుట్టారీ హిందమ్మతల్లీకి
అందారు ఒక్కటై ఉందారి సక్కంగ
కష్టమ్ము లొచ్చిన నిష్ఠూర మొచ్చిన
ఇష్టముగా నుండి కట్టూగ నుందాము
ఎట్టాగు యొక్కువ బ్యామర్లు మాకంటె
ఎట్టాగు యొక్కువ యేరైన మాకంటే
వర్ణాలు యెక్కువ పుట్టంగ లేదయ్య
మమ్మేల క్రిందకి కుమ్మేరు మానోరు"

(మాలవాండ్ర పాట)

భారతీయులంతా ఒకేతల్లి బిడ్డలని ఇందులో ఎక్కువ, తక్కువలు లేవని, వర్ణవ్యవస్థలో అగ్రవర్ణాలుగా భావించబడే బ్రాహ్మణులు అవర్ణులకంటే ఏ రకంగా ఎక్కువ కాదని ఇంగ్లీషు చదువుల కోసం ఎగబడి ఏ వృత్తికైనా సిద్ధమైనా బ్రాహ్మణులు వర్ణచక్రాన్ని విచ్ఛిన్నం చేసినట్లే కదుక వర్ణవ్యవస్థకు కాలం చెల్లిందని ఈ గేయం ద్వారా స్పష్టంగా తెలియజేశారు.

మంగిపూడి వారు రాసిన నిరుద్ధ భారతంలో

"మనదేశంబున జన్మమెత్తి మనక్షేమంబున్ సదాకోరి తా
మనయంబున్ మన సంఘ వృద్ధికయి దాస్యం చప్పగా చేయుచున్
మన దైవంబుల కొల్చుచున్ మన మతామ్నాయ ప్రకాంబుగా
మనచున్నన్ మనదేశ సోదరులె యన్మాటన్ విచారింపమ్"

మనదేశంలో పుట్టి మనక్షేమం, మన సుఖసంతోషాల్ని కోరుకుంటూ మనదేశం అభివృద్ధి చెందాలని, దేశంకోసం దాస్యం చేస్తూ మనం కొలిచే దైవాన్ని కొలుస్తూ, మన మత ధర్మాలను పాటిస్తున్న వారు మన సోదరులే అనే విషయం మరచి ప్రవరిస్తున్నామని తెలియజేశారు.

వర్ణవ్యవస్థను, సాంఘిక దురాచారాల్ని ఖండిస్తూ సంఘ సంస్కరణ దృష్టిలో గురజాడ వారు రచనలు చేశారు. అస్పృశ్యతను నిరసిస్తూ కులమత రహిత సమాజం రావాలని ఆయన ఆకాంక్షిస్తూ రచనలు చేశారు. ముత్యాల సరాలు, లవణరాజు కల మొదలైనవి ప్రాచుర్యం పొందాయి.

"మలినదేహులు మాలలనుచు
మలిన చిత్తుల కధిక కులములు
నెలవొసంగిన వర్ణధర్మను
ధర్మధర్మంబె"

సత్యా సత్యాలు దాచిపెట్టి మానవులు కులవ్యవస్థను పెంచిపోషిస్తున్నారు. మనుషుల్లో మంచి చెడులు అనేవి రెండే కులాలని గురజాడ తెలియచేశారు.

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ, రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనే అగుదున్"

మాల వానిని మంచిగా ఉండాలని అభ్యుదయాన్ని కాంక్షించి తాను వారిలో ఒక్కడినని వర్ణధర్మానికి నూతన భాష్యం చెప్పారు గురజాడవారు. హృదయ మాలిన్యం తీసి వేయాలంటూ సవర్ణులకు పిలుపునిస్తూ దళితాభ్యుదయానికి మార్గదర్శకులుగా నిలిచారు.

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా వ్యవహారిక భాషను అభిమానిస్తూ ఎన్నో రచనలు చేసిన వ్యక్తి గరిమెళ్ళ సత్యనారాయణ 1921 వ సం॥లో స్వరాజ్య గీతాలు మొదట భాగంలో పంచములు అనే గీతాన్ని రాసారు. దళితుల పక్షాన వహిస్తూ అస్పృశ్యుల్ని ఆదరించాలని వారు చేసే వృత్తుల్ని, పనులను సహృదయంతో అర్థం చేసుకోవాలని తెలియచేశారు.

అన్నలారా వినుడి మన - యఘమొక్కటి గనుగొనుడి మన
చిన్న తమ్ములను జేరదీసి దమ - చేసి మహోదర మదుడి ॥అన్న॥

అంటూ జంతువులపై కరుణ చూపించే మానవుడు సాటి మనుషులను అసహ్యించుకోవటం, అవమానాలకు గురిచేయడం తగదని వివరించారు. మానవులందరూ సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. 1921వ సం॥లో స్వరాజ్య గీతాలు మొదటి రెండు భాగాలను, 1926 వ సం॥లో నూతన జాతీయ గీతాలను, 1933వ సం॥లో హరిజన పాటలు మొదలైన గీతాలను రచించారు. అలాగే "అస్పృశ్యతా సిద్ధాంత నిరసనం" అనే మరో గేయంలో

అంటరాని వాడనిన - నన్నంటే ఇక ఒప్పుకోను
ఒంటరి! నీకిష్టము - లేకుంటే అటు తొలగిపొమ్ము ॥అంట॥

దళితుల పక్షాన వహిస్తూ ఆత్మాశ్రయ రీతిలో సవర్ణులను
తాకినంత మాత్రాన అంటరాని వారుగా మారిపోరని తెలియజేశారు.
ఒకరిపట్ల ఒకరు అధిక్యతను భావించడం, ప్రదర్శించడం అమానుషమని చెప్పారు.

1921వ సం॥లో గరిమెళ్ళ వారు రాసిన "మాకొద్దీ తెల్లదొరతనం" అనే గేయానికి ప్రతి స్పందనగా విరుద్ధ భావజాలంతో "మాకొద్దీ నల్లదొరతనం", హరిజన శతకాన్ని కుసుమ ధర్మన్న గారు రచించారు.

ఆలకింపుమయ్య హరిజనుండ
ఆలకింపుమయ్య ఆదిహిందు
ఆలకింపుమయ్య ఆదిమాంధ్ర
ఆలకింపుమయ్య మాలవర్య!

అనే నాలుగు "మకుటాల్ని" సూచిస్తూ, ఆటవెలదిలో 108 పద్యాల్ని రచించారు. ఈ మకుటంలో ఏది ఇష్టమైతే వారి వారి అభిమతాల సారం దాన్ని వాడుకోమని వివరించారు. ఆనాటి కాలంలో గాంధీ ప్రభావం వలన "హరిజన" అనే పదం ప్రాచుర్యం పొందింది.

"నీకులంబు వారి ప్రాకటంబుగ మున్ను
హిందూ భూమినేలి యెలమి తోడ
సౌఖ్య మందిరనుచు శాస్త్రంబు చెప్పదే
ఆలకింపుమయ్య హరిజనుండ"

నీకులం వారు తక్కువ వారు కారు. పూర్వం వారు హిందూ దేశాన్ని పాలించారు. సుఖ శాంతులతో జీవించారని శాస్త్రాలు చెబుతున్నాయని చెప్పారు. హరిజనుల కోసం పోరాటం చేయమని, అవసరమైతే ప్రాణత్యాగం చేయమని ఉద్బోధిస్తూ కుసుమ ధర్మన్న కవి రచించారు.

భారత స్వాతంత్ర్యోద్యమ రధసారధి మహాత్మా గాంధీ, ఆనాటి యువకులకు ఆదర్శం, గాంధీజీ పిలుపుతో అనేక రంగాల్లో కృషి చేస్తున్న వాటన్నింటిని ప్రక్కకు పెట్టి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. గాంధీజీ చేపట్టిన అస్పృశ్యతా నిరసనోద్యమానికి తమవంతు సహాయంగా రచనలు ప్రారంభించిన వారు చాలామంది ఉన్నారు. తల్లాప్రగడ సూర్యనారాయణ శాస్త్రి-"హేలావతి", వేంకట పార్వతీశ్వర కవులు - "మాతృమందిరం", కొండపల్లి జగన్నాధరావు - మేలు కొలుపు గీతాలు, ఉన్నవ మాలపల్లి, హరిజన నాటకం, బోయి భీమన్న - పడిపోతున్న అడ్డగోడలు, పాలేరు నాటకం, జాలా రంగ స్వామి - అంటరానివారెవరు, పురిపండా - గుడిలో దైవమా, జాషువా - గబ్బిలం మొ॥వి స్వాంతత్ర్యానికి ముందే వచ్చిన దళితాభ్యుదయ గీతాలు. వీరి రచనలు ఆనాటి ప్రజలను ఎంతో ప్రభావితం చేశాయి.

ముగింపు :

1930 దశకం నుండి దళితులు తమ సమస్యలపై గొంతెత్తి రచనలు చేయటం కనిపిస్తుంది. దళితులు, పంచములు, హరిజనులు పదాలను తిరస్కరించి, ఆది ఆంధ్రులు గా తమను పిలుచుకున్న కాలం ఇది. ఆది ఆంధ్రోద్యమ ప్రభావం కూడా ఇందుకు దోహదం చేసింది. మనకు స్వాతంత్ర్యం లభించే వరకు వచ్చిన దళిత సాహిత్య దృష్టి నంస్కరణ మార్గంలో నడిచింది. స్వాతంత్ర్యానంతరం కాలంలో దళిత సాహిత్యం విస్తృత మార్గంలో ప్రయాణించి తమకంటూ ఒక అస్తిత్వాన్ని సంపాదించుకుంది. సామాజిక అసమానతల్ని కొంత వరకైనా అధిగమించే విధంగా రచనలు చేసారు. కులమత రహిత సమాజ నిర్మాణానికి చేసిన ప్రయత్నం ఫలించాలని ఆశిద్దాం.

ఆధార గ్రంథాలు :

1) ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - రంగనాధాచార్యులు
2) తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - మద్దూరి సుబ్బారెడ్డి
3) దళిత సాహిత్య చరిత్ర - పిల్లి శాంసన్

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

హరిజన శతకం – కుసుమ లోచనం

– పెదముత్తి రవిన్ని, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

మానవ జీవితంలో సాహిత్యం అంతర్భాగం. సాహిత్యం అంటే ఆనందింపచేసేది, మేలుకోరేది, అడుగడుగునా ఆలోచింపచేసేది, అడుగులో అడుగై ముందుకు నడిపించేది. అందుచేతనే "హితేన సహితమ్ సాహిత్యం" అని అర్థాన్నిచ్చారు హితవు కోరేది కాబట్టి మానవ జీవన ప్రయాణంలో అంతర్భాగమైంది. చరిత్ర ఆధారంగా చూస్తే కాలక్రమంలో ప్రాచీన సాహిత్యం ఆధునిక సాహిత్యం అని రెండు రకాలుగా కనిపిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో మనకు 3 విషయాలు కనిపిస్తాయి రక్తి, భక్తి, ముక్తి. వాటితో పాటుగా తరతరాలకు

కథలుగా చెప్పడానికి రాజులు ఆనవాళ్లుగా కోటలు
ఆశ్రమాలుగా ఆరామాలు కీర్తి ప్రతిష్టలు తెచ్చే కట్టడాలు
మన కళ్ళ ముందు కదలాడుతాయి. అంతే తప్ప
అలసిపోయిన ఆశలు ప్రపంచాన్ని పలకరించని పాదాలు
వాస్తవంగా కాదు కదా ఊహల్లో నహితం
ఊసెత్తనివ్వని అంతర్మథనాలు

ఏ కవి కలం నుంచి జాలువారలేదు. ఏ కవి కంటిపాపను తడమలేదు. అందుచేతనే శ్రీశ్రీ మాటల్లో దేశ చరిత్రను ఈ విధంగా లిఖించాడేమో

ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం
నర జాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అని

1875 నుండి తెలుగులో సాహిత్యంలో ఆధునిక యుగం ప్రారంభమైంది. కవులు, రచయితల దృక్పథాలలో మార్పులు వచ్చి కొత్త భావాలు, కొత్త ప్రక్రియలతో రచనలు చేపట్టారు. వాడుక భాషకు పట్టంకట్టి సామాన్య ప్రజానీకానికి కూడా సాహిత్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ విధంగా ఆధునిక సాహిత్య ప్రక్రియలో 1980-90 మధ్యకాలంలో తెలుగు సాహిత్యంపై తనదైన ముద్ర వేసింది దళిత వాద సాహిత్యం.

దళితులు అనే ప్రస్తావన ప్రాచీన సాహిత్యంలో మనకు కొద్దిగా కనిపిస్తుంది. పరాశరుడు, మాతంగముని, ఏకలవ్యుడు వంటి దళితులు గొప్పవారుగా చెప్పబడ్డారు. మల్లిఖార్జున పండితారాధ్యుడు శివతత్వసారంలో దళితుడు పూజకు అర్హుడని అతన్ని కులం తక్కువ వానిగా చూడొద్దని పేర్కొన్నాడు. కృష్ణదేవరాయలు అముక్తమాల్యదలో మాలదాసరి కథను అద్భుతంగా రచించాడు కావ్యాల పాత్ర చిత్రణలో అందంగా ఆకర్షించినప్పటికీ వాస్తవంలో ఊరి చివర మాత్రమే ఆవాసాలు ఉంచిన అక్షర సత్యాలు ఎక్కడా ప్రస్తావించ బడలేదు.

ఆర్యులు భారతదేశానికి రాకముందే అనార్యులుగా అంటరానివారుగా వెనుకబడిన జాతిగా పిలవబడుచున్న భారతీయ మూల వాసులచే సింధు నాగరికత వెల సిల్లిందని చరిత్ర మనకు స్పష్టం చేస్తున్నది. ఆహారం నుంచి ఆదాయం వరకు సామాజిక గణవ్యవస్థను నిర్మించిన మనిషిని మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, ఆర్థికంగా, అణచివేసే భావాలను అస్పృశ్యతగా మార్చి తరతరానికి అందించారు.

ఎండకు ఎండి వానకు తడిసి ప్రకృతితో మమేకమై కాయకష్టం చేసేవారిని అప్రాచ్యులని పిలిచి, సమస్త మలినాన్ని శుభ్రంచేసి పరిశుభ్రతకు నిలువెత్తు నిదర్శనమైన వాడ్ని అంటరానివాడ్ని చేశారు. నేలతల్లిని తన పాదాలతో ముద్దాడుతూ నారుమడి నుంచి కుప్ప నూర్పిడి వరకు చంటి పిల్లలా కాపు కాసి మన కడుపునింపటానికి ఎండ, వాన, చలిని లెక్కచేయక ఇంటి గడపలోనికి

ఆహారం తెచ్చి నింపిన వాని ఆకలి తీర్చడానికి ఆకు తెమ్మని వీధి బయట వాకిట్లో విస్తరేసి రెండు, మూడు రోజుల నుంచి మిగిలినవన్నీ రాసిగా పోసి పంచభక్ష పరమాన్నాలు మనం తినడం మానేసి వాడికి పెట్టినట్టుగా గర్వంతో ఒక చూపు విసిరే సంస్కృతి మనది. ప్రపంచం లోని రుచులన్నీ వాని చేతికందినంత సంబరంగా ఆస్వాదిస్తూ ఆకలి తీర్చుకునే సంస్కారం వానిది. ఆ కష్టజీవి సంతృప్తికి విలువకట్టే ధనం ఏ గొప్ప వాని దగ్గరుంది? కష్టజీవుల కొరకు శ్రీశ్రీ రాసిన ఈ సాహిత్యం అద్భుతంగా ఉంటుంది.

పగలనక రేయనక పడుతున్న శ్రమనంతా
పరుల కొరకు దారబోయే మూగజీవులు
ఆటలలో పాటలలో ఆయాసం మరిచిపోయి
ఆనందం పొందగలుగు ధన్యజీవులు

ఆ కష్టజీవులు, ధన్యజీవులు చెమట కార్చకపోతే రోజు గడవని బ్రతుకులు మనవి. అదేమిటో విచిత్రం పడకగది నుంచి వీధి వాకిలి వరకు సమస్త దరిద్రాన్ని ఊడ్చివేయాలి కానీ లోపలకు ప్రవేశించకూడదు. తిన్న వంట పాత్రలన్నీ తళ తళ మెరిపించడానికి అరచేతులు అరిగిపోవాలి. కానీ అన్నం తినే అవకాశం లేదు. భుజాలు కాయలు కాసేలా ఇంటిల్లపాదికి ఊరి చెరువు నుంచి నీళ్ళు చేరవేయాలి. కానీ దోసెడు నీళ్లు తాగడానికి అనుమతి లేదు పాదాలు కందిపోకుండా వారి అరిచేతులు సుత్తి దెబ్బలు తిని పాదరక్షలు తయారుచేయాలి కానీ వారి కాళ్లకు అంతటి అదృష్టం లేదు.

1930 దశకం నాటికి భారతదేశంలో అన్ని ప్రాంతాల లోనూ ఇదే పరిస్థితి. ఇల్లు శుభ్రం చేయటానికి, వాకిలి అందంగా అలంకరించడానికి, అవసరానికి సరిపడా నీళ్లు తేవడానికి, పశువులని కాపలా కాయటానికి, చెత్తను ఎత్తిపోయడానికి, పాలం దున్నడానికి గొడ్డులా ఉలుకు పలుకు లేకుండా 24 గంటలు పనిచేయడానికి, ఊరంతటికి హరిజనుడు కావాలి. కానీ వాళ్లు మాత్రం ఊరి చివర వెలివాడలోనే బ్రతుకులీడ్చాలి. పేటలోనే ఉండేంత పాపం ఏమి చేశారో మరి? ఒకవేళ ఒళ్ళొంచి కష్టపడటమే వారికి శాపంగా మారిందేమో.

"ఆకలి అంటే నీళ్లు, దాహం అంటే స్వేదం" అని జీవితాలను జల్లెడలో పీల్చి పిప్పి చేసిన పరిస్థితుల్ని స్వతహాగా అనుభవించిన ఆ తరానికి ప్రత్యేక డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అందుచేతనే దళిత వాదానికి మూల కారణం అంబేడ్కర్‌గా చెప్పవచ్చు. మనిషిని మనిషిగా గౌరవించే నవ సమాజ నిర్మాణం కోసం పోరాటం చేసి ఆ స్ఫూర్తిని ఎందరికో రగిలించి ఘనుడు. గాంధీజీ, జ్యోతి బాపూలే వంటి వారు దళితుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారు. ఈ నేపథ్యంలో చారిత్రక, భౌతిక వాద సిద్ధాంతాలు అనేకమంది విద్యావంతులను ఆకర్షించి దళిత సాహిత్యం వైపు నడిపించాయి. ఈ నేపథ్యంలో గాంధీజీ స్ఫూర్తితో దళితులను ప్రబోధించు లక్ష్యంతో కుసుమ ధర్మన్న (తొలి దళితకవి) 1933లో హరిజన శతకం రచించారు.

కుసుమ ధర్మన్న తన జాతి హరిజనుల హీనత్వంతో అమానుషంగా బాధపడుతున్న స్థితిని నివారించడానికి సంఘసంస్కరణ దృష్టితో జాతి చైతన్యం కోసం "హరిజన శతకాన్ని" రచించాడు. ఈ శతకం రాసేనాటికి జాషువా గారి గబ్బిలం వంటి కావ్యాలు కూడా రాలేదు. మానవుడు అంటరానితనం అనే విషాన్ని రంగరించి పోసి మోస గించారని తరుణం మించిపోకుండా మేల్కొని జన్మ హక్కులపై పోరాడమని ఆత్మగౌరవాన్ని ఆత్మభిమానాన్ని నిలబెట్టుకొనమని ప్రబోధిస్తూ "ఆలకింపుమయ్య హరిజనుండా" అనే మకుటంతో ఆటవెలది పద్యాలతో ఈ శతకాన్ని రచించాడు.

ఆది కాలమందు నవనిలో జనులెల్ల
నన్నదమ్ములగుచు నాశనీడి
చీకు చింత లేక చిరజీవులైరయా
ఆలకింపుమయ్య హరిజనుండ

పురాతన కాలంలో ప్రజలంతా కుల మత బేధ రహితంగా అన్నదమ్ముల్లా ఐకమత్యంతో నిశ్చింతగా

జీవించారు. స్వార్థపరులైన కొందరి కారణంగా సమాజంలో భేదాభిప్రాయాలు తలెత్తాయి అంటరానితనమనే విషాన్ని ఉగ్గుపాలతో పోసి మోసగించి దాసులుగా చేశారన్న విషయాన్ని గ్రహించమని ప్రబోధించారు.

ద్రవ్యకాంక్ష సుంత తలయత్తగా లేదు
కూడబెట్టి దాని గొలవలేదు
పాడిపంట వారి భాగ్య భోగములయా
ఆలకింపుమయ్య హరిజనుండ

సమాజంలో అందరూ ఒకరి మీద ఒకరు ఆధారపడి జీవించారు. చేతివృత్తులు సంఘంలో ప్రజలందరి కోసం పాటుపడ్డాయి. ధనము సంపాదించడం కంటే పాడి పంటలు కలిగి సుఖ సంతోషాలతో అందరం కలిసి ఉండటమే భోగభాగ్యములుగా భావించారు. ఎప్పుడైతే సంఘంలో ధనకాంక్ష పెరిగి, ధర్మ చింతన నశించింది. ప్రజల మధ్య హెచ్చు-తగ్గులు, కుల-మతాలు, పేద-ధనిక భావం బాగా ప్రబలింది. ధనము లోభుల పాలయ్యింది. పెట్టుబడిదారులు పేదల కష్టాన్ని దోచుకుని ఐశ్వర్యవంతులయ్యారు. కష్టం ఒకరిది సౌఖ్యం ఇంకొకరిది. పనికి ఆహారం పథకం అనేదాన్ని పేదవానికి కేరాఫ్ అడ్రస్ గా మార్చి నరాలు సాగిపోయి చర్మం కమిలిపోయేంతగా ఊడిగం చేయించుకుని అంటరాని వాళ్ళుగా చిత్రించి వెలివాడలో మురికి కాలువలు వద్ద గంజినీళ్ళతో గడిపేలా చేశారు. అందుచేత ఓ హరిజనుడా! నిజా నిజములు మనసు లోపల దర్శించి అవి కేవలం ఉద్దేశపూర్వకంగానే చేసినవని గ్రహించి నీ హక్కులకై పోరాడు అని ధర్మంగా ప్రబోధించాడు.

కోటికొక్కరి కోటీశ్వరుల మంచు
సంఘదనములలో నంగ్రహించి
భాగ్య భోగములకు బానిసలైరయా
ఆలకింపుమయ్య హరిజనుండా

అనాది కాలంలో ప్రజలకు ద్రవ్యకాంక్ష కొంచెం కూడా లేదు డబ్బును కూడా పెట్టేవారు కాదు దేశమాత ఇచ్చిన సంపదలు పోగుచేసి సంఘసేవ చేయడానికి పాటు పడడం నాడు గౌరవభంగము కాదు. కాని నేటి సమాజంలో దోచుకున్న వాడికి దోచుకున్నంత కాదు దాచుకునే వాడికి దోచుకున్నంత అన్నట్లుగా తయారైంది. కోట్ల సంపద కొందరి వసమైపోతుంది. పిల్ల పిల్ల తరాలు అనుభవించేంత సంపద మూలధనంగా కొద్దిమంది చేతులకే పరిమితం అయిపోయింది.

పదుల, వందల ఎకరాలు చేతిలో ఉన్న ఆసామి సంపద అనుభవిస్తూ పంచ కట్టుకుని పెన్షన్ కోసం పంచాయతీ దగ్గర కాపు కాస్తూ దిక్కులేని వారికి ప్రభుత్వమే దిక్కుగా అందించే పెన్షన్ పళ్ళికిలిస్తూ పక్కన పెట్టుకునే దోపిడీదారులు తయారయ్యారు. సమయం లేదు మిత్రమా! ''డబ్బులు ఎవరికి ఊరికే రావు'' అనే సత్యాన్ని తేటతెల్లం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. కష్టపడే వాడికి కులం అంటగట్టిన సమాజానికి మంచికి-చెడ్డకి, అందరికీ-అన్నింటికీ అండగా నిలబడే వానికి కడుపు మండితే ఎలా ఉంటుందో తెలియచెయ్యి. కూర్చుంటే తప్పు, నుంచుంటే తప్పు, తింటే తప్పు, తాగితే తప్పు అని వంగి వంగి దండాలు పెట్టించుకున్న వాళ్లకి లంకణాలు పెట్టి కష్టం విలువ తెలిసి వచ్చేలా కంకణాలు కడుతూ ఉంటే తల్లేడులోకాలు గుర్తొచ్చి మనిషిని అనే భావాజాలన్నీ నరనరాన నింపుకునేలా నినదించు అని తన జాతిని మేల్కొలిపాడు.

కులము స్థలము లేదో? గుణగణంబులు లేవో?
ధనము బలము బ్రతుకు దారి లేదో?
బానిసవై పరువు బాసిపోయెదవేల?
ఆలకింపుమయ్య హరిజనుండ

నీ కష్టాన్ని దోచుకుని నీ పనితనాన్ని హేళన చేసి నీ మంచితనాన్ని చేతకానితనంగా భావించే ఈ దోపిడి రాజ్యాన్ని, రాబందులను ప్రశ్నించమంటున్నాడు. దళితుడైన నీకు కులం లేదా! స్థలము లేదా! గుణగణములు లేవా, బ్రతుకు దారి లేదా? అంటరాని తనంతో వెలివాడల్లో వెనకబడిన జాతిగా ఎంతకాలం కుమిలిపోతావు? నీ హక్కులకై ఉద్యమించు అని

సందేశాన్నిస్తున్నాడు. ప్రశ్నించడం మరిచిపోతే బ్రతికే హక్కు కోల్పోయినట్టే. అందుచేత మనిషిని మనిషిగా గౌరవించే సమాజం కోసం ఉద్యమించమని వెలుగెత్తి చాటాడు.

పోరాటం, ఉద్యమించడం, ఎలుగెత్తిచాటడం, నీకు దాసోహమైన విద్యలు. నిరంతరం ప్రకృతితో పోరాడి రాటు తేలిన నీకు, ప్రతిక్షణం అవమానాలు, నిందలు భరించి ఉద్యమంలా ముందుకు సాగే నీ సాహసానికి, ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా చిరునవ్వునే ఆయుధంగా చేసుకొని కాలానికి తలవంచుకుని పోతూ మానవత్వాన్ని ఎలుగెత్తి చాటిన నీ దయా గుణానికి ఎదురు నిలిచే ధైర్యం ఎవరికి ఉంది? పట్టుమని పది నిమిషాలు ఎండలో నిలబడితే సోలిపోయేంత సుకుమారం, గట్టిగా వర్షంలో తడిస్తే ఒణికిపోయే జీవనం, తొలి మంచు తుషారాలకే ఉక్కిరి బిక్కిరి అయిపోయే బలహీనులు, నీ పనితనానికి ఏ ప్రశ్నాపత్రం సరిపోదు సుమా! కష్టపడటం, చెమట కార్చడం, సంపాదించడం, సంతోష పెట్టడం ఎవరికి తెలుసు? నీకు తప్ప.

నీ కులంబు వారు ప్రాకటంబుగ మున్ను
హిందుభూమి నేలి యెలిమి తోడ
సౌఖ్యమందిరనచు శాస్త్రంబు చెప్పదే?
ఆలకింపుమయ్య హరిజనుండ

నీ దళిత కులము వారు హిందూ దేశాన్ని పాలించి చక్కని సౌఖ్యములను అనుభవించారని శాస్త్రము చెబుతుంది భారతదేశం కేవలం వృత్తిరీత్యా మాత్రమే విభజింపబడింది. సంఘం సమాజం ఏ ఒక్కరిదీ కాదు ఏ ఒక్కరి కోసమో కాదు. "ఒక్కరి కోసం అందరూ అందరి కోసం ఒక్కరు" మన కుటుంబంలో అమ్మ తన కోసం మాత్రమే ఆహారం సిద్ధం చేయదు, కుటుంబ సభ్యులందరి కోసం తన శ్రమను ఖర్చు పెడుతుంది. అదే విధంగా సమాజంలో ప్రతి ఒక్కరూ వారి వారి పనితీరును అందరికోసం అందిస్తున్నారు కానీ సంపద సృష్టించే వారికి ఆ సంపద అనుభవించే అవకాశం లేకుండా కొంతమంది స్వార్థపరులు కనుసన్నల్లో అంతర్గతమై వారి చేతిలోనే చెలామణి అవుతున్న కారణాన కుసుమ ధర్మన్న వ్యక్తిగా కష్టజీవులు ఉనికిని గుర్తించేలా చేయమంటున్నారు.

"రక్తం రుచిమరిగిన పులి వేట మానదు" అన్నట్టుగా నాగరికత ఇంతగా అభివృద్ధి చెందిన రోజుల్లో కూడా "తడి గుడ్డతో గొంతు కోసినట్టు"గా మనకు తెలియకుండానే మనలో ఆ భావజాలం కొనసాగుతుంది అనడానికి ఇంకా చాలా ప్రాంతాల్లో మారుమూల గ్రామాల్లో ఆ అనవాళ్ళు మిగిలే వున్నాయి. అస్పృశ్యత, అంటరానితనం పేదల జీవితాలను బలి పెడుతూనే ఉన్నాయి. ఆకలికి, దాహానికి, రక్తానికి పేద-గొప్ప, కులం-మతం, ఉన్నత - వర్గం వారు వెనుకబడినవారు అనే తేడా తెలియదు. ఏ జీవనమైన పోరాటం చేసేది కడుపునిండా తిండి కోసమే, కంటినిండా కునుకు కోసమే. ఏ జీవితం అయినా మొదలయ్యేది రక్తమాంసాలతోనే ముగిసిపోయేది ఆరడుగుల నేలపైనే. ఈ సిద్ధాంతం కొత్తదేమి కాదు కానీ ఆలోచనలకు అందనంత వెనకబడి పోయింది. వాటిని అధిగమించే దిశగా మనలో వున్న మానవత్వాన్ని తట్టిలేపి తరతరాలకు మనమంతా భారతీయులం, మనదంతా భరతజాతి అనే భావాన్ని భావితరాలకు ఉగ్గుపాలతో రంగరిద్దాం నవసమాజ నిర్మాణంలో మనమంతా ఏకమై మనిషిని మనిషిగా గౌరవించే సమాజాన్ని స్వాగతిద్దాం.

ఆధార గ్రంథాలు :

1) దళితుల చరిత్ర - డా॥ కత్తి పద్మారావు
2) హరిజన శతకం - కుసుమ ధర్మన్న

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్న కవిత్వం–దళిత తాత్త్విక దృక్పథం

– డా॥. కోలా శేఖర్, శాఖాధిపతి, తెలుగుశాఖ, ఆంధ్ర లొయోల కళాశాల (స్వయంప్రతిపత్తి), విజయవాడ.

'తనకీ ప్రపంచానికి సామరస్యం
కుదిరే దాకా కవి చేసే అంతర్
బహిర్ యుద్ధారావమే కవిత్వం' అంటాడు చలం.

అటువంటి యుద్ధాన్నే తన కవిత్వం ద్వారా ప్రపంచానికి చాటే ప్రయత్నం చేశారు బోయి భీమన్న. జరిగిన, జరుగుతున్న కాలంలోని లోపాలను, జరగబోయే కాలంలో చేసుకోవలసిన మార్పులను సరి అయిన రీతిలో విశ్లేషించి అక్షర రూపంలో సమాజానికి అందించే ప్రయత్నం చేశారు.

"నేను రసానంద వాదిని. సృష్టిలో సర్వత్రా సౌందర్యాన్ని చూస్తాను. రసాస్వాదన చేస్తాను. ఇది నా ప్రకృతి. ఇది నా ప్రవృత్తి అంటూనే ఆ సౌందర్యం మాటున దాగిన నిజాలను. అణగారిన బతుకుల ఆవేదనను తలుచుకుని తపన పడుతూ-

'కోర్కె తీరని నా గుండె కొలిమి నుంచి ప్రత్యణువు వ్రేలు నొక్క అణ్వస్త్ర మగుచు', అంటూ తన భావావేశాన్ని కవిత్వరూపంలో ప్రపంచానికి తెలియచెప్పే ప్రయత్నం చేశారు. దాదాపు 70దాకా రచనలు చేసిన బోయి భీమన్న సమాజంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తన గళాన్ని వినిపించారు.

హిందువుల ప్రామాణికమైన మను ధర్మశాస్త్రం పై అవకాశం వచ్చినప్పుడల్లా విరుచుకుపడే బోయి భీమన్న మనువు దళితులను గురించి ప్రస్తావించలేదని విమర్శిస్తారు. 'జంబూద్వీపే' అంటూ మొదలయ్యే హిందూ పూజా విధానంలో పేర్కొన్న జంబూద్వీపానికి జాంబవంతుడి కారణంగా ఆ పేరు వచ్చిందని, అతడు దళితుడని, ఋగ్వేద కాలం నాటి ఋషులంతా దళితులేనని, ఆర్య అనార్య సిద్ధాంతాన్ని భీమన్న సమర్థిస్తారు. నాటి నుంచి నేటి దాకా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వారంతా బోయలేనని, పంచములని అంటారు.

'కృతయుగంలో ధర్మ వ్యాధుడు బోయ
త్రేతా యుగంలో వాల్మీకి బోయ
ద్వాపరంలో వ్యాసుడు బోయ
కలియుగంలో భీమన్న బోయ'- అని. వీరే సమాజాన్ని తను కవిత్వంలో చూపారని అంటారు. మార్క్సిస్టు సిద్ధాంతంపై భీమన్నకు విశ్వాసం లేదు. కాని తన రచనలలో దళితుల జీవితాలు బాగుపడాలనే అభ్యుదయ తత్వం బలంగా వినిపించారు.

హిందూయిజం, 4 వర్ణాలని అంటుంది. కమ్యూనిజం పేద ధనిక వర్గాలే ప్రపంచంలో ఉన్నాయంటుంది. కానీ, ఈ లోకంలో 3 వర్గాలే ఉన్నాయనేది భీమన్న మాట. అది పులి, తోడేలు, గొర్రెల వర్గాలు. ప్రజలలో చాలా మంది ఆఖరి వర్గానికి చెందినవారని, వారిలో చైతన్యం తీసుకురావాలని తన రచనల ద్వారా ప్రయత్నం చేశారు భీమన్న.

'నీతికి అవినీతికి తేడా ఏం లేదు
తనకు దక్కిన సుఖం నీతి
ఇతరులకు దక్కిన సుఖం అవినీతి'

అంటూ మనుషుల మనస్తత్వాన్ని వివరిస్తారు. ప్రతిభకు తగిన స్థానం సమాజం ఇవ్వటం లేదంటూ ప్రతిభను తలెత్తనివ్వరు పండితులు, పాండిత్యాన్ని తలెత్తనివ్వరు పామరులు, ఈనాడు సాహిత్యం అంటే కులం, మతం, వర్ణం, ముఠా ఉద్యమాలు, నినాదాలు, వ్యాపారం అంటూ తన కులాన్ని కాక తనలోని ప్రతిభను చూడమని వేడుకుంటారు. 'ఈ యాకృతి నేమి కలుగు హృదయాకృతి జూచి సమాదరింపరే' అని అంటారు.

'భీమన్న ప్రణయము, ప్రకృతి, తత్వశాస్త్రము, అభ్యుదయము మొదలైన భావాలతో వచన కవిత్వములో వైవిధ్యాన్ని ప్రవేశపెట్టినాడు అంటారు డా॥ సి. నారా

యణరెడ్డి. భీమన్న వచన కవిత్వ రూపంలో రాసిన కావ్యాలు అనేకాలు. గేయకావ్యాలు, పద్యకావ్యాలు అన్నింటిలోనూ ఈ వైవిధ్యం కనిపిస్తుంది.

అంబేద్కర్ ఆశయాలను భీమన్న తన కవిత్వంలో కొనసాగించాడు. అంబేద్కర్ సైద్ధాంతిక పునాది మీద 20వ శతాబ్దంలో దళిత ఉద్యమం ప్రారంభమయింది. నిజమైన దళిత తత్వం దీనంగా, జాలిగా జాషువా కలం నుంచి మొదటగా వెలువడింది. జాషువా ద్రవీ భూత తత్వానికి ప్రతీక. జాషువా స్వరం దిగ్దిగంతాలకు వినిపించకపోయిన అట్టడుగు అణగారిన దళితులకు చేరింది. ఆధిపత్య కులాలలో కనిపించని స్పందన అణగారిన జాతిలో వచ్చింది. ఐతే ఆ మార్పు దీనంగా కాకుండా తిరుగుబాటుగా, విప్లవంగా, ఉద్యమంగా రావడానికి సామాజిక పరిస్థితులు కారణం అయ్యాయి. జాషువా కవిత్వంలోని అంతర్గత తీవ్రతను తరువాతి తరం కవులు బోయి భీమన్న, కుసుమ ధమ్మన్న, కొలుకలూరి ఇనాక్ లాంటి వారు అంది పుచ్చుకున్నారు అంటారు డా॥ ఆశాజ్యోతి. భీమన్న వ్రాసిన 'జన్మాంతర వైరమ్'లో అంటరానితనంలో మగ్గుతున్న వారి బాధలను వర్ణించినాడు.

బోయి భీమన్న దళితులకు అండగా కుల తత్వానికి వ్యతిరేకంగా వదిలిన ఆయుధం పంచమస్వరం. గాయపడిన హృదయలెప్పుడూ / కవిత్వం తోనే సంభాషిస్తాయి. సమస్త జీవన కాంక్షల్లో తనదైన / తాత్విక మూలాల్ని అన్వేషించే వాదే కవి - అంటాడు రాధేయ. సమిష్టి అనుభవాలను స్వానుభవంతో, కవిత్వ రూపంలో మార్చుకోవటం కనిపిస్తుంది. అటువంటి కవిత్వమే బోయి భీమన్న రచించిన పంచమ స్వరం. సంగీతంలోని సప్తస్వరాలు సరిగమ పదని - అందులో పంచమస్వరం ప. కోకిల కూతను పంచమ స్వరం అంటారు. హైందవ జాతిలో 4 వర్ణాల తర్వాతి జాతి పంచమ జాతి. వీరిని పంచములు అంటారు. "నాది కవి కోకిలగా పంచమ స్వరం పంచముడిగా పంచమ స్వరం రెండు విధాలుగా ఈ కావ్యం పంచమ స్వరమే" అంటారు భీమన్న.

'పంచభూతాలు కలిసి ప్రపంచమాయె
పంచ ప్రాణాలు కలిసి జీవించు వ్యక్తి
పంచ సంఖ్యపై ఎందుకీ పంచనామా?
పంచమ స్వర గీత మా భారతమాత' అంటారు. ఈ సృష్టిలో పంచ సంఖ్యకు ఉన్న ప్రాముఖ్యం ఎంతో-

ఈ ప్రపంచంలో కూడా పంచ శబ్దం నిబిడీకృతమై ఉందని సూచిస్తూ-

'పంచభూతాలు, వర్ణాలు, ప్రాణములును
పంచతంత్రాలు, ఖండాలు, వార్ధులిట్లు
పంచములెన్నో కలవు ప్రాపంచమున
పంచ జనుడేను, ప్రపంచ విభుత'

వీటి అన్నిటికి ప్రాముఖ్యం ఉన్నట్లే పంచముడికి కూడా ప్రాధాన్యం ఉందని, దానిని ఎవరూ కాదనలేరని అంటారు.

'పంచమ స్వరం' కావ్యం 13 భాగాలలో కనిపిస్తుంది. అవి వరసగా శ్రీరాగం, పద్యానికి షష్టిపూర్తి పంచమ వర్ణం, మాలమాదిగ, కులభూతం, కావ్య సృష్టి - పద్యకళ, ప్రజల రాజరికం, మహిళాస్వామికం, నేనే నియంతనైతే, జాతీయ సోషలిజం, క్షణిక స్పందనలు, అపశ్రుతులు, ప్రాణవీణ మొదలైనవి.

కవి దళితులను హరిజనులని, దళితులని పిలవడానికి ఇష్టపడరు.

"వద్దు హరిజన, దళితయు వద్దుగాక
పంచమ పదమ్మె మనకు శుభ ప్రదమ్ము
పంచముడ నేను, వైదిక పంచజనుడ
పాంచజన్యము నాది, ప్రాభవము నాది"

అంటూ పంచములనే పిలవాలని అంటడు. దళిత శబ్దాన్ని వ్యతిరేకిస్తూ అందులో హీనత్వం, దీనత్వం ఉన్నాయంటాడు కవి.

'పంచజనుడను వాడు ద్వాపరమునందు
పంచముడు, వాసుదేవుని పాంచజన్య
మాతడిచ్చినదే దాస జాతి వాడు
జలములే జీవనమ్ముగ వెలయువాడు'

అంటూ పురాణాలలోనే పంచముల ప్రస్తావన ఉందని, శ్రీకృష్ణుడికి పాంచజన్యం ఇచ్చింది పంచముడని, అతని పేరు మీదే పాంచజన్యమయిందని పురాణ ఆధారాలను చూపుతాడు. భాగవతంలో దీని గురించిన వివరములు కనిపిస్తాయి. శ్రీకృష్ణుడు విద్యాభ్యాసం అనంతరం తన గురువు సందీపుడికి ఏదయినా గురు దక్షిణ ఇవ్వాలని, గురువును ఏం కావాలో అడగమంటాడు. సాందీపుడు ఎప్పుడో తప్పిపోయిన తన కుమారుడిని తెచ్చి ఇమ్మని కోరుతాడు. శ్రీకృష్ణుడు సముద్ర గర్భంలోకి వెళ్ళి శంభాసురుడనే పంచజనుడు శంఖంలో దాచిన గురుపుత్రుణ్ణి విడిపించి తీసుకొని వస్తాడు. ఆ శంఖమే పాంచజన్యం అని బోయి భీమన్న వివరిస్తూ పంచజనుడి నుంచి తీసుకోవటం వల్ల పాంచజన్యం అయిందని నాటికే పంచములు ఉన్నారని, కాని 4 వర్ణాలను పేర్కొన్న మనువు తమ గురించి చెప్పలేదని, మను ధర్మశాస్త్రాన్ని విమర్శిస్తాడు.

దళితులు ఐక్యం అవవలసిన అవసరముందని, మాల - మాదిగలు కలిసి పోరాడవలసిన అవసర ముందని మాల - మాదిగలు కలిసి పోరాడవలసిన అవసరం ఉందని అంటాడు. వీరిద్దరు సహోదరులని ప్రాచీన సాహిత్యంలో దానికి బుజువులున్నాయని అంటూ

'మాలయును మాదిగయు పూర్వమందు కూడా
మాలలే యనిరి అస్పృశ్య మానవులను'

కాని తర్వాతి కాలంలో వారు విడిపోయి రెండు వర్గాలుగా మారారని 'మాల'లోనే మాదిగలు ఇమిడి ఉన్నారని కవి అంటాడు-

'మాలలనె కలదు మాదిగ అను మాట
అన్నలోనే కలడు తమ్ముడెపుడు'

హరిజనులు గిరిజనులు అంతా బహుజనులని ప్రాచీన సాహిత్యాన్ని పరికిస్తే అది అర్ధం అవుతుందని కవి వివరిస్తాడు. అందుకే పంచములంతా కలిసి ఉండాలని అంటాడు.

'మీరు మాల అవును మాదిగ అను మాట
మాల మాదిగలకు మల్లెతోట
మల్లెపూల మాదిక అనుచిట్లు,
అన్న దమ్ము లేదొ ఆడుకొండ్రు'

రాజకీయ నాయకులు తమ ఓటు బ్యాంకు పెంచుకోవటం కోసం వీరిని కలవనీయటం లేదని, దానిని గుర్తించాలని హెచ్చరిస్తాడు. కులాల వల్ల ఏర్పడుతున్న దుష్పరిణామాలను విమర్శిస్తూ దానిని సమాజం నుంచి పారద్రోలాలని అంటాడు.

కుల మార్పును మతమార్పిడి వలె శాసనపరము చేయవలయును. అప్పుడే కుల నిర్మూలన సాధ్యము, కుల శబ్దంలో కు కార గుణ మది' అంటూ కులంలో 'కు' అనే అక్షరం చెడు 'లం' అంటే నీరు అని అర్ధం ఇస్తాయని కులం అంటే చెడు నీరు అని దీనిని వదిలించుకుని పంచములు ఏకం అవవలసిన సమయం వచ్చిందని అంటాడు. దీనికి కుల మార్పిడియే సరి అయిన పరిష్కారం అని కవి అంటాడు.

'మార్చుకోవలయు కులమును మతము వోలె
అందు కోసము శాసనమవసరమ్ము'

అంటూ ప్రభుత్వం దీని కోసం శాసనం చేయాలని అంటాడు.

పంచములు అధికారంలోకి రావాలని, మిగిలిన కులాల వారు చేయలేని ఉత్తమ కార్యాలను చేసి చూపించాలని అంటాడు.

'ఏ కులమన్న ప్రశ్న ఇపు
డెందుకు? పాలక వర్గ దుష్ట బు
ద్ధే కద హేతువెందుకు! యిపు
డే లెడి వంతిక మాలవారిదే
పై కులముల్ స్వదేశమును
బానిస చేసిరి, క్రింది వారు తత్
ధీ కళ నుద్ధరింపవలె
దేశము లోకము నేలగావలెన్!'

అంటూ పంచములు అధికారంలోకి రావాలని కోరుకుంటాడు. పంచములకు అధికారం రావాలని వారి జీవితాలు బాగుపడాలనే తపన, ఆకాంక్ష ఈ పంచమ స్వరంలో కనిపిస్తుంది. అంబేద్కర్ ఆశయాలకు అక్షర రూపంగా పంచమ స్వరం కనిపిస్తుంది.

అంబేద్కర్ ఆశయాలను తన రచనలకు ఊపిరిగా రచనలు కొనసాగించిన బోయి భీమన్న అంబేద్కర్‌పై ఎన్నో పాటలు రచించాడు. ఒక ఉద్యమంలా ఈయన అంబేద్కర్ ఆశయాలను పాటల రూపంలో వ్యాపింపచేశారు.

'జయ జయ జయ అంబేద్కర
జయ దళిత జనస్వరా' అంటూ సాగే పాటలో
'అంధకారమున పుట్టి
అవనికి దీపం పెట్టి
పంకమును మధించి మహికి
పరిమళం ఒసగిన సూరీ' అని కీర్తిస్తారు.

అంబేద్కర్‌ను అగ్రకులాల బాలురు వెలివేసిన ఘటనను తలుచుకొని

'బాబా అంబేద్కరా / బాధపడకురా
ఎచట కూర్చున్ననేమి / అచ్చరమొకటేగదరా
సర్వులు సములై జీవించాలన్నది / మన మతము
మతమును తన స్వార్థానికి / మలిపె నేటి కుల తత్వము
రాజసతామస గుణ వా / రసులు నేటి సవర్ణులు
ఋషివై ఈ దళితులర / క్షింతువులే చింతించకు

అంటూ అంబేద్కర్‌ను ఉద్దేశించి రాసిన ఈ గేయంలో దళితుల కోసం అంబేద్కర్ చేసిన కృషి ఆయన తపనను వివరించారు. అంబేద్కర్ ఆశయ సాధనను తోటి దళితులే నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన చెందుతూ-

నాయకుల పంచలలో
నాసు సారాతాగి
వొళ్ళు మరిచితిమి
వోట్లు అమ్మితిమీ - అంటూ ఈ పరిస్థితి తరువాతి కాలంలో అయినా మారుతుందని, దళితులలో మార్పు వస్తుందని ఆశపడుతారు.

నీ ఆశ పేరాశ కాకూడదన్నా / నా తపస్సందుకేనన్నా అంటూ వారిని ఖండిస్తారు. అంబేద్కర్ ప్రధాన సందేశం అన్ని భేదాలు పోగొట్టుకొని భారతజాతి అంతా ఒకే జీవన విధానాన్ని అనుసరించాలని, 'భారతీయత'ను చాటి చెప్పాలనేదే. దీని కోసమే అంబేద్కర్ బౌద్ధ మతాన్ని అనుసరించాడు. దీనినే భీమన్న

'పరమతాలన్నిటినీ పరిశోధించిన అంబే
ద్కరు బౌద్ధమునే ఎన్నిక చేసెను
అంబేద్కర్ కంటె మన
కధికం తెలుసా సోదరా!
అస్పృశ్యత కుల జాడ్యం
అంతరించిపోతే, భా
రతీయమే ప్రబుద్ధమై
క్షితినే పాలించదటరా'- అంటూ బౌద్ధ ధర్మమే భారతీయులను, భారతీయతను ముందుకు నడిపించ గలదని, ప్రపంచానికి ఆదర్శ ప్రాయమవుతుందనే ధ్వనిని వినిపించారు.

దళితులు ఉత్పత్తి శక్తులని, శ్రమజీవులని వారిని జాతి నుంచి వేరు చేసి చూడకూడదని అంటూ,

దళితులపై కులం పేర దండెత్తకురా....
దళితులగ నెవరు నీ దాయాదులురా...
విడిపోయినవారు, వెనకపడినవారు -
జాతికి సంపద కూర్చే శ్రమజీవులు దళితులు
దేశ సమగ్రతకు జీవదీపాలే దళితులు
దీపాలను ఆర్పుకోకురా వేద
దేవి బ్రతుకు చీకటి చేయకురా... అంటూ దళితులను విశాలదృష్టితో చూడాలని వారి వల్లే దేశ సమగ్రత అనేది పెంపొందుతోందని వారి జీవితాలలో వెలుగు నింపే ప్రయత్నం చేయాలని అంటారు.

కుల నిర్మూలనము చేసి కుల పోరాటాలు తప్పించాలని అంబేద్కర్ మాటలను ఉటంకిస్తారు.

తన జాతి జనుల ఆకాంక్షలకు ప్రతి రూపంగా, అంబేద్కర్ ఆశయ సాధనకు అక్షర రూపాన్ని ఇచ్చిన వారు బోయి భీమన్న. దళితుల జీవితాలలోని అంతఃసంఘర్షణకు కేవలం సాక్షీ భూతుడిగానే కాక క్రియాశీలక సాహితీ కారునిగా మారారు. వారి జీవితాలలోని, అంత రంగాలలోని ఆవేదనకు స్పందించి, దానిని తన అంతఃకరణంలో ప్రతిఫలింపచేసుకుని ఆ అనుభవాలకు సామాజిక ప్రయోజనం దృష్ట్యా వస్తు రూపాన్ని నిర్మాణం చేయటం వల్లే బోయిభీమన్న పంచములకు, దళిత సాహిత్యానికి మార్గదర్శి అయ్యారు.

ఆధార గ్రంథాలు :

1. జాతీయ కవి బోయిభీమన్న - సూర్య దినపత్రిక సాహిత్య అనుబంధం - 2011 ఫిబ్రవరి 28, ప్రొ.దార్ల వెంకటేశ్వర రావు
2. గుడిసెలు కాలి పోతున్నై (కవితా సంపుటి) - బోయిభీమన్న
3. రాఖీలు (కవితా సంకలనం) - బోయిభీమన్న
4. పంచమ స్వరం - బోయిభీమన్న
5. సాహిత్య పరామర్శ - కొలకలూరి ఇనాక్
6. గుప్పెడు తలపులు - మధుజ్యోతి
7. దళితుల చరిత్ర (1,2,4 భాగాలు) - కత్తి పద్మారావు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శిఖామణి కవిత్వం-దళిత చైతన్యం

– తంత్రవహి శ్రీరామమూర్తి, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సామర్లకోట.

తెలుగు కవిత్వపు గని శిఖామణి. కవిత్వం స్వచ్ఛ కర్పూరం అని భావించిన దశనుండి కవిత్వానికి కూడా కులం ఉంటుందని గ్రహించిన కవి.అభ్యుదయ కవిత్వం, అనుభూతి కవిత్వం తనలో ఇంకింపజేసుకుంటూ దళిత కవిగా జయకేతనాన్ని ఎగురవేసిన కవి శిఖామణి. కవిత్వంలో అనుభూతి, మానవీయకోణం, స్త్రీలు, స్థానీయత ఉన్నా దళిత కోణాన్ని బలంగా చూపించిన కవిశిఖామణి. దళితులంటే ఎవరు అనే ప్రశ్నకు ''తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట సాంస్కృతికంగా హీనంగాచూడబడి విద్యాసౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన స్రవంతికి దూరమై, ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడీకి గురి అయినవాళ్ళు'' దళితులు. పూలే, అంబేద్కర్‌ల సిద్ధాంతాలను మార్గదర్శనంగా భావిస్తూ ''జీవితానుభవం నుంచి పొందిన స్పందన, నిరసన, సంస్కరణ, ఉద్ధరణ, విమర్శ, విజ్ఞాపన, సంఘటన, ప్రతిఘటన అనేవి దళిత చైతన్య పరిణామ క్రమంలో కనిపించే దశలుగా విమర్శకులు గుర్తించారు. కంచికచర్ల కోటేశు మరణంతో మొదలుకొని పదిరికుప్పం, కారంచేడు, చుండూరు సంఘటనలు దళిత చైతన్యాన్ని తీవ్రతరం చేసాయి.

దళిత కవిత్వంలో సామాజిక సంస్కృతి, రాజకీయ నిర్మాణాలను బలంగా కోరటం కనిపిస్తుంది. వర్తమాన రాజకీయ అవగాహనల పట్ల తీవ్ర అసంతృప్తిని, అసహనాన్ని ప్రదర్శించేది,బౌద్ధం వైపు మొగ్గు కలిగి ఉంటూ విద్య, ఆర్థికహోదా, రాజకీయ అధికారం కోరుతూ వాటి మూలాలను, భావజాలాన్ని వ్యాప్తిచేసేది, దళిత గుర్తింపును ప్రధానంగా ఆశించేదిగా కనిపిస్తుంది. దీనినే జాషువా, బోయిభీమన్న, జ్ఞానానంద కవులు వినిపించేరు. ఆ వారసత్వాన్ని పొంది తొలిసారి సతీష్ చందర్ దళిత కవిగా గొంతు విప్పాడు. ఎండ్లూరి సుధాకర్ వంటి కవులు దళిత కవిత్వాన్ని సౌందర్యమయంగా తీర్చారు.అలాంటి నేపథ్యంలో గొంతు కలిపి తనవాణిని వాడిగా వినిపించిన కవి శిఖామణి. అందుకే యు.ఎ.నరసింహమూర్తిగారు ఈ కవి ''ఉత్తుత్తి శిఖామణి కాదు బడబాగ్ని శిఖామణి'' అంటారు. ''కవిని నేను, వర్ణ చాపాన్ని విరగ్గొట్టడానికి వచ్చిన దళిత కవిని నేను'' అని 'అవర్ణం' కవితలో ప్రకటించిన శిఖామణి దళిత నేపథ్యంతో రాసిన కవితలలోని దళిత చైతన్యాన్ని పరిశీలించటమే ఈ వ్యాస ఉద్దేశం.

దళితాగ్రహం, తిరుగుబాటు :

దళితులపై ఎక్కడ దాడి జరిగినా, అమానుషమైన అవమానం జరిగినా దళిత కవులు తమ ఆగ్రహాన్ని కవిత్వీకరించారు. ''వాడే అశుద్ధమానవుడు'' కవిత ద్వారా తొలిసారి శిఖామణి తన ఆగ్రహాన్ని ప్రకటించారు.

''ఈ లోకంలో మనిషి రక్తం త్రాగిన/ నరరూప రాక్షసులున్నారు/ మనిషి మాంసం తినే 'మేన్ ఈటర్స్' ఉన్నారు.

కానీ మనిషి మలాన్ని/మరొక మనిషి చేత తినిపించిన/ మనుషులు మాత్రం లేరు'' అని విజ్ఞానం, అభివృద్ధి నిరుపయోగమయ్యిందా అని తీవ్ర స్వరంతో ప్రశ్నిస్తారు.''నీ పేరు మనిషా'' అని బూతులతో తిడతారు. సామాజిక దురన్యాయాల మీద కోపం వస్తే కవి ఆ అన్యాయానికి కారణమైన వాళ్లను ఇలాగే తిడతారని అన్న సీతారాం మాటలను మనం గ్రహించాలి.

''ఇపుడు అక్షరాలు పుట్టేవి/ శివుని చేతి డమరుక శబ్దం నుండి కాదు/ వీరబాహుని కిర్రు చెప్పుల చప్పుళ్ళ నుండి

ఇహ ఇప్పుడు సరస్వతికూడా/ పలకాబలపం పట్టుకుని / రాత్రి పాఠశాలకు/నా అరుంధతి ఇంటికి రావల్సిందే''....

చిన్నయసూరి తన బాల వ్యాకరణాన్ని / దళిత వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబుగా/ తిరగరాస్తున్నాడు.

"శివుని తొలగించి వీరబాహునీ, సరస్వతి స్థానంలో అరుంధతినీ, ఆవిష్కరించిన కవి దళిత బాలవ్యాకరణ రచనకు 'తిరిగి చిన్నయసూరినే పురమాయించాడు. ఇది ప్రత్యామ్నాయ దళిత భాషను, సంస్కృతిని అగ్రవర్ణాల చేత ఆమోదింప చేయడమే" అంటారు శివసాగర్. అందుకే ఈ కిర్రుచెప్పులభాష అనే కవిత అంతా "దళిత దండయాత్ర కాదంటే జైత్రయాత్ర" అనిపిస్తుంది.

ఎవడురా పొరలు కమ్మిన/ ఈ సవర్ణాంధ్రను/ స్వర్ణాంధ్ర అన్నవాడు" అని తీవ్రంగా గద్దిస్తాడు.

కోడెత్రాచు,ఊరకుక్క, నల్లపంది, కోతి, ఆంబోతు, నడిచిన వీధుల్లో రక్తమాంసాలున్న మనుషులు నడవబోతే ఊరు ఊరంతా ఏకమై అడ్డునిలవడాన్ని గర్హిస్తారు.మనిషి మృగమైన చోట/అక్షరాలా/ అధర్మం నాలుగుపాదాలా/ నర్తించింది/ మనిషి మరణించి/ శిలాజంలోని మనువు/ రాక్షస బల్లిలా ఒక్కసారిగా పైకి/ లేచాడు. అని దాని వెనుకాల ఉన్న కారణాన్ని బహిర్గతం చేస్తాడు. మూడు పదుల రణక్షేత్రం' కవితలో 'హత్యజరిగిందంటే హంతకుడూ ఉండి తీరాల్సిందే/ అదేమి చోద్యమో కారంచేడు నుండి లక్ష్మింపేట వరకు/ హత్యలైతే ఉన్నాయి కానీ/ హంతకులెవరో పట్టుకోలేకపోతోంది చట్టం/ దీన్ని చట్టమని ఎవడన్నాడెహె/ ఇది పెద్ద కులపోళ్ల చుట్టంగాని" అని కవి ఆవేదనను, ఆగ్రహాన్ని ప్రకటిస్తాడు.

దళితుల అణచివేత :

దళితుల అణచివేత జరినప్పుడల్లా కవులు నిరసిస్తూనే ఉంటారు. ఆ సమయంలో స్పందించనందుకు నిజాయితీగా క్షమాపణ చెబుతారు శిఖామణి. "చుండూరు రాచపుండు గురించీ/ కారంచేడు కదంతొక్కడం గురించి,

నీరుకొండ నిప్పుగురించి/ ముమ్మాటికీ కవిత లల్లలేను/ అంతర్జాతీయ కవినైన నేను/ ముమ్మాటికీ మాలవాడల గురించి కవిత్వం రాయలేను" అంటూ "తెగ నరకబడి తుంగలో తొక్కుబడి/ గోతాలలో కుక్కబడిన/ ఏ దళితుడి ఉబ్బిన శవమూ/ కదిలించలేకపోయిందని, ''ఊచకోతకు ఒక్క సిరాచుక్కనైనా వెచ్చించలేక పోయా"నని తన తప్పును ఒప్పుకుంటారు.'క్షమాపణ' కవితలో.

దళిత పాత్రలు :

శిఖామణి కవితలలో అనేక దళిత పాత్రలు కని పిస్తాయి. అవన్నీ దళిత సాంస్కృతిక ఔన్నత్యానికి ప్రతీకలుగా ఉంటాయి. దళిత గౌరవాన్ని పెంచేవిగా, దళిత ఆగ్రహాన్ని ప్రకటించేవిగా కవి తీర్చిదిద్దాడు.

మద్దెల శాంతయ్యను 'గాయకుడా విలుకాడా!' అని కీర్తిస్తూ "కులం గురించి క్రీస్తును నిలదీసిన సాహసీ! శాంతయ్యా!" అని అభినందిస్తారు. అక్షరమంటే ఏమిటని.. "వూరిబయటే నిలబడిపోయిన/మా గోరటి వెంకన్ననడుగు జీవితాన్ని ముట్టించుకునే అగ్ని అని/ఛాతీ మీద ఛెళ్ళున కొట్టుకొని మరీ చెప్తాడు అని గోరటివెంకన్నను కీర్తిస్తాడు. చిన్నారి హేలీని "రాబోయే రోజులలో దళితుల రాజ్యాధికారానికి విజయపతాక" గా ఊహిస్తారు. పంచదార చిలక కవితలో "నరకంలోనూ/ నరకంలాంటి దళిత వాడలోనూ/ పుడతారని నిరూపించినవాడ/ గంధర్వుడవు నీవు"అని పౌరాణిక రంగస్థల నటుడు, పద్య కళాకారుడైన చీమకుర్తి నాగేశ్వరరావును నుతిస్తారు. ప్రకృతి వైద్యురాలు గోపెమ్మపెద్ది రుసుములేని ఒక సంచార ప్రజావైద్యశాల, పట్టాలు లేని ప్రకృతి వైద్యురాలు అని ఆర్ద్రమైన మనస్సుతో ప్రశంసిస్తారు.

చెప్పులుకుట్టే మోచీమా "ఆమె నా జాతి మేలిమి ముత్యం" అంటారు. తన గురువు నరసమ్మగారిని సావిత్రీ బాయిపూలే అని సంబోధిస్తారు."మండేలా మండేలా" కవితలో మండేలాను "నల్లజాతి కోపోద్రిక్త రక్తపారావారా నివి" అంటారు.'మా బాప్ప' కవితలో కొబ్బరికొట్టు పనిలో/ తొడకు కాయను ఆనించి/ మూడు చెక్కల్లో వొలిచిన మా బాప్ప/... కారంచేడులో ఎందుకు పుట్టలేదా అనుకుంటాను?...అని మా బాప్ప అవసరం ఇపుడు

ఎంతైనా ఉందని తలచుకొని దళితోద్యమాన్ని తీవ్రతరం చేయగలిగిన పాత్రలు కావాలంటారు.

దళిత సంస్కృతి :

శిఖామణి ఉన్నతమైన దళిత సంస్కృతి, వారసత్వాన్ని ఎక్కడ కుదిరినా బలంగా చెప్పారు. పాత్రలను గురించి చెప్పేటపుడు దీనిని సమర్థవంతంగా ఉపయోగించు కున్నారు. మిగలపండిన జామపండు మేని ఛాయతో/ గడపకు పసుపు రాసినట్టు/ నుదుట ఇంత వెడల్పాటి కుంకుమబొట్టుతో/ ముక్కున చంద్రవంక నత్తుతో/ చుబుకం మీది మూడుచుక్కలతో పాటు/ మోచేతి కిందినుంచి మణికట్టు వరకు/ గళ్ళగళ్ల పచ్చబొట్లతో/ పక్కకు ముడిచిన తూర్పుకొప్పులో/ ముదురు ఆకుపచ్చని నాచురంగు చీరలో/ భుజానికి/ కుదముట్టంగా అల్లిన ఈతాకుల బుట్టతో ఉన్న మరిడమ్మని మనముందే సాక్షాత్కారింపజేస్తారు 'మా ఊరి మరిడమ్మ' కవితలో.

"రెండు బారల పెద్ద పన్నా చీరకూడా/ మా పెద్ది కడితే మీగాళ్ళపై వరకు మాత్రమే వచ్చేది.
అయిదడుగుల చీరను/ నడుము చుట్టూ రెండు సార్లు చుడితే/ పట్టుమని నాలుగు కుచ్చిళ్ళు వచ్చేవి కావు"

అంటూ 'తాటాకు గదులుపెట్టె' కవితలో చెల్లి గోపెమ్మపెద్దిని వర్ణిస్తారు.ఈ విధంగా దళితుల వస్త్ర ధారణను, అలంకారాన్ని, వస్తువులను అత్యంత సహజంగా వర్ణిస్తారు.

దళితప్రతీకలు :

దళితుల రంగు, సమస్తవృత్తుల సమస్త చిహ్నాలు అన్నట్లు వారి పరికరాలు, నలుపుగా ఉండే వస్తువులు, ప్రకృతిలో అంశాలైన నల్ల కలువ, వంటివి శిఖామణి ఉపయోగించుకున్నారు.ఏకలవ్యుని బొటనవేలు, అంబేద్కర్ చూపుడు వేలు దళిత కవిత్వంలో అప్పటికే ఉన్న ప్రతీకలు. నలుపును గురించి " నలుపంటే నలుపా అది/ గుత్తులుగా విరగకాచిన నేరేడు నలుపు/ దుక్కి దున్నిన నల్లరేగడి మడి చెక్క నలుపు/ పంట బోదెలో విరగబూసిన నల్లకలువ నలుపు" అని బాప్ప ఒంటి రంగుని అక్షరీకరిస్తారు. మినుమును గురించి రాసిన కవితలో" నేను నల్లని దానను,నవధాన్యాల్లో నాలుగో దానను, నాపేరు మినుము, శక్తికి నేను ఇనుము...అని మొదలుపెట్టి

"నలుపు సౌందర్యాత్మకమే కాదు జాత్యహంకారపు
అభిజాత్యాలను/ నిట్టనిలువునా దగ్ధంచేసే

నీలిమంటల ధిక్కారపు అగ్ని శిఖ" అంటూ దళిత తత్వాన్ని ప్రతిబింబించే అధికార వర్ణం నలుపని చాలా ఉన్నతంగా చూపిస్తారు.'మండేలా ఓ మండేలా' కవితలో మండేలాను "ఆఫ్రికా అగ్ని సరస్సున వికసించిన/ నీలితప్త జ్వాలా సుమానివి" అని నీలకాంతిని ఇక్కడ కూడా జ్వలింపచేస్తారు. ఈ విధంగా నీలిమంటలు అనేది కవి సాధించిన గొప్ప అభివ్యక్తి. కిర్రు చెప్పులభాష కవితలో "ఇప్పుడు అక్షరాన్ని/ రాకాసి బొగ్గును చేసి/ నాచీకటి కొలిమిని ముట్టించుకున్నాను." అంటూ నల్లని బొగ్గుతో అక్షరాలు ప్రజ్వరిల్లే జ్వాలను రగులుస్తానంటాడు కవి.ప్రపంచ వ్యాప్తంగా నలుపు వారసులే ఉన్నారని వీరబాహుడు, మాలకన్నమనీడూ, వీరమల్లుడూ, చండాలికా, మార్టిన్ లూథర్ కింగ్, మండేలా,రూట్స్ నవలలో నల్లని నేరేడు బుగ్గల కథానాయకుడు 'కుంటా', వీరందరినీ తలచుకుని పరవశించిపోతాడు కవి. ఆ పరవశంలో కవి తనమాటలు 'నల్లని మట్టి మీద' పచ్చని తివాసీ మొలకెత్తినట్లుండటానికి కృషి చేస్తాడు."వర్తమాన రణక్షేత్రంలో/ సమతారథం శిఖరాగ్రంపై/ రెపరెపలాడే గబ్బిలపు ధ్వజాన్ని" ఎగరేయటానికి అందరినీ ఆహ్వానిస్తాడు కవి.

అంబేద్కర్ ఆరాధన :

దళితుల జీవితాలకు వెలుగు బాట అంబేద్కర్. అందుకే అడుగడుగునా అంబేద్కర్‌కు నీరాజనాలు పడతాడు. అంబేద్కర్‌కు అవమానం జరిగితే తీవ్రంగా ఆగ్రహిస్తారు.'విగ్రహాలు మాట్లాడతాయి' కవితలో

అంబేడ్కర్ అంటే ఎవరో చెబుతూ ''తన చూపుడు వేలుతో ముందుకు నడిపిస్తున్న యోధుడు అంటారు. శతాబ్దాలుగా ఘనీభవించిన దళితాగ్రహం, కోట్లాది దళిత బహుజనుల కండలూ ఎముకలూ , రక్తమూ కన్నాళ్లతో కలిపి నిర్మించిన మహోన్నత సజీవ మానవతా సౌధం'' అని కళ్ళకున్న గంతలు విప్పి చూడమంటాడు.

'భీమ్ పాటే పాడతాను' అనే కవితలో భీమ్ పాట దళిత జీవితాలను శ్రుతి చేసిన రాగం. జీవన మంత్రం, సాహాసాన్ని సౌందర్యాన్ని నింపిన జీవన మంత్రం. కోటాను కోట్ల దళితజాతి పవిత్ర పరమ గీతం. ధ్యానించే దస్య మంత్రం. అంటూ ప్రారంభించి, భీమ్ పాట/ దళితజాతి పాలిటి మృత సంజీవని/ భీమ్ పాట/ కల్లోలమైన బతుకు కడలిని దాటించే/ నావా పడవ/ భీమ్ పాట/ నిదురించే నా జాతిని మేలుకొలిపే/ దళిత వైతాళిక గీతిక/.... ఈ కలియుగపు అనాగరిక జాతికి/ భీమ్ మంత్రోపదేశం చేస్తున్నాను/ ఒక్క గొంతుతో కాదు/ కోటి గొంతుల దళిత కోరస్‌తో/నేను/ భీమ్ పాటే/ పాడతాను'' అని ఎలుగెత్తి చాటుతారు.

''ఊడలు దిగిన ఈ కులం మర్రి చెట్టును/తుత్తు నియలు చేయడానికి/ గండ్రగొడ్డలి వంటి/ అంబేడ్కరొక్కడు చాలు/ మాల కన్నమదాసు పదునైన చేతి ఖడ్గంలాంటి/ అంబేడ్కర్ వర్ణ నిర్మూలన సిద్ధాంతం ఒక్కటే చాల''ని తన పరిపూర్ణ విశ్వాసాన్ని ప్రకటిస్తాడు.''నూట ఇరవై అడుగుల ఎత్తులో/అంబేడ్కర్/ విగ్రహాలు నిర్మిస్తున్నారని విన్నప్పుడు../ఈ మట్టికాళ్ల మనిషి కూడా/ తలెత్తుకు నిలబడతాడనీ..ఆకాశమే హద్దుగా, నిలువెత్తు ఆత్మ గౌరవ పతాకంలా రెపరెపలాడతాడనీ.. ఇది తన ''అమృతోత్సవ కల''అనీ కవి చెబుతారు.పక్షి సభను కూడా ''సూటు బూటులోనే కాదు, అప్రతిహత అజేయ, అనర్గళ వాగ్ధాటితో, లండన్ రౌండ్ టేబుల్ సమావేశంలో, పాల్గొన్న అంబేడ్కర్‌గానే '' దర్శిస్తాడు. డ్రాయింగ్ టీచర్ చెల్లి కృష్ణారావు నల్లబోర్డుమీద గీసిన అంబేడ్కర్ రేఖా చిత్రం తనను దళిత సాహిత్యకారునిగా మలచిన విధానాన్ని ఆనందంగా గుర్తుచేసుకుంటాడు.

దళిత భవిత :

అక్షరాన్ని వశం చేసుకుని, ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న తనజాతి భవిష్యత్ ఉన్నత స్థానంలో ఉంటుందని, ఉండాలనీ కవి ఆశిస్తాడు. దానికి అడ్డు పడిన వారిని ''నేర్పని విద్యకు/ గురు దక్షిణ కోరిన/ మా బొటన వేళ్ల స్థానంలో/ఇనుప పాళీలు మొలుచు కొస్తున్నాయి'' అని హెచ్చరిస్తూ దళితుల భవితపై విశ్వాసాన్ని ప్రకటిస్తారు. కుల నిర్మూలన జరగకుండానే/ వర్గపోరాటం సిద్ధిస్తుందనీ/ కలలు కంటూ గాలికత్తులతో/ యుద్ధంచేస్తున్నవాణ్ణి'' అనటం ద్వారా కులనిర్మూలన జరగడమే దళితోద్యమ భవిత అంటారు 'క్షమించు దళితా' కవితలో.

'మూడుపదులరుధిరక్షేత్రం' కవితలో ''సమాధుల దొడ్డిని, ఊరి నడిబొడ్డు రచ్చబండకు, ఈడ్చుకు రావడం, వర్తమాన దళిత చరిత్ర'' అని పిలుపునిస్తారు. ''నేను ప్రవచించే దళిత సూక్తంలో/ ప్రభవించే దళిత విరాట్ పురుషుడు/ ఈ జాతి పెట్టుడు పచ్చబొట్లను/సమూలంగా తుడిచివేసే రోజు/ మరింకెంతో దూరంలో లేదు'' అని కుల నిర్మూలనే భవిష్యత్ అనీ చెబుతారు. ''నాయనా! నిప్పు ఎప్పుడూ అణిగిమణిగి ఉండదు../దాని తల ఎంత కిందకు వంచినా/ అగ్ని శిఖల నాలుకలు/ పైపైకి లేస్తాయి/... ఇక అప్పటినుండి/ అమ్మ వొదిలేసిన పాయ్యిని/ నేను రాజేస్తున్నాను'' అని సగర్వంగా చెబుతారు. దళితుల ఆత్మ గౌరవం కోసం పోరాటం చేయవలసిందేనని, రాజ్యాధి కారం సాధించవలసిందేనని నిశ్చయంగా ప్రబోధిస్తారు.

''కవి ఏమిస్తాడు లోకానికి ప్రాణవాయువు వంటి ఒక అమృత వాక్యం తప్ప'' అన్నట్లు సాహిత్య ప్రపంచానికి ఊపిరిలూదుతున్న శిఖామణి ''దిగంబర కవుల్లోనిక ధిక్కారం, అభ్యుదయ కవుల్లోని ప్రబోధం, విప్లవకవుల్లోని ఆవేశం అన్నిటినీ వొడిసి పట్టి సొంత గొంతుక'' పలికించారు.''ఇప్పుడు నేను/ మనిషికి మనిషికి మానవ త్వాన్ని /అంటు కట్టే పనిలో /నిమగ్నమై ఉన్నాను'' అనే

కవి మాటలే పరిశీలిస్తే "స్త్రీ వాదమైనా, దళిత వాదమైనా, వాటి సారాంశం మనిషి వాదమనేది శిఖామణి కవితా తత్వం" అనే చల్లపల్లి స్వరూపరాణి మాటలు ఎంత యదార్థమో తెలుస్తాయి. "శిఖామణికి జీవిత రహస్యం తెలుసు, కవిత్వ శిల్ప రహస్యం బాగా తెలుసు" అని ప్రశంసలు పొందిన ఆధునిక కవి శిఖామణి, శిఖామణి.

ఆధార గ్రంధాలు :

1. ఆధునిక సాహిత్యం-దళిత స్పృహ-యువభారతి.1994.
2. సంజీవని-దాట్ల దేవదానం రాజు-కవిసంధ్య గ్రంధమాల-2017.
3. శిఖామణి సమగ్రసాహిత్యం,సంపుటం1-కవిసంధ్య గ్రంధమాల-2021
4. శిఖామణి సమగ్రసాహిత్యం,సంపుటం2-కవిసంధ్య గ్రంధమాల-2021
5. శిఖామణి సమగ్రసాహిత్యం,సంపుటం3-కవిసంధ్య గ్రంధమాల-2021

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాదిగ విజయం నవల-దళితుల జీవిత చిత్రణ

- గడ్డం లింగరాజు, పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా తరతరాల నుండి అణచివేతకు గురిచేయబడ్డవారు దళితులు. తరతరాలుగా అనుభవిస్తున్న అవమానాల్ని పోగొట్టు కోవాలని, అందరిలాగే తాము గుర్తింపబడాలని, ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలని, సాంస్కృతికంగా తమకో అస్తిత్వాన్ని కల్పించుకోవాలని, సమాజంలో అన్ని రంగాలలో సమాన ప్రాతినిధ్యం కోసం పోరాడుతున్న వారి జీవితాలను గురించి తెలియజేసేదే దళిత నవల. దళిత నవల దళితుల జీవన విధానాన్ని ప్రతిబింబింప చేస్తుంది. ప్రతి దళితుడు కూడా వారి వారి జీవితాన్ని తొంగి చూసినట్లుగా ఉంటుంది. దళిత నవలల్లో సంస్కృతి, ఆచారవ్యవహారాలు, వృత్తులు, అంటరానితనం, ఆహారపు అలవాట్లు, దొరల పీడన, భూస్వాముల దౌర్జన్యాలు, స్త్రీలపై లైంగిక వేధింపులు మొదలైనవి ఉంటాయి.

దళితులు అనుభవిస్తున్న దైన్య స్థితిని ఎంత హృదయ విదారకంగా వివరిస్తారో అంతే స్ఫూర్తితో దళితుల్లో చైతన్యం రావాలనే విషయాన్ని కూడా అంత సూటిగా రచయిత చెప్తారు. కాలువ మల్లయ్య దళితులు సామాజి కంగా ఎదుర్కొనే అవమానాలు, అన్యాయాల్ని, నిరం కుశత్వాన్ని గురించిమాదిగ విజయం నవలల్లో తెలియ జేశారు.

మాదిగ విజయం నవల :

కాలువ మల్లయ్యగారి 'మాదిగ విజయం' నవలను సామాజిక భారత్ బి.వి.వి. ఛారిటబుల్ ట్రస్టు, హైదరా బాద్ వారు 2015 ఏప్రిల్ లో ముద్రించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ నిర్వహించిన నవలల పోటీల్లో (2013 - 2014) బహుమతి పొందిన నవల ఇది. ఈ నవలలో నాలుగు తరాల మాదిగల జీవితం, పరిణామం, అభ్యుదయం ప్రత్యక్షమవుతాయి. ఒక తరం బుచ్చయ్యది. రెండోతరం బుచ్చయ్య కొడుకు పేరయ్యది. మూడవ తరం బుచ్చయ్య మనవడు ఎల్లయ్యది (ఆనందరావుది). నాలుగవ తరం ఆనందరావు పిల్లలైన ఆజాద్, శ్రీకాంత్ లది. ఇది దాదాపు నూరేళ్ల మాదిగల జీవితాన్ని ప్రతిబింబించిన నవల. ఈ నవల దళిత బహుజన రాజ్యాధికారాన్ని కోరుతూ రాయబడిన నవల. యుగయుగాలుగా వేదనకు, పీడనకు, అంటరానితనానికి గురవుతున్న దళితులు చైతన్యం పొంది అభివృద్ధి పథంలో నడుస్తున్నవైనాన్ని ఈ నవల చిత్రీకరించింది. ఆ చైతన్యాన్ని ఉపయోగించుకొని మంద కృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ రాష్ట్రంలోని మొత్తం మాదిగల్ని కదలించగల నాయకులుగా ఎదిగారు. నిజంగా దళిత జీవితంలో ఎంతో వైవిధ్యముంది. కష్టపూరితమైన బ్రతుకే అయినా సర్వసంపదలకు సృష్టికర్తృత్వం వహించడం దళిత జీవితంలో ఉంది.

వస్తు విశ్లేషణ :

ఈ దేశంలో అత్యధికంగా అణగారిన జాతియైన మాదిగలకు తద్వారా దళితులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే దేశాన్ని పీడిస్తున్న కుల సమస్య తద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. తరతరా లుగా వేదనకు, పీడనకు, అంటరానితనపు దౌర్భాగ్యం అనుభవిస్తున్న దళితులకు, పేరయ్య, చిలుక రామయ్య లాంటి కుటుంబాలకు రాజ్యాధికారం రావాల్సిందే. తాము మాదిగవాళ్లమని చెప్పుకోవడానికి సంకోచించే దశ నుండి వారి పేరు వెనుక మాదిగ అని పెట్టుకోవడానికి తాము మాదిగలమని చెప్పుకోవడానికి గర్వకారణంగా భావించే స్థితికి కారణం ఈ నవలలోని ఆనందరావు కుటుంబ విజయం. అదే మాదిగ విజయం. వివిధ రకాల ఉద్యమాలు, ఆనందరావు లాంటివారు విజేతలుగా

నిలువడం, చదువులతో ఉన్నత స్థితికి వెళ్ళిన శ్రీకాంత్, ఆజాద్ లు ఆదర్శంగా నిలవడం లాంటివి పీడిత జాతుల వెలుగుగా చెప్పవచ్చు. ఇరవై ఒకటవ శతాబ్దం ఖచ్చితంగా పీడిత జాతులదే అని నిరూపిస్తూ జరుగుతున్న పరిణామాల వెలుగులో ఇలాంటి విజయాలు ఎన్నో జరుగుతున్నాయి. అన్ని రంగాలలో ముందుకు వెళ్తూ దళిత రాజ్యాధికారం దిశగా అడులేస్తున్న దళిత చైతన్యపు వీరులు ఎంతోమంది ఉన్నారు. తెలంగాణలో ఆనంద రావు తరంతో ప్రారంభమైన విజయ పరంపర దళితుల నుండి ఆచార్యులు, న్యాయవాదులు, కలెక్టర్లు, రచయితలు, రాజకీయ నాయకులు, కళాకారులు, తత్వవేత్తలుగా పరిణామం చెందుతూనే ఉన్నారు. ఒక్క ఆనందరావు విజయంతోనో అలాంటి కొద్దిమంది విజయంతోనో 'మాదిగ విజయం' పూర్తయినట్టు కాదు. విజేతలైన వారంతా అంబేద్కర్ పీడిత జన పక్షపాత సిద్ధాంతాల వెలుగులో ఇప్పటికీ హీనదశ స్థితిలో ఉన్న దళిత సోదర సోదరీమణులను విజేతలుగా నిలిపినప్పుడే మాదిగ విజయం పూర్తవుతుంది.

ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో దళితులదే జయమని ఒబామా, మాయావతి ఎన్నికలలో గెలువడం రుజువుగా కనబడుతుంది. ఓ దళితుడు దేశాధ్యక్షుడు కావడం వెనుక ప్రత్యక్ష, పరోక్ష పోరాటాల ఫలాలెన్నో ఉన్నాయి. తరతరాల పీడన అనుభవించిన దళితుడు రాజ్యాధికారం కొంతకాలమైనా చేయాల్సిందే. తెలంగాణలో మాదిగలు ఎక్కువగా ఉన్నారు. వివిధ ఉద్యమాలు తెలంగాణలో వచ్చిన తరువాత ఫ్యూడల్ దొరలతో పీడితులైన మాదిగల్లో చైతన్యం వచ్చింది. ఆ చైతన్యాన్ని ఉపయోగించుకొని మందకృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ రాష్ట్రంలోని మొత్తం మాదిగల్ని కదిలించగల నాయకులుగా ఎదిగారు. మందకృష్ణ మాదిగ ఒక చారిత్రక స్థితిని ఉప యోగించుకోగలిగే చైతన్యవంతమైన పాత్రను నిర్వహిస్తు న్నాడు. శాసనసభల్లోను వారి సమస్యలే ఎక్కువ చర్చకు వచ్చేంత స్థితికి ఉద్యమాన్ని తీసుకువెళ్లాడు. అందుకే దళిత కులాల వర్గీకరణ జరగాలన్న ఆందోళన తీవ్రమైంది. ఉ న్న రిజర్వేషన్ సౌకర్యాలను కొద్దిమంది మాత్రమే ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారని ఎవరి వాటా వారికి చెందాలని అందుకు కులాల వర్గీకరణయే మార్గమని పోరాటాలు చేసి వారిని ఎ, బి, సి, డి గ్రూపు లుగా విభజించడం జరిగింది. వారి జనాభాను ఇతర పరిస్థితులను అనుసరించి రిజర్వేషన్ శాతాన్ని పెంచుతూ జి.వో. జారీ చేయడం జరిగింది. పీడితులు అయిన పల్లెల్లోని మాదిగలు భూమి, చదువు, అధికారం పొందటంవల్ల నలుగురితో సమానంగా గౌరవంగా నిలుస్తారని భావించి రచయిత ఈ నవల రాశాడు. స్వాతంత్ర్యం రాకముందు సూర్యారావు లాంటి దొరల ఆగడాలు తెలంగాణలో ఏ స్థాయిలో ఉండేవో తెలుసు కున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక సమాజంలో వచ్చిన మార్పులు, అది దళితుల జీవితంలో వచ్చే పరిణామాలు జాగ్రత్తగా సమన్వయ దృష్టితో వ్రాశాడని చెప్పవచ్చు. ఒక మాదిగ కుటుంబం తెలంగాణలో ఈ శతాబ్దంలో పొందిన అభ్యుదయాలను చిత్రించిన నవల ఇది. ఇది దళితు లకు మేలుకొలుపు వంటిది. ఇది సమాజం గ్రహించి విజయం పొందటానికి కరదీపిక లాంటిది. 3. దళితుల మత మార్పిడి విధానం:

నైజాం పాలనలో నిజాం నవాబు ఎలాంటి మత ప్రచారాలకు అనుమతించలేదు. పోచమ్మ, మైసమ్మలాంటి క్షుద్ర దేవతల గుళ్ళు కట్టుకోవడాన్ని ప్రోత్సహించారు. నిజాం ఎంత ప్రతిఘటించినా ఢిల్లీలో ఉన్న పాలకులది క్రైస్తవం కాబట్టి పరిమితంగానైనా క్రైస్తవ మత ప్రచారానికి అనుమతించక తప్పలేదు. అందుకే స్వాతంత్ర్యానికి పూర్వం కోస్తా ప్రాంతంలో స్వీకరించినంతగా తెలంగాణలో క్రైస్తవాన్ని స్వీకరించలేదు. అన్ని మతాలవారు మత మార్పిడిలకు దళితులనే ప్రోత్సహించారు. అన్ని ప్రాంతాల్లోను తమ మీద ఉన్న పీడనను, అంటరాని తనాన్ని భరించలేక దళితులే ఎక్కువ మంది మతం మార్చుకున్నారు. క్రైస్తవ మత ప్రచారకులు ఊళ్లలో తిరిగి

మత మార్పిడిని ప్రోత్సహించారు. తమ మతంలో చేరితే అంటరానితనం ఉండదని, అందరితోపాటు చర్చికి వెళ్లొచ్చని ప్రార్థనలు జరుపుకోవచ్చని, చదువుకోవడానికి కూడా అవకాశాలు కల్పిస్తామని ప్రచారం చేశారు.

ఆ ఊరి దళిత యువకులకి గుళ్లోకి ప్రవేశం లేదు, పండుగలనైనా తమ ఇష్టానుసారం చేసుకునే అవకాశంలేని మతంలో ఉండటం ఎందుకన్న ఆలోచన వచ్చి వారిలో తర్జన భర్జనలు మొదలయ్యాయి. దసరా తరువాత వారం రోజులకి దళిత యువకులు, మిగతా కొంతమంది కొండయ్య ఇంటి ముందు చర్చించారు. అక్కడికి క్రైస్తవ మత ప్రచారకుడు ఒకరు వచ్చారు. అతని మాటలను అర్థం చేసుకొని కొందరు మత మార్పిడికి అంగీకరించారు. కొంతమంది నిజాం నవాబుకి భయపడి బాధలు అనుభవించడం ఎందుకు అని ఆలోచించి మత మార్పిడిని విరమించుకున్నారు. తమ మతంలో తారతమ్య భేదాలు లేవని చదువు, ఉద్యోగాల విషయంలో తమ సాయం ఉంటుందని ఇంకా అనేక విషయాలు ప్రచారకుడు చెప్పాడు. అయితే అతడెన్ని విషయాలు చెప్పిన చివరకు రెండు కుటుంబాల వాళ్లు మాత్రమే తమ మత మార్పిడికి అంగీకరించారు. ఆ కుటుంబ సభ్యులందరిని ఊరి బయట ఉన్న చెరువు దగ్గరికి తీసుకువెళ్ళి కొన్ని ప్రతిజ్ఞలు చేయించాడు. వాళ్లకు బాప్టిజం ఇప్పించాడు. ఆ రెండు కుటుంబాల వారు క్రైస్తవులయ్యారు. మంచి క్రైస్తవులు ఎలా ఉండాలో బైబిల్లోని వాక్యాలను కోడ్ చేస్తూ కొద్దిసేపు ప్రసంగించాడు. జానయ్య అనే వ్యక్తి జాన్సన్ గా పేరు మార్చుకున్నాడు. తిమ్మయ్య థామ్సన్ అయ్యాడు.

దళితుల జీవన విధానం :

చాలా ఊళ్ళకున్నట్టే ఆ ఊరికి ఓ దళితవాడ ఉంది. ఊరి చిట్టచివరన మాదిగవాడ ఉంది. ఆ వాడను ఆనుకునే మాలవాడ ఉంది. రెండింటిని కలిపి మాదిగ మన్నేపొల్లవాడని, దళితవాడని అంటారు. ఆ వాడలో అన్ని పాకలే ఉన్నాయి. రెల్లుగడ్డి, వరిగడ్డి తాటాకు కప్పులతో ఉండే ఆ గుడిసెలను ప్రతి సంవత్సరం సదరాల్సిందే. ఆ వాడకున్న ప్రతి ఇంట్లో ఓ చేద బావుంది. ఆ బావుల్లో ఉండే నీళ్లు ఉప్పునీళ్లు అవి స్నానాలకు, ఇతర గృహావసరాలకు వాడుతారు. తాగడానికి, వంటకు మాత్రం చెరువు నీళ్లు వాడుతారు. ఆ ఊరిలో మంచి నీళ్ల బావి ఉన్న ఆ నీళ్ళను దళితులు ముట్టుకోకూడదు. వారి కోసం వేరే బావి తవ్వించడానికి ఏ అధికారి, నాయకుడు ముందుకు రాడు. ఉన్న మంచి నీళ్లబావి నీళ్లు తీసుకోవడానికి, వివాదం సృష్టించడానికి దళితులు సిద్ధంగా లేరు. ఆ వాడలోని వీధులన్ని మురికి మురికిగానే ఉంటాయి. ప్రతి గుడిసె ప్రక్కన ఉన్న పెంట దిబ్బలో మురికి పదార్థాలు, చెత్తచెదారం వేస్తారు. ఆ వాడలో చాలామంది శరీరాల మీద చొక్కాలు ఉండవు. మొలకు మాత్రం చిన్న పంచెలు ఉంటాయి. తలపాగాలు ఉంటాయి. స్త్రీలు బొంతల్లాంటి దొడ్డు చీరలు ధరిస్తారు. ఒక్కో స్త్రీకి రెండుకంటే ఎక్కువ చీరలుండటం అరుదు. పిల్లలకు గోచీలున్న వారు కొందరైతే అవి లేనివారు చాలామంది ఉంటారు. ఊళ్లో ఉన్న వందలాది ఎకరాల భూముల్లో దళితులెవరికి భూములున్న దాఖలాలు లేవు.

ఊరి వాళ్లందరికి మాలలు, మాదిగలు అంటరానివాళ్లే. మాదిగవాళ్లు తాకితే పెద్ద ముట్టుడుగా భావిస్తారు. దళితవాడకు వెళ్లితే వారి గుడ్డపీలికలు కాళ్లకు తగులకుండా జాగ్రత్త పడతారు. ఒకవేళ తగిలితే ఇంటికొచ్చి స్నానాలు చేస్తారు. దళితుల్లో చాలా ఉప కులాలు ఉన్న మాల, మాదిగల సంఖ్యే ఎక్కువ. ఊరంతటికి మాలమాదిగలు అంటరానివాళ్లు అయితే మాలలకు మాదిగలు అంటరానివారు. వీరి మధ్య కంచం, మంచం పొత్తుల్లేవు. ఈ కులాల వారికి గుళ్లోకి పోయే అవకాశం లేదు. దళితులంతా పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ లాంటి మాతృస్వామ్య దేవతలను పూజిస్తారు. కొన్ని క్షుద్ర దేవతల కొలుపులు చెప్తారు. మాదిగవారిలో చాలామంది తమ వృత్తి పనులు చేసుకుంటూనే బతుకుతున్నారు. చెప్పులు కుట్టడం, తాళ్లు పేనడం,

వ్యవసాయదారులకు ఉపయోగపడే తలుగులు, దండెడలు, పగ్గాలు పేనడం లాంటి పనులు చేస్తూ బతుకుతున్నారు. కొంతమంది వెట్టివాళ్లుగా, పాలేర్లుగా, కూలీలుగా బతుకుతున్నారు. మాలలు పాలేర్లుగా, కూలీలుగా, సుంకర్లుగా, నీరటికాళ్లుగా వ్యవసాయాధారిత ఇతర పనులు చేస్తూ బతుకుతున్నారు. మాదిగవాళ్ల ఇంట్ల పందిర్లపై, గుడిసెలపై పశువుల తోళ్లు ఆరేసుకుంటారు. ఇంటి నిండా ఉత్పత్తితో సంబంధమున్న వస్తు సామాగ్రి ఉన్న,ఇంట్లో మాత్రం దుర్భర దారిద్ర్యం విలయతాండవం చేస్తూంటుంది. చాలాచోట్ల దళిత వాడల పరిస్థితి ఇలాగే ఉంటుంది.

దళితులు వారి సాంప్రదాయం ప్రకారమే పెళ్ళి చేసుకుంటారు. దళితులకు పెళ్ళిళ్లు చేసే మిత్తిరయ్య వారి పురోహితుడు. జోడు నాగలెత్తుకొని వ్యవసాయానికి పోవడం, విత్తనాలు వేయబోవడం, అలుగు పోవడం లాంటి పెళ్లి తంతు కార్యక్రమాలు అన్ని పద్ధతి ప్రకారమే జరుగుతాయి. దళిత ముత్తైదువలు పాన్పులేసే పాటలు పాడుతారు. కల్లు, గుడాలతో విందు జరుగుతుంది. అప్పగింతల సమయంలో పెళ్లికూతురు వారి తరుపువారు ఏడున్నా ఆమెను అప్పగిస్తారు. దళితులకు ఇతర కులాలవారికి ఉన్నట్టుగా అన్ని పండుగలు జరుపుకునే అవకాశం లేకున్నా అవెప్పుడు తమవి కావని భావించలేదు. సంక్రాంతి పండుగ వీరు జరుపుకునేవారు. వ్యవసాయ దార్లకు ఇది పెద్ద పండుగ.

దళిత కుటుంబాల్లో చాలావరకు తల్లే యజమానురాలుగా ఉండటం కనిపిస్తుంది. భార్యాభర్తలిద్దరూ పనిచేస్తూ సంపాదిస్తుండటం వల్ల ఇంటి యాజమాన్యంలో సగం వరకు స్త్రీ పాత్ర కూడా ఉంటుంది. దళిత కుటుంబాల్లో, మధ్యతరగతి కుటుంబాల్లోలాగా స్త్రీ మీద పురుషుడి ఆధిక్యం పెద్దగా కనిపించదు. దళితులు ఎక్కువగా గటిక, అంబలి, కుడుములు, గంజుపిండి, జొన్నరొట్టె, పచ్చి పులుసు, చేపల పులుసులతో తినేవారు. అప్పటితో పోల్చితే ప్రపంచీకరణ ప్రభావం వలన ఇప్పుడు వారి జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయి. వారిలో వచ్చిన చైతన్యం కూడా వారి జీవ విధానాన్ని మార్చిందని చెప్పవచ్చు. వారిలో కొందరు ఈరోజు ఉన్నత స్థాయి జీవితాన్ని గడుపుతున్నట్లుగా మనం చూడవచ్చు. ఆనందరావుతో ప్రారంభమైన వారి మార్పు ఇంకా వారిలో చాలా మార్పులు రావాలని జీవన విధానంలో వీరు ఎంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆశిద్దాం.

దళితుల సంస్కృతి :

ఎవరూ అనుకరించని సంస్కృతి ఏ విదేశీ వాసనలు, మోజులేని సంస్కృతి. దాన్ని కాపాడుకుంటున్నాడు దళితుడు. ఈ దేశంలోని ఆదిమ భారతీయుడు దళితుడే. నిజమైన జాతీయవాది దళితుడే. ఎంతో వైవిధ్యమున్న సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొన్నాడు. నాగరికతను పెంపొందించినవాడు దళితుడు. హక్కుల కోసం, ఆత్మగౌరవ కోసం, రాజ్యాధికారం కోసం పోరాటాలు చేస్తున్నాడు దళితుడు. భూములను సస్యశ్యామలం చేయడానికి ఘర్మ జలాన్ని ధారబోస్తున్నవాడు. నాగరికత విలసిల్లడానికి చెమటోడ్చుతున్న శ్రమజీవి దళితుడు. ప్రాజెక్టులను కట్టినవాడు, కొండలను పిండిచేసేవాడు ధన్యజీవి దళితుడు. దళితులు చాలామంది పాలేర్లుగా, కూలీలుగా, చెప్పులు కుట్టేవాళ్లుగా, డప్పు కొట్టేవాళ్లుగా, నీరటికాళ్లుగా, తాళ్లు పేనేవాళ్లుగా, చిన్న చిన్న వ్యవసాయదారులుగా ఉంటూ రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పుడు ఆ వృత్తులకు కూడా విఘాతం ఏర్పడి సంక్షోభంలో ఉన్నారు. దుబాయికి వెళ్లడం, కమ్యూనిస్టులుగా మారడం లాంటి అనేక సంఘటనలు జరుగుతున్నాయి. ఓ దిక్కు చావకింది నీరులా అంటరానితనం, మరోదిక్కు పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. సర్వ సంపదలకు సృష్టికర్తలైన దళితులకు తాము పోరాడి గెలుచుకున్న జీవితముంది. గెలుచుకోవాల్సింది ఇంకా ముందుంది. మాతృస్వామ్య దేవతారాధన, ఇండ్లల్లో జంతువులను

పెంచడం, పిడకల మీద అగ్గిని మండించడం వంటి పనులను దళితులు చేస్తూనే ఉన్నారు. దళితుల్లోంచి చదువుకొని ఉన్నత స్థాయికి చేరినవారు కొంతమంది తమ కుటుంబాల వారికి సహాయం చేస్తున్నారు. మరికొందరు తమ మూలాలను మరిచిపోయి రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోయారు. ఇంకొందరు మాత్రం తమ జాతి అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారు. దళిత వనం వికసిస్తూనే ఉంది.

దళితులను అడుక్కోవడానికి చిందు భాగోతులవారు ఊళ్ళోకి వస్తారు. వారి రాకతో దళితవాడ సందడిగా ఉంటుంది. వారు భాగోతాలాడుతూ దళితుల దగ్గర బాపతులు వసూలు చేస్తుంటారు. వాళ్లకు చదువు రాదు. అయినా వంశపారంపర్యంగా భాగోతాలాడే కళ ఒకరి నుండి మరొకరికి సంక్రమిస్తుంది. నిరక్షరాస్యులే అయినా నాటకాలాడుతుండటం వల్ల వారి భాష కొంచెం నాగరికంగా ఉంటుంది. అందులో ఓ ప్రత్యేకమైన యాస ఉంటుంది. వారి వల్ల దళితవాడలో రెండు నెలల వరకు పండుగ వాతావరణం ఉంటుంది.

భూస్వామ్య వ్యవస్థలో దొరల పీడన :

నిజాం పాలనలో నాలుగైదు శాతంగా ఉన్న భూస్వాముల చేతుల్లోనే భూములన్ని ఉన్నాయి. మిగతా వారంతా భూమిలేనివాళ్లే. భూస్వాముల భూముల్లో పాలేర్లుగా, కౌలుదార్లుగా పనిచేస్తున్నవాళ్లు ఎక్కువగా దళితులే. నైజాం జారీ చేసిన కొత్త పన్నుల చట్టం 'సర్వే సెటిల్మెంట్ యాక్ట్' రాకముందు భూస్వాములే కాక కొంతమంది రైతులకు కూడా స్వల్పంగా భూములుండేవి. చాలాకాలం వరకు శిస్తులన్ని వస్తురూపంలో చెల్లించేవారు. కొత్త పన్నుల విధానం అమల్లోకి వచ్చిన తరువాత పన్నులు డబ్బుల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. అమాయకత్వం, చదువుకోకపోవడం, అణచివేత దుర్మార్గంగా ఉన్న సమయంలో ప్రజలు తమ ధాన్యాన్ని డబ్బులకు అమ్ముకునే పరిస్థితులు లేవు. ఇతర ప్రదేశాలతో సంబంధాలు అతి తక్కువ. మిగిలే పంటే తక్కువంటే దాన్ని అమ్ముకునే సౌకర్యాలు మరీ తక్కువ కావడం వల్ల చిన్నరైతు పరిస్థితి అస్తవ్యస్తమైంది. క్రమక్రమంగా పన్నులు చెల్లించడం సాధ్యంకాక భూములు వదులుకోవాల్సి వచ్చింది. పన్నులు చెల్లించలేని రైతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకొని భూస్వాములు, దేశ్ ముఖ్ లు, పట్వారీలు పలుకుబడి ఉపయోగించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇలా భూమ్మీద పనిచేసే రైతులు భూమిలేని వారైతే పట్వార్లు, పటేళ్లు, దొరలు భూస్వాములయ్యారు. ఇందులో అగ్రకులాల వారే ఎక్కువ. వారికి నిజాంతో, అధికార్లతో సత్సంబంధాలు ఉండేవి. దొరలు, పటేళ్లు, పట్వార్లు తనకు అండగా ఉండటంతో నిజాం నిరంకుశంగా రాజ్యమేలాడు.

పైన చెప్పిన నేపథ్యం ఉన్న గ్రామంలో నర్సింగరావు భూస్వామి, పెద్ద దొరగా నిజాం అండదండలతో అపరిమితంగా ఆస్తి సంపాదించాడు. మాదిగ రామయ్య దొర గడీకే అంకితమయ్యాడు. దొర పశువుల కొట్టానికే పరిమితమయ్యాడు. దొర భూములకే తన ఘర్మజలాన్ని అంత ధారపోశాడు. దొర కుటుంబం కోసమే తన రక్తమాంసాలను ధారపోశాడు. ఇంటి వాకిట్లోనో, పాలాల దగ్గరో కావలిగా పడుకునేవాడు. అతడెంత పనిచేసినా దొరతో, అతని మనుషులతో తిట్లు తినడం తప్పడం లేదు. దొర కుటుంబం వాళ్లంతా బియ్యపు అన్నం తినేవారు. పాలేర్లకు, వెట్టివాళ్లకు పనిచేసేవారికి మాత్రం మొక్కజొన్న గటికే వండిపెడతారు. ఒక్కోసారి వారు తినగా మిగిలిన పాచిపోయిన అన్నం, కూరలు పెట్టేవారు. అతని బతుకంతా దొర దగ్గర వెట్టి బతుకులాగా ముగిసింది. అతని కొడుకు బుచ్చయ్య కూడా తండ్రిలాగే పాలేరుగా సూర్యారావు దొర దగ్గర పనిచేశాడు. అతని కొడుకులైన లింగయ్య, పేరయ్యలను కూడా దొర దగ్గర పాలేరు పనికి ఉంచాడు. పేరయ్యను దొర దగ్గర పని చేయించడం ఇష్టం లేకున్న దొర ఆగ్రహానికి లోనై అతనిని కూడ ఎడ్లు కాయడానికి పాలేరుగా ఉంచాల్సి వచ్చింది. చిన్నవాడు అయిన పేరయ్య పెద్దవాళ్ల కంటే ఎక్కువ పనిచేసేవాడు.

పేరయ్య కిరాయికో, గుత్తాకో భూములు దున్నుకుంటున్నాడంటా అని బుచ్చయ్య అనడంతో సూర్యారావు దొర ఆగ్రహంతో అన్న మాటలు ఇవి: "ఆహా... ఏమన్నావురా...? మాదిగ్గాడిది కొడుకులు గూడ భూములు దున్నుకుంటరంట... నీకేమున్నయని దున్నుతవురా...! మా మోచేతి కింది నీళ్లు తాక్కుంట బతికే మీకు భూములు కావాల్సి వచ్చినాయిర...? నీ యవ్వ మాదిగ పీసునా గొడుదు... బాగ కావుర మొచ్చిందిరా మీకు...? భూమి దున్నుతాడట... ఎవ్వరి భూమిరా నువ్వు దున్నేది...?" (మల్లయ్య, కాలువ.2015:పుట.6). ఈ సందర్భంలో దొర నోటికొచ్చినట్టు బూతులు తిట్టడం ద్వారా అతని యొక్క అహంకారం తెలుస్తుంది. ఓ మాదిగ కులస్థుడు సొంత వ్యవసాయం చేసుకుంటాననడం పెద్ద తప్పైనట్టు మాట్లాడడం చూసి పేరయ్యలాంటి దళితులు చైతన్యవంతులు కావడానికి ఒక ఉదాహరణగా దీన్ని తీసుకోవచ్చు. దొర దగ్గర పాలేరు పని మానేశాడు పేరయ్య. కమ్యూనిస్టుల ప్రభావంతో, ఉద్యమకారుల పోరాటాలతో కొంతకాలం తరువాత సూర్యారావు దొర, లక్ష్మణరావులు ఊరు వదిలి వెళ్ళిపోయారు.

ముగింపు :

ఒకే దళిత కుటుంబానికి చెందిన నాలుగు తరాల మాదిగల జీవితం, అభివృద్ధి ఇందులో ప్రత్యక్షమవుతుంది. ఇది దాదాపు వారి నూరేళ్ల చరిత్రను తెలియజేస్తుంది. సమాజంలో తరతరాలుగా అగ్రవర్ణాల చేత అణచివేయబడుతూ, దొరల దౌర్జన్యాలకు గురవుతూ వారి వద్ద పాలేర్లుగా పనిచేస్తూ అంటరానితనానికి, అణచివేతకు గురవుతున్న దళితుల జీవితాన్ని ఆవిష్కరింపజేశాడు. 21వ శతాబ్ది ఖచ్చితంగా పీడిత జాతులదే అని నిరూపిస్తూ రాయబడ్డ నవల ఇది. 21వ శతాబ్దం దళిత బహుజనులదేనని చెప్పవచ్చు. అన్ని రంగాల్లో ముందుకు వెళ్తూ దళిత రాజ్యాధికారం దిశగా అడుగులేస్తున్న దళిత చైతన్యపు వెలుగులు ఎంతో మందితో 21వ శతాబ్దిలో రాజ్యాధికరం దక్కుతుంది.

దళితుల ప్రత్యక్ష, పరోక్ష పోరాటాల ఫలితమే ఓ దళితుడు రాష్ట్రపతి కావడం. అతను విధులను నిర్వహించిన తీరు ప్రపంచంలోనే ఉత్తమ రాజనీతిజ్ఞునిగా నిలబెట్టింది. దేశవ్యాప్తంగా దళితుల హక్కుల గూర్చి, విద్యావకాశాల గూర్చి, రాజ్యాధికారం గూర్చి చైతన్యవంతమైన పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. దళిత చైతన్యం వెల్లివిరుస్తూనే ఉంది. సిద్ధాంత నేపథ్యంతో కూడిన దళిత బహుజన పార్టీ సిద్ధాంత బలంతో దళిత రాజ్యాధికారం వస్తే తప్ప,మిగతా దళితులు కూడా విజేతలు కాలేరు. ఒక్క ఆనందరావు విజయంతోనో అలాంటి కొద్దిమంది విజయాలతోనో మాదిగ విజయం పూర్తైనట్టు కాదు. మందకృష్ణ మాదిగ, గద్దరు లాంటివారు తెలుగు నేల పగ్గాలు చేపడితినే సంపూర్ణమవుతుంది. అంబేద్కర్ చెప్పిన దళిత రాజ్యాధికార చర్యే అసలు సిసలు మాదిగ విజయాలవుతాయి.

ఉపయుక్త గ్రంథసూచి :

1. మల్లయ్య, కాలువ. 2015. మాదిగ విజయం. హైదరాబాద్: సామాజిక భారత్ బి.వి.వి. . ఛారిటబుల్ ట్రస్టు.
2. వెంకటేశ్వర్లు,పంతంగి.2014.తెలంగాణ తెలుగునవల.వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం.
3. ప్రతాపరెడ్డి, కాసుల. 2017. తెలంగాణ నవలా వికాసం. హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమీ.
4. అయిలయ్య, బన్న. 2010. కాలువ మల్లయ్య కథలు తెలంగాణా జనజీవితం. వరంగల్:నానీ ప్రచురణలు.
5. జయప్రకాష్, ఎస్.2009. పరిశోధన విధానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
6. సిద్ధారెడ్డి,నందిని.2008.కులవృత్తులు తెలంగాణ సాహిత్యం.హైదరాబాద్:తెలంగాణ రచయితల వేదిక.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సునీల్‌కుమార్ కథల్లో దళిత స్పృహ

– డకర వెంకట రమణ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అ), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

నిచ్చెనమెట్ల వ్యవస్థగా రూపుదిద్దుకున్న భారతీయ సమాజంలో కుల మతాల ప్రాధాన్యం ఎంతైనా ఉంది. కుల మతాల ప్రస్తావన లేని సమాజం కనబడదు. ఏ విషయానైనా ప్రభావితం చేసేవి కుల మతాలే. ఈ రెండిటిలోనూ కులం మరీ ప్రభావితం చేస్తుంటుంది. కుల మతాల ప్రసక్తి ఉండకూడదని మనిషి మనుగడకు ఇవి అడ్డంకులని కుల మతాలను ప్రస్తావించడం సంకుసతత్వం అని సమాజంలో అనుకోవడం పరిపాటి. కాని మిగిలిన దేశాల విషయాలు ఎలా ఉన్నా మనదేశంలో సామాజికంగాను, రాజకీయంగాను కులాల ప్రభావం ఎంతగానో కనిపిస్తుంది. చాలా సందర్భాలలో కులం ప్రధాన పాత్రను పోషిస్తుంది. ఇటీవల కాలంలో కులం అనే మాటను ప్రస్తావించకుండా సామాజిక వర్గం అంటున్నారు. ఇంకా చిత్రవిచిత్రంగా ఆయా కులాలలోని ప్రముఖుల పేర్లుతో ఆయా సామాజిక వర్గంగా పేర్కొంటున్నారు. మేము పలానా వాల సామాజికవర్గం వారమని బాహాటంగా చెబుతున్నారు.

పి.వి. సునీల్ కుమార్ పశ్చిమ గోదావరి జిల్లా చింతల పూడిలో పుట్టారు. పెనుగొండలో పెరిగారు. తణుకు, విశాఖపట్టణం, హైదరాబాదులో విద్యాభ్యాసం గడిచింది. తల్లిగారు దయామణి. ఈయన 50 కథలు, 3 నవలలు (1. ప్రారంభం, 2. సయ్యాట, 3.క్షుద్ర) రాశారు. ఈయనకు ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం 2016లో, తానా పురస్కారం (వాషింగ్టన్ డి.సి.) 2017లో, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం 2018లో ఆయనకు వరించాయి.

ఆంగ్ల మరియు ఆంధ్ర సాహిత్యాభిలాషుల మేలు కలయికగా ఉన్న కుటుంబ నేపథ్యం వీరిది. సాహిత్యాభిలాషులైన కుటుంబ సభ్యులద్వారా వీరికి సాహితీ సుగంధం అంటింది. ఆంగ్లభాషా పండితులైన మాతా మహుల ద్వారా రచయితకు షేక్స్‌పియర్ సాహిత్యం వంటబట్టింది. తల్లి దయామణి. శరత్, చలం సాహిత్యాల అభిమాని. ఆ ప్రభావం కూడా వీరిపై పడింది. వీరికి తెలుగు, ఇంగ్లీషు భాషల్లో మంచి పట్టు ఉంది. ఆ భావజాలం కూడా కలం ద్వారా పలికింది. ప్రజాక్షేమాన్ని కాంక్షించే సాహిత్యాన్ని వాంఛిస్తూ రచనారంగంలోకి ప్రవేశించారు. అలనాటి పోతన హలాన్ని, కలాన్ని ఒకే చేత్తో పట్టిన విధంగా వీరు లాఠీని, కలాన్ని ఒకేచేత్తో పట్టుకున్నారు. లాఠీ పట్టిన చేత్తోనే పదునైన కలాన్ని కూడా చేపట్టి సమాజ రక్షణ కావించారు.

నీలవేణి కథల సంపుటిలో పి.వి. సునీల్ కుమార్‌గారు మానవ సంబంధాలు మరియు స్త్రీ దృక్పథానికి సంబంధించిన కథలతోపాటు వ్యవస్థ విశ్లేషణ, దళిత క్రైస్తవ జీవితాలు, అధివాస్తవిక ధోరణిలతో కూడిన కథలను పొందుపరిచారు. మానవ సంబంధిత కథలు దెయ్యం, దెయ్యం-2, నాన్న హైదరాబాదొచ్చాడు, భయానందం. స్త్రీ దృక్పథంతో రాయబడిన కథలు నీలవేణి, అందం. వ్యవస్థ విశ్లేషణతో చెప్పబడిన కథలు - తోకదెయ్యం చెప్పిన డిసిప్లే కథ, చాయిస్ ఈజ్ యువర్స్, సబ్బునురగ. దళిత క్రైస్తవ జీవితానికి సంబందించిన కథలు - థూ..., చీకటి, మహామాయ, పరిశుద్ధ వివాహము 3వ ప్రకటన, దేవదాసు 2015, క్రైస్తవులు లేని చర్చి, అధివాస్తవికత, ది టెర్మినేటర్ ద్వైతములుగా ఈయన తన కథలను వర్గీకరించారు.

మానవ సంబంధాల్లోని అనుబంధాల్ని, డొల్లతనాన్ని బతకనేర్చిన విధానాన్ని నున్నితంగా నునిశితంగా

వ్యంగ్యాన్ని హాస్యాన్ని సమపాళ్ళలో రంగరించి ఈ కథల ద్వారా పి.వి. సునీల్ కుమార్‌గారు తెలియజేశారు. సామాజిక జీవిత దృక్పథాన్ని, ఆలోచనా విధానాన్ని నేటి కాలపు సంబంధ బాంధవ్యాలను తన రచనల ద్వారా తెలియజేసారు. స్త్రీ వివక్ష, కులవివక్ష, ఆర్థిక అసమానత, దోపిడి, అవినీతి, అజ్ఞానం అన్నీ ఒకే కాలంలో కలిసి కాపురం చేస్తున్న వికృత వ్యవస్థకు విమర్శనాత్మక, కళాత్మక ప్రతిఫలమే సునీల్ కుమార్‌గారి కథలు.

సునీల్ కుమార్ గారి సాహిత్యాన్ని విశ్లేషించినట్లయితే సామాజిక సమస్యలతోపాటు వాటి పరిష్కార మార్గాలు కనిపిస్తూ ఉంటాయి. విశ్వమానవ సౌభ్రాతృత్వం, సామాజిక సంబంధాలు, తత్వజ్ఞానం వికసించాల్సిన విశ్వవిద్యాలయాలలో కులవివక్షలు, మతోన్మాదం చెల రేగుతున్నాయి. ఈ నేపథ్యంలో సునీల్ కుమార్‌గారు కులవ్యవస్థలోని దుర్మార్గాలను బహిర్గతం చేస్తూ సబ్బు నురగ, చీకటి, థూ..., టెర్మినేటర్, ద్వైతము కథలను రాశారు. ఈ కథల్లో ఆధిపత్య కులాలు ప్రదర్శించే వివక్షను, అగ్రకులాలు, దళితులు మాన ప్రాణాలను ఎలా దోచుకుంటున్నారో కన్నులకు కట్టినట్లు చిత్రించారు.

సమకాలీన సామాజిక స్థితిగతులు ఆయా రచనల్లో ప్రతిబింబిస్తాయని చెప్పుకోవడమేగాని వర్తమాన స్థితిగతులను కులాల విషయంలో రాజకీయ అధికారం కలిగిన కూలాల గురించి ఎవ్వరూ చెప్పరు. సమాజంలో ఈ విషయం ఉన్నట్టుగానే చాలా మంది రచయితలు దీని జోలికి పోరు. ఈ విషయం గురించి ప్రస్తావిస్తే ఇది సున్నితమైన విషయం అంటూ దాటేస్తారు. ఇలాంటి విషయాన్ని, ఇలాంటి విషయములతో కూడిన కథలను రాయడానికి ధైర్యం ఒక్కటే చాలుదు, సాహసం కూడా ఉండాలి. ఇలాంటి ధైర్య, సహాసాలు ఉన్న గొప్ప తెలుగు కథా రచయిత సునీల్‌కుమార్‌గారు. థూ... కథలో ఆయన తెలుగు ప్రాంతంలోనైన కుల సమాజిక వర్గాలను మూడు విధాలుగా ఉన్నాయని చెప్పారు. ఒకటి అధికారాన్ని హస్తగతం చేసుకుని పరిపాలించే కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలు. రెండోవది తరతరాలు అణచివేతకు గురై రాజ్యాంగ పరిరక్షణ ఉన్నా నేటికి వివక్షణకు, అణిచివేతకు గురౌతున్న దళిత సామాజిక వర్గం. తక్కిన సామాజిక వర్గాలందరిని మూడోవ వర్గంగా చెప్పారు. ఇక్కడే ఈ కథలోనే మూడోవ వర్గంలో ఎన్నో కులాల పేర్లు ప్రస్తావించారు. క్రైస్తవులు లేని చర్చి, పరిశుద్ధ వివాహం మూడవ ప్రకటన లాంటి కథల్లో కూడా మూడవ వర్గంలోని చాలా కులాల పేర్లు ప్రస్తావించడం జరిగింది.

"పరిశుద్ధ వివాహము మూడవ ప్రకటన" అనే కథ ద్వారా నానాటికి పెరిగిపోతున్న కుల వ్యవస్థ, దళిత వర్గీయులను నానాటికి అణచివేతకు గురిచేయటం అనేది ఈ కథ ద్వారా సుస్పష్టమవుతుంది. క్రైస్తవులు అయినప్పటికి ఉన్నత వర్గీయులు, దళిత వర్గీయులు మధ్య బేధం కనపడుతూనే ఉంది.

దళిత క్రైస్తవ జీవితాలలోని వెతలకు సంబందించినవి. "పరిశుద్ధ వివాహము: మూడవ ప్రకటన" కథలో "క్రైస్తవులంతా సమానమే, కానీ వివాహ సంబంధాలను కలుపుకోవడానికి మాత్రం కులం గోత్రం చూసుకోవాలి" అనే అబేద్దగోలాంటి గోముఖుల గురించి ప్రస్తావిస్తూ, "వివాహం అన్ని విషయాల్లోకి గొప్పది అని ప్రభువు చెప్పాడు. కానీ కులం దానికంటే గొప్పదని చెప్పే ప్రభువులు మన మధ్యనే ఉన్నారు" అంటూ వివాహాల లోకి కూడా చొచ్చుకు వచ్చిన కుల వివక్షని తూర్పార బట్టారు. ఎన్ని తరాలు మారిన మారని తమ బ్రతుకుల గురించి, మతం మారిన వాళ్ళ పేర్ల చివర తగిలించుకున్న కులం తోకని ఊపుకుంటూ, చర్చ్‌లలోకి దూసుకువచ్చిన అగ్రకులాల పెత్తనాన్ని నిరసిస్తూ, ఎంతకాలమని మాబతుకులను మీవెనకమలే తిప్పాలని విసుగెత్తిన దేవదాసు తిరగబడి పాస్టర్‌గా అవతారం ఎత్తిన సత్య నారాయణ మూర్తి మీద దాడికి దిగుతాడు "దేవదాసు 2015" కథలో, చర్చ్‌లలోకి దూరిన కుల పెత్తనాలను, అగ్రకులాలు, దళిత కులాలు, ఆస్తులు, అంతస్తులు అంటూ వివక్షతను విశృంఖలం చేసి మొత్తం మీద

చర్చిలను క్రైస్తవులు లేని చర్చిగా మార్చారని కలత పడ్డారు రచయిత "క్రైస్తవులు లేని చర్చి" కథలో. చీకటి ఫుట్ బాల్ గ్రౌండ్ నుంచి బెల్టుషాపుల మీదుగా మాలపల్లి, మాదిగగూడేలమీదికి జారి, అక్కడనుంచి వాడకట్టు మీదకు, అక్కడ నుంచి నేరుగా మనుషుల మనసులలోకి ప్రసరించి, క్రీడాకారుడు, నిజాయితి గల వ్యక్తి అయినా చంటిలాంటి వారి జీవితాలను ఎలా నాశనం చేస్తుందో విశ్లేషిస్తూ, "ప్రేమ ఉన్న చోట ఆర్థిక జ్ఞానం ఉండదు. ఆర్థిక తెలివి వాకిట్లోకి రాగానే ప్రేమ కిటికీలోంచి దూకేస్తుంది" అంటూ మనుషుల మధ్య స్నేహాన్ని, నమ్మకాల్ని, విలువల్ని, అసలు మొత్తానికే మనుషులను... అవినీతి చీకటి...మింగేస్తుంది అంటారు రచయిత "చీకటి" కథలో.

"లోకం అంత మిథ్య, మాయ అంటూ బోధించే యాజులుగారి వస్తువులు, నగలతో సహా మాయం చేసిన మహా మాయగాళ్లు ఎవరో చూడాలనిపించింది అంటూ రాములుకు" అంటూ "మహామాయ" కథలో చమత్కరించిన తీరుకు నవ్వకుండా ఉండలేం మనం.

నీలివేణి కథ సంపుటిలో కథలకే తలమానికం అయి, ఎప్పుడు చదివిన గుండె తరుక్కుపోయి కళ్ళు రెండు కన్నీటి చలమలు అయి హృదయాన్ని ఆవేదనలో ముంచెత్తే కథ "థూ....". ముఖ్యంగా ఈ కథ చుండూరు, కారంచేడులలో దళితులమీద ఆధిపత్య కులాల వాళ్ళు జరిపిన దమనకాండ నేపథ్యంలో సాగుతుంది. "అమ్మాయి, అబ్బాయి పరస్పరం ఒకరిని ఒకరు ఇష్టపడ్డా కూడా, అగ్రకులపు ఆడపిల్లను ప్రేమించాడని, ఆ పిల్లతో మాట కలిపాడని రాజు అనే దళిత యువకుడిని కులం పేరుతో దూషిస్తే తిరగబడినందుకు, ఆ రోజు రాత్రి ఆధిపత్య కులాలవాళ్ళంతా ఒకటై దండెత్తి వచ్చి కత్తులు, కాటర్లతో దళితుల ఇళ్ల మీదపడి వాళ్ళ గుడిసెలను తగలబెట్టి, దొరికిన వాళ్ళను దొరికినట్టు నరకడం, దళిత ఆడ బిడ్డలను చరచడం లాంటి రాక్షస, ఉన్మాదకాండని సాగించి చివరకు రాజును అతి దారుణంగా చెంపేస్తారు. తరతరాలుగా ఆధిపత్యకులాలు, దళితులమీద సాగిస్తున్న పెత్తనాన్ని, బానిసలుగా మార్చి వాళ్ళ మీద పాల్పడుతున్న దుర్మార్గపు చర్యలను ఖండిస్తూ, సమాజం అంతా కులం కంపుతో కుళ్ళిపోతోందని ఆవేదన చెందారు రచయిత. కథను నేరుగా చెప్పకుండా బసివిరెడ్డి పాత్రచేత సమాజంలో ఉండే కుళ్ళునంతా కక్కించాడు. చాతుర్వర్ణం మాయ స్పష్టం ఇంకా కులాలు ఎక్కడ ఉన్నాయి అంటూనే, అంతరాలు పాటిస్తూ, తరాలు మారిన మారని కుల విషపు వేళ్ళు వ్యక్తుల్లో, సమాజపు లోతుల్లోకి చొచ్చుకుని పోయిఉన్నాయి తప్ప, సమానత్వం తరిదాపుల్లో కనపడడం లేదు అంటూ ఆవేదన చెందుతారు. కన్న బిడ్డను పోగుట్టుకున్న కుంటి జోసెఫ్ న్యాయం కోసం పెద్ద కోర్టుకు వెళితే అక్కడ న్యాయం జరగక "ఇది దొంగ కేసు" అన్న జడ్జి మాటలకు కడుపు "నిన్నెప్పుడైనా ఎవుడైన తరిమాడ? నీ అమ్మ మానం మీద తన్నడా? పాలంలో మీ ఇంటి ఆడబిడ్డని చెయ్యట్టుకు లాక్కెళ్లాడా... అయి జరిగినపుడు ఎలా ఉంటదో నీకు తెలుసా అని అడుగుదామని నోరు తెరిచా... నోట్లోనుంచి మాటరాలే.... మాట బదులు ఉమ్మొచ్చింది... ఊశా... అది అయన మొహం మీద పడిందయ్యా... థూ... అంటూ జోసెఫ్ పాత్ర చేత చెప్పించిన తీరుకు మనసున్న ఏమనిషికైనా కన్నీళ్లు రాకమానవు. ఎన్ని కాలాలు మారినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా సమాజంలో కులమత అంతరాలు ఇంకా మారలేదనడానికి సాక్షాలు నిన్న మొన్నటి మిర్యాలగూడ ప్రణయ్ ఉదంతం. కులం, పరువు అంటూ కన్న బిడ్డలను చంపుకునే కసాయి లోకంలోనే ఇంకా మనం ఉన్నాం అనే ఆవేదన కలుగుతుంది కథ చదువుతున్నంతసేపూ...

ముగింపు :

"థూ...', 'చీకటి' అనే కథల ద్వారా దళిత క్రైస్తవ జీవితాలను చిత్రించాడు రచయిత. దళిత క్రైస్తవ జీవితాన్ని దగ్గర్నుంచి విశ్లేషించారు. వారి వెతల్ని అంతర్గత విభేదాలను ఎత్తి చూపారు. కుల వ్యవస్థలోని కుళ్ళును కడిగిపారేశారు. వర్ణ వ్యవస్థను అందుకు దగ్గ రచనలను,

దళిత క్రైస్తవ సంబంధిత సాహిత్య, ప్రస్తానాన్ని సునీల్ కుమార్ గారు మనకు అందించారు. 'చీకటి' కథలో కులం కులం మధ్యలోని వ్యత్యాసాలను ఏలెత్తి చూపే అమానుషాన్ని క్రికెట్ క్రీడారంగం ద్వారా తెలిపారు. వివాహ సంబంధాలలోనే అంతర్గత కుల పిశాచం ఆవహించి ఉన్న తీరును వివరించారు. మనుషుల మధ్య మానవ సంబంధాలను కోల్పోయి కుల విషక్షతో కుమ్ము లాడుకునే వ్యవస్థ మారాలని రచయిత అభిలషిస్తాడు.

ఆధార గ్రంథాలు :

1. నీలవేణి కథల సంపుటి - పి.వి. సునీల్‌కుమార్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత కథ - వస్తువైవిధ్యం

- సేవేని రామస్వామి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళశాల (ఎ), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

అణగారిన జీవితాలను సంస్కృతి సంప్రదాయాలను సామాన్య జీవనం గురించి రాసినప్పుడే ఏ రచయిత రచనకైన సార్థకత. అలా రాయాలంటే ప్రతి రచయితకి దళిత దృక్కోణం తప్పనిసరి ఉండాలి. ఎందరో రచయితలు సామాజిక స్పృహతో దళిత సాహిత్యాలను లిఖించినవారే దళితులు మొదటి నుండి అస్పృశ్యులుగా, తక్కువ వారనే భావనతో అణిచివేయబడ్డతున్నారు. దళిత కథలలో ఏవీ కల్పితాలు కావు. ఆయా రచయిత దృష్టి కోణంలో యదార్థ చిత్రాలే. హిందువులలో ఒకరైన దళితులను గాంధీజీ హరిజనులు అన్నీ పేరు పెట్టారు. దళిత అనే శబ్దానికి చీల్చబడిన, ఖండించబడిన, చేధించబడిన, సగం చేయబడిన అనే నైఘంటికార్థాలు కలవు. 1990లో దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక ఏర్పడింది. ఇది దళితులకు సాహిత్యంలో శిక్షణ తరగతులు నిర్వహించింది. దీని వల్ల ఎందరో దళిత రచయితలు వెలుగులోకి వచ్చారు.

దళిత కథా వస్తువులు :

దళిత కథలలో ముఖ్యమైన విషయాలను గమనిస్తే అంటారానితనం, అభివృద్ధి పలాలు అందుకోవాలిసిన తీరు రాజయకీయాలలో దళితులు పాత్ర, కుల వృత్తులపై చిన్న చూపు, మూఢ విశ్వాసాలు, స్త్రీలను చెరబట్టిన కథలు, లైంగిక సంబంధ కథలు, కులాంతర వివాహాలు, అగ్రవర్ణాల దురహంకార కథలు, పేదరికం, ఆకలి బాధలను చిత్రించిన కథలు, వెట్టిబతుకులు, ఆత్మ గౌరవమును చిత్రించిన కథలు, ఉద్యమ చైతన్య కథలు మొదలైనవి.

దళితవాడ చిత్రణ కథలు :

బోయ జంగయ్య రాసిన కథలలో ఎన్నో విధాలుగా దళితుల జీవన చిత్రణ కలదు. వీరి కథల్లో ఎక్కువగా కులపీడ పోవాలని ఆకాంక్ష కనిపిస్తుంది. ఎవ్వరికీ అన్యాయం జరగకూడదని సమన్యాయం ధ్వనిస్తుంది. కొమ్ములు లేని ఎడ్ల కథలో దళితులకు అందరి పొత్తుల మూడు ఎకరాల పొలం ఉమ్మడి పట్టాగా ఉంటుంది. వీరు అందులో కందులు పెరర్లు పండించుకుంటారు. ఒక రోజు పెద్దిరెడ్డి దొర పశువులు పొలంలో పడి కందులను తినేశాయి. దీంతో దళితులు ఆ పశువులను బందెలదొడ్డిలో పడేస్తారు. అంతకముందే ఒకరోజు దలితుల కోళ్ళు దొర పొలంలోకి వస్తే దొర వాటిని మందుపెట్టి చంపేశాడు. అప్పుడు మాట్లాడనీ అగ్ర కులస్తులు, దొర ఎడ్లను దళితులు కట్టగానే అందరు ఏకమైనారు. మొత్తానికి దొర కక్షకట్టి తీసుకున్న అప్పులన్ని ఇవ్వాలనే ఘింకరించాడు. దీంతో చేసేదేమి లేక దళితులు తమ భూమిని అప్పు కింద ఇచ్చి, దొరలేని ఊరి పొలిమేర దాటి వెళ్ళిపోయారు. అలా దళితవాడలు ఏర్పడ్డాయని రచయిత వాస్తవిక చిత్రం చేశాడు.

అంటరానితన నేపథ్యం కథలు :

బోయ జంగయ్య కథ ఉప్పు నీరు కథలో తాగే నీరు లేక కుక్క చావు చచ్చిన ఎనభై ఏండ్లు దళితుని కథ కలదు. కాళోజి రాసిన తెలియక ప్రేమ తెలిసి దేశం కథలో అంటరానితనాన్ని గురించి ఉంది. ఊరు అడవి కథ రాసిన పొట్లపల్లి రామారావు కథలో కూడా ప్రతీకాత్మకంగా దళిత విషయంను చెప్పారు. దీనితో కులం అడక్కుండా పల్లెలో కనీనం మంచినీరు కూడా ఇవ్వరు. అదే అడవిలోని వాగు చల్లని నీరు ఇస్తుంది. దీనికి మాత్రమే ఎలాంటి వివక్షలేదనే సందేశం ఇచ్చాడు రచయిత.

స్త్రీవాద నేపథ్యంలో దళిత కథలు :

దళిత వాదంలో స్త్రీ స్వరాన్ని వినిపించిన వాళ్ళు గోగు

శ్యామల, జాజులు గౌరీ, జూపాక సుభద్ర మొదలైనవారు. ముస్లిం కథలలో కూడా దళిత స్వరాన్ని వినిపిస్తున్నవారు షాజహానా, పర్వీన్, కాలువ మల్లయ్య రాసిన ఎంగిలి చేత్తో కథలో నేతగాని దుబ్బమ్మ అనే దళిత స్త్రీ జీవితంతో కడగండ్లు చిత్రీకరించబడ్డాయి. పంట మార్పిడి తర్వాత మట్టితో కలిసిన గింజల్ని చెరిగి పోసుకోవడం నేతగాని వృత్తి. పిడికెడు వడ్లు కూడా రాలకుండా అవుతున్నయనీ రైతులు పిసినారులు అవుతున్నారని వారి జీవన మెట్లు సాగాలనే నేతగాని దుబ్బమ్మ బాధపడే కథ ఇది. దళిత కోణంలో రైతు కోణం చూస్తే ఇది ప్రత్యేకమైనదే. అంపశయ్య నవీన్ రాసిన కథా సంపుటి ఎనిమిదో అడుగు. దీనిలో శిక్ష అనే కథలో రాధను తెలివిగా సర్పంచ్ కొడుకు శ్రీధర్ పొందాలని అనుకుంటాడు. అయితే అతనిని వివాహబంధంలో రాధ ఇరికించి న్యాయం పొందుతుంది. దీనిలో దళిత స్త్రీ పరిస్థితులను ఎదిరించి తన సమస్యను తాను ధైర్యంగా పరిష్కరించుకోవడం ఇతివృత్తం. పేదరికంతో వచ్చిన రాధ లైంగిక దోపిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. దళిత చైతన్యం ఈ కథలో కనిపిస్తుంది.

ప్రేమ - లైంగిక దోపిడి నేపథ్య కథలు :

1948లో పోలీసు యాక్షన్ తర్వాత బూర్గుల రామకృష్ణా రావు అమలు చేయబడ్డ కౌలుదారీ చట్టంను దానిలో లోటుపాట్లను చిత్రీకరించిన కథ విద్యుల్లత. దీనిలో అగ్రవర్ణ యువతిని ప్రేమించిన దళిత యువకుని జీవితం ఆధారంగా రచయిత ఈ కథను నడిపారు. ఇందులో దళిత ఆదిమవాసి స్త్రీల సమస్య చిత్రణ కలదు. ఈ కథను రాసి వారు యస్.కె. రామారావు. జూపాక సుభద్ర రాసిన కథ ఆదర్శ వివాహంలో ప్రేమ పెళ్ళాడి మోసపోయిన స్త్రీ కథ కనబడుతుంది.

చదువు నేపథ్యంలో కథలు :

కాలువ మల్లయ్య మన్కట్ మల్లయ్య కథలో దళితునిగా పుట్టిన మల్లయ్య ఊర్లో ఉన్నంత వరుకూ నికృష్టంగా బతికేడు. ఊరు వదిలి లిబియా వెళ్లి తిరిగి డబ్బు సంపాదించుకుని ఊరికి వెళ్తే దొంగ మల్లిగా అంటూ అవహేళన చేసిన వారే ''మన్కట్ మల్లయ్య... అగు బిడ్డా!'' అనీ గౌరవంగా పిలిచారు. దళితలకు జీవితాన్ని గెలిచినప్పడే గుర్తింపు అనీ రచయిత చెప్పారు. బోయ జంగయ్య శిధిల విగ్రహాలు కథలో కథా నాయకుడు గోపాల్ దళితుడు చదువుకున్నవాడు. పండుగలలో గావు పట్టి జంతువులను చంపివేయడం అమానుషమని, అపని చేయనీయ్యడు. దాంతో ఆ వూరి దొర, పూజారి, ఇద్దరు కలసి గోపాల్‌ని అరెస్టు చేయిస్తారు. చివరికి జెడ్జి న్యాయంగా గోపాల్‌ని నిర్దోషిగా నిర్ణయించి ఆచారికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు, ఇలాంటి దళిత కథలు అరుదు గానే ఉంటాయి. దళితుల పక్షాన తీర్పు రావడం అనేది రచయిత ఇలాంటి మార్పు కోరు కుంటున్నారనీ తెలుస్తోంది.

ఆకలి కేకలు పేదరిక నేపథ్యంలో కథలు :

జాజుల గౌరి రాసిన కథ మన్ను బువ్వ. ఇది దళితుల పేదరికం ఆకలిచావులు ఆర్తనాదాలను చెప్పింది. కథలో తమ తల్లిదండ్రులు ఇంట్లో ప్రతి రోజు గొడవ పడుతుంటే నిశ్శబ్దంగా భరిస్తుంది దళిత బాలిక. అలా ఆకలి కూడా మరిచిపోతుంది. మన్నుతో ఆడుకున్న కడుపులో ఆకలి తక్యకాలేదు నన్ను ఎవరు చూస్తలేదు అని బాలిక బాధపడింది. దళితుల పేదరికాన్ని తెలుపుతూ జాజుల గౌరి రాసిన మరోకథ దవఖాన.

కుల వృత్తి నేపథ్యంలో కథలు :

గోగు శ్యామల రాసిన కథలన్నీ దళిత నేపథ్య కథలు. వీరి బడేయ్య కథలో దళితులు జంతు కళేబరాల నుండి చెప్పులు సేకరించే విధానం చెప్పబడుతుంది. అలా వారి వృత్తి జీవితం గురించి కలదు. జూకంటి జగన్నాధం రాసిన కథ కళేబరం. దీనిలో పెరిగిన చైతన్యంతో దళితులు తమ కులవృత్తి అయిన చచ్చిన శవాలను తామెందుకు తీసేయాలి అని నిలదీయడంతో ఆ సమస్య ఎంత పెద్దదో అప్పుడు అగ్రకులం వారికి తెలిసివస్తుంది.

దళిత కథలు దళితల జీవన చిత్రాని తెలియ జేస్తున్నాయి. సమాజంలో వారి యొక్క వేదనాభరితమైన జీవితాని తెలియజేస్తున్నాయి. దళిత కథ రచయితలు అనాటి కాలంలో దళితులకు జరిగిన అన్యాయాన్ని ఎంతో నైపుణ్యంగా తెలియసే విధంగా వారి కథలు రచన జరిగింది అనడంలో అతిశయోక్తి కాదు అని చెప్పవచ్చు. ఆనాటి కాలంలో దళితలకు జరిగిన అనేక విషయాలను వారి కథల ద్వారా సమాజానికి తెలిసేటట్లుగా వ్రాసారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు కథకులు - కథనరీతులు - బి.యస్. రాములు.
2. బోయ జంగయ్య కథలు - డా॥ మంథని శంకరయ్య.
3. నిరుద్ధ భారతం - మంగిపూడి వెంకటశర్మ
4. అంపశ్యయం - నవీన్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సినీ, వాస్తవాధారిత – దళిత సమస్యల చిత్రణ

– అరిగెల శ్రీకాంత్, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

వర్ణవ్యవస్థలోని కాఠిన్యతయే దళితవాదానికి దారి తీసింది. పంచములని ముద్రవేసి ఊరికి దూరంగా నెట్టివేయబడి కనీసం మానవతాస్పర్శ లేకుండా దయ నీయ జీవనానికి గురిచేసిన వర్ణవ్యవస్థలపై తిరుగుబాటుగా వచ్చినదే దళితసాహిత్యం.

దళితులంటే ఎవరు?

తరతరాలుగా యుగయుగాలుగా అగ్రవర్ణాలచే అణిచివేయబడ్డ వర్గాలు దళితులు. మానవులంతా సమానమే. అందరిలో ప్రవహించే రక్తం రంగు ఒక్కటే అయినప్పటికి మనిషికి మనిషికి మధ్య చెప్పరాని అంతరాలు సృష్టించబడ్డాయి. సమానత్వానికి, సంపదకు, మర్యాదకు, మన్ననకు దూరమై సమాజంలో కనివినీ ఎరుగని కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ పడరాని పాట్లు పడుతూ అగ్రవర్ణాల దౌర్జన్యాలకూ, దోపిడీలకూ నిత్యం బలి అవుతూ వాళ్ళకే ఊడిగం చేస్తూ ఊరి బయట తలదాచుకునే స్థితికి నెట్టివేయబడ్డ వర్గమే దళితవర్గం.

దళిత సాహిత్య ఆవిర్భావం :

ఆంగ్లేయులు రాకవల్ల, ఎంతోమంది సంఘసంస్కర్తల ప్రభావం వల్ల దళితుల జీవితంలో చైతన్యం వచ్చింది. ఎంతో మంది దళిత, దళితేతరులు తమ రచనలతో సమాజంలోని వ్యక్తుల ఆలోచనలలో మార్పు కలిగించి కుల, వర్గ, లింగ రహిత సమసమాజ స్థాపనకు తమ గళాన్ని సాహిత్యరూపంలో అందించడం జరిగింది.

సినిమా - దళితవాద సమస్యల చిత్రణ :

నేటి సమాజం నూతన పోకడలతో, క్రొత్త ఆవిష్కరణలతో, సాంకేతిక విప్లవంతో అన్ని రంగాలలో వేగంగా ముందుకు దూసుకెళ్తున్నప్పటికీ కూడా కొన్ని వర్గాల ప్రజల ఆలోచనలలో, ఆచరణలలో దళిత వర్గాల పట్ల చిన్న చూపు నేటికి కొనసాగడం మనంగమనించవచ్చు. అలాంటి దళితవాద సమస్యలను చిత్రీకరించిన సినిమాల్లోని కొన్ని సంఘటనలను మీ ముందుకు తీసుకురావలన్నదే నా ప్రయత్నం.

దళితులు - సమస్యలు :

- కులవివక్ష
- అసమానత్వం
- అస్పృశ్యత
- చిన్నచూపు
- మానవ హక్కుల ఉల్లంఘన

జై-భీమ్ సినిమా - కులవివక్ష చిత్రణ :

యదార్థ సంఘటనలను ఆధారంగా చేసుకుని తీసిన సినిమాలోని ఒక సన్నివేశం.

ఖైదీలను రిలీజ్‌చేసే సమయంలో ఒక పోలీసు అధికారి జైలులో నుండి విడుదలయ్యే వారిని వారి కులం అడగడం. అగ్రవర్ణాల వారిని విడిచిపెట్టి నిమ్న జాతి కులాలవారిని, దళిత వర్గాలవారిని ఇతర పోలీస్ స్టేషన్ల నుండి వచ్చిన పోలీసులకి అప్పచెప్పి డబ్బులు తీసుకుని ఒక్కొక్కరిపై రెండు, మూడు తప్పుడు కేసులను పెట్టమనడం.

పై సన్నివేశంలో కులం పేరుతో దూషణ, కులవివక్ష ప్రస్ఫుటంగా మనకు అవగతమవుతున్నాయి. అయితే ఎప్పుడో జరిగిన సంఘటనను ఆధారంగా చేసుకుని తీసిన ఈ చిత్రంలోని అంశాలు 75 యేళ్ళ స్వాతంత్ర సంబరాలు జరుపుకున్న భారతావనిలో నేటికి కొనసాగుతూనే ఉన్నాయి దానికి తార్కాణమే ఈ క్రింది రెండు సంఘటనలు.

1) సెప్టెంబర్ 24, 2021 కర్ణాటకలోని దళిత బాలుడి ఆలయ ప్రవేశం.

2) ఆగష్టు 15, 2022 రాజస్థాన్‌లోని ఉపాధ్యాయుని చేతిలో దళిత విద్యార్థి మృతి.

మొదటి సంఘటన :

సెప్టెంబర్ 24, 2021 కర్ణాటకలోని కొప్పల్ జిల్లాలో రెండేళ్ళ దళిత బాలుడు ఆలయప్రవేశం చేయడంతో గ్రామపెద్దలు ఆబాలుడి తండ్రికి రూ॥ 25,000/-లు జరిమానాని విధించారు. అయితే ఆడబ్బు కట్టే స్తోమత లేక భయంతో పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు జోక్యం చేసుకుని గ్రామపెద్దలపై తగు చర్యలు తీసుకున్నారు.

"పసిపిల్లల ప్రవేశం తర్వాత మైలపడింది
దేవాలయం కాదు మనమనస్సులు"

అని కొప్పల్ జిల్లా డిప్యూటీ కమీషనర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 17 ప్రకారం అస్పృశ్యత నేరమయినప్పటికీ కూడా అది నేటికి కొనసాగుతుందని, పసిపిల్లలు దేవునితో సమానమైనప్పటికీ దేవాలయాల్లో ప్రవేశమే నిషిద్ధమనడం దళిత వర్గాల పట్ల చూపుతున్న వివక్షకు తార్కాణంగా చెప్పవచ్చు.

రెండవ సంఘటన :

ఆగష్టు 15 2022న రాజస్థాన్‌లోని ఒక పాఠశాలలో 9 యేళ్ళ వయస్సు కల్గిన మేఘ్‌వాల్ అనే దళిత విద్యార్థి దాహం తట్టుకోలేక కుండలోని నీటిని తాగడంతో అక్కడున్న ఉపాధ్యాయుడు కులవివక్ష పేరుతో ఆ కుర్రాడిని చితకబాదాడు, ఆ దెబ్బలకు తాళలేని విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆజాదికా అమృత్ మహోత్సవాల పేరుతో దేశ మంతటా 75 సంవత్సరాల స్వాతంత్ర్యదినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న భారతావనిలో ఇలాంటి ఘటనలు కులవివక్ష, అస్పృశ్యత పేరుతో ఇంకా కొనసాగడం ఎంతో బాధాకరమయిన విషయం.

దళితుల సమస్యలు - అధిగమన సోపానాలు :

- ఆత్మనూన్యతా భావం తొలగింపు
- విద్య
- ఉద్యోగావకాశాల పెంపు
- ఉన్నత, అధికార హోదా, పదవులు పొందే ప్రయత్నం

ముగింపు :

తమకి తాము తక్కువనే ఆత్మన్యూనతా భావాన్ని, సంకుచితత్వాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో, ప్రగతిశీల దృక్పథంతో మనమంతా ముందుకు నడవాలి. ప్రతి ఒక్కరిలో ఎదురించేతత్వం, ప్రశ్నించేతత్వం, ఏది ఒప్పో, ఏది తప్పో అనే విచక్షణాజ్ఞానం, నిర్ణయాలు తీసుకోవడం, సమస్యా పరిష్కారతత్వం, విద్యద్వారా సాధ్యపడుతుంది. సంఘంలో పేరు ప్రతిష్టలు, గుర్తింపు, హోదా, తమ ఉనికిని, అస్థిత్వాన్ని పెంపొందింప జేసుకోవడం, జీవనశైలిని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేం దుకు యువత ఉద్యోగ అవకాశాలను, ఉన్నత, అధికారహోదా, పదవులు పొందే ప్రయత్నం చేయాలి. తమతో పాటు తమ వర్గాల భవిష్యత్తుని ఉన్నతంగా తీర్చిదిద్దగలగాలి. కుల, మత, లింగ వర్గరహిత సమ సమాజ నిర్మాణానికి కృషిచేయాలి.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న
2) జై భీమ్ సినిమా
3) ఇంటర్నెట్ ఆధారిత గ్రంథాలు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కా.రా.కథలు– దళితచైతన్యం

– డా॥. కె.వి.శాంతకూమారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ.

రామారావుగారు 'యజ్ఞం', 'హింస', 'నోరూమ్', 'ఆర్తి', 'చావు' అనే ఐదు కథల్లో దళిత జీవితాన్ని చిత్రించారు. ఈ కథల్లో దళితులే నాయకులు. దళితుల జీవిత విధానాల్ని, ఆర్థికస్థితిగతుల్ని, వారి సాంఘికపరిస్థితి, భాష, హాస్యం, తిట్లు మొదలైన అంశాలను యీ కథల్లో ఆయా సందర్భాల్లో చిత్రించారు. కథల ముగింపుల్లో వివిధదశలకు చెందిన దళితచైతన్యాన్ని ప్రస్ఫుటంగా చిత్రించారు. ఈ చైతన్యం కొన్ని కథల్లో వ్యక్తిచైతన్యపరిమితిలో వుంటే, మరికొన్నింట్లో వర్గచైతన్య పరిణామం పొందింది. ఈ కథల్లోని దళితచైతన్యాన్ని తెలుసుకునే ముందు అసలు దళితసాహిత్యం అంటే ఏమిటో, అది ఏపరిస్థితుల్లో సాహిత్యంలోకి ప్రవేశించిందో తెలుసుకోవడం అవసరం.

దళితవాదం :

ప్రాచీన సామాజిక వ్యవస్థలోని మధ్యయుగాల్లో దళితజాతి ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. హిందూమత శాస్త్రాల ప్రకారం యజ్ఞపురుషుడి శరీరం నుండీ వర్ణాలేర్పడ్డాయి. యజ్ఞపురుషుడి తల నుండీ బ్రాహ్మణులు, భుజాల నుండీ క్షత్రియులు, నడుము నుండీ వైశ్యులు, కాళ్ళ నుండీ శూద్రులు, పాదాల నుండీ పంచములు పుట్టినట్లు యీ శాస్త్రాలు చెబుతాయి. అనాటిపంచములే నేటి దళితులు. వీరిని పంచములనీ, అస్పృశ్యులనీ, చండాలురనీ పిలచేవారు. వీరు ఇబ్బందికమైనవృత్తుల ద్వారా పై వర్ణాలకు సేవ చేస్తూబ్రతికేవారు. మత మౌఢ్యం పెరుగుతున్న హిందూ సమాజంలో నా నాటికీ వీరిస్థానం దుర్భరమైపోయింది. వీరికి ఊరిచివర నివాసం, నీళ్ళు తాగడానికి ప్రత్యకంగా చెరువులు వుండేవి. హిందూ దేవాలయాల్లోకి ప్రవేశం వుండేది కాదు. ఏదైనాపని మీద వూళ్ళోకి వెళ్ళాలంటే వీరి రాకను తెలియజేస్తూ చేతిలో ఒక గంట, వీరి ఉమ్మినేలమీద పడకుండా మెడలో ఒక ముంత, వీరి అడుగుజాడల్ని వీరే చెరుపుకునేలా మొలకొకతాటాకు కట్టుకోవడం తప్పనిసరి ఆచారంగా వుండేది. మతమౌఢ్యం పెరిగిపోయిన వైదికమతాచారాలకు వ్యతిరేకంగా జాధ్ధ, జైన మతాలేర్పడినప్పటికీ వీరి పరిస్థితిలో మార్పులేదు. అలాంటి పరిస్థితిలో- 'మీరూ మనుషులే - మీకూ దేవాలయాల్లోకి ప్రవేశంవుంది' అంటూ వీరిలో మొదటిగా చైతన్యం కలిగించినవారు ఆంగ్లేయులే. ఆంగ్లేయులు వీరికి చదువుకునే అవకాశం, ఆర్థిక సహాయాన్ని కల్పించడమే కాక, క్రై స్తవమతంలోకి మార్చి, దేవాలయాల్లోకి (చర్చిలలోకి) ప్రవేశం కల్పించారు. అప్పటి వరకూ సమాజంలో అసమానత్యానికీ, అస్పృశ్యతకూ గురై, ఆత్మన్యూనతతో జీవించిన వీరి జీవితాల్లో ఒక్కసారిగా ఆనందం, ఆత్మవిస్వాసం కలిగాయి . దీనితో క్రమంగా అట్టడుగు వర్గాలవారు క్రైస్తవమతంలోకి మారడం మొదలుపెట్టారు. ఇది గమనించిన రాజా రామ్మోహనరాయ్ లాంటి సంస్కర్తలు 'హిందూ సమాజాన్ని హిందువులే సంస్కరించుకోవాలి తప్ప ఆంగ్లేయులు కాదు' అని భావించి, అంటరానితన నిర్మూలనకు కొన్నిసంస్కరణలు చేపట్టారు.

రాజారామ్మోహనరాయ్ తరువాత అంటరానితన నిర్మూలనకు ఎక్కువగా కృషి చేసిన వారు మహాత్మా గాంధీ. ఈయన సంస్కరణల్లో భాగంగా మొదటిగా వారి పేరును 'హరిజన' అని మార్చడం ద్వారా గౌరవాన్నా పాదించారు. వృత్తులపరంగా వీరికున్న అగౌరవాన్ని పోగోట్టే ఉద్దేశంతో వారి పనులను తాను చేశారు. అశ్పృశ్యతను రూపమాపడానికి సహపంక్తి భోజనాల నేర్పాటు చేశారు. దేవాలయాల్లో ప్రవేశం కల్పించారు. గాంధీజీ తరువాత వీరి అభివృద్ధికి రాజకీయాభివృద్ధికి కృషి చేసిన వారు అంబేద్కర్. వీరందరి కృషి ఫలితంగా అభివృద్ధి చెందిన దళితులు నేడు సాహిత్యం ద్వారానూ, సామాజిక

ఉద్యమాల ద్వారానూ తమ అణచివేత పై నిరసననూ, ధిక్కా రాన్నీ తెలియజేస్తున్నారు.

దళిత ఉద్యమాల గురించీ తెలుసుకునే ముందు అసలు దళితులంటే ఎవరన్న విషయం తెలుసుకోవడం అవసరం. భారతదేశంలో సాంఘిక, ఆర్థిక, విద్య మొదలైన అన్నిరంగాల్లో అణచివేతకు గురైన వారు దళితులు. ప్రధానంగా ఎస్.సి, ఎస్.టి, బి.సి లు, హిందూ యేతర మైనారిటీలు దీనిలోకివస్తారు. విశాలార్థంలో 'స్త్రీలు' ఏవర్ణానికి చెందిన వారైనప్పటికీ పురుషుల అణచివేతకు గురై, వారి ఆధిపత్యానికి బలౌతున్నారు కాబట్టీ స్త్రీలంతా దళితులే నని వారి అభిప్రాయం.

దీన్నిబట్టీ సమాజంలో అణచివేతకు గురైన వారంతా కలసి, హైందవ వాదానికి వ్యతిరేకంగా ప్రారంభించిందే దళితవాదమని తెలుస్తోంది.

దళితవాదానికి మహాత్మాపూలే, అంబేద్కర్ రచనలు తాత్వికపునాది. పూలే కులవ్యవస్థకు సంబంధించి చారిత్రక భౌతిక వాది అని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

అంబేద్కర్ అభిప్రాయంలో పూలే :

''ఆధునిక భారత సమాజంలో మహాత్మాపూలే అందరికంటే గొప్ప శూద్రుడు. హిందూ సమాజంలో అగ్రకులాల వారి బానిసలుగా బతుకుతున్న కింది కులాల వారిలో తమ బానిసత్వం పట్ల చైతన్యాన్ని ఆయన రగిలించారు. విదేశీ పాలకుల నుండి విముక్తి సంపాదించడం కంటే సాంఘిక ప్రజాస్వామ్యాన్ని సాధించడం భారతదేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని ఆయన ఇచ్చారు''

దళిత సాహిత్యం క్రీ.పూ బుద్ధుడితో ప్రారంభమైందని కొందరూ, క్రీ.శ. చోళ మేఖుడితో ప్రారంభమైందని కొందరూ చెబుతారు. ఫూలే (1828-90)లో, ఎన్.ఎమ్.మాతే (1886-1957) లలో ప్రారంభమయ్యా యని మరి కొందరిలో భిన్నాభిప్రాయాలున్నాయి.

స్వాతంత్ర్యానంతరం రాజకీయ రిజర్వేషన్ల సమయంలో అనేకమంది దళితులు చదువుకుని, ఉద్యోగ పరంగా, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందారు. అయితే వీరి అభివృద్ధి అంతా ఉన్నత వర్గాల సహాయ సహకారాలతోనే సాగింది. మెల్ల మెల్లగా వీరు తమ అణచివేతను గ్రహించి, దాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేపట్టారు. ఈ ఉద్యమాలు సాహితీఉద్యమాలుగా, క్రియాశీలక రాజకీయ ఉద్యమాలుగా కొనసాగుతున్నాయి.

1958లో మహారాష్ట్రలో జరిగిన సాహితీసభలో దళిత సాహిత్యాన్ని నిర్వచించే చర్చ జరిగింది.

''కులం తాలూకు అన్ని ప్రత్యేకతల్ని చర్చించి కుల నిర్మూలన ధ్యేయంతో దళితులు ఎదుర్కొంటున్న అన్ని అణచివేతలకు వివక్షలకూ వ్యతిరేకంగా ఒక ప్రత్యామ్యాయ ప్రజాస్వామిక మానవ సంబందాల నిర్మాణాన్ని కోరుకుని రచించింది దళిత సాహిత్యం''

వీరు అప్పటి వరకూ తమకున్న హరిజన పేరును దళితులుగా మార్చుకున్నారు. 'దళిత' అనే సంస్కృత పదానికి ఖండించబడిన, అణచివేయబడిన, అణగారిన, నిరంతరం దోపిడీకి గురవుతున్న వారు అనే అర్థాలున్నాయి. దళిత సాహిత్యంలో దళితుల జీవితాల్లోని అణచివేతను ప్రత్యక్షంగా చూసి, వాటిని వ్యతిరేకిస్తూ, సంస్కరణాభావంతో రచనలు చేసే అగ్రవర్ణాలు ఒక రకంకాగా, దళితులే తమ అనుభవాన్ని ఆవిష్కరించడం మరోరకం. ఈ రెండింటి మధ్యా స్వానుభవం అనే భేదం కారణంగా వ్యక్తీకరణలో కూడా భేదం తప్పని సరిగా వుంటుంది. ఆ విషయాన్ని చెబుతూ బి.ఎస్. రాములు గారు

''దళితులు సృష్టించుకుంటున్న దళిత సాహిత్యం పురిటి నొప్పులు పడే తల్లితనే బాధలు చెప్పుకున్నట్లుగా వుంటే, దళితేతరులు సృష్టించిన దళిత సాహిత్యం భార్య పురిటి నొప్పులు పడుతుంటే బయట వుండి బాధను అనుభవించే భర్త పరిస్థితి వంటిది''అంటారు. అయినప్పటికి యీ రెండింటినీ దళిత కవిత్వంగానీ ఎక్కువ మంది విమర్శకులు ఆమోదించారు.

కా.రా.గారి కథల్లో దళితుల సమస్యలకు కారణం 'కుల వివక్ష ' కంటే ఆర్థిక వెనకబాటు తనమే ప్రధానంగా కనిపిస్తుంది. ఎందుకంటే వీరిది ప్రధానంగా వర్గదృష్టి. అయినప్పటికీ యీ కథల్లో పాత్రలన్నీ దళితులవే కావడం గమనార్హం.

కా.రా. కథల్లో దళితచైతన్యం :

ఈ కథల్లో దళిత చైతన్యం అంచెల వారీగా కని పిస్తూంది. 'యజ్ఞం' కథలో 'సీతారావుడు', 'హింస'లో 'సంగి'. 'నోరూమ్' లో 'నూకరాజు', 'ఆర్తి' లో 'పైడెయ్య', 'చావు'లో 'అప్పారావు' పాత్రలు దళిత చైతన్యానికి ప్రతీకలుగా కనబడుతాయి . వీరిలో 'నోరూమ్' కథలోని నూకరాజు ఒక్కడే వ్యక్తి చైతన్యంతో కనిపిస్తాడు . మిగిలినవాళ్ళంరూ మొత్తం వారి వర్గంలోనే చైతన్యాన్ని కలిగించి , దళితులందరి తరపునా పోరాడుతారు .

'యజ్ఞం' కథలో 'సీతారావుడు' కంబారితనం కంటే చావునయమన్న విషయాన్ని తనకొడుకు తలనరకడం ద్వారా తెలియజేస్తూ వర్గచైతన్యాన్ని ప్రదర్శించాడు . ఇతని చైతన్యం ఆత్మహింసకు పరిమితమైందిగా కనిపిస్తుంది.

'హింస' కథలో 'సంగి' వర్గచైతన్యానికి ప్రతీకగా కనిపిస్తుంది. ఆమె చైతన్యంలో బలహీనులపై జరిగే హింసనెదుర్కోవడానికి ప్రతిహింసతప్పదనే విప్లవాత్మక ప్రబోధం కనిపిస్తుంది.

'నోరూమ్' కథలో నూకరాజు అప్పటికే తనజీవితంపట్ల ఎరుక కలిగివున్నవాడు . అందుకే అతనిలో కొంత అభివృద్ధి కనబడుతుంది. ఆ చైతన్యంతోనే తనకు జరిగిన అవమానాన్ని గ్రహించీ, ఏమీ చేయలేని అసహాయత్వంలో పరహింసకు పాల్పడ్డాడు.

'ఆర్తి' కథలో 'పైడెయ్య' ఆత్మాభిమానంతో వ్యవహ రించడం ద్వారా తన చైతన్యాన్ని ప్రకటించాడు. 'చావు'కథలోని అప్పారావు తమ హక్కుల్ని గుర్తించడమే కాక, వాటిని 'హక్కులు'గానే పొందాలనే చైతన్య దృక్పథంకలిగిన వాడు. ఇతను పూర్తిదళిత చైతన్యానికి ప్రతీక. తమ అణచివేతపట్ల సంపూర్ణ అవగాహన, దాన్నెదుర్కోవడంలో ధైర్యం గల సంపూర్ణ దళిత నాయకుడు.

ఈ కథల్లోని వ్యక్తుల్లోని చైతన్యానికి తగిన కారణాల్ని చూపడంలో కూడా రచయిత కృతకృతులయ్యారు. ఇప్పుడొస్తున్న దళితసాహిత్య అంశాలలో మూడు అంశా లను యీ కథలు ప్రతిబింబిస్తున్నాయి.

అవి -

1. తరతరాలనుండి దళితులు అవమానవీకరణకు గురైన క్రమాన్ని 'యజ్ఞం','హింస' కథలూ ,
2. దళితులు తమ స్వీయత్వాన్ని వెక్కుంటున్న వైనం 'నోరూమ్','ఆర్తి' కథలూ ,
3. ఆత్మగౌరవంలో అగ్రకులాల పెత్తనాన్ని ధిక్కరిస్తూ ప్రతిఘటనా ఉద్యమాలను నడుపుతున్నవాస్తవం 'చావు'కథ ప్రతిబింబిస్తున్నాయి .

మొత్తంమీద రామారావుగారి కథల్లో మంచి కథలుగా పేరుపొంది , అట్టడుగు వర్గరచయితగా ఆయనకు పేరు తెచ్చిన ఐదు కథలూ దళితకథలే. రామారావు గారు రచయితగా మార్క్సిస్టు దృక్పథంతో కథలు రాసినందువల్ల దళిత సమస్యలను కూడా ఆర్థికకోణంలోనే ఎక్కువగా చూసినప్పటికీ, వ్యక్తిగతంగా పీడితులపట్ల ఆయనకున్న అనుకంపే వారి జీవితాల్లోని మిగిలిన అంశాలను కూడా స్పృశించేలా చేసింది. దళిత సమస్యలను చిత్రించడంలో యీ కథలు ఆ లక్ష్యాన్ని సాధించాయనే చెప్పాలి.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంస్కరణ కథలోని కొలకలూరి ఇనాక్ దళిత భావ చైతన్యం

– **బాబొకతు సత్యనారాయణ,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళశాల (ఎ), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరము.

ఉత్సవం ఉత్సాహంగా సాగుతూ ఉంది. రంగు రంగుల కాగితాల తోరణాలు కట్టారు. లౌడు స్పీకరు పెట్టారు. రంగు బల్బులు అమర్చారు. వేదిక అమరి ఉంది. టేబిల్ మీద పూలవాజ్‌లు చక్కగా ఉన్నాయి. ఖద్దరు టేబిల్ క్లాతు ముచ్చటగా ఉంది. ముద్దుగా మూడు కుర్చీలు మెత్తగా, ఒత్తుగా, బుద్ధిగా కూర్చుని ఉన్నాయి. మైకులు మూడు అమర్చారు. షామియానా సుందరంగా ఉంది షామియానా నిండా కుర్చీలు వేశారు. జనం ఒక్కొక్కరే వస్తున్నారు. ఇది కళ్యాణ మండపం కాదు. కాబట్టి పెళ్ళికాదు. కార్లు గత్తర హడావుడీ లేదు. కాబట్టీ అఫీషియల్ సమావేశం కాదు. పిల్లలు బడ్జీలు జండాలు లేవు. కాబట్టీ రాజకీయ సభకాదు. కిటకిట లాడుతూ జనం గుడిగుడారు. కాబట్టీ సాహిత్య సభ కాదు. బ్రాహ్మణులున్నారు. కాని పూజారులు లేరు కాబట్టి మత సమావేశం కాదు. వీధిలో నాలుగురోడ్లు కలిసే చోట కందుకూరి వీరేశలింగం పంతులు నిలువెత్తు విగ్రహం ముందు వేదిక. దాని ముందు షామియానా ఉండటం విగ్రహం కాళ్ల దగ్గర్నుంచి అన్ని పక్కలు రంగు కాగితాలు దారాలు కట్టారు. కాబట్టి ఇదేదో సంస్కర్తల సంగతి అయి ఉంటుందని అడిగితే అన్నారు. 'నీకెందుకు పో' అని అందుకని ఎవరినీ ఏమీ అడగడం బాగుండదని ఊర కుండటమే ఉత్తమం. కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంస్కర్త ఆడవాళ్ల కష్టాలు తొలగించాలని అహ రహరం కృషి చేశాడు. సాంఘికంగా శ్రమించాడు. సాహిత్యంగా పరిశ్రమించాడు. సంఘంలోనూ, సాహిత్యం లోనూ కొత్త చూపు ప్రసాదించిన ఆధునిక యుగ వైతాళికుడు. ఇది కూడా జరుగుతూ ఉంది కాబట్టి మహత్తర విషయమే అయి ఉంటుందనిపించింది.

ప్రభాకర్‌జీ వచ్చాడు. ప్రభాకర్‌జీ వచ్చాడంటూ చుట్టూ కేకలు వినబడ్డాయి. అందరూ అటు పరుగెత్తారు. కొందరు నమస్కరించారు. కొందరు వినయంగా వంగారు. కొందరు పాదాలు తాకారు. కొందరు సాష్టాంగ దండ ప్రణామమా చరించాడు. ప్రభాకర్‌జీ అందర్నీ ఆలింగనం చేసుకొంటూ ఆదరంగా మాట్లాడుతూ వస్తున్నాడు. కట్టుకొన్నది ముతక ఖద్దరు గుడ్డముక్క, శరీరం మీదున్న బట్టంతా జమ చేసి కొలిస్తే రెండు మీటర్లు ఉండవచ్చు. అందులో సగం మొలబట్ట. మిగతా సగం తలబట్ట ఇక మరేం శరీరం మీద లేదు. అందరికీ అన్నీ ఉంటాయి. కొందరికి కొన్నే ఉంటాయి. ఈ మనిషికి ఏమీ లేవు. తపస్సు చేసుకోవడం చెట్టుకిందే కానక్కరలేదు. నగరంలో నడి వీధిలో నడుస్తూ తపస్సు చేసుకొంటున్న మహర్షి కాబోలు ప్రభాకర్‌జీ కలెక్టరు వచ్చాడు. కలెక్టరు వచ్చాడంటూ జనం చెల్లా చెదురయ్యారు. పోలీసులున్నారు వెనక బిళ్ళ బంట్రోతు ఉన్నాడు. ఆపైన జిల్లా అధికారులున్నారు. చుక్కల్లో చంద్రుళ్ళ కలెక్టరు ఉన్నాడు. ఆరాతీస్తే ఆ వూరికి బదిలీ అయి రాకముందే, కలెక్టరు హరిజనుడని అంతా అర్థమయి పోయింది. ప్రభాకర్ జీవి పక్కనుంచి కలెక్టర్ను చుట్టుకున్న జనం కలెక్టరు చుట్టూ శాట్‌లైట్లుల్లాగా వచ్చారు జిల్లా కలెక్టరు ప్రభాకర్‌జీ కాళ్లమీద పడితే అందరూ తుఫాను వచ్చినట్లుగా, పిడుగులు పడ్డట్లుగా, ఎక్కడో ఇళ్లు తగలబడుతున్నట్లుగా ఆనందంగా కరతాళధ్వనులు కావించారు. అంత ఉత్సాహం ఎందుకో అర్థంకాలేదు. జిల్లా అంత వణికించే కలెక్టరు ప్రభాకర్‌జీ చేతులకింద పిల్లిపిల్లలా ఒదిగి రావడం చూడటానికి వింత దృశ్యం.

కందుకూరి కులం లోకానికి తెలుసు. గాంధీ కులం దేశానికి తెలుసు. కలెక్టరు కులం రాష్ట్రానికి తెలుసు. ప్రభాకర్‌జీ కులం అందరికీ తెలుసు. ఎవరికీ తెలియదు.

అందరూ అందర్నీ అడిగారు ఎవరూ ఎవరికీ చెప్పలేదు పలకలేదు ఉలకలేదు కదల్లేదు మెదల్లేదు పెదవి. మహత్తర విషయం చిదంబర రహస్యం ఒక్కటి సత్యం. ప్రభాకర్‌జీకి తన కులం తెలియదు. అది గాంధీ కులం బ్రిటీష్ ఇండియా నుంచి రిపబ్లిక్ ఇండియాలోకి ప్రభాకర్‌జీ బదిలీ అయ్యాడు. దేశమంతా తిరిగాడు. మానవ శక్తి బోధించాడు. ఆత్మ పరమాత్మల గురించి చెప్పాడు. సంఘ చైతన్యం ఉద్బోధించాడు. మానవ సమానత్వ సందేశం అందించాడు. ప్రభాకర్‌జీ దేశంలో కొందరికి దేవుడు. కొందరికి ప్రవక్త. కొందరికి మహాత్ముడు. ఎవరికి మనిషి కాదు. మనిషిలాగానూ లేడు. సంఘంలో అసమానతలున్నాయా? ఉంటే అవి తొలగింపబడాలి అందుకు ఏం చేయాలో ఆలోచించాలి. కరతాళధ్వనుల కలకలం తగ్గింతర్వాత నెమ్మదిగా దిగి వస్తున్న ప్రభాకర్‌జీని పట్టుకున్నాడు కలెక్టరు. ప్రభాకర్‌జీ కారు దగ్గరకు చేరేలోగా వందమంది మారిపోయారు. ప్రభాకర్ కారెక్కెడు. అది బయలు దేరింది. అలా వెళ్ళి పోయింది. కలెక్టరింకా వెళ్లనేలేదు. జనమంతా ఇంకా అక్కడే ఉన్నారు. ఇంతలో ఎవరో మంచె ఎక్కారు. కందరుకూరి వీరేశలింగం పంతులు మెళ్లోని నిలువెత్తు పూలమాల నేలపాలు చేశారు. అది మట్టలో పడింది. దుమ్ముకొట్టుకుపోయింది. పంతులు జీవించే దుఃఖించాడు. గతించే దుఃఖించాలి. పంతులు సంఘుంమీద తిరగబడ్డాడు. సంస్కరణ గొడ్డలి ఎత్తి చెడ్డను నరికాడు. ఆయన బతికే పూజలు పొందాడు. గతించి పూజింపబడ్డాడు. దూషణ భూషణలు ఆదర తిరస్కారాలు మహాత్ములకు లెక్కలో ఉండవు. నీళ్లలో పూలమాల దుమ్ము చెమ్మ సంతరించుకొని అందంగా రూపొందింది. కింద నుంచి పాల బిందె అందించారు. విగ్రహం నిలువునా పాలపోతే క్షీరాభిషేకం. కలెక్టరు చుట్టి చూశాడు. పూలమాల కనిపించింది. నేలమీద విగ్రహం కనిపించింది పాలతడిలో. కలెక్టరు వంగి పూలమాల ఎత్తాడు. నీళ్ళతో, పాలతో, మట్టితో, దుమ్ముతో తడిసి బరువయింది. ఎస్.పి. ఎత్తి పట్టాడు.

కలెక్టరు మంచె ఎక్కాడు. వెంటపూలమాల వచ్చింది. ఎర్రటోపీల చేతుల్లో రద్దీరోల! లాఠీచార్జీ! విగ్రహం కంఠంలో పూలమాల! కలెక్టరు చేతుల్నిండా దుమ్ము, దూళ్ళీ, తడి. మాలనిండా నీళ్లు పాలు మట్టి దూరంగా ప్రభాకర్‌జీ జిందాబాద్. ఇంకా దూరంగా ప్రభాకర్‌జీ డౌన్‌డౌన్. విగ్రహం మెళ్లో, పూలమాల పోలీసు కాపలతో, బందోబస్తుగా భద్రంగా ఉంది. ఎవరు దీన్ని అంటరాదు? రూలు! ఎవరు దీన్ని అంటరాదు? ఎవరీ అంటరాని వాళ్ళు? ఊరేగుతూ ఉంది. ఊరంతా నిశ్శబ్దంతో...

ఆధార గ్రంథాలు :

1. సంస్కరణం - కొలకలూరి ఇనాక్.
2. అంటరానోళ్ళు కథలు - ఎండ్లూరి సుధాకర్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – విలువల పునర్మూల్యాంకనం

– బొదరొల అంజనీ కుమారి
చరిత్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల,
(స్వయంప్రతిపత్తి) A⁺, రాజమహేంద్రవరం.

– దొసరి భవాని శంకర్ రెడ్డి
వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల
(స్వయంప్రతిపత్తి) A⁺,రాజమహేంద్రవరం.

దళిత సాహిత్యం మొత్తం సాహిత్యాన్ని అలంకార శాస్త్రాన్ని సమాజాన్ని తనతో సహా నిరంతరం పునర్మూల్యాంకనం చేస్తూ సరికొత్త మూల్యాంకన ప్రమాణాలను సంతరింప చేసుకుంటుంది.

ముఖ్యాంశాలు :

- వస్తువిలువల పునర్మూల్యాంకనం
- అభివ్యక్తి విలువలపునర్మూల్యాంకనం
- విమర్శ విలువల పునర్మూల్యాంకనం
- వ్యక్తి విలువల పునర్మూల్యాంకనం

విరివిగా సునాయాసంగా లభించేదేదయినా తక్కువ ఆనందాన్ని ఇస్తుంది. అతిగా అందుబాటులో ఉండేది విసుగు కలిగిస్తుంది. దూరంగా అరుదుగా కష్ట సాధ్యంగా ఉండేవాటికి ఎక్కువ విలువ ఆపాదించబడుతుంది. ఈ నేపధ్యంలోంచే పాతరోతవుతుంది. ఓల్డు గోల్డవుతుంది. పాత చింతకాయపచ్చడి, పాడిందే పాడే పాచిపళ్ళ దాసరి లాంటి పలుకుబళ్ళు ఈ మొనాటనీలోంచే పుట్టుకొచ్చాయి. దూరపు కొండలు నునుపు, పొరుగింటిది పుల్లకూర లాంటి సామెతలు అందీ అందకుండా ఉండడంలోంచి వచ్చాయి.

మామూలు వ్యవహారం నుంచి కళాత్మక వ్యవహారాన్ని మినహాయించడానికి ఉపకరించే సామాగ్రిగా శబ్దశుభగత్వం; భాష, భావపరమైన సంక్లిష్టత ప్రధానపాత్ర వహించాయి. అయిఏ ఇప్పుడు శబ్దశుభగత్వం, సంక్లిష్టతలు మొనాటనీలోకి జారిపోతున్నాయి.

ఒకప్పుడు వచనంలా తేలిపోతామేమో అనేభ్రమలో భాషా భేషజంతో పొడుపు కథలు, పజిళ్ళు, విప్పే; సృష్టించే పనిలో మన పండితులు తొడలు చరచుకునేవాళ్ళు. మన పూర్వికులు ద్రుతరాష్ట్ర కౌగిలిలో పడి హృదయంగమం అయిన మన కవిత్వ విద్య మేధోగారడిగా దిగజారి పోయింది. కప్పి చెప్పనిదాన్ని కవిత్వం కాదనుకున్నారు వాళ్ళు కనిపెట్టడం అంటే కుప్పలు తెప్పలుగా పదాలను నిఘంటువుల్లోంచి తిరగదోడడం అనుకున్నారు. అసలు ఈ కప్పటం, విప్పటం అనేవి సాపేక్ష భావాలన్న సంగతి వాళ్ళకి అర్థంకాలేదు. మరి అక్షర ద్రవ్యోల్బణంతో అనల్పార్థ రచనకు పాడెకట్టారు. పాండిత్య ప్రకర్ష శిరోభారంతో జీవద్భాషను జానపదంగా ద్వితీయ శ్రేణి ముద్రవేశారు.

నిన్నటిదాకా మడికట్టుకుని దూరంగా జరిగిపోయిన రాసేభాష ఇవాళ మాట్లాడే భాష అడుగులో అడుగేయటానికి తహతహలాడుతుంది. లేకపోతే స్మశానాల నిఘంటువుల్లోకి జారిపోవలసిందేమరి.

ఒక చోట ఔచిత్యంగా చలామణిలోఉన్నది మరో చోట అనౌచిత్యం అవుతుంది సీమాసమయాలు రచన విలువలను నిర్ణయిస్తాయి. అప్రమాణంగా, గ్రామ్యంగా, ఈసడిందచబడ్డ భాష ఇవాళ పలుకుబడిగా, నుడికారంగా అందలమెక్కింది. గాసట బాసటగా కొట్టి వేయబడ్డ గాథలు ఇప్పుడు జాతిసాంస్కృతిక వైభవ భూమికలుగా కీర్తించబడుతున్నాయి. ఏమాత్రం సంక్లిష్టత లేని సాదా సీదా మాటలకలనేత నేడు గొప్ప శైలీ వైవిద్యంగా మన్ననలందుకుంటుంది. భారతరత్న పొందిన శాస్త్రీయ సంగీతం కాదు, సాధారణ సినిమా పాటబాణీ ఆనందాన్నిస్తుంది అని అనగలిగే వాతావరణం ఏర్పడింది.

అందమాంతా అలంకారంలోనే ఉందన్నట్టు అలంకారం లేకపోతే అందమే లేదన్నట్టు చెప్పబడింది.

కృతకంగా రూపాన్ని, వస్తువును నిర్ణయించింది. వస్తువేదాని రూపాన్ని సృజించుకోవడం అన్నది సత్యం. నది ఉద్భతిని బట్టిదాని ఆకృతి ఆధారపడినంత సహజం కాని ఏం చెప్పారో అన్నదానికంటే ఎలా చెప్పారో అన్నదానికే విలువ ఆపాదించబడింది. ఈ కృతకత్వం భావ, వస్తు దారిద్ర్యాల వల్లనే ఏర్పడింది. ఎరువు తెచ్చుకున్న వస్తువు, భావం ఎరువు అభివ్యక్తిని నిస్సిగ్గుగా అనుకరించడంవల్ల ఈ పరిస్థితి దాపురించింది. భాష, భావం, వస్తువు, రూపం సమస్తం అరువుతెచ్చుకున్న అంధ అనుకరణల ట్రెండ్‌గా చలామణి అయిన తరుణంలో స్వతంత్ర రచనలు ద్వితీయ శ్రేణిపౌరులుగా తృణీకరించబడ్డాయి.

ఇప్పుడు అనుకృతిలో స్వేచ్ఛకికాదు; అనితర సాధ్య సర్వస్వతంత్ర మార్గాలకు విలువ. పెత్తందారీ తనానికి, దాని మోచేతినీళ్ళకు, చెమ్చాగిరికి, భజన బృందాలకు చిన్న చూపు ఎదురవుతుంది. రాజ్యాంగ మౌలికత్వానికి, స్వీయాభివ్యక్తికి, జనపద స్వరరవళికి చెవికోసుకోవడం జరుగుతుంది.

వల్లించడమే విద్యగా చలామణి అయ్యింది. ఇప్పుడు దాని స్థానాన్ని అవగాహన విశ్లేషణ, సృజన ఆక్రమించాయి అదే విధంగా ఇప్పుడు పరాయి భాష సంక్లిష్టత స్థానంలో జీవద్భాష, సరళత ప్రముఖస్థానాన్ని ఆక్రమించుకున్నాయి.

లక్ష్యాలు తయారీకోసమే లక్షణాలు అన్నట్టు, లక్ష్య లక్షణ సమన్వయమే విమర్శ; మరేమీకాదు అన్నట్టు ఉండేది. పరాయి భాష, పరాయి వస్తువు, పరాయి అలంకారం, పరాయి రచనాసంవిధానం నుంచి సృజన ఇవాళ నేటివిటీని, ఒరిజనాలిటీని ప్రాతిపదికగా చేసుకుని ఎదుగుతుంది.

విద్య జాతీయీకరణం కావటంతో సృజనకు పారంపర్య విధేయత నుంచి విముక్తి లోకి ప్రవేశించి తనదైన కొత్త భూమిక మీద బలంగా వేళ్ళూనుకోగలిగింది. తూకపురాళ్ళు, గీటురాళ్ళు పునస్సమీక్షించబడ్డాయి.

అందరు చదవటం వల్ల అందరూ ఎదుగుతున్నారు. ఈ ఎదిగే క్రమంలో వేయిగొంతుకలు ఎలుగెత్తడం సహజం. బహుళ దృక్పథాల చౌరస్తాగా సమకాలీన సమాజం సమాయత్తం కావటం సహజం.

ఈ నేపథ్యంలో సమకాలీన సమాజం నుంచి ప్రతి ఫలితమైన సాహిత్యాన్ని అవలోకించడం, కొత్త తూకపు రాళ్ళను తయారు చేసుకోవడం అనివార్యం అవుతుంది. మారనిది మార్పు ఒక్కటేకాబట్టి; మార్పు అనివార్యం, సీమాసమయాల ఊతంతో అయా దృక్పథాలు బలంగా వెల్లడిలోకి వచ్చి చర్చనీయాంశాలవుతాయి.

కవి తన రచనలో ఏదృక్పథాన్ని ప్రతిష్టాపించాడు ఏ సిద్ధాంతానికి కొమ్ముకాస్తున్నాడో, ఏభావజాలాన్ని అందలం ఎక్కించాలనుకుంటున్నాడో అది ఏ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందో, అది ఎవరి ప్రయోజనాలు కాపాడటానికి ఉద్దేశించిందో పసిగట్టి దానికి భిన్నమైన సిద్ధాంతాలు, భావజాలాలు తెరమీదకొస్తాయి. ఒకనిర్దిష్ట సమూహపు జీవితంలోంచి పెల్లుబికే భాష, వస్తుజాల సంస్కృతి, సరికొత్త సౌందర్య శాస్త్రంగా ఆవిష్కృతమవుతుంది. అది ఆసమూహపు జీవితానికి ఉనికిపట్టు అవుతుంది.

ఎద్దు పుండు కాకికి ముద్దా అన్నట్టు ఎవడి నొప్పి వాడికే తెలుస్తుంది. ఎంత సహానుభూతి చెందినప్పటికీ ఒకడి బాధ మరొకడిది ఎన్నటీకాజాలదు ఎవరి గాథలు వాళ్ళే తవ్వుకుంటారు. వ్యాఖ్యానించుకుంటారు. విశ్లేషించుకుంటారు. విలువకట్టుకుంటారు. అవతలి వాళ్ళు మనల్ని గుర్తించాలన్నా గౌరవించాలన్నా ముందు మనల్ని మనం గుర్తించాలి గౌరవించుకోవాలి అన్న ప్రాథమిక సూత్రం ఇక్కడ వర్తిస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. పోష్టు మోడ్రనిజం - డా॥ తిరుపతిరావు
2. సంజీవ్ దేవ్ వ్యాసాలు - డా॥ సంజీవదేవ్
3. ఒక వస్తువు భిన్న సందర్భాలు - డా॥ పి.ఎ. సత్యనారాయణ

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక పద్య కవిత్వం - దళిత స్పృహ

- డా॥ ఎన్. భీమన్న, తెలుగు అధ్యాపకులు, శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

తెలుగు పద్యం అజరామరమైన జీవవాహిని. అది ఎంత పురాతనమైనదో, అంతే నూతనమైనది. ప్రభువుల శాసనాలను, పండితుల వాద వివాదాలను, అభ్యుదయాన్ని, ఆధునికతను సమపాళ్ళలో మోస్తున్న సుప్రసిద్ధ ప్రక్రియ పద్యం.

పద్యంలోని సొగసులు, పోకడలు అసంఖ్యాకం. రాజాస్థానాల్లో పురుడుపోసుకున్నంత మాత్రాన పద్యం మడి గట్టుకొని, అంత:పుర సీమల్లో, పరదాలలోపలే ఉండిపోలేదు. అది జనంలోకి ప్రవహించింది. పండితుల నుండి పామరులవైపుకు అమర గంగా ప్రవాహంలా ఉరికింది. శ్రమజీవుల నాల్కలపై సాధారణ వ్యక్తుల గుండెల్లో సముచిత స్థానాన్ని పొంది, చిరస్మరణీయంగా వెలుగొందుతోంది.

పరిణామం జీవలక్షణం, సాహిత్య ప్రక్రియల్లో పరిణామం కూడా అటువంటిదే, పరిణామం అంటే ఉన్నదాని యొక్క మరొక రూపమేకాని విధ్వంసం మాత్రం కాదు. పద్యం వర్ణన వ్యవస్థ నుంచి శోక మోహాల్లోకి, పాలకు నుంచి ప్రజల్లోకి పరిణామం చెందింది. చెందుతూ ఉంది.

ఆధునిక పద్యం సమాజానికి దర్పణగా నిలుస్తున్నది. ఛాందస భావాలతో పద్యం రాసే వాళ్ళున్న మాత్రాన పద్యం అంటరానిది కాదు. వర్ణ్యంలో పుట్టినంత మాత్రాన వారసుణ్ణి వదిలేస్తామా? పద్యం కూడా అంతే. అన్ని సామాజిక రుగ్మతలను ఆధునిక పద్యం ప్రతిబింబిస్తున్నది. ఆధునిక పద్య కవిత్వంలో దళిత స్పృహకు కొరత లేదు, దళితులు, దళితేతరులు ఎవరు పద్యం వ్రాసినా వారి వారి చైతన్యపు పరిధిలో కుల, వర్ణవ్యవస్థల దురాగతాలను ప్రశ్నించారు. ధిక్కరించారు.

దళితులు వ్రాసిన పద్యంలో ధిక్కారం, అభివ్యక్తి, వస్తు సాంద్రత ఎక్కువ. దళితేతరులు వ్రాసినపుడు సానుభూతి శాతం ఎక్కువగా ఉంటుంది. అది వాస్తవమే. "దళిత జీవిత అభ్యుదయం దళితుల ఆలోచన, ఆచరణల మీద ఎంతగా ఆధారపడి ఉంటుందో, దళితేతరుల ఆలోచన, ఆచరణ పరిష్కారాల మీద అంతగా ఆధారపడి ఉంటుంది" అన్న కొలకలూరి ఇనాక్ మాటలు అక్షర సత్యాలు.

వర్ణవ్యవస్థ స్పృహ :

డా॥ బి.ఆర్. అంబేద్కర్ అభ్యుదయ దర్శనకారుడు. ఆయన దార్శనికత రాజకీయ, సాంఘీక వ్యవస్థలు రెండింటికి పెద్దబాలశిక్ష. ఆయనను విస్మరిస్తే జాతికదే పెద్ద శిక్ష. 19వ వతాబ్దం చివరి నాటికి భారతీయ సామాజిక వ్యవస్థలో ప్రారంభమైన మార్పులు జాతీయోద్యమ కాలానికి వేగవంతమైనాయి. అక్షరాస్యత పెరిగింది. మానవత్వం, సమానత్వం చదువరుల ఆలోచనలను ప్రభావితం చేయసాగింది. అంబేద్కర్ బోధనలు, గాంధీజీ హరిజనోద్ధరణ దళితుల జీవితాల్లోని వ్యధాభరిత గాధలను నిరసించే దిశగా తొలి అడుగులు వేశాయి. ఆ అడుగులతో పద్యం సమాంతర ప్రయాణం మొదలు పెట్టింది. అయితే దళితులు విద్యాంతులు కాకపోవడం దళితేతర అగ్రవర్ణాల చేతిలో పద్యం బందీ కావడంతో కొన్నాళ్ళు పద్యం చేతులు ముడుచుకొని ఉండిపోయింది. కుసుమ ధర్మన్న గుర్రం జాషువా వంటి కవుల పద్యం దళిత స్పృహతో పంచముడెవడనే ప్రశ్నతో బయలు దేరడంతో ఒక సమగ్ర రూపాన్ని సంతరించుకొని తరువాతి తరానికి మార్గదర్శకమైంది.

వివక్ష స్పృహ :

ఆధునిక కాలంలో గుర్రం జాషువా వారసత్వాన్ని అందుకున్న పద్య కవులలో సురగాలి తిమోతి జ్ఞానానంద

కవి, బోయి భీమన్న ముఖ్యులు. "నిఖిల లోక మొట్లు నిర్ణయించిన గాని, తిరుగులేదు నాకు తిరుగులేదు..... విశ్వనరుడ నేను" అని జాషువా అంటే

నీరుగట్టి, మళ్ళుగట్టి, నారుగట్టి
కంచెలను గట్టి నన్ను పోషించెవరు
అడవి మెక్కను నేను, విశ్వావకాశ

వీథులందిష్టమైనట్లు పెరుగుచుంటే - అని తనను నాను భీమన్న పరిచయం చేసుకుంటారు. 'స్వప్న జీవి' ఖండికలో "ఏ కులమంచు నన్ను వివరింపుల గూడిన కుంటి ప్రశ్నలన్, వ్యాకుల పెట్టబోకుడది వ్యర్థము ....." హృదయాకృతి చూసి, సమాదరించి, వివక్ష మానమని సమాజాన్ని కోరతాడు.

జ్ఞానానంద కవి తన అక్షర గుచ్ఛంలో "డాబు దర్పమ్ము తోడను నిబ్బరించిన మనువు మాటలు గొప్పవనిన వేళ, మత్తెక్కి పేద నిమ్నులపై వర్ణ పిశాచమ్ము కోరలు సాచువేళ అప్రాచ్యమత దురహంకార భావమ్ము స్వేచ్ఛ మై వ్యాహ్యాళి సేయువేళ" ఉదయించిన అంబేద్కరును గూర్చి వ్రాస్తూ అప్రాచ్యమత దురహం కారము, వర్ణపిశాచమై కోరలు సాస్తున్నదని వర్ణవ్యవస్థను నిరసిస్తారు.

దేవాలయ ప్రవేశ స్పృహ :

ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమల గుడిలోనికి దళితుల ప్రవేశమును నిషేధించిన వార్తను చదివిన కాటూరి వేంకటేశ్వరరావు దళితుల ఆత్మఘోషను "గుడిగంటలు" పేరుతో 40 పద్యాల ఖండ కావ్యంగా వ్రాశారు.

"ఆలంగాచుచు, క్షీరముల్ పిదికి నీకర్పించు ముక్కా రులున్ చేలంబైరులు పెంచు, నీ గరిసెలన్ నిండించు ధాన్యమ్ములిట్లాలుం బిడ్డల కొక్కి ప్రొద్దులిడి నిన్నర్చించు ముప్పొద్దు, ప్రాల్మాలండెన్నడు మాలడాతనికి నేలా మోము చూపింపవో".

యజమానుల పనులన్నీ చేస్తూకూడా "ఆలుంబిడ్డల కొక్క ప్రొద్దులిడి" చివరికి ఆలయ ప్రవేశానికి కూడా నోచుకోని స్థితిని కాటూరి హృద్యంగా వర్ణించారు.

వేదాధ్యయన స్పృహ: ఊరబావి వంటి దళిత తాత్త్విక నేపథ్యంగల కథలను వ్రాసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ 'ఆది ఆంధ్రుడు' అనే పద్యం కావ్యం రాశారు. కావ్య నాయకుడు ఆది ఆంధ్రుడైన భుజంగరాయుడు. అమాయకులైన పశువులు గాచే పిల్లల్ని, సమిధలేరుకునే బ్రాహ్మణుడు కొడుతుంటే భుజంగరాయుడు అడ్డు కుంటాడు. అప్పుడు వారు భుజంగ రాయునితో అన్న దురహంకారపూరితమైన మాటలు ఇనాక్ అక్షరీకరణలో అస్త్రాలైన తీరిది.

"మాదిగవాడా! నీకా
వాదము మాతో తొలంగి పరుగున పో పో
కాదని ఎదురాడిన నీ
వేదము జదివెడి గళమును బ్రేలుంజుమ్మీ"

అయితే అప్పటికే వర్ణవ్యవస్థను ధిక్కరించి మాదిగ కులస్తుడైన భుజంగరాయుడు వేదాధ్యయనం చేస్తూ ఉండటం ఒక భావ విప్లవంగా అభివ్యక్తమవుతున్నది.

జాతీయ స్పృహ :

గుంటూరు జిల్లా ముటుకూరు వాసియైన ఎం.పి. జానుకవి తమ 'భావగీత' అనే ఖండకావ్యములో వేదికపై సాహితీ మూర్తులు కూడా కుల, వర్ణ భేదాలతోనే ప్రవర్తిస్తున్నారని మనస్తాపం చెంది, తన శోకాన్ని మాపుచేయమని భారతీసతికి విన్నవించుకుంటాడు.

ఇంకా ఈ కుల వర్గ భేదములతోనే సాహితీమూర్తులున్
వంకల్ వెట్టుచు గేలిసేయుచు సదా బాధించినన్ వారిలో
నంకోచమ్ములు మోసులెత్తుచు మనస్తాపంబు గల్గించు నీ
శంకల్ మాయ సమాన గౌరవ ప్రతిష్ఠల్ గూర్చి యోదార్చవే!

వర్ణాంతర వివాహం చేసుకున్న జంటను చంపాలను కునే తల్లిదండ్రులలో నిలువెల్లా నిండిపోయిన కుల విషాన్ని తీవ్ర స్వరంతో 'ఆనంద మోహినీ' అనే కావ్యంలో గుర్రం ధర్మోజీరావు.

"కండ్లు కారాక కటిక యాకటి చేత
తానె బిడ్డల దిను త్రాచుపాము
హెచ్చు కులమటంచు పిచ్చి నెత్తికి నెక్కి
చంపజూచు జంట జాలిలేక" - అని నిరసించారు.

విప్లవ స్పృహ :

"ఎదురు తిరిగిన చెప్పులు" అనే ఖండికలో మల్లవరపు జాన్ ఇలా వ్రాస్తారు. మాదిగవారు కుట్టిన చెప్పులు తొడుక్కొని రాయి రప్పల నుండి, గాడ్పుటెండల నుండి, ముళ్ళ బాటల నుండి తమ పాదాలను రక్షించుకునే వారు, చర్మకారులను చవకచేసి మాట్లాడినప్పుడు చెప్పులు ఎదురు తిరిగి ఇలా మాట్లాడుతున్నాయి.

"తలబిరుసున నా ప్రాణ దాతలను పిలిచి
కొట్టెదను చెప్పతోడ నా కొడుకయనిన
ఎదురు తిరిగి పైకెగిరి తన్నెడము మేము
గారవించుము మమ్ము జాగ్రత్త సుమ్ము" - అని హెచ్చరించడమే కాకుండా

"పెదవి మెదపక నీ చెంత నొదిగియుండు
ఆట్టడగు జీవులను క్షోభ పెట్టినపుడు
తిరుగబడునని ఇపుడైన తెలుసుకొనుడి
సమత పాటించి మానవత్వమున మనుడి" అని చెప్పులతో ప్రతీకాత్మకంగా హితబోధ చేశారు.

కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన సవ్వప్ప గారి ఈరన్న 'లోకం పోకడ' అనే కావ్యంలో

"అగ్ర జాతుల నీడలో
విగ్రహమ్ముగ నుండటల్
నిగ్రహమ్ము చూపుటన్
ఉగ్ర రూపికి సాధ్యమా" అని ప్రశ్నించి తిరుగుబాటుకు పిలుపునిచ్చారు. అంటరానితనాన్ని గూర్చి చెపుతూ

"అంటరాదట మానవుల్
ఇంటి చాకరి చేయగన్
అంటు జాడ్యము పోవునా
పంటభూములు పండవా" - అంటూ దళితులు అని పనులు చేసి పెడుతున్నపుడు లేని అంటు, అంటు కున్నపుడు ఎలా వస్తుందని నిలదీస్తారు.

అభ్యుదయ స్పృహ :

డా. మన్నవ బాస్కర నాయుడు వ్రాసిన 'స్వేద సూర్యోదయం' కావ్యం, భూస్వామి కామానికి బలైన దళిత యువతిని తిరుగుబోతుగా చిత్రీకరించి కులంలో నుండి వెలివేస్తే, భూస్వామి తమ్ముడు అన్నపై తిరగబడి ఆమెను పెళ్ళి చేసుకునే ఇతివృత్తంతో కూడినది. ఈ కావ్యం ద్వారా రేపేమవుతుందో అనే భయంతో అగ్రకులాల వారికి దాస్యం చేస్తున్న దళితులు తిరగబడాలని ఇలా ప్రబోధం చేస్తారు.

పుట్టిన దాదిగా చెమట పుట్టలు పెట్టిన చీమలార! మీ
పుట్టలలోని పాములకు బుద్ధిని చెప్పుట నేర్వుడింక, రే
పెట్టని నేడె చావవలదిప్పుడె, రూపటి పాలకూటికై
రెట్టలు కల్పి స్వేదముల రేగడి నేలలు తన్పిసాగుడీ.

చేతులు చేతులు కలిపి పుట్టల్లో దూరిన పాములకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చిన ఈ పద్యం ఒక పాలికేక.

ప్రారంభదశలో దళిత స్పృహతో పద్యం వ్రాసిన వారికి అంబేడ్కర్ కావ్య నాయకుడైనట్లే, తరువాతి వారికి జాషువా కావ్యనాయకుడైనాడు. ఆధునిక పద్యంలో దళిత స్పృహ నిండుగోదావరిలా తొణికిసలాడుతోంది.

ఆధార గ్రంథాలు :

1. ఆది ఆంధ్రుడు - ఆచార్య కొలకలూరి ఇనాక్
2. స్వప్నజీవి - బోయి భీమన్న
3. స్వేద సూర్యోదయం - డా॥ మన్నవ భాస్కర నాయుడు
4. ఆనంద మోహినీ - గుర్రం ధర్మోజీరావు
5. జాషువా కృతుల సమాలోచన - ఎండ్లూరి సుధికర్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయ జంగయ్య కథలలో దళిత దృక్పథం జీవిత వాస్తవిక చిత్రణ

– పొన్నకంటి స్వప్న, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

సామాజిక దురన్యాయానికి, అణిచివేతకు గురవుతూ, అస్పృశ్యులుగా పరిగణింపబడుతూ, కుల వృత్తులుగా భావింపబడుతున్న వృత్తులు చేస్తూ, శారీరక శ్రమపై ఆధారపడి బతుకులు గడుపుతూ సమాజ సంపదను పెంచుతున్నవారు దళితులు. హిందూ మతంలో అణగారిన వర్గాలను దళితులుగా పేర్కొంటారు. భారతీయ సమాజంలో ఉన్న చాతుర్వర్ణ వ్యవస్థను అనుసరించి కుల వ్యవస్థ రూపొందింది. భారతదేశంలో కుల వ్యవస్థ సాంఘిక అసమానతలకు కారణ మయ్యింది. ఈ కుల వ్యవస్థ కారణంగానే దళితుల పట్ల వివక్షత నేటికీ కొనసాగుతూనే ఉంది. దళితము అనే శబ్దానికి నిఘంటువుల్లో ఖండింపబడినది, ఛేదింపబడినది, వికసించినది అనే అర్థాలు ఉన్నాయి.

దళితులని హిందూ మతంలో అతి తక్కువ స్థాయి వారిగా చూస్తారు. దళితులు భారతదేశంలోని ఇతర మతాలలో కూడా ఉన్నా, వారి మూలాలు హిందూ మతానికి సంబంధించి ఉన్నాయి. దళితులు జన్యు పరంగా ఇతర అగ్రకులాలను పోలి ఉన్నా కూడా సామాజికంగా, తరతరాలుగా తక్కువ జాతిగా పరిగణింప బడుతున్నారు. అగ్రవర్ణాల వారు వీళ్ళని అస్పృశ్యులుగా చూస్తూ వచ్చారు. ఊరికి దూరంగాఉంచుతూ, కనీసం దేవాలయాలలోనికి రానిచ్చే వారు కాదు. అంటరాని తనం, ఊరికి దూరంగా, సంఘ సేవలో మాత్రమే పనికి వచ్చేవారుగా దళితుల్ని భారతదేశం ముద్ర వేసింది. ఇది శతాబ్దాల చరిత్ర స్వాతంత్ర్య పోరాటంలో అస్పృశ్యతా నిర్మూలన సమస్యను గాంధీ చేపడితే, మతంలోనుంచి పుట్టి పెరిగి, వర్ధిల్లుతున్న కులం, అందులోనుంచి విషపుత్రికగా అవతరించిన అంటరానితనాన్ని అంబేద్కర్ చక్కగా వివరించారు. మూల సమస్య పరిష్కారం కావాలంటే మూల దోషాల నుండి దళితులు బయట పడాలన్నారు. మతాన్ని ఎందరు సంస్కరించబోయినా విఫలం కావడానికి కారణం మూలం జోలికి పోకపోవడమే అన్నాడు అంబేద్కర్. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అయినా నేటికీ అది పూర్తిస్థాయిలో పోలేదు అనడానికి అనేకానేక ఘటనలు మనం రోజూ చూస్తూనే ఉన్నాము. ఈ అసమానతల్ని వివరిస్తూ దళితుల ఆలోచనా విధానాన్ని మార్చి అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా కృషి చేయాలని స్ఫూర్తిని కలిగించిన వాటిలో సాహిత్యమొకటి. దళితుల జీవన విధానాన్ని చైతన్య వంతంగా వర్ణించిన సాహిత్యం దళిత సాహిత్య మవుతుంది. దళితులే తమ సమస్యలకు ప్రతిస్పందించి రాస్తే దాన్ని "ఆత్మాభిమానవాదం" గానూ, దళితేతరులు దళితుల పక్షాన్ని వహించి రాస్తే దాన్ని ఉదారవాదంగానూ పిలుస్తున్నాం.

దళితసాహిత్యం మరాఠీ భాషలో ముందుగా స్థిరపడి, తరువాత భారతీయ భాషలన్నిటిలోనూ విస్తరించింది. భారతదేశ వ్యాప్తంగా జరిగిన పాలన, ఆర్థికపర అంశాల కారణంగా సామాజిక ఉద్యమాలు వచ్చాయి. దాని ప్రభావంతో వెలువడుతున్న సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక ప్రత్యేక విభాగమయ్యింది. 1960 నుండి దళిత సాహిత్యం ప్రాచుర్యాన్ని పొందింది. 1970లలో మరాఠీ, కన్నడ భాషలలో నిర్దిష్ట లక్ష్యాలతో, ప్రత్యేకమైన అభివ్యక్తులతో దళిత సాహిత్యం పురోగమించింది. 1980ల ఉత్తరార్ధంలో తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం నిర్దిష్ట రూపాన్ని పొంది 1990 నాటికి దళిత సాహిత్యం సాహిత్యంగా నిలదొక్కుకునే ప్రయత్నం

చేసింది. ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని ప్రశ్నిస్తూ తనదైన అస్తిత్వంతో ముందుకొచ్చింది. వేమన, తత్వకవులు, మానవతా దృక్పథంతోనూ, గురజాడ హేతువాత దృక్పథంతోనుదళితుల సమస్యలను సృజనీకరించారు. సంఘ సంస్కరణోద్యమాలు ప్రధానంగా స్త్రీ సమస్యల పైనే కేంద్రీకరించినా, కొంతవరకు కుల సమస్యను కూడా గుర్తించాయి. జాతీయోద్యమం అస్పృశ్యతా సమస్యను ప్రధానంగా గుర్తించి, మత స్పృహలో దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేసింది.

అభ్యుదయ సాహిత్యం పీడిత శ్రామికవర్గ సమస్యలలో భాగంగానే దళిత సమస్యలకు పరిష్కారాన్ని సూచించింది. అది ఎక్కువగా ఆర్థిక సంస్కరణలకే ప్రాధాన్యాన్నిచ్చింది. విప్లవ సాహిత్యం గిరిజన సమస్యలతో పాటు దళిత సమస్యలను వర్గదృష్టితో ప్రత్యేక ప్రాధాన్యాన్నిచ్చింది. ఆర్థిక కోణానికి అధిక ప్రాధాన్యాన్నిచ్చే విప్లవ స్పృహతో సమాంతరంగా సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడా దళిత చైతన్యం విస్తరించింది. వర్గం కంటే దళిత సమస్య కులంతోనే ముడిపడి ఉందని గుర్తించి, ఆ అంశాలను ప్రధానంగా తీసుకొచ్చింది. (స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అంబేద్కర్ జాతి నిర్మాణంలో అందరినీ భాగస్వాములు చేస్తూ అణగారి నతనం నిర్మూలించడానికి రిజర్వేషన్లు ప్రతిపాదించడం జరిగింది.

ఈ దశలో దళిత జీవితాలను చిత్రిస్తూ, సంస్కరణ, అభ్యుదయ, విప్లవ సాహిత్యంలో భాగంగానే దళిత కథలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ కథలలో పలువురు రచయితలు దళితుల జీవితాన్ని వారి సంవేదనలను, వారి పోరాట చైతన్యాన్ని, ఆర్థిక వెనకబాటుతనాన్ని, దళితులు చదువుకోవలసిన, అవసరంవంటి పలు అంశాలపైన తమదైన శైలిలో కథలు రాసి కొంత మార్పుకుదోహదపడ్డారు. వారిలో ముఖ్యులు 50 సంవత్సరాలు నిరంతర సాహిత్య కృషి సల్పుతూ అనేక ప్రక్రియల్లో రచనలు చేస్తూ దళితవాదాన్ని ప్రతిబింబించేలా రచనలు చేసిన వారు బోయ జంగయ్య వారి కథలల్లో ఉన్న దళిత దృక్పథంపై పత్ర సమర్పణ ముఖ్య ఉద్దేశ్యం.

బోయ జంగయ్య :

పూరి గుడిసెలో పుట్టి కష్టాల్లో పెరిగి స్వయంకృషితో ఎదిగిన జీవితం బోయ జంగయ్య గారిది. పేదరికం, కుల అసమానతలు వంటి ప్రతికూల పరిస్థితుల నడుమ తనను తానుమలచుకొని తన జీవితమే ఒక పాఠశాలగా, విశ్వ విద్యాలయంగా అనుభవాలు పండిన జీవితం బోయ జంగయ్య గారిది. కష్టాలు, కన్నీళ్లు, పేదరికం, కుల అణిచివేత పెట్టే మానసిక హింస, నిరాశ, ఆత్మన్యూనత బాగా తెల్సినవాడు, స్వయంగా అనుభవించినవాడు కావడం వల్ల బోయజంగయ్య కథల్లో అలాంటివారికి అందించాల్సిన ఆత్మ విశ్వాసం అందిస్తూ, జీవితం పట్ల ఆశ, విశ్వాసం కలిగిస్తూ, పీడితులు,బాధితులు, దళితులు జీవితం గెలిచే క్రమాన్ని, గెలవాల్సిన క్రమాన్ని చిత్రించడం బోయ జంగయ్య విశిష్టత. కథా వస్తువును సమాజం నుండి స్వీకరించి తనదైనముద్రతో కథల్ని మలిచిన మహా రచయిత జంగయ్య. వీరి కథలు కాలం గడుస్తున్న కొద్దీ సామాజిక చరిత్రగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. గోపీచంద్, కాళీపట్నం రామారావు, బి.ఎస్. రాములు వంటి వాళ్ళెవరూ చిత్రించని కోణాల్ని గ్రామీణ జీవితాన్ని దళిత హృదయంతో చిత్రించిన మహా రచయిత.

తెలుగు కథా సాహిత్యంలో దళితవాదం 1990 నుండి ఉద్యమ రూపంగా వచ్చింది. కానీజంగయ్య గారి కథలు మొదటి నుండి అణగారిన దళిత జీవన రేఖలను తాకుతూనే ఉన్నాయి. దళిత స్పృహతో, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే దళితుల జీవన స్థితిగతులను తనదైన శైలిలో చెప్పారు. అందుకే కథా సాహిత్యంలో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ దృక్కోణంతో పాటు దళిత దృక్పథాలను సృష్టించిన కథా రచయిత

జంగయ్య. ఈయన కథలలో అస్పృశ్యత, నీటిసమస్య, రాజకీయాధికారం, నీచ కులవృత్తులను నిషేధించడం, కులపీడన, భూస్వామ్య పెత్తందారి వ్యవస్థ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఉప్పునీరు కథలో అగ్రవర్ణాలు దళితుల్ని పశువులకన్నా హీనంగా చూస్తారు అన్న సత్యాన్ని మన ముందుకు కథ రూపంలో తీసుకొచ్చారు జంగయ్య. దళితవాడలో పెంకుటిల్లులో ఉండే ఎంకులు వృత్తి ఊరంతా బావులు త్రవ్వడం. ఇతనికి భార్య లేదు. భర్త విడిచిపెట్టిన మారెమ్మ అనే మహిళతో కలిసి జీవించసాగాడు. ఈ ఇద్దరూ కలిసి ఊళ్ళో చాలా బావులు తవ్వారు. ఒక బావిని తవ్వుతుండగా ప్రమాదంలోమారెమ్మ మరణిస్తుంది. ఎంకులు ఒంటరయ్యాడు. ఎంకులు తవ్విన బావుల్లో రెండు మాత్రమే మంచినీటివి. మిగిలిన బావులంతా ఉప్పునీటివి. వాటిని పొలాలకి ఉపయోగించేవారు. భార్య మరణంతో ఒంటరైన ఎంకులు వయసురీత్యా పెద్దవాడై శరీరంలో సత్తువ నశించి పని చేసుకోలేని దశలో ఆకలికి అలమటిస్తాడు. అది ఎండాకాలం అవడంతో ఊళ్ళో ఎక్కడా నీళ్ళు దొరకవు. చివరికి గుక్కెడు నీళ్ళకె పటేలమ్మ ఇంటికివెళ్ళి యాచిస్తాడు. కానీ పటేలమ్మ బావిలో కొన్నే నీళ్ళు ఊరుతున్నాయని, అవి కూడా తమకి, అవు కుడితికే చాలట్లేవు అంటుంది. అవుకు ఉప్పునీరు తీసుకొస్తాను. కనీసం ఒక చెంబుడు నీళ్ళివ్వ మన్నాకూడా కనికరించని పటేలమ్మ కుడితిలోకి ఉప్పు నీళ్ళా? ఆ కుడితి తాగి బర్రె పాలిస్తదా అని మొహం చిట్లించి గుక్కెడు నీళ్ళివ్వడానికి నిరాకరిస్తుంది. ఊరందరి దాహార్తిని తీర్చడానికి బావులు తవ్విన ఎంకులు తన ఇంటి ముందు బావి తవ్వుకునే ఆలోచనే చేయలేదు. బహుశా ఇంతమందికి బావులు తవ్వాను కదా రేపునాకు కనీసం దాహానికి నీళ్ళు ఇవ్వరా అని అనుకుని ఉంటాడు. కానీ పాపం అతని కేం తెలుసు ఆ ఊళ్ళోఅగ్రవర్ణాల వారు తమ జాతి వారిని పశువుల కంటే హీనంగా చూస్తారని, కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతూ పటేలమ్మను దీనంగా అర్థించి భంగపడ్డాడు.చివరకు ఆకలికి, ఎండ ధాటికి తట్టుకోలేక కడుపులోఈసమైన ఆసరలేక చనిపోయాడు. కంటతడి పెట్టించే చిత్రణ ఈ కథలో ఉంది. బావి తవ్వి తమ దాహార్తినితీరుస్తున్న ఎంకులు దళితుడు. కులం అహంకారంతో దళితునికి దాహానికి కూడా నీళ్ళివ్వని అగ్రవర్ణపుమూర్ఖత్వం ఎలా ఉంటుందో పటేలమ్మ పాత్ర ద్వారా మనకు తెలిపారు జంగయ్య.

వంతెన :

అగ్రవర్ణాల వారి అహంకారానికి నిలువెత్తు నిదర్శనం వంతెన కథ. నాగారం అనే గ్రామ దొర నర్సింగరావ్ కొడుకు తమ ఇంట్లో పనిచేసే దళిత పాలేరు కూతురుని ప్రేమిస్తాడు. కులంతక్కువదాన్ని ప్రేమిస్తే ఎలా అని దళితవాడకి తమ ఊరికి మధ్య ఉన్న రోడ్డుని పాడు చేసి కాలువతవ్విస్తాడు. కానీ కాలువనిదాటుకుని మరీ ప్రేమికులు కలుసుకుంటుంటే సహించలేని దొర ఆ అమ్మాయిని చంపిస్తాడు. అది తెలిసిదొర కొడుకు ఆత్మహత్య చేసుకొని చనిపోతాడు. ఆకాలువకి కొత్త వంతెనను ఏర్పాటు చేసి, బస్సు సౌకర్యాన్నికల్పించిన నోడల్ ఆఫీసర్ని దొర పటేల్ అడ్డగించి అభివృద్ధి కార్యక్రమాలు ఆపేయమని బెదిరించడంలో వాళ్ళ ఉద్దేశం ప్రభుత్వం దళితసంక్షేమం కోసం ఇలానే సంక్షేమ కార్యక్రమాలు చేస్తూపోతే అన్ని విధాలదళితులు తమతో సమాన స్థాయిలో ఉంటారు. అదే జరిగితే తమ ఆటలు సాగవని గ్రహించి, నోడల్ ఆఫీసర్ని బెదిరించిసంక్షేమ ర్యక్రమాలు ఆపమంటారు. అంతేకాక బస్సు ముందుగా దళితవాడ నుండిబయలుదేరితే దళితులు కూర్చొని ఉంటే అగ్రవర్ణాల వారు నిలబడాలా? అదేం కుదరదు వారెప్పటికీ మా కింద బతికే వారే అనే అహంకారంతో ఇలా వ్యవహరిస్తారు. దొర ఆర్థికంగా మంచిస్థితిలో ఉండడానికిదళితుడే వ్యవసాయం పనులు చేస్తాడు. ఫలితంగా దళితున్ని ఏ రకంగా ఆదుకోడు. జీతం ఇవ్వక అప్పులపాలు చేస్తాడు. దొర

దళితున్ని పట్టించుకోడు. అతను చేయని పనినిప్రభుత్వం చేసినా కుట్రలతో, బెదిరింపులతో దళితుని సంక్షేమాన్ని అడ్డుకుంటాడు అంటేనేఅర్థమవుతుంది. వారి కుట్రపూరిత స్వభావం ఎలాంటిదో. అంతేకాక చావు బతుకుల్లో ఉన్నదళితున్ని ముట్టుకుంటేనే పాపమని తలచి అతని చావుకు కారణమైన దొరల మూర్ఖత్వాన్ని ఈ కథలో తెపారు రచయిత.

బందలగడ్డ కథలో తరతరాలుగా దళితుడు అగ్ర వర్ణాల ఉక్కు పాదాల క్రింద నలిగిపోతూ వారి ఆగడాలు భరించలేక ఎదురు తిరిగి చివరికి అపజయాన్నే చవి చూసిన తీరు కనిపిస్తుంది. గ్రామం పక్కనే పూడిపోయిన చెరువు భూమి ఖాళీగా ఉండడంతో అది దళితులకు వ్యవసాయ నిమిత్తమై కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఇది నచ్చని ఆ ఊరి దొర, పూజారిగ్రామంలో మిగిలిన కులాల వారిని పిలిచి అది దైవసొత్తు. ఆ భూమిని రక్షించమని కలలో శ్రీరాముడు వేడుకొన్నాడని, ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని స్వాధీనపరుచుకోవాలని చూస్తుందని తెలుపగా ఊరి వారంతా కలిసి ఆ భూమి దళితులకు చెందొద్దు అనిదళిత వాడలకు నిప్పుపెట్టి దళితులే సారా స్తుంటే నిప్పులు అంటుకున్నాయని దాసు అనేతాగుబోతుచే దళితులపై అబద్ధ సాక్ష్యాలచెప్పి, కేసులు పెట్టించి అప్పులపాలు చేస్తారు. తర్వాతఅగ్రవర్ణాల వారికి దళితులకు మధ్య జరిగిన కొట్లాటలో దాసుని పూజారే చంపి దళితుల మీద నెడితేపోలీసు జాగిలం అసలు హంతకులని పట్టిస్తుంది. ఇక్కడ నిజం దళితుల పక్షాన నిలిస్తే తట్టుకోలేని గ్రామ ప్రజలు దాసు శవానికి అంత్యక్రియలు రాత్రికి రాత్రే జరిపిస్తారు. మరునటి రోజు ఉదయానికి తెలుస్తుంది, ఎలాగైనా సరే దళితులు గెలవొద్దు అనే కుట్రతో ప్రభుత్వం వారికి కేటాయించిన స్థలంలోనే దాసు శవాన్ని పాతిపెట్టారు. దళితులు ఎంత చైతన్య వంతులైనా, ఎంత ఎదురుతిరిగినా కూడా అగ్రవర్ణం వారు చేసే కుయుక్తుల ముందు నిలువలేకపోయారు. ఈ కథలో అగ్రవర్ణాలు ఎన్నో రకాల దమన కాండలు చేసారు. అయినాసరే సంతృప్తిచెందక, దళితులకు భూమి దక్కడం, న్యాయమే గెలవడం ఇష్టం లేక దాసుని హత్య చేసి శవాన్ని దళితులకు కేటాయించిన స్థలంలో పాతిపెట్టి దాన్ని బందలగడ్డగా మార్చి మరీ ఆ భూమిని వారికి దక్కనీయకుండా చేసిన వారి కర్కష హృదయాలను ఆవిష్కరించారు రచయిత.

కొమ్ములేని ఎడ్లు :

తెలంగాణలో ఊరు అంటేనే ఖచ్చితంగా దొర ఉంటాడు. దొర ఏం చేసినా దళితులు ఎదురు తిరిగకూడదు. ఎదురు తిరిగితే వారిని చంపడమో, ఊరు వదిలిపోయే విధంగా చేయడమోచేస్తాడు. దొరలు ఏం చేసినా నోరెత్తకుండా బానిసలుగా బతకడం తప్ప మరో మార్గం ఉండదు. ఆ విషయాని ఋజువు చేసింది కొమ్ములేని ఎడ్లు కథ. ఈ కథలో దళితులందరికీ కలిపి మూడెకరాల బంజరు భూమిఉంటుంది. దానిలో వారు కందులు, పెసలు పండించుకుంటారు. ఊరి దొర పెదరెడ్డి పశువులు దళితుల చేనులో పడి కందికాయ నంతా నములుతాయి. దాంతో దళితులు ఆ పశువులను బందెలదొడ్డిలో బంధిస్తారు.దళితులు పెంచుకుంటున్న కోళ్ళు దొర గారి వరి చేలకుపోతే ఎండ్రిన్ కలిపిన గింజలు తినిపించి, కోళ్ళని దొర చంపిస్తాడు. కానీ దళితులెవరూ ధైర్యం చేసి దొరను అడగరు. కానీ దొర మాత్రం బందెల దొడ్డిలో పశువుల్ని బంధించినందుకుగానూ ఊళ్ళో ఉన్న దళితుల్ని బాధిస్తూవారికి ఊళ్ళో ఎవరూ పనివ్వకుండా, కనీస అవసరాలు తీరనీయకుండా, వారు గతంలో తన దగ్గర తీసుకున్న అప్పులకు ఎక్కువ వడ్డీలు వేసి తీర్చాల్సిందే అని వారి మీద ఒత్తిడి తెస్తారు. దీంతో వేరే దారిలేక వారు ఆ అప్పు కింద తమ చేనుని దొరకిచ్చి వేరే ఊరుకు వలసెళ్ళిపోతారు. ఈ విధంగా దళితవాడ వాస్తవిక చిత్రణ చేశారు జంగయ్య. అంతేకాక దొరలు, అగ్రవర్ణం వారు కలిసి ప్రభుత్వపుపక్కా ఇండ్ల పథకాలు దళితుల చేరకుండా అడ్డుకుంటారు. ఈ విధంగా

దళితులు చేనులో పశువులుపడితే వాటిని "బందెల దొడ్డి"లో పెడితే ఆ చేనునేవిడిచిపోయే పరిస్థితి తెలంగాణ దళితులకు ఉందన్న విషయం చెప్తుంది ఈ కథ.

ఇలా జంగయ్య గారు రాసిన ప్రతీ కథ నాడు దళితులపై జరుగుతున్న వాస్తవిక కోణాల్ని చిత్రీకరించింది. జంగయ్య సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యల్ని గ్రహించి రచనలు చేశారు. అనేక దృక్కోణాల్లో కథల్ని విశ్లేషించి వాటిలో కొన్నింటికి పరిష్కార మార్గాన్ని చూపిస్తూ, మరికొన్నింటికిపరిష్కార మార్గాన్ని పాఠకులకే వదిలివేసాడు. వాస్తవ ప్రపంచంలోనిదుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న పేద, దళిత ప్రజల్ని ఈసడించుకునే ధనికవర్గం, అగ్రవర్ణాలకుయుక్తులను తన రచనలలో కళాత్మకంగా చూపించాడు. వస్తువురీత్యా, శిల్పంరీత్యా, ఇతివృత్తాల రీత్యా జంగయ్య రచనలు సాహిత్య విలువల్ని సంతరించుకున్నవి. వామపక్ష దృక్పథంలోంచి ఎదిగి దళిత దృక్పథంలో కథా ప్రస్థానం చేస్తున్న సృజనాత్మకరచయిత జంగయ్య. మూఢ నమ్మకాలు వదిలి వేసిననాడే దళితులు అభ్యున్నతి సాధిస్తారనేది వీరి రచనల్లో సారాంశం. వీరి రచనలకు అంబేద్కర్ భావజాలమే పునాది. దళితులకు కావాల్సింది గుడి కాదు బడి అనివీరి ధృడ విశ్వాసం. దళిత సమాజం విద్య ద్వారా చైతన్యం పొందుతూ, తమపై జరుగుతున్న దౌర్జన్యాలని ఎదిరించడానికి అవసరమైన పోరాట పటిమను అందిస్తూ, దళిత నాయకులు, మేధావులు స్వతంత్రంగానే సాగాలనే సందేశాన్ని జంగయ్య గారి రచనలు తెలియజేశాయి. జంగయ్య గారి లాంటి రచయితలు సృష్టించినసాహిత్యం వలన ఉత్తేజితులైన నాయకులు బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకించడంలో కృతకృత్యులయ్యారు. దళితులలో చైతన్యం రగిలించడానికి సాహిత్యాన్ని ఆయుధంగా మలచుకొని మనువాదాన్ని ఖండించిన ధీశాలి బోయ జంగయ్య. నాడే కాదు నేటికీ పరిస్థితి ఇలాగే ఉంది.

ఉపయుక్త ఆధార గ్రంథాలు :

1. బోయ జంగయ్య
2. దళితుల చరిత్ర - డా. కత్తి పద్మారావు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మనువాదంపై లెల్లాయి పాటతో లొల్లి పుట్టించిన మాదిగబిడ్డ ఎర్ర ఉపాళి

– పోతురాజు శ్రీనివాస్, చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వనపర్తి.

తరతరాలుగా అంటరాని తనాన్ని మోస్తూ, భరిస్తూ, సహిస్తూ వచ్చిన మనువాదపు కర్మ సిద్ధాంతాన్ని, కుల తత్వాన్ని సింధూ సమాజంపై బలవంతంగా రుద్ది రుద్దీ కులగజ్జిని అలవాటుచేసి దానికి మతం అనే మత్తుతో మందు ఎక్కించి మనుషులను మనుషులుగా చూడని సామాజిక అంతరాలు సృష్టించి ఎక్కువ తక్కువ కులం అని వర్గ విభజన చేసి చదువుసంధ్యకు దూరం చేసి యజ్ఞయాగాది కృతువులతో శ్రామిక మిగులు దోసి శ్రమ రక్తపు బొట్లను యజ్ఞాలకు ఆహుతి చేసి అంటరానితనాన్ని అంటగట్టి బలసిన కులాలుగా, బక్క కులాలుగా మార్చి వెట్టి చాకిరితో ఊడిగం చేయించుకుని ఊళ్లకు ఊళ్లను దోచుకుని సబ్బండ జాతుల మధ్య అంతరాలను సృష్టించి ఏకం కానీయకుండా, అడుగడుగునా నాగశేషనీడలో సేదదీరుతూ, తిరగబడ్డ వారిపై పడగవిప్పి కాటేస్తూ, వేలాది సంవత్సరాలు సాగిన మనువాదుల స్వర్ణయుగాన్ని బద్దలు కొట్టి అంతో యింతో కొద్ది సామాజిక మార్పులను వీరిలాగే వచ్చిన మరో విదేశీ పారశీక పాలకులవల్ల మనువాదానికి కొద్దిగా అంతరాయం ఏర్పడినప్పటికీ సుదూర మార్పు రాకపోయినా ముసల్మాను, క్రైస్తవ పాలకుల వల్ల వారి ఆస్థానంలో దళితులు సేవకులుగా చేరినప్పటికి, కాస్తో కూస్తో అక్షర జ్ఞానం రగిలించి, వారి పీఠాలల్లో (మిషనరీలు) పాఠాలు నేర్పించి, సాంకేతిక జ్ఞానం అందించి, చీకటి బ్రతుకులలో వెలుగులు నింపే ప్రయత్నం ఆంగ్లేయ పాలకుల వల్ల నిమ్నజాతులకు అక్షరజ్ఞానం కలిగిందని చరిత్ర ఖచ్చితమైన సమాచారాన్ని అందించగలదు.

మొత్తంగా భారత స్వతంత్ర ఉద్యమంలో సైతం అణ గారిన బహుజనవర్గాల పోరాట బలిదానాలను ఆసరాగా చేసుకుని, వారి త్యాగధనపు చితిమంటల్లో చలికాచుకున్న అగ్రకుల జాతీయ నాయకులు వందలాదిమంది వున్నారు.

మధ్యయుగం నుండి ఆధునికయుగం వరకు మనువాదంపై తిరుగుబాటు చేసిన మహానాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే నుండి బాబా సాహెబు అంబేడ్కరు వరకు ఎన్నో పోరాటాలు చేయవలసి వచ్చింది.

స్వతంత్ర్యానంతరం నుండి ఇప్పటి వరకు నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను కూలదోసే ఆలోచన కాని, అంట రాని కులాల ఆవేదన కాని, ఆత్మ గౌరవాన్ని కాని, అర్థం చేసుకునే నాగరిక సమాజ పాలకులు పూర్తిగా ప్రజా స్వామ్యాన్ని అర్థబలం అంగబలంతో రోజు రోజుకు కుల అహంకార విషాన్ని చిమ్ముతూ ప్రజాస్వామ్యంలో పీడిత ప్రజలను ఏకం కానీయకుండా దాడులు దౌర్జన్యాలు జరుగుతూనే వున్నాయి.

అయిన 75 సంవత్సరాల "అజాది కా అమృత్ మహోత్సవాల" సాక్షిగా అంటరాని కులాల అక్షరజ్ఞానానికి దూరంగా, శ్రమదోపిడీకి, అలాగే వారిపై అత్యాచారాలు అవమానాలు పరువు పేరుతో హత్యలు, రాజ్యాధికార దూరభారాలు పెరుగుతూనే వున్నాయి.

అయిన ఏదో ఒక రూపాన దళిత చైతన్య దండోరాలు మ్రోగుతూనే వున్నాయి. అలాంటి వారిలో చదువుకు నోచుకోక, కఠిన దుర్భర పేదరికాన్ని అనుభవిస్తూ, వెట్టి చాకిరికి జీతం చేస్తూ రాత్రిబడులలో అక్షరాలు మాత్రమే నేర్చుకుని వాటికి అనగా అక్షరాలకు తానే ప్రాణం పోసి, పదరూపం కల్పించి పదునైన పదాలతో తన జీవితంతో పాటు చుట్టూ నెలకొన్న సామాజిక అంతరాలను ఎలుగెత్తి

చాటుతూ డప్పు సంకనవేసుకుని, ఎన్నో కళారూపాలు ప్రదర్శించి, తాడిత పీడిత ప్రజలపాటను రాస్తూ పాడుతూ, అగ్రకులాల గుండెల్లో దండోరా మోగించిన మాదిగ బిడ్డ ఎర్ర ఉపాళి.

ఉపాళి నల్లగొండ జిల్లా ఆలేరు మండలం రాఘవాపురం గ్రామంలో ఎర్ర సుక్కమ్మ, సిద్దులు గార్లకు మాదిగ కుటుంబంలో జన్మించాడు.

తనగురించి తాను చెప్పుకున్నమాటలు " పేదరికం నాయింటి పునాదులు, దరిద్రం నాయింటి అలంకరణలు, దౌర్భాగ్యం నాయింటి సౌభాగ్యాలు, కష్టాలు కన్నీళ్ళు నాకున్న సిరిసంపదలు, కష్ఠాల కడలి సామ్రాజ్యానికి నేను సామ్రాట్టును, కళతో భవిష్యత్తుకు వారధి నిర్మించుకున్న మహారాజును, ఈ లోకానికి సేవ జేసే కులంలో బుట్టినోన్ని, కటిక పేదనైన కాకి బలగం కలిగిన వాన్ని, ప్లవులతో ప్రాణం నింపుకుంటున్నోన్ని, బ్రతుకు పాటనై దరువేస్తున్న వాన్ని, కూటికి లేక తిప్పలే గాని నాగుణం సక్కని జనబలం ఉన్నంక నాకేం తక్కువ"

మాదిగలపైనే కాకుండ డక్కలి, చిందు, కళాకారుల కష్టాలపై అద్భుతమైన పాటలు రాసారు.

"రంగుల మాటున దాగిన చిందులు, కన్నీళ్లను తాగే కనువిందులు, అతుకుల బతుకుల చింతలు,
ఆకలితీరని గొంతులు, జానపదాలకు జీవం బోసిన జాతిలో సంచార జాతులు ..... "

అంటూ అద్భుతమైన పాటను రాశాడు.

మనువాదంపై :

"మనువా నువు మల్ల జన్మెత్తురా, నామదిగశక్తి యేందో చూపిస్తరా, మట్టి బొమ్మల చేసి జీవం పోస్తవంటా పుట్టి గిట్టే తలరాత రాస్తాంటా, అవ్వయ్య లేకుండ అట్లెట్ల పుడుతరు, ఓరి మడిబట్ల నాకొడక మెడబట్టి కొరికేస్త, పంచభూతాలనె పానంగ నమ్ముకుని ఎల్ల వేళల మేము సల్లంగ బతికినం, నేలమ్మ గుండెపై జోల పాటయ్యినం ప్రకృతి ఒడిలోన పాపలై ఊగినం, మట్టి వాసన పీల్చి మనుషులం అయ్యినం, ఈ మట్టిలోనె సిరి సంపదలు తీసినం, కనిపెంచిన తల్లి కాళ్లకు మొక్కినం, మాతృ స్వామ్యానికే పెత్తనం యిచ్చినం, తొలుతయ్యా భూమ్మీద పుట్టిన మమ్మల్ని సూద్రులను జేసి సుస్రూత చేయ మన్నావు, రాయి రాయి రప్ప రాసుకున్నపుడే నిప్పు పుడుతా దన్న నిజము దెలువదారా, చేయి చేయికి తగులు కున్నపుడే సప్పుడొస్తుందన్న సత్యమెరుగువారా, మనసు మనసేకమై కలుసుకున్నపుడే కొత్త మనిసి పుడుతాడన్న మర్మమెరుగవారా, తోడు ముట్టకుంటే పుట్టుకేలేదనే జాడ నెరుగవారా పాడు ముండాకొడుకా, బాపనోడే నోట్లె కెల్లెట్లపుట్టిండు వేదశాస్త్రాలను పట్టెట్ల వట్టిండు, మంత్రాలు తంత్రాలు కుతంత్రాలతోని బాపనోడిగ బలిసి బతుకు మని చెప్పావు, ఛాతి నుండి మనిషి పుట్టడని తెలిసిన క్షత్రియుడని దొంగ సాక్ష్యంగ జూపావు, తొడనుండి బుట్టిన వైశ్య నా వంశమని తోడు దొంగలయి దోసుకోమన్నావు

అంటూ మనువాదానికి ప్రతివాదం మా డక్కలి, చిందు, ఆదిమాదిగజాంబవ పురాణమని తెలియజేస్తూ అనేక పాటలు రాయడం జరిగింది.

ఈ విధంగా దళిత, బహుజన, మహిళ, సామాజిక అంతరాలపై అనేక పాటలు సరళమైన సామాన్య మానవునికి సైతం అర్థమయ్యే భాషలో అద్భుతమైన దళిత చైతన్య రచనలు చేయడం జరిగింది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్న వచన కవిత్వం దళిత దృక్పథం

– డా॥. ఐ. తేజోవెళ్ళి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.

తెలుగు సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు ఉన్నాయో, ఎన్ని ఉద్యమాలు ఆవిర్భవించాయో, అన్నిటిలో భీమన్న సిద్ధహస్తులు. ఆయన పద్యం రాసినా, వచనం రాసినా దళిత అభ్యుదయాన్ని కాంక్షించారు.

దళిత వచన కవిత్వం కారంచేడు సంఘటన తర్వాత ఉద్యమ రూపాన్ని పొందింది. అంతకు పూర్వమే బోయి భీమన్న దళిత ఉద్యమ స్ఫూర్తితో దళితులలో పోరాట పటిమను, చైతన్యాన్ని రగిలించడానికి వచన కవిత్వం రాశారు. ఆచార్య ఇనాక్ 1979లోనే ఆధునిక భారత దేశంలో నాగరికత ముసుగులో జరుగుతున్న అనాగరిక వ్యవస్థను నిరశిస్తూ, దళితుల్ని ప్రగతి వైపు నడిపించే విధంగా కవిత్వం రాశాడు.

బోయి భీమన్న వచన కవత్వం గురించి ఆచార్య టి. గౌరీశంకర్ చెబుతూ "భీమన్న ఇజాలకు, భేషజాలకు కట్టుబడి నిజాన్ని నిర్భయంగా, నిర్మోహమాటంగా చాటుతారు. ప్రకృతి పురుషులు ప్రణయం, ఆత్మ పరమాత్మల ఐక్యం, అలౌకిక భావనా ప్రపంచం, రసానుభూతి, రసానందం, రసాద్వైతం, లౌకిక వస్తుజాలం, వ్యక్తి సమూహం, సామాన్యుని వేదన, సామాజిక సమస్యల చిత్రణ, అట్టడుగు మనిషి ఆక్రందన అన్నీ అతని కవిత్వంలో అక్షరాకృతిలో సాక్షాత్కరిస్తాయని" ప్రశంసించారు.

భీమన్న అభిప్రాయంలో కవిత్వం ఒక ప్రక్రియకు, భాషకు బందీ కాదు. అదొక స్వేచ్ఛా సుందర మధుర భావన అంటారు.

"ఆకాశంలో పద్యంగా ప్రవహించిన వాణ్ని
దూకి గేయంలో పడ్డాను!
అక్కడి నుండి గెంతి, గద్యం మీద పడ్డాను!
కవిత్వం ఒక ప్రక్రియకు ప్రేయసి కాదు.
ఒక భాషకు బందీ కాదు.
ఒక స్వేచ్ఛా సుందర మధుర భావన" అంటారు.

బోయి భీమన్న 1962లో 'అనాది కొన నుంచి అనంతత్వంలోకి' అనే వచన కవితా సంపుటిని ప్రచురించారు. ఇందులో కొన్ని ఆత్మాశయాలు, కొన్ని ప్రకృతి వర్ణనలకు చెందినవి. మరికొన్ని తాత్విక, వ్యంగ్య సంబంధమైనవి ఉన్నాయి. ఇంకా భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వ ధోరణులు కూడా కనిపిస్తాయి. ఈ కవితల్లో భీమన్న ఎక్కువగా ప్రణయాన్ని, ప్రేమతత్వాన్ని మేళవించి చెప్పడనికి ప్రయత్నించారు. దీనితోపాటు తాత్విక విషయాలను భావ గాంభీర్యాన్ని అందించారు. ప్రకృతి పరిశీలన శక్తి కలిగి, భావ పుష్టితో రసరమ్యంగా వ్యక్తీకరించారు.

భీమన్న వ్యక్తీకరించిన భావాలు భావకవిత్వానికి దగ్గరగా ఉన్నా, అందులో వీలైనంత వరకు దళితుల కష్టాల్ని చెప్పడానికి ప్రయత్నించారు. షేక్స్ ఫియర్ డ్యూక్ అనే రాజు చేత 'స్వీట్ ఆర్ ది యూజెస్ ఆఫ్ అడ్వర్సిటి' అని చెప్పించారు. అంటే కష్టాల్లో అభ్యుదయాల్ని చూడమని భావం. ఈ భావానికి దగ్గరగా ఉండే ఆనందాన్ని భీమన్న వ్యక్తీకరిస్తారు.

'పువ్వుల కంటే లెక్కకు ముళ్ళే ఎక్కువ
ఈ నా గులాబీ తోటలో అందుకని
ముళ్ళతోట అననా దీన్ని? అంటారు.

కష్టాలు సర్వసాధారణంగా వస్తుంటాయని దాన్ని ప్రతిఘటించి చైతన్య వంతులై సుఖాన్ని పొందమని దళితుల్ని చైతన్య పరుస్తారు భీమన్న.

"లక్ష ముళ్ల పాదల్ని భరించి
ఒక్క తోటైనా పెంచుకొందాం
లక్ష అపస్వరాల్ని సహించి
ఒక్క పాటైనా పాడుకుందాం

లక్ష కోరికల్ని పరిహరించ

ఒక్క మాటైనా కలుసుకొందాం!' అనటంలో లక్ష్య సాధన కోసం ఎన్ని కష్టాలనైనా భరించాలని, ఎదురైన ఎన్నో అవమానాల్ని సహించాలని, కోరికల్ని చంపుకొని ఐక్యంగా పోరాడటానికి ముందుకెళ్లాలన్న ప్రతిఘటనాత్మక చైతన్యాన్ని ఈ కవితలో చొప్పించారు.

'దివారాత్రాలు' అనే ఖండికలో తాను జీవిస్తున్న జీవనాన్ని, బ్రతుకును నిందించకుండా, చావుకు భయ పడకుండా అందులోని సౌందర్య విలసితాలైన ప్రయత్నించాలని ఉద్బోధిస్తారు.

'తపస్సులోకి' అనే ఖండికలో దళిత జీవనాన్ని మల్లె మొగ్గతోను, గులాబి పూవుతోను,ఉపశమించి తన నెంతగా నాశనం చేయాలని ప్రయత్నించినా, మోడుగా తయారు చేయాలని ప్రయత్నం చేసినా, తపస్సులోకెళ్లి తిరిగి పుష్పిస్తానని చెప్పడంలో అణచివేయబడ్డ దళితుడు తన స్థితికి వగచి మోడుగా పడి ఉండకుండా తిరిగి పుష్పించటానికి లేదా బ్రతకటానికి కావలసిన అన్ని శక్తుల్ని కూడగట్టుకొని ముందుకెళ్ళాలన్న సందేశం ఆ కవితలో కన్పిస్తుంది.

'తపస్సు చేసుకొంటూ
నాలో నేను జీవించినప్పుడు
అంకురించాను మల్లెమొగ్గగా,
వికసించాను గులాబి పువ్వుగా
ఫలించాను రసాలగా!
కన్ను తెరచి
లోకంలో బ్రతకడం ప్రారంభించి
గిల్లి వేసుకోబడ్డాను రాత్రి అందం కోసం!
మాల గ్రుచ్చబడ్డాను మహాసభ గౌరవం కోసం
ఇంధనమై పోయాను లోకం ఆకలి మంటలో!

బోయి భీమన్న 1973 ప్రచురించిన మరొక వచన కావ్యం గుడిసెలు కాలిపోతున్నై. దీనికి 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. గుడిసెల్లో పుట్టి, గుడిసెల మధ్య పెరిగిన భీమన్నకు గుడిసెలు ఎందుకు కాల్తాయి. ఆ గుడిసెల స్థానంలో వేరే గుడిసెలు ఎలా లేస్తాయి మొదలైన విషయాలు కూలంకుషంగా తెలుసుకొని ఈ సంపుటిలో రాశారు.

వర్ణాశ్రమ ధర్మవ్యవస్థ వేళ్ళు తన్నుకున్న ఈ సమాజంలో గుడిసెలు, గుడిసెవాసులు ఉండడానికి ప్రధాన కారణం వారి అజ్ఞానమే అంటారు భీమన్న. అందువల్ల ఆ వ్యవస్థను రూపుమాపడానికి ఆ వ్యవస్థ ధర్మాన్ని, రూపాన్ని మన కళ్ళ ముందు ఉంచుతారు భీమన్న.

గుడిసెలు కాలిపోతున్నై
ఓహో కాలిపోతున్నై
ఎవరి గుడిసెలో పాపం
మాల మాదిగలవే అయివుంటై
గుడిసెలు మరి ఎవరికుంటె?
చాలా మందికే ఉంటైలే
అసలు ఈ దేశ ధర్మమే అంత
అయితే ఈ గుడిసెలు
ఏడాది కొకసారైనా కాలిపోతుంటె
ఒకసారి కాలిపోయిన గుడిసెలు
మరి మళ్ళీ కాలిపోవడానికి
ఎక్కడి నుంచి వస్తుంటై?
అవును నిజమే
ఎక్కడి నుంచి వస్తుంటె
అదే మన ధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటె
పోతుంటై పుట్టుకొస్తుంటై"

గుడిసెవాసులైన మాల మాదిగలు అందులో ఉన్నతంవరకు వారికి తమకు జరుగుతన్న అన్యాయాన్ని తెలుసుకునే అవకాశం లేదు. అందులో ఉన్నంత వరకు తమ గుడిసెలు కాలిపోవడం తిరిగి వాటిని నిర్మించడం, మరల గుడిసెలు కాలిపోవడం అనే విషవలయం

సాగిపోతూ ఉంటుంది అంటారు కవి ఇక్కడ విష వలయం అని ఎందుకంటున్నాడో గమనించవలసిన అవసరం ఉంది. దళితులు గుడిసెల్లో ఉంటూ పేద రికాన్ని అనుభవించాలే కాని వాటి నుండి బయట పడటానికి ఈ సమాజం అవకాశాన్ని కల్పించదు. అంటే దళితుల అభ్యున్నతిని కాంక్షించకుండా వారిని ఆ స్థితిలోనే ఉంచి వాటి చుట్టూ ఓ విషవలయాన్ని ఏర్పరచడాన్ని భీమన్న పరోక్షంగా నిందిస్తారు. ఈ కాలిపోతున్న గుడిసెల స్థానంలో మరో గుడెసెను నిర్మించకుండా గుడిసెల స్థానంలోనే భవనాలు లేపుకోవాలని భీమన్న అభిలషిస్తారు. కాలిపోతున్న గుడి సెల స్థితిలో నుంచి కొత్త ఉగాది పుట్టుక రావాలని కోరుకుంటాడు. పాతది గతించకుండా కొత్తదానికి దారే ఉండదని కాలిపోయిన గుడిసెల స్థానంలో మరో గుడిసె లేస్తే అది అభ్యుదయ కారకం కాదని భీమన్న అభిప్రాయం.

తిండి దొరకపోతే, బట్టలేకపోతే, కొంప లేకపోతే కృషించిపోనవసరం లేదని పరిస్థితులను తనకు అను కూలంగా మలచుకొని ముందుకెళ్లాలని హీన పరిస్థితుల నుండే మేలైన వాటిని సాధించుకోవడానికి కృషి చేయాలని 'నాకు పేదరికం లేదు' అనే గేయంలో స్పష్టం చేశారు.

'నాకు తిండి దొరక్కపోతే
నేను పస్తులుండను
ఉపవాసాలు చేస్తాను!
నాకు పేదరికం లేదు
నాకు బట్ట దొరక్కపోతే
నేను చింకి పాతలు కట్టను
దిగంబరోద్యమం నిర్వహిస్తాను!
నాకు పేదరికం లేదు
నాకు కొంప దొరక్కపోతే
పేవు మెంట్లపై కూర్చోను

శ్రీ శుక మహర్షినే అవుతాను! అని బోయి భీమన్న అంబేడ్కర్ భావాల్ని తన కవితలో చొప్పించి దళితుల్ని చైతన్యవంతం చేయడానికి పూనుకుంటారు.

ఆధార గ్రంథాలు :

1. బోయి భీమన్న సాహిత్య షష్టిపూర్తి సంచిక.
2. అనాది కొస నుంచి అనంతత్వంలోకి - భీమన్న.
3. గుడిసెలు కాలిపోతునై - భీమన్న.
4. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - డా॥ నమశ్శివాయ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గబ్బిలం కావ్యంలో – దళిత స్పృహ

– **దత్తి రెహూరెహ్ల,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

"నాకు గురువులు ఇద్దరు పేదరికం కులమతబేధం ఒకటి సహనాన్ని నేర్పితే రెండవది నాలో ఎదురించే శక్తిని పెంచింది".

- జాషువా

సాహిత్యంలో అనేకానేక ప్రక్రియలు కవితా ధోరణులు ఆయా కాలానుగుణ పరిస్థితులను బట్టి మారుతూ వచ్చాయి. సాహిత్యానికి సమాజానికి అవినావభావ సంబంధం వలన కొన్ని వాదాలు సమాజ స్థితి గతులు అలాగే అప్పటి సమాజాన్ని కళ్ళకు కట్టే ప్రయత్నం చేసాయి. సంఘసంస్కరణోధ్యమం, అభ్యుదయ, భావ, విప్లవ, దిగంబర, స్త్రీ, దళిత, మైనారిటీ, వాదాలతో సహ ప్రతి ధోరణిలో సాహిత్యం అనేది కథ నాటకం నవల కవిత రూపంలో ఎన్నో సమస్యలను ఎత్తి చూపుతూ సమాజ లోపాలను దాని ప్రభావ గాడతను కళ్ళ ముందు ఉంచాయి. అలా సామజిక సమస్యలను ఎలిగెత్తి నిరసించిన కవుల్లో గుర్రం జాషువా ఒకరు.

"సహజమైన ప్రకృతి సౌఖ్యంబు లొకవ్యక్తి దొంగలించి మనుట దొసగు నాకు అంటూ సమతత్వం ఆలపించిన మహాకవి నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా. కవి సామ్రాట్ జాషువా 1895 సెప్టెంబర్ 28న వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించారు. తన తల్లిదండ్రులు వేర్వేరు కులాలకు చెందిన వారు కావడంతో తన విద్యా భాస్యంలో అనేక కష్టాలు, అవమానాలు, చీత్కారాలు ఎదుర్కొన్నారు. జాషువా అనేక రచనలు రాశారు. కొక్కొల్లలుగా ఖండకావ్యాలు రాశారు. వాటిలో గబ్బిలం (1941), ఫిరదౌసి(1932), క్రీస్తు చరిత్ర అతి ముఖ్యమైనది. ఇదే కోవలో లఘుకావ్యాలు కూడా ఉన్నాయి. కందుకూరి వారి జీసస్ చరిత్రను రాస్తే జాషువా క్రీస్తు చరిత్ర రాశారు. జాషువా సమాజంలోని హెచ్చుతగ్గులను వెతికి దానికి గల కారణాలను పరిశీలించి, అనేక కోణాల నుంచి ఆలోచించి తన కంఠంలోని ఆవేదనను కవిత్వ మార్గంగా ఎంచుకున్నారు. అదే జాషువా "గబ్బిలం" కావ్యానికి శ్రీకారం. దళితులకు జరుగుతున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటడం కోసం జాషువా గబ్బిలం రాశారు. గబ్బిలం కావ్యం 'కాళిదాసు' మేఘసందేశం తరహాలో సాగుతుంది. అయితే గబ్బిలం కావ్యంలో సందేశాన్ని పంపేది యక్షుడు కాదు.. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును సమాజానికి వినిపించడమే కథాంశం.

మేఘసందేశం కావ్య స్ఫూర్తితో రచింపబడిన కావ్యం గబ్బిలా అక్కడ మేఘం సాధనమైతే ఇక్కడ జాషువా గబ్బిలానికి తన వ్యధను అంతటిని మొదట తన వ్యధను అంతటిని కూడా తెలియజేస్తాడు. అలాగే ఎన్నో అందమైన పక్షులు ఉండగా గబ్బిలాన్ని మాత్రమె ఎంచుకోవడం అనేది దళిత దీన జాతికి అడ్డం పట్టడం లాంటిది. ఈ కావ్య విశిష్టత అంతా ఇందులోనే ఉంది. హరిజనుడు తాను నివాసమున్న తంజావూరు దక్షిణ భూముల నుండి తంజావూరు , నెల్లూరు, హంపీ గుంటూరు మండలం, రాజమహేంద్రవరం, ద్రాక్షారామం, బొబ్బిలి, విజయ నగరం, ఒరిస్సా, నలందా, పాటలీ పుత్రం, ఢిల్లీ, ఆగ్రా,కురుక్షేత్ర మొదలైన ప్రాంతాలమీదుగా కైలాస పర్వతాలకు వెళ్లే మార్గాన్నిగురించి గబ్బిలానికి ఆయా ప్రాంతాల విశేషాలను, దర్శనీయ స్థలాలను వర్ణిస్తూ చెప్పటంగా సాగిన మిగిలిన కావ్య భాగపు విషయం.

చిక్కినకాసుచే దనివి జెందునమాయికు డెల్లకష్టముల్
బొక్కెడు బువ్వతో మఱచిపోవు క్షుధానల దగ్ధమూర్తిన
ల్దిక్కులుగల్గులోకమునదిక్కరియున్నయరుంధతీసుతుం
డొక్కఉడు జన్మమెత్తె భరతోర్వరకుం గడ(గొట్టు బిడ్డ(డై"

తన పడ్డ శ్రమకు ఎంత ప్రతిపలం వస్తే దానితోనే సరిపెట్టుకొనే వాడు తన పడ్డ శ్రమకు ఎంత వస్తుందో కూడా తెలియని అమాయకుడు. ఒక ముద్ద భోజనంతో తన కష్టాలు అన్ని మరిచిపోయే స్వభావం కలవాడు నలుగు దిక్కులో ఏఆ దిక్కు కూడా లేనివాడు పేరుకు భరతమాత పుత్రుడు అయిన పిలవబడేది మాత్రం అరుంధతి సుతుడుగానే అన్న ఈ మాటలు దలిత జీవనాన్ని అస్పృశ్యతను ఎదుర్కొంటున్న ఒక జాతి జీవనాన్ని సమాజానికి కళ్ళకు కట్టినట్లు చూపించడంలో ప్రధాన పాత్ర ను జాషువా తన మొదటి పద్యంలోనే పరిచయం చేస్తాడు.

"వాని ఱెక్కల కష్టంబు లేనినాఁడు
సస్య రమ పండి పులకింప సంశయించు
వాఁడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము (బెట్టు వానికి భుక్తిలేదు"

వాడు కష్టపడకపోతే సకల జనానికి తిండి లేదు వాడి చెమటవోడ్చానిదే లోకాని భుక్తి లేదు వాడు అంత శ్రమ పడి అందరికి తిండి పెడుతున్నప్పటికీ కూడా వాడికి కనీసం తినడానికి తిండి లేదన్న విషయం గుర్తు చెయ్యడం దళితల పై పెత్తందార్ల అధికారం దోపిడి ఏ స్థాయిలో జరుగుతుందో అన్న విషయాన్ని మరియు సమాజంలో వారి స్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించారు.

వాని తలఁమీదబులిమిన పంకిలమును
గడిగి కరుణింపలేదయ్యె గగనగంగ
వాని నైవేద్యమున నంటు వడిన నాఁడు
మూడు మూర్తులకును గూడ గూడు లేదు

చివరికి వాడి తల మీద ఉన్న పంకిలన్ని కడిగి కరుణినిద్దాం అని ఆకాశ గంగ కూడా అనుకోదు ఒక వేల అల అనుకోని ఆ పంకిలన్ని కడిగితే దాని వలన తను మైల పడి త్రిమూర్తులకు కూడా అది అంటు కొంటుందని ఆ అభాగ్యని అస్పృశ్యత దేవతలకు సైతం ఉంటుంది అని దేవతల కటాక్షం కూడా ఆ అభాగ్యుడు మీద లేదని నాటి అంటరాని పరిస్థితులకు దేవతలు కూడా ఈ అంటరాణి వాడి ప్రసాదం తింటే మైలాపడ తారని సూచన ప్రాయంగా తెలిపారు జాషువా.

ప్రవిమల దేవతాభవన వానముచేయుచు
మమ్మువంటి మా
నవులకు లేని గౌరవమునం దులదూఁగెడు
గబ్బిలాల రా
ణివిగద నీవు స్వాగతము నీకు శుభంబకదమ్మ
నీతనూ
భవులకుఁ దల్లక్రిందుల తపంబులకున్ గుడి
గోపురాలకున్

గబ్బిలాన్ని తన ఇంట్లోకి ఆహ్వానిస్తూ ఓ పక్షి రాజా సాధారణ మనషులకు కూడా అందని వరం నీకు మాత్రమే ఉన్నదీ ప్రవిమల దేవాలయంలో నివసిస్తున్నావ్ మాములు మనుషులు పొందలేని గౌరవాన్ని పొందుతున్న గబ్బిలాల రాణివి నీ కొడుకులకు తల కిందులగా చేసే తపస్సు గుడి గోపురాలకు శుభమే కదా అంటూ తను ఉన్న అస్పృశ్యత పరిస్థితుల కంటే గొప్పగా దేవాలయల్లో తపస్సు చేస్తూ నివశిస్తున్న నువ్వు నాలాంటి అభాగ్యుడి దగ్గరకు ఎందుకొచ్చావ్ అని తన దీన స్వరంతో గుర్తు చేస్తాడు.

పతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు
వ్యయించుఁగాని దుఃఖితమతు లైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్చు దీ భరతమేదిని ముప్పది మూఁడుకోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తు లాఱునే

ముప్పయ్యి మూడుకోట్ల మంది దేవతలకు మన దేశంలో రోజు పూజల పేరిట ప్రసాదం దొరుకుతుంది, అలాగే బొమ్మల పెళ్ళిళ్ళు చేయడానికి కూడా ఖర్చుకు వెనుకాడని ఈ భూమిలో భాగ్య విహీనులకు రోజుకు ఒక పూట కూడా ఆహారం దొరకని ఆకలిచే బాధపడు తున్న పేదల పకీరుల పాత్రలలో ఒక మెతుకు కూడా

దొరకట్లేద్ని నిరసించిన విధానం నాటి సామాజిక పరిస్థితులకు దర్పణం.

ఆ యాభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఉ
గసిరి బుసకొట్టు నాతని గాలిసో(క
నాల్గు పడగల హైందవ నాగరాజు"

అని ఏక కాలంలో దళితుల మీద జరుగుతున్న ఆర్థిక దోపిడీని, అమలవుతున్న అస్పృశ్యతను నిరసించాడు. నాలుగువర్ణాల హిందూ మత వ్యవస్థ నా సృష్టే అని సాక్షత్తు భగవంతుడే చెప్పాడు దానికిక తిరుగులేదు అనుకునేవాళ్లను సవాల్ చేస్తూ జాషువా ఐదో వర్ణాన్ని సృష్టించి పాలిమేరల అవతలికి వెళ్లగొట్టిన హిందూమత విద్వేష స్వభావాన్ని 'నాల్గు పడగల హైందవనాగరాజు' అన్న ప్రయోగంతో బట్టబయలు చేసాడు.

మహాకవి జాషువా ఆధునిక కవితా యుగ ప్రవర్తకుడు. కవిత్వంలో నూత్నప్రత్యామ్నాయ ఆవిష్కరణలు చేసిన ప్రయోక్త. సామాజిక జీవితంలోని వైవిధ్యాలకు అద్దం పట్టిన చిత్ర కారుడు. అస్పృశ్యతా భారతంలోని వేదనను అక్షరదృశ్యాలు చేసి, ఆకాశ నక్షత్రాలుగా వెలిగించిన సృష్టికర్త. గతించి అర్ధ శతాబ్ది అయినా కవికి మరణం లేదని నిరూపించిన పునరుజ్జీవుడు. వస్తువు ఏదైనా శృతిహితంగా తెలుగు నుడికారపు సొగసుతో చెప్పగలిగిన ధీశాలి. 'రాజు మరణించె ఒక తార రాలిపోయే. సుకవి మరణించె ఒక తార గగనమెక్కే 'రాజు జీవించు రాతి విగ్రహ ములయందు. సుకవి జీవించు ప్రజల నాల్కుల యందు' అని చెప్పిన జాషువా ప్రజల నాల్కుల మీద నర్తిస్తున్నాడు.

భారతీయ సంస్కృతిపై మాయని మచ్చలా నిలిచిన ఈ ఆచారం ప్రజల నరనరాల్లో జీర్ణించుకుపోయింది. తారతమ్యాలు తెలియని లేతమనసుల ఆటపాటల్లో కూడా ఈ అసమానతని ఉగ్గుపాలతో పట్టించిందీ సమాజం. మధ్యయుగంలో వీరశైవ, వీరవైష్ణవాలు, ఇస్లాం కొంత వరకూ నిమ్నజాతుల్లో చలనశీలతకి అవకాశ మిచ్చినా ఆధునిక యుగారంభానికి కులవ్యవస్థ బిర్ర బిగునుకుంది. దాని ప్రభావం సాహిత్యంలో ఎన్నో రచనలతో దళితుల సమస్యలను వర్తమాన సమాజంలో వారి ఆర్థిక సాంఘిక పరిస్థితులను కూలంకషంగా తెలపడంతో పాటు సమాజంలో ఉన్న అసమానత్వాన్ని నిలదీసే దిశగా అడుగులు వేసింది అని చెప్పవచ్చును.

ఆధార గ్రంథాలు :

1. గబ్బిలం - జాషువా
2. తెలుగులో కవితోద్యమాలు - తెలుగు అకాడమి
3. దళిత సాహిత్య తత్వం - శిఖామణి
4. జాషువా కవిత్వంలో దళిత సమస్య - రాజకీయార్థిక దృక్పథం(నీలిరాగం వ్యాసాలు) - కాత్యాయని విద్మహే

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పంచముల నాదం - పంచమ వేదం

- ఎం. ప్రదీప్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

భారతదేశం భిన్న సంస్కృతులకు, మతాలకు, వర్ణాలకు నిలయం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించుకునే దిశలో ఎన్నో మైలురాళ్ళను అధిగమిస్తూనే అక్కడక్కడ అప్పుడప్పుడు కొన్ని చెదురుమొదురు సంఘటనలను ఎదుర్కొంటూ సమాజం కొన్ని ఉద్యమాలకు ఊత మిస్తుంది. ఈ ఉద్యమ సారాన్ని అక్షర బద్ధం చేసేది. సాహిత్యం. కావున సాహిత్యం ఉద్యమం - సమాజం ఒకదానిపై ఒకటి అవినాభావ సంబంధం కలిగి ఉన్నా యని చెప్పుకోవచ్చు. ఇలా దేశంలో జరిగిన అనేక ఉద్య మాలలో సాహిత్యోద్యమాన్ని ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఇందులో భాగంగా ఆంధ్రదేశంలోనూ ఎన్నో రకాల సాహిత్యోద్యమాలు పురుడు పోసుకున్నాయి. ఈ క్రమంలో అస్థిత్వ వాద నినాదంతో ప్రారంభమై అంచెలంచెలుగా ఉద్యమ స్ఫూర్తిని పొంది తారాజువ్వలా సాహితీ వినిలా కాశంలో ఉవ్వెత్తున ఎగిసినది దళిత సాహిత్యోద్యమం. అణచివేతకు అస్పృశ్యతకు గురి అయి వెలివాడల్లో వెతలు అనుభవిస్తూ, ఛీత్కారాలకు చలించిపోయిన దళితులు వినిపించిన విస్పష్టమైన గొంతుక దళిత సాహిత్యం రూపంలో ప్రస్ఫుటమయింది.

దళితులు తామెక్కడి వారమని వెతుక్కునే క్రమంలో ఎన్నో విషయాలు వీరి ప్రశ్నలకు సమాధానాలు కాక ప్రశ్నల రూపంలోనే తిరిగి ప్రశ్నించాయి. "చాతుర్వర్ణమ్ మయా స్పష్టమ్ గుణకర్మ విభాగశ:" అని భగవద్గీత చెప్తుంది. ఆది పురుషుని ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని ఋగ్వేదంలోని పురుషసూక్తం చెప్తుంది. ఇలా చెప్పబడిన నాలుగు వర్ణాలే కాక ఈ అయిదవ వర్ణం ఎక్కడదని దళిత కవులు సూటిగా ప్రశ్నించారు. పురాణాలలోనూ, ఇతిహాసాలలోనూ, అణచి వేతకు అస్పృశ్యతకు గురికావడమే కాకుండా వంచనకు వంచములే బలి అయ్యారని తెలియవస్తున్నది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు తప్ప తక్కిన వారందరూ శూద్రులే. కానీ నేటి జనవ్యవహారంలో శూద్రులు అంటే హరిజన, గిరిజన, అరుంధతీయులే అన్న భావం స్థిరపడిపోయింది.

ఇలా పంచములు చరిత్రను తరచి చూచిన దళిత కవులలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ కవి సతీష్ చందర్ గారు. వీరు 1958 అక్టోబర్ 29న పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో జన్మించారు. వర్ణాధిక్య సమాజంలో విచక్షణను చవిచూసిన వీరు సమాజాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వర్ణ సమాజానికి మూలాలు ఎక్కడున్నా యని, వాటికి పరిష్కార మార్గం ఏమిటని వెతికేందుకు ఎంతో కృషి చేశారు. స్వయంగా తాను పత్రికా రంగంలో పనిచేస్తుండటం వలన సమాజాన్ని దగ్గరగా చూసిన విస్పష్టమైన అవగాహనతో నిబద్ధత గల కవిత్వం అందించారు. పంచములని పిలువబడే దళితులకు కరదీపిక వంటిది సతీష్ చందర్ గారి పంచమవేదం. ఈ కవితా సంపుటిని 1995 సం॥లో అచ్చువేశారు.

ఈ పంచమ వేదం కవితా సంపుటి దళిత కవిత్వానికి మంచి ఊతమిచ్చింది. ఇందులోని మొదటి కవిత అయిన పంచవేదం కవిత మొత్తం కవితా సంపుటికే మణిపూస వంటిదని చెప్పుకోవచ్చు. ఈ కవితలోని వస్తువు దళిత జీవనానికి చెందినది. ఉత్తమ పురుషలో సాగిన ఉత్తమోత్తమ కవిత పంచమ వేదం, ఇది గురువుల కులపిచ్చికి బలయిపోయిన విద్యార్థులు దాకే బాలాజీ, డొక్కా, పద్మనాభరావులకు అంకితం.

నాలుగు వర్ణాల్లో చోటులేని వారు, అంటరానివారిగా సమాజం చేత అస్పృశ్యతకు గురి అయిన వారి వేదనను

ఈ కవితలో చిత్రించారు. భారతదేశంలో నాలుగు వేదాలు, నాలుగువర్ణాలే ఉన్నాయి. కానీ పంచమ వేదం లేదు. పంచమ వర్ణం లేదు. అయినా పంచములుగా పిలువబడుతున్న దళితుల పక్షాన గొంతు వినిపించింది సతీష్ చందర్ గారి పంచమ వేదం. ఈ కవితలో ప్రధానంగా ఏకలవ్యుడు, కర్ణుడు కనిపిస్తారు. కులం చేత అవమానించబడిన వీరని చిత్రిస్తూ అనాదిగా దళితుల పట్ల కొనసాగుతున్న దమన కాండను స్పష్టం చేశారు.

ఈ కవితలో మొత్తం ఐదు భాగాలున్నాయి. ఈ భాగాలను చేతికి గల ఐదువేళ్ళుగా అభివర్ణించుకోవచ్చు. సమాజంలో వివక్షత ఎలా ఉన్నా సరస్వతికి నిలయమైన విద్యాలయాల్లో వివక్ష కూడదని, గురువులకు సమభావం ఉండాలని ఇంక ద్రోణుల వంటి విద్యార్థి ద్రోహులు ఉండరాదని ఈ కవిత నిర్ధిష్టంగా తెలియజేస్తున్నది.

ఈ కవితను ఒక లేఖ రూపంలో రాయడంలో కవి యొక్క హృదయం ఆవిష్కృతమవుతున్నది. సాహితీ లోకానికా లేక దళితుల నూరేళ్ళ జీవితానికా అని ప్రశ్నించుకోవాలి. నూరేళ్ళకు పదిహేడు మార్కులు అని ప్రారంభించడంలో పదిహేడేళ్ళకే వారికి నూరేళ్ళు నిండా యనే ధ్వని ద్యోతకమవుతున్నది.

ఈ కవిత ప్రతిభాగం చివర ఏకలవ్యుని గురించి చెప్పి ముగిస్తాడు కవి. ఐదవ వేలు, ఏకలవ్యుని చూట్టునే ఈ కవిత నడుస్తుంది.

సంపూర్ణంగా చేయి అన్ని పనులు చేయగలగాలంటే ఐదువేళ్ళు ఉండాల్సిందే. ద్రోణుడు వంచనతో తీసు కున్నది ఒక వేలే కావొచ్చు కానీ ఆ వేలి అవసరం ఈ చేతికి ఎంతవుందో మా అవసరం కూడా సమాజానికి అంతే ఉందని తెలియజేసిన కవిత పంచమవేదం. కవితలో ఒక దగ్గర కొత్తగా క్యాస్ట్ సర్టిఫికేట్ తెచ్చుకుని క్లాసులో చేరిన కర్ణుడు అంటూ ప్రస్తావిస్తాడు. నిజానికి భారతంతో ఎక్కువ అవమానాలకు అద్దం పట్టే పాత్ర కర్ణుడే రారాజు ఆదరించినా రాధేయుడుగానే అవమానింపబడ్డాడు.,

చాతుర్వర్ణాల వారు రకరకాల అవయవాల నుండి పుడితే మేము మాత్రం మా తల్లికే పుట్టాం అని గర్వంగా చెప్పారు. గురువుల దాష్టికానికి గురి అయిన విద్యార్థు లను దహించినది కిరోసిన్ కాదని అభిమానం అని ఆర్ధ్రతగా వినిపించారు.

మొత్తం మీద సతీష్ చందర్ గారి పంచమ వేదం కవితను చదువుతుంటే ఒకింత ఉద్విగ్నతకు గురుకాక తప్పదు ఆధునిక కవులకు కవితా వస్తువు వ్యదార్థ జీవుల యదార్థగాధలే. అందునా దళిత కవుల సాహిత్య సృష్టికి ఈ వ్యధార్థ జీవితాలతో పాటు సమాజంలో సామాజికంగా వారు అనుభవించిన విచక్షణ జతయి, ఆర్ధ్రత తోడయి హృద్యతను సంతరించుకుంటాయి. సమాజంలో పంచములుగా ముద్ర వేయించుకుని పలు రకాలు పరిస్థితులను ఎదుర్కొంటున్న పంచముల నాదమే పంచమవేదం.

ఈ పంచమ వేదం కవితను అందరూ చదివి విద్యాలయ్యాల్లో ఎటువంటి వివక్షతకు తావివ్వరని ఆశిస్తూ మనందరి కోసం ఈ కవిత

పంచమ వేదం కవిత :

నూరేళ్ళకీ పది హేడు మార్కులే వేసి
జీవితంలో తప్పించిన గురుదేవులకు
చేతులు జోడించి వ్రాయునది
'నీకు చచ్చినా అర్ధంకాదురా' - అని
మీరు తిట్టుకొంటూ చెప్పిన వేళ్ళ మీద లెక్క
నాకు చచ్చాకనే అర్థమయ్యింది.
నేనెన్నిసార్లు లెక్క పెట్టుకున్నా
నాచేతికి నాలుగువేళ్ళే వుండేవి.
నాన్నకి కూడా అయిదోవేలు లేకనే మీరు
గుండుసున్నలు చుట్టిన ప్రోగ్రెస్ రిపోర్టు మీద
ఎప్పుడూ వేలిముద్ర వెయ్యలేదు.
పుచ్చపువ్వల్లాంటి వెన్నెల రోజున కూడా ఆ వేలు లేకనే
అమ్మ గోరుముద్దలు తినిపించలేదు.
నేను తెల్లముఖం వేసినప్పుడెల్లా

మీరదేదో అమృత భాషలో తిట్టేవారు.
నాకన్నం తప్ప అమృతం సయించదు. నిజం చెప్పండి
పంచముడంటే అయిదోవేలు లేనివాడనేనా అర్థం ?
మా ముత్తాత ఏకలవ్యుడు చెప్పాడు

మీకు ఫీజు ఇవ్వకుండా మరణించినందుకు మన్నించండి
ఏమివ్వమంటారు?
ప్రాణాలే యిద్దామంటే -
ఇంతవరకూ నాబొందిలో తల దాచుకొని మైల పడ్డాయి.
అదీకాక మీకు తలంటు రోగం! పోనీ,
అతి సున్నితమైన నా మనోఫలకాన్ని మీకిచ్చేద్దామంటే
నా చావు మీకొచ్చిపడుతుంది.
ఎలా చూసినా మీకు నా దిష్టిబొమ్మ నివ్వడమే ధర్మమనిపిస్తోంది.
ఏ గాంధీ జయంతినాడో మీరు చేసే సహపంక్తి భోజనమ్మీద
చెడుచూపు పడకుండా కాపాడుతుంది.
ఏకలవ్యుడు కూడా భారతంలో ఓ దిష్టిబొమ్మ

మా క్లాసులో పాండవుల్నీ, కౌరవుల్నీ అడిగినట్లు చెప్పండి
కొత్తగా కేస్ట్ సర్టిఫికెట్ తెచ్చుకొని క్లాసులో చేరిన కర్ణుడికి
నా సానుభూతిని తెలియజేయండి.
ప్రతిభావంతులు వాళ్ళు మీ శ్లోకాలకు చప్పట్లు కొట్టేవారు.
నాకు మాత్రం అవి తిట్లులా అనిపించేవి.
నిజం చెప్పాద్దూ
మనుధర్మాలు వాత్సాయన కామసూత్రాల్లా వినిపించేవి.
దేవుడి నాలుగు శరీర మర్మాలూ
అశ్లీల భావ చిత్రాల్లా కనిపించేవి.
నా జన్మరహస్యం మీ శాస్త్రాల్లో రాయనందుకు నేనెప్పుడూ కృతజ్ఞుణ్ణే.
నన్నేవగించుకోవడానికి మీ నిఘంటువుల్లో
శాపనార్థాలు దొరకనప్పుడెల్లా
నా తల్లి మాటే మీనోట్లో నానుతుండేది
పోనీలెండి, దూషణలోనైనా నా తల్లికే నేను పుట్టానని ఖరారు చేశారు.
ముమ్మాటికీ మేం తల్లికి పుట్టిన బిడ్డలమే. అవ్మో మాకు దైవం
గొప్పిళ్ళు వెలివేసిన కుంతెమ్మనయినా
మా యిళ్ళకొస్తే గొంతెమ్మను చేసి కొలుచుకుంటాం
ఏకలవ్యుడు దేవుళ్ళకు కాకుండా తల్లికే పుట్టాడు

నన్ను దహించింది కిరోసిన్ కాదూ -
అభిమానమేనని పత్రికల వాళ్ళతో చెప్పండి.
మంటల్లో కాలినప్పుడు నా శరీరమే నాకు కంపు కొట్టింది.
అచ్చంగా బతికున్న మీ దగ్గర కొట్టే కంపే.
అప్పుడర్థమయ్యింది మాష్టారూ మీకూ నాకూ వున్న తేడా.
కులం కాల్చకుండానే కంపుకొడుతుంది కదండీ!
మిమ్మల్ని చంపినా పాపం లేదని మావాళ్ళంటున్నారట
అసలు మీరు బతికున్నదెప్పుడు?
ఊపిరితో వుండి తన పిండాకూడు తనే తినేవాణ్ణి
'సచ్చినోడ నేది మా అమ్మ.
మీరు నన్ను చూసి నవ్వినప్పుడెల్లా
పెదవుల్లేని పుర్రెదంతాలు కనిపించేవి
వీరుడు ఏక లవ్యుడు శవాలను చంపడు

చివరిగా ఒక్క మాట
నా అంతిమ యాత్రలో పాల్గొన్న
శకుని మామలకు ధన్యవాదాలు చెప్పండి

వాళ్ళ కన్నీటిధారలకు ఊళ్ళోవరదొచ్చిందట కదా.
నేను చూస్తూనే వున్నాను. వాళ్ళ ఏడుపు ముఖాలమీద
మేకప్ చెరిగిపోయి
పులిచారలు బయటపడ్డాయి. వాళ్ళస్మారకోపన్యాసాల
నిండా
బ్యా లెట్ పెట్టెల ముక్కవాసనే.
అయినా, వాళ్ళు నాకెంతో మేలు చేశారు.
నా సజీవ దహనానికి
బియ్యం కార్డు మీద కిరోసిన్ సరఫరా చేసింది వాళ్లే.
రేపు అడవిలో ఏకలవ్యుడు
వాళ్ళను ఉచితంగా దహనపరచి
నారుణం తీర్చుకుంటాడు.

(గురువుల కులపిచ్చికి బలయిపోయిన విద్యార్థులు
దాకె బాలాజీ. డొక్కా పద్మనాభరావులకు)

ఆధార గ్రంథాలు :

1. పంచమ వేదం కవితా సంపుటి
   రచన: సతీష్ చందర్
   ప్రచురణ: స్మైల్స్ అండ్ స్మైల్స్, హైదరాబాద్
2. తెలుగులో కవిత్యోద్యమాలు
   ప్రచురణ: తెలుగు అకాడమీ, హైదరాబాదు
3. 20వ శతాబ్ధి తెలుగుకవిత్వం
   రచన: డాక్టర్ కడియాల రామమోహన్ రాయ్
   ద్వితీయ ముద్రణ: బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి పౌండేషన్, గుంటూరు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత కవిత్వంలో మానవతావాదం

– డా॥. గుండిమెడ శ్రీనివాసరావు, తెలుగు అధ్యాపకులు, మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామవరపుకోట ఏలూరు జిల్లా.

మానవతావాదం నేపథ్యం :

మానవుడే అన్నింటికి మూలం అనే భావన క్రీస్తుపూర్వం 5వ శతాబ్దం నాటికే పొడసూపినప్పటికి, ఆ భావన ఒక వాదంగా రూపుదిద్దుకున్నది ఆధునికయుగంలోనే. మధ్య యుగం, ఆధునిక యుగం సంధి కాలంలో యూరప్ దేశాలలో వచ్చిన పునరుజ్జీవనం అనేక వాదాలకు, ధోరణులకు తెరలేపింది. ఈ మానవతావాదం కొత్త దైనప్పటికి "మానవత" అనే భావన మనిషి పుట్టినప్పటి నుండి ఉంది. మధ్యయుగం నాటి సామాజిక పరిస్థితు లన్నీ మత విశ్వాసాలకు, కట్టుబాట్లకు లోబడి ఉన్నవే. మనిషిని ఒక సామాజిక అంశంగా గుర్తించలేని పరిస్థితులు సుమారుగా ప్రపంచం అంతటా విస్తరించి వున్న రోజుల్లో యూరప్ దేశాల్లోని తత్త్వవేత్తలు మనిషిని కేంద్రంగా సమాజాన్ని నిర్మించాలన్న అవసరాన్ని గుర్తుచేస్తూ ఈ వాదాన్ని బలంగా ముందుకు తెచ్చారు. ఈ సిద్ధాంతాలు తర్వాత కాలంలో యూరప్ నుండి ప్రపంచమంతటికి విస్తరించాయి. సామాజిక స్పృహతో రచనలు చేసిన రచయితలందరూ ఈ వాదాన్ని ఒక వస్తువుగా స్వీక రించారు.

ప్రాచీన కాలంలో భారతదేశం భూస్వామ్య సంభంధా లతో, దేవుడు కేద్రంగా,ఆధ్యాత్మిక చింతన పేరుతో, సనాతన ధర్మం పేరుతో గల ఆచారాలు , సంప్ర దాయాలు ఉనికిలో వుండేవి. సామాన్య మానవుడు ఒక ఉత్పత్తి సాధనమే తప్ప సామాజిక, రాజకీయ వ్యవహారా లలో అతనికి ఎటువంటి సంబంధం లేదు. పాలనా వ్యవహారాలు, సాహిత్యం వంటి మానవీయ అంశాల్ని కులీన, ఉన్నత కులాల పరిధిలో మాత్రమే వుండేవి. సామాన్య మానవుడి ఉద్ధరణ ఒక ఆదర్శంగా యూరప్ సమాజాల్లో ఉండేది. అది మన సమాజంలో కొరవడింది.

ఆంగ్లేయుల పాలనలో ఉన్న భారతదేశం యూరప్ దేశాల్లో వచ్చిన సామాజిక, సాహిత్య మార్పులన్నిం టిని స్వీకరించింది. ముద్రణా యంత్రాల అభివృద్ధి , అంగ్ల విద్య వీటికి దోహదం చేసింది. ఆ విధంగా మానవతా వాదం కూడా ఒక ప్రత్యేక ధోరణిగా సాహిత్యంలో చోటుచేసుకుంది. తెలుగు సాహిత్యం అందుకు మినహాయింపు కాదు. అయితే నన్నయ కాలం నుండే తెలుగు సాహిత్యంలో మానవత భావన విరివిగా కనిపించినప్పటికీ ఒక వాదంగా బలపడింది మాత్రం ఆధునిక యుగంలోనే అని చెప్పవచ్చు.

మానవతావాదం :

మానవతావాదాన్ని ఆంగ్ల భాషలో HUMANISM అంటారు. ఈ ఆంగ్ల శబ్దానికి మాతృక లాటిన్ భాషలోని HUMANITAS అనే పదం. (LATIN - ENGLISH : HOMO - MAN; HOMINES - MANKIND ; HUMANUS - HUMAN; HUMANITAS - HUMANISM).

HUMANISM అనే పదాన్ని మొట్ట మొదటిసారిగా ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటికీ చెందిన ఎఫ్. సి. యస్. షిల్లర్ సమకూర్చారు. షిల్లర్ ప్రతిపాదించిన వ్యావహారికవాద (pragmatism) రూపాంతరమే మానవతావాదంగా భావించబడింది.

మానవతావాదం లక్షణాలు :

"1. మానవుడే అన్నింటికి ప్రమాణం, లక్ష్యం
2. జీవకోటిలో పవిత్రుడు, అత్యుత్తముడు మానవుడే.
3. విశ్వరహస్య సంవేది, సంఘ సౌభాగ్య కారిణి మానవునిది విలసనమే.
4. భౌతిక, వైజ్ఞానిక ఆధ్యాత్మిక కళా రంగాల్లోని అభ్యున్నతికి మానవుడే కారణం.

5. మానవుని మేధను, సర్వశక్తులను మానవా భ్యుదయం కోసం నిర్దేశించేదే మానవతావాదం.
6. వ్యక్తీ స్వాతంత్ర్య పూర్వకమైన మానవ ప్రేమే మానవతావాద లక్ష్యం.
7. వ్యక్తిపరిస్థితులకు, వైయక్తిక స్థితిగతులకు సంబంధించినవి సర్వసమత్వాన్ని, సౌకర్యాలను, న్యాయాన్ని అందించడమే మానవతావాద లక్ష్యం.
8. భౌతిక సుఖాన్ని అభిలషించే అర్హతను అందరికి అందించేదే మానవతావాదం.
9. సాంప్రదాయక మత సిద్ధాంతాలకు, అతిమానవ శక్తులకు అతీత మైనదే మానవతావాదం.
10. వసుధైక కుటుంబమే మానవతా ధ్యేయం.
11. మానవతావాదం పరిణామశీలం." (వసునందన్, రావికంటి :1990 :పుట:15,16)

దళిత కవిత్వం నేపథ్యం :

సమాజం వైరుధ్యాల నిలయం. అది సంఘర్షణలతో పరిణాపరిణామ స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఆదిమ సమాజ దశ నుండి ఆధునిక సమాజం వరకు ఈ అంతరాలు కొనసాగుతూనే వున్నాయి. మత, వర్ణ, వర్గ, భాషా, ప్రాంతీయ,లింగ భేదాల వలన మానవుల మధ్య సంఘర్షణ అనివార్యమౌతుంది. ఈ దశలో జరిగే సంఘర్షణల వలన సమాజంలో కొత్త పరిణామాలు సంభవిస్తున్నాయి. తెలుగు సాహిత్యంలోనూ ఇటువంటి పరిణామాలు వర్ణించబడ్డాయి. భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ, చేతనావర్తన,అనుభూతి,స్త్రీవాద సాహిత్య ధోరణులకు ఆ సమాజ పరిణామాలే ప్రధాన కారణాలు. అలాంటి నేపథ్యం నుండే దళిత సాహిత్యం కూడా ఆవిర్భవించింది. దళిత సాహిత్య ఆవిర్భావంతో తెలుగులో సాహిత్య విస్తృతి పెరిగింది.

స్త్రీవాదం కల్పించిన సాహిత్యపరమైన వెసులు బాటుతో సాంఘిక పీడనకు, కుల అనుచివేతకు, హింసకు వ్యతిరేకంగా కింది కులాల వారిని మానవులుగా పరిగణించాలని, అమానవీయ కుల వ్యవస్థను రద్దు చేయాలని ఉద్యమించింది దళిత కవిత్వం. దళిత కవిత్వం మానవతావాదాన్ని పరిపుష్టం చేసింది. మానవతా వాదం యొక్క పరిధిని విస్తృతం చేసింది. సాటి మానవు లను సమానంగా చూడలేని ఆధునిక భారత సమాజాన్ని నిల దీసింది. మానవతా విలువలు లేని సమాజం సకల రంగాలలో వికాసాన్ని చూడలేదని దళితవాదమే వాస్తవమైన మానవతావాదమని ముందుకు వచ్చింది దళిత కవిత్వం.

దళిత కవిత్వం -నిర్వచనాలు :

1. దళితులంటే ఎవరు? అనే ప్రశ్నకు సమాధానంగా కే.కే రంగనాథ చార్యులు ఇలా నిర్వహించారు "తరతరాలుగా అస్పృశ్యతకు లోనై, మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి, విద్యా సౌకర్యాలు కరువై, సమాజంలో కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై, ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడికి గురైన వాళ్లు దళితులు" (రంగనాథ చార్యులు కే.కే 1994 :పుట:2).
2. "సంఘ బహిష్కృతులు, కులము వలన అధోగతి పాలైన వాళ్ళు, సాంఘికంగా, రాజకీయంగా అణగదొక్కబడిన వారు, ఆర్థిక దోపిడీకి గురై నిత్య అవసరాలైన కూడు, గుడ్డ, గూడు కు దూరమైన వాళ్ళు, విద్యకు వికాసానికి నోచుకోక మతానికి, సంస్కృతికి దూరంగా నెట్టి వేయబడిన వాళ్లు, నీచ వృత్తులు చేసుకుంటూ శారీరక శ్రమనే నమ్ముకొని సభ్య సమాజానికి దూరంగా ఉన్నవాళ్లు, నిత్యం అవమానాలకు, అత్యాచారాలకు గురి అవుతూ ప్రధాన జీవన స్రవంతిలో కలవకుండా నివసిస్తున్న వాళ్లు దళితులు" అన్నారు బన్న ఐలయ్య (ఐలయ్య బన్న : 2001:పుట- 86).
3. "సాంఘిక దోపిడీకి అణచివేతకు గురవుతున్న వారు, అస్పృశ్యులుగా పరిగణింపబడుతున్నవారు,

నీచవృత్తులుగా భావింపబడుతున్న వృత్తులు చేస్తున్న వారు, శారీరక శ్రమపై ఆధారపడి బతుకులు గడుపుతూ సమాజ సంపదను పెంచుతున్నవారు దళితులు" (సత్యనారాయణ, ఎస్. వి:2003:పుట:70).

4. "తరతరాలుగా అనుభవిస్తున్న అవమానాల్ని పోగొట్టుకోవాలని, అందరిలాగానే తాము గుర్తింప బడాలని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని, సాంస్కృతికంగా తమకో అస్తిత్వాన్ని కల్పించు కోవాలని, ఆర్థిక రాజకీయ రంగాల్లో సమాన ప్రాతినిధ్యం కోసం పోరాడుతూ, సమాజంలో అట్టడుగున కూడా అణచివేతకు గురవుతున్న వారే దళితులు. వారి అభ్యున్నతని ఆకాంక్షిస్తూ చైతన్యపరిచే విధంగా రాసేదే దళిత సాహిత్యం అవుతుంది అని ఆచార్య శరత్ జ్యోత్స్నరాణి అన్నారు (శరత్ జ్యోత్స్న రాణి, ఎస్:2003:పుట:101).

దళిత కవిత్వం తాత్విక భూమిక :

వర్ణ వ్యవస్థ దేవుడు, విధి, ఆత్మ, పునర్జన్మ స్వర్గ నరకాలు వంటి భావనలు పునాదిగా స్థిరపడింది హిందూమతం. ఈ భావనల కారణంగా ఆర్థికంగా, సామాజికంగా సాంస్కృతికంగా, అణిచివేయబడినవాళ్లు దళితులు దళితుల విముక్తి కోసం హిందూ మత తాత్వికతను మౌలికంగా ప్రశ్నించిన చార్వాకులు, లోకాయితలు, బౌద్ధ, జైన మొదలైన వాళ్ళ బోధనలు, శాస్త్రీయ దృక్పథం దళిత సాహిత్యానికి అవసరమైన తాత్విక భూమిక అందించాయి.

1. దేవుడు, విధి, పునర్జన్మ, ఆత్మ, స్వర్గం, నరకం వంటి అతీంద్రియ భావనలను తిరస్కరించడం లేదా వ్యతిరేకించడం.
2. నాస్తికత్వాన్ని హేతువాద దృక్పథాన్ని పెంపొందించడం.
3. శాస్త్రీయ దృష్టిని అలవర్చడం.
4. ప్రధాన లక్ష్యం మానవతావాదం. (మల్లికార్జున్, పి:1997:పుట:17)

మానవత్వానికి మారు పేరుగా దళితవాదం నిలబడి ప్రగతిశీల ధారలని కురిపించింది అని అంటారు నను మాస స్వామి (నను మాస స్వామి:2006:పుట:11).

దళిత కవిత్వం ఎంత మానవీయమైందో అంత తాతాత్వికమైంది. ఇక్కడ మానవుడే శిల్పం అని కత్తి పద్మారావు అన్నారు (లక్ష్మీనారాయణ, కె:2002:పుట:5).

"స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువలు ప్రాతిపదికగా నిర్మించబడే సమాజం పట్ల దళిత సాహిత్యం విధేయత కలిగి ఉంటుంది. అంటే ఇది కుల రహిత, వర్గ రహిత, సమసమాజ స్థాపనకు ఉద్దేశిస్తున్నట్లుగా భావించవచ్చు. మానవతా వాదాన్ని వ్యతిరేకించే సాహిత్య సంస్కృతులపై దళిత సాహిత్యం నిర్విరామ పోరాటం చేస్తుంది. అణిచివేత దోపిడీలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, సామాజిక ఆర్థిక న్యాయం కోసం పోరాడడం దీని ప్రధాన లక్ష్యంగా భావించవచ్చు".

దళితవాద కవిత్వం -మానవతావాదం :

కులం వలన కలుగుతున్న సమస్యలను వర్ణిస్తూ దళిత కవిత్వం అధికంగా వచ్చింది. నేటి పత్రికల్లో పుస్తకాల్లోనూ వస్తూనే ఉంది. దళిత కవిత్వం ప్రధానంగా కుల సమస్య పైన దృష్టిని కేంద్రీకరించిన సాటి మనిషిని మనిషిగా గుర్తించాలని మానవీయ దృక్పథం నుంచే చిత్రించబడింది. దళిత కవిత్వం తాత్విక దృక్పథమంతా మానవతావాదాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని దళిత కవులు తమ కవితల్లో వ్యక్తపరిచారు.

చాతుర్వర్ణ వ్యవస్థలో దళితులను అస్పృశ్యులుగా చూసిన వైనాన్ని బొజ్జా తారకం మానవీయ దృక్పథం నుంచి ఇలా అంటారు...

"నేను అస్పృశ్యుడ్ని నా ఒళ్ళంతా మట్టి వాసన
నా బ్రతుకు నిండా వెట్టి వేదన నా కళ్ళ నిండా ఎండ వేడిమి
ఎండకు ఎండి వానకు తడిసి బిగుసుకుపోయినా
మర్రి ఊడల్లా నా తల నన్ను ఊరికి దూరంగా ఉంచారు"

అంటూ సాటి మనిషిని మనిషిగా గుర్తించాలని ఆవేదన వ్యక్తం చేశారు అంతేకాక అగ్రవర్ణాల అమాన వీయాన్ని ఆక్రోసిస్తూ...

"నా నీడ మీకు తగలకూడదు అన్నారు
నా గోడు వినిపించకూడదన్నారు
మూతికి ముంత, ముడ్డికి ఆకు
కట్టుకు తిరగమన్నారు"

అంటూ తన ఆర్తిని వెళ్ళగక్కారు తనన అసలు మనిషిగా గుర్తించడం లేదంటూ...

"నన్నెవరూ పిలవలేదు నాతో ఎవరూ పలకలేదు
నేను మనిషిని కాదనే...
నా గురించి కథలలేవు గాథలు లేవు
నాకై కవిత లేదు నాకు చరిత లేదు
నాలుగు వేదాల్లోంచి నాలుగు పాదాల నుంచి
నన్ను తొలగించారు కట్టెల నుంచి జారిన కట్టెల
ఒక్కడినే ఎక్కడో ఎండిపోయాను
(దళిత కవిత్వం- 2, లక్ష్మీనారాయణ,
కే:2003:పుట66)

అంటూ అగ్రవర్ణాలు దళితులను అస్పృశ్యులుగా చూస్తున్న వైనాన్ని మానవీయ దృక్పథం నుంచి విశ్లేషిం చారు.

దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడిన పరిణామా లను కలేకూరి ప్రసాద్ 'పిడికెడు ఆత్మగౌరవం కోసం' అనే కవితలో ఇలా అంటారు...

"నా కనుగుడ్లు కన్నీరైద్రవిస్తే
ఈ దేశంలో జీవ నదులు ప్రవహించాయి
నా సిరల నుండి జీవదాతువులు స్రవిస్తే
ఈ దేశం సస్యశ్యామలమై సిరులు కురిసింది"

అంటూ తన శక్తిని అంతా ధారపోసి ఈ దేశాన్ని ఈ భూమిని సస్యశ్యామలం చేస్తే కనీసం మానవత్వం లేకుండా ఈ అగ్రవర్ణ సమాజం..

"అవమానాలకు అత్యాచారాలకు మానభంగాలకు
చిత్రహింసలకు గురై పిడికెడు ఆత్మగౌరవం కోసం
తలెత్తిన వాడిని
ధన మదాందా కులం మత్తుల రాజ్యంలో
బతకడమే ఒక నిరసనగా బతుకుతున్న వాడిని"
(చిక్కనవుతున్న పాట - లక్ష్మీనరసయ్య, జి
(సంపా):1995:పుట:110)

అంటూ తనకు కనీసం ఆత్మగౌరవం కూడా లేకుండా చేసిందని హిందూ సమాజంపై తన నిరసనను వ్యక్తం చేశాడు.

వర్ణ వ్యవస్థలో దళితుల అస్తిత్వం ప్రశ్నగా మారింది. కఠిన నియమాలతో దళితులను అమానవీయంగా అవ మానించడాన్ని 'నెత్తుటి ప్రశ్న' వేశారు ఎండ్లూరి సుధాకర్...

"నేనింకా నిషిద్ధ మానవుడ్ని నాది బహిష్కృత శ్వాస
నా మొలకు తాటాకు చుట్టి నా నోటికి ఉమ్మి ముంత
కట్టి
నన్ను నలుగురిలో అసహ్య మానవ జంతువుని చేసిన
మనువు
నా నల్లటి నుదుటిమీద బలవంతంగా నిషిద్ధముద్ర
వేసినప్పుడే"

దళిత జాతి అంతా క్రమక్రమంగా హత్య చేయ బడిందని మానవ దృక్పథం ద్వారా స్వభావోక్తికరించారు. అంతేగాక...

"నిన్నటి చరిత్ర బొటనవేలనే కోసింది
వర్తమానం ఐదు వేళ్ళుని నరికేస్తుంది
బహిరంగం గానూ రహస్యంగాను" అంటూ దళితు లపై జరుగుతున్న దౌర్జన్యాలను వివరిస్తూ దళిత జాతి కోసం...

"మాకు ఇప్పుడు కావలసింది నెత్తుటి రక్తం కాదు
మాకేం కావాలో కోరుకునే నిర్భయ గొంతుక.
కొత్త రాజ్యాంగం కొత్త దేశం కొత్త ఆకాశం"
(చిక్కనవుతున్న పాట - లక్ష్మీనరసయ్య,
జి (సంపా):1995:పుట:1)

కావాలంటూ అగ్రవర్ణ సమాజాన్ని ప్రశ్నిస్తాడు.

వర్ణాశ్రమ ధర్మం దళితుల్ని మృగాలుగా చేసి వేటాడుతున్న వైనాన్ని ప్రశ్నిస్తూ శిఖామణి 'అవర్ణం' అనే కవితలో...

"ఒకే ఒక స్వచ్ఛమైన తెల్లటి కాంతి కిరణం లాంటి మనిషిని
రంగురంగులుగా విడగొట్టిన ఈ కులం గాజు పటకాన్ని
ముక్కలు ముక్కలుగా పగలగొడుతున్నాను
ఏ వర్ణం వలన నేను అవమానించబడ్డానో
ఏ వర్ణం నన్ను అవమానవీకరణకు గురిచేసిందో
ఏ వర్ణం నా ఆత్మగౌరవాన్ని
పత్ర హరితాన్ని నాకి వేసే ఆకుపురుగులా నాకేసిందో
ఆ వర్ణాన్ని తుడిచి వేస్తున్నాను"

అంటూ వర్ణ రహిత సమాజాన్ని మానవీయ మాధుర్యాన్ని రుచి చూద్దాం రమ్మంటూ అగ్రవర్ణ సమాజం పూసుకున్న రంగుల్ని కడిగేసుకుందాం నటనలకు స్వస్తి చెప్పి మానవులుగా జీవిద్దాం" (పైదే:పుట:228) రమ్మంటూ అగ్రవర్ణాన్ని కోరుకుంటాడు.

అంతేకాక దళితులు అంటే ఎవరనే ప్రశ్నకు ఉనికికి సమాధానంగా మరొకవి ఇలా అంటారు...

"ఇంతకీ ఎవరమూ మేం మా ఉనికి ఏమిటి మేం దస్యులం మేం శూద్రులం మేము పంచములం మేము అంత్య జులం మేము అవర్ణులం మేము అనార్యులం మా ఉనికి ఏమిటి?" (పైదే) అని దళితుల అస్తిత్వాన్ని మానవీయ కోణం నుంచి ప్రశ్నిస్తారు.

సూర్యవంశీ దళిత గీతం అనే కవితలో మనుషులే కాదు ప్రకృతి సైతం దళితుడిని అంటరాని వాడుగానే చూసిందంటూ...

"మబ్బుల్లారా వెళ్ళిపోకండి ఇక్కడ కూడా కురవండి
మా వాడలు కూడా ఈ దేశంలో ఒక భాగమే
గత స్మృతుల మీద ఎవరైనా శవ వస్త్రం కప్పండి
అప్పుడప్పుడు అవి లేచి మిమ్మల్ని భయ పెడుతున్నాయి
మా దేశంలోనే మేము మీ వలసదాడులకి గురి అయ్యాం
మీరు పౌరులుగా మేము శరణార్థులుగా మిగిలి పోయాం
గుడి గుండెల్లో మేము కూడా ప్రవేశం అడిగాం
కానీ దేవుళ్ళకే కాదు మనుషులకి కూడా దూర మయ్యాం
అద్దె కొంపలు సైతం మమ్మల్ని తిరస్కరించాయి
పత్రాలు కూడా బయటకు వినరి మమ్మల్ని సత్కరించాయి
కొళాయి నీరు మురికి కాలువలో ప్రవహించు గాక
మేం వాటిని దోసిట్లో అందుకుంటే దోషం అవుతుంది
ఒక చెంప మీద ఉమ్మితే నిన్న మరొక చెంప చూపించాం
కానీ ఇప్పుడు బద్ధలైన మౌనంలో తుఫాను చూపిస్తాం"

(దళిత మేనిఫెస్టో-కేశవకుమార్ (సంపా):1995:పుట:49)

అంటూ ఒక దళిత జీవితాన్ని తన ముందు ఉంచుతారు అంతేకాక మరో కవితలో దళితులందర్నీ ఏకమై సరికొత్త మానవ సమాజాన్ని నిర్మించాలని...

"దళితుల్లారా ఏకమవుదాం వాళ్లని మనుషులుగా మార్చుదాం
కలసి మెలసి ఒక సరికొత్త మానవుడిని నిర్మిద్దాం"

(పదునెక్కిన పాట-లక్ష్మీనరసయ్య, జి (సంపా):1996:పుట:168)

విశ్వజినీన మానవతావాదాన్ని కోరుకుంటారు.

హిందూమతంలో కులాల పేరుతో మనిషి నుండి సాటి మనిషిని విడదీసిన వైనాన్ని మాస్టార్జీ...

"మన మనువిచ్చిన
హిందూ ధర్మంలో కులాల పేరుతో మనిషిని మనిషి
దోపిడీ చేయడమే ముఖ్య లక్షణం

తాను బాగుండి తన తమ్ముడెవరో చెడిపోతే
సంకలు ఎగరేసే గుణం మనుధర్ములందున్న"

మనుధర్మ శాస్త్ర అవినీతిని బయటపెట్టి మనిషిని మనిషిగా గౌరవించడం మానవతా ధర్మం అంటూ...

"మనిషిని మనిషి చూసేదే మానవతా ధర్మం
మతంతో మనుషులను కులంతో వర్గాలను
వేరుచేసి ఊరేగే తరతరాల దోపిడీని"

(దళిత కవిత్వం-2-లక్ష్మీనారాయణ, కె(సంపా):2003:పుట:45)

సహించవద్దంటూ ప్రతి మనిషి మానవ స్వభావాన్ని కోల్పోవద్దంటూ సలహాలు ఇస్తాడు.

విశ్వజనీన మానవతావాదాన్ని ప్రతి మనిషి కోరాలని విశ్వజనీన సౌభ్రత్వాన్ని కాంక్షించాలని కత్తి పద్మారావు...

"కులమున్ మతమున్ కులదోసి
మనిషిని నిలిపి మానవ విలువలు కూర్చి పేర్చి
మనిషి చేసే మానవ దర్శనమే నీవే" నంటూ ప్రపంచ మానవాళికి పిలుపునిస్తాడు అంతేగాక..

స్వేచ్ఛన్ సమతన్ సోదర ప్రేమన్ ఉండాలని మరో కవితలో కుల రాజ్యాన్ని పూలదొయాలని సందేశం ఇస్తూ...

"కులరాజ్యమును కూల్చగ లేరా
నీ రాజ్యమును నిర్మించు నీవు నిర్మించు
సమతా మమతల సంస్కృతి నీదే"

అంటూ దళిత జాతిని మేల్కొలుపుతాడు అంతేకాక...

"నేను మనువును మానవత్వం నా శత్రువు
నేను నీలో ఉన్నాను నీవు నన్ను గుర్తిస్తే నేను నశిస్తా
నన్ను బ్రాహ్మణుడిగా ద్వేషిస్తే నీది బ్రాహ్మణవాదమే
నా మూలం హైందవం దాన్ని కూలిస్తే నేను మరణిస్తా

(దళిత కవిత్వం-1: లక్ష్మీనారాయణ, కె (సంపా):2002:పుట:55)

అంటూ మనువాదపు దుర్బుద్ధిని బయటపెడతాడు అంతేగాక సమ సమాజ స్థాపన కోసం ప్రతి మనిషి పాటుపడాలని విశ్వసిస్తాడు.

మనువు చెప్పిన అనైతిక సూత్రాలను దళిత రచయితగా ప్రశ్నించలేకపోయానని వేదనతో శిఖామణి...

మనిషికి మనిషి దూరమైన వైనాన్ని ప్రశ్నించలేక పోయాను అంటూ మనువాద సంస్కృతిని ఇలా అవిష్కరించాడు..." ఈ నేల మీద మరో మనిషి హక్కుల కోసం ప్రశ్నించలేకపోతున్నాను" (దళిత కవిత్వం-2: లక్ష్మీనారాయణ కె: సంప: 2003:పుట-97) అంటూ మనూపై మానవయ్య తిరుగుబాటు చేద్దాం రమ్మంటూ దళిత జాతిని మేల్కొల్పుతాడు.

అంటరానితనమంటూ దళితుల్ని దూరంగా పెట్టే ఈ హిందూ సమాజంపై మానవీయ తిరుగుబాటుగా బి ఎన్ బి... "మీ ఇల్లు ఎవడు గట్టే నీ బావి ఎవడు దవ్వే" (దళిత కవిత్వం-1: లక్ష్మీనారాయణ, కె (సంపా) : 2002 : పుట:67) అంటూ దళితుల శ్రమజీవన సౌందర్యాన్ని ప్రపంచానికి చాటుతాడు.

మనుషులంతా ఒకటేనని ఘోషించే హిందూమతంలో సాటి మనిషి అయినా దళితుడు హిందూ దేవాలయంలోకి ప్రవేశించాడనే అక్కసుతో అగ్రవర్ణ సమాజం ఆ దళితుడు చేత మనిషి మలాన్ని తినిపించిన వైనాన్ని శిఖామణి ఇలా...

'ఈ లోకంలో మనిషి రక్తం తాగిన నరరూప రాక్షసులు ఉన్నారు
మనిషి మాంసం తినే మ్యాన్ ఈటర్స్ ఉన్నారు
కానీ మనిషి మలాన్ని మరొక మనిషి చేత తినిపించినా
మనుషులు మాత్రం లేరు
రెండు కళ్ళు రెండు కాళ్లు
రెండు చెవులు రెండు చేతులు కలిగిన
అచ్చం నీలాగా నీలాగా ఒక అమ్మ బాబుకు పుట్టిన మనిషి
అక్షరాల మనిషే రా వాడు మలం తిన్నాడు"

(చిక్కనవుతున్న పాట: లక్ష్మీ నరసయ్య, జి. 1995:పుట:96)

అంటూ ఒక అమానవీయ దృశ్యాన్ని చిత్రీకరిస్తాడు

కర్ణాటకలో ఒక దళితుడు ఆలయ ప్రవేశం చేశాడని అగ్రవర్ణాల వారు అతనికి శిక్షగా మనిషి మలం తినిపించినప్పుడు దళిత కవి ప్రతిస్పందనే పై కవిత ఇది అస్పృశ్యతకు పరాకాష్ట అమానవీయతకు చిట్టచివరి హద్దు అని అంటారు.

దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు అన్న గురజాడ సూక్తులు దళితుల పట్ల కాదనే సత్యాన్ని గ్రహించిన కవి తనకేం కావాలో కత్తుల కిషోర్ నాకేం కావాలి ఇప్పుడు అనే కవితలో...

నాకీ కులం వద్దు మతం వద్దు
కులం గోడలు కూల్చిన మతం దాడులు దాటిన
మనిషి కావాలి చూపగలవా? చూడగలనా...?

నాకు ఇప్పుడేమీ వద్దు నన్ను మనిషిగా చూసే సమూహం కావాలి, దేశమంటే మనుషులేననే నిరూపించ గల కొత్త రాజ్యం కావాలి రాజ్యాంగం కావాలి మట్టి బతుకులోంచి మొలకెత్తే మానవ ప్రపంచం కావాలి" (పదునెక్కిన పాట: లక్ష్మీనరసయ్య, జి:1996:పుట:197) అంటూ దేశమంటే మనుషులమే ఆ మనుషులు కూడా తరతరాలుగా వివక్షకు గురవుతున్న మానవత్వాన్ని విడవని దళితులని పేర్కొన్నారు.

దళితుల దిన స్థితిని చూసి శిలలు సైతం కన్నీరు కార్చాయని, మనుధర్మ శాస్త్రం మానవత్వం అనే పేరుతో దళిత జాతికి మరణశిక్ష విధించింది అనే నగ్న సత్యాన్ని జె గౌతమ్ 'ఉరిని ఉరి తీయాలి' అనే కవితలో...

"శిలలు కన్నీరు కార్చాయి ఆకలి నీడల్ని జైలు గోడలు బంధిస్తే
మనుధర్మం మానవత్వం పేరు చెప్పి మరణశిక్ష బహుకరించింది"

(దళిత కవిత్వం-1:లక్ష్మీనారాయణ, కె:2002:పుట:100)

అని ఆకలిని అంటరానితనాన్ని ఉరితీయాలి అంటాడు.

దళితులకు అన్నీ ఉన్నా ఈ హిందూ సమాజంలో ఏమీ లేని వాళ్ళుగా చూడబడుతున్నారనే వాస్తవాన్ని గద్దర్ మేం బాంచోళ్ళం అనే కవితలో...

"నో ఇండి లేనోళ్ళం ఊరు ఉండి లేనోళ్ళం
మనుషులుగా పుట్టి మనుషులుగా గుర్తింపు లేని వాళ్ళం"

ఈ దోపిడీ వ్యవస్థను రూపుమాపి సరికొత్త విశ్వ నరుడిగా ప్రతి దళితుడు మారతాడు అనే విషయాన్ని...

"దోపిడీ వ్యవస్థను రూపుమాపేస్తాం
మనిషిని మనిషిగా చూసే మరో ప్రపంచం నిర్మించుకుంటాం"

అంటూ అగ్రవర్ణ సమాజానికి సరికొత్త శాంతి సందేశాన్ని ఇస్తాడు.

గత చరిత్ర అంతా అమలిన చరిత్రనేని దళితుడి చుట్టూ అమానవీయ కులగోడల్ని నిర్మించి శతాబ్దాల తరబడి దళితుడిని బానిసగా చూస్తున్నారనే నగ్న సత్యాన్ని బన్నా ఐలయ్య 'అమలిన చరిత్ర' అనే...

"నన్ను మలినుడిని చేసి ఊపిర్లేవరు దొంగిలించారో
నా స్వేచ్ఛని శరీరాన్ని స్వరాన్ని ఎవడు బంధించాడో
వాడే నా చుట్టూ కట్టిన గోడల మీద మానవత్వాన్ని కమ్ముతున్న
శతాబ్దాల నుండి పల్లవి లేని పాటకు పల్లవి సమకూరుస్తున్నాను
నడుస్తున్న కాలం మీద మణి కిరీటాన్ని నేను"

(చిక్కనవ్వుతున్న పాట: లక్ష్మీ నరసయ్య, జి:1995:పుట:133)

అంటూ మానవత్వం అనే కిరీటాన్ని ప్రతి మనిషి ధరించాలంటూ అంతేగాక ప్రతి మనిషిలో మానవత్వాన్ని నిలబెడతానని బలంగా విశ్వసించారు.

ఈ విధంగా దళిత కవిత్వం ప్రాథమికంగా మానవ జీవితం కేంద్రంగా సాగి, కుల, మత, వర్గ, జాతి, ప్రాంతీయ పరిమితుల్ని అధిగమించింది. దళిత

కవిత్వంలో వ్యక్తీకరణ కేవలం వ్యక్తిగతమైనదిగా మాత్రమే కాకుండా విశ్వ జననమైనది. మతం కంటే దేవతా విగ్రహాల కంటే ఏ ఇతర భావాల కంటే మానవుడే విలువైన అంశంగా భావిస్తూ ఆ దిశగా సమాజ ఆలోచనలో మార్పు తెచ్చేందుకు దళిత కవిత్వం ప్రయత్నించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. అనంతరామశాస్త్రి నేతి : ఆధునిక తెలుగు సాహిత్యంపై లౌకిక విలువల ప్రభావం, అరుణ పబ్లికేషన్స్,గుంటూరు, 2006.
2. అరుణ కుమారి జి : ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం - విభిన్న ధోరణులు, ఈస్ట్ వెస్ట్ రీసెర్చ్ సెంటర్, హైదరాబాదు, 1987.
3. వీరాంజనేయులు కాగిత : తెలుగు సాహిత్యంలో మూడనమ్మకాలూ , శాంతి పబ్లికేషన్స్,మంగళగిరి, 1989.
4. రంగనాథాచార్యులు కె.కె : తెలుగులో తొలి సమాజ కవులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు,1983
5. నారాయణరెడ్డి సి. : ఆధునికాంధ్ర కవిత్వము %--% సంప్రదాయములు %--%ప్రయోగములు , సికింద్రాబాదు, 1977.
6. లక్ష్మీనరసయ్య జి: పదునెక్కిన పాట : 1996
7. లక్ష్మీనారాయణ కె: సంపా: దళిత కవిత్వం-1: 2002.
8. వసునందన్ రావికంటి : ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతా వాదం %--% విశ్వంభర విలక్షణత , జగదాంబ ప్రచురణలు, హైదరాబాదు, 1990.
9. శ్రీనివాసరావు గుండిమెడ : సమకాలీన తెలుగు కవిత్వంలో మానవతావాదం, పిహెచ్.డి సిద్ధాంతగ్రంథం హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2011.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మద్దూరి నగేష్‌బాబు కవిత్వం – దళిత స్త్రీ జీవిత చిత్రణ

– డా॥. మల్లెలోగు మూదన్న, తెలుగు అధ్యాపకులు, యస్.జి.యస్.ఆర్ట్స్ కళాశాల(తి.తి.దే), తిరుపతి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత సాహిత్యానికి ఎనలేని సేవచేసిన వ్యక్తి మద్దూరి. సమాజంలోని యదార్థ స్థితిగతులను విమర్శించాలంటే గుండె ధైర్యం కావాలి. ఏ విధమైన సంకోచాలకు తావీయక జరిగిన జరుగుతున్న వాటిని వున్నవి వున్నట్లు చెప్పేవారిలో మద్దూరి నగేష్‌బాబు ప్రముఖంగా పేర్కొనదగినవారు. తాను చెప్పదలచుకున్న విషయాలను ముక్కుసూటిగా వ్యక్తపరిచే అలవాటు పుట్టుకతోనే అలవరచుకున్నారు నగేష్ బాబు గారు.

దళితుల కోసం తన జీవితాన్ని అంకితం చేసి, సాహిత్యమనే ఆయుధం ద్వారా వారి సమస్యలకై అవిశ్రాంత పోరాటం చేసిన యోధుడు నగేష్‌బాబు భవిష్యత్తులో దళితుల సమస్యలకై పోరాడేవారికి మార్గదర్శకుడుగా ఉండటమే కాక, ఎలాంటి సమస్యలను గ్రహించి పోరాడాలో తమ రచనల ద్వారా తెలియజేశారు.

భారతీయ సమాజం మిగతా సమాజాలకంటే నిర్మాణంలో ఎన్నో వైరుధ్యాలను సంక్లిష్టతలను కలిగి ఉంది. మిగతా సమాజాలలో లేని వర్ణం, కులం భారతీయ సమాజంలో కనిపిస్తుంది. భారతీయేతర దేశాలలో అక్కడక్కడ ఈ వర్ణ వివక్ష ఉన్నా ఇంత తీవ్రస్తాయిలో లేదు. సాటి మనిషిని కులం పేరుతో మానసికంగా, శారీరకంగా, లైంగికంగా, వేధించి హింసించిన పరిస్థితులు భారతదేశంలోనే ఎక్కువగా ఉన్నట్లు చరిత్ర, సాహిత్యం కూడా తెలుపుతున్నాయి. మన పురాణాలలో నాలుగు కులాలుగా విభజించబడినట్లు ఉన్న సమాజం తదనంతర కాలంలో వందలాది ఉపకులాల తోతీ శాఖోపశాఖలుగా విభజించబడింది. ఒక కులం మరొక కులాన్ని, ఆ కులం అదే కులంలోని మరొక వర్గాన్ని చులకనగా చూడటం జరిగింది. అగ్రవర్ణాలలోని కులాల్లో కూడా ఈ వ్యత్యాసం మనకు నేటికీ స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఎన్ని కులాలు, ఉపకులాలు ఉన్నా, స్త్రీని మాత్రం అన్ని కులాల వారు చాలా చులకనగానే చూసారని చెప్పాలి. అగ్రవర్ణాలవారు కూడా వారి కులంలోని స్త్రీలను, దళితులు వారి కులంలోని స్త్రీలను వివక్షతోనే చూశారు. ఒక్క మాటలో చెప్పాలంటే వర్ణవ్యత్యాసంతో బాటు సామాజిక స్థాయిలో స్త్రీలు రెండో వర్గంగా చూడబడ్డారు. వారిలో దళిత స్త్రీలు లైంగికంగా మరీ దారుణమైన జీవితాన్ని అనుభవించారు. అటువంటి దళిత స్త్రీలపై జరుగుతున్న లైంగిక దాడులగురించే మద్దూరి నగేష్ బాబు గారు 'మళ్లీనీళ్లాడాల్సిందే' ఈ కవితలో మన కళ్లకు కట్టినట్లు చిత్రించారు.

"పోయింది శీలమైతేనేమి!
ప్రమాదవశాత్తు జరిగి పోయాక
ఇక ఎవ్వరూ ఏమీ చెయ్యరు-చెయ్యలేరు కూడాల
చివరికి పోస్ట్ మార్టమ్ రిపోర్టయినా!
.....
.....
ఇక్కడ ఏపనె ఎవ్వరూ కావాలని చెయ్యరు
చివరికి అత్యాచారమైనా!
అరబ్బు అంపశయ్య మీద అంగీకరించలేని అమీనా
అయ్య సారా గ్లాసులో వేపమండలు కట్టుకు
చిందులాడుతున్న మాతంగివ కోటేశ్వరీ
అంజమ్మాషవ రాములమ్మా ఏసమ్మా
ఎవరయినా ఇక్కడ ప్రమాదవశాత్తుగానే పుడతారు.
పాపం ప్రమాదవశాత్తుగానే చస్తారు" అంటాడు.

శీలాన్ని దోచిన దుర్మార్గులను శిక్షించకుండా, వెనకేసుకొని వస్తారని, అది ప్రమాదవశాత్తు జరిగిందని సమర్థిస్తారని, చివరికి అత్యాచారాన్నైనా కావాలని చెయ్యరని అగ్రవర్ణాల వారు గాని పలుకుబడి ఉన్న వారు

కాని దుర్మార్గులకు వంతపాడతారని ఈ కవితలో కవి గర్హిస్తాడు. దళిత స్త్రీలు ఇష్టం లేకున్నా అరబ్బు అంపశయ్యమీద నరకాన్ని అనుభవిస్తారని, మాతంగి రూపంలో కోటేశ్వరి శరీరాన్ని ఊరందరికీ పంచి పెడుతున్నదని, అంజమ్మ, రాములమ్మ, ఏసమ్మ వంటి దళిత స్త్రీలు అత్యాచారానికి గురౌతుంటారని ఏం చేయాలో కూడా కవి ఇలా తెలుపుతున్నాడు.

"ప్రమాదవశాత్తుకాదు ఉప్పెనలా ఉద్యమించిఽ
బతుకుని దొమ్మర గుడిశెలనుండి
లాఠీంగులనుండి
అర్ధరాత్రి స్వేచ్ఛల నుండి కాపుడుకోవటానికి
తప్పిదమా!
బావుల గుండెల్లో మందుపాతర్లై పేలాల్సిందే
ఈమదం పట్టిన కీకారణ్యాల్నీ కాల్చిపడేసి
ఆబూడిద రాశులమీద మీరు
మళ్లీ నీళ్లాడాల్సిందే!"

అంటూ వారిలో చైతన్యాన్ని రగిలిస్తూ, మార్గోపదేశాన్ని ఉపదేశించాడు. అప్పటికి గాని స్త్రీలపై ముఖ్యంగా దళితస్త్రీల పై లైంగిక వేధింపులుగానీ, దాడులుగానీ ఆగవని స్పష్టంగా చేశాడు. 1992 ఏఫ్రిల్ మాసంలో చీమకుర్తిలో అగ్రవర్ణాలవారు ముగ్గురు దళితస్త్రీలపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేశారు. అగ్రవర్ణాలవారు తమ పలుకుబడితో అధికారదర్పంతో ఆ సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందేగాని, కావాలని జరిగింది కాదని పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్‌లో నమోదు చేయించగలిగారు. ఆ వార్త చదివాక కవి ఆవేదనతో కుమిలిపోయి తన బాధను పై కవితారూపంలో వ్యక్తం చేస్తాడు. సామాజిక స్పృహ కలిగిన కవిగా తన బాధ్యతను కవితా రూపంలో పై విధంగా తెలియపరిచాడు.

దళిత స్త్రీలు పొట్టకూటికోసం దొరల ఇళ్లలో పాచి పనులు చేస్తున్నారు. ఎర్రటిఎండలో పొలం పనులు చేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా వెట్టి చాకిరీ చేస్తూనే ఉన్నారు. ఇంకొందరు బతుకు గడవక రికార్డు డాన్స్ చేస్తూ, నాలుగు రూకలు సంపాదించుకొంటున్నారు. వారిని జులాయి వెధవలు మాట్లాడే వెటకారపు మాటలు వింటూ తమను కాదని గుండె నిబ్బరం చేసుకొంటూ కాలం నెట్టుకొస్తున్నారు. అటువంటి రికార్డు డాన్సర్ల దుర్భర జీవితాన్ని 'ఎగిరేపళ్లేలు' అనే కవితలో కవి ఇలా చిత్రించాడు-

"మేము మీ ఆడోళ్లసుమంటోళ్లమే బాబూ
మాకు సంసారాలుంటాయి
మాకు మొగుళ్లూ పిల్లలూ ఉంటారు
సమర్తాడినాక కొత్త ఓణీ గుడ్డల బిడియంలో
ఐదారు నెల్లు నక్కీనక్కీ తిరిగిందాన్నే నేను కూడా
అక్కర నాడు మా ఆయన నా హుక్కులు తప్పిస్తుంటే
నేను గుప్పెడు సిగ్గునై కోటి వంకర్లు తిరిగిందాన్నే
అయినా ఇట్టా ఇడిసేసి ఎగరడానికి మాకేవన్నా సరదా!
మేమేమన్నా మదంపట్టి కొట్టుకుంటున్నామా?
ఆకలినాయనా ఆకలి"

అంటూ వారి ఆవేదనను వారి గొంతుకను వినిపిస్తాడు. మేము సాటి స్త్రీలమేనని మీ అగ్రవర్ణ, ధన బలం కలిగిన స్త్రీలలాంటి వాళ్లమేనని, అయినా కేవలం కడుపు కూటికేసం రికార్డు డ్యాన్సు చేస్తున్నామేగాని కొవ్వుపట్టి కాదని స్పష్టం చేశాడు.

"ఒక రూపాయి నన్ను చూసి ఈలేసినా
ఒక కళోపోసన నాకు కన్ను గొట్టినా
ప్రోగ్రాం అయిపోయినాక ప్రతి ఊరు నీరేటెంతని
అడిగినా
ఎదురు తిరిగితే ఎండుగుంటయే దిక్కు గనక
మొకం రంగుతోబాటు అన్నీ తుడిపేసుకొని
పోతుంటాను"

అంటూ తన వేదనాభరిత జీవితంలోని ఆకలి కోణాన్ని డాన్సర్ చేత చెప్పిస్తాడు కవి.

ప్రేమ పేరుతో దళిత అమ్మాయిలను అగ్రవర్ణాల అబ్బాయిలు లైంగికంగా ఉపయోగించుకొని అటు తరువాత వదిలేస్తారని కవి హెచ్చరించాడు. సాంకేతిక విద్యనభ్యసిస్తున్న'సునీత' అనే దళిత అమ్మాయి రెడ్డి

కులస్థుడైన ప్రేమికుడిచేతిలో మోసపోయింది. ఆమె ఆవేదనను కవి తనదిగా భావిస్తున్నాడు. ఆ అమ్మాయిని ఇలా ఊరడించాడు.

"నువ్వు చెప్పిందీ నిజమేనమ్మా
జీవితమంటే సిద్ధాంత వాక్యాల పొడియిసక మాత్రమే కాదు
వొక గిలిగింత ఒక నవ్వుతెర
కూసిన్ని వెక్కిళ్లు పిడికెడు నిట్టూర్పులు కూడా
కానీ వేదనని వెక్కిరించే వెకిలిగాళ్ల రాజ్యంలో
ప్రేమని బలహీనతనుకునే బేవకూన్ల వ్యవస్థలో
పాదితీసి నువ్వెంత కన్నీటి తడికట్టినా
కొండ చిగురుస్తుందా సునీతా?"

అంటూ ఓదారుస్తాడు కవి. మన చావులు కూడా వానికి విజయ సంకేతాలే ఔతాయంటాడు.

"పడమటి కనుమల్లోంచి కూడా
వొక పొద్దు పొడుపుని సాధ్యం చేయాల్సిన చోట
పట్టపగలు కూడా
ఆకాశాన్ని నీలి చంద్రికల్లో అలంకరించాల్సిన వేళ
చావుని కూడా చచ్చేదాకా చావగొట్టి చేవచూపాల్సిన వేళ
వాడి వంశపారంపర్య విజయాల కొనలాగింపైన
నీ ఆత్మ హత్యని నేను సమర్థించలేనమ్మా" అంటాడు.

ఇంకా దళిత అమ్మాయిలు ఎలా ఉండాలో, ఏమి నేర్చుకోవాలో కూడా ఇలా తెలిపాడు.

"అయాం సారీ సునీతా!
ఈదేశం ప్రేమనేపదాన్ని అర్థం చేసుకోగలగాలంటే
ముందు మనం ద్వేషం నేర్చుకోవాలి"

అంటూ హెచ్చరికతో కూడిన హితబోద చేస్తాడు.

అగ్రవర్ణాలు వారు దళితుల శ్రమను దోపిడీ చేశారు. స్త్రీల మానాలను దోచుకున్నాను. పిల్లలచేత వెట్టిచాకిరీ చేయించుకున్నారు. పెద్దలను బానిసలుగా చూశారు. ఊరికి దూరంగా ఉంచారు. చెప్పులు వేసుకోకూడదని నిర్దేశించారు. ఉమ్మిని కూడా ఊయలాడదని వారి మెడకు ఉమ్మి తొట్టి కట్టారు. మృత పశువుల మాంసాన్ని తినమన్నారు. ఆపశువుల చర్మంతో చెప్పులు కుట్టించారు. శుభకార్యాలకు వారి చేత డప్పులు కొట్టించారు. చనిపోయి వారి వార్తలను బంధువులకు చేరవేసే వార్తహరులుగా వాడుకున్నారు. గుడులు గోపురాల్లోకి రాకుండా కట్టడి చేశారు. ధిక్కరించి వచ్చిన వారికి శిక్షలు వేశారు. అగ్రవర్ణ స్త్రీలను దళిత పురుషులు శారీరకంగా అనుభవిస్తే వారి అవయవాలను కోసేయాలన్నారు. దళితులు వేదాలు వినరాదని, చదవరాదని ఆదేశించారు. ఒకవేళ వేదాలు వింటే వారిచెవుల్లో సీసం కరిగించి పోయాలన్నారు.

ప్రపంచ చరిత్రలోనే ఒక జాతి తమ సాటి జాతిని ఇంత నీచంగా హీనంగా చూసినట్లు ఎక్కడా కనిపించదు. అటువంటి వేదనల నుంచి, ఆక్రందనలనుంచి, ఆవేదనల నుండి దళిత కవిత్వం పుట్టింది. క్రీ.శ.13వ శతాబ్దం నుంచే దళిత కవిత్వ ఛాయలు అక్కడక్కడా కనిపిస్తున్నా వాటికి ఒక సంపూర్ణ స్వరూపం తెచ్చింది మాత్రం గుర్రం జాషువాగారేనని చెప్పవచ్చు. ఒక గొప్ప కవిగా వానికెక్కిన జాషువా కూడా వర్ణవివక్షకు గురయ్యాడు. ఎన్నో సందర్భాల్లో తన ఆవేదనను కవితా రూపంలో వెల్లడించారు. ఆయన కవితా స్ఫూర్తిని ఆదర్శంగా తీసికొని ఎండ్లూరి సుధాకర్, కత్తిపద్మారావు, కలేకూరి ప్రసాద్, పైడి తెరీష్‌బాబు, మద్దూరి నగేష్ బాబు వంటి కవులు గళమెత్తి దళిత కవితావాణిని ఎలుగెత్తి చాటారు. దళితుల చైతన్యం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్నారు. ఆ పరంపరలో భాగంగానే మద్దూరి నగేష్ బాబుగారు దళిత కవిత్వాన్ని రాశారు. అందులో 'దళిత స్త్రీ' తరతరాలనుంచి ఎదుర్కొంటున్న సమస్యలను, అనుభవించిన వేదనలను చారిత్రక పౌరాణికాధారాలతో సమన్వయిస్తూ, అక్రమాలను నిలదిస్తూ, అన్యాయాలనూ సూటిగా ప్రశ్నిస్తూ, వాడి వేడి పదజాలంతో కవితలు సృజించారు.

ఆధార గ్రంథాలు :

1. వెలివాడ-మద్దూరి నగేష్‌బాబు 2. మీరేవుట్లూ-మద్దూరి నగేష్‌బాబు
3. హరిజన శతకం- కుసుమ ధర్మన్న

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాయక్క మాన్యమ్ – దళిత జీవిత దృక్పథం

– చిలుక శ్రీలత, పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

దళిత నిర్వచనం :

నిఘంటువుల్లో 'దళిత' అనే శబ్దానికి ఖండించిన బడినది, ఛేదింపబడినది, వికసించినది అనే అర్థాలు కనిపిస్తున్నాయి. అస్పృశ్యత కారణంగా సమాజం నుండి విడగొట్టిబడిన వారనే అర్థంలో సాహితీవేత్తలు దళితులను భావిస్తున్నారు. ముఖ్యంగా సామాజిక వ్యవస్థలో సరైన స్థానం లభించని, వివక్షకు గురవుతున్న వారందరికీ దళిత శబ్దం వర్తిస్తుంది. శతాబ్దాల తరబడి జరిగిన పోరాటంలో వ్యక్తమైన ఆత్మగౌరవ నినాదం 'దళిత' అనే పదం అని చెప్పడంలో సందేహం లేదు. అగ్రకులాల అధిపత్యంలో కులాన్ని ఆధారంగా చేసుకొని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రంగాల్లో జరిగే వివక్షను ప్రశ్నించే శబ్దం దళిత. సమాజంలో నిమ్న స్థాయిలో బతుకీడుస్తూ, ఆ కష్టాల నుండి బయటపడడానికి శాస్త్రవిజ్ఞానాన్ని విశ్వసిస్తూ, హేతువాద భావజాలంతో పోరాడుతూ, అస్తిత్వం కోసం నిత్యం ప్రయత్నించే వారికి ప్రాతినిధ్యం వహించే శబ్దం 'దళిత'.

సామాజికంగా నిమ్న స్థానంలో ఉన్న ప్రజలు అస్పృశ్యతను అనుభవిస్తూ దళిత శబ్దాన్ని తమ ఆత్మగౌరవానికి ప్రతీకగా భావిస్తున్నారు. చారిత్రక ఆధారాలను బట్టి వీరిని అవర్ణులు, అతి శూద్రులు, అంత్య వాసులు, చండాలురు, బహ్యులు, హీనులు, అస్పృశ్యులు, అంటరానివాళ్ళు, పంచములు, హరిజనులు మొదలైన పేర్లతో కొన్ని వందల సంవత్సరాలుగా వీరిని పిలిచేవారు. ఇలా కొన్ని పేర్లతో వ్యవహరించినా, కాల క్రమేణా దళితులు 'దళిత' అనే శబ్దంను తమ ఆత్మ గౌరవానికి, సమైక్య శక్తికి ప్రతీకగా నిలుపుకొని ఆ శబ్దంతోనే పిలుచుకోవడానికి ఇష్టపడుతూ ఆ పేరుతోనే తమ భావాలను, తమ ఆక్రందనలను, వ్యథలను వివిధ సాహిత్య ప్రక్రియల ద్వారా సమాజానికి అందిస్తూ అన్ని భారతీయ భాషల్లోనూ "దళిత సాహిత్యం" అనే పేరుతోనే తమ రచనలను కొనసాగిస్తున్నారు.

దళిత జీవిత దృక్పథం :

తరతరాల నుండి అగ్రకులాల ఆధిపత్యానికై గురి కాబడుతున్న దళితులు వీరు సమాజంలో ఎదుర్కొం టున్న అణచివేతలను, పీడలను వివిధ దృక్కోణంలో అణువణువు అక్షరించి దళిత జీవితాన్ని క్షుణ్ణంగా ఆవిష్కరించిన కథ సంకలనం రాయక్క మాన్యమ్.

రాయక్క మాన్యమ్ కథ సంకలనాన్ని జూపాక సుభద్ర గారు 2014లో ప్రచురించడం జరిగింది. ఈ సంకలనంలో రచయిత అనగారిన కులాల అక్రందానలను ఆత్మగౌరవ పోరాటాలను అస్తిత్వ ఆరాటాలను స్వీయానుశీలనతో చిత్రించింది.

ఈ సంకలనంలో కథలు దళితుల జీవిత ప్రతి బింబాలు నాటి నుండి నేటి వరకు సమాజంలో కుల, వర్గ, సాంఘిక, రాజకీయ పరిణామాలలో ఎన్నో వినూత్న మైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రపంచం ప్రాచీన దృక్పథాల నుండి ఆధునిక దృక్పథాల గుండా వైవిద్యమైన ధోరణిలో ముందుకు పయాణిస్తుంది. మహాత్మ జ్యోతిబా పూలే, బి.ఆర్.అంబేద్కర్,కాన్షీరాం మొదలగు ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా మనుధర్మ శాస్త్రం విధించిన బానిస సంకెళ్లను విదిలించుకుని దళితులు విద్యావంతులై అగ్రవర్ణ ఆగడాలకు అడ్డుకట్ట వేస్తూ చైతన్య దృక్పథలో ముందుకు సాగుతున్నప్పటికీ, అప్పటికే వేళ్ళునూకొని ఉన్న ఆధిపత్య భావజాలం సమాజంలో నరనరాన జీర్ణించిపోయి నేటికీ కూడా దళితులు సమాజంలో అణచివేతకు గురికాబడుతున్నారు అనడానికి రాయక్క మాన్యమ్ కథలే నిదర్శనం.

ఈ సంకలనంలో కథ వస్తువులు అన్నీ కూడా కల్పితాలుగా అనిపించవు. రచయిత స్వయంగా స్వీయ అనుభవంతో రాసిన కథలుగా అనిపిస్తాయి. ఇందులో ప్రధానంగా దళితుల జీవన విధానం, స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, మానవ సంబంధాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, దళితుల ఆత్మగౌరవం, అస్తిత్వవాదం, కులాదుహంకారానికి గురికాబడ్డ దళితుల జీవితాలను వాస్తవిక కోణంలో చిత్రించింది.

కుల వివక్ష :

అనాది కాలం నుండి దళితులపై నిరంకుశమైన కుల వివక్ష పరంపరంగా కొనసాగుతూనే ఉంది. సమాజంలో అగ్రకుల ఆధిపత్య భావజాల ప్రభావం దళితులపై నేటికీ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తూనే ఉంది.

దళితులపై నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ కుల వివక్షను నిర్మూలించడానికి దళితులు మరియు ఉన్నత భావాజాలం గల దళితేతరులు అందరూ కలిసి ఎన్నో దళిత భావజాల, కుల నిర్మూలన విప్లవోద్యమాలు చేస్తున్నప్పటికీ కూడా దళితులపై కుల వివక్ష, మరణ కాండ దుశ్చర్యలు ఆగడం లేదు.

సమాజంలో సామాజిక అసమానతలు లేకుండా సమ సమాజ భావజాలం ప్రజలలో ఇమిడి ఉన్నప్పుడే ప్రపంచ ప్రగతి ముందుకు కొనసాగుతుంది. అలాకాకుండా అగ్ర, నిన్న వర్గాల మధ్య కుల వైరుధ్యాలు ఉన్నంతకాలం నూతన సమాజ ఆవిష్కారం అడుగంటి పోతుంది.

రాయక్కమాన్యంలోని కథా సంకలనంలో "బల్లేనే దోస్తు వుల్లే గాదు", "శుద్ధి చెయ్యాలె", "గద్దెత్కపోయిన బతుకమ్మ" కథలలో అగ్రకులస్తులు దళితులపై ప్రవర్తించిన తీరు తెన్నులు అగ్ర కులస్తులు దళితులపై చూపించే కుల దురహంకార దృక్పథాన్ని తెలియజేస్తాయి.

"బల్లేనే దోస్తు వుల్లే గాదు" కథలో నీకేంబుట్టిందే...! మాదర్ చోద్ ముండా...గా మాదిగోల్ల పిల్లకి ఇచ్చి మల్లితెచ్చుడేందే, దోస్తు గీస్తూ అంతా బల్లేనే గీ మన వుల్లే గాదు. అదేసుకున్నయి మల్ల నువ్వేట్లయేసుకుంటావే, నీకు తెలువకుంటే దాని కన్నా దేల్వదనే. దాని సాధువు నట్టు బండలుగాను, నాలుగు అక్షరాలు నేర్సుకొంగనే సిన్నంత్రం పెద్దంత్రం దెల్వకుంటైందా. దాని అయ్యవ్వలు ఎక్కువోల్లు తక్కువోల్లనే బుద్ధులు చెప్పుకోరా అని, అలాగే "శుద్ధిచెయ్యలే" కథలో అగ్ర కులస్తులు అనుకుని ఒక దళితురాలికి ఇల్లు అద్దెకిచ్చి మళ్ళీ ఆమె దళితురాలని తెలియగానే ఆ ఇంటిని ఖాళీ చేపించి ఆ ఇంటికి మైల పట్టిందని శుభ్రం చేయించడం వెనుక ఆధిపత్య కులాలు దళితులపై గల కుల వివక్షతను తెలియజేస్తున్నాయి.

దళితుల అస్తిత్వం :

నాటినుండి నేటి వరకు నిమ్నవర్గస్థులు అంటేనే వారికొక అస్తిత్వం, వ్యక్తిత్వం లేని మట్టి మనుషులు అనే దృక్పథం సమాజంలో ఎమిడిపోయి ఉంది. అగ్ర కులస్థులు దళితులను పిలిచే పిలుపులో సంబోధించే తీరులో దళితులపై గల అగ్రకుల దృక్పథాన్ని తేట తెల్ల పరుస్తాయి. అందుకు నిదర్శనమే "షేవ్వ నెత్తురు", "రోట్లెబడ్డ తల్కాయ" అనే కథలు. దళితులు అంటేనే వారికి ఒక అస్తిత్వం, వ్యక్తిత్వం లేని వారుగా కనిపిస్తారు.

"షేవ్వ నెత్తురు" కథలో హాస్టల్ బాత్రూమ్ లో గర్భస్రావం జరిగితే హాస్టల్లో అంతమంది ఉండగా వార్డెన్ కేవలం తక్కువ కులానికి చెందిన విద్యార్థులనే నిందించడం వెనక దళితులపై గల చిన్నచూపును తెలియజేస్తుంది.

అలాగే "రోట్లెబడ్డ తల్కాయ" కథలో నిమ్నకులస్థులు అంటే ఎప్పుడు అగ్రకులస్తులకు ఊడిగం చేస్తూ వారి చెప్పు చేతుల్లో ఉంటూ వారికి బానిసగా మాత్రమే బ్రతకాలి అనే దృక్పథాన్ని మల్ రెడ్డి పాత్ర ద్వారా తెలుస్తుంది. మాదిగ కులస్థులైన బక్కన్న సమ్మక్క తమ కుమార్తెను మల్ రెడ్డి కూతురు దగ్గరికి ఊడిగం చేయడానికి నిరకరించినప్పుడు మల్ రెడ్డి బక్కన్నను నిమ్న కులాలను దూషించిన తీరు అగ్రకుల దురహంకారానికి

ప్రతీకగా, దళితులంటే వారికో అస్తిత్వ, వ్యక్తిత్వం లేని వారు అనే భావజాలాన్ని కలిగి ఉన్నారు అని తెలియ చెపుతుంది.

దళితుల ఆహార్యం :

సమాజంలో అగ్ర, నిమ్న వర్గాలలో అంతరాలు ఉన్నట్లే అగ్రవర్ణ, నిమ్నవర్ణ జాతుల ఆహార్యంలో (రూపు రేఖలు)కూడా తేడాలు ఉన్నాయి. అగ్రవర్ణాలు అంటే ఆర్థికంగా బలపడి ఉండడం వల్ల వారు విద్యావంతులై కట్టు బొట్టు బాగుండి అంతర రూపం ఎలా ఉన్నా బాహ్యరూపంలో మాత్రం హుందాగా కనిపిస్తారు. కానీ నిమ్న వర్గీయులైన దళితులు నిరక్షరాస్యులై కూలీలుగా మారి రోజువారి జీవితంలో తినడానికి పూట గడవని పరిస్థితులను దాటుకుంటూ సరియైన తిండికి గుడ్డకు నోచుకోక ధైన్యమైన జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటారు. అందువల్ల సమాజంలో వారు బాహ్యరూపం పరంగా కూడా హేళనకు గురై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆత్మ న్యూనతకు గురి కాబడుతున్నారు.

''షానిబడాలే'' కథలో సాంబలక్ష్మి తన గోసిచీర కట్టినందుకు ఇబ్బందికిలోనవుతుంది. అప్పటివరకు దొరగారింట్లో పనిచేసే ఆమె ఇప్పుడు హుందగా దొర పక్కన ప్రెసిడెంట్ హోదాలో కూర్చోవడం తన సిగ్గుగా అనిపిస్తుంది. నిరక్షరాస్యురాలైన ఆమె గోసిపోసుకుని మండల ఆఫీస్ వెళ్లడంతో అక్కడివాళ్లు ఎగతాళి చూపులు తట్టుకోలేక ఆత్మ న్యూనతకు గురి అవుతుంది.

''మొండి వైదిగం'' కథలో సుశీలమ్మ వాళ్ల కొడుకు రమేష్ కి యాక్సిడెంట్ అయితే ఆపరేషన్ చేయాల్సి వస్తుంది. హాస్పిటల్లో అక్కడి డాక్టర్స్ వారి రూపురేఖలను చూసి అంటరాని, అనగారిన కులాలవారని, నిరక్ష రాస్యులు అని గ్రహించి రమేష్ ఆపరేషన్ పై నిర్లక్ష్య ధోరణితో ప్రవర్తించి కాలు తీసేయడానికి కారకులు అవుతారు.

ఇలా దళితులు కడు పేదరికంలో జీవనం కొనసాగిస్తూ తమ రంగు రూపలలో, బాహ్య రూపంలో సమాజంచే చిత్కరాలకు గురికాబడుతున్న సంఘటనలను రాయక్క మాన్యమ్ కథలలో కనిపిస్తాయి.

ముగింపు :

బడుగు, బలహీన వర్గాల వెతల్ని, కథల్ని అక్షికరించి సాహిత్యంలో వివిధ ప్రక్రియల ద్వారా తన గొంతుకను వినిపిస్తూ దళితుల జీవన స్థితిగతులను, వీరు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను, సంవేదనలను సమాజానికి తెలియజేయడానికి జూపాక సుభద్ర గారు రాసిన సంకలనం రాయక్క మాన్యమ్, చరిత్రల్ని చెరిగిపోస్తూ... (సమకాలిన సామాజిక సాహిత్య వ్యాసాలు).

ఆధార గ్రంధాలు :

1. రాయక్క మాన్యమ్
2. చరిత్రల్ని చెరిగిపోస్తూ...(సమకాలిన సామాజిక సాహిత్య వ్యాసాలు)

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గబ్బిలానికి విన్నవించుకొన్న అరుంధతీ సుతుని ఆర్త సందేశం

- మూల్యా బ్రి మూర్తి
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ప్రభుత్వ ఆర్ట్స్
కళశాల (ఎ), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
రాజమహేంద్రవరము.

- మోగంటి సుధాకుమయిగారు
తెలుగు శాఖాధ్యక్షులు,
ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అ),
రాజమహేంద్రవరం.

దళిత సాహితీ వనంలో విరబూసిన వేలాది కవితా పుష్పాలలో నందనవన పారిజాతము వంటి కీర్తిని గడించిన అద్భుత కావ్య కుసుమరాజము మహాకవి జాషువాచే రచించబడిన గబ్బిల మనే కావ్యము.

అస్పృశ్యత, అంటరానితనం, కులమత భేదాలు, శ్రమదోపిడీ, ఆర్థిక అసమానతలనే సాంఘిక దురాచారాల రక్కసులపై జాషువా సంధించిన కవితా ఖడ్గము గబ్బిలము.

నిమ్న కులస్తుల బాధతప్త, భయాల్ని, ఆందోళనల్నీ, పేదరికాన్ని, పిరికితనాన్ని, బానిసత్వాన్ని, బలహీనతల్ని ప్రోదిచేసి నవ సమాజ నిర్మాణం కోసం సమసమాజ స్థాపన కోసం, మానవ మనస్సును విస్తృత పరిచేందుకు, మనిషి హృదయాన్ని విశాలత నొందించుటకు, జాతి ఉద్దీపనకు, జాతీయ భావన ఉద్ధరణకు వినూత్న ఆలోచనా ధోరణిలో రాయబడిన విభిన్న కవితా కావ్యము గబ్బిలము.

ఒక నిమ్న కులజుని కావ్య కథానాయకుని చేసి, మృగ, పక్షి రూపానికి సంకేతమైన ఒక గబ్బిలాన్ని సందేశ వాహకంగా చేసి కావ్య జగత్తులో అరుంధతీ సుతునికీ, గబ్బిలానికి కనివిని ఎరుగని కీర్తిని ఆర్జించి పెట్టినటు వంటి అద్భుత అపురూప కావ్యము జాషువా సృజ యించిన గబ్బిలము.

ఇక కథ విషయానికి వస్తే, ఉదయమాదిగా కష్టమోర్చి ఇనుని సాగనంపి ఇల్లు జేరిన ఒక అరుంధతీ సుతుని వ్యధను తన ఇంటికి అతిధిగా వచ్చిన ఒక గబ్బిలానికి, బాధాతప్త హృదయంతో సమాజం తనపై చూపుతున్న వివక్షను కాశీనాధునికి కాస్త వివరించమని అరుంధతీ సుతుడు ఆర్తిగా చెప్పుకొన్న ఆవేదనాభరితమైన బాష్పసందేశమే గబ్బిల కావ్య సారాంశము.

అసలు జాషువా ఈ కావ్యానికి గబ్బిలం అని పేరు పెట్టడంలోనే ఒక వినూత్న దృక్పధాన్ని చూపాడనిస్తుంది. ఒక నిషిద్ధమావునిపై లేక నిమ్న కులజునిపై ఆనాడు సమాజం చూపుతున్న వివక్షత వివరించుకునేందుకు సాటి మానవుడెవ్వరూ సాయపడే పరిస్థితి లేనందున, తన ఆవేదనలో ఆలయాలలో తిరుగాడే ఒక గబ్బిలానికి వివరించాలనుకోవడం సముచితమైన నిర్ణయంగా కనిపిస్తుంది. అలాగే ఈ కావ్యమంతటిలో మనిషికీ, దేవునికీ మధ్య అనుసంధానం గబ్బిలమే కాబట్టి "గబ్బిలం" అనే పేరు గొప్ప నామౌచిత్యాన్ని పాటించిందని చెప్పవచ్చు.

తే॥గీ॥ సాత్వికాహారిణి తప్పశ్చర్య కతన
నీ మనంబున జాలి వెన్నెల రహించు
నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్రహృదయంబు గూడ గొంతరసంబు

అరుంధతీ సుతుడైన తన కన్నీటి కథను ఆలకించడానికి ఆర్ద్రహృదయమున్న మనిషి అవసరం కావున, కులమత విద్వేషాలలో కుచించుకుపోయిన ఆనాటి సమాజంలో తన బాధను, గాధను విని అర్థం చేసుకునే మనిషి లేకపోవడం వలన, మానవునిలో వుండే సంకుచిత మనస్తత్వం ఏమాత్రం లేని ఒక గబ్బిలానికి తన బాధను వ్యక్తపరచాలనుకోవడం దళితులపై ఏమాత్రం జాలి, దయ లేని సమాజపు పోకడలను అద్దం పట్టి చూపడమే.

దళితుడైన అరుంధతీ సుతుడు తన వేదనను

విన్నవించుకునేందుకు గబ్బిలాన్నే ఎంచుకోవడానికి కారణాన్ని జాషువా ఇక్కడ చక్కగా వ్యక్తీకరించాడు

తే॥గీ॥ ఆలయంబున నీవు వ్రేలాడు వేళ
శివుని చెవి నీకు గొంత చేరువుగ నుండు
మౌని ఖగరాజ్ఞి, పూజారి లేని వేళ
విన్నవింపుము నాదు జీవిత చరిత్ర

గబ్బిలాలకు తలక్రిందులుగా వేలాడే లక్షణం ఉండడం వలన, అవి ఆలయాలలో వ్రేలాడుతున్న సమయంలో శివుని చెవికి దగ్గరగా వుండే అవకాశం వుండడం వలన, దళిత జీవుని సాధక బాధకాలను దేవునికి వినిపించే సౌలభ్యం గబ్బిలానికి వుంటుందని, కాబట్టి పూజారి లేని వేళ తన బాధను దేవ దేవునికి చెప్పమని అరుంధతీ సుతుడు గబ్బిలాన్ని వేడుకోవడం, ఆలయాలకు దళితుల ప్రవేశం లేదనే విషయం ఇక్కడ స్పష్టంగా అర్థమవుతుంది.

చ॥ ప్రతిమల పెండ్లి సేయుటకు వందల వేలు వ్యయవించుగానీ దు:
ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని ముప్పది మూడు కోట్ల దే
వతలెగబడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారునే

అరుంధతీ సుతుడు గబ్బిలానికి విన్నవించుకొన్న సందేశంలో ముఖ్యమైన సందేశమిది. దేవుతల పెళ్ళిళ్ళ లకు, పూజలకు, వందల వేలు ఖర్చు చేసే ఈ సమాజం నిరుపేదలైన వారలకు, ఆకలితో అలమటించేవారికి, యాచకులకు ఒక్క మెతుకు రాల్చలేనటువంటి ఈ దౌర్భాగ్యపు సమాజానికి, "మానవ సేవే మాధవ సేవ" అనే నీతి ఏనాడు బోధపడుతుందోకదా ! అనే జాషువా గారి ఉద్దేశ్యాన్ని ఏ సిద్ధాంతులు, ఏ వేదాంతులు, ఏ పండితులు కూడా కాదనలేని నిత్య సత్యమిది.

నరుని కష్టపెట్టి నారాయుణునికి నమస్కరించే దుష్ట సాంప్రదాయమున్న ఈ భూమిపై కాలుపమోపుటకు ఇష్టం లేక పాదాలను ఆకాశం వైపు చాచే వ్రేలాడే విలక్షణత కలిగిన గబ్బిలాన్ని దళితుని బాధను విన్నవించు కునేందుకు జాషువా ఎంచుకోవడం ఎంతో సముచిత మనిపిస్తుంది. అలాగే మృగరూపము, పక్షి రూపము కలగలసిన గబ్బిలాన్ని చూచుట అపశకునమని భావించే నాగరిక జనుల సంకుచితత్వాన్ని కూడా గబ్బిలాన్ని వాహకంగా ఎంచుకోవడం ద్వారా జాషువా చెప్పకనే చెప్పారు. మూఢ విశ్వాసాలపై మోపిన ఉక్కుపాదంగా ఇక్కడ గబ్బిలాన్ని మనం ఊహించవచ్చు.

ఉ॥ చిక్కిన కాసుచే దనివి జెందు నమాయకుడెల్ల కష్టముల్
బొక్కిడు బువ్వతో మరచిపోవు క్షుదానల దగ్ధమూర్తి న
ల్దిక్కులు గల్గు లోకమున ధిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కడు జన్మమెత్తె భరతోర్వరకుంగడగొట్టు బిడ్డడై

ఉ॥ ముప్పు ఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
బిప్పి యొనర్చునీ భరత వీరుని పాదము కందకుండగా
జెప్పులు కుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్ప వడ్డది సుమీ భరతావని వీని సేవకున్

తే॥గీ॥ వాని రెక్కల కష్టంబు లేని నాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తి లేదు

ఆ॥వె॥ వాని నుద్ధరించు భగవంతుడే వేడు
మనుజుడెట్లు వాని కనికరించు

వాడు జేసుకున్న పాప కారణమేమో
యంత వరకు వానికెరుకలేదు.

చెమ్మట చిందించి నిస్వార్థంతో కాయకష్టం చేసి ప్రపంచానికి భోజనం పెట్టే సత్తావున్న శ్రామికుడు దళితుడు. తమ కష్టాన్నంతా వరుల భాగించుకొనిపోతున్నా చిరునవ్వుతో ఓర్పు వహించే పరోపకార సంపన్నులు దళితులు. చిక్కిన కాసు చేతనే సంతృప్తి పడే అమాయక ధనవంతులు దళితులు. ఎల్ల కష్టములను బొక్కెడు బువ్వలోనే మరిచిపోయే అల్పసంతోషులు దళితులు. ఎంతటి కష్టాన్నైనా ధైర్యంతో ఎదుర్కొని చేతి వృత్తులను, కుల వృత్తులను సాగించి భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను నిలబెట్టే నిజమైన భారతీయ మూలవాసులు దళితులు. నిరంతరముగా వర్ణ పిశాచి పదఘట్టనల క్రింద నలిగి పోతున్నా తమ ఉనికిని నిత్యమూ నిలబెట్టుకొనే నిజమైన బలవంతులు దళితులు ఆలాంటి దళితులు అనుభవిస్తున్న అరాచకాలను ప్రశ్నించే వారికి న్యాయం చేయగలిగే నరుడు గానీ, నారాయణుడు గానీ లేడనే అరుంధతీ సుతుని ఆర్తిని జాషువా భావనా విస్మృతిని చక్కగా బోధిస్తున్నాయి పై పద్యాలు.

సీ॥ ఎంతకొయిల పాట వృధయయ్యెనో కదా
చెక్కు చీకటి వనసీమలందు
ఎన్ని వెన్నెల వాగులింకిపోయెనో కదా
కటిక కొండల మీద మిటకరించి
ఎన్ని కస్తురి జింక లీడేరెనో కదా
మురికి తిన్నెల మీద పరమళించి
ఎన్ని ముత్తెపు రాలు భిన్నమయ్యెనో కదా
పండిన వెదురు జొంపముల లోన

ఆ॥వె॥ ఎంత గంధ వహనమెంత తంగెటి జున్ను
యెంత రత్న కాంతి యెంత శాంతి
ప్రకృతి గర్భమందు భగ్నమైపోయెనో
పుట్టరాని చోట పుట్టుకతన

ధర్మమునకు పిరికితనము లేదు, సత్యవాక్యమునకు చావులేదు. అన్న విశ్వాసంలో జాషువా గారు అరుంధతీ సుతుని నోట పలికించిన అక్షర సత్యమిది. ఘోరమైనరకుల పిశాచి పాదము క్రింద నలిగి ఎంతటి దళిత కళాకారులు, దళిత కవులు, దళిత పండితులు, దళిత గాయకులు, దళిత శాస్త్రకారులు వారి వారి ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పలేకపోయారో కదా ! ఇలాంటి పరిస్థితికి కారణామెవ్వరనీ గబ్బిలం ద్వారా శివునికి నివేదించిన అరుంధతీ సుతుని ఆర్త సందేశానికి పరాకాష్ట అనబడే ఆలోచన యిది.

సీ॥ భోగులాహరించు భుక్తి కన్నుల జూచి
పరమ పేదలు దు:ఖపడని చోటు
సాంఘికాచార పంచాస్య గర్జనమున
బెదరక జ్ఞానంబు పెరుగుడెటు
జాతి వైషమ్య రాక్షస పదాహతి చేసి
కందక కళలు పెంపొందుచోట
పరిపాలక క్రూరతర కరాసికి లోంగిపోక
స్వేచ్ఛలక్ష్మి పాదల చోటు

తే॥గీ॥ విసపు నవ్వుల లాహిరి వేషగాండ్ర
పాద చిహ్నాల మరక లేర్పడని చోటు
తోడు నీడయు లేనట్టి దర్భరులకు
గబ్బిలపు చాన వాసయోగ్యంబు గాదె

కులమతాల కోరల్లో చిక్కి చావురాక బ్రతకలేక నిరతము విలవిలలాడే నిమ్నజాతులు నివసించుట కొరకు సమత, మమత, ప్రేమల విరాజిల్లే చోటు చూపమని అరుంధతీ సుతుడు గబ్బిలం ద్వారా భగవంతున్ని వేడుకున్న ఈ సందర్భాన్ని చూస్తే "ఎక్కడ మనస్సు నిర్భయంగా వుంటుందో, ఎక్కడ మానవుడు సగర్వంగా తలెత్తుకు తిరుగుతాడో, ఎక్కడ ప్రపంచం ముక్కలుముక్కలైపోయి మగ్గిపోదో, ఎక్కడ మన చదువు, విజ్ఞానం, మూఢ నమ్మకాలలో ఇంకిపోదో, ఎక్కడ ఒక మనిషి తోటి మనిషిని దోచుకోడో, అక్కడ ఆ స్వేచ్ఛ స్వర్గంలోకి భగవంతుడా నా ఈ దేశాన్ని మేల్కొలుపు" అన్న రవీంద్రుని గీతాంజలిలోని మాటలు గుర్తుకొస్తాయి.

సందర్భం ఏదైనా సమస్య ఒక్కటే, పరిస్థితి ఏదైనా

పడుతున్న బాధ ఒక్కటే. కాలం ఏదైనా కబళిస్తున్న గరళం ఒకటే. ఇటువంటి బాధల నుండి ఇక్కట్లు నుండి భయాల నుండి ఈనాటికైనా మనం సమాజాన్ని మేల్కొలపాల్సిన అవసరం ఎంతైనా వుంది. అటువంటి అవసరాన్ని గుర్తించి ఆనాడే గబ్బిలం, గీతాంజలి వంటి కావ్యములు వ్రాసిన జాషువా, ఠాగురులు చిరస్మరణీయులు. కాబట్టే ఒకరు విశ్వకవులు, మరొకరు విశ్వనరులు.

ఆధార గ్రంథాలు :

1. గబ్బిలం - జాషువ.
2. గీతాంజలి - మూలం: రవీంద్రనాథ్ ఠాగూర్
   అనువాదం : గుడిపాటి వెంకటాచలం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రిజర్వేషన్ బోగి – దళిత స్పృహ

– డా॥. వి. వింధ్యవాసినీదేవి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పు), కర్నూలు.

దళిత సాహిత్యానికి కొంత చేర్పును చేకూరుస్తూ, దళిత వర్గాల చైతన్యాన్ని కాంక్షిస్తూ దళితసోదరుల ఆత్మగౌరవ పతాకాన్ని సాహిత్యం ద్వారా ప్రపంచానికి ఎరుక పరుస్తున్న రచయిత్రి శ్రీమతి జూపాక సుభద్ర గారు. దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే విధంగా ప్రవర్తించే వ్యక్తుల ఆవనాళ్ళను చూపుతూ,అంటు జాడ్యానికి నిలువునా కన్నీరై విలపించే దళిత వర్గాల ఆత్మఘోషను అక్షరాలుగా మార్చి సమాజం ముందుంచడంలో వీరి కృషి గణింపదగినది. కారంచేడు ఉద్యమంతో తలెత్తిన దళిత చైతన్యస్వరానికి బలం చేకూర్చేవిధంగా దళిత స్పృహతో ఎన్నో రచనలు వెలువరించారు జూపాక సుభద్రగారు. అయ్యయ్యో దమ్మక్క కవితా సంపుటి, రాయక్క మాన్యం కథాసంపుటి వీరి దృక్పథాన్ని వెల్లడిస్తాయి. దళితవర్గాల సామాజిక జీవితానికి ప్రతి బింబాలు వీరి రచనలని నిర్ద్వంద్వంగా పేర్కొనవచ్చు. సమాజంలో దళితుల అగచాట్లు, కష్టాలు, కన్నీళ్లు,అవమానాలు, అవహేళనలు, అమానుష సంఘ టనలు, అణచివేతలు, శ్రమదోపిడి, తీరని దుఃఖం, వేదనలు, వలపోతలు ఇలా ఎన్నో అంశాలు వీరి రచనల్లో వాస్తవికంగా దర్శనమిస్తాయి.తరాలుమారినా, యుగాలు మారినా, వేల ఏండ్లు కాలగర్భంలో కలిసిపోయినా మనువాదం మాత్రం సజీవస్రవంతిలా ప్రవహిస్తూనే ఉందని తెలియజెప్పే కథల సంపుటి-రిజర్వేషన్ బోగి. పది హేను కథలున్న ఈ సంపుటి రచయిత్రి దళిత స్పృహకు తార్కాణంగా నిలుస్తుంది. 2021లో ఈ కథా సంపుటిని వెలువడింది. రిజర్వేషన్ బోగిలో వ్యక్తమైన దళితస్పృహను పరిశీలించడమే ఈ వ్యాసఉద్దేశ్యం.

భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధించింది. కుల, మత, ప్రాంత, భాషా, లింగ వివక్షలు లేని సమాజాన్ని రూపొందించాలన్న సంకల్పానికి నిదర్శనమే భారతరాజ్యాంగ రూపకల్పన. రాజ్యాంగరిత్యా దేశంలో పౌరులంతా సమానమే. కానీ వాస్తవంలో మాత్రం రాజ్యాంగ రూపకర్తల ఆశయాలకు తిలోదకాలిస్తూ నేటికీ అస్పృశ్యత ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతూనే ఉంది.కుల దురహంకారం, ధనబలం, అధికారమదం, కుటిల మనస్తత్వం కారణంగా సమాజంలోని అణచివేయబడిన కులాల ప్రజల వెతలు వర్ణనాతీతం.నేటి అత్యాధునిక సాంకేతిక యుగంలోనూ సమసమాజ నిర్మాణమన్నది కాగితాలకే పరిమితమైన భావనగా కనిపిస్తుంది. కారణా లేమైనా పీడతవర్గాల వేదనకు మాత్రం ముగింపులేదన్నది నేటినిజం. ఇటువంటి దుఃఖిత జీవితాలను మోసుకుంటూ బతుకుతున్న,వ్యధార్థ జీవుల అంతరంగ కథనమే రిజర్వేషన్ బోగిగా రూపుదిద్దుకుంది. ప్రశ్నార్థకమవుతున్న దళితవర్గాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, ఆహారపుటలవాట్లు, వేషధారణ వంటి ఎన్నో విషయా లను, ఆలోచనాత్మక కోణంలో హృద్యంగా ఆవిష్క రించారు రచయిత్రి. సభ్యసమాజంలో ఆధిపత్యవర్గాల చేత నిమ్నవర్గీయుగా ఎంచబడే వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక స్థితిగతులను తెలుపుతూ, నాగరిక సమాజంలో వారిస్థానం ఎక్కడన్న ప్రశ్నను సంధిస్తూ రచయిత్రి ఈ కథా సంపుటిని ప్రకటించారు.కులం కారణంగా వెలి వేయబడుతున్న కొన్నివర్గాలవారి హృదయస్పందనగా నిలుస్తుంది ఈ కథాసంపుటి.

పాలనలో దళితుల పాత్ర :

రాజ్యాంగం నిమ్నవర్గాల అభివృద్ధికి అనేక అవకాశాలు కల్పించింది. అందరూ సమానంగా ఎదగడానికి, అవకాశాలు అందరికీ సమంగా దక్కడానికి రాజ్యాంగం వీలు కల్పించింది.అందులో భాగంగానే పాలనా హక్కును కల్పించింది. అయితే అమలులోనూ, ఆచరణలోనూ ఇది

ఎంతవరకు సఫలీకృతమవుతుందన్నది ప్రశ్నార్థకమే. షెడ్యూల్డు కులాలవారికి పదవులు లభించినప్పటికీ పాలనాపగ్గాలు మాత్రం ఆధిపత్యకులాల చేతులు మారకపోవడం పెను విషాదం.పదవి దక్కినా,దక్కని పెత్తనాన్ని చూపే కథలు రాణిర్కం, ఓ సర్పంచి వల(స)పోత. మహిళాసాధికారత దిశగా అడుగులేస్తున్న సందర్భంలో మహిళల పాలన కేవలం అలంకార ప్రాయమే కావడం గమనార్హం. గ్రామాల్లో సర్పంచ్‌గా ఎంపికైన దళితమహిళల పాట్లను ఈ కథలు వెల్లడిస్తాయి. పేరుకు మాత్రమే పదవిని అలంకరించిన ఓ మహిళ వ్యధకు దర్పణం పట్టిన కథ 'ఓ సర్పంచి వల(స)పోత''. ఏనాడు ఏ విషయంలోనూ సర్పంచ్‌గా ఆమె నిర్ణయాలు అమలుకాకపోగాఎన్నో అవమానాలను ఎదుర్కొంటుంది గంగమ్మ.'' పేరుకే నేను సర్పంచిని. పెద్దిర్కమంతా పటేలుదే.....కుర్చిల కూనుందామన్న బయమేం. ఏమత్తన్నయి, ఏం బోతన్నయి అని అడుగుదామనుకున్నా బయమే....వూరికి వచ్చే పైసలు, కొత్తలు అంత మా పటేలు వుపసర్పంచే సూసుకునేది. నాతోని ఒక్క ముక్క చెప్పక పోయేది.'' (పుట:63). అని నిట్టూర్చే గంగమ్మలెందరో నేటి సమాజంలో దర్శనమిస్తారు.చిట్టచివరికి ఉన్న కాస్త భూమి కరిగిపోయి అప్పులపాలై, పట్నానికి వలస వచ్చి వాచ్‌మెన్ పోస్టులో కుదురుకోవడం గంగమ్మ దుస్థితిని తెలుపుతుంది. రాణిర్కం కథలో పంచాయితీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన కారణంగా దళితమహిళ సర్పంచ్‌గా ఎన్నికవుతుంది. సర్పంచ్‌గా ఎన్నికైనా, పొట్టకూటికోసం కూలి పని చేసుకోవడం తప్పని ఆర్థిక స్థితి ఆమెది.కూలీ చేసుకునే సర్పంచ్‌గా పేర్కొంటూ ఆమెను గ్రామీణులు అపహాస్యం చేయడం, అవమానించడమనేది దళితుల రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తుంది. పదవులు ఆధిపత్య వర్గాలకే సొంతమని భావించే వర్గం 'ఆ... గీ కూల్నాలి గాల్లకు,అమాంతం సరిపంచిని జేత్తే ఏం జేత్తరు !సరిపంచి అనరానివాళ్లను గ్గూడ గౌరుమెంటు సర్పంచులనేంది, జడ్.పి.టీ.సి లను జేసె, ఎంపిటిసిలను జేసె, అంత జేసినా, గీల్లేం నిలబెట్టుకుంటండ్రు....గదే మాదిగిర్కెమ్.ఉ పసర్పంచుగున్న మన పటేలు చంద్రారెడ్డే లెక్కలు బక్కలు జూత్తడాయె.' (పుట:47) అనడంలో పాలనలో దళిత వర్గాల వారి పాత్ర అవగతమవుతుంది.

దళిత వివక్ష :

తరాలు మారినా అంటు జాడ్యం మాత్రం వదలని వైనాన్ని రిజర్వేషన్ బోగి కథలు వెల్లడిస్తాయి.కూటికి పేదైనా కులానికి గొప్పే అనే దృక్పథంతో మనుగడ సాగించే మనుషుల స్వభావాన్ని అడివిని యిడువని అంటు., కూటికి పేదైనా, రిజర్వెడ్ కాల్ కథలు తెలుపుతాయి. కటిక పేదరికంలోనూ కులం అభిజాత్యాన్ని ప్రదర్శించే వ్యక్తుల మనస్తత్వాన్ని బహిర్గతం చేసిన కథలు ఇవి. అడవుల్లో నివసిస్తూ ఉన్ననాడు తిని,లేనినాడు పస్తులుంటూ బీదరికంలో మగ్గుతున్నవాళ్ళు కూడా దళితులు ఇంట్లోకి రావడాన్ని జీర్ణించుకోలేరన్న చేదు నిజాన్ని ''అడవిని యిడువని అంటు'' కథలో తేటతెల్లం చేశారు రచయిత్రి.కోయగూడెంలో ఉండే పదేళ్ళ వయసున్న సదక్క అనే అమ్మాయి దళితవాడకు చెందిన భద్రక్కను ఇంటికి తీసుకెళ్లి స్టీలుపల్లెంలో అంబలి తాగడానికి ఇస్తుంది.అప్పుడే వచ్చిన సదక్క తల్లి భద్రక్క వివరాలడిగి కోపంతో '' సీ...మాదిగోల్లా.....సదీ .....ఏందే గా మాదిగోల్ల పిల్లందెచ్చి మంచాల గూసోవెట్టి టీలు గిన్నెల బోసి తాగుమనిత్తావే బోసిడీ...యింట్ల టీలు గిన్నె మీద కాయినుపడి కూలికి బయి అంగట్ల కొనుక్కచ్చు కుంటే.....గా మాదిగదానితోని యెంగిలి జేపిత్తివి గదవే...'' (పుట:98) అంటూ అంటువడ్డదని స్టీలు పల్లేన్ని పెంట దిబ్బల పడేయటం తీవ్ర దళిత వివక్షను చూపుతుంది. దళితుల ఇళ్ళలో పనిచేయడానికి కూడా మనసొప్పని మనుషుల స్వభావాన్ని కూటికి పేదైనా కథలో చూడొచ్చు. ఉద్యోగంలో తలమునకలయ్యే ఉపేంద్ర ఇంటిపనిలో సహాయానికి శారదను పెట్టుకుంటుంది.మంచి జీతం ఇచ్చి ఇంట్లో మనిషిగా ఆదరిస్తుంది. అయినప్పటికీ శారద

మాత్రం ఉపేంద్ర దళితవర్గానికి చెందిన విషయం తెలిసిన వెంటనే వారింట్లో పని మానెయ్యడం దళిత వివక్షకు పరాకాష్టగా చెప్పొచ్చు. బ్రాహ్మణుల ఇంట్లో పని చేస్తే పుణ్యమన్న భావన కలిగి ఉండటాన్ని ఉపేంద్ర నిరసిస్తుంది. ముందు ఆధిపత్యవర్గాల ఇళ్లలో పనులు చేసినతర్వాతనే ఇతరుల ఇళ్ళలో పని చేస్తానన్న శారద మాటలను ఖండిస్తూ ఉపేంద్ర "మాగ్గూడా యింగువ ,నేతి గిన్నెలు తోమిన సేతులతోని .... ఆ వాసండ్ల మా గిన్నెలకంటుతన్నయ్, ఆ వాసండ్లు మాగ్గూడా బడయని మేంగూడంటము ' (పుట:35) అని ఉపేంద్ర అనడంలో అణచివేతను ఎదుర్కొనడం స్పష్టంగా కనిపిస్తుంది.

సమాజంలో అంటరానితనం అడుగంటనంతవరకు సమసమాజ నిర్మాణమన్నది ఊహాత్మకభావనగానే మిగిలి పోతుంది. అంటరానితనం రాజ్యాంగరిత్యా నిషేధించ బడినా, మానవ మనస్తత్వంలో మార్పు రానంతవరకూ ఆ నిషేధం మేడిపండు చందమే. మారాల్సిన ఆలోచనల్లో మార్పు లేకుండా ఎన్నిచట్టాలు చేసినా నిరుపయోగమేనన్న భావన ఈ కథాసంపుటిలో వ్యక్తమైంది. రిజక్టెడ్ కాల్ కథలో భద్ర స్నేహితురాలైన భాగ్యలక్ష్మి బడిలో కలిసమెలసి మెలిగినా, ఇంట్లోకి మాత్రం రానివ్వకపోవడం భద్రను కలచివేస్తుంది. వాళ్ల వస్తువులు ముట్టుకుంటే అంటవు తుందని భావించడం, వాకిట్లోనే కూర్చోమనడం,పల్లెంలో కాకుండా పాత పేపరులో తినడానికి పెట్టడం వంటి సంఘటనలనెదుర్కొన్న భద్రకు భాగ్యలక్ష్మి చేష్టలు మానసికంగా ఎంతో బాధిస్తాయి. భాగ్యలక్ష్మి ఫోనొచ్చిం దంటే' మాదిగోళ్ల పిల్లా దూరముండు ' అన్నట్లే విని పిస్తుంది. మానని గాయాలు ఆ ఫోన్ కాల్ ను రిజక్ట్ చేయించడంలో ఆశ్చర్యం లేదు.

దళితులు తమ శరీరరంగు విషయంలోనూ తీవ్రమైన వివక్ష నెదుర్కొనడాన్ని గమనించవచ్చు. ఈ విషయం పట్ల అసహనాన్ని వ్యక్తపరుస్తూ జూపాక సుభద్ర రిజర్వేషన్ బోగి కథను రచించారు. రంగును బట్టి కులనిర్ణయం చేసే కపట మనస్కులను ఈ కథలో ఖండిస్తారు.రైలు లో బెర్త్ ముందుగానే రిజర్వ్ చేసుకొని ప్రయాణించడానికి పూనుకున్న రచయిత్రి ఒక పెద్దమనిషి నుంచి అవమానాన్ని దుర్కొంటుంది." ఎర్రగ బుర్రగ వున్నోల్లు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రిజర్వేషండ్లు ముందే తీసుకొని యెక్కుతరు. 'నల్లగ బక్కగున్నోల్లు రిజర్వేషన్ బోగీల్ల యెక్కరు' అనే అభిప్రాయాలు నరనరాల్లో వూడల్లా దిగిపోయినయి సమాజంల. ఒక రకంగా ఇవి అంటరానితనాలే" (పుట:72) 'రిజర్వేషన్ బోగిలెక్కేదంత సవర్ణ కులాలు, జెండ్రల్ బోగీల యెక్కేదంత అలగా కులాలనే ఒక మీటరుంది. ఆ మూసలోని మాటలు నాలాంటోళ్లకు దప్ప వేరే వాల్లకు పెద్ద తప్పేమనిపియ్యది. అవి నా నవనాడుల్నే కుంగ దీస్తయి. (పుట: 73) అంటుంది.ఈ మాటల వెనకున్న మనోవేదనకు మందులేదు.

దళిత సంస్కృతి :

దళిత వర్ణాల ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ వారి మనోభావాల్ని దెబ్బతీసే వ్యక్తుల నైజాన్ని బహిర్గతం చేసిన కథలు బిందాస్ బీఫ్, నీసు నియ్యతి, ముద్దుకూర, భారతీయ సమాజం భిన్న సంస్కృతులకు నిలయం.ఎవరి అలవాట్లను వారు నిరభ్యంతరంగా కొనసాగించుకోవచ్చు. ప్రధానంగా ఆహారపుటలవాట్ల విషయంలో ఎవరికి నచ్చినట్లు వారు ఎటువంటి ఆహారాన్నైనా స్వీకరించవచ్చు. అయితే దళిత వర్గాల ఆహారపుటలవాట్లు మాత్రమే చర్చనీయాంశాలుగా మారటం ఎంతవరకు సబబన్న విషయాన్ని చర్చకు పెట్టిన కథలు ఇవి.సమాజంలో నిత్యం ఏదో ఒకచోట చోటుచేసుకున్న వాస్తవాంశాలనే కథలుగా మలిచారు రచయిత్రి. కొన్ని వర్గాల ప్రజలు ప్రధానంగా మాంసాహారం తీసుకోవడమన్నది అనాదిగావస్తున్నదే. అయినా నేటికీ ఈ అంశంపై వాదోపవాదాలు,చర్చలు జరగడం, వారిని కించపరిచే విధంగా మాట్లాడటం, ప్రవర్తించడాన్ని రచయిత్రి తీవ్ర కంఠస్వరంతో ఖండిం చడం ఈ కథల్లో గమనించవచ్చు.

దళిత చైతన్యం :

తరాలుగా చదువుకు దూరమై విజ్ఞానానికి ఆవల నిలబెట్టబడిన దళితవర్గీయులు తమ బిడ్డలనైనా బాగా

చదివించాలన్న ఎరుకను కలిగి ఉండటాన్ని ఈ కథలు తెలియపరుస్తాయి. ''మాకు గిట్ల లేకపాయె'' కథ దళిత చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. మాణిక్య బిడ్డల చదువుకోసం ఆరాటపడటంలో దుర్భర జీవితాల నుంచి విముక్తిని కోరుకోవడం గమనించవచ్చు. చదువే జీవితానికాధారమని నమ్మటం ,ఆ చదువు కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడటం ఈ కథల్లో గమనించవచ్చు.

రిజర్వేషన్ బోగి కథాసంపుటి దళితుల సమస్యలను తెరమీదకు తెస్తూ, సమకాలీన సమాజదృష్టిపథంలో నిలబెడుతుంది. అసమానతలను, అణచివేతను,దోపిడీనీ ఎండగడుతూ దళితచైతన్యం ప్రోదిచేసేందుకు దోహదం చేస్తుంది. ఆధునిక జీవనపయనంలో కులం కుంపటిని ఆర్పడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్న పిలుపు నిస్తుంది. దళిత వివక్షకు చరమగీతం పాడాలన్నది రచయిత్రి ఆశయంగా చెప్పొచ్చు.సమన్యాయాన్ని సాధించడానికి , సమసమాజాన్ని నిర్మించడానికి కులం అడ్డుగోడల్ని కూల్చాల్సిన అనివార్యతను ఈ కథా సంపుటి ద్వారా వ్యక్తపరిచారు జూపాక సుభద్రగారు.

ఆధారగ్రంథాలు :

రిజర్వేషన్ బోగి - కథాసంపుటి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – చారిత్రక పరిశీలన

– ఎం. రమాగీతా దేవి, తెలుగు అధ్యాపకురాలు, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల, విజయనగరం.

రత్నగర్భ భారతదేశం. మన దేశ సంపద ఎంత గొప్పదో ఆ సంపద సృష్టించిన చేతులకు కులం రంగు పులమటం అంత నికృష్టం. ఈ కులంలో పుట్టినవారు ఈ పనే చేయాలనే తత్వం, కొందరికి శాపం, కొందరికి వరం, సామాజిక అణచివేతలకు గురి అయ్యిన మనుషులను రెండుగా విభజించబడి, మూడుగా చీల్చబడి, నాలుగు ముక్కలుగా నరికి వేయడం జరిగింది. చరిత్ర పొడుగునా ఇలాంటి సంఘటనలు అనేకం.

అనాదికాలం నుండి వర్ణవ్యవస్థ సూత్రాలలో తక్కువ జాతి వారిని శిక్షణ, సామాజిక, ఆర్థిక, ధార్మిక అధికారాల నుండి దూరం చేయబడి పెద్దజాతి వారి అహంకారంతో అణచివేయబడి, పశువులవలే అమ్మబడి, నీచంగా, హీనంగా చూడబడి సమాజంనుండి దూరంగా నెట్టి వేయబడిన వారే 'దళితులు' దళితుల సుదీర్ఘ చరిత్ర తెలుసుకునేముందు దళిత పదానికి అర్థం తెలుసుకోవాలి. సంస్కృతంలో 'దళ్' అంటే బలవంతంగా తెరచుట, చింపుట, విరుచుట, విసురుట, కాలిక్రింద కుమ్ముట మొదలైన అర్థాలు వస్తాయి. దానికి కృదంత 'తిత్' శబ్దానికి విరిగిన, చినిగిన, అణిగిన మొదలు అర్థాలు వస్తాయి. దళిత శబ్దానికి హిందీలో చీల్చబడిన, ఖండించబడిన, ఛేదించబడిన, అణచివేయబడిన అర్థాలున్నాయి. విసిరివేయబడిన, అన్ని రంగాల్లో ఖండించిబడినవారు సమాజంలోనుంచి చీల్చబడి విసిరివేయబడిన వారు అనే అర్థం సూచిస్తుంది.

తెలుగులో దళ్ అంటే సమూహం అని అర్థం. దళిత అంటే వికసించబడిన అనే అర్థం కూడా వస్తుంది. ప్రాచీన కాలంలో "దళిత" అనే వారు గొప్ప వీరులగా పిలువబడే వారు. ఆర్యుల రాకతో వారి గొప్పసైన్యం ముందు వీరు గెలవలేక బానిసలుగా అణచివేయబడ్డారు.

దళితజాతి ప్రజలపై అతి ప్రాచీన కాలంనుంచే అన్యాయం జరుగుతూనే ఉంది. నాలుగు యుగాలలో వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మణికాలు, అరణ్యకాలు, స్మృతి గ్రంథాలు, పురాణాలు, ధర్మ సూత్రాలను ఆధారంగా చేసుకుని అణచివేయుట జరిగింది. పంచమ కులస్థులుగా ముద్రవేసి ఊరికి దూరంగా నెట్టబడి నీచమైన వృత్తులు అంటగట్టి అస్పృశ్యత పాటిస్తూ కనీస మానవులుగా గుర్తించలేదు మన సమాజం. దీనికి పూర్వజన్మలో చేసుకున్న కర్మలే కారణమనే అభూత కల్పనతో కూడిన కర్మ సిద్ధాంతాన్ని చెప్పి ఎన్నో తరాలు హీనంగా చూస్తూ వచ్చారు. జీవిస్తూ వచ్చారు.

బౌద్ధ జైన మతాలు కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించాయి. తరువాత శైవ వైష్ణవ మతాలు కూడా తీవ్రంగా ప్రతిఘటించాయి. దళితుల్ని జనజీవన స్రవంతిలోనికి తీసుకురావడానికి హిందూమత మౌఢ్యంపైన బ్రాహ్మణ వ్యవస్థపైన దాడిచేసాయి. ప్రాచీన సాహిత్యంలో వర్ణ వ్యవస్థను నిరసించిన కవులున్నారు. అయితే ఆ నిరసన భక్తి మార్గంలో, తాత్విక దృక్పథంతో జరిగింది.

కృతయుగంలో సత్యవ్రతుడు, త్రిశంకుడు, త్రేతాయుగంలో జాబిలి, శంభూకుడు, ద్వాపర యుగంలో వ్యాసుడు, కర్ణుడు, కలియుగంలో ఎందరో దళితులు కావడం వలన అవమానాలకు గురయ్యారు. ప్రాచీన సాహిత్యంలో 12వ శతాబ్దానికి చెందిన మల్లికార్జున పండితుడు శివతత్వ సారంలో శివభక్తుడైన దళితుడు పూజకు అర్హుడని, అతన్ని కులం తక్కువ వాడిగా చూడవద్దని సిద్ధాంతం చేశాడు. చెన్నయ్య అనే దళితుడు శివభక్తుడై విముక్తి పొందినట్లు చూపించాడు. పాల్కురికి సోమనాథుని "పండితారాధ్య చరిత్ర" లో 'సామవేదికథ' కూడా భక్తి తత్పరత కలిగినవాడు దళితుడైనా పూజకు అర్హుడని పేర్కొన్నాడు.

వైష్ణవంలో ఒక ఆళ్వారు పంచమవర్ణంలో జన్మించిన ''తిరుప్పాణి'' పరమ భక్తుడై శ్రీరంగ క్షేత్రంలోకి వెళ్ళకూడదని దూరంగా ఉండి భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తాడు. రంగనాథుని ఆదేశానుసారం సారంగముని భుజాలపై దైవ సన్నిధికి చేరుకుంటాడు. ఈవిధంగా తిరుప్పాణి ముని వాహనుడవుతాడు. 14వ శతాబ్దానికి చెందిన అన్నమాచార్యుడు తన సంకీర్తనల్లో రాజునిద్ర, బంటు నిద్ర ఒక్కటే నని బ్రాహ్మణుని మెట్టు భూమి, దళితుడు ఉండే భూమి ఒక్కటే అని చెప్పి అస్పృశ్యతా దురాచారాన్ని ఖండించాడు. శ్రీ కృష్ణదేవరాయలు ఆముక్త మాల్యదలో మాలదాసరి వృత్తాంతం కూడా చెప్పవచ్చు. తరువాత వచ్చిన వేమన, పోతులూరి వీర బ్రహ్మం మొదలగువారు దురాచారాలను ఖండించారు.

మాల మాలగాడు మహిమీదనే ప్రొద్దు
మాట తిరుగువాడు మాలగాన
వాని మాలన్నవాడె పొపెను మాల...

కులం కంటే గుణం గొప్పదని మాట తప్పినవాడు మాలగాని మాల మాల కాదు అని వేమన అభిప్రాయం. పోతులూరి వీరబ్రహ్మంగారు ''దేవుళ్ళకు లేని అంటు, పంచభూతాలుకు లేని అంటు ఈ మనుషులకేల కక్కా!'' అని ప్రశ్నిస్తాడు.

ఆధునిక యుగంలో సంఘ సంస్కరణోద్యమం, గాంధీ రాజకీయ ప్రవేశం ముందే మన ఆంధ్ర దేశంలో అస్పృశ్యత నిరాసన కవిత్వ చైతన్యం కన్పిస్తుంది. ఆంధ్రభారతిలో అచ్చయిన ''మాలవాండ్ర పాట'' కర్త ఎవరో తెలియకపోయినా ''అందారుపుట్టిరి హిందమ్మ తల్లికి... అంటూ ముందుచూపుతో బ్రాహ్మణులు మా కంటే ఎలా ఎక్కువ మమ్మల్ని సోదరుల్లా చూడమనే అభ్యర్థన ఈ గేయంలో కన్పిస్తుంది.

1910లో గురజాడ అప్పారావు ''లవణరాజుకల'' గేయంలో అస్పృశ్యతా నిరసన స్పష్టంగా కన్పిస్తుంది.

మలిన దేహులు మాలలనుచు
మలిన చిత్తుల కథిక కులముల
నెలవొసంగిన వర్ణ ధర్మ
మధర్మ ధర్మంబే....

అని దేహాలు మలినమైనంత మాత్రాన వారిని అస్పృశ్యులని మనసులో మలిన మున్నవారికి అధిక కులాలలనే అధర్మాన్ని నిరసించాడు.

మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండు కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనే నగుదున్

అని పంచములతో మమేకం అయినాడు. తరవాత గురజాడ మార్గాన్ని ఎందరో అనుసరించారు.

మంగిపూడి వెంకటశర్మగారు 1915 నిరుద్ధ భారతంలో జాతికి వెన్నెముక అయిన అట్టడుగు వర్గాలవారిని అస్పృశ్యత పేరుతో దూరం చేయడం ఆత్మహత్య సదృశ్యమని ఆవేదన చెందాడు. తరువాత గాంధీ కొత్తగా ''పంచములని'' అంతవరకూ ఉన్న పదం స్థానంలో హరిజన అనే పదాన్ని సృష్టించి వ్యాప్తిలోకి తెచ్చాడు.

గరిమెళ్ళ సత్యనారాయణ ''మాకొద్దీ తెల్ల దొరతనం'' గేయంలో ''అంటుదోషం మాకు లేదండీ... పాపమంటూ చాటుదాం రండి'' అంటాడు.

కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్ల దొరతనం, హరిజన శతకంలోనూ హరిజనుల హీనమైన కడగండ్లను హృద్యంగా ఆవిష్కరించాడు.

పన్నెండు మాసాలు పాలేరు తనమున్న
పస్తుల బడి బ్రతుకులండి... ఈ కులమనే నిప్పుపై మేయక నిలువలేమో తండ్రి అని తెగెసి చెప్తాడు.

గాంధీ పలికిన 'హరిజన' అన్న పదాన్నే కాకుండా, పంచములు అన్న పదాన్ని కూడా చాలామంది విముఖత వ్యక్తం చేశారు. తమని తాము ఆది ఆంధ్రులుగా పిలుచుకోవడం మొదలు పెట్టారు. హరిజనులు, పంచములు, ఆది హిందువులు, ఆదియాంధ్రులు, మాలలు మొదలైన

పేర్లతో పిలువబడినవారు ఆ తరువాత వచ్చిన భావ, అభ్యుదయ, విప్లవ, కవితోద్యమాలతో హరిజన సమస్య కొంచెం వెనుకబడి పోయింది. మార్క్సిస్టు భావజాలం నేపథ్యంలో వచ్చిన అభ్యుదయ విప్లవ సాహిత్యోద్యమాలు ఎక్కువగా వర్గదృష్టితో ఆలోచించాయి. వర్గపోరాటం జరిగి సమసమాజ స్థాపన జరిగితే కుల సమస్యల కూడా దానంతట అదే అదృశ్యం అయిపోతుందని భావించారు. అయితే వర్గ దృక్పథంతో కులాన్ని చూస్తే సమస్యకు పరిష్కారం దొరకదు. కేవలం వాదతెరల్ని ఛేదిస్తూ దేశ విముక్తి సాంఘిక సాంస్కృతిక విముక్తితో నిమిత్తం లేకుండా జరగడం అసాధ్యం.

కులమత వివక్ష ఒక్కోసారి ఆర్థిక సమస్యలకు కారణమవుతుంది. శ్రమ జీవుల్ని విభజించి శ్రామిక వర్గ ఐక్యతలను దెబ్బతీస్తుంది. అందుకే కులమత వివక్ష పోరాటాలు ప్రత్యేకంగా జరగాలని, అధిక సంఖ్యాకులైన దోపిడీలకు గురవుతున్న నిమ్న వర్గాలువారు బాగు పడితేనే దేశం బాగుపడుతుందని అవగాహన ఎక్కువైంది. అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటంలో దళిత చైతన్యం మొదలైంది. దళితులమీద విస్తృతమైన చర్చ జరిగింది. జ్యోతిరావు పూలే, డా॥ బి.ఆర్. అంబేద్కర్, సాహు మహారాజ్, ఇ.వి. రామస్వామి, నారాయణగురు, కాన్షీరామ్, ఆంధ్రప్రదేశ్‌లో కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్న కృషి చేశారు. కొలకలూరి ఇనాక్, కలేకూరి ప్రసాద్, సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్, శివసాగర్, గౌరిశంకర్, మొ॥గు వారు దళితవాదాన్ని, సమస్యను, ఒక భావన, ఒక సంఘటనలను తీసుకుని తాత్విక నేపథ్యంలో వెలువ రించే సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు.

స్త్రీవాదం తనకు తెలియకుండానే కొన్ని పరిమితులను లోబడి అట్టడుగు దళిత వర్గాల స్త్రీల సమస్యలను పట్టించుకోలేదనే విమర్శను ఎదుర్కొన్న నేపథ్యంలోంచి దళిత స్త్రీలు తమ కోణంనుండి లింగపరంగా, కుల పరంగా, తాము ఎదుర్కొంటున్న సమస్యలను సాహిత్యంగా తీసుకు వచ్చారు. చల్లపల్లి స్వరూపరాణి, జి. విజయలక్ష్మి, వినోదిని మొదలగువారు దళిత స్త్రీలు ఇంట్లో పురుషాహంకారాన్ని సమాజంలో కుల వివక్షను, శ్రమదోపిడికి గురిఅయ్యి అవమానాలు ఎదుర్కొం టున్నారో ఆకలి, దారిద్ర్యంలో దళిత స్త్రీలు పని మనుషులుగా మిగిలిపోతున్నారో మొదలగు అన్ని విషయాలు ఆవిష్కరించారు.

దళిత సాహిత్యంలో ప్రధానంగా ఎదుర్కొంటున్న ఆరోపణ ఏమిటంటే దళిత కవులు ఉపయోగిస్తున్న భాషపట్ల అభ్యంతరం, దళిత దృక్పథం నుండి అగ్రకుల ప్రగతివాదులు కూడా సాహిత్య సృష్టి చేయడం జరిగింది. అయినా ఇది ఇంకా ఎక్కువగా రావాల్సిన అవశ్యకత ఉంది.

దళితులు సంఘంలో కోరేది తమ అస్తిత్వానికి అర్థం, వ్యక్తిత్వానికి ఆత్మ గౌరవం, లోకం ప్రదర్శించే నీచత్వం, హైన్యంనుంచి విడుదల నలుగురితో సమానంగా, స్వతంత్రుడిగా, స్వేచ్ఛగా, ఆర్థిక, రాజకీయ, సాంఘిక, ధార్మిక చైతన్య శక్తిగా దళితులు ఎదగాలి.

ఉపయుక్త గ్రంథాలు :

1) తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి ప్రచురణ.
2) ఆధునిక సాహిత్యం - దళిత స్పృహ - యువభారత ప్రచురణ.
3) దళిత సాహిత్య నేపథ్యం - డా॥ ఎస్వీ సత్యనారాయణ.
4) హింది మరియు తెలుగు దళిత ఆత్మకథల తులనాత్మక అధ్యయనం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం–సామాజిక చైతన్యం

– డా॥. టి. పార్థసారథి, విశ్రాంత విద్యాధికారి. (గిరిజన సంక్షేమం), కన్నాపురం, ఏలూరు జిల్లా.

ఇది దళిత యుగం.

దళిత సాహితీ యుగం.

దళిత సాహిత్యం దళిత సామాజిక ప్రతిబింబం.

అనాదిగా అగ్రవర్ణాల చేత అణిచివేయబడ్డ వర్గాలు దళితులు.

వీరు సమానత్వానికి, సంపదకు దూరమై, మన సమాజంలో కటికదారిద్ర్యాన్ని అనుభవిస్తూ, పడరాని పాట్లు పడుతూ, అగ్రవర్ణాల దౌర్జన్యాలకు బలి అవుతూ, వాళ్లకే పరిచర్యలు చేస్తూ, ఊరి బయట తలదాచుకునే స్థితికి నెట్టబడ్డారు. మనుషులంతా ఒక్కటే అయినా మనిషికి మనిషికి మధ్య చెప్పరా అని అంతరాలు సృష్టించబడ్డాయి.

ఆంగ్లేయుల రాక వలన, సంఘసంస్కర్తల ప్రభావం వల్ల, దళితుల జీవితంలో చైతన్యం వచ్చింది. తదను గుణంగా తెలుగు సాహిత్యంలో ,''దళిత అభ్యుదయం ''చోటుచేసుకుంది.

దళిత వాదం తెలుగు సాహిత్యంలో 1975లో ప్రారంభ మైన, 1985 నాటికి అసలు రూపం దాల్చింది. దళితులు సాహిత్యం నిర్మించడం ఈ శతాబ్ది మొదటి నుంచే ఉంది. దాని ఆరంభమే చైతన్యంతో ఉంది. జాషువా 1920 నుండి రచనలు చేశారు. తన వ్యక్తిత్వం ప్రతి బింబించే సాహిత్యం పుట్టేసరికి జాషువా ఒక సాహిత్య చైతన్యమయ్యారు. బోయి భీమన్న దళిత స్పృహ ఉన్న సాహిత్యం స్వాతంత్రానికి ముందుగానే వచ్చింది. స్వాతంత్రం తరువాత ఇనాక్ దళిత భావన ఉన్న సాహిత్యం వెలుగు చూసింది. జాషువాను దళిత సాహిత్య ప్రారంభకులుగా అందరూ అంగీకరిస్తున్నారు. భీమన్న దళిత సాహిత్య భావన అంగీకరించబడలేదు.

నిర్వచనం :

1) అనాదిగా అస్పృశ్యతకు గురై' మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి, విద్యా సౌకర్యాలు కరువై, సమాజంలో ప్రధాన జీవన స్రవంతికి దూరమై ఆర్థిక అణచివేతకు, శ్రమ దోపిడీకి గురైన వాళ్ళు'' దళితులు''గా చెప్పవచ్చు.

2) కుల వ్యవస్థ కారణంగా, రాజకీయంగ,' ఆర్థికంగా, సామాజికంగ,' అణచివేయబడిన శ్రామికులే ''దళితులు ''అని , కే. సత్యనారాయణ నిర్వ చించారు.

అయితే ఈ'' దళిత ''అనే పదాన్ని వాడవద్దని ఇటీవల సుప్రీంకోర్టు ఒక తీర్పులో పేర్కొంది.

దళిత సాహిత్య నిర్వచనాలు :

దళితులు తమ ఆవేదనను, ఆర్తి నీ, అనాదిగా అనుభవించిన వివక్షతలను, తామే స్వాను భవంతో, అక్షర రూపంలోకి తెచ్చుకోవడమే ''దళిత సాహిత్యం.''

దళితుల ద్వారా, దళితుల కోసం రాయబడే సాహిత్యమే'' దళిత సాహిత్యం''..

దళిత సాహిత్య లక్షణాలు :

దళిత సాహిత్యం అనుభూతి విశిష్టమైనది . జీవితాన్ని, సమాజాన్ని, యధాతధంగా ప్రతిబింబించడం దీని లక్షణం.

దళిత దృక్పథంలో జీవితమే సాహిత్యం. కనుక సాహిత్యాన్ని ప్రజలకు మధ్య ఉన్న ఖాళీని పూరించే దిశగా కృషి చేస్తుంది. మానవ జీవితంలో చైతన్య స్ఫూర్తిని కలిగి స్తుంది.స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువల ప్రాతిపదికగా ఏర్పడే సహజ నిర్మాణాన్ని ఆస్వాదిస్తుంది. హేతువాద దృష్టిని కలిగి పురాణ భావనలు, మత సిద్ధాంతాలు, అశాస్త్రీయమైన భావనల్ని ఖండిస్తుంది.

సమాజంలో సంస్కరణ భావాలు రేకెత్తించడానికి సాహిత్యం ఒక సాధన కావాలని దళిత సాహిత్యం భావిస్తుంది.

సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కలిగించేదిగా ఉండాలని ఆశిస్తుంది.

సామాజిక, ఆర్థిక న్యాయం కోసం పోరాడటమే దళిత సాహిత్య ప్రధాన లక్షణం.

ఈ దిశగా చేసే పోరాటంలో ఉన్నత వర్గాలు కూడా దళితుల గురించి ఆలోచించేలా చేసింది దళిత సాహిత్యం.

అంబేద్కర్, ఫూలే ,మార్క్స్ రచనలనీ, సిద్ధాంతాలని అర్థం చేసుకుంటే దళిత దృక్పథం అర్థం చేసుకోవడం తేలిక అవుతుంది.

భారతదేశంలో ప్రబలంగా ఉన్న కుల సమస్య, అస్పృశ్యత వంటి నేపథ్యంలో దళితుల బానిసత్వాన్ని ప్రతిఘటిస్తూ..

దళితులు కవిత్వం రాయడం ప్రారంభించారు. మొదట గుర్రం జాషువా రచించిన కవిత్వం నేటి దళిత కవిత్వ ధ్యేమానికి భూమిక గా నిలిచిందని చెప్పొచ్చు.

దళిత వాద నేపథ్యంతో ఉన్న కొన్ని రచనలు పరిశీలిద్దాం.....

కత్తి పద్మారావు గారు దళితవాదంతో రచించిన కవిత "అవును ఈ యుగం మాది" లో "యుగం మాది "అంటే వ్యక్తి కాదు... దళిత నముద్రపు ఘోష. అని తెలియజేశారు.

"అవును ...నా గాయాలన్నీ గర్వపడేవే.. నేల కన్నీటి బొట్లతో.....

మనిషి అంతరంగం ఎంత వెతికినా వేదనే దొరుకు తుంది..." అని కత్తి పద్మారావు గారు దళిత వేదనని ఈ కవితలో తెలియజేశారు.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చినప్పుడు, అంబేద్కర్ విగ్రహం శిరస్సును ఖండించి నప్పుడు చలించి పోయిన ఎండ్లూరి సుధాకర్ గారు, "ఒక విగ్రహం ..ఒక నిగ్రహం" అనే కవిత రాశారు.

దళితుల్ని అవమానించడానికి అంబేద్కర్ విగ్రహ శిరస్సు కనిపించిందా? అని ప్రశ్నించారు. రాజ్యాంగ రూపకల్పనని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేశారని, అందరికీ ఆత్మగౌరవాన్ని కలిగించిన వ్యక్తి మా దీన బాంధవుడని ఇందులో పేర్కొన్నారు.

అంబేద్కర్‌ని అవమానించడమే ఉద్దేశమైతే ఈ దేశంలో మట్టితో చేసి పూజించే దేవుళ్లకు పుట్టగతులు ఉండవని ఈ కవిత ద్వారా తెలియజేశారు.

ఎండ్లూరి సుధాకర్ గారు తన ఆవేదనను వ్యక్తం చేస్తూ...

"బాబా సాహెబ్ లేకపోతే భావి భారత దేశమే లేదు..... .జరిగిన నష్టానికి పరిహారం పశ్చాత్తాపమే పూలహారం "అని తెలిపారు.

వెట్టి చాకిరీని వ్యతిరేకిస్తూ, అరుణ్ సాగర్.." హూ లెట్ ద డాగ్స్ ఔట్" .....అనే కవిత రాశారు. ఎడారిని కప్పిన ఆకాశం, మనుషుల మధ్య నుంచి దారి చేసు కుంటూ, సముద్రంలోకి దూకిన మనిషి ఎక్కడికి పారి పోతావంటూ ప్రశ్నించాడు. మనిషిని తన కులం ఏంటి అని ప్రశ్నిస్తూ, పక్కనోడు చనిపోతుంటే పట్టించుకోని మనిషి తత్వాన్ని దుయ్య బట్టారు.

బతుకమ్మ పండుగ వస్తే, కుల ప్రస్తావన లేకుండా ఓట్లు అడుక్కునే సమయంలో, అమలుకు వీలుకాని పథకాల వలలతో, ఓట్లు వేటకు వచ్చిన రాజకీయ నాయకుల తీరును కృపాకర్ మాదిగ గారు "పాద యాత్రలన్నీ దండయాత్రలే" అనే కవితలో ఎండగట్టారు.

చుండూరుమారణ కాండపై వచ్చిన తీర్పుని ఖండిస్తూ, తుల్లి మల్లి వెల్సన్ సుధాకర్ గారు "మట్టి పువ్వు సైతం కులం పాటకు పత్రహరితం" అనే కవితను రచించారు. దళితులు అన్ని రంగాలలో రాణించడం పురోగమించడం, ఓర్వలేని కళ్ళ దాస్టీకానికి ఈ కవిత

అద్దం పడుతుంది .దళితులు చదువుకొని పైకి ఎదగడం భరించలేని అగ్రవర్ణాలు దళితుల్ని చంపడానికి, వారి పొలాలని నాశనం చేయడానికి, వెనుకాడర నే సత్యాన్ని వీరి కవిత ద్వారా విల్సన్ సుధాకర్ తెలియజేశారు. చంపిన వారు తెలుగువారే. చనిపోయిన వారు తెలుగువారే. 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' పెటాకులై సమకాలీన సమాజాన్ని ముక్కలు చేస్తూ ,దళితులపై అగ్రవర్ణాలు వేట కుక్కల దాడి చేసిన తీరుని వీరి కవిత తెలియ జేస్తుంది.

కుల వివక్ష పై ఎండ్లూరి సుధాకర్ గారు దళిత వాదంతో రాసిన మరో కవిత,,'' తూటా బండి''.

''నేను రైలెక్కినప్పుడల్లా మూడో తరగతి రైలు డబ్బాలనే గమనిస్తుంటాను..... మా వాళ్లు చీపుళ్లు పట్టకపోతే రైలు పట్టాల మీద మలం పోదు.''

రైలు బండి ఎక్కితే కవికి మేకల మండి గుర్తుకొస్తుంది అంట. సుఖంగా ప్రయాణం చేయడం అంటే సుఖ ప్రసవం జరిగినట్టుగా కవి పేర్కొన్నాడు. సీటు ఉన్నవారు, లేనివారు, ప్రాణాలకు తెగించి రైలు ఉపరితలంపై ప్రయాణించేవారు, ఏ తరగతి, ఏ వర్గం, ప్రయాణికులని ప్రశ్నించాడు. మన దేశంలో బుల్లెట్ రైలు, కొత్త రైల్వే లైన్లు, ఎవరికోసమని ప్రశ్నించాడు. జలాలను, పొలాలను చూస్తూ హాయిగా ప్రయాణించే జనతా రైళ్లు కావాలని కవి కాంక్షించాడు. దళిత జీవితాలన్నీ అంటరాని ప్రయాణా లతో ఆదిశంకర అవమానాలతో అతలాకుతలం కాకుండా ఆదర్శప్రాయంగా ఉండి దళితుల్ని అందరితో సమానం గా గౌరవించాలని కవికాంక్షించాడు.

దళిత కవిత్వం ఉద్యమంతో విడదీయలేని బంధం ఉన్న కవి శిఖామణి గారు. దళిత పేద జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చూపే కవిత'' ముత్యాలు గారి నిలువుటద్దం''.... ఎవరైనా అద్దం ముందు నిలబడి చూసుకుంటే అర్థం కాస్త పెద్దదిగా కనిపిస్తుంది. భాగ్యనగరంలోని ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ వంటివి చూసి, వాళ్ళ ఊరి చెరువుతో పోల్చుకుంటూ, దళిత జీవితాన్ని నెమరు వేసుకునే విధంగా ఈ కవిత దర్శనమిస్తుంది.

''నుగారు మీనకట్టు మూతి మీద మొలుస్తుండగా.....
కలల ప్రపంచంలో ఊరేగించిన మాయా దర్పణం ముత్యాలు గారి నిలువుటద్దం.''

మట్టి ఇల్లు, కంపదడి గోడలు, అరచేయి అంత అధ్చం, పిచ్చుక గూడంత దీపం గూడు, చింపిరి జుట్టు, చీమిడి ముఖంతో, ఎగిరెగిరి అద్దంలో చూసుకుంటుంటే.. ముక్కు కనబడితే, కన్ను కనబడదు. కన్ను కనబడితే ,ముక్కు కనబడదు. కంటికి పెట్టగా మిగిలిన కాటుక రేఖలు, నుదుటిదిద్దగా మిగిలిన కుంకుమ రజను తో ఉన్న ఇంటి గోడలు వంటివన్నీ దళిత పేద జీవితాన్ని చిత్రిస్తాయి.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో దళిత కవితో ద్యమం బహుముఖీనంగా కొనసాగుతోంది. ఎందరో దళిత కవులు సామాజిక బాధ్యతగా, దళిత స్పృహతో కవిత్వ రచన కొనసాగిస్తూ, దళిత చైతన్యం కోసం పోరాడుతున్నారు. సాంఘిక అసమానతలను రూపుమాపే దిశగా కవిత్రీకరిస్తున్నారు. ఈ దిశగా సాగుతున్న ఉద్యమంలో దళిత సాహిత్యం మరింత పరిపుష్టమై, సామాజిక అసమానతల్ని, రుగ్మతల్ని, రూపుమాపి సమసమాజ స్థాపన జరగాలని కాంక్షిద్దాం.

ఆధార గ్రంధాలు :

1.ఆచార్య పింగాళి లక్ష్మీకాంతం... సాహిత్య శిల్ప సమీక్ష .
2.ఆచార్య కాకర్ల వెంకట రామనరసింహం ...సాహిత్య దర్శనం .

3.ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి ...ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయం ..ప్రయోగం.

4.ఆచార్య ఎస్ వి రామారావు... తెలుగు సాహిత్య విమర్శ .

5.డాక్టర్ ద్వాదశి నాగేశ్వర శాస్త్రి... తెలుగు సాహిత్య చరిత్ర.

6. తెలుగు వ్యాస పరిణం.. ఆచార్య కొలకలూరి ఇనాక్.

7. తెలుగు సాహిత్యం పై ఆంగ్ల ప్రభావం.. ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు.

8 ఆచార్య డివి శ్రవణ్ కుమార్.. దళిత కవిత్వం సామాజిక చైతన్యం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం - శ్మశాన వాటి తాత్వికత

- వద్ది వెంకటరమణమ్మ
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
రాజమహేంద్రవరము, తూర్పు గోదావరి జిల్లా.

- డా॥. మోగంటి సుధామయి
తెలుగు శాఖాధ్యక్షులు,
ఆర్ట్స్‌కళాశాల,
రాజమహేంద్రవరం.

తెలుగుగడ్డపై తెలుగు బిడ్డగా పుట్టిన ప్రతి ఒక్కరూ గర్వంగా విర్రవీగుతూ చెప్పుకోవలసిన కవి గుఱ్ఱం జాషువా. తెలుగు పద్యానికి సుమధుర సౌరభాన్ని అద్దిన కవుల్లో ప్రముఖులు గుఱ్ఱం జాషువా. సామాజిక, సాహిత్య అననుకూల వాతావరణంలో వికసించిన కవికుసుమం జాషువా. "సుకవి జీవించు ప్రజల నాయకులయందు" అన్నట్లుగా తెలుగులో 'ఖండకావ్య' ప్రక్రియకు అఖండ ఖ్యాతిని సంతరింపజేసిన జాషువా తెలుగుజాతి గుండెల్లో మెండుగా నిండిపోయారు. ఆయన రచించిన అనేక కావ్యాలూ, ఖండకావ్యాలూ ఆధునిక తెలుగు కావ్యావరణంలో సరికొత్త వాతావరణానికి ఊపిరి లూదాయి.

గుఱ్ఱం జాషువా కవితా వస్తువు సమకాలిన కవుల వస్తువుకంటే భిన్నమైంది. ఆయన చెప్పిన అంశం వర్ధమానమైనా, గతకాలమైనా సామాజికమైనా, చారిత్రక మైనా ఆవస్తుతత్వాన్ని దర్శించే చూపు ప్రత్యేకమైంది. ఆవిష్కరించే తీరు విశిష్టమైంది. అందుకే కవికోకిల, కవితావిశారద, కవిదిగ్గజ, నవయుగకవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ వంటి బిరుదులూ, గండపెండేరాలు, గజారోహణలు వరించాయి.

జాషువా కవీంద్రుని కలం నుండి జాలువారిన అద్భుత ఖండకావ్యం ఈ 'శ్మశానవాటి' మానవులు జీవించి వుండగా వెళ్ళుటకు గాని, చూచుటకు గాని ఇష్టపడని ప్రదేశాలు రెండు 1.వైద్యశాల 2.శ్మశానం / వల్లకాడు/ రుద్రభూమి 'జాత్యస్యహిధ్రువం మృత్యు.' అంటారు. పుట్టిన ప్రతివాడూ గిట్టక తప్పదు. ఈ లోకంలో చావును తప్పించుకున్న వాడెవ్వడూ లేడు. అందరూ ప్రస్థానానికి వెళ్ళవలసిన వారే. అందుకే దువ్వూరి రామిరెడ్డిగారు 'పానశాల'లో "అంతంలేని ఈ భువనమంతయూ ఒక విశాల పాంథశాల, విశ్రాంతి గృహం. అందు ఇరు నంజెలు రంగుల వికిలుల్.. కొంత నుఖించి పోయిరెటకో.." అని అంటాడు. అయినా స్మశానం అనే పేరు వినగానే మనిషికి ఏదో భీతి, గుబులు. అట్టి శ్మశానాన్ని తన కవితావస్తువుగా ఎంచుకున్నాడు జాషువా. ఈ ఖండికలో మొత్తం 8 పద్యాలున్నాయి. ఒక్కో పద్యం ఒక్కో ఆణిముత్యం. ఇది జీవిత తాత్వికతను సామాజికతతో ముడిపెట్టి లోతైన సత్యాన్ని తెలియజేస్తాయి. "జీవనంబు క్షణభంగురం యౌవనం ఝరీవేగతుల్యం కావున బుద్ధిమంతుడు". అని చిన్నయసూరి 'నీతి చంద్రిక'లో అంటాడు. కావున మనిషి బ్రతికి వుండగానే సత్యాన్ని తెలుసుకోవాలి. అనే సత్యాన్ని, తత్వాన్ని జాషువా ప్రబోధిస్తాడు.

"ఎన్నోయేండ్లు గతించిపోయినవి గానీ, యీశ్మశాన స్థలిన్
గన్నుల్ యెరాడ్చిన మందభాగ్యుడొకడైనన్ లేచిరాడక్కటా!
యెన్నాళ్ళీ చలనంబులేని శయనంబేతల్లులల్లాడిరో!
కన్నీటంబడి క్రాగి పోయినవి నిక్కంబిందు పాషాణముల్"!

ఎన్నో వేల సంవత్సరాలుగా ఈ శ్మశాన వాటికలో నిద్రిస్తున్నవారు కూడా లేచిరాలేదు గదా! అయ్యో! ఈ కదలిక లేని నిద్ర ఇంకా ఎన్ని సంవత్సరాలుంటుందో అంటూ కవి వాపోతాడు. ఈ శ్మశానంలో తమ బిడ్డల్ని

పోగొట్టుకున్న తల్లుల రోదనలతో నిండిన కన్నీటిలో పడి ఇక్కడి రాళ్ళు సైతం నిజంగా క్రాగిపోయాయి. అంటూ కవి చింతిస్తాడు. ఇది కవి హృదయం.

ప్రకృతి గతి తప్పి ఆకాశంలో కారుమబ్బులు కమ్మి చిమ్మచీకటి నిండిపోయి దయ్యాలు, గుడ్లగూబలు చెరలాడచూ, కాకులు మూకుమ్మడిగా చోలచేస్తే ఎలా ఉంటుందో 2వ పద్యంలో చెబుతాడు.

''ఆకాంశబును కాఱుమబ్బుగములా హారించె, దయ్యాలతో
ఘూంకంబుల్ జెరలాడసాగినవి వ్యాఘోషించె సల్దిక్కులన్
గాకోలంబులు గుండెరుఘుల్లు మనుచున్నంగాని, యిక్కాటియం
దాకల్లాడిన జాడ లేదిచట సౌఖ్యంబెంత క్రీడించునో!''

ఆకాశాన్ని దట్టమైన మేఘాలు కప్పగా చిమ్మచీకటిలో నిండిపోయింది. ఈ శ్మశానంలో గుడ్లగూబలు దయ్యాలతో కలసి ఆటలాడుతూ ఉంటాయి. కాకులు మూకుమ్మడిగా చేరి నాలుగు దిక్కులలోను పెద్దపెద్దగా అరుస్తూ ఉంటాయి. అట్టి శ్మశానాన్ని తలచుకుంటే చాలు భయంతో గుండె ఝల్లు మంటుంది. ఇక్కడ ఒక్క ఆకు కూడా కదిలిన జాడకనిపించదు. అంతా నిశ్శబ్దం శ్మశాననిశ్శబ్దం. దీన్ని బట్టి శ్మశానంలో సౌఖ్యం బాగా ఆడుకుంటోంది అంటాడు కవి.

ఈ రుద్రభూమికి చెడ్డవాడు మంచివాడు, హతుడు - హంతకుడు ఇద్దరూ సమానమే. ఈ నేలలో కవి, రాజు, లేత యిల్లాలి మాంగల్యం, చిత్రకారుడు.. అందరూ ఆయుష్షు తీనార ఇక్కడ విశ్రమించాల్సిందే అంటున్నాడు ఈ పద్యంలో..

''ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము
నిప్పులలోన గఱగిపోయె
యిచ్చోటనే భూములేలు రాజన్యుని
యధికారముద్రికలంతరించె
యిచ్చోటనే లేత యిల్లాలి నల్లపూసల సొరు
గంగలో గలసిపోయె
ఇచ్చోటనే నెట్టి పేరెన్నికం గనుగొన్న
చిత్రలేఖకుని కుంచియనశించె
ఇది పిశాచులతో నిటాలేక్షణుండు
గజ్జె కదిలించి యాడు రంగస్థలంబు
యిది మరణదూత తీక్షణ దృష్టలొలయ
నవని పాలించు భస్మసింహాసనంబు''.

ఈ శ్మశాన భూమిలో చక్కని కవీశ్వరుని కమ్మని కలము నిప్పులలో కరిగిపోయింది. ఇక్కడే రాజ్యమేలిన రాజాధిరాజుల యొక్క అధికారముద్రాలాంఛనాలూ నశించాయి. ఇక్కడే యువతులైన గృహిణుల నల్లపూసల సౌందర్యం గంగలో కలిసిపోయింది. ఇక్కడే గొప్ప కీర్తి పొందిన చిత్రలేఖకుని యొక్క చిత్రాలు గీసిన కుంచె నశించింది. (అనగా అందరూ ఇక్కడే మరణించి ఇక్కడికే చేరుకున్నారని) ఇది సృష్టికి లయకారుడైన శివుడు పిశాచాలతో కలసి గజ్జెకట్టి నాట్యం చేసే నాట్యశాల. ఇది యమదూత తన తీక్షణమైన చూపులు బయలు పడేలా భూమండలాన్ని పాలించే భస్మ సింహాసనము ఇక్కడ కవి భావన ఎంతలోతైనదో అర్థమౌతుంది.

రాత్రి సమయం తిమిరం నిండిన శ్మశానం నిశ్శబ్దం రాజ్యమేలు వేళ ఆమూల కొత్త సమాధి.. సమాధిపై అమదపు దీపం మిణుగురులా రెపరెపలాడుతూ వెలుగు చున్నది. పాఠకుని గుండెను సూటిగా తాకి అర్థమయ్యే భావన చేయడం గుర్రం జాషువా కవికేసాధ్యం.

''ముదురు తమస్సులో మునిగిపోయిన క్రొత్త సమాధి మీద బై
బొదలు మిణుంగురు బురువు పోలిక వెల్గుచున్న దివ్వె, ఆ
ముదముడివోయినన్ నమసిపోవుట లేదది దీపమందుమా?
హృదయము సుమ్మి నిల్పిచనియెన్గతపుత్రిక యే యభాగ్యయో!''

కటిక చీకటిలో కనిపించకుండా పోయిన క్రొత్తగా కట్టిన సమాధిపైన కనిపించే మిణుగురు పురుగు లాగా ప్రకాశించే దీపం. దానిలో పోసిన ఆముదం పూర్తిగా అయిపోయినా ఆరిపోవడం లేదు. నిజానికి అది దీపం అనుకోవాలా? కాదు కాదు. బహుశ: కొడుకును పోగొట్టుకున్న ఏ అభాగ్యురాలో తన హృదయాన్ని అక్కడ వదిలిపెట్టి వెళ్ళియుంటుంది సుమా! అంటాడు కవి.

కవితా సుధలొలికించిన కవుల కలాలు, శ్రవణా నందకరమైన కమ్మని గాయకుల కమ్మని కంఠస్వరాలు.. ఈ శ్మశానవాటికలో విశ్రమించాయి. పంచభౌతికమైన ఈ దేహం చివరికి ప్రకృతిలో కలిసిపోవల్సిందే.. అంటారు. కవి ఈ పద్యంలో..

''కవుల కలాలు, గాయలకుల కమ్మనికంఠము లీశ్మశానపురం
గవునుల ద్రొక్కిచూచెడి నొకానొకనాడల కాళిదాస భా
కవుల శరీరముల్, ప్రకృతి రంగము నందిపుడెంత లేసి రే
ణువులయి. మృత్తికంగలిసెనో! కద? కుమ్మరివాని సారెపైష''

ఎందరో గొప్ప కవీశ్వరుల యొక్క కలాలునూ, ఇంపైన సంగీతం పాడే గాయకుల కమ్మని కంఠ స్వరాలునూ, ఏదో ఒకరోజున ఈ శ్మశానభూమి యొక్క కోటవాకిళ్ళను త్రొక్కిచూడవలసిందే.. ప్రసిద్ధులైన కాళిదాసు భారవి కవుల శరీరాలు సృష్టిరంగంములో ఇప్పుడు చిన్న చిన్న కణములుగా విడిపోయి, కుమ్మరివాని సారెపై మట్టిలో కలిసి పోయాయోకదా! పుట్టుక కూడా తల్లి గర్భం నుంచే అయినా తల్లి కూడా ప్రకృతి జనీతనే మట్టిలో ఖననం చేయబడిన దేహం క్రమంగా కృశించి, నశించి, జీర్ణించి మట్టిలో మట్టిగా కలిసిపోతుంది. మట్టి రేణువులుగా కలిసిపోయే విషయం నిజమే కదా! ఎంతగొప్ప సత్యమో కదా..

శ్మశాన వాటిక వాకిట్లో నుంచోని ఒకసారి పరికించి చూస్తే మనగుండె తరుక్కుపోతాయి. మనమనస్సు కరిగి నీరై పోతుందని చెబుతాడీపద్యంలో..

''ఆలోకించిన గుండియల్లఱగు నాయాపిల్ల గోరీలలో
నేలేబుగ్గలసొరు రూపఱియెనో యే ముద్దు నిద్రించెనో!
యేలీలావతి గర్భగోళమున వహ్నిజ్వాల జీవించునో!
యీ లోకంబున వృద్ధిగా దగిన యేయే విద్యల్గాడెనో?

ఈ శ్మశాన భూమిని పరిశీలించి చూస్తే గుండెలు కరిగిపోతాయి. ఆయా పిల్లగోరీలలో (ముస్లిం సమాధికి 'గోరీ' అని పేరు) ఏ లేత బుగ్గలగల పిల్లల అందం నశించిందో ఏముద్దొచ్చే చిన్నారి పొన్నారి బిడ్డ శరీరం నిద్రించిందో! ఏకాంత గుండ్రటి కడుపులో అగ్నిజ్వాల సజీవంగా నిలిచి ఉందో! ఈ లోకంలో అభివృద్ధి కావ లసిన ఏయే విద్యలు నశించాయో! అంటే బ్రతికి వుంటే ఎన్నో గొప్ప విద్యలు నేర్చుకొనేవారు కదా! అని ఈ కవి భావన.

ఈ వల్లకాడులో ఆస్పృశ్యతకు తావు లేదంటాడు ఈ పద్యంలో.....

''ఇటనస్పృశ్యత నంచరించుటకు దావేలేదు. విశ్వంభరా
నటనంబున్ గబళించి, గర్భమున విన్యస్తంబు గావించి, యు
త్కటపుం బెబ్బులితొడ మేకనొక క్రన్ జేర్చి జోకొట్టి, యూ
ఱట గల్పించును భేద భావమఱును, ధర్మం బిందుగారాడెడిన్''

..... ఈ శ్మశాన భూమిలో ''అంటరానితనం'' అనే దురాచారం సంచరించే అవకాశం లేదు. (అంటే ధన వంతుడు, పేదవాడు, కులం - మతం అనే తేడా లేదు. భూమి యొక్క కదలికను గ్రహించి తనకడుపులో ఉంచు కొని భయంకరమైన పెద్దపులితో పాటు మేకను కూడా ఒక ప్రక్కను ఉంచుకొని వాటిని నిద్రపుచ్చి విశ్రాంతిని చేకూర్చే భేదం లేని తనం, ధర్మం ఇక్కడ సంచరిస్తాయని కవి భావన.

మారుతున్న నేటి కలికాలంలో ఆర్థిక అవసరాలు, ధన వ్యామోహం, రక్తబంధాలను పాశాలను త్రెంచివేస్తున్నా యని చెబుతాడీ పద్యంలో.....

"వాకొనరాని గొప్ప ధనవంతునిద్దపుబాల ఱాతి గో
రీకడ బారవేయబడి ప్రేలికలం బొరలాడు ప్రేతమే
యాకటి చిచ్చునన్ గుమిలి యార్చి గతించిన
పేదవాని దొ
నోకద! వానికై వగవడొక్కడు దాచదు కాటి నేలయున్"

మాటలలో చెప్పడానికి వీలుకాని గొప్పధనవంతుని చక్కని పాలఱాతితో నిర్మించిన సమాధివద్ద పారవేయబడి చింపిరిగుడ్డలతో దొర్లుతున్న ఆ పీనుగు, ఏ ఆకలి మంటతో తపించి, ఆర్చి మరణించిన బీదవాడిదో కదా! ఆ బీదవాడికోసం ఏ ఒక్కడూ ఏడ్వడు శ్మశాన భూమి కూడా వాడి శవాన్ని తన కడుపులో పెట్టుకొని దాచుదు. వాడి శవాన్ని కనీసం పూడ్చడం కూడా చేయరని అర్థం. నేటి కాలంలో తమను కని అల్లారుముద్దుగా పెంచి పోషించిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బ్రతికుండగానే వల్లకాటిలో అర్ధరాత్రిలో వదిలివెల్తున్న రోజులివి. అలాంటప్పుడు పేదవాని మృతశరీరాన్ని పట్టించుకొని ఖననం చేసే దాతలెందరు? అన్నింటికంటే దారుణం ఏమంటే పేదరికం/ దారిద్ర్యం. శ్మశానంలో ఖననానికి నోచుకొని ఒక అనాథశవాన్ని జాషువా హృదయార్తితో వర్ణించాడీ పద్యంలో.....

ఈ రీతిగా గుఱ్ఱం జాషువా కవి 'శ్మశానవాటి' అనే అద్భుత ఖండికలో వైరాగ్యభావాన్ని, జీవితచరమాంక సత్యాన్ని తాత్వికతనూ తెలియజేశారు. ఈ శ్మశానవాటి పద్యాలు బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి "సత్యహరిశ్చంద్ర" నాటకంలో ప్రసిద్ధిపొందాయి. "సుకవి జీవించు ప్రజల నాలుకలయందు" అన్నట్లుగా పండిత పామర జనుల నోళ్ళల్లో నాలుకమీద ఈ పద్యాలు నేటికీ నాట్యమాడుతూ సజీవంగా నిల్చి యున్నాయి. అంటే నాటికీ నేటికీ మరెన్నకీ గుఱ్ఱం జాషువా కవి తెలుగువారి గుండెల్లో మెండుగా సజీవంగా చిరంజీవిగా నిల్చియుంటాడు.

ఆధార గ్రంథాలు :

1. గుర్రం జాషువా - స్మశాన వాటిక (ఖండిక)
2. బలిజే పల్లి లక్ష్మీకాంతం - సత్యహరిశ్చంద్ర

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వర్ణవ్యవస్థను నిరసించిన 'దళిత సాహిత్యం'

– డా॥. దొర్లపూడి శివరామకృష్ణ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతపల్లి.

భారతదేశం ఎన్నెన్నో ప్రత్యేకతలను కలిగి ఉన్నది. నైసర్గిక, భౌగోళిక, కుల, మత, జాతి, రాజకీయ ఇలా ఎన్నో.. ఎన్నెన్నో విభిన్నతల మధ్య తన మిగిలిన సమాజాలలో లేని కులం, వర్ణం వంటివి ఇక్కడ మాత్రమే 'సహజం' అనే స్థితి గల సమాజమిది. ఈ వర్గాలు కూడా శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్నాయనేది సత్యం. ఈ కారణంగా అనేక అంతరువులు, అసమానతలు ఏర్పడ్డాయి. ఋగ్వేదం పదవ మండలంలోని పురుష సూక్తంలో కుల విభజనకు సంబంధించిన ప్రస్తావనుంది. రామాయణంలో నాలుగు కులాల వివరణ ఉంది. భారతకాలం నాటికి నాలుగుగా (చాతుర్వర్ణం మయాం స్పృష్టం) ఉన్న కులాలు ఆ తరువాత అయిదుగా, తదనంతరకాలంలో అనేకానేక ఉపకులాలుగా విభజించ బడ్డాయి. నాటి సమాజం ఈ 'అయిదవ కులం' (పంచమ కులస్థులు) వారిని ఊరికి దూరంగా నెట్టి, నీచమైన వృత్తులు అంటగట్టి, వారిపట్ల అస్పృశ్యతను పాటిస్తూ వారిని కనీసం 'మానవులుగా' కూడా గుర్తించకుండా 'అంటరానివారిగా' ముద్రను వేసింది. మనుషుల మధ్యకు సాటి మనుషులు కూడా రానివ్వని పాపం, నేరం తామేమి చేసామో వారికే తెలియదు. దీనికి కారణం 'కర్మ'లేనని ఓ తాత్వికతో కూడిన 'కర్మ సిద్ధాంతం'ను తెర మీదకు తీసుకు రావటం జరిగింది. ఈ వర్ణాశ్రమ ధర్మాలను పదిలంగా పరిరక్షించవలసిందేనని రామాయణం (శంభూకుని వధ) శూద్రునికి తపస్సు చేసే హక్కు లేదని (మనుధర్మశాస్త్రం) వంటివి నిర్ణయించిన గ్రంథాలుగా ఖ్యాతి గడించాయి. కాలంలో నిరంతరాయంగా మార్పులు చోటు చేసుకుంటూ వస్తాయి. చరిత్ర క్రమేపి 'మార్పు'లకు లోనవుతూ అంటుంది. కాని... అంతరాలలో నిలిచిన 'తరతరాల అంతరం' అలానే ఉండిపోయింది. ప్రాచీన కాలం నుంచి భారతీయ సాహిత్యంలో వర్ణవ్యవస్థను నిరసించిన కవులున్నారు. కాని ఈ నిరసన 'భక్తి' మార్గంలో కొనసాగింది వేమన, పోతులూరి వీరబ్రహ్మం, అన్నమయ్య వంటి వారు అస్పృశ్యతా దురాచారాన్ని ఖండించారు. వేమన-

"మాల మాలగాడు మహిమీదనే ప్రొద్దు
మాట తిరుగువాడు మాలగాక
వాని మాలయన్న వాడెపో పెనుమాల" అని కులం కంటే గుణం గొప్పదనే భావాత్మకంగా చెప్పాడు. వీరబ్రహ్మం సహితం-

"పంచముడని నిను కించ పరచిరని బాధపడకురా కక్కా
తిట్టిన నోరే పొగడుతున్నప్పుడు వదిలేనురా వారి తిక్క"
అని అన్నారు. వర్తమానంలో ఈ దృశ్యం ఆవిష్కరించ బడినా.. దాని వెనుక 'వారి' కష్టం, శ్రమ గుర్తింప బడుతున్నదా అనేది ప్రశ్న....?

మనదేశంలో సంఘ సంస్కరణోద్యమం ఆవిర్భావానికి ముందే తెలుగులో అస్పృశ్యతా నిరసన కవిత్వం వెలువడింది. 1909 సం॥లో 'ఆంధ్రభారతి' పత్రికలో ఓ అపరిచిత కర్త (పేరు లేదు- తెలియదు) 'మాల వాండ్రపాట' అన్న గేయంలో ఈ నిరసన కనిపిస్తుంది.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి
అందారు ఒక్కటై ఉండాలి సక్కంగా
అమ్మోరు దీవించి అయిశర్యమిచ్చును" (ఉప యోగించిన భాష కూడా గమనించదగ్గదే..) నాటికాలానికి ఇదో గొప్ప ముందుచూపుగానే చెప్పాలి.1910లో గురజాడ వారు తను రాసిన 'లవణరాజు' కల అనే గేయంలో-

"మలిన దేహులనుచు
మలిన చిత్తుల కధిక కులముల
నెలనొనసంగిన వర్ణధర్మ
మధర్మ ధర్మంచే" అంటారు. 'మంచి అన్నది మాల అయితే మాల నేనగుదున్' అని కూడా నినదించారు. 1915లో మరిగిపూడి వెంకటశర్మగారు తన 'విరుద్ధ

భారతం' అనే పద్యకావ్యంలో (ఇది 'తొలి నిరసన కావ్యం' అనే వారున్నారు)-

"మాలలన పంచములటంచు మాదిగలని
శ్వపచులని చెప్పగరాని వారటంచు
మరియు జండాలురని తోడి మానవులను
దరిమి వేయుట సాంఘిక ధర్మమగునే" అనే వేదనను వ్యక్తం చేసారు. గాంధీ రంగ ప్రవేశం తరువాత జాతీయోద్యమం, అస్పృశ్యతా నిరసన జోరందుకున్నాయి. గాంధీజి 'హరిజన' అనే పదాన్ని వాడుకలోకి తెచ్చారు. (ఇది కూడా నిరసనకు గురయింది) గాంధీ పిలుపుతో ఎంతోమంది కవులు అస్పృశ్యత నిరసన కావ్యాలు రాసారు. గరిమెళ్ళ వారు తన 'మాకొద్దీతెల్లదొరతనం' అనే గేయంలో 'అంటు దోషము మాకు లేదండీ పాపమంటూ చాటుదాముర౦డి' అంటూ ప్రసిద్ధి పొందారు.1926లో గరిమెళ్ళ రాసిన ఖండకావ్యంలో-

"అస్పృశ్యులని యొక అసదృశంబగుజాతి
నాదరింపక బైటకంపినాము
తలచుకొను కొద్ది హృదయములో దగ్ధమగుచు" అని వేదనను వ్యక్తంచేసారు. 1930 నుంచి హరిజనులు రంగ ప్రవేశం చేసి తమ సమస్యలను తామే గానం చేసు కున్నారు. కుసుమ ధర్మన్న, గుఱ్ఱం జాషువా, జాలా రంగస్వామి, నక్కా చినవెంకయ్య, బోయి భీమన్న, కలేకూరి, కొలకలూరి ఇనాక్ వంటి ఎందరెందరో తమ కలాలకు తమ వేదనలే వస్తువులుగా మార్చుకున్నారు. వీరిలో జాషువాదో ప్రత్యేకమైన పంథా. ఆయన జీవితం అంతా ఇటువంటి 'అస్పృశ్యత'లోనే గడిచిపోయింది. కాని.. ఆయనకు సమాజంపైన కోపం, కసి, పగ వంటివి లేవు. కలంలో కూడా ఆయన తన వేదనను, సమాజం మారవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఓ సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారు. 'గబ్బిలం', 'ఫిరదౌసి', 'ముసాఫరులు' వంటి రచనలు జాషువాకు ప్రత్యేక వేదికను నిర్ణయించాయి.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగాజూచి, రూపురే
ఖామనీయ వైఖరులగాంచి భళి భళి యన్నవాడె, నీ
దేకులమన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచిపోవుచో
బాకున గ్రువ్వినట్లగును పార్థివ చంద్ర వచింప సిగ్గగున్" అనే ఆవేదన వ్యక్తం చేస్తారు. అంతేకాదు అలాంటి దళితున్ని చూసి "కసిరి బుసకొట్టు నాల్గు పడగల హైందవ నాగరాజు" అని వర్ణవ్యవస్థ క్రూరత్వాన్ని వెల్లడిస్తారు.

దళిత సాహిత్యం గురించి చర్చించుకొనే సమయంలో అసలు దళితులంటే ఎవరు అనే ప్రశ్నకు కూడా చోటు కల్పించుకోవాలి. దళిత అనే పదానికి సూర్యారాయాంధ్ర నిఘంటువు ఇచ్చిన అర్థాలు..

- ఖండించబడినది, ఛేదించబడినది, చీల్చబడినది
- వికసింపబడినది, విసిరివేయబడినది
- అర్ధి కృతము, సగము చేయబడినది
- నిక్షిప్తము, అటునిటు చిమ్మబడినది.

అర్థాలన్నీ ఖండించబడిన అనే దానికి దగ్గరగా ఉన్నాయనేది వాస్తవం. మరి దళితులంటే ఎవరు? కె.కె.ఆర్ "తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి విద్యా సౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై, ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడికి గురైన" వారుంటారు. 1920- 1930 నాటికి దళితులు పంచమ, హరిజన అనే పదాలను తిరస్కరించటం మొదలుపెట్టారు. తమని తాము 'ఆది ఆంధ్రులుగా' పిలుచుకోవడం ప్రారంభించారు. 1927లో గూడూరు రామచంద్రరావు నాయకత్వంలో విజయవాడలో 'పంచమ మహాసభ'ను నిర్వహించారు. ఈ సభలో భాగ్యరెడ్డివర్మ పంచమ పదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో ఆసభను 'ప్రథమ ఆది ఆంధ్ర మహాజన సభ'గా మార్చి నిర్వహించారు. 1933లో కుసుమధర్మన్న 'హరిజన శతకం'లో

"ఆలకింపుమయ్య ఆది హిందు
ఆలకింపుమయ్య ఆదియాంధ్ర
ఆలకింపుమయ్య మాలవర్య" అని పేర్కొంటూ, అలా

ఎందుకు రాసారో 'హరిజనులు ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆది హిందువులు, ఆదియాంధ్రులు, మాలలు మొదలైన పేర్లతో పిలువబడు కారణంగా ఆయా ప్రాంతాల వారికి అవసరమని తోచినచో అందుకు అనుగుణంగా మార్చి చదువుకోవడానికి అని సూచనలో పేర్కొన్నారు. బొజ్జాతారకం సలింద్ర, కత్తి పద్మారావు వంటి కవుల తొలి రచనల్లో దళిత చైతన్యం కంటే, విప్లవ, హేతువాద చైతన్యాలు ఎక్కువగా దృశ్యమానమవుతాయి. అసలు సాహిత్యంలో 'దళిత సాహిత్యం' యొక్క ప్రవేశం. ఆవశ్యకతలను గురించి కె.కె.రంగాచార్యులు అంచనా ప్రకారం 'ఇటీవలి కాలం వరకు తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం ఒక ప్రత్యేకమైన పాయగా కనిపించదు. బలమైన సామాజిక, రాజకీయోద్యమాలు రావటం, ఇతర సమస్యలతో పాటు అందులో భాగం కావటం దీనికి కారణం కావచ్చు' నంటారు. (అధునిక సాహిత్య దళిత స్పృహ). ఈ నేపథ్యంలో దళిత సాహిత్యాన్ని పరిశీలిస్తే క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో బుద్ధుడిలో ప్రారంభ మయిందని, కొందరు, మరికొందరు మహాత్మా జ్యోతిరావు పూలే (1827-1890), ప్రొఫెసర్ ఎ.ఎన్.ఎం.మాలో (1886-1957) ఆరంభమయిందని మరికొందరు విభిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. "దళితుల సామాజిక, ఆర్థిక సాంస్కృతిక విముక్తి కోసం పోరాడే శాస్త్రీయమైన దళిత సాహిత్యాన్ని రగిల్చి దళిత సాహిత్యానికి ఒక వెలుగు భూమికను అమర్చి సమగ్రమైన తాత్విక దృక్పథాన్నిచ్చిన వాడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్' అంటారు కలేకూరి ప్రసాద్ తన 'దళిత సాహిత్యం'లో. అయితే అంబేద్కర్ ముందు వారు చేసిన సేవ తక్కువది కాదని కూడా ఆయన అంగీకరిస్తారు.

సాహితీ ప్రక్రియలలో దళితుల సమస్యలను మొట్ట మొదటిగా చిత్రించిన భారతీయ నవల ముల్క్‌రాజ్ ఆనంద్ రచించిన 'అస్పృశ్యుల్'. ప్రేమ్‌చంద్, రాగోర్లు తమ అనేక రచనల్లో అస్పృశ్యతను నిరసించారు. మహారాష్ట్రలో 70 దశకంలో ఉవ్వెత్తున లేచి మొత్తం సమాజాన్ని ఓ కుదుపు కుదిపిన 'దళిత పాంథర్స్' ఉద్యమం దళిత సాంస్కృతికోద్యమానికి అవగాహనను అందించదనే ఒప్పుకోవాలి. ఈ ఉద్యమ నాయకులందరూ 'రచయిత'లే కావటం విశేషం. ఈ ఉద్యమానికి అంబేద్కర్' స్ఫూర్తి మూలసూత్రం. అస్పృశ్యతను ప్రధానంగా తీసుకుని రాసిన మొదటి తెలుగు నవల 'హేలావతి'. 1913లో శ్రీ తల్లాప్రగడ సూర్యనారాయణ దీని రచయిత 1919లో వెంకట కవులు 'మాతృమందిరం' 1922 ఉన్నవ వారు రాసిన 'మాలపల్లి' వంటివి వచ్చాయి. ఆ తరువాత కాలంలో 1936లో ఆచార్య ఎన్.జి.రంగా 'హరిజన గాయకుడు', అడవి బాపిరాజు 'వరుడు', అంతటి నరసింహం 'ఆదర్శం' (1946) ఇల్లందుల రంగ నాయకులు 'మల్లిక' (1950), వట్టికోట ఆళ్వారు స్వామి 'ప్రజల మనిషి' (1952), రంగనాయకమ్మ గారు రాసిన 'బలిపీఠం' (1962) (ఇది చలన చిత్రంగా కూడా వచ్చింది) వంటివి దళిత సమస్యలను బలంగా చిత్రించి నవే. మహీధర 'కొల్లాయి గట్టితేనేమి' నుంచి 1984 దడాల చంటబ్బాయి రాసిన 'అంతులేని అమావాస్య' వరకు ఉన్నాయి. కథ, నవల, కవిత, పద్యం, గేయం ఇలా అనేక రూపాల్లో కవులు, రచయితలు, రచయిత్రులు 'దళిత సాహిత్యం'ను పరిపుష్టం చేసారు. కలేకూరి ప్రసాద్ అన్నట్టుగా "కాలం రాజహంస, కాలం చంద్రవంక. కాలం చీకటి వెలుగుల పెనుగులాట. లక్ష కరిమేఘాలు చీకటి కాటుకను వర్షించనీ, మనది వెలుతురు పాట. మనది ఓడిపోయిన మానవుల తుది విజయగీతం. కథలై గీతాలై, నవలలై, రకరకాల సాహితీ రూపాలై దళిత ఆకాంక్ష వెల్లువగా వ్యక్తం కావాలి. దళిత ప్రజల కలల సాఫల్యానికి మనతరం నడుం కట్టాలి." ఆ దిశగా దళిత సాహిత్యం మరింతగా వెలుగులీనాలి.

ఆధార గ్రంథాలు:

1. దళిత సాహిత్యం - కలేకూరి ప్రసాద్ - తంగిరాల సోనీ బుక్‌ట్రస్టు-1993
2. తెలుగులో కవిత్వోద్యమాలు- తెలుగు అకాడమీ -2003

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'అగ్నికవి' మోదకూరి జాన్సన్ 'నిచ్చెనమెట్లపై' నిరసన

– గజ్జెల ప్రమీల, తెలుగు అధ్యాపకురాలు & తెలుగు శాఖాధిపతి, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.

మోదుకూరి జాన్సన్ సామాజిక సంస్కరణ, దళిత స్పృహ కలిగిన కవి. ఈయన నటుడు. దర్శకుడు. ప్రయోక్త. కవి. రచయిత. హేతువాది కూడా. ఇంతకన్నా ప్రవృత్తిలో వృత్తిని, వృత్తిలో ప్రవృత్తిని ఎన్నుకొని జీవితాన్ని శ్వాసించిన అసలైన వర్ధమానకవి. "రాజులు తరాజు లయ్యారంటూ రాగాలు తీసిన వాడ్ని, కాలం మారింది కవితలు మారాలంటూ కవనకవాతు తొక్కుతున్న ప్రజాకవిని నేను" అని చెప్పుకున్న ప్రజాకవి. తనకు కులమతాలు అడ్డుకావని తరచూ ఇచ్చే ఉపన్యాసాల్లో షేక్‌జాన్సన్‌శాస్త్రిగా తనను తాను అభివర్ణించుకొనే లౌకికవాది. మోదకూరి జాన్సన్ 1934లో ఆగస్టు 8న తెనాలి సమీపంలోని కొలకలూరులో పుట్టారు. ప్రాథమిక విద్యను స్వగ్రామమంలోనూ, ఉన్నత విద్యను దుగ్గిరాలలోనూ, తదనంతర కళాశాల విద్యను గుంటూరు ఎ.సి. కాలేజీలో అభ్యసించారు. న్యాయవాద విద్యను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అభ్యసించారు. మొట్టమొదట ఆంధ్రయూనివర్శిటీ తాత్కాళిక ఉద్యోగిగా చేరి, ఆపై ప్రభుత్వ అనువాదశాఖలో ట్రాన్స్‌లేటర్‌గా ఉద్యోగించి, తన మకాంను హైదరాబాద్‌కు మార్చుకొని స్థిరపడి, కళారంగంలో ఉన్నతశిఖరాలను అధిరోహించి, చివరకు హైదరాబాద్‌లోనే 1988 డిశెంబరు 24న లోకాన్ని విడిచి వెళ్ళిపోయారు.

మోదుకూరి జాన్సన్ కళాసక్తి :

కళారంగంలో ప్రావీణ్యం సాధించిన కొలకలూరిలో సురభినాటకాల ప్రదర్శనలు తనను చిన్నతనంలో బాగా ఆకట్టుకున్నాయి. గ్రామంలో యువతను కూడగట్టి నాటక ప్రదర్శన చేయించడం ఇతనికి అలవాటైంది. అందులో భాగంగా ఈయన "పప్పుకూటి నాట్యమండలి"ని ఏర్పాటు చేశారు. అప్పుడప్పుడూ సమీప గ్రామాలలో జరిగే శుభకార్యాలకు ప్రదర్శనలు ఏర్పాటు చేసేవాడు. అన్నాచెల్లెలు, దోపిడీ, ఇన్స్‌పెక్టర్ జనరల్, మాస్టార్జీ వంటి నాటకాలకు ఆదిలో జాన్సన్ దర్శకత్వం వహించేవారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేరిన తర్వాత ఇతనిలోని కళాతృష్ణ పెంచుకోవడానికి అవకాశం దొరికింది. ప్రతిసారి ప్రభుత్వ పర్వదినాల్లో జాతీయ సమైక్యతను చాటే ప్రదర్శనల్ని ఏర్పాటు చేసి, కళాకారుడుగా రాటుదేలాడు. అప్పుడే విశ్వవిద్యాలయం కళావేదికను ఏర్పాటు చేశాడు. సాంఘిక దురాచారాల్ని రూపుమాపాలన్న ఉద్దేశ్యంతో 1960-70 దశకాల్లో కళాపరిషత్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వం అనుబంధంతో కార్యక్రమాలు నిర్వహించేవాడు. సాంఘిక సంక్షేమశాఖ అనుబంధంగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన స్టేట్ కల్చరల్ డైరెక్టర్‌గా పదవిని అలంకరించి, రాష్ట్రవ్యాప్తంగా కళాకారులను తయారు చేశాడు. ప్రముఖకవి పద్మశ్రీ బోయిభీమన్న, సాంఘిక పోరాట యోధుడు బొజ్జాతారకంలతో పరిచయం తర్వాత "సుఖేలనికేతన్"ను స్థాపించాడు. ఆ తర్వాత జగజ్జీవన్ రామ్, జవహర్‌లాల్ నెహ్రూ, దామోదరం సంజీవయ్యల మన్ననలకు పాత్రుడయ్యాడు. తదనంతరం తన కళాసక్తిని కవితారంగంపై సారించాడు. ''అంటరానితనం అసమానతలు రాజ్యమేలుతున్న ఆ రోజుల్లో యువతలో చైతన్యం తీసుకువచ్చి సమాజానికి సందేశమిచ్చి నాటకాలు రాయాలని, అసమానతలు తొలగించాలని బాల్యంలోనే బీజంపడిందంటూ" (చెరగని జ్ఞాపకం-పుట 13) తన కవితాభిలాషను వ్యక్తం చేశాడు.

మోదుకూరి జాన్సన్ రచనలు :

ఈయన కలంనుండి నటనాలయం, నిచ్చెనమెట్లు, నీరద, శిలువభారం, క్రీస్తుచరిత్ర, వీరబాహు, దేవాలయం అనే ఏడు నాటకాలు వెలువడ్డాయి. 35 సినిమాలకు మాటల్ని, ఇందులో కొన్ని సినిమాలకు పాటల్ని రాశాడు.

కాకి అనే గేయాన్ని రాశారు. ఈ రచనల్లో నిచ్చెనమెట్లు అనే నాటకంలోని రచయిత దళిత ఆవేదనని పరిశీలిద్దాం.

నిచ్చెనమెట్లు నాటకం - ఇతివృత్తం :

భారతీయ సమాజంలోని చాతుర్వర్ణవ్యవస్థ పంచమునికి చేసిన అన్యాయం ఈ నాటకంలో ఇతివృత్తం. హిందూ సమాజం సాంఘిక అసమానతలతో నిచ్చెనమెట్ల వ్యవస్థను తయారు చేసిందని, దీనితో సామాజిక న్యాయం కుళ్ళి దుర్వాసన కొడుతూ దురన్యాయంగా మారిందని అభ్యుదయకాముకులైన యువకులు సంస్కర్తలు, ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థను నామరూపాలు లేకుండా చేయాలని, మతన్మోద నిచ్చెనమెట్ల వ్యవస్థను విరగ్గొట్టి భూస్థాపితం చేసి, సమన్యాయ పాలనకు హిందూ సమాజం నాంది పలకాలనే వస్తువును ఈ నాటికలో ఇతివృత్తంగా రచయిత మలిచాడు. ఇందులో పంచముడు, బ్రాహ్మణుడు, వైశ్యుడు, క్షత్రియుడు, శూద్రుడు, క్రైస్తవ మిషనరీ, బ్రిటీష్‌వాడు, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, భరతమాత పాత్రలు. ఈ నాటకానికి రచయితే వ్యాఖ్యాత. ప్రధాన సూత్రధారుడు.

ఈ నాటికలో నాయకుడు దౌర్భాగ్యుడైన పంచముడు. భారతీయ సమాజానికి ప్రతీక అయిన నిచ్చెనలో నాలుగు వర్ణాలకు ప్రతీకగా నాలుగు మెట్లుంటాయి. నలుగురు ఒక్కోమెట్టుపై కూర్చొని వుంటారు. నిచ్చెన నేలపై ఆనకుండా దౌర్భాగ్యుడైన నాయకుని గుండెల్లో ఘాతం వేసుకొని నిలుచుకొని వుంది. ఈ ఘాతం వెట్టిచాకిరీకి ప్రతీక. తరాలు మారినా తనపై మానని 'నాలుగ్గోళ్ళ పులిపంజా' గాట్లకు భయపడి నాయకుడు క్రైస్తవాన్ని ఆశ్రయిస్తాడు. అప్పటికి తనపైనున్న పంచమముద్ర తొలగదు. స్వాత్రంత్ర్యసిద్ధి తర్వాత నాయకుల సంస్కరణలు, అంబేద్కర్‌వాదాలు మనిషిగా నిలబెడతాయి. అయినా ప్రజాస్వామ్యపు పేకాటలో పంచముడు నీరసిస్తాడు. భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికీ, వున్న నాలుగు మెట్లలో పంచముడికి మరోమెట్టు ఇవ్వలేమని నిచ్చెనమెట్ల వ్యవస్థ చెప్పక చెబుతుంది. అప్పుడు నిచ్చెనను నేలకు సమాంతరంగా పరచి అందరూ సమానంగా కూర్చోవాలనే సైద్ధాంతికతతో నాటకం ముగుస్తుంది.

కర్మసిద్ధాంత చర్చ :

వాస్తవానికి పంచముడిని నాలుగు వర్ణాలకు వెట్టిచాకిరీచేసి, బ్రతకమని ఈ సమాజం శాసించినట్లుగా నిచ్చెనమెట్ల సమాజాన్ని ఊహించవచ్చు. ఇదే కర్మసిద్ధాంతం. ఈ కర్మసిద్ధాంతాన్నే జాషువా గబ్బిలం కావ్యంలో

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలుగురు కుమారులటంచు విన్నాముగాని,
పసరముకన్న హీనుడభాగ్యుడైన
ఐదవకులస్థు డెవ్వరమ్మా సవిత్రీ!" అంటూ భరత మాతను నిలదీశారు. ఆ గబ్బిలం కావ్యంలో కూడా నాయకుడు పంచముడే. తరతరాలుగా పంచముని దీనావస్థని ఈ కావ్యంలో జాషువా చెప్పినట్లుగా, హిందూవ్యవస్థలోని నిచ్చెమెట్ల బరువుని మోస్తున్న పంచముని దీనావస్థను మోదుకూరి జాన్సన్ ఈ నాటికలో చెప్పకచెప్పాడు.

హైందవ నిచ్చెనమెట్ల వ్యవస్థలో అనాదినుంచి సవర్ణ సమాజాలతో కాలుకింది చెప్పులాగా, చెప్పుకింది తేలులాగా పంచముడు ఊపిరాడక ఎదగలేక బ్రతుకుతున్నాడని, మోస్తున్నవాడికి బరువు తెలియక మోసేవాడి బరువు సవర్ణసమాజం గుర్తించక, కాలం వెళ్ళదీస్తున్నాడని ఈ నాటికలో రచయిత తరతరాల బానిసత్వాన్ని బరువైన గుండెతో ఆవిష్కరించినట్లు తెలుస్తుంది. ఈ ఆవేదనకు పరిష్కారంగా ఈ నాటిక ప్రదర్శించబడుతుందన్న పరోక్ష హెచ్చరికతో ఈ నాటికోద్దేశ్యాన్ని సూత్రధారుడు పాత్రలో ఇలా అంటాడు.

"సహృదయులకు సుస్వాగతం
అంటరానివాడనబడుతున్న వాన్ని అంటుకుంటూ
చెప్పరానివాడనబడుతున్న వాన్ని చెప్పుకుంటూ
అడ్రస్సులేనివాడ్ని ఆదరిస్తూ

అందరమూ అన్నదమ్ములమేనంటూ
తన ఐదవ సోదరుడ్ని అర్థంచేసుకుని అభిమానించి
ఆశీర్వదించడానికి ఆరాటపడుతూ, ఆలోచిస్తూ
కూర్చున్న పెద్దలకు నమస్కారం
పిన్నలకు విప్లవాభివందనాలు''

(నిచ్చెనమెట్లు నాటిక, పుట - 23)

పై గీతిక సవర్ణసమాజాన్ని మేల్కొలపడానికి రచయిత వేసిన చురకలు. సమసమాజంతోపాటు చైతన్యాన్ని కూడా రచయిత ఇందులో నిక్షిప్తంచేశాడు.

మతమార్పిడి - పరిష్కారం :

''తనగాలే తగలడానికి వీలులేని ఈదేశంలో, తనపక్కనే కూర్చున్న మనిషిని చూసి, పంచముడు బెదిరాడు.''(నిచ్చెనమెట్లు, పుట-16) కాబట్టి నిచ్చెనమెట్ల లాంటి భారతీయ సమాజంలో ఊపిరాడని దళిత సమాజాలకు దొరికిన ఆక్సిజన్ క్రైస్తవ మిషనరీలు. భారతీయ సమాజంలోని హెచ్చుతగ్గులు జాతీయోద్యమ కాలంలో భారతీయుల్ని చీల్చడానికి క్రైస్తవులకు అనుకూలమైంది. అప్పట్లో దళిత సమాజాలు క్రైస్తవ మిషనరీలకు అంగట్లో వస్తువులుగా దొరికాయి. మిషనరీలు కూడా స్థానిక భాషానంస్కృతుల్ని, సాంఘిక వ్యవస్థను అధ్యయనం చేసి, చిరునవ్వులతో దళితులను స్పృశించి, తమజాతి మూలాలు తెలియని పంచముల్ని క్రీస్తే మీ అమ్మానాన్న అంటూ తమ సమాజంవైపు ఇలా ఆహ్వానించారు.

''ఈయనే మీ తల్లి, తండ్రి రక్షకుడు
నీ కొరకు శిలువమీద తన రక్తాన్ని ధారపోసి
నీకు రక్షణ కల్పించిన దేవుడు
జిగటగల భూమిలో ఇరుకున్న నిన్ను
పైకి లేవనెత్తుతాడు
తీసివేసిన పరాయి రాయిలాంటి నిన్ను
ఈ సంఘానికి మొలరాయిలా చేస్తాడు'' (నిచ్చెనమెట్లు నాటిక, పుట - 20)

క్రైస్తవ మిషనరీల లక్ష్యాలు, క్రీస్తు లక్షణాలు వెరసి నాటి దళిత సమాజానికి నమ్మకాన్ని కలిగించాయి. హైందవ సమాజంలో తప్పిపోయి దిక్కుతోచని స్థితిలో ఈ మతమార్పిడిల వల్ల దళిత సమాజాలకు తృప్తి, ఆనందాలు చేకూరాయి. వీళ్ళు జ్ఞానబోధ చేస్తారు. విద్యా బుద్ధులు నేర్పిస్తారు. ఆరోగ్యాన్ని, అనునయాన్ని పంచుతారు. స్వేచ్ఛాజీవిగా బ్రతికే అవకాశం కల్పిస్తారు. వీటన్నిటికీ మిషనరీలు ఇచ్చిన లైసెన్సే మెడలోని శిలువహారం. కానీ భారతదేశంలో మతం మారినంత మాత్రాన, కులం మారలేదని, దళితులు క్రైస్తవులు, బౌద్ధులు అయినప్పటికీ పంచమముద్ర పోలేదన్న సత్యాన్ని ఆలస్యంగా దళిత సమాజాలకు తెలిసొచ్చింది.

తమదాకా వస్తేగానీ తెలియదా? :

వర్తకం పేరుతో భారతదేశానికి చాలామంది విదేశీయులు వచ్చారు. వీరిలో భారతదేశంలో స్థిరపడిదోచుకున్న వారు తూర్పుఇండియా వర్తక సంఘం వారు. అప్పటికి భారతీయుల్లో తాండవిస్తున్న అనైక్యతను వీళ్ళు సొమ్ముచేసుకొని, భారతీయుల్ని బానిసలుగా చేసుకున్నారు. భారతీయులపై తమ అధికార కొరడాను ఝుళిపించారు. పరాయివాళ్ళకు బానిసలైన తనవాళ్ళను గుర్తుచేసుకుంటూ ఈ నాటికలో రచయిత -

''ప్రతి చెడూ
ఒక మంచికి దారితీస్తుందన్నట్లు
ఇతరుల బరువు మోయడంలోని ఆ బాధేంటో
ఇన్నాళ్ళూ ఈ పంచముడు పడుతున్న
ఆ మూగ ఆవేదనేంటో
అందులోని వేదమేమిటో
వినబడని నాదమేమిటో - తెలుసుకొని
క్షణకాలం మనుష్యులయ్యారు -తల్లడిల్లిపోయారు.''

(నిచ్చెనమెట్లు నాటిక, పుట -25)

అంటూ- భారతీయ సవర్ణ సమాజం పరాయివాళ్ళకు బానిసయ్యిందని, బానిసైన తర్వాత స్వజాతిలో బానిసగా బ్రతికిన దళితుల మూగవేదన భారతీయ సవర్ణ

సమాజాలకు అర్థమయ్యుంటుందని పై మాటల్లో తెలిపాడు.

రచయిత పిలుపు :

జాతీయోద్యమం సఫలీకృతమై భారతీయులు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నారు. క్రైస్తవుల విరమణా నంతరం దళితసమాజాలకు మళ్ళీ ఊపిరి కరువైంది. భారతీయ స్వాతంత్ర్య సౌఖ్యఫలంలో ''మాభాగంబు మాకిత్తురో వాటాలేదని తోని పుచ్చెదరో వక్కాణింపవే చెల్లెలా'' అంటూ గబ్బిలంలో జాషువా భారతీయ స్వాతంత్ర్య ఫలాలపై వేసిన ప్రశ్న, ప్రశ్నగానే మిగిలి పోయింది. నెహ్రూ సోషలిస్టు నినాదం, గాంధీ హరి జనోద్ధరణ నినాదాలు, జాతిని మేల్కొలపలేకపోయాయి. అంబేద్కర్ వాదంతో దళిత సమాజాలకు ఊరట చేకూరింది. కానీ మళ్ళీ భారతీయ ప్రజాస్వామిక వ్యవస్థ దళితులకు పాముపడగనీడే అయింది. ప్రజాస్వామిక వ్యవస్థలోకూడా నాలుగు నిచ్చెనమెట్ల వ్యవస్థలో దళితు లకు స్థానంలేకుండా పోయింది.

''మహాత్ముల ప్రాణాలతో కడిగినా
రాజ్యాంగపు కవచాలు తొడిగినా
శాస్త్రమెంత పెరిగినా
చరితలెన్ని మారినా
మనసులేని మూఢనమ్మకాల గట్లు
ఈ నిచ్చెనమెట్ల నికృష్టపు గట్లు''
(నిచ్చెనమెట్లు నాటిక, పుట -30)

కాబట్టి నిచ్చెనను పడుకోబెట్టి అందరూ సమానంగా కూర్చోవాలంటూ రచయిత పంచముడికి నాటికలో ఇచ్చిన క్రింది పిలుపుతో నాటకం సమాప్తమవుతుంది.

''ఇప్పుడు దీనికి
అరలు లేవు అంతస్థులు లేవు
ఒకరిమీద మరొకరెక్కి
కూర్చొనే అవకాశంలేదు
పున్నంతలో అందరం
సమానంగా కూర్చుందాం
ఒకేతల్లి బిడ్డల్లా
అరమరికలులేని అన్నదమ్ముల్లా
బ్రతుకుదాం'' (నిచ్చెనమెట్లు నాటిక - పుట 40)

రచయిత మోదుకూరి జాన్సన్‌కు స్వాత్రంత్ర్య, స్వాతంత్ర్యానంతర భారతీయ జీవితం తెలుసు. తెల్ల, నల్లదొరల పెత్తందారీతనం తెలుసు. ప్రజాస్వామ్యపు పడగనీడ తెలుసు. సంఘసంస్కరణ భావజాలం తెలుసు ఈ అపారమైన అనుభవ జ్ఞానంతో కులమతాతీత సమాజం ఎలా నిర్మించబడాలో తెలుసు. ఆ సమసమాజ నిర్మాణ ధ్యేయమే నిచ్చెనమెట్లు నాటిక.

ఆధార గ్రంథాలు :

1. 20వ శతాబ్దం తెలుగు కవిత్వం - కడియాల రామ్మోహన్‌రాయ్
2. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ (సంకలనం)
3. దళిత సాహిత్యం - ఆచార్య కొండపల్లి సుదర్శనరాజు
4. దళిత సాహిత్య నేపథ్యం - డా॥ ఎస్వీ సత్యనారాయణ
5. పాతికేళ్ళ దళిత కవిత్వం - డా॥ దార్ల వేంకటేశ్వరరావు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సినీ గేయ సాహిత్యంలో దళిత తత్త్వం

– **డా॥. ఉడాలి విష్ణుప్రియ,** తెలుగు విభాగాధిపతి, సెంట్ ఆన్స్ మహిళా కళాశాల, మెహదీపట్నం, హైదరాబాదు.

సామాజిక ప్రతిబింబానికి తార్కాణాలుగా పత్రికలను చలనచిత్రాలను ప్రధాన సాధనాలుగా పేర్కొనవచ్చు. ప్రపంచం నలుమూలల నుంచి ఏ విధమైన సామాజిక దురన్యాయాన్ని అయినా కళ్లకు ఉట్టి పడే విధంగా ఆవిష్కరింపబడే సాధనాలివి. సమాజ చైతన్యానికీ, స్పృహకూ చలనచిత్రాలు ఎంతగానో దోహదం చేస్తాయి. పండితుడికైనా పామరుడికైనా ఎవరికైనా అందుబాటులో ఉండే సాహిత్యం సినీ సాహిత్యమే అనడంలో అతిశయోక్తి లేదు. కవి ఎప్పుడూ సమాజానికి ప్రతిబింబం. మానవుడి పక్షాన నిలబడి ఏ సమస్యనైనా ప్రశ్నించే ధిక్కార స్వరమే కవి. అలా సినీ గేయ సాహిత్యంలో కొన్ని విభిన్న పార్శ్వాలను మీ ముందు ఉంచుతాను. శివాజీ గణేశన్ నటించిన కర్ణ చిత్రంలోని అనువాద గీతాన్ని రాసిన ఆచార్య డా. సి. నారాయణరెడ్డి గారి పాటలోని పంక్తులను ఒకసారి అవలోకిద్దాం.

గాలికి కులమేది? ఏదీ?
నేలకు కులమేది? ఏదీ?
నింగికి మరుగేది? ఏదీ?

కాంతికి నెలవేది? ఏదీ?.. అన్న పంక్తులలో పంచ భూతాలు అందరికీ సొంతమనీ, ఏ ఒక్కరి సొత్తూ కాదన్న సత్యాన్ని సూటిగా ప్రశ్నిస్తారీయన. ఇందులోనే..

పాలకు ఒకటే తెలి వర్ణం
ప్రతిభకు కలదా స్థల భేదం?
వీరులకెందుకు కుల భేదం?
అది మనసుల చీల్చడు మత భేదం?
జగమున యశమే మిగులునులే
అది యుగములకైనా చెదరదులే..
దైవం నీలో నిలుచునులే
ధర్మం నీతో నడచునులే.. అని సాగే ఈ పాట కర్ణ పాత్ర ఔచిత్యాన్ని తెలిపే విధంగా ఉన్నప్పటికీ మానవునిగా జన్మనెత్తే ఎవరికైనా రెండే రెండు కులాలు మాత్రమే ఉన్నాయని వెల్లడిస్తుంది. అవి ఒకటి మంచి.. ఒకటి చెడు! మానవులకు మాత్రమే కాదు.. సకల జీవరాశులకు కూడా పైవే ఆధారం!

కొమ్మ చెక్కితే బొమ్మరా
కొలిచి మొక్కితే అమ్మరా.. అని చాటిన కవి అందెశ్రీ పాదాలను ఒక్కసారి తలచి చూస్తే ఎవరు నిమ్న కులానికి చెందినవారు? అన్న ప్రశ్నకు సమాధానం లభిస్తుంది.

ఒక అగ్ర కులానికి చెందిన యువతి మరో నిమ్న కులానికి చెందిన యువకునికి మధ్య చిగురించిన ప్రేమకు సాంఘిక కట్టుబాట్లు, వర్ణ వ్యవస్థ వంటివి అడ్డు తగిలినప్పుడు కవి స్పందించిన తీరు చూడండి..

ఏ కులము నీదంటే
గోకులము నవ్వింది

మాధవుడూ యాదవుడూ మా కులమే లెమ్మంది.. అంటూ ఆ పాదాలు సమాజాన్ని నిలదీస్తాయి.

ఏడు వర్ణాలు కలసి ఇంద్రధనుస్సవుతాది

అన్ని వర్ణాలకూ ఒకటే ఇహమూ పరముంటాది.. అని రెండే రెండు పాదాల్లో ప్రకృతినీ, మానవ జీవితాన్ని అద్భుతంగా పోల్చి సప్తపది చిత్రంలో కవి వేటూరి సుందరరామమూర్తి గారు దానికి చక్కటి తాత్త్వికను జోడిస్తారు!

పై వాక్యాల్లో సమతావాదాన్ని, జాతిని జాగృతం చేసే భావాలనీ దర్శిస్తాము. ఇప్పుడు ఆ వర్గానికి చెందిన ఇతివృత్తాలతో వచ్చిన చిత్రాల్లో సినీ కవులు ఏ విధంగా స్పందించారో చూద్దాం!

ఏటికి ఏతం పెట్టి

ఎయ్యి పుట్లు పుట్టించి
గంజిలో మెతుకెరుగరన్నా..
కాల్జెయ్యి కడుక్కొని కట్ట మీద కూర్చుంటే
కాకి తన్ని పోయెరన్నా..

కాకి పిల్ల తన్ని పోయెరన్నా.. అనే పాదాల్లో బలహీన వర్గాలుగానూ, జనబలం ఉన్నా మనోబలం లేనివాళ్లుగానూ ఉన్నటువంటి వారి పరిస్థితి సమాజంలో ఎప్పటికీ అణగారే ఉంటుందన్న నిజాన్ని ఇక్కడ కవి వాక్యాలు వెల్లడిస్తాయి. అలాగే మాలపిల్ల సినిమాలోని ఓ పాటలో...

నిజానికి మంచోడే
నేలకూలి పోతాడే
అన్నవోడే నా యెర్రిగొల్ల
ఇది విన్నావా బర్రె పిల్లా..
వినవే బర్రె పిల్లా..
నువ్వినవే బర్రె పిల్లా..
విన్నావా బర్రె పిల్లా

విన్నావా బర్రె పిల్లా.. అని సాగే ఓ పాటలో గొడ్లు కాసేవాడు ఓ బర్రె మీద కూర్చొని ఇంకా ఇలా అంటాడు..

గొప్పోళ్ల ఆటలన్నీ
గుట్టుమట్టూ బైటకెట్టి
చెప్పుకుంటే సిగ్గు సిగ్గు..
పచ్చి మోసగాడే
పట్టెమంచం పానుపెక్కి పవ్వళించుతాడటే..
ఆడి మాట విననివోడే
మాడి మరణించుతాడే..
ఊరు మంచి కోరి రోజల్లా
పాటు పడే బీదోళ్లు బూడిదవుతారే..

ఎవరెవరో బాగుకుంటారే.. వంటి నిత్యసత్యాలు హృదయాన్ని కలచివేస్తాయి. అవి వారి దీన స్థితిని వారే వల్లె వేసుకుంటూ విధిని నిందించుకుంటూ పలవరించే మాటలు!

బడుగుల బతుకుల్లో ఎప్పటికీ వెలుగులు రానే రావంటూ కవి జాలాది గారు ప్రాణం ఖరీదు చిత్రంలో రాసిన ఒక గేయంలో ఆ కటువైన నిజాలేమిటో మనకు కళ్లకు కడతారు!

ఏతమేసి తోడినా యేరు ఎండదు
పొగిలి పొగిలి యేడ్చినా పొంత నిండదు
దేవుడి గుడిలోదైనా
పూరి గుడిసెలోదైనా

గాలి ఇసిరి కొడితే ఆ దీపముండదు.. అనే పల్లవి ఎత్తుగడలో అణగారిన మానవ జీవితాల చీకట్లు ఎన్నటికీ తొలగిపోవనీ, ఒకవేళ గుడ్డి వెలుగులు మిణుకుమన్నా అవి ఒక్క గాలి విసురుకు ఉసూరుమంటాయన్నది అయన తాత్విక దృక్కోణం!

పలుపుతాడు మెడకేస్తే పాడియాపురా
పసుపుతాడు ముడులేస్తే ఆడదాయెరా
కుడితి నీళ్లు పోసినా అది
పాలు కుడుపుతాది
కడుపు కోత కోసినా ఇది

మనిషికే జనమనిత్తాది.. అని పశువునీ పడతినీ పోల్చి చెబుతూ రెండింటినీ ఎలా చూసుకున్నా అవి నిస్వార్థ త్యాగానికే ప్రతీకలంటూ అయన చాటుతాడు.

బొడ్డు పేగు తెగిపడ్డ రోజు తలుసుకో
గొడ్డు కాదు ఆడదనే నిజం తెలుసుకో.. అంటూ ఈ సమాజాన్ని నిలదీస్తాడు.

అందరూ నడిసొచ్చిన తోవ ఒక్కటే
సీము నెత్తురులు పారే తూము ఒక్కటే
మేడ మిద్దెలో ఉన్నా
సెట్టు నీడ తొంగున్నా
నిదర ముదర పడినాక
పాడె ఒక్కటే..

వల్లకాడు ఒక్కటే.. అని ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే లెక్కలు మనుషులు రాసుకున్న చిట్టా పద్దులని, అవి మన బతుకు పొద్దు గుంకినాక చితికెక్కాల్సినవేనని ఉటంకిస్తాడు.

ఎర్రమందారం అనే మరో చిత్రంలో జాలాది గారు రాసిన మరో గీతంలోని మార్దవాన్ని గమనిద్దాం!

యాలో యాలో ఉయ్యాల
యేడేడు జనమాలు మొయ్యాల
నాలుగు దిక్కుల ఉయ్యాల
నలుగురు కలిసే మొయ్యాల
కళ్లు తెరుసుకుంటే ఉయ్యాల

కళ్లు మూసుకుంటే మొయ్యాల.. అనే పల్లవిలో మనిషి పుటకకూ, చావుకూ మధ్య అంతరాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తాడు. మనుషుల్లో ఎన్ని అసమానతలున్నా ఊపిరున్న వరకే ఉయ్యాలనీ, మనుగడ చాలించాక అదే మనిషిని మొయ్యాలనీ అభివర్ణిస్తాడు!

మాసాలు మొయ్యాల
మనిషిని చెయ్యాల
కన్నీళ్ల ఉగ్గెట్టి కష్టాల బువ్వెట్టి

కాపాడుకోవాల.. అన్నప్పుడు ఉగ్గుపాలల్లో కన్నీళ్లు కలిపినా, నోటి ముద్దలో కష్టాల గంజి వార్చినా మనిషి తనాన్ని కాపాడుకోవాలన్న ఉద్బోధ ఈ వాక్యాల్లో ద్యోతక మవుతుంది.

సిరినవ్వులాడాల.. ఆడు
సిట్టడుగులు వెయ్యాల
దండాలు మొక్కించి

గండాలు రాకుండా గుండెల్లో దాయాల.. అంటూ మానవ మనుగడకు చిన్ని చిన్ని ఆనందాలు చేర్చుకుంటూ ఆపదల అడ్డుగోడల్ని దాటుకుని మన ప్రాణాల్ని కాచుకోవాలంటాడు!

అడుగడుగున అణగారుతూ బతికుండాల
ఆ బతుకున ఒక మెతుకేసే తోడుండాల
కొడుకైనా గొడుగయ్యే బుణముండాల
శరణైనా శవమయ్యే బతికుండాల
పారాడే వయసేమో పకపక నవ్వాల
పోరాడే వయసేమో తాతయ్యతో కలిసి
దోబూచులాడాల..
నడికారు వయసేమో నడుమును కట్టాల

పుట్టిన నేలనూ పెట్టే తల్లినీ కాపాడుకోవాల.. అనడంలో అణగారి బతుకుతున్నా జీవితాన్ని అపురూపంగా చూసుకోవాలనీ, ఆ బతుక్కి ఇంత మెతుకేసే తోడూ ఉండాలని కవి కోరుకుంటాడు. కొడుకైనా అవసాన దశలో గొడుగులా నిలబడే బుణముండాలనీ, శరణంటూ జీవచ్ఛవంలా కొట్టుమిట్టాడుతున్నా ఈ ప్రాణం బతికుండాలనీ ఆశిస్తాడు!

నడుమొంగే వయసైనా నిలిసుండాల
నలుగురికొకటే న్యాయం కలిగుండాల
సాయైనా బతుకైనా పోరాడాల

కడకైనా కలగన్నది నిజమవ్వాల.. అని అథములైనా, అధికులైనా వయోభేదం లేకుండా అంతా కలిసుండాలనీ, అందరికీ ఒకే న్యాయం కలిగుండాలనీ అంటాడు. మరణమైనా, మనుగడైనా పోరాట తత్వాన్ని వదులు కోకూడదనీ, చివరకి కన్న కలలన్నీ నిజం చేసుకోవాలనే ఆశావాదంతో ఈ గీతాన్ని ముగిస్తాడు కవి.

దళితుల జీవితాల్ని ఎవరెన్ని కష్టాలకు గురి చేసినా, కన్నీళ్లలో ముంచినా ఆ కడగండ్ల మాటున కనిపించని చిన్ని చిన్ని ఆనందాలు, అనుబంధాలూ వారి జీవితంలో ఎంతటి ఆశావాదాన్ని రేపుతాయో, ఆ అనురాగాలూ, ఆప్యాయతలూ ఎలా ఉంటాయో ఈ గద్దర్ గీతంలో మన దర్శించవచ్చు.

రిక్షా తోలుకుని బతికే ఓ అన్న తన చెల్లెలిపై ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో, ఎంతటి మమకారాన్ని తన మాటల్లో రంగరించి పోస్తున్నాడో ఈ పాట వింటే తెలుస్తుంది.

చదివినంత నిన్ను సదివిస్తనమ్మా
ఎదిగినంత నిన్ను ఎదిగిస్తనమ్మా.. అంటూ తన సామాజిక వర్గమెలాంటిదైనా, తన స్థాయి ఏదైనా అందరితో సమానంగా తన చెల్లెలు కూడా ఎదగాలన్న ఆకాంక్ష ఆ అన్నలో కనిపిస్తుంది.

నీకు పెళ్లీడు వచ్చేనాటికి
పువ్వో బొట్టో కూడబెట్టుతా..
నచ్చినోడికే ఇస్తానమ్మా సెల్లెమ్మా
నా కన్నీళ్లతో కాళ్లు కడుగుతా సెల్లెమ్మా..
రిక్షా బండినే మేనా గడతా సెల్లెమ్మా

నిన్ను అత్తోరింటికి సాగనంపుతా సెల్లెమ్మా.. అంటూ బడుగు జీవిల బతుకుల్లోనూ తొంగి చూసే సున్నితమైన అనుబంధాన్ని ఒక అన్న తన చెల్లెలి కోసం పాడుకునే పాటలో అత్యంత రమణీయంగా ఆవిష్కరించడం గద్దర్కే చెల్లింది!

దళిత జీవన చిత్రాల్లో విభిన్న కోణాలను సినీ గేయ సాహిత్యంలో కొంత వరకే మనం నెమరేసుకున్నాము. రచన విస్తృతినీ, సమయాభావాన్నీ దృష్టిలో పెట్టుకుని కొన్ని గీతాలనే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. అనంతమైన సినీ సాహిత్యంలో ఈ దళిత సాహిత్యానికీ అగ్ర తాంబూలం లభించడం మనం గమనించదగింది. ఈ పాటలు రాసిన వారిలో దళిత కవులూ ఉండడం విశేషం! మంచి అన్నది మాల అయితే.. మాల నేనగుదును అని ఉద్ఘాటించిన గుఱజాడ అప్పారావు నవ సమాజానికి, సమ సమాజానికీ ఆనాడే తన సాహిత్యంతో బాటలు వేశారు. సంఘ సంస్కరణ దిశలోనూ, సహపంక్తీ భోజనాల మూలంగానూ అన్ని కులాలూ, వర్గాలూ సమానమే అనేటటువంటి దృక్పథాన్ని తన రచనల్లో ప్రోది చేశారు! ప్రధాన సాహిత్య శాఖలకైనా, సినీ గేయ సాహిత్య శాఖకైనా పూర్వ కవుల ప్రస్థానం, వారి రచనలూ శిరోధార్యాలని నా అభిప్రాయం!

ఉపయుక్త గ్రంథాలు :

1. యూ ట్యూబ్ లింకు ద్వారాసేకరించిన సమాచారం

సినిమాలు :

మాలపిల్ల
కర్ణ
ప్రాణం ఖరీదు
ఎర్రమందారం
రిక్షావోడు
సప్తపది
వేగుచుక్కలు
చిల్లర దేవుళ్లు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"తుమ్మల రామకృష్ణ 'రాలినచింత' కథ దళిత సామాజిక స్పృహ"

– రొళ్ళపాటి లోకనాథం, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య పీఠం, రాజమండ్రి.

తెలుగు సాహిత్య చరిత్రలో ఎందరో రచయితలు తమ సృజనాత్మక దృక్పథాలతో రచనలు చేసి సుస్థిర స్థానాలను అధిరోహించారు. సాహితీకర్తల సామాజిక బాధ్యత ఈ ఆధునిక కాలంలో కాస్తంత భారమైనదేనని చెప్పాలి. దోషపూరితంగా తయారైన సమాజంలోని వ్యక్తులను, వ్యవస్థలను సరైన మార్గంలోకి నడిపించడానికి సాహిత్యపరంగా శ్రమించకతప్పదు. అలా సామాజిక్షేత్రంలో సామాజిక విలువలను నాటి. పచ్చని శాంతి సౌభాగ్యాల పంటలు పండాలని ఆశించే కర్షకుడు తమ్మల రామకృష్ణగారు.

ఆర్థికంగా, సామాజికంగా, సాహిత్యపరంగా కాస్త వెనుకబడిన రాయలసీమ ప్రాంత రచయితగా సుపరిచితులు రామకృష్ణగారు. తుమ్మల రామకృష్ణగారి కథలు సామాజిక స్పృహ, వర్గ స్పర్శ కలిగి ఉన్నాయి. ముఖ్యంగా చెప్పాలంటే గ్రామీణ జీవితంలో తొంగి చూస్తున్న కుల సమస్యలు, వర్గసమస్యలు మొదలైన అసమానతల నేపథ్యంలోంచి వచ్చిన కథలు వాస్తవికతకు అద్దం పడతాయి.

గ్రామీణ జీవితంలో ఇటీవల వచ్చిన పరిణామాల నుంచి, వాటి మధ్య ఉండే సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రాజకీయ సంబంధాల నుంచి చూడడానికి కథకుడుగా తమవంతు కృషి చేసాడు.

తుమ్మల రామకృష్ణ గ్రామీణ జీవితంలోని కులాలను, కుటుంబాలను, దళితులను, వృత్తులను, వాటి విచ్ఛేధాలను, వాటి పరివర్తన దశాదిశలును కథలలో చిత్రించాడు అన్న తన సాహిత్య గురువు కేతు విశ్వనాథరెడ్డి గారి మాటలు అక్షర సత్యం.

తుమ్మల రామకృష్ణ "రాలిన చింత" కథలో జీవితాను భవం నుంచి వచ్చిన చైతన్యధారలు రామకృష్ణగారికి కథా వస్తువుగా అమరడం వల్ల "రాలిన చింత" కథలో సహజత్వం కనిపిస్తుంది. తరతరాలుగా అగ్రకులాల దోపిడీలో నలిగిపోతున్న దళిత కులాలు యొక్క ఆవేదనను ప్రతిబింబించేదే "రాలిన చింత" కథ మాల, మాదిగ, మంగలి, బోయ, చాకలి, తలారి, ఈడిగ వంటి దళిత కులాలు "రాలిన చింత" కథలో ప్రతిబింబిస్తాయి.

కుల సమాజాలకు దన్ను ధనసమాజం కొమ్ము కాస్తుందని తన కథల ద్వారా పాఠకలోకానికి తెలియ పరచటానికి తుమ్మల రామకృష్ణగారు "రాలిన చింత" కథలో చిత్రించారు. కులాలకు సంబంధించి కథలు చిత్రించడం చాలా వరకు తక్కువుగానే ఉండేవి. గ్రామీణ ప్రాంతాలలో నివశించే దళితులును అగ్రకులాలు వారు, జమీందారులు, భూస్వాములు తమ చెప్పుచేతల్లో పెట్టుకొని శ్రమదోపిడీనికి గురియ్యే దళితకులాల యొక్క వేదనను "రాలిన చింత" కథలో చిత్రీకరించి తద్వారా దళితులును చైతన్యపరచే దిశగా అడుగులు వేశారు రామకృష్ణగారు.

"రాలిన చింత" కథలో రెండు చింతచెట్లు కోసం రెండు దళిత కుటుంబాల మధ్య వచ్చిన గొడవను అవకాశంగా తీసుకుని వాటికి కొంచెం ఆద్యం పోస్తూ అమాయక వ్యక్తులైన "మాలమునెప్ప" "మంగలి రామన్న"లను అగ్రకులానికి చెందిన "శ్రీపతిరావు" అనే కరణం దళితులను ఏవిధంగా దోచుకుంటున్నాడో అని తెలియజేసే కథ "రాలిన చింత".

ఈ కథలో ముఖ్యంగా దళిత స్పృహ అనేది కల్లకుకట్టినట్లుగా కన్పిస్తుంది. పెత్తందార్ల స్వార్థం, కుతంత్రాలు ఏలా ఉంటాయో తెలిపి దళితులలో చైతన్యాన్ని నింపిన ఈ కథ దళితులకు స్ఫూర్తినిస్తుంది.

"రాలిన చింత" కథలో మాలమునెప్ప మంగలి

రామన్నలకు రెండు చింతమాన్లపై యాజమాన్య హక్కుకై ఏర్పడిన తగవు చిలికి చిలిగి గాలివానగా మారినట్లే పల్లె గొడవలు దళిత కుటుంబాల విచ్ఛితికి కారణమౌతాయి అని తెలిజజేసేది ఈ ''రాలిన చింత'' కథ.

సమాజం ఎందుకింత దుర్మార్గంగా తయారవుతుందో అనే ఆవేదన రచయితలో మనకు కన్పిస్తుంది. అటువంటి చాలా వైవిధ్యభరితమైన దళితలకు సంబంధించిన ఇతి వృత్తాలను సమాజం నుంచి సేకరించి వాటిని బాగా చిత్రికపట్టి కథలుగా మనముందుంచిన ఘనట తుమ్మల రామకృష్ణగారిది.

ఈ ''రాలిన చింత'' కథలో ప్రధానంగా గ్రామీణ దళిత జీవన చిత్రణకు రచయిత పెద్ద పీఠవేశారని చాలా స్పష్టంగా మనకు అర్థమౌతుంది అని చెప్పడంలో సందేహం లేదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కథాశిల్పం - వెంకటసుబ్బయ్య వల్లంపాటి.
2. కథానిక - స్వరూప స్వభావాలు - దక్షిణామూర్తి పోరంకి.
3. మట్టి పొయ్యి కథలసంపుటి రామకృష్ణ తుమ్మల.
4. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం- ఆచార్య కొలకలూరి ఇనాక్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి కథాసాహిత్యంలో - దళిత స్త్రీ చైతన్యం

- డా॥ మల్లెపోగు నాగమ్మ, అతిథి అధ్యాపకురాలు, కె.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కర్నూలు.

ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు, తన చుట్టూ ఉన్న జీవితాలే వస్తువుగా, వారి వ్యధ తొలగాలనే ఆరాటమే తన దృష్టికోణంగా సాహిత్యం సృజించారు. తన చుట్టూ ఉన్నవారు స్త్రీలు దళితులు, బహుజనులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులు. తన తల్లి ప్రభావం వల్ల అత్యధికంగా గౌరవించే స్త్రీలను గురించి, తన జీవితం ముడిపడి

ఉన్న దళితలు గురించి సాహిత్యం అధికంగా సృజితమైనా అనేకానేక పార్శ్వాలు వీరి సాహిత్యంలో కన్పిస్తాయి.

స్త్రీ ప్రాధాన్య సాహిత్యం :

ఇనాక్‌గారి సాహిత్యం స్త్రీ ప్రాధాన్యంగా ఉండటం పలువురు గుర్తించిన విషయమే. స్త్రీ పట్ల గౌరవం, స్త్రీ సమర్థత పట్ల అనన్య నమ్మకం వారి రచనల్లో స్పష్టం. శారీరక బలం మానసిక స్థయిర్యం ఈ స్త్రీల శక్తులు ఇంతటి బలమైన శక్తివంతమైన పాత్రలను చిత్రించటంలో ఇనాక్‌గారి తల్లి ముద్ర గుర్తించదగ్గది. తన జీవితం పై బలమైన ముద్రవేసిన వారిగా తల్లిని శ్రీమతిని వారు నిత్యం పేర్కొంటుంటారు.

నిశీధిని శంఖారావం (గులాబినవ్వింది) స్త్రీ పట్ల ఆకర్షణ, వ్యక్తులను ఎలా దిగజారుస్తుందో ఎంత పతనానికి తీసుకెళ్తుందో చెప్పే కథ. గురవయ్య రైలు డ్రైవరు. గతంలో కూలి ఆపై బొగ్గుమోసే పనిలో మేస్త్రీ దయతో ఫైర్‌మెన్ అయ్యాడు. మేస్త్రీ ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చాడు. మేస్త్రీ కూతురు నెల తప్పినప్పుడు కాని వారి వ్యవహారం బయటకు రాలేదు. మేస్త్రీ బాధపడినా వారికి పెళ్ళి చేశాడు. గురవయ్య ఇప్పుడు డ్రైవరు ఒక కూతురు ఒక కొడుకు. కొడుకు వయసున్న దిక్కులేని కోటిగాడికి ఆశ్రయం ఇచ్చాడు. కూతురు నెల తప్పింది. మేస్త్రీలా బలహీనుడు కాదు తాను అనుకొని కొడుకు సహాయంతో చంపేయాలని ఆలోచించి, కొడుకుకు చేయాల్సింది చెప్పాడు. శవాన్ని గోనెలో మూటగట్టి చీకట్లో తెచ్చిస్తే ఇంజనులో వేసి కాల్చేశాడు. పది గంటలకే డ్యూటి ఎక్కిన గురవయ్య, రైలు టాపు పై నుండి ఇంజల్లో కొచ్చి ఫైర్‌మెన్‌ని చంపి కత్తితో నిల్చున్న కోటిగాడిని చూశాక, అంతసేపూ బొగ్గు చిదుగుల్లో పడి ఉన్న కొడుకు పులిగోరును అనుమానంగా చూస్తున్న గురవయ్యకు జరిగింది స్పష్టం అయ్యింది.

ఒక తరంలో జరిగిన విషయం పెళ్ళితో సుఖాంతం అయ్యింది. రెండో తరంలో జరిగిన విషయం చావులతో నిండింది. అక్కడా ఇక్కడా యువజంట బాగుంది.

అక్కడ మేస్త్రీ ఔదార్యం జీవితాన్ని ఇస్తే, ఇక్కడ గురవయ్య అనవసర పౌరుషం ఎంతో భవిష్యత్తు గల కొడుకును తోటి ఉద్యోగిని మట్టు పెట్టటమే కాదు. అతని ప్రాణాల సంబంధించినది కాదు. అతని ప్రాణాల మీదకే తెచ్చింది. స్త్రీ పురుషుల మధ్య తలెత్తే ఆకర్షణ, ఆ జంటకు మాత్రమే సంబంధించినది కాదు. ఆ కుటుంబాలకూ ముడిపడి ఉంటుంది. ఆ వాస్తవం పట్టించుకోక రెండు జంటలూ తొందరపడ్డారు.

కొందరి ఆకర్షణలు సరాదాగా ఇష్టంగా ముచ్చటగా ఉంటాయి. ఆ ఇష్టాలే కొందరికి వికటిస్తే ఎందరి జీవితాలో తలకిందులవుతాయి. అపోహలు అపార్థాలు ఫర్వాలేదు. సర్దుకొంటాయి. జీవితాలే పణంగా నిలిస్తే, ప్రేమకు హింస చావు ప్రత్యామ్నాయం అయితే జీవితాలకు ఇక అర్థం ఏం ఉంటుంది.

మరోకథ (కట్టడి) కథలో చక్కని సౌందర్యంతో ఉన్న పాతికేళ్ళ సుధను చూచి రవి హృద్రోగి అనుకొన్నాడు. డాక్టరు రూం ముందు కూర్చొని ఉంటే, ఒంటి నిండా బంగారం దిగేసుకొన్న రవిని సుధ చూసింది. డాక్టరుకు మిత్రుడనుకొంది. ఆమె అవివాహిత అని తల్లి సౌందర్య వతికి మంచి భర్త దొరకుతాడని చెప్పాడు. ముప్పై అయిదేళ్ళ రవికి పెళ్ళి కాలేదని ఆమె గ్రహించింది. అందుకే అందరూ అందంగా కనిపిస్తారని అంది. ఇద్దరూ పరిచయం చేసుకొన్నారు. డాక్టరు వచ్చాడు రవిని పటుకరించాడు. డాక్టరు వెంట సుధలోనకు వెళ్ళింది. డాక్టరు ఆపరేషన్‌కు వెళ్తే సుధ అక్కడే కూర్చొంది. ఆమె తండ్రి స్వీపరుగా రిటైర్ అయ్యాడని అతను, అతనికి ఎవరూ లేరని ఆమె తెలుసుకొన్నారు. ఆమె ఆపరేషనుకు డబ్బివ్వటానికి సిద్ధపడ్డారు. అప్పుడు తెల్సింది. అంత సౌందర్యం అక్కడ శుభ్రం చేసే హెల్పర్ అని ఆమెకు హర్టు ప్రాబ్లెమ్ లేదని, ఎంతో సంతోషించాడు. డాక్టరు వచ్చాడు. వరిని పిల్చాడు. బయటకు వచ్చిన రవి అక్కడే ఉన్నాడు. నిజానికి రవి అపరేషన్‌కని వచ్చాడు. ఆమె పట్ల అతడికి సదభిప్రాయం ఏర్పడింది అని డాక్టరు ఆమెతో అన్నాడు . ఆపరేషన్‌కు వెళుతూ తనపై ఉన్న బంగారాన్ని ఆమెకు వేసి తాను చనిపోతే అవి ఆమెకు బహుమతి అని బ్రతికి ఉంటే ఆమె అంగీకరిస్తే వివాహం చేసు కొంటానని తెల్పాడు.

కథ చమత్కారంతో నడిచింది. రోగి అనుకొన్న ఆమె డాక్టరు దగ్గర ఉద్యోగి డాక్టటరుకి పరిచయస్థుడనుకొన్న వ్యక్తి ఆపరేషన్ కోసం వచ్చిన ఆపరేషన్ కోసం వచ్చిన హృద్రోగి, అక్కడున్న కాసేపటిలో ఒకరి గురించి ఒకరు తెలుసుకొన్నారు అంచనా వేసుకొన్నారు, అభిప్రాయం ఏర్పరచుకొన్నారు. అతనిలో నిజాయితీని ఆమె పట్ల కల్గిన ఇష్టంలోని నైర్మల్యాన్ని ఆమె గ్రహించింది. ఆమె సౌందర్యాన్ని వ్యక్తిత్వాన్ని అతడు గుర్తించాడు. హస్తవాసి ఉన్న డాక్టరు ఆపరేషను విజయవంతం అయితే అతనూ ఆమె కలుస్తారు. కలవాలనే ఆశా భావనతో కథ నడిచింది. వ్యక్తిత్వ నిరూపణకు బాహ్య ప్రదర్శింతాంశాలు. ఉద్యోగ పేదరికాలు ప్రమాణాలు కావు. వ్యక్తిలో నిగూఢంగా వెలిగే కాంతే వ్యక్తిత్వం, ఇరువురూ ఇరువురిలోని కాంతిని గుర్తించారు కనుకే వారి పరిచయం బంధంగా మారటానికి మార్గం ఏర్పడింది.

రమ నా కూతురు(కొలుపులు) కథలో తల్లి డెబ్భై ఏళ్ళ రసరాజ్యం, ఆమె కూతురు రమ. రసరాజ్యం సంపన్న మాదిగ స్త్రీ. రంగారావుని ఇష్టపడింది. రసరాజ్యం రంగారావు చిన్నప్పటి నుంచి కలిసి చదువుకొన్నారు. స్కూల్ ఫైనల్‌కు వచ్చేసరికి ప్రేమతో ఆమెను శృంగార రసాధిదేవతగా అతను పిలిచేటంతగా అది ఎదిగింది. రాజుల కుటుంబపు వాడైన రంగారావుకు, రసరాజ్యంతో స్నేహం ప్రేమగా పెళ్ళిగా మారే ప్రమాదాన్ని పసిగట్టిన తండ్రి కట్టడి చేస్తే అతనూ ఆ అభిజాత్యం వెనుక దాక్కోసాగాడు. అతను దూరంగా పోయేకొద్దీ ఆమె దగ్గర కావటానికి ప్రయత్నించేది. స్కూలు ఫైనలు తప్పి ఆమె విశాఖలో ఆగిపోవలసి వస్తే అతను పై చదువులకు మద్రాసు వెళ్ళాడు. 'ఇల్లు కదలక, జ్ఞాపకాలు ముసురులో తడిసి ముద్దముద్ధై అన్నం నీళ్ళుముట్టక, చిక్కి సగమై వెర్రిచేపులు మాటలు చేష్టలు ఎక్కువై పిచ్చిదానిలా మారిపోయింది' అతను వస్తే కలిసే వీలులేక కుదరక మద్రాసు వెళ్ళాలని తీర్మానించుకొంది. అతడు మద్రాసు వెళ్తుంటే, కలిసి మాట్లాడి, మనువాడాలని ఆమె కోరిక, ఆమె తప్పు రైలు ఎక్కింది. ఒంటి నిండా నగలున్న ఆమెకు మద్రాసులో కాలేజీల చుట్టూ ఎంత తిరిగినా అతని ఆచూకి దొరకలేదు

ఎవరో ఆశ చూపారు. దోచుకోగలిగినవన్నీ దోచు కొన్నారు. ఆ ఎవరో ఎవరికీ తెలీదు. మద్రాసు సెంట్రల్లో బిచ్చమెత్తుకొంటున్న నిండు నెలల పిచ్చిదాన్ని తల్లి దండ్రులు వెతుకుతూ గుర్తించి తెచ్చుకొన్నారు. బిడ్డ పుట్టాక పిచ్చి చూపులు మాటలు చేష్టలు తగ్గాయి. కాని ఎప్పుడూ ఒకే మాట రంగారావు నా భర్త అని. బిడ్డ తండ్రి విషయమై కేసు అయి కోర్టు డిఎన్ఏ చేసి రంగారావు

బిడ్డ కాదని తేలినా, ఆమె అప్పటికి ఇప్పటికి ఎప్పటికీ నా భర్తే అని ఘంటా పథంగా చెప్తుంది.

ఈ కథలో రంగారావు రసరాజ్యం కౌమరదశలో స్నేహంలో ఆకర్షణలో ప్రేమలో పునీతమయ్యారు. రంగారావు లోకరీతిని గుర్తించి అమెతో స్నేహం ప్రేమలకు దూరమయ్యాడు.కాని రాజ్యం లోకం అతనే అవతలివారికి ఎర అయ్యింది. దోపిడికి గురైయింది. అప్పుడైనా ఆమె రంగారావునే కలవరించింది. కనపడని కలవని రంగారావే తన బిడ్డకు తండ్రి అని ఆమె నమ్మింది. అదే బిడ్డకు చెప్పింది. కోర్టు కాదన్నా, ఆమె రంగారావే తన భర్త అని చెప్పింది. అతనితోడు జీవితంగా రసరాజ్యం స్కూలు వయసులోనే నిర్ణయించుకొంది. అతడి పట్ల ఆమెది చెప్పలేని ప్రేమ, ఆ ప్రేమ లౌకిక పరిధిని దాటిపోయింది. తనపై జరిగిన దోపిడికి కారణమెవ్వరో కూడా తెలియదు కాని, తను తన సర్వస్వం త్రికరణ శుద్ధిగా రంగారావుకే చెందుతాయి అని విశ్వసించింది. బిడ్డ పుట్టి భర్త లేకుండా జీవిస్తున్న రసరాజ్యం ఉన్న ఊళ్ళోనే భార్యా బిడ్డలతో రంగారావు సుఖంగా ఉన్నాడు. ఆమెలో అతడి పట్ల నెలకొన్న భావనలో మార్పులేదు. ఆమెకు పుట్టిన బిడ్డకు తనకు ఎలాంటి సంబంధం లేదని వాదించిన రంగారావు, ఆమెలో ప్రేమైక జీవిని చూశాక చివరిలో ఆమె దగ్గరకు వచ్చి 'నన్ను క్షమించు' అని అడిగాడు.

ఈ కథలో స్త్రీ ప్రేమైక జీవి. పురుషుడు అవకాశవాది. ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నా స్త్రీ ప్రేమ చెక్కు చెదరలేదు. పురుషుడు చిన్న అవాంతరాలకే ఎలా మారిపోతాడో ఈ కథ చెప్తుంది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చాతుర్వర్ణ వ్యవస్థను కూలదోయమనే "నిచ్చెనమెట్లు"

– డా॥. చదలవాడ విజయ్ కుమార్, తెలుగుశాఖాధ్యక్షులు, జి.డి.సి. నాయుడు పేట, పొట్టి శ్రీ రాములు జిల్లా.

ఒకరి బరువు మోయకుండా, ఒకరి తల మీద మరొకడు కాళ్ళుపట్టి అవమానించ కుండా ఈ నిచ్చెనమెట్ల మీద వాళ్ళు, మెట్ల కిందవాళ్ళూ, మెట్ల వెనక పడినవాళ్ళూ, ఈ మెట్ల మాటున అడవుల్లో అజ్ఞాతంగా బతుకుతున్న వాళ్ళూ అందరూ అన్నదమ్ముల్లాగా సమానంగా బతకాలంటే ఈ నిలువు నిచ్చెనను అడ్డంగా పడ దోయడమే. నాతో చేతులు కలపండి. వెనుక బడిన తమ్ముల్లారా! గిరిజనులారా! బహుజనులారా! అందరూ రండి. ఈ నికృష్టపు నిచ్చెనను పడతోద్దాం. పడిపోయిన నిచ్చెనకు అరలు లేవు. అంతస్తులు లేవు. ఒకరి మీద మరొకరు ఎక్కి కూర్చునే అవకాశం లేదు. ఉన్నంతలో అందరం సమానంగా కూర్చుందాం. ఒకే తల్లిబిడ్డల్లా... అరమరికలు లేని అన్నదమ్ముల్లా బ్రతుకుదాం." అంటూ అసమానతలకు ఆధారమైన చాతుర్వర్ణ వ్యవస్థను కూలదోసి సమానతకు పూలబాటలు వేసిన ఇతివృత్తం తో మోదుకూరి జాన్సన్ రచించిన నాటిక 'నిచ్చెనమెట్లు'.

ఈ దేశం ఒక రంగస్థలమైతే, ఈ సమాజం ఒక నిచ్చెన దానికి నాలుగే మెట్లు ఉన్నాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర లేదా విద్య, దికారం, వ్యాపారం, కృషి అనుకోవచ్చు. ఒకరి మీద మరొకరు నాలుగు మెట్ల మీద కూర్చున్నారు. కానీ చాతుర్వర్ణ సమాజం నాలుగు మెట్ల నిచ్చెన లాంటిది. అది నెల మీద నిలబదనూ లేదు, గాలిలో తేలనూ లేదు. మరొక దౌర్భాగ్యుడి గుండెల్లో గాతం వేసుకొని గర్వంగా నిలబడి ఉంది. ఆ నిచ్చెన మోస్తున్న దౌర్భాగ్యుడెవారు. నీచుడా! వ్లేచ్ఛుడా! తుచ్ఛుడా! అంటూ రచయిత సమాజానికి ప్రతీకగా ఉన్న నిచ్చెనను, దానిని మోస్తున్న దళితుణ్ణి పరిచయం చేస్తాడు. వర్ణవ్యవస్థ చట్రంలో బిగించి అణగదొక్కబడిన పంచముల దుస్థితిని చూసి బ్రిటీష్ వాడు వారికి క్రైస్తవులుగా నామకరణం చేశాడు. గాంధీ పంచ ములను హరిజనులుగా పిలిచి వారిని కూడా స్వాతంత్ర్యో ద్యమంలో భాగం చేశాడు. పెరుమారినా వారి బతుకు మారలేదు. అంబేద్కర్ వారికి రాజ్యాంగ పరంగా కొన్ని సదుపాయాలు కలిగించాడు. వారికి ఓటు హక్కును ఇచ్చారు. ఓట్ల ప్రహసనంలో మళ్ళీ మళ్ళీ మోసగించ బడ్డారు. అగ్రవర్ణాలు వారిని ముక్కలుగా విడగొట్టారు. వారి దుస్థితిని చూసిన భారతమాత వారికి ఆర్థిక సమానత్వాన్ని ఇచ్చింది.

నలుగురూ దళితుణ్ణి నిచ్చెన మీద కూర్చోమని ఆహ్వానించారు. ఉన్నవి నాలుగు మెట్లే గనుక ఒకరు నా స్థానాన్ని ఆక్రమించుకోమని కోరాడు. ఎవరూ అంగీకరించక పోవడంతో నిచ్చెనను క్రిందకు పడవేస్తే అందరూ ఒకే వరుసలో సమానంగా కూర్చోవచ్చని ప్రతిపాదన చేస్తే అందరూ అంగీకరిస్తారు." మోదుకూరి జాన్సన్ నిచ్చెన హిందూ జాతికి చెందిన నిచ్చెన. ఏ పురాణకాలంలోనో, ఏ స్వార్థపరులో స్వప్రయోజనాల కోసం కట్టబెట్టిన నిచ్చెన. అనాటి నుండి చివికి కుళ్ళి దుర్వాసన కొడుతున్న నిచ్చెన. నిర్జీవమైపోయినా ప్రేతంగా నిలిచి అభ్యుదయ గాములైన యువజనులను, సంస్కర్త లను, మేధావులను చెదరగొట్టి పారేస్తున్న నిచ్చెన. ఈ నిచ్చెనను విరగ్గొట్టి, పండబెట్టి నామరూపాలు లేకుండా భూస్థాపితం చేయాలని మోదుకూరి దీక్ష, వ్రతం. మోదుకూరి తపస్సు వేదిక మీద ఫలించిందని" డాక్టర్ భీమన్న ప్రశంసించారు.

"నాలుగు వర్ణాలనూ నాలుగు నిచ్చెన మెట్లుగా భావిం చటం మౌలిక కల్పన అంటున్నది జాన్సన్ సృజనాత్మకత ప్రతిభా దృష్ట్యా నిజానికి ఇది పరమ యదార్థ చిత్రణ" అని ఆచార్య సి. నారాయణ రెడ్డి అభివర్ణించారు.

ఈ నాటకాన్ని 1976లో ఆంధ్రప్రదేశ్ హైదరాబాదులో నిర్వహించిన హరిజనోత్సవాల సందర్భంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో వ్యాఖ్యాతగా కొంగర జగ్గయ్య, కవిగా

మోదుకూరి జాన్సన్, బ్రాహ్మణునిగా అల్లు రామలింగయ్య, క్షత్రియుని గా రావు గోపాల రావు, వైష్యునిగా మాడా వెంకటేశ్వరరావు, శూద్రునిగా పేకేటి శివరామ్, పంచ మునిగా డాక్టర్ ప్రభాకర రెడ్డి, భరతమాతగా విజయ నిర్మల, క్రైస్తవునిగా నాటి శాసనసభ్యులు చుక్కా పీటర్ పాల్ నటించారు. వీళ్ళందరూ ఈ నాటకంలో నటించారు అనడం కంటే జీవించారు... అంటేనే ఉత్తమంగా ఉంటుంది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"దండోరా ఉద్యమం – గుండెడప్పు కనకయ్య తీర్పు"

– కొట్ల గోవిందరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

వేదకాలం నుండి ఉన్నతమైన నాగరికత సొరభాలు వెదజల్లి, ఎన్నో వైవిధ్యాలు, వైరుధ్యాలు కలిగిన భారతీయ సమాజం ప్రపంచంలో ఏ సమాజానికి లేని వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థలను కలిగి ఉంది. వర్ణవ్యవస్థ కంటే భిన్నమైనది, సంక్లిష్టమైనది కులవ్యవస్థ. ఈ కులవ్యవస్థ వలన ఈ హిందూ సమాజంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. మనుధర్మశాస్త్రం, పురుషసూక్తం ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ కులవ్యవస్థ, వర్ణవ్యవస్థల తరువాతి కాలంలో వెర్రితలలు వేస్తూ, అల్పసంఖ్యాకులైన విజ్ఞానవంతులు, బుద్ధి జీవులు కలిసి, అధిక సంఖ్యాకులైన ప్రజల్ని మభ్యపెట్టి శారీరకంగా, మానసికంగా బలహీనున్ని చేసి కులవ్యవస్థ కట్టుబాట్లను పెంచి, బానిసకొక బానిసగా ఎంచి, పంచములు, దళితులని పేరు పెట్టి, అస్పృశ్యులని, అంటరానివారని ముద్ర వేసి ఊరికి దూరంగా ఉంచి నాగరికతకు, అభివృద్ధికి దూరం చేసి, నీచమైన వృత్తులు అంటగట్టి శతాబ్దాల తరబడి దోచుకుతిన్న వైనం భారతీయ సమాజంలో మాత్రమే కనిపిస్తుంది. ఈ దళిత సమస్య తరాల తరబడి భారత దేశాన్ని పట్టిపీడిస్తూనే ఉంది. ఈ దళిత సమస్య వలన దేశంలో ప్రజల మధ్య అంతరాలు, ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో అసమానతలు పెరిగిపోయాయి. ఇటువంటి సామాజిక వైకల్యాలను నిరసిస్తూ ఆధునిక యుగంలో దళిత సమస్యలే ప్రధానస్వరంగా కొద్దోగొప్పో రచయితలు రాసినప్పటికీ 1980 తరువాత దళిత సమస్యలే ప్రధాన ఎజెండాగా ఎంతోమంది కవులు సాహిత్య సృష్టిని కావించారు. అయితే ఈ దళిత సాహిత్య ఉద్యమం చివరిలో మనకు దండోరా ఉద్యమం ఊపందుకుంది.

దండోరా ఉద్యమాన్ని పరికించినట్లయితే దళిత సాహిత్యంలో భాగంగానే మాదిగ కవులు తమ సొంత గొంతుకతో తమ వర్గం యొక్క సాధకబాధకాలను తెలియజేస్తూ మాదిగ స్వరాన్ని వినిపించారు. ముఖ్యంగా ఈ దండోరా ఉధ్యమావశ్యకత ఎందుకు వచ్చిందంటే, శతాబ్దాల తరబడి దళితులు అణచివేతకు గురవుతూనే ఉన్నారు. అందులోనూ మరీ ముఖ్యంగా మాదిగలు అటు అగ్రవర్ణాలవారిచేత, ఇటు సోదరులైన మాలల చేత అణిచివేతలకు గురౌతూ, రెండు వర్గాల వారి చేత అస్పృశ్యతను అంటరానితనాన్ని అనుభవిస్తున్నారు. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన దోపిడీ ఒక రకమైనదైతే స్వాతంత్ర్యం వచ్చి, రిజర్వేషన్లు అమలు జరుగుతున్నా మాదిగల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చిన కవిత్వమే దండోరా కవిత్వం. ఈ దండోర ఉద్యమం ఆంధ్రరాష్ట్రంలో 1985 తరువాత ఉధృతంగా వచ్చింది. అందులోనూ తెలంగాణా ప్రాంతంలో మరింత వ్యాప్తి చెందింది. ఈ ఉద్యమానికి ఊపిరి తానై, మాదిగల వెలుగు కోసం తాను జ్యోతిలా జ్వలించి తన ఉచ్ఛ్వాసనిచ్ఛ్వాసలను సైతం మాదిగ చైతన్యానికే ఆలోచించి తెలంగాణా ప్రాంతపు కవి, దండోరా ఉద్యమ సారధి ఆచార్య గుండెడప్పు కనకయ్య గారు.

కనకయ్య గారు తెలంగాణా రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా వీణవంక గ్రామంలో 15-12-1969లో శ్రీమతి శ్రీ పులాల కొమరమ్మ, యల్లయ్య దంపతులకు జన్మించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో కూడా తల్లి దండ్రులు చోరవ వలన ఉన్నత చదువులు చదువుకుని, ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో తెలంగాణా విశ్వ విద్యాలయంలో ఆచార్యులుగా ఉన్నతమైన పదవులు నిర్వహిస్తున్నారు. ఈయన తన నిశిత పరిశీలన ద్వారా, చిన్నప్పటి నుండి తాను చూసిన కొన్ని సంఘటనలకు చలించిపోయి, ముఖ్యంగా దళితుల మధ్య అంతర్గత

కుమ్ములాటలు, అనైక్యత వంటి విషయాలను, అన్ని రంగాల్లో మాదిగలు వెనుకబాటుతనానికి గల కారణాలను అన్వేసించి కలం పట్టి కథనానికి పూనుకున్నాడు. ముఖ్యంగా సమాజంలో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యల్ని బహిర్గత పరిచాడు. అటు అగ్రవర్ణాల చేత, ఇటు అగ్ర దళితుల చేత రెంటికి చెడ్డ రేవడిలా నిత్యం దాడులు ఎదుర్కొంటూ, వివక్షలకు గురవుతూ, అంటరానితనం అనే జాఢ్యాన్ని భరిస్తూ బానిసకొక బానిస బ్రతుకు వెళ్లదీస్తున్న మాదిగల వెతలను తెలిపారు. ముఖ్యంగా మాదిగల చైతన్యాన్ని ఆకాంక్షించి, అన్ని రంగాల్లో మాదిగ అభివృద్ధిని ఆశించాడు.

ఈ మాదిగ చైతన్యంలో భాగంగా తాను కవిత్వం రాయడమే కాక ఎంతోమంది రచయితలను, యువ కవులకు మార్గదర్శియై, వారి యొక్క కవితలు, కథల్ని సంకలనం చేసిన ఘనుడు. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రిజర్వేషన్లు అమలు తీరులో జరుగుతున్న అక్రమాల కారణంగా నేటికీ సమాజంలో అసమానతలు పెరిగి పోయాయని, తెలియజేస్తూ ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో విద్యా ఉద్యోగంలో మాదిగల స్థితి గతులను తెలియజేసారు. నేటికీ అన్ని రంగాల్లో మాలలు అభివృద్ధి చెందినప్పటికీ మాదగలు, ఇతర ఉపకులాలు వారు మాత్రం నేటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారని తెలిపారు. ఈ విధంగా ఎన్నో అంక్షలు, అవ మానాలు అవహేళనలు మధ్య నిత్యం బ్రతుకు పోరాటం చేస్తున్న మాదిగల ఆకలికేకలను తెలియజేస్తూ, రిజర్వేషన్లను ఎ, బి, సి, డిలుగా వర్గీకరిస్తేనే అన్ని కులా లకు సామాజిక న్యాయం అందుతుందనీ తెలుపుతూ దండోర ఉద్యమంలో వర్గీకరణ ఆవశ్యకతను తెలియ జేసాడు.

మనుధర్మ శాస్త్ర ప్రేరణతో బ్రాహ్మణ మనువాదులు మానవతా విలువల్ని మరిచి బ్రహ్మరాక్షసులవలె ప్రవర్తించి దళితులపై జరిపిన దమనకాండ చెప్పనవి కానిది. క్రీస్తుపూర్వ నుండి ఇప్పటి వరకు వారి ఇనుప పాదాల క్రింద నలిగి పోయి అనువులు బాసిన దళితులెందరో? ప్రతీ వీధిలో ఒక తలతెగిన శంభూకుడు, ప్రతీ గ్రామంలో బొటన వేలు లేని ఏకలవ్యుడు మనకు దర్శనమిస్తూనే ఉంటూ అటువంటి సంకెళ్ళు నుండి తప్పించుకున్న దళితుల్లో అంతర్గత అశాంతి చెలరేగింది. ముఖ్యంగా రిజర్వేషన్ ఫలాలను కేవలం మాలలు మాత్రమే అనుభవిస్తూ, విద్య, ఉద్యోగం, ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రభుత్వ సహాయసహకారాలను అందుకుని, మాదిగలకు మరియు ఇతర ఉపకులాలకు రిక్తహస్తం చూపిస్తూ, అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ ఉపకులాలని పాతాళానికి నెట్టిన ఘటనను మనం ఈ సమాజంలో గమనించవచ్చు. సోదరుల చేత వంచనకు గురై, వివక్షలు, అంటరానితనం ఎదుర్కొంటూ, ప్రాథమిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ వంటి కనీస అవసరాలు లేక పేదరికం, నిరుద్యోగం, అవిద్య అజ్ఞానంలో కొట్టు మిట్టాడుతూ ఉన్న మాదిగల ధీనగాధ, వారి ఆవేశపు, ఆక్రోశపు ఉద్యమ జ్వాల దండోరా ఉద్యమం. ఈ దండోరా ఉద్యమ ప్రధాన ఎజెండా ఎస్.సి. రిజర్వేషన్ల వర్గీకరణ. అయితే ఈ వర్గీకరణకు మాలలు వ్యతిరేఖిస్తూ ఏకీకరణ మంత్రం జపించడం మాదిగల్ని మరింత ఆగ్రహానికి గురి చేస్తుంది. ఇప్పటి వరకు అనుభవించిన రిజర్వేషన్లు చాలక, ఇంకా అనుభవించాలనే పేరాశతో వర్గీకరణ ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తూ, ఏకాకరణ పేరుతో అణచివేతకు గురి చేస్తూ మామహానాడు పేరుతో మాయలు పన్నుతూ, ఉపకులాల ఎంగిలి కూడుకై అర్రులు చాస్తున్న మాలల స్వార్థపూరిత విధానాలను నిరసిస్తూ ఆచార్య కనకయ్యగారు దండోర ఉద్యమ బావుటాను ఎత్తి తన గోడును కవితా రూపంలో చెపుతూ మాలల సోదరఘాతుకాన్ని నిలదీస్తున్నాడు.

"ఏకమౌదామని
బజారు మనిషి
ఎక్కు పెట్టిన బాణం
ఏకీకరణీయం

... అంటూ

ఏలుబెట్టి ఇయ్యాల
ఉత్పత్తి కులాలను
శాసిస్తున్నారు!?
నామను లెవరు?"

సమైఖ్యత పేరుతో మాలలు అణిచివేత ధోరణి ప్రదర్శిస్తున్నారనీ, ఏకీకరణ ఉద్యమం కేవలం మాలల స్వార్థపూరితమైన ఆలోచన అని, బజారు మనిషివంటి మనస్తత్వం గల మాలలు కల్లబొల్లి మాటలతో ఏకీకరణ మంత్రం జపిస్తూ మరిన్ని దశాబ్ధాలు వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలియజేసారు. ఎస్.సి.లోని మాదిగలు మొదలుకుని, అనేక ఉపకులాలు ఉత్పత్తి కులాలై సమాజానికి కావలసిన అనేక అవసరాలు తీర్చుతున్నా యనీ, అటువంటి ఉపకులాలను ఈ వేళ మాలలు ఆధిపత్యం, అధికారం పేరుతో చెలాయిస్తూ, వారి శ్రమను దోచుకుంటున్నాయనీ, విద్యా ఉద్యోగాల్లో అవకాశాలు అందుకుంటూ, ఇతర ఉపకులాలను వాటికి దూరం చేసి, ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుకు గురి చేసి పాతాళానికి తొక్కేస్తున్నారనీ, మాలలు ఉపకులాల పాలిట వామనులై ఆధిపత్య ధోరణి కలిగి ఉండి, మహానాడు పెట్టి, మాదిగల్ని నిలువునా ముంచుతున్నారని తెలుపుతూ

"ఇతరుల మేలుకే
తరాలుగా జీవిస్తున్నాం
మనువాద రోటికి
ఏకీకరణీయ రోకలికి మధ్య
నలిగి పోతున్నాం
జీవిత లక్ష్యం తెలియక
మనువాద ఊబిలో పడ్డాం"

శతాబ్ధాల శ్రమను గుర్తు చేస్తున్నాడు కనకయ్య. ముఖ్యంగా పురాతన కాలం నుండి మాదిగలు చర్మకార వృత్తితో పాటు, దండోరా, వ్యవసాయం, పారిశుద్యం వంటి వృత్తులతో సమాజ సేవకే అంకితమై కాలం, సమయంతో పని లేక అహోరాత్రులు శ్రమిస్తున్న మాదిగలు అటు అగ్రవర్ణాల వారికి, ఇటు అగ్రదళితులకు మధ్య నలిగిపోతున్నారని తెలుపుతూ

"వేల ఉద్యోగాలను
గద్దలా తన్నుకుపోయారు
లక్షల జీవితాశలను
పెళ పెళమని విరిచారు"

అంటూ విద్య ఉద్యోగ రంగాల్లో మాదిగలు మోసపోతున్న తీరును తెలియజేసారు. ఎస్.సి. కోటాలోని అన్ని విశ్వవిద్యాలయాల్లోని సీట్లు మాలలే తన్నుకు పోతున్నారనీ, క్లర్క్ పోస్ట్ నుండి ప్రభుత్వ సర్వీసుల వరకు అన్ని ఉద్యోగాలు మాలలే పొందుతున్నారనీ, ఎస్.సి. కమీషన్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శులు, మంత్రులుగా, ఎ.పి.పి.ఎస్.సి. సభ్యులుగా కూడా మాలలే ఉండడం వలన వచ్చిన ఉద్యోగాలన్నీ మాలలే పొందు తున్నారనీ, మాదిగలకు ఎక్కడా ప్రాతినద్యం లేదని వాపోతూ, డిగ్రీలు చేత పట్టుకుని మాదిగ, ఇతర ఉపకులాల యువత చెప్పులు అరిగేలా తిరుగుతూ నిరుద్యోగులై నిరాశాజనకమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ రకమైన దోపిడీ, దౌర్జన్యం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో శ్రమ దోపిడీ వలన మాదిగలు నిత్యం ఆకలి కేకలతో అలమటిస్తున్నారని వాపోతూ

"ఊపిరి బతుకులు
ఉత్పత్తి కులాలు
పంది కొక్కుల
తీరని ఆకలి"

ఉత్పత్తి కులాల యొక్క శ్రమను, అవకాశాలను, అభివృద్ధిని, దోచుకున్న మాలలు ఇంకా ఆకలి తీరక అగ్నిదేవుని మాదిరి అమాంతం స్వాహా చేయాలని అనుకుంటున్నారని నేటికీ ఉత్పత్తి కులాలు రెండు పూటలా తినడానికి కూడా గతిలేక ఆకలి బ్రతుకులు బతుకుతున్నాయనీ, వారి పేదరికం, నిరుద్యోగం వంటివి చూసి కూడా మాలల మనస్సు చదవడం లేదని వాపోతూ...

"ఈ సారి కవికుండలో సేతులు తిప్పుతూ
బలిచ్చేది గొర్రె మేకల గాదు....
బాసనిజాన్ని.... దళిత బాపనిజాన్ని..."

మాదిగల పట్ల, ఇతర ఉపకులాల పట్ల శతాబ్దాల తరబడి అన్యాయం చేసిన మనిషి, ఇప్పుడు వాటిని పాతాళానికి నెట్టే ప్రయత్నం చేస్తున్నారనే తెలుపుతూ, ఈ తరుణంలో మాదిగల ఉధాసీనంగా వ్యవహరిస్తే మొదటికే మోసం వస్తుందని, మాలలు ఇకనైనా మారాలని, అలాంటి మార్పు కనిపించకపోతే ఈసారి మాదిగలు తీవ్రమైన ఉద్యమం చేపడతారని హెచ్చరిస్తూ, ఎల్లమ్మ పండగ సందర్భంగా ఇచ్చే బలిలో దళిత బాపనిజాన్ని బలిస్తామని తీవ్రంగా హెచ్చరించారు.

వర్గీకరణ మాదిగల పాలిట అమృతమని కనకయ్య భావించారు. తరతరాలుగా మాలలు మాదిగల్ని బానిస కొక బానిసగా ఎంచి వారి వృత్తిని, వారి శ్రమను, వారి నాగరికతను దొచుకున్న, అన్ని రంగాల్లోనూ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంచుతూ, అరుంధతీయుల్ని అంటరానివారిగా, అస్పృశ్యులుగా చేసి, ఊరికి, సమాజానికి దూరంగా ఉంచిన ఘటన గమనించవచ్చు. ఉపకులాల పాలిట వామనులై వారిని అభివృద్ధిని, వారి చైతన్యాన్ని చూడలేని మాలలు మరో మనువులా వారిని అణిచివేస్తున్నారని మాలల్ని అగ్రదళితులు, మరో మనువు వారసులు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. నేటి సమాజంలో మాదిగల స్థితిగతులు చూసి, చలించి పోయిన కనకయ్య తన కవిత్వానికి తోడుగా ఎంతోమంది మాదిగ కవులను, యువతను, కళాకారులను ఏకతాటిపైకి తీసుకువెళ్ళి దండోరా దరువు, గుండెడప్పు, కడుపు మీద కొట్టకుండ్రి వంటి కవితా సంకలనాలు వెలువరిచారు. తన జాతి చైతన్యానికి, తన వర్గం అభివృద్ధికి అరుంధతీయుల విముక్తికి, మాదిగల విద్య ఉద్యోగ రంగాల్లో స్వయం సమృద్ధికి అహర్నిశలు శ్రమించి దళిత కవి, జాంబవ కవి, అరుంధతీయుడు ఆచార్య గుండెడప్పు కనకయ్య. ఈ మాదిగల వెనుకబాటును నిర్మూలించి, అభివృద్ధి మధంలో నడిపించడానికి వర్గీకరణ ఉద్యమాన్ని ఎంచుకున్న ఉద్యమ నేత కనకయ్య దళిత సాహిత్యాని కిచ్చిన తీర్పు.

ఆధార గ్రంథాలు :

1) మాదిక్కేక - గుండెడప్పు కనకయ్య
2) వర్గీకరణే హైటెక్ ఔషదం - గుండెడప్పు కనకయ్య
3) బేంజ్ - గుండెడప్పు కనకయ్య
4) రాజశేఖరా మోజు తీరలేదురా - గుండెడప్పు కనకయ్య
5) దళితవాద వివాదాలు - తాళ్ళూరి లాలున్‌బాబు
6) తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న
7) తెలుగు కవితోద్యమాలు - తెలుగు అకాడమీ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత కవిత్వం - చారిత్రక నేపథ్యం

- గెడ్డ కళ్యాణి
పరిశోధక విద్యార్థి, ఆదికవి నన్నయ
విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం
తూర్పు గోదావరి జిల్లా.

- డా. మోగంటి సుధాముయి
తెలుగు శాఖాధ్యక్షులు,
ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అ)
రాజమహేంద్రవరం.

భారతదేశంలో కొనసాగుతున్న చాతుర్వర్ణ వ్యవస్థని ఆధారంగా చేసుకొని కులాల విభజన జరిగింది. ఈ వ్యవస్థకి భిన్నంగా పంచమ వర్ణంగా గుర్తించబడుతున్న సమూహాన్ని అంటరానివారిగా సమాజానికి అతి దూరంగా పశువుల కంటే హీనంగా చూశారు. ఒకప్పుడు గాంధీచే ప్రచారం చేయబడ్డ 'హరిజనులు' అని పిలిపించుకోబడినా కూడా ఈ వర్గం తమ సొంత వ్యక్తిత్వాన్ని, అస్తిత్వాన్ని గుర్తెరిగి ''దళితులు'' అని సగర్వంగా చాటుకున్నారు. ఈ పదానికి అణచబడిన వారు, వేరు చేయబడిన వారు అని అర్థం. 1971లో బొంబాయి నుండి ప్రచురించబడిన మరాఠీ దళిత 'పాంథర్స్ మానిఫెస్టో''లో 'దళిత' అనే పదానికి ఈ విధంగా అర్థం చెప్పబడింది. షెడ్యూలు కులాలు, తెగలు, బౌద్ధులు, శ్రామికులు, భూమి లేని పేద రైతులు, స్త్రీలు మతం పేరుతో రాజకీయంగా, ఆర్థికంగా దోపిడీకి గురైన వాళ్ళంతా దళితులౌతారని, అగ్రవర్ణ స్త్రీలను దళితులుగా భావించనవసరం లేదని, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు వంటి మైనారిటీ వర్గాలపై హిందూ ఆధిపత్యం, అణచివేత ఉన్నాయి కాబట్టి వారిని కూడా దళితులుగా గుర్తించాలని'' ఈ పత్రికలో అభిప్రాయపడ్డారు. భారతీయ దళిత సాహిత్యం ముందుగా మరాఠీ భాషలో మొదలై ఆ తరువాత భారతీయ భాషలన్నింటికీ విస్తరించింది.

సంఘ సంస్కరణోద్యమం మొదలకొని అభ్యుదయ వాదం నుండి మైనారిటీ వాదం వరకు ఎన్నో ఉద్యమాలు తెలుగు సాహిత్యాన్ని ముందుకు వివిధ ప్రక్రియలతో నడిపించాయి. అయితే దళిత సాహిత్యం అనేది వాదంగా రూపు దిద్దుకోక ముందే అంటరానితనం అస్పృశ్యతను రూపుమాపే దిశగా ముందు తరం కవులు అక్కడక్కడ ప్రస్తావిస్తూ వచ్చారు. 1909 భాద్రపద మాసపు ఆంధ్ర భారతి పత్రికలో మాల వాండ్ర పాట అన్న గేయంలో అస్పృశ్యత నిరసన కనిపిస్తుంది. ఇదే మొదటి అస్పృశ్యత నిరసన అని విమర్శకారుల అభిప్రాయం. దీని కర్త ఎవరో తెలీదు నాటి కుల నిర్మూలన గురించి తెలియజేసిన గేయం.

అందారు పుట్టరీ హిందమ్మ తల్లికి
అందారు ఒక్కటై ఉందారి సక్కంగ
అమ్మోరు దీవించి అయిశార్యమిచ్చును

మంగిపూడి వెంకటశర్మ తర్వాత కాలంలో తన రచనల ద్వారా ఈ అస్పృశ్యత దళితభావాలను తెలిపారు.

''కాపురంబులు చేయగా చుట్టుగుడిసెలే
కాని లోగిళ్ళు లెక్కకును లేవు
చెలగికట్టంగ మాసిన చింపిగుడ్డలే
కాని వల్వలు కొంచెమ్మెన లేవు
త్రావంగ నూకల జావయు, గంజియే
కాని అన్నమును శాకములు లేవు
సాగసుగా తాల్పు గాజులు, పూసపేరులే
కాని బంగరునగల్ లేనెలేవు
పంటపండింపగా నూరివారి చేలె
కాని సొంతంబు లెందును కానరావు
అకట! మా ఘోరదారిద్ర్యమొకరిక్కెన
జాలి పుట్టింపదాయెనా శ్రీలులార!

దళిత సాహిత్యానికి మొదట పునాది చెప్పబడుతున్న రచనలు ముఖ్యంగా మంగిపూడి వెంకట శర్మ అలాగే

కుసుమ ధర్మాన్న నిరుద్ధ భారతం ను చెప్పవచ్చును. మంగిపూడి వెంకట శర్మ తనదైన శైలిలో అప్పటి సామాజిక స్థితిగతులను అస్పృశ్యతను తనదైన శైలిలో కవిత్వీకరించాడు.

"మాలవాడని యవమానంబు గావించి
పంచముండని పరువు పారద్రోలి
ఆదిమాంధ్రుడవని సోదిచెప్పిరి గాదె
ఆలకింపుమయ్య హరిజనుండ!"

దళిత కవిత్వం అంటే దళిత కవులు రాసింది మాత్రమే అన్న భావన నుండి ఎవరు రాసిన కవిత్వం అయిన దళిత కవితవంగా విమర్శకులు పెర్కొన్నప్పటికీ దళిత కవిత్వాన్ని దళిత కవులు రాస్తేనే దళితుల దృక్కోణంతో పాటు ఆ ఆర్తి గాడత వాస్తవికత ఆవేదన ప్రతిఘటన ప్రస్పుటంగా కనిపిస్తాయనడానికి కుసుమ ధర్మాన్న సాహిత్యం ఒక మెట్టు అని నిరూపించింది.

"కొల్చు నీకు పిచ్చ కుంచంబుతో తాను
కొల్చుకొనడె పెచ్చుకుంచమునను
దోచుకొనక నీకు దొర యెట్టులగు ర్కెతు.."

దళితులు నాటి కాలంలో పెత్తందార్ల వద్ద నష్ట పోయిన విధానం దోపిడీకి గురి అవుతున్న తీరును ధర్మన్న నాడే వాస్తవికంగా కళ్ళకు కట్టినట్లు చూపించాడు దళిత స్పృహను నాటి కాలంలో ఇంతల వాస్తవిక చిత్రణ చేసిన కవి కుసుమ ధర్మాన్న మాత్రమేనేమో.

1910 గురజాడ లవణరాజు కలలో కూడా అస్పృశ్యత నిరసన మనం చూడొచ్చు దీని భావం విషయానికొస్తే దేహం మలినం అయినంత మాత్రాన అల్ప కులస్తులని మనసులో మాలిన్యం ఉన్న వారిని అధిక కులస్తులు అన్న భావం మంచిది కాదని దాని తను నిరసిస్తూ మంచి ఎటు వైపు ఉంటె తాను అటువైపు ఉంటానని అది అల్ప కులమా అధిక కులమా అన్నది అనవసరం అని తెలిజేయడం జరిగింది.

మలిన దేహులమాలలనుచు
మలినచిత్తుల కదికకులముల
నేలవోసంగిన వర్ణ ధర్మ
మదర్మ ధర్మంబె

అంతే కాదు మనుషులలో ఉన్న కులాలు రెండే అని అవి మంచి చెడు అని మంచి అన్నది మాల అయితే ఆ మాల నేను అవుతా అంటారు గురజాడ తర్వాత ఈ శైలిను చాల మంది కవులు అనుసరిస్తూ వచ్చారు.

మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగా రెండే కులములు
మంచియన్నది మాలయైతే
మాలనేనగుదున్

జాషువా తర్వాతి కాలంలో అంటరానితనం అస్పృశ్యతల మీద తనదైన సాహిత్యంతో తన కన్నీటిని కూడా కవిత్వంతో అగ్నిగా కురిపించాడు.

నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపురే
ఖాకమనీయ వైఖరులగాంచి భళిభళి యన్నవాడె, నీ
దేకులమన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచిపోవుచో
బాకున గ్రువినట్లగును పార్థివ చంద్ర వచింప సిగ్గగున్

తన కవిత్వాన్ని దానిలోని మధుర్యన్నీ ఎంత పొగిడి అభినందించి నప్పటికీ తనదే కులమని ప్రశ్నించి ఆ కులపు వెక్కిరింతను గురించి తలుచుకొని బాధ పడిన సందర్భాన్ని బ్రాకుతో గ్రుమ్మినట్లు ఉందని ఆవేదన చెందుతాడు. తర్వాత కాలంలో మేకల్నే బలిస్తారు సింహాల్ని కాదు అన్న అంబేద్కర్ మాటలతో ఆయన్ని స్ఫూర్తిగా తీసుకొని దళిత సాహిత్యానికి ఒక స్థిరత్వాన్ని ఏర్పాటు చేసే క్రమంలో స్వచ్ఛమైన తాత్విక భావంతో పాటు ఆ భావజాలాన్ని ఉద్యమం వైపు తీసుకెళ్ళినన రచన బొజ్జతారకం నది పుట్టిన గొంతుక ఆ తర్వాత రాబోవు దళిత సాహిత్యానికి ఒక గట్టి పునాది వేసింది.

"నేను అస్పృశ్యుణ్ణి
నా ఒళ్ళంతా మట్టి వాసన
నా బ్రతుకు నిండా వెట్టివేదన

నా కళ్ళనిండా ఎండవేడిమి
ఎండకు ఎండి వానకు తడిసి
బిగుసుకుపోయినజి
మర్రి ఊడల్లా నా తల
నన్ను ఊరికి దూరంగా ఉంచారు
మట్టి పిసికి యిటుకలు చేసి
ఇళ్ళు కట్టి యివ్వమన్నారు
ఇంట్లోకి రావద్దన్నారు
చచ్చిన మీ గొడ్డుల్ని
మోసుకుపొమ్మన్నారు
వాటి చర్మం ఒలిచి
చెప్పులు కుట్టమన్నారు
నేను చెప్పులు తొడగకూడదన్నారు

దళితకవిత్వం ఒక చారిత్రిక కవితోద్యమం. అగ్రవర్ణ అహంకారంతో పోరాటం తాత్కాలిక అవసరమ్మెనా, కులనిర్మూలన దాని అంతిమలక్ష్యం. సమగ్రమ్మెన తాత్విక నేపథ్యం, సమకాలీన సమస్యాచిత్రణ, వస్తువ్మెవిధ్యం, దళితజీవన వాస్తవికతల్తో పాటు, అత్యుత్తమ కవితాభివ్యక్తి దళితకవిత్వాన్ని మహోజ్జ్వలం చేస్తోంది. ప్రతిఘటన వల్ల రాజకీయపార్శ్వమూ, వాస్తవికత వల్ల సాంస్కృతిక పార్శ్వము, కవితాభివ్యక్తి వల్ల కళాపార్శ్వమూ, నిండుగా పండించుకుంటున్న దళితవాదం తెలుగుకవిత్వానికి గర్వకారణమ్మెన ఒక ఉద్యమం.

ఆధార గ్రంథాలు :

1.తెలుగు కవిత్వంలో దళితవాదం- అద్దేపల్లి రామ్మోహన్ రావు
2.తెలుగులో కవితోధ్యమాలు -తెలుగు అకాడమి
3.దళిత సాహిత్య తత్వం --శిఖామణి
4.దళిత సాహిత్యం - కలేకూరి ప్రసాద్

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సామాజిక చైతన్యం – చిలుక భాస్కర్ సాహిత్యం

– **అరూరి రొజు,** జానపద కళల శాఖ పరిశోధన విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్, తెలంగాణ.

తెలుగు మాగాణిలో వెలుగొందిన తెనుగు భాషావాగ్గేయకారులు అన్నమయ్య, త్యాగయ్య, మౌఖిక జానపదులకు ఈ నేలపై కొదవలేదు. ఆధునిక కాలంలో ఎందరో ప్రజావాగ్గేయకారులు అవతరించిన నేల ఈ తెలుగునాడు.

ఇలాంటి కోవకు చెందిన వాగ్గేయకారులు ఇంకా మీడియా నేత్రచూపులకు చిక్కని పరిశోధకులకు అందని ప్రతిభావంతులైన కవిగాయకులకు రచయితలుకు తెలుగు వెలివాడలలో వెలతి లేదని నేను చూసిన చదివిన గ్రంథాల ఆధారంగా నిరూపించగలను.ఈ మట్టిలో మాణిక్యంలా మాదిగల గూడెంలో మ్రోగే నాదం సంగీత సాహిత్యానికి ప్రేరణ కలిగించిన అచ్చమైన జానపద గానపదుల "విజ్ఞానవంతుల వాడ, తెలుగుదేశం లో ఉన్న "తూరుపు వాడ." ఈ వాడను ఇంతకు పూర్వము అక్షర రూపం లో తెచ్చిన వారెందరున్నా.... ఆ వెలివాడను సమగ్రంగా అధ్యయనం చేసి అక్షరగ్రంథ రూపంలో పరిశోధనకనువైనదిగా సాహిత్య జగత్తుకు అందించిన మహాకవి డా. చిలుక భాస్కర్ గారు.

ఓరుగల్లు ఇవ్వటి తెలంగాణ రాష్ట్రం లోని మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలకేంద్రంలో కీ.శే.చిలుక.శాంతమ్మ, రామయ్య పుణ్య దంపతులకు 1963, డిసెంబర్ 27వ, తేదీన డా. చిలుక భాస్కర్ గారు జన్మించారు.

బాల వాగ్గేయకారుడిగా గూడెం గుండెల్లో పేరొంది, 1977లో మొట్టమొదటి సారిగా ఆకాశవాణి హైదరాబాద్ జానపద గాయకుడిగా శ్రోతలకు పరిచయమైనాడు.

వెలివాడలో సాంస్కృతిక విప్లవం తేవడానికి 1977 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన గద్వాల నియోజక సాధార ఎన్నికల్లో దళిత నాయకత్వం బలపడడానికి బుర్ర కథ కథానాయకుడిగా డా చిలుక భాస్కర్ గారి కళా సేవలను నాటి దళిత నాయకులు వాడుకున్నారేది.. చరిత్ర సత్యం.

హైదరాబాద్ నడిబొడ్డున నిర్వహించిన దళిత సాంస్కృతిక లెల్లె పాడుదాం అనే వేదిక పై ఎగిసిన వెలివాడ కమ్మని కంఠం డా. చిలుక భాస్కర్ గారు.తన స్వీయ రచన

"ప్రతిదానికీ ముందు నీవే మాదిగన్న
ప్రతిభ లేదని పలికినోడెవ్వడన్న" అనే గీతాన్ని

ఆలపించి అందరిలో ఆలోచన కలిగించి చర్మకారుడి ప్రతిభను మాదిగ సాంకేతిక నైపుణ్యతను ధరణికి తెలిపాడు.

ఇలాంటి పాటలు అనేక అంశాలపై డా చిలుక భాస్కర్ రచించి అనేక సామాజిక ఉద్యమ వేదికల పై ప్రదర్శించిన "సామాజిక చైతన్య పాటల"ను ఒక గ్రంథ రూపంలో 2005 సంవత్సరం లో వెలువడిన "సామాజిక చైతన్య పాటలు" అను గ్రంథం.

"జానకి కాలకదమ్మో- మీరు
జంక వలసినది లేదమ్మా" అనే పాటలో
"కాన్షీరామ్ కాలంలోనే
కన్యలే ముఖ్యమంత్రులౌదురని
ఉత్తరప్రదేశ్ లో ఎత్తిచూపెను
ఉర్వీమాతలకు ఊతమిచ్చెను." అంటు అన మానతలు, అవమానాలు, అణిచివేత తో కుంగిపోతున్న అతివల హృదయాంత రంగాలలో ఆత్మస్థైర్యం నింపి, స్త్రీలలో రాజకీయ చైతన్యం కలిగించాడు. స్త్రీ వాద కవిత్వానికి తనవంతు కృషి కవి.

"మేము బాలలం-భరతమాత బిడ్డలం
ఏ వివక్షతను సహించిని నేటిపౌరులం" అనే బాలగేయంలో

"ఏ అంటుముట్టులడుగని బాల యేసులం
వేళకు నమాజ్ చదివె అల్లాహ్ పిల్లలం
ఎదురైన గుడికల్లా మ్రొక్కే హిందూ బాలలం
ఏ మతం మాయ మర్మాలు ఎరుగని వాళ్ళం" అంటూ

బాలల నిష్కల్మషమైన పిసి హృదయాల స్వచ్ఛత ను ఐక్యమత్యమును ప్రతి హృదయం హత్తుకునే లౌకిక భావములతో దేశభక్తి బాలగీతాలనెన్నిటినో ఆవిష్కరించి, బాలసాహిత్య కవనం చేసిన సుకవి చిలుక భాస్కరుడు.

డా. చిలుక భాస్కర్ గారి ఈ పాటల పుస్తకం 2012 నుండి తెలంగాణా విశ్వవిద్యాలయంలో ఎమ్.ఏ తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశంగా కొనసాగుతుంది.

ఈ గ్రంథంలో దళిత సాహిత్యంతో పాటు స్త్రీ, ప్రకృతి, పర్యావరణం, పర్యాటక,చరిత్ర, అక్షరవికాసం జనారోగ్యం పండుగలు సంస్కృతి సంప్రదాయాలు ఇలా మానవ వికాసం కొరకు దోహదపడే సాహిత్యాన్ని అందించి అందరిలో భాస్కర్ గారు తన సాహిత్య దళితుల్లోనే కాదు అందరిలో సామాజిక చైతన్యం రగిలించి మూలవాసులను మేల్కొపాడు.

ఇదే గ్రంథంలో ఉన్న మరో పాటలో
"మాలమాదిగల వాడల వెలిసినమ్మ మైసమ్మ
నీకుమహిమలుంటే మమ్ము పాలకుల చెయ్యవే మైసమ్మ"
అంటూ పల్లవిలోనే ప్రశ్నిస్తూ.....
"నీకు నీళ్ళ పాలోళ్ళు నిన్ను నేల మీదుంచి
నిలువెత్తు నగలతో కొండెక్కి కులుకుతుండ్రు
నీ గుండె చెరువు చేసి చెట్టు కింద దొక్కిండ్రు
కల్లు బెల్లం సాకలు బోసి మైసమ్మ
కట్ట కింద నిను కాపులుంచిరే మైసమ్మ
ఆ కల్లు సారెలు మాకు బోసి మైసమ్మ
కలిగినోడు ఓటు దొబ్బుకెల్లనే మైసమ్మ" అను చరణం ద్వారా

మైసమ్మ దేవతకు మూలవాసులకు ఈ సమాజంలో జరుగుతున్న అణిచివేత అన్యాయపు చిన్నచూపు, భావసారూప్యతను కళ్ళకు కట్టినట్టు తన పాట ద్వారా చూపడమే కాకుండా...అమాయక దళితవాడల ఓట్లను డబ్బుతోనే కోసం కలిమి గల దొరలు కొల్లగొట్టి దళితులను బిచ్చగాళ్ళను చేసిన వైఖరిని వినసొంపుగా ఆలపించి, అందరిని తన సాహిత్యం ద్వారా అలరించి ఆలోచింప చేసిన అధ్యాపకుడు కవి, గాయకుడు డా. చిలుక భాస్కర్ గారు.

2009లో ప్రారంభించినప్పటికి 2019 లో గ్రంథగా వెలివడిన "తూర్పు వాడ" అను దీర్ఘ కవితా గేయం,డా.సినారె గారికి జ్ఞాన పీఠ అవార్డు ను అందించిన విశ్వంభర దీర్ఘకవితా గేయంలా డా చిలుక భాస్కర్ గారు దళితవాడ చరిత్రను ఆధారం చేసుకుని,లిఖించిన ఆధునిక ఇతిహాసం ఈ "తూరుపు వాడ" దీర్ఘకవితా గేయ గ్రంథమనడంలో అతిశయోక్తి ఎంత మాత్రం కాదు.

ఇంకా ఈ గ్రంథంలో ఆరంభంలో నే కవి ఇలా అంటాడు.

"వేకువ జామున నిద్ర లేచి
ఏ గంగంలోనైనా తడిచి
ఎదిగొచ్చే సూర్యుడికి ఎదురుగా నిలిచి
ఎదపై రెండు చేతులెత్తి మొక్కి
ఎల్లరునూ వేడుకునే దిక్కు
తూరుపు వాడ". అంటూ కవిత్వీకరించాడు.

పై కవితా పాద వరుసలను చదివి అవగాహన చేసికున్నట్టయి తే.. అందులోని అంతర్భావాన్ని గ్రహిస్తే విషయం బోధపడుతుంది. ప్రతి భక్తుడు ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానమాచరించి సూర్య వందనం చేయడానికి ఎలాగైతే తూరుపు దిక్కుకు తిరిగి చేస్తాడో.. అలాగే ఊరిలోని ప్రతి నివాసుకుడు తన అవసరాల నిమిత్తం తూరుపు వాడను మానవుడు తన మార్పు కొఱకు దర్శింపక తప్పదని కవి ఆత్మవిశ్వాసమును ప్రదర్శించారు.

వెలివాడలోని సాంస్కృతిక సాంకేతిక ప్రతిభాపాట వాలను మానవీయ విలువలు ఆచార సంప్రదాయాలు బంధాలు అనుబంధాల ఆత్మీయ మూలాలను శ్రమనైపుణ్యతలను ఈ దళిత వారిలోని మనుష్యుల ఐక్యమత్యం ఆచరించే లౌకిక తత్వం ఒక్కటేమి భారతీయ సంస్కృతి సాంకేతిక వికాసానికి ఈ తూరుపు వాడే ఆది ప్రేరణ గురువుగా ఆధార బుజువులతో తూరుపు వాడలో అక్షర గ్రంథం చేసారు.

దళిత సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు అని అనడం కన్న తెలుగు సాహిత్యానికి ఒక ప్రామాణిక గ్రంథంగా అందించాడని అనడం సముచితం.

డా. చిలుక భాస్కర్ రచియించిన "తూరుపు వాడ" దళితుల జీవన విధానం భారతీయ సంస్కృతి సాంకేతిక మూలాలను ప్రతిబింబించే విధంగా అవనికి అద్దంలా తలపిస్తది.

"తూరుపు వాడ" మొదటి భాగంలో భారతదేశంలో బుష్యాశ్రమ స్థాపకులని, జాంబవంతుని వంటి బుషులనీ, వాళ్ళ శక్తుల్ని, వాళ్ళు దేశ అభ్యుదయానికి చేసిన కృషిని వివరించారు ఈ విధంగా మాదిగల గత వైభవ ప్రకటన ప్రదర్శన కావించాడు. మేమింత ప్రాచీనులం అని ప్రకటించి, వర్తమానం లో నిలబడటానికి పూర్తిగా హక్కుదారుడిగా కనిపించాడు.

రెండో భాగంలో మాదిగ జీవన స్థితిగతులు చూసాడు. వీళ్ళ వృత్తులు నైపుణ్యాలు వృత్తి సంసిద్ధులు కవితా సుందరంగా తెలిపాడు. చర్మం శుద్ధి చేయటం చెప్పులు కుట్టడం, ఉపయోగ వస్తూ ప్రపంచాన్ని సృష్టించటం, పేదరికంలో కూడా దానసురులుగా ఉండీమాదిగలను ప్రస్తూతించటం చాలా హృదయానికి హత్తుకునేలా కవి చిలుక భాస్కర్ గారు వ్రాసాడు.

"ఎండు పేగులాకలితో గుర్రు గుర్రుమంటున్నా
ఎండిన డొక్క లెన్నుకంటుకపోతున్న
ఎగదీసి కట్టిన దోతి నిలువకుండా జారిపోతున్న
ఎత్తి జగతినడముకు తోలు బెల్టు కట్టిన వాడ" అంటాడు.

మరో చరణంలో

"ఏ బంధువు కూడా నీ వెంట రాకపోయినా
ఏ బంధం తనకు నీతో లేకపోయినా
ఏ ఆనవాళ్లు లేకుండా కాల్చి,పూడ్చు
ఎల్లరి "వల్లకాడు" యజమానులున్న వాడ"

అనే తూరుపు వాడలోని పై గద్యపాదములను చదువుతుంటే చిలుక భాస్కర్ గారిని "దళిత గద్య తిక్కన"

అని చెప్పకుండా ఉండలేము.

ఇంకా తూరుపు వాడ లోని

"ఎద్దు చర్మాల ఒలిచి, చెప్పులు కుట్టుటే కాదు
ఏ పద్య, కవితలనైనా కైగట్ట గలమని, శ్రీ హర్ష
ఏలుబడిలోనే బాణ మయూరి తో సరి ఎన్నబడి
ఎదిగిన మాతంగి మహాకవులుండు వాడ" తూరుపు వాడ

పై కవిత వరస పాదములను గమనించిన చాలు డా చిలుక భాస్కర్ గారు నేటి ఆధునిక వాగ్గేయకారులకు ఏమాత్రము తీసుపోని కవిపుంగవుడు. ఇప్పుడున్న వర్తమాన కవిగాయకులను పరిశీలించి చూస్తే ఎవరిలో లేని సుగుణాలు ప్రత్యేక ప్రతిభాపాటవాలను భాస్కర్ గారిలో మనకు కనిపిస్తాయి. ఒకరు పాట పాడితే బాగానే ఉంటుంది కానీ ఆ పాటలో సందేశం ఉండదు. కొందరి పాటల్లో పదాల పొందిక బాగానే ఉంటుంది. ఆ పాటలో మేలుకొలుపు చోటు చేసుకోదు. మరికొందరి పాటల్లో ఉద్యమ స్ఫూర్తి ఉంటుంది. అయిన వారిలో చంచలత్వం కానవస్తుంది. కానీ డా. చిలుక భాస్కర్ గారి సాహిత్యం దళితులనే కాదు అందరిని మెప్పించి,. ఒప్పించే చిక్కని చక్కని కవిత్వం సృష్టించి సుమధురంగా జనరంజకంగా పాడగల పాటగాడు, రాతగాడు, పాటలు రాయగలడు, స్వీయ బాణీలు కట్టగలడు. తీసుకునే అంశం ఏదయినా సరే... సందేశం సమాజహితం లేని సాహిత్యం రాయని ఏకైక సామాజిక చైతన్య కవి,గాయకుడు రచయిత,

కథకుడు కథానాయకుడు "చిలుక శతకం" సృజన కర్త తెలుగు భాషా బోధకుడు ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి డా. చిలుక భాస్కర్ గారు.

మారుతున్న కాలానికనుగుణంగా తనను తాను మలుచుకుంటూ తనలోని సాహిత్య స్పృహకు భాషా సొబగులు అద్దుకుంటూ అంతర్జాల వేదికల పై తన కవితా గాన కచ్చేరిని కొనసాగిస్తూ..అనేక సాహిత్య సేవా సంస్థల నుండి ప్రశంసలతో పాటు ఉదయసాహితి సాహిత్య సేవా సంస్థ నుండి ఈ మధ్యే కవితా విభూషణ అవార్డు పొందడం వీరి ప్రతిభకు తార్కాణం.

తన గేయ రచనలు స్వీయ గానమాధుర్యంతో కవి డా చిలుక భాస్కర్ గారు తనయూట్యూబ్ చానెల్ ద్వారా తెలుగు పాఠకులను అలరిస్తూ.....

"సింగిడి బతుకమ్మ" యూట్యూబ్ లో వినిపిస్తున్న డా చిలుక భాస్కర్ పాటలో..

"బంగారు బతుకమ్మవై
బంగళల్లా కలిసినావు
బంధాలు తెంచుకుని
అందుల మెక్కి నావు
నీ పేగు బంధం జాడ - పేదోళ్ళ ఇంటికాడ" అంటూ

పాట ముగింపు చరణంలో

"నీళ పాలోళ్ళ నొదిలి
నీళ్ళల్లా కలువొద్దు
నిండు నూరేళ్ళు న
నువ్వు సల్లంగా బతుకమ్మ
కాన్పిరామ్ తొవ్వన కదిలిరావమ్మ

ఎతలన్నీ తొలగ మా ఎదల నేలమ్మా....అని సంప్రదాయ బతుకమ్మ పాటతో కూడా దళితుల ఆకాంక్ష ను ప్రతిబింబించేలా పాటను సృజన చేసి ఆలపించిన తీరు

అందరి మన్ననలను పొందిన దళిత గానగంధర్వుడు.

సంప్రదాయ గేయ రచనలో కూడా దళిత చైతన్యమును రగిలిస్తున్న

"నిత్య చైతన్య నీలివర్ణ పతాక
తెలుగు సాహిత్య ప్రతిభగల చిలుక".

దళితజాతి సాహిత్య రత్నం డా. చిలుక భాస్కర్ గారి కవిత్వం దళిత జాతికి నిత్యనూతన నవ చైతన్యం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా 'ముసాఫరులు' – ఆధ్యాత్మిక తాత్త్విక దృక్పథాల పరిచయం

– డా॥. రత్నశేఖర్ కట్టెపోగు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్.

జాషువా జీవితం - పరిచయం :

ఆధునిక కవుల్లో గుర్రం జాషువా ప్రముఖమైన స్థానం పొందారు. తాను చిన్నతనంనుండి అనేక అవమానాలు పొంది, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని మూఢాచారాలపై తిరుగుబాటుచేసి ఛీత్కారాలు ఎదురైనచోటే సత్కారాలు పొందిన మహానుభావుడు. ఎన్నికష్టాలు ఎదురైనా ధీరత్వంతో నిబ్బరంగా ఎదుర్కొన్నారు. తెలుగు ప్రజలు, తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం తన రచనలద్వారా సజీవంగా జీవిస్తూ, కవిగా చరిత్ర పుటల్లో నిలిచిన వ్యక్తి కవికోకిల గుర్రం జాషువా. తెలుగు సాహిత్యమంటేనే సంప్రదాయ సాహిత్యంగా ఉన్న రోజుల్లో జాషువా అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని సామాజిక దృక్పథంతో రచనలు కొనసాగించిన కళాప్రపూర్ణ గుర్రం జాషువా. ఛీ అంటూ చీదరించిన సమాజ అభివృద్ధికోసం తన జీవితకాలం రచనలు కొనసాగించిన మధురకవి.

జాషువా 1895 సెప్టెంబర్ 28న వీరయ్య, లింగమ్మ లకు గుంటూరుజిల్లా వినుకొండలో జన్మించారు. తల్లిదండ్రుల కులాలువేరు. తండ్రి యాదవ. తల్లి మాదిగ. తల్లిదండ్రుల మతాంతర వివాహంతో ఉభయ పక్షాల నుంచి తీవ్రమైన నిరాదరణలు నిరసనలు ఎదురయ్యాయి. జాషువా తండ్రి క్రైస్తవమతం స్వీకరించి ఫాదర్‌గా మారారు. జాషువా విద్యాభ్యాసమంతా వినుకొండలోనే సాగింది. అడుగడుగునా అంటరానితనం విషనాగులా పడగలువిప్పి బుసగొడుతున్న రోజులవి. చిన్నతనం నుండి అనేక అవమానాలు, ఛీత్కారాల మధ్య తన చదువు కొనసాగింది. జాషువాకు ఒకవైపు హిందూ సంప్రదాయం, మరొకవైపు క్రైస్తవ సంప్రదాయం తనను తాను సముదాయించుకొని నిలబడలేని స్థితిలో ఒక కొత్త భావావేశంతో సాహిత్యాన్ని చదివి తనదైన శైలితో రచించే అవకాశం ఏర్పడింది. తన సాహిత్య రచనకు తన నిజ జీవితమే ఒక నూతన మార్గాన్ని చూపించినట్లు కన్పిస్తుంది. తన మార్గంతో ఆధునిక సాహిత్యానికి కొత్త ఓరవడిని సృష్టించాడు.

జాషువా 'ముసాఫరులు' - పరిచయం :

ముసాఫరులు కావ్యాన్ని జాషువా 1963లో రాశాడు. ఈ కావ్యం జాషువాలోని ఒక కొత్తకోణాన్ని తెలియ పరుస్తుంది. వయసుతోపాటు ఆయన ఆలోచనల్లో వచ్చిన పరిణామాలు ఈ కావ్యంలో కనిపిస్తాయి. దేశారాధన, ప్రాచీన భారత కళాసాహిత్యాల స్మరణంలోంచి, దళిత జనోద్ధరణలోంచి, వర్తమాన సంక్షుభిత రాజకీయాలనుంచి, ఆయన దృష్టి దేవుడి మీదికి మళ్ళింది. సమాజంలో జరుగుతున్న అరాచకాలు, అన్యాయాలు, పేదరికం, ఆకలి, దుర్మార్గాలు, మారణహోమాలు మొదలగు విషయాలపట్ల దేవుని సృష్టే ఈ విషయాలన్నింటికీ కారణమా? అనే ప్రశ్నకు జవాబుగా ఈ కావ్యం ఉన్నట్లుగా భావించవచ్చు.

'ముసాఫిర్' అనే పదం ఉర్దూభాషాపదం. ఈ పదానికి అర్థం ప్రయాణికుడు. బహువచనంలో ఈ పదాన్ని వాడాడు కాబట్టి ప్రయాణికులు అని అర్థం. జాషువా ఈ పదాన్ని తాత్త్విక చింతనతో కూడిన ఆధ్యాత్మిక అర్థంలో ప్రయోగించాడు. ఈ కావ్యం జాషువా ఊహాశక్తికి, పాత్రల కల్పనా నిర్మాణానికి గీటురాయిగా చెప్పవచ్చు. అలాగే మానవ పరిణామ సారాంశాన్ని ఈ కావ్యంలో చిత్రీకరించాడు.

ఆధునిక యుగంలో మానవుడు భౌతికమైన పురోభివృద్ధిని సాధించాడని, కాని మానవతకు ఊపిరిపోసే హృదయ వైశాల్యాన్ని కోల్పోయాడని, మానవుని మేధాశక్తి

రోదసిని తాకినా, అతని మనస్సులో కసి ప్రాకిందని, ఈ విషమ పరిస్థితులే నేడు మానవాభ్యుదయ కాంక్షులైన వారిని కలత పెడుతుందని, బుద్ధికి, హృదయానికీ మధ్య ఉన్న సమన్వయ తంతువు విచ్ఛేదమైన ఈ విచిత్ర పరిస్థితిని గూర్చే జాషువ ఈ కావ్యంలో వితర్కించాడని బి. బాస్కర చౌదరి అన్నారు. ముసాఫరులు కావ్యం జాషువా కవిత్వ పరిపక్వతకు, సాహిత్య పరిణామానికి ప్రధానమైన చివరి మలుపని ఎండ్లూరి సుధాకర్ అన్నారు.

ముసాఫరులు - ఆధ్యాత్మిక దృక్పథం :

'జగత్సృష్టికి కారణమైన అఖండ శక్తి 'అజ్ఞాత జగత్తు'న ఏదో ఒక రూపంలో 'నిర్గుణ రజ: ఖండములై' సంచరిస్తూ చిరు ప్రాణములను భూతలానికి నెట్టగా, అవి పిండాకృతిని ధరించి, మాతృగర్భంద్వారా 'సంస్కృతి కాసారము'న పడడం, మరలా 'నీరీహాత్మకమైన జీవములు' 'ఊహింపరానిదగు నొక మోహన సూక్ష్మ పుష్పనిభమైన ఆకృతులను పొందడం, అనాదిగా సాగుతున్న సృష్టికి సంబంధించిన వ్యాపారం. సమస్త జీవులకు 'మామూలై'న ఈ ప్రస్థానాన్ని ఆధారంగా చేసుకొని జాషువా ఈ ఖండకావ్యాన్ని రచించాడు' అని బి. బాస్కర చౌదరి అన్నారు.

వీరుని ఆత్మ మనిషి జన్మ ఎత్తే ఆత్మతో
"జగతికి ప్రయాణమా యిది?
భగవంతుడు పంపెనా? సెబాసని వానిం
బిగియార కౌగిలించెన్
మొగిళులు నానందబాష్పములు వర్షింపన్" (పు.169)

అంటూ అన్ని జన్మలలోకెల్లా మనిషి జన్మ అనేటువంటిది చాలా గొప్పదనే భావనను ఇందులో తెలియజేస్తున్నాడు. ఎలాగంటే స్వర్గలోకంనుండి వస్తున్నాడంటే దేవుడే స్వయంగా ఆ అవకాశాన్ని కల్పించాడనే భావనను కలిగినన్తా అతనిని అభినందిన్తా, కౌగిలించుకొని ఆనందబాష్పాలు వర్షించాడు.

మరో ఖండికలో దేవుడు కుశలమేనా? అంటూ స్వర్గ లోకంలో అందరి (అమరులు, రంభ, దిశాధిపతులు) క్షేమసమాచారాలు అడిగి తెలుసుకుంటాడు. అంటే హిందూమతంలోని పురాణ ఇతిహాసాలలో ప్రస్తావించే స్వర్గలోకం, అక్కడ నివశించే దేవతల ప్రస్తావన ఇందులో కన్పిస్తుంది.

"కుశలమె సర్వేశ్వరునకు?
కుశలమె స్వర్గమున కమరకోటికి? రంభా
ప్రశుభాస్య కుశలమేనా?
దిశాధిపతులెల్ల నేడు ధృతినున్నారే?" (పు. 169).

అలాగే మనిషిగా జన్మించే ఆత్మతో భూలోకంలో ఎన్ని సంవత్సరాలు ఆయువుని కలిగివున్నావంటూ కులవ్యవస్థ అనేది ఉందని, నీ శరీరము ఏ కులములో బ్రతుకును సాగిస్తుందోనని ప్రశ్నిస్తాడు. ఈ ప్రశ్నద్వారా భూమి మీద మనిషి కులమనే రంగుని పులుముకొని జీవిస్తున్నాడని, ఆ కులము ద్వారా మనిషికి గుర్తింపు వస్తుందనే విషయాన్ని ప్రస్తావించారు.

"ఆయువు నీ కెన్నేడులు
వ్రాయంబడె నుదుట భరతవర్షంబుననా
నీరయునికి? యేకులంబున
కాయము ధరియించి బ్రతుకగాబోయెదవో?"
-(పు. 169).

మనిషి బాల్య దశలో ఏ విధంగా ప్రవర్తిస్తాడో చెప్తూ - కనిపించే ప్రతి వస్తువును తాకుతూ దానితో ఆడుకుంటూ, ఒక్కోసారి దాని రూపాన్ని మార్చివేస్తూ అభముశుభము తెలియని అమాయకులు వారన్నారు. ఆ దశలో ఉన్నట్లే మిగతా దశలలో కూడా ఉంటే మనిషి ప్రశాంతంగా తన జీవితాంతం జీవించే అవకాశం కలిగి, ముక్తి కూడా లభిస్తుందనే భావనను ఈ ఖండికలో చెప్పారు.

"కంటంబడు ప్రతివస్తువు
నంటుచు భక్షింపబోవు నభముశుభము లో
నంటని శిశుత్వదశ
ని ష్కంటక వైకుంఠమై ప్రశాంతి ఘంటించున్"
(పు. 172).

మనిషి సృష్టి బ్రహ్మదేవునివల్ల సాధ్యమవుతుందని, మనిషిగా జన్మించి, ఏమి చేస్తున్నామో? ఎందుకు ఈ భూమిమీదికి వచ్చామో? తెలియని స్థితిలో మనిషి ఉన్నాడని ఎన్ని యుగాలు ఆలోచించినా అది అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోయిందని, అది సృష్టించిన ఆ బ్రహ్మ దేవునికే తెలియాలన్నట్లు చెప్పారు. ఈ ఖండికవల్ల మనిషిని సృష్టించేది బ్రహ్మదేవుడని నమ్మే హిందూమత ఖర్మ సిద్ధాంతాన్ని తెలియజేశారు. మనిషి తనకు తెలియకుండానే సృష్టి జరుగుతుందనే విషయాన్ని ఎత్తిచూపాడు.

"పుట్టువు గుట్టుదాచుకొని పుట్టిన పిమ్మట నేటికీ ధరన్
పుట్టితినంచు పెక్కు యుగముల్ తలపోసిన తేల్చలేని యీ
మట్టిశిరస్సునిచ్చి పరమంబున డాగిన నాధుడొక్కడు
న్నట్టుగ దాఖలాల్ దొరక వవ్వటి కివ్వటి కద్భుతంబగున్" (పు. 172).

స్వర్గం - నరకం, సత్యం - అసత్యం, కరుణ - కాఠిన్యం ఈ భూమిమీద సమాన నిష్పత్తిలో ఉన్నాయని చెప్పారు. మనిషి తాను జీవించిన విధానానికే స్వర్గం లేదా నరకం అనేవి ప్రాప్తిస్తాయనే హిందూ ధర్మశాస్త్రాల సారాంశాన్ని ఈ ఖండికలో చెప్పారు. సత్యం దాపునే అసత్యం, కరుణ దాపునే కాఠిన్యం దాగి వుంటాయనే భావనను, మనుషులందరూ వీటిని సరిసమానంగా కలిగి వుంటారనే విషయాన్ని చెప్పారు.

"నరకము స్వర్గం బవనిని
సరిసమముగ సాగుచుండు సత్యమసత్యం
బిరుగడల మ్రోగుచుండున్
కరుణయు కాఠిన్యమెదురుగా నడయాడున్"
(పు. 173).

భారత భూభాగంపై కృష్ణుడు స్వయంగా పదిసార్లు పుట్టడానికి ఇష్టపడతాడని, శివుడు తన నాట్యకళతో తన భార్య పిల్లలతో హిమాలయ పర్వతాలను ఆలయంగా చేసుకొని జీవించి ఉన్నాడని - దేవుళ్ళే మనిషి జన్మ ఎత్తడానికి ఎంతో ఇష్టపడే జన్మగా కీర్తిస్తూ - అందులో వారు జన్మించడానికి ఇష్టపడే భూభాగం భారతదేశమనే విషయాన్ని చెప్పారు.

"పదిమారుల్ జనియింపడే భరతభూభాగంబునన్ గృష్ణు డే
హృదయాకర్షకమైన శక్తి గలదో యీనేల యం దెన్నడో
సదనంబొండు హిమాద్రిగట్టుకొని యీశానుండు సత్పుత్ర సం
పదతోనుండడె సాంధ్యనర్తన కళాపాండిత్య శౌండీర్యుడై" (పు. 174).

మహానుభావులుగా, దివ్యపురుషులుగా కీర్తించబడుతున్నవారు నామరూపాలకు అతీతులైన వారుగా మనుషులలో దివ్యత్వం వున్నవారుగా కీర్తించ బడుతూ ఈ విశ్వంలో భక్తుల మనస్సులలో నిరంతరం ఇహపరాలలో నిలచి వుంటారన్నారు. మనుషులందరూ ఆ విధమైన జీవితాన్ని కలిగి వుండాలనే హిందూమత సాంప్రదాయాన్ని ప్రకటించారు.

"నామ రూప రహితులై మంటిపాలైన
మానవాళిలో మహానుభావు
లైన దివ్యపురుషులే నిల్తు రనయంబు
గగనమందు విశ్వజగము నందు" (పు. 173).

భూమిపై అనేక మతాలు ఉన్నాయని, నిరంతరం అయా మతాలు అయా దేవుళ్ళ ప్రసంగాలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని, ఒక మతంలోని భక్తులు ఇతర మతస్థులతో కలహించుకుంటున్నారన్నారు. అన్య మతాలను, మతస్థులను గౌరవించాల్సిందిపోయి నిరంతరం కొట్లాడుకుంటు, ప్రాణాలు తీసుకుంటూ అనేక దేశాలమధ్య అశాంతిని కూడా సృష్టిస్తున్నారనే విషయాన్ని ఈ ఖండికలో చెప్పారు.

"మతములు పెక్కులు గలవిల
సతతము సర్వేశ్వర ప్రసంగంబులతో
సతమతమగు భక్తులుగల
రితరేతర కలహ రభసలే తొడజరచున్" (పు. 173).

ముసాఫరులు - తాత్త్విక దృక్పథం:

మరణించిన ప్రాణం ఆకాశం (పరం) వైపుకి, అవతరించనున్న కొత్తప్రాణం భూమి (ఇహం) మీదకి వచ్చే సన్నివేశంలో ఇహపరాల యాత్రలో సంభాషించే ఆ రెండు ప్రాణాత్మక తాత్త్విక సంభాషణం 'ముసాఫరులు' కావ్యనిర్మాణమని ఎండ్లూరి సుధాకర్ అన్నారు.

జాషువా ఈ కావ్యంలో యుద్ధంలో వీరమరణం పొందిన వీరుని ఆత్మ ద్వారా మనిషి జన్మ ఎత్తే ఆత్మతోటి మాట్లాడుతూ తాత్త్విక ఆలోచనలను కలిగింపజేశాడు.

"చుట్టములుగాని తన కన్నసుతుడుగాని
తల్లిదండ్రులుగాని యర్ధాంగిగాని
తోడుగా వెంబడించిన జాడలేదు
వీరమరణంబునం గల్గు పేరుగాక" (పు. 169).

ఈ ఖండికలో వీరుడు తాను చనిపోయిన తరువాత వీరమరణం పొందానన్న పేరొక్కటే మిగిలిందని తనతో పాటు తన చుట్టాలు, తల్లిదండ్రులు, భార్య, కుమారుడు ఎవరూ తనతోపాటు వచ్చినట్లుగా లేదనే ఒక తాత్త్విక ఆలోచనను ఆరంభంలో ప్రస్ఫుటింపజేశాడు.

మనిషి తన జీవితకాలం ఎంత ఆనందంతో పల్లకిలో ఊరేగుతూ జీవించినా, చివరకు కాటికి పోవలసిందేనన్న విషయాన్ని 'పుట్టినవాడు గిట్టక తప్పదు' అన్న సూక్తితో ఏకీభవిస్తున్నాడు. హిందూ ధర్మశాస్త్రాలు నొక్కివక్కానించే మనిషి జీవితంలోని ముఖ్యఘట్టాలను ఈ ఖండికలో చెప్పారు.

"ఒకచో నొక్కడు పెండ్లి పల్లకులపై నూరేగు నొక్కండు కా
టికిబోవున్ పతితోడ నొక్కసతి క్రీడించున్ గతాత్మేశయై
ఒకయిల్లాలు తపించు విశ్వధరణీవృత్తం బుదాత్తంబు దీ
నికి నాద్యంతము లూహచేయగల పాండిత్యంబు లే దేరికిన్" (పు. 174).

మనిషికి సత్తువ వున్నంతవరకే ఆప్తులు, స్నేహితులు ఆదరించి ప్రేమిస్తారని, ముసలితనం వచ్చిన తర్వాత అదే మనిషిని చూడడానికి, అతనిని ఆదరించడానికి వారికి వినుగు కలుగుతుందని మనిషి నైజాన్ని, తాత్త్విక దృక్పథాన్ని తెలియజేశాడు.

"ముసలితనం బనియెడు నీ
రస దశ దేహంబునందు ప్రాప్తంబగుచో
వసుధాస్థలి ఆప్తులకే
విసువగు నిన్నాదరింప ప్రేమించుటకున్" (పు. 174).

మనిషి బ్రతికున్నన్నాళ్ళు వట్టించుకోనివాళ్ళు చనిపోయిన తర్వాత వారికి స్వర్గలోక ప్రాప్తి కలగాలని వారికి ఖర్మకాండలు జరిపిస్తూ విందులు ఆరగించే బంధుగణం ఈ భూమిపై ఉన్నారన్న విషయాన్ని గుర్తు చేశారు.

"బ్రతికియున్న వేళ మెదుకు బెట్టనివారు
చచ్చెనేని దినము సల్పగలరు
స్వర్గలోకమందు సద్గతుల్ గల్గగా
విందు గుడువగలరు బందుజనులు" (పు. 174).

భక్తులు పిలిచినప్పుడు మొర ఆలకించే దైవాన్నేమో ఈ భూమిమీద మోసం చేస్తున్నారనే నెపాన్ని వారిమీద నెట్టివేసేవారు ఎక్కువయ్యారని, ఎంత పిలిచినా పలుకు తాడనే భావాన్ని ప్రకటింపజేసే వారినేమో శక్తులు, మహిమలు ఉన్నవారుగా చెప్తూ వారిని కీర్తించే వారున్నారని ఈ ఖండికలో చెప్పారు.

"పిలిచిన బలికెడు దైవము
గలిగినచో వీడు మోసగా డనియెద రే
పలుకుం బలకని వాడే
బలశక్తులు మహిమలున్నవా డగు ధరణిన్" (పు. 173).

భూమిపైనున్న ప్రకృతి సౌందర్యము, మధురాను భూతులు కలిగిన జీవితము స్వర్గలోకంలో కూడా ఉండవని అందుకే స్వర్గలోకంనుండి భూమిపైకి వచ్చిన ప్రాణులు మరళా స్వర్గానికి వెళ్ళటానికి ఇష్టపడరనే విషయాన్ని తెలియజేశారు. స్వర్గలోకం కన్నా మిన్నగా

భూలోకం వుందన్న విషయాన్ని మనిషి జన్మ ఎత్తే ఆత్మకు వీరుని ఆత్మతో కవి తెలియజేశాడు.

"స్వర్గముననుండి భూమిపై బడ్డప్రాణి
చచ్చి స్వర్గంబునకుబోవ నిచ్చగింప
డిచ్చటి ప్రకృతి సౌందర్య మిచటి మధుర
జీవితానందములు మింటలేవుగాన" (పు. 174).

అలాగే స్వర్గజీవితంకన్నా మిన్నైనది భూలోక జీవనం అంటూ, భూలోకంలో వుండే ఇళ్లు వాకిళ్ళు, ఒకరిపై ఒకరికి వుండే విడదీయలేని మోహంతో వుంటారని, ఇక్కడ వుండే ప్రకృతి (కొండలు, నదులు, పున్నమినాటి వెన్నెల, వీచే వాయువులు, పుష్పవనాలతో కూడిన ప్రదేశాలు) చూస్తూవుంటే స్వర్గజీవితంపై మక్కువను కలుగజేయవని చెప్పారు.

"ఇక్కడి యిండ్లు వాకిళులు నిక్కడి వాంశిక మోహజాలముల్
ఇక్కడి కొండలు న్నదులు నిక్కడి పున్నమనాటి వెన్నెలల్
ఇక్కడి మందవాయువులు నిక్కడి పుష్పవన ప్రదేశముల్
మక్కువ వుట్టనీయ వనుమానవు స్వార్గిక జీవితంబుపై" (పు. 174).

ఈ విధంగా జాషుగా ముసాఫరులు కావ్యంలో హిందూ మతానికి, హిందూ ధర్మశాస్త్రాలకు సంబంధించిన ఆధ్యాత్మిక తాత్విక అంశాలను తెలియ జేశారు. తన చివరి రోజుల్లో ఈ విధమైన భావజాలం కలిగిన రచనలను రచించాడని చెప్పువచ్చు. తన రచనలన్నింటికంటే భిన్నమైన రచనగా ఈ కావ్యాన్ని రచించాడని చెప్పడంలో ఎటువంటి సందేహంలేదు.

ఉపకరించిన గ్రంథాలు :

1. జాషువా సాహిత్యం దృక్పథం - పరిణామం - ఎండ్లూరి సుధాకర్
2. జాషువ కృతుల సమాలోచన - బి. భాస్కరచౌదరి
3. మా నాన్నగారు - హేమలతా లవణం
4. ముసాఫరులు - గుర్రం జాషువ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కొలకలూరి ఇనాక్ రచనలు – సామాజిక దృక్పథం

– శశికళ బలరామ మతంతి, పరిశోధక విద్యార్థిని.
– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

వేజెండ్ల గ్రామంలో విశ్రాంతమ్మ, రామయ్య దంపతులకు 1939 జూలై 1వ తేదీన కొలకలూరి ఇనాక్ జన్మించారు. తెలుగు ఆచార్యునిగా పనిచేస్తూ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో కులపతి అయ్యారు. 2012లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం 2018 లో కేంద్ర సాహిత్య పురస్కారం 2021లో వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. 'దృష్టి' నాటికకు కేంద్ర ప్రభుత్వ బహుమతి, 'జైహింద్' నాటికకు రాష్ట్ర ప్రభుత్వ బహుమతిని దక్కించుకున్నారు. 'మునివాహనుడు' కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 'అనంత జీవితం' నవలకు మూర్తి దేవి పురస్కారం అందుకున్నారు. గుర్రం జాషువా పురస్కారం, వెండి కిరీటం అందుకున్నారు. ఎన్నో సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. వీరు కథలు, వ్యాసాలు, నాటకాలు, వచన కవితలు, పద్యాలు, పరిశోధక విమర్శన గ్రంథాలు, నవలలు రచించి ప్రసిద్ధి చెందారు. సుమారు 95 వరకు పుస్తకాలు వెలువరించారు.

దళితులైన ఇనాక్ గారు ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుని కుల వివక్షను అర్థం చేసుకున్నారు. దళితులను జాగృతం చేయడం సమానత్వం కోసం పోరాటం ఈయన రచనల్లో స్పష్టంగా వ్యక్తమవుతుంది. అంబేద్కర్, బోయి భీమన్న, జాషువాల వలె అవమానాల కొలిమిలో కాగి వచ్చిన సెగతో గుండెల నుండి పొంగి వచ్చిన సాహిత్యం వెనుకవాడి, వేడి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఆయన హృదయమనే విల్లు నుండి విడిచిన బాణాలే ఈయన రచనలు. అలాగని తిరుగుబాటు ధోరణి ఎక్కడ అణువంతైనా కనిపించదు. సున్నితమైన న్యాయపోరాటం, తాత్వికత, కాచి వడపోసిన అనుభవ నత్యాలు, మర్మగర్భంగా చెప్పే తీర్పు, మార్గదర్శనం ఈయన రచన విశేషాలు. సర్వసమాన సౌభ్రాతృత్వం విశ్వజనీయత కొట్టొచ్చినట్లు కనిపించే శైలి లక్షణాలుగా మనం చెప్పుకోవచ్చు.

ప్రసిద్ధి చెందిన ఇనాక్ కథలను పరిశీలిస్తే :

తల లేనోడు :

క్షురక వృత్తి చేసుకొని జీవించే నాగలింగాన్ని మోసగించి రెండు ఎకరాల పొలాన్ని సొంతం చేసుకున్నాడు మునసబు వీరన్న. ఆ పొలాన్ని పొందడం కోసం పంతం పట్టిన వీరన్న తలనీలాలు మరునాడే సమర్పించాలి అనుకున్నాడు. క్షురకుడైన నాగలింగమే రావాలి. రానే వచ్చాడు నాగలింగం. గుండు, గడ్డం గీసి మెడ వద్ద క్షవరం చేస్తున్న నాగలింగం కత్తి వీరన్నకు అతి చేరువలో ఉన్నది. అన్యాయంగా నాగలింగం పొలాన్ని దోచుకున్న వీరన్న తలను తెగ్గోయడం ఖాయం అనే ఉత్కంఠ ప్రతి పాఠకునిలో కలుగుతుంది. నాగలింగంలో ఎన్నో ఆలోచనలు, కోపం ఉన్నప్పటికీ అతడిని చంపడానికి మంచి అవకాశం ఉన్నప్పటికీ తన వృత్తి ధర్మంగా క్షవరం చేసి వదిలి పెట్టాడు నాగలింగం. అతడి క్షమాభిక్షతో వీరన్న తల ఉన్నా లేని వాని క్రిందే లెక్క. సమాజంలోని దోపిడీని ఈ కథలో ఎత్తిచూపారు రచయిత.

ఊర బావి :

1969 జూలై 2వ తేదీన ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో వెలువడిన కథ ఊర బావి. వేసవికాలం వచ్చింది. బావులన్నీ ఎండిపోయాయి. ఒకే బావిలో నీళ్లు ఉన్నాయి. ఊరి వారందరికీ ఒకటే బావి. దళితులను బావిని ముట్టుకొనివ్వరు. దయ తలచి ఎవరైనా తోడి పోయాలి. కథానాయకైనా చిదంబరం భార్యకు

నీరందించిన ఒక కుర్రవాడు ఆమెను తాక ప్రయత్నించాడు. చెంప పగులగొట్టిందామె. రైలు స్టేషన్లో ముస్సబుని చూసి చిదంబరం నిలబడలేదు. పోలీసుల సహాయంతో దేవాలయ ప్రవేశం చేశాడు. ఈ ధిక్కారణ ధోరణికి ఆగ్రహించిన మునసబు చిదంబరాన్ని, అతడి తండ్రి రాముడిని కట్టి కొట్టాడు. ఈ విషయం తెలిసిన చిదంబరం భార్య మునసబుని మంచానికి కట్టేసి కొట్టింది. అగ్రవర్ణాలు అన్యాయాన్ని సహించలేక ఎద్దు కళేబరాన్ని బావిలో పడేసింది. సావిడికి, గడ్డివాములకు నిప్పు పెట్టింది. ఊరంతా అల్లకల్లోలమైంది. ఎండు కళేబరాన్ని ఎవరు బయటకు తీయలేకపోయారు. ముడులను చాకచక్యంగా విప్పి కళేబరాన్ని బయటకు తీసింది. ఊరి వారంతా దళితులను బావి నీరు వాడుకోవడానికి ఒప్పుకున్నారు. ప్రకృతి వనరులందరూ వాడుకోవాలి. ఏ ఒక్క కులానికి, వర్గానికి సొంతం కాదు. దళిత స్త్రీ తెగువ, ధైర్యం, ఆత్మగౌరవం, సాహసాలను ఈ పాత్రలో చిత్రించారు రచయిత. సమానత్వం కోసం పోరాడిన దళిత వీరవనితలు ఈ కథల్లో దర్శనమిస్తారు.

అస్పృశ్య గంగ :

దళితుడైన వినాయక బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించి, అగ్రవర్ణస్థుల ఇళ్ల మధ్య సొంత ఇల్లు కట్టుకున్నాడు. చిన్నపిల్లలు ఆడుకునే చోట వేరుగా చూడడం, వీరిని బావి వద్ద వేరుగా చూడడం, వీరిచ్చిన వస్తువులు తీసుకోకపోవడంలాంటి ధోరణికి కుటుంబమంతా ముడుచుకుపోవడం, చిన్న పోవడం మామూలు అయింది. గోవిందు, అతని భార్య శ్రామికులు. పనిలో సాయపడడం, మంచినీరు తెచ్చివ్వడం లాంటి సహాయాలు చేసేవారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ వినాయక్ ఇంట్లోనే ఆహార పదార్థాలు తీసుకునేవారు కాదు. ఒకరోజు గోవిందు బావితవ్వుతుండగా డైనమిక్ పేలి గాయాల పాలయ్యాడు. వినాయక్ గోవింద్‌కి సపర్యలు చేసి అతడి ఆరోగ్యం కోసం పరితపించాడు. బావిలో నీరు పడినప్పుడు గోవిందు తాగగా మిగిలిన నీటిని తాగాడు. ఆ నీరు నా ఎంగిలైందని గోవిందు వారించాడు. నీవు శ్రమించడం వల్లనే కదా! బావిలో నీరు పడింది. ఆ నీటిని మేము వాడుతాము. శ్రమ విలువ మాకు తెలుసు. భూమి స్తన్యమైన గంగలో స్పృశ్య, అస్పృశ్య అనే తారతమ్యమేమిటని కొట్టిపారేశాడు వినాయక్. కార్మికశక్తిని, శ్రామిక విలువలను గౌరవించిన సంస్కారవంతుడైన దళితయువకుడు ఈ కథలో చిత్రించబడ్డాడు.

కట్టడి :

ఆ గ్రామంలో బావిని కట్టడి చేశారు. శీర్షిక కట్టడి అని చదవగానే ఏమిటా కట్టడి అనే ఉత్సుకత కలుగకమానదు. ఆ పేరే కట్టి మరీ చదివిస్తుంది. పదేళ్ళ పసివాడైన పెద్దోడికి అదే ఉత్కంఠ కలిగింది. దళిత కులంలోని ఉపకులం వాడు మొండోడు. మొండోడు కనిపించిననాడు అపశకునంగా భావిస్తారు దళితులు రహస్యంగా భోజనం ఒడ్డించడం, ఆ భోజనాన్ని మొండోడు రహస్యంగానే ఆరగించడం పరిపాటి. బావి గిలకకు తలవెంట్రుకలు చుట్టి బావిని కట్టడి చేశాడారోజు మొండోడు. తల వెంట్రుకలు చుట్టి బావి గిలకకు తల వెంట్రుకలు చుట్టి బావిని కట్టడి చేశాడు ఆరోజు మొండోడు. తల వెంట్రుకలు చుట్టిన వారే దానిని విప్పతీయాలి. నీరు లేకపోవడంతో దళితవాడలో పోయి వెలిగించలేదు ఎవ్వరూ. మొండోడికి ఆహారం ఎలా అనే ప్రశ్న తలెత్తింది. చద్దన్నమైన పెట్టవచ్చునని ఒక వృద్ధుని సలహాతో ఎవరికి తోచిన ఆహార పదార్థాలు వారక్కడ పెట్టారు. పెద్దోడు తన ఆహారాన్ని కూడా అక్కడ పెట్టి రహస్యంగా దాక్కొని మొండోడు ఆహార పదార్థాలను ఆప్యాయంగా తినడం చూశాడు. ఆ రోజుతో మళ్ళీ మొండోడు మళ్ళీ కనిపించలేదు. మనుషుల ఆచారాలు సంప్రదాయాలు జీవన విధానాలు మూఢనమ్మకాలు ఈ కథలో చిత్రించారు రచయిత.

కులవృత్తి :

ఈ కథలో బలహీనులపై బలవంతులు ఏవిధంగా

ఆధిపత్యం చెలాయిస్తారో ఈ కథలో ఎత్తిచూపారు రచయిత. మూర్తి చెప్పులతో దేవాలయ ప్రవేశం చేయబోతే పూజారి అభ్యంతరం చూపాడు. కాళ్లకు రసికారుతోందని మూర్తి చెప్పడంతో చెప్పులు కడుక్కుని రమ్మన్నాడు. ఆచారాలు సంప్రదాయాలు అవసరానికి అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు కూడా ఉన్నదని పూజారి చేతనే నిరూపించారు రచయిత. పశుపక్ష్యాదులు ఒక్కోసారి దేవాలయంలో మలమూత్రాదులు విసర్జిస్తాయి. దేవాలయం అప్పుడు అపవిత్రం కాలేదు. పవిత్రత, అపవిత్రతను నిర్ణయించడానికి ప్రమాణాలు ఏమిటి? ఆరోగ్యకరమైన పరిశుభ్రత పాటించాలి. ఆ పర్యవేక్షణ బాధ్యత పూజారి తీసుకుంటాడు. పరిశుభ్రతకు ఒక వర్గం వారిని వెలివేయడానికి సంబంధం ఏమైనా ఉందా ఆ పని ఎంతవరకు సబబు. మరి పురోహితుడే మురికి వస్త్రాలు మాసిపోయిన జంధ్యాన్ని ధరిస్తున్నాడు. అది అపవిత్రత కాదా మనుషులలో భేదాలు ఎందుకు ఒక్కొక్కరికి ఒక్క న్యాయమా ఇలాంటి ప్రశ్నలతో సుతి మెత్తగా విమర్శిస్తూ హేతువాద ధారణతో రసవత్తరంగా చక్కని శిల్పంతో కథను నడిపిన ఇనాక్‌ని అభినందించ కుండా ఉండలేము.

తాకట్టు :

ఓబులేసు, శాస్త్రి చిన్ననాటి మిత్రులు. అధ్యాపకులు అయ్యారు. ఒకరి ఇంట్లో ఒకరు భోజనం చేస్తారు. శాస్త్రి పదివేల రూపాయల అప్పు ఓబులేసుని అడిగాడు. కేవలం దారపుపోగైన జంధ్యం తమిద్దరి మధ్య భేదాన్ని సృష్టిం చడం సహించలేని ఓబులేసు జంధ్యాన్ని తాకట్టు పెట్టి డబ్బు తీసుకోమన్నాడు. జంధ్యమనేది మిత్రుని వద్ద లేకపోతే తామిద్దరూ సమానులమేనన్న ఆలోచన ఓబులేసులో కలిగించడం, తాకట్టుగా జంధ్యాన్ని పెట్టమని అడగడం సాహితీ బ్రహ్మ ఇనాక్ ఓబులేసు పాత్రను సృష్టించి సమాజంలోని మార్పునకు ప్రయత్నం చేశారు.

జబ్బు :

కులం జబ్బును ఈ కథలో చూపారు ఇనాక్ గారు. దళితుడైన మిత్రుని ఇంట్లో భోజనం చేస్తే ఎవరైనా లోకువ చేస్తారేమోనని భోజనం చేయడు. కొన్నాళ్లకు ఓపిక నశించి కులాన్ని లోకువ చేసే అస్పృశ్యత అనే జబ్బు నుండి మిత్రుడు బయటపడడమే ఈ కథానేపథ్యం. నేటి యువత, విద్యావంతుల చేతిలోనే సమాజ భవితవ్యమున్నది. వీరు తలుచుకున్ననాడు సమాజంలో ఎటువంటి పరిణామాలైనా సుసాధ్యాలేనని స్పష్టంగా ఈ కథ ద్వారా తెలియజేసిన ఇనాక్‌లోని సార్వజనీయత మనకు అవగతమౌతుంది.

క్షమాభిక్ష :

గురువు తన శిష్యుడుని నైతికతకు నిదర్శనంగా తయారు చేశాడు. శిష్యుడు విలువలు కలిగిన వైద్యు డయ్యాడు. గురువుగారబ్బాయి రైలు డ్రైవరుగా సెలెక్టు అయ్యాడు. మెడికల్‌లో సెలెక్ట్ కాబడితే ఉద్యోగం రావడం ఖాయం. మెడికల్ పరీక్ష చేసి అతడికి దృష్టిలోపం లేదని శిష్యుడైన వైద్యుడే సర్టిఫికెట్ ఇవ్వాలి. కొడుకు దృష్టిలోపం గురువుకి తెలుసు. దృష్టిలోపమున్నవాడు రైల్వే డ్రైవరు ఉద్యోగానికి అనర్హుడన్న విషయం అతడికి తెలుసు. సర్టిఫికెట్ ఈయవద్దని చెప్పి తన కొడుక్కి అన్యాయం చేయలేక ఈయమని అభ్యర్థించి తన విలువలకు వారసుడైన శిష్యునికి అన్యాయం చేయలేక ఆ గురువు మనసులో అగ్నిపర్వతం బద్దలవుతున్నా మౌనం వహించాడు. విలువలు కోల్పోయి సర్టిఫికెట్ యిస్తే ఎందరో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతారు. గురువుగారి కుమారునికి ఈ ఉద్యోగం కాకపోతే వేరొక ఉద్యోగం వస్తుంది. కనుక గురువుగారి బోధన సఫలమైనట్లు ఆ శిష్యుడు దృష్టిలోపం కారణంగా ఆ కుర్రవాడు ఉద్యోగానికి అనర్హుడన్న సర్టిఫికెట్ ఇచ్చాడు శిష్యుడు. తాను నేర్పిన విద్య వ్యర్థం కానందుకు ఆ గురువుగారు సంతృప్తి చెందారు. ఒక మంచి విద్యార్థిగా, ఒక గొప్ప గురువుగా పరకాయ ప్రవేశం చేసిన రచయిత సమాజానికి అవసరమైన విలువలను పండించారు.

విఘ్ననాయకుడు :

గత నిమర్జనాలలో గొడవలు జరిగి నరసప్ప కొడుకు చనిపోయాడు. కాంట్రాక్టు లెక్చరర్ చేతికంది వచ్చిన కొడుకు దూరమైన నరసప్ప ఈసారి గణేశ నిమర్జన బాధ్యతను తన నెత్తిన వేసుకున్నాడు. సివిల్స్ ప్రిలిమ్స్ పాసై, మెయిన్స్‌కి హాజరు కావలసిన దళిత యువకుడు, పోలీసు ఉద్యోగంలో చేరి లా అండ్ ఆర్డర్ మాట్లాడుతున్న వాడు, ఎమ్ ఆర్ వో గా కొత్త ఉద్యోగంలో చేరిన యువకుడు వీళ్లంతా దళితులుగా పుట్టిన పాపాన చంపబడ్డారు. ఏ దళిత స్త్రీకి కడుపుకోత మిగలకూడదని ఉద్దేశ్యంతో నరసప్ప నడుంబిగించి గణేశ నిమర్జనాన్ని నిర్విఘ్నంగా జరిపించి విఘ్ననాయకుడైనాడు. ఏ వర్ణం వారైనా ఎవరి ఊరేగింపు వారిది కనుక వేరే వారి ఊరేగింపులో జోక్యం చేసుకోరాదని ఊరు పెద్దలు నిర్ణయించారు. డప్పుల, సంగీతం, చిందు లాంటి కార్యక్రమాలతో నిమర్జనాన్ని పూర్తి చేసిన నరసప్ప రిపబ్లిక్ డే నాడు వాహనాల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న రాష్ట్రపతిలా నరసప్ప వచ్చి పోయే వాహనాలకు దండం పెడుతున్నాడు. సామాన్య పౌరుని ప్రథమ పౌరునితో పోల్చి పౌరుల బాధ్యతను సమాజంలోని అలజడులు అన్యాయాలను ఎత్తి చూపారు ఈ కథలో రచయిత.

ఇనాక్‌గారి నవలలను పరిశీలిస్తే....

రంధి నవల :

ఊరికి మాదిగ పల్లెకు మధ్య జరిగే గొడవే రంధి నవల. భూస్వామి నాంచారయ్య కొడుకు రాముడు మాదిగ యువతి సువ్విని నల్లతుమ్మమొద్దులా ఉన్నావు నేను ఎక్కిన భోగిలోకి ఎక్కవొద్దు అన్నప్పుడు సువ్వి ఏడ్చింది. మరో భోగిలో ప్రయాణం చేసింది. కానీ తన ఒంటి మీద రాముడు చెయ్యి వేయగానే ప్రతిఘటించి అతడు ముక్కు మీద రక్తం వచ్చేలా గుద్దింది. తనను అర్థం చేసుకున్న వాడు, రాముడి నుండే తనను రక్షణ కల్పించగలిగేవాడు చందిరి మాత్రమేనని చందిరిని భర్తగా ఎన్నుకున్న మేధావి సువ్వి. తన శీలానికి పెద్దమనుషులు ఖరీదు కడితే ఆ డబ్బును విసిరికొట్టి ఆ తీర్పుని లెక్క చేయకుండా తన ఆత్మాభిమానం నిలబెట్టుకున్న వ్యక్తిత్వం కలిగిన యువతిగా నిలిచింది సువ్వి. రాముడు ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకు ఇష్టపడిన అమ్మాయి సువ్వి తనకు కోడలై ఉండేది. అనే భావనతో నాంచారయ్యలో పరివర్తన కలిగి మాదిగవాడలోని మనుష్యులతో స్నేహంగా మెలుగుతూ కొడుకుని చందిరిలో చూసుకుని సంతృప్తి చెందుతాడు నాంచారయ్య. డబ్బు ఉందని విర్రవీగితే ఒంటరి జీవితం ఏర్పడిన పరిస్థితులు ఏర్పడతాయని, నలుగురితో మంచితనంతో కలిసి బతకడం ఎంతో అవసరమని నాంచారయ్యలో పరివర్తన తెచ్చి సమాజానికి చక్కని సందేశాన్ని ఈ కథ ద్వారా తెలపడమే కాక మాదిగ యువతిలోని తెగువ, స్వయం నిర్ణయం ఆ రోజుల్లోనే సువ్విని సృష్టించి స్త్రీలకు చక్కని మార్గనిర్దేశనం చేసిన కథా బ్రహ్మ ఇనాక్.

సర్కారు గడ్డి :

ప్రభుత్వ పథకాలు, ఫలాలు అందరికీ అందక పోవడం, ముఖ్యంగా పేదవాళ్లకు అన్యాయం జరగడం ఈ కథా నేపథ్యం. పశువుల కోసం ప్రభుత్వం వరిగడ్డి ఇస్తున్నది. ఆ గ్రామం మోతుబారులు, ధనికులు ఆ గడ్డిని తీసుకొని పేదవాళ్లకు అన్యాయం చేస్తున్నారు. ఇటువంటి సందర్భంలో ఓబులేసు కొడుకులు ముసలిదైన లచ్చువు అనే ఎద్దువలన తమకు భారమే తప్ప ఎటువంటి ఆదాయము లేకపోవడంతో ఆ ముసలి ఎద్దును కబేళాకు అమ్మితే తమకు భారం ఉండదు. కబేళా వాళ్ళు కొంత డబ్బు కూడా ఇస్తారన్న ఆలోచనతో ఎద్దుని కబేళాకి పంపించేద్దామని నిర్ణయానికి వచ్చారు. ఇది గమనించిన వారి తండ్రి భవిష్యత్తులో తన కొడుకులు తనను కూడా వృద్ధాశ్రమానికి పంపిస్తారేమోనన్న ఆందోళన చెందుతాడు. ఆ బెంగతో చనిపోతాడు. ఎంతో ప్రాణప్రదంగా తనను చూసుకునే యజమాని చనిపోవడంతో లచ్చుడు అనే ఎద్దు యజమాని చెంతనే ప్రాణాలు వదులుతుంది. ఈ

నన్నివేశాన్ని చూసిన కుక్క కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేస్తుంది. మానవులలో లేని సమానత్వాన్ని సాధు జంతువుల్లో ఉన్నదంటూ ఈ కథలో తెలియజేశారు రచయిత. ప్రాణప్రదంగా చూసుకోవడం, ఇంట్లో మనిషిగా భావించడం, ఈ కరువు కాటకాలు గడ్డి దొరకకపోవడం వలన ఎద్దుని భారంగా భావించి కబేళాకి పంపించాలనుకోవడం పెత్తందారుల అమానుషత్వం, దోపిడీ, అణచివేతలు ఈ కథలో స్పష్టంగా కనిపిస్తాయి.

కాలమేఘాలు నవల :

ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నట్లయితే విజయాన్ని సాధించవచ్చునని ఈ కథలో యువకుని పాత్ర ద్వారా తెలియజేశారు రచయిత.

అనంతజీవనం :

మూర్తి దేవి పురస్కారాన్ని సంపాదించిన నవల ఇది. గంగారెడ్డి కోటలో 50 గదులు ఉన్నాయి. పూర్వపు రాజు కోటకు ఏమాత్రం తీసిపోని సంపన్నభవనమిది. నిత్య జీవితంలోని అలవాట్లకు, అవసరాలకు ఒక్కో గదిని కట్టించిన విశాలమైన భవనంలో గంగారెడ్డి ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఒకడు రౌడీ, రెండోవాడు అందరిని దోచుకునే లాయరు, మూడవ వాడు అవినీతిపరుడైన రాజకీయ నాయకుడు. అనావృష్టికి మారుపేరైన అనంతపురంలో 36 గంటలు ఏకధాటిగా వర్షం కురవడం తండ్రీకొడుకుల మోసాలకు సాక్షిభూతమైన ఆ భవనం కూలిపోవడం ఈ నవలలోని కథాంశం. గుడిసె లోనున్న వాళ్లు, సామాన్యులు, వృత్తిపనివారు ఏదో ఒక చోట తలదాచుకొని సేద తీరుతారు. వాళ్లు పెద్దగా నష్టపోయినది ఏమీ లేదు. ఎంతో వెచ్చించి ఆడంబరంగా అధునాతనంగా కట్టించిన భవనం నేలమట్టమయింది. దురహంకారంతో విర్రవీగే సంస్థానాధీశుల, భూస్వాముల, పెత్తందారుల గర్వం ఎలా అణగారిపోతుందో, పెద్దపెద్ద సంస్థానాలు ఎలా మట్టిలో కలిసిపోయాయో ఈ నవలలో స్పష్టంగా చూపి, సామాజిక మార్పు అవసరాన్ని, అహంకారంతో విర్రవీగే వారికి హెచ్చరింపుని ఈ నవలలో మనం గమనిస్తాము.

సమత నవల :

దళితవాడలోనున్న రాజారావు బాగా చదువుకొని మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. తనను పెళ్లి చేసుకోవాలని ఆశపడిన మరదలు స్వర్ణకు తండ్రి కోరిక తీర్చడం కోసం తాను కులాంతర వివాహం చేసుకోనున్నట్లు చెప్పాడు. రాజారావు లక్ష్యాన్ని అర్థం చేసుకున్నది స్వర్ణ. లీలను ప్రేమించినా... సంధ్యను పెళ్లి చేసుకున్నాడు. తనకు హాని చేయబోయిన రత్నరాజు, మధులను క్షమించి తన స్నేహ హస్తాన్ని అందించాడు. తోటి వ్యక్తులలోని లోపాల కారణంగా వారిని వదులుకోకూడదన్న మానవత్వాన్ని చూపాడు. సుందరాన్ని ప్రేమించిన అమ్మాయిని సుందరం అన్నయ్యనిచ్చి పెళ్లి చేశారు పెద్దలు. మరిదిగా ప్రేమించిన సుందరం కళ్ళ ఎదుట తిరగడాన్ని సహించలేని అమ్మాయి ఆత్మహత్య చేసుకోబోయింది. విషయం తెలిసిన పెద్దలు సుందరంతో ఆమె వివాహాన్ని జరిపించి సుందరంతో వేరే అమ్మాయి పెళ్లి జరిపారు. పరిస్థితులను అర్థం చేసుకునే పెద్ద మనసు దళితుల్లో ఉంటుందని, వీరి మానవత్వం సర్దుబాటు తత్త్వం ఉంటాయని ఈ నవల ద్వారా తెలియజేశారు ఇనాక్ గారు.

పులుల బోను - నేను :

విద్యనభ్యసించదలచిన దళిత యువకునికి ఎన్నో చేదు అనుభవాలు ఎదురవ్వడం, ఎన్నో ఆటంకాలు వచ్చినా ఓర్పుతో సహించి తన విజ్ఞానాన్ని దినదినాభివృద్ధి చేసుకుంటూ ఒక్కొక్క సోపానాన్ని దాటుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో ఒక గౌరవనీయ స్థానాన్ని పొందిన యువకుని జీవన పోరాటమే ఈ నవల ఇతివృత్తం.

అనాథ నవల :

అనాకారంతో పుట్టిన పోలి తల్లి అనాథాశ్రమంలో పెరిగి ఉపాధ్యాయురాలు అయింది. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగాన్ని సంపాదించిన దళిత యువకుడు రవి. వైద్య విద్యార్థిని రాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా ఆ పెళ్లి

పెటాకులైంది. అనకాని స్త్రీ అందమైన యువకుని పెళ్లాడాలన్న గాఢమైన కోరిక లాంటిదే అగ్రవర్ణ స్త్రీని దళితుడు పెళ్లాడదని సరిపుచ్చుకున్నాడు రవి. తన చదువుకి ఎన్నో విధాలుగా సహాయపడిన పోలి తల్లి తనపై మనసు పడడాన్ని అర్థం చేసుకున్న రవి అందం, కులం మన చేతుల్లో లేవన్న అవగాహనతో పోలి తల్లిని వివాహమాడి పెద్ద మనసును చాటాడు. కులం కంటే గుణమే గొప్పదని మానవతా విలువలు మానవ సంబంధాలు, నర్సుబాటు, సహనం దళితులలో ఎక్కువగానే ఉంటుందని హృదయాన్ని స్పృశించేలా సుతారంగా తెలియజేశారు రచయిత.

పై మెట్టు నవల :

మాదిగ కులంలోని ఒక ఆశ్రిత ఉపకులం భోగమోళ్ల కులం. స్త్రీ ఆధారిత కులమిది. భోగమోళ్ల యువతి ఆటపాటలతో మెప్పించి, మాదిగ యువకుల నలరించి పొట్ట పోసుకోవడం పరిపాటి. మాదిగ పురుషుడామెకు కన్నెరకం పెడతాడు. కన్నెరికం పెట్టినవాడు జీవితాంతం పోషించగలవాడయితే ఆమె అతనికి కట్టుబడి ఉంటుంది. భోగం పిల్ల రవ్వ చిట్టోడి ఆడదిగా పెద్దలు నిశ్చయించారు. భోగం యువతి రవ్వ తన సంతానానికి గౌరవనీయ స్థానం కల్పించడానికి రవ్వ చేసిన పోరాటమూ, సమయస్ఫూర్తి, తెలివిని ఈ నవలలో చూపి భోగం యువతి సంప్రదాయ ధిక్కారణ ధోరణిని, సాధికారతను చూపి మహిళా ప్రగతి, పరిణామాల అవశ్యకతను స్పష్టంగా చూపారు రచయిత. బుజ్జులు కొడుకు దొరబాబు. బుజ్జులు చెల్లెలు నల్లమ్మ కూతురు బుజ్జితో దొరబాబుకి పెళ్లి నిశ్చయించారు. అంటే మేనత్త కూతురు బుజ్జి. పెళ్లి జరుగుతుండగా బుజ్జులు బావ మరిది చిట్టోడు సంతానమైన మువ్వ తాను దొరబాబుని పెళ్లాడతానని ఒడిబియ్యంతో, పెళ్లికూతురు అలంకారంతో పెళ్లి మండపంలో ప్రత్యక్షమైంది. రవ్వ కూతురే మువ్వ. చిట్టోడికి, రవ్వకు పుట్టిన సంతానమే మువ్వ. తన భోగం కులవృత్తికి తన కూతురు బలి కాకుండా కూతురు దొరబాబుని పెళ్లి చేసుకుని గౌరవంగా బ్రతకాలని కోరుకొని, మొదటి నుంచి బాధ్యతాయుతమైన తల్లిగా పాకులాడి సామాజికంగా తొలిమెట్టుపై అడుగు వేసింది. దొరబాబునకు మేనత్త కూతురు బుజ్జి అన్నా, మేనమామ సంతానమైన మువ్వ అన్నా ఇష్టమే కనుక ఇద్దరినీ దొరబాబుకి ఇచ్చి పెళ్లి చేశారు పెద్దలు. కులంలోనున్న దురాచారాలను వ్యక్తులు ప్రయత్నంతో మార్పు తేవాలని ఈ నవల ద్వారా తెలియజేశారు రచయిత.

ఆది ఆంధ్రుడు కావ్యం :

అమరావతి స్థూపానికి పూర్ణ కలశాన్ని బహుమతిగా ఇచ్చిన ఒక మాదిగ వ్యక్తిని గురించి ఈ కావ్యంలో వివరించారు. దళితులుచరిత్రను, ఆర్యుల దురాక్రమణను ప్రస్తావించి అత్యద్భుతంగా విశ్లేషించారు ఈ గ్రంథాన్ని ఇనాక్‌గారు.

కన్నీటి గొంతు కావ్యం :

శూర్పణఖ హృదయాన్ని ఈ కావ్యంలో ఆవిష్కరించారు రచయిత. రావణుడిని ధీరోదాత్త నాయకునిగా, రాముని ప్రతినాయకునిగా చిత్రించి ఈ కావ్యాన్ని సృజియించారు ఇనాక్.

జానపద సాహిత్య విమర్శనా గ్రంథం:

విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో ప్రసిద్ధి పొందిన గ్రంథరాజమిది. జానపద సాహిత్య విమర్శనంలో మొదటి గ్రంథం ఇది.

మునివాహనుడు నాటకం :

12వ శతాబ్దంలో వాస్తవంగా జరిగిన చారిత్రక కథనమే ఈ మునివాహనుడు నాటకం. పాణ్ కులస్థుడైన తిరుప్పణ్ ఆళ్వారనే దళితుడు దేవాలయ ప్రవేశానికి తిరస్కరింపబడ్డాడు. 12 మంది ఆళ్వారులలో తిరుప్పణ్ ఆళ్వారొకడు. ప్రసిద్ధుడైన ఈ ఆళ్వారు మునివాహనుడయ్యాడు. ముందు వ్యాసాన్ని రాసి సంతృప్తి చెందని ఈ చరిత్రను నాటకంగా రాసి విమర్శకుల మన్ననా పొందారు. ఈ నాటకం 5,40,000 కాపీలు అమ్ముడై రికార్డ్ సృష్టించిన

ఈ కావ్యం 1974లో వెలిసింది. ఈ నాటకం శరీరాన్ని పులకింప చేసే కళాఖండం. ఇక ఈ నాటకాన్ని పరిశీలిస్తే...

లోకసారంగముని శ్రీరంగనాథుని దేవాలయం పూజారి. ఈయనే మునీశ్వరుడు. శ్రీ రంగనాథుని పరమ భక్తుడు. దళితుడైన తిరుప్పాణ్ ఆళ్వారు కూడా శ్రీ రంగనాథుని పరమ భక్తుడే కాదు గాయకుడు కూడా. లోక సారంగముని పూజాది కార్యక్రమాల వద్ద తిరుప్పాణ్ ఆళ్వారు రావడాన్ని సహించలేని అగ్రకుల దురహంకారంతో ముని రాయితో కొట్టాడు తిరుప్పాణ్ ఆళ్వారుని. అతడి తలపై గాయమై రక్తం స్రవించింది. కోనేటిలో అతడి రక్తం కలిసింది. ఆ నీటితోనే ముని శ్రీరంగనాథుని అభిషేకించాడు. శ్రీరంగనాథుడు సారంగమునికి కనిపించి తిరుప్పాణ్ ఆళ్వారుని తన వద్దకు తీసుకు రమ్మన్నాడు. దళితుడైన తిరుప్పాణ్ దేవాలయ ప్రవేశానికి అర్హుడు కాడు. కనుక ఇది అసాధ్యమన్నాడు సారంగముని. నీ ఆచారం ప్రకారం తిరుప్పాణ్ దేవాలయంలో అడుగుపెట్టి పాదాలతో తాకి రాకూడదు అంతే కదా! సరే అలాగే కానివ్వు. అతడిని నీ భుజాల పైన ఎక్కించుకొని మునివాహనిగా తిరుప్పాణ్ని నా వద్దకు తీసుకొనిరా! అని ఆజ్ఞాపించిన శ్రీ రంగనాథుని కోరికతో లోకసారంగముని తిరుప్పాణ్ని ఆహ్వానించి, అతడిని అంగీకరింపజేసి, ఇది దైవేచ్ఛయని తెలిపి తన భుజాలపై తిరుప్పాణ్ని ఎక్కించుకొని మునివాహనునిగా దైవ సన్నిధికి తెచ్చాడు. దేవుని చెంతకు చేరిన తిరుప్పాణ్ ఆళ్వారు శ్రీరంగనాథునిలో ఐక్యమయ్యాడు. కవి తన రచనల ద్వారా సమాజాన్ని ప్రేరేపిస్తే విశ్వవ్యాప్తుడౌతాడు. సువర్ణాక్షరాలతో లిఖించబడిన యశోభరితమైన కావ్యం ఇది. ఈ కావ్యంలో సంప్రదాయ కావ్య లక్షణాలన్నీ ఉన్నాయి. పఠన యోగ్యమైన కావ్యమిది. నారికేళ పాకంలో రచించారు.

ఓట్లూట నాటకం :

ఈ నాటకంలో ఓటు విలువలను తెలిపారు. పేద వానికైనా రాష్ట్రపతి కైనా ఓటు ఒక్కటే. ఓటు ఎంతో విలువైనది. అంత విలువైన ఓటును ప్రతి వ్యక్తి వినియోగించుకొని సరియైన నాయకుని ఎన్నుకోవాలని ఈ నాటకంలో చూపారు రచయిత.

కొలకలూరి ఇనాక్‌గారు స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. కథలు, నవలలు, వ్యాసాలు, కావ్యాలు, విమర్శనా గ్రంథాలు, నాటికలు, పద్య, వచన కవితలు రచించారు. 96 గ్రంథాలు వెలువరించారు. అస్పృశ్యత, అణిచివేత, అగ్రవర్ణాల అమానుషత్వం, పేదరికం, దోపిడి, పీడనం ఈయన రచనల్లోని వస్తువులు. స్త్రీని శక్తి స్వరూపిణిగా చిత్రించడం ఈయన రచనల ప్రత్యేకత. సంఘటన సన్నివేశాలను కల్పించి కథను ఏకబిగిసి పాఠకులు చదివేలా చక్కని శిల్పంతో రాయడమే కాక పాత్రలను సృష్టించి నాటకీయంగా వాటి సంభాషణలను రాయడం ఈయన రచనల్లోని విశేషం. ఎటువంటి శైలిలోనైనా రాయగల నైపుణ్యం, శీర్షిక, ప్రారంభం, నడక, కొసమెరుపు లాంటి అన్ని లక్షణాలు ఇలా కథలలో దర్శించవచ్చు. ఈయన చేసిన సాహితీ సేద్యంలో మణులు మాణిక్యాలే సాహితీ ప్రక్రియలు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. రంధి - కొలకలూరి ఇనాక్ - జ్యోతి గ్రంథాలయ- 2018
2. ఆశాజ్యోతి - కొలకలూరి ఇనాక్ - జ్యోతి గ్రంథాలయ-2020
3. పై మెట్టు - కొలకలూరి ఇనాక్ - జ్యోతి గ్రంథాలయ- 2020
4. విమర్శిని- కొలకలూరి ఇనాక్ - జ్యోతి గ్రంథాలయ- 2013
5. కొలకలూరి ఇనాక్ కథా సంపుటాలు
6. వికీపీడియా

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జక్కులు నవల-1940లలో మాదిగల జీవితం

- ఈ. యాకయ్య, పి.జి.టి తెలుగు ఉపాధ్యాయులు

జక్కులు నవల కథ మంథని దగ్గర ఉన్న మాదిగ గూడెంలో ప్రారంభమౌతుంది. పక్షులు, జంతువులు, ఆవులు లేగలతో గ్రామం కళకళలాడుతూవుంటుంది. తెల్లారంగానే కోళ్ళు బయట తిరుగుతూవుంటాయి. పిల్లి పొదల మాటున పొంచి కోడిపిలల్ని తినడానికి చూస్తూ వుంటుంది. నిండు గర్భిణి అయిన కొండక్క ఇంటి పనులు చేస్తూ కిందపడుతుంది. ఈమె భర్త మారన్న. వీళ్ళకి జన్మించినవాడు మన కథానాయకుడు జక్కులు. ఇతడు జన్మించినది మాదిగ కులంలో. ఈ కులం అతడిని నవలలో అనేక సార్లు ఇబ్బందులకు గురి చేస్తుంది. ఈ జక్కులు నవలా రచయిత మంథని శంకర్. ఈయన కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. కవిగా, రచయితగా పరిశోధకుడిగా సాహితీ రంగంలో ముందుకు సాగుతున్నాడు. కవిగా తునక లందని దండెం, నల్లరక్తకణాలు, యుద్ధం-తపస్సు వంటి ఉత్తమమైన కవితా సంపుటాలు వెలువరించారు. సాహితీ క్షేత్రంలో కవిత్వం ద్వారా తన గళాన్ని వినిపిస్తూనే నవలా రచయితగా జక్కులు నవలతో తన తొలి అడుగువేసారు. ఈ నవల 1940ల మాదిగల జీవితం ఎలా వుండేదో మనకు తెలుపుతుంది. ఈ నవలకి 2022 కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం దక్కింది.

"ప్రజల మనిషి నవల 1939కి పూర్వం తెలంగాణలో ఉన్న దుర్భర బానిసత్వాన్ని ప్రతిబింబింస్తూ అక్కడి ప్రజా చైతన్యం మేల్కొన్న క్రమాన్ని వివరిస్తున్నది దీనిని తెలంగాణ ఉద్యమం యొక్క ప్రాథమిక దశను రికార్డు చేసిన చారిత్రక నవల గా చెప్పవచ్చు. దిమ్మగూడెం కేంద్రంగా అంతవరకు పెంపొందుతూ వస్తున్న ఫ్యూడల్ శక్తులకు ప్రతీకగా ఉన్న దొర రామభూపాల్‌రెడ్డి పైన కంఠీరవం,కొంరయ్యలలో ప్రజాచైతన్యం మేల్కొని ప్రతిఘటించిన క్రమాన్ని ప్రతిపాదిస్తుంది."(ప్రాంతీయ చైతన్యం తెలంగాణసాహిత్యం,ప్రజలమనిషి నవలా జీవితం.కాత్యాయనీవిద్మహే పేజీ:86). ఈ కాలంలోని ఫ్యూడల్ శక్తులకు ప్రతీకగా ఉన్న దొరలు ఆదిరెడ్డి సోమయ్యదొర పైన జక్కులు చేసిన శాంతాయుత పోరాటన్ని ఈనవలప్రతిపాదించింది.

గ్రామాలలో ఆస్పత్రులు లేని పరిస్థితులు ఊళ్ళో ఉన్న మంగలివారు మంత్రసానులుగా వైద్య సేవలు చేస్తూ ప్రజలను ఆదుకునేవారు. ఈ సంఘటన మనకు జక్కులు పుట్టినప్పుడు 'మంగలి మంగక్క' పురుడు పోయడం ద్వారా రచయిత మనకు తెలిపారు. పుట్టిన బిడ్డలకు 21వ రోజు కార్యక్రమం చేయడం ఆ కార్య క్రమంలో నామకరణం చేయడం ప్రతి కుటుంబంలో వుంటుంది. బాలింతలకు, పుట్టిన పిల్లల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని మంచి ఆహారం అందిస్తారు. పేద కుటుంబాలలో మంచి ఆహారం అందించడం, ఖర్చును భరించడం కష్టమే. కాబట్టి వారికి అందుబాటులో ఉన్న ఆహారం అందిస్తారు. అందులో భాగంగా 21వ రోజున లేగదూడను తెచ్చి కోసి అందరికి భోజనాలు పెట్టారు. ఎద్దు గోర్జం తెచ్చి జక్కులుకి తినిపించడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తాడు మారన్న. మాదిగ గూడెం ప్రజలు వాళ్ళ ఆచార పద్ధతులు నిత్య జీవితానికి ఆపాదించు కుంటారు. తినే తిండి మొదలైన వాటిని కూడా నిత్య జీవితంలో జరిగే సంఘటనలలో భాగం చేస్తారు.

చిన్న పిల్లలు ఏడిస్తే వారిని బుజ్జగించడానికి జోల పాటలు పాడుతూ వారిని బుజ్జగిస్తారు. అలా బుజ్జగిస్తూ రాయక్క పాడిన పాటలో దళితుల ఆహారపు అలవాట్లను పరిచయం చేస్తూ,

చందమామ రాయే
జాబిల్లి రాయే

కొండెక్కి రాయే
గోగు పూలు తేయే
గోల్కొండకు పోయి గొడ్డును తేవే
కొరికిన బొక్కలు కుక్కకేయే
కొరకని బొక్కలు జక్కనికేయే

అంటూ జోలపాటలు పాడుతారు. జానపదులు పురాణ పురుషులను, దేవుళ్ళను పిల్లలకు ఆపాదించు కుంటారు. కాని వీళ్ళను పురాణాలకు, దేవుళ్ళకు దూరంగా ఉంచడం వల్ల నిత్య జీవితాలను జోలపాటలకు ఆపాదించిన విషయాలను రచయిత మనకు తెలియ జేశారు.

గ్రామాలలో ప్రజలపై దొరల అధికారం ఎక్కువగా ఉండేది. వాళ్ళు చెప్పిందే అందరూ వినాలి. ఏ నిర్ణయం తీసుకున్న అందరూ దానికి కట్టుబడి ఉండాలి. గ్రామాలలో నిర్ణయాలు తీసుకునే అధికారం వారికే ఉంటుంది. గ్రామ పెద్దగా దొరలే వ్యవహరిస్తారు. వారి మాటకు ఎవరైన ఎదురు తిరిగితే వారిని హతమార్చే ప్రయత్నం చేస్తారు. మంథని దగ్గరున్న మాదిగ గూడెం ఆదిరెడ్డి దొర, సోమయ్యదొర, ముత్యంరావు దొరల ఆధీనంలో ఉండేది. వారు ఏది చెప్పితే అదే శాసనం.

పంటలు మంచిగా రోగాలు రాకుండా ఉండడం కోసం పోచమ్మ దేవతను గ్రామాలలో కొలుస్తారు. ఈ పండుగను అందరూ జరుపుకుంటారు. అయినప్పటికీ ఈ కార్యక్రమం నిర్వహించేది మాదిగోళ్ళు, పంబాలోల్లు. అయితే ఆదిరెడ్డి దొర మారన్నకు కబురు పంపి ఇంటికి పిలుపించుకొని ఆదివారం నాడు పోచమ్మ కొలుపు చేయాలని అంటాడు. మారన్న ఇంటికి తిరిగి వచ్చి మాదిగగూడెంలో అందరితో చర్చించి 'దప్పుచాటింపు చేయిస్తాడు'. దప్పు కొట్టుడు వారి జీవితంలో భాగమైన విద్యగా ఉంటూ గ్రామంలో ఏ వేడుక జరిగినా దప్పును మాదిగలే కొట్టేవారు. ఏ సమాచారం అయిన ప్రజలందరికి చేరాలంటే 'దప్పు చాటించటం' ఇప్పటికి మనం గ్రామాలలో చూస్తూనే వుంటాం. ఇలాంటి వాస్తవ సంఘటనలు మన ముందుకు తీసుకు వచ్చారు రచయిత. పోసమ్మ కొలుపులో గటం కుండ పట్టడం, గావుపట్టడం, బలివేయడం, లెల్లపాట, ఊరుకట్టడి చేయడం మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కొలుపులో ఏమైన తప్పులు దొర్లితే గటం కుండ పట్టినవారి ప్రాణాలు పోతాయి. అయితే దానిలో కూడా మూడనమ్మకం ప్రభావం చూడవచ్చు. ప్రాణాలకు ముప్పు ఉన్న కార్య క్రమాలను కింది కులాల వారిచే చేయించే పరిస్థితులు మన కళ్ళముందర కనిపిస్తాయి. పోసమ్మను పంటలు అధికంగా పండడం కోసం కొలుస్తారు. దీనిలో మాది గోళ్ళు ముఖ్యమైన వనులన్నీ చేస్తారు. అటూ వ్యవసాయంలో, ఇటు కొలుపులో పనులు నిర్వహించేది దళితులే అయినప్పటికి ఏ ఒక్క మాదిగ వారికి భూమి లేని పరిస్థితి నవలలో మనకు కన్పిస్తుంది.

"అంటరాని తనం సామాజిక అణచివేత. అది దళితు లకు గౌరవంగా బతికే హక్కులు నిరాకరిస్తుంది. చాలా చిన్నచిన్న నేరాలకే హత్యలు జరిగే పరిస్థితి సృష్టిస్తుంది. కులం పేరుతో దూషించడం అవమానించడం అన్నీ దళితులు భరించాలి." (ఆంధ్రప్రదేశ్ దళితులు,కలేకూరి ప్రసాద్.పేజీ 43). దొరలకు జీతం ఉండి ఎంతో కష్టమైన వ్యవసాయ పనులు చేస్తూ వారిచ్చే తిండిగాసం కోసం ఎదురుచూసే దయనీయమైన పరిస్థితులు మాదిగ గూడెం ప్రజలలో ఉండేవి. దొరల భూమిల సేత చేసిన దొరలు ఎంత ఇస్తే అంతే తెచ్చుకోవాలి. వారిని ఎదిరించి మాట్లాడకూడదు. దొరల అహంకారం వారి మాటలలో, చేతలలో అడుగడుగున ఈ నవలలో కన్పిస్తూనే వుంటుంది. అలాంటి నిరంకుశత్వానికి, రాక్షసత్వానికి పరాకాష్ఠ ఆదిరెడ్డి, రమేష్ దొర. మారన్న వాళ్ళకు సేత చేస్తడు. దానికి బదులుగా వాళ్ళు ఒడ్లు ఇస్తారు. మారన్న, జక్కులు వడ్ల కట్టలు తెస్తుంటే వాళ్ళపైనే దాడి చేసి కొట్టి వాళ్ళని పంచాయితీల పెట్టి క్షమాపణలు చెప్పించు కుంటాడు రమేష్‌దొర. "దళిత స్త్రీలు ఎదుర్కొనే మిగతా సమస్యలన్నీ ఒక ఎత్తు అగ్ర కుల పురుసుల హింసను

ఎదుర్కొనడం మరొక ఎత్తు. అగ్రకుల పురుషులనుండి దళిత స్త్రీ ఎదుర్కొనని అవమానంలేదు అనుభవించని హింస లేదు. హత్యలు, మానభంగాలు నగ్న ఊరేగింపులు, సాంఘిక బహిష్కరణలు"(స్త్రీవాద కవిత్వం భాష,వస్తు,రూప, నవీనత.డా॥ఎమ్.ఎమ్.వినోదిని. పేజీ 272).ఆ రోజుల్లో దొరలు ఏది అనుకుంటే అదే జరుగుతుంది అనడానికి ఈ సంఘటన నిదర్శనం. ఇంకా చిన్నచిన్న తప్పులకే కట్టేసి కొట్టడం, దళిత స్త్రీలపై అత్యాచారం చేయడం వంటి పనులు దొరలకు సాగుతుండేవి. ఈ సంఘటనను ఎంతో విశాదంగా చిత్రించారు రచయిత. రంగీకి చిన్నతనంలో భర్త చనిపోతాడు. పిల్లలతో తల్లిగారింటికాడ కూలీ పనులు చేస్తూ బ్రతుకుతుంది. దొర పొలంలో పనికి పోయిన రంగీని బలవంతంగా రమేష్‌దొర అత్యాచారం చేస్తాడు. ఆ విషయాన్ని ఎక్కడ చెప్పుకోలేక, దొరకు వ్యతిరేఖంగా చెప్పితే ప్రాణాలు పోతాయని భయపడుతుంది. అలా ఆమె గర్భవతీ అయి ఆడపిల్ల జన్మిస్తే, దొరపై కోపంతో బిడ్డని పురిట్లోనో చంపివేసే సంఘటన మరియు గ్రామంలో మాదిగోళ్ళు, శాలొళ్ళు పంచాయితీ కూడా కొట్టుకుంటుంటే అందులో రంగీ రమేష్ దొరపై విరచకుపడి కొట్టడం, తన కోపాన్ని తీర్చుకోవడం మనం చూడవచ్చు.

సమాజంలో పండుగలకు ఎంతో ప్రాధాన్యత వుంటుంది. పండుగ సమయంలో ప్రతి ఒక్కరు కుటుంబంతో సంతోషంగా ఉంటారు. పండుగలు మన సంస్కృతిని ప్రతిబింభిస్తాయి. అట్లాంటి పండుగలు దళితులు జరుపుకోరాదని పండుగలలో భాగస్వామ్యం లేకుండా అస్పృష్యత పేరుతో వారిని దూరం చేసిన తీరును, అలా దూరం చేయడం కోసం వాళ్ళు చెప్పిన హనుమంతుని పెళ్ళికథ, వినాయకుడు జాంభవంతుడు గురించి చెప్పె గుండ్రాల కథ, బతుకమ్మ ఆడక పోవడానికి సంబంధించిన కాకి దొబ్బెత్తుకుపోయిన కథలను నవలలో జక్కనికి బాలన్న ద్వారా రాయక్క పోసమ్మ ద్వారా తెలుసుకుంటారు. ఈ కథలలో ఎంత మాత్రం వాస్తవికత లేకపోయిన ఇవన్నీ మాదిగ ప్రజలను అంటరాని తనంతో దూరంగా ఉంచడానికి పన్నిన అస్త్రాలుగా రచయిత తెలిపారు.

కులం పేరుతో, అంటరానితనాన్ని ఆసరాగా చేసుకొని ప్రేమకు వ్యతిరేకంగా అనేక ఇబ్బందులు కల్గించారు. అష్టల్, పద్మ ఒకరినొకరు ఇష్టపడతారు. ఇద్దరి కులాలు వేరు. తక్కువ కులం వారు, ఎక్కువ కులం వారితో మాట్లాడిన, వారిని ముట్టుకున్న, ప్రేమించిన వారిని చంపివేయాలనే ఆలోచనలు కలిగియుండే ఉన్నత కులస్థుల బుద్ధిని మనకు శాలరామయ్య ద్వారా వివరించారు.దొర ఆదిరెడ్డి ప్రాభల్యంతోశాలోల్లు ఇతర కాపువవారు కూడగలిసి కుట్ర పన్నుతారు."దళితులమీద సాంఘిక బహిష్కరణ అమలుచేసే విషయంలో మొత్తం గ్రామమంతా ఒకటైపోతుంది అప్పటి వరకు అగ్రకుల వారిచేత అవమానాలు పొందినవెనుక బడిన తరగతుల వారు కూడా ఈ బహిష్కరణలో పాలు పంచుకుంటారు." (ఆంధ్రప్రదేశ్ దళితులు,కలేకూరి ప్రసాద్.పేజీ 51).జక్కులు నవలలో కూడా కాపు శాలె వారంత కలిసి దళితులపై దాడికి దిగారు.(ఆంధ్రప్రదేశ్ దళితులు, కలేకూరి ప్రసాద్.పేజీ 43). పద్మతో మాట్లాడినందుకు గ్రామంలోని శాలోల్లు అష్టల్‌పై రెండు సార్లు చంపడానికి ప్రయత్నిస్తారు. ముస్లింలపై కొంత భయంతో ఉన్న దొరలు దొంగచాటుగా ఉపాయాలు పన్ని అష్టల్‌ను హతమార్చి వాళ్ళకు అడ్డొస్తే ఏమి జరుగుతుందో చెప్పాలనుకునే అహంకారం నవలలో కన్పిస్తుంది."

ఉన్నత కులాల వారికి ఎవరు ఎదురు చెప్పొద్దు, అన్యాయాన్ని ప్రశ్నించొద్దు. హక్కుల కోసం పోరాటం చెయ్యొద్దు. అలా కాకుండా ఎవరైన తిరగబడిన, ప్రశ్నించిన వారిని హతమార్చాలనే ఆలోచనలతో దొరలందరు ఒక్కటై వారిపై దాడులు చేస్తారు. మారన్న, జక్కులు, అష్టల్ ద్వారా వారికి భూమి ఉన్నదని, దానికి పట్టాదారులు వారే అయినప్పటికీ దానిపై అధికారం

దొరకు ఉందని తెలుసుకుంటారు. మాదిగలు భూములకోసం దొరను ప్రశ్నిస్తే వారిని ఏవిధంగానైన వంచించే ప్రయత్నంతో అందర్ని ఇంటి కొట్టంలో బంధిస్తాడు. అయినప్పటికి భూమి కాగితాలు ఎవ్వరు ఇయ్యరు. అందరు దొరను వ్యతిరేఖిస్తారు. దానికి దొర భయపడి దీనంతటికి కారణం మారన్న, జక్కులు, వాళ్ళను హతమార్చాలనే ప్రయత్నాలు దొరలు చేస్తారు.

గ్రామంలో దొరల భూములలో సేత చేసేది, వ్యవసాయ పనులు చేసేది మాదిగ కులం వారే. అయినప్పటికి వీళ్ళకు కూలీ డబ్బు కూడా ఇవ్వరు. గ్రామంలో ఎంతో మంది ప్రజలు, ఎన్నో కులాలు వుంటాయి. అయినా భూములు మాత్రం దొరలకే ఉండేది. వివిధ కులాల వారికి భూములు ఉన్న వారికి అక్షర జ్ఞానం లేని కారణంగా ఆ భూములు కూడా దొరల సొత్తుగా భావింపబడేవి. ఈ విధంగానే మాదిగ గూడెంలో భూములు కూడా సోమయ్య దొర, ఆదిరెడ్డి దొరల ఆధీనంలో ఉండేది. వారిని సొంత భూములలోనే కూలీలుగా మార్చి, శ్రమను దోపిడి చేస్తూ వారిని పేదరికంలోకి నెడుతూ నీచంగా చూస్తూ హేలన చేసేవారు. మాదిగలు వారి భూమి పొందడం కొరకు దొరను అడిగితే వాళ్ళను దబాయించి, ఆ పత్రాలు తీసుకునే ప్రయత్నాలు అనేకం చేస్తారు. ఇలా ఈ దళితులు ఎదురు తిరగడానికి కారణం అష్టల్, జక్కులు, మారన్న అని గ్రహించి వారిని హతమార్చాలనే ఉద్దేశంతో 'దొడ్డ చెరువు మైసమ్మ' కొలుపు చేయాలని సోమయ్య దొర గ్రామ ప్రజలకు చెప్పుతాడు. కొలుపులో దున్నను బలి ఇయ్యాలని దానికోసం మాదిగలు సిద్ధంగా ఉండాలని తెలియజేస్తాడు. ఈ కార్యక్రమంలోనే మారన్న, జక్కులును చంపాలని భావించిన విషయం జక్కులు తెలుసుకొని మైసమ్మ కొలుపులో గుర్రంపై వచ్చి తన తాత పెద్దజక్కులు నరికిన కత్తితో దున్న తలను నరికివేస్తాడు. ఆ సంఘటనతో వారిని వారు కాపాడుకోగలిగారు.

అస్పృశ్యత, అంటరానితనం, కుల వివక్ష పేరుతో సమాజం వారిని వెలివేసిన వాళ్ళు ఎంతో ఓర్పు సహనంతో బ్రతికినారు తప్పా, వ్యతిరేఖంగా తిరగబడలేదు. సమాజంలో ముస్లింలు మాత్రమే మాదిగ వారిని ఆదరించారని జక్కులు నవలలో రచయిత ఎంకక్క, హుస్సేన్‌ల వివాహం ద్వారా మరియు రజాకార్లు జక్కులును పెంచుకుంటాం వస్తావా అని అడిగిన విధానం ద్వారా తెలిపే ప్రయత్నం చేశారు రచయిత.

సమాజంలో దళితులు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా, ప్రధాన జీవన విధానానికి దూరం అయిన వీరు సమాజంతో ఎదో ఒక రకంగా మమేకమై జీవనం సాగిస్తూ సేవలు చేసారు. ఆనాటి గ్రామీణ జీవితంలో మాదిగల పాత్ర విశిష్టమైనది. వీరిపై గ్రామంలోని మునసబులు, పట్వారీలు, పటేల్‌ల కంటే కూడా అగ్రవర్ణాల పీడన అధికంగా ఉండేది. వారిపై జరిగే అన్యాయాలను ఎదుర్కోవడంలో అహింసా మార్గాన్ని అవలంభించారు తప్పా హింసను ప్రేరేపించలేదు. ఇది ఈ జక్కులు నవల విశిష్టత.

ఉపకరించిన గ్రంథాలు :

1. ప్రాంతీయ చైతన్యం తెలంగాణ సాహిత్యం-కాత్యాయనీవిద్మహే
2. ఆంధ్రప్రదేశ్ దళితులు,కలేకూరి ప్రసాద్
3. అభినవ దృక్పథం-బన్నఅయిలయ్య
4. స్త్రీవాద కవిత్వం భాష,వస్తు,రూప, నవీనత.డా॥ఎమ్.ఎమ్.వినోదిని.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – వస్తు వైవిధ్యం

– డా॥. *వసగడుకుల శివాజీ,* తెలుగు లెక్చరర్, వి.కె.వి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట, బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా.

సాహిత్యంలో వస్తువు శిల్పం అనే రెండు అంశాలు ప్రధానంగా ఉంటాయి. కవి లేదా రచయిత ఏ విషయాన్ని ప్రధానంగా చెప్పదలచుకుంటాడో అది వస్తువు. ఎంచుకున్న వస్తువును రచనలో అభివ్యక్తికరించే విధానమే శిల్పం. వస్తు శిల్ప సమ్మేళిత రూపమే సాహిత్యం.

కవి తాను చూచిన లేక వినిన విషయాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దితే అది వస్తువు అవుతుంది అ వస్తువుకు తొలి రూపం విషయం. వస్తువు మొక్క ముఖ్య ప్రయోజనం కవి సందేశాన్ని పాఠకులకు అందించటమే.. అది ఎవరో ప్రభోదిస్తున్నట్లు కాక రచనలో నుండి సహజంగా ఉద్భవించాలి. కళలో రచాయిత వస్తువు విషయంలో చూపే సంవేదన చేత కలుగుతుంది అప్పుడే కవి రచన కోసం తీసుకున్న విషయం వస్తువుగా మారినట్లు మనం గణించాలి. సమాజంలో నుండి వస్తువు ఎన్నుకోబడుతుంది అందుకే మానవుడు అతని సామాజిక జీవితం మానవ సంబంధాలు, మనుష్యులు మధ్య వైరుధ్యాలు మొదలైనవి సాహిత్యంలో కనిపిస్తాయి. వీటన్నింటి కళాత్మక ప్రతిఫలమే సాహిత్యములో వస్తువు అవుతుంది.

తిరుగుబాటు :

ఏ విషయంలోనైన ఓర్పుకు సహనానికి ఒక హద్దు ఉంటుంది. వాటి స్థాయి దాటిపోయినప్పుడు తిరుగుబాటు మొదలవుతుంది. ఎదుటి పక్షంపై సైద్ధాంతికంగా ఎదురుదాడికి దిగడమే తిరుగుబాటు అవుతుంది. తమ కళ్ళముందే తమకు అన్యాయం జరుగుతున్నప్పటికి దళితులు నోరు మెదపలేకపోయారు. తమపై జరుగుతున్న వివక్షలకు అవమానాలకు మూలాలను తెలుసుకోగలిగిన తరువాత దళితులు వాటిపైన సైద్ధాంతిక తిరుగుబాటు చేయటానికి వెనుకాడలేదు. అనేక అంశాలపై తమ తిరుగుబాటును ప్రకటించారు.

హిందూ గ్రంథాలు :

వేధాలు, పురాణాలు, ఇతిహాసాలు మొదలైన వాటిని పవిత్ర గ్రంధాలుగా హిందూ సమాజం విశ్వసిస్తుంది. వాటిలో నిర్దేశించిన సామాజిక వ్యవస్థను అమలు పరుస్తు కొన్ని పురాణ పత్రలకు దైవికతను ఆపాదిస్తున్నారు. ఆనాటి సమాజ ధర్మానికి ఎదురు తిరిగిన వారిని అశురులుగాను, దుష్టులుగాను, నీచులుగాను చిత్రించారు.

పౌరాణిక కధల్ని అందులోని పత్రల్ని వారసత్వంగా తెచ్చుకుని సమాజం వ్యవస్థను నిర్మించుకుంది హిందువులు తమ సామాజిక వ్యవస్థను పరమపవిత్రంగా బావిస్తారు. కులానికి దైవిక ప్రాతిపదికను ఆస్వాదిస్తారు అందువల్ల మీకు కులాన్ని నిర్మూలించాలంటే దానికి ఆధారంగా కల్పించబడ్డ దైవికతను, పవిత్రను ముందు నిర్మూలించవలసి ఉంది అంటే శాస్త్రలమొక్క వేదాల మొక్క అధికారాన్ని నిర్మూలించాలన్నమాట అని అంబేడ్కర్ స్పష్టం చేసారు. కులనిర్మూలన జరగాలంటే హిందూ పవిత్ర గ్రంధాల మొక్క ప్రామాణికతను గూర్చి నిజనిజాలను ప్రజలకు తెలిపి వారిలో చైతన్యాన్ని నింపాల్సి ఉందని అంబేడ్కర్ మాటలను బట్టి తెలుస్తున్నది.

పగడాల నాగేంద్ర రచించిన గాయాన్ని విభజించకు అనే కండిక అటువంటి వాటిలో ఒకటి

మాల వాడల్లోంచి దొమ్మరి గుడిసెల్లోంచి ఠీవిగా నడిసొచ్చి
వర్ణాశ్రమ ధర్మాలమీద, కుఠిల నీతి సూత్రాల మీద
పవిత్ర గ్రంధాల మీద్ణ ప్రాతివ్రశ్య,హర్మ్యాల మీద
వీర్యస్కలనం చేసిపోదం

1. విమర్శ కళాతత్వ శాస్రలు : ముదిగొండ వీరభద్రయ్య పుట.199 2. కులనిర్మూలన - అంబేద్కర్

పుట. 61, పేజి : 1, 3. పదునిచ్చిన పాట(సంకలనం) - పుట.246.

దళితులను అంటరానివారిగా దూరంగా ఉంచిన హిందూ గ్రంధాలపై కవి తీవ్రమైన ఆక్రోశాన్ని వ్యక్తం చేసాడు. వర్ణాశ్రమ ధర్మాలు, కుతిలమైననీతుల వలన శిక్ష అనుభవిస్తున్నది దళితులే. అందుకే వాటి పవిత్రతా ప్రామాణికతను ప్రశ్నించాడు కవి. వీర్యస్కలనం చేసి పోదం అనే మాటల్లో తిరుగుబాటు తీవ్రత కనిపిస్తుంది.

ఎన్.రవికుమార్ రచించిన - మనోగాడు చావలేదూ అనే కండికకూడ ఈ సందర్భంలో ప్రస్తావించదగినదే.

వాడి చరిత్ర
చెట్టు చాటుగా నక్కి
వాలిని వధించిన చరిత్ర
సామ్రాజ్య కాంక్షతో బలిని భూమిలో తొక్కిన చరిత్ర
ఏకలవ్యుడి వ్రేలుని
కుత్రపూరితంగా కోరిన చరిత్ర

చరిత్రలో దళితుడు ఏ విధంగా చిత్రించబడ్డాడో ఈ కవితలో తెలుస్తుంది. వాలి, బలి,ఏకలవ్యుడు వీరు ముగ్గురు ఆదిపత్యం కింది నలిగినవైనం ఇక్కడ కనిపిస్తుంది. చరిత్రలో వీరు ముగ్గురూ దగాకాబడిన వారైనప్పటికి అవతలి వ్యక్తులకే కీర్తి దక్కటం విశేషం. గత చరిత్ర అంత దళితులను కుట్రపూరితంగా నెట్టి వేసింది అనే వాస్తవాన్ని కవి బయటపెట్టాడు.

ఇదే విషయాన్ని మరికొంత పదునుగా చెప్పిన కవిత శివసాగర్ రచించిన- నడుస్తున్న చరిత్ర-

శంభూకుడు పెదాలమీద చిరునవ్వుతో
రాముణ్ని వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని బొటనవ్రేలును
గొడ్డలితో నరుకుతున్నాడు
బలి తన చిరుపాదాలతో వామనుణ్ని
పాతాళానికి తొక్కేస్తున్నాడు
మనువు కళ్ళల్లో సూదులు గుచ్చుకుని
నాలుక తెగ్గొసుకుని
ెవిలో సీసం పోసుకుని
స్మశానంలో దొర్లుతున్నాడు
కాలం కసాయి కత్తిమీద నలబడి
గద్దిస్తున్న చండాలుడు
శంఖరునిపై నాలుగు వేట కుక్కల్ని ఉసిగొలుపు తున్నాడు
ఓహు...!
ఇప్పుడు నడుస్తున్న చరిత్ర
పరమచండాల చరిత్ర ..

పురాణ ఇతిహాసాలపై తిరుగుబాటు ఈ కవితలో స్పష్టంగా కనిపిస్తుంది. దగా కాబడిన పురాణ పాత్రలు తమపై అవమానవీయదాడికి తెగబడ్డ వారితో ప్రతి కారానికి పూనుకున్నట్లుగా ఈ కవిత ఉంది. పురాణ పాత్రలను తలకిందులుగా మార్చిన కవి వివక్షకు గురైన పాత్రలకు ఔన్నత్యాన్ని పెంపొందించాడు. నాటి చరిత్రలో దళితుడికి స్థానం లేకపోయిన ఇప్పుడు నడుస్తున్న చరిత్ర మొత్తం దళితుడుదేనన్న ఆత్మవిశ్వాసం ఈ కవితలో కనిపిస్తుంది.

కుల వివక్ష :

భారతీయ సామాజిక వ్యవస్థ కులం పునాదులపై నిర్మితమైంది. నిచ్చెన మెట్ల వ్యవస్థలో అట్టడుగున ఉన్నవారు దళితులు వీరికి పైన ఉన్నవారు దళితులకు కొన్ని నీచమైన పనులను కేటాయించి వారిని అంటరాని వారిగా చూస్తున్నారు. దళితులు దాదాపు అన్ని రంగాలలో వివక్షను అనుభవిస్తున్నారు. ఏళ్ళ తరబడి ఉన్న ఈ అంటరానితనం, వివక్షలు అంతం కాకపోగా ఆధునిక కాలంలో అది రంగు, వేషం మార్చుకుని ఇతర రూపాలలో పరిభ్రమిస్తున్నాయి. ఒక మనిషి తనలాంటి మరో మనిషిపై వివక్ష చూపడాన్ని దళితులు తమ కవిత్వంలో ఎండగట్టారు.

శిఖామణి రచించిన ఇనుప పాళీలు మొలుచు కొస్తున్నాయ్ అనే ఖండిక అలాంటి వాటిలో ఒకటి.

గాడిదల తోకలకు కట్టినట్లు
తాటాకులు మా మొలలకు కట్టి
ఈ నేల మీద నీరు చెరిపేసిన
మా కోటాను కోట్ల పాదముద్రలు
ఒకొక్కటి ఒక్క ఉక్కుపాదమై
సిద్ధంగా ఉన్నాయి
మా మూతులకు కట్టిన
ముంతల్లో మేము ఉమ్మిన ఉమ్ము
ఇప్పటికి భద్రంగానే ఉంది
దాన్ని పారబోసే రోజు వచ్చింది
అ వెల్లువలో పూచికపుల్లలై
మీరు కొట్టుకపోక తప్పదు

దళితులను అంటరాని వాడిగా చూడటమే కాకుండ వారి పాదముద్రలు కూడ నేలపైన కనిపించకుండ వారి మొలలకు తాటాకులు కట్టారు. వాళ్ళ ఉమ్మి సైతము గాలిని కలుషితం చేస్తుందనే నెపంతో మూతికి

ఉమ్మి ముంత కట్టారు. ఈ హేయమైన అమానవీయ మైన చర్యను దళితులు వేల సంవత్సరాలుగా భరిస్తూనే వచ్చారు. ఇలాంటి అనేక అనేక అవమానాల పరంపర దళితుల్లో ప్రతిఘటన చైతన్యానికి అంకురార్పణ చేసింది. ఈ అవమానాలనే ఆయుధాలుగా మలుచుకొని తిరగబడటానికి దళిత కవులు సిద్ధమయ్యారు.

మనువాదం :

కుల వ్యవస్థకు బలమైన పునాదులు వేసినవాడు మనువు. రాజ్యాధికారం బ్రహ్మణుల, క్షత్రియుల అదుపులో ఉంచే ఉద్దేశ్యంతో మనువు చాతుర్‌వర్ణ వ్యవస్థను ఏర్పాటు చేసాడు.

మను సృష్టించిన మనుధర్మశాస్త్రం మానవ ధర్మాలకు ఆటంకంగా మారింది. స్త్రీలను అస్వాతంత్రులను చేసింది. శూద్రులను, పంచములను పశువుల కంటే హీనులను చేసింది.బ్రహ్మణ వర్గాల ఆదిపత్యానికి ¬దళితుల బానిసత్వానికి కారణమైన మనుధర్మశాస్త్రాన్ని అంబేడ్కర్ 1927 డిసెంబర్ 25న బహిరంగంగా దహనం చేసారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఒక సామాజిక తిరుగు బాటుకు ప్రేరణగా మారింది. అంబేడ్కర్ ఆలోచన విధనాలపై నిర్మితమైన దళిత వాదం మనుపైనా మనుధర్మశాస్త్రంపైన కవిత్వ యద్ధం ప్రకటించింది.

ఇందుకు సంబంధించిన కవితలు తెలుగులో విరివిగానే వెలువడ్డాయి. ఇలాంటి బలమైన ఖండికల్లో ఇందురి సుధాకర్ ప్రకటించిన - నెత్తుటి ప్రశ్న ఒకటి

నెనింకా నిషిద్ధ మానవుణ్నే
నాది బహిశృతశ్వాస
నా మొలకు తాటాకు చుట్టి
నా నోటికి ఉమ్మి ముంత కట్టి
నన్ను నలుగురిలో
అసహ్య జంతువును చేసిన మనువు
న నల్లని నుదిటి మీద బలవంతంగా
నిషిద్ధ ముద్ర వేసినప్పుడే
నా జాతంత
క్రమక్రమంగా హత్యచేయబడింది
ఇప్పుడు కొత్తగా చావటమేంటి ?

ఒక జాతి క్రమక్రమంగా ఎలా అణచివేయబడిందో దానికి గల కారణాలను కవి ఈ కవితలో వివరించాడు. సమాజం ఎంత అధునికం అయినప్పటికి దళితులు ఎంత ఉన్నతిని సాధించినప్పటికి ఇంక నిషిద్ధ మానవుని గానే ఉన్నాడు. ఎలాంటి గుర్తింపుకు నోచుకోక జాతంత ఆనాడే హత్య చేయబడిందని ఇప్పుడు కొత్తగా చావటం లేదని కవి తన ఆవేదనను బయటపెట్టాడు. దీనికంతటికి కారణంమనువేనని కవి ఆరోపించాడు.

వర్ణధిత్య భావాజాలం :

బ్రాహ్మనోస్య ముఖమాసిత్ బహు రాజన్య కృతహ
ఊరూ తదస్యయత్వైశ్యహ పధాగ్య శుద్రోఅజాయత

రుగ్వేదం 10వ మండలంలోని పురుషసుక్తం ఇది ఈ సూక్తమే కుల విభజనను చేస్తూ వర్ణ వ్యవస్థను నిల బెట్టింది. బ్రహ్మ ముఖం నుండి బ్రహ్మణులు, భుజాల

నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు,పాదాల నుండి శూద్రులు పుట్టారని పై శ్లోకం తెలియజేస్తుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చాతుర్వర్ణం మయాస్పష్టమని బోధించాడు. అగ్రస్థానం ఉన్న బ్రాహ్మణులు సాంఘికంగా అందరికంటే ఉన్నత స్థానంలో ఉండి సమాజాన్ని శాసించారు. మిగిలిన వర్ణాలపై వారు చూపించిన వర్ణాధిపత్యం నేటికి కొనసాగుతుంది. గతంతో పోల్చుకుంటు బ్రాహ్మణుల సంఖ్య సమజంపై వారి ఆధిపత్యం నేటి ఆధునిక సమాజంలో కొంత మేర తగ్గిన మాట వాస్తవం అయితే ఈ ఆదిపత్య భావాజలన్ని మిగిలిన వర్ణాల వారు అందిపుచ్చుకుని తమ కింది వర్ణాలపై చెలాయించటం జరుగుతుంది. దీనిని బ్రాహ్మణీయ వర్ణాధిపత్య భావాజాలంగా దళిత కవిత్వం గుర్తించింది.

సంప్రదాయ సాహిత్యం :

సంప్రదాయ తెలుగు సాహిత్యంలో దళితుడిఇకి సరైన స్థానం లేకపోయింది. అట్టడుగు వర్గాల వారికి ప్రాచీన కాలం నుండి సాహిత్యమనేది లేకపోలేదు. నిమ్న కులాల సాహిత్యమంతా ఆశు సంప్రదాయాన్ని పాటిస్తూ పాటల రూపంలో పాల రూపంలో కీర్తనల రూపంలో గేయాల రూపంలోనే వుంది.అగ్రకుల సాహిత్యమంతా లిఖిత రూపంలో వుంది. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం లిఖిత రూపంలో వున్న బ్రాహ్మణ సాహిత్యమే అని ప్రముఖ దళిత కవి ప్రసాదమూర్తి తన పరిశోధనా గ్రంథంలో పేర్కొన్నాడు.

లిఖిత రూపంలో ఉన్న సాహిత్యమ ప్రామాణిక సాహిత్యంగా చలామణి అయింది. సంప్రదాయ సాహిత్యం భక్తి,శృంగారానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. అష్టాదశ పర్ణనలు,అలంకారాలు, కావ్య లక్షణాలు, ఛందస్సూ లాంటి అనేక నియమాలు విధించటం వల్ల సాహిత్యం అట్టడుగు వర్గాల ప్రజలకు దూరమైంది. సంప్రదాయ సాహిత్యం దళితులను దూరంగా ఉంచినట్లు దళిత కవులు గుర్తించారు. ఈ నేపద్యంలో సంప్రదాయ సాహిత్యంపై తిరుగుబాటుకు పూనుకున్నారు.

ఇప్పుడు ద్విజుడి వేషాన్ని ధిక్కరిస్తూ
చండాలుడా!
పద్యంలోకి వైతాళికుడవై రా!
నిను బహిష్కరించినన చరిత్ర చెవుల్లో
సల సల కాగే సీసాన్ని పోద్దపు రా
వర్తమాన మనుపు నోట్లో
ఉచ్చ పోసేందుకు రా !

ముద్దుకృష్ణ - వైతాళికలు పేరుతో సంకలనాన్ని వెలువరించాడు. అందులో తెలుగు సాహిత్యం ఆనాటి ప్రముఖ ఆధునిక కవితలన్నీ చోటుచేసుకున్నాయి. ఆధునిక పద్య కవిత్వంలో సిద్ధహస్తునిగా పేరుగాంచిన జాషువాకు ఈ గ్రంథంలో చోటు దక్కలేదు. సాహిత్యంలో కూడ ఈ రకమైన వివక్ష ఉండడాన్ని కవి తీవ్ర స్వరంతో వ్యతిరేకించాడు. అందుకే ద్విజుడి వేషాన్ని ధిక్కరించమని, వైతాళికుడిగా పద్యంలోకి రమ్మని కవి చండాలుడిని ఆహ్వానించాడు. ఇన్నాళ్ళు దళితుణ్ణి బహిష్కరించిన చరిత్ర చెవుల్లో సీసం పోయమన్నాడు. మునువు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న వర్తమాన మనువు నోట్లో మూత్రం పోయమంటూ కవి తీవ్రమైన ఆక్రోశాన్ని వెల్లగక్కాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాయలసీమ కథల్లో దళిత జీవనం

- డా॥. సంగుల సునీల్ కుమార్, అతిథి ఉపన్యాసకులు తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

రాయలసీమ నిటికి కరువేమోగానీ సాహిత్యానికి కాదు. అయితే ప్రాచీన సంప్రదాయక సాహిత్య ఆనవాళ్ళ నుండి ఆలస్యంగా బయటపడ్డ కారణంగా ఆధునిక సాహిత్య ప్రక్రియల్ని అందుకోవడంలో మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే రాయలసీమ నడక కాస్తనిదానమే అని చెప్పాలి. ''ప్రబంధ సాహిత్యం పట్ల ఎల్లలు లేని వ్యామోహం, సమకాలీన భాషపట్లా, జీవితంపట్లా నిరసనా కల్పనా సాహిత్యం రాయలసీమలో ఉద్భవించటానికి అడ్డునిలిచాయని'' రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ - వల్లంపాటి వెంకట సుబ్బయ్య చెప్పిన మాటలు నిజమేనని అనిపిస్తాయి.

కథా సాహిత్యం విషయానికొస్తే తొలి తెలుగు కథానిక గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు' 1910 వ సంవత్సరంలో వెలువడింది. రాయలసీమలో మాత్రం మూడు దశాబ్దాల కాలం పట్టింది. ఇక్కడ తొలికథగా జి. రామకృష్ణ రాసిన 'చిరంజీవి' 1941లో విజయవాడ పత్రికలో వెలువడింది.

స్వాతంత్ర్యానంతరం రాయలసీమ వెనుకబాటు తనాన్ని ఇక్కడున్న కవులు, రచయితలు గుర్తించడం మొదలు పెట్టిన తార్వాత రాయలసీమ ప్రాంతం నుండి గొప్ప ఆధునిక సాహిత్యం రావడానికి అవకాశం ఏర్పడింది. కె. సభ, మధురాంతకం రాజారాం, నాదముని రాజు, రాచుమల్లు రామచంద్రారెడ్డి. వల్లంపాటి వెంకటసుబ్బయ్య, పులికంటి కృష్ణారెడ్డి, సింగమనేని నారాయణ, కేతు విశ్వనాథ రెడ్డి, బండి నారాయణ స్వామి, రాసాని వంటి రచయితలు మూడు దశాబ్దాల పాటు రాయలసీమలో కథా రచనలో జరిగిన జాప్యాన్ని పూడ్చే ప్రయత్నం చేశారు. కరువు, ఫ్యాక్షన్, రైతుల కష్టాలు, వలస జీవితాలు, గ్రామీణ అట్టడుగు వర్గాల జీవితం వంటి అంశాల కథల్లో వస్తువులయ్యాయి.

దళిత సాహిత్యం విషయానికొస్తే, కులవ్యవస్థ పునాదిగా కలిగిన భారతదేశంలో వేలయేండ్లుగా అస్పృశ్యతను అనుభవిస్తూ సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో దోపిడీకి గురవుతున్న వారిని దళితులుగా చెప్పవచ్చు. దళిత వాదం ప్రధానంగా కవిత్వంలో ప్రతి బింబించింది. దళితుల జీవితాల్లో దాగిన అనేక జీవిత పార్శ్వాలను కథా సాహిత్యం అక్షరబద్ధం చేసింది.

రాయలసీమలో తొలి కథగా చెప్పబడుతున్న జి. రామకృష్ణ 'చిరంజీవి'లో ఉన్నది దళిత జీవిత ఇతివృత్తమే. వెంకటరాముడు అనే దళితుడు రెడ్డిగారి ఇంట్లో తన ముత్తాత చేసిన 60 రూపాయల బాకీకిగానూ నేటికి కట్టు బానిసగా మారి జీవితాన్ని వెల్లదీయడం ఈ కథలో కనిపిస్తుంది. అయితే ఈ కథ రాసిన రామకృష్ణ దళితేతరుడు. కాబట్టి ఈ కథను దళిత సంఘీభావ కథగానే మనం స్వీకరించవచ్చు. పరిశోధనా వ్యాసం పరిమితి దృష్ట్యా రాయలసీమ దళిత కుటుంబాలలో పుట్టి, దళిత జీవిత ఇతివృత్తాన్ని తీసుకొని కథా రచన చేసిన వారి కథలను మాత్రమే రాయలసీమ దళిత కథలుగా స్వీకరించి ఈ పత్రాన్ని సమర్పిస్తున్నాను.

పంచమం నవలా రచయితగా తనకంటూ ఒక గుర్తింపును ఏర్పరచుకున్న వారు చిలుకూరి దేవపుత్ర. చదువకున్నది ఎస్.ఎస్.ఎల్.సి. దాకనే అయినా, జీవితం స్వీయ అనుభవాల ద్వారా అపార జ్ఞానం సంపాదించారు. భారదేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా అయిన అనంతపురం జిల్లాలో అందునా దళిత కుటుంబంలో పుట్టిన దేవపుత్ర గొప్ప రచయితగా ఎదగడం పెద్ద విశేషమే. 120 కి పైగా కథలు రాసిన ఈయన ఆరు గ్లాసులు, ఏకాకినొక చప్పుడు, వంకర టింకర, బండీ అనే నాలుగు కథా సంపుటాలను వెలువరించారు.

దళిత వాదం అంత బలంగా వ్యాప్తి చెందడానికి పూర్వమే చిలుకూరి దేవపుత్ర దళితుల జీవన వేదనను తన కథల్లో ప్రతిబింబింపచేశారు.

ఈయన రాసిన 'ఊడలమర్రి' కథను పరిశీలించి నట్లయితే దళితులకు పంచాయితీ ఎన్నికలలో రిజర్వేషన్ అమలయిన తొలి రోజుల్లో, దళితుల రాజకీయ హక్కు లను సైతం అగ్రవర్ణ భూస్వాములు తమకు అను కూలంగా మలచుకొని గ్రామీణ ప్రాంతాలలో అధికారం చలాయిస్తూ దళితులను పావులుగా వాడుకుంటున్న పరిస్థితిని మన కళ్ళముందుంచాడు.

ఈ కథలో 35 సంవత్సరాలుగా సర్పంచిగా ఉంటూ చుట్టు పక్కల గ్రామాలపై ఆధిపత్యం ప్రదర్శించే వాడిగా భీమప్ప కనిపిస్తాడు. కొత్తగా గవర్నమెంట్ దళితులకు రాజకీయ హక్కులను కల్పించే ఉద్దేశంలో భాగంగా ఆ పంచాయితీని దళితులకు రిజర్వ్ చేయడం వల్ల భీమప్ప ఆ ప్రాంతం నుండి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. అయితే తన ఇంట్లోనే జీవితానికి పనిచేసే దళితుడైన ఓబులేసును తన క్యాండెట్‌గా ఎలక్షన్‌లో నిలబెట్టాడు. పేరుకు ఓబులేసును నిలబెట్టి పెత్తనం మాత్రం తన చేతుల్లోనే ఉంచుకొనే రాజకీయ వ్యూహాన్ని భీమన్న అమలు చేశాడు. ఓబులేసు చేస్తున్న పనిని, అతని అవతారాన్నిసూసి విస్తుపోయిన ఎలక్షన్ స్టాఫ్‌తో భీమప్ప ఇలా అంటాడు.

"ఈ గుడ్డి గవర్నమెంటు రిజర్వేషన్ పెట్టిందే ఏం జేసేది మల్ల.... ఎవరో మాల మాదిగ నాయాండ్లు? ఓట్లేపిట్టి గెలిపిస్తే కొమ్ములు మొలుసుకొచ్చి మనల్నే కుమ్ముతారని నాకు బాగా తెలుసు సార్! అందుకే మా జీతగానితోనే నామినేషన్ ఏపించినా... ఎట్లా ఈనాకొడుకు మాల నాయాలే! ఈడయితే మనం యాడుండమంటే అడపడి వుంటాడు. చెప్పలిడిసే జాగాలో కూచ్చోమంటే గమ్మున కూచ్చుంటాడు." ఈ మాటల్లో దళితులను హీనంగా చూడడమే కాకుండా, అగ్రకుల కరుడుగట్టిన కులతత్వ వాదిగా భీమప్ప కనిపిస్తాడు. దళితులను రాజకీయంగా అణగదొక్కుతూ వారి అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకొని వారి రాజకీయ హక్కులను కాలరాస్తున్న వైనాన్ని రచయిత ఇందులో ఎండగట్టాడు.

ఎన్నికల్లో ఓబులేసు గెలుస్తాడు. ప్రమాణ స్వీకారం చేసేందుకు భీమప్ప ముందు కుర్చీలో కూర్చొనేందుకు సంకోచిస్తాడు. ఎలక్షన్ ఆఫీసర్ ఎంత పిలిచినా రాడు. తాను భీమప్ప ముందు కుర్చీలో కూర్చుంటే తర్వాత పరిణామాలు ఏంటో ఓబులేసుకు తెలుసు అందుకే రాలేకపోయాడు. భీమప్ప కంబళ్ళు, చాపలు తెప్పిస్తా కింద కూర్చొని ప్రమాణ స్వీకరం చేయించమని ఉచిత సలహా కూడా ఇస్తాడు. అందుకు ఎలక్షన్ ఆఫీసర్ నిరాకరిస్తాడు. ఎలక్షన్ ఆఫీసర్ భీమప్పను ప్రేక్షకుల్లో నిలబడమని చెప్పి ఓబులేసుతో ఆనవాయితీ ప్రకారం ప్రమాణ స్వీకారం చేయిస్తాడు. కులం తక్కువ వాడిగా, జీతగాడిగా ఉన్న ఓబులేసు రాజకీయ అధికారం పొంది తన ముందు కుర్చీని ప్రమాణ స్వీకారం చేయడం భీమన్న సహించు కోలేకపోతాడు. అందుకే చేలకోలు తీసుకొని ఓబులేసును చితకకొడతాడు.

ఊడల మర్రి కింద ఏ మొక్క ఎలాగైతే బతకలేదో కులవ్యవస్థ ఊడల మర్రిగా వ్యాప్తి చెందిన ఈ సమాజంలో అణగారిన జాతులు బలైపోతున్న వాస్తవ పరిస్థితులను చిలుకూరి దేవపుత్ర వివరించారు.

సమిధలు ఆయుధం, విలోమం వంటి గొప్ప దళిత కథలను చిలుకూరి దేవపుత్ర రచించాడు. అగ్రకుల సంపన్నుల రాజకీయ సరదాలలో దళితులు బలై పోవడాన్ని 'సమిధలు' కథ ప్రతిబింబించింది. ఫ్యాక్షనిస్టుల మాయలోపడి అవసరానికి మించి ప్రభుభక్తిని ప్రకటించి ప్రాణాలు కోల్పోయే దళితుల అజ్ఞానాన్ని 'ఆయుధం' కథ ఆవిష్కరించింది. దళిత విద్యావంతులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను చూసి ఇంతకాలం దళితుల్ని ద్వేషించిన అగ్రకులాలు ఇప్పుడు మాత్రం వారితో పెళ్ళి సంబంధాలకు సైతం ఎలా సిద్ధమవుతారో 'విలోమం' కథ ద్వారా చెప్పాడు.

చిలుకూరి దేవపుత్ర కుమార్తె అయిన చిలుకూరి దీవెన కూడా దళితుల సాదక బాధల్ని కథలుగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. ఆమె రాసిన 'ఆటపట్టు' అనే కథలు కులవ్యవస్థ పునాదిగా కలిగిన భారతదేశంలో జాతీయ క్రీడల్లోనూ, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడల్లోనూ కులాధిపత్యం కారణంగా దళిత బహుజనులకు ప్రతిభ ఉన్నా వారికి అవకాశాలు దూరం అవుతున్న విషయం తెలిపారు. దళిత బహుజనులను కూడా ప్రోత్సహించి ఒలింపిక్స్ వంటి క్రీడలకు ఎంపిక చేస్తే మరిన్ని పథకాలను సాధించే అవకాశం ఉందని ఈ కథ ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు.

తెలుగునాట దళిత వాదం ప్రారంభదశలో కథ, కవిత్వం వాహికగా తనదైన దిక్కార స్వరంతో ముందుకు కదిలిన కవి, రచయిత, దళిత ఉద్యమ కారుడు నాగప్పగారి సుందర్రాజు. దళితుల జీవన వైవిధ్యాన్ని ముఖ్యంగా రాయలసీమ గ్రామీణ ప్రాంతాలలోని మాదిగల సామాజిక, సాంస్కృతిక జీవితాన్ని 'మాదిగోడు' కథల ద్వారా అభివ్యక్తం చేశాడు. 'మాదిగోడు' కథలను రాయలసీమ కర్నూలు జిల్లా ఆలూరు ప్రాంతం గ్రామీణ దళిత వ్యవహార భాషలో రాశాడు. 'మాదిగోడు' కథా సంపుటి భాష, భావం పరంగా రాయలసీమ కథా సాహిత్యంలో ఒక విప్లవంగా చెప్పవచ్చు. సుందర్రాజు జీవించిన కాలం తక్కువే అయినా దళిత బహుజన సాహిత్యాన్ని కొత్త ప్రమాణాలతో ముందుకు నడిపిన వాడిగా మనకు కనిపిస్తాడు. మాదిగ మూలాల్లోకి వెళ్ళి వారి జీవితాన్ని యధాతధంగా సాహితీకరించిన వాడు నాగప్పగారి సుందర్రాజు.

దళిత స్త్రీ ఎదుర్కొంటున్న లింగ, కుల వివక్షలను దోపిడీలను "మద్దికేరి మార్తమ్మ కత యంత మందికి తెలుసప్పా" కథ ద్వారా తెలిపాడు. ఇది కథ కాదు. కర్నూలు జిల్లా మద్దికేరి దళితవాడలో జరిగిన యదార్థ ఘటనకు కథా రూపం.

మద్దికేరి గ్రామంలో ఎర్రన్న దళితుడు. అక్కడ వైశ్యుల పిండి జన్నాలో వారి దగ్గర నమ్మకస్తుడిగా పని చేస్తూ తన రెక్కల కష్టంతో వైశ్యులు ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో తోడ్పడ్డాడు. ఒక రోజు పిండి జన్నాలో పని చేస్తూ తన కాలును కోల్పోయి కుంటి వాడిగా మారి పోయాడు. తమ యజమానుల ఆస్థిపాస్తులు పెరగడానికి పరోక్షంగా సహాయపడ్డ ఎర్రన్నకు ఎలాంటి సాయం అందలేదు. ఇక్కడ ఎర్రన్న శ్రమ దోపిడీకి గురైనట్లు స్పష్టంగా కనిపిస్తుంది.

ఎర్రన్న కూతురు మార్తమ్మ. అమాయకురాలు, శ్రమజీవి. ఆ గ్రామంలో శివారెడ్డి, రాందాసు, ఖాజా అనే ముగ్గురు కలిసి వ్యాపారం చేస్తుంటారు. వీరు నిత్యం పిండి జన్నా దగ్గరే ఉంటూ ఆ అమ్మాయిని ఎలాగైన అనుభవించాలని చూస్తుంటారు. అయితే ఇలాంటి వాటికి స్పందించని ఉత్తమురాలు మార్తమ్మ వారికి దూరంగా ఉంటుంది. మగ్గురూ ఒక రోజున పథకం ప్రకారం ఆమె తండ్రి ఎర్రన్నకు వేరేపని మీద బయటకు పంపిస్తారు. పిండి జన్నాలో ఎవరూ లేనప్పుడు ముగ్గురు కలిసి మార్తమ్మను వరిపొట్టులో పడేసి నోటికి గుడ్డకుక్కి, చేతులు వెనక్కి విరచి కట్టి, ఒక తర్వాత ఒకరు ఆమెపై అతి పాశవికంగా అత్యాచారం చేశారు. అప్పటికే మార్తమ్మ చనిపోతుంది. ఆ ఘటన తర్వాత దళిత ఉద్యమాలు జరుగుతాయి. నిందితులు ఫలానా వారు అని తెలిసినా కూడా ఎప్పటిలాగా చట్టాలు, ప్రభుత్వాలు వారిని ఏం చేయలేకపోతాయి. దళితులకు, దళిత స్త్రీలకు ఈ కులవ్యవస్థలో భద్రత లేకపోవడాన్ని ఈ కథ ఎండ గట్టింది.

రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఇలాంటి ఘటనలు నేటికీ జరుగుతుండడం విచారకరం. ఇటీవల ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో దళిత యువతి మనీషా వాల్మీకి పై జరిగిన అత్యాచార ఘటనకు, మద్దికేరి మార్తమ్మ కథకు దగ్గరి పోలిక ఉండడం మనం గమనించవచ్చు.

ఊరికి బయట జీవం గడుపుతున్న దళితులకు అస్పృశ్యత కారణంగా ఎలాంటి రక్షణ లేదు. సామాజికంగా

బలవంతులైన అగ్రవర్ణాల చేతుల్లో దళితులు శ్రమ దోపిడీకి, శారీరక దోపిడీకి గురికాబడుతూ తమ మాన ప్రాణాలను సైతం కోల్పోతున్న పరిస్థితిని ఈ కథ తెలియజేసింది.

ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో కులం, మతం చొరబడుతున్నంత కాలం దళితులు, మైనారిటీలు అభద్రతతో బతకాల్సి వస్తుందనే విషయాన్ని ఈ కథ ద్వారా మనం గ్రహించవచ్చు.

వెట్టి చేయలేక పెద్దోళ్ళ అహంకారానికి, వెట్టి చాకిరీకి బలై నిస్సహాయ స్థితిలో వ్యధకు లోనై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం 'జోరెసావు' కథ చెప్తుంది.

ఓ వైపు దళిత జీవితాన్ని చెప్తూనే తాను రాయలసీమ రచయితగా కూడా తన అస్థిత్వాన్ని నిలుపుకొనే ప్రయత్నం చేశాడు. 'పోడేపోడు' కథలో "అక్కడ యక్కడో గుంటూరు తుక్క తుపాన్లు కురిసి వూర్లకు ఊర్లు వూరుసుకని పొయ్యేవునంట, ఈ నీళ్ళులేని కొంపలోనేమో వాండ్లు ల్యాక. తాగేకి నీళ్ళుల్యాక, పంట్లు పండక డొక్కలు కరువొచ్చి వున్నీన జనమంతా సచ్చిపోతుండారు" అంటూ రాయలసీమ కరువు వెతలను చెప్పాడు. ఇదే కథలో -

"మాదిగ్గేరి నిండా సెప్పులు కుట్టేవాళ్ళే. వొగిని కాళ్ళోనన్నా సెప్పులు వుండవు, యండ్లకి బయపడన్నా సెప్పులు యేసుకుందామని ఎవడాన్న సెప్పులు యేసుకుంటే 'ఈ మాదిగనాకొడుకులికి నెత్తికెక్కువ సెప్పులు యేసుకొని తిరుగుతార్రా నా కొడుకులు" అంటూ సిన్నా పెద్ద సూడుకోకుండా వూర్లో వోళ్ళంత యేకమయ్యి తంతారని బయపడి మాదిగోళ్ళు యెవుడు దేరుము సేసి సెప్పులు యేసుకొని తిరగడు" అంటాడు. ఈ మాటల్లో అగ్రకుల దాష్టీకాన్ని చెపుతాడు సుందర్రాజు. గ్రామాల్లో ఉండే దళితులు నిరంతరం భయపడుతూ బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న విషయాన్ని బట్టబయలు చేశాడు. 'మాదిగోడు' కథల్లో కేవలం అగ్రవర్ణాల పెత్తనాన్ని చెప్పడం మాత్రమే కాకుండా దళిత సంస్కృతిని, వారిలో ఉండే కళాత్మకతను ఈ కథల్లో సూటిగా చెప్తాడు.

రాయలసీమ నుండి విరివిగా కథలు రాస్తూ యువ రచయితగా మంచి గుర్తింపు పొందిన వ్యక్తి వేంపల్లి గంగాధర్. ఈయన కడప ప్రాంత జనవ్యవహార భాషను, జీవితాన్ని తన కథల్లో వినియోగించాడు. రావణ వాహనం కథలు, పాపిష్ని కథలు, గ్రీష్మ భూమి కథలు, దేవరశిల, మొలకల వున్నమి, వంటి కథా సంపుటాలను వెలువరించాడు.

వేంపల్లి గంగాధర్ 'నల్లఛత్రీ' సవర్ణులకు గొడుగులు పట్టీపట్టీ వారి ముఠాకక్షలకు, అగ్రకులాల రాజకీయ, ఆర్థిక ఆదిపత్యంలో నలిగిపోయిన దళిత జీవితాలను ఆవిష్కరించాడు.

ఈ కథలో రోశిరెడ్డి అనే అగ్రకుల భూస్వామి దగ్గర ఉంటూ ఆయనకు సేవ చేస్తూ ఉంటాడు కొండయ్య. వీరికి ముందుతరం అంటే కొండయ్య తండ్రి లింగన్న. రోశిరెడ్డి తండ్రి అంకిరెడ్డి దగ్గర సేవకుడిగా ఉండి, ఆయన ఎక్కడికి వెళితే అక్కడికి వెళుతూ తాను ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అంకిరెడ్డికి నల్ల ఛత్రీ పట్టేవాడు.

భూమి కోసం ఆరాటం, ఫ్యాక్షనిజం వల్ల అంకిరెడ్డిపై నాటు బాంబులతో ప్రత్యర్థులు దాడి చేస్తారు. ఈ దాడిలో అంకిరెడ్డితో పాటూ వక్కనున్న లింగన్న కూడా చనిపోతాడు.

అంకిరెడ్డి కొడుకు రోశిరెడ్డి. వారి ప్రత్యర్థి సిద్ధి నాయుడుకు రాజకీయ ఆధిపత్యం కోసం పోరు మొద లైంది. ఒకరిపై ఒకరు ఎత్తులకు పై ఎత్తులు వేసు కుంటున్నారు. ఈ క్రమంలో రోశిరెడ్డి సిద్ధినాయుడును దెబ్బతీసే ఉద్దేశంతో తన దగ్గర జీతగాడిగా పనిచేస్తున్న కొండయ్యను, అతని భార్య ఓబులమ్మను బలిపశు వులుగా వాడుకొనేందుకు వ్యూహం రచించాడు. దళితుల ఇళ్ళ దగ్గరికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన సిద్ధినాయుడు ఓబులవ్వపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించారని పోలీస్ స్టేషన్‌లో ఎస్.సి., ఎస్.టి., చట్టం కింద కేసు

పెట్టమని పంపాడు. కేసు మరింత బలంగా మార్చేందుకు చివరకు పోలీసుల అండతో తనకు ఎంతో నమ్మకంగా సేవ చేస్తున్న కొండయ్యను కూడా చంపించాడు రోశిరెడ్డి. చివరకు ఎమ్.ఎల్.ఎ. సమక్షంలో రెండు వైరి వర్గాలు రాజీకి వచ్చాయి. రోశిరెడ్డి ఏకగ్రీవంగా సర్పంచి అయ్యేందుకు ఒప్పందం కుదిరింది.

అయితే ఈ అగ్రకులాల రాజకీయ చెలగాటంలో బలైపోయింది మాత్రం దళితుడే. దళితుల రక్షణ కోసం ఉన్న ఎస్.సి., ఎస్.టి., చట్టాలను సైతం అగ్రవర్ణాలు తమ ఆధిపత్యం కోసం వినియోగించుకొని దళితుల్ని బలి పశువులు చేస్తున్న వైనాన్ని రచయిత ఈ కథలో ఎత్తి చూపించాడు.

వేంపల్లి గంగాధర్ రాసిన 'పొద్దు పుట్టింది', 'శిలబండి' వాడొక్కడు, తూరుపుకొమ్ములు వంటి కథల్లో దళిత జీవిత చిత్రణ కనిపిస్తుంది.

రాయలసీమ దళిత కథా రచయితల విషయానికొస్తే సంఖ్యాపరంగా తక్కువేనని చెప్పాలి. అక్కడక్కడ కొందరు కథలు రాస్తున్నప్పటికీ వారు అంత వెలుగులోకి రాలేదు.

రాయలసీమ కథా సాహిత్యంలో ప్రధానంగా గమనించాల్సిన విషయమేమిటంటే ఇక్కడ గొప్ప పేరు పొందిన కథా రచయితలు రాయలసీమ ప్రాంత ప్రజల జీవితాలను అనేక కోణాల నుండి ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే అనేక మంది దళితేతర రచయితలు రాయలసీమ గ్రామీణ ప్రాంతాలలో ఊరికి దూరంగా నివసిస్తూ అనేక అవమానాలకు, దోపిడీలకు గురవుతున్న దళితుల వాస్తవిక జీవితాలను కథలుగా మలిచే ప్రయత్నం చేశారు. ఈ కారణంగానేమో బహుశా దళిత కథకులు ఇక్కడ తక్కువగానే ఉన్నారని చెప్పాలి. అయితే ఉన్నంతలో దళిత కథ బలమైనదే. దళిత సంఘీభావ కథలతో పోల్చుకుంటే దళిత స్వానుభవ కథకు విశ్వసనీయత ఎక్కువని ఇక్కడ గమనించాలి. నాగప్పగారి సుందర్రాజు కథల్లోని భాష, యాస, చిత్రించబడిన సంస్కృతి, వాస్తవ జీవితం దళితేతరుల నుండి రావడమంటే కష్టమే. అయితే రాయలసీమ ప్రాంతం నుండి యువ దళిత కథకులు ప్రాతినిధ్యం చేయాల్సిన అవసరం ఉంది. వీరు మరింతంగా ముందుకు వచ్చి మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా దళిత కథానికలో కొత్త పార్శ్వాలను శోధించి కథలు రాయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ - వల్లంపాటి వెంకట సుబ్బయ్య, విశాలాంధ్రం పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు - 2006
2. తెలుగు కథ - దళిత, మైనారిటీ, గిరిజన, బహుజన జీవితం - డా॥ వి.ఆర్. రాసాని, విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లి - 2012
3. మాదిగోడు - నాగప్పగారి సుందర్రాజు, కురిని వ్యాలీ క్రానికల్స్, హైదరాబాద్, 2010
4. గ్రీష్మ భూమి కథలు - వేంపల్లి గంగాధర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2013
5. దళిత కథలు - 4, ఆర్థిక, రాజకీయ, కథలు - రమా పబ్లికేషన్స్, అనంతపురం, 1998
6. సాహిత్యం ప్రస్థానం (మాస పత్రిక) - జనవరి - 2020

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యంలో ముస్లిం సాహిత్యం

-షేక్ జలీన బేగం, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల, రాజమహేంద్రవరం.

హితాన్ని చేకూర్చేది సాహిత్యం. సమాజ శ్రేయస్సును కోరుకునేది సాహిత్యం. అంతేకాదు మనిషిలోని భావాలను, ఊహలను, అనందాలను, ఎదుర్కొనే బాధలను, అసమానతలను, వైరుధ్యాలను తెలిపే కళాత్మకమైన సాధనమే సాహిత్యం అని చెప్పవచ్చు.

20వ శతాబ్దం ఆరంభంలో కుల, మత, ప్రాంత, లింగ, జాతి, తెగల అస్తిత్వానికి సంబంధించి అనేక వాదాలు బయలుదేరాయి. తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం ఉద్యమించారు, హేతుబద్ధంగా ప్రశ్నించారు, తమ హక్కులను గుర్తు చేయడమే కాక వాటి సాధన కోసం శ్రమించారు. వారి గళానికి సాహిత్యాన్ని ఆయుధం లాగా ఎంచుకున్నారు. ఎందుకంటే ఏ ఉద్యమానికైనా సాహిత్యమే ఊపిరి. సాహిత్యమే ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపగలదు. ఇలాంటి లక్ష్యాలతో తెలుగు సాహిత్యంలో ప్రారంభమైనదే దళిత సాహిత్యం. 20వ శతాబ్ది ఆరంభంలో అస్పృశ్యులు, అంటరాని వారు, హరిజనులు అని వేర్వేరు విధాలుగా పేర్కొనబడిన వారు ఈనాడు దళితులు అని పేర్కొంటున్నారు. దళితుల గురించి దళితులు, దళితేతరులు రాసిన సాహిత్యం దళిత సాహిత్యం.

దళిత సాహిత్యం దళితుల అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటాల నుంచి పుట్టింది. కారంచేడు, చుండూరు, పందిరి కుప్పం మొదలైన చోట్ల దళితులపై జరిగిన దాడులు వారి అస్తిత్వాన్ని ప్రశ్నించాయి. ఈ నేపథ్యంలోనే దళిత కవులు తమ అస్తిత్వం గురించి తీవ్రస్థాయిలో కవితలు రాశారు.

ఇప్పుడు కరుడు కట్టిన భూస్వామ్య క్రౌర్యం
నా గుండెల మీద నాగేటి కర్రులతో
పచ్చబొడిసిన పేరు చుండూరు

ఇలా చుండూరులో దళితులపై జరిగిన దాడులను కలేకూరి ప్రసాద్ "పిడికెడు ఆత్మగౌరవం కోసం" కవితలో ఖండించారు.

రాజమండ్రిలో దళిత విద్యార్థులు, ఉపాధ్యాయులు కులం పరంగా అవమానించిన కారణంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ సంఘటనను సతీష్ చందర్ వారిని ఏకలవ్యుని వృత్తాంతంతో జతచేసి పంచముడంటే ఐదో వేలు లేని వాడనేనా అర్థం అంటూ ప్రశ్నిస్తూ రాసిన కవిత దళితులు ఎదుర్కొంటున్న వివక్షతకు ఉదాహరణగా నిలిచింది. ఇలా దళితుల అస్తిత్వం కోసం, ఆత్మ గౌరవం కోసం, అంబేద్కర్ ఆశయాల కోసం, అసమానతలు లేని తరాల కోసం దళిత సాహిత్యం నేటికీ పోరాడుతూ వుంది.

దళిత సాహిత్యంలో ముస్లిం సాహిత్యం :

దళితులపై జరిగిన దాడులను నిరసిస్తూ వచ్చిన దళిత సాహిత్యం, దానికంటే ముందే మహారాష్ట్ర దళిత సాహిత్యం నుంచి ప్రభావం పొందింది. దళిత బహుజనుల అభ్యున్నతి కోసం పోరాడి వారి కోసం పాఠశాలలని ఏర్పాటు చేసిన ఉద్యమకారుడు జ్యోతిరావ్ పూలే. అందుకే అంబేద్కర్ పూలే ను తన గురువుగా పేర్కొనడమే కాక అతని ఉద్యమ వారసత్వాన్ని అందుకున్నాడు. ఆ కాలంలోనే అంబేద్కర్ ఆశయాల కనుగుణంగా 1972లో బొంబాయిలో దళిత పాంథర్స్ ఆవిర్భవించింది. అంత వరకు దళితులు అంటే వున్న అర్థానికి ఇది విస్తృత అర్థాన్నిచ్చింది. దళితులంటే ఎస్సి, ఎస్టీలు మాత్రమే కాదు ఎస్సీ, ఎస్టీ, బీసీలు మరియు మైనారిటీలు, స్త్రీ లు అందరూ అని అర్థాన్నిచ్చింది. దీని ప్రకారం "తరతరాలుగా అస్పృశ్యతకు గురై మతం పేరిట సాంస్కృతికంగా ప్రధాన జీవన స్రవంతికి దూరమై ఆర్థికమైన అణచివేతకు, శ్రమ దోపిడీకి, అసమానతలకు, అవమానాలకు, గురైన వాళ్ళు అని అర్థం చెప్పవచ్చు".

"దళితులు తమ స్థితిని తాము గుర్తెరిగి తమను తామే ఉద్ధరించుకోవాలి, తమ సమస్యలను తామే పరిష్కరించు కోగలగాలి, సవర్ణుల కన్నా తాము ఎందులోనూ తక్కువ కాదని గ్రహించాలి" అన్న అంబేడ్కర్ సందేశం తెలుగు దళితులను కూడా ప్రభావితం చేసింది. అంబేడ్కర్ ప్రసంగాలు తెలుగులోకి అనువాదమై ప్రచారమయ్యాయి. ఈ సందేశాల పట్ల, జ్యోతిబాపూలే, అర్జున్ కాంబ్లె మొదలగువారి రచనల పట్ల ముస్లిం వర్గం వారూ ఆకర్షితులయ్యారు. దళితులు, ముస్లీం లు ఎదుర్కొం టున్న అసమానతలలో భేదం వుంది. ఇరువర్గాలవి భిన్నమైన ధోరణులు కానీ, వీటి మధ్య అస్తిత్వం కోసం పోరాడటమనే సామ్యం వుంది. అందుకే ముస్లిం మైనారిటీ సాహిత్యం దళిత సాహిత్యంలో భాగమైంది. తాము అనుభవిస్తున్న సామాజిక వ్యత్యాసాలకు దళిత సాహిత్యాన్ని వేదికగా ఎంచుకున్నారు. దళితవాదంలో భాగంగా వచ్చిన చిక్కనవుతున్న పాట, పదమెక్కిన పాట, చిత్తరువు కవితా సంకలలాల్లో ఖాదర్, ఖాజా, స్కైబాబా మొదలగు రచయితలు కవిత్వాలు రాశారు.

నేను పుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదై వుంది నా పేరు
కన్న బిడ్డని సవితి కొడుకుగా
చిత్రించింది చరిత్ర
అన్నదమ్ముల్ని చీల్చి
నన్ను ఒంటరి వాణ్ణి చేసింది చరిత్ర
క్షమించండి నా స్నేహితుల్లారా
వక్రీకరణకి వత్తాసుగా
పదబంధాన్ని సృష్టించి
నన్ను వెక్కిరించడానికి వెనుదీయని
మహాకవినీ నేను మన్నించలేను
మన్నించండి నా మిత్రుల్లారా
రాజుకీ, పేదకీ మధ్య
భేదాన్ని చూడలేని
ప్రజాకవి ఉద్రేకానికి నేను
ఉర్రూతలూగలేను

మహాకవి శ్రీశ్రీ కసాయి, సాయిబు అనే పదాల్ని కలిపి కసాయిబు అనే పదబంధాన్ని సృష్టించడం, ప్రజాకవి సుద్దాల హనుమంతు తురకలను తరిగేయాలని పాట రాయడం, నిజాం నవాబు ముస్లిం కాబట్టి ముస్లిం లందరినీ తరిగేయాలని పిలుపునివ్వడం వంటి సన్ని వేశాలు ఖాదర్ మొహియుద్దిన్ పుట్టుమచ్చ దీర్ఘ కవితకు కారణమయ్యాయి. అంతేకాదు ఈ కవిత ముస్లీం లు అనుభవిస్తున్న ప్రతి సమస్యను కళ్లకు కట్టింది

ముస్లీం లను దేశద్రోహులుగా దేశభక్తి లేని వారిగా చూసే సమాజాన్ని ఖాదర్ గారు ప్రశ్నించారు.

"హిందీ - హిందూ - హిందుస్థాన్
ముస్లీం జావో పాకిస్తాన్"
"ముసల్మాన్ కి దోహిస్తాన్
పాకిస్తాన్ యా ఖబరస్థాన్"

ఈ నినాదాలు ఖాదర్ తన కవితలో పేర్కొన్నట్టు ప్రతి ముస్లిం తన బాల్యంలో అనుభవించిన అవమానాలే. తెలిసి తెలియని బాల్యంలో నిజంగానే మేము ఈ దేశ పౌరులం కాదేమో, అందుకే మమ్మల్ని అవహేళన చేస్తున్నారేమో అని ఆలోచించినా పసిహృదయాలూ లేకపోలేదు.

జన్మభూముల్ని వెతుక్కుంటూ
జీవితాన్ని నైవేద్యం పెడదాం
సారే జహాసే అచ్ఛ అంటూనే
జాతిని చెల్లాచెదురు చేద్దాం

అబ్బాస్ గారి కలోసియం అనే ఈ కవితలో అధికారం కోసం స్వార్థపరులు మతచిచ్చులు రేపుతున్నారని తెలిపారు.

ఖాజా గారి షరతు కవిత ముస్లిం మతంలో స్త్రీలు అనుభవిస్తున్న ఘోష సంప్రదాయం పురుషులకు కూడా వర్తింపచేయాలనే షరతు పెట్టింది.

"మేం వీధిలో నడుస్తుంటే నిలువెత్తు నిరసన జెండా నడుస్తున్నట్టుంటుంది

ఒక రాత్రే మనిషో దెయ్యమో అయి నడిచొస్తున్నట్లుంటుంది

ఇప్పుడు మా శరీరాల నుంచి వీచేది అరబు దేశాల అత్తర్ల వాసనలు కాదు

మక్కిన మా కలల మాగువాసనలు"

అనే షరతు కవిత పంక్తులు ముస్లీం స్త్రీ అనుభవిస్తున్న బాధని గుర్తుచేస్తున్నాయి.

షరియత్ లా ను వేలెత్తి చూపిన తస్లీమానస్రీం ను మత చాందసులు నిరసిస్తే, దేశం నుంచి బహిష్కరిస్తే కొంతమంది ఆమె చేసినది సరైనదని సమర్థించారు. ఆమె పక్షాన నిలిచారు. తెలుగులోను ఈ అంశంపై స్పందిస్తూ కవితలు వచ్చాయి. దీనిని సమర్థిస్తూ ఖాజా గారి ఫత్వా కవిత్వం వెలువడింది.

"అందమైన మొగ్గల్ని మాయ చేసి నిఖా చేసుకోవడం నేరం కాదు

వాడి పోయాక మెహర్ మొహాన కట్టి తలాక్ చెప్పడమూ నేరం కాదు"...

మతంలో వున్న ఈ విషయాలు నేరం కాదు కానీ వాటిపై గళం విప్పితే నేరమా అంటూ ఈ కవిత ప్రశ్నించింది.

అగ్రవర్ణాలు,నిమ్నవర్ణాలు, వర్ణ వ్యవస్థ, వర్గ వ్యవస్థ అంటూ చూపిన వ్యత్యాసాలు ప్రజలు భరించగలిగినంత వరకే సాగుతాయి ఓపిక నశిస్తే తిరుగుబాటు తప్పక జరుగుతుంది. ఎంత గట్టిగా కట్టుకున్న సౌధమైన కూలిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, కాదు కాదు స్కై బాబా గారి మాటల్లో చెప్పాలంటే "డప్పు కొట్టడమే న్యాయం" అనిపిస్తుంది

అది నీ చావు డప్పే
నువ్వు ఎంతగా వినపడనట్టు నటించినా
నీ కర్ణభేరులు అదురుతున్నది నిజం
విను జాగ్రత్తగా విను!
గుండెలు బాదుకోవాలనిపిస్తే
బాదుకుని మరీ విను
ఇప్పుడు వినిపిస్తున్న చప్పుడు
ఎప్పటి నీ ఆకృత్యాల ఫలమో..

అనే ఈ స్కైబాబా మాటలు ఎంత నిరసన నుంచి వచ్చాయో మనకు అర్థమవుతుంది.

ఆధునిక దళిత సాహిత్యంలో భాగంగా వచ్చిన ముస్లిం సాహిత్యం కేవలం ముస్లీం సమస్యల మీదే కాదు, దళిత సమస్యల మీదను ప్రశ్నించింది, కవిత్వం రచించింది. దళిత సాహిత్యంలో ముస్లీం సాహిత్యం అంతర్భాగంగా ఉంటూ సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గం ఎలా ఘోషిస్తుందో కవిత్వం ద్వారా చూపింది. ఈనాడు ముస్లింవాద సాహిత్యం ముస్లిం మైనారిటీ వాద సాహిత్యంగా ప్రత్యేక శాఖగా నిలిచినప్పటికీ దళిత సాహిత్యం ముస్లిం మైనారిటీ వాద సాహిత్యానికి దారి చూపిందనిచెప్పవచ్చు. అందుకే ఖాజా గారి రూట్స్ అనే కవితలో నేను దళితుల నుంచి ఇస్లాంలోకి మారానని చెప్పడం స్కైబాబా గారి మర్సా అనే కవితలో మాదిగ వాడలు ముస్లిం గల్లీలు ఒకేలా ఉంటాయని మాలో సామ్యం ఉందని పేర్కొనడం బట్టి ముస్లింవాద సాహిత్యం దళిత వాద సాహిత్యాన్ని మాతృకగా భావించిందని చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. తెలుగులో కవిత్వ ఉద్యమాలు - తెలుగు అకాడమి
2. దళిత కవిత్వం - చిక్కనవుతున్న పాట.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పిల్లంగోవి పాటల్లో తొణికిన తాత్త్విక స్వరాలు

-డా॥ మోగంటి సుధాకుమారి, తెలుగు శాఖాధిపతి, తెలుగుశాఖ, రిసెర్చ్ సూపర్‌వైజర్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

వస్తువును దర్శించడం, దర్శించిన వస్తువును రకరకాలుగా భావించడం, ఆభావాలను తిరిగి జీవద్భాష లోకి ఒంపడం ఈ పనంతటినీ ఒక్క ఆర్ద్రతగల కవి మాత్రమే చేయగలడు. మానవుని విశాలమైన జీవన పార్శ్వాలను ఎక్కడో ఒకచోట స్పృశించాల్సిన మానసిక సందర్భం కవి కంటికి మాత్రమే చిక్కుతుంది. ఎవరి అభిరుచులు దేనిలో ప్రతిఫలిస్తాయో అదే వారిని నిజంగా అభివ్యక్తం చేస్తుంది. జీవితపు బహుముఖీన కోణాల్లోంచి తనకు సుపరిచితమైనవి మాత్రమే కవి కలం నుంచి జాలువారతాయి.

కవిత్వం ఎవరికోసమో, దేనికోసమో సృజించబడదు. అలా చేస్తే, పలుచనై రసానుభూతిని కోల్పోతుంది. కవిత్వం నిసర్గ మధురంగా, అర్ధరాత్రి అరణ్యగర్భంలో నిశ్శబ్దంగా వికసించే పూవులాగా ఉద్విగ్న హృదయంలోంచి పుట్టుకురావాలి. కవిత్వపు ఆర్ద్రతను తీవ్రతను నిర్ణయించే గీటురాళ్ళు లేవు. కవిని ఆ కవిత్వవస్తువు ఎంతగా స్పందింపజేసిందో దాని అభివ్యక్తి అన్నిసార్లూ, ఋజువు చేయలేకపోతుంది. కాని అభిరుచి వైరుధ్యం అనేక ముఖాలతో తనని తాను ఆర్ద్రంగా సాక్షాత్కరించు కుంటుంది.

కవిత్వపు గాఢత వస్తువును బట్టి, వస్తు భావనా భావాన్ని బట్టి, భావాభివ్యక్తిని వెలార్చే భాషను బట్టి, ఆ భాషను పరుగెత్తించే వాక్యనిర్మాణాన్ని బట్టి ఆధారపడిఉ ంటుంది. వీటన్నిటీ నిర్ణయించేది అస్వాదించేవారి అభిరుచుల సాంద్రత. ఇలాంటి కవిత్వపు విలువలు, ఏ ఒక్క అంశం మీద ఆధారపడిఉండవని, ఆయా దేశకాలాలకు సంబంధించిన మెజారిటీ పాఠకుల అభిరుచులను బట్టి అవి నిర్మించబడతాయని తన "పిల్లంగోవి పాటల్లోకి" కవి డా॥ పోలుమాటి అన్నవరం సత్యనారాయణ నిస్సందేహంగా ప్రకటిస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటి విద్యార్థి నేటి ప్రభుత్వ కళాశాల (అ) రాజమహేంద్రవరం తెలుగు అధ్యాపకులు డా॥ సత్య నారాయణ "పిల్లంగోవి పాటల్లో కవితారసప్రవాహంలో మనం తలమునకలయ్యాక తెలిసేదేమంటే ఫలానా విధంగా ఉంటేనే క్రమం, ఉత్తమం అని దిశాగమనాన్ని నిర్ణయించే రాజశాసనాల వైఖరికి సృజన ఎప్పుడూ తలవంచదు" అని.

పక్షిజాడలు కవిత "అఘ్రాణం లేకపోతే అడవికేం నష్టం లేదు" అని స్పష్టంచేస్తుంది. "కాలనౌక మీద ఒంటరిగా కూర్చోవడం, ముఖం మీద పిడికిలానించి చూపుల్ని దృశ్యాలకు ముడెయ్యడం" లాంటి ప్రతీకారాత్మక భావాల్ని ప్రస్ఫుటిస్తుంది.

కవి, తిలక్‌లాగా అపురూపమైన ఉపమల్ని ప్రయోగిస్తాడు. "నా దర్జీతనంలో తయారైన చాలీచాలని కవిత్వడ్రస్సు సరిగ్గా నీకు ఒదక్కపోయినా సరే నంటాడు కవి నిద్ర బస్సులోకి చొరబడి కోలాహలాలో కవి నిశ్శబ్దాన్ని కొల్లగొట్టే తన ప్రియమైన కలల రాజ్ఞిని తలచుకుంటూ "నీకంట్లో కవిత్వాన్ని ఎంతమంది కవులు, అరగదీసినా అరిగిపోదు" అనడం పోలుమాటికే చెల్లింది.

రుస్సో, యీరే, భరోసా కంబళి, తామరాకు వేద పాఠశాలలాంటి ప్రత్యేకాత్మక పదప్రయోగాలతో "ఏ సంఘర్షణలు ఏ పర్యవసానాలకు జన్మస్థానాలో" అన్నిస్తాడు.

"ఎండుకళ్ళు పెద్దవి చేస్తే సముద్రం ఒళ్ళకు సెగలు పుడతాయా? నదుల కడుపు దున్నేస్తాననుకుంటుంది. పాపం నాటుపడవ. నీ నడినెత్తి మీద రేపు రెపరెపలాడేది నా నిలువెత్తు జెండాయే" నంటూ కవి దళిత తాత్త్విక దృక్పథాన్ని ఠీవిగా వెల్లడిస్తాడు.

"రెఫంత" కవితలో కవి అదృశ్య దైవశక్తిని మార్మికంగా వర్ణించడం అబ్బురపరుస్తుంది. "ప్రయాణమంతటికీ నీ కొలబద్దలో మిల్లీమీటరు చోటు దొరికినందుకు అబ్బురపడిపోతా, నీ నిడివి తూచడానికి ఎన్ని కాస్మోటిక్ సంవత్సరాల్ని మోసుకురావాలి, తలంపు పుట్టకముందే దాని ఉనికి తెలుసు నీకు" టాగూర్ గీతాంజలిలోని కవితా పంక్తులు కళ్ళముందు కదలాడుతాయి కవితలను చూస్తే.

కవి లోతైన సంవేదనతో "స్థితికి, గతికీ, జీవ సంపుటికి, దాని సంవేదనకి చోదకత్వానికి అన్నిటిముందు సాష్టాంగం కావడమే పరమావధి, విధి" అని అంగీకరిస్తూ బ్రహ్మాస్మి అంటున్నాడు.

"గుండె చప్పుళ్ళకు అక్షరాలు ప్రేములవ్వడం,
దండలు శ్వాసలకెయ్యడం" పోలుమాటికి
మాత్రమే తెలిసిన ఆల్కెమీ.

మాటలెన్నటికీ గొప్పవక్తలు కాలేవని ప్రేయసి మెచ్చుకోలే తనకు జాస్మిన్ అని ప్రకటిస్తున్నాడు. చలి నెగళ్ళు చల్లారిపోతుంటే చెవులను కప్పిన దుప్పటి చిరిగిపోయినట్టేనంటూ చలిరాత్రులకు చలిమాట గోరువెచ్చని స్పర్శను అనుభూతిస్తున్నాడు.

సంధికాలపు మోళ్ళను చిగుళ్ళు తొడగమని, చెట్టుతనాన్ని చాటింపు వేయమని, దుడ్డుకర్రల బహు మానాలవ్వమని, చీడదులుపుకుని పునఃప్రసవించమని ఆత్మవిశ్వాసాన్ని నూరిపోస్తున్నాడు.

"ఎండిపోయిన చెరువును వెలివాడ చేసి చెప్పకుండా పత్తా పోతాయి కప్పలు, చంటి పిల్లాణ్ణి అందరూ పలకరిస్తారు, బాల్యాన్ని గుప్పెట్లోబంధించాడు కదా!" ఈ వాక్యాలు కవి హృద్యమైన అనుభూతుల్ని పట్టిస్తాయి.

"అందం ఎక్కడా లేదు కంట్లోనే ఉంది ఎండిన మోళ్ళు ముఖాలు నవ్వితేనే బాగుంటుంది" వంటి వాక్యాలు కవి ఆశావాద దీపికలు. "పగ్గం తెగినా సరే చేదుకపోతే దోసిట్లోకి నీళ్ళురావు" అంటూనే "మిట్ట మధ్యాహ్నపు ఏసంగి ఎండలో వసివాడిపోని వాసంతి అభ్యాసకుణ్ణి చేస్తుంది. మౌనసంగీతాన్ని వినడానికి ఎంతో నేర్పు కావాలి" అని తన జీవితానుభవాల్ని పేరుస్తాడు.

కవికి ఇస్మాయిల్ అంటే ప్రాణం అందుకే "చంద మామను వర్ణించగలనే గాని, దాన్ని బాల్చీలోకి లాగి నా ఇంట్లో దాచేసుకోగలనా" అనగలిగాడు. చలికాలపు రాత్రి కవితలో "ఆమె మాటాళ్ళేదు, వెన్నెలంతా అడవిలోనే కాచింది మెరికల్లాంటి చూపుల్ని పట్టుకోలేక కవిత్వం కుంటిదైపోయింది అంటాడు దిగులుగా.

చెట్టు ఒంటికి లిఖియకుండా జీర్ణపత్రజాబితాలను" అని నూతనవిష్కరణల వంక పరుగెడతాడు. "అసలైన అనుభూతిని మాటల్లోకెవడైనా రూపాంతరీకరించగలిగాడా ఎప్పుడైనా" అంటూ కోడెగిత్తుల, కుక్కకూనల చిన్ని పువ్వులాంటి ప్రేమను నరనవంగా అభివ్యక్తీకరించగలిగిన హృదయపు రాతగాడు ఈ కవి.

ప్రేయసికీ తనకీ మధ్య మంచుపొగల్లా విస్తరించిన నిశ్శబ్దాన్ని, రాత్రుల మీద రాలిపోయిన పూల అక్రందనల్ని గరికపూల పరిమళాల్లోనికి జమచేయడం ఇతనికే చెల్లింది. కలయికకు వీడ్కోలు, ప్రారంభాలకు ముగింపులు నానిపోయిన రాత్రులు ఈ కవి కవిత్వోపకరణాలు.

అనాది మానవ జీవనకళ మృత్తికా పేటికలో స్వేదంతో తడిసిన నులివెచ్చటి కలల్ని కళగా మారుస్తుందని తవ్వినకొద్దీ జాడలుగా మానవుని జ్ఞాపకాలు పరిమళిస్తా యని కవి తరతరాల మానవానుభూతుల్ని ఆవిష్కరిం చాడు.

నిదుర పడవలు ఎటో కొట్టుకుపోవడం, బాటలని అడుగుల బలపాలతో దిద్దడం, తన ఆనవాళ్ళమీద కాలానికి వీలునామా రాసిపోవడం, పట్టుజారి దొర్లిపడి పోయిన అనుభవాల దొంతరలను చూడడం, సంజీవ్‌దేవ్ గంభీరమైన తాత్వికచింతనను సూచిస్తాయి.

కవి ప్రేమాతిశయం గాఢంగా రెక్కలు విప్పుకున్న కవిత "మంత్రజాలం". "ప్రేయసి సమీరంలా వచ్చి కోటి

కలతల్ని వేకుమన్నా శుభ్రంగా ఊడ్చిపారేసిందట.'' కవిత్వం కూడా ఆమెను నిర్వచించలేదట. ఆమె చూపు సోకి శిలనై ఇప్పుడిప్పుడే కవిత్వమై కరుగుతున్నానని, ఆకుపచ్చని జ్ఞాపకమై ఒక్కసారిగా తనని తాగేసిందని'' గాఢమైన కవితాభివ్యక్తిని గానం చేసాడు.

''దాహం'' కవిత కవి పోరాటస్ఫూర్తికి కాగడా పట్టింది. ''నిరంతరం దప్పికను నెమరేయని గిట్టల్లేకుండా గుర్రం గెలుపు చిహ్నం అయ్యేదా? చెమట చుక్కలు శిరసు వంచని శిఖరముందా? నీవురు ముసుగు కప్పేస్తే నిప్పు నేత్రం నిదరోతుందా'' అని మార్మికంగా జీవనపోరాట స్ఫూర్తిని రగిలిస్తాడు.

''సహృదయునికి'' అనే కవిత తిలక్ కవితా శిల్పాన్ని అచ్చంగా ప్రతిబింబిస్తుంది. ''కవిత్వరహస్యాల సిద్ధాంతాల గట్టుచప్పుడు వింటూ ఎన్ని నవ్వు పొట్లాలు విప్పుకొనే వాళ్ళం'' నెమ్మదిగా కవి ప్రేమపరిమళాల్లోంచి శ్రమ దోపిడీకారుల దౌర్జన్యాల దగ్గరకొచ్చిన కవిత ''కొత్తజన్మ''. ''నానల్లనొసటిమీద ముత్యాల సరాన్ని చెమటకంపని ఈసడించుకుంటావ్, నీబూట్ల నిగారింపులో నాప్రతిభ మెరుస్తుంది. నా చెమటవాసన సోకనిదే భూమి కడుపు పండదు. విశాల మైదానం మీద భుజాలమీద చేతు లేసుకు నడుద్దాం. నా త్యాగాల చిట్టా మీద నీ చూపు దిగ్గొట్టుకో'' అని తరతరాలకు తన శ్రామికశక్తిని ఆత్మవిశ్వానపతాకగా ఎగరేస్తాడు.

కవి మనకవెన్నెల మంచు తెరల మాటల్లోంచి వాస్తవజీవితాన్ని దర్శించిన కవిత ''ఇక తెరలో దాక్కోలేను''

''ఏంతకీ కవిత్వీకరించబడవు
పైటచెంగు కరాంగుళికి వేలాడతాను
బుగ్గ బొట్టు పెట్టమని బోసి నవ్వు అడగాలా ఏంటి''

ఉపమల కలువల మాలలతో సహృదయుల్ని అలం కరించే కవిత ''ఆకురాలుకాలపురాతిరి'' కవిత తిలక్‌ని, బైరాగినీ బాగా గుర్తు తెస్తుంది, ''నీ గుమ్మం దగ్గరే'' కవిత టాగూర్ గీతాంజలి గానంలా ఉంటుంది.

గోడలు కూల్చండి అనే కవిత ''యుద్ధ భూమ్మీదే విలుకాడి అలికిడి వినిపించాలి. గోడలు కూల్చండి వంతెనల్ని కాదు'' అని కదనకాహళమై మోగుతుంది. ''తలపోసుకోవడానికి మట్టి ఎంత చెమ్మనైనా ఇముడ్చు కోదా'' అని ప్రశ్నిస్తాడు. జామురాతిరి మర్రి చెట్టు నీడలాంటి, డొంకమల్లెల అత్తరులాంటి కవిత్వాన్ని కలగన్న అసలైన హృదయవాది. లేకుంటే ఇరానీ చామ్‌లో ముంచుకు తింటున్న గోరువెచ్చని జ్ఞాపకం వీడు అనగలడా?

కవి హృదయపు చెలమలోంచి వికసించిన తామరల పూల ''పిల్లంగోవి పాటల్లోకి'' కవిత ఈ కవితాసంపుటికే కీర్తి కిరీటం.

''చిరునవ్వునై నీ పెదాలమీద వాలిపోతాను
పుస్తకాల మీదనీ స్పర్శల్ని తడుముకుంటానని
పిల్లంగోవి పాటల్లోకి నీజ్ఞాపకాల్ని విసిరేస్తాను
నువ్వు నిర్మించిన అమూర్త కోటలకావల
నిలబడి నోట్లో చూపుడు వేలు పెట్టుకున్న చంటి
పిల్లాణ్ణి'' అంటాడు.

కవి సహజమైన సరళమైన బోళాతనం ఈ కవిత లన్నిటిలోనూ అంతర్వాహినిగా ప్రవహిస్తూ తన వారస త్వపు శ్రమశక్తిని, తన ఆత్మశక్తిని, సృజనాత్మక అభివ్యక్తిని పువ్వులా, పిట్టలా, చెట్టులా, నీరులా, నిప్పులా అవిష్క రిస్తుంది. కవి తన జాతి చారిత్రక మూలాల నిజాలను చెబుతూ గతచరిత్ర చేసిన తప్పిదాలను నెమరేయడం కాక, నేడు మానవీయతకు పట్టంగట్టే మహనీయ సందర్భం కావాలంటాడు. ఈ కవితల్లోని మాధుర్యం, నిజాలు, శైలి, ఏవస్తువునైనా కవిత్వీకరించి పరిమళింప జేయగల నేర్పు ఆధునిక తాత్విక దర్శనం, సంఘటనల్ని, చరిత్రను విశ్లేషించగల నేర్పు పోలుపాటి కవిని పిల్లంగోవి పాటల్లోని తాత్విక స్వరాలను మన జీవితాంతం సన్నగా మనని వెంటాడుతూ ఉంటాయి.

ఆధార గ్రంథం : 1. పిల్లంగోవి పాటల్లోకి - డా॥ పోలుమాటి అన్నవరం సత్యనారాయణ.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సారస్వతంలో మాదిగ సాహిత్యం ఒక చారిత్రక తప్పిదం?

– డా॥. పి. ఎ. సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు, తెలుగుశాఖ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

సమాజం, సాహిత్యం పరస్పర ప్రభావితాలు. కాని ఇక్కడ మాదిగ సాహిత్యం మాదిగ వర్గీకరణ ఉద్యమ ప్రతిఫలనం. ఇంతకీ ఈ సాహిత్యంలో ఏముంటుంది? సాధారణంగా ఏ ఆధునిక సాహిత్యంలోనయినా వర్గ శత్రువును ఎదుర్కోవడం గురించి ఉంటుంది. ఇక్కడ కూడా ఇదే ఉంటుంది కానీ వెనుకనుండి గుమ్మడి కాయలు పోతున్నా కళ్ళముందు చేజారే కాకర కాయకోసం వగచినట్టుగా ఈ సాహిత్యాన్ని దర్శించవచ్చు. పనలు పట్టుకుపోయినోణ్ణి వదిలేసి పరిగలేరుకునేవాణ్ణి నిలదీసి నట్టు కనిపిస్తుందని కొందరి వాదన.

దీన్ని కొంతమంది గతితప్పిన ఉద్యమముగా, మతి మాలిన సాహిత్యంగా పరిగణించడంలో వాస్తవికతను అంచనావేయాల్సి ఉంది.

మాదిగ వర్గీకరణ ఉద్యమం హింసాత్మకంగా మారింది. వైరుధ్యాలను, ఘర్షణలను, ఆశాంతి, అసహనా లను సృష్టించిని మాట సత్యదూరం కాజాలదు.

ప్రముఖులైన మాదిగ సాహితీవేత్తలు ఈ ఉద్యమాన్ని ప్రత్యక్షంగా బలపరచిన దాఖలాలు కనిపించవు. వర్గీకరణ మీద మాదిగ యువత స్పందించి సాహిత్యాన్ని సృష్టించడం మనకు కనిపిస్తుంది. మేరునగాల్లాంటి ఈ వర్గపు సాహితీవేత్తలు. ఎందుకు స్పందించలేదు. అంతేకాదు వర్గీకరణ ఉద్యమాన్ని వ్యతిరేకించే మరో దళిత ఉపవర్గానికి చెందిన సాహితీ ప్రముఖులు కూడా ఏకీకరణ గురించి సాహిత్యాన్ని సృష్టించలేదు. అంటే ఈ ఇరువర్గాలకు చెందిన ప్రముఖులెవరూ వర్గీకరణ, ఏకీకరణలతో పాలుపంచుకోలేదు. తటస్థంగా ఉండి పోయారు. ఈ తటస్థతకు కారణాలు ఏమైఉండవచ్చు. అసలు వీళ్ళెందుకు ఈ పరస్పర వ్యతిరేకతలపట్ల ఎందుకు ఉదాసీనంగా వ్యవహరించారు?

అంటే వర్గీకరణ ఉద్యమ సిద్ధాంతంలోనే ఏమైనా లోపం ఉన్నట్టా? అన్న కోణంలో మనం తరచి చూడాల్సి ఉంటుంది. దళిత ఉపవర్గాల మాట కొట్టి పారేస్తూ వారి మధ్య ఇక్కడే ఐకమత్యమే మహాబలం అన్న సత్యాన్ని పునఃప్రతిష్టాపించబడాలన్న ఉద్దేశంతో వాళ్ళు మౌనంగా ఉండిపోయారా? అన్నది కూడా చర్చనీయాంశం. వర్గీకరణ సాహిత్యాన్ని వీళ్ళు ఆలోచనలేని కొంతమంది ఆవేశ పరులైన కుర్రకారు రాతలుగా కొట్టిపారేశారా? అన్నది కూడా పరిశీలనార్హం.

రెండు పదుల వయస్సులో వర్గీకరణ సాహిత్యాన్ని సృజించిన వాళ్ళు ఇప్పుడు ఏభయ్యో పడిలోకి వచ్చి పెద్ద మనుషులై ఇప్పుడు పెద్దల మారుగా ఏకీకరణే ముఖ్యం అంటున్నారు. అంటే మూడు దశాబ్దాల తరువాత వాళ్ళకు వాళ్ళే వాళ్ళ రాతలకు, అభిప్రాయాలకు కొట్టివేతలు, దిద్దుబాట్లు చేసుకున్నారు చేసుకుంటున్నారు. అంటే వీరు కూడా తటస్తులైన దళిత మేధావుల జాబితాలోకి చేరిపోయారన్న మాట. వర్గీకరణ ఉద్యమం మొదలయిన వాటినుంచి దాన్ని పురికొల్పే సాహిత్యాన్ని సృజించి ఇప్పుడు మడమ తిప్పిన వాళ్ళు కొంతమంది; ఆదిలోనే తటస్థులైన వాళ్ళు కొంతమంది. మొత్తం మీద దళిత ఉపవర్గాలలో ఎక్కువ శాతం మేధావులు వర్గీకరణ ఉద్యమానికి, దాన్ని ముందుకు నడిపేసాహిత్యానికి విముఖంగా, తటస్థంగా ఉన్నట్టు వాళ్ళ రాతల వల్ల ప్రసంగాల వల్ల తెలుస్తుంది.

ఒకప్పుడు సరైనది అని చెప్పి ఇప్పుడు సరికాదు అని చెప్పడంలోని హేతుబద్ధతను పరిశీలించాల్సి ఉంది.

- జ్ఞానం ఒక జాతి సొమ్ము ఇది ప్రత్యర్థి వర్గానికే ఉన్నది తమకులేదని భ్రమపడటం.
- వెనుకబాటు తనం దళిత ఉపవర్గాలలో అందరికీ సమానం అన్న ఎరుక కొరవడటం.

- సీట్లు మావే ఓట్లు మావే అన్న నినాదంతో అతిపెద్ద రాష్ట్రంలో, అతిపెద్ద మెజారిటీతో రాజ్యాధికారంలోకి వచ్చిన తోటి సమకాలీన దళిత మేధావుల మార్గాన్ని నిశితంగా చూడలేకపోవడం.
- గుమస్తా, కానిస్టేబుల్, టీచర్ కొలువులకు రిజర్వేషన్ల వర్గీకరణ రాజమార్గంగా భావించడం.
- ఉద్యోగాలిచ్చే స్థాయికి తీసుకొచ్చేది రాజ్యాధికారం అని అది దళిత వర్గాల ఏకీకరణ వల్లనే సాధ్యం అవుతుందన్న ఎరుక కొరవడటం.
- అంటరానితనం, వివక్ష ప్రాతిపదికగా రిజర్వేషన్లు వచ్చాయి. కాబట్టి దళిత ఉపవర్గాలు మధ్య అంటరానితనం, వివక్షపరంగా ఏ మాత్రం హెచ్చు తగ్గులు లేవన్న సత్యాన్ని గ్రహించకపోవటం.
- అంటరానితనం దళిత సామాజికవర్గాల ఉమ్మడి పీడ. దీనికి విరుగుడు ఉమ్మడి రిజర్వేషన్లు. అయిన అంటరానితనాన్ని ఉమ్మడిగానే భరించారు. అంటరానితనం ప్రాతిపదికగా లభించిన ఉమ్మడి రిజర్వేషన్లు ఉమ్మడిగానే అనుభవించడం న్యాయం అని ఏకీకరణవాదుల వాదన. అంతేకాదు ఐక్యత రాజ్యాధికారానికి తాళపు చెవి.

ఇదంతా పక్కన పెట్టి కొంతకాలం అమలులో ఉన్న రిజర్వేషన్ల వర్గీకరణ మాదిగల జీవితాలను ఎంతోకొంత ప్రభావితం చేసిన మాట వాస్తవం.

గొర్రెతోక బెత్తెడులాంటి ద్రవ్యోల్బణాన్ని అధిగమించ లేని చిన్నచిన్న ఉపాధులు ఉద్యోగాలమీంచి ఉద్యోగాలిచ్చే రాజ్యాధికారం మీదకు దళితవర్గాల చూపు మళ్ళడం శుభపరిణామం.

గ్లోబలైజేషన్ ప్రైవేటీకరణ నేపథ్యంలో రిజర్వేషన్ల కోసం వర్గీకరణ ఔట్‌డేటెడ్ టాపిక్ అయిపోయింది. కాబోలు ఇప్పుడు మాదిగ సాహిత్య భూమిక అయిన వర్గీకరణను కొట్టిపారేసి ఉమ్మడి రాజ్యాధికారం కోసం ఏకీకరణ అంటూ గళం విప్పుతున్నారు.

అంటే వర్గీకరణపట్ల మొదట నుంచీ తటస్థ వైఖరిని కనపరచే ఆలోచనాపరులైన దళిత మేధావివర్గంలోకి మూడు పదులు కిందట ఆవేశపరులై సృష్టించిన సిద్ధాంతానికి, దాని ప్రాతిపదికగా నిర్మితమైన యావత్తు సృజనకు చెల్లు చీటీ రాసినట్టయ్యింది. ఆమాటకొస్తే ఇప్పుడు దాన్ని ఏకీకరణవాదంతో కొట్టిపారేసినట్టయ్యింది.

ఇప్పటికయినా ఈ దిద్దుబాట్లు మొదలవటం అణగారిన వర్గాలకు ఆపన్న శుభశకునంగానే భావించవచ్చు. వారు రిజర్వేషన్లే కాదు రాజ్యాధికారాన్ని ఉమ్మడిగా అనుభవించాలంటే ఉమ్మడి చారిత్రక సాంస్కృతిక మూలాలు, ఉమ్మడి సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనాలు, ప్రాతిపదికగా ఉన్న దళితవర్గం మనువాదపు అవశేషాలైన ఉపకులాలుగా విడిపోకూడదని గ్రహించి ఇప్పటికయినా గ్రహించడం ముదావహం.

కులం పునాదుల మీద ఒక జాతిని గాని నీతిని గాని నిర్మించలేం అన్న అంబేద్కర్‌కి నిజమైన వారసులు కావాలి. అంతేకాని కులాన్ని పెంచిపోషించే ఆధిపత్య వర్గాలలాగ కులం ద్వారా ఐడెంటిపై కావాలనుకొనే దళితవర్గం ఋజుమార్గంలో ఉండజాలదు. అంతేకాదు మాలపల్లెకాదు మాదిగపల్లెకూ అంబేద్కర్ అడ్రస్ కావాలి కాని వేరే వారుకాకూడదు, అంతేకాదు మొదటిగా కులాంతర వివాహాలు మాల మాదిగల మధ్య హెచ్చు స్థాయిలో జరగాలి.

కక్క ముక్క, డప్పుడోలు కాకుండా ఆధునికత, అభివృద్ధి వాళ్ళు ఉమ్మడి సంస్కృతి అవ్వాలి. మాదిగలకు అంబేద్కర్ కాకుండా మరొకరు ఐకాన్‌గా ఉన్నంతకాలం ఏర్పాటు తప్పదు. ఎవరికో కొమ్ముకాయటం, ఎవరి జండాలో మోసుకు తిరగడం గుమస్తాలుగా మహా అయితే చిరు ఉద్యోగులుగా దళితవర్గం మిగిలిపోవటం తప్ప సమాజ ప్రధాన స్రవంతి అనుభవించే హుందాతనాన్ని, గౌరవాన్ని ఉన్నతిని ఆస్వాదించజాలదు. అనలు వేర్పాటును ఉనికిలోకి తీసుకురావటానికే మాదిగలు అంబేద్కర్‌ను వదిలేసి వేరొకరిని ఐకాన్ వోన్

చేసుకున్నారన్నది ప్రస్తుత సదర్భోచితం. ఏది ఏమైనా తప్పటడుగుల్ని తప్పుడుగుల్ని సరి చేసుకుని దళిత వర్గం ప్రగతి పథంలో రాజ్యాధికారం వైపుకు పరుగులెత్తాలని సంకల్పించడం అభినందనీయం. అయితే రాజ్యాధికారానికి ఏకైక వాహిక వర్గీకరణ కాదు ఏకీకరణ అని గొంతు సవరిస్తున్న దళికాలపు ఆలోచనా పరులైన దళితమేధావులతో మనం కూడా ఏకీభవించక తప్పదు మరి.!

ఉపయుక్త గ్రంథాలు :

1. నెమలికన్నులు - ఆచార్య దార్ల వెంకటేశ్వరావు.
2. దార్ల మాట శతకం - ఆచార్య దార్ల వెంకటేశ్వరావు.
3. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - ఆచార్య కొలకలూరి ఇనాక్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్న నాటకాలు – దళిత అభ్యున్నతి

– డా॥ టి. ఆశీర్వాదం, తెలుగు అధ్యాపకులు, పి.ఆర్. ప్రభుత్వ కళాశాల (అ), కాకినాడ.

కవిత్వం ఒక కళ అని, అది జన్మతః స్వతస్సిద్ధంగా మానవునికి ఉపలబ్ధమయ్యే ప్రతిభా విశేషమని భీమన్న విశ్వాసం. తెలుగు సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు ఉన్నాయో, ఎన్ని ఉద్యమాలు తలెత్తాయో, కవిత్వం ఎన్ని వైవిధ్యాల్ని వెలార్చిందో అన్నింటిలో భీమన్న గారు సిద్ధహస్తులు. ఆయన పద్యం రాసినా, వచన కవిత్వం రాసినా, గేయం రాసినా దళిత అభ్యున్నతి కాంక్షించారు.

వేదాలన్నా అవి ప్రవచిస్తున్న జ్ఞానమన్నా భీమన్నకు ఎంతో ఆదరం మరియు ఎంతో గౌరవం. పురాణాల్లో, ఇతిహాసాల్లో మహర్షులు చెప్పిన కథలు కేవలం కల్పనలు కావనీ, స్వార్థపరుల వ్యాఖ్యానాల వల్ల అవి రకరకాల స్వప్రయోజనాలకూ, అజ్ఞాన తిమిరాలకూ దారి తీసినవని భీమన్న గారు తలంచారు. మిడిమిడిజ్ఞానంతో వేద విహితాలైన ధర్మా చరణాలను వ్యాఖ్యానించకూడదనీ, ఆయన తమ నాటకాలలో వెల్లడించారు. వాల్మీకి, రాగవాశిష్టం, బాలయోగి మొదలైన నాటకాల పీఠికల్లో ఆయన తన ఆలోచనలకు ప్రాతిపదికలు మనకు లభిస్తాయి.

భీమన్న సాహిత్య వ్యక్తిత్వం కవిత్వాధీనం వారి కవితలు, పద్యకావ్యాలు, గేయకావ్యాలు, నాటకాలు వెలయిస్తున్నప్పుడు మనకు కనిపిస్తాయి. ఆయన కున్న స్వేచ్ఛా ప్రవృత్తి నాటక రచనలో మరో రూపంలో మనకు ప్రతిబింబిస్తుంది. ఆయన తన నాటక సన్నివేశ కల్పనలలో, పాత్రల సృష్టిలో ప్రతి విషయంలో ఆయన తన సిద్ధాంతాలకు అనుగుణంగా కొన్ని కట్టుబాట్లును ఏర్పరచుకుంటారు. ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించచడానికి ప్రతీకాత్మకమైన పాత్రలను సృష్టించి విజ్ఞాన స్ఫోరకాలైన సన్నివేశాలను సృష్టించి ఆలోచనాత్మకాలైన సంభాషణలను కల్పించి నాటకం రాయడంలో భీమన్న గారు సిద్ధహస్తులు. సాంఘిక నాటకాల కంటే పౌరాణిక నాటకాలలో ఆయన తన దళిత అభ్యున్నతి దృక్పథం ప్రస్ఫుటంగా కనిసిస్తుంది. భీమన్న నాటకాలలో వాచికాభినయానికి, ఇతర అభినయ విశేషాల కంటే విశేష ప్రాముఖ్యం ఉండడం గమనార్హం.

భీమన్న నాటకాలలోని వాచికాభినయం ఆ పాత్రల సంభాషణరీతి, అర్థవంతమైన వాక్యాలు సామాజికులను ఇట్టే ఆకట్టుకుంటాయి. పరిసరాలనూ, వాటిని ప్రభావితం చేస్తున్న పరిస్థితులనూ అవగాహన చేసుకోగల లోకజ్ఞత పుష్కలంగా ఉందని భీమన్న తన సాంఘిక నాటకాల ద్వారా తెలియజేస్తాడు.

భీమన్న గారి 'కూలిరాజు' ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆయనకున్న ప్రగాఢ నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక. హింసను ప్రతీకారాన్నీ, దౌర్జన్యాన్ని, పారద్రోలి, సంఘటిత శక్తికి మరింత బలాన్ని చేకూర్చగలిగితే బడుగు వర్గాల చేతిలోకి ప్రభుత్వం వచ్చి తీరుతుందని భీమన్న అభిప్రాయం.

'కూలిరాజు' నాటకం పేరు చాలా చక్కగా కుదిరింది. అంటే కూలీవాడు ప్రభువు కావడం. ఈ నాటకంలో సంభాషణలు ఎంతో ఉత్కంఠను కల్గిస్తూంటాయి. ప్రయోజనాత్మకమైన ఈనాటకం గ్రామీణ జీవనంలో ఎంతో సంస్కారాన్ని కల్గించగలుగుతుంది. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఈ నాటకంలో ఒకటుంది. అది ప్రణయకలాపం. అయితే ఇది చాలా సముచితంగా అభ్యుదయ మార్గంగా చిత్రించబడింది.

భీమన్న 'వాల్మీకి' ఆరు అంకాల నాటకం. ఈ నాటకంలోనూ కుల తత్వ వాదులు సృష్టించిన కొన్ని అపవాదాలను ఖండించడం భీమన్న ఆశయముగా పెట్టుకున్నారు. ఆదికవి వాల్మీకి హృదయంలో కవితావిర్భూతి జరిగిన మహాద్భుత క్షణాలు ఈ కావ్యంలో

అంకాలై అవతరించిన్నాయి. దీనిలో ఇతి వృత్తం సీతావనవాసం, లవకుశలుల జననం దాకా సాగింది. ఈ నాటకంలో పాటలు, పద్యాలు, రామాయణ శ్లోకాలు అక్కడక్కడ మనకు వినిపిస్తాయి. ఇందులోని పద్యాలు, పాటలు, మాటల కంటే ఎక్కువ రసానుభూతికి కారణ మవుతాయి. ఇది భీమన్న తెలిసి చేసినపని అని నేనను కుంటున్నాను. ఇలా రాయాలంటే కొంత కవితా వాసన అవసరం. ఈ నాటక కర్త ప్రకారం వాల్మీకి శప్తుడైన వ్యాధుడుగా పుట్టిన ఋషి. కవి పుడతాడే కాని ప్రయత్న పూర్వకంగా కాలేడని ప్రాచీనాలంకారికుల విశ్వాసం. ఈ నమ్మకం భీమన గారిలో గట్టిగా వుంది.

భీమన్న గారు రాసిన నాటకం 'అసూయ' నాటిక నేటికీ ప్రజా జీవితాన్ని పీడిస్తున్న జాడ్యాలు ఈ నాటకంలో చక్కగా చిత్రించబడ్డాయి. ఇది "విద్యార్థి కాంగ్రేసోద్యమ" నాటకం అని ఆయనే పేర్కొన్నారు. రాజకీయ రంగంలో విద్యార్థులు ప్రవేశించడం ఎంత అనర్థానికి దారి తీస్తుందో ఈ నాటకం నర్మగర్భంగా తెలియజేస్తుంది.

"సత్యమును నసత్యముగ చూపజాలు నొకడు
లేని అపవాదు లెన్నో కల్పించు నొకడు
మంచి వానిని పడద్రోయ నెంచు నొకడు
మానవత్వము నాశనమయ్యె నేడు" అంటూ

సత్యము అసత్యముగా చూపుతూ రాజకీయ రంగంలో విద్యార్థులు ప్రవేశించడం ఎంత అనర్థానికి దారి తీస్తుందో తెలియజేస్తూ, రాజకీయ నాయకులు తమ ప్రాబల్యం కోసం విద్యార్థులను పాచికలుగా ఉపయోగించుకునే తీరుతెన్నులు ఇందులో కనిపిస్తాయి.

భీమన్న మేధావిత్వం విద్యార్థులలోని నిర్మాణాత్మక శక్తులను ఆనాడే గుర్తించగలిగింది. నీరసమైన రాజకీయ ఇతి వృత్తాన్ని భీమన్న మృదుమధుర గీతాలతోనూ చైతన్య పూరితమైన ప్రబోధ గీతాలతోనూ మనోహరంగా తీర్చి దిద్దినారు.

'స్వేచ్ఛాజీవి' విహరింపుము, మా
బానిస బ్రతుకులు తరియంప" అని

ప్రయాణానికి ప్రతీకగా కవుల కున్న కోకిల ఉద్దేశించి ఒక గీతంలో ప్రబోధాన్ని ధ్వనింపజేసినారు.

భీమన్న రాసిన విజ్ఞాన ప్రదమైన నాటకం 'రాగవాసిష్ఠ' ఈ నాటకంలోని పీఠిక చదువుతుంటే ఇదేదో కొత్త మతాన్ని కవి ప్రతిపాదిస్తున్నాడే అని అనిపిస్తుంది. కానీ నాటకం పేరులోని 'రాగం' రసాన్ని సూచిస్తుంది.

ఈ నాటకంలో అరుంధతీ వశిష్టులు తప్ప అన్నీ కల్పిత పాత్రలే. పరమ శివుని పాత్ర జ్ఞానానికి చిహ్నంగా నిలుస్తుంది.

"ప్రేమ ప్రేమ అంటే, విశ్వమానవ కళ్యాణాన్ని కోరేదే
ప్రేమ! దాని సిద్ధకోసం చేసే నిష్కామకర్మే
యజ్ఞం. వసిష్ఠా! నీది ప్రేమ కాదు, వట్టి కామం
దానికి ప్రేమ అని పేరు బెట్టి ప్రేమను
అవమానించకు" అంటూ

విశ్వమానవ కళ్యాణభావం ఔదార్యం, వాంఛ విలుప్తమైన నిష్కామకర్మ నీకు మోక్షాన్ని ఇస్తుందని చెబుతూ నేనిప్పుడు కోరేది వాంఛా మధురమైన రసానుభూతి అన్నాడు.

"ప్రాచీన ధర్మం కంటే ఈ ఇసుక కొంత మెత్తనిది అని చెప్పూ... "మాతంగ కన్య తేజశ్శాలిని ఎందుకు కాకూడదు?" అని ప్రశ్నిస్తాడు. మానవ కల్పిత కులానికి ఆధ్యాత్మిక మహాశక్తి ముడిపెడుతున్న ఈ ప్రాచీన మతం ఎంత సత్యదూరం" మొత్తానికి నాటక కర్త భీమన్న తాను నమ్మిన సిద్ధాంతాన్ని చాలా సుందరంగా ప్రతిపాదించ గలిగినారు.

అజ్ఞానం నిరక్షరాస్యత చీకట్లలా సమాజంలో అల్లుకొని పోతున్న రోజుల్లో వీరేశలింగం పంతులు బ్రహ్మసమాజాన్ని స్థాపించి కులమతాల అడ్డు గోడలను, మూఢ విశ్వాసాల ఎండమావులనూ ఛేదించుకుంటూ కలాన్ని ఆయుధంగా పట్టి సంఘ సంస్కరణోద్యమాన్ని సాగించారు. కాని నేటికి కూడా ఆయన ఆశయాలు సంపూర్ణంగా నెరవేరినట్లు కనబడదు. మనకు రాజకీయ స్వేచ్ఛలేనప్పుడు ఆయన

సాగించిన తపస్సు ఇప్పుడు మనకు అన్ని విధాలా స్వాతంత్ర్యమున్నా సాధించలేక పోతున్నాం.

భీమన్న ఈ వైఫల్యంలో సతమతమై గ్రామీణ వాతావరణాన్ని "పాలేరు"అనే నాటకంలో భూమికగా పెట్టుకొని సజీవ పాత్రలనూ వాస్తవికమైన పరిసరాలనూ సృష్టించి కొంత త్యాగం, కొంత జ్ఞానం ఉంటే సర్వతోముఖ వికాసం సాధ్యమే అన్న ఆశావాదానికి సాధువాదం పలికినారు. ఈ నాటకంలోనూ భీమన్న తన కవితా కౌశలానికి పని కల్పించుకున్నారు.

ముమ్మిడివరం బాలయోగి జీవితాన్ని ఇతి వృత్తంగా తీసుకొని "బాలయోగి' నాటకం రాసారు. ఈ బాలయోగి నాటకం అస్పృశ్యతను నివారించడానికి వెలువడినది. తాను ఫలానా కులం వాణ్ణి చెప్పకుని సంఘంలో ఉత్తముడిగానో నీచుడిగానో మన్నన పొందడం గొప్పకాదు. ముమ్మిడివరం బాలయోగి మాలవాడు అంటే ఎవరు నమ్ముతాడు? మాలతనం మాదిగతనం, బ్రాహ్మణత్వం వీటికి అతీతమైన వ్యక్తిత్వాన్ని ఆయన తన తపశ్చర్యవల్ల సంపాదించుకొని బ్రహ్మస్వరూపుడైన తర్వాత కూడా ఆయన మాల వాడని అనడం అంతసబమైన విషయం కాదు. భీమన్న ఈ నాటకం రాసి కులం కాదు గుణం ప్రధాన మని నిరూపించినారు.

ఈ విధంగా భీమన్న గారు వారు రాసిన నాటకాల్లో సందర్భానుసారంగ దళిత అభ్యున్నతిని కాంక్షించారు.

ఆధార గ్రంధాలు :

1) పద్మ భూషన్ డా॥ బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - డా॥ భీమశింగి నమశ్శివాయ
2) పాలేరు నుంచి పద్మ శ్రీ వరకు బోయి భీమన్న - హైమవతి,1978 హైదరాబాద్
3) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
4) బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - కొల్లాగుంట ఆనందన్

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సామాజిక దృక్పథం – జాషువా దళిత సాహిత్యం

– కె. ఎం. సౌందర్యవతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

జాషువా జననం – జీవితం :

గుఱ్ఱం జాషువా 1895 సెప్టెంబరు 28న వినుకొండ ప్రాంతం (గుంటూరు జిల్లా)లో గుఱ్ఱం వీరయ్య, లింగమాంబ దంపతులకు జన్మించాడు. దుస్సహమైన కుల, మత బేధాలను, దుర్భరమైన దారిద్ర్యాన్ని చవిచూసాడు (అనుభవించాడు). ఈయన 1905లో వినుకొండలోని ఎలిమెంటరీ స్కూలులు చేరాడు. అక్కడ కుల, వర్గ బేధాలు ఆయన లేత మనసును కలిచివేసాయి. గాయపడిన హృదయంతో తాను గుర్తించిన సాంఘిక వ్యవస్థలోని అసమానతలను ప్రశ్నించం ప్రారంభించాడు. జాషువా సాహిత్యంలో తాను వ్యక్తీకరించిన స్పష్టమైన అభిప్రాయాలకు చిన్న నాటి సన్నివేశాలే ప్రాతిపదికల య్యాయి. అనంతరం బాపట్లలోని హయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసి వినుకొండ సమీపంలోని చాట్రాగడ్డపాడులో 1909లో బడిపంతులు ఉద్యోగంలో చేరాడు. నాటి నుండి జీవన పోరాటం సాగిస్తూనే ఉ న్నాడు. ఈ పోరాట పటిమతోనే అతడు తన జీవితాన్ని గడిపాడు.

హిందూపురాణాలను పారాయణం చేస్తూ హిందూ గ్రంథాల్ని వ్రాస్తున్నాడనే భావంతో క్రైస్తవ మత బోధకులు ఆయన్ని టీచర్ పోస్టు నుండి తొలగించారు. ఆ తరువాత మూకీ సినిమాల కథా వాచకుడుగా కొంతకాలం పనిచేశాడు. ఆ ఉద్యోగాన్ని కూడా వదలి రాజమండ్రిలోని కోటిలింగాల దగ్గర గల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. ఆ సమయంలో ఆయన పడిన కష్టాల గూర్చి

"ఇద్దరు సుతులం గూరిమి
ముద్దియు మేరాంబతోడు ముట్టెడు జీతం
బద్దెకు ముద్దకు చాకలి
పద్దుకు నరిపోక పెక్కు పాట్లుంబడితిన్" అని వ్రాసాడు.

ఆ పిదప రాజమండ్రి వదిలి వినుకొండలో పండితుడుగా పనిచేశాడు.

జాషువా రచనా విధానం :

20వ శతాబ్ది ప్రారంభంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన భారతీయ భాషా సాహితాల్యలలో కాల్పనిక ధోరణి చోటు చేసుకుంది. ఈ కాలంలో తెలుగులో భావ కవిత్వం ఒక ఉద్యమంగా రూపుదాల్చింది. భావ కవిత్వములో అంతర్లీనం అయిన ఖండకావ్య ప్రక్రియ దానితో పాటు మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసించింది.

ఈ భావ కవితా రీతులతో కావ్య ప్రక్రియలను చేపట్టి రచనలు చేసిన ఖండకావ్య నిర్మాత గుఱ్ఱం జాషువా. భావ కవితా వృక్షములో కొమ్మలు సాగిన ఆత్మానేయత్వం ప్రకృత్యోపాసన స్వేచ్ఛా ప్రియత్వం. సంఘ సంస్కరణ గత వైభవ స్మరణ వంటి పోకడలను తన ఖండకావ్యాలలో వ్యక్తం చేశాడు.

జాషువా సమకాలీన కవితోద్యమ ముఖ్య లక్షణాలను తన కవిత్వంలో కనబరిచిన వాటికి అతీతమైన ఒక తత్వాన్ని బలమైన వ్యక్తిత్వ ముద్రతో వ్యక్తం చేశాడు. సార్వకాలికం, సార్వజనీనమైన సత్యం, ధర్మం, సమత, సౌందర్యం, మొదలైన అంశాలను ప్రాతిపదికగా చేసుకుని అతడు రచించిన ఖండకావ్యాలు కుల, మత, ప్రాంతీయ భావాలకు అతీతంగా పాఠకులకు హృదయాలను స్పృశించగలిగి ఉన్నాయి.

జాషువా ఒక సందర్భంలో "విశ్వమానవ సౌభ్రాతృత్వం, నిర్మాత నిర్జాతి సంఘం నా ఆదర్శం. ఒక జాతికి ఒక మతానికి చెందిన కవిత్వాలు మంచివి కావు అవి కవిత్వాలే కావు. అలాంటివి వీలునామా కవిత్వాలు అంటాను. నా

భావం సామాన్యులకు అందివ్వడానికే ప్రయత్నించాను. గహన సంచావం లేని కవిత్వం నా లక్ష్యం అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

జాషువా రచనలు :

జాషువా ప్రారంభ దశలో దృవవిజయం, హిమద మార్కపరిణయం నాటకాలు వ్రాశాడు. 1924-1930 సంవత్సర మధ్యకాలంలో భారతిలో విరివిగా అచ్చు కావడంతో క్రమంగా ప్రసిద్ధిపొందాడు. ఆ తర్వాత ఫిరదౌసి, స్వప్నకథ, కాందిశీకుడు, ముంతాజ్‌మహల్, గబ్బిలం (మొదటి భాగం), నేతాజి, చిన్న నాయకుడు, బాపూజీ, గబ్బిలం (రెండవ భాగం), స్వయంవరం, రాష్ట్రపూజ, కొత్తలోకం, ముసాఫరులు, క్రీస్తు చరిత్ర, నాగార్జున సాగర్ మొదలైన లఘు కావ్యాలు వ్రాసాడు.

జాషువాకు కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ, మధుర, శ్రీనాధ, నవయుగ చక్రవర్తి, కళా ప్రపూర్ణ బిరుదులు లభించాయి. భారత ప్రభుత్వం వారికి పద్మభూషణ పురస్కారం 1970లో ఇచ్చారు.

ముగింపు :

నరుని మనస్సులో ''నాజాతి, నా ఊరు, నాదేశమని పొంగే, భేదభావం నమసిపోయి ''మానవులొక్క తల్లికింబుట్టిన యన్నదమ్ములు'' జీవిత కవితా ప్రస్థాన ప్రారంభంలో చేదైన అనుభవాల్ని రుచిచూచి నిట్టూర్చిన జాషువాకు ''మడమతిప్పని ఆంధ్రవీరుడన్న'' జాషువాకు ''భరత ఖండంబు నా పాఠశాల'' అని విశ్వసించిన జాషువాకు వ్యక్తిత్వ విషయంలో కన్పించే భేదానికి, పరిణామానికి ఆయన రచించిన రచనలు నిదర్శనంగా నిలిచాయి, అసమానతలు, అన్యాయాలు, దురాచారాలు ఆయన కవిత్వ గమనంలో కన్పించే భూతదయ అన్నీ జాషువా రచనల్లో కన్పిస్తాయి. జాషువా మానవత్వం - పరిమళించే విధంగా ఎన్నో రచనలు రాసారు. అందుకే క్రీస్తు చరిత్ర పై వచ్చే రాయల్టీలో కొంత భాగాన్ని ''మూగజీవుల పోషణకు ఇవ్వాలని వీలునామా''లో పేర్కొన్నారు. ''బైబిలులోని ప్రసిద్ధ సూక్తిని అది తలపిస్తుంది. "Blessed are the merciful, for they shall obtain mercy".

ఆధార గ్రంథాలు :

1) జాషువా ఖండకావ్యాలు
2) గబ్బిలం కావ్యం
3) జాపూజీ
4) క్రీస్తు చరిత్ర
5) ఫిరదౌసి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భూమి భాష – నది ఘోష

– డా॥. సముద్రాల ప్రసన్నకుమార్, సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ , ప్రభుత్వ కళాశాల(ఆ) , రాజమండ్రి.

''భూమిభాష'' కవితా సంపుటి రచయిత కత్తి పద్మారావు. ఈయన రచనల్లో దళితవాదం, హేతువాదం ప్రస్ఫుటమవుతాయి. మృచ్ఛకటికం రాసిన శూద్రకుడు, శ్రీకృష్ణదేవరాయలు, రామరాజభూషణుడు, వీర శైవకవులు, వేమన, జాషువ, ఖలీల్ జిబ్రాన్, నాజర్, దళిత పాంథర్స్, బ్లాక్ పాయెట్స్ ఎందరో గొప్ప రచయితలు నుండి, రచనల నుండి స్ఫూర్తిని పొందారు. కత్తి పద్మారావు స్వగ్రామం గుంటూరు జిల్లాలోని ఈతేరు. 1953లో జన్మించారు.

2003 నుండి 2004 వరకు సంవత్సరాల్లో జరిగిన దేశంలోని సంఘటనలు ''భూమిభాష'' అనే కవితా సంపుటిలో ప్రస్ఫుటీకరించబడ్డాయి. ఇందులో ఎన్నో సున్నితమైన అంశాలు, ఒక వ్యక్తి వ్యక్తం చేయలేని భావనలు, సమాజం పొరల్లో నలిగిపోతున్న అంశాలు కవిత్వీకరించాడు. కవిగా కత్తిపద్మారావు తన మనో ప్రకృతిని, ప్రకృతితో అనుసంధానించి అటు భూమి భాషగా, ఇటు నది ఘోషగా కవిత్వీకరించాడు.

ఈ ''భూమి భాష'' కవితా సంపుటిలో మొత్తం 71 కవితలున్నాయి. ఈ కవితల్లో దళితులు, సామాజిక తరగతులు, స్త్రీలు, పేదలు అందరూ మాట్లాడుతారు. ప్రకృతి స్వయంగా తానే మాట్లాడుతున్నట్లుగా ఉంటుంది. దళిత పల్లెల్లోని భాష ప్రతి శ్రోత హృదయాన్ని పలకరిస్తుంది.

భూమి భాషలో నదిఘోష :

'నది మాట్లాడుతుంది' కవితలో ప్రవహించనీయండి అన్నటువంటి నదీస్వరంలో ప్రవాహానికి అడ్డువచ్చిన దేన్నైనా తిరస్కరించగలిగిన సంస్కారంలో , మనిషి గుండెను తగిలిన గాయాలను ఒంగి ఔషధం పూసి నిమిరినట్టుగా, యుగాల వెంట కనుమరుగవుతున్న చరిత్రలను వెలికి తీసే ఘోష స్పష్టం అవుతుంది. సముద్రం నుండి పాయ చీలి నదిగా ప్రవహించే పాయ నుండి అలలు కొండలకు తాకుతున్నపుడు ప్రవాహవేగం, అలలశబ్దం, కమ్మని చల్లదనం సామాన్యంగా కనిపించే వాతావరణం. కానీ, ఈ విషయాన్ని కవిత్వీకరిస్తూ నదిలో ఏదో కీల జ్వలించడం అనే అంశం ఆలోచనతో పాఠకుడ్ని నిలబెట్టేస్తుంది. నది అనే తల్లి అడవి అనే బిడ్డకి జోలపాట పాడినట్టుగా వర్ణించిన విధం ప్రశంసనీయం.

''నదియానం'' అనే కవితలో కవి తన నిరంతర యానం గురించి, గమ్యానికి గమనానికి అంతరం లేదని తెలియజేశాడు.

''నది ఇంకిన చోటల్లా
రాళ్ళు మెరుస్తుంటాయి'' అన్న మాటలు వాస్తవాలే అయినా, మనసును మీటి ఎన్నోరాగాలు, ఆలోచనలు పుట్టిస్తాయి.

''అలలు దాటేదాకే
ఒరవడి
అంతరంగం దాటితే
ఏదయినా ప్రశాంతమే
ప్రకృతులు భిన్నమయినపుడే
అన్వేషణ''

''అడవిపూత'' కవితలో గాలికి చెట్టు ఊగడం అనేటటువంటి సూక్ష్మాంశాన్ని అనల్పార్థంతో, అనుభూతియైన కవిత్వాన్ని అందించాడు. చెట్టు ఊగినపుడు ఒకగాయని పాటపాడినట్లుగా, ఆ పాట సముద్రాలను దాటి శిశువులకు జోల పాడినట్లు చెప్పాడు కవి.

''నది సంఘర్షణ'' కవితలో నది పైకి గంభీరముగా కనిపిస్తుంది. అయినా, నది గుండె కొలిమిలా ఉంటుంది. భూమి వేడెక్కినా, నిరాశక్తగా ఉన్నా, నది సేదదీరుస్తుంటుంది.

"ఇసుక తిన్నెలా ఉంది
ఆ కుండలో దాగున్న
చారెడు నీళ్ళుని కుండే తాగేసింది
దోసిలి పట్టేలోపే
నేల నెర్రిలిచ్చింది
అవును

నది సంఘర్షనలో ఉంది" నది భూమినీ, సూర్యుణ్ణీ జయించి, మనిషి గుండెల్లోకి ప్రవహించాలని అనుకున్నా, నది మానవుడికి మేలు చేయాలనుకున్నా, మనిషి ప్రకృతి నుండి పలాయనమయినపుడల్లా నదికి సంఘర్షణే అని నదీ - సంస్కృతి వేరు వేరు కాదని కవి ఆలోచన.

"వచ్చే ఏడు" అనే కవితలో "సన్నగా కారుతున్న కాల్వ
నా నీడను నిటారుగా చూపినా
నేను నా చూపును వంచి
తల వంచకుండా నడిచానే"

అంటూ నదివొడ్డును నడిచేటపుడు నది అలలు వచ్చి పాదాలను తాకుతున్నపుడూ కలిగే మనో ఆనందం, మనోధైర్యం స్పష్టంగా కన్పిస్తాయి.

"పాటైనా మాటైనా
అలలు వస్తున్నపుడే
పడవలు నడుస్తున్నపుడే"

అనే భవిష్యత్తుపై ఆశను పెంచేలా ఆశావాదంతో చెప్పిన మాటలు దళితుల హృదయాలను పలకరిస్తాయి.

'ఆకాశదీపాలు' అనే కవితలో మనిషి నిర్మలంగా స్వచ్ఛంగా ఉంటే మధుర స్వరంగా, మార్మికంగా ఉంటే చిల్లులుపడిన బూరధ్వనిలా ఉంటుందని, అహం విడిచి వెలుగులోకి మారాలంటే నది అనే అద్దం చాలు అంటాడు కవి.

"నిశ్శబ్దం ఒక మరణశయ్య" అనే కవితలో మనిషి కూడా సముద్రం లాగేననీ కన్నతల్లి గుండెలో బాధకు అర్ధం ఎవరూ చెప్పలేరని, ఆ నిశ్శబ్దం ఒక మరణశయ్య లాంటిదని ప్రతి అంతరంగానికి అంతర్మథనం ఉంటుందని తేల్చి చెప్పాడు.

ముగింపు :

మొత్తంగా ఈ "భూమి భాష" సంపుటిలోని కవితల్లో నది, సముద్రం, కాలువ, తుఫానుల మధ్య తేడాలు, అంతరాలు వివరిస్తూ సకారాత్మంగా విషయం అందించడం కవి యొక్క దృష్టికోణం.

నది దళితునికీ, కవి హృదయానికీ ప్రతీక. అంతేకాదు నదికీ అంతరంగానికీ, నదికీ ఎదల్లో సొదలకు, నదికీ జీవితానికి, నదికీ జీవనవిధానానికి, నదికీ జీవిత సంఘర్షణకు, నదికీ సంఘటనలకు, నదికీ మంచికీ, నదికీ మానవత్వానికి, నదికీ భవిష్యత్తుకు, నదికీ ఆశావాదానికి, నదికీ నవీన ఆలోచనలకు, నదికీ మనసుకు, నదికీ చరిత్రకూ, నదికీ తల్లికి, నదికీ శిశువుకు, నదికీ దేశానికీ, నదికీ సమాజానికి మధ్య ఉన్న బంధం, సంబంధం అనుబంధం అవినాభావసంబంధం "భూమి భాష" కవితల్లో చూడవచ్చు.

ఆధారాలు :

1) భూమి భాష , కత్తిపద్మారావు : 2004

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తొలితరం దళితకథలు – సామాజిక విశ్లేషణ

– చిలుకమఱ్ఱి శారద, సహాయ ఆచార్యులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ తూర్పు, వరంగల్ జిల్లా.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం దళిత సాహిత్యోద్యమం. సామాజిక పరిణామంలో దళితుల అస్తిత్వానికి, పోరాటానికి, చరిత్రలో పునర్నిర్మాణానికి దిక్సూచిగా నిలిచింది. ''చాతువర్ణం మయంసృష్ట్యా'' అని భగవానుడు గీతలో చెప్పినట్లు బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైర్యుడు, శూద్రుడు అనే నాలుగు వర్ణాలు పోగా మిగిలిన ఐదవవాడైన ''పంచముడు'' తరతరలుగా, యుగయుగాలుగా అణిచివేతకు గురి అవుతున్నాడు తన అస్తిత్వము కొఱకు పోరాటం చేస్తూనే ఉన్నాడు. అసలు దళిత అనే పదాన్ని ఈ మధ్యకాలంలో ఉపయోగిస్తున్నారు. దళిత జాతి, అణచివేతకు వ్యతిరేకంగా అనాదిగా కొంత మంది దళితేతరులు కూడా పాటుపడుతున్నారు. శంకరాచార్యులు, రామానుజాచార్యులు మొదలైన వారు అస్పృశ్యతకు వ్యతిరేకంగా అందరిని దిశానిర్దేశం చేవారు. దళిత సాహిత్యాన్ని మొదటగా స్పృదించిన వారు పాల్కురికి సోమనాథుడు. ఆయన రాసిన బసవ పురాణంలోని గాథలన్ని దళితులైన శివభక్తులవే. ఇక్కడ దళిత సాహిత్యం గూర్చి ప్రస్తావించాలంటే ''దళితుల జీవితాలను చిత్రించేది, దళితుల ఆర్తిని, ఆవేదనను, ఆవేశాన్ని, ఆగ్రహాన్ని, ప్రతిఘటనను, ప్రతిబింబించేది, దళితులకు మెఱుగైన, సుఖమయమైన, అందరితో సమానమైన జీవన గమనాన్ని నిర్దేశించేది, దళిత చైతన్యాన్ని వ్యక్తీకరించేది దళిత సాహిత్యం'' అని ఎస్వీ సత్య నారాయణ గారు అన్నారు. దళిత సాహిత్యం రావాలి అంటే దళిత జీవనఅనుభవాల నుండే రావాలి. సానుభూతితో సింపతి కాకుండా 'సహానుభూతి' (ఎంపతి)తో రాస్తే మాత్రమే సాహిత్యంలో గాఢత వస్తుందన్నారు.

ఇక దళిత సాహిత్యం విషయానికి వస్తే కథలు అనేవి ఒక ప్రత్యకతను సంతరించుకున్నాయి. సాహిత్యంలోనే కథలది ఒక ప్రత్యేక విభాగం. 1920 దశకం దళిత బహుజన అస్తిత్వ చైతన్యం వికసించిన దశకం. వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఒకవైపు త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రారంభించిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం మరొక వైపు భాగ్యరెడ్డి వర్మ, అరిగ రామస్వామి వంటివాళ్ళు నడుపుతున్న దళిత అస్తిత్వ ఆత్మగౌరవ ఉద్యమం తెలుగునాట ప్రజాస్వామిక భావాల వ్యాప్తికి కారణ మయ్యాయి.

తెలుగులో ఆధునిక కథ సంస్కరణోద్యమంతో పాటే రూపు దిద్దుకుంటూ వస్తున్నది. తొలి తెలుగు కథకురాలిగా గుర్తించబడిన బండారు అచ్చమాంబ అయినా, గురజాడ అయినా వారి రచనలలో దళిత ప్రస్తావన కనబడదు. అస్పృశ్యతపై సమస్యపై ''శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన పుల్లం రాజు కథ (ప్రబద్ధాంధ్ర -1925) తొలి తరం మొదటి దళిత కథానిక గుర్తింపబడింది. అస్పృశ్యత నివారణ కోసం చక్రవర్తి ముందుకొస్తాడు ...చివరికి తియ్యటి మాటలు చెపుతూనే మాల మాదిగల మద్య తెలివిగా చిచ్చుపెట్టిన రామచంద్రయ్యను ఆధునిక మనువుగారచయిత ఆవిష్కరిస్తాడు. దళిత సమస్యను చిత్రించిన తొలి కథగా ఈ కథ సాహిత్య చరిత్రలో నమోదు అయ్యింది. 1927 జులై 16 నాటి గోల్కొండ పత్రికతో అచ్చయిన ''యౌవన భ్రాంతి'' కథలో కొంత దళిత జీవిత పార్శ్వాల ప్రస్తావన కనిపిస్తుంది. కటంగూరి నరసింహారెడ్డి కథా రచయిత. ఇందులో విఫల ప్రేమికుడైన సుదర్శనుడు అనే వాడి గూర్చి రాయబడిన కథ. ఇందులో ఎక్కడా ఆ యువకుడి కులం ప్రస్తావన కనబడకపోయినా రావు బహదూర్

ముత్తయ్య గురించిన పరిచయంలో ఆనాటి కుల సామాజిక వాస్తవికత కనబడుతుంది. కనుక ఇక్కడ ప్రస్తావించాలి.

ముత్తయ్య హైకోర్టు న్యాయాధిపతి కావడం, రావ్ బహదూర్ బిరుదుతో బ్రిటిష్ వారి చేత సత్కరింపబడటం వల్ల అతడు నిమ్నజాతి వాడైనా ఎవరూ పైకి మాట్లాడరు. కాని ఉత్తమ హిందూ కుటుంబాలు ఆయనను దగ్గరికి రానీయకపోవడం వల్లనే బ్రహ్మ సమాజంలో చేరాడని ఆ సమాజం నుండే విద్యావంతురాలైన ఒక యువతిని పెండ్లాడని కథనం. హిందూ వర్ణ వ్యవస్థలో ఉపాంతీకరణకు గురవుతున్న వాళ్ళు ఆత్మగౌరవ స్పృహతో వెతుక్కునే ప్రత్యామ్నాయం మతాంతీకరణ లేదా బ్రహ్మ సమాజం. అందరికి న్యాయం చెప్పగలిగిన గల స్థాయికి ఎదిగిన మనిషికి దక్కని సామాజిక న్యాయం. గుర్తింపు కోసమే ముత్తయ్యవంటి విద్యాధిక దళిత యువత బ్రహ్మ సామాజికులు అవుతున్న సమకాలీన సామాజిక స్థితిని ఈ కథ సూచించింది.

దళిత సమస్యను ప్రస్తావించిన 'యౌవనభ్రాంతి' కథ వచ్చిన గోల్కొండ పత్రికలోనే ఆరు నెలలకు అంటే 15 ఫిబ్రవరి 1928న ''నేరేడు పండ్లకంటు'' అనే కథ అచ్చయింది. కథా రచయిత శ్రీనివాసులు యానాం ప్రాంత ఆదిమాంధ్ర విద్యార్థి. దీనినే మనం దళిత కవి రాసిన మొదటి కథగా గుర్తించవచ్చును. భార్యాభర్తల సంవాద రూపంలో నడిచే ఈ కథలోనూ వస్తువు ప్రత్యక్షంగా దళిత జీవితం కాదు. దళితుల పట్ల, అస్పృశ్యత పట్ల చదువుకున్న మధ్యతరగతి బ్రాహ్మణ వర్గపు చర్చ. బజారులో నేరేడు పండ్లు అమ్ముకుంటున్న ఆడమనిషిని పిలిచి ఇల్లాలు పండ్లు కొనాలనుకోవడం, మాలస్త్రీ దగ్గర పండ్లు కోనడాన్ని భర్త అభ్యంతర పెట్టడం, దానిని నిరాకరిస్తూ భార్య వాదన చేయడం కథ. ఇక్కడ రచయిత భార్య ముఖంగా దళితుల పట్ల నాగరికులు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని విమర్శింపజేస్తాడు. ఒక ఆదిమాంధ్రుడు ఇచ్చిన సిల్కుకండువా, గొడుగు, పట్టెకోటు బహుమతిగా పుచ్చుకున్నప్పుడు లేని అంటు మాల స్త్రీ వద్ద కొన్న నేరేడు పండ్లకు ఎలా వస్తుంది' అని ప్రశ్నిస్తుంది. చదువుకొని కూడా ఆదిమాంధ్రులతో స్నేహం చేసి కలిసిపోయినట్లుగా, ఉదారులవలె, సంస్కర్తలవలె ప్రవర్తించే వారి మనో బుద్ధులలోని అల్పత్వాన్ని ఎత్తి చూపిస్తాడు. (ఎన్ యాకయ్య - గోలకొండ పత్రిక - సాహిత్య సాంస్కృతిక చైతన్యం - పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం - 2018 - అముద్రితం).

దళిత జీవితాలలోని వ్యధలను వెలికి తీసి వారి బ్రతుకులలో వెలుగును నింపడానికి అవతరించిన అపర అంబేద్కర్‌గా మనకు భాగ్యరెడ్డి వర్మ కనబడతారు. ఈయన అజ్ఞాతవాసి కలం పేరుతో రాసిన 'వెట్టిమాదిగ'నే పూర్తిస్థాయి తొలి దళిత కథగా గుర్తింపబడింది. తర తరాలుగా వెట్టిచాకిరీ చేస్తూ అగ్రవర్ణాలకు ఊడిగం చేస్తున్న సబ్బండ వర్గాల వ్యధనుదీనిలో రచయిత చిత్రీకరించాడు. వెట్టి మాదిగల బతుకులోని హింస దారిద్ర్యం ఎంత భయంకరమైనదో చూపించి అందుకు మూలమైన పోలిసుపటేల్ వ్యవస్థ వైపు పాఠకులు చూపున మళ్ళించిన కథ ఇది.

1932లోనే అస్పృశ్యులు ఇతర మైనారిటీ వర్గాలకు ప్రత్యేక నియోజకవర్గాల ప్రతిపాదనను నిరసిస్తూ గాంధీగారు సత్యాగ్రహం ప్రారంభించారు. ఆక్రమంలోనే హరిజన్ సేవక్ సంఘ్, 'హరిజన్' అనే పత్రిక స్థాపించ బడ్డాయి. అంటరాని వారిని 'హరిజనులు' అని వ్యవహరించడం అప్పుడే మొదలైంది. ఇలాంటి దేశ రాజకీయ సందర్భం నుండి 1934లో వచ్చిన కథ శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి వ్రాసిన ''ఇలాంటి తవ్వాయి వస్తే'' ఎనభై ఏళ్ళ నాటి వెల నాటి బ్రాహ్మణ అగ్రహారంలో ఉన్న రెండు మంచి నీటి చెరువులలో చిన్నది మాదిగలది. పెద్దది మిగిలిన అన్ని కులాల వాళ్ళది. చిన్న చెరువులో లచ్చిగాడు పడి చావడం వల్ల మంచి నీటికోసం మాదిగలు పెద్ద చెరువు దగ్గర పడిగాపులు పడడం ఎవరైనా దయతలచి నీళ్ళు పోస్తే బిందె నింపుకోవడం. ఇలా

ఇద్దరూ విసిగిపోయిన సందర్భంలో ఒక ఒప్పందానికి వస్తారు. వాళ్ళకు నీళ్ళు పోయడానికి ఏర్పాటు చేయబడ్డ మనుషులకు మాదిగలు జీతాలు ఇచ్చేటట్లుగా కాని మాదిగలు అందుకు ఒప్పుకోరు అందరికీ ఉచితంగా వచ్చే నీటికి తామెందుకు డబ్బు చెల్లించాలని ప్రశ్నిస్తారు. చివరికి తాము తురకమతం తీసుకొని అయినా చెరువులో దిగే హక్కును దక్కించుకోవాలనే నిర్ణయానికి వస్తారు. చివరకు మాదిగ విస్సిగాడు ఇస్మాయిల్‌గా మారి చెరువులో దూకుతాడు. 1927లో అంబేద్కర్ నాయకత్వంలో వేల మంది దళితులు చెరువులో దూకి తమ హక్కును పొందడానికి చేసి ప్రయత్నమే ఈ కథకు స్ఫూర్తి. అలాగే పరోక్షంగా కథకుడు మాటలే తప్ప చేతలు లేని హరిజన్ సంఘ్ అధ్యక్షుడిని, కాంగ్రెసు సభ్యత్వం తీసుకుంటే గాని మాదిగల నీటి సమస్య పరిష్కారం గురించి ఆలోచన లేని కాంగ్రెసు స్వభావాన్ని నిశిత విమర్శకు గురిచేశాడు. దళితుల స్వీయ చైతన్యం, కార్యాచరణ మాత్రమే వివక్ష నుండి, అస్పృశ్యత నుండి వాళ్ళను విముక్తం చేయగలరని స్పష్టంగా చెప్పడం ఈ కథ ప్రత్యేకత.

ఇలాంటి తవ్వాయి వస్తే నుండి, కొలకలూరి ఇనాక్ 'ఊరబావి' కథను కలుపుకొని దళితులు ప్రజలందరికి చెందిన నీటి వనరులలో తమవంతు వాటిని పొందడానికి, పన్నిన వ్యూహాలు, వేసిన ఎత్తుగడలు, సాధించిన విజయాలపైన ప్రత్యేక అధ్యయనం అవసరం.

దళిత సమస్యను వస్తువుగా చేసుకొని మహిళలు కూడా కథా రచన చేయటం ఒక విశేషం గొట్టు ముక్కల మంగాయమ్మ వ్రాసిన 'అయ్యోపాపం" కథ (మార్చి 1935 దళిత కథలు సంపాదకుడు - డా॥ కె. లక్ష్మినారాయణ, 1999) వాటిలో మొదటిది. కథా ప్రారంభంలో రచయిత్రి "శునిచైనశ్వపాకీచ పండితాఃసమదర్శినా", అన్న గీతా వాక్యం "విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే, గవి హస్తిని" అని ఉటంకించడం విద్యా వినయాలు గల బ్రాహ్మణుల యందు, కుక్క యందు చండాలుని యందు సమదృష్టికలవారే పండితులు అని చెప్పబడిన మిగిలిన వారందరూ గౌరవించబడుతున్న మన సంస్కృతిలో కుక్క చండాలుడు మాత్రం ఛీత్కారానికి గురి అవుతున్నా రన్నది కఠోర వాస్తవం. ఒక హరిజన యువతి, అస్పృశ్యతా పాపమునకు సంబంధించి అమలులో ఉన్న ఆచారాలు హరిజనులకు ఎంత అవమానకరంగా ఉన్నాయో చెపుతున్నట్లుగా సాగిన కథ. ఎండాకాలంలో బాట సారుల దాహార్తి తీర్చడానికి మజ్జిగ ఇవ్వాలనే చలివేంద్రంలో హరిజనులకు ప్రవేశం లభించలేదు మాల వాళ్ళకు దాహమిస్తే మైల పడిపోతామనుకునే బ్రాహ్మణుల పుణ్యచింతన ఎంత అర్థరహితమైందో ఈ కథ చెపుతుంది. చివరకు ఒక ముస్లిం వాళ్ళు దాహం తీరుస్తారు. మానవత్వం మరచిపోయిన సమాజపు హేయమైన పోకడను రచయిత్రి వర్ణిస్తుంది.

చుండూరి రమాదేవి వ్రాసిన ధర్మతల్లి (1938) కష్టంలో అదుకోవలసిన స్థితిలో ఉన్న మాలలకు బ్రాహ్మణ అగ్రహారాలు, వీధులు తలుపులు మూసిన అమానుష వైఖరిని చిత్రించింది. కలరా వచ్చిన అన్నకు పూజారి పాపయ్య దగ్గర నుండి మందు తీసుకొని రావడానికి బ్రాహ్మణ వీధిలోకి ప్రవేశించిన మాల పిల్లను చూసి ఆ పిల్లను తూలనాడుతూ బిందెడు నీళ్ళను పారబోసిన వితంతువు ప్రవర్తనతో వర్ణ వివక్ష రూపాన్ని ఆనాటి సమాజంలోని వారి హేయమైన స్థితిని పై కథానిక సూచిస్తుంది. "మాయదారి స్వరాజ్యం వచ్చిందని మండి పోతున్నారేం" అని అడుతుంది. 1938 నాటికి స్వరాజ్యం రాకపోయినా అస్పృశ్యుల స్థితి గతులను మార్చడానికి జరిగే ప్రయత్నాలు, హరిజనులకు దేవాలయ ప్రవేశాలను కల్గించడం అగ్రకుల సంప్రదాయ వర్గం యొక్క అసంతృప్తికి, అసహనానికి వ్యక్తీకరణలు ఆ వాక్యాలు. ఆ అసహనం గాంధీని దూషించే వరకు వచ్చింది. ఈ వైఖరిని గమనించి కనుపర్తి వరలక్ష్మమ్మ తన 'శారద లేఖలు'లో శారద కల్పలత అనే స్నేహితురాలికి జవాబు రాస్తారు (1933) గాంధీజిని దూషిస్తూ కల్పలత రాసిన ఉత్తరానికి జవాబుగా ఆమె అవగాహనను సరిచేస్తూ

అస్పృశ్యతను నిరసిస్తూ, పంచముల దేవాలయ ప్రవేశాన్ని సమర్థిస్తూ సంస్కరణల ఆవశ్యకతను నొక్కి వక్కాణిస్తూ రాయబడిన ఉత్తరం.

1934-1938 మధ్యకాలంలో కథలు వ్రాసిన తాడి నాగమ్మ దళిత రచయిత్రి అయినప్పటికి ప్రత్యేకంగా దళిత సమస్యలు వస్తువుగా ఆమె రాసిన కథలు ఏమిలేవు. కాని అంతర్జాతీయ రాజకీయార్థిక పరిణామాల నేపథ్యంలో కథలు వ్రాసిన మేధావంతు రాలైన రచయిత్రి ఆమె. ప్రేమ సమస్య అనే కథలో మొదటి ప్రపంచ యుద్ధ వాతావరణాన్ని స్పృశిస్తూ జర్మన్ నాయకుని, యూదు నాయికను పరిచయం చేస్తుంది. హిట్లర్ జర్మని జాత్యహంకారం యూదు జాతి ద్వేషంగా ప్రకటితమై వారిద్దరి ఎడబాటుకు కారణమవుతుంది. ఈ కథలో నాజీ హింసను గూర్చి చెబుతూ నరకమనేది యెచ్చటనో లేదు. యూదులకు జర్మనీ దేశము నరకము, నీగ్రోలకు అమెరికా దేశము నరకము, భారతీయులకు దక్షిణాఫ్రికా నరకము "మాలలకు హిందూ దేశము నరకము" అని ధిక్కార స్వరాన్ని వినిపిస్తుంది. ఆ మాటలు ప్రపంచ వ్యాప్తంగా కుల, మత, జాతి వివక్ష వేళ్లూనుకొని ఉన్నాయని చెప్పకనే చెపుతుంది. ఆమె దళితులకే ప్రత్యేకంగా నిర్వహింపబడే లేబర్ స్కూలు ఉపాధ్యాయిని.

1920 నుండి అంటు దోషం మానాలంటూ ఉద్యమిస్తూ దానికి అనుగుణంగా సాహిత్య సృజన చేస్తూ వచ్చిన కుసుమ ధర్మన్న హరిజనులకు సవర్ణులకు మధ్య సంఘర్షణను కథా వస్తువుగా ఆరు కథలు రాస్తాడు. అవి (1) మండోదరి - దండోరా (2) మాధవశాస్త్రి - మాదిగ సుబ్బయ్య (3) పల్లమ్మ పడవ ప్రయాణం (4) మాల పోలయ్య- మడుగులో బాపనయ్య (5) ముత్తమ్మ ముడుపు (6) పండితగోష్ఠి - వీరభద్ర పాకయాజి (కుసుమ ధర్మన రచనలు - దళిత దృక్పథం. మద్దునూరి సూర్యనారాయణ ఎంఫిల్ పరిశోధనా వ్యాసం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2001).

దళిత జీవితంలలోని ఆత్మగౌరవ ధిక్కార స్వరానికి కొలకలూరి ఇనాక్ కథలు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఆయన దళితులపై అణచివేతను, హింసను గమనిస్తూనే ఉన్నారు. అంటరానితనం, విద్య ఉద్యోగాలు, పదవులు, రాజకీయాలు, స్నేహాలు, ప్రేమ, మతం, ధిక్కారం, తిరుగుబాటు మొదలైన దళిత జీవిత పార్వాలను వస్తువుగా చేసి వ్రాసిన అనేక కథల నిదర్శనం. ఆ వరుసలో ముందు చెప్పుకోవలసినది ఊరబావి (1969 జులై 2, ఆంధ్రప్రభ).

ఊర బావి కథ నీటి సమస్యను చిత్రించిన కథ. దళితులు నీటి సమస్య కొత్త కాదు. ఊరి నుండి మాల, మాదిగ వేరు చేసి పై మూడింటిని వారికి దూరం చేసిన సవర్ణ దురహంకారాన్ని సవాలు చేస్తూ వాటిని దళితులు అనుభవానికి తీసుకొని రావడానికి 1927లో మహద్ ఎరువులో దళితుల ప్రవేశానికి ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించి దారి చూపాడు. ఇనాక్ కంటే ముందు ఊర చెరువులో నీళ్ళ వాటా కోసం బతిమలాడి భంగపడిన దళితులు ముస్లిం మతంలోకి మారి చెరువులోకి దిగే అర్హతను సంపాదించిన వైనాన్ని శ్రీపాద 'ఇలాంటి తర్వాయి వస్తే అనే కథగా వ్రాసాడు. దాదాపు పాతికేళ్ళ తర్వాత స్వతంత్ర్య భారతంలో కొత్త చైతన్యంతో యుద్ధ వ్యూహాలతో ఆ సమస్యకు పరిష్కరించుకున్న విధానమే వస్తువుగా ఇనాక్ చేత రాయబడ్డ కథ "ఊరబావి". ఎండాకాలంలో వంద గడపలున్న పల్లె బావి ఎండిపోయి ఊరబావి మీద ఆధారపడవలసిన స్థితిలో నాటకీయ పరిణామాలతో వాస్తవికతను చిత్రీకరించిన కథ. ఇందులో ఊరబావిలో చచ్చిన ఎద్దుకళేబరం ఉంటుంది. అందరూ చిదంబరాన్ని అనుమానిస్తారు. అతనికి రెండు సందర్భాలలో అవమానం జరిగింది. ఒకటి పెళ్ళి తర్వాత గుళ్ళో కొబ్బరికాయలు కొట్టడానికి వెళ్ళిన ఆ దంపతులకు గుడిలోకి ప్రవేశాన్ని అడ్డగించడం. రెండు రైల్వేస్టేషన్‌లో భార్యతో సహా కూర్చున్న అతను పెద్దలు వచ్చినా లేవకపోవడంతో అవమానింపబడటం. ఈ రెండిటిని

ఆయన చట్టం ద్వారా పోలీసుల అండతో సాధించడానికి చిదంబరం భార్యనే కారణం అని రచయిత చెప్పకనే చెపుతాడు. ఊరబావి నీళ్లను చిదంబరమే ఇంటికి మోస్తాడు అందరికీ సంబంధించిన నీటి కోసం సవర్ణులను బ్రతిమాలడం ఎందుకు అని చిదంబరం భార్యకు ఉన్నదని పాఠకులకు అర్థం అయ్యేటట్లు కథ నడిపిస్తాడు. వ్యక్తిగతము, సామాజికము అయిన సమస్యకు పరిష్కారంగా మామ చర్మం వలచిన ఎద్దు కళేబరాన్ని మోకులు కట్టి ఆమె బావిలోకి దింపి ఉంటుందని ప్రత్యక్షంగా చెప్పక పోయిన పరోక్షంగా గ్రహింపును వచ్చేటట్లు చేయడంలోనే కనబడుతుంది రచయిత చాతుర్యమంతా బావిని పల్లెకు వదిలేసినాక ఎద్దు కళేబరాన్ని తీయడంలో ఆమె చూపిన చొరవ, ఆవేశం ఆమె పాత్రను స్పష్టం చేస్తుంది. చైతన్యవంతమవుతున్న మాల మాదిగల పల్లెల మానవ ముఖ చిత్రంగా కనబడుతుంది ఈ కథ.

1967లో వెంకటనారాయణరావు 'చెప్పులు' కథ రచించారు. దీనిలో తన కొడుకుకు విద్య నేర్పిన గురువు పంతులు చెప్పులను కాపాడడానికి నిప్పుల్లో కాలిపోయిన రంగయ్య ఉదంతం కంటతడిపెట్టిస్తుంది. దళితుల విశ్వాస పాత్రతను వెల్లడిస్తుంది.

కాళోజి రాసిన తెలియక ప్రేమ తెలిసిదేశం కథలో అంటరాని తనం గూర్చి ఉంది. బోయ జంగయ్య కథలో తాగే నీరు లేక కుక్క చావు చచ్చిన వృద్ధుని వ్యధ ఉంది. నైజాం కాలంలో వృత్తి పనులు, వెట్టి చాకిరి, దొరల అహంకారాన్ని చిత్రీకరిస్తూ అనేక కథలు వచ్చాయి. పొట్లపల్లి రామారావు 'న్యాయం', వట్టికోట ఆళ్వారుస్వామి 'పరిగె', సురవరం ప్రతాపరెడ్డి "సంఘాల పంతులు', ఆవుల పిచ్చయ్య 'నార'.

1948లో పోలీస్ యాక్షన్ తర్వాత కౌలుదారీ చట్టంలోని లోపాలను చిత్రీకరించిన కథ బూర్గుల రామకృష్ణారావు "విద్యుల్లత" హిందుమతంలో దళితులు ఆశించిన మార్పులు పొందలేక పరమతాన్ని ఆశ్రయించిన సందర్భాలు కోకొల్లలు. అలాంటి కథ ఇది. అలాంటి నేపథ్యంలో వచ్చిన కథలు అనేక ఉన్నాయి. అందులో ఒకటి గూడ అంజయ్య రాసిన "ఇనాంశిలుక" 1945లో దళితులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చారు. భూమిని ఇస్తాము అని చెప్పి మతం మార్పిడి జరిగిన తర్వాత ఇవ్వలేదు. "మాల మాదిగల నోట్లో మన్ను పడ్డట్టయింది.. అనే వాక్యం దగాపడిన దళితులు సూచిస్తుంది.

పాత తరం దళిత సాహిత్యంలో దేవాలయ ప్రవేశం, అంటరానితనం, దళితులపైన జరిగిన దాడులు,బడి, గుడి, నీటిసమస్య, వెట్టి చాకిరి, మొదలైన అంశాలను ఆనాటి సాంఘిక సామాజిక పరిస్థితులకు అనుగుణంగా రచయితలు విశ్లేషించారు. ఇవన్నీ దళిత సాహిత్యానికి, నేపథ్యానికి, చరిత్రకు సంబంధించిన విషయాలు. ఇక ప్రస్తుత సమాజానికి వస్తే పాత పునాదులు కూలి కొత్త నిర్మాణాలు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రపంచీకరణ పుణ్యమా అని వైజ్ఞానిక ఆవిష్కరణలు మానవ జీవితంలో పెను మార్పులు తీసుకొని వచ్చాయి. గ్రామాలు వలసలై బుక్కెడు బువ్వ కోసం పట్టణాల బాట పట్టాయి. అపార్ట్‌మెంట్ సంస్కృతులు విలసిల్లిన నేపథ్యంలో కొత్త సమస్యలు ఏర్పడుతున్నాయి. మేథో వలసలతో కన్న భూమికి దూరమవుతున్న చదువుకున్న దళిత తరాలు ఉంటున్నాయి. మార్కెట్ మాయాజాలం, విలాసవస్తువుల విన్యాసాలు దళితుల జీవితాలపై బాగానే ప్రభావం చూపుతున్నాయి.

అంటే ఒకప్పటి దళిత సాహిత్యం ముందుకు తెచ్చిన సమస్యల మూల స్వభావం మారలేదు. రంగు, రుచి, వాసనను మిగుల్చుకొని, దళితులపై మేక వన్నె పులిలా దాడి చేస్తూనే ఉంది. అందుకే ఈ మధ్యకాలంలో వచ్చిన వాదాన్ని నయా దళిత వాదం అంటున్నారు.

కాని నేడు దళిత సాహిత్యం ఎక్కువగా రావడం లేదన్నది వాస్తవం. తక్కువగా వస్తున్నా ప్రపంచీకరణ

నేపథ్యాన్ని ఖచ్చితంగా పట్టుకున్నదని చెప్పవచ్చు. ఇప్పుడు రాస్తున్న కొత్త తరం దళిత రచయితలకు, మారుతున్న విలువలు, సామాజిక స్వరూపం, పునాదుల్లోని వాస్తవ జీవన దృశ్యాలు తెలుసు. పైగా చదువుకొని ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం వల్ల సమకాలీన సమాజం పట్ల నిర్దిష్టమైన అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. కాబట్టి వారు చేసే రచనలు వాస్తవిక పరిస్థితులకు అద్దం పట్టేట్లుగా ఉండాలి. ఊహాజనితంగా ఉండకూడదు. సమస్య యొక్క మూలాలను వెలికి తీయవలసిన అవసరం, అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. దళిత సాహిత్యంపైన ఇంకా విస్తృత పరిశోధన, అధ్యయనం చేయడం ద్వారా సామాజికపరమైన మార్పుకు రచయితలు మార్గం వేయాల్సిన అవసరం ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. ''ఇలాంటి తవ్వాయి వస్తే'' - శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.
2. ఊరబావి - కొలకనూరి ఇనాక్
3. నీలి రాగం సాహిత్య - వ్యాసరచన - కాత్యాయనీవిద్మహే, జనవరి, 2020.
4. దీనజన బాంధవుడు - భాగ్యరెడ్డి వర్మ (జూన్ -15, 2015), టి. ఉడయవర్లు
5. గోలకొండ పత్రిక తొలి దళిత కథ - పబ్లిష్డ్ 12-02-2018.
6. సాహిత్యంలో నయా దళిత వాదం (02.04.2014)

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత గతి పై - కలము గళ పౌరుషం

- డా॥ ఎక్కిరాల వెంకటనర్సయ్య, రసాయనిక ప్రధాన శాస్త్రవేత్త, ఐ. ఐ. సి. టి, హైదరాబాద్.

దాదాపుగా 180 సంవత్సరాల క్రితం, పూణే పట్టణ మందు, దేశభక్తిని అణువణువునా నింపుకున్న, వస్తాదుల కుటుంభంలో (5-9-1840) జన్మించిన బాలిక ముక్తా సాల్వే. నూనుగు మీసాలతో, ఆటవిక మూకలను అంతం చేయటానికి అరణ్యానికి బయలుదేరిన రాముడు, పసుపు పారాణి చెదరక ముందే, పద్మవ్యూహంలో దూకి, ప్రత్యర్థులను గడగడలాడించిన వీరఅభిమన్యుడు, అద్వైత సిద్ధాంతాన్ని బోధించి, అందరిని ఏకం చేసిన, ఆది శంకరాచార్యుని పరంపరలో, 14 ఏళ్ళ వయసులో, కలము పట్టి, కులకంపుతో కూడిన, భారతీయ సమాజానికి, చురకలు అంటించిన, వీరసూర వనితా, ధ్రువతార, మన కథానాయకి ముక్తా సాల్వే.

సంగీత సామ్రాజ్య పితామహుడు, బృహద్దేసి గ్రంథకర్త, మాతంగ మహర్షి పేరున, మహారాష్ట్రలో కొందరు మాతంగ (మాంగ్) అను కులముతో పిలవబడుతున్నారు (మాతంగ, మాదిగ పర్యాయ పదాలు). మాతంగ కులము నందు ఎందరో మహాపురుషులు జన్మించారు. క్రీస్తుకు పూర్వం జైన ధర్మాన్ని ప్రచారం చేసిన, 7వ గురువు సుపార్శ్వనాథుడు, 1వ శతాబ్దంలో బౌద్ధాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన కశ్యప మాతంగుడు లాంటి, ఎందరో మహా మూర్తులకు జన్మనిచ్చినది మాతంగ వంశం. అందుకేనేమో మహాకవి కాళిదాస్, మాతంగ కన్యాం మానసా స్మరామి అని కీర్తించాడు. ఇంతటి ఘన చరిత్ర కలిగినది మాతంగ కులం. వీళ్ళు ఎందుకు అంటరాని వాళ్ళు అయినారో, ఎప్పటి నుండి అయినారో, ఏ పుస్తకంలోనూ దొరకదు. కాని, సమాజంలో మాత్రం అమలు జరుగు తున్నది. మహారాష్ట్రలో అంటరాని తనమును ఎదుర్కుంటున్న కులాలలో మాతంగ్, మోచి, మహార్, చంబార్, దోర్ మొదలగునవి కలవు. వీళ్ళ మధ్య సత్సంభందాలు పెద్దగా లేవుకాని, అంటరానితనం అనే బంధం మాత్రం కలదు.

కలము, హలము, కరవాలము, ఈ మూడు ఆయుధాలు చేసే పని వ్యవసాయమే, కాని వాటి ఫలితాలు వేరు వేరుగాను, వైవిద్యంగానూ ఉంటాయి. హలము ద్వారా వెలువడే ఫలితాలు, ఆహారం కోసం. కరవాలము ద్వారా వెలువడే ఫలితాలు అధికారం కోసం. కలము ద్వారా వెలువడే ఫలితాలు, సర్వకాలములందు, సభ్యసమాజాని కి, చుక్కానిలా దారిచూపుతూ, చైతన్యాన్ని కలిగిస్తూ, సజీవంగా ఉంటాయి. ఈ సందర్భంలో మహాకవి గుర్రం జాషువా కలము నుండి జాలువారిన అమృత వాక్యాలు:

రాజు మరణించే ఒక తార రాలిపోయే - కవియు మరణించే ఒక తార గగనమెక్కి,
రాజు జీవించే రాతి విగ్రహములందు - సుకవి జీవించే ప్రజల నాలుకలయందు.

క్రాంతివీర్ సాల్వేగారి సహాయ సహసారంతో, చదువుకొని, కులాంతర వివాహం చేసుకొని, సమాజ ఉద్ధరణ దృష్టితో, జ్యోతిరావు ఫూలే-సావిత్రిభాయ్ దంపతులు, బాలికల కోసం, పుణేలో ఒక పాఠశాలను 1-1-1848 లో ప్రారంభిస్తారు. ఆ పాఠశాలలో చేరిన, 8 మంది బాలికలలో, ముక్తాసాల్వే ఒకరు. ఈమె క్రాంతివీర్ సాల్వేగారి మనుమరాలు. ఆ పాఠశాలలో చదివిన ముక్తాసాల్వే, పదునాలుగు సంవత్సరాల వయస్సులో, నాటి సమాజం లో అంటరాని వాళ్ళ స్థితి గతులపై ధ్వజమెత్తినారు. సనాతన ధర్మముపై సవాలు చేసినారు. మాంగ్, మహార్ ఆచారాలు దుఃఖభరితమేనా అను శీర్షికతో ఒక వ్యాసం మరాఠిలో వ్రాయటం జరిగింది. ఆ వ్యాసము ద్యానోదయ అను పత్రికలో 15-2-1855 వ సంవత్సరం నాడు ప్రచురితమైనది.

కలము, కత్తికంటే పదునైనది, అని ముక్తాసాల్వే నిరూపించారు. ఈ వ్యాసమును Forgotten Liberator అను శీర్షికతో, సావిత్రి భాయ్ జీవన పోరాటం అనే పుస్తకంలో ప్రచురించబడినది. 1855 నుండి నేటి వరకు అంటరాని వాళ్ళు అని చెప్పబడుతున్న కులాలవారిపై జరుగుతున్న వివక్ష గురించి ప్రచురితమైన వ్యాసాలలో, దీని కంటే గొప్ప వ్యాసం మరొకటి లేదు, అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాసం అజ్ఞానం అనే అంధకారం నుండి జ్ఞానం అనే వెలుగు వైపు, అణగారిన వర్గాలను నడిపించుటకు, ఉదయించే సూర్యుడులాగ, కనపడిన మొట్టమొదటి వ్యాసం. అంతటి గొప్ప వ్యాసాన్ని, దళిత రచనలు చేసేవారు ఎందుకు ప్రస్తావించుటలేదో, వారి విజ్ఞతకే వదిలేద్దాము. సాహిత్యమంటే ఏమిటో ! సమస్యలను ఏవిధముగా లేవనెత్తాలి, బాధ్యులకు ఏవిధముగా బుద్దులు చెప్పాలి, బాధితులు ఏవిధముగా సమస్యలను అధికమించాలో, ఈ వ్యాసము చక్కగా వివరిస్తున్నది. కవికి భయం లేదు అని రుజువు అయినది.

సృష్టి కర్త అయిన దేవుడు, ఒక్కడే అయిఉండి, మానవులందరిని తానొక్కడే సృష్టించినట్లైతే, నాలాంటి ఒక మాతంగ్ బాలిక హృదయం, ఎందుకింత బాధతో నిండి ఉంటుంది. మాంగ్, మహారులు మనుషులే కదా!. జంతువుల కంటే హీనముగా ఎందుకు చూడబడు తున్నాము?. అని నాలో నేను ఆలోచిస్తున్నప్పుడు, దేవుడు నా హృదయంలో ప్రవేశించి, కలము నాతో పట్టించి, ఈ వ్యాసాన్ని వ్రాపించాడు.

"సృష్టి కర్తను నేను ఒక్కడినే. సృష్టినంతా నేను ఒక్కడినే చేశాను. మాతంగ్, మహార్, బ్రాహ్మన్, అందరిని నేనే సృష్టించాను. అందరిని సమానంగానే సృష్టించాను. ఎవరు ఎక్కువ కాదు, ఎవరు తక్కువ కాదు. సర్వజనులు సమానమే. సనాతన ధర్మం వేదముల సారాంశమే. వేదములు అందరికి సంబందించినవి. వేదములను అందరు చదువ వచ్చును. కాదు అని ఎవరైనా అభ్యంతరం పెడితే, వాళ్లకు ధర్మంపైన నమ్మకం లేదు, దేవుని పైన విశ్వాసం లేదు, అనేది సత్యం. ధర్మాన్ని, దైవాన్ని వాళ్ళ స్వార్ధం కోసం వాడు కోవటం మహా పాపం. ఇటు వంటి వాళ్లతో సనాతన ధర్మానికి నష్టమే కాని, లాభం ఏ మాత్రము ఉండదు."

పీష్వారాజు బాజీరావు పరిపాలనలో, అంటరాని వాళ్ళు అనబడే వారిని, అగ్రవర్ణాలు అని చెప్పుకునే వాళ్ళ వీధులలో కూడా నడవకూడదని ఆంక్షలు విధించారు. దీనిని అధికమించిన, మాంగ్, మహారుల తలలునరికి, బంతిలాగా మైదానంలో, ఆటలు ఆడుకుంటున్నారు. వాళ్ల ఇల్లు కూలగొట్టి, భూములను ఆక్రమించుకొని భవనా లు కట్టుకుంటున్నారు. అణచబడిన జాతుల స్త్రీలు, ప్రసవ వేదన పడుతున్నపుడు కూడా, పైకప్పులేని నివాసాలే దర్శనమిస్తున్నాయి. రాజుకు తన రాజ్యంలో ప్రజలు అందరూ, తన బిడ్డలతో సమానమే అని ధర్మ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి కదా !. ప్రజల బాగోగులు చూడని ప్రభువు, పాలనకు అర్హుడేనా ?. ఆయనకు పాలనా ధర్మంపైన, కనీస జ్ఞానమైన ఉన్నదా ?. బూజు పట్టిన సిద్ధాంతాన్ని వల్లించే ఓ బ్రాహ్మణ పండితులారా ! ప్రజలు ధర్మముగా, ఎలా జీవించాలో, ప్రభువు ధర్మముగా ఎలా పాలించాలో, చెప్పటం మీ బాధ్యత. ప్రభువుకు, ప్రజల కు ధర్మ సూత్రాలను చెప్పవలసినది మీరే. ప్రజలు అందరు కలిసి మెలిసి జీవించండి అని మీరే చెప్పాలి, ఎందు కంటే, మీరు ధర్మ గ్రంధాలని చదువుతున్నారు కనుక. మీకు ధర్మం తెలుసు కనుక. ధర్మం చెప్పటం, మీకు చేత కాక పోతే, మీరు చెప్పటం మానేయండి. నేను చెప్పేది వినండి. సనాతన ధర్మాన్ని భ్రష్టుపట్టిస్తున్న మ్లేచ్చులారా !, సర్వజనులకు చదువులు చెప్పాలనే కనీస జ్ఞానం లేని చెండాలులారా !. రాజుకు ధైర్యంగా సరైన సలహాలు ఇవ్వచేతకాని సవటల్లారా !. మీరు ధర్మ సూత్రాలు వల్లించుటకు ఏమాత్రమూ అర్హులు కారు. యజ్ఞోప వీతాలు వేసుకోవటం ముఖ్యం కాదు, దాని విలువ తెలియాలి. బ్రహ్మజ్ఞానం కలిగినవాడే బ్రాహ్మ ణుడు. మీలో ఎందరికి బ్రహ్మజ్ఞానం ఉన్నది ?. బ్రహ్మజ్ఞానం ఉన్నవాడికి, ప్రతి వస్తువులోను దేవుడు

కనపడతాడు. అంటరానివాడు, అంటగలిగినవాడు అనే నీచ అభిప్రాయాలూ మీలో ఎలావస్తున్నాయి ?. బ్రాహ్మణత్వాన్ని బ్రష్టు పట్టిస్తున్న బహిష్కృతులు మీరు. మీలాంటి మూరు?ల కంటే, పరదేశీయులైన బ్రిటిష్ వాళ్ళు మంచిదేమో అనిపిస్తున్నది. మీలాంటి దుష్టుల వల్లననే, ఈదేశం పరదేశీయుల వశమైనది. సనాతన ధర్మం, నాశనమై పోతున్నది. పరాయి ధర్మాలు, భరతభూమిలో ప్రవేశించటానికి మీలాంటి వాళ్లే కారణం. ఇకనైనా బుద్ధి మార్చు కోండి, మనుషులను మనుషులు గానే చూడండి, మీరు కూడా మనుషులే అని నిరూపించుకోండి. మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తిని, అణువణువునా నింపుకొని ప్రవర్తించండి, అంటూ గర్జించారు ధీరబాలిక ముక్తా సాల్వే.

ఓ నా జాతి ప్రజలారా ! మీలో కూడా కొంత బేధ భావజాలం ఉన్నది, దానిని వదులుకోండి. మహర్, మాతంగ్ అనే బేధాలు మానుకోండి, అందరు ఒకటిలాగానే కలిసిమెలిసి జీవించండి. మీ ఇంట్లో ఉన్న స్త్రీలను జాగ్రత్తగ చూసుకోండి, వాళ్ళు ఆరోగ్యంగా ఉంటేనే, మీ ఇల్లు ఆనందంగా ఉంటది. మీకు రోగాలు వస్తే, వైద్యం చేయటా నికి, మీలో డాక్టర్స్ లేరు. మందులు ఎవ్వరూ ఇవ్వరు. మీ ఇల్లును, శుభ్రముగా ఉంచుకోండి, మీరు శుభ్రముగా ఉండండి. ఈ సమాజంలో ఉన్న అసమానతలు తగ్గాలంటే, అవి ఎవరో తీసివేస్తే పోయేవి కావు. అవి మన మార్పుతోనే ముడిపడి ఉన్నాయి, అని గుర్తించండి. మీరు బలహీనులే కావచ్చు, మీరు పేదవారే కావచ్చును, కాని విజ్ఞానం మాత్రం, వీటన్నిటినుంచి విముక్తి చేస్తది. మానవుని కంటే, బలమైనది ఆకలి. కష్టపడి, ఆర్థికంగా బలపడి, ఆకలిని జయించండి. ఎన్ని కష్టాలైనా ఎదుర్కొని, చదువుకోండి, విజ్ఞానాన్ని పెంపొందించు కోండి. విజ్ఞానమే అన్ని సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపుతుంది. అప్పుడే మనకు సమాజంలో గౌరవం లభిస్తుంది, అని అణచబడిన జాతులకు, హిత బోధచేసిన మహనీయురాలు, ముక్తా సాల్వే.

భారతదేశ చరిత్రలో, మహిళాలోకం నుండి అందునా అంటరాని కులమని నెపం వేయబడ్డ కులం నుండి ఇంతటి ధీశాలి, అనసూయ, అరుంధతి పరంపర అనుటలో సందేహమే లేదు. కనీసం ఇకనుండై నా ఆ మహనీయురాలి ఆశయాన్ని, ఆవేదనని సాహితి పరులు గుర్తిస్తారని, కోరుకుంటున్నాను.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్న గారి పాలేరు నాటకం – సామాజిక చిత్రణ

– డా॥. రుద్రాక్షి పాపని వేరుగు, పి.జి.టి. తెలుగు, టి.యస్.యమ్.యస్. టేకులపల్లి, పెనుబల్లి మం॥, ఖమ్మం జిల్లా.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన సాహితీ వేత్తలాలో ప్రసిద్ధి చెందినటువంటి వారు బోయి భీమన్న గారు. ఎందరో కవులకు మార్గదర్శకులు సంప్రదాయ కవి సాహిత్య చరిత్రలో నూతన యుగకర్త, వైతాళికుడు, ప్రఖ్యాతి పొందిన దళిత కవి, గొప్ప విమర్శకుడు, గేయ రచయిత, ఉత్తమకవి, తాత్త్వికుడు, సోషలిస్టు, హేతువాది, మానవతావాది అయిన బోయి భీమన్న గారు తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ, మామిడికుదురు గ్రామములో 1911 సెప్టెంబరు 19 న బోయి పల్లయ్య, నాగమ్మ దంపతులకు జన్మించారు. భీమన్న తండ్రి వల్లయ్యగారు అద్వైతి, వేదం తెలిసిన వారు సీతారామయ్య గారి దగ్గర పాలేరుగా ఉండేవారు. కోనసీమ ప్రజా జీవనం, అచ్చటి పచ్చని పంటపొలాలు, వ్యక్తులు ప్రభావం, "పాలేరు" నాటకంలో స్పష్టంగా కన్పిస్తాయి. కొంతకాలం పాలేరుగా కూడా పనిచేశారు భీమన్నగారు. 1922 లోనే సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించారు. మొదటగా "పాలేరు" నాటకాన్ని రాశారు. మధుబాల, అశోకవనిలో రాముడు, మణిమాసం వంటి లఘుకావ్యాలు, దీప సభ, రాగవైశాఖ మహాకావ్యాలు. అనాదికోన నుంచి అనంతత్వంలోకి, గుడిసెలు కాలిపోతున్నై, శివాలికలు వంటి వచన కవితా కావ్య సంపుటాలు. మానవుని మరొక మజిలి. పైరు పాట, పాలేరు, కూలిరాజు రాగవాసిష్టం, బాలయోగి, ఆదికవి వాల్మీకి, పడిపోతున్న అడ్డుగోడలు చిత్ర కళా ప్రదర్శనం, ప్రగతి, అసూయ వంటి రూపకాలు. 1945లో 'పాలేరు' నాటకం బహుళ ప్రచారం పొందింది. ఈ నాటకం ద్వారా దళితుల అభ్యున్నతికి కృషి చేశారు బోయి భీమన్నగారు.

ఈ నాటకాన్ని సూర్యప్రకాశరావుగారికి అంకిత మిచ్చారు. పాలేరు నాటకం గురించి భీమన్నగారి ముందుమాటలో ఇలా అన్నారు.

"పాలేరు అంటే ఎవరు? యజమాని క్రింద బానిసలా పనిచేసే ప్రతి అస్వతంత్రుడూ పాలేరే. అట్టి ప్రతివాడూ తన బానిసత్వాన్ని తొలగించుకోవడానికి నిరంతరం కృషి చేయవలసే ఉంది. ఇదొక ఎడతెగని సమస్య. దీనికి ముగింపు లేదు. అయినా, పోరాటం కొనసాగక తప్పదు." ఈ నాటకం ప్రారంభ గేయంలోని ఉద్బోధ ఇదే,

"బానిస తనమును బాపుమురా" అనేది అంటూ తెల్పారు భీమన్నగారు.

కుల, మత, బేధ భావం లేకుండా అందరూ చదువుకొని జ్ఞానాన్ని ఆర్జించాలంటాడు.

నాటి సామాజిక సమస్యలను ఆయా పాత్రల ద్వారా చూపించారు. భీమన్నగారు ఈ నాటకంలో దళితుల సమస్యలు, సంఘంలో వారు పడే బాధలు అగ్రవర్ణాల అణచివేత, విద్య లేకపోవడం వలన అజ్ఞానాంధకారంలో మునిగిపోవుట, వారి ఆర్థిక స్థితిగతులు మొదలైన సామాజిక సమస్యలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

ఈ నాటకంలో పదహారు రంగాలు ఉన్నాయి. సామాజిక సమస్యలు, సమసమాజ చిత్రణ ఇందులో కన్పిస్తాయి. పేదల శ్రమను దోపిడీ చేసేవారు, నిరుపేదల, కూలీల జీవన చిత్రణ వారు అనుభవించు కష్టాలు విశదీకరించారు.

మానవుడు సంఘజీవి, సమాజం నుంచి మానవుడ్ని విడదీసి చూడలేము. సమాజంలో అంతర్భాగం మానవుడు మానవుని మానసిక స్థితి వలన సమాజంలో మార్పులు చోటుచేసుకుంటాయి. అతని వ్యక్తిత్వంపై సమాజ ప్రభావం తప్పకుండా పడుతుంది. ఇటువంటి మార్పులతో కూడా ఉన్న సామాజిక లక్షణాన్నే "సామాజికత" అంటారు. ఇటువంటి సామాజిక పరమైన విషయాలనే ఇతివృత్తంగా గ్రహించారు భీమన్నగారు.

ఇందలి పాత్రలను గమనించినట్లయితే వెంకన్న ఈ నాటకంలో ముఖ్య పురుషపాత్ర, కుబేర్రావు దగ్గర పాలేరు అతని దగ్గర నుంచి వెళ్లిపోయిన తరువాత, కలెక్టరు వెంకటేశ్వరరావు అవుతాడు. కుబేర్రావు మరొక పురుషపాత్ర, ఈ నాటకంలో భూస్వామి, కామందు, కూలీలను నీచంగా చూస్తాడు. సుందరం ఆధునిక భావాలు కల కాలేజీ విద్యార్థి, ఉపకారి పల్లెటూరి బడిపంతులు, సంస్కారభావాలు కలిగి ఆధునికంగా వ్యవహరిస్తాడు.

ఈయన రచించిన నాటకం 'పాలేరు' గొప్ప ప్రజాధరణ పొందింది. ఆంధ్రదేశంలో నాడు చాలా చోట్ల ప్రదర్శింపబడింది. ఈ నాటకం ద్వారా భీమన్నగారు ప్రజలలో గొప్ప చైతన్యాన్ని తీసుకువచ్చారు అనుటలో అతిశయోక్తి లేదు. ఈ నాటకం ద్వారా నాటి సామాజిక ఆర్థిక, పరిస్థితులు అగుపడతాయి. సమాజంలో కుల, మత పరమైన విషయాలు తేటతెల్లమౌతాయి. ఆంగ్ల విద్యా ప్రభావం ద్వారా ఆధునిక భావజాలాన్ని నాటి యువతరం అవలంభించు విధానాన్ని తెల్పారు భీమన్న గారు.

మానవ జీవనానికి అడ్డంకులైన సాంఘిక దురాచారాలు కుల వివక్ష, అస్పృశ్యత, అంటరానితనం వంటి సంప్రదాయాలను రూపుమాపడానికి భీమన్నగారు "పాలేరు" నాటకం రాశారు. ఆందులో దళితుల జీవన చిత్రణ కన్పిస్తుంది ఈ నాటకంలో సమకాలీన సమస్యల్ని ప్రస్తావిస్తూ సమాజ వికాస పరిణామానికి మానవజాతి సమిష్టి సంక్షేమానికి తోడ్పడేదే గొప్ప నాటకం అన్న ఆర్థర్ ముల్లర్ పలుకులు భీమన్న గారి నాటకాలకు ప్రత్యక్ష సాక్షాలు.

మన సమాజపు, ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు నిర్మూలించడానికి తన సాహిత్యం ద్వారా కృషి చేశారు. అంటరానితనాన్ని పోగొట్టుటకు కృషి చేశారు. పాలేరు నాటకంలోని కథను గమనించినట్లయితే గోదావరి ప్రాంతంలో కాకినాడ వైపు రైతువాడ ఒక చిన్నగ్రామం కుబేరయ్య అనే వ్యక్తి చిన్న సవర్ణ భూస్వామి. పాలేర్లతో వ్యవసాయం చేసుకుంటాడు. అతని దగ్గర పనిచేసే పాలేర్లలో పుల్లయ్య అనే వ్యక్తి ముఖ్యమైనవాడు. అతని కొడుకు వెంకన్న వీరేశు మరొక పాలేరు. ఈ ముగ్గురూ అంటరానివాళ్లే. వెంకన్నను కూడా పాలేరుగా పెడతాడు పుల్లయ్య. వెంకన్నకు మాత్రం చదువుకోవాలని ఉండేది. ఆ ఊరిలోని ఉపాధ్యాయుడైన ఉపకారి, విద్యార్థి వనబాల అతణ్ని ప్రోత్సహిస్తుంటారు. కామందు కుబేరయ్య, పుల్లయ్య వ్యతిరేకిస్తారు. ఈ ఇద్దరూ వెంకన్నను చాలా బాధలు పెడతారు. పాలేరు నాటకంలో ఉపాధ్యాయుడైన ఉపకారి బడిలో చేరని పిల్లల తల్లిదండ్రుల గురించి వర్ణాంతర వివాహాల గూర్చి ఇలా అంటారు....

"గోచిపెట్టుట నేర్చుకొనగానే బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులారా!
నడవ నేర్చుటతోనే బుడతని గొంపోయి
పాలేరు తన ముంచు మాలలార!
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించి
మనుగడలే మాపు జనకులారా!
వంటయిల్లొకటె ప్రపంచమ్ముగా చేసి
తనయల నేడ్పించు తల్లులారా!
జాతి శక్తి విహీనమై చచ్చుచుండ
కన్నులను మూసికొంటిరే గాఢనిద్ర?
శక్తికంతకు మూలము చదువుకాన
బడికి బంపుడు మీ వంశ వర్ధనులను

అంటూ అక్కడి బడి పిల్లల తల్లిదండ్రులతో చెప్తూ ఉంటాడు. కానీ ఆ గ్రామ ప్రజలు ఉపకారిని లెక్క చేయకుండా ఉంటారు.

పాలేరు నాటకంలో పొలంలో పశువుల్ని మేపుతున్న వెంకన్న ఈ విధంగా బాధపడుతూ ఉంటాడు.

సీ॥ "మాలను గావించి - పాలేరుగా జేసి
కా మందు కాలికి గట్టినావు

అంటరాదని చెప్పి పెంటల పాల్జేసి
నీచుల మను పేరు నిల్పినావు
చదువు సంధ్యలు లేక జంతువులను బోలె
ఊరి వెల్పల చావనుంచి నావు
అజ్ఞాన తిమిరాల యడుగున బడద్రోసి
బరిగేసి యొదనొక్కి పట్టినావు
వెలుగు జూపవు, నేర్పవు వెలుగు సరళి
దాస్యముం బాపుకొనీవు ధైర్యమూని
మనిషిగా నన్ను మననీవు మహినికేల
చంపుకొని పొమ్ము చాలింతు జన్మమింక"

అంటూ దళితుల మానసిక పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చిత్రించారు.

అదే విధంగా దళితుల వెనుకబాటుతనానికి అవిద్య హేతువుగా చెప్పి, కూలి పనిచేసే బానిసత్వ బ్రతుకును విడనాడాలంటే నిరక్షరాస్యతే ముఖ్య కారణమని తలంచి అందరూ విద్యావంతులు కావాలని అంటూ ఉపకారితో ఈ విధంగా నాటకంలో అనిపిస్తారు భీమయ్య.

"ఒక వైపున సనాతన కుల దివాంధులు
శపియించి నిప్పులు జల్లుచుండ
ఒక వైపు ప్రగతి కాముకు యువకులు
ప్రేమ కాన్కలు సమర్పించుచుండ
ఒక వైపు భారతాభ్యుదయ నిరోధకుల్
నోటి కత్తులు చాలనూరు చుండ
ఒక వైపు జాతి ఏ కొన్ముఖ మగుచుండ
దాస్య శబుంఖలలు బ్రద్ధలగు చుండ
కుటిలకులబేధ కుడ్యాలు కూలద్రోసి
పూర్వవైభవ శిఖరాల బూజు దులిపి
తెలిసి జాతి నిద్దుర లేచి నడవ
బాల బెండ్లాడె వెంకటేశ్వరుడు, నేడు"

రైతువాడ గ్రామం చుట్టూ విశాలమైన పంటపొలాలు. పొలాల మధ్యలో అక్కడక్కడ చెట్లు, తోటలు, వ్యవసాయ కూలీలు, పాలేర్ల పేటలు పొలాలకు ఆనుకునే ఉంటాయి. కుబేరయ్యగారి ఇంటి దగ్గరలోనే మరొక ధనవంతుల కుటుంబం ఉంది. వారు కుబేరయ్యలా సంకుచిత మూర్ఖ, కులతత్వ వాదులు కారు. ఆ సంపన్న కుటుంబానికి చెందినదే వనబాల. ఆమె అన్నయ్య సుందరం కాకినాడ కాలేజీలో చదువుతున్నాడు.

ఖామందూ, తన తండ్రి పెట్టే హింసలను భరించ లేకపోతాడు. వెంకన్న వారి నుంచి బయటపడి కాకినాడ కు పారిపోయి శరణాలయంలో చేరి, వెంకటేశ్వర్రావై, ప్రైవేటుగా పరీక్షలు పాసై, ప్రభుత్వాధికారి డిప్యూటి కలెక్టర్ అవుతాడు. తర్వాత కుబేర్రావుకు వెంకటేశ్వరరావు మేలు చేయటం జరుగుతుంది. బాల వెంకటేశ్వరరావుల వివాహంతో కథ ముగుస్తుంది.

ముగింపు :

బోయి భీమన్నగారు ఈ నాటకం ద్వారా నాటి ప్రజల ఆర్థిక, సామాజిక, పరిస్థితులు తెల్పారు. నవ్య సాహిత్యానికి దారిని చూపించారు. కుల, మత, వర్గ రహిత సమాజాన్ని కాంక్షించారు. సమాజంలో ఉన్న వ్యవసాయ కూలీ వర్గాలలో మార్పు చోటు చేసుకుంది. తెలుగు సాహిత్యంలో "పాలేరు" గొప్ప నాటకం అని చెప్పవచ్చు. ముఖ్యంగా దళితులను నవ్య పథాన నడుపుటకు ఈ నాటకం తోడ్పడింది. ఈ నాటకం ద్వారా బోయి భీమన్న గారు, ఆధునిక కవులలో గొప్ప దళిత కవిగా వెలుగొందు తున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1) పాలేరు - బోయి భీమన్న - 1988
2) బోయి భీమన్న రూపకాలు - తాత్విక చింతన - డా॥ తక్కళ్ల బాలరాజు 1996
3) భీమన్న ఉగాదులు - 1983

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యం – ఆర్థిక చైతన్యం

– డా॥. ఎన్. సుజాత, పి.ఆర్. కళాశాల, కాకినాడ.

ముప్పుఘటించి వీనికులమున్ గబళంచి దేహమున్
బిప్పి యొనర్చు నీ భరతవీరుని పాదము కందకుండగా
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే
దెప్పుడు నప్పువడ్డది సుమీ భరతావని వీనిసేవకున్"
వాని ఱెక్కల కష్టంబు లేనివాడు
సస్వరము పండిపులకింప సంశయించు
వాడి చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టువానికి భుక్తిలేదు"

దళితుల ఆర్థిక దోపిడీని "గబ్బిలం" కావ్యం ద్వారా తెలియజేసిన ప్రతిభాశాలి గుర్రం జాషువ. నిర్ణయిస్తుంది. అస్పృశ్యుల్లో చైతన్యం పెరిగే కొద్ది వాళ్ళకి ఆత్మగౌరవ సమస్య ప్రధానమైంది. ఒక సమాజంలో వాడి పుట్టుకను బట్టి వాడిని అధఃపాతాళంలోకి తొయ్యడం అనే భావన వాళ్ళను వేధించింది" అని కత్తి పద్మారావు గారు అన్నట్లు దళితుల ఆర్థిక పరిస్థితి, పేదరికాన్ని, ఎన్నో అవమానాలను అనుభవిస్తూ వారి జీవితాన్ని అత్యంత దుర్భరంగా కొనసాగిస్తున్న విధానాన్ని సాహిత్యంలో ఎందరో రచయితల సామాజాన్నికి తెలియజేసారు.

ఆర్థిక అసమానతలపై కన్నా, సాంఘిక అసమానత లపై ఎక్కువగా ప్రతిస్పందన దళిత సాహిత్యంలో కనిపిస్తుంది. జనం పేదవాళ్ళు కావడం వల్ల తక్కువ కులస్తులు కావడం లేదు. తక్కువ కులస్తులుగా పుట్టడం వలన పేదవాళ్ళు అవుతున్నారు. అందుకే ఇక్కడ ఆర్థిక, రాజకీయ సమానత్వంకోరే వాళ్ళు దీనికి ఆటంకంగా నిలబడుతున్న కులవ్యవస్థను నిర్మూలించాల్సి వుంది.

దళితుల పట్ల అగ్రకులాల వాళ్ళు చూపుతున్న మౌఢ్యాన్నికి భారతదేశంలో మానవత్వం నశిస్తూ వచ్చింది. సామాజిక స్థబ్దత ప్రారంభమైంది. అప్పటి నుంచి భారతీయ సమాజంలో అభివృద్ధి కుంటుపడింది. మనిషిని అంటుకోకపోవడానికి ఒక ధర్మశాస్త్రం రూపొందించి దానిని అగ్రకులాల వాళ్ళచేత రాజుల చేత అంగీకరింప చేయటం సమాజంలో అసమానతలకు దారితీసింది. మనిషిని మనిషిగా చూసే తత్వం పోయింది.

అందుకే "పంచమవేదం"లో శ్రీ సతీష్ చంద్ర గారు "మనుధర్మ శాస్త్రం" పై ధ్వజమెత్తారు. మనువుపై మనుస్మృతి పై, అంరానితనం పై, ఆర్థిక వివక్షతపై పోరాటాన్ని చేయాలని రచయితలు అందరూ పిలుపు నిచ్చారు.

"దేవుడి కాళ్ళలోంచి భుజాల వరకూ
ఎగబాకిన ధమనులు మీరు
మను ధర్మాన్ని మనీపర్సులో
ముగ్గబెట్టే వుంటారు"
అంతకు మనుధర్మం పై విరుచుకు పడ్డారు
అలగా బతుక్కులో మాట్కా ఆడుతున్న
జాతి తక్కువ జూదగాడా
నువ్వు దాచుకున్న సూర్యోదయాన్ని భుజాన వేసుకొని
బతుకురాత్రిలో వేక్కువకోసం పరిగెత్తే నికాళ్ళకింద
నువ్వు కోటానుకోట్లు సేసపు పెంకులు పరిచినా
నీ పిచ్చిగానే ... రేపు తెల్లారి తీరుతుందిరా తండ్రీ"

ఒక దళిత సంసాను స్వగతం' అనే కవితలో మద్దూరి వారు ఆర్థిక అసమానతల్ని సంపన్నుల దళితుల పట్ల చూపించిన ఆర్థిక దోపిడీని వీరు తీవ్రంగా విమర్శించారు

"కాటాకోసం దాదాన్ని నినాదాన్ని చేసిన నీకు
బతుకంటే నీ కొక పెద్ద మొత్తాల పాదుపు పథకం కావచ్చు,
చందా వసూళ్ళలో లెక్కలోకిరాని చిలక్కట్టుళ్ళు కానవచ్చుకానీ

మూడు సింహాలకు బదులు మహల్ వీరుణ్ణి ధరించమని

రూపాయిని చిత్రవధ చేస్తున్న అలెగ్జాండర్‌ని నేను"

మద్దూరి వారు దళితులను ఆర్థిక దోపిడికి గురా కాకుండా, అగ్రవర్ణాల వారి రూపాయిలకు లొంగి పోకుండా దళితులు మేలుకోవాని తెలిపారు.

దళితులు రాజకీయంగా ఎదగడం, అధికారాన్ని చేపట్టడం, సమర్ధవంతంగా పరిపాలించడం వంటి వాటి కోసం ఈ దేశం కొన్ని సౌకర్యాలు కల్పించింది. అయినా అసౌకర్యాలు నేతి బీరకాయలో నేయి ఉన్న చందమే అన్నట్లు కనిపిస్తుంది. భారతదేశం రాజ్యాంగం దళితులకు రిజర్వేషన్లు కల్పించింది. అయితే రాజకీయంగా వారు సమగ్రంగా ఎదగలేని స్థితి కులం నిత్యం వారిని వెంటాడుతూ ఉంటుంది.

రిజర్వేషన్లు పేరుతో ఇచ్చేరాయితీలు కేవలం వడ్డీ మాత్రమే అని, ఇంక అసలు ఎప్పుడు తీరుతుందని డాక్టర్ కేండపల్లి సుదర్శన్ గారు ఇలా ప్రశ్నించారు.

తరతరాల శ్రమదోచిన
రుణగ్రస్తపు దొరలారా
అసలు ఎప్పుడు తీరుస్తారు,
వడ్డీ మాత్రమే రిజర్వేషన్లు

కత్తి పద్మారావు గారు భారతదేశంలో అస్థిహక్కు కులతత్వం వున్నంతవరకు రిజర్వేషన్లు అస్థిహక్కు కులతత్వం వున్నంతవరకు రిజర్వేషన్లు వుండాలని "ప్రతిభ" కవితలో నిర్దేశించారు.

"భూమిని పరిశ్రమలను
జాతీయ చేయండి
రిజర్వేషన్లు ఎత్తివేయండి
సాంత ఆస్థి - కులంపట్టు
ఉన్నంత వరకు
రిజర్వేషన్ తప్పదండి"

భారత రాజకీయ సమాజంలో ఆధిపత్యం, అణిచివేత, దోపిడీ వంటివి కొన్ని కులాల్లో అసంతృప్తికి దారితీశాయి. శతాబ్దాల తరబడి అంటరానివాళ్ళుగా, అనాగరికులుగా, నీచంగా చూడబడుతూ, ఊరికి దూరంగా హీనంగా బతుకుతూ దారిద్ర్యంలో మగ్గుతూ, కనీస అవసరాలను సరిపడే ఆదాయం లేక అప్పులు పుట్టుక, ఆపదలో ఆదరణకరువై ఒక సామాజిక వర్గపు జీవనం దుర్భర మయింది.

మన సమాజంలో శ్రమించే వర్గం వారు ఒక్కరు. సంపద ప్రతిఫలాన్ని పొందే వారు ఇంకొకరా, దీనికి రాజకీయం కేంద్ర బిందువు అయ్యింది. దీని వల్ల బానిస వ్యవస్థ, బానిస జీవితాలు దళితులకు సహజమయ్యింది. కానీ దేశకాల పరిస్థితులలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. సమాజంలోని ప్రజలలో చైతన్యం, అభివృద్ధి వంటి విషయాల్లో మౌలిక మార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం సాహిత్యం దళితుల జీవితాల్లో పెను మార్పులకు కారణం దళిత సాహిత్యం.

సాహిత్యాన్ని చైతన్య వంతమయిన ఆయుధంగా ప్రయోగించి సమసమాజ నిర్మాణానికి కారకులు అయన ఎందరో మహానుభావులు అందరికి వందనాలు.

ఉపయుక్త గ్రంధసూచిక :

1. దళిత సాహిత్యంలో వాదా ప్రతివాద విమర్శ - గుర్రం మాదవరావు
2. ఆధునిక సాహిత్యం : దళిత స్పృహ - యువ భారతి, సాహితి సాంస్కృతిక సంస్థ
3. చుండూరు నెత్తుటి చరిత్ర - కుల నిర్మూలనా ప్రచురణలు
4. అందుకో దండాలు - మాష్టార్జీ
5. అంబేడ్కర్ అనంతర దళిత ఉద్యమాలు, సాహిత్యం : సవాళ్ళు
6. దళిత ఉద్యమాలు-సాహిత్యం, దళిత స్త్రీల పాత్ర - జూపాక సుభద్ర

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నల్ల రక్త కణాలు – దళిత ప్రేమ తత్వం

– రగిడిపల్లి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, ఎస్ఆర్.& బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ.ప్ర), ఖమ్మం.

తెలుగు సాహిత్యంలో పందొమ్మిది వందల ఎనభై తరువాత వచ్చిన స్త్రీవాద, దళితవాదాల అస్థిత్వ సాహిత్యం ప్రత్యేకం. అప్పటి వరకు వచ్చిన ఉదారవాద దళిత సాహిత్యాన్ని పునాదిగా చేసుకొని ఒక మహోద్యమంగా సాగింది దళిత సాహిత్యం. అది పునాదులను గుర్తించి రాజ్యాధికార దిశగా సాగుతూవస్తుంది. దళిత సాహిత్యం లోని విస్తృత అర్థం నెమ్మది నెమ్మదిగా శాఖలు చేయబడి, బి.సి.మైనారిటీ, గిరిజన, వాదాలుగ ప్రకటితమైన తరువాత కేవలం షెడ్యూల్డ్ కులాలు దళితులుగా పిలువబడ్డారు.

అందులోనుండి దండోరా మరియు మాల మహానాడు వంటి రెండుశాఖలు వెలువడ్డాయి. తెలుగు ప్రజల సామాజిక రాజకీయ పరిస్థితులను అవగాహనతో చూస్తే దళిత సాహిత్యమంటే మాదిగ సాహిత్యమే అనే స్థాయి వచ్చింది.

నల్లరక్త కణాలు కవితా సంపుటి డా.మంథని శంకర్ గారి రెండవ దళిత కవితా సంపుటి, డా॥మంథని శంకర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో "చెప్పులు కుట్టి జీవనం సేయు" వెంకటరాజం, గట్టమ్మ దంపతులకు సెప్టెంబర్ 18,1972 లో జన్మించాడు. శంకర్ కాకతీయ విశ్వవిద్యాలయంలో పి.జి. చేసి కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొ. బన్న అయిలయ్య పర్యవేక్షణలో "శిఖామణి కవిత్వం-సమగ్రపరిశీలన" అనే అంశం పై 2010లో పి.హెచ్.డి పట్టాపొందాడు. 2008 నుండి నేటికి కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా సేవ చేస్తున్నాడు.

వీరు "తునకలందని దండెం" నల్ల రక్త కణాలు, యుద్ధం-తపన్సు, వచన కవితా సంపూటాలు వెలువరించాడు. చిగురు, పత్రావళి విమర్శ వ్యాస సంపుటాలు మరియు "జక్కులు" నవలను వెలువరించారు. వీరి జక్కులు నవలకు 2022 కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం లభించింది. నేటి వివిధ ప్రక్రియల్లో సాహితీ వ్యవసాయం సాగిస్తున్నారు డా.మంథని శంకర్.

"నల్ల రక్త కణాలు" కవితా సంపుటిలో సమాజంలో కల్లోలం రేపుతున్న భావాలను అనమానతలను, మానవీయ సమాజ నిర్మాణం వైపుగా నిర్మించాడు శంకర్. "నలుపు" దళిత ప్రతీకగా దళిత జీవన సమాహారంగా "నల్ల రక్తకణాలు" కావ్యాన్ని చిత్రించాడు. భావాత్మకమైన మూలాలు, గతాన్ని దర్శించి భవిష్యత్తు నిర్మాణకాంక్షన ప్రకటించాడు. వీరి కవిత్వంలో మానవ జీవన సౌందర్యాత్మకమైన ప్రేమను ప్రతిపాదిస్తూనే దళిత ప్రేమతత్వ విశేషణను ప్రత్యేకంగా చెప్పడం "నల్లరక్త కణాలు " కావ్యం ప్రత్యేకత.

దళిత సాహిత్యంలో దళిత మహిళ కవిత్వం, దళిత ప్రేమ కవిత్వం ఉంది. అందులో భాగంగా "'వీడి ఆకాశం" అనే కవితా సంకలనం వెలువడింది. అయితే 2019లో వెలువడ్డ "నల్ల రక్త కణాలు" కావ్యంలో ప్రకృతి ధర్మానికి దళితుల ప్రేమను అనువదిస్తూ రాసిన కవితలున్నాయి. దళితుల కులాంతర వివాహాలలో జరిగే పరువు హత్యలను ప్రస్తవిస్తూ , ప్రేమ అనేది అన్ని వర్గాల కంటే మిన్న అని నిరూపించ ప్రయత్నించాడు శంకర్.

"నీ మనసు ప్రేమగా ఎగసి
నన్ను తాకితే చాలు
నేను నానబెట్టిన తోలుతిత్తిలా మెత్తబడి పోతాను"
(నల్ల ప్రేమ ప్రపంచం)

ఇది దళిత ప్రేమ తత్వం. ప్రేమ భావోద్వేగ

భరితమైనది. దళితులు ఎంత స్వచ్ఛమైన ప్రేమ ప్రకటిస్తారో, అది సహజమైన మానవ ప్రేమ, వీరి ప్రేమలో కుట్రలు, కుతంత్రాలు, మోసం అవసరాల నిమిత్తం మారే ప్రపంచికరణ ప్రేమలు కాదు. అది ప్రకృతి అంత సహజమైనది.

"పుష్పం వికసించినంత సహజంగా
నా ప్రేమ
పక్షులు ఎగిరినంత హాయిగా
నా ప్రేమ
సముద్రాలలోతు ఆకాశమంత ఎత్తు
నా ప్రేమ (నల్ల ప్రేమ ప్రపంచం)

మానవ పరిణామ దశలలో నవయవ్వనం, యవ్వనం దశలో ఎక్కడో ఒకసారైన మనసుకు నచ్చిన వారితో సాంగత్యం ఏర్పడుతుంది. అది మైత్రితో పాటు ప్రేమగా అలా మారే ప్రేమ ఈ సమాజంలో కుల,మత, వర్గ, ఆధిపత్య, అధికారముల వలన అది సజావుగా సాగక అనేక అటంకాలను, అగత్యాలను, హత్యలను చవి చూడవలసివస్తున్న విషయాన్ని స్పష్టంగా తెలిపారు శంకర్.

"ప్రేమ అపురూపంగా
తనను తానుగా రెండై ముడిపడుతుంది
నరికి ముక్కలు ముక్కలుగా
చేయాలని
అగ్గిలో కాల్చి వేయాలని
శ్రమ జీవుల ప్రేమను
ఖరీదుకో కాటికో
లేకుండా చేయాలని
తరాల పట్టుదలతో నరుకుతూ
నడుస్తున్న పదునైన కుల మత రంపం
ఎన్నో మొక్కలను పువ్వులను
తుమ్మొదలను తుంచింది (నల్ల మనసు)

మనసు వికసించిన మొగ్గ, పుష్పంగా పరిమళించి, తుమ్మొద కొరకు వెదకుతున్న సమయంలో కులమత భావాలు గుర్తుకు రాక దళిత యవ్వనస్థులతో సంగవ తీరాన్ని ఏర్పర్చుకున్నప్పుడు దళితులు ప్రకృతి ఆరాధ్యులు గనక వారి ప్రేమ ఎంతో పవిత్రంగా ఆస్వాదిస్తారు. కాని వారి పవిత్రకను నేటి మనవాదభావాలు గల్గిన సమాజం కట్టుబాట్లు, ఆచారాల పేరట పంచాయితీలు, కుట్రలు చేసి వారి మనోభావాలను దెబ్బదీస్తుంటారు. అయినప్పటికీ ప్రేమికులు సమాజాన్ని ఎదిరిస్తే ఆ ప్రేమ బతికి బట్టకట్టదు. దానికి ఈ సమాజంలో లెక్కకు లేనన్ని ఉదాహరణలు. మన కళ్ళ ముందు కనబడుతూ ఉంటాయి. ఎన్నో హత్యలు పరువు పేరుతో, కులం పేరుతో నాటినుండి నేటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి.

"కులం పూసిన కత్తితో
నడిరోడ్డుపై ప్రేమికున్ని నరికినానని
ఈ తరానికి కులాన్ని సంకరం కాకుండా
ఆ పగలిగానని సంతోషం
కొడుకైనా కూతురైనా
అక్కైనా, చెల్లైనా
వాళ్ళ కంటే పరువు ముఖ్యమని
మాటుగాసి వేటువేసి
కులాన్ని బాగుచేసానని
తమలో తాము
క్రూరానందం (కులం పూసిన కత్తి)

ఈ విధంగా క్రూర హత్యోదంతాలు గల ఈ మానవ సమాజంలో "నల్ల" చల్లని ప్రేమ పుడుతూనే ఉంటుం దంటాడు కవి. ఒకనొక సమయంలో దళిత ప్రేమను తిరస్కరించినా ప్రేమిస్తూనే ఉంటారని, ప్రేమలో ద్వేషం, ఈర్ష్య, కోపం ఉండవంటాడు. ఈ గుణాలన్ని నిజమైన ప్రేమకు ఉండవలసినవి అనుకుంటే దీనికి సరిగ్గా సరిపడే ప్రేమ దళిత ప్రేమ అని నిక్కచ్చిగా వెల్లడించాడు శంకర్.

"ప్రకృతి సౌందర్యం
శ్రమ సౌందర్యం రహస్యం

మనసు కులానికో మతానికో
చదువుకో ధనానికో ఆగిపోతుందా
పరిధి పరిమితుంటాయా
పాలంలో గింజలు చల్లినట్టు
ప్రేమ పుప్పొడి రేణువులు చల్లుతుంది (నల్లమనసు)

పరువు హత్యలకు, కులాధిపత్యానికి ఊతం ఇచ్చి ప్రేమికులను చంపడం వల్ల ఈ ప్రేమలు ఆగిపోతాయని నమ్మేవారికి ప్రణయ్ హత్య ఎంత విషాదాన్ని మిగిల్చిందో సభ్య సమాజం కల్లారా చవిచూసింది. హంతకుడై ప్రణయ్‌కు మామ శిక్షార్హుతయ్యి, ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఇలా హింస దేనికి సరిగా సమాధానం కాదు. అహింసే ఏ సమాజానికైనా ప్రశాంతతను అందిస్తుంది. అందుకే ప్రేమించుకునే వారిని దళితులు చంపరు. ఆ ప్రేమకు బలానిచ్చి సహకరిస్తారు. లేకపోతే సానుభూతి తెలుపుతారు లేదా దాని వల్ల జరిగే దుష్పరిణామాలను ఎండగడుతారు. బౌద్ధ,శాంతి, అహింసా వాదులుగానే కనబడుతారు. గ్రామాలలో ఉండే దళిత బహుజనులు చాలా వరకు శాంతి కాముకులే. వారి జీవితమంత వెదికినా ఎవరిని చంపిన దాకలాలు ఉండదు. ఒకవేళ ఉన్నా దాని వెనుక మిగతా వర్గాల ప్రభావమే ఉంటుంది. అందుకే "ప్రేమలేని సమాజం/ శ్మశాన సమమని/ బోధించలేరా" అని ఈ సమాజాన్ని ప్రశించాడు కవి. దళిత ప్రేమ ఎట్లాండిదో స్పష్టత నివ్వడానికి శంకర్ ఇంకో కవితలో వివరించాడు.

"రేణుక ఎల్లమ్మ ఉరికచ్చి
నా పచ్చితోలు నానబెట్టిన లంద తొట్టిలో
దాకున్నప్పుడు నా లంద తొట్టి ప్రేమ మయమైంది
ఆ లంద తొట్టెట్ల తనను దాసుకున్నదో
ప్రేమతో నా నల్లని హృదయంలో
నిన్ను నేను అలా దాచుకుంటా"

(నల్ల ప్రేమ ప్రపంచం)

ఇది దళిత ప్రేమతత్వం. ఇది ఎంత "ఒరిజినల్ లవ్" పాఠకులు అర్థం చేసుకోవాలి. ప్రేమించినందుకు మంధని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన మంధని మధు హత్యకు గురి అయ్యాడని ఈ రాష్ట్రమంతా పెద్ద గందరగోళం జరిగింది. అయినా ప్రేమలు ఆగలేదు. హత్యలు దాగలేదు ప్రేమ ప్రేమిస్తూనే ఉంటుంది. వర్గ, కుల, మతాలు పరువు పేరుతో వీటిని ద్వేషిస్తూ, చంపుతూ, నేరస్థులవుతూనే ఉంటారు. అయినా ఇవి ఆగవు ఎందుకంటే చంపడం ఎంత శక్తి గల్గినదో, ప్రేమించడం అనేది అంతకన్న శక్తివంతమైనదని శంకర్ అభిప్రాయం.

"నా తలను నరికి గోనె సంచిలో వేసి
నీళ్ల ట్యాంకులో పడవేసిన
కల్వర్టు పక్కన నల్ల తుమ్మల్లో తొక్కేసిన
కాళ్ళు రెండు చేతులు రెండు వేలాడగట్టి
కొట్టి చంపి పాతరేసిన
సమాధి మీద నల్ల పుష్పమై
నా ప్రేమ పుడుతూనే ఉంటుంది"

(నల్ల ప్రేమ ప్రపంచం)

ఇది ప్రేమ ఈ ప్రేమనే నేటి సమాజానికి కావలసినది. ఈ ప్రేమను ద్వేషించకండి. కులాలు వేరైనా, మతాలు వేరైనా ప్రేమ ప్రేమయే. అయితే ఈ కవి నకిళీ ప్రేమలను కూడా ఖండించారు.దళిత స్త్రీపై మోజుపడి లేదా దళిత యువకులపై మోజుపడి ప్రేమగా వ్యామోహంగా మారే ప్రేమ వల్ల కూడా ఎంతో మంది స్త్రీల జీవితాలు నాశనమయ్యాయని తెలిపినాడు. దళిత స్త్రీ అగ్రవర్ణ దుర్మార్గుల చేతిలో ఎంతోమంది అగాయిత్యాలకు గురిఅయ్యారు.

"కొమ్మ చాటున
కామం కోరలకు
బలై రాలిన రెమ్మలెన్నో
కొన్ని గడీలకు పంపబడ్డాయి
కొన్ని రోడ్డున పడ్డాయి
కొన్ని గుండె పగిలి చచ్చాయి
కొన్ని గుండె కోతను మింగి బతికాయి

మొదలుకంట తుంచేసినా
నడు మంత్రంగా నలిగినా
పిండిన రంగులేని పువ్వులం'' (దళితపువ్వు)

అగ్రవర్ణాల అమ్మాయిలను ప్రేమిస్తే దళిత అబ్బాయిలను చంపేస్తారు. ఆ విధంగా దళిత అమ్మాయిలను అగ్రకుల అబ్బాయిలు ప్రేమించినా దళిత అమ్మాయిలను చంపేస్తారు. ప్రేమ పేరుతో మోసం చేస్తూ ఈ సమాజాన్ని అసమాన సమాజంగా ఉంచడానికి ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేస్తూ, విచ్ఛిన్నకర ఊహలు కంటుఉంటారు. అయినా మా శరీరాలు మలినమై యున్నా మా మనసులు మలినమైనవి కాదని ఈ నమాజంలో ప్రేమ అవనరమని దానిని దళిత బహుజనులు ముందుకు రావాలని చైతన్యవంతులై, మానవ ప్రేమపై మానవీయ శ్రేష్ట నిబద్ధమైన నిర్ణయాలు తీసుకోవాలని కవి కోరుకుంటున్నాడు. అందుకే ఎన్ని హత్యలు జరిగినా ఎన్నో పరువు కుల మత దుర్మార్గాలు చోటు చేసుకున్నా ఇంకా మానవ మనగడ సాగుతుందంటే ఈ దళితుల బహుజనుల యొక్క ప్రేమానురాగాల వల్లనే అనేది మరవకూడదు. దళిత ప్రేమ ద్వేహపూరితమైన నాటి భారత ప్రపంచం నిలువడానికి వీలుండదు. దళితులంతా అహింసను కోరుకున్న నాడు ఈ భరత భూమి అగ్ని శకలంగా మారుతుంది. అందుకే దళితులు ప్రేమమయులు.వీరి దళిత ప్రేమ తత్వం ప్రశాంత దీపిక అని కవి శంకర్ అద్భుతంగా తెలియజేశాడు. ''అధికార ఆధిపత్యం/ వర్గం కులం రంగు రుచి లేని నా ప్రేము/ ఆకాశం నల్ల మబ్బై ఉరిమినప్పుడు/ వెరుపై మెరిసినప్పుడు/ నీటి బిందువునై నేల పడి/ ధరణికి పులకరింపు పరిమళమై/ ఈ ప్రపంచాన్ని నేను ప్రేమిస్తూనే ఉంటాను'' (నల్ల ప్రేమ ప్రపంచం). ఇదే దళిత ప్రేమతత్వం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మనందరం ఒక్కటే

- కళాగౌతమి బులుసు వి.యస్. మూర్తి

మనందరం ఒక్కటే. సర్వమానవ సౌభ్రాతృత్వమే భారత ధర్మం. విశ్వమానవ శ్రేయస్సే మన భారత లక్ష్యం. సకల లోక కల్యాణమే మన భారతీయ ఆదర్శం. ఇదీ లోకానికి మనం అందిచ్చిన సంస్కృతి. మరి ఆ సంస్కృతిని కాపాడుకోవలసిన బాధ్యత ఎవరిది? మనది కాదా? ఈనాడు మనం మన భారతీయత గురించిన యథార్థాన్ని తెలుసుకోలేకపోతున్నాం. మధ్యలో మనపై రుద్దబడిన పరాయి సంస్కృతికి, సంప్రదాయాలకి ఆకర్షితులమై వాటికి లొంగిపోతున్నాం. మనదైన సంస్కృతిని, సంప్రదాయాలను హేళన చేస్తున్నాం. అస్పృశ్యతను నిర్మూలించి, కుల భేదాలను రూపుమాపి ఏక భారతజాతిని నిర్మించుకుంటూ ముందుకు సాగుతున్న విషయం మనం మరచిపోకూడదు. దాన్ని సాధించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలి.

పురాణకాలంనుంచి నేటిదాకా ఏదో రంగంలో ప్రసిద్ధి పొందిన దళితులు ఉన్నారు. చాలమంది భక్తులుగా, తాపసులుగా, వేదాంతులుగా కూడా దర్శనమిస్తారు. వీరంతా సమ సమాజం కోసం పాటుపడినవారేననే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. కొందరు భగవదర్పింతంగా పోరాటం సాగించినా, అది సాంఘిక నేపథ్యం నుంచి సాగిన పోరాటమే. వాళ్ళంతా కుల నిర్మూలనకు పోరుసల్పిన విప్లవవీరులే. వీరంతా తక్కువవారమని భావించక గుణానికి ఎక్కువవారమని నిరూపించుకున్నారు. దళితజాతిలో పుట్టినా ఏ రంగంలోను తాము ఇతర కులాలవారికి తీసిపోమని చాటి చెప్పారు కాని విడిచిపెట్టి పోతామనలేదు.

బ్రహ్మదేవుని మన:సంకల్ప మాత్రంచేత ప్రాదుర్భవించిన వశిష్ఠ మహర్షి బాల్యంనుంచీ తపోదీక్ష వహించి చిరకాలం తపస్సు చేశాడు. బ్రహ్మ కోరికను మన్నించి తనకు భార్య కాతగిన కన్యను వెదుక్కుంటూ లోకాలన్నీ తిరిగాడు. ఆ వశిష్ఠుడు చేసిన పనేమిటంటే తన అంగవస్త్రం కొంగున కొంచెం ఇనుకను మూట కట్టుకున్నాడు. గరుడ, గంధర్వ, యక్ష, వసు, రుద్రాది లోకాలన్నీ తిరుగుతూ 'నా దగ్గర ఇసుక ఉంది. మీరు దాన్ని నాకు భోజనం వండిపెట్టగలరా?' అని అడిగేవాడు. ఎవరినడిగినా 'ఇసుక వంటచేయడమా?' అని హేళన చేసినవారే. వశిష్ఠునికి తనకు తగిన వనిత ఏ లోకంలోను కనబడలేదు. వినుగుచెందక వశిష్ఠుడు చివరకు భూమండలంలో తిరుగుతూ అరుంధతిని 'ఇసుకను వంటచేసి పెట్టమ'ని అడిగాడు. అరుంధతి వెంటనే, వెనుదీయక ఆ ఇసుకను తీసుకుని, రోటిలో పోసి -

> సువ్వి జగద్రక్ష! సువ్వి పద్మాక్ష! సువ్వి రమాధీశ! సూర్యప్రకాశ!
> సువ్వి భక్తవిధేయ! సుగుణ ధౌరేయ! సువ్వి మేఘశ్యామ! సుర సార్వభౌమ!

అని ఆ ఇసుకను దంచి, వంటచేసి పెట్టింది. ఇంతకీ ఎవరీ అరుంధతి? ఈవేళ అరుంధతేయులుగ పివువ బడుతున్నవారి ఆడపడుచు. ఆ అరుంధతీ వశిష్ఠుల చరితం లోకపావనం. ఆమె చల్లని చూపు లేనిదే దంపతులకు వైవాహిక జీవితమే లేదు. ఇది మనం తెలుసుకుంటున్నామా? ఇది మా హక్కు అని నిలబెట్టుకుంటున్నామా?

మహర్షులలో శ్రేష్ఠుడైన మతంగుడు గౌతమ మహర్షి వంశంలో జన్మించాడు. వేద,శాస్త్రాల నభ్యసించాడు. మతంగుడు కొన్ని వేల సంవత్సరాలు ఉగ్ర తపస్సు చేశాడు. బ్రహ్మజ్ఞాని అయ్యాడు. ఆ మహర్షి ఆశ్రమం నిత్యం అగ్నిదేవునికి హోమక్రియలు నిర్వర్తిస్తూ, వేద, వేదాన్త, శాస్త్ర వ్యాఖ్యాన గోష్ఠులతో విరాజిల్లుతూ

ఉండేది. మాతాపితృ సేవాతత్పరుడైన ధర్మవ్యాధుడు తన కుమార్తెను మతంగుని కుమారున కిచ్చి వివాహం చేశాడు.

ఒకరోజున ఒక ఆడ ఏనుగు ప్రసవించి మరణించింది. అది చూసిన మతంగుని హృదయం కనికరంతో కరిగిపోయింది. ఆ ఏనుగుపిల్లను తెచ్చి తన కొడుకుతో సమానంగా పెంచాడు. ఆ ఏనుగు కావాలని ఇంద్రుడు ఎన్నో ఆశలు చూపించినా, ఆ ఏనుగును మాత్రం ఇవ్వనన్నాడు. అటువంటి పవిత్రమైన మతంగుని వంశంలో జన్మించినవారే 'మాతంగులు'.

తమ వంశీయుల మూలస్థానం తెలుసుకోవాలి. దాన్ని నిలబెట్టుకోవాలి. అంతేకాని బయటకుపోయి, ఒకరు బయటకి తోసేశారనీ, ఒకరు అవమానించారనీ భావించడం పిరికితనం. అంబేద్కరు పోరాట యోధునిగా ఆ విధంగా నిలబడి గెలువలేదా? మన స్థానాన్ని మనం పొందడానికి వేరొకరి అనుమతి కావాలా? ఆస్తిలో వాటా ఇవ్వనంటే కొడుకు ఊరుకుంటాడా? సర్వమానవ సౌభ్రాతృత్వమే మన భారత ధర్మం. విశ్వమానవ శ్రేయస్సే మన భారత లక్ష్యం. సలక లోక కల్యాణమే మన భారతీయ ఆదర్శమని తెలుసుకోవాలి.

ధర్మవ్యాధుడు తన కుల ధర్మానుసారం మాంసం అమ్ముకుని జీవిస్తూ ఉంటాడు. అతడు గురువు ద్వారా ఏ విద్యలు అభ్యసించలేదు. కాని పూర్వజన్మ సుకృతం వలన అతనికి అన్ని విద్యల సారము కరతలామలక మయింది. ఎవరికి ఏ సందేహం కలిగినా ధర్మవ్యాధుడు నివారిస్తాడు. కౌశికుడనే ఒకానొక బ్రాహ్మణుడు వేదాలు, శాస్త్రాలు చక్కగా అధ్యయనం చేశాడు. కానీ ఏం లాభం? చదువుల సారం ఒంటబట్ట లేదు అతనికి. కోపం, తాపం, అహంకారం, అసహనం పెచ్చుమీరినవాడు. ఒక బ్రాహ్మణ స్త్రీ శాసనంతో పరీక్షిద్దామని కౌశికుడు ధర్మవ్యాధుని వెతుక్కుంటూ వెళ్ళాడు.

మాంసం దుకాణంలో ఉన్న ధర్మవ్యాధుని చేరడానికి మనసొప్పక సందేహిస్తున్న కౌశికుని ధర్మవ్యాధుడే చేరి 'బ్రాహ్మణ స్త్రీ పంపితే వచ్చావు. నీ మనోవాంఛితం నెరవేరుతుంది, రా' అని తన ఇంటికి తీసుకొనిపోయాడు. అపుడు కౌశికుడు 'ధర్మవ్యాధా! నువ్వు ధర్మం తెలిసినవాడివి. జీవహింస జీవనంగా గడుపుతున్నావు. ఇదేం ధర్మం' అని అడిగాడు. దానికి 'ఆర్యా! బ్రాహ్మణులకు తపస్సు, వేదాధ్యయనం - రాజులకు దండనీతి - వైశ్యులకు వ్యవసాయం, పశు పోషణ - శూద్రులకు శుశ్రూష ఎలా ధర్మాలని చెప్పబడుతున్నాయో, అలాగే మాకు మృగమాంస ఉపజీవనం ధర్మంగా చెప్పబడింది. ఇది మాకు వంశపారంపర్యంగా వచ్చిన జీవనాధారం. ఎవరి వృత్తి వారు అవలంబించడమే సృష్టి ధర్మం' అన్నాడు. ఈ ధర్మవ్యాధుని ధర్మ వర్తనం, మాతాపితృ సేవనం మనకు ఆదర్శప్రాయం కావాలి.

గుణం ప్రధానం కాని కులం ప్రధానం కాదని తెలుస్తోందికదా! ఆ గుణమే లేని ఒక బ్రాహ్మడిని, ఒక బ్రాహ్మణ స్త్రీ ఒక దళితుని దగ్గరకు పంపితే అతడు ఆ బ్రాహ్మణునికి జ్ఞానోపదేశం చేశాడు. ఇదీ మనం లోకానికి అందిచ్చిన సందేశం. దీన్ని మనం అంటే మనమందరం ఏకముఖంగా కాపాడుకోవాలి. మానవులంతా ఒక్కటేనని మన ధర్మం ఎలుగెత్తి చాటుతోంది. చాతుర్వర్ణ్య వ్యవస్థే కాని పంచమ వర్ణ మనేది వైదిక ధర్మంలో లేనేలేదు. ఆలోచించి అడుగు ముందుకు వేయాలి. భారతీయ ఐక్యతను కాపాడడానికి అందరం కలిసి నడవాల్సిన సమయమిది.

భారతీయులకు కాశీ పరమ పవిత్ర పుణ్యక్షేత్రం. కాటికి కాళ్లు చాచినవాడైనా కాశీలో మరణించాలనుకుంటాడు. శంకరాచార్యులు అద్వైతమత స్థాపకుడు. ఒకనాటి మధ్యాహ్న సమయం శిష్యబృందంతో నుస్నాతుడై శంకరులు భిక్షాటనకు బయలుదేరాడు. ఇంతలో ఒక చండాలుడు వారి మార్గానికి అడ్డుగా వచ్చాడు. వాడిని చూసి శంకరులు 'ఓరీ! దూరంగా తొలగు తొలగు' అన్నారు. వెంటనే ఆ చండాలుడు 'ఓ నన్యానీ! అద్వితీయమనీ, అనఘమనీ, అఖండమనీ, అసంగమనీ,

అనాది సత్య బోధ సౌఖ్యరూపమనీ ఆత్మను శ్రుతులు పేర్కొంటున్నాయి. అలాంటి ఆత్మను నువ్వు వేరు చేస్తున్నావు. సరే! ఇప్పుడు నన్ను నువ్వు దూరంగా పొమ్మన్నావుకదా! ఏది పోవాలి? దేహమా? దేహియా? గంగలోను, కల్లుకుండలోను ప్రతిబింబించే సూర్య బింబానికి ఏదేనా భేదముంటుందా?' అని ప్రశ్నించగానే శంకరులు 'మహానుభావా! సత్యం వచించావు. నాకు జ్ఞానోదయమయింది. నువ్వు దేహానికి, ఆత్మకు కల భేదాన్ని ఎఱిగినవాడవు. నీవంటి మహానుభావుడు ఎవరైనా నాకు గురుస్థానీయులే' అని శంకరులు ఆతని పాదాలపై పడ్డారు. చండాలుడైనా తనకు అద్వైతాన్ని బోధించాడని శంకరులు పదే పదే తలచుకుంటూ అచటినుండి నిష్క్రమించారు.

మనుష్యుల బాహ్యస్వరూపలనుబట్టి విలువలు నిర్ణయించడం అల్పజ్ఞుల లక్షణం. ఆత్మసౌందర్యాన్ని అవలోకించగలగడం ఆత్మజ్ఞుల లక్షణం. ఆ స్థితికి చేరుకోవడం మన ప్రయత్నం కావాలి. మన ప్రాచీనులు మన కందిచ్చిన వారసత్వాన్ని నిలబెట్టుకోవడం మనందరి లక్ష్యం కావాలి. లోపాలుంటే సవరించుకోవాలి. అంతేకాని వదలిపెట్టిపోతే లోపాలు పోతాయా? అందుకని నిలిచి పోరాడాలి, అంతేకాని వదలిపెట్టిపోతామనడం సరైనది కానేకాదు. మనది కాదని మన పిత్రార్జిత ఆస్తిని వదలుకుంటున్నామా? పోరాడుతున్నాం. సాధించుకుంటున్నాం కదా! బాబా సాహెబ్ అంబేద్కర్‌కి ఎవరు ఎన్ని ప్రలోభాలు చూపారో మనకు తెలియదా? మరి ఆయన లొంగేడా? భారతీయతను విడిచిపెట్టాడా! అందుచేత రండి, మన సంప్రదాయాన్ని మనం నిలబెట్టుకుందాం. మన స్థానంకోసం మనం పోరాడుదాం. మన స్థానాన్ని మనం సాధించుకుందాం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాధికారత – వర్గీకరణ ఉద్యమం

– తెన్నేటి మోజేష్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్, అమలాపురం.

ర్గీకరణ ఉద్యమమే, దండోరాగా ప్రసిద్ధిగాంచినది. అసలు దండోరా అంటే చాటింపు అని మనకు అందరకు తెలి సిన అర్థం. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వారి ఉద్యమం చూసిన తరువాత, దండోరా అంటే దగాపడిన వారికి అండగా ఉండే ఒక అభయ అస్తం అని అర్థమౌతున్నది. భారతదేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో నడి చిన ఉద్యమం దండోరా. సమాజంలో చిన్న అధికారి నుండి అత్యున్నత అధికారి వరకు, సర్పంచి నుండి ప్రధాన మంత్రి వరకు, ప్రతి ఒక్కరికి తెలిసిన సామజిక న్యాయ పోరాట ఉద్యమం దండోరా.

భారతీయ సమాజం, ప్రపంచ దేశాల సమాజములతో కొంత భిన్నత్వాన్ని కలిగి ఉంటుంది. అది సంస్కృతే కావ చ్చును, సామజిక పరిస్థితులే కావచ్చును. మనదేశంలో ఉన్న కుల వ్యవస్థ, మరొక దేశంలో లేదు. అదేవిధము గా ప్రజల మధ్య వ్యత్యాసాలు, ఉంటాయి. కాని, మనలాగా కులపరమైన వ్యత్యాసాలు మాత్రం ఉండవు. స్వాతంత్యం రాకముందు, భారతీయులు అందరం బానిసలమే. స్వాతంత్ర్య పోరాటాలు చేసేటప్పుడు, అన్ని వర్గా ల వారు, వారి వారి శక్తిమేరకు సహాయ సహకారాలు అందించటం మూలంగా, దేశం స్వాతంత్ర్యమైనది, మనం స్వతంత్రులమైనాము. అప్పుడు, మనం అందరం, కలిసి మెలిసి జీవించటానికి అనుకలంగా, ప్రజాస్వామ్య వ్యవ స్థను ఏర్పర్చుకున్నాము. మన పరిపాలన ఎలా ఉండాలో, మనకు అనుకూలమైన రీతిలో, రాజ్యాంగాన్ని, మన మే తయారుచేసుకున్నాము. ఆ క్రమములోనే సమాజంలో బాగా వెనుకబడిన, అంటరాని వారిగా పరిగణింప బడి, సభ్యసమాజానికి దూరంగా జీవిస్తున్న, హరిజన (SC), గిరిజన (ST) అనే రెండు వర్గాల ప్రజలకు, వారి వారి జనాభా ప్రకారం, విద్య, ఉద్యోగం మరియు రాజకీయ రంగాలలో, రిజర్వేషన్స్ అనే ప్రత్యేక సౌకర్యా లను కల్పించుకొని, అందరం కలిసిమెలిసి జీవిస్తున్నాము.

భారతదేశం స్వతంత్రమై, మనలను మనం పరి పాలించుకోవటం మొదలైననాటి నుండి, ప్రతిరంగాన్ని, ప్రణాళిక బద్ధంగా, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, అభివృద్ధిని ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి, పరిశీలన చేసుకొని, అవస రానికి తగ్గట్టుగా, మార్పులు చేర్పులు చేసుకుంటూ, పరిపాలన సాగిస్తున్నాము. అదే క్రమములో SC, ST రిజర్వేషన్స్, అమలు జరుగుతున్న తీరు, వాటి వల్లన జరిగిన అభివృద్ధి మొదలగు అంశాలపై, పరిశీ లించుటకు 1965 లో, సామజిక రక్షణ డిపార్ట్మెంట్, భారత ప్రభుత్వం వారు, అప్పటి న్యాయ శాఖ సెక్రెటరీ, B.N. లోకూర్ గారి నాయకత్వంలో కమిటీ వేయటం జరిగింది. ఆ కమిటీ సమగ్రముగా పరిశీలించి, 1967 లో వారి నివేదికను భారత ప్రభుత్వానికి ఇవ్వటం జరిగింది. దానిలో ఆ కమిటీ వారు కొన్ని మార్పులు కూడా ప్రతిపాదించారు. ఆ ప్రతి పాదనలు ఏమంటే, అంటరాని వారు అని చెప్పబడే (SC) జాబితాలో కొన్ని కులాలు, బాగా అభివృద్ధి చెందినవి, వాటిని ఆ జాబితా నుండి తొలగిస్తేనే, మిగిలిన కులాల వారికి రిజర్వేషన్ ఫలాలు అందుతాయి. లేక పోతే, ఫలాలు అందని కులాల వారు, రానున్న రోజులలో తిరుగుబాటు చేయవచ్చును. సామజిక న్యాయం పేరు తొ ఇచ్చిన రిజర్వేషన్స్ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోటం లేదు అనేది రుజువు అవుతది. ఆ క్రమములో తెలుగు రాష్ట్రాలలో, మాల కులమును SC జాబితా నుండి తొలిగించాలని లోకూర్ కమిషన్ 1967 లోనే చెప్పటం జరిగింది. దురదృష్ట కరమైన విషయం ఏమంటే, అది నేటికీ కూడా జరగలేదు. లోకూర్ కమిషన్ నివేదికను మరుగుపరచటానికి, అంబెడ్కర్ పేరున దళితుల ఐక్యత

అనే కొత్త అవతారాన్ని తెరపైకి తెచ్చినారు మాలలు. అసంతృప్తితో ఉన్న మిగతా దళిత కులాలను దారి మళ్లించటంలో చాలా వరకు విజయాన్ని సాధించారు. మను వాదం నచించాలి అంటూనే, మాల వాదాన్ని మలముల చుట్టిపెట్టినారు. ఎంత తియ్యగా మాట్లాడినా, మలము వాసనను మరిపించలేరు కదా.అడపా దడపా, ఆర్తనాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ మాదిగ సంఘం పేరున, డాక్టర్ విద్యాకుమార్, సూర్యనారాయ గారి నాయకత్వంన, మాదిగ యువకులు 1982లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో, SC రిజర్వేషన్స్ ను, మా జనాభా ప్రకారం వర్గీకరించాలి అంటూ, కరపత్రాలు వెదజల్లటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అది ఒక గొప్ప సంఘటన. మాధవరావు అనే ఒక ఆటోమొబైల్ ఇంజనీర్, సికింద్రాబాద్ నుండి ఆంధ్రప్రదేశ్ మాదిగ కాంగ్రెస్ అనే సంస్థను స్థాపించి, ఆనందరావు అనే లిడ్క్యాప్ ఆఫీసర్, M.S. పెద్దన్న అనే సచివాలయ అధికారి, సహాయ సహకారంతో మాదిగలకు జరుగుతున్న అన్యాన్ని, లేవనెత్తే వారు. వారి సమావేశ అంశాలను, దక్కన్ క్రానికల్ లో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న, G. J. ఆల్ఫ్రెడ్ అనే జర్నలిస్ట్, అప్పు డప్పుడు ప్రచురించి వెలుగులోకి తెచ్చేవారు.

1967 నుండి చాలా కాలం వరకు, దళిత జ్యోతి పత్రికను, నడిపిన P. J. ఆనంద్ గారు అనే ఒక మహానుభావు డు, రిజర్వేషన్స్ ముసుగులో జరుగుతున్న ఎన్నో అవకతవకలను వెలుగులోకి తేవటం జరుగు తుండేది. మరో దురదృష్ట కరమైన విషయం ఏమంటే, నాడు (1967) దళిత జ్యోతి పత్రికను, ప్రజల మధ్య, చేతిలో పట్టుకొని చదవటానికి సాహసం చేయని పిరికి సన్నాసులు, తరువాత కాలంలో దళిత నాయకులుగా చెలామణి అయ్యా రు. ఈ విషయాన్ని P. J. ఆనంద్ గారు చాలా సందర్భములలో చెప్పి బాధపడటం జరిగింది.

అరుంధతి బంధుసేవ మండలి వారు, డాక్టర్ మందా జగన్నాధం, డాక్టర్ నందిపాక వెంకస్వామి గారి నాయక త్వంలో, మాజీ మంత్రి శ్రీమతి సదాలక్ష్మి గారి సహాయ సహకారం తో, నిజాం కాలేజీ గ్రౌండ్స్ లో జరిగిన మాదిగల సమావేశానికి లక్షకు పైగా మాదిగలు రావటం జరిగింది. నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి, ఆ సభకు హాజరై, మాదిగ మరియు ఉపకులాల సమస్యలను అర్థం చేసుకోవటం జరిగింది. నా వంతుగా నేను సహాయం చేస్తానని చెప్పటం జరిగింది. ఇది అన్ని పత్రికలలో పతాక శీర్షికగా ప్రచురించగా, రిజర్వేషన్ ముసుగులో కొందరికి జరుగుతున్న అన్యాయం, సభ్య సామాజినికి తేట తెల్లమైనది.

ఆ సభకు సామాన్య వ్యక్తిగా హాజరైన, మందా కృష్ణ మాదిగ, అక్కడ దొరికిన కరపత్రాన్ని, తీసుకొని పోయి, పూర్తి గా చదివి, సమస్యను బాగా అవగాహన చేసుకోవటం జరిగింది. అదే సమయంలో ప్రకాశం జిల్లా, ఈదుమూడి గ్రామంలో, దళితులకు ప్రభుత్వం భూమి పంపిణి కార్యక్రమము జరపగా, నాటి జిల్లా అధికారిగా ఉన్న, మాల అధికారి, పంపిణీదారులు అందరిని మాల కులము నుండే ఎంపిక చేయటం జరిగింది. ఆ గ్రామములో మాదిగ లు కూడా చాల మంది ఉన్నారు. ఒక్క మాదిగ కుటుంబానికి కూడా ప్రభుత్వ భూమి ఇవ్వకపోవటం, మాదిగ యువకులలో అసంతృప్తిని కలిగించినది, అదే ఉద్యమముగా మొదలైనది. అదే దండోరా ఉద్యమం. అప్పటి వరకు మాదిగ అని చెప్పుకోవటానికి భయపడిన వారు, పేరు చివరన మాదిగ అని వ్రాచుకునే స్థాయికి ఎదగటం జరిగింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) అనేది ఒక బ్రాండ్ గా ప్రసిద్ధిగాంచినది. ప్రపంచంలో అత్యున్నత విశ్వ విద్యాలమైన హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో MRPS పై పరిశోధనలు మొదలైనవి. మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో, ఉద్యమం సమాజంలో అన్ని వర్గాల వారికిని ఆకట్టుకోగలిగింది. దీనిని స్ఫూర్తిగా తీసు కొని ఎన్నో కులసంఘాలు పుట్టుకొచ్చినవి. అన్ని కులాలకు MRPS స్ఫూర్తిదాయకంగా నిలచింది. లక్షలాది మందిని

తరలించటం, ప్రభుత్వాలకు తమ బాధలు తెలియ జేయటం, గాంధేయ మార్గంలో ఉద్యమాలు చేయటం వీరి పద్ధతి. వీరి ప్రధాన డిమాండ్, %ూజ% జాబితాలో ఉన్న 63 కులాలకు, వారి వారి జనాభా ప్రాతిపదికన 15% రిజర్వేషన్స్ పంచటమే. అప్పుడే అన్ని కులాలకు ఫలాలు అందుతాయి. అప్పుడే సామజిక న్యాయం జరుగు తున్నది అనేది వీరి వాదన. అందుకు అంగీకరించిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వర్గీకరణ చేయటం జరిగింది. కొంత కాలం అమలు చేయటం కూడా (2000 to 2004) జరిగినది. అది తట్టుకోలేని మాల కులము వాళ్ళు కోర్టును ఆశ్రయించి, నిలిపివేయటం జరిగినది. సామజిక న్యాయానికి, సాంకేతిక సాకు చూపుతూ, వర్గీ కరణను నిలుపుదల చేయటం, సామజిక న్యాయాన్ని కూని చేయటమే అంటూ చాలా మంది నిపుణులు వ్యాఖ్యానించారు. గత రెండున్నర దశాబ్దాలుగా, మాదిగలు మరియు ఉప కులాలు, తమకు రావలసిన వాటా కొరకు, ఎక్కని గడప లేదు, మొక్కని దేవుడు లేదు. ఎదుట వారి బాధను చూసి, సంతోష పడే, రాక్షసులకు వంత పాడుతూ, రాజ్యాలు ఏలే వాండ్లు కూడా రాక్షసులే అని నిరూపించుకుంటున్నారు.

విచిత్ర కరమైన విషయం ఏమంటే, సమాజంలో ఎవరికి సమస్య వచ్చినా, వాళ్ళు దండోరా వారినే సంప్రదించటం జరుగుతున్నది. అందుకు దండోరా వారు కూడా ముందుకు వచ్చి, ప్రజల సమస్యలను అధికారుల మరియు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయి, పరిష్కరించటం అనవాయితీ మారినది. నాటి నుండి నేటి వరకు, చాలా విషయాలలో ప్రభుత్వాలకు, మందా కృష్ణ మాదిగ గారి నేతృత్వంలో MRPS, ప్రతిపక్ష పాత్రను పోషించటం జరు గుతున్నది. పేద, ధనిక అన్న బేధం లేకుండా, ఉచితంగా, కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం పొందుటకు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యక్రమము రావటానికి కారణం దండోరా వారి ఉద్యమమే. వృద్ధులకు, వితంతువులకు, అంగవైకల్యం కలిగిన వారికి, ప్రభుత్వం ఇచ్చే సహాయం Rs. 200/- నుండి Rs.2000/-కు పెరగటం కూడా దండోరావారి పుణ్యమే. అంతటి మహత్తర ఉద్యమం దేశ చరిత్రలో మరొకటి లేదని గట్టిగ చెప్పవచ్చును.

దళితులు అని స్వయం నామకరణం చేసుకున్న హరిజనులు, నభ్యసమాజంను ఎన్నో విధాలుగా ప్రశ్నిస్తూనే ఉన్నాము కదా. మనకు జరిగిన, జరుగుతున్న అన్యానికి, అవమానాలకు అగ్రవర్ణాల వాళ్లే కారణమని నింది స్తూనే ఉన్నాము కదా. వాళ్లకు మానవతా విలువలు లేవు, మనిషిని మనిషిగా చూడాలనే, కనీస జ్ఞానం కూడా లేదని, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే మైకాసురులు మనమే కదా. మాకు అందవలసిన ఫలాలు, అంద కుండా చేస్తున్న ద్రోహులు, సమాజాన్ని పీల్చుకు తింటున్న పంది కొక్కులు, మోసాలు చేస్తున్న గుంట నక్కలు అని ఏవేవో తిట్లు, శాపనార్థాలు అగ్ర వర్ణాల వారికి పెట్టేది దళిత ముత్యాలే కదా. మరి మనలో ఉన్న అన్ని కులాల వారికి, మన రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయా ?. మనం ఏనాడైనా ఈ విషయాన్ని ఆలోచించామా ?. అసలు ఆలో చిస్తామా ? అంతటి నీతి నియమాలు, నైతిక విలువలు, కనీస జ్ఞానాలు మనకు ఉన్నాయా ?. సభ్య సమాజాన్ని ప్రశ్నించే నైతిక హక్కు మనకు ఉన్నదా ?. అని ప్రశ్నించుకొని, అగ్ర వర్ణాల వారిని నిలదీస్తే, అర్థం ఉ ంటుంది. అంతే కాని, మన దుప్పట్లో దూళి పెట్టుకొని, మరొకరి దుప్పటిని దులపమని చెప్పటం, ఏమాత్రమూ అంగీకారం కాదు. గురువింద గింజలాగా, మనలో ఉన్న నలుపుని, కడుక్కోవాలి, లేనియెడల కాలమే సమాధానం చెప్పుతది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాతంగి దురాచారం – దళిత స్త్రీ జీవితం

– డా॥. డి. వి. నాగేశ్వర రావు, అర్థ శాఖాధిపతులు, ప్రభుత్వ కళాశాల, రాజమండ్రి.

ఆంధ్రదేశపు గ్రామీణ ప్రాంతాల్లో ఆనాదిగా వస్తున్న సాంప్రదాయం మాతంగి సాంప్రదాయం. ఇది సాంఘ దురాచారాల్లో ఒకటైనా కొందరు దీనిని పవిత్ర భావంగా భావించి అనేకమైన గ్రామదేవతలకు కొలుపులలో పాల్గొంటూ ఆ కొలుపులకు ప్రధాన భూమికగా నిలుస్తున్నారు.

ఆంధ్రరాష్ట్రంలో మాతంగి, జోగిని, దేవదాసి, బసివి అనేవి అతి ప్రాచీనకాలం నుండి కనబడుతున్నవి. ఇది ఒక దురాచారమైన వ్యవస్థ. దానిని శ్రీనాథుడు క్రీడాభిరామము నందు ఇలా పేర్కొన్నాడు...

అకలంకస్థితిగోరి కొల్చెదరు బ్రహ్మానందభావంబునన్
నకలానందమయైన మాతయుగుచున్ సంతోషచిత్తంబునన్
తకదుందుమ్ములు తాళముల్, జవనికల్ తందానలమ్మయ్యకు
న్నెకవీరమ్మకు మాహురమ్మకు నధోహ్రీంకార మధ్యాత్మకున్ - 132

ప్రాచీనకాలం నుండి వైదిక దేవాలయాల్లో దేవదాసి వ్యవస్థ ఉండేది. ఈ దేవాలయాల్లో ప్రతిరోజు నాట్యం చేసేది వాళ్ళే. అక్కడ ఉన్న పూజారులకు సంతోషాన్ని కలిగించుటం వీళ్ళ ప్రధాన కర్తవ్యం. అంటే పూజారులు వారితో కామవాంఛ తీర్చుకొనేవాళ్ళు.

ఈ దేవదాసీలు దేవాలయ ధర్మకర్తలుగా ఉన్న జమీందారుల పోషణలో ఉండేవారు. వారితో కూడా శారీరక సంబంధం కలిగి ఉండేవాళ్ళు ఈ దేవదాసీలు. మరికొందరు జమీందార్లు వీళ్ల తమ ఉంపుడుగత్తెలుగా ఉంచుకొనేవాళ్ళు. ఈ ధర్మకర్తలు వారికి కన్నెరికం చేసి ఆనాటి నుండి ఆ గుడికి అంకితం అయ్యేవారు.

అదే పద్ధతిలో శైవ సాంప్రదాయంలో బసివిరాండ్రని, వైష్ణవ సాంప్రదాయంలో దేవదాసీలని గ్రామ దేవతల వ్యవస్థలో జోగినిలు, మాతంగీలని పిలిచేవారు.

జోగినులు, మాతంగీలుగా మార్చబడు బాలిక లందరూ దళితులలోని మాదిగ కులం నుండి వచ్చినవారే. ఈ మాదిగ కులం వాళ్ళు తమ బాలికలను మాతంగిగా మార్చడం ఆ కుటుంబం అదృష్టంగా భావిస్తారు. ఈ దళిత జాతిలో కొందరు తమ మొదటి సంతానాన్ని గ్రామదేవతకు అంకితమిస్తారు. అలా అంకితం ఇవ్వ బడినవాళ్ళందరూ మాతంగులు గానే పరిగణించ బడతారు. మాతంగి వ్యవస్థలో పెళ్ళిళ్ళు ఉండవు. పెళ్లి వీరికి నిషేదం. మాదిగ కుటుంబాల్లో ఈ వ్యవస్థ వంశ పారంపర్యంగా వస్తుంది. తమ సంతానంలోని మొదటి ఆడబిడ్డను ఇలా మాతంగిగా మారుస్తారు.

మాతంగిగా మార్చుట :

దళిత జాతిలోని ఒక వర్గమైన మాదిగ కులం నుండి తీసుకురాబడిన బాలికను ఏదో ఒక గ్రామదేవతకు అంకితమిస్తారు. గ్రామంలోని ఒక వ్యక్తి చేత ఆ బాలికకు కన్నెరికం చేయించి తాళి కట్టిస్తారు. దానిని 'మాతా కళ్యాణం' అంటారు. ఆ రాత్రికి ఆ బాలిక ఆ వ్యక్తికి శారీరక సౌఖ్యాన్ని అందించాలి. ఆ తర్వాత ఆ గ్రామంలో ఏ పెద్ద పిలిచినా కాదనకుండా వారికి తన శారీరక సౌఖ్యాన్ని అందించాలి. మాతకళ్యాణం జరిగిన తర్వాత కొలుపుల్లో ఏమేమి చేయాలో ఆ కార్యక్రమాలన్నింటిని నేర్పుతారు. ఆ గ్రామంలో జరిగే గ్రామదేవత కొలుపుల్లో తప్పనిసరిగా ఈ మాతంగి పాల్గొనాలి. ఆ గ్రామమందే కాక సమీప గ్రామాల్లో జరిగే గ్రామదేవత కొలుపుల్లో కూడా ఈ మాతంగిని తీసుకెళ్ళతారు.

కొలుపులు ఒకరోజు, మూడు రోజులు, ఐదు

రోజులుగా నిర్వహిస్తారు. కొలుపులు జరుగు రోజులను బట్టి వీరికి డబ్బులు చెల్లిస్తారు. కొలుపులకు వెళ్ళునపుడు అక్కడ కొలుపులు నిర్వహించు వ్యక్తికి కూడా ఆ మాతంగి శారీరక సుఖాన్ని అందించి ఆనందాన్ని కలిగించాలి.

మాతంగుల ఆచార వ్యవహారాలు :

దళిత జాతిలో మాదిగ కులంలో కొన్ని కుటుంబాల్లో ఆనాదిగా వస్తున్న ఈ వ్యవస్థను వంశపారంపర్య ఆచారంగా భావిస్తూ తమ సంతానం మొదటి ఆడ సంతానాన్ని చిన్న వయసులోనే మాతంగిగా మారుస్తారు. మాతంగి గా మార్చిన రోజున గ్రామ పెద్ద ఏదో ఒక గ్రామదేవత ఎదుట తాళి కట్టి మాత కళ్యాణం చేస్తారు. ఆనాటి నుండి ఆ గ్రామదేవతకు అంకిత మవుతుంది. వీరికి పెళ్ళి నిషేధమైనా, పిల్లలను కనవచ్చు. వీరిని 'మాతా పిల్లలని', 'దేవుని బిడ్డ'లని పిలుస్తారు. మాతంగులు కొలుపులో మాత్రమే పాల్గొంటారు. వీళ్ళు కొలుపుల్లో పాల్గొని ప్రారంభించడానికి 'మాత మైలు' జరపటం అంటారు.

ఒకరోజు కొలుపు ఐతే సాయంత్రం వీళ్ళ చిందు ప్రారంభమవుతుంది. మూడురోజుల కొలుపు ఐతే రెండవరోజు నుండే మాతంగి ఉంటుంది. ఐదు రోజుల కొలుపులైతే రెండవరోజు నుండే అక్కడ ఉండి దేవతా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కొలుపు ప్రారంభానికి ముందు మాతంగి గ్రామ పెద్దల ఇళ్ళకు వెళ్ళిరావాలి. వెళ్ళినప్పుడు పెద్దలు ఎవరైనా కోరితే కాదనకుండా ఆ రాత్రికి వారికి శారీరక సౌఖ్యాన్ని అందించాలి.

సాధారణంగా గ్రామాల్లో పోలేరమ్మ, అంకమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ కొలుపులు జరుపుతారు. ఈ కొలుపులను గూర్చి తిక్కన మహాకవి భారతం నందలి మౌసలి పర్వంలో ఇలా పేర్కొంటాడు -

జాతర సేయగ వలయుసర్వజనంబులు నంబు రాశికిన్
బ్రాతిగ భక్తి తోడనని బంధువులెల్లను చెప్పి కోట వి
ఖ్యాతగ నష్టచాటుటకు నర్హుని బాచిన ఘంటికాశ్వనో
పేతముకాక వాడెలిమి పెద్ద వలుంగున చాటే నెల్లడన్
(మౌసలి పర్వం 1- 4)

16వ శతాబ్దానికి చెందిన తెనాలి రామకృష్ణుడు కూడా అనాటి గ్రామసీమల్లో నిర్వహించు గ్రామదేవతల జాతరలను గూర్చి తన పాండురంగమహాత్మ్యములో -

అత్తరి దన్నగరీవతి, జాతర సాటించె బశు
విసరమనితర సా
ధ్యాతత వాతామయని, ర్ఘాతాహతి దూలగాలి
గంగలకెల్లన్ (పాండురంగ మహాత్మ్యము ; 3-73)

గ్రామాల్లో ఏదైనా అరిష్టం జరిగినప్పుడు, వర్షాలు లేనప్పుడు, మశూచి, కలరా వంటి వ్యాధులు సోకినపుడు కొలుపులు చేసేందుకు ప్రజలు ముందుకు వస్తారు. సాధారణంగా ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ఈ కొలుపులు చేస్తారు. ఈ కొలుపుల్లో తాగడం, చిందులు వేయడం, పరిపాడిగా ఉంటుంది. బ్రాంది, సారా, కల్లు త్రాగి అక్కడి వారిని కాలితో తన్నుతూ, వారిపై ఉమ్మి వేస్తే వారికి శుభం జరుగుతుందని వారి నమ్మకం, మాతంగి చేత తన్నించుకోవడానికి, ఉమ్మి వేయించుకోవడానికి పోటీలు పడుతుంటారు.

పోలేరమ్మ జాతర్లలో కొన్నిచోట్ల సిడిమాను ఊరేగిస్తారు. సిడిమానుకు ముందు మాతంగి నడుస్తూ వుంటే మిగిలిన వారు ఎగురుతుంటారు. దీన్ని తెనాలి రామకృష్ణుడు తన పాండురంగమహాత్మ్యములో ఇలా -

అంబోధరము క్రిందనసియాడు నైరావతియు దోలె
సిడివ్రేలె దెరవయోర్తు
బెందమ్మి కొలన రంజిల్లు నంచయు బోలె నిప్పుటేట
జరించె నెలత యోర్తు
తొలినంజయొడ వర్తిలు జక్కవయు బోలె
నీగెబందిరిగుండ నింతియోర్తు
జలనీలిపై నెక్కు కలువ మొగ్గయుబోలె
ననటాకునర్తించె నతివ యోర్తు

తే॥ కాంత యొక్కర్తు మూవునంగండలిచ్చె
మారుగాలిచ్చెనొకసుధామధురవాణి
లలన యొక్కుర్తు నోరితాళంబు లిచ్చెశక్తి జాతర
సద్భక్తి శక్తులెసగ
(పాండురంగ మహాత్మ్యము ; 3-77)

జాతరలో ఒకరు ముద్రగడ్డ పట్టుకొని ముందు వెళ్త ంటే కొంతమంది వేపమండలు కట్టుకొని మాతంగితో కలసి ఎగురుతుంటారు. మాతంగి చేతిలో వేపమండలు పట్టుకొని చిందులు వేస్తుంది.

కొలుపులు విధానం :

కొలుపులకు ముందు రోజు ధర్మకర్తల ఇంటి నుండి ముద్రగడ్డ ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి గుడికి చేరుస్తారు. కొలుపు ముందుగా కొమ్మునాదంతో ప్రారంభమవుతుంది. కొమ్మువారు కూడా ప్రత్యేకంగా ఉండారు. మొదటి రోజు సద్ది పెడతారు. రెండవరోజు కుభం వండిపోస్తారు. మూడవరోజు మాతంగితో కలిసి ముందుగా జమ్మిచెట్టు వద్దకు వెళ్ళి వచ్చి ఊరేగింపుగా బయల్దేరతారు. ఊరేగింపులో ముందుగా ముద్రగడ్డ పట్టుకొని వెళ్తూ ఉంటే కొందరు వీర త్రాళ్లతో కొట్టుకొనుచూ ప్రదర్శనలిస్తారు. బవినీడి వారు జమిలిక, పంబ వాయిస్తూ వుంటే మాతంగి ఆ మోతకు తగినట్లుగా చిందులు వేస్తుంది. బవినీడు వారు మధ్యలో అమ్మవారి కథ చెప్తుంటారు. గుడి దగ్గరికి వెళ్ళి ముగ్గువేసి అమ్మవారి కథను చెప్తారు. వేకువ జాముకు ఊరేగింపు గుడి దగ్గరకి వస్తుంది. అప్పుడు అమ్మవారికి బలులు ఇచ్చి పొంగలి పెట్టుకుంటారు.

మాతంగి ధరించే వస్తువులు :

1. బుట్ట
2. జోగిని కర్ర
3. గవ్వలదండ
4. గజ్జెలు

దేవర ఇంటి నుండి తెచ్చిన గవ్వలు, శిలలు మాతంగి బుట్టలో వేస్తారు. ఈ రీతిగా మాతంగి కొలుపుల్లో పాల్గొనుట వల్ల ఆ గ్రామానికి శుభం జరుగుతుందని గ్రామస్థుల నమ్మకం.

సాధారణంగా గ్రామాల్లో ఈ కొలుపులు వెనుకబడిన కులాల వాళ్లు నిర్వహిస్తుంటారు. గ్రామ దేవతల పూజా కార్యక్రమాల్లో కుమ్మరులు ప్రముఖ పాత్ర వహిస్తారు. కొలుపులు నిర్వహించే వాళ్లు - గొల్లలు, వడ్డెరలు, రజకులు. గొల్లలు ఈ కొలుపుల్లో వీరతాళ్ళతో కొట్టుకుంటూ ప్రదర్శనలిస్తారు. కొలుపుల సాయంత్రపు వేళలో బవినీడు వారు అమ్మవారి కథను ఎంతో నేర్పుతో చెప్తారు. కథకుడు చేతిలో కత్తి, డాలు ధరించి కథ చెప్తుండగా కొందరు పూనకంవచ్చి ఎగురుతుంటారు. వాళ్ళపై పసుపు నీళ్ళ చల్లి సాంబ్రాణి పొగ వేస్తారు. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ కొలుపులు నిర్వహిస్తారు.

ఇది అశ్లీల నృత్యమని, సాంఘీక దురాచారమని, నీచమైన వ్యవస్థని తెలిసి కూడా గ్రామీణులు ఈ మాతంగి చిందులకు ఎక్కువగా ప్రాముఖ్యాన్ని ఇస్తారు. భర్త లేకుండా పిల్లల్ని కనే ఈ సంస్కృతిని నిషేదించాలి. ప్రభుత్వం ఈ మాతంగి వ్యవస్థను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా ఈ దురాచారం గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతూనే వుంది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్యము – కవిత్వ చైతన్యము

– చొమర్తి సాయికృష్ణ, తెలుగు అధ్యాపకులు, శ్రీ వై.ఎన్. కళాశాల (అ), నరసాపురం.

చరిత్ర అంటే మానవ సామాజిక జీవన పరిణామాన్ని వాస్తవాంశాలతో క్రోడీకరించడం, ఏ నేల నుండి ఒక జాతి జనించిందో దాని భాష, సంస్కృతి, జీవన గమనము అంతర్గర్భితంగా ప్రవాహశీలమైన మలుపును తీసుకోవడమే. మనం వాస్తవాంశాలను మధింపు చేసి వ్యక్తీకరించడం చరిత్ర. అణగద్రొక్కబడిన, తిరస్కరించబడిన జాతులదే నిజమైన చరిత్ర కాగా అణగద్రొక్కిన వాడిదే చరిత్రగా చలామణి అవుతూవచ్చింది. అణగద్రొక్కిన వాడి క్రౌర్యాన్ని ఎదిరించిన వాడి పోరాటం నుండి చారిత్రక అంశాలు మనం క్రోడీకరించుకోవడం ద్వారా నూతన చరిత్ర ముందుకొస్తుంది.

చరిత్ర అంటే జనరల్ ఇన్ఫర్మేషన్ కాదు. ఒక దేశంలోని వైవిధ్యభరితమైన జాతుల చరిత్రయే నిజమైన చరిత్ర. ఆధిపత్య వర్ణాలకు వ్యతిరేకంగా నిలబడిన జాతుల చారిత్రక గుర్తులు తుడిపివేయడానికి భారత ఉపఖండంలో పెద్ద ప్రయత్నం జరిగింది. దాన్ని తట్టుకొని వారి ఆధారాలలోకి చొరబడి నిలబడగలగడం దళితుల జాతి జీవన వ్యక్తిత్వానికి నిదర్శనం అని ఆర్.ఎస్.ఖారే తన అన్‌టచ్‌బుల్ యాజ్ హిమ్‌సెల్ఫ్ అనే గ్రంథ పీఠికలో పేర్కొన్నారు.

శాంతశ్చ ద్రవంతశ్చ పరిచర్యాసుయే రతా,
నిస్తేజసః అల్పం వీర్యాశ్చ శూద్రాన్ తాన్ బ్రవీత్తుసః

దుఃఖంతో పారిపోయిన వారు, కాయ కష్టానికి అలవాటు పడ్డవారు, ధీనులుగా, బలహీనులుగా ఉన్నవారు శూద్రులుగా పరిగణించబడ్డారని భవిష్య పురాణంలో నిర్వచించారు. అంబేద్కర్ ఇప్పటివరకు ఒక యుగానికి మార్గదర్శకంగా ఉన్న వేదాన్ని తన హేతువాద దృక్పథంలో ఇలా వ్యాఖ్యానించారు.

"ఈ పనికిమాలిన వేదాల్లో ఉన్నదేమిటి? పవిత్రత లేదు, ప్రశ్నించే తత్వము లేదు, తమ శత్రువుల నాశనము కొరకు వారి ఆస్తులను దోచుకొని, వాటిని తమ అనుయాయులకు పంచిపెట్టడం కోసం కొండ దేవతలను ప్రార్థించడం తప్ప మరేమీ లేదు. ఆర్య జాతులు చేసిన వధని, హింసని వారు వీరత్వంగా వర్ణించుకుంటూ పోయారు. అందుకే ఎప్పటినుంచో లభిస్తున్న ఆ చరిత్రను పునఃపరిశీలించాలని, దీనివల్ల కలిగే పరిణామాలకు నేను భయపడటం లేదని, జన సామాన్యాన్ని ఉత్తేజపరచడంలో కృతకృత్యుణ్ణి కాగలిగితే సంతోషిస్తాను" అని వ్యాఖ్యానించారు.

మనుషులంతా ఒక్కటే అయినా మనిషికీ మనిషికీ మధ్య చెప్పరాని అంతరాలు సృష్టించబడ్డాయి. ఆంగ్లేయుల రాకవల్ల ఎంతోమంది సంఘసంస్కర్తల ప్రభావం వల్ల దళితుల జీవితంలో చైతన్యం వచ్చింది. తదనుగుణంగా తెలుగు సాహిత్యంలో దళితాభ్యుదయం చోటు చేసుకుంది. దళితవాదము, స్త్రీవాదము తెలుగు సాహిత్యంలో దాదాపు ఒక కాలంలో ఆవిర్భవించాయి. వాటి ప్రారంభము 1975లో అయితే 1985 నాటికి వాటికి అసలు రూపం వచ్చింది. జాషువా 1920 నుంచి కవిత్వం రాస్తున్నా 1929 దాకా సొంత గొంతుక ఏర్పడలేదు. దళిత సాహిత్యం పుట్టేసరికి జాషువా ఒక సాహిత్య చైతన్యం అయ్యాడు. మానవులంతా సమానమే అనే మాట ప్రక్కకునెట్టి తరతరాలుగా, యుగయుగాలుగా అగ్రవర్ణాలచేత అణచివేయబడ్డ వర్గాలు దళితులు. కుల వ్యవస్థలో వీరు సమానత్వానికి, మర్యాదకి దూరమై కఠిక దరిద్రం అనుభవిస్తున్నారు.

1. భవిష్య పురాణము-1-44-23.
2. డా॥బి.ఆర్.అంబేద్కర్ రచనలు - ప్రసంగాలు-5, పేజీ-9.

బౌద్ధ, జైన మతాలు ఈ కుల వ్యవస్థని ఘాటుగా వ్యతిరేకించాయి. ఆ తరువాత శైవ, వైష్ణవ మతాలు తీవ్రంగా ప్రతిఘటించాయి. ''శివతత్వసారము''లో మల్లికార్జున పండితుడు శివభక్తుడైన దళితుడు పూజకు అర్హుడని అతన్ని కులం తక్కువ వాడుగా చూడద్దని సిద్ధాంతం చేసాడు. తాళ్ళపాక అన్నమాచార్యులు తన సంకీర్తనలలో..

నిండారు రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
ఛండాలుడుండేటి సరిభూమి యొకటే

అంటూ అందరూ సమానమేనని చెప్పడం జరిగింది. ఇంకనూ వీరబ్రహ్మము గారు, వేమనగారు తమ పద్యాలలో కూడ దళిత కవిత్వాన్ని వికసింపజేసారు. కవులు తమ భావప్రకటనలో వారు జీవించిన కాలము, వారి చుట్టూ ఉన్న పరిస్థితులు విశ్లేషించడం జరుగుతుంది. ఈ దృష్టిలోనే గురజాడ చెప్పిన భావాలను కూడ గ్రహించవచ్చు.

మనుజులందున ఎంచిచూడగా
మంచి చెడులను రెండె కులములు
మంచి అన్నది మాల అయితే
ఆ మాలనేనగుదును

ఇది గురజాడ ప్రసిద్ధమైన ఉద్ఘాటన. అంటే కులం అనేది ఏవిధంగానూ గుణాలకు, ఔన్నత్యాలకు కొలమానం కాదని భావము. 1933లో దళిత చైతన్యానికై రెండు గొప్ప దళిత కవిత్వ సంపుటాలు వచ్చాయి. 1. మంగిపూడి వెంకటశర్మ రాసిన ''నిరుద్ధభారతము'', 2. కుసుమ ధర్మన రాసిన ''హరిజన శతకము'' అని చెప్పవచ్చు. వెంకటశర్మ, ధర్మన ఆ కాలంలో గాంధీ భావాలచే ప్రభావితులై గాంధీ అస్పృశ్యతను వ్యతిరేకించడంతో మంగిపూడి వెంకటశర్మగారు అస్పృశ్యులపై తనకు గల సానుభూతిని, ఉద్యమ అనుకూల లక్షణాలను, గుండెను కదిలించే భావాలను తన కవితా రూపంలో చెప్పారు. దేవుణ్ణి, శాస్త్రములను, హిందూ మతాన్ని కవి విశ్వసించినా ఆ పరిధిలోనే తన కాలానికి అనుగుణంగా దళితులను మేల్కొలిపే ప్రయత్నము తీవ్రంగా చేసారు.

పంచములారా! అంతరిత భవ్య గుణోత్కరులారా! గర్భతో
దంచిత శక్తులారా! అనమర్ధలె మీరలు? గొఱ్ఱెమందలో
వంచితమై చరించు నల వ్యాఘ్రు కిశోరము రీతి పూర్తిగా
వంచితులైరి ఆత్మబల వైఖరి నెంచుడు మేల్కొనుండికన్

అని అస్పృశ్యతకి వ్యతిరేకంగా సంచలనాత్మకమైన కవిత్వాన్ని రాసి దళితులు ఇకనైనా చైతన్యాన్ని పొంది సమాజంలో జీవించాలని తెలిపారు.

అదేవిధంగా ''మేకల్ని బలిస్తారు గానీ సింహాలని కాదు'' అనే అంబేద్కర్ మాటలు దళితులను సమాజంలో సమాన వర్గాలుగా గుర్తింపు పొందాలనే పోరాటం వైపు నడిచేలా చేసాయి. దీని ప్రేరణతో బొజ్జాతారకం గారు 80ల నుండే ''నలుపు'' అనే దళిత పత్రికను కూడ నడిపి, దళిత చైతన్యాన్ని వ్యాప్తి చేసారు. ఆయన...

''నేను అస్పృశ్యుణ్ణి
నా ఒళ్ళంతా మట్టివాసన
నా బ్రతుకు నిండా వెట్టివేదన''

అంటూ రాసిన రచన వలన దళితులు సమాజంలో పడుతున్న అవమానాలను తెలియజేసారు. ఈ రచన తరవాత కాలంలో దళిత సాహిత్యానికి వేగుచుక్క అని చెప్పవచ్చు. సతీష్ చందర్ దళితులంటే తరతరాలుగా అన్నికులాలకు దూరంగా ఉంచబడిన అవర్ణులు మాత్రమే అని వారికి సమాజంలో సమానమైన స్థానము ఉన్నదని ఆవేదనను వ్యక్తం చేసారు.

నిజం చెప్పండి,

పంచముడంటే అయిదోవేలు లేనివాడనేనా అర్థం?
మా ముత్తాత ఏకలవ్యుడు చెప్పాడు.

అంటూ దళిత కవిత్వము ప్రధానంగా ఆత్మగౌరవానికి సంబంధించిన ప్రశ్నగా రూపొందిందని దళితులు అన్నివిధాలుగా సమాజంలో అందరితో కలిసి జీవించడానికి జ్ఞానాన్ని పొందడానికి అర్హులని తెలియజేసారు. ఇంకనూ సతీష్ చందర్ దళితుల ఆత్మగౌరవ ప్రకటనలో మరో ముఖ్యమైన కోణంగా తమ అనుభూతులను అస్థిత్వాన్ని ఎవరూ తక్కువగా చూడటానికి వీలులేదని తెలిపారు.

నిలువుటద్దం ముందు నిల్చుంటాన్నేను
అవయవాల దొంతర కాదు
అవమానాల పరంపర కనిపిస్తుంది.

అంటూ దళితులకు జరిగిన అన్యాయాలను అవమానాలను పేర్కొని వాటికి ప్రతిస్పందన ఇవ్వడము దళిత కవిత్వములో ప్రబలమైన ధోరణి అని వివరించారు. అదేవిధంగా దళిత జీవన సౌందర్యాన్ని కూడ కొందరు కవులు వినిపించారు. అందులో డా॥ కత్తి పద్మారావు గారిది ప్రత్యేకము.

బండింటికాడ
గనిసిగడ్డల బండి దిగిందని
ఎడగారోడు గోలపెడితే
బానలో నూకలు చెంగున గట్టి

అంటూ రాసిన కవిత దళిత భాషను, దళితుల జీవితాలను విశదీకరిస్తుంది.

ఈ దేశవాసులం-ఈ భూమి పుత్రులం
మేము మూలవాసులం-అది అసలు జాతులం

అంటూ మాస్టర్జీ దళితులు ఈ దేశములో ఎప్పటి నుండో జీవనము సాగిస్తున్నారని ఈ భూమిమీద హక్కులు వారికీ ఉన్నాయని దళితులకు అగ్రతాంబూలం అందించాలని, ఎందువలననగా దళితులు ఆదినుంచీ ఇక్కడ ఉన్నవారని తెలియజేసారు.

ఈ విధంగా దళిత కవిత్వము తెలుగు సాహిత్యములో ఒక చారిత్రక కవితోద్యమము. అగ్రవర్ణాల అహంకారముతో పోరాటము చేసి, తాత్కాలిక అవసరమైన కుల సమస్యనే కాక, ఇతర సమస్యలను కూడ స్వీకరించి వారి చైతన్యానికి దళిత కవిత్వము తోడ్పడింది. సమగ్రమైన తాత్విక నేపథ్యము, సమకాలీన సమస్యా చిత్రణ, వస్తు వైవిధ్యము, ప్రతిఘటనల వలన వెలువడిన వీరత్వము, అత్యుత్తమ కవితాభివ్యక్తి దళిత కవిత్వాన్ని మహోజ్వలం చేస్తుంది.

ఈ విధంగా దళితవాద సాహిత్యము తెలుగు కవిత్వానికి గర్వకారణమైన ఉద్యమము అని నిస్సందేహంగా చెప్పవచ్చును.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. దళితుల చరిత్ర-డా॥ కత్తి పద్మారావుగారు-లోకాయత ప్రచురణలు
2. భారతదేశంలో కులవ్యవస్థ-సంపాదకవర్గం-విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్
3. తెలుగు సాహిత్య చరిత్ర-వెలమల సిమ్మన్న-దళిత సాహిత్యపీఠము.
4. తెలుగు కవితోద్యమాలు-తెలుగు అకాడమీ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత కవిత్వం తాత్విక నేపథ్యం

– డా॥. పెండ్యాల లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

భారతదేశం విభిన్న మతాల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం. అదే భారతదేశపు గొప్పదనం. అటువంటి భారతదేశంలో ప్రాచీనకాలం నుండి కులం సమాజంలో అంతర్భాగం. కులంలేని మనిషి భారత దేశంలో లేడనే చెప్పాలి. అంతగా కులం సమాజాన్ని పెనవేసుకుపోయింది. వేదాల్లో బ్రహ్మదేవుడి ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాలనుండి క్షత్రియులు, నాభి నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని, వారిలో బ్రహ్మముఖం నుండి పుట్టిన బ్రాహ్మణులు బ్రహ్మజ్ఞానం కలవారిగా, పండితుల స్థానమైన గురు స్థానానికి అర్హులుగా భుజాల నుండి పుట్టిన క్షత్రియులు దేశరక్షణులుగా యుద్ధాలు చేయుటకు అర్హులుగా, పాదాలనుండి పుట్టిన శూద్రులుపై ముగ్గురికి సేవచేసే బానిసలుగా పేర్కొనబడింది. నాటి సమాజం అలాగే నడుచుకుంది. అగ్రవర్ణాల ముగ్గురు కూడా శూద్రులను బానిసలుగా చేసుకుని వెట్టిచారికి చేయించుకున్నారు. ఋగ్వేదంలోని పురుష సూక్తం బ్రాహ్మణులకు ప్రథమస్థానాన్ని, శూద్రులకు అధమస్థానాన్ని కల్పించింది. క్రీ.పూ. 1 నుండి 3వ శతాబ్ద మధ్యకాలంలో రాయబడిన 'విష్ణుధర్మ సూత్రం' అనే ధర్మశాస్త్రంలో 'అస్పృశ్య' అనే పదం మొదటిసారిగా వాడబడింది. తద్వారా కష్టజీవుల్ని పంచములుగా గ్రామ చండాలురుగా చట్టబద్ధంగా ముద్రవేసింది.

భిన్నత్వంలో ఏకత్వం కలిగిన ఈ పవిత్ర దేశంలో స్వార్థ పూరిత శక్తుల కారణంగా అస్పృశ్యతను లేవనెత్తి పెత్తనం చేశారు. వీరి ప్రయత్న ఫలితంగా అగ్రవర్ణాలు అంటరాని వారి మీద పెత్తనం చేసి చివరికి ఏ స్థాయికి తీసుకువచ్చారంటే అస్పృశ్యుడి నోటి నుండి పడే తుంపర్లను, వారు నడిస్తే ఏర్పడే అడుగుల గుర్తులను అగ్రవర్ణాల వాళ్ళు తాకితే మహాపాతకాలు చుట్టుకుంటా యన్నారు. అందుకే అస్పృశ్యుడి నోటి నుండి తుంపర్లు బయటపడనీయకుండా నోటికి మట్టి ముంతను, నడిస్తే పడే కాలి అడుగుల గుర్తులను చెరిపేయడానికి నడుముకు తాటి ఆకులను కట్టించారు. నాటి నుండి అస్పృశ్యులు అగ్రవర్ణాల వారికి దాసోహమై తమ మాన ప్రాణాలు అర్పించుకున్నారు. ప్రాచీన భారతీయ సమాజంలో శూద్రులు పై మూడు వర్ణాల వారికి సేవ చేస్తూనే కుల వృత్తులు చేస్తూ తమ శ్రమశక్తితో అనాటి సమాజానికి సేవచేశారు. అగ్రవర్ణాల వారు శూద్రుల పట్ల వివక్ష చూపించేవారు. నాటి ప్రాచీన సమాజంలో ఒక వర్గం ఆధిపత్యం చేస్తుంటే మరొకవర్గం సేవలు చేస్తూ బానిసలుగా బతికారు. ఆనాటి సమాజంలో శూద్రుల తర్వాత చెప్పుకోదగిన చండాలురు. వీరే తరువాత దళితులుగా పిలువబడ్డారు.

ఆర్యులు మన దేశానికి రాకముందు ఆదిమ భారతీయులు పశువులతో వ్యవసాయం చేశారు. అలాగే జంతు చర్మాలతో చెప్పులు కుట్టడం ఉత్పత్తి శక్తులుగా అధిక సంపదలు ఆర్జించారు. ఒక రకంగా చెప్పాలంటే, శ్రమ విభజనలో భాగంగానే సాగింది. ఆర్యులు భారతదేశానికి వచ్చిన తర్వాత మతం, వర్ణ వ్యవస్థలు ప్రారంభమైయ్యాయి. వృత్తులు కులాలయ్యాయి. శ్రామికులు బానిసలయ్యారు. ఆర్యులు వాళ్ళకి సన్నిహితంగా మెలిగిన కొన్ని ఆదిమ భారతీయ వర్గాలు అగ్రవర్ణులయ్యారు. పితృస్వామిక వ్యవస్థలో భాగంగా మహిళలు ఇంటికే పరిమితమయ్యారు. ఆది భారతీయ వర్గాల మహిళలు దాసీలుగా మారారు. ఆర్యులతో పోరాడి ఓడిన వర్గాలు అస్పృశ్యులయ్యారు.

దళితులు వారి ఉనికిని అనేకమంది రచయితలు తమ కవిత్వాల ద్వారా బహిర్గతం చేశారు.ఎవరైతే తమ

రచనలతో దళిత స్పృహను స్పర్శించారో వారంతా దుర్భరమైన పరిస్థితులను చవిచూశారు. దళితుల యొక్క దయనీయ స్థితిని వారి దుర్భర జీవితాలను కవిత్వ రూపంలో చిత్రించారు.

కుసుమ ధర్మన్న తొలితరం హరిజనోద్ధరణ నాయకుడు. మాకొద్దీ నల్లదొరతనము అనే సుదీర్ఘమైన పాటను రాశారు. గరిమెళ్ళ మాకొద్ది తెల్లదొరతనము అనే పాటను దేశ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో రాస్తే, కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్లదొరతనము అని అగ్రవర్ణాల తీరును ఈ పాటలో వివరించారు. అగ్రవర్ణాలు దళితుల్ని బానిసలుతా చేసుకుని హీనంగా చూస్తున్న తీరును దుయ్యబట్టారు.

"బ్రాహ్మణులమని యేరు - బహు విర్రవీగేరు
బ్రాహ్మణత్వము మరచినారు వేషభాషలో తిరుగుతాడు
తమకంటే ధన్యులు లేరంటారు. మతధరన్మాలు మంటబెట్టారు.
పరమ బానిసలై బ్రతుకుతున్నారు. మా పంచములె బానిసలంటారు.
వారి వేష బాషలేమొ నేడే మాడి మంటడిపోను
మాకొద్ది నల్లదొరతనము - దేవ మాకొద్దీనల్లదొరతనము
మాకు పదిమందితోపాటు పరువు గలకయన్న"

అగ్రవర్ణాల దురహంకారాన్ని ధర్మన్న ఎండగట్టారు. దళితులను బానిసలుగా మార్చి పెత్తనం చేస్తున్న బ్రాహ్మణులను, వేదాల పేరుతో వీళ్ళు చేస్తున్న మోసాలను తెలియజేశారు.

నవయుగ కవితా వైతాళికుడు గుర్రం జాషువా తాను అనుభవించిన అస్పృశ్యతను తన కవిత్వాలలో తెలియజేశారు. కుల వ్యవస్థ నాలుగు పడవల హైందవ నాగరాజులా బుసలు కొడుతుంటే ఆ సెగలకి దళితులు మాడిపోతున్నారన్నారు. జాషువా కుల వ్యవస్థ బ్రహ్మ శరీర భాగాల నుండి ఏర్పడ్డాయిని నోటి నుండి బ్రాహ్మణుడు, భుజాల నుండి క్షత్రియుడు, తొడల నుండి శూద్రులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని పురాణాలు పేర్కొన్నాయి. మరి ఐదవ వర్ణం వాడైన పంచముడు ఎక్కడి నుండి పుట్టాడని ప్రశ్నిస్తున్నాడు.

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలుగురు కుమారులనులు వినాన్నముకాని
పసరము కన్న హీనుడభాగ్యుడైన
అయిదవ కులస్థుడెవరమ్మ సవిత్ర"

జాషువా పంచములు ముసలివాడైన బ్రహ్మదేవుడి ఏ అవయవం నుండి పుట్టుకువచ్చారని ప్రశ్నించారు. పురాణాల్లో లేని తప్పుడు కర్మ సిద్ధాంతాల్ని అగ్రవర్ణాల వాళ్ళు తమ స్వార్థం కోసం దళితులకు నూరిపోసి బానిసలుగా చేసుకున్నారు. కర్మ సిద్ధాంతం పేరుతో దళితుల నోరు కట్టిపడేశారు. కర్మ సిద్ధాంతాన్ని అడ్డం పెట్టుకుని అగ్రవర్ణాలు దళితుల మాన ప్రాణాలతో చెలగాటమడుతున్నారు.

మనువు పేర్కొన్న మనుధర్మ శాస్త్రాలను ధిక్కరిస్తూ సతీష్‌చంద్ర

దేవుడి కాళ్ళలోంచి భుజాల వరకూ
ఎగబాకిన ధమనులు మీరు
మనుధర్మాన్ని మనీపర్సులో
ముగ్గబెట్టే వుంటారు
మనిషినే కాదన్న నన్ను
రాజకీయ స్పర్శ గురించి అడిగితే
చర్మం వలిచి సోదాహరణంగా చెబుతాను

మనుధర్మ శాస్త్రాన్ని అడ్డం పెట్టుకుని అగ్రవర్ణాల వాళ్ళు పంచముల్ని హీనాతిహీనంగా చూస్తున్న తీరును తెలియజేశారు.

అంబేడ్కర్ భావజాల ప్రభావితుడు దళిత సాహిత్యాన్ని బలంగా సృష్టించిన భావితరం రచయితల్లో బోయి భీమన్న ప్రముఖులు. "మేమే తెలివైన వాళ్ళము మా కంటే తెలివైన వాళ్ళు లేరు అని తెలివితక్కువగా

ప్రవర్తించే వారిపై భీమన్న కవితా కొరడాలు ఝళిపించారు. భీమన్న కుల వ్యవస్థని, దానికి కారణభూతమైన పురాణాల్ని, పురాణ పురుషుల్ని విమర్శించారు. దేవుడి పేరుతో చేసే నిలువు దోపిడీలను, దోపిడీలకు కారణమైన బ్రాహ్మణ వ్యవస్థను వ్యతిరేకించారు. భీమన్న పై అంబేడ్కర్ భావజాల ప్రభావం ఉంది. దీని కారణంగా వీరి రచనల్లో దళితుల పట్ల వారి అభివృద్ధి కాంక్ష కనిపిస్తుంది.

ఎంతకాలం గొర్రెగా వుంటావో జనతా
సింహమై తిరగబడి రాక్షసవధ చెయ్యి
నీతులతో నినాదాలతో ఊరేగుతున్న
ఈ వేషగాళ్ళు వట్టి మహిషాసురేలేకాదు
మేక తోలు కప్పుకున్న వాతాపులు కూడా

అందరూ సమానమేనని నీతులు చెబుతూ ఏ విషయమైన వస్తే దళితుల్ని ప్రక్కదారి పట్టిస్తున్న పెద్దలను భీమన్న వాతాపులతో పోల్చాడు. ఎంతకాలం గొర్రెల బతుకు ధైర్యంగా సింహాల గర్జిస్తూ అగ్రవర్ణాల ఆగడాలకు బదులు పలకాలని సందేశమిచ్చారు.

ఆర్య ఋషులంతా దళితులే, దళితులంతా ఆర్య ఋషులేనని భీమన్న గట్టిగా వాదిస్తారు. ఆ వాదన సరియైనదని అనడానికి ఆర్య సంతతికి ఆది పురుషుడైన వశిష్టుడి నుండి ప్రారంభమైన వర్ణ సంకరాన్ని, వారి ద్వంద్వ నీతిని, పక్షపాత బుద్ధిని నిరశించారు. ''నా వారసత్వంపు హక్కులు'' అనే కవితలో

నానా దేశాలు వెతుకుతున్న వశిష్టుడికి
ఆమాల మాదిగ పిల్ల అరుంధతే దొరక్కుండా వుంటే
ఆనాడు అరుంధతి మనుమడైన పరాశరుడు
మోహంతో మీద చెయ్యివేసినపుడు
కోపంతో మూతిపళ్ళురాలగొట్టి వుంటే
అత్తగారి ఆజ్ఞల్ని ధిక్కరించి
పరపురుషుడైన వ్యాసుడ్ని తిరస్కరించి
పాతివ్రత్యాన్ని ప్రదర్శించి ఉంటే
వేదవ్యాసుడు పుట్టేవాడే కాదు
మహా భారతానికి కథ వుండేదే కాదు''

అంటూ మహాభారత కథ దళితులతోనే ప్రారంభమైందని పేర్కొన్నారు. ఆర్య ఋషులుగా పిలువబడే వారంతా దళితులేనన్న విషయాన్ని భీమన్న కవిత్వంలో వ్యక్తీకరించారు. భీమన్న దళితుల ఆవేదనల వ్యధలను కవీత్వకరించి హృదయాల్ని ద్రవింపజేస్తాయి.

దళితుల ఆర్తనాదాలు గ్రహించి వారి అభ్యున్నతికి త్రికరణ శుద్ధిగా కృషి చేస్తున్నవారు కత్తి పద్మారావు ఒకరు. దళితుల ఆర్తిని కవితల రూపంలో తెలియజేస్తూ యువతరాన్ని ఉద్యమంవైపు నడిపించిన స్ఫూర్తి ప్రధాత. హైందవ సాంప్రదాయపు వర్ణ వ్యవస్థను కూకటివేళ్లతో సమాజం నుండి పీకేయాలని ప్రయత్నించారు. అవసరమైతే తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో అడుగుపెట్టి నడిపిస్తున్నారు. నాలుగు వర్ణాల వారి పరిస్థితుల్ని మార్పులు ఉంటాయి. ఎటువంటి మార్పులు లేని అభివృద్ధికి నోచుకోనివారు దళితులు. నాలుగు వర్ణాల వారిని నిచ్చెన మెట్లను బానిసగా దళితులు మోస్తూన్నారని పేర్కొన్నారు. పద్మారావు జనగీతం అరశ్రీనే కవితా సంకలనంలో 'కడుపు తీపి' ఖండికలో నాలుగు వర్ణాలవాళ్ళు పంచముల్ని ఊరికి దూరంగా ఉంచిన విధానాన్ని

అద్దరేతిరికాడ - వల్లకడులోన
అరగాలిన పీనులుగ - పడదోసి కాలుత్తుండు
వోడురా వాడు? భూరతమ్మోరి కడగొట్టు కొడుకా
పెద్దొళ్ళు నలుగురు - వెలిబెట్టివాణ్ణి
కూడు లేకుండా -గుడ్డ లేకుండా
అంటకూడదని
వల్లకాడు దాక తరిమి తరిమి కొడుతుంటే
భారతమ్మోరు సాద్దింగా సూత్తునవ్వుతుందేరా
బిడ్డల్ని గందా! గడ్డల్ని గందా! అని వాపోయారు.

భారతమాతకు అందరు సమానమే. అయితే ఇక్కడ

నాలుగు వర్ణాల వాళ్ళు అందరు సమానమే అన్న మాటలు ప్రక్కనబెట్టి దళితుడిని కూడు, గుడ్డ, లేకుండా ఊరి బయటికి తరిమేశారు. అయినా భారతమాత అలానే వింతగా చూస్తూనే ఉంది. ఈమె బిడ్డల్ని కాదా దళితులు అని ప్రశ్నించారు. దళిత అభ్యున్నతికి, వారు తక్కువకారనే న్యూనతాభావాల్ని దళితుల మస్తిష్కం నుండి తీసేయాలని ప్రబోధించారు.

దళితుల్ని చైతన్య పరచడానికి
దళితుడా! దళితుడా
భారత భూమి బిడ్డడా - ఆది భారతీయుడా
సింధూనది తీరాల్లో - నగరాలు నిర్మించిన మొదటి నాగరికుడా
భారతభూమి గుండెల్లో -మానవ సంస్కృతికి
వారధిని నిర్మించిన శ్రామికుడా ! పోషకుడా

అంటూ కత్తి పద్మారావు కలాన్ని గళాన్ని ఒకే స్థాయిలో సామాజిక సమస్యలపై ఝుళిపించారు.

దళిత జనోద్ధారకులు బొజ్జా తారకం దళితుల అస్థిత్వాన్ని తమ కవితలలో చొప్పించారు. నాటి సమాజం దళితులకు భూమిని లేకుండా చేసి వృత్తి పనులకోసం చచ్చిన గొడ్డుల్ని అంటగట్టింది. చచ్చిన గొడ్ల చర్మాలతో చెప్పులు తయారు చేస్తారు. దీన్ని జీవన వృత్తిగా చేశారు. మూతికి ముంతా, ముడ్డికి ఆకు కట్టుకు తిరగమన్నారు. అదేమని ప్రశ్నిస్తే మీరు పోయిన జన్మలో పాపాలు చేశారు, అందుకే ఈ జన్మలో అస్పృశ్యులుగా పుట్టారని కర్మ సిద్ధాంతాన్ని నూరిపోశారు.

"నేనెప్పుడో చేసిన పాపం కొద్దీ
నాకీ బ్రతుకొచ్చిందని
మీకిలా ఊడిగం చేయడమే
దేవునికి ఇష్టమని
అలా నానొసట వ్రాశాడని
శిక్షవేసిన వాళ్ళు వీళ్ళే అంటాడు"

బొజ్జా తారకం దేవుడి పేరుతో మతోన్మాదులు చేస్తున్న కుట్ర ఇది అని తెలియజేశారు.

ముగింపు :

ఈ విధంగా దళిత కవిత్వం అణగారిని వర్గాల ఆర్తిని, ఆవేదనను వ్యక్తం చేసింది.

ఆధార గ్రంథాలు :

1. వర్ణ వ్యవస్థ, చిత్తజల్లు వరహాలరావు, పుట, 17.
2. ఆదిమ భారతీయుల చరిత్ర, డా॥. కె. లక్ష్మీనారాయణ, పుట, 24 : 25.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత కళా సాహిత్యం – సమకాలీన జీవనచిత్రణ

– డా॥. బూసి వెంకటస్వామి, సహాచార్యులు,తెలుగు విభాగం, ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో కథానిక నేడు ప్రధాన భూమిక పోషిస్తుందని చెప్పవచ్చు. గురజాడ చేతిలో రూపుదిద్దుకున్న కథానిక ప్రక్రియ అనంతరకాలంలో వైవిధ్యభరితమైన ఇతివృత్తాలతో సామాజిక స్పృహ కలిగిస్తూ సమాజ చైతన్యానికి వారధిగా నిలిచింది. కాలానుగుణంగా అనేక మార్పులు చెందుతున్న తెలుగు కథానిక పాలగుమ్మి పద్మరాజు గాలివానతో అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది.

సమకాలీన సమాజంలో. జరుగుతున్న అన్యాయాలను అకృత్యాలను దౌర్జన్యాలను దోపిడీ విధానాన్ని,అంతరించిపోతున్న మానవీయ విలువలు,కుటుంబ జీవనం వంటి మొదలైన అంశాలను ఇతివృత్తంగా తీసుకొని ఎంతోమంది కథలు రాసి కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. అటువంటి కథా సాహిత్యంలో దళిత కథా సాహిత్యం 1925 లో ప్రారంభమైందని అని చెప్పవచ్చు.తెలుగు దళిత కథా సాహిత్యాన్ని రెండు భాగాలుగా వర్గీకరించుకోవచ్చు. ఒకటి స్వాతంత్ర్యం పూర్వం దళిత జీవితాన్ని ఆవిష్కరిస్తూ వెలువడిన కథానికలు వీటిని మొదటి తరం కథానికలుగా భావించవచ్చు.రెండు స్వాతంత్ర్యానంతరం దళిత జీవితాన్ని ఆవిష్కరిస్తూ వెలువడిన కథానికలు ఇవి రెండో తరం కథానికలు గా పేర్కొనవచ్చు మొదటి తరంలో కథానికలలో దళితుల దుస్థితిని, ఆ రోజుల్లో దళితులను అనునిత్యం అవమానిస్తూ తమ వైపు వారు వస్తేనే తాము మైల పడి పోతున్నామంటూ గగ్గోలుపెడుతూ కుక్కలకంటే హీనమైన పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు ఆనాటి రచయతలు వర్ణించారు.

మొట్టమొదట తెలుగులో వచ్చిన దళిత కథానిక లాజరస్.ఈ కథను ఎవరు రాశారో తెలియదు గాని 1925 ఫిబ్రవరిలో శారద అనే పత్రికలో ఈ కథానిక అచ్చయ్యింది. ఈ కథలో వీరడు అనే వ్యక్తి. గ్రామంలో జరిగే. రామయజ్ఞానికి వెళ్ళినప్పుడు. ఊరి మోతుబరి రైతు రామయ్య తమ ప్రాంతానికి వచ్చిన వేరడాను చంపేస్తాడు.వీరడు కొడుకైన లాజరస్ చదువుకొని. న్యాయవాద వృత్తిని చేపట్టి న్యాయమూర్తిగా అక్కడకే వస్తాడు. తన తండ్రిని చంపిన రామయ్య కేసు. తన దగ్గరకు విచారణకు వచ్చినప్పుడు హంతకుడైన రామయ్య పశ్చాత్తాపపడి తనను శిక్షించమని ప్రాధేయపడతాడు అందుకు ప్రతిగా లాజరస్ అతనికి ఎటువంటి శిక్ష వేయకుండా అందరూ సోదరభావంతో కలసిమెలసి జీవించాలని అదే అతనికి విధించే శిక్ష అంటూ ముఖ్యంగా దేశ స్వాతంత్రం కోసం అందరూ పాటుపడాలని. జై మహాత్మా గాంధీ కి అని పలికి అతన్ని వదిలి వేస్తాడు. ఈ కథలో రచయిత మనందరం సోదరులం మనమంతా ఒకే కుటుంబం వలే జీవించాలని తరతమ బేధాలు వాడాలి దేశ స్వాతంత్రం కోసం పాటుపడాలని భావనను కలుగజేస్తాడు.

తెలుగు దళిత కథా సాహిత్యంలో వచ్చిన రెండవ కథ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రచించిన పుల్లం రాజు. ఈ కథ పుల్లంరాజు బొంబాయిలో జరుగుతున్న అస్పృశ్యతా నివారణ సభలకు వెళ్లి తన ప్రాంతంలో కూడా అటువంటి అస్పృశ్యత నివారణ. చర్యలకు పూనుకుంటాడు. తన రాజ్యంలో. మారువేషంలో సంచరిస్తూ. మాల మాదిగలు ఉన్నటువంటి. ప్రదేశానికి చేరుకొని. వారిద్దరిని ఓకే నూతి నుండి నీటిని తోడుకోమంటాడు. అందుకు. మాల కులస్తులు నిరాకరిస్తారు. మాది కులస్తులను నూతిలో నీటిని తోడుకోవటానికి ఇష్టపడరు. పుల్లంరాజు దళితుల్లో ఇటువంటి వ్యత్యాసాన్ని. తొలగించుకోవాలని చెప్పి అక్కడనుండి వెళ్ళిపోతాడు.

అయితే ఈ కథలో. పుల్లం రాజు కేవలం దళితుల్లో ఉన్నటువంటి. అసమానతలను. తొలగించుకొమని తెలియ జేసాడు అంతేగాని సమాజంలో ఉన్నటువంటి అగ్రవర్ణ కులస్తులు దళితుల పై చూస్తున్న నీచమైన సంస్కృతి గురించి మాత్రం తెలియజేయలేదు.రచయత కేవలం సమాజంలో దళిత వర్గాల మధ్య ఉన్న అంతరాలను తెలియజేసాడే గాని దళితుల అగ్రవర్ణ వర్గాలు చూపుతున్న అస్పృశ్యత గురించి వివేచన చేయలేదు.

మూడవ కథానిక తాళ్లూరు వెంకటేశ్వరావు రచించిన. సంసార సాగరం. విశ్వనాథ అనే బ్రాహ్మణుడు ఉద్యోగి అతని భార్య పరమ చాందసురాలు. ఒకరోజు రోజు విశ్వనాథం. ఉద్యోగానికి వెళుతూ తొందరలో తన పెట్టెలో ఉన్న కోటును తీసుకురమ్మంటాడు. ఆకోటుపై అంతకుముందు మాలవాడు తెచ్చిన పుస్తకం ఉందని అతని భార్య" ఇందాక మాలవాడు ఇచ్చిన పుస్తకం కదూ ఆ మాల ముండాకొడుకు ఇచ్చిన పుస్తకాన్ని జాగ్రత్తగా ఇంట్లో పెట్టుకుంటారండి అంటుంది. ఏ కథ లో ఆనాటి బ్రాహ్మణుల వైఖరి దళితుల పట్ల చులకనభావం దళితుల పట్ల ప్రవర్తిస్తున్న మూర?త్వం అంటరానితనం సమాజ వ్యవస్థ మొదలైన విషయాలన్నీ ఈ కథలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఆ తర్వాత వచ్చిన కథానిక బందా కనకలింగేశ్వరరావు గుక్కెడు నీళ్లు. ఇందులో బ్రాహ్మణునిచే అవమానింపబడి దూరంగా ఉంచబడిన వెంకటప్ప ఆపద సమయంలో అదే బ్రాహ్మణ కుటుంబాన్ని ఆదుకుంటాడు. కలరా సోకి బ్రహ్మయ్య అనే బ్రాహ్మణుడు చనిపోగా అతని కొడుకులు గానీ అతని బంధుమిత్రులు గానీ ఎవరూ శవాన్ని తీసుకు వెళ్ళటానికి ఇష్టపడలేదు. అప్పుడు వెంకటప్ప ధైర్యంగాఆ శవానికి దహన సంస్కారాలు జరిపిస్తాడు. అది చూసిన బ్రహ్మయ్య భార్య వెంకటప్పను తను కొడుకుగా స్వీకరించి తను చనిపోయే సమయంలో గొంతులో గుక్కెడుడు నీళ్లు పోసి పుణ్యం కట్టుకోమని ప్రాదేయపడుతుంది. తనకు అపకారం తలపెట్టినా ఉపకారం చేసిన వెంకటప్ప ను కన్న కొడుకు కంటే ఏక్కువగా చూసుకొన చివరకు అతని ఒడిలోనే తనువు చాలిస్తుంది. ఈ కథ ద్వారా రచయిత హరిజనులు హింసించే బ్రాహ్మణులే కాదు వారిని ఆదరించే ఇటువంటి మహామనుషులు కూడా ఉన్నారని తెలియజేస్తారు.

అనారోగ్యానికి గురై సరైన వైద్యానికి నోచుకోని దళిత యువతి కథే యీరమ్మ దీనిని అరవ వెంకట స్వామి రచించారు. వెంకడు అనే దళితుడికి యీరమ్మ కూతురే సర్వస్వం. ఆమె అనారోగ్యానికి గురైనప్పుడు వెంకడు మందు కోసం పూజారి గురవయ్య దగ్గరికి వెళ్ళినప్పుడు ఓరి నీ దుంప తెగ నీ ఇళ్లు వల్లకాడు గాను దిక్కుమాలిన పీనుగ ఇలా బ్రాహ్మణ వీధి తగలబడ్డావేమిరా ఆ స్వామికి అమంగళం అయిపోయాడంటాడు. చివరకు మందు ఇవ్వడానికి ఇష్టపడడు. చదువుకున్న సమర్థుడైన రామారావు చావు బతుకుల మధ్య ఉన్న యీ రమ్మను ఆంగ్ల వైద్యం చేత బాగు చేయడానికి ప్రయత్నిస్తాడు. ఆ విధంగా ఆమె ప్రాణాలు కాపాడుతాడు. ఈ కథలో రచయిత దళితుల పట్ల బ్రాహ్మణ కుటుంబాలు చూపుతున్న చిన్నచూపుతున్న వైనాన్ని కళ్లకు కట్టినట్లు చూపారు. రామారావు లాంటి వ్యక్తులు ఉండడంచేత మానవత్వపు విలువలు సమాజంలో ఇంకా బతికున్నా యని గుర్తు చేసారు.

అయ్యో పాపం అనే కథానికను తొలి దళిత కథా రచయిత్రియైన గొట్టుముక్కల మంగాయమ్మ గారు రాశారు. ఈ కథలో అన్నపూర్ణ భాస్కరులు భార్యభర్తలు అన్నపూర్ణ తల్లికి బాగా లేదని తెలిస ఊరు బయల్దేరారు. మార్గమధ్యంలో వారికి దాహం అవడంతోదగ్గరలోని చలివేంద్రం వద్దకు వెళ్తే కులం గురించి తెలుసుకొని ఇక్కడ మాల మొండోళ్ళకు దాహం ఇవ్వరు మీ వల్ల చలివేంద్రం మైలు పడుతుందని కసుకుకుంటారు. ఇది విన్న భాస్కరుడు పూర్వ కర్మ ఫలితాలను ఈ దొంగ వేదాంతాన్ని మనకోసమే కల్పించారు. మన రక్తమాంసాలని

బాగా పిండుకొని మనకు మంచి నీళ్ళు అయినా త్రాగకుండా చేస్తున్నందుకు మన నోరు మూసుకొని ఊరుకోవడానికి ఇలాంటి పిచ్చి మాటలు నమ్మబోకు పూర్ణ అంటాడు. ఆ తరువాత ఒక సాయిబు వీరి దాహార్తిన తీరుస్తాడు. ఈ కథలో రచయిత శాస్త్రాలను వేదాంతాన్ని అడ్డంపెట్టుకుని దళితులను ఏవిధంగా బ్రాహ్మణులు హింసిస్తున్నారో ఏళ్ల తరబడి అవమానిస్తున్నారో చెప్పకనే చెప్పారు. మతాలు వేరైనా మానవత్వం ముఖ్యమనే సిద్ధాంతాన్ని రచయిత చక్కగా విశదీకరించారు.

చుండూరు రమాదేవి ధర్మ తల్లి అనే కథను రాశారు. గ్రామంలో కలరా విజృంభించినప్పుడు అన్నను బతికించుకోవడం కోసం చెల్లెలు పూజారి పాపయ్య దగ్గరకు మందు కోసం వెళుతుంది. పది రూపాయలు ఇస్తే గాని మందు ఇవ్వనంటాడు.డబ్బులులేని ఆమె వెనక్కి తిరిగి వస్తుండగా ఒక బ్రాహ్మణ వితంతువు ఎదురుపడి ఛీ మాల ముండా కళ్లు కనబడవా మన వీధిలో ప్రవేశించడమే కాకుండా వెధవ ముండవి.మణ్ణీళ్ళు తెచ్చుకుంటుంటే మీదమీదికి వస్తావటే ముండా. మాయా స్వరాజ్యం వచ్చిందని ఉడికిపోతావా అంటూ నీళ్ళు పారబోస్తుంది. ఆకలికి తాళలేని ఆ చెల్లెలు అక్కడనుండి వెళుతూ మార్గమధ్యంలో సొమ్మసిల్లి పడిపోయినప్పుడు ఒక బ్రాహ్మణ వితంతువు ఇంటికి తీసుకువెళ్లి అన్నం రసం ఇచ్చి ఆమెకు సేవలు చేస్తుంది. ఈ కథలో రచయిత్రి బ్రాహ్మణ కుటుంబాలలో ఒకవైపు మంచివారు ఉంటే మరోవైపు చెడ్డవాళ్ళు ఉంటారనే విషయాన్ని చాలా చక్కగా తెలియజేశారు. మతం కంటే మానవత్వం గొప్పదనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

అయ్యపెళ్ళి రామలక్ష్మి రాసిన కథానిక ధన్యజీవులు. మాల కులానికి చెందిన వెంకడు బ్రహ్మణుడైన శంకరం పాలంసాగు చేస్తుంటాడు. ఒక రోజు తన భార్యకు బాగా లేక మందు అడగడానికి శంకరం ఇంటికి వెళతాడు. శంకరం మందు తీసుకొని వెంకడు భార్య ను బాగా చేస్తాడు. ఇది తెలిసిన శంకరుని తండ్రి శాస్త్రి అగ్గిమీద గుగ్గిలం అయి మాలపల్లి కి పోయి పరువు తీస్తావవాళ్లు అంటరాని వాళ్ళని చెబుతాడు. అందుకు ప్రతిగా శంకరం మాల వాళ్ళు అంటరానివాళ్ళని ఏ శాస్త్రం లో ఉంది ఏ వేదాంతం లో ఉంది. అరుంధతి వాల్మీకులు హరిజనులు కాదా అని ప్రశ్నిస్తాడు. అంతే కాకుండా తన భార్యతో హరిజనపల్లెలో కాపురం పెడతాడు. హరిజనులకు వైద్యం చేస్తూ అక్కడే ఉంటాడు. శంకరం తండ్రి చనిపోయేముందు శంకరాన్ని పిలిచి నువ్వే గెలిచావు హరిజనులు అంటరాని వారు కాదు వారికి సేవ చేయమని చెప్పి ప్రాణాలు విడుస్తాడు. శంకరం దంపతులు హరిజనులకు సేవ చేస్తూ విద్యలు నేర్పుతూ వారితో మమేకమై జీవిస్తారు. ఈ విధంగా వారు ఆ గ్రామానికి ఆదర్శప్రాయంగా నిలుస్తారు. ఈ కథలో రచయిత హరిజనులు మానవులేనని శంకరన్ లాంటి వారు తెలుసుకొని వారిలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించారని అభ్యుదయ భావాలు కలిగిన దంపతులని రచయిత తెలియజేస్తారు. సమాజంలో కుల మత భేదాలు వదలి సంస్కరణ దృక్పథం గల వాళ్ల కొంత మంది ఉంటారని వారు అంకిత భావంతో సాంఘీక దురాచారాలను రూపుమాపటానికి పాటుపడతారని తెలియజేశారు.

అనిశెట్టి సుబ్బారావు రాసిన దళిత కథ పాకీది. ఇందులో నాగు కోటి అనే ఇద్దరు ఓకే తరగతి చదువు తుంటారు. నాగు తండ్రి భాస్కరరావు ధనవంతుడు. కోటి పాకీ పని చేసుకునే మంచి కొడుకు.కోటీ బుద్ధిమంతుడు చదువుపై ఆసక్తి ఉన్నవాడు. ఉన్నత చదువులు చదివి సమాజంలో గొప్ప వ్యక్తిగా రాణించాలని కలలుకన్నాడు. అందుకోసం బడికి వెళుతున్న బడికి వెళ్తానన్నాడు. భాస్కరరావు తన కొడుకైన కోటిని నాగుతో కలవకూడదని తీర్మానం చేశాడు. నాగు తో స్నేహం చేసావంటే కళ్ళు పీకించేస్తా అంటూ హెచ్చరించాడు. అప్పటి నుంచి నాగు కోటీ తో కలవడం మానివేసాడు.. మంచి తన కొడుకును

పాకీపనికి వెళ్లమని చెప్తుంది. తనకు ఇష్టమైన చదువుకు దూరం అయ్యి కోటీ చాలా బాధపడతాడు. బడిలో పంతుల్ని సైతం భాస్కర్ రావు భయపెట్టి కోటికి చదువు చెప్పొద్దని హెచ్చరిస్తాడు. ఈ విధంగా కోటి చదువు అర్ధాంతరంగా మధ్యలో అగిపోతుంది. ఈ కథలో రచయిత దళితుల జీవితాలలో వెలుగు రేఖలు లేకుండా చేసేటటువంటి భాస్కర్ రావు లాంటి వాళ్లు సమాజంలో లెక్కకు మిక్కిలి ఉంటారని ఈలాంటి వారివలనే దళితులు చదువుకు దూరం అయి పాకీ పనులు చేసుకోవల్సి వస్తుందని తెలియజేసారు అంతేకాకుండా దళితులకు చదువు అందని ద్రాక్ష పండు గా మారడానికి. కారణం కుళ్ళు కుతంత్రాలుగల వ్యక్తుల స్వార్థచింతన ఒకటైతే, విద్యార్థులకు చదువు చెప్పకుండా పెద్దలకు భయపడి ఉపాధ్యాయులు వ్యవహరించడం నీతి బాహ్యమైన చర్యఅని ఇటువంటి వ్యవస్థ మారవలసిన అవసరం ఉందని రచయిత తెలియజేశారు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మహాకవి జాషువా కవిత్వంలో విస్తరించిన 'ఆకాశంలో సగం'

- డా॥. కోయి కోటేశ్వరరావు

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజల నాలుకల మీద జీవిస్తున్న మహాకవి గుర్రం జాషువ. కులాధిపత్యం వల్ల కలిగే సామాజిక విధ్వాంసాన్ని, మతోన్మాదం రగిలించే కరుడుకట్టిన మూఢత్వాన్ని వేయిగోంతుకలతో ధిక్కరించి మరణంలేని మానవత్వానికి తన సాహిత్యంలో పట్టాభిషేకం చేసిన నవయుగ కవి చక్రవర్తి జాషువ. సూర్యగమనానికి అభిముఖంగా పొద్దుతిరుగుడు పువ్వు దృష్టి సారించినట్లుగా ప్రజా సమస్యల చిత్రణ దిశగా జాషువా తన సాహిత్య సృష్టిని సాగించాడు.

"మత కలహాగ్నిలో కరిగి మన్నయిపోయిన మానవ ప్రతతుల రక్తనిర్ఝరుల ప్రత్యణువున్ పరిషిక్తమైనదీక్షితి" అంటూ ఆరు దశాబ్దాల క్రితమే జాషువా వెలుబుచ్చిన ఆవేదన నేటికి తీరనేలేదు. 21వ శతాబ్దంలో కూడా ఆ "క్షితి"లో, ఆ స్థితిలోనే కొంత మంది ప్రజలు జీవిస్తున్నారు. ఆ వేదనా చితిలో అంటరాని జీవితాలు అవిశ్రాంతంగా దగ్ధమవుతున్నాయి. కావున ఇంకా జాషువ కవిత్వానికి ప్రాసంగికత ఉంది. జాషువా సాహిత్యంలో విస్తృతమైన వస్తు వైవిధ్యం కనిపిస్తుంది. సామాజిక ప్రగతికి విఘాతం కలిగించే ఎన్నో అంశాలను ఆయన తన కవిత్వంలో శక్తివంతంగా పొందుపరిచాడు. సంఘ సంస్కరణ ఉద్యమానికి పురిటి గదియైన రాజ్యమండ్రిలో ఆయన కొంతకాలం జీవించటం వల్ల, స్త్రీ జనాభ్యుదయానికి మార్గదర్శిగా నిలిచిన వీరేశలింగం సాహిత్యంతో పరిచయం కలగటం వలన, మహిళా చైతన్యం జాషువా కవిత్వం నిండా పరిమళిస్తుంది. పితృస్వామ్య వ్యవస్థ స్వరూప స్వభావాలను పురుషాధిపత్యం తీరుతెన్నులను జాషువా నేటి నెలత, వంచిత, కవితా ఖండికల్లో ఎంతో సముచితంగా ఆవిష్కరించాడు. బాల్యంలో, వివాహ వ్యవస్థలో, సంసార జీవితంలో పురుషాహంకారం ఏఏ రూపాల్లో బుసలుకొడుతుందో తన రచనల్లో ప్రగాఢంగా చిత్రించాడు. "పెండ్లి ఆడిన భార్యల పిప్పిజేసి / తరుముచున్నవి పురుష భూతములుకొన్ని స్త్రీ త్వమిడి అట్టి వానిని శిక్షించా"లని ఆయన ప్రబోధించాడు. "స్త్రీని వంట ఇంటి కొరముట్టుగా" "ఊడిగపు యంత్రంగా" ఉపయోగించుకుంటున్నారని జాషువ ఎంతో పరిశీలనాత్మకంగా వ్యాఖ్యానించాడు. "మదన జ్వరౌషధములుగా", "కొట్టుటకు తిట్టుటకు ఒకపట్ట జన్మించినట్లుగా మహిళలను అర్థం చేసుకుంటున్నారని సూక్ష్మంగా తెలియజేశాడు. "సాంఘీక మహాభూతంబు పెనుకోరల మధ్య, దుష్ట భర్తల కృపాహీన ప్రవృత్తులతో నలిగిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న స్త్రీలను ఎలా ఊరడిస్తారని అధినాయకుల గుండెలదిరేల జాషువ ప్రశ్నించాడు.

సంఘ సంస్కరణోద్యమ భావజాలాన్ని తన కవిత్వంలో విస్తృతంగా ప్రచారం చేసిన జాషువ ఆకాశంలో సగమైన స్త్రీ సర్వతోముఖాభివృద్ధిని వాంఛించటమే కాకుండా వారిపై పెరుగుతున్న అణిచివేత చర్యలను ఖండించి స్త్రీ చైతన్యాన్ని ప్రబోధించాడు. భావ, అభ్యుదయ, విప్లవ కవుల్లో కనిపించని మహిళాభ్యుదయ చింతన జాషువా కవిత్వంలో దర్శనమిస్తుందు. మహిళా వికాసంతోనే సామాజిక ప్రగతి సాధ్యమవుతుందని ఆయన బలంగా విశ్వసించాడు. స్త్రీలపై అణచివేత కొనసాగినంత కాలం "భారత స్వాతంత్ర రథము బెత్తెడు కూడా ముందుకు సాగద"ని జాషువ అనాడే చాటి చెప్పటం విశేషంగా భావించవచ్చు. "సతుల నైసర్గిక జ్ఞాన సస్యరమను చిత్రచిత్రముగా హత్య చేసినారు' అంటూ పరమ కిరాతకమైన మనుస్మృతిని, పితృస్వామ్య సమాజాన్ని తీవ్రంగా నిరసించాడు. "కన్నతల్లి" "మాతృప్రేమ"

ప్రబోధము లాంటి కవితా ఖండికల్లో మాతృత్వంలోని మాధుర్యాన్ని, త్యాగ నిరతిని అద్భుతంగా కవిత్వీకరించాడు. "నాదు కంటినీరు నాతల్లి దేహాన / నరనరాన దు:ఖనదులు చిమ్ము" అంటూ తల్లీ బిడ్డల అనుబంధాన్ని ఎంతో ఆర్ద్రంగా అభివ్యక్తం చేశాడు. తన భార్య మరియమ్మ మరణించినప్పుడు జాషువ రాసిన పద్యాలను పరిశీలిస్తే ఆయన స్త్రీకి ఎంతటి ఉదాత్తమైన స్థాన మిచ్చాడో అర్థమవుతుంది. 'నాతనుయష్టి ప్రత్యణువున్ గల పుష్టికి కారణంబు నీ / చేతి సుధాశనంబ కద ! చిక్కునె నా కనరాదుగాని నా / మాతకు మారుగా యనుగు మానిని రూపము దాల్చినట్టి నా / జాతక పుణ్యరేఖవో ప్రశస్త శుభైక వరప్రధాత్రివో" అంటూ భార్యను తల్లిగా అభివర్ణించడం జాషువా ఔన్నత్యానికి తిరుగులేని నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

'నిన్నాకాశము దాకగ పొగుడుచున్ నీ అంద చందాలతో / వన్నెల్ దీర్చి కవిత్వమల్లు కొనుచున్, పైపై పరామర్శలన్ / నిన్నున్, నీదు శరీరమున్, హృదయమున్ ఛేదించి వేధించియుం / తన్నంబున్ బడవేయు సంఘమును బిడ్డా యెట్లు హర్షింతువో'' అంటూ వాత్సల్యంతో స్త్రీని ప్రశ్నిస్తాడు జాషువ.

తెరచాటు నాటకంలో కన్యాశుల్క నాటక స్ఫూర్తి ప్రత్యక్షరంలో నవనవోన్మేషంగా దర్శన మిస్తుంది. 1935 సం॥ వెలువడిన ఈ నాటకంలో బాల వితంతువుల హృదయవేదన, దీనివల్ల కలిగే అనర్థాలు, సనాతనుల స్వార్థ పరత్వం, ముసలి భర్తలు, పడుచు భార్యలతో అనుభవించే కష్టనష్టాలను జాషువ అంగీకారయోగ్యంగా అక్షరబద్ధం చేశాడు. ''జిలుగు మంధాళి జలతారు చీరలోన / పొదివిసేవింపదగు మల్లెపూల గుత్తి పీనుగుల మీద కప్పు పాపిష్టి కులష వస్త్రపు ముసుగులో చుట్టి వయిచినారు'' అంటూ బాల వితంతువైన కళ్యాణి స్వరూపాన్ని శిల్పసుందరంగా, వర్ణించాడు. పట్టుచీర జిలుగులతో పరిమళించాల్సిన మల్లెపూల గుత్తిని పీనుగులమీద గప్పే

కలుష వస్త్రంలో చుట్టివేశారని చెప్పడం ద్వారా వితంతువు పూర్వోత్తర స్థితి గతులను కవి అద్భుతంగా కవిత్వీకరించాడు. కలుష వస్త్రంలోని మల్లెపూలగుత్తి పరిమళమంతా వ్యర్థమైపోయినట్లుగా వితంతువు సౌందర్యం కూడ నిరుపయెగమవుతుందని తేట తెల్లం జేశాడు కవి. "ఆ ప్రసన్నేక్షణముల శైత్యంబునందు / ఉబుకుచున్నవి వేడి పయోధరములు / ఆ వినూతన యౌవనోద్యాన సీమగ్రక్కుచున్నాడు సూర్యుడంగార వృష్టి" సర్వ సుఖాలకు దూరమైన వితంతువు యౌవ్వనోద్రాకాన్ని, సహజ సిద్ధమైన శారీరక ఆకాంక్షలను జాషువా అసామాన్య శిల్ప చాతుర్యంతో వర్ణించాడు. వితంతువు యవ్వన ఉద్యాన సీమలో సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నా డని సంభావించడంలో జాషువ కవితా శిల్పం పరాకాష్ఠకు చేరుకుంది. తెరచాటు నాటకంలో కళ్యాణి, ప్రమోద్ పాత్రల ద్వారా పలికించిన సంభాషణల్లో మత కర్కశత్వం కనబడుతుంది. "హిందూ సంఘమంటే మనుషులను ప్రాణాలతో పీక్కుతినే క్రూర పిశాచం కాదా? వెర్రిదాన? ఆడదై పుట్టడమే మహాపాపమనుకో" ; "ఆచారలన్ని ఆత్మనాశనాలకు, పరనాశనానికి కారణభూతాలు"; "ఈ సంఘ శక్తికి కన్నులున్నవి కాని కరుణ లేదు, హృదయం ఉన్నది కానీ వజ్రకల్పం" ; "దర్మదేవతకు నాలుగు కాళ్ళని శాస్త్రంలో రాశారే, ఆ పోలిక మహా కుదిరింది. పశు ధర్మం కనుక" ఇలాంటి సంభాషణల్లో పూర్వ, సమకాలీన కవులు విన్మరించిన చీకటి కోణాలను సాహసోపేతంగా దృశ్యమానం చేశాడు కవి. ఈ మాటలలోని భావతీవ్రత వితంతువుల వేదనలోనుంచి ఉబికి వచ్చిన ధర్మాగ్రహం మాత్రమే కాని కేవలం మతద్వేషం కాదు. నిజానికి జాషువ హిందూ మతంతో పాటు క్రైస్తవ, ముస్లిం మతాలలోని అతివాద, ప్రగతి విద్రోహ ధోరణులను కూడా విమర్శించిన విషయం ఇక్కడ గమనార్హం.

విద్య అంటే మూఢత్వం అనే పులికి పెట్టే ఇంపైన భోజనం కాదని మనుజత్వాన్ని పెంపొందింప జేయలేని చదువుల వల్ల ప్రయోజనం లేదని తన రచనల్లో

విశ్లేషించిన జాషువ మహిళా విద్యావశ్యకతను శాస్త్రీయంగా ప్రబోధించాడు. "అబల విద్యా పూర్ణయై తోకురాకున్నన్ దేశము నిద్ర మేలుకోనునే "(ప్రబోధం)", "స్త్రీల విజ్ఞానంబు చిదిమి బందీజేయు దేశాన సిరులు వర్ధిల్లగలవే" (బాపూజి) అంటూ ఒక సామాజిక శాస్త్రవేత్తల ప్రశ్నించాడు. మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కవిత్వంలో జాషువ నిర్ధారించాడు. స్వార్థాత్మకమైన సంఘం స్త్రీలకు విద్యా స్పర్శ లేకుండా "ఆ జన్మదుస్తర దాస్యంబున నెట్టి వైచినదని మనసులో భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించి, పురుష దురాగతాల నెదిరించలేని "చిలుకల చదువు" నేర్పించారని జాషువ దుయ్యబట్టాడు. గురజాడ సాహిత్యంతో పాటు, "చదువెరుగని స్త్రీలు తమ బిడ్డలకు శత్రువులు" అన్న కందుకూరి స్ఫూర్తి జాషువ కవిత్వంలో ప్రతిఫలిస్తుంది.

'కు మాతా న భవతి' అన్నమాట నిజమే కావచ్చు కాని ఎందెందు వెదకినా అందందు ప్రత్యక్షమయ్యే కులభూత ప్రభావానికి తల్లి కూడా మినహాయింపు కాదని 'మాత' అనే అరుదైన కవిత ద్వారా జాషువ తెలియజేశాడు. బాల్యం నుండే కులగోత్రాల... విద్వేషపున్ మొలకలు నాటి అహంకృతిని కలిపి తప్పుద్రోవ జూపించు మాతలు శాంత్యున్నతికిన్ విషక్రిముల"ని తీవ్రంగా ఆరోపించాడు. "ఈడు రాకముందు వేడుక కోసమర్థంబులేని పెండ్లి తంతు నెఱిపి / భావిజీవితములు పాడుసేయు మహిళ తల్లికాదని జంగుబిల్లి వంటిదని జాషువ ప్రకటించాడు. ఇట్టి "పైశాచిక వత్సలత్వములు జాతికి తీరని వజ్రఘాతముల్" అని జాషువ తీవ్రంగా హెచ్చరించాడు. బిడ్డల పెంపకంలో మహిళలు జాగ్రత్త వహించకపోతే జాతి నష్టపోతుందని హితవు చెప్పాడు.

"రామరాజ్యముల్ / వేయినముద్భవించినా", "పదివేల స్వరాజ్యములుప్పతిల్లినన్" స్త్రీలపట్ల జాలిజూపే మహనీయులు పుట్టరని" "స్త్రీ జగము దుఃఖము వాపెడి శాసనాలకున్ / నాయకులే విరోధులయినారని! (ఖండకావ్యం-5, 1953) అని జాషువా నాటి రాజకీయ నాయకుల సంకుచిత తత్వాన్ని జాషువ ఎంతో వ్యంగ భావస్ఫోరకంగా ఎత్తి చూపించాడు. "స్త్రీల సర్వతోముఖ పురోగమనాన్ని వాగ్దానం చేసే హిందుకోడ్ బిల్లును శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, వల్లభాయిపటేల్, డా॥ రాజేంద్రప్రసాద్, లాంటి ఘనత వహించిన నాయకులతో పాటు ప్రధానమంత్రి నెహ్రూ కూడా వ్యతిరేకించాడు. ఇందుకు నిరసనగా డా॥ బి.ఆర్ అంబేడ్కర్ రాజీనామా చేసి (1951 సెప్టెంబర్) పార్లమెంటు సాక్షిగా హిందూకోడ్ బిల్లు హత్యచేయబడిందని, దీనికోసం ఎవరూ రెండు కన్నీటి బోట్లు కూడా రాల్చడం లేదని వాపోయాడు. స్త్రీలకు జరిగిన ఈ చారిత్రాత్మక ద్రోహాన్ని జాషువ పై పద్యంలో సమర్థవంతంగా సమకాలీన రాజకీయ ఎరుకతో అక్షరబద్ధం చేశాడు.

'వలపుల రాణిగా', 'చిలక పలుకుల చక్కర పిండిబొమ్మ'గా పొగుడుతూనే, స్త్రీని 'తలవాకిలి దాటని పుట్టు ఖైదీగా మార్చిన ఘనమైన సంస్కృతిని నిరసించి స్త్రీ ఎదుర్కొంటున్న మానసిక, శారీరక హింసను జాషువ ఈ పద్యంలో స్ఫురింపజేశాడు. చలం ఆదర్శాలను కవిత్వంలో ఒలకబోసి నిజ జీవితంలో భార్యలను రాచిరంపాన పెట్టే కవుల కుహనా వ్యక్తిత్వాన్ని కూడా జాషువా వ్యతిరేకించాడు. "నెపోలియన్ తన సైనికులను పంపి భార్యలను కొట్టే భర్తలను పట్టి శిక్షింపజేసేవాడట. మన ప్రభుత్వం కూడా అలాంటి చట్టం ఏదయినా పెడితే బాగుండును (మా నాన్నగారు - హేమలతాలవణం) అన్న జాషువ మాటల్లో స్త్రీవట్ల ఆయనకున్న వైఖరి స్పష్టమవుతుంది. భావ స్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యాలను స్త్రీకి కల్పించాల్సిన అవసరం ఉందని పురుషులతో పాటు స్త్రీకి సమాన గౌరవ మర్యాదలు ఉండాలని 'కొత్త లోకం' కావ్యంలో జాషువ పదేపదే గుర్తు చేశాడు. 'ముంతాజ్‌మహల్' కావ్యంలో స్త్రీ ఔన్నత్యాన్ని అనాథలో దళిత స్త్రీ అనుభవించే దుర్భర దారిద్ర్యాన్ని, వాస్తవిక దృష్టితో చిత్రించిన జాషువా స్త్రీ స్వేచ్ఛ కోసం

పరితపించాడు. నోములు, వ్రతాలు, పూజలతో ప్రతినిత్యం ప్రదక్షిణలు చేస్తూ కుటుంబాన్ని మర్చిపోయే స్త్రీల మూఢత్వాన్ని కూడా ఆయన నిరసించాడు. మహిళల్లో పెరుగుతున్న అలంకార ప్రియత్వాన్ని సున్నితంగా తిరస్కరించాడు. 'భావదాసురాలు', 'వెర్రి బాగులమ్మ', 'పరమ మూఢ' మొదలగు పదబంధాల ద్వారా స్త్రీలలోని పోరాట లేమిని ఆయన ఎత్తిచూపాడు. అయితే "అబల, చపల హృదయ" లాంటి సంబోధనలు కవిగా ఆయనకున్న పరిమితులను తెలియజేస్తున్నాయి. పితృస్వామ్య సమాజ ఉక్కు పాదాల కింద దళితులతో పాటు స్త్రీలు కూడా నలిగిపోయారు. కాబట్టి స్త్రీల కష్టనష్టాలను జాషువ బాగా అర్థం చేసుకోగలిగాడు. వితంతువు, గబ్బిలం, స్మశానం, చీకటి ఇలాంటి సంఘ విముఖ అంశాలను తన కవితా చాతుర్యంతో వాటిని సౌందర్య శోభితం చేసి పాఠక లోకాన్ని ఈ కవి పరవసింప జేశాడు. వస్తువు అధమమైనా, ఉత్తమమైనా, వికృతమైనా, జుగుత్సాకరమైన జాషువ సృజన స్పర్శతో అది రసరమ్యమై అలరారుతుంది. వస్తుతత్వంతో మమేకమయ్యే శిల్పనైపుణ్యం కారణంగా జాషువా పద్య కవిత్వంలో Aestheic Imagination దర్శనమిస్తుంది.

"నీ మానసము దయారామాభివృద్ధికి అమృతంబు చిల్కు వర్షాగమంబు / నీ చరిత్రము గాఢనిద్రా దరిద్రాణ కుతల చక్రమునకు కోడికూత (ఖండకావ్యం.4)" అని కవి వ్యక్తిత్వ గరిమను కోనియాడిన జాషువా ఈ రకమైన కవన హృదయంతో, తెలుగు సాహిత్యంలో మేలుకోలుపుల గానం ఆలపించాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత ఆళ్వార్ – తిరుప్పాణాళ్వార్

– డా॥. యస్. దివిజాదేవి, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

జగన్నాటక సూత్రధారియైన భగవంతుని సృష్టిలో, దృష్టిలో మానవులందరూ సమానమే, విచక్షణతో కూడిన వర్ణ విభజన కేవలం వృత్తులకు సంబంధించినది మాత్రమే. కాల క్రమంలో అది బాధాకరమైన వివక్షకు గురై కొన్ని వర్గాలను అణచివేసిన దనుట చరిత్ర కాదనలేని సత్యం. ఎంతో వివక్షకు గురైనా తనదైన శైలిలో పడిలేచిన కెరటంలా ఆకాశమంత ఎత్తుకు ఎదిగి తమపై ఆగ్ర హించిన వారిని, బాధించినవారిని అనుగ్రహించే, ఆశీర్వదించే స్థాయికే ఎదిగిన వారు మన సమాజంలో కోకొల్లలు, ఆలాంటి మహానుబావులలో ఒకరు 'పాణన్' అనే పేరు గల తిరుప్పాణా ళ్వార్, వీరినే, శ్రీపాణయోగి అనీ, మునివాహనులు అనికూడా అంటారు. వీరు వైష్ణవ సంప్రదాయంలోని పనిద్దరాళ్వారులలో ఒకరు.

"వృశ్చింకే రోహిణి జాతం శ్రీపాణం నిచులాపురే
శ్రీవత్సాంకం గాయకేంద్రం మునివాహన మాశ్రయే"
(గురుపరంపర)

నేటి తమిళనాడు లోని శ్రీరంగ క్షేత్రానికి సమీపంలో ఉన్న 'నిచులావురం'అనే నామాంతరం ఉన్న ఉరయూరు అనే దివ్య క్షేత్రంలో కలియుగాది 341 వ సంవత్సరంలో శ్రీమహావిష్ణువు యొక్క 'శ్రీవత్సాంశమున', ఆయోనిజులుగా వరివెన్ను లో జన్మించారు. వరికోతలు కోస్తుండగా, వరిచేలో దొరికిన వీరిని భజనలు చేసే పంచముడైన 'మాతదాసుడు' దంపతులు భగవత్ప్ర సాధంగా భావించి 'పాణన్' అని నామకరణం చేసి పెంచుకున్నారు.

శ్రీరంగంలో కొలువున్న శ్రీరంగనాథుడు సన్నిధిలో వీణానాదంతో గొంతెత్తి పాడాలని 'ప్పాణన్' కోరిక. అంత్య కులజుడైన తాను ఆ భాగ్యానికి నోచుకోలేదు కాబట్టి, ఎంతో బాధ పడుతూ స్వామి సన్నిధికి ఎదురుగా 'కావేరి' నది దక్షిణ తీరములో నిలిచి స్వామి నుద్దేశించి పాడుతుండేవారు.

ఉభయ కావేరి నదుల మధ్య భాగమైన శ్రీరంగ క్షేత్రం సప్త ప్రాకారాలతో కూడి ఉంటుంది. శేషతల్పం పై కొలువై ఉన్న ఆ స్వామిని తన జ్ఞాన దృష్టితో వీక్షించి కీర్తించే వారాయన, ఆహార పానీయాలను విసర్జించి, తన్మయ చిత్తంతో ధ్యానించి ఆనందించేవాడు.

అతడు నారదుని వలె సుస్వరంతో, తాళ బద్ధంగా, లయ శుద్ధంగా అనేక రాగములతో, శ్రీరంగనాథుని నామ గానాన్నే, అమృతంగా స్వీకరిస్తూ తన్మయత్వంతో పాటలు పాడుచుండగా శ్రీరంగనాథుడు పరవశించి శ్రీరంగ నాయకితో కలిసి వినుచుండేవాడు.

ఓ రోజు, స్వామివారికి నిత్య కైంకర్య సేవలు చేసే అర్చకులు 'లోకసారంగముని' స్వామివారికి అభిషేకం చేయడానికి నీళ్ళు కోసం వచ్చి, మైమరచి స్వామివారి ధ్యానంలో ఉన్న 'పాణన్' ని చూసి, అంత్యాజాదూరమున పొమ్ము, నీ కిచ్చట యేమిపని అంటారు. (పేజీ - 71, ఆళ్వారాచార్యుల చరితము - శ్రీ మధుభయ వేదాంతా చార్య పీఠం ట్రస్టు).

కానీ 'పాణన్' కళ్ళు మూసుకొని స్వామి సేవ యందు మనసు లగ్నం చేసి ఆనంద పారవశ్యంతో ఉండుట చేత ఆ మాటలు అతనికి వినిపించలేదు. కాబట్టి, పక్కకు వెళ్ళలేదు. లోకసారంగముని 'పాణన్' కదలక పోవుటచే కోపించి రాయి విసిరారు. అతడు స్పందించక పోవుటచే లోకసారంగముని అనుచరులు రాళ్లు రువ్వారు. అవి తగిలి 'పాణన్' కు రక్తము వచ్చింది. అయినా అతడు ఇహలోకంలోకి రాలేదు. ఇక చేసేదేమి లేక వారే మరో పక్కకు నీళ్ళకోసం వెళ్ళారు.

'పాణన్' ధ్యానం ముగియగానే కండ్లు తెరచి రక్తమును

చూచి కోపించక, విషయం చుట్టూ ఉన్న వారిచే తెలుసుకొని, నేను అపరాధం చేసినందునే రాయి విసిరారు అనుకొని రెండు పర్లాంగుల వెనక్కి వెళ్ళి తిరిగి పాడటం ప్రారంభిస్తారు. వారి భక్తికి మెచ్చి, వారి దేహ బాధను శ్రీరంగనాథుడే స్వీకరిస్తాడు.

లోకసారంగముని స్వామివారి గర్భాలయ తలుపులు తీయగా, శ్రీరంగనాథుని శిరము నందు ముఖము నందు రక్తము కారుతూ కనిపించింది. వెంటనే అతడు అధికారులకు సమాచారం అందించారు. వారు లోపలికి వెళ్ళే ధైర్యం చేయక రాజుగారికి విషయం విన్నవిస్తారు.

తానేదో అపకారం చేసినందునే ఇలా జరుగుతుందని రాజు భావించి విచారణకు ఆదేశిస్తారు. లోకసారంగ మునికి శ్రీరంగనాథుడు కలలో కనిపించి " కావేరీ తీరమున పాడుచుండినవాడు 'పాణిన్' కాదు, నాకు ప్రాణన్. అతడు తమకు దూరముగా పోలేదని యెంచి రాతితో గొట్టితిరి కదా? మీరు అభిషేకము చేయునట్టి యీ చోట అతడు పాడవలయును''.అని లోక సారంగమునిని ఆజ్ఞాపిస్తారు. (పేజి - 72, ఆళ్వారా చార్యులు చరితము - శ్రీ మధుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు).

అతడు రాకున్న ఏమి చేయాలని లోకసారంగుడు అడగగా, నీ భుజములపైకి ఎక్కించుకొని అతనిని గౌరవంగా తీసుకురావాలని స్వామి ఆదేశిస్తారు. వెంటనే లోక సారంగముని నిద్రలేచి, శుచిగా తయారై,రాజుకు విషయాన్ని వివరించి బ్రాహ్మణులతో కలిసి అతన్ని ఆలయం లోకి తీసుకురావడానికి కావేరీ తీరానికి వెళతారు. అతడు వారిని చూచి పక్కకు తొలుగుతారు. వారు అతనిని సమీపించి సాష్టాంగ దండ ప్రణామం ఆచరించి, క్షమించమని అడుగుతారు. ఆలయంలోకి రమ్మని వేడుకుంటారు.

అతడు "అయ్యా! నేను రావచ్చునా నిన్న ఇక్కడ ఉండటమే తప్పు ఇక నుండి దూరంగా ఉంటాను. సాక్షాత్ వైకుంఠమైన ఈ ప్రదేశంలో పంచములు పాదముంచడం తగదు కాబట్టి నేను రాను" అంటారు.

బ్రాహ్మణులు వెళ్ళి అతన్ని గట్టిగా పట్టుకోగా, లోకసారంగముని 'ప్రాణన్'ను భుజములపై కూర్చో పెట్టుకుంటారు. ప్రాణన్ అపచారం అపచారం" అనగా, ఇది స్వామివారి ఆజ్ఞ అని అతన్ని తీసుకెళ్ళి శ్రీ రంగ నాథుని ముందు నిలబెట్టారు.

దరిద్రుడు మహానిధిని చూసి ఆనందపరవశుడైనట్లు శ్రీ రంగనాథుని సేవించి తిరుప్పాణాళ్వారు " ఆహా! నేటికి గదా నా జన్మము తరించినది " అని ఆనందించాడు. ఇచట తిరుప్పాణాళ్వారు ఎన్నో తరాలుగా దేవుని సందర్శింపలేని జాత్యావేదనకు ఏకీకృత రూపంలో, వ్యక్తిలా కాక వ్యవస్థలా మనకు దర్శనమిస్తాడు. పాదాది కేశ పర్యంతము ఆస్వామి రూపసౌందర్యమును అమృతంవలె ఆస్వాదిస్తూ ఆ యోగి వరుడు పది పాశు రములతో స్వామిని అవిచ్ఛిన్నమగు భక్తితో ప్రస్తుతించెను. ఆదియే ద్రావిడమున ''అమలనాది పిరాన్'' అను ఉత్తమ దివ్య ప్రబంధమయింది.

"అలమామవర్తినిలై మెలొరు పాలకనాయ్
జులమేళు డాస్ అరంగత్తరవి నణైయాన్
కోలమామణియారము ముత్తత్తామముండి విల్లె
దో రెళిల్
నీలమేము యైయో నిరైకొండ దెన్నెంజమే "

అనగా " ఒక చిన్న మట్టి ఆకుపై పసిబిడ్డలా పరుండి, ప్రళయకాలమందు జగత్తును అంతటినీ తన ఉదర మందు ఉంచుకొన్న శ్రీ మహావిష్ణువే శ్రీ రంగ మందు అనంతుని మీద శయనించియున్నాడు. ఆ స్వామి యొక్క రమ్మమైన రత్న ఖచిత హారమును, మత్తాదామమును, అంతమును సామ్యమును లేని సౌందర్యము గల నీలు వర్ణమగు దేహమును నా హృదయ గాంభీర్యమును నశింపజేసినవి" అని అర్థం.

శిశువు దృష్టి స్తన్యపానమునకై అమ్మ రొమ్ము పైకి ప్రసరించినట్లే ఆ భక్తవరుని చిత్తము కూడా స్వామి

యితరవయవ సౌందర్య దర్శనము చేసి, జగత్పాలన దక్షమగు శ్రియ:పతి పాదార కుందముల యందె నంలగ్నమాయెను. తరువాత క్రమముగా ఇతరా వయవముల మీద ఊర్ధ్వ ముఖముగ వారి దృష్టి ప్రసరిం చెను. భగవదను భావ సంజాతమగు ప్రేమ అతిశయిం పగా ఆ యోగి - మూర్ధాన్యుడు పాదాది కేశ పర్యంతము మృదు మధుర సుందరముగ నవరసభరితముగ ఆ శ్రీరంగేశుని వర్ణించెను. వారి కావ్యమున రంగనాథుడు, వేంకటేశ్వరుడు ఎక్కువగా స్తుతింపబడ్డారు.

స్వామి ఆళ్వారుకు నిజరూప దర్శనం ఈయగా, పరవశించిన వీరు 'పదివేల పాశురములతో " సమానమైన "అమలనాద పిరాన్" అనే పది పాశురములు గల ప్రబంధాన్ని ఆశువుగా చెబుతారు. దానికి 'వేదంతదేశికులు ' వ్యాఖ్యానం రాసారు. ఆ వ్యాఖ్యానానికి 'మునివాహన భోగ 'మని పేరు. ఇది సకల వేదాంతసారము. ఈ ప్రబంధానికే ముద్వాయిర 'ఆరప్పాడి' అనే వ్యాఖ్యానాలు కూడా కలవు.

లోక సారంగమని భుజముల మీద మోసుకొని పోయినందున ఆ ఆళ్వారుకు 'మునివాహనుడు" అని పేరు కలిగెను, పాణన్ పేరు 'తిరుపాణన్' గా మారింది. 'తిరు' అంటే 'శ్రీ' (గౌరవ వాచకం). భగవత్ భగవత్ సేవకుడైన అతడు 'ఆళ్వార్'గా గుర్తింపు పొందినందున, అతడు 'తిరుప్పాణాళ్వార్' గా భక్తులచే సేవించ బడు తున్నాడు. మునివాహనుడు స్వామివారిని పాదాదిగా వర్ణిస్తారు.

ఆళ్వారుల వివరాలు :

"భూతం సరశ్చమహదాహ్వయ భట్టనాథ
శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్
భక్తాంఘ్రి రేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోస్మి నిత్యమ్"

ఆళ్వారుల కాలం గురించి నిర్ధిష్టమైన ఆధారాలు లేవు. వీరు ద్వాపరయుగాంతం నుండి కలియుగారంభం మధ్య ఉద్భవించారని "గురుపరంపర" చెబుతుంది. శాస్త్రీయ పరిశోధకులు వీరిది క్రీ.శ. 7-9 శతాబ్దాల మధ్యకాలమని అభిప్రాయపడుతున్నారు.

భగవద్భక్తి సాగరంలో మునకలు వేస్తూ, లోతులు చూసిన శ్రీ వైష్ణవ భక్త శిఖామణులు ఆళ్వారులు. వీరు శ్రీవైష్ణవ సంప్రదాయానికి మూలపురుషులు.

వీరు పన్నెండు మంది (పన్నిద్దరాళ్వారులు) వీరిలో ఒకరే మునివాహనులుగా సుప్రసిద్ధులయిన తిరుప్పాణా ళ్వార్, ఈ మహాత్ములు ద్రావిడ దేశంలో అవతరించి ద్రవిడ భాషలో శ్రీమన్నారాయణుడి అనంత కల్యాణ గుణచేష్టితాలను అనన్య భక్తితో నాలుగువేల పాశురాలతో (పాశురం అంటే పద్యం) కీర్తించారు. దానినే " నాలాయిర దివ్య ప్రబంధం" అంటారు.

వీరు తమ పాశురాలలో తిరుమల,శ్రీరంగం, కంచి మొదలయిన శ్రీ వైష్ణవ దివ్య దేశాలలో వెలసిన భగ వదర్చామూర్తులను పలువిధాల ప్రస్తుతించారు. తమిళ సాహిత్యంలో విశిష్టమైన స్థానం ఉంది ఆ పరమ భక్తులకు, మహాభక్తులు, కవిశిరోమణులైన ఆ ఆళ్వారులు చెప్పిన పాశురాలు విష్ణు దేవాలయాలలో నిత్య పఠనీయాలు, ఆళ్వారు అనగా కాపాడువారు అని వ్యుత్పత్తి. తమ పాశురములతో మనల్ని కాపాడుటకు అవతరించారు వీరు.

ప్రతీ వైష్ణవాలయం లోనూ భగవదనుగ్రహం పొందిన వీరి విగ్రహాలు ఉంటాయి.నిత్య పూజాలు అందు కుంటారు. ఆలయాలను దర్శించిన ప్రతీవారికి, ఓ సందేశాన్ని అందిస్తూనే ఉంటారు. కానీ దాన్ని స్వీకరించే బుద్ధి కుశలత మనలో ఉండాలి. లేకపోతే వివక్ష కొనసాగుతూనే ఉంటుంది.

'మలిన మనస్కుల భావనయే మలిన దేహము" అంటారు మునివాహనుడు నాటకంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు. దళితుడికి ఆలయ ప్రవేశం లేదన్న సమాజం మనదే, దళితుడి విగ్రహాన్ని ఆలయంలో పెట్టి పూజించే సంస్కృతీ మనదే. ఆ అంతరం అంతరిం చిన నాడు సమసమాజం సాధ్యమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. ఆళ్వారాచార్యుల చరితము - శ్రీమధుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు (నడిగడ్డపాలెం)
2. ద్వాదశ సూరి చరిత్ర - శ్రీ కె.టి.యల్. నరసింహాచార్యులు (టి.టి.డి. ప్రచురణ)
3. మునివాహనుడు (నాటకం) - ఆచార్య కొలకలూరి ఇనాక్
4. గురుపరంపర.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సూరజ్ పాల్ చౌహాన్ – సమకాలీన దళిత రచయిత

– డా॥. ఐ. గీతా దేవి, హిందీ అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (ఆ), రాజమండ్రి.

హిందీలో అనేక మంది సాహిత్యకారులు తమ రచనలలో దళితుల పట్ల సానుభూతిని వ్యక్తపరుస్తూ వారు అనుభవిస్తున్న చిత్రహింసలను దుస్థితిని చిత్రీకరించారు కాని వారి సంఘర్షణ, స్పృహ, చైతన్య స్వరం వినపడలేదు. హిందీ దళితేతర రచయితలు తమ రచనలలో కులవ్యవస్థ పై వేలు ఎత్తే సాహసం చేయలేదు, దీనికి విరుద్ధంగా వ్రాసి వర్ణవ్యవస్థను బలోపేతం చేశారు. కొన్ని మినహాయింపులను మినహాయిస్తే, హిందీకి చెందిన దళితేతర రచయితలు తమ రచనలను దళిత సమాజం మరియు దళిత పాత్రల స్వభావాన్ని చెడగొట్టడానికి ఎల్లప్పుడూ ఉపయోగించారు. ఇరవయ్యో శతాబ్దంలో దళితుల అభ్యుదయానికి బలైన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహోన్నత మానవుడు గౌతమబుద్ధుని సిద్ధాంతాలను ప్రాతిపదికగా తీసుకుని దళితుల బాధలకు గల కారణాలను తీవ్రంగా అన్వేషించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బయటపెట్టారు. వారి అభిప్రాయం ఏమంటె

'హిందూ మతము మరియు న్యాయము దళితుల దుస్థితికి కారణమని, దళితులకు వాటిపై విశ్వాసం ఉన్నంత వరకు బతికుండగా మోక్షం ఉండదు.''

హిందీ దళితేతర సాహిత్యంలో దళితుల అవమానం, న్యూనతాభావాలు తప్ప మరేమీలేదు. దళిత సాహిత్యంలో దళిత చైతన్యానికి అర్థవంతమైన వ్యక్తీకరణ కనిపిస్తుంది. వేల సంవత్సరాల తరువాత ఇప్పుడు దళిత సాహిత్యం ద్వారా మౌన రోదన వినిపిస్తుంది. హిందీ దళిత సాహిత్యం మండే దీపం లాంటిది. దీని వెలుగులో దారి తప్పిన పాఠకుడు ఆలోచనాత్మకంగా లక్ష్యం వైపు పయనిస్తాడు. హిందీ రంగంలో దళితుల రచన చాలా కాలం క్రితమే ప్రారంభమైంది. అయితే అది గుర్తింపుగా మారడానికి చాలా సమయం పట్టింది. మొదటిగా హిందీలో దళిత రచయితలు మరియు విమర్శకులచే దళిత స్పృహ మరియు పోరాటం గురించి సైద్ధాంతిక, చారిత్రిక సామాజిక రచనలు జరిగాయి. ఇది హిందీలో దళిత రచన యొక్క ముఖ్యమైన కాలంగా పరిగణించబడుతుంది. దీని తరువాత సృజనాత్మక రచనల యుగం ప్రారంభమైంది.

ఇప్పుడు తొలితరం సాహిత్యాన్ని పక్కన పెడితే, అణగారిన వర్గాల రచయితలు కలం పట్టుకుని, తమ వర్గానికి చెందిన వారి బాధలు, సానుభూతి గురించి వ్రాయడం మొదలు పెట్టారు. దళితేతర సాహితీవేత్తలు దళితుల పై కొన్ని కథలు వ్రాసినప్పుడు, బహుశ దళిత సాహిత్యం అనే సాహిత్యం కుడా వెలువడుతుందని వారి దృష్టికి వచ్చి ఉండకపోవచ్చు. ప్రేమచంద్ తన కథలు, నవలలలో దళిత పాత్రలను చేర్చారు, కాని గౌరవం, స్వావలంబన మరియు ఆత్మగౌరవంతో జీవించాలనే చర్చ అతని రచనలలో కనిపించదు. ఎందుకంటే ప్రేమచంద్ గాంధీ భావజాలంతో ప్రేరణ పొందారు. అయితే దళితుల రచనలు బాబాసాహెబ్ అంబేద్కర్ భావజాలంతో ప్రభావితమయ్యాయి. దళిత సాహిత్యంలోని పాత్రలు మితిమీరిన వాటిని భరించడానికి సిద్ధంగా లేవు. దళిత సమాజంపై జరుగుతున్న దౌర్జన్యాలు, వారిపై పక్క ప్రణాళికతో జరిగిన కుట్ర, వీటన్నిటిని పట్టుదలతో ఎదుర్కొని న్యూనతా మనస్తత్వం తొలగించడం, వ్యవస్థ మార్పుకోసం పోరాటం చేయడం, తమ ఉనికిని కాపాడుకోవడం, చావడం-చంపడం లాంటి మండుతున్న సమకాలీన అంశాలను వ్యక్తీకరించడంలో దళిత సాహితీవేత్తల సాహిత్యం విజయం సాధించింది. నేడు దళిత సాహితీవేత్తలు దళిత సాహిత్యాన్ని ముందుకు తీసుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు, వారిలో సూరజ్

పాల్ చౌహాన్, జయప్రకాష్ కర్దామ్, విపిన్ బిహారీ, ఓం ప్రకాష్ వాల్మీకి, మోహన్ దాస్ నైమిష్ రాయ్, డా. శోయరాజ్ సింహ బెచైన్, సుశీల టాక్ భోలే, డా. కుసుమ్ మేఘవాల్, రత్నకుమార్ సాంబారియా పేర్లు చెప్పుకో తగినవి.

సూరజ్ పాల్ చౌహన్ సాహిత్యం :

బహుముఖ ప్రజ్ఞాశాలి సూరజ్ పాల్ చౌహాన్ ఆత్మకథ మాత్రమే కాకుండా కథ, జీవిత చరిత్ర మరియు బాల సాహిత్యం పై కూడా వ్రాశారు. సాహితీలోకంలో 'తిరస్కృత్' (తృణీకరించబడిన) ఆత్మకథ గురించి ప్రత్యేక చర్చ జరిగింది. ఆత్మకథ అతని పరిచయాన్ని దళితునిగా మాత్రమే పరిచయం చేయలేదు, దళితుడు అయినప్పటికీ ఆటను భంగీ, పేదవాడు, సాహితీవేత్త మరియు అణచివేత వ్యవస్థను ప్రతిఘటించేవానిగా కూడా స్పష్టం చేస్తుంది.

సూరజ్ పాల్ చౌహన్ వాల్మీకి వర్గానికి చెందిన వారు. వాల్మీకి వర్గం గురించి మరియు తృణీకరించబడిన సమాజం గురించి సజీవంగా మరియు ఆత్మీయంగా వివరించడం చాలా అరుదు. ఒక వైపు ఆ మురికిని, ఆ జీవితంలోని వ్యంగాన్ని వర్ణిస్తూనే, అందులో గడిపిన బాల్యాన్ని కూడా ఎంతో ఆప్యాయంగా అనురాగంతో వ్యక్తపరుస్తారు.

తిరస్కృత్ (తృణీకరించబడిన) ఆత్మకథలో వాస్తవికత ఉంది, ఊహ కాదు. ఒక రకమైన వాక్చాతుర్యము వుండడం వలన ఈ రచనకు ప్రాధాన్యత పెరిగింది. ఒక నిర్దిష్టమైన అణగారిన వర్గాలకు చెందిన సాహిత్యం కావడం వలన సంపూర్ణ దళిత సాహిత్యంలో ఒక రకమైన సైద్ధాంతిక నిబద్ధత కనిపిస్తుంది. ఒక రకమైన ద్వంద్వ పోరాటం ఈ ఆత్మకథలో కనిపిస్తుంది. దీనిపై విమర్శలు కూడా వచ్చాయి.

కులతత్వంతో పోరాడాలంటే దళితుల మధ్య ఐక్యత అవసరం అయితే ప్రస్తుతం ఆ ఐక్యత లేక పోవడానికి గల కారణాలను దాచిపెట్టి, బయట నుండి విధించిన ఐక్యతను ప్రదర్శించవచ్చు, కానీ సమస్యలకు పరిష్కారం లభించదు. ఏ సమస్యలపై ఐక్యత లేదు, ఎందుకు ఐక్యత లేదు ఈ ప్రశ్నలను లేవనెత్తడం మరియు ఎదుర్కోవడం అనేది ఐక్యతా నిర్మాణంలో ముఖ్యమైన ప్రయత్నం.

ఆర్థిక మరియు విద్యాభివృద్ధి ఎంత తక్కువ స్థాయిలో ఉంటే అంత ఆలస్యంగా బానిసత్వం నుండి విముక్తి పొందాలనే స్పృహ వస్తుంది. ఈ బానిసత్వానికి సామాజిక, ఆర్థిక అసమానత్వమే కారణం. దళిత సాహిత్యకారులు కుడా ఈ ఆర్థిక అంశాలను గురించి చర్చించడానికి సంశయించారు. ఈ అంశం గురించి తిరస్కృత్ ఆత్మకథలో 'మానవ శ్రమలోని కొన్ని పక్షాలు అసభ్యకరమైనవిగా పరిగణించబడుతున్నాయని మరియు ఆ శ్రమ ఆర్థికంగా విలువ తగ్గించబడి నందున అస్పృశ్యుల కోసం ప్రత్యేకించబడిందని రచయిత సరిగ్గా అర్థం చేసుకున్నారు.

ముగింపు :

సమకాలీన సాహిత్యంలో దళిత సాహిత్యం దానిపై సైద్ధాంతిక నిబద్ధత మరియు తిరుగుబాటు స్వభావం వలన వివాదాస్పదంగా ఉండవచ్చు కాని అది ఒక ప్రసిద్ధ సాహిత్యశైలిగా ఉద్భవించింది. ఇది విశ్వవ్యాప్త సత్యం, ఏ సంఘం మరియు సమాజానికి తనదైన సాహిత్యం ఉంటుందో ఆ సంఘం మరియు సమాజానికి గౌరవ స్థానం మరియు తనదైన గుర్తింపు లభిస్తుంది.

సందర్భ గ్రంథాలు :

1. హిందీ భాషా మరియు సాహిత్యం - కిరణ్ బాల, బి.కె. పబ్లిషింగ్ హౌస్, బరేలి , 1994.
2. భారతీయ సమాజ్ మే అంధవిశ్వాస్ - డా. కిషోర్ ఆర్ పవార్, చింతన్ ప్రకాషన్, కాన్పూర్, 1998
3. సూరజ్ పాల్ చౌహాన్ యొక్క సాహిత్యంలో దళిత విమర్శ - డీ .ఎం. వణకర్. పరిశోధన గ్రంధం

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నాగప్ప గారి సుందర్రాజు – "నడిమింటి బోడెక్కబసివిరాలయ్యేద" కథ విశ్లేషణ

– డా॥. కట్టెపోగు సురేష్ కుమార్, తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ), గుంటూరు.

ప్రపంచంలోని ప్రాచీన ఆచారాల్లో దేవదాసీ ఆచారం ఒకటి. మతం, దేవాలయాలతో ముడిపడిన ఆచారం ఇది. ప్రాచీన ప్రపంచ నాగరికతలన్నిటా ఈ ఆచారం పలుపేర్లతో కనిపిస్తుంది. ఈజిప్ట్, అస్సీరియా, సుమేరియా, అక్కడ్ బాబిలోనియా, న్యూగినియా.. సింధూ నాగరికత ఇలా ప్రతిచోట ఇది కనిపిస్తుంది.

దేవుడు / దేవతలకి సేవ చేయడానికి పెళ్ళికాని బాలికలని, యువతులని అర్పించడం దేవదాసి ఆచారంలో కనిపించే ముఖ్య అంశం. ఇది ఒక పవిత్ర కార్యంగా అనాటి వారంతా భావించారు. ఇలాదైవ సేవకోసం నియమించబడిన వారు, దేవుడు / దేవతలకి భార్యలుగా ఉంటారు. ఈ దేవాలయాల్లో పలు పనులు చేస్తూ అక్కడే వారి జీవితాన్ని వెళ్ళబుచ్చేవారు. ఇలాంటి పవిత్ర ఉద్దేశంతో మొదలైన ఈ ఆచారంలో మొదట రాజులు, మంత్రులు, అధికారులు, ఉన్నత వంశాల వారు తమ ఆడపిల్లలను దేవునికి అర్పించేవారు. కాలక్రమంలో ఈ ఆచారం మరింత విస్తృతమైంది. ఈ క్రమంలోనే ఈ ఆచారం మెల్లిగా తన పవిత్రతను పోగొట్టు కుంటూ వచ్చింది. దీనికి ప్రధాన కారణం ఆశయాలు సన్నగిల్లి ఆకర్షణ, శారీరక ఆకర్షణ పెరగడం. రాజులు, మంత్రులు, పూజారులు, అధికారగణం, శారీరక వాంఛలకి లొంగిపోవడం వలన దేవదాసీ ఆచారంలోకి వ్యభిచారం చేరింది. వ్యభిచారం చేరిన తర్వాత ఉన్నత వంశస్థులు మెల్లిగా ఈ ఆచారంలోకి తమ పిల్లలను పంపటం మాని వేశారు. అయినా ఆచారం కొనసాగాలి కనుక వేరే వాళ్ళ పిల్లలని దత్తత తీసుకునో, కొనుక్కునో వారిని దేవదాసీలుగా వదులుతున్నారు.

ఇటువంటి ఆచారం, పద్ధతులు, సింధూ నాగరికతా కాలం నుంచి నేటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. చరిత్రలో ఎన్నో ఆధారాలు పుస్తక రూపంలో, శాసన రూపంలో కనిపిస్తాయి. శిల్పకళా రూపంలో కనిపిస్తాయి.

భారతదేశంలో సింధూ నాగరికతా కాలం తర్వాత క్రీ॥శ. 5,6 శతాబ్దాల నుంచి దేవాలయం సమాజానికి కీలక మైనదిగా మారింది. ఈ క్రమంలోనే దేవుడికి అంగ భోగాలు, రంగ భోగాలు ఏర్పాటు చేయడం సంగీత, సాహిత్య, నృత్య గాన వినోదాల కోసం స్త్రీ పురుషులని నియమించడం జరిగింది. ఇందులో భాగంగానే దేవదాసీలు వచ్చారు.

దేశంలోని పలు ప్రాంతాల్లో దేవదాసీ ఆచారం కనిపిస్తుంది. గణిక, రుద్రగణిక, పార్వతి, మురళి, దేవరదియార్, నాతి, సాని, బసివి, జోగిని, మాతంగి... ఇలా పలుపేర్లతో ఈ ఆచారం కొనసాగుతూ వచ్చింది.

ఎవరి మతాన్ని వారు ప్రచారం చేసుకునే క్రమంలో మత బోధకులు / ప్రచారకులు, పూజారుల లైంగిక అవసరాలు తీర్చటం కోసం కూడా ఈ ఆచారాన్ని ప్రోత్స హించారు.

ఆంధ్రప్రదేశ్‌లో శైవ, వైష్ణవ మత ప్రచారాల్లో భాగంగా విష్ణుదాసీలు, దేవదాసీలను వైష్ణవులు సృష్టించి ప్రోత్సహిస్తే వీరశైవుల కాలంలో బసివినులు, జోగినులు, మాతంగి లను వీరు ప్రోత్సహించారు.

మూఢ నమ్మకాలతో, ఆచారం పేరుతో, భక్తితో, మోక్షం పేరుతో ఇలా పలుకారణాల వలన దేవుడు / దేవతలకి పెళ్ళికాని ఆడ పిల్లను అర్పించే ఆచారం మొత్తం మీద దేవదాసీ ఆచారంగా ప్రసిద్ధమై నిలిచింది. క్రమంగా సమాజంలో ఉన్నత వర్గాల నుంచి కింది తరగతుల ప్రజలకు ఈ పద్ధతులు చేరాయి వారి వారి

కులాల్లో ఈ దేవదాసి ఆచారం పాటిస్తూ వస్తున్నారు. సంస్కృత సంప్రదాయాలు ఉన్నత వర్గాల నుంచి మెల్లగా కింది వర్గాలకి చేరటం సహజంగా జరిగే పరిణామం.

క్రమంగా ఈ ఆచారాలు పై వర్గాల వారు మానుకుంటూ వస్తుంటే, కింది వర్గాల వారు పాటిస్తూ వస్తున్నారు. పైగా పై వర్గాలవారు క్రింది వర్గాల వారిని ప్రోత్సహించటం, వారిని వారి లైంగిక అవసరాలకు వాడుకోవడం ఎక్కువ అవటం మొదలైంది.

దేవదాసీ వ్యవస్థ ఆచారాలు పూర్వం నుంచీ ఉన్నా బసివి ఆచారం వీరశైవ మత ప్రచారం, వ్యాప్తితో భాగంగా వచ్చింది. వీరశైవం మొదట లింగధారణ చేసిన వారంతా సమానమే అని చెప్పింది. కాలక్రమంలో కులాల జోలికి పోలేదు. పైగా ఏ కులానికి ఆ కులంలో పూజారులు, బసివినులు మొ। ప్రోత్సహించింది. దాని ఫలితమే కింది కులాల్లో బసివినులు, జోగినులు, మాతంగి వ్యవస్థ బలపడటానికి కారణమైంది. దీనికి తోడు పై కులాలు కింది కులాల ఆడపిల్లలని లైంగికావసరాలకి వాడుకోవచ్చు అని దానినొక క్రమబద్ధమైన ఆచారంగా చేశారు. పైన చెప్పినట్లు నమ్మకాలు, మొక్కులు, ఆచారాన్ని పాటించాలనే కట్టుబాట్లు, భక్తి, వీటితోపాటు ఒక్కతే కుమార్తె ఉన్నప్పుడు దేవునికి / దేవరకి అర్పిస్తే తమ దగ్గరే ఉంటుందనే ఆశ, బతుకు తెరువు గడిచిపోతుందనే పేదరికం కింది కులాలలో ఈ బసివి ఆచారం పెరగటానికి కారణం. అలాగే ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు పొందటం కోసం కూడా తమ పిల్లలని ఈ ఆచారంలోకి నెట్టే పేద తల్లిదండ్రుల చేతకానితనం నేటికీ ఈ ఆచారం నిలిచి ఉండటానికి కారణాలుగా చెప్పొచ్చు.

ఈ ఆచారం రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లో ఎక్కువగా కోస్తాంధ్ర ప్రాంతంలో నామమాత్రంగా కనిపిస్తుంది. అనేక కోణాలు, ఉన్న ఈ వ్యవస్థ గురించి స్థూలంగా మాత్రమే ఇక్కడ పరిచయం చేశాను. ఇటువంటి ప్రాచీన ఆచారాన్ని గురించి, వారి దుస్థితి గురించి చాలా తక్కువ కథానికలు వచ్చాయి. అసలు దళితుల ప్రస్తావనలే అరకొరగా ఉన్నాయి. ఈ ఆచారం మీద వేళ్ళమీద లెక్కపెట్టదగిన కథలే ఉన్నాయి. వాటిలో గొప్ప కథగా నాగప్ప గారి సుందర్రాజు వ్రాసిన కథ. 'నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద' సుందర్రాజు కవి, విమర్శకుడు, వ్యాసకర్త, కథకుడు, నవలారచయిత, పరిశోధకుడు, నికార్సయిన అంబేద్కరిస్టు.

రాయలసీమలోని కర్నూలు జిల్లా, ఆలూరు ప్రాంతంలోని 'మొలగవల్లి కొట్టాల' కథా కేంద్ర స్థానం రాయలసీమలోని కర్నాటక రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న తెలుగు ప్రాంతాలలో ఎక్కువగా ఈ ఆచారం కనిపిస్తుంది. ముఖ్యంగా మాదిగ కులంలో అక్కడక్కడా బి.సి. కులాల్లో ఇంకా అరుదుగా ముస్లింలలో అరుదుగా ఈ ఆచారం కనిపిస్తుంది. సుందర్రాజు ఈ ప్రాంతపు భాషలో, యాసలో, పలుకుబడులు, సామెతలతో, 'నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద' అనే పేరుతో కథని అపూర్వంగా చిత్రించాడు. ఒక దృశ్యకావ్యంలా కథ సాగుతుంది. కథను పాత్రలే నడపటం కథనంలో సుందర్రాజు పాటించిన శిల్పం.

ఈ కథలో కనిపించే పాత్రలు కల్పితాలు కాదు. ఆ ప్రాంతంలోవి, ఆ పాత్రల ద్వారా వారి దైనందిన భాషలో చాలా సహజమైన సంభాషణ శైలిలో కథను నడిపిస్తాడు. కథ చెప్తూ తనతో పాటు మనల్ని ఆ ఊరికి వాళ్ళ ఇళ్ళకి తీసుకెళతాడు. వారు మాట్లాడుతున్నప్పుడు, వారు ఆలోచిస్తున్నప్పుడు వారి పక్కనే వారితోనే మనం ఉన్న అనుభూతిని కలిగిస్తాడు. ఇది కథా రచయితగా సుందర్రాజు విజయానికి గుర్తుగా చెప్పొచ్చు.

ఈ అంశంపై వచ్చిన కథలు ఒకటి రెండుకి మించి లేవు. అవి కూడా సమస్య లోతులకెళ్ళినవి కావు. ఈ కథ అచ్చంగా స్వచ్ఛమైనది. స్థానికతతో, జీవంతో నిండి హృదయాలను, మానసాలను తడుముతుంది, ఆలోచింపచేస్తుంది, కర్తవ్యోన్ముఖుల్ని చేస్తుంది.

ఈ కథలో బోడక్కని బసివిరాలుగా చేయడం వెనుక ఉన్న నేపథ్యం వివరిస్తాడు. దీని వెనుక గ్రామ

పెత్తందారులు పెద్దకులాలు ఈ ఆచారాన్ని ఎలా పెంచిపోషిస్తున్నది వివరించే సన్నివేశం ఒకటుంది. ఈ సన్నివేశంలో కుల ప్రాతిపదికన విభజితమైన గ్రామవ్యవస్థ స్వరూపాన్ని చక్కటి దృశ్యకావ్యంలా చిత్రిస్తాడు. నిచ్చెన మెట్ల కులవ్యవస్థలో ఎవరెవరు ఎక్కడుండాలో, ఉన్నారో ఇలా వివరిస్తాడు.

మాదిగోళ్ళకి రొవుంత ముందు మాలొళ్ళు గుంపుకుసునేద. వాళ్ళకేమి పట్టినట్లు లేదు. వూరికే సూసుకుంట కూసునేర అవుతులు పక్క బాయెళ్ళు గుంపు వుండాది నబీసావొళ్ళు వోట్లు పక్క తరుకొళ్ళు గుంపుకుసునేద వాళ్ళకి డమపక్క కటికే వొళ్ళు దూదేకు లొళ్ళు కుసునేర రెడ్‌రూము కాంసోండుని ఆనుకుని వున్నిన మంగుళుసావుల యనకపక్క మంగులొళ్ళు అంతాకుసునేర రొడ్డొళ్ళు సరిగ పింజిరొళ్ళు బలిజేవొళ్ళు, బైనేవొళ్ళు, ఈడిగొళ్ళు, క్వామిటోళ్ళు, కమ్మొళ్ళు పెద్ద మనుషులు కట్టమింద వుడారు. "మిగిన కులాలోళ్ళు అంతా రెడీరూము సుట్టూరుగ కుసునేర" 'పుట 29. నాగప్పగారి సుందర్‌రాజుకతులు మాదిగోడు.

గ్రామ చట్రంలో చిట్టచివరి స్థానం మాదిగలది అని ఇక్కడ స్పష్టంగా చెప్తాడు. కులం తక్కువ, పేదరికం అందుకే అందరికీ లోకువ, బసివి రాలిని చేయటానికి ఇటువంటి వారి నుంచి పెద్దగా అభ్యంతరాలే ముండవు పైగా మతం, నమ్మకాలు. అందుకే గ్రామ పెద్దలు రెడ్డి మొ॥ ఈ ఆచారాలని కట్టుదిట్టంగా పాటించేలా చేస్తున్నారు.

"వొగునాడు బోడెక్కొళ్ళు నాయిన్ని బజార్లోకి పిలిసుకొని వూర్లో వాళ్ళంతా పంచాద పెట్టిడిసేర" (ఆట 28) అంటూ ఈ పంచాయితీలో బోడెక్కని బసివిరాలిని చేయడానికి కట్టుబాటు, ఆచారం పేరిట ఒప్పించే కుట్ర.

"రెడీ రూము ముందు పందులు పొర్లాడే దుమ్ములు మాకాళ్ళు మద్దిలోకి మాసేతులు పెట్టుకుని కుసినిన నడిమింటి కందారప్ప నెత్తిమీద రుమాలు తీసి సంకులో పెట్టుకుని రెండు సేతులు యెత్తి మొక్కి మాట్లాడేది మొదలు పెట్టిడిస (పుట 28) ఇదీ కింది కులాల దుస్థితి. మనిషిగా గౌరవం లేదు. ఇది ఇక్కడి పరిస్థితి మాత్రమే కాదు దేశంలో ఏ మూలకెళ్ళినా దళితుల దీనస్థితి ఇది. ఇటువంటి మనుషులు వీరికి పైకులాలకి ఎందుకన వసరం చాకిలీ చేయటానికి, మగవాళ్ళు, లైంగిక అవస రాలు తీర్చడానికి ఆచారల పేరున ఆడవాళ్ళు కావాలి. బసివిరాలిగా చేయడానికి చిన్నపిల్ల అని కందారప్ప అంటాడు. భక్తి, కంటే ఈ మానవ మృగాల బారినుంచి సాధ్యమైనంత వరకు బిడ్డను కాపాడుకోవాలనే తపన కూడా కనిపిస్తుంది. దీనికి బాయిగడ్డ అనుమంతు మాట్లాడే మాటలు పై కులాల నీచ స్వభావాన్ని చూపిస్తుంది.

"యేమలే కందరగా.. యేమంటివి నీ బిడ్డ పసిపిల్లా. నోట్లో యేలుబెడితే కొరుకుదేమఅనీ, యదమింద కొంగు తీసేస్తే సారుట్లావు వుండాలి సాండ్లు. వూర్లో మొగొళ్ళంత ఆ మాదిగ బోడెక్కని యప్పుడు బసివిరాల్ని ఇడుస్తారా. యప్పుడు బొట్టు కట్టి పెట్టుకుందామని యెదురు సూస్తుంటే యేమి వగులుమింద మాట్లాడుతుండావు మాదిగాతినీ.. దానికేల్యా అంటారు పెద్దోళ్ళు మాలోన్ని సెప్పకుండ తన్నల్ల - మాదిగోన్ని సెప్పి తన్నళ్ళ"ని సానా రవుసుమిందమాట్లాడిడిస (ఆట 28).

దీనికి పెద్దరెడ్డి ఇచ్చే పెద్ద ప్రసంగం, తీసుకొచ్చే ఉదాహరణలు బసివి వ్యవస్థని మనమే సరిగా పాటించం ట్లేదు చుట్టుప్రక్కల ఎంత చిన్న పిల్లల్ని చేస్తున్నారు, ఎంత తక్కువ ఖర్చులో చేస్తున్నారు అని చెప్పే మాటలు పెద్దకులాల మోసపూరిత స్వభావాన్ని తెలియజేస్తాయి.

"నిజమేగద కందారప్పా! అన్ని వూర్లు లోన పదేండ్లు గాని లేని పిల్లాల్ని బసివిరాలుని ఇడుస్తుంటే మనూర్లో మాత్రమే యేంటికి ఇడుసుగూడుదు సెప్పు మీ మాదిగొళ్ళుకి యంత సెప్పినా అర్తము గాదు. కొమ్ము నరసప్పబిడ్డ పులిగమ్ముని బసివిరాలని ఇడిసినప్పుడు ఇదే రంకు మస్తానమ్మ బిడ్డ అనుమక్కని బసివి రాల్ముని ఇడిసినప్పుడు ఇదే రంకు యాటకని మిమ్ముల్ని వోరుసుకునేది సెప్పండప్పా అనిడిస రెడ్డి (పుట-29)

ఈ రకంగా పెద్దకులపోళ్ళంతా తలోచేయి వేసి, మాటవేసి, ఆదిరించి, బెదిరించి, ఆచారం పేరుతో కట్టడి చేసి మాదిగోని బిడ్డని బసివిరాలిని చేయడానికి రంగం సిద్ధం చేస్తారు. వీరు జరిపించలేరు ఇంత ఖర్చని ఊరిపెద్ద నగం మిగతాది ఊరు భరించేలా ఏర్పాటు చేసి పంచాయితీ ముగిస్తారు.

అక్కడి నుంచి ఊరంతా జాతరలా ఈ కార్యక్రమం ఎలా చేశారనేది బొమ్మకట్టినట్లు ఒక విషయం తర్వాత మరోటి వరుసలో కార్యక్రమాన్నంతా చిత్రిస్తారు. పెద్ద కులపోళ్ళు ఏం చెప్తే అది చేసే ఆటబొమ్మల్లా ఆడే మాదిగల, కింద కులాల దుస్థితిని యథాతథంగా వివరిస్తాడు. ఈ క్రమంలో పిల్లలు, ఇంట్లోవాళ్ళు వీధిలో వాళ్ళు, ఊర్లో వాళ్ళు పక్క ఊళ్ళనుంచి వచ్చిన వారి మాటల్లో ఈ సందర్భంగా వచ్చే మాటలు వివరిస్తాడు. పిల్లలకి అదో పండుగ, ముసలి బసివి రాళ్ళకి తలరాత, మిగతావాళ్ళకి ఆచారం, ఊర్లో మగాళ్ళకి బోడెక్కని పొందాలనే ఆశ, డప్పులు కొట్టేవాళ్ళకి సారా, బీడీలు, పూజార్లకి కొత్త పొందు, తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతం. అసలు పాత్ర అయిన బోడెక్కది శోకసముద్రం. ఈ బతుకువద్దని, ఇన్ని ఆలోచనలు సంఘర్షణలు మధ్య ఈ ఆచార దుర్మార్గాన్ని ఎండగట్టే తీక్షణమైన సూదుల్లాంటి మాటలు కూడా ఉన్నాయి.

"సిత్తకార్తిలో అరవయ్యి ఆరు మొగకుక్కలు సొంగు కారుసుకుంట ఆడుకుక్క తాకివొచ్చేకి సూసినా పాతనన వొగిటే వొగు మొగుకుక్క యొక్కి పెట్లేసుకున్నట్లు వొయిసు అయిపోయే వొరుకు ఇంగోర్నిదరికి రానీకుండ బసివిరాలుని వొలుసుకుని అనేక యక్కడ దప్పిన్నా యాండ్లు అందరు యెదురు సూస్తుండారని".. (పుట 32)

"బోడెక్క ఇంగా పెద్దమనిసి కూడా అయిలేదు కదమ్మా. ఈ పొద్దు బసివిరాలిని ఇడిసేరకదా. ఆ ద్యావుర్లు గట్టిన పూజారాయప్ప కాలుడొక్కిన కర్నేము సామి కంకునుము గట్టిన గొరువయ్య - ముగ్గురు ముసిలి నాబట్లు కలిసి సామి కార్యమని ఆ పిల్లిని ఈ రాతిరికే వొగుడయినంక వొగుడు వక్కలో పొండుబెట్టు కుంటారంట. అన్నియు పున్నిము యెరుగని నడిమింటి బోడెక్కని బసివిరాల్ని బెట్టుకుంటారంట. అన్నిము పున్నిము యెరుగని నడిమింటి బోడెక్కని బసివిరాల్ని జేసి బజారుకు యేసిడిసిరి. ఎద్ద మనిసి అయ్యే తలకాల యంతమంది పిల్లుల్ని పుట్టిస్తారో ముసిలి ముప్పు ఆనానికి ముద్దేసేకి యెవురు మిగులుతారో. ఆ బగమంతునికే తెలల్ల తల్లోయ్.. ఆలుసుకుంటేనే బయమయితాది అంటాని దీర్గాలు తీసిడిన గుంతనంటి మస్తానమ్మ పెద్దమ్మ" (పుట 32)

నేటికి కూడ, ఇంత ఆధునిక కాలంలో, ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో లౌకిక దేశంలో మతాల పేరుతో, ఆచారాల పేరుతో ఆడవారిని, ముఖ్యంగా కింది కులాల స్త్రీలని, బాలికలని నాశనం చేయడం ఏ సంస్కృతికి నిదర్శనం, ఏ వెలుగులకీ ప్రస్థానం. సాటి మనిషిని మనిషిగా గౌరవించలేని కుటిల సంస్కృతిని సభ్య సమాజానికి గొంతెత్తి పెద్దగా అరిచి చెప్పవద్దా.... ఇలా ఒక దాని వెనుక ఒకటి ఎన్నో ప్రశ్నలని ఈ సభ్య సమాజంపైకి వదులుతాడు రచయిత.

మొత్తంగా చూసినపుడు కథ చెప్పటానికి అల్లుకున్న సన్నివేశాలు, సంభాషణలు, పాత్రలు, వాఆవరణం కాదు ఇది నిత్యం ఆంధ్రదేశంలోని ఏదో మూల ఇది జరుగు తున్నదే వాస్తవానికి కల్పించి రచన చేయటం సులభం. వాస్తవ సంఘటనలని కథగా మలచడానికి నైపుణ్యం కావాలి. నిజాయితీ కావాలి గొప్ప విశ్వాసం ఉండాలి. ఇవన్నీ పుష్కలంగా ఉన్న రచయిత నాగప్పగారి సుందరరాజు.

ఈ కథలో చాలా ఘట్టాలని విశ్లేషించటానికి ఇక్కడ వీలుపడదు. స్థూలంగా ప్రధానమైన ఒకటి రెండు సన్నివేశాలను మాత్రమే విశ్లేషించటం జరిగింది.

తెలుగు కథా రచయితల్లో రాశిలో తక్కువైనా వాసిలో

విలువగల కథలు రాసి అర్ధాంతరంగా తనవు చాలించిన రచయిత నాగప్పగారి సుందర్రాజు దూరదృష్టి ఉన్న స్వాప్నికుడు, కార్యసాధకుడు. బ్రతికుంటే నిస్సందేహంగా మంచి రచనలు వెలువడేవి.

ఆధార గ్రంథాలు :

1. నాగప్పగారి సుందర్రాజు : మాదిగోడు మాదిగ సాహిత్యవేది ఎ.పి. యునివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 1997
2. కె. సురేశ్ కుమార్ : బిసివి సాహిత్యం సామాజిక విశ్లేషణ, సిరి ప్రచురణలు, విజయవాడ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి భీమన్న 'పాలేరు' నాటకం – చదువు విలువ

– రొచప్రోలు రమేష్ కుమార్, లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్, ప్రభుత్వ కళాశాల అటానమస్, రాజమండ్రి. తూ.గో. జిల్లా.

దళిత నేపథ్యం :

అనాదిగా భారతావనిలో సామాజికంగా, సాంఘికంగా, ఆర్థికంగా అణచివేతకు గురైనవారంతా దళితులే. వీరిని అణచివేస్తున్న అగ్రవర్ణాలకు ఒక తాత్విక పునాది ఉంది. అదే హిందూ మతవాద తాత్విక పునాది.ఈ అగ్రవర్ణాలకు ఒక సాంఘిక దృక్పథం ఉంది. అది కుల అసమసమాజ నిర్మాణం. ఈ కులం హిందూ సాంప్రదాయం వల్ల అభివృద్ధి చెందింది. హిందూ ధర్మశాస్త్రాలు, సాహిత్యం, కళలు ఈ కులాన్ని భారతీయుల మెదళ్ళలో అంటు వ్యాధిలా వ్యాపింపచేశాయి. దీని వల్ల అంటరాని కులం ఏర్పడి తరతరాలుగా చీకట్లో మగ్గిపోయింది, పోతుంది దళిత మేధావులందరు కులవివక్ష గురైనారు. అలాంటి వాళ్ళు జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ రామస్వామి తదితరులు. శతాబ్దాలుగా సామాజికంగా, సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా బహిష్కరించబడ్డ జనంగా, హీనంగా, దీనంగా బతుకు తున్న దళితుల జీవితాల్లో ఉద్యమాల ద్వారా వెలుగు నింపిన దార్శనికులు వీళ్ళు. వ్యక్తి స్వాతంత్ర్యం, రాజకీయ స్వాతంత్ర్యం కొరకు పోరాడుతూనే దళిత చైతన్యానికి ఇనుప గోడల్లాగా ఉన్న మనుస్మృతిని, వర్ణవ్యవస్థను కూలదోయడానికి అక్షరాలను ఆయుధంగా మలచు కున్నారు. మరికొందరు స్వరూపాన్ని బట్టి నక్సలిజాన్నే మార్గంగా ఎంచుకున్నారు. అది ముగింపు లేని ప్రస్థానంగా సాగుతుంది. అందుకు ఆత్మగౌరవ పోరాటాన్ని ఎంచు కున్నారు.

వందల వేల సంవత్సరాల నుండి సమాజంలో ఒక వర్గం పనిచేయకుండా దోపిడీ ద్వారానే జీవిస్తుంది. ఆ వర్గం భూమిని, పెత్తందారీతనాన్ని తమ సొంత ఆస్తులుగా కలిగి ఉంది. మొదట వాటికి బలైనది దళితులు. ఉత్పత్తిలో ప్రధాన భాగస్వామ్యాన్ని పోషిస్తున్నా, వారికి మిగులుతుంది కటిక దారిద్ర్యమే. కానీ ఆ దారిద్ర్యాన్ని తలచుకొని ఎప్పుడూ బాధపడలేదు. ఒకడు తింటూ మరొకడు పస్తులుండడం ధర్మం కాదంటాడు. అందరికీ కూడు, గూడు, గుడ్డ సమానంగా ఉండాలని సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ఆశించాడు. ఆ విధంగా ఆలోచించటానికి కూడా వీలులేకుండా చేసిందీ సమాజం. అందుకు ప్రధాన కారణం కులం. ఈ కులాన్ని పోగొట్టాలంటే ఉద్యమాలే సరైన మార్గంగా ఎంచుకొని దళితులను చైతన్యవంతులను చేశారు కొందరు దళిత తత్వవేత్తలు. ప్రారంభంలో ఈ రకమైన చైతన్యం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలలో ఆరంభమై ఆంధ్ర ప్రదేశ్‌కు కూడా వ్యాపించింది.

దళితులపై అగ్రవర్ణాల పెత్తనానికి నిరసనగా సాంఘిక సమానత్వం కావాలంటూ 1917 నవంబర్ 4, 6 తేదీలలో భాగ్యరెడ్డి సారధ్యంలో "ఆది ఆంధ్ర మహాసభ"ను విజయవాడలో నిర్వహించారు. ఈ సభ దళితులలో ఆత్మస్థైర్యాన్ని, చైతన్యాన్ని నింపింది. ఇదే స్ఫూర్తితో 1917 మొదలు 1938 దాకా భాగ్యరెడ్డి వర్మతో సుందు వెంకయ్య, కుసుమ ధర్మన్న, వేముల కూర్మయ్యలు ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు విరివిగా నిర్వ హించడం, కులాల మధ్య అంతరాలు నశించేదాకా పోరాటాలు ఆపకూడదని తీర్మానించుకున్నారు.

ఈ కాలంలోనే సంప్రదాయ మేధావులు కొందరు మూఢ విశ్వాసాలతో, ఆచారాలతో నిండిన సమాజాన్ని ఖండించే ప్రయత్నం చేశారు. అందుకు వేదాంత ధోరణిని మార్గంగా ఎంచుకున్నారు. వేమన, పోతులూరి వీర బ్రహ్మంలను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. వేమన దేశమంతా సంచారం చేస్తూ సంఘంలోని దురాచారాలను ఆసు

పద్ధతిలో దుయ్యబట్టారు. మనుష్యుల స్థాయిని హీనపరిచేది జన్మ కాదు - గుణ హీనత అని ప్రభోధించారు.

వందల వేల సంవత్సరాల నుండి సమాజంలో ఒక వర్గం పనిచేయకుండా దోపిడీ ద్వారానే జీవిస్తుంది. ఆ వర్గం భూమిని, పెత్తందారీతనాన్ని తమ సొంత ఆస్తులుగా కలిగి ఉంది. మొదట వాటికి బలైనది దళితులు. ఉత్పత్తిలో ప్రధాన భాగస్వామ్యాన్ని పోషిస్తున్నా, వారికి మిగులుతుంది కటిక దారిద్ర్యమే. కానీ ఆ దారిద్ర్యాన్ని తలచుకొని ఎప్పుడూ బాధపడలేదు. ఒకడు తింటూ మరొకడు పస్తులుండడం ధర్మం కాదంటాడు. అందరికీ కూడు, గూడు, గుడ్డ సమానంగా ఉండాలని సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ఆశించాడు. ఆ విధంగా ఆలోచించటానికి కూడా వీలులేకుండా చేసిందీ సమాజం. అందుకు ప్రధాన కారణం కులం. ఈ కులాన్ని పోగొట్టాలంటే ఉద్యమాలే సరైన మార్గంగా ఎంచుకొని దళితులను చైతన్యవంతులను చేశారు కొందరు దళిత తత్వవేత్తలు. ప్రారంభంలో ఈ రకమైన చైతన్యం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలలో ఆరంభమై ఆంధ్ర ప్రదేశ్‌కు కూడా వ్యాపించింది.

దళితులపై అగ్రవర్ణాల పెత్తనానికి నిరసనగా సాంఘిక సమానత్వం కావాలంటూ 1917 నవంబర్ 4, 6 తేదీలలో భాగ్యరెడ్డి సారధ్యంలో ''ఆది ఆంధ్ర మహాసభ''ను విజయవాడలో నిర్వహించారు. ఈ సభ దళితులలో ఆత్మస్థైర్యాన్ని, చైతన్యాన్ని నింపింది. ఇదే స్ఫూర్తితో 1917 మొదలు 1938 దాకా భాగ్యరెడ్డి వర్మతో నుందు వెంకయ్య, కుసుమ ధర్మన్న, వేముల కూర్మయ్యలు ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు విరివిగా నిర్వహించడం, కులాల మధ్య అంతరాలు నశించేదాకా పోరాటాలు ఆపకూడదని తీర్మానించుకున్నారు.

ఈ కాలంలోనే సంప్రదాయ మేధావులు కొందరు మూఢ విశ్వాసాలతో, ఆచారాలతో నిండిన సమాజాన్ని ఖండించే ప్రయత్నం చేశారు. అందుకు వేదాంత ధోరణిని మార్గంగా ఎంచుకున్నారు. వేమన, పోతులూరి వీర బ్రహ్మంలను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. వేమన దేశమంతా సంచారం చేస్తూ సంఘంలోని దురాచారాలను ఆసు పద్ధతిలో దుయ్యబట్టారు. మనుష్యుల స్థాయిని హీన పరిచేది జన్మ కాదు - గుణ హీనత అని ప్రభోధించారు. వీరబ్రహ్మం కూడా ఇదే ధోరణితోనే కులవ్యవస్థను ఖండిస్తూ అస్పృశ్యతను, 'మైల' అనే పదాలను తీవ్రంగా గర్హించాడు.

సాహిత్యంలో ప్రవేశం :

1969 నుండి దళిత సమన్య సాహిత్యంలోకి ప్రవేశించింది. కథ, నవల, నాటకం ద్వారా దళితులను చైతన్యపరచగలిగారు కొంతమంది రచయితలు. ఈ నేపథ్యంగా పరిశీలిస్తే దళిత సమస్యను చిత్రించిన తొలి భారతీయ నవల ముల్కరాజ్ ఆనంద్ రచించిన 'అంటచబుల్'. తెలుగులో దళితుల సమస్యలను వేర్వేరు కోణాలతో చిత్రించిన నవలలు - వెంకట పార్వతీశకవులు రచించిన 'మాతృమందిరం', ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన 'మాలపల్లి', వట్టికోట ఆళ్వారు స్వామి రాసిన 'ప్రజల మనిషి', దాశరథి రంగాచార్యులు రచించిన 'చిల్లర దేవుళ్ళు' మొదలగు నవలలను ప్రత్యేకంగా చెప్పుకొవచ్చు. అయితే ఈ నవలలు సమన్య మూలాన్ని ఆశించిన స్థాయిలో పరిష్కరించ లేకపోయాయి. అందుకు ప్రధాన కారణం కందుకూరి వీరేశలింగం పేర్కొన్నట్లు... ''మన కులవ్యవస్థ కొన్ని కులాలకు విద్యను నిషేధించింది. ఆ కులాల జ్ఞానమూ, నైపుణ్యమూ, అభివృద్ధి చెందడానికి ఎంతగానో అడ్డుపడింది. మానవ కార్యకలాపాలకు చెందిన సమస్త శాఖలతో పురోగమిస్తున్న ప్రపంచంలో మనం అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో సమంగా ముందుకు పోవాలి. విద్య లేకుండా ఇది సాధ్యం కాదు. విద్యరాని చేతి పనివానికి తన వృత్తిలో ఉపయో గించబడే వేలైన నైపుణ్యాలు, సంవిధానాలు తెలియవు''... ఫలితంగా అతని పెరుగుదల శాశ్వతంగా కుంటు పడుతుంది. కులవ్యవస్థ పరస్పర అవిశ్వాసాన్ని సృష్టించి అనైక్యత, శతృభావం ఏర్పడడానికి కారణం అవుతుందని భావించాడు.

విప్లవ ధోరణి :

ఈ శత్రుభావం అగ్రవర్ణాల మధ్య అణగారుతున్న వర్గాల మధ్య ఆరని కుంపటి లాగే ఉంది. ఆ కుంపటిలో నుండి అనేక ఆలోచనలు ఎగిసిపడుతున్నాయి. ఒడలు మరిచి నిద్రపోయే మోతుబరుల జీవితాల్లో వెలుగులు విరజిమ్మడానికి సిద్ధంగా లేమని ఒకరి దయాధర్మాల మీద బతకడానికి సిద్ధంగా లేమని, సామాజిక సమానత్వం కావాలని కోరుకుంటున్నారు. అందుకు ఎలాంటి ప్రతి బంధకాలు అడ్డొచ్చినా ప్రతిఘటించటానికి సిద్ధమే అంటున్నారు. ఇలాంటి ఆలోచనలు వారిలో ఒక్కరోజులో వచ్చినవి కావు, వందల సంవత్సరాలుగా సాంఘిక జీవన చట్రంలో నలుగుతూ, ఆకలి కేకల్లో నుండి ఉప్పెనలా వచ్చిన ఆలోచనా తరంగాలు. ఈ ఆలోచనలు సమాజం లోని వ్యవస్థ లకు - వ్యక్తులకు మధ్య అగాధంలో నుండి పుట్టుకొచ్చినవి. అలాంటి ఆలోచనలకు దర్పణమే కళాప్రపూర్ణ బోయి భీమన్న రచించిన 'పాలేరు' నాటకం. ఇది ఆనాటి సమాజానికి ప్రతిబింబం. వ్యాపార ధోరణికి అతీతమైంది. రచయిత అనుభవాల సమాహారం. అహింస ద్వారా దళితులలో కొంత వరకైనా చైతన్యాన్ని తెచ్చి ఉన్నత నిలపాలని కోరుకున్న ఆశావాది. వెరసి ఈ నాటకం ఆంధ్రదేశమంతటా వందలాది ప్రదర్శనలకు వేదికైంది.

పాలేరు నాటకం - వస్తువు :

నాటకంలో ప్రధాన వస్తువు వంశానుగతంగా వస్తున్న జమిందారీతనం - కామందు - పాలేరు మధ్య జరుగు తున్న మౌనపోరాటం. నాటకంలో కామందు అభివృద్ధి నిరోధక తత్వం కలిగిన కుబేర్రావు. ఈ నాటకంలో నాయకుడు వెంకన్న. వెంకన్న పాలేరుగా ఉన్నా భావదాస్యం పోయి సర్వ మానవ సమానత్వం కావాలని, అప్పుడే భారతదేశానికి భాగ్యోదయం అని అంటాడు. ప్రపంచ దేశాలు చైతన్యమవుతున్న తరుణంలో దాస్య జీవితం ఎంతకాలమని ప్రభువు సేవకుడు సంఘాన్ని నిర్మించి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకునే అభ్యుదయవాది. అందుకు పూర్తిగా విరుద్ధమైన వాడు కుబేర్రావు.

పాలేరు తను చేస్తున్న పనిలో అలసట మరవడానికి పాటలు పాడుకున్నా అందుకు తన అనుమతి కావా లంటాడు. సమాధానం చెబితే "మాటలు నేర్చిన కుక్క ఉస్కో అంటే డిస్కో అందిట... మొద్దు పీనుగ" అంటూ తన నైజాన్ని ప్రదర్శిస్తాడు. పాలేరు ప్రశ్నించడానికి ప్రధాన కారణం - 'చదువు' అని, దాన్ని నేర్పుతున్న పంతులును శిక్షిస్తే పాలేరులో ప్రశ్నలుండవని గ్రహించాడు కుబేర్రవు. కాని పాలేరు వెంకన్న కుబేర్రావు కాటేస్తాడని తెలిసినా అతని పట్ల విశ్వాసం నడలదు. గ్రామాలే దేశానికి వెన్నెముక, పరిశ్రమించే బహుజనులంద రినీ అధికారపు బహుభారపు లోహపు పాదాల కింద క్రిమికీటకాల మాదిరి నలిగిపోకుండా కాపాడమని లోకానికి చాటుతాడు.

కుబేర్రావు పాలేరుకు మాట్లాడే హక్కులేదని, తన కనుసన్నల్లో మెలగాలే తప్పా స్వేచ్ఛగా ఉండకూడదని శాసిస్తాడు. సందర్భం ఉన్నా లేకపోయినా వెంకన్నను మానసికంగా కృంగదీస్తాడు. వనబాల సాహచర్యం వల్ల, ప్రేమ వల్ల, వనబాల అన్న సుందరం తోడ్పాటు వల్ల, ఉపకారి మాష్టారు ప్రోద్బలం వల్ల చదువుపై ప్రేమను పెంచుకుంటాడు. వెంకన్న చదువుకోవటాన్ని గ్రహించిన కుబేర్రావు చదువుకోవద్దని చావు దెబ్బలు కొడతాడు. తండ్రి వెంకబేష్ కూడా అదే తీరులో శిక్షిస్తాడు. వెంకన్న చేసేది లేక నిరాశతో చావడానికి సిద్ధపడతాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వనబాల వెంకన్నకు తోడుగా ఉంటుంది. బ్రతికి చదువుకోవాలనే నీ ఆశయాన్ని నెరవేర్చాలేగానీ, చావడం వల్ల ప్రయోజనం లేదని అతనిలో ఆశయసిద్ధిని కలిగిస్తుంది.

పాలేరులో వచ్చిన చైతన్యం :

వెంకన్నలో చదువుకోవాలనే పట్టుదలను గ్రహించిన ఉపకారి పంతులు వనబాల అన్న సుందరం సహాయంతో కాకినాడలోని అనాథ శరణాలయంలో చేర్పించి చదువు కోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాడు. అక్కడ రామం అనే స్నేహితుడి పరిచయంతో తన ఆశయాలను నెరవేర్చు

కునే క్రమంలో పట్టుదలతో బి.ఎ. పరీక్ష పాసై డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికవుతాడు. ఉద్యోగ బాధ్యతలో భాగంగా ఏ గ్రామమైతై తనను బాధలకు, హేళనకు, ఈసడింపులకు గురిచేసిందో ఆ గ్రామానికే - రైతువాడకు డిప్యూటీ కలెక్టర్ హోదాతో వెళతాడు.

ఒకప్పుడు తనను పశువు కంటే హీనంగా చూసి తన ప్రగతికి అడ్డుగోడగా ఉన్న కుబేర్రావుతోనే నమస్కారం పెట్టించుకునే ఉన్నత స్థితికి చేరుకుంటాడు. అందువల్ల మనిషిని కులం బట్టికాక, గుణం, ప్రతిభను బట్టి చూడాలి గాని ఏ కులాన్నీ తక్కువ అంచనా వేయకూడదు. సమాజంలో అంటరానితనం, అవిద్య, పేదరికం, బానిసత్వం, కులం, ధనిక, పేదల మధ్య అంతరం మొదలైన వాటిని అధికమించాలంటే ప్రతి మనిషి చేతిలో ఒక ఆయుధం ఉండాలి. ఆ ఆయుధమే 'విద్య' - ఇదే విషయాన్ని నాటకంలో బోయి భీమన్న "కర్ర చేతిలో లేకుంటే గొర్రె కూడా కరచెనోయ్" అంటాడు. అటువంటి విద్య వల్లే వెంకన్న వెంకటేశంగా మారి అందరికీ ఆదర్శంగా నిలబడతాడు. అదే ఆదర్శంతో విశ్వాసంతో తన ఎదుగు దలకు కారణమైన వనబాలను ఆదర్శ వివాహం చేసు కుంటాడు.

ముగింపు :

ఆనాడు ఈ నాటకం గ్రామాల్లోని దళిత పల్లెల్లో ప్రదర్శించటం వల్ల ఎంతోమంది దళితులు చైతన్యంతో చదువుకోవటానికి ముందుకు వచ్చారు. అలాంటి వారిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి కాకి మాధవరావు గారు ఒకరు. ఒక సందర్భంలో ఆయన "పాలేరు నాటకానికి ప్రభావితుడనై కలెక్టర్ నయ్యానని, ఈ నాటకం రాకపోతే నేను పాలేరుగా, అనామకుడిగా మిగిలి ఉండేవాడి"నని అన్నారు. పాలేరు నాటకం ద్వారా సమాజంలో వచ్చిన మార్పు కేవలం ప్రారంభమేనని, చక్కని ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి దళితులందరూ విద్యావంతులై ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఈ నాటకం దళితులందరిలో ఒక చైతన్యాన్ని తీసుకువస్తుంది. గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయులంతా నాటకంలోని ఉపకారి మాష్టారిలా గ్రామాల్లో అందరూ చదువుకోవడానికి వీలైన పరిస్థితులను కల్పించాలి. ముఖ్యంగా కూలీల బిడ్డల విద్యాభివృద్ధికి కూడా కృషి చేయాలని సందేశమిస్తుంది. సంపన్న, ఉన్నత కులాల్లో పుట్టిన వనబాల వంటి యువతులు వర్ణాంతర వివాహాలకు ముందుకు రావాలని ఈ నాటకం సందేశమిస్తుంది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పాలేరు నాటకం - దళిత కోణం

- డా॥ సిహెచ్. నాగరాజేశ్వరి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అ),
రాజమహేంద్రవరం.

- రాజబాబు చెందుకుర్తి
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ప్రభుత్వ ఆర్ట్స్ కళశాల (ఎ), ఆదికవి నన్నయ
విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరము.

సాంఘిక దోపిడికి అణచివేతకూ గురవుతున్నవారు, అస్పృశ్యులుగా పరిగణింప బడుతున్నవారు, నీచ వృత్తులుగా భావించబడుతున్న వృత్తులు చేస్తున్నవారు, శారీరక శ్రమపై ఆధారపడి బతుకులు గడుపుతూ సమాజ సంపదను పెంచుతున్నవారు దళితులు. దళితులు సంవేదనలను, ఆర్తిని, ఆవేశాన్ని, నిరాశనూ, నిట్టూర్పు లను, ఆగ్రహాన్ని, యదార్ధ జీవిత వ్యధార్ధ దృశ్యాలను ప్రతిబింబించేది దళిత సాహిత్యం.

ఏనాడైతే మనుధర్మశాస్త్రం రచించబడిందో ఆనాడే కులవ్యవస్థ ఆవిర్భవించింది. కులం అభివృద్ధి నిరోధక మైన పాత్రను పోషిస్తూ భారత ప్రజల ఐకమత్యానికి విఘాతం కలిగిస్తుంది. దళిత ప్రజలు ఆత్మగౌరవాన్ని కోల్పోయి నిర్వీర్యమై జాతి ప్రధాన జీవన స్రవంతికి ఎడంగా జీవించారు, జీవిస్తున్నారు. వందలాది సంవత్స రాల దేశ చరిత్రలో కులమే నిర్ణయాత్మక పాత్ర పోషించడం వలన తమ ఉనికే ప్రశ్నార్థకమైనదనే అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్నారు. మనిషి జననం నుంచి మరణం వరకు కులమే పెనుభూతమై అన్నిదారుల్లో ఎదురు నిలుస్తుంది. దీన్ని గుర్తించిన సామాజిక ఉద్యమ కారులు కులనిర్మూలనకు తమ తమ అనుభవకోణం నుంచి పరిష్కారాన్ని కనుగొని దాన్ని ఆచరణలో పెట్టే ప్రయత్నం చేసారు. ఈ దేశం సనాతన భావాలకు నెలవైంది. సనాతన భావాలు మెండుగా ఉన్న ఈ దేశంలో నూతన ఆలోచనలు ఎప్పుడూ ఆమోదయోగ్యంకాదని తిరస్కరిస్తుంది. ఏ కొత్త దానికైనా మొదట వ్యతిరేకిస్తారు, రకరకాలుగా నిందిస్తారు, దూషిస్తారు. అయితే తార్కికంగా తాము ఓడిపోయినప్పుడు నీవంటున్నది నిజమేనని ఒప్పుకుంటారు. బాల్య వివాహాల రద్దు, వితంతు పునర్వి వాహాలు, ధర్మబద్ధంకాదని, సాంప్రదాయ విరుద్ధమని అడ్డుపడినవారు, ఇవి సంఘంలో విరివిగా జరిగాక తర్కబద్ధంగా తాము గెలవలేమని గ్రహించాక మాట మాత్రంగానే దాన్ని ఒప్పుకుంటారు.

భారతదేశంలో శ్రమవిభజన కాకుండా శ్రామికుల విభజన జరిగిందని డా॥ బి.ఆర్. అంబెద్కర్ తెలిపారు. శ్రామికుల విభజనవల్ల ఉత్పత్తి కులాలకు తమ వృత్తి వలన కులం స్థిరీకరించబడుతున్నాయి. ఏ కులంలో పుట్టినవారు ఆ కుల వృత్తినే స్వీకరించి మనుగడ సాగించాలి. చాతుర్వర్ణ వ్యవస్థలో అన్ని కులాలకు సమానమైన ప్రాతినిధ్యం, ఒక కులానికి మరొక కులానికి మధ్య సామరస్యం కన్పించదు. ఎక్కువ కులాలకు ఎక్కువ గౌరవం, తక్కువ కులాలకు తక్కువ గౌరవం ప్రభలంగా ఉన్న ఈ వ్యవస్థను మార్చాలని జీవితకాలం కృషిచేసిన మహానుభావులున్నారు. ప్రాచీన కాలంలో బుద్ధుడు, మధ్యకాలంలో భక్త కవులు, ఆధునిక కాలంలో పూలే, అంబెద్కరులున్నారు. వీరిని అనుసరించేవారు అనేక మంది దళిత తాత్వికులుగా గుర్తింపు పొందారు.

దళిత దృక్పథం కులవ్యవస్థ నిర్మూలన, అస్పృశ్యతల కున్న చారిత్రక కారణాలను సహేతుకంగా అన్వేషించింది. ఈ దేశవాసులంతా కులాలుగా చీలిపోవడంలో అర్థంలేదని, మానవులందరూ ఏకరక్త బంధువులని చెబుతుంది. నా కులం, నా జాతి అనే మాటలను దళిత దృక్పథం నిరసిస్తుంది. మానవత్వానికి ఇవే అడ్డుగోడలవు

తున్నాయని గుర్తిస్తుంది. కులనిర్మూలన జరిగితే మానవత్వం వెల్లివిరుస్తుందని కూడా దళిత దృక్పథం నిర్ద్వంద్వంగా ప్రకటిస్తుంది. కులనిర్మూలనకు దళిత దృక్పథం చూపించే పరిస్కార మార్గాలల్లో కులాంతర వివాహాలు, దళితులంతా విద్యకే ప్రాధాన్యమివ్వాలి. ఈ రెండు అంశాలు సాంస్కృతిక వికాసానికి దోహదం చేస్తాయి. సాంస్కృతిక వికాసం పొందితే దళితులు ఈ దేశ ప్రధాన జీవన స్రవంతిలో కలిసిపోతారు.

దళితుల్లో సాంస్కృతిక చైతన్యానికి పురికొల్పడానికే పాలేరు నాటకాన్ని 1933 సంవత్సరంలో రచించారు. బోయి బీమన్నగారు. వర్ణవ్యవస్థలో చిధ్రమైపోయిన దళితుల బతుకులు పురోభివృద్ధి సాధించాలంటే వారు మొదట అక్షరాస్యులు కావాలి. విధ్యాధికులై దళితులు పరిపాలనలో భాగమైతే తరువాత తరం వారికి నిర్మాణాత్మక పథకాలను రూపొందిస్తారు. విద్యాధికులైన దళితులను వర్ణాంతర వివాహం చేసుకోవడానికి ఇతర వర్ణాలు ఒక మేరకు సిద్ధంగా ఉంటారు. ఈ అంశాల ప్రాతిపదికపై పాలేరు నాటకం నిర్మాణమైంది. పాలేరుకు, బానిసకు పెద్ద లేదా లేదు. ఇద్దరూ భూస్వామి యాజమాని దగ్గర తమ అస్థిత్వాన్ని కోల్పోయి బ్రతుకుతారు. తమకంటూ ఒక జీవితం ఉన్నదనీ స్పృహ వాళ్ళకుండదు, ఉన్నా తమ జీవితమంతా తమ యాజమానికి దాష్టికం చెయ్యడానికే ఉన్నదని అనుకుంటారు. పాలేరు భూస్వామి భూముల్లో అరుగాలం కష్టపడతారు. తాను మాత్రమే కాదు తమ కుటుంబం మొత్తం పాలేర్లుగానే ఉంటారు. ఇది ఒక వృత్తిలాగే ఉంటుంది. తన తండ్రి ద్వారా జన్మతో వచ్చిన వృత్తిని జీవితాంతం ఎలా స్వీకరిస్తారో అట్లాగే పాలేరు వృత్తి కూడా.

తరతరాలుగా, భూస్వాముల, దొరల గారడిలలో బానిసలుగా పడిఉంది పాలేర్లకు అణచివేత, ఆర్థిక దోపిడి జీవితమిచ్చిన బహుమానాలు. ముఖ్యంగా పాలేర్లుగా దళితులే ఉంటారు. దళితులకు భూమి ఉండదు. విద్యకు నోచుకోరు. అస్పృశ్యులనే హేయ భావం సంఘం నుండి ఎదరవుతుంది. తమ శక్తి సామర్థ్యాలను తెలుసుకునే అవకాశం, చైతన్యం వీరికి ఉండదు. ఇక ఆ చీకట్లోంచే నిరంతర కృషితో వెలుతురు లోకి వచ్చిన భీమన్నలాంటివారు దళితుల అభివృద్ధి కాంక్షించే పాలేరు నాటకం రాసారు. కుబేర్రావు అనే మానవత్వం లేని భూస్వామి వద్ద పుల్లయ్య పాలేరుగా ఉంటారు. పుల్లయ్య కొడకు వెంకన్నను ఈ భూస్వామి దగ్గరే పాలేరుగా పెడతారు. బానిసలాంటి పాలేరుతనం ఇష్టం లేని వెంకన్న దాని నుండి బయటపడాలని కోరుకుంటాడు. వనబాల, ఉపకారి, సుందరం మొదలైన వారి సహాయంతో వెంకన్న వెంకటేశ్వరరావుగా పేరు మార్చుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం సంపాదిస్తాడు. తనకు సహాయం చేసిన వనబాలను కులాంతర వివాహం చేసుకుని అస్పృశ్యత నివారణకు పాటుపడతాడు, ఇది పాలేరు నాటకంలోని ఇతి వృత్తం.

కులవృత్తి నుండి బయటపడిన వెంకటేశ్వరరావు ప్రతిభాశాలియే, చాతుర్వర్ణ సిద్ధాంతం స్వార్థపరులు సృష్టించింది. దీని ప్రకారమే వేలాది కులాలు ఏర్పడ్డాయి, కులవృత్తులూ ఏర్పడ్డాయి. ఏ కులంవారు ఆ కుల వృత్తిలో విధిగా చేయాలనే నియమాన్ని తొలగించవచ్చు అని పాలేరు నాటకం బుజువు చేస్తుంది. దళితుడైన వెంకన్న పాలేరుగానే ఉండకుండా, విద్యావంతుడై స్వయంప్రతిభతో డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వంలో ఉన్నతమైన ఉద్యోగిగా స్థిరపడ్డాడు. వంశపారంపర్యంగా వస్తున్న వృత్తులను చేపట్టవలసిన అవసరం లేదనేది దళిత దృక్పథం అందించిన సందేశమే. వ్యక్తులు తమ ప్రతిభ ఆధారంగా తమకిష్టమైన వృత్తులలో స్థిరపడవచ్చు అనడానికి ఉదాహరణగా వెంకన్నను చెప్పుకోవాలి. దళితులు స్థిరసంకల్పంతో ఉంటే అకుంటిత దీక్షతో ఎంతటి కార్యాన్నయినా సునాయాసంగా సాధించవచ్చు అనే సందేశాన్ని వెంకన్న పాత్ర అందిస్తుంది. నాటక ప్రారంభలో వెంకన్న ఈ క్రింది పాట పాడుతాడు.

"బానిస తనమును - బాపుమురా
భారత భూమాతకి - భాగ్యములౌరా!

సకల దేముల - సకల మానవుల
సామ్యము - సాధింపుమురా
ఒకడు తినుచు - మరియొకడు - పస్తుపడి
యుండుట - ధర్మము కాదురా
కూడు, గుడ్డ, కొంపయు సమానముగ
కూర్పుమురా లోకమున
ప్రభువు - సేవకుడులేని సంఘమున
పదిలముగా నిర్మింపుమురా!
సౌఖ్యము, సంతోషము మానవులకు
సమకూర్పుమురా! వీరా!

ఒకడు ప్రభువు, ఒకడు సేవకుడు, ఒకడికి తింతి ఉంటుంది, మరొకడికి అది లభించదు. సర్వమానవులు సమానంగా ఉండాలంటే ప్రాధమిక అవసరాలైన కూడు, గుడ్డ, కొంప అందరికి ఉండాలి. అప్పుడు మాత్రమే ఈ వ్యవస్థ సౌఖ్యంగా, సంతోషంగా ఉండదనే బలమైన విశ్వానం ఈపాటలో మనకు కన్పిస్తుంది. ఆర్థిక తారతమ్యాలు లేని వ్యవస్థ నిర్మితం కావాలంటే మొదలు కులం కుదుళ్ళను తొలగించాలి. కులాన్ని బట్టే ఆర్థికంగా బలవంతులుగానో, బలహీనులుగానో ప్రజలుంటున్నారు. పాలేరు తనం కులవృత్తిగా ఉంటే, ఈ పాలేరు తనం బానిసత్వంతో సమానమైనదైతే బానిసత్యానికి ప్రతిఫలం ఉండదు, శ్రమకు ప్రతిఫలం దక్కని చోట తీవ్రమైన ఆర్థిక అవాంతరాలుంటాయనేది స్పష్టమే.

దళితుడైన వెంకటేశ్వరరావు అగ్రవర్ణం స్త్రీ వనబాల వివాహం చేసుకోవడంతో కులాంతర వివాహం కుల నిర్మూలనకు దారితీస్తుందని చెప్పినట్లయింది. దళితడు, నిరక్షరాస్యుడైన వెంకన్న విద్యావంతుడై వెంకటేశ్వరరావుగా పరిణామం చెంది డిప్యూడి కలెక్టరుగా జీవితంలో శిఖరాగ్రంకు చేరడంలో ప్రధానపాత్ర నిర్వహించింది వనబాల. పాలేరు వెంకన్న కష్టాలను చూసి, ఆయనకు చదువుకోవాలన్న అభిలాషను గ్రహించి తన అన్న సుందరం, ఊరి పాఠశాల పంతులు ఉపకారి ద్వారా వెంకన్నకు చాలా సహాయం చేసింది.

జీవితంలో వెలుగుండాలి. అది ఇతరులను వెలిగించాలి. త్యాగం ఒక్కటే జీవితాన్ని వెలిగించగలుగుతుందని గౌతమబుద్ధుడంటారు. ఈ మాటలు అక్షరాల ఉపకారికి వర్తిస్తాయి. దళితులు విద్యావంతులైతే తప్ప వారికి బానిసతనం నుండి విముక్తిలేదు అని దృఢంగా నమ్మాడు. తన లక్ష్యం ఏమిటో స్పష్టంగా తెలిసినవాడు ఉపకారి. ఉపాధ్యాయుడు కనుకనే నిరక్షరాస్యత సంఘంలో ఉండకూడదు. మూఢనమ్మకాలు ఉంటే సంఘం ముందుకెళ్ళదని ప్రచారం చేస్తాడు. సాంఘిక విప్లవం సాఫల్యంలో భాగమే కులనిర్మూలన. కులవ్యవస్థ మనుష్యులను జాతిరీత్యా విభజించడం లేదు. అది ఒకే జాతి ప్రజలను సాంఘికంగా విభజిస్తుంది. కులనిర్మూలన ఉద్యమమే భారతజాతిని ఐక్యం చేస్తుందన్న దళిత దృక్పథమే పాలేరు నాటకానికి ప్రాతిపదికగా గ్రహించాలి.

ఆధార గ్రంథాలు :

1. పాలేరు నాటకం - బోయి భీమన్న.
2. పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - హైమావతి.
3. పౌరాణిక రూపాలు - భావ విప్లవం - కొండపల్లి సుదర్శనరాజు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విశ్వనరుని హృదయ వేదనకు ప్రతీక – 'గబ్బిలం'

– డా॥. ఓ. ధాత్రికుమారి, సహాయాచార్యులు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), గుంటూరు.

పద్మభూషణ్, కళాప్రపూర్ణ, కవికోకిల, కవితా విశారద, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 1895 సెప్టెంబరు 28 వ తేదీన వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో లింగమాంబ, వీరయ్య దంపతులకు జన్మించారు. 1971 జూలై 24న 75వ యేట కీర్తిశేషులైనారు. వీరు జన్మించినపుడు సమాజంలో అగ్రకుల ఆధిపత్యం కొన సాగుతూ దళితులు చదువుకోవడమే కష్టంగా ఉండేది. చిన్న నాటినుండి దళితునిగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. ఎన్నో ఛీత్కారాలను భరించారు. 1941 వ సంవత్సరంలో దళిత వేదనాయుత, దేశభక్తి పూరిత ఆధునిక తెలుగు పద్య కావ్యం 'గబ్బిలం' ను రచించారు. హరిజన కులానికి చెందిన కథానాయకుడు తన మనో వేదనను కాశీ విశ్వనాథునికి చేరవేయమని గబ్బిలంతో సందేశం పంపడమే గబ్బిలంలోని కథాంశం. (పస్తుతం హరిజన అనే పదం స్థానంలో దళిత అనే పదం వ్యవహారంలో ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ పత్ర సమర్పణలో హరిజన అనే పదం స్థానంలో దళిత అనే పదాన్ని ఉపయోగించడం జరిగింది.)

జాషువా గారే ఓ సందర్భంలో చెప్పినట్లు "నాకు గురువులు ఇద్దరు - పేదరికం, కులమత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే రెండవది నాలో ఎదిరించే శక్తిని నేర్పింది అని" - ఈ సహనం, ఎదిరించే శక్తి వలననే దళిత భావజాలంతో, నిమ్నకుల పక్షపాత ధోరణితో, కవిత్వం రాశారు. నిశితమైన దృక్కులతో, తాత్విక చింతనతో తన హృదయ వేదనకు ప్రతీకగా ఉండే కవిత్వాన్ని వెలువరించారు. చెప్పదలచుకున్న భావాన్ని సూటిగా, స్పష్టంగా ధిక్కార స్వరంతో ప్రతిధ్వనించారు. బుద్ధుడు, క్రీస్తుల పట్ల గల భక్తిభావంతో, గాంధీ, అంబేద్కరుల నుంచి పొందిన భావజాల ప్రభావంతో సమసమాజాన్ని కాంక్షించి రచనలు చేశారు.

గబ్బిలం - దళితుని హృదయ వేదన :

సీమగుడ్డకు కన్నులు చెమ్మగిల్ల
ముతకబట్టకు మర్యాద పొటమరించె
నగరివెలుపలిమాలమాదిగలు గూడ
నరులుసుమ్మని దేశంబు గుఱుతుబట్టె

(జాషువా రచనలు-మొదటి సంపుటం-పుట.24)

గాంధీజీ హరిజనోద్యమంపై జాషువాకు గల అపార విశ్వాసం పై పంక్తులలో ప్రకటితమౌతుంది. కుల మత భేదాలు లేని సమ సమాజాన్ని గాంధీజీ తీసుకురాగలడనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు జాషువా.

కలడంబేద్కరు నా సహోదరుడు మాకై యష్ట కష్టాలకుం
బలియై సీమకువోయి క్రమ్మరిన విద్వాంసుండు వైస్రాయి మే
ల్కొలు వందం గల దొడ్డ వాడతడు నీకుం స్వాగతం బిచ్చి పూ
వుల పూజల్ వొనరించెనే యతనిమెప్పుల్ నీజయా రంభవ

(జా.ర.-మొ. సం.-పుట.31)

అని అంబేద్కరు గురించి రాయడంలో జాషువాపై గల అంబేద్కర్ ప్రభావం ద్యోతకమౌతుంది.

కాళిదాను మేఘ సందేశమును మనస్సులో ఉంచుకొని జాషువా ఈ ఖండకావ్యాన్ని రచించానని 'గబ్బిలం' గ్రంథంలో తెలియజేశారు. గబ్బిలం గ్రంథం గురించి వివరిస్తూ - గ్రంథనామము గబ్బిలము. శ్రోతలకిది కటువుగా దోచవచ్చును. కానీ అందలి కథానాయకుడు ప్రణయ సందేశమును నంపును. ఇతడంపునది తుకతుకనుడుకు నశ్రుసందేశము. అతని శిక్షా కాలపరిమితి యొక సంవత్సరము. ఇతని శిక్ష

ఆజన్మాంతము. తరతరములు. దీని కవధి లేదు. అతడు మన్మధాగ్నితప్తుడు, ఇతడు క్షుధాగ్ని పీడితుడు అని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ కాళిదాసు ఖైదీ జైలులో ఒక సంవత్సరము మాత్రమే శిక్షని అనుభవిస్తే, జాషువా దళితుడు ఆజన్మాంతంగా తరతరాలుగా కాల పరిమితి లేని శిక్షని అనుభవించాడు. కాళిదాసుది విరహాగ్ని పూరిత సందేశమైతే జాషువాది ఆకలితో అలమటించే దళితుని వ్యథార్థపూరిత కన్నీటి సందేశం.

నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు
(జా.ర.-మొ.సం.-పుట.7)

అని యితడు వాపోవును అని పేర్కొనుటలో తన కావ్యాన్ని రసజ్ఞతతో చదివి అర్థం చేసుకోగలగాలని సహృదయత ఉన్న వారే తన బాధని అర్థం చేసుకోగలరని, అప్పుడు మాత్రమే తన శ్రమ ఫలోన్ముఖ మౌతుందని భావించారు.

కావ్యారంభ పద్యాలలో కథానాయకుని పరిచయం చేస్తూ 'గర్భ దరిద్రుడు నీతిమంతుడై' అని ప్రయోగించారు. కులపరంగా ఈసడించబడుతున్న దళిత కథానాయకుని ఆనాటి సమాజాన్నునుసరించి కులానికి పేద కాని గుణానికి పేద కాదని, ఎంతో నీతిమంతుడని అభిమానవంతునిగా, ఉన్నతునిగా వర్ణించారు.

ముప్పు ఘటించి వీనిగలిమిన్గబళించిదేహమున్
బిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగా
జెప్పులుగుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని వీనిసేవకున్
(జా.ర.-మొ.సం. పుట.1)

'అప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్' అని దళితుడు ఇతరుల పాదాలు కందకుండా చేస్తున్న సేవకు భరతభూమి మొత్తం ఋణపడి ఉన్నదని, అయినా అతని కష్టాన్ని ఎవరూ గుర్తించటం లేదని వ్యథ చెందారు.

నువ్ బాంచాను దొర అంటే - శబ్బాషు బేట అంచు
నువు ఎట్టిజేసి పెడితే - ఆడు పొట్టనింపుకొండు
నీ రక్తమంత ఉడికి - చెమటోలె గారుతుంటే
ఆడు సీసలల్ల బట్టి - సారోలె తాగుతుండు
అరె కులం పేర నీ శ్రమను - దోపిడి జేస్తుండు
॥ రండి ॥

అంటూ దళితులకు, తమ శ్రమ విలువను తెలియ జేస్తూ, ప్రత్యక్ష వర్గ సాయుధ పోరాటాన్ని ప్రబోధిస్తూ, కుల హీనులుగా వెలివేస్తున్న వర్ణ శత్రువులపై ఆగ్రహాన్ని ప్రకటిస్తున్నదీ గీతం. దళిత స్పృహతో మాస్టార్జీ రచించిన 'రండిరో దళితన్నా' అనే ఈ గీతం పైన చెప్పబడిన జాషువా పద్యాన్ని తలపిస్తోంది.

తన కవిత్వంలో మూఢాచారాలను, మతమౌఢ్యాన్ని, కుల, మత భేదాలను నిరసించారు. మత ఛాందసత్వాన్ని తలచుకొని వ్యథ చెందారు. పేదరికాన్ని ఓర్చుకొనగలి గాడు గాని, తన తోటి సహవాసకాండ్రు తనని కులం పేరు చెప్పి అవమాన పరిచిన విషయం మాత్రం మరచిపోలేక పోయారు. సహించలేక పోయారు. దానికి ప్రతీకగా

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోఉక
నాల్గు పడగల హైందవ నాగరాజు
(జా.ర.-మొ.సం.-పుట.2)

'కసరి బుసగొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు' అని ఆక్రోశాన్ని వెలిబుచ్చారు. జాషువా తాత్విక దృష్టితో మత సామరస్యాన్ని కాంక్షించారు.

పామునకుఁ బాలు, చీమకుఁ బంచదార
మేపుకొనుచున్న కర్మభూమిఁ జనించు
ప్రాక్తనం బైన ధర్మదేవతకుఁ గూడ

నులికిపడు జబ్బు గలదు వీఁడున్న చోట
(జా.ర.-మొ. సం. - పుట.2)

ప్రాక్తనంబైన ధర్మదేవత కూడా దళితుని చూసి ఉలికిపడుతుందని తీవ్రంగా ఖండించారు.

బొమ్మల పెళ్లిళ్లకు ఎంత ధనాన్నయినా ఖర్చు పెడతారు గారి పేదవాడి ఆకలి బాధని పట్టించుకునే నాథుడే లేడని మత విశ్వాసాల పేరు చెప్పి ఎలా దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారో విశదం చేశారు.

ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించు గాని
పేదల దుఃఖిత మతులైన పేదల వకీరుల శూన్యములైన పాత్రములన్
మెతుకు విదల్పదీ భరత మేదిని, ముప్పది మూడు కోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారునే
(జా.ర.-మొ.సం.-పుట.4)

అంటూ జాషువా బహుదేవతారాధనను, విగ్రహారాధనను విమర్శించారు.

కుల మతాలు గీచుకొన్న గీతల జొచ్చు
పంజరాన గట్టువడను నేను
నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు విశ్వనరుడనేను -

అంటూ తాను ఈ అసమ సమాజానికి కట్టుబడనని తాను చాలా విశాల దృక్పథం గల విశ్వనరుడనని ధైర్యంగా ప్రకటించుకున్నారు.

ఈ కావ్యంలో కవి పదే పదే గబ్బిలాన్ని గురించి, దేవాలయ గోపురాగ్రాలలో అది నివసించుటను గురించి కావ్యంలో కథానాయకుని చేత సంభావింపజేస్తూ ఉండడం వల్ల కావ్య లక్ష్యంలో ఒకటైన దళిత వేదనా కారణమైన హిందూ సంప్రదాయ అధిక్షేపణ కనిపిస్తుంది.

కర్మసిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నాభుక్తి ననుభవింత్రు
కర్మమననేమొ దాని కీ కక్ష యేమొ
యీశ్వరునిచేత బుజువు చేయింపవమ్మ
(జా.ర.-మొ.సం.-పుట.5)

కుల, మత వ్యవస్థను నిరసిస్తూ కర్మ భూమికి నిజమైన అర్థమేదో ఆ ఈశ్వరునే తెలియజేయమంటూ గబ్బిలానికి చెప్పడంలో హిందూమతంలో పేరుకుపోయిన ఛాందస భావాలను విమర్శిస్తూ జాషువా కర్మ సిద్ధాంతాన్ని వ్యతిరేకించడం మనం గమనించవచ్చు. అందుకే స్వార్థపరులు సృష్టించిన సిద్ధాంతమే కర్మ సిద్ధాంతమని విమర్శించారు.

నన్నొకమారు నీ దరిసెనంబున దేల్చిననాడు ధన్యునిగ జేసి భర్గుఁ డే
మన్నది చెప్పి పొమ్ము విబుధాలయ వాసిని నాకు లేరు నీ
కన్న శరణ్యు లాప్తులు వికాసితమైనవి తూర్పు రేఖలున్
కన్నఁపు దొంగతోడసదనంబునకుం జనుమమ్మ పక్షిణీ
(జా.ర.-మొ.సం.-పుట.22)

అంటూ ఈ సమాజంలో అందరూ తనని అస్పృశ్యునిగా చూశారని, తనది గబ్బిలం కన్నా హీనమైన జీవితమని అందుకే గబ్బిలంతో తన సందేశాన్ని శివునికి వినిపించమని చెప్పారు. గబ్బిలాన్ని ఎవరూ తమ ఇంట ప్రవేశింపనీయరు కదా! అయినా దానికి దేవాలయ ప్రవేశమున్నది. తనకి దేవాలయ ప్రవేశం లేదని, ఇప్పుడు తన బాధని శివునికి వినిపించే ఏకైక ఆప్తుడు గబ్బిలమే నన్నాడు.

నీకావించిన రాయబారమునకు నిత్యాభిషేకంబుగా
నాకన్నీటిని కాన్కగా యొసగుచున్నానో దయాశాలినీ
చేకొమ్మింతకుమించి నావలన నాశింపంగ లేదిట్టి నీ
బాకీ దీర్తు స్వరాజ్య సౌధమున నావాసంబు సిద్ధించినన్
(జా.ర.-మొ. సం.-పుట.30)

దళితుని వేదనని విని రాయబారం చేసినందుకు గబ్బిలానికి కవి కన్నీటితో నిత్యం అభిషేకం చేస్తానన్నారు. స్వరాజ్యం వచ్చి దళితుల స్థితి మెరుగుపడితే దానికి బాకీ తీరుస్తానన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తే సంఘంలో సామాజిక దురన్యాయం పోయి మంచిరోజులు

వస్తాయని, దళితుల ఆత్మగౌరవం నిలబడుతుందని, తద్వారా దళితుల సమస్యలు తీరుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు కవి.

పుట్టంగావలె సత్కవీశ్వరుడు నీ పుణ్యాన మావంశపుం
బుట్టంజీలిచికొంచు సంచితకళాపూర్ణ ప్రభారాశియై
పుట్టంగూడదు పుట్టినం గలుగవెప్పన్ నిండు సన్మానముల్
గట్టా యుచ్చత నీచతాయుత వితర్కభ్రష్టదేశంబునన్
(జా.ర.-మొ. సం.-పుట.33)

ఎంత సత్కవి అయినా అగ్ర కులస్థుడైతే మాత్రమే ఈ దేశంలో గౌరవం, సన్మానాలు లభిస్తాయని, ఎంత ప్రతిభ ఉన్నా దళితుడైతే ఆ కవికి గుర్తింపు లేదని వేదన చెందారు.

సమతలు సఖ్యముల్ బెదవిజారిన మాటలు కట్టు బాట్లు చ
ట్టములు బటుత్వమూడిన గుటారపు దూముడి బంధనాలు ధ
ర్మములు దయారసాల్ మొసలిరాలుచు నశ్రుకణాలు చిత్రచి
త్రములు మతస్వభావములురామరగా వివరింప గల్గితిన్
(జా.ర.-మొ.సం.-పుట.34)

సమతలు, స్నేహ బంధాలు వ్యర్థమైన మాటలని, చుట్టాలు తాత్కాలికమేనని, ధర్మాలు దయారసాలు మొసలి కన్నీళ్ళ వంటివని, మాట స్వభావాలు చిత్ర విచిత్రమైనవని, కేవలం మానవత్వం మాత్రమే శాశ్వత మైనదని ప్రబోధించారు.

రెండవ భాగం తొలి పలుకులో 'తన ఇష్ట దేవత తన జాతికి కేతన చిహ్నమైన గబ్బిలానికతడు మరికొన్ని చింతా సందేశాలను చెప్పుకొనసాగినాడు. గబ్బిల మామూలాగ్రంగా ఆలకించింది. నోరులేని పక్షి మారు పలుకుటకు శక్తి లేని పక్షి ఏమని యోదార్వ గలదు? ప్రదర్శించి కన్నీరు కార్చి శివాలయానికి తరలిపోయినది. తను పడిన శ్రమకు ఫలితం దక్కుతుందో లేదో అతని వాక్కులు చావులేనివై, వాయు మార్గమున ప్రతిధ్వనించు చున్నవి. గణబద్ధములైనవి. రెండవ గబ్బిలమను కావ్యమై నిలచినది. నేడుగాక మరొకనాడు ఫలించును. ఫలిత మనుభవించు భాగ్యమతనికున్నదో లేదో' - అని విజ్ఞప్తి చేయడాన్ని బట్టి సహృదయత గల పాఠకులకే దాని బాధ్యతని వదలి వేసినట్లుగా తెలుస్తోంది.

ముగింపు :

జాషువా తన కవిత్వం ద్వారా సమాజంలో ఏ కొంచమైనా మార్పు తీసుకురావాలని ఆశించారు. కుల, మత, వర్గ రహిత సమాజాన్ని కాంక్షించారు. గబ్బిలం ద్వారా అస్పృశ్యుని ఆవేదనని అవిష్కరింపజేశారు. స్వాతం త్రోద్యమ కాలంలో రగుల్కొలుప బడుతున్న దేశభక్తి భావాలతో దళిత భావాలను మిళితం చేసి దళితుని హృదయ సంవేదనని నివేదించారు. జాషువా కలలు కన్నట్లుగానే గబ్బిలంలో పేర్కొన్న స్వాతంత్ర్య ఫలాలను దళితులు నేడు దాదాపుగా అనుభవిస్తున్నట్లుగా భావించవచ్చు. ఈ ఫలాలను నూరు శాతం మత, వర్ణ, వర్గ రహితంగా అందరూ సమానంగా అనుభవించే దశ వచ్చినప్పుడు జాషువా హృదయ వేదనకు నిజమైన సార్థకత చేకూరుతుంది. తన హృదయగత భావాలను, వేదనను సూటిగా, స్పష్టంగా, ధైర్యంగా, కరుణ రసాత్మకంగా వ్యక్త పరచిన విశ్వనరుడు జాషువా అజరామరులు.

ఉపయుక్త గ్రంథాలు :

1. జాషువా రచనలు మొదటి సంపుటం-గబ్బిలం-విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్-హైదరాబాద్-ద్వితీయ ముద్రణ-జూలై - 2004.
2. దళితవాద వివాదాలు-సంపాదకులు డా॥ ఎస్వీ సత్యనారాయణ-విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్- హైదరాబాద్-తృతీయ ముద్రణ, నవంబరు - 2005.
3. గబ్బిలం జాషువా తాత్విక స్వప్నం (గబ్బిలంపై వ్యాసాలు, సులభ లఘు వ్యాఖ్య) - పద్మభూషణ్ డా॥ గుర్రం జాషువా పరిశోధనా కేంద్రం - తెలుగు అకాడమి - హైదరాబాద్ - 2012.

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు కవిత్వంలో దళిత తాత్వికత

– విజయ్ కుమార్ బండారు, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల, స్వయంప్రతిపత్తి, రాజమండ్రి.

సాహిత్యంలో ఏవాదమైనా ప్రారంభమ్మెనప్పుడు, ఆ వాదానికి మూలాలు ఎంతోకాలంగా పరిణమిస్తూ, వస్తే, అందుకు కారణం, అన్ని వాదాలకూ పునాదిగా సామాజిక సందర్భాలుండడమే. ఒక సామాజిక సందర్భానికి సంబంధించిన పరిణామమే, ఒక వాదంలోని పరిణామానికి నేపథ్యంగా ఉంటుంది. ఇలా గమనించినప్పుడు, 1990ల నుండి తెలుగుకవిత్వంలో ప్రారంభ, 1995ల నుండి లోతునూ, విస్తృతినీ, సాధించిన దళితవాదానికి సంబంధిన అంశాల్ని, ఆధునిక కవిత్వ ప్రారంభకాలం నించీ గమనించవచ్చు. అయితే, 1990ల దాకా వచ్చిన కవిత్వాన్ని "దళితకవిత్వం" అని మాత్రమే అనగలం. 1990ల నించీ వస్తున్న కవిత్వాన్ని "దళితవాద కవిత్వం" అని పేర్కొనాలి. దళితకవిత్వంలో దళితస్పృహ అన్ని కోణాల్లోనూ కనిపించవచ్చు. కాని దళితవాద కవిత్వం, దళితులు తమ కోసం తామే పోరాడి, సమాజంలో తమదైన స్థానాన్ని సాధించుకోవాలనే చైతన్యం లోంచి వచ్చింది. ఒక విధంగా అసమానమైన సామాజిక స్థితిని అలాగే ఉంచి, దళితులకి జరిగిన అన్యాయాల్ని గూర్చి మాత్రమే దళితకవిత్వం చెప్తే, సామాజిక సమానత కోసం జరిగే సంఘర్షణలోంచి దళితవాదం ఉద్భవించింది.

ఒక్కసారి పూర్వ నేపథ్యం వైపు దృష్టి సారిస్తే, ముందుగా దళితస్పృహని కవిత్వంలో చాటిన కవి గురజాడ. ఏ కవుల భావప్రకటనక్కైనా వారు జీవించిన కాలం, వారి చుట్టూ ఉన్న పరిస్థితులు, భావాల పరిపక్వ స్థితి లోని దశలు చాలా ముఖ్యం. అంతేగాని, సరిగ్గా ఈనాడు ప్రచలితంగా ఉన్న ధోరణుల్ని, పూర్వకవుల్ని విశ్లేషించడంలో, అన్వేషించరాదు. ఈదృష్టిలోనే గురజాడ చెప్పిన భావాల్ని గూడా గ్రహించవలసి ఉంది.

"మంచి అన్నది మాల అయితే
మాలనేనగుదున్"

ఇది గురజాడ ప్రసిదమైన ఉద్ఘాటన. మంచి, చెడు అంటే కేవలం సౌజన్యం, దుర్మార్గం మాత్రమే కాదు. ఔన్నత్యం, అవరత్వం కూడా ఆమాటల వెనక ధ్వనిస్తుంది. "ఔన్నత్యం, అవరత్వం కులం వల్ల వచ్చేవి కావు, ఔన్నత్యానికి మాల అని పేరు పెడితే నన్ను మాల అనే పిలవండి" అని కవి అభిప్రాయం. అంటే కులం అనేది ఏవిధంగానూ, అవరత్వ, ఔన్నత్యాలకి కొలమానం కాదు అని భావం. గురజాడ భావాన్ని ఆయన కాల పరిమితుల్లోనే గ్రహించవలసి ఉంది.

1933లో రెండు గొప్ప దళితకవిత్వ సంపుటాలు వచ్చినాయి. ఒకటి మంగిపూడి వెంకటశర్మ రాసిన "నిరుద్ధభారతము", రెండోది కుసుమ ధర్మన్న రాసిన "హరిజన శతకము". మంగిపూడి వెంకటశర్మ, ధర్మన్న ఆ కాలపరిమితులలో గాంధీభావాల చేత ప్రభావితులే. గాంధీ, ఏవిధంగా, ఎందుకోసం అస్పృశ్యతను వ్యతిరేకించినా, అనాటికి కొంతైనా సంచలనం కలిగించిన అంశమే. మంగిపూడి వెంకటశర్మ, అస్పృశ్యులపై తనకు గల సానుభూతి, సహానుభూతుల వల్ల, ఉద్యమానుకూల లక్షణాల్ని తన కవితారూపానికీ, భాషకీ ఒదిగించగలిగాడు. అంతేగాక, గుండెను కదిలించే భావాల్ని విస్తృతమ్మెన పరిధిలో చెప్పగలిగాడు.ల

"కాపురంబులు చేయగా చుట్టుగుడిసెలే
కాని లోగిళ్ళు లెక్కకును లేవు
చెలగికట్టంగ మాసిన చింపిగుడ్డలే
కాని వల్వలు కొంచెమైన లేవు
త్రావంగ నూకల జావయు, గంజియే
కాని అన్నమును శాకములు లేవు
సాగసుగా తాల్ప గాజులు, పూసపేరులే
కాని బంగరునగల్ లేనెలేవు

పంటపండింపగా నూరివారి చేలె
కాని సొంతంబు లెందును కానరావు
అకట! మా ఘోరదారిద్ర్యమొకరిక్కెన
జాలి పుట్టింపదాయెనా శ్రీలులార!

దేవుణ్ణీ, శాస్త్రాల్నీ, హిందూమతాన్నీ కవి విశ్వసించినా, ఆపరిధిలోనే తన కాలానికి అనుగుణంగా, అస్పృశ్యతకి వ్యతిరేకంగా, సంచలనాత్మకమైన కవిత్వాన్ని రాయగలిగాడు. దళితుల్ని మేల్కొలిపే ప్రయత్నం తీవ్రంగా చేశాడు.

"పంచములార! అంతరిత భవ్య గుణోత్కరులార! గర్భితో
దంచిత శక్తులార! అసమర్థులె మీరలు? గొర్రెమందలో?
వంచితమై చరించు నల వ్యాఘ్రకిశోరమురీతి పూర్తిగా
పంచితులైరి, ఆత్మబల వైఖరినెంచుడు, మేల్కొనుండికన్"

కుసుమ ధర్మన్న దళితుడు కావడం చేత, ఆయన కవిత్వంలో దళితజీవన వాస్తవికత, ఆవేదన, ప్రతిఘటన తీవ్రత ఇంకా స్పష్టంగా కనిపిస్తాయి.

"మాలవాడని యవమానంబు గావించి
పంచముండని పరువు పారద్రోలి
ఆదిమాంధ్రుడవని సోదిచెప్పిరి గాదె
ఆలకింపుమయ్య హరిజనుండ!"

దళితులు పాలేర్లుగా ఉండగా, రైతులు చేసే దోపిడి గురించి, దళితుల శ్రమను వారు ధనంగా మార్చుకోడం గురించి కుసుమ ధర్మన్న చెప్పిన పద్యాలు ఎంతో దళితస్పృహ కలిగి ఉన్నాయి. ఆర్థికపరమైన దోపిడిని ఇంత స్పష్టంగా చెప్పిన కవి అప్పుడు మరొకడు లేడు.

"కొల్చు నీకు పిచ్చ కుంచంబుతో తాను
కొల్చుకొనడె పెచ్చుకుంచమునను
దోచుకొనక నీకు దొర యెట్టులగు రైతు"
"అక్కర్కెన కొంత అప్పిచ్చి తక్కువ
కూలికెపుడు పనులు గొనుచునుండు
పేదవగుట నిన్ను పీడింపడే రైతు."
"తెల్లదొరల పైన కళ్ళెర్రగా జేసి
హక్కులడగ జూచు నాగ్రహమున
ప్రక్కనున్న నిన్ను త్రొక్కిపెట్టరె వీరు."

దళితవేదన దళితస్వరం నుండి వచ్చినపుడే రగిలే వాస్తవికత రూపుదిద్దుకుంటున్న విషయానికి కుసుమ ధర్మన్న మొదటి ఉదాహరణ.

ఇంకా జాలా రంగస్వామి మొదలైన కొందరు దళిత స్పృహను విస్తృత పరచగా, మహాకవి జాషువాతో దళిత కవిత్వంలో గుణాత్మమైకన మార్పు వచ్చింది. జాషువా, కులం కారణంగా, పేదరికం కారణంగా, తన అనుభవాలను అంతస్సవంతిగా చేసి, తన కవిత్వంలో జీవన వాస్తవికత, ఆవేదన, చైతన్యాలతో పాటు ప్రతిఘటన స్వరాన్ని తీవ్రంగా వినిపించిన కవి.

"నిమ్న జాతుల కన్నీటి నీరదములు
పిడుగులెక్క దేశమును గప్పివేయు ననుచు."

అనగలిగిన కవి జాషువా. కన్నీటిని అగ్నిగా మార్చగల అక్షరశిల్పి, ధిక్కారశీలుడు మహాకవి జాషువా. అయినా ఆయన కాలపరిమితులు ఆయనకీ ఉన్నాయి. భావ తీవ్రతకి తోడు, అద్భుతమైన కవితాశక్తి కూడా కలవాడు కావడం చేత, మొదటిసారిగా ప్రజాకవిత్వానికి పద్యాన్ని వినియోగించి, దళిత చైతన్యానికి మార్గదర్శి కాగలిగాడు.

సమాజంలో తిరుగుబాట్లు జరుగుతున్నప్పుడు మాత్రమే, దానికి సమాంతరంగా కవితోద్యమాలు కూడా తలెత్తుతాయి. 1930ల నుండి భారతదేశాన్ని మహోద్యమ రూపంతో నడిపింది మార్క్సిస్టు సిద్ధాంతం. 1980దాకా మార్క్సిస్టు ఉద్యమాలు తిరుగులేని విధంగా జరిగాయి. ఈ ఉద్యమాల ఆధారంగా మార్క్సిస్టు కవిత్వం అత్యంత విస్తృతంగా సమాజాన్ని ప్రభావితం చేసింది. మార్క్సిస్టు ఉద్యమాలు దళితుల విషయంలోనూ, కులనిర్మూలన విషయంలోనూ ఉదాత్తమైన ఆశయాలతో నడిచినా, దళిత చైతన్యాన్ని ప్రధాన స్థానానికి తీసుకురాలేక పోయాయి. ఆర్థిక, రాజకీయ పోరాటాలు మార్క్సిస్టు భావనలో ప్రధానస్థానంలో ఉంటాయి. 1969లో కంచికచెర్లలో కోటీశు అనే దళితుణ్ణి అగ్రవర్ణాలు సజీవ దహనం చేసిన సంఘటన దళిత చైతన్యానికి మొదటి సంచలనంగా చెప్పవచ్చు. అయితే, అప్పటికి దళిత

సంఘటిత శక్తి రూపొందక పోవడం చేత, ఆసంఘటన దళితస్పృహని ఎంతగా రగిలించినా, సమష్టి పోరాటానికి ప్రారంభం కాలేకపోయింది. అప్పటినుంచి క్రమంగా రూపుదిద్దుకుంటున్న దళిత స్పృహ, 1980ల లోకి వచ్చేటప్పటికి, నిర్దిష్టమైన సిద్ధాంతాల్ని ఏర్పరచుకోవడం, డా. బి.ఆర్. అంబేద్కర్‌ని స్ఫూర్తిదాతగా తీసుకోవడం, సమష్టి ఉద్యమాల కోసం పురోగమించడం మొదల యింది. ''మేకల్నే బలిస్తారు గాని సింహాల్ని కాద''నే అంబేద్కర్ మాటలు దళితుల్ని పోరాటం వైపు మరల్చడం ప్రారంభమైంది. వచనకవిత్వంలో ఈ భావాల ప్రతిఫలనం మొదటిసారిగా, బొజ్జా తారకం ''నదిపుట్టిన గొంతుక''లో స్పష్టమైన రూపం పొందింది. ఏ సాహిత్య వాదానిక్కైనా, ఒక స్వచ్ఛమైన, సమగ్రమైన తాత్విక భావధార ఉండాలి. దీన్ని మొదటిసారిగా అందించే ప్రయత్నం చేసింది ''నదిపుట్టిన గొంతుక''! బొజ్జా తారకం 80ల నుండే ''నలుపు'' అనే దళిత పత్రికను కూడా నడిపి, దళిత చైతన్యాన్ని వ్యాప్తి చేశాడు. 1980ల లోనే ఆయన తెచ్చిన ''నదిపుట్టిన గొంతుక'', ఆ తర్వాత రాబోయే దళితవాద సాహిత్యానికి వేగుచుక్క.

''నేను అస్పృశ్యుణ్ణి
నా ఒళ్ళంతా మట్టి వాసన
నా బ్రతుకు నిండా వెట్టివేదన
నా కళ్ళనిండా ఎండవేడిమి
ఎండకు ఎండి వానకు తడిసి
బిగుసుకుపోయిన,
మర్రి ఊడల్లా నా తల
నన్ను ఊరికి దూరంగా ఉంచారు
మట్టి పిసికి యిటుకలు చేసి
ఇళ్ళు కట్టి యివ్వమన్నారు
ఇంట్లోకి రావద్దన్నారు
చచ్చిన మీ గొడ్డుల్ని
మోసుకుపొమ్మన్నారు.
వాటి చర్మం ఒలిచి
చెప్పులు కుట్టమన్నారు
నేను చెప్పులు తొడగకూడదన్నారు
నా గురించి కథలు లేవు
గాధలు లేవు
నాకై కవిత లేదు
నాకు చరిత లేదు
నాలుగువేదాలలోంచి
నాలుగు పాదాల లోంచి
నన్ను తొలగించారు
కట్టలోంచి జారిన కట్టెలా
ఒక్కణ్ణే ఎక్కడో ఎండిపోయాను''

కట్టలోంచి జారిన కట్టెలా ఒక్కడూ ఎండిపోవడమనేది చాలా కొత్త పోలిక. ఈ కట్టె, భవిష్యత్తులో మండుతుందన్న ధ్వనికి అనుగుణమైన ఉపమానం.

మార్క్సిస్టు ఉద్యమాలు ఆటుపోట్లకు గురౌతున్న సందర్భంలో, 1985 నుండి శక్తిమంతంగా ప్రచలితమైంది స్త్రీవాదం. ఆ తర్వాత ఐదు సంవత్సరాలకు దళితవాదం ఒక ఝంఝలా సర్వవ్యాప్తమైంది. కారంచేడు, నీరుకొండ మొదలైన చోట్ల జరిగిన హింస, దేశవ్యాప్తంగా పెరిగిన దాడులు, పీడన, దళిత ఐక్య సంఘటనకు నేపథ్యంగా నిలిచినాయి. అంతకుముందు మార్క్సిస్టులుగా ఉన్న చాలా మంది రచయితలు, మేధావులూ దళితవాదంలోకి వచ్చారు. చాలామంది మార్క్సిస్టు వ్యతిరేకులుగా కూడా మారారు. ఈ యిరువర్గాల మేధావుల మధ్య ఆరోజుల్లో అతి తీవ్రమైన చర్చలు జరిగినాయి. ఆ చర్చల్లో ముఖ్యమైంది పునాది, ఉపరితలాల్ని గూర్చింది. అన్నిటికీ పునాది ఆర్థికమనీ, మిగిలినవన్నీ ఉపరితల నిర్మాణాలనీ మార్క్సిజం చెప్తుంది. అందువల్ల దళితపీడనకీ అంతిమంగా ఆర్థికమే కారణమని మార్క్సిస్టుల వాదన. అయితే, భారతదేశ పరిస్థితికి, అంతర్జాతీయ వాదాన్ని అనుసంధించరాదనీ, ఇక్కడి పరిస్థితుల్లో దళితత్వం ఉపరితలం కాదనీ, పునాదిగా ఉన్నదనీ దళితవాదులు అన్నారు. అందుకే ధనవంతుడైన దళితుడు కూడా,

నిరుపేద అయిన అగ్రవర్ణస్థుని చేత తక్కువగా చూడబడతాడనీ, అందుకే ఈ అంశం పునాదిగా చూడాలనీ, కులనిర్మూలన జరిగితే గాని, ఆర్థికమైన దోపిడిని ఎదుర్కొనడం సాధ్యం కాదనీ దళితవాదం చెప్పుంది. ఇంకో అడుగు ముందుకేసి జి. లక్ష్మీనరసయ్య అనే విమర్శకుడు "దేశీయ మార్క్సిజమే" దళితవాదం అన్నాడు. అంటే మార్క్సిజమ్ అవసరం ఇక్కడ లేదనీ, దేశీయంగా మార్క్సిజమ్ స్థానంలో దళితవాదమే నిలవాలనీ ఆయన అభిప్రాయం. అయితే అంత క్రితం మార్క్సిస్టులుగా ఉండి, దళితవాదులుగా మారిన కొంతమంది అంబేద్కరిజమ్ ని ప్రధానంగా భావిస్తూనే, మార్క్సిస్టు దృక్పథాన్ని కూడా కలుపుకోవాలని వాదించారు.

సతీశ్ చందర్, భూపతి నారాయణమూర్తి మొదలైన వారు ఇందుకుదాహరణ. భూపతి నారాయణమూర్తి, మార్క్సిస్టు మూలసూత్రాల్నీ, అంబేద్కరిస్ట్ భావధారనీ విపులంగా చర్చించి, రెంటి సమ్మేళనం కావాలని "దళిత విముక్తి" అనే సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించారు. మార్క్సిస్టు నేపథ్యం అంగీకరించిన దళిత మార్క్సిస్టు మేధావులు, అన్ని కులాలలోనూ పేదలున్నారు కాబట్టి, మార్క్సిస్టు పోరాటాల్ని సమర్థిస్తూ, దళితవాదం సాగాలని కోరారు. కేవలం దళితవాదులు ముందు కుల సంబంధమైన పోరాటాలే మొదటిమెట్టు అని వాదించారు. ఏమైనా దళిత కవిత్వంలో దళితతత్వమే ప్రధానంగా ఉన్నా, ఆర్థిక సమస్యలు కూడా ప్రతిబింబించినాయి.. అయితే, అంతకు ముందు, ఇతర వస్తువుల మీద కవిత్వం రాస్తూ, మధ్యలో కొన్ని కవితలలో తమ వేదనలూ, ప్రతిఘటనలూ చెప్పిన దళితకవులు 1990 దాటిన తర్వాత నిబద్ధకవులయ్యారు. అంబేద్కరిస్టు నేపథ్యాన్ని విస్తృతపరుచుకుంటూ కవిత్వాన్ని కేంద్రీకృత వస్తువుతో రాయడం ప్రారంభించారు. అంతకుముందే వచనకవితా అభివ్యక్తి మార్గాల్లో నైపుణ్యం కల దళితకవులు, నిబద్ధతతో రాసిన కవిత్వం వస్తుశిల్పాల అపూర్వ సమ్మేళనమై అత్యున్నత స్థాయి దళితకవిత్వం వికసించడం మొదలయింది. ప్రజోద్యమమే కవిత్వోద్యమంగా మారిన తర్వాత, ఉద్యమ నేపథ్యంతో, అత్యుత్తమ కవిత్వపు విలువలతో, అసంఖ్యాకంగా వచ్చిన కవులు సాహితీపరులందర్నీ ఆశ్చర్యపరిచారు. దళిత కవిత్వోద్యమం తెలుగు వారు గర్వించదగిన స్థాయిలో కొనసాగడం జరిగింది.

1994, 95ల నుండి దళితవాదం గూర్చి అతి తీవ్రమైన చర్చలు ప్రారంభమైనాయి. వీటిలో మొదటగా చెప్పుకోవలసింది, అసలు దళితుడు అంటే ఎవరు? అనేది. దళితులంటే, అస్పృశ్యులు, వెనుకబడ్డ కులాల వారు, గిరిజనులు, మైనారిటీలు అందరూ అని బి.యస్. రాములు, జి. లక్ష్మీనరసయ్య మొదలైన వారు వాదించారు. అయితే సతీశ్ చందర్ మొదలైన వారు దళితులంటే తరతరాలుగా అన్ని కులాలకీ దూరంగా ఉంచబడిన అవర్ణులు మాత్రమే అని ఉద్ఘాటించారు. అస్పృశ్యులు కాక మిగిలిన వారిని "బహుజనులు" అని వ్యవహరించడం చేత, వారు దళితులు కావడం కుదరదని కొంతమంది అన్నారు. అగ్రవర్ణాల్ని ఎదుర్కోడానికి అవసరన రాజకీయ సంఘటనకి "దళిత బహుజన సమైక్యత"ను కాన్షీరామ్ మొదలైనవారు బలపరిచారు. కాని సాహిత్యం దగ్గరకి వచ్చేటప్పటికి, దళితకవిత్వానికి ఒక ప్రత్యేకమైన అస్తిత్వమిచ్చేది, "అస్పృశ్యత" మాత్రమే. తరతరాలుగా వస్తున్న కవిత్వమంతటికీ కేటాయింపుగా వస్తున్న కవిత్వోద్యమానికి ఒక ప్రత్యేక వస్తువుండాలి. దళితకవిత్వంలో అలాటి వస్తువు అస్పృశ్యత పునాదిగానే ఉంటుంది. ఇది సొంతముద్ర (identity) కు సంబంధించిన అంశం. ఈ విషయాన్ని గూర్చి ప్రసిద్ధ మహారాష్ట్ర దళితోద్యమ రచయిత Arjun Dangle యిలా అంటాడు

"Dalit literature is marked by revolt and negativism, since it is closely associated with the hopes for freedom of a group of people who, as untouchables, are victims of social, economic, and cultural inequality."

కాబట్టి కవిత్వోద్యమంగా దళితవాదంలోని

"దళితుడు", తరతరాలుగా అస్పృశ్యతావివక్షకు గురైన అవర్ణుడే ఔతున్నాడు.

మద్దూరి నగేష్‌బాబు మొదల్కెన వారు తెచ్చిన "నిశాని" సంకలనం 1995లో వచ్చిన తర్వాత "దళిత భాష" చర్చనీయాంశమైంది. "నిశాని" సంకలనంలో మద్దూరి నగేష్‌బాబు, పైడి తెరేష్‌బాబు, ఖాజా, వరదయ్య అనే నలుగురి కవితలు ఉన్నాయి. తమ శత్రువుని ఎదురుగా నిలబెట్టి తిడుతున్నట్టు రాసే ధోరణి ఈ సంకలనంలో ఉంటుంది. ఇలా తిట్టడంలోని తీవ్రతా, కోపావేశమూ, దిగంబర కవిత్వాన్ని తలపిస్తాయి. దిగంబర కవిత్వంలో మాదిరే, "అసభ్యత" కూడా ఈ కవితల్లో కనిపిస్తుంది. దీన్ని మొత్తంగా కొందరు వ్యతిరేకించారు. మొత్తంగా కొందరు సమర్థించారు. అసలు అసభ్యత అంటే ఏది, "దళితభాష" అనే దానికి నిర్వచనం ఏది అనే విషయాల మీద ఆసక్తికరమైన చర్చలు వార్తాపత్రికలలో జరిగాయి. ఈ అంశాన్ని గూర్చి ఈ వ్యాసకర్త అప్పట్లో రాసిన ఒక వ్యాసం (ఆంధ్రభూమి) "అసభ్యత" అనే అంశాన్ని విశ్లేషించింది. అసభ్యత అనే దృక్పథానికి ఎప్పుడూ పరిమితు లుంటాయి. కొన్ని సందర్భాల్లో అది అంగీకరించవచ్చు. కొన్ని సందర్భాల్లో అనుచితం కావొచ్చు. భావ తీవ్రతకి సహకరించినప్పుడూ, స్త్రీలను అవ మానించేది కానప్పుడూ, మధ్యలో పాఠకుణ్ణి భావధార లోంచి బయటకు తేనప్పుడూ, వాస్తవిక సన్నివేశాన్ని చెప్తున్నప్పుడూ అసభ్యతను అంగీకరించవచ్చు. అలా ఏ ప్రయోజనమూ లేనప్పుడు, రచయిత కోపాన్ని తెప్పిం చాలనుకున్నప్పుడు అసభ్యత నవ్వు తెప్పిస్తుంది. అత్యాచారానికి గురైన దళితస్త్రీ వేదనను గూర్చి మద్దూరి నగేష్‌బాబు

"మానం అంటే కడుక్కుని సరిపెట్టుకునే దాన్ని
ఈ సినిగిపోయిన రైక ఎక్కణ్ణుంచి తెచ్చుకునేదిరా"

అన్న మాటల్లో, ఒక తీవ్రవేదన సందర్భంలో పై మాటలు అసభ్యత కాకుండా పోతున్నాయి. కాని "నిశాని" కవులు కూడా ఒక సంచలనాత్మక స్థితిలో ఆ విధంగా రాసినా, తర్వాత వారి ధోరణి మారింది. "బ్రాహ్మణీయ భావజాలం" గలవారికి కోపం తెప్పించేట్టు రాయడం అనే ప్రధానలక్ష్యం కాకుండా, వస్తువైవిధ్యం, ఉద్యమనేపథ్యం, వాస్తవికత, వేదన, అభివ్యక్తి వారికి ప్రధానాంశాలైనాయి.

దళితభాష అనే ప్రత్యేకశైలి గురించి కొందరు వాదించారు. దళితకవులు రాసే కవితల్లో, జీవనవాస్తవికత గూర్చి చెప్తున్నప్పుడు, దళితులకి చెందిన పదాలు, పదబంధాలూ, నుడికారాలూ రావొచ్చు గాని ఒక ప్రత్యేకశైలి ఉంటుందని చెప్పడం సమగ్రత నివ్వదు. మొరటుపదాల్తో రాస్తేనే అది దళితభాష ఔతుందని కూడా చెప్పలేం. ఎందుకంటే మొరటుదనం గ్రామాల్లో చాలామంది దగ్గర ఉంటుంది. ఐతే, మొత్తం మీద చూసినప్పుడు, దళిత బహుజన కవిత్వం వల్ల అచ్చమైన తెలుగు పలుకుబడికీ, నుడికారానికీ వచ్చిన ప్రచారమూ, గౌరవమూ అపూర్వం. సులభంగా రాయడమనే దృష్టి అంతకుముందు అభ్యుదయ, విప్లవ కవిత్వాల్లోనూ ఉ ంది గాని, కావాలని ప్రయోగించే సంస్కృతపదాలూ, పదబంధాలూ, సమాసాలూ మొదల్కెన వాటిపట్ల వ్యతిరేకత గానీ, అట్టడుగు వర్గాల్లో సజీవంగా ఉన్న తెలుగుపలుకుబడిని ప్రత్యేకంగా స్ఫూర్తిమంతంగా ప్రయోగించాలనే పట్టుదల గానీ లేదు. దళితకవిత్వం అమోఘంగా ఈలోపాన్ని పూరించింది. దళితజీవన వాస్తవిక సందర్భాలూ, మట్టితనం లోంచి పట్టడమే ఇందుకు కారణం. కత్తి పద్మారావు "ఓనమాలు" కవితలో ఇలా రాస్తాడు

"మాయమ్మ
ఎండిమిరపగాయలు
కాల్సి కాల్సి పచ్చిపులుసు బువ్వ కలిపి
పెట్టినప్పుడు
మా అప్ప
కుండలో, గడ్డిమీద
కుడుములు ఆయిగిలబెట్టి
నానోట్లో కుక్కినప్పుడు

ఎర్రపచ్చడితో
పాలం బువ్వ కలిపి మాయమ్మ
దోసిట్లో పెట్టినప్పుడు
మా అయ్య
పిల్లిమిసర గుత్తి తెచ్చి
బిళ్ళంగోడు ఆడేనన్ను
కేకేసి యిచ్చినప్పుడు
మా జేటి తిరగల్లో కందులు ఇసిరి
ముడిపప్పు నానోట్లో పోసినప్పుడు
ఆకలికి అర్థం తెలియలేదు''

ఇలాంటి భాష మాత్రమే ఈకవులు ప్రతిసందర్భంలో ప్రయోగించారని కాని, భావాన్ని బట్టి సంస్కృతపదాల్ని ఉపయోగించలేదని గాని చెప్పడం నా అభిప్రాయం కాదు. కాని, దళితబహుజనకవిత్వం వల్ల, తెలుగుపలుకుబడికి అంతకుమందు లేని ప్రాచుర్యం వచ్చిందనీ, ఇది దళితకవిత్వపు కొత్త ఉపలబ్ధులలో (achievements) ఒకటి అనీ చెప్పడమే నా ఉద్దేశం.

ముస్లిములు దళితులౌతారా అన్న ఒక చర్చ కూడా 1995లో బాగా సాగింది. మొదట్లో ముస్లిమ్ కవులు దళితులతో కలిసి కవిత్వం రాసి, పుస్తకాల సంకలనాలు వెలువరించారు. ఆకాలంలో కొప్పర్తి ''చారిత్రక పీడనలోంచి, అణచివేతలోంచి వచ్చింది దళితకవిత్వం కాగా, మ్కొనారిటీ కవిత్వం అట్లా కాదు.... స్వాతంత్ర్యం తర్వాత సంఖ్యాపరంగా బాగా తగ్గిపోయిన ముస్లిములు హిందూమతతత్వ ఫలితంగా అభద్రతకు లోనయ్యారు. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ హిందూమతతత్వం ప్రధానభూమికను నిర్వహించినంత మాత్రాన, అందుకు వ్యతిరేకంగా వచ్చిన దళితమ్కొనారిటీ కవిత్వాలు ఒకటి కావు''.

కాలం ఈమాటనే ఋజువు చేసింది. తర్వాత ముస్లిమ్ వాదకవులుగా వేర్పడి, ముస్లింలు ''జలజలా'' అనే సంకలనం వేశారు.

అభ్యుదయ విప్లవ కవిత్వాలకి మార్క్సిస్టు తత్వం నేపథ్యంగా ఉన్నట్లే, దళితకవిత్వానికి అంబేద్కరిజమే నేపథ్యంగా ఉంది. జీవనవాస్తవికతని విస్తృతంగా లోతుగా చెప్పడంతో పాటు, ఒక నిర్దిష్ట భావధార ఉండడం చేత సమగ్రత, సంఘర్షణ, పరిష్కారదృక్పథం, చారిత్రికత, సాంస్కృతికదృష్టి మొదల్కెన ఎన్నో లక్షణాలు ఈకవిత్వాన్ని పటిష్టం చేశాయి.

దళిత కవిత్వంలో స్పష్టంగా రెండు దశలున్నాయి. మొదటిదశ, పౌరాణిక చారిత్రక కథల్లో అగ్రవర్ణాల దుర్మార్గానికి గురయిన పాత్రల్ని ప్రతీకలుగా చేసుకుని, తమ ఆగ్రహాన్నీ, ప్రతిఘటననీ వ్యక్తీకరించిన దశ. శంబుకుడు, ఏకలవ్యుడు, బలి మొదల్కెన ప్రతీకలు ఎన్నో కవిత్వాల్లో వచ్చిన్కె. అలాగే పౌరాణిక సంఘటనలు కూడా ప్రతీకాత్మకంగా వినియోగించబడిన్కె. ''ఒళ్ళు కడుక్కుందాం రండి'' కవితలో చిన్ని రాసిన మాటలు

''రెల్లు పాదలో పడ్డ వీర్యం నుండి పుట్టిందెవరు?
ఎవడో మాయగాడిచ్చిన కుండనుండి మొలకెత్తిం దెవరు?
గుర్రం రతినుండి ఊడిపడ్డదెవరు?
నాపుట్టుక అసహ్యమ్కొనప్పుడు
పరమ అసహ్యమ్కొన పుట్టుకనుండి
కళ్ళు తెరిచిన దేవుళ్ళను కొలుస్తున్న
మీపుట్టుకనే నేను ఇప్పుడు సవాల్ చేస్తున్నాను.''

తరతరాలుగా తలవంచబడి నిలుచున్న దళితుడు, ఒక్కసారి ధైర్యంగా ప్రశ్నించగల సమష్టిశక్తి సమకూరినప్పుడు, తనకు జరిగిన అవమానాలన్నిటినీ తలచి ఆవేదన పడి, తీవ్రమ్కొన కోపం పొంది రాస్తున్నప్పుడు ఈవిధంగా అనడంలో ఆశ్చర్యం లేదు. ఇలాటి కోపతీవ్రత, ప్రతీకాత్మకత మొదటి రెండు మూడేళ్ళలో ఎక్కువగా ఉన్న్కె. ఆ తర్వాతి దశలో వాస్తవికత, అభివ్యక్తి ప్రధానమ్కొన ధోరణి వచ్చింది. అంటే మొదటి దశలో వాస్తవికత లేదనీ, రెండో దశలో అలాటి ప్రతీకలు అసలు

లేవనీ నా అభిప్రాయం కాదు. రెండు దశల్లోనూ స్పష్టంగా కనిపించే రీతుల గూర్చి ఈ విశ్లేషణ.దళితకవిత్వంలోని వస్తువైవిధ్యమూ, అభివ్యక్తిరీతుల్ని గూర్చి వివరించవలసి ఉంది.

దళితకవిత్వం ప్రధానంగా ఆత్మగౌరవానికి సంబంధించిన ప్రశ్నగా రూపొందింది. "నీసంస్కృతి హీనమ్మెంది, నీజాతి నీచమ్మెంది" అని తరతరాలుగా అనిపించుకున్న దళితుని ప్రతిఘటనలో మొదటి దశ "నాసంస్కృతి గొప్పది, నాచరిత్ర గొప్పది" అని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించడం, అంతేగాక "నీసంస్కృతి ఏం గొప్పది?" అని ప్రశ్నించడం ఇది దళితకవిత్వంలోని ప్రధాన ధోరణుల్లో ఒకటి. సతీష్‌చందర్ "అక్షరశయ్య" కవితలో ఇలా అంటాడు

"నాలుగు పదాలు కలవకూడదన్నదే నిన్నటి వ్యాకరణం
నాలుకనంటిన ఏ అయిదో పదమూ గ్రాంధికం కాలేదు
క్రియల్ని కిందికి తొక్కిన మనువే మహాకవయ్యాడు
భాషా అప్రవీణులారా! ఉలిక్కిపడకండి
మీరు కుదిర్చిన ఛందోబద్ధ కాపురాల్ని కాలదన్ని
పదాలు లేచిపోతున్నాయి
వర్ణక్రమాలు లేని వాడలకు వలసపోతున్నాయి"

చరిత్రలో అణచబడ్డ దళితకవి ఆత్మవిశ్వాసం పై పంక్తుల్లో ఉంది. "నను వరించిన శారద లేచిపోవునే" అన్న మహాకవి జాషువా మాటల్లోని తత్వానికి, యిది ఆధునిక అభివ్యక్తి రూపం.

"దళితధ్వని"లో నాగప్పగారి సుందర్‌రాజు

"అడుగులు నేర్చుకుంటున్న వారసుణ్ణి
ఓర్పునేర్పుతో అస్త్రవిద్యా వైద్యుణ్ణి
గురుదేవుడు పరుగుపరుగున వచ్చి పాదాలపై వాలి
భిక్షాన్ దేహి గురుదక్షిణ అడిగితే
భవిష్యత్తును బంధించి నాబొటనవేలుతో
మహాభారతానికి నాందీవాక్యం రాశాను
అయినా నాలుగు శతాబ్దాల నానగరం
నన్ను గుర్తించలేదు"

ఆత్మగౌరవప్రకటనలో మరో ముఖ్యమైన కోణం, తమకు సంబంధించిన వాటిని ఉదాత్తమైనవిగా చెప్పడం. తమ అనుభూతుల అస్తిత్వాన్ని ఎవరూ తక్కువగా చూడడానికి వీలులేదని నిరూపించడం. తమ అస్తిత్వాన్ని తాము గాఢంగా ప్రేమించడం. ఎండ్లూరి సుధాకర్ ఇలా అంటాడు

"సంకటి ముద్దల్లోకి
ఎండుతునకల్ని నంజుకుంటూ
వార్చిన గంజిలోకి మిరపకాయల్ని కొరుక్కుంటూ
అంబలిజుర్రిన కమ్మదనం
ఏ అమృతాని కొస్తుందిరా!"

ప్రబంధనాయిక కన్న దళితస్త్రీ అందమైంది అని సుధాకర్ రాసిన కవిత ఆత్మగౌరవప్రకటనలో అత్యుదాత్త స్థాయిలోది.

"ఓ నా చండాలికా
నీ వెండికడియాల కాళ్ళ ముందు
వెయ్యేళ్ళ కావ్యనాయికలు వెలవెలబోతున్నారు
అలంకారశాస్త్రాలన్నీ
నీ పాటిమట్టి మెరుపు ముందు బలాదూర్
నా నల్లపిట్టా
నిన్ను వరాంగివనీ, కృశాంగివనీ
లతాంగివనీ మభ్యపెట్టను.....
నీనెత్తి మీది యినుపగమేళం
విశ్వసుందరి కిరీటాన్ని సైతం వెక్కిరిస్తోంది...
నా నల్ల కావ్యానికి నిన్ను
నాయికగా ప్రకటిస్తున్నాను"

ఆత్మ గౌరవ, విశ్వాస ప్రకటనలో దళితకవిత్వం వందలాది కోణాల్ని (dimensions) ఆవిష్కరించింది.

దళితులకు జరిగిన అన్యాయాల్నీ అవమానాల్నీ పేర్కొని, వాటికి ప్రతిస్పందన ఎన్నో విధాలుగా చెప్పడం

దళితకవిత్వంలో ప్రబలమ్మెన ధోరణి. 1981లోనే విప్లవ కవిగా, విప్లవకారుడుగా ఉన్న సలంద్ర ఈధోరణికి మొదటికవి. "దళితమానిఫెస్టో" అనే కవితని రాశాడు.

"నన్ను
నీ దేవుడి గుళ్ళోకి రావద్దన్నావు
సరే, ఎలాగయితేనేం
నేను నాస్తికుణ్ణవడమే బాగయింది
నన్నుజి
చదువుకోవద్దన్నావ్‌జి
చదివితే నాలుక కోసెయ్యమన్నావ్
వింటే చెవుల్లో
వేడివేడి సీసపులోహం పోయమన్నావ్
సరే, ఎలాగయితేనేం
నువ్వెంతటి మూరు?డివో
నీవెంతటి విశాలహృదయుడివో
నాకు తెలిసిపోవడమే బాగయింది
నన్నుజి
చచ్చిన శవాల దహన సంస్కారాలే చూసుకోమన్నావు
సరే, ఎలాగయితేనేం
మీ ప్రాణాలని కూడా
ఎలా పాతేయాలో
నాకు తెలవడమే బాగయింది"

యిలా సాగుతుంది కవిత. తమకు ఎలాటి అవమానం జరిగినా, తమపై ఏహింస జరిగినా వెంటనే స్పందించి, తమ పోరాటస్వరాన్ని తీవ్రంగా వినిపించడం దళితకవిత్వంలో చూడగలం. "ఐ" అనే కవి, చుండూరులో జరిగిన దళితహింసకు ప్రతిస్పందిస్తూ "మరోసారి" అనే కవిత రాశాడు. అందులోంచి ఈ పంక్తులు

"హతుడి నిశ్చల నేత్రాలను చూడు
స్తంభించిన విశేషస్వప్నాలు కనిపిస్తాయి
స్వప్నాలు ప్రవహిస్తాయి
బిగిసిన పిడికిళ్ళను చూడు
శత్రుస్థావర రహస్యాలు లభిస్తాయి
రక్తానికి తన స్వభాష తెలుసు
అది తిరుగుబాటు
ఆకాశంలో అనివార్య సూర్యోదయం".

దళిత జీవితంలోని విషాద వాస్తవికతలు దళిత కవిత్వంలో ఆవిష్కరించబడినాయి. దళితకవిత్వంలోని సాంస్కృతికపార్శ్వం ఈలాటి కవిత్వంతో వెలుగుతోంది. ఈకవిత్వంతో దళితజీవితంలోని వాస్తవాలు తెలియగానే, తెలియని వారి మనస్సులో ఉన్నతసంస్కారం కలుగు తుంది. "వెలివాడ"ని మద్దూరి నగేష్‌బాబు ఇలా వర్ణిస్తాడు

"చాలాకాలం తర్వాత
అమ్మని చూద్దామని బయల్దేరా
బస్సు దిగేసరికి బాగా పొద్దుపోయింది
శీతకాలపు జిగటవెన్నెల
పూరిగుడిశెలపై కప్పిన మృతవస్త్రంలా ఉంది....
దూరంగా ఎక్కడో ఒక కుక్క
హృదయవిదారకంగా ఏడుస్తూ
నడుస్తుంటే నా నేల
బురదచేతుల్తో నన్ను చుట్టేసింది"

ఇలా దళితజీవితంలోని వాస్తవికవిషాదం ఎన్నో కవితల్లో హృదయాన్ని కదిలిస్తుంది.

దళిత జీవితంలోని సౌందర్యాన్ని కూడా కొందరు కవులు వినిపిస్తున్నారు. అందులో కత్తి పద్మారావుని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

"బడింటికాడ
గనిసిగడ్డల బండి దిగిందని
ఎడగారోడు గోలపెడితే
బానలో నూకలు చెంగున గట్టి
బేరమాడి బేరమాడి
ఈసెడు కొని
కొసరుగడ్డ మునిపంట కొరికి
పిల్లోడికి నోటికందించినపుడు

పళ్ళకొసల్లోజి
పూసిందొక నవ్వుపువ్వు''

దళితభాషనీ, దళితజీవితాన్నీ ఎక్కువగా రికార్డు చేస్తుంది కత్తి పద్మారావు కవిత్వం.

దళిత కవిత్వంలో స్త్రీవేదనల్నీ, ప్రతిఘటననీ వినిపించడం దళితకవితాపరిణామంలో ఒక విశేషం. ''చల్లపల్లి స్వరూపరాణి'' కవితలు ఈమార్గంలో ఉత్తమమైన వాటిని అందించినై.

''ఇంట్లో పురుషాహంకారం
ఒక చెంప ఛెళ్ళుమనిపిస్తే
వీధిలో కులాధిపత్యం
రెండో చెంప పగలగొడుతుంది''

ఇంకా జి. విజయలక్ష్మి, జె. ఇందిర మొదలైన వాళ్ళు దళిత స్త్రీల జీవనప్రతిబింబంగా కవితలు రాస్తున్నారు.

దళిత కవిత్వం రానురాను, కేవలం కులసమస్యనే కాకుండా, ఇతరసమస్యల్ని కూడా స్వీకరిస్తోంది. కుల సమస్య ఒక పరిధి కాగా, ఇతర సమస్యలు సాధారణమైన పరిధి. ఆర్థికాదివిషయాల్లో దళితుని జీవితం, మిగిలిన వర్ణాల పేదవారి జీవితంతో సమానం గానే ఉంటుంది. అలాగే సామ్రాజ్యవాద దురాక్రమణ వల్ల, ప్రభుత్వ వక్రవిధానాల వల్ల పొందే బాధలు అందరికీ ఒకే విధంగా ఉంటై. అందువల్ల దళితకవులు సాధారణసమస్యల్ని కూడా స్వీకరించడం కవితావస్తువుని విస్తృతం చేస్తుంది. ప్రగతిమార్గాన్ని విశాలం చేస్తుంది.

దళిత కవిత్వం ఒక చారిత్రిక కవితోద్యమం. అగ్రవర్ణ అహంకారంతో పోరాటం తాత్కాలిక అవసరమైనా, కులనిర్మూలన దాని అంతిమలక్ష్యం. సమగ్రమైన తాత్విక నేపథ్యం, సమకాలీన సమస్యాచిత్రణ, వస్తువైవిధ్యం, దళితజీవన వాస్తవికతల్తో పాటు, అత్యుత్తమ కవితాభివ్యక్తి దళితకవిత్వాన్ని మహోజ్జ్వలం చేస్తోంది. ప్రతిఘటన వల్ల రాజకీయ పార్శ్వమూ, వాస్తవికత వల్ల సాంస్కృతిక పార్శ్వమూ, కవితాభివ్యక్తి వల్ల కళాపార్శ్వమూ, నిండుగా పండించుకుంటున్న దళితవాదం తెలుగుకవిత్వానికి గర్వకారణమైన ఒక ఉద్యమం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సర్కారు గడ్డి నవల – దళిత చైతన్యం

– దొనరి కృపారావు, తెలుగు అధ్యాపకులు, ఆంధ్ర లయోలా కాలేజి

ఆచార్య కొలకలూరు ఇనాకు గారి కలం నుండి జాలువారిన సర్కార్ గట్టి నవల 1980వ సంవత్సరంలో అనంతపురం జిల్లాలో తీవ్ర కరువు సంభవించడం వలన పశుగ్రాసనం లభించక, రైతుల దయనీయమైన కష్టాలు కడగండ్లు వాటిలో ప్రత్యేకించి దళిత రైతు బ్రతుకు పోరాటం గురించి ఈ నవలలో చిత్రీకరించారు.

కదా సారాంశం :

ప్రభుత్వం పశువుల కోసం పంపిణీ చేసే గడ్డి అందించడంలో అవకతవకలు జరగడం, దళితులు లాగే దళిత పశువులు కూడా వివక్షకు గురి కావడం చూసి తట్టుకోలేని దళిత రైతు ఆరాటాన్ని, బ్రతుకు పోరాటాన్ని చాటుతుంది. ఈ సర్కారు గడ్డి నవల. తమ హక్కుల రక్షించుకోవడంలో దళిత రైతు కుటుంబం సాగించిన బ్రతుకు పోరాటం, ఆరాటం దానిలో భాగమై వాళ్లు సాధించి సమన్వయించిన శక్తి యుక్తులు, శారీరిక శ్రమ విజయంతో ఆర్థిక పీడనను అధిగమించిన తీరు ఈ నవలలో మనం గ్రహించగలుగుతాం.

నేలను నమ్ముకుని నేల కోసం ప్రాణాలర్పించే రైతు అవస్థలు ప్రతిబింబించారు రచయిత. రైతు ప్రకృతి శాపానికి, ప్రభుత్వ విధానాలకు బలైపోతున్న వైనం ప్రదర్శించారు. కరువు మానవ జీవితాన్ని ఎలాంటి సంక్షోభంలో నెట్టివేస్తుందో చూడవచ్చు. కరువు వల్ల పశువుల్ని పోషించుకోలేక కసాయ శాలకు తోలవలసి వస్తున్న దుర్భర స్థితికి ప్రతిఫలమిది. మనిషికి, పశువుకి మధ్య ఉండే దృఢమైన అనుబంధాన్ని బలంగా చిత్రిస్తున్నది ఈ నవల కథాపరంగా కాక, అనుభూతి కథనంగా సాగిన ఈ నవల విసుకు విరామానికి ఆస్కారం లేదు. వర్ణన అవసరాన్ని సూచన విలువను గుర్తించి కథ చెప్పడం చేత కథనంలో సమతూల్యత ఏర్పడింది. రైతులు బ్రతకడానికి కోసం వారు సాగించే జీవిత పోరాటం ఈ నవలస్పష్టంగా చిత్రీకరణ చేశారు.

రైతుల దుస్థితి :

భారతీయ సమాజంలో తరతరాలుగా రైతులు వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. దానికి వర్షమే ఆధారం: వానలు కురిస్తేనే వసుంధర, వానలు ఉంటేనే పంటలు లేకుంటే మంటలు, వర్షాలు బాగా పడితే రైతుకు తిండి లేదంటే పస్తులే. అస్పృశ్యతకు అణిచివేతకు గురై కులం పేరట హీన చూపుకు గురై సమాజంలో ఉంటూనే ప్రధాన జీవన స్రవంతికి దూరంగా చేయబడిన వారు, విద్యనభ్యసించి అర్హత లేక ఊరికి దూరంగా వెలి వేయబడిన వాడల్లో కులవృత్తులు చేసుకుంటూ, ఆర్థికపరమైన అణిచివేతకు, గురై కులం పేరట హీనతకు గురై సమాజంలో ఉంటూనే ప్రధాన జీవన స్రవంతికి దూరంగా త్రో సివేతకు గురైన వారు, విద్యనభ్యసించే అర్హత లేక ఊరికి దూరంగా వెలి చేత వెలి వాడల్లో కులవృత్తులు చేసుకుంటూ ఆర్థికపరమైన అణచివేత శ్రమ దోపిడీకి గురైన వారు దళితులు. ఇలాంటి దళిత రైతులు పరిస్థితి మరి దారుణంగా ఉంటుంది. దళిత రైతులు సమాజ పరిణామ క్రమంలో వారికి జరిగిన అన్యాయాలను అవమానాలను సమాజానికి సాహిత్యం ద్వారా చెప్పుకున్నారు.

కరువు వల్ల వ్యవసాయం శిథిలం కావడం రైతుల కష్టాలు, పశువుల మేత లేకపోవడం వల్ల అవి ఎలా కృషించి పోయాయి సర్కారు గడ్డి నవలలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గ్రామీణ దళిత రైతుల జీవితాల్లోని ఆందోళనకరమైన జీవితాలను ఈ నవలలో చిత్రీకరించారు. వ్యవసాయక సమస్యలు దళిత రైతుల కష్టాలు హృదయ విధారకమైనవి.

ముసలి పశువులను అమ్మితే కొంతైనా డబ్బు వస్తుంది కానీ, వృద్ధాప్యం చచ్చాక తన వలన ఎలాంటి ఉపయోగం లేదని తనలోనే తాను మదన పడతాడు రాముడు అనే పాత్ర ఈ నవలలో. పశువుల నమ్మితే ఎవరైనా కొంటారు తనను అమ్మితే ఎవరూ కొనరు ఈ మాటలు వింటే హృదయం ద్రవించక మానదు. పంట ఇచ్చిన పొలాలు బిల్లు కావడం పంట ఇంటికి తెచ్చే పశువుల గడ్డి లేక, దిక్కులేని చావు చావడం ప్రాణం అన్నది ఎవరికైనా ఒక్కటే అది మనిషి పశువు అయినా, ఎంతటి హృదయ విధారకమైన మనోవేదనను దళితరైతు అనుభవిస్తున్నాడు రచయిత వర్ణించిన తీరు ఎంతో ప్రశంసనీయం.

అంటరానితనం: రైతు పడే కష్టాలు ఒక ఎత్తైతే ఆ దళిత రైతుకు అంటరానితనం మరొక ఎత్తు అంటరాని తనం అమానుషం ఇప్పుడు సమాజంలో దళిత రైతు పశువుల కూడా వివక్షకు గురి కావడం, దళితులే కాకుండా వారి పశువుల విషయంలో కూడా వివక్ష చూపడంలో ఆంతర్యం ఏమిటి? ఊరి పశువులు, గౌరీ పశువులంటే వేరు చేయడం దళిత రైతు పొందే అస్పృశ్యత అవమానాన్ని పశువులకు కూడా ఎదుర్కొనడం నిజంగా అమానుషం: అంటరాని వసంతం నవలలోపేజి నెంబర్ 197లో అంటరానితనం ఈ దేశంలో

పీల్చే గాలికి కులం ఉంది
తాగే నీటికి కులం ఉంది
పారేపంట కాలువకి, పండే భూమికి కులం ఉంది.
బడికి, గుడికి, రచ్చబండకి కులం ఉంది.
తినే తిండికి ఉండే ఇంటికి కట్టే బట్టకి కులం ఉంది
మాట్లాడే మాటకి కులం ఉంది
సాహిత్యానికి సంస్కృతికి కులం ఉంది.
శవానికి స్మశాన వాటికకు కులముంది.
హైందవదేవుడికి కులం ఉంది,
దెయ్యానికి కులం ఉంది.; అన్నట్లు అంటరానితనం పశువులకు అంటగట్టడం ఊరి వాళ్ళ దుర్మార్గాన్ని చాటుతుంది.

వర్ణ వ్యవస్థ బలంగా ఉన్న ఈ భారత దేశంలో రాష్ట్రంలో అందులో అనంతపురం జిల్లా వర్ణ వ్యవస్థ పశువులకు కూడా సంక్రమిస్తుంది. అగ్రకుల పశువులు సంపన్నుల పశువుల మాదిరిగానే అధమ కులాల పశువులు పేదల పశువులు వేరువేరుగా ఉన్నాయి, ప్రాణులన్నిటిలో ఒకే రకమైన ప్రాణం ఉంటుంది. మరెందుకు వివక్ష. అది అగ్రవర్ణ పశువైనా, అధమ వర్ణపశువైన వాటి ఆకలి మేత ఒకటేనన్న విషయం ఎందుకు గుర్తించరు? రైతుకు వర్షాలు లేక కరువు ఎక్కువై తినడానికి తిండి లేక పశువులను కాపాడలేక వాటికి అంటరాని తనాన్ని అంటగట్టడం ఎంత బాధాకరమో రచయిత గారు తెలిపారు. జాషువా గారు స్మశాన వాటికలో చెప్పినట్లు" స్మశాన వాటికలో అస్పృశ్యతకుతావు లేదు పులితో పాటు మేకను సైతం ప్రక్కన వరుండబెట్టి జోకుడుతుంది. ఇది అభేద భావాన్ని ప్రవర్తిస్తుంది ఇక్కడ ధర్మము సంచరిస్తుంది. అన్నట్లు సజీవుల దేశంలో మరి ముఖ్యంగా భారతీయ సమాజంలో ఈ ధర్మం నాలుగు పాదాలుగా వర్ధిల్లాలి.

ఈ నవలలో రాముడికి నాలుగు గోడ్లు సేద్యం ఇది రాముడి ఆర్థిక స్థితి ఎప్పుడూ పాడిపంటలతో కళ కళలు ఆడాల్సిన రాముడు ఇల్లు కరువు వల్ల చిన్నాభిన్న మయింది. కనీసం మనుషులకైనా కూలి పనులకు వెళితే డబ్బు వస్తుంది. కానీ పశువులకు అసలు మేత లేని పరిస్థితి ఎదురైంది.

ఆర్థిక పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న రైతు ప్రాణం ఉన్న పశువులను కూడా చంపడానికి సిద్ధపడతాడు ఆర్థిక పరిస్థితి మనిషిని ఎంతకైనా దిగజార్చుతోందని స్పష్టంగా తెలుస్తుంది.వ్యవసాయం చేసుకునే రైతులు కూలీలు కరువు వల్ల పట్టణాలకు పోయి కూలి పనులు చేసుకోవడం మొదలు పెడతారు వారిలో కొందరు రైల్వే గూడ్స్ దగ్గర పనిచేసే కూలీలుగా పని చేస్తూ ముఠామేస్త్రి పాత్రను పోషిస్తూ దళిత బహుజన ఐక్యతను చాటి చెబుతున్నట్లుగా ఈ నవలలో ప్రధానంగా చిత్రించారు.

ఆధార గ్రంధాలు :

1 సర్కారు గడ్డి నవల, ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు

2 కులం పునాదులు, డాక్టర్ కత్తి పద్మారావు గారు

3 అంటరాని వసంతం, జి కళ్యాణ్ రావు గారు

4 స్మశాన వాటిక ఖండిక, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా గారు

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"సొరాజ్జెం" నవల – రాజ్యాంగ నైతికత, ఆర్థిక అసమానత

- బోరుగడ్డ సుభ్భయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, కామర్స్ డిపార్ట్మెంట్,
ఆంధ్ర యూనివర్శిటీ, విశాఖపట్నం.

- ఐతర్తి రమేష్ కృష్ణ
లెక్చరర్ ఇన్ కామర్స్,డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్,
ప్రభుత్వ కళాశాల స్వయంప్రతిపత్తి, రాజమండ్రి.

అక్కినేని కుటుంబరావు రాసిన "సొరాజ్జెం" నవల గ్రామీణ కుల వ్యవస్థలోని రాక్షసత్వాన్ని విప్పిచెప్పి మనలో రాజ్యాంగ నైతికతను పెంపొందించగల నవల. ఆ నవలను రాజ్యాంగ నైతికతను ప్రాతిపదికగా తీసుకుని అంచనా వేయటమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం. "భారతీయ గ్రామం రిపబ్లికన్ భావనకు పూర్తిగా విరుద్ధ మైంది. ఒక వేళ భారతీయ గ్రామమే రిపబ్లిక్ అయితే ఆ రిపబ్లిక్ స్పృశ్యుల చేత, స్పృశ్యుల యొక్క, స్పృశ్యుల కొరకు ఉన్న గ్రామం అవుతుంది. అందులో ప్రజా స్వామ్యానికి సోదరత్వానికి, సమానత్వా నికీ, స్వేచ్ఛకూ చోటు లేదు" (అంబేద్కర్ 2002, :330 కోటెడ్ కల్పన కన్నాబిరాన్, టూల్స్ఆఫ్ జస్టిన్, పుట 234) అన్న అంబేద్కర్ మాటలను ఒక గ్రామంలోని దళిత జీవిత వాస్తవ కథనంతో పోల్చి చూడటం కూడా ఈ వ్యాస రచన ఉద్దేశం.

"సొరాజ్జెం" నవల కృష్ణాజిల్లాలోని చౌటపల్లి గ్రామంలో జిరిగిన కథ. కథలో అన్ని సంఘటనలూ ఆ గ్రామంలో జరగలేదని, చుట్టు పక్కల గ్రామాలలో జరిగిన ఒకటి రెండు సంఘటనలను ఈ గ్రామంలో జరిగినట్లు రాశానని రచయిత చెప్పారు. చౌటపల్లిలో మాలపల్లిలోని ఎంకడి కుటుంబం చుట్టూ ఈ కథ నడుస్తుంది. ఎంకడు, భార్య పద్దాలు, కొడుకు తిరపతి, పద్దాలుకి ఎంకడికి స్వతంత్ర దినం రోజున పుట్టి, ఆ ఊరి కాంగ్రెస్ పెద్ద బ్రహ్మంగారి చేత స్వరాజ్యమని నామకరణం చేయించుకుని సొరాజ్జెంగా అందరిచేతా పిలవబడ్డ సొరాజ్జెం ఈ నవలకు నాయిక. సొరాజ్జెం 1947 ఆగస్టు 15 న పుట్టింది. 16 సంవత్సరాలు ఆ ఊళ్ళో పెరిగింది. ఆ పదహారు సంవత్సరాలలో - స్వతంత్ర దేశంలోని తొలి పదహారు సంవత్సరాలలో రాజ్యాంగం రాయబడిన మొదటి 13 సంవత్సరాలలో ఒక గ్రామంలోని మాలపల్లి ప్రజల జీవితం ఈ నవల కథా వస్తువు. అదేకాదు స్వతంత్రం వచ్చాక దానిని తాము బాగుపడటానికి తమ ఆధిపత్యాన్ని గ్రామాలలో స్థిర పరుచుకోటానికి, ఆ ఊరి అగ్రవర్ణ భూస్వాములు, రైతులు ఎట్లా ప్రయత్నించారన్నది కూడా ఈ నవలకు కథా వస్తువే. ఆధిపత్యమూ, అణచివేత, బానిసత్వం, పరాధీనత ఈ రెండు నవలలోని ప్రధాన ఇతి వృత్తాలు. రెండూ ఒకదానితో ఒకటి సంబంధం కలవి. ఆ సంబంధం ఒకప్పుడు కరడుగట్టిన సంబంధం. స్వతంత్రం, రాజ్యాంగం కలిసి ఆ సంబంధాన్ని కదిలించాయి. కుదిపాయి. ఆ కుదుపు ఆధిపత్యాన్ని భయపెట్టేంత పెద్దది కాదు. బానిసత్వాన్ని పోగొట్టేంత విప్లవాత్మకమైనదీ కాదు. స్వతంత్రం, రాజ్యాంగం తొలి సంవత్సరాలలో దళితులకు ఇవ్వవలసిన ఆత్మ గౌరవాన్ని, ప్రతిఘటనా స్వరాన్ని ఇవ్వలేక పోయామని, అగ్రవర్ణాలు తమ ఆధిపత్యాలను మరింత స్థిరపరుచుకునేందుకు మార్గా లను వెతుకుతూ, సాధనాలను సమకూర్చుకునేందుకు సర్వ ప్రయత్నాలూ చేస్తున్నారనీ "సొరాజ్జెం' నవల చదివినపుడు మనకు అర్థమవుతుంది. కుటుంబరావు నవలా రచనలో సంప్రదాయ మార్గాన్ని వదిలివేశాడు. ఆయన నవలల్లో కథంటే జీవిత చిత్రణకు ప్రాధాన్యత ఉంటుంది. ప్లాట్ కూడా సంప్రదాయక పద్ధతుల్లో నడవదు. గ్రామంలోని అనేక జీవితాలు, గ్రామ నైసర్గికత నుంచి, మానవ సంబంధాల వరకూ ప్రతిదీ వివరంగా, సూక్ష్మంగా, క్లుప్తంగా పాఠకులకు పరిచయమవుతాయి.

"సొరాజ్జెం" నవల మన దేశ స్వాతంత్ర్యం వచ్చిన

రోజే మొదలవుతుంది. అది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. రచయిత స్వతంత్రం ఎలా ఉండబోతోందో ఎలా ఉంటుందని అప్పటి ప్రజలు ముఖ్యంగా మాలపల్లిలోని ప్రజలు ఏమనుకున్నారో తరువాతి రోజుల్లో దేశంలో ఏ మార్పులు ఎవరి మేలు కోసం జరుగుతాయో సూచిస్తూ స్వతంత్రం వచ్చిన రోజున, ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఆగష్టు 14 సాయంత్రం - ఢిల్లీలో దేశీయ, సామ్రాజ్యవాద నాయకులందరూ భారతదేశ స్వతంత్రానికి సంకేతాలను, సారాంశాన్ని సమకూరుస్తున్న సమయంలో, హిందు ముస్లింల మధ్య ఘర్షణలలో రక్తం ప్రవహిస్తూన్న క్షణాలలో భయంకరమైన హింస దేశ ప్రజల మనసుల్లో మర్చిపోలేకుండా ముద్రవేసు కుంటున్న సమయంలో, చీకట్లు ముసురుకుంటూ, మబ్బులు కమ్ముకుంటూ ఉన్న వాతావ రణంలో నవల చాలా సింబాలిక్‌గా మొదలైంది. తల్లి పురుటి నొప్పులు పడి, సరైన వైద్య సౌకర్యాలు కాదు గదా, కాస్త పరిశుభ్రమైన నేల కూడా లేని చోట "సారాజ్జెం" పుట్టింది. పుట్టింది స్వరాజ్యమని తల్లిదండ్రులు గానీ, మాలపల్లిలోని ఏ ఒక్కరు గానీ అనుకోలేదు. ఆగష్టు 15 ఉదయాన్నే మాలపల్లి సందర్శిం చాల్సిన తన రాజకీయ అవసరాన్ని గుర్తించిన, ఆ ఊరి భూస్వామి, స్వతంత్ర భారత నిర్మాతగా ఎదగాలనే కాంక్ష ఉన్న బ్రహ్మంగారు 'సారాజ్జెం' వచ్చిందని, ఎంకడి కూతురికి ఆ పేరు పెట్టాడు. ఎంకడికి కూతురికి పేరు పెట్టుకునే అధికారం కూడా లేకుండా పోయింది.

తర్వాత బ్రహ్మంగారు స్వతంత్ర దిన సందేశాన్ని మాలపల్లిలో వినిపించాడు. "మనమంతా అన్నదమ్ములా కలిసిమెలిసుండాలి. అన్నిక మాటన్నా, ఒక దెబ్బేసినా తమ్ముడు ఎదురు తిరుగుతాడా? తిరగడు" అంటూ అసలు సారాంశాన్ని చాలా తేలిక మాటల్లో చెబుతాడు. కుటుంబ అధికార చట్రాన్ని అమలు చేయందే, స్వతంత్ర దేశంలో అసమానత్వాన్ని అణిచివేతని భరించలేని కులాల తిరుగుబాట్లని అణిచివేయటం కుదరదని బ్రహ్మం సూచిస్తున్నాడు. అన్నదమ్ముల్లా ప్రేమగా ఉండాలని కాదు ఆయన చెప్పేది. అన్నిక దెబ్బేసినా తిరగబడని తమ్ముడు కావాలి. ప్రశ్నించే వీలు లేకుండా వేల సంవత్సరాలుగా కుటుంబం కొనసాగిస్తున్న అధికార సంబంధాలను రాజ్యం బలపరుస్తుంది. ఆ విలువలను తన మనుగడకు వాడుకుంటుంది. స్వతంత్రం వచ్చిన తొలిరోజునే పితృస్వామ్య కుటుంబానికి, రాజ్యానికి ఉన్న ముడిని భద్రపరిచే నీతివాక్యాలతో రాజ్యాంగ నీతులకు చోటు లేకుండా చేసే పాలకవర్గాన్ని పరిచయం చేశాడు రచయిత. నిజానికప్పుడు రాజ్యాంగం లేదు. రాబోయే రాజ్యాంగంలో కూడా వయసు కారణంగా చూపించే వివక్ష గురించిన ప్రస్తావన లేదు. తర్వాత బాలల హక్కులు వివరంగా రాసుకున్నారు. వృద్ధుల గురించి ఇప్పటికీ ఇదమిద్ధంగా ఒక హక్కుల పత్రం వంటిదేమీ ఉన్నట్టు లేదు.

బ్రహ్మంగారు స్వతంత్రం గురించి, అన్నదమ్ముల్లా ఉండాల్సిన అవసరం గురించి చెప్పిన మాటలు ఎంకడిలో మాలపల్లెలో చాలా ఆలోచనలే రేపాయి. వాళ్ళకు తెలిసిన స్వతంత్రోద్యమం మోటూరెళ్ళి రైలు పట్టాలు పీకటం, అంగలూరు వెళ్ళి గాంధి గారిని చూడటం. ఈ రెండిటితో తెల్లాళ్ళు వెళ్ళారంటే నమ్మలేక పోయాడు ఎంకడు. అన్నదమ్ముల్లా ఉండటమంటే అధికారం సంగతలా ఉంచి వివక్ష లేకుండా పోవటం, వనరుల్లో సమాన భాగస్వామ్యం. ఏమీ చదువుకోక పోయినా ఎంకడికి, అతని భార్య పద్దాలుకీ ఈ విషయం జీవితానుభవం ద్వారా తెలిసింది. పద్దాలు తమకు "కూత్త మడిసెక్కేదన్నా దొరుకుతే" అని ఆలోచించింది. ఎంకడికీ తనకు పరిచయమైన వివక్ష అంతా గుర్తొచ్చింది.

"వాకిట్లో మంచంమీద కూర్చున్న బెమ్మంగారు... ఇద్దరు, ముగ్గురు మాలవాళ్ళు దూరంగా చేతులు కట్టుకుని నిలబడి ఉండటం... వాళ్ళల్లో ఒకడికి దాహమైతే, దూరంగా ఉండమనే హెచ్చరికల్తో, దోసిల్లో ఎత్తుగా పెట్టిన చెంబుతో నీళ్ళు పొయ్యడం... యియ్యన్నీ పోతయ్యా, అంతా కలిసి మెలిసి ఉంటారా? పెళ్ళిళ్ళకీ,

పండగలకి అందరి భోజనాలు అయ్యినాక ఆకరి బంతిలో కూచ్చోమనకుండా కలిసి మెలిసి తింటారా? మాలల్ని కమ్మ రాములోరి గుళ్ళోకి రానిత్తారా? కమ్మ దొరలు మాలపిల్లల్ని పెళ్ళిళ్ళు చేసుకుంటారా? మాలాడికి కమ్మ దొరలు పిల్లల్నిత్తారా? ఇయ్యన్నీ జరిగేయేనా?''

వనరుల గురించి, వివక్ష గురించి రచయిత ఇన్ని మాటలు చెప్పాక కులం గురించి, కుల అణచివేత గురించి మనం ఆలోచిస్తాం. ఈ అణచివేత సంఘటనలు 'సారాజ్జెం'లో అనేకం కనిపిస్తాయి. మొత్తంమీద కులం అగ్రవర్ణాలలో ఆధిపత్య భావనను కలిగించి, వనరులను స్వంతం చేసుకోవటం, శ్రమను దోపిడీ చెయ్యటం, హింసా దౌర్జన్యాలతో దళితులను అణచటం, వాళ్ళ ఆత్మ గౌరవాన్ని ప్రతిక్షణం కించపరచి అవమానించటం ద్వారా వారిలో కూడా ఆత్మన్యూనతా భావం ఏర్పడి, తమంత తాముగా ఆధిపత్య భావనలను, కులాలను గౌరవించే స్థితిలోకి జారటం - వీటన్నిటికి కారణమవుతుంది. ఈ వివక్షలను, హింసలను కుల సమజాన్నీ కొనసాగించే విధం సాంఘిక నిర్మాణాలన్నిటిలోను అత్యంత ఆశ్చర్య కరమైంది. నీచమైంది.

వనరుల మీద ఆధిపత్యం లేకపోవటం అనే విషయం సారాజ్జెంలో అనేకచోట్ల ప్రస్తావనకు వస్తుంది. సారాజ్జెంని తీసుకుపోయి ఎంకడు మూల్లంక వెళ్ళి తాటికాయలు తెచ్చుకుంటాడు. మూల్లంక ఎవరి స్వంత ఆస్తికాదు. అక్కడి తాటిచెట్లలో గల దానిమ్మ చెట్టువి, పక్క ఊరివారీవి కోసుకుంటాడు తాటిచెట్టు ఎక్కగలిగిన వారెవరైనా కోసు కోవచ్చు. ఎంకడు అలాగే కోసి, తనూ, సారాజ్జెం తిని, ఒకటి రెండు కాయలు ఇంటికి పట్టు కెళ్తుంటే దారిలో కనపడ్డ అమరయ్య తాటికాయల గురించి కోపంగా మాట్లాడతాడు. మీవి కాదని చెబితే. ''ఎవరియ్‌రా లంజాకొడకా. నాయితే ఎముకల్లో సున్నం లేకుండా కుమ్మబొడవనూ'' అంటాడు అమరయ్య. రెండు తాటికాయలకి ఎంకడు చెల్లించాల్సి వచ్చే మూల్యం అది. ఆ కాయలు అమరయ్య చెట్టువి అయితే ఎంకడికి ప్రాణాలు దక్కేవి కావు. రచయిత ఈ సహజ వనరుల విషయంలో మాలపల్లెలకు జరిగే అన్యాయాన్ని, అగ్రవర్ణాలు వాటిని దౌర్జన్యంగా స్వంతం చేసుకోవటం గురించే రెండు వాక్యాలలో అద్భుతంగా చెప్పాడు. ''తెల్లగా వెన్నెలొచ్చింది. మాలపల్లి క్కూడా, వెన్నెల ఆకాశం మీద నించొచ్చేది కాబట్టి గానీ లేకపోతే దొరలు మాలపల్లికి వెన్నెల్ని రానిచ్చేవారు కాదేమో''. సందేహం లేదు. రానిచ్చేవారు కాదు.

బ్రాహ్మణకులాధిపత్యాన్ని మిగిలిన కులాల వాళ్ళందరూ ఒప్పుకునేలా చేయటంలో కులవ్యవస్థ ఎల్లకాలం నిలబడే శక్తిని సంపాదించుకుంది. ఎంకడికి - రోజూ అగ్రవర్ణాల చేత దూరంగా ఉండమనే ఎంకడికి బ్రాహ్మణుల గొప్ప గురించి సందేహాలు లేవు. సోమయ్య అనే బ్రాహ్మణుడు చచ్చి స్వర్గానికే పోతాడని, అయన చేయించిన పూజలు అయన్ని స్వర్గానికే తీసుకెళ్తాయని కచ్చితంగా నమ్మి పద్దాలుతో చెబుతాడు. సోమయ్య ముగ్గురు పెళ్ళాలను మందెట్టి చంపినా సరే బ్రాహ్మడిగా స్వర్గమే పొందుతాడంటాడు ఎందుకని భార్య అడిగితే.

''బేంబడి పుటక మరి''

''దేవుడి కందరూ సమానమేనంటగా''

''అందరూ సమానమేంటి ఎంత సమానమైనా బేంబళ్ళ దారి ఏరు'' అంటాడు. బ్రాహ్మణ జన్మలోని ప్రత్యేకత గురించీ, అందరూ సమానం కాదని వాళ్ళు చెప్పిన మాటల గురించి, ఒకవేళ తప్పేజారీ దేవుడి దృష్టిలో అందరూ సమానమైనా బ్రాహ్మల దారి వేరనే అపారమైన విశ్వాసం ఎంకడిది. అది ఒక్క ఎంకడి విశ్వాసమే కాదు. వందల సంవత్సరాల నుండీ బ్రాహ్మణులు తమ జన్మ గురించి, తమ ఎక్కువ సమానత్వం గురించీ మిగిలిన కులా లందరిలో స్థిరపరిచిన విశ్వాసం. అది ఇప్పటికీ అనేక ఆచారాలలో కనపడుతూనే ఉంటుంది.

ఈ నవలలో అస్పృశ్యత అగ్రవర్ణాల వారి అవసరాల మేరకు ఉంటుంది. వారికి అవసరమైనపుడు మాల వాళ్ళను కొంతవరకూ దగ్గరకు రానిస్తారు. పాలేర్లుగా

పెట్టుకున్నపుడు నీళ్ళు కూడా తెప్పించుకుంటారు. దాసీలుగా ఉంచుకున్నపుడు ఇంట్లో దాదాపు అన్ని పనులూ చేయించుకుంటారు. ఈ మార్పు అంటరానితనం నేరం దాన్ని పాటించకూడదనే అవగాహన నుంచికాక వాళ్ళ అవసరాల నుంచి వచ్చింది. దానిని వాళ్ళు దాచుకోవాలని కూడా అనుకోరు.

కళ్ళు కనిపించని పొన్నమ్మ గారనే వృద్ధురాలు తన కర్ర పట్టుకుని ఇంటి దాకా చేర్చే పని మాల పిల్లల్ని చేయనిస్తుంది. కళ్ళు కనపడవు కాబట్టి తప్పదు - "కనపడితే మిమ్మల్ని నా కర్ర పట్టుకోనిచ్చేదాన్నంటరా? దగ్గరకొస్తే కర్ర తిరగేసేదాన్ని గానీ, రామ రామ" అని ఆ పిల్లలతో చెప్పగలిగే ధైర్యం ఆమెకి ఆమె కులం ఇచ్చింది.

సారాజ్జెం, బోడి, సంకురాత్తిరీ ముగ్గురు పిల్లలూ, పరిగ ఏరుకున్నారు. అరబస్తా దాకా ఒడ్లు పోగేశారు. అవి అమ్ముకుని తమ చిన్న చిన్న కోరికలు తీర్చుకుందామని వారి ఆశ. కానీ వాళ్ళ కుటుంబాల పేదరికం ఎలాంటి దంటే పిల్లలు ఏరి తెచ్చిన పరిగను కూడా పెద్దవాళ్ళు కోమటింట్లో అమ్ముకుని అప్పు తీర్చుకోవాల్సిన పరిస్థితి. దాదాపు నెలరోజులు బురద బురదగా ఉన్న చేలల్లో, ఎండిన చేలల్లో పడి పగలంతా ఏరిన పరిగ తమ ఆశల్ని తీర్చలేదని ఆ పిల్లలు ఏడ్చిన ఏడుపు హృదయ విదారకంగా ఉంటుంది. ఒకవైపు సాంఘిక బానిసత్వం, మరోవైపు అతి పేదరికం. ఈ కుల వ్యవస్థ రెండు రకాలుగా వారిని అణిచివేస్తుంది. జోనే మంచెర్ అన్నట్లు "ఈ వ్యవస్థని బానిసత్వం అని పిలవొచ్చో లేదో గాని కుల అంతరువుల సంఘంలో అట్టడుగున ఉన్నవారు అతి పేదరికంతో బాధపడేవారు ఒకరే" అది సారాజ్జెం నవలలో ప్రతి పేజీలోనూ కనిపిస్తుంది. సారాజ్జెం ఆ ఊళ్ళో గడిపిన పదహారు సంవత్సరాల జీవితమంతా ఆ అమ్మాయి కటిక బీదరికంతో చేసిన పోరాటమే. ఆ బీదరికంలో తల్లీ కూతుళ్ళ మధ్య నిలబడిన సంబంధం అతి మానవీయం. అర్ధవంతం.

ఈ నగరంలో అతి భీభత్సమైన దృశ్యం జోజి హత్య. ఒట్టి హత్య కాదు. చిత్రహింస పెట్టి చంపుతారు కమ్మ దొరలు. జోజి దొంగతనం చేశాడని యజమాని నల్లచంట బ్బాయి ఆరోపణ. అతను ఆ మాట అన్నాడో లేదో మిగిలిన కమ్మ దొరలు కోపం తెచ్చుకుని జోజిని ఎలా చిత్రహింసలు పెట్టాలో ఒక్కొళ్ళు ఒక్కో పద్ధతి చెప్తారు. ఒక్కరు కూడా ఏం దొంగతనం చేశాడు? ఎప్పుడు చేశాడు అనే కనీసపు ప్రశ్నలు వేయరు. కమ్మ యజమాని మాల జీతగాడిమీద నేరం ఆరోపించడాంటే అది నిజమని అందరూ నమ్మాల్సిందే. నమ్మారు. ముందు జోజిని చెట్టుకి కట్టేశారు. సోవిగారు "చెప్పుచ్చుక్కొట్టమని" వెళ్ళి పోయాడు. మొహన రావు "చేతులిరిచెయ్య"మన్నాడు.

మల్లేశ్వర్రావు కొత్త పద్ధతి చెప్పాడు. "కాళ్ళూ చేతులు కట్టి కింద పడేసి ఒంటి మీద పంచదార పోసి రెండు బొట్లు నీళ్ళు చల్లాలి. దాంతో జన్మజన్మలకీ బుద్ధొస్తుంది." ఒకాయన కత్తవలు పెట్టి కుళ్ళపొడవమన్నాడు. చెంపలు పగల గొట్టాడు. ఇంకొకాయన "వదలమాకండి. కాళ్ళూ చేతులూ నజ్జు నజ్జు చేసి వదలండి. గాడిద కొడుకెవడితో చెప్పు కుంటాడో" అని వెళ్ళిపోయాడు. అసలు యజమాని కోదండం వేయించాడు. అంతలో మాలపల్లి నుంచి జోజిని రక్షించటానికి యవకులొస్తున్నారని విని యజమాని కిసర నాయిలు పోసి జోజిని తగలబెట్టేశాడు. ఈ ఘోరం గురించి చర్చేలేదు. కాకపోతే మాలపల్లె యువకులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. కోర్టుకి వెళ్ళారు. పోలీసులకి, ప్లీడర్లకి ఒక యకరం పొలం అమ్మి ఖర్చు పెట్టి. యజమాని తప్పించుకున్నాడు. ఖర్చు పెట్టలేని మాలపల్లె యువకులు తమే నేరస్తులయ్యారు. జైలుకి వెళ్ళారు. ఎందుకంటే పొలం గట్టున కొట్లాటలో వాళ్ళే జోజిని చంపారని న్యాయవాదులు న్యాయస్థానంలో నిరూపించగలిగారు.

జోజి హత్య జరిగింది. అది ఒక గ్రామంలో విడిగా జరిగిన అమానుష చర్యగా మాత్రమే చూస్తే మనలో వ్యక్తిగతంగా వివిధ స్థాయిలలో ఉండే మానవత్వం వివిధ రకాలుగా మేల్కొనవచ్చు. స్పందించవచ్చు. దానివలన

పాఠకుల వ్యక్తిగత సంస్కార స్థాయిగాని స్పందనస్థాయి గాని పెరగవచ్చు. అది పరిమిత ప్రయోజనం. ఐతే ఇక్కడ జరిగింది ఒక హత్య మాత్రమే కాదు. అనేక హత్యలను అనుమతించే కులవివక్షతా ఆవిష్కరణ. రాజ్యాంగ ఉల్లంఘన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16, 21 ల ఉల్లంఘన. ముఖ్యంగా ఆర్టికల్ 15 ఆర్టికల్ 21 ఇక్కడ కుప్ప కూలిపోయాయి. కులవివక్షకు వ్యతిరేకంగా రాజ్యాంగం ఇచ్చిన హామీ గాలికి ఎగిరిపోయింది. ఇక్కడ మనం వివక్షకు జీవించే హక్కుతో, వ్యక్తిగత స్వేచ్ఛతో పడిన ముడిని విప్పిచూసే అవకాశం దొరుకుతుంది. వివక్షకున్న న్యాయపరమైన ఎన్నో అర్థాలు మన కళ్ళకు కట్టినట్లు కనపడతాయి.

జోజిగాడి హత్య తర్వాత మాలపల్లిలో కాస్త తిరుగు బాటు ధోరణి వచ్చింది. సహదేవుడుని యజమాని ఎర్రసత్తెం కొట్టినప్పుడు తిరపతి మాలపల్లె నుంచి పదిమందిని పోగేసి ఆ రాత్రి ఎర్ర సత్తెం ఇంటికి వెళ్ళాడు. కమ్మదొరలంటే వాళ్లకున్న భయం విశ్వాసం ఎలా పని చేస్తాయో వాళ్ళు మాలపల్లి నుంచి ఎర్రసత్తెం ఇంటి కొచ్చేసరికి వాళ్ళకు కోపం తగ్గి భయ సందేహాలు ఎలా కమ్ముకుంటాయో రచయిత చాలా వాస్తవికంగా రాశాడు. చివరకు ఆ తగాదాను బ్రహ్మంగారు సర్దుతాడు. బ్రహ్మం ఒకరకంగా ప్రభుత్వ ప్రతినిధి. గాంధీయిజంకు తన ఇష్టం వచ్చిన వాఖ్యానం చేస్తూ ప్రచారం చేసే కాంగ్రెస్ మనిషి. అతను రాజ్యంపేరు చెప్పి వాళ్ళను భయపెట్టిన తీరు మొత్తం రాజ్యాంగాన్నే అవమానించేది గా ఉంది.

"మీరింత మంది ఒక్కసారిగా ఇట్టారావడం అనేది, అదెంత గోరమైన తప్పో మీకు తెలవదురా. తెలిస్తే మీరిట్టా వొచ్చేవాళ్ళే కాదు. యిప్పుడు, ఈ నిమిషాన మిమ్ముల్నం దర్నీ బొక్కలోకి తొయ్యొచ్చురా, మీరిట్టా చేశారని, యిట్టా పలానా వూళ్ళో, పలానా మా వాళ్ళంతా మూకుమ్మడిగా వొచ్చి వూరుమీద పడ్డారు అని తెలిస్తే ఢిల్లీ నుంచి గవర్నమెంటు సైన్యాలొచ్చి మిమ్ములందర్ని చంపిమరీ కవాతు కొట్టుకెళ్తాయిరా పిచ్చి సన్నాసుల్లారా.

తిరపతిని పనిలోంచి తీసేశాడు యజమాని నాగ భూషణం. పాలేరు పని నుంచి వ్యవసాయ కూలీ అయ్యాడు తిరపతి. అతనిలో తిరుగుబాటు భావాలు ఊళ్ళో అన్యాయాలు చూసి పెరుగుతున్నాయి. మాలపల్లెలో నాయకుడిగా ఎదుగుతున్నాడు. కూలిరేట్లు పెంచాలని సమ్మె చేయించటంలో ముందున్నాడు. పక్క ఊళ్ళ నుంచి కూలీలను తెద్దామని భూస్వాములు ప్రయత్నిస్తుంటే తిరపతి పక్క ఊళ్ళో వెళ్ళి ఆ కూలీల మద్దతు సంపాదించి వాళ్ళు రాకుండా చేస్తున్నాడు. అలాంటి తిరపతిని భూస్వాములు సమించే ప్రశ్నే లేదు. తిరపతి తలపగలగొట్టి శవాన్ని కాలువలో తోసేశారు. మాలపల్లె నుంచి నందిని కూడా చంపేశారు. మాట్లాడే వాడు బతకకూడదు. అది భూస్వాములు గట్టిగా తీసుకున్న నిర్ణయం. సారాజ్జెం నవలా సమయంలోనే (1960) కాదు - మాలపల్లి నవలలో కూడా ఇదే జరిగింది. సంగదాసుని హత్య చేశారు. అక్కడ కూడా కారణం ఇదే. కూలీల కూలిరేట్లు పెంచమని అడిగిన కూలీలకు నాయకుడు సంగదాసు. యజమాని కోపం పట్టలేక గడ్డపారతో పొడిచి చంపేస్తాడు. అప్పుడు పోలీసులు కేసులు లేకుండా రాజీ చేసు కుంటారు. సంగదాసు శవాన్ని ఇచ్చేటట్లు, అతను చనిపోయిన చోటనే అతని సమాధి కట్టటానికి స్థలం తక్కువ ధరకి ఇచ్చేటట్టు.

సారాజ్జెం నవలలో పోలీసులూ, కోర్టులూ తమ పాత్ర పోషించాయి. సమ్మె సమయంలో మాల వాళ్ళు వాళ్ళలో వాళ్ళే కొట్లాడుకుని తిరపతిని, పోలిని, చంద్రిని చంపే శారని ఎంకన్న, రత్తయ్య అనే మాలవాళ్ళని జెయిల్లో వేశారు. అందరికీ తెలిసిన నిజం కూడా చచ్చిపోయింది. ఎందుకంటే "పోలీసులు పురుషోత్తమ రావు చేతిలో ఉన్నారు. కోర్టులు పురుషోత్తమ రావు చావిట్లోనే ఉన్నాయి.

న్యాయం, ధర్మం పురుషోత్తమ రావు గుబురు మీసాల చిరునవ్వుల్లో చిక్కుకు పోయాయి. రాజ్యాంగం రాసిన పదిహేనేళ్ళ నాటి పరిస్థితి ఇది. అంబేద్కర్ చెప్పినట్లు "పేడకుప్ప మీద కట్టిన రాజభవనం" అది అని తేలి పోయింది.

ఆ తర్వాత సాహిత్యంలో కాకుండా యదార్థంగా జరిగిన ఎన్నో సంఘటనలున్నాయి. కారంచేడు, చుండూరు సంఘటనలు జరిగాయి. భూస్వాములు మాల, మాదిగ కులాల వాళ్ళు తలెత్తితే, నోరెత్తితే ఎంతటి ఘాతుకాలకు తలపడతారో 1984, 1991 సంవత్సరాల్లో రాజ్యాంగం' రాసుకున్న నలభై ఏళ్ళకు కూడా పాత సత్యాలే మళ్ళీ మళ్ళీ రుజువయ్యాయి. కారంచేడు కేసులో, చుండూరు కేసులో కోర్టులు న్యాయం చెయ్యలేవా? పత్రికలు, టి.వి.లు చూపిన ప్రత్యక్ష సాక్ష్యాలు కూడా కోర్టులకు కనపడలేదు. సంగదాను సమాధిలానే చుండూరులో అమరవీరుల సమాధులు ఊరినడి బొడ్డులో వచ్చాయి. ఐనా ఎవరికీ భయం లేదు. కులపరమైన వివక్షధారాళంగా పెరిగిపోవటానికి, రాజ్యాంగ ఉల్లంఘనలు నిర్భయంగా చేయటానికి న్యాయ యంత్రాంగం సహకరించింది. ఐతే దళితులు సంఘటిత పడటానికీ, వారి అస్తిత్వం గురించి ఆలోచించ టానికి ఈ సంఘటనలు దోహదం చేశాయి. ఒక్క అడుగు ముందుకు వెయ్యటానికి ఎన్ని కాళ్ళు తెగనరకబడాలో.

మాలవాళ్ళను భూస్వాములు ఇంత అన్యాయంగా చంపుతున్నారని, స్వతంత్రం వచ్చాక, రాజ్యాంగంలో ప్రాధమిక హక్కులు వాగ్దానం చేయబడిన తర్వాత కూడా భారతదేశ గ్రామాలలో దళితుల పరిస్థితి ఇంత భయంకరంగా ఉందని చెప్పిన స్వాతంత్రా నంతరపు తొలి తెలుగు నవల సారాజ్జెం. ఈ హత్యాకాండ కల్పన కాదు. వాస్తవం. వాస్తవాన్ని నవలారూపంలో చెప్పటమే కుటుంబరావు సాహితీ వ్యూహం.

సారాజ్జెం నవలంతా రాజ్యాంగ ఉల్లంఘనలే. ఆ సంఘటనల ద్వారా పాఠకులలో రాజ్యాంగ నైతికత పెరగాలనే రచయిత ఆశయం ఒక్కరోజుతో నెరవేరేది కాదు. కానీ ఆ దిశగా 1984 నుంచీ దళిత ఉద్యమంలో గుణాత్మకమైన మార్పులు రావటం, అందరం హర్షించ దగిన విషయం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంఘ సంస్కరణ దిశగా దళితోద్యమం పాట

– డా॥. సి.హెచ్. శ్యామలకుమార్, తెలుగు అధ్యాపకులు, శ్రీ వైకెఆర్ & కె ప్రభుత్వ కళాశాల, కోవూరు, నెల్లూరు జిల్లా.

ఆదికాలంలో మానవుడు శరీరకష్టాన్ని మరచి పోవడానికి పదాలు పాడుకున్నాడు. రానురాను అవి గేయాలుగా, పాటలుగా రూపుదిద్దుకున్నాయి. ఈ గేయాలు మానవుని సంతోషానికి, ఆత్మశాంతికి, ఆత్మస్థైర్యానికి, ఆలవాలాలయ్యాయి. తదనంతర కాలంలో ఉద్యమాల్ని కూడా ఈ గేయమే ప్రభావితం చేసింది. ఈ గేయం ఛందోబద్ధమైన పద్యానికి ఆధారభూతమైందని పలువురి అభిప్రాయం.

సంఘ సంస్కరణ, జాతీయోద్యమ, విప్లవ, దళిత స్త్రీవాద ఉద్యమాల్ని గేయం చాలా ప్రభావితం చేసిందనడంలో విప్రతిపత్తిలేదు. కాబట్టి 1980 నుంచి వెలువడిన దళితోద్యమంలో గేయం పాత్ర ఎలా వుందో తెలుసుకుందాం.

అనాది నుంచి భారతదేశంలో చాతుర్వర్ణవ్యవస్థ అమలులో వుంది. ఆదికాలంలో వైయక్తికంగా చేసుకునే వృత్తులే తదనంతర కాలంలో కులాలుగా మారాయని అందరూ అంగీకరించే సత్యం. కానీ చిన్న చిన్న వృత్తులు చేసుకునేవారికి ఆదిలో వున్న గౌరవం తరువాత తరువాత క్షీణిస్తూ వచ్చింది. కాలక్రమేణా కొన్ని వృత్తులు స్పృశ్య సమూహాలుగాను, కొన్ని వృత్తులు అస్పృశ్య సమాజాలు గాను వేరు పడిపోయినాయి. ఆ విధంగా వేరుపడిన అస్పృశ్య సమాజాలే నేటి దళిత సమాజాలు. భారత దేశంలో ఆంగ్లేయులు ప్రవేశించిచడానికి పూర్వమే ఈ సాంఘిక అసమానతలు భారతదేశాన్ని ఏలుతున్నాయి. ఈ అసమానతలు జీర్ణించుకోలేని సంస్కరణ హృదయులు ఆ సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా గళాల్ని విప్పుతూనే వున్నారు. ఆ విధంగా ఒకప్పటి హరిజన నేటి దళిత సమస్యల్ని అంతరంగాల్ని, రావాల్సిన మార్పును చిత్రిస్తూ వచ్చినపాటే మాలవాండ్రపాట. గాంధీజీ హరిజనోద్యమాన్ని ఆరంభించకముందే 1909లో ఆంధ్రభారతి పత్రిక, భాద్రపద సంచికలో వచ్చిన ఈ పాటను గమనించండి.

"అందారూ పుట్టిరి హిందమ్మ తల్లికి
అందారూ ఒక్కటై వుండాలి సక్కంగా
కష్టమ్ములొచ్చిన నిష్ఠూరమొచ్చినా
యిష్టమ్ముగానుండి కట్టుగనుందాము
వర్ణాలు యెక్కువ పుట్టంగ లేదయ్య
మమ్మేల క్రిందీకి కుమ్మేరు మానోరు
పదాలు మావారు ఇంగ్లీషు చదివారు
యగబడతా వున్నారు వెట్టీ వృత్తూలకైన
మతముచ్చుకుంటేను మావోడమంటార
సారాయి తాగాము శుభ్రంగా వుంటాము
పదాలూ సక్కంగా ఇంపించుతామయ్య
హిందూలమై యిష్ణ ముందూకు వస్తాము
తమ్ముూలమనిమీరు మమ్ముూల జూడండి
అమ్మోరు దీవించి అయిశ్వర్యమిచ్చును"

ఈ పాటను రాసినవాడు ఒక అజ్ఞాతకవి. భారత దేశంలో అన్ని కులాలు సమానమైన అన్నదమ్ముల లాగా వుండాలని, సాంఘిక అసమానతలు కూడదని, అజ్ఞానులైన పంచమ సమాజాల్ని, సవర్ణ సమాజాలు జ్ఞానంవైపు నడిపించి సంస్కరించి, ఆదుకోవాలనే సంఘసంస్కరణ హృదయాన్ని ఈ గేయం తెలుపుతూ వుంది.

తరువాత 1930 ప్రాంతంలో జాలా రంగస్వామి అనే దళితకవి అరుంధతిపాట, అంటరానివాళ్ళెవరు అనే గేయాల్ని రాశాడు. వశిష్ఠుడు, వాల్మీకి, వేదవ్యాసుడు, పరాశరుడు, హనుమంతుడు, వాలి-సుగ్రీవులు, తిరుప్పా నాళ్వార్ మొదలైన చారిత్రక పురుషుల్ని నేపథ్యంగా

చెబుతూ పూర్వం రాజ్యాలేలిన వీరులు శాస్త్రాలు ప్రవచించిన ఋషులు మావారేనంటూ ఆర్యుల దాడుల్లో ఓడించబడి నేటి నీచ స్థితికి దిగజారామంటూ తమ గత ఔన్నత్యాన్ని నేటి దీనత్వాన్ని "అంటరానివాళ్ళెవరు" అనే గేయంలో జాలా రంగస్వామి ఇలా చెప్పారు.

"కుక్కలకన్నా హీనమంచూ మము వెక్కిరించుతారే
చక్కని పంటలు పండిస్తేనూ చల్లగ తింటారే
వీటినన్నిటిని ముట్టిన వారికి వెగటే లేదండి.
కూటికి లేక మాయవేషమున కులం మరచి పోయి
మాదు యిండ్లలో భిక్షను హాయిగా చేదుక పోతారు.
అంటూ ముట్టూ అసలుండదు బాబు ఆ సమయంలో
.....
కొంపలపైన అప్పులు పెంచి కోర్టుకు లాగెదరు
కడకు కొంపలేకుండగ మమ్ము కడనే బెట్టెదరు
గదుముక భూములు తీసుకున్నప్పుడు కన్పడదే యంటు
పదిలముగ మా ధనమొసంగినను పాటించరే యంటు
.....
మూటలు మోసి బ్రతుకుదమన్న ముట్టనీయరయ్యా
వస్తువులనమ్మి బ్రతికెదమన్న వీలే లేదండ్రు
అంగడిబెట్టి అమ్మెదమంటే అమ్మనీయరండి" అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

జాలా రంగస్వామి 1930 ప్రాంతంలో రాసిన పై గేయాలు జాతీయోద్యమ ప్రభావంతో వచ్చినవి. అదే విధంగా దళిత సాహిత్య ప్రభావంతో వర్తమాన కవి, రచయిత దళిత జాతి ఔన్నత్యాన్ని, నేటి స్థితిని వర్ణిస్తూ రాసిన గేయాన్ని కూడా గమనించండి.

"ఏలరో? మా బ్రతుకులిట్లా - ఎవరు చేసిన మాయరో
దేవుడా లేకున్న వైదుక జీవుడా - మా రాత రాసిండేలరో

చరణం 1 :

కృతాయుగమందు ధర్మవ్యాధుడూ - మా కులమువాడే
త్రేత యుగమందునా వాల్మీకియూ - మా జాతివాడే
ద్వాపరా మందునా వేదవ్యాసుడూ - మా లోని వాడే
అగ్ర ఋషులూ వారలైతే - అంటరాని వారమెట్లా
॥ఏలరో॥

చరణం 2 :

వశిష్ఠునకును ధర్మపత్నీ అరుంధతి - మా అడపడచే
కృష్ణునకు ప్రియజీవితేశ్వరి జాంబవతి - మా ఇంటి పడచే
నారదునకు జన్మనిచ్చిన నాతియూ - మా ఆడపడచే
వారలను దేవుళ్ళ జేసి - మమ్ములను హీనంగ జూచుట
॥ఏలరో॥

చరణం 3 :

బ్రహ్మదేవుని ముఖమందున - బ్రాహ్మణులు బుట్టిరనిరి
భుజములందూ క్షత్రియులూ - భూములేల బుట్టిరనిరి
నాభితొడల మధ్య వైశ్య - నాయకులూ బుట్టిరనిరి
వెట్టిచాకిరి చేయ శూద్రులు పాదములలో బుట్టిరనట
॥ఏలరో॥

చరణం 4 :

నాలుగే వేదాలు అనిరి - నాలుగే వర్ణాలు అనిరీ
పురాణాలను పుక్కిలించి - ఉపనిషత్తులు ఉచ్చరించీ
కర్మయని మా కళ్ళుగప్పి - కంచె చేనుమేసినట్లు
పంచములను బుట్టించినట్టి - వంచకులు ధరలోన ఎవరు
॥ఏలరో॥

చరణం 5 :

వేదములు పఠియించ నంటు - శూద్రశంభు శిరసు నరికిన
యాజ్ఞవల్క్యునకు యెదురు తిరిగిన - సత్యకాముని తలను నరికిన
మనువు ధర్మము పేర నేటికి - మమ్ములను యెల నరికి చంపుట
సిగ్గు సిగ్గిది అగ్రజాతిని - నిగ్గదీసి అడుగుతున్న
॥ఏలరో॥

పై గేయం వేదాధ్యయన పరుడైన బ్రాహ్మణునికి ధర్మరహస్యాల్ని విప్పజెప్పిన ధర్మవ్యాధున్ని, ఆదికవిగా వాల్మీకిని, పురాణేతిహాస కర్త వ్యాసున్ని మొదలైనవారి చరిత్రలు స్మరిస్తూ దళిత సమాజాల ఆత్మగౌరవానికి సంఘం సంస్కరింపబడవలసిన అవసరాన్ని కూడా ఈ గేయం నొక్కి చెప్పిందనే భావించవచ్చు. తరువాత జాతీయోద్యమ కాలంలో కుసుమ ధర్మన్న మాకొద్దీ నల్లదొరతనం అనే గేయంలో జంతువుల కన్నా హీనంగా దళిత సమాజాల్ని హిందుత్వం చూస్తుందన్న భావనతో బాధపడుతూ...

"కుక్కనక్కలకంటే తక్కువగా జూచి
నిక్కి నిక్కి నిగుడుతారు
సానిపక్కజేర సాగుతారు
కుష్మరోగి సరసన కూర్చుంటారు
కుక్క కోతిని కోరి పెంచేరు
పిల్లీ పిట్టాలను ప్రేమించుతారు
.....
కాకి నీటిని తాకనిస్తారు
మమ్ము దరికి చేరగనీరు

దడదడా తిట్టేర"ని మా కొద్దీ నల్లదొరతనం గేయంలో ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక మనిషిని మనిషిగా ప్రేమించలేని సాటి మనుషుల్లోని క్రూరత్వాన్ని కూడా ఈ గేయం ఎండగడుతూ వుంది. పై విధంగా స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యానంతరం కూడా దళిత సమాజాల సాంఘిక, ఆర్థిక స్థితిగతులు మారలేదని నేటికీ తమ గళాలను విప్పుతూనే వున్నారు.

ఆధార గ్రంథాలు :

1. మాకొద్దీ నల్ల దొరతనం - కుసుమ ధర్మన్న
2. ఆంధ్ర భారతి పత్రిక (భాద్రపద సంచిక-1909)
3. అంటరానివాళ్ళెవరు (గేయం) - జాలా రంగస్వామి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవత పై మరకలు తుడిచిన – మహనీయ మాటలే సాహిత్యం

– డా॥. తేళ్లూరి వేంకటేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ అఫ్ హిస్టరీ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం (నిజాం కళాశాల), హైదరాబాద్.

దళిత, దళితులు అనే పదాలకు, నేడు మనం వాడే దానికి సంబంధమూ లేదు, శాస్త్రీయము కాదు. ఇది మన కు మనం అనునయించుకున్నది మాత్రమే. దళిత అనేది కులానికే పరిమితమా ? మతానికే పరిమితమా ? ఆర్థిక స్థితికి పరిమితా ? లేక ఆధ్యాత్మతకు, అని పరిశీలిస్తే కూడా స్పష్టత లేదు. ఎందుకంటె అన్ని కులాలలో, మతాలలో, ఆర్థిక మరియు సాంస్కృతిక సమూహాలలో కూడా బాగా అణచబడినవాళ్లు కనపడుతున్నారు. అంటరాని తనం కొలమానికం అందామా అంటే, కూడా సరికాదు. ఎందు కనగా, అంటరాని వాళ్ళు అనబడే సమూహాల మధ్య కూడా అంతరాలు కనబడుతున్నాయి. మాదిగ దండోరా ఉద్యమం దీనికి చక్కని ఉదాహరణ. లింగ భేదము కూడా నిజం కాదు. ఎందుకంటే, అందమైన స్త్రీ ని ప్రతిపురుషుడు ఇష్టపడుతున్నాడు. అదే విధ ముగా శారీరిక సొష్టం కలిగిన ప్రతి పురుషున్ని, అన్ని వర్గాల స్త్రీలు ఇష్ట పడుతున్నారు. అందుకే అంటరాని తనం పుడ్ దగ్గరో లేక బెడ్ దగ్గరో అంతు చిక్కని ప్రశ్న. ఈ స్థితికి ఎవరిని నిందించాలో, ఎవరిని ఓదార్చాలో, అయోమయ పరిస్థితి.

కొందరిని అంటరానివారుగా పరిగణించి, ఊరికి దూరంగా ఉండమని ఆదేశించిన సమాజం, వాళ్ళు కూడా మన తోటి మనుషులే అన్న కనీస జ్ఞానాన్ని, ఎందుకు మరచి నారో, వాళ్ళకే తెలియాలి. అటువంటి, కరకు రక్కసి గుండెలకు ఒణుకు పుట్టించినది, అధ్యాత్మి గురువులే. ఆ మహామూర్తుల చేతిలో కత్తిలేదు, కలము లేదు. నోటి మాటలే, తూటాల్లా పేలినవి. రక్కసి గుండెలు ముక్కలైనవి, ముచ్చెమటలు పెట్టినవి. వారే వీరశైవానికి మూల పురుషులైన మాదర చెన్నయ్య, సమగరా హారలయ్య, దోహర్ కక్కయ్య, మాలే మహదేశ్వర, నులకచందయ్య (నులియచందయ్య) మరియు వైష్ణవ ధర్మ రక్షకులు రవిదాస్, ఘూసిదాస్, బాలకదాస్, దున్న ఇద్దాస్ లాంటి మహాఋషులు. కపిలుని సాంఖ్య శాస్త్రాన్ని, దమ్మ రూపంలో బుద్ధుడు అందించగా, మనీషా పంచకం ద్వారా ఆదిశంకరుడు సమాజానికి అందించారు. ఎందరో పుణ్యపురుషులకు జన్మనిచ్చినది, మన భరత భూమి. రక రకాల సంస్కృతులకు, నిలయమైనది. ఇట్టి నేలలో, సత్యాన్వేషణలో నిత్యమూ, మంచి గురువు కోసం తపించే జాతిలో జన్మించిన కక్కయ్య, 16 శతాబ్దంలో, పోతులూరి వీరబ్రహ్మమును నిలదీసి, మానవ శరీరంలో శక్తి చక్రా లను చూసి, నాటి సమాజానికి జ్ఞానాన్ని అందించి, జ్ఞానకక్కయ్యగా వెలుగొందినారు. ఆ క్రమములోనే మరొక మహానుభావుడు, ఎర్రగుంట్ల పేరయ్యగారు. పాపులను తన రక్తంతో పరిశుద్ధ పరచిన ప్రేమమూర్తి, కరుణామ యుని కూడా పుష్కలంగా ప్రవచించే పవిత్ర పుడమిలో, శాంతికపోతాన్ని కరముల ధరించి, గాఢాంధకారంలో వెలుగులు వెదజల్లిన చైనత్య మార్గదర్శి పేరయ్య గారు. ఆయన ముద్దు పేరు బంగారు తాత.

పేరయ్యగారు నెల్లూరు జిల్లా, కనిగిరి తాలుకా, ఎర్రగొండ్లపాలెం అనే గ్రామానికి చెందిన వారు, చర్మాల వ్యాపారి. రాజమండ్రి, కాకినాడ వరకు వెళ్లి జంతు చర్మాలను కొనుక్కోని, ఎడ్లబండిమీద ఏసుకొని మద్రాస్ వెళ్లి అమ్ముకు నే వారు. ఈ క్రమములోనే అనేక గ్రామాలతో, ఆయా గ్రామాల ప్రజలతో అనుబంధం కలిగి ఉండే వారు. ఒకరి నొకరు అక్క, బావ అంటూ వరసలు కలుపుకొని పిలుచుకోవటం జరుగుతుండేది. అటువంటి వారిలో రాజ మండ్రిలో ఒక కుటుంభంతో విడిది సంభందం కలిగి ఉండెను. ఒక రోజు ఎప్పటి లాగానే రాజమండ్రిలో తన మిత్రు ని ఇంటికి వెళ్ళటం జరిగింది. అప్పుడు తన మిత్రుని ఇంట కొంత మార్పు

గమనించారు. ఆ ఇంటి చుట్టూ అలవ కట్టి ఉండటం, శుభ్రముగా ఊడ్చి కనబడినది. ఎప్పటిలాగానే చెల్లెమ్మ బాగున్నారా, బావ ఎక్కడ అని అడిగి నారు. ఇంతలో బావ బయటకు రావటం జరిగింది. బావ ఇంతక ముందు కంటే తేడాగా కనిపించాడు. పేరయ్య గారికి, ఒకింత ఆనందము, ఆశ్చర్యము కలిగినది. ఆ ఇంటిల్లిపాది దుస్తుల విషయంలో కొంత మార్పు కనపడు తున్నది. మాటలలో కూడా మార్పు కనిపించింది. అప్పుడు తను ఆత్రుత ఆపుకోలేక, ఈ మార్పుకు కారణం ఏమి అని అడగటం జరిగింది. సమాధానముగా పాత పేరును మార్చుకున్న బావ, అబ్రహంగా చెప్పినాడు. ఒక తెల్ల దొర వచ్చి, మాకు క్రొత్త ధర్మ మార్గం గురించి వివరించి, మమ్ములను మార్చటం జరిగింది, నా పేరు కూడా మార్చినాడు, ఈ మార్పుకు కారణం అంతా ఆయనే అన్నాడు. ఆ రోజు భోజనం చేస్తున్నప్పుడు కూడా, ఆ కుటుంభం సభ్యులు, ఏదో ప్రార్థన చేయటం జరిగింది. ఇదంతా పేరయ్య గార్కి చాలా నచ్చింది. ఆ మాటలకు సంతోషపడిన పేరయ్య అంటాడు, బావా, ఆ తెల్లదొర వచ్చేది నాకు కూడా చెప్పు, నేను మి చెల్లీ వచ్చి మీతో చేరుతాము అని అన్నాడు. ఆ మాటలకు అబ్రహంగారు కూడా చాలా సంతోషపడి, సరే అన్నాడు. ఆ విధముగా పేరయ్యగారు, తన శ్రీమతిని (నాగమ్మ) ఒప్పించి, క్రొత్త ధర్మ మార్గాన్ని అంగీకరించటం జరిగింది. ఇది షుమారు గా 1864 సంవత్సరం చివరలో జరిగింది.

ఆ తరువాత కొన్ని రోజులు రాజమండ్రిలో ఉండి, పేరయ్య దంపతులు తమ గ్రామమైన ఎర్రగొండ్లపాలెం కు వెళ్ళి నారు. ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో దళితుల జనాభా చాలా ఎక్కువ. ఏ గ్రామం చూచినా, వందల సంఖ్యలో ఇండ్లు ఉండేవి. వీరిలో కుల కట్టుబాట్లు ఎక్కువే. ఆచార వ్యవహారాలు చాలా పద్ధతిగా ఉంటాయి (వాళ్లకు తెలిసి నంత వరకు). అసలు కథ ఇక్కడే మొదలైంది. రెండు మూడు రోజులలో వారి గూడెంలో అందరికి తెలిసిపో యింది, పేరయ్య దంపతులు మతం మారినారని. గుసగుసలు మొదలైనాయి. మన మతం వదిలి, పరాయి దేశపు మతంలో చేరటం తప్పు కదా ?. కుల పెద్దలు పంచాయతీ పెట్టి, ఈ దంపతులను కులమునుండి వెలి వేచినారు. తన కొడుకు కోడలును వెలి వేచినందుకు, ఎంతో బాధపడిన పేరయ్యగారి మాతృమూర్తి, కుల పెద్దల ను కలిసి, నా కొడుకు కోడలు, ఆ తప్పు ఎందుకు చేసినారో, నేను అడగాలి అను కుంటున్నాను, కనుక నాకు అవకాశం ఇవ్వండి అని అడిగింది. అందుకు కుల పెద్దలు అంటారు, అమ్మ ! నీ కొడుకు కోడలు ఎవరికి తెలియ కుండా మతంమారి తప్పుచేసినారు. ఇప్పుడు మీరందరు కూడబలుక్కొని ఇంకేమి చేస్తారో ?, కనుక నీవు ఏమన్నా అడగాలి అనుకుంటే, మాముందే అడుగు అంటారు. అందుకు ఆమె అంగీకరిస్తుంది. పెద్దలు అందరు కూర్చుంటారు, పేరయ్య దంపతులను పిలిపిస్తారు. అప్పుడు పేరయ్య గారి మాతృమూర్తి అడుగు తున్నది, నాయనా ! ఎందుకు మీరు మతం మారినారు ? మిమ్ములను వెలి ఏస్తే, మీరు బాధ పడుచున్నారు, నేను బాధ పడుతున్నాను. బంగారంలాంటి జీవితాన్ని కష్టాల పాలు చేసుకున్నారు. చెప్పు నాయనా, ఎందుకు ఈ తప్పు చేసినారు. మీరు తెలియక చేస్తే, పెద్దలను నేను బ్రతిమిలాడి, కులానికి తప్పు కట్టి, మరలా కులంలో కసిపోదాం, అని కొడుకును బ్రతిమిలాడినది. తల్లి కళ్ళల్లో కన్నీరు, మాటలలో ఆవేదన గుర్తెరిగిన పేరయ్య, ఈ విధముగా చెపుతున్నాడు. అమ్మా ! నేను తెలియకుండా ఏమి చేయలేదు. నేను ఏమి చేస్తున్నానో, బాగా తెలిసే చేసినాను అన్నాడు.

అమ్మా ! ఒక తెల్లదొర, నా ప్రక్కన కూర్చొని, నా మీద చెయ్యివేసి, నా చెయ్యి పట్టుకొని, పేరయ్యా ! ఈ గోళ్లు కత్తెరించుకో, నా జుట్టు పట్టుకొని, ఈ జుట్టు కత్తెరించోకో, రోజూ స్నానం చెయ్యి, రోజూ ఉతికిన బట్టలు కట్టుకో, నా గడ్డం పట్టుకొని, గడ్డం గీచుకో, శుభ్రాంగా ఉండండి. చనిపోయిన పశువును తినవద్దు. ఎందుకంటే దానికి ఏదో జబ్బు వచ్చే చనిపోయింది కదా ?, ఆ జబ్బు

మీకు కూడా రావచ్చును. తినాలనుకుంటే ఆరోగ్య వంతమైన జంతువుని కోసుకొని తినండి, అని ఎన్నో మంచి మాటలు చెప్పినాడు అమ్మా, అందుకే మేము మతం మారినా ము అమ్మా, పేరయ్య మాటలు విన్న కుల పెద్దలు, ఆశ్చర్యపడి. ఈ విదంగా అడుగుతున్నారు, అసలు తెల్లదొర ఉన్నాడా ?. నీ మీద చెయ్యివేసి మాట్లాడిన మాట నిజమేనా ? నీతో ఈ మాటలన్నీ చెప్పినాడా ?. కుల పెద్దల ప్రశ్నలకు పేరయ్య అన్నాడు, ఔను, నేను చెప్పినవన్నీ నిజమే. ఏ మాత్రము అబద్ధము లేదు. అందుకు కుల పెద్దలు, మాకు తెల్లదొరను చుపిస్తావా ?, మన గ్రామానికి తెల్ల దొరను తీసుకువస్తావా ? అని నిలదీశారు. అప్పుడు పేరయ్య తెల్లదొరను, వాళ్ళ గ్రామానికి తీసుకువస్తానని ఒప్పుకుంటాడు.

కానీ, నేడు ఉన్న రవాణా సౌకర్యాలు నాడు లేవు. పేరయ్యగారు నెల్లూరు వెళ్ళినప్పుడు, తెల్ల దొర లేకపోవటం, వారు అమెరికా వెళ్లి మరలా తిరిగి వచ్చేసరికి, ఆరు నెలలకు పైగా సమయం పట్టటం జరిగింది. తెల్లదొర వచ్చిన తరువాత, పేరయ్య తెల్లదొరను కలిసి మాట్లాడి, వారి గ్రామానికి ఆహ్వానించటం జరిగింది. కుల పెద్దల సమక్షం లో తెల్లదొర మాట్లాడం జరిగింది. అందుకు సంతోషపడిన కుల పెద్దలు, అందరు మాట్లాడుకొని ఒకే రోజు, ఒకే గ్రామానికి చెందిన దళితులు, 2500 మంది బాప్టిజం తీసుకోవటం, భారతదేశ చరిత్రలో, ఒక చారిత్రక ఘట్టం. ఇది బలవంతముగా జరిగినది కాదు. మంత్ర తంత్ర మహిమలతో జరిగినది కాదు. ఉత్పలమాల, చంపకమాల, శార్దూల, మత్తేభాల ప్రభావం ఏ మస్తిష్కములపైనా పడలేదు. తాయతలు లేవు, తాయిలాలు లేవు, తాకట్టులు లేవు. పురాణ పురుషుల గురించిన ప్రవచనాలు చెప్పబడలేదు. మన వెనుక బాటు తనానికి, ఫలానా వాళ్ళు కారణం, అంటూ చెప్పే, ఊకదంపుడు ఉపన్యాసాలు కూడా లేవు. ఇది మత మార్పిడి అనుట కూడా సరైనది కాదేమో. దైనందిన జీవితాన్ని ఎలా గడపాలో వివరించిన వాస్తవికత. ధర్మం అంటే, అర్థం కాని బ్రహ్మ పదార్థ మేమి కాదు. జీవించ టానికి సరియగు మార్గ నిర్దేశమే ధర్మం. దానిని చూపే వ్యక్తే గురువు, మార్గదర్శి, బోధకు డు. ఎదుటివారికి హాని తలపెట్ట కుండా జీవించటమే ధర్మ మార్గం. దీనిని బోధించేందుకు గురువులు ఉంటారు. వారి బోధనలు సంతృప్తిగా లేనప్పుడు, మరొక గురువును ఎంచుకోవటం మానవ నైజం. ఆ క్రమములోనే పేరయ్యగారి దంపతులు వేరే గురువును ఎంచుకున్నారు. అందరు ఊహించేది మాత్రం, అంటరాని తనం అనే సామాజిక జాడ్యం నుండి విముక్తి పొందటానికి మతం మారినారు అనుకుంటారు. ఎందుకంటే, ఆనాటి సమాజ పరిస్థితులు అలా ఉండేవి. కాని అది నిజము కాదు. వాస్తవానికి, మనిషి పుట్టిన నాటి నుండి గిట్టే వరకు, సాగే జీవనయాత్రలో, ఎన్నో కార్యక్రమాలు గురువు అవసరంతో ముడిపడి ఉంటాయి. ప్రతి సమాజానికి గురువులే, ప్రధాన భూమికను పోషిస్తారు. ఈ ప్రాముఖ్యతను గుర్తించిననాడు, భారతదేశం విశ్వవిజేత అవుతది, అనుటలో సందేహం లేదు.

ఇది జరిగినది 1866 వ సంవత్సరం. అదే సంవత్సరంలో, ఒకే ప్రాంతమైన కనిగిరి తాలుకాలో 20,000 దళితు లు ధర్మ మార్గం మార్చుకున్నారు. డాక్టరేట్ చేసిన అంబెడ్కర్, 1956 లో బౌద్ధ మతములోకి మారినప్పుడు, తనతో మారిన వారు 3000 మంది (జోగేంద్రనాథ్ మండల్ ఆత్మకథ). కానీ అంబెడ్కర్ కంటే 90 సంవత్సరాలు ముందు, ఒక తోళ్ల వ్యాపారి పేరయ్య గారి మాటతో, ధర్మం మారిన వారు, ఒకే రోజు 2500 మంది, ఒకే సంవత్సరం, ఒకే ప్రాంతం, ఒకే వర్గం వారు 20,000 మంది. దీనిని బట్టి అర్థమయ్యేదేమంటే, ధార్మికతను చెప్ప టానికి కావాల్చింది, స్వచ్ఛమైన మనసు, స్వస్థత పరచే బోధన మాత్రమే. గురువు బాధ్యత, సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడుపుట. ఆ క్రమములోనే అక్కడక్కడ పాఠశాలలు తెరచినారు, సభ్య సమాజం చేత అంటరాని వాళ్ళు అని చెప్పి వెలివేయబడిన

వర్గాల వారికి చదువులు చెప్పించటం మొదలు పెట్టినారు. చిన్నచిన్న వైద్యశాలలు తెరచినారు. ఇవి బ్రిటిష్ ప్రభుత్వం వాళ్ళు చేయించ లేదు. ధర్మాన్ని బోధించే సంస్థ వారే చేసినారు. ప్రజలు విద్య నేర్చుకున్నారు కనుక ఉద్యోగ ప్రయత్నాలు చేసి నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసికోవటం మొదలు పెట్టినారు. వెట్టి చాకిరి (భోజనం కోసం పని) కాకుండా, వేతనం కోసం చాకిరి మొదలైనది. ఇది మనుషులలో వచ్చిన మార్పే. అదే, మానవ సమాజం యొక్క మార్పు. నేడు లక్షలాది మంది, మహారిషి పేరయ్య గారి మార్గంలోనే నడుస్తున్నారు. విద్య, ఉద్యోగాలతోపాటు, రాజకీయాలలో, వ్యాపారాలలో వెలుగొందుచున్నారు. మరి ఆ మహానుభావున్ని ఏ రోజైనా గుర్తు చేసుకుంటున్నారా ?. నాటి నుండి నేటి వరకు (1864-2022) ఆ పుణ్య దంపతులైన పేరయ్య-నాగమ్మ గారికి గుర్తింపు లేదు. చెప్పులు కుడుతూ కుడుతూ అనే పుస్తకం పై, ఏ దళిత రచయిత ద్రుష్టి పెట్టటం లేదు. పరిశోధనలు లేవు. నాటి సమాజంలో దళితుల జీవన విధానం పై చక్కని ఆవిష్కరణ చేసినది ఆ పుస్తకం.

పేరయ్యగారి జ్ఞాపకార్థం, ఎర్రగుండ్లపాలెంలోనో, కనిగిరిలోనో ఆ దార్శకుని విగ్రహాన్ని పెట్టి, ఒక పూలదండ వేచి, దండం పెడితే, బాగుంటుంది కదా !, మరి దళితులు ఎందుకు చేయటం లేదు. మాదిగాయన గౌరవానికి అర్హుడు కదా ?. మేధావులమని చెప్పుకునే వారికి పేరయ్యగారు తెలియదా లేక తెలిసినా మనకెందుకులే అనే బాధ్యతా రాహిత్యమా ?. ఏమనుకోవాలి దళిత మేధావుల ప్రవర్తనను. సామాజిక న్యాయం, సంస్కారం, ఆత్మగౌరవం, అని పలికే పలుకులు, పెదాల పైననేనా లేక హృదయాంతరాలలో నుండి వస్తున్నాయా. వేరే వాళ్లపై విమర్శలు చేసే ముందు, మనని మనం ఒకసారి పరిశీలించుకోవాలి. జాతిరత్నాలను జనజీవన స్రవంతిలో నిత్యమూ జపించేలాగా చేయాలి. అప్పుడే దళిత జాతికి గౌరవం. మహానీయులను గౌరవించటం అలవర్చుకుందాము. వారు బోధించిన మానవ ధర్మమున నడుద్దాం. మార్గాలు వేరు కావొచ్చు, మాటలు వేరు కావొచ్చు, కాని, అర్థం, పరమార్థం మాత్రం, సత్యం, ధర్మం వైపే. మనుషులు అందరూ సమానమే అని చాటి చెప్పుదాం. మనం అంద రం భారతీయులం, భరతమాత ముద్దు బిడ్డలం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రశ్నించే తాత్వికుడు – జాషువ

– ఠరుచూరి విజయలక్ష్మి, ప్రభుత్వమహిళా కళాశాల, గుంటూరు.

నాకు గురువులు ఇద్దరు - పేదరికం, కులమత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది. అని తన ఎదుగుదలకు సమాజమే పరోక్షంగా దోహదం చేసిందని చెప్పుకున్న విశ్వనరుడు గుర్రం జాషువ.

1895న వినుకొండలో గుర్రం వీరయ్య ,లింగమాంబ దంపతులకు జాషువా జన్మించారు. చిన్నతనం నుండి సమాజంలోని అసమానతలను చూస్తూ కారణాలను అన్వేషిస్తూ పెరిగాడు.

